ఈ గ్రంథము

**శ్రీ సద్గురు శివానంద సరస్వతీ స్వాములవారి**

133వ జన్మదినోత్సవ (8.9.2020)

శుభసందర్భమునందు

శ్రీవారి పాదపద్మముల యందు

పూజాపుష్పముగా సమర్పింపఁబడినది.

# బ్రహ్మసూత్రములు

-:ఆంగ్లమూలము:-

**శ్రీశ్రీశ్రీ శివానంద సరస్వతీ స్వాములవారు**

-:ఆంధ్రానువాదము:-

**స్వామి హంసానంద**

-:ప్రకాశకులు:-

**దివ్యజీవన సంఘము**

శివానందనగర్ -249 192

హిమాలయములు (ఉత్తరాఖండ్)

**2020**

వెల : రు. **500/-**



# భగవాన్ శ్రీ వేదవ్యాసులవారు

(సూత్రకారుడు)



# జగద్గురు
# శ్రీశ్రీశ్రీ శంకరాచార్యులవారు
(భాష్యకారుడు)

“సర్వ బ్రహ్మామయం రేరే,

సర్వం బ్రహ్మామయమ్”

\- శ్రీస్వామి శివానంద



## శ్రీ సద్గురు శివానంద స్వాములవారు

### దివ్యజీవనసంఘ సంస్థాపకులు

**(1887-1963)**

ॐ

Siwananda Ashram.
27-10-1982.

Homage Unto the Supreme Reality the Brahman of the Upanishads, that is Bliss and Peace infinite! THAT IS the ultimate goal of your life. He who realizes Brahman attains all Blessedness and becomes a liberated being. Live to attain the experience of Brahman.

Homage Unto Sage Veda Vyasa, who expounded the Nature of this great Reality through His Vedanta-Sutras popularly referred to by the term BRAHMA SUTRAS. These aphorisms constitute one of the 3 most important authoritative Reference texts in matters of highest philosophy. It is one of the Prasthana-traya.

Gurudev's translation and Commentary of these Brahma Sutras has been acclaimed as one of the best and most readable texts in recent times. Sri Swami Hamsanandaji has done an excellent work of producing this Telugu language version of Gurudev Swami Sivanandaji's exceptional work. It is a great service to Telugu knowing people. God bless him for this noble effort in the cause of Jnana Yajna.

Swami Chidananda

Sri



పరమపూజ్య

# శ్రీ స్వామి చిదానంద వారు

దివ్యజీవన సంఘాధ్యక్షులు

(1916–2008)

ॐ

25th November, 1982.

The Brahmasutras form a final judgment on the nature of God, World and Soul, and the internal relation obtaining among these Supreme principles. While the commentaries of the Acharyas, Sankara, Ramanuja, Madhva, and others, there are as monuments of scholarship, it was left to saints like Sri Swami Sivanandaji Maharaj to present the themes of the Brahma-Sutras in a manner and style suited to the modern educated mind. The ease-loving youth of the day would find the intellectual polemics of the standard works hard and almost inaccessible. The plain statements of the Swamiji free the central ideas from the knots of intricate arguments found in the works of the Acharyas. Now that a translation of the same is coming out in the Telugu language, there is no doubt that a larger number will be benefitted by this great treatise.

Swami Krishnananda

ॐ



బ్రహ్మనిర్వాణ

# శ్రీ కృష్ణానందస్వాములవారు

దివ్యజీవన సంఘ ప్రధాన కార్యదర్శి

(1922–2001)

ॐ 8th November 1982.

Salutations and adorations to Para Brahman, Who is the basis of all that exists, Who is Sat-Chit-Ananda, Who cannot be comprehended or apprehended by the senses, mind and intellect, Who is beyond all attributes. Adorations to the great Sri Krishna Dwaipayana Vyasa, the Jagad Guru of Dwapara yuga, who was a Jnani in the true sense of the word, and who due to his extreme compassion to the humanity classified the Vedas, wrote the eighteen Puranas and the classic the Mahabharata, all for the benefit of the people in general and to the aspirants in particular. The various truths experienced by many Rishis, given utterances which form the Upanishads, Sri Vyasa classified and brought out in a cogent form, called the Brahma Sutras which is of immense value and benefit to the students of Advaita Vedanta.

Sadguru Sri Swami Sivananda Maharaj wrote a commentary on Brahma Sutras in English in his own simple, homely and lucid style which is of great value to the present day aspirants and is held in high esteem. It now gives me immense joy to learn that this English commentary has been ably translated in Telugu language by my brother disciple and collegue Sri Swami Hamsananda for the benefit of the Telugu knowing aspirants. This is very laudable indeed. As Sri Hamsananda Swamiji is well-versed in the scriptures, I have no hesitation to believe that his translation will be very useful and helpful to the aspirants and throw an insight about the truths contained in the Sutras.

May his pious attempt be of immense value and benefit to one and all is my prayer to the All-merciful Lord.

Hari Om Tat Sat.

Swami Madhavananda
8/11/82. ॐ



బ్రహ్మలీన

# శ్రీ మాధవానంద స్వాములవారు

దివ్యజీవనసంఘ ఉపాధ్యక్షులు

(1917–2005)

ॐ

# THE DIVINE LIFE SOCIETY (REGD.)

**(ESTABLISHED : 1936)**

Propagates Yoga and Vedanta and the Ethical and Spiritual Culute of India. Promotes Universal Love, the Unity of Religions, the Ideal of Brotherhood, and the Spirit of Service among Mankind.

(Founder : H.H.SRI SWAMI SIVANANDA)

P.O. SHIVANANDA NAGAR - 249192, DISTT. TEHRI-GARWAL, UTTARANCHAL., INDIA.
Phone : (0135) 430040, Rly. Stn. Rishikesh, N.RLY.)

Buddha Jayanti.
May 2nd, 2007

Smt. Venundi Mataji
and
Rev. Sri Sit Ram Rai Bobb
3918 Tecoma Drive,
Crystal Lake, Illinois 60012 (U.S.A)

Blessed Divinities! Om Namo Narayanaya.
Please accept my loving Namaskars

Immensely happy to learn from our Gurubhai Sri Swami Harinanandaji Maharaj that you graciously agreed to reprint the Telugu version of 'Brahma Sutras' which was published in the year 1983. By undertaking this sacred task, you will be doing a wonderful service to the Telugu knowing people who don't know English.

Such noble acts were very dear to Sri Gurudev Sri Swami Sivanandaji Maharaj and to God. Brahma Sutras contain Divine knowledge. By systematic study of this sacred work will help the students of Vedanta to know the essence of the Absolute. By bringing out this publication you endear yourself to numerous seekers of Truth. Kindly accept my heartfelt thanks. May the choicest blessings of the Absolute ever be upon you both.
With kind regards.

Yours, in Sri Gurudev
Swami Vimalananda
General Secretary.

ఈ గ్రంథము

అమెరికా వాస్తవ్యులును,

**పూజ్యశ్రీ స్వామి చైతన్యానంద సరస్వతి** (ఉత్తరకాశి) వారి

శిష్యులునగు

**శ్రీమతి బొబ్బా వసుంధరగారు-శ్రీ సీతారామారావుగారల**

ధార్మిక ద్రవ్యదానముచే ముద్రింపబడినది.

వారిపై, వారి కుటుంబసభ్యులందఱిపై

పరమేశ్వరుని దివ్యానుగ్రహము,

**శ్రీ సద్గురు శివానందస్వాముల** వారి

దివ్యానుగ్రహము

ఎల్లప్పుడు ప్రసరింపబడుచుండునుం గాక!

**- దివ్యజీవన సంఘము**

ప్రకాశకులు :

**దివ్యజీవన సంఘము**

శివానందనగర్ –249 192

హిమాలయములు (ఉత్తరాఖండ్)

2020

వెల: రు.  500/–

ప్రచురణకర్త :

**శ్రీ స్వామి పద్మనాభానంద సరస్వతి**

దివ్యజీవన సంఘము

శివానందనగర్ –249 192

హిమాలయములు (ఉత్తరాఖండ్)

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణము | : | 1983 |
| ప్రతులు | : | 1,000 |
| ద్వితీయ ముద్రణము | : | 2007 |
| ప్రతులు | : | 1,000 |
| తృతీయ ముద్రణము | : | 2020 |
| ప్రతులు | : | 1,000 |

ముద్రణ స్థలము :

**శ్రీచక్ర ఆఫ్ సెట్ ప్రింటర్స్,**

తాటిపాక – 533 249

మొబైల్ నెం. 9492 156 888

---

ఈ గ్రంథమునకు సంబంధించిన సర్వహక్కులు

దివ్యజీవన సంఘమునకు చెందియున్నవి.

ॐ

Blessed Selves,

Om Namo Narayanaya!

Om Namo Bhagavate Sivanandaya!

Very glad to know that one of the ancient scriptures ' **Brahma Sutras**' also known as ' *Sareerika Sutras*' which is a part of scriptural trinity "*Prasthana Trayi*" is being printed as a third addition into Telugu. The sacred scripture "**Brahma Sutras**" was originally written by Sage Vyasa to clear the doubts in the Upanishads. It is also said some of the words in the Upanishads created doubts among seekers of Truth. Hence, Sage Vyasa, clearing the doubts emphatically declared that, these words in the Upanishads are revealing the supreme consciousness known as "Brahman" to meditate upon. Without proper guidance and clarification, it is difficult to grasp their meaning. Worshipful Gurudev Sri Swami Sivanandaji Maharaj brought this noble work with his commentary for every spiritual aspirant to grasp, meditate and realise the Truth. It is our most Revered Sri Swami Hamsanandaji Maharaj whom I affectionately call him as '*incarnation of Sage Vyasa*' who has been translating many books of Gurudev and Ashram publications translating into Telugu language for the benefit of Telugu-knowing spiritual aspirants. This book '**Brahma Sutras**' is not like other books. One must have proper knowledge, understanding and capacity to translate. Really, he is a suitable person to do this noble work. I hope this book "**Brahma Sutras**" which was printed in Telugu as two parts in its first edition in 1983, was brought into single volume in second edition in 2007. It is now being reprinted as third edition. I am very glad to know that Smt. Bobba Vasundara Mataji is helping in this sacred *Jnana Yajna* project as she did for second edition. May this third edition have wide circulation and give spiritual illumination to many Sadhaks is my heartfelt prayer.

May the grace of the Almighty God, Worshipful Gurudev, blesssings of worshipful Guru Maharaj Sri Swami Chidanandaji Maharaj be ever upon our most beloved Sri Swami Hamsanandaji, all those who have rendered their selfless service in this Jnana Yagna project. May all the readers of this noble work be bestowed with health, peace and spiritual illumination is my prayer.

Swami Yogaswarupananda
President
The Divine Life Society.

5th July, 2020

# BRAHMA SUTRAS

(Telugu Translation)

BY

**H.H. Sri Swami Sivananda Saraswathi Maharaj**

*Translated by*

**SWAMI HAMSANANDA**

*Published by*

**THE DIVINE LIFE SOCIETY**

SHIVANANDANAGAR - 249 192

HIMALAYAS (Uttarakhand)

2020

PUBLISHED BY

**SRI SWAMI PADMANABHANANDA**

**For THE DIVINE LIFE TRUST SOCIETY**

SHIVANANDANAGAR - 249 192

HIMALAYAS (Uttarakhand)

| | | |
|---|---|---|
| First Edition | : | 1983 |
| Copies | : | 1,000 |
| Second Edition | : | 2007 |
| Copies | : | 1,000 |
| Third Edition | : | 2020 |
| Copies | : | 1,000 |

**Printed at :**

Sri Chakra Off-Set Printers,

TATIPAKA - 533 249

Mob. No. 9492 156 888

*All Rights Reserved by*
*The Divine Life Trust Society*

ॐ

# శ్రీ గురు ధ్యానమ్

బ్రహ్మానందం పరమ సుఖదం,
కేవలం జ్ఞానమూర్తిం, ద్వంద్వాతీతం,
గగన సదృశం, తత్త్వమస్యాది లక్ష్యమ్ ।
ఏకం నిత్యం, విమలమచలం, సర్వధీ
సాక్షిభూతం, భావాతీతం త్రిగుణరహితం
సద్గురుం తం నమామి ॥

తా॥ బ్రహ్మానంద స్వరూపుడును, పరమ సుఖము నొసంగువాడును, జ్ఞానస్వరూపుడును, ద్వంద్వముల కతీతుడైనవాడును, విశాల సముద్రము వంటివాడును, "తత్త్వమసి" ఇత్యాది వాక్యములచే పొందఁబడువాడును, ఏకము, నిత్యము, శుద్ధము, అచలము, సాక్షిస్వరూపుడు, భావాతీతుడు, త్రిగుణ రహితుడునైన సద్గురు మూర్తికి నమస్కరించుచున్నాను.

ॐ

# శ్రీ వ్యాస ధ్యానమ్

వ్యాసం విష్ణుస్వరూపం కలిమల తమసః
ప్రోద్యదాదిత్య దీప్తిం, వాసిష్ఠం వేద
శాఖావ్యసనకరమృషిం ధర్మబీజం
మహాంతమ్ । పౌరాణ బ్రహ్మణ్యంచ
యదథయో భారతం చ స్మృతిం తం
కృష్ణద్వైపాయనాఖ్యం సురనర దితిజైః
పూజితం పూజయేఽహమ్ ॥

తా॥ కృష్ణద్వైపాయనుడని పిలువబడువాడును, దేవదానవ మనుజులచే పూజింపబడువాడును, విష్ణుస్వరూపుడును, కలియుగమనెడి రాత్రికి భాస్కరుని వంటివాడును, వసిష్ఠ గోత్రోద్భవుడును, వేదశాఖలను విభజించినట్టివాడును, ధర్మబీజస్వరూపుడును, పురాణములు- బ్రహ్మసూత్రములు- మహాభారతమును మఱియు స్మృతిని రచించినట్టి వాడునగు శ్రీ వేదవ్యాసమహర్షిని నేను పూజించుచున్నాను.

# శ్రీ హస్తామలకాచార్య విరచిత
# శ్రీ శంకర దేశికాష్టకమ్

శ్లో॥ పద్మాసీనం ప్రశాంతం యమవిరత
మనంగారి తుల్య ప్రభావం,
ఫాలే భస్మాంకితాభం స్మిత రుచిర
ముఖాంబోజ మిందీవరాక్షం ।
కంబుగ్రీవం కరాభ్యామ విహత
విలసత్పుస్తకం జ్ఞానముద్రం
వంద్యం గీర్వాణ ముఖ్యైర్నతజన వరదం
భావయే శంకరార్యం ॥

1. విదితాఖిల శాస్త్ర సుధాజలదే,
మహితోపనిషత్కథితార్థనిధే ।
హృదయే కలయే విమలం చరణం,
భవ శంకర దేశిక మే శరణం ॥

తా॥ సమస్త శాస్త్రజ్ఞానమనెడి అమృతమునకు సముద్రము వంటివాడా! నీవు మహిమోపేతములగు ఉపనిషత్సారమునకు నిధి వంటివాడవు. నా హృదయమునందు నీ పరిశుద్ధమైన పాదపద్మములను గూర్చి ధ్యానింతును. ఓ శంకర దేశికా! నేను నిన్ను శరణు వేడుచుంటిని.

2. కరుణా వరుణాలయ పాలయమామ్,
భవసాగర దుఃఖ విదూన హృదమ్ ।
రచితాఖిల దర్శన తత్త్వ విదమ్,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ ఓ కరుణాసముద్రా! ఈ సంసారసాగర దుఃఖముచే తపించుచున్న నన్ను సంరక్షించుము. సర్వదర్శన తత్త్వసారమును నీవు తెలిసికొనియున్నావు. ఓ శంకర దేశికా! నేను నిన్ను శరణు వేడుచుంటిని.

3. భవతా జనతా సుఖితా భవితా,
నిజబోధ విచారణ చారుమతే ।
కలయేశ్వర జీవ వివేక విదం,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ నీ వలన మానవాళికి సుఖము కలిగినది. స్వస్వరూప బోధనా విధానమునందు నీవు చతురుడవు. జీవ బ్రహ్మైక్యమునుఁ గూర్చి బోధించినట్టి నిన్ను నేను ధ్యానించుచున్నాను. ఓ శంకర దేశికా! నీవే నాకు శరణ్యుడవు.

4. భవ ఏవ భవానితిమే నితరాం,
సమజాయత చేతసి కౌతుకితా ।
మమ వారయ మోహ మహాజలధిం,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ "నీవే నా దేవుడవ"ని తలంచుచున్న నా మనస్సు ఆనందముతో కూడియున్నది. నాలోనున్న మోహ మహాసాగరమును తొలగించుము. ఓ శంకరా! నీవే నాకు శరణ్యుడవు.

5. సుకృతోऽధికృతే బహుధా భవతో,
భవితా పదదర్శన లాలసతా ।
అతిదీన మిమం పరిపాలయమాం,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ నేను ఎంతో కాలమునుండి సుకృత కర్మలనొనర్చిన కారణముచే నీ పాదపద్మములయందనురాగము నాకు కలిగినది. దీనుడనగు నన్ను పరిపాలించుము. ఓ శంకరా! నీవే నాకు శరణ్యుడవు.

6. జగతీ మవితుం కలితాకృతయో,
విచరన్తి మహామహ సచ్ఛలితః ।
అహిమాంశురివాత్ర విభాసిపురో,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ ఈ జగత్తును ఉద్ధరించుటకై మీ బోటి మహాపురుషులు సంచారమును చేయుచుందురు. నీవు నాకు పరిశుద్ధమైన ప్రకాశించుచున్న సూర్యునివలె గోచరించుచున్నావు. ఓ శంకరా! నీవే నాకు శరణ్యుడవు.

7. గురుపుంగవ! పుంగవ కేతన! తే,
సమతామయతాం నహికోఽపి సుధీః ।
శరణాగతవత్సల! తత్త్వనిధే!
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ ఓ గురుదేవా! మానవ శ్రేష్ఠా! నీ ప్రజ్ఞను గణించుటకెవ్వరికిన్నీ సాధ్యము కాదు. ఓ శరణాగత వత్సలా! తత్త్వనిధీ! నాకు శరణ్యము నీవే!

8. విదితానమయా విశదైక కళా,
నచకించన కాంచన మస్తి గురో ।
ద్రుతమేవ విదేహికృపాం సహజాం,
భవ శంకర దేశిక మే శరణమ్ ॥

తా॥ ఓ ఆచార్యా! నీ కంటె మిక్కిలి పొందఁదగినట్టి ఐశ్వర్యము నాకు కానఁబడుటలేదు. నీ సహజమైన కృపను నాకు దయచేయుము. ఓ శంకరా! నీవే నాకు శరణ్యుడవు.

నా॥ భవశంకర దేశిక మే శరణమ్ ।
భవశంకర దేశిక మే శరణమ్ ॥

# ఆశీస్సులు

## 1

జయ గంగే జయదుర్గే

శ్రీరామ జయరామ జయజయ రామ
ఓం నమో భగవతే శివానందాయ
బ్రహ్మనిష్ఠాయ విద్మహే
సంయమీంద్రాయ ధీమహి ।
తన్నః శివానందః ప్రచోదయాత్ ॥

## శ్లోక త్రికమ్

1. శివానందాశ్రమ వాసిన్
హంసానంద మహామునే ।
ఆంధ్రాణాముపకారాయ
బ్రహ్మసూత్ర మనూదితమ్ ॥

2. సచ్చిదానంద రూపాయ
గంగాతీర నివాసినే ।
శ్రీమత్పరమ హంసాయ
హంసానందాయతే నమః ॥

3.	గురుదేవ కుటీరే-త్ర
నివాసః సార్థకో-భవత్ ।
పరోపకార నిరతః
స్వాత్మారామాయ మఙ్గలమ్ ॥

హరిః ఓం తత్సత్

"ఓం నమో నారాయణాయ నారాయణానందః"

దీపావళిః 4-11-1983 శుక్రవాసరః

---

# 2

సంసారోగ్ర రుజార్త వైద్య జగదాచార్యుల్, శివానంద వి
ద్వాంసుల్ వ్రాసిన బ్రహ్మసూత్ర విపుల వ్యాఖ్యన్ సుధీమండలీ
శంసార్హంబుగఁ దొల్గొనర్చి, జనతాసంత్రాతవైనట్టి శ్రీ
హంసానంద సరస్వతీ మునివరేణ్య! ధన్యగణ్యా నతుల్.

**- శ్రీ పండిత విశ్వనాథకవి**

ది.వి. 24.9.1983 } ఆంధ్రసాహితి ప్రచార సభ
(పశ్చిమ బెంగాల్)

---

# 3

"శ్రీ సద్గురు శివానందస్వాములవారు ఆంగ్లభాషలో విరచించిన బ్రహ్మసూత్ర భాష్యమునకు మీరుఁ గావించినట్టి ఆంధ్రానువాదము ఆంధ్రలోక ప్రజానీకమునకు గర్వకారణం"

**బ్రహ్మలీన మాతా**
**శ్రీ నిరంజనానంద గిరిగారు**
ఆత్మారామాశ్రమము
కొవ్వూరు, (ఆంధ్రప్రదేశ్)

ది.వి. 3.9.1983
మకాం: శ్రీ ఆంధ్ర తారకాశ్రమము
వారణాసి (ఉ. ప్ర.)

# 4

## "భూతపురి" వారి పద్యము

మ ॥ స్థిర సంకల్పులు హౌణవాఙ్మయమునన్ దివ్యుల్ శివానందధీ
వరులున్ బల్కిన బ్రహ్మసూత్ర వితత వ్యాఖ్యానమున్ దెన్గుఁజే
సి, రసజ్ఞస్తుతి పాత్రులైన, సతమున్ శ్రీ విష్ణుదీవ్యన్మనో
హరపాదార్చిత చిత్తులన్ గొలుతు హంసానంద యోగీంద్రులన్.

ఇతి నమాంసి, శ్రేయాంసి, భూయాంసి,

త్వదీయ **"భూతపురి"**

కడప (ఆంధ్రప్రదేశ్)

ॐ

॥ శ్రీ గురుభ్యో నమః ॥

శ్రీ శారీరక మీమాంసా దర్శనమ్

(బ్రహ్మసూత్రాణి)

# అథ ప్రథమోఽధ్యాయః

## ప్రథమః పాదః


| క్రమసంఖ్య | విషయము | | పేజీ |
|---|---|---|---|
| **1.** | **జిజ్ఞాసాధికరణమ్** | .......... | 13 |
| 1. | అథాతో బ్రహ్మజిజ్ఞాసా | .......... | 13 |
| **2.** | **జన్మాద్యధికరణమ్** | .......... | 16 |
| 2. | జన్మాద్యస్య యతః | .......... | 16 |
| **3.** | **శాస్త్రయోనిత్వాధికరణమ్** | .......... | 19 |
| 3. | శాస్త్రయోనిత్వాత్ | .......... | 19 |
| **4.** | **సమన్వయాధికరణమ్** | .......... | 20 |
| 4. | తత్తు సమన్వయాత్ | .......... | 20 |
| **5.** | **ఈక్షత్యధికరణమ్** | .......... | 27 |
| 5. | ఈక్షతేర్నా శబ్దమ్ | .......... | 27 |
| 6. | గౌణశ్చేన్నాత్మ శబ్దాత్ | .......... | 30 |
| 7. | తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ | .......... | 31 |
| 8. | హేయత్వావచనాచ్చ | .......... | 32 |
| 9. | స్వాప్యయాత్ | .......... | 34 |
| 10. | గతిసామాన్యాత్ | .......... | 35 |
| 11. | శ్రుతత్వాచ్చ | .......... | 36 |

**6. ఆనందమయాధికరణమ్** .......... 38

12. ఆనందమయోఽభ్యాసాత్ .......... 38

13. వికారశబ్దాన్నేతి చేన్నప్రాచుర్యాత్ .......... 41

14. తద్ధేతు వ్యపదేశాచ్చ .......... 42

15. మాంత్ర వర్ణికమేవచ గీయతే .......... 43

16. నేతరోఽనుపపత్తేః .......... 44

17. భేదవ్యప దేశాచ్చ .......... 44

18. కామాచ్చ నాను మానాపేక్షా .......... 45

19. అస్మిన్నస్యచ తద్యోగం శాస్తి .......... 45

**7. అంతరధికరణమ్** .......... 46

20. అంతస్తద్ధర్మోపదేశాత్ .......... 46

21. భేదవ్యపదేశాచ్చాన్యః .......... 49

**8. ఆకాశాధికరణమ్** .......... 50

22. ఆకాశస్తల్లింగాత్ .......... 50

**9. ప్రాణాధికరణమ్** .......... 52

23. అత ఏవ ప్రాణః .......... 52

**10. జ్యోతిశ్చరణాధికరణమ్** .......... 53

24. జ్యోతిశ్చరణాభిధానాత్ .......... 53

25. ఛాందోఽభిధానాన్నేతిచేన్నతథా చేతోఽర్పణ నిగదాత్తథాహి దర్శనమ్ .......... 55

26. భూతాదిపాద వ్యపదేశోపపత్తే శ్చైవమ్ .......... 57

27. ఉపదేశ భేదాన్నేతి చేన్నోభయస్మిన్నప్య విరోధాత్.......... 58

**11. ప్రతర్దనాధికరణమ్** .......... 59

28. ప్రాణస్తథానుగమాత్ .......... 59

29. నవక్తురాత్మోపదేశాదితిచేద ధ్యాత్మ సంబంధభూమాహ్యస్మిన్ .......... 60

30. శాస్త్ర దృష్ట్యాతూపదేశో వామదేవవత్ .......... 62
31. జీవముఖ్య ప్రాణలింగాన్నేతి .......... 62
చేన్నోపాసాత్రైవిధ్యాదాశ్రితత్వాదిహ తద్యోగాత్

# అథ ద్వితీయ పాదః

**1. సర్వత్ర ప్రసిద్ధ్యధికరణమ్** .......... 68
1. సర్వత్రప్రసిద్ధోపదేశాత్ .......... 68
2. వివక్షిత గుణోప పత్తేశ్చ .......... 69
3. అనుపపత్తేస్తు న శారీరః .......... 70
4. కర్మకర్తృవ్యపదేశాచ్చ .......... 71
5. శబ్దవిశేషాత్ .......... 72
6. స్మృతేశ్చ .......... 72
7. అర్భకౌకస్త్వాత్తద్వ్యపదేశాచ్చనేతి చేన్నని .......... 73
చాయ్యత్వా దేవం వ్యోమవచ్చ
8. సంభోగప్రాప్తిరితి చేన్నవైశేష్యాత్ .......... 74
**2. అత్త్రధికరణమ్** .......... 76
9. అత్తాచరాచరగ్రహణాత్ .......... 76
10. ప్రకరణాచ్చ .......... 77
**3. గుహాప్రవిష్టాధికరణమ్** .......... 78
11. గుహాం ప్రవిష్టావాత్మానౌహి తద్దర్శనాత్ .......... 78
12. విశేషణాచ్చ .......... 80
**4. అంతరాధికరణమ్** .......... 81
13. అంతర ఉపపత్తేః .......... 81
14. స్థానాది వ్యపదేశాచ్చ .......... 82
15. సుఖ విశిష్టాభిధానాదేవచ .......... 82
16. శ్రుతోప నిషత్క గత్యభిధానాచ్చ .......... 84
17. అనవస్థితేరసంభవాచ్చనే తరః .......... 84

**5. అంతర్యామ్యధికరణమ్ .......... 85**

18. అంతర్యామ్యధి దైవాదిషు తద్ధర్మవ్యపదేశాత్ .......... 85
19. నచస్మార్తమతద్ధర్మాభిలాపాత్ .......... 87
20. శారీరశ్చోభయేఽపి హి భేదేనైన మధీయతే .......... 87

**6. అదృశ్యత్వాధికరణమ్ .......... 89**

21. అదృశ్యత్వాధి గుణకో ధర్మో క్తేః .......... 89
22. విశేషణ భేదవ్యపదేశాభ్యాంచ నేతరౌ .......... 89
23. రూపోపన్యాసాచ్చ .......... 91

**7. వైశ్వానరాధికరణమ్ .......... 91**

24. వైశ్వానరః సాధారణ శబ్ద విశేషాత్ .......... 91
25. స్మర్యమాణమనుమానం స్యాదితి .......... 93
26. శబ్దాదిభ్యోఽంతః ప్రతిష్ఠానాచ్చనేతి చేన్నతథా .......... 94
దృష్ట్యుపదేశాద సంభవాత్పురుష మపిచైన మధీయతే
27. అత ఏవ న దేవతాభూతంచ .......... 95
28. సాక్షాదప్యవిరోధం జైమినిః .......... 96
29. అభివ్యక్తేరిత్యాశ్మరథ్యః .......... 96
30. అనుస్మృతేర్బాదరిః .......... 97
31. సంపత్తేరితి జైమినిస్తథా హి దర్శయతి .......... 98
32. ఆమనంతి చై నమస్మిన్ .......... 98


# అథ తృతీయ పాదః


**1. ద్యుభ్వాద్యధికరణమ్ .......... 103**

1. ద్యుభ్వాద్యాయతనమ్ స్వశబ్దాత్ .......... 103
2. ముక్తోప సృప్యవ్యపదేశాత్ .......... 105
3. నాను మానమతచ్ఛబ్దాత్ .......... 106

4. ప్రాణభృచ్చ .......... 106

5. భేద వ్యపదేశాత్ .......... 107

6. ప్రకరణాత్ .......... 107

7. స్థిత్యదనాభ్యాం చ .......... 108

**2. భూమాధికరణమ్ .......... 109**

8. భూమా సంప్రసాదాదధ్యుపదేశాత్ .......... 109

9. ధర్మోప పత్తేశ్చ .......... 112

**3. అక్షరాధికరణమ్ .......... 113**

10. అక్షరమంబరాంతధృతేః .......... 113

11. సాచ ప్రశాసనాత్ .......... 114

12. అన్యభావవ్యావృత్తేశ్చ .......... 114

**4. ఈక్షతి కర్మవ్యపదేశాధికరణమ్ .......... 115**

13. ఈక్షతి కర్మవ్యపదేశాత్సః .......... 115

**5. దహరాధికరణమ్ .......... 117**

14. దహర ఉత్తరేభ్యః .......... 117

15. గతి శబ్దాభ్యాం తథా దృష్టం లింగం చ .......... 118

16. ధృతేశ్చ మహిమ్నోఽ స్యాస్మిన్నుపలబ్ధేః .......... 120

17. ప్రసిద్ధేశ్చ .......... 121

18. ఇతర పరామర్శాత్స ఇతి చేన్నాసంభవాత్ .......... 121

19. ఉత్తరాచ్చేదావిర్భూత స్వరూపస్తు .......... 122

20. అన్యార్థశ్చ పరామర్శః .......... 124

21. అల్పశ్రుతేరితి చేత్తదుక్తమ్ .......... 124

**6. అనుకృత్యధికరణమ్ .......... 125**

22. అనుకృతేస్తస్యచ .......... 125

23. అపి చ స్మర్యతే .......... 126

| | | | |
|---|---|---|---|
| **7.** | **ప్రమితాధికరణమ్** | .......... | 127 |
| | 24. శబ్దాదేవ ప్రమితః | .......... | 127 |
| | 25. హృద్యపేక్షయాతుమనుష్యాధికారత్వాత్ | .......... | 128 |
| **8.** | **దేవతాధికరణమ్** | .......... | 130 |
| | 26. తదుపర్యపి బాదరాయణః సంభవాత్ | .......... | 130 |
| | 27. విరోధః కర్మణీతి చేన్నానేక ప్రతిపత్తేర్దర్శనాత్ | .......... | 131 |
| | 28. శబ్ద ఇతిచేన్నాతః ప్రభాత్రప్రత్యక్షానుమానాభ్యామ్ | .......... | 132 |
| | 29. అత ఏవ చ నిత్యత్వమ్ | .......... | 136 |
| | 30. సమాన నామ రూపత్వాచ్చావృత్తావప్య విరోధో దర్శనాత్స్మృతేశ్చ | .......... | 137 |
| | 31. మధ్వాదిష్వ సంభవాదనధికారం జైమినిః | .......... | 139 |
| | 32. జ్యోతిషి భావాచ్చ | .......... | 139 |
| | 33. భావం తు బాదరాయణోఽస్తిహి | .......... | 140 |
| **9.** | **అపశూద్రాధికరణమ్** | .......... | 142 |
| | 34. శుగస్య తదనాదర శ్రవణాత్తదా ద్రవ ణాత్సూచ్యతే హి | .......... | 142 |
| | 35. క్షత్రియత్వావ గతేశ్చోత్తరత్రచైత్ర రథేన లింగాత్ | .......... | 143 |
| | 36. సంస్కార పరామర్శాత్తదభావాభిలాపాచ్చ | .......... | 143 |
| | 37. తదభావ నిర్ధారణేచ ప్రవృత్తేః | .......... | 144 |
| | 38. శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ | .......... | 145 |
| **10.** | **కంపనాధికరణమ్** | .......... | 146 |
| | 39. కంపనాత్ | .......... | 146 |
| **11.** | **జ్యోతిరధికరణమ్** | .......... | 147 |
| | 40. జ్యోతిర్దర్శనాత్ | .......... | 147 |
| **12.** | **అర్థాంతరత్వా దివ్యపదేశాధికరణమ్** | .......... | 148 |
| | 41. ఆకాశోఽర్థాంతరత్వాదివ్యపదేశాత్ | .......... | 148 |

**13. సుషుప్త్యుత్క్రాంత్యధికరణమ్** .......... 149

42. సుషుప్త్యుత్క్రాంత్యోర్భేదేన .......... 149

43. పత్యాది శబ్దేభ్యః .......... 150

## అథ చతుర్థః పాదః

**1. ఆనుమానికాధికరణమ్** .......... 154

1. ఆనుమానికమప్యేకేషామితిచేన్న శరీరరూపక విన్యస్తగృహీతేర్దర్శయతి చ .......... 154
2. సూక్ష్మంతు తదర్హత్వాత్ .......... 156
3. తదధీనత్వాదర్థవత్ .......... 157
4. జ్ఞేయత్వావచనాచ్చ .......... 158
5. వదతీతిచేన్నప్రాజ్ఞోహిప్రకరణాత్ .......... 159
6. త్రయాణామేవచైవముపన్యాసః ప్రశ్నశ్చ .......... 160
7. మహద్వచ్చ .......... 161

**2. చమసాధికరణమ్** .......... 162

8. చమసవదవిశేషాత్ .......... 162
9. జ్యోతిరుపక్రమాతు తథాహ్య ధీయత ఏకే .......... 163
10. కల్పనోపదేశాచ్చ మధ్వాది వదవిరోధః .......... 164

**3. సంఖ్యోప సంగ్రహాధి కరణమ్** .......... 165

11. నసంఖ్యోప సంగ్రహాదపి నానాభావాదతిరేకాచ్చ.......... 165
12. ప్రాణాదయోవాక్యశేషాత్ .......... 167
13. జ్యోతిషైకేషామసత్యన్నే .......... 168

**4. కారణత్వాధి కరణమ్** .......... 169

14. కారణత్వేనచాకాశాదిషుయథావ్యపదిష్టోక్తేః .......... 169
15. సమాకర్షాత్ .......... 171

**5. బాలాక్యధికరణమ్** .......... 174
16. జగద్వాచిత్వాత్ .......... 174
17. జీవముఖ్యప్రాణలింగాన్నేతి చేత్తద్ వ్యాఖ్యాతమ్ .......... 176
18. అన్యార్థంతు జైమినిః ప్రశ్న వ్యాఖ్యానాభ్యామపిచైవమేకే .......... 177

**6. వాక్యాన్వయాధికరణమ్** .......... 178
19. వాక్యాన్వయాత్ .......... 178
20. ప్రతిజ్ఞాసిద్ధేర్లింగమిత్యాశ్మరథ్యః .......... 180
21. ఉత్క్రమిష్యత ఏవంభావాదిత్యౌడులోమిః .......... 181
22. అవస్థితే రితికాశకృత్స్నః .......... 182

**7. ప్రకృత్యధికరణమ్** .......... 185
23. ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాంతానుపరోధాత్ .......... 185
24. అభిధ్యోపదేశాచ్చ .......... 187
25. సాక్షాచ్చోభయామ్నానాత్ .......... 187
26. ఆత్మకృతేః .......... 188
27. పరిణామాత్ .......... 188
28. యోనిశ్చహిగీయతే .......... 189

**8. సర్వవ్యాఖ్యానాధికరణమ్** .......... 190
29. ఏతేనసర్వేవ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః .......... 190

నాల్గవ పాదము పూర్తియైనది.

బ్రహ్మసూత్ర ప్రథమాధ్యాయము పూర్తియైనది.

(మూలసూత్రములు మాత్రము)

# అథ ద్వితీయోధ్యాయః

## ప్రథమః పాదః


| | | | |
|---|---|---|---|
| **1.** | **స్మృత్యధికరణమ్** | .......... | 198 |
| 1. | స్మృత్యనవకాశదోష ప్రసంగ ఇతి చేన్నాన్య స్మృత్యనవకాశ దోష ప్రసంగాత్ | .......... | 198 |
| 2. | ఇతరేషామ్ చానుప లబ్ధేః | .......... | 199 |
| **2.** | **యోగ ప్రత్యుక్త్యధికరణమ్** | .......... | 200 |
| 3. | ఏతేన యోగః ప్రత్యుక్తః | .......... | 200 |
| **3.** | **విలక్షణత్వాధికరణమ్** | .......... | 202 |
| 4. | నవిలక్షణత్వాదస్య తథా త్వం చ శబ్దాత్ | .......... | 202 |
| 5. | అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్ | .......... | 204 |
| 6. | దృశ్యతేతు | .......... | 205 |
| 7. | అసదితిచేన్నప్రతి షేధమాత్రత్వాత్ | .......... | 206 |
| 8. | అపీతౌ తద్వత్ప్రసంగాదసమంజసమ్ | .......... | 207 |
| 9. | నతుదృష్టాంత భావాత్ | .......... | 209 |
| 10. | స్వపక్ష దోషాచ్చ | .......... | 211 |
| 11. | తర్కాప్రతిష్ఠానాదప్యన్యథానుమేయమితి చేదేవమప్యనిర్మోక్ష ప్రసంగః | .......... | 212 |
| **4.** | **శిష్ట పరిగ్రహాధికరణమ్** | .......... | 215 |
| 12. | ఏతేన శిష్టా పరిగ్రహా అపి వ్యాఖ్యాతాః | .......... | 215 |
| **5.** | **భోక్త్రా పత్త్యధికరణమ్** | .......... | 217 |
| 13. | భోక్త్రా పత్తేరవిభాగశ్చే త్స్యాల్లోకవత్ | .......... | 217 |

| | | | |
|---|---|---|---|
| **6.** | **ఆరంభణాధికరణమ్** | .......... | 218 |
| | 14. తదనన్యత్వ మారంభణ శబ్దాదిభ్యః | .......... | 218 |
| | 15. భావేచోపలబ్ధేః | .......... | 220 |
| | 16. సత్త్వాచ్చావరస్య | .......... | 221 |
| | 17. అసద్వ్యపదేశాన్నేతి చేన్న ధర్మాంతరేణ వాక్య శేషాత్ | .......... | 222 |
| | 18. యుక్తేశ్శబ్దాంతరాచ్చ | .......... | 224 |
| | 19. పటవచ్చ | .......... | 225 |
| | 20. యథాచ ప్రాణాది | .......... | 226 |
| **7.** | **ఇతర వ్యపదేశాధికరణమ్** | .......... | 227 |
| | 21. ఇతర వ్యపదేశాద్ధితాకరణాది దోష ప్రసక్తిః | .......... | 227 |
| | 22. అధికం తు భేదనిర్దేశాత్ | .......... | 228 |
| | 23. అశ్మాదివచ్చ తదనుపపత్తిః | .......... | 229 |
| **8.** | **ఉపసంహార దర్శనాధికరణమ్** | .......... | 231 |
| | 24. ఉపసంహార దర్శనాన్నేతి చేన్న క్షీరవద్ధి | .......... | 231 |
| | 25. దేవాదివదపిలోకే | .......... | 232 |
| **9.** | **కృత్స్న ప్రసక్త్యధికరణమ్** | .......... | 234 |
| | 26. కృత్స్న ప్రసక్తిర్నిరవయవత్వశబ్ద కోపోవా | .......... | 234 |
| | 27. శ్రుతేస్తు శబ్ద మూలత్వాత్ | .......... | 235 |
| | 28. ఆత్మనిచైవం విచిత్రాశ్చహి | .......... | 237 |
| | 29. స్వపక్షదోషాచ్చ | .......... | 238 |
| **10.** | **సర్వోపేతాధికరణమ్** | .......... | 240 |
| | 30. సర్వోపేతా చ తద్దర్శనాత్ | .......... | 240 |
| | 31. వికరణత్వాన్నేతి చేత్తదుక్తమ్ | .......... | 241 |

**11. ప్రయోజన వత్వాధికరణమ్** .......... 242

32. న ప్రయోజన వత్వాత్ .......... 242

33. లోకవత్తు లీలా కైవల్యమ్ .......... 243

**12. వైషమ్యనైర్ఘృణ్యాధికరణమ్** ........... 244

34. వైషమ్య నైర్ ఘృణ్యేన సాపేక్షత్వాత్తథాహి దర్శయతి ...... 244

35. న కర్మావిభాగాదితి చేన్నానాదిత్వాత్ .......... 245

36. ఉపపద్యతే చాప్యుపలభ్యతే చ .......... 246

**13. సర్వధర్మోప ప్రత్త్యధికరణమ్** .......... 248

37. సర్వధర్మోప పత్తేశ్చ .......... 248

## అథ ద్వితీయః పాదః

**1. రచనానుపపత్త్యధికరణమ్** .......... 263

1. రచనానుపపత్తేశ్చ నానుమానమ్ .......... 263
2. ప్రవృత్తేశ్చ .......... 264
3. పయోఽంబు వచ్చేత్త త్రాపి .......... 266
4. వ్యతిరేకానవస్థితేశ్చ అనపేక్షత్వాత్ .......... 267
5. అన్యత్రాభావాచ్చ న తృణాదివత్ .......... 268
6. అభ్యుపగమేఽ ప్యర్థాభావాత్ .......... 268
7. పురుషాశ్మవదితి చేత్తథాపి .......... 269
8. అంగిత్వానుపపత్తేశ్చ .......... 271
9. అన్యథాను మితౌచజ్ఞశక్తివియోగాత్ .......... 272
10. విప్రతిషేధాచ్చా స మంజసమ్ .......... 273

**2. మహద్దీర్ఘాధి కరణమ్** .......... 275

11. మహద్దీర్ఘ వద్వాహ్రస్వ పరిమండలాభ్యామ్ .......... 275

**3. పరమాణు జగదకారణత్వాధికరణమ్** .......... 277

12. ఉభయథాపి న కర్మాతస్తదభావః .......... 277
13. సమవాయాభ్యుపగమాచ్చసామ్యాదన వస్థితేః .......... 280
14. నిత్యమేవచ భావాత్ .......... 281
15. రూపాదిమత్త్వాచ్చ విపర్యయో దర్శనాత్ .......... 282
16. ఉభయథా చ దోషాత్ .......... 282
17. అపరిగ్రహాచ్చాత్యంత మనపేక్షా .......... 283

**4. సముదాయాధికరణమ్** .......... 286

18. సముదాయే ఉభయ హేతుకేఽ పితదప్రాప్తిః .......... 286
19. ఇతరేతర ప్రత్యయత్వాదితి చేన్నోత్పత్తి మాత్రనిమిత్తత్వాత్ ..... 289
20. ఉత్తరోత్పాదేచ పూర్వనిరోధాత్ .......... 293
21. అసతిప్రతిజ్ఞో పరోధోయౌగపద్యమన్యథా .......... 295
22. ప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యా నిరోధా ప్రాప్తిరవిచ్ఛేదాత్.......... 296
23. ఉభయథా చ దోషాత్ .......... 297
24. ఆకాశేచా విశేషాత్ .......... 298
25. అనుస్మృతేశ్చ .......... 301
26. నాసతోఽ దృష్టత్వాత్ .......... 303
27. ఉదాసీనా నామపిచైవం సిద్ధిః .......... 304

**5. అభావాధికరణమ్** .......... 305

28. నా భావ ఉపలబ్ధేః .......... 305
29. వైధర్మ్యాచ్చన స్వప్నాదివత్ .......... 308
30. నభావోఽ నుపలబ్ధేః .......... 309
31. క్షణికత్వాచ్చ .......... 310
32. సర్వథానుపపత్తేశ్చ .......... 311

| | | | |
|---|---|---|---|
| **6.** | **ఏకస్మిన్న సంభవాధికరణమ్** | .......... | 312 |
| | 33. నైకస్మిన్న సంభవాత్ | .......... | 312 |
| | 34. ఏవం చాత్మాకార్త్స్న్యమ్ | .......... | 314 |
| | 35. న చ పర్యాయాదప్యవిరోధో వికారాదిభ్యః | .......... | 315 |
| | 36. అంత్యావస్థితేశ్చో భయనిత్యత్వాదవిశేషః | .......... | 316 |
| **7.** | **పత్యధికరణమ్** | .......... | 317 |
| | 37. పత్యురసామంజస్యాత్ | .......... | 317 |
| | 38. సంబంధానుపపత్తేశ్చ | .......... | 319 |
| | 39. అధిష్ఠానానుపపత్తేశ్చ | .......... | 320 |
| | 40. కరణవచ్చేన్న భోగాదిభ్యః | .......... | 322 |
| | 41. అంతవత్త్వమ సర్వజ్ఞతావా | .......... | 323 |
| **8.** | **ఉత్పత్త్య సంభవాధికరణమ్** | .......... | 342 |
| | 42. ఉత్పత్త్య సంభవాత్ | .......... | 324 |
| | 43. న చ కర్తుః కరణమ్ | .......... | 325 |
| | 44. విజ్ఞానాది భావే వా తదప్రతిషేధః | .......... | 325 |
| | 45. విప్రతిషేధాచ్చ. | .......... | 327 |

# అథ తృతీయః పాదః


| క్రమసంఖ్య | విషయము | | పేజీ |
|---|---|---|---|
| **1.** | **వియదధికరణమ్** | .......... | 336 |
| 1. | న వియదశ్రుతేః | .......... | 336 |
| 2. | అస్తితు | .......... | 337 |
| 3. | గౌణ్యసంభవాత్ | .......... | 337 |
| 4. | శబ్దాచ్చ | .......... | 338 |
| 5. | స్యాచ్చై కస్య బ్రహ్మశబ్దవత్ | .......... | 339 |
| 6. | ప్రతిజ్ఞాహాని రవ్యతిరేకా చ్ఛబ్దేభ్యః | .......... | 341 |
| 7. | యావద్వికారం తు విభాగో లోకవత్ | .......... | 343 |
| **2.** | **మాతరిశ్వాధికరణమ్** | .......... | 348 |
| 8. | ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః | .......... | 348 |
| **3.** | **అసంభవాధికరణమ్** | .......... | 349 |
| 9. | అసంభవస్తు సతోఽ నుపపత్తేః | .......... | 349 |
| **4.** | **తేజోఽ ధికరణమ్** | .......... | 351 |
| 10. | తోజోఽ త స్తథాహ్యాహ | .......... | 351 |
| **5.** | **అబధికరణమ్** | .......... | 353 |
| 11. | ఆపః | .......... | 353 |
| **6.** | **పృథివ్యధికారాధికరణమ్** | .......... | 354 |
| 12. | పృథివ్యధికారరూపే శబ్దాంతరేభ్యః | .......... | 354 |
| **7.** | **తదభిధ్యానాధికరణమ్** | .......... | 355 |
| 13. | తదభిధ్యానాదేవతుతల్లింగాత్సః | .......... | 355 |

| | | | |
|---|---|---|---|
| **8.** | **విపర్యయాధికరణమ్** | .......... | 357 |
| | 14. విపర్యయేణతు క్రమోఽ త ఉపపద్యతేచ | .......... | 357 |
| **9.** | **అంతరావిజ్ఞానాధికరణమ్** | .......... | 358 |
| | 15. అంతరావిజ్ఞాన మనసీక్రమేణ తల్లింగాదితిచేన్నావిశేషాత్ | .......... | 358 |
| **10.** | **చరాచరవ్యపాశ్రయధికరణమ్** | .......... | 361 |
| | 16. చరాచర వ్యపాశ్రయస్తు స్యాత్తద్వ్యపదేశోభాక్తస్తద్ భావ భావిత్వాత్ | .......... | 361 |
| **11.** | **ఆత్మాధికరణమ్** | .......... | 362 |
| | 17. నాత్మాఽ శ్రుతేర్నిత్యత్వాచ్చతాభ్యః | .......... | 362 |
| **12.** | **జ్ఞాధికరణమ్** | .......... | 364 |
| | 18. జ్ఞోఽ త ఏవ | .......... | 364 |
| **13.** | **ఉత్క్రాంతిగత్యధికరణమ్** | .......... | 367 |
| | 19. ఉత్క్రాంతి గత్యాగతీనామ్ | .......... | 367 |
| | 20. స్వాత్మనాచోత్తరయోః | .......... | 368 |
| | 21. నాణురతచ్ఛృతేరితిచేన్నేతరాధి కారాత్ | .......... | 369 |
| | 22. స్వశబ్దాను మానాభ్యాంచ | .......... | 370 |
| | 23. అవిరోధశ్చందనవత్ | .......... | 371 |
| | 24. అవస్థితి వైశేష్యాదితి చేన్నాధ్యు పగమాద్ధృదిహి | .......... | 371 |
| | 25. గుణాద్వాలోకవత్ | .......... | 373 |
| | 26. వ్యతిరేకో గంధవత్ | .......... | 373 |
| | 27. తథా చ దర్శయతి | .......... | 374 |
| | 28. పృథగుప దేశాత్ | .......... | 374 |
| | 29. తద్గుణ సారత్వాత్తు తద్ వ్యపదేశః ప్రాజ్ఞవత్ | .......... | 375 |

| | | | |
|---|---|---|---|
| 30. | యావదాత్మ భావిత్వాచ్చ న దోషస్తద్దర్శనాత్ | .......... | 378 |
| 31. | పుంస్త్వాది వత్త్వస్య సతోఽభి వ్యక్తియోగాత్ | .......... | 379 |
| 32. | నిత్యోపలబ్ధ్యనుపలబ్ధి ప్రసంగోఽన్య తరనియమోవాన్యథా | .......... | 380 |
| **14.** | **కర్త్రధికరణమ్** | .......... | 381 |
| 33. | కర్తాశాస్త్రార్థవత్త్వాత్ | .......... | 381 |
| 34. | విహారోపదేశాత్ | .......... | 382 |
| 35. | ఉపాదానాత్ | .......... | 382 |
| 36. | వ్యపదేశాచ్చ క్రియాయాంనచేన్నిర్దేశ విపర్యయః | .......... | 383 |
| 37. | ఉపలబ్ధివదనియమః | .......... | 384 |
| 38. | శక్తి విపర్యయాత్ | .......... | 384 |
| 39. | సమాధ్య భావాచ్చ | .......... | 385 |
| **15.** | **తక్షాధికరణమ్** | .......... | 386 |
| 40. | యథాచ తక్షోభయథా | .......... | 386 |
| **16.** | **పరాయత్తాధికరణమ్** | .......... | 388 |
| 41. | పరాత్తు తచ్ఛ్రుతేః | .......... | 388 |
| 42. | కృత ప్రయత్నాపేక్షస్తు విహిత ప్రతిషిద్ధా వైయర్థ్యాదిభ్యః | .......... | 389 |
| **17.** | **అంశాధికరణమ్** | .......... | 390 |
| 43. | అంశోనానావ్యపదేశాదన్యథా చాపిదాశకితవాదిత్యమధీయత ఏకే | .......... | 390 |
| 44. | మంత్ర వర్ణాచ్చ | .......... | 392 |
| 45. | అపిచ స్మర్యతే | .......... | 392 |
| 46. | ప్రకాశాది వన్నైవం పరః | .......... | 392 |
| 47. | స్మరంతిచ | .......... | 394 |
| 48. | అనుజ్ఞా పరిహారౌ దేహ సంభద్ధాజ్జ్యో తిరాదివత్ | .......... | 395 |

| | | | |
|---|---|---|---|
| | 49. అసంత తేశ్చావ్యతికరః | .......... | 395 |
| | 50. ఆభాసా ఏవచ | .......... | 396 |
| | 51. అదృష్టా నియమాత్ | .......... | 397 |
| | 52. అభిసంధ్యాదిష్వపి చైవమ్ | .......... | 398 |
| | 53. ప్రదేశాదితి చేన్నాంతర్భావాత్ | .......... | 399 |


## అథ చతుర్థః పాదః


| | | | |
|---|---|---|---|
| **1.** | **ప్రాణోత్పత్త్యధికరణమ్** | .......... | 404 |
| | 1. తథాప్రాణాః | .......... | 404 |
| | 2. గౌణ్య సంభవాత్ | .......... | 405 |
| | 3. తత్ప్రాక్ ఛ్రుతేశ్చ | .......... | 406 |
| | 4. తత్పూర్వకత్వాద్వాచః | .......... | 407 |
| **2.** | **సప్తగత్యధికరణమ్** | .......... | 408 |
| | 5. సప్తగతేర్విశేషితత్వాచ్చ | .......... | 408 |
| | 6. హస్తాదయస్తు స్థితేఽ తో నైవమ్ | .......... | 409 |
| **3.** | **ప్రాణాణుత్వాధికరణమ్** | .......... | 411 |
| | 7. అణవశ్చ | .......... | 411 |
| **4.** | **ప్రాణశ్రైష్ఠ్యాధికరణమ్** | .......... | 412 |
| | 8. శ్రేష్ఠశ్చ | .......... | 412 |
| **5.** | **వాయుక్రియాధికరణమ్** | .......... | 414 |
| | 9. న వాయు క్రియే పృథగుపదేశాత్ | .......... | 414 |
| | 10. చక్షురాదివత్తు తత్సహశిష్ట్యాదిభ్యః | .......... | 416 |
| | 11. అకరణత్వాచ్చ న దోషస్తథా హి దర్శయతి | .......... | 417 |
| | 12. పంచవృత్తిర్మనోవద్ వ్యపదిశ్యతే | .......... | 419 |
| **6.** | **శ్రేష్ఠాణుత్వాధికరణమ్** | .......... | 420 |
| | 13. అణుశ్చ | .......... | 420 |

| | | | |
|---|---|---|---|
| **7.** | **జ్యోతిరాద్యధికరణమ్** | .......... | 421 |
| | 14. జ్యోతిరద్యధిష్ఠానం తు తదామననాత్ | .......... | 421 |
| | 15. ప్రాణవతాశబ్దాత్ | .......... | 422 |
| | 16. తస్యచ నిత్యత్వాత్ | .......... | 423 |
| **8.** | **ఇంద్రియాధికరణమ్** | .......... | 425 |
| | 17. త ఇంద్రియాణి తద్వ్యపదేశాదన్యత్ర శ్రేష్ఠాత్ | .......... | 425 |
| | 18. భేద శ్రుతేః | .......... | 426 |
| | 19. వై లక్షణ్యాచ్చ | .......... | 426 |
| **9.** | **సంజ్ఞామూర్తిక్లృప్త్యధికరణమ్** | .......... | 428 |
| | 20. సంజ్ఞామూర్తి క్లృప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్ | .......... | 428 |
| | 21. మాంసాది భౌమం యథాశబ్దమితరయోశ్చ | .......... | 429 |
| | 22. వైశేష్యాత్తు తద్వాద స్తద్వాదః | .......... | 429 |


# అథ తృతీయోఽ ధ్యాయః

## ప్రథమః పాదః


| | | | |
|---|---|---|---|
| **1.** | **తదంతర ప్రతిపత్త్యధికరణమ్** | .......... | 435 |
| | 1. తదంతర ప్రతిపత్తౌరంహతి సంపరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్ | .......... | 435 |
| | 2. త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్ | .......... | 437 |
| | 3. ప్రాణగతేశ్చ | .......... | 438 |
| | 4. అగ్న్యాదిగతి శ్రుతే రితిచేన్న భాక్తత్వాత్ | .......... | 439 |
| | 5. ప్రథమేఽ శ్రవణాదితిచేన్న తా ఏవహ్యుపపత్తేః | .......... | 440 |
| | 6. అశ్రుతత్వాదితిచేన్నేష్టాది కారిణాం ప్రతీతేః | .......... | 441 |
| | 7. భాక్తం వానాత్మవిత్త్వాత్తథా హి దర్శయతి | .......... | 442 |
| **2.** | **కృతాత్యయాధికరణమ్** | .......... | 444 |
| | 8. కృతాత్యయేనుశయవాన్ దృష్టస్మృతిభ్యాం యథేత మనేవంచ | .......... | 444 |

9. చరణాదితి చేన్నోప లక్షణార్థేతి కార్ష్ణాజినిః .......... 447
10. ఆనర్థక్యమితి చేన్నతదపేక్షత్వాత్ .......... 448
11. సుకృతదష్కృత ఏవేతి తు బాదరిః .......... 449

**3. అనిష్టాదికార్యాధికరణమ్ .......... 450**

12. అనిష్టాది కారిణామపి చ శ్రుతమ్ .......... 450
13. సంయమనే త్వనుభూయేతరేషా మారోహా వరోహౌ తద్గతి దర్శనాత్ .......... 451
14. స్మరంతిచ .......... 452
15. అపిచసప్త .......... 452
16. తత్రాపిచతద్ వ్యాపారాదవిరోధః .......... 453
17. విద్యాకర్మణో రితితు ప్రకృతత్వాత్ .......... 453
18. న తృతీయే తథోపలబ్ధేః .......... 454
19. స్మర్యతేఽపిచలోకే .......... 455
20. దర్శనాచ్చ .......... 456
21. తృతీయ శబ్దావరోధః సంశోకజస్య .......... 457

**4. సాభావ్యాపత్త్యధికరణమ్ .......... 458**

22. తత్సాభావ్యాపత్తి రుపపత్తేః .......... 458

**5. నాతిచిరాధికరణమ్ .......... 459**

23. నాతిచిరేణ విశేషాత్ .......... 459

**6. అన్యాధిష్ఠితాధికరణమ్ .......... 460**

24. అన్యాధిష్ఠితేషు పూర్వవదభిలాపాత్ .......... 460
25. అశుద్ధమితిచేన్నశబ్దాత్ .......... 462
26. రేతః సిగ్యోగోఽథ .......... 463
27. యోనేః శరీరమ్ .......... 464

# అథ ద్వితీయః పాదః


| | | | |
|---|---|---|---|
| **1.** | **సంధ్యాధికరణమ్** | .......... | 473 |
| 1. | సంధ్యే సృష్టిరాహహి | .......... | 473 |
| 2. | నిర్మాతారం చైకేపుత్రాదయశ్చ | .......... | 474 |
| 3. | మాయామాత్రంతు కార్త్స్న్యే నానభివ్యక్త స్వరూపత్వాత్ | ... | 475 |
| 4. | సూచకశ్చహి శ్రుతేరాచక్షతేచ తద్విదః | .......... | 477 |
| 5. | పరాభిధ్యానాత్తు తిరోహితం తతోహ్య స్యబంధ విపర్యయౌ | .......... | 478 |
| 6. | దేహయోగాద్వాసోఽపి | .......... | 479 |
| **2.** | **తదాభావాధికరణమ్** | .......... | 481 |
| 7. | తదభావో నాడీషు తచ్ఛ్రుతేరాత్మని చ | .......... | 481 |
| 8. | అతః ప్రబోధోఽస్మాత్ | .......... | 483 |
| **3.** | **కర్మానుసృతిశబ్దవిధ్యధికరణమ్** | .......... | 484 |
| 9. | సఏవతు కర్మాను స్మృతిశబ్దవిధిభ్యః | .......... | 484 |
| **4.** | **ముగ్ధేఽర్ధ సంపత్త్యధికరణమ్** | .......... | 487 |
| 10. | ముగ్ధేఽర్ధ సంపత్తిః పరిశేషాత్ | .......... | 487 |
| **5.** | **ఉభయలింగాధికరణమ్** | .......... | 490 |
| 11. | నస్థానతోఽపి పరస్యోభయలింగం సర్వత్రహి | .......... | 490 |
| 12. | న భేదాదితి చేన్నప్రత్యేక మతద్వచనాత్ | .......... | 492 |
| 13. | అపిచైవమేకే | .......... | 493 |
| 14. | అరూపవదేవహి తత్ ప్రధానత్వాత్ | .......... | 493 |
| 15. | ప్రకాశవచ్చావైయర్థ్యాత్ | .......... | 495 |
| 16. | ఆహచతన్మాత్రమ్ | .......... | 496 |
| 17. | దర్శయతిచాథోఅపిస్మర్యతే | .......... | 496 |
| 18. | అత ఏవ చోపమా సూర్యకాదివత్ | .......... | 497 |

19. అంబువదగ్రహణాత్తునతథాత్వమ్ .......... 498
20. వృద్ధిహ్రాసభాక్త్వమంతర్భావాదుభయసామంజస్యాదేవమ్ ... 499
21. దర్శనాచ్చ .......... 500

**6. ప్రకృతైతావత్త్వాధికరణమ్ .......... 500**

22. ప్రకృతైతావత్త్వం హి ప్రతిషేధతి తతోబ్రవీతి చ భూయః ... 500
23. తదవ్యక్తమాహ హి .......... 503
24. అపి చ సంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్ .......... 504
25. ప్రకాశాది వచ్చావైశేష్యం ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్..... 505
26. అతోఽనంతేన తథాహి లింగమ్ .......... 506
27. ఉభయవ్యపదేశాత్త్వ హికుండలవత్ .......... 506
28. ప్రకాశాశ్రయవద్వాతేజస్త్వాత్ .......... 508
29. పూర్వవద్వా .......... 508
30. ప్రతిషేధాచ్చ .......... 510

**7. పరాధికరణమ్ .......... 510**

31. పరమతః సేతూన్మాన సంబంధ భేదవ్యపదేశేభ్యః .......... 510
32. సామాన్యాత్తు .......... 512
33. బుద్ధ్యర్థః పాదవత్ .......... 513
34. స్థానవిశేషాత్ప్రకాశాదివత్ .......... 514
35. ఉపపత్తేశ్చ .......... 515
36. తథాన్యప్రతిషేధాత్ .......... 516
37. అనేన సర్వగత త్వమాయామ శబ్దాదిభ్యః .......... 517

**8. ఫలాధికరణమ్ .......... 518**

38. ఫలమత ఉపపత్తేః .......... 518
39. శ్రుతత్వాచ్చ .......... 519
40. ధర్మంజైమినిరత ఏవ .......... 519
41. పూర్వం తు బాదరాయణో హేతువ్యవదేశాత్ .......... 520

# అథ తృతీయః పాదః


| | | | |
|---|---|---|---|
| **1.** | **సర్వవేదాంతప్రత్యయాధికరణమ్** | .......... | 533 |
| | 1. సర్వవేదాంత ప్రత్యయం చోదనాద్య విశేషాత్ | .......... | 533 |
| | 2. భేదాన్నేతి చేన్నైకస్యామపి | .......... | 535 |
| | 3. స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారేఽధికారాచ్చ సవవచ్చ తన్నియమః | .......... | 536 |
| | 4. ధర్మయతి చ | .......... | 538 |
| **2.** | **ఉపసంహారాధికరణమ్** | .......... | 539 |
| | 5. ఉపసంహారోఽర్థాభేదాద్విధిశేషవత్సమానే చ | .......... | 539 |
| **3.** | **అన్యథాత్వాధికరణమ్** | .......... | 540 |
| | 6. అన్యథాత్వం శబ్దాదితి చేన్నా విశేషాత్ | .......... | 540 |
| | 7. నవా ప్రకరణభేదాత్పరోఽవరీయస్త్వాదివత్ | .......... | 542 |
| | 8. సంజ్ఞాతశ్చేత్తదుక్తమస్తి తు తదపి | .......... | 543 |
| **4.** | **వ్యాప్త్యధికరణమ్** | .......... | 543 |
| | 9. వ్యాప్తేశ్చ సమంజసమ్ | .......... | 543 |
| **5.** | **సర్వాభేదాధికరణమ్** | .......... | 544 |
| | 10. సర్వాభేదాదన్యత్రేమే | .......... | 544 |
| **6.** | **ఆనందాద్యధికరణమ్** | .......... | 545 |
| | 11. ఆనందాదయః ప్రధానస్య | .......... | 545 |
| | 12. ప్రియశిరస్త్వాద్యప్రాప్తిరుపచయాపచయౌ హి భేదే | .......... | 545 |
| | 13. ఇతరేత్వర్థ సామాన్యాత్ | .......... | 547 |
| **7.** | **ఆధ్యానాధికరణమ్** | .......... | 548 |
| | 14. ఆధ్యానాయ ప్రయోజనాభావాత్ | .......... | 548 |
| | 15. ఆత్మశబ్దాచ్చ | .......... | 549 |

| | | | |
|---|---|---|---|
| **8.** | **ఆత్మ గృహీత్యధికరణమ్** | .......... | 550 |
| | 16. ఆత్మగృహీతిరితరవదుత్తరాత్ | .......... | 550 |
| | 17. అన్వయాదితిచేత్స్యాదవధారణాత్ | .......... | 551 |
| **9.** | **కార్యాఖ్యానాధికరణమ్** | .......... | 552 |
| | 18. కార్యాఖ్యానాద పూర్వమ్ | .......... | 552 |
| **10.** | **సమానాధికరణమ్** | .......... | 553 |
| | 19. సమాన ఏవం చాభేదాత్ | .......... | 553 |
| **11.** | **సంబంధాధికరణమ్** | .......... | 554 |
| | 20. సంబంధాదేవ మన్యత్రాపి | .......... | 554 |
| | 21. న వా విశేషాత్ | .......... | 555 |
| | 22. దర్శయతి చ | .......... | 556 |
| **12.** | **సంభృత్యధికరణమ్** | .......... | 557 |
| | 23. సంభృతిద్యువ్యాప్త్యపి చాతః | .......... | 557 |
| **13.** | **పురుషవిద్యాధికరణమ్** | .......... | 558 |
| | 24. పురుషవిద్యాయామివ చేతరేషామనామ్నానాత్ | .......... | 558 |
| **14.** | **వేధాద్యధికరణమ్** | .......... | 559 |
| | 25. వేధాద్యర్థభేదాత్ | .......... | 559 |
| **15.** | **హాన్యధికరణమ్** | .......... | 561 |
| | 26. హానౌతూపాయన శబ్దశేషత్వాత్కుశా ఛందస్తుత్యుప గానవత్తదుక్తమ్ | .......... | 561 |
| **16.** | **సాంపరాయాధికరణమ్** | .......... | 563 |
| | 27. సాంపరాయే తర్తవ్యాభావాత్తథాహ్యన్యే | .......... | 563 |
| | 28. ఛందత ఉభయథా విరోధాత్ | .......... | 565 |

**17. గతేరర్థవత్వాధికరణమ్** .......... 566

29. గతేరర్థవత్వముభయథాన్యథాహి విరోధః .......... 566

30. ఉపపన్న స్తల్ల క్షణార్థోపలబ్ధేర్లోకవత్ .......... 567

**18. అనియమాధికరణమ్** .......... 568

31. అనియమః సర్వేషామవిరోధః .......... 568
శబ్దాను మానాభ్యామ్

**19. యావదధికారాధికరణమ్** ......... 569

32. యావదధికారమవస్థితిరాధికారికాణామ్ ......... 569

**20. అక్షరధ్యధికరణమ్** ......... 571

33. అక్షరధియాం త్వవరోధః సామాన్య ......... 571
తద్భావాభ్యామౌప సదవత్తదుక్తమ్

**21. ఇయదధికరణమ్** ......... 573

34. ఇయదామననాత్ ......... 573

**22. అంతరత్వాధికరణమ్** ......... 574

35. అంతరాభూతగ్రామవత్స్వాత్మనః ......... 574

36. అన్యథాభేదానుప పత్తిరితి చేన్నోపదేశాంతరవత్......... 576

**23. వ్యతిహారాధికరణమ్** ......... 577

37. వ్యతిహారో విశింషంతి హీతరవత్ ......... 577

**24. సత్యాద్యధికరణమ్** ......... 579

38. సైవ హి సత్యాదయః ......... 579

**25. కామాద్యధికరణమ్** ......... 580

39. కామాదీతరత్ర తత్రచాయతనాదిభ్యః ......... 580

**26. ఆదరాధికరణమ్** ......... 582

40. ఆదరాదలోపః ......... 582

41. ఉపస్థితేఽత స్తద్వచనాత్ ......... 583

**27. తన్నిర్ధారణాధికరణమ్** ......... 583

42. తన్నిర్ధారణానియమ స్తద్దృష్టేః ......... 583
    పృథగ్ఘ్యప్రతిబంధః ఫలమ్

**28. ప్రదానాధికరణమ్** ......... 585

43. ప్రదానవదేవ తదుక్తమ్ ......... 585

**29. లింగభూయస్త్వాధికరణమ్** ......... 587

44. లింగభూయస్త్వాత్తద్ధి బలీయస్తదపి ......... 587
45. పూర్వ వికల్పః ప్రకరణాత్స్యాత్క్రియా మానసవత్......... 588
46. అతిదేశాచ్చ ......... 588
47. విద్యైవతు నిర్ధారణాత్ ......... 589
48. దర్శనాచ్చ ......... 589
49. శ్రుత్యాది బలీయస్త్వాచ్చ న బాధః ......... 589
50. అనుబంధాదిభ్యః ప్రజ్ఞాంతర
    పృథక్త్వవద్దృష్టశ్చ తదుక్తమ్ ......... 590
51. న సామాన్యాదప్యుపలబ్ధేర్మృత్యువన్నహి లోకాపత్తిః .........591
52. పరేణ చ శబ్దస్యతాద్విధ్యం భూయస్త్వాత్త్వనుబంధః......... 593

**30. ఐకాత్మ్యాధికరణమ్** ......... 594

53. ఏక ఆత్మనః శరీరేభావాత్ ......... 594
54. వ్యతిరేక స్తద్భావా భావిత్వాన్న తూపలబ్ధివత్ ......... 595

**31. అంగావబద్ధాధికరణమ్** ......... 597

55. అంగావబద్ధాస్తున శాఖాసు హి ప్రతివేదమ్ ......... 597
56. మంత్రాదివద్వావిరోధః ......... 598

**32. భూమజ్యాయస్త్వాధికరణమ్** ......... 599

57. భూమ్నః క్రతువజ్జ్యాయ స్త్వం తథా హి దర్శయతి......... 599

**33. శబ్దాది భేదాధికరణమ్** ......... 601

58. నానా శబ్దాది భేదాత్ ......... 601

| | | | |
|---|---|---|---|
| **34.** | **వికల్పాధికరణమ్** | ......... | 602 |
| | 59. వికల్పోఽ విశిష్టఫలత్వాత్ | ......... | 602 |
| **35.** | **కామ్యాధికరణమ్** | ......... | 603 |
| | 60. కామ్యాస్తు యథాకామం సముచ్చీయేరన్నవా పూర్వహేత్వభావాత్ | ......... | 603 |
| **36.** | **యథాశ్రయభావాధికరణమ్** | ......... | 604 |
| | 61. అంగేషు యథాశ్రయభావః | ......... | 604 |
| | 62. శిష్టేశ్చ | ......... | 605 |
| | 63. సమాహారాత్ | ......... | 606 |
| | 64. గుణసాధారణ్య శ్రుతేశ్చ | ......... | 607 |
| | 65. న వా తత్సహ భావాశ్రుతేః | ......... | 607 |
| | 66. దర్శనాచ్చ | ......... | 609 |

## అథ చతుర్థః పాదః

| | | | |
|---|---|---|---|
| **1.** | **పురుషార్థాధికరణమ్** | ......... | 613 |
| | 1. పురుషార్థోఽ తశ్శబ్దాదితి బాదరాయణః | ......... | 613 |
| | 2. శేషత్వాత్పురుషార్థవాదో యథాన్యేష్వితి జైమినిః | ......... | 614 |
| | 3. ఆచార దర్శనాత్ | ......... | 615 |
| | 4. తచ్ఛ్రుతేః | ......... | 616 |
| | 5. సమన్వారంభణాత్ | ......... | 616 |
| | 6. తద్వతో విధానాత్ | ......... | 617 |
| | 7. నియమాచ్చ | ......... | 617 |
| | 8. అధికోపదేశాత్తు బాదరాయణ స్యైవం తద్దర్శనాత్ | ......... | 618 |
| | 9. తుల్యం తు దర్శనమ్ | ......... | 619 |
| | 10. అసార్వత్రికీ | ......... | 620 |
| | 11. విభాగః శతవత్ | ......... | 621 |
| | 12. అధ్యయన మాత్రవతః | ......... | 622 |

| | | | |
|---|---|---|---|
| | 13. నా విశేషాత్ | ......... | 622 |
| | 14. స్తుతయేఽనుమతిర్వా | ......... | 623 |
| | 15. కామకారేణ చైకే | ......... | 623 |
| | 16. ఉపమర్దంచ | ......... | 624 |
| | 17. ఊర్ధ్వరేతస్సుచ శబ్దేహి | ......... | 624 |
| **2.** | **పరామర్శాధికరణమ్** | ......... | 625 |
| | 18. పరామర్శం జైమినిరచోదనా చాపవదతి హి | ......... | 625 |
| | 19. అనుష్ఠేయం బాదరాయణః సామ్యశ్రుతేః | ......... | 626 |
| | 20. విధిర్వాధారణవత్ | ......... | 627 |
| **3.** | **స్తుతిమాత్రాధికరణమ్** | ......... | 629 |
| | 21. స్తుతిమాత్ర ముపాదానాదితిచేన్నా పూర్వత్వాత్ | ......... | 629 |
| | 22. భావశబ్దాచ్చ | ......... | 630 |
| **4.** | **పారిప్లవాధికరణమ్** | ......... | 631 |
| | 23. పారిప్లవార్థా ఇతిచేన్న విశేషితత్వాత్ | ......... | 631 |
| | 24. తథాచైకవాక్యతోప బంధాత్ | ......... | 632 |
| **5.** | **అగ్నీంధనాద్యధికరణమ్** | ......... | 633 |
| | 25. అత ఏవ చాగ్నీంధనాద్యనపేక్షా | ......... | 633 |
| **6.** | **సర్వాపేక్షాధికరణమ్** | ......... | 634 |
| | 26. సర్వాపేక్షాచ యజ్ఞాదిశ్రుతేరశ్వవత్ | ......... | 634 |
| | 27. శమదమాద్యుపేతః స్యాత్తథాపి తు తద్విధేస్తదంగ తయాతేషా మవశ్యానుష్ఠేయత్వాత్ | ......... | 635 |
| **7.** | **సర్వాన్నానుమత్యధికరణమ్** | ......... | 636 |
| | 28. సర్వాన్నానుమతిశ్చ ప్రాణాత్యయే తద్దర్శనాత్ | ......... | 636 |
| | 29. అబాధాచ్చ | ......... | 638 |
| | 30. అపి చ స్మర్యతే | ......... | 638 |
| | 31. శబ్దశ్చాతోఽకామకారే | ......... | 639 |

**8. ఆశ్రమకర్మాధికరణమ్** ......... 640

32. విహితత్వాచ్చాశ్రమ కర్మాపి ......... 640

33. సహకారి త్వేనచ ......... 640

34. సర్వథాపి త ఏవోభయలింగాత్ ......... 641

35. అనభిభవం చ దర్శయతి ......... 642

**9. విధురాధికరణమ్** ......... 643

36. అంతరా చాపి తు తద్దృష్టేః ......... 643

37. అపి చ స్మర్యతే ......... 644

38. విశేషానుగ్రహశ్చ ......... 645

39. అతస్త్వితర జ్యాయోలింగాచ్చ ......... 646

**10. తద్భూతాధికరణమ్** ......... 646

40. తద్భూతస్య నాతద్భావో జైమినేరపి నియమాతద్రూపాభావేభ్యః ......... 646

**11. అధికారాధికరణమ్** ......... 648

41. న చాధికారికమపి పతనానుమానాత్తద యోగాత్ ......... 648

42. ఉపపూర్వమపిత్వేకే భావమశనవత్తదుక్తమ్ ......... 648

**12. బహిరధికరణమ్** ......... 650

43. బహిస్తూభయథాపి స్మృతేరాచారాచ్చ ......... 650

**13. స్వామ్యధికరణమ్** ......... 650

44. స్వామినః ఫలశ్రుతేరిత్యాత్రేయః ......... 650

45. ఆర్త్విజ్యమిత్యౌడులోమిస్తస్మైహి పరిక్రీయతే ......... 651

46. శ్రుతేశ్చ ......... 652

**14. సహకార్యంతర విధ్యధికరణమ్** ......... 652

47. సహకార్యంతరవిధిః పక్షేణతృతీయం తద్వతో విధ్యాదివత్ ......... 652

48. కృత్స్నభావాత్తు గృహిణోపసంహారః ......... 654

49. మౌనవదితరే షామప్యుపదేశాత్ ......... 655

**15.** **అనావిష్కారాధికరణమ్** ......... 656

50. అనావిష్కుర్వన్నన్వయాత్ ......... 656

**16.** **ఐహికాధికరణమ్** ......... 657

51. ఐహికమప్య ప్రస్తుత ప్రతిబంధే తద్దర్శనాత్ ......... 657

**17.** **ముక్తి ఫలాధికరణమ్** ......... 658

52. ఏవం ముక్తి ఫలానియమ
స్తదవస్థావధృతే స్త దవస్థావధృతేః ......... 658

# అథ చతుర్థోఽ ధ్యాయః

## ప్రథమః పాదః

**1.** **ఆవృత్త్యధికరణమ్** ......... 664

1. ఆవృత్తిరస కృదుపదేశాత్ ......... 664

2. లింగాచ్చ ......... 666

**2.** **ఆత్మత్వోపాసనాధికరణమ్** ......... 669

3. ఆత్మేతి తూపగచ్ఛంతి గ్రాహయంతి చ ......... 669

**3.** **ప్రతీకాధికరణమ్** ......... 670

4. న ప్రతీకే నహిసః ......... 670

**4.** **బ్రహ్మదృష్ట్యధికరణమ్** ......... 672

5. బ్రహ్మదృష్టిరుత్కర్షాత్ ......... 672

**5.** **ఆదిత్యాదిమత్యధికరణమ్** ......... 673

6. ఆదిత్యాదిమతయశ్చాంగ ఉపపత్తేః ......... 673

**6.** **ఆసీనాధికరణమ్** ......... 674

7. ఆసీనస్సంభవాత్ ......... 674

8. ధ్యానాచ్చ ......... 675

| | | | |
|---|---|---|---|
| | 9. అచలత్వం చాపేక్ష్య | ......... | 677 |
| | 10. స్మరంతి చ | ......... | 677 |
| **7.** | **ఏకాగ్రతాధికరణమ్** | ......... | 678 |
| | 11. యత్రైకాగ్రతా తత్రా విశేషాత్ | ......... | 678 |
| **8.** | **ఆప్రాయణాధికరణమ్** | ......... | 678 |
| | 12. ఆప్రాయణాత్తత్రాపి హి దృష్టమ్ | ......... | 678 |
| **9.** | **తదధిగమాధికరణమ్** | ......... | 680 |
| | 13. తదధిగమే ఉత్తరపూర్వాఘయోరశ్లేష వినాశౌతద్వ్యపదేశాత్ | ......... | 680 |
| **10.** | **ఇతరా సంశ్లేషాధికరణమ్** | ......... | 682 |
| | 14. ఇతర స్యాప్యేవమసంశ్లేషః పాతేతు | ......... | 682 |
| **11.** | **అనారబ్ధాధికరణమ్** | ......... | 682 |
| | 15. అనారబ్ధకార్యే ఏవతు పూర్వే తదవధేః | ......... | 682 |
| **12.** | **అగ్ని హోత్రాద్యధికరణమ్** | ......... | 684 |
| | 16. అగ్నిహోత్రాది తు తత్కార్యాయైవ తద్దర్శనాత్ | ......... | 684 |
| | 17. అతోஉన్యాపి హ్యేకేషాముభయోః | ......... | 685 |
| **13.** | **విద్యాజ్ఞాన సాధనాధికరణమ్** | ......... | 686 |
| | 18. యదేవ విద్యయేతి హి | ......... | 686 |
| **14.** | **ఇతర క్షపణాధికరణమ్** | ......... | 687 |
| | 19. భోగేనత్వితరేక్షపయిత్వా సంపద్యతే | ......... | 687 |

# అథ ద్వితీయః పాదః


**1. వాగధికరణమ్** ......... 692

1. వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ ......... 692
2. అత ఏవ చ సర్వాణ్యను ......... 693

**2. మనోఽధికరణమ్** ......... 694

3. తన్మనః ప్రాణ ఉత్తరాత్ ......... 694

**3. అధ్యక్షాధికరణమ్** ......... 695

4. సోఽధ్యక్షే తదుపగమాదిభ్యః ......... 695
5. భూతేషు తచ్ఛ్రుతేః ......... 696
6. నైకస్మిన్ దర్శయతో హి ......... 697

**4. ఆసృత్యుపక్రమాధికరణమ్** ......... 698

7. సమానా చాసృత్యుపక్రమాదమృతత్వం చానుపోష్య......... 698

**5. సంసారవ్యపదేశాధికరణమ్** ......... 699

8. తదాపీతేః సంసారవ్యపదేశాత్ ......... 699
9. సూక్ష్మం ప్రమాణతశ్చ తథోనలబ్ధేః ......... 700
10. నోపమర్దేనాతః ......... 701
11. అస్యైవ చోపపత్తేరేష ఊష్మా ......... 701

**6. ప్రతిషేధాధికరణమ్** ......... 701

12. ప్రతిషేధాదితిచేన్న శారీరాత్ ......... 701
13. స్పష్టో హ్యేకేషామ్ ......... 702
14. స్మర్యతే చ ......... 703

**7. వాగాదిలయాధికరణమ్** ......... 703

15. తాని పరే తథాహ్యాహ ......... 703

**8. అవిభాగాధికరణమ్** ......... 704

16. అవిభాగో వచనాత్ ......... 704

**9. తదోకోఽ ధికరణమ్** ......... 705

17. తదోకోఽ గ్రజ్వలనం తత్ప్రకాశితద్వారో విద్యాసామర్థ్యాత్తచ్ఛేష గత్యనుస్మృతియోగాచ్చ హార్దానుగృహీతః శతాధికయా ......... 705

**10. రశ్మ్యధికరణమ్** ......... 707

18. రశ్మ్యనుసారీ ......... 707

19. నిశినేతిచేన్న సంబంధస్య యావద్దేహభావిత్వాద్దర్శయతి చ ......... 707

**11. దక్షిణాయనాధికరణమ్** ......... 709

20. అతశ్చాయనేఽ పి దక్షిణే ......... 709

21. యోగినః ప్రతి చ స్మర్యతే స్మార్తేచైతే ......... 710

# అథ తృతీయః పాదః

**1. అర్చిరాద్యధికరణమ్** ......... 715

1. అర్చిరాదినా తత్ప్రథితేః ......... 715

**2. వాయ్వధికరణమ్** ......... 717

2. వాయుమబ్దాదవిశేష విశేషాభ్యామ్ ......... 717

**3. తడిదధికరణమ్** ......... 719

3. తడితోఽ ధివరుణః సంబంధాత్ ......... 719

**4. ఆతివాహికాధికరణమ్** ......... 720

4. ఆతివాహికాస్తల్లింగాత్ ......... 720

5. ఉభయ వ్యామోహాత్తత్సిద్ధేః ......... 721

6. వైద్యుతేనైవ తత స్తచ్ఛ్రుతేః ......... 722

| | | | |
|---|---|---|---|
| **5.** | **కార్యాధికరణమ్** | ......... | 722 |
| 7. | కార్యం బాదరిరస్య గత్యుపపత్తేః | ......... | 722 |
| 8. | విశేషితత్వాచ్చ | ......... | 723 |
| 9. | సామీప్యాత్తు తద్వ్య పదేశః | ......... | 724 |
| 10. | కార్యాత్యయే తదధ్యక్షేణసహాతః పరమభిధానాత్ | ......... | 724 |
| 11. | స్మృతేశ్చ | ......... | 725 |
| 12. | పరం జైమినిర్ముఖ్యత్వాత్ | ......... | 725 |
| 13. | దర్శనాచ్చ | ......... | 726 |
| 14. | న చ కార్యే ప్రతిపత్త్యభిసంధిః | ......... | 726 |
| **6.** | **అప్రతీకాలంబనాధికరణమ్** | ......... | 728 |
| 15. | అప్రతీకాలంబనాన్నయతీతి బాదరాయణ ఉభయథా దోషాత్తత్క్రతుశ్చ | ......... | 728 |
| 16. | విశేషం చ దర్శయతి | ......... | 730 |


## అథ చతుర్థః పాదః

| | | | |
|---|---|---|---|
| **1.** | **సంపద్యావిర్భావాధికరణమ్** | ......... | 734 |
| 1. | సంపద్యావిర్భావః స్వేనశబ్దాత్ | ......... | 734 |
| 2. | ముక్తః ప్రతిజ్ఞానాత్ | ......... | 735 |
| 3. | ఆత్మా ప్రకరణాత్ | ......... | 736 |
| **2.** | **అవిభాగేన దృష్టత్వాధికరణమ్** | ......... | 737 |
| 4. | అవిభాగేన దృష్టత్వాత్ | ......... | 737 |
| **3.** | **బ్రాహ్మాధికరణమ్** | ......... | 738 |
| 5. | బ్రాహ్మేణ జైమినిరుపన్యాసాదిభ్యః | ......... | 738 |
| 6. | చితి తన్మాత్రేణ తదాత్మకత్వాది త్యౌడులోమిః | ......... | 738 |
| 7. | ఏవమప్యుపన్యాసాత్ పూర్వభావాద విరోధం బాదరాయణః | ......... | 739 |

**4. సంకల్పాధికరణమ్** ......... 740
8. సంకల్పాదేవ తుతచ్ఛ్రుతేః ......... 740
9. అత ఏవ చానన్యాధిపతిః ......... 741

**5. అభావాధికరణమ్** ......... 741
10. అభావం బాదరిరాహ హ్యేవమ్ ......... 741
11. భావం జైమినిర్వికల్పామననాత్ ......... 742
12. ద్వాదశాహవ దుభయవిధం బాదరాయణోఽతః......... 743
13. తన్వభావే సంధ్యవదుపపత్తేః ......... 743
14. భావే జాగ్రద్వత్ ......... 743

**6. ప్రదీపాధికరణమ్** ......... 744
15. ప్రదీపవదావేశ స్తథా హి దర్శయతి ......... 744
16. స్వాప్యయ సంపత్త్యోరన్యతరా పేక్షమావిష్కృతం హి ..... 745

**7. జగద్వ్యాపారాధికరణమ్** ......... 746
17. జగద్వ్యాపారవర్జం ప్రకరణాద సన్నిహితత్వాచ్చ......... 746
18. ప్రత్యక్షోపదేశాదితి చేన్నాధికారిక మండలస్థోక్తేః ......... 747
19. వికారావర్తి చ తథా హి స్థితి మాహ ......... 748
20. దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే ......... 749
21. భోగమాత్ర సామ్యలింగాచ్చ ......... 749
22. అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్ ......... 750

**శ్రీశ్రీశ్రీ శివానంద స్వాములవారి సంక్షిప్త జీవితము** ......... 752

**మహా మృత్యుంజయ మంత్రము**

**సమాప్తిశ్చ బ్రహ్మసూత్రపాఠః**

ఏతద్గ్రంథము

**భగవాన్ శ్రీ వేదవ్యాసుల** వారికి

**జగద్గురు శ్రీ శంకరాచార్యుల** వారికి

మఱియు

**సద్గురు శ్రీ శివానందస్వాముల** వారికి

సాష్టాంగ ప్రణామములతో

వారి పాదపద్మముల యందు

పూజాపుష్పముగ

సమర్పింపఁబడినది.

# Sri Sri Jagadguru Sankaraacharya

Mahasamsthanam, Saarada Peetham. Sringeri.

**PRIVATE SECRETARY**
His Holiness Sri Jagadguru
Sankaacharya, Dakshinamnaaya
Sri Saarada Peetham,
SRINGERI -577 139 (Karnataka)

Camp : New Delhi
Date : 2.9.1982.

## శ్రీ స్వామి హంసానందగారికి నమస్కారములు

మీరు పంపిన పుస్తకములు అందినవి. శ్రీవారి సన్నిధిలో తెలియపరచినాము.

శ్రీ స్వామి శివానందులు వ్రాసిన ఆంగ్లగ్రంథమునకు ఇది అనువాద మనియు, మూల ఆంగ్ల గ్రంథమును మీరు యథాతథముగ అనువదించి నట్లును తెలియుచున్నది.

శ్రీశ్రీ జగద్గురువులవారి నారాయణ స్మరణ పూర్వకాశీస్సులు మీకు తెలుపుచున్నాను.

మీరు పంపిన పుస్తకములను మరల మీకు పంపుచున్నాను.

ఇంతే నమస్కారములు,

(Sd.) **ఎ. వెంకట సుబ్బయ్య**

Personal Assistant
to Swamiji

ॐ

# శాంతి మంత్రము

"ఓం పూర్ణమదః
పూర్ణమిదం
పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్యపూర్ణమాదాయ
పూర్ణమేవావ శిష్యతే"
ఓం శాంతిః శాంతిః శాంతిః

*తా॥ అది పూర్ణము, ఇది పూర్ణము. పూర్ణమునుండి పూర్ణము ఉద్భవించును; పూర్ణమునుండి పూర్ణమును తీసివేసినచో పూర్ణమే శేషించును.*

# మున్నుడి

ఆధ్యాత్మిక మార్గములో ముందంజవేసి, ఆధ్యాత్మిక శిఖరముల నధిరోహించి, ఆత్మానుభూతి నొందుటకు "ప్రస్థానత్రయము" (భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు) వెన్నెముక వంటిది. ప్రస్థానత్రయము నధ్యయనము చేయకుండా, విచారణ సలుపకుండా ఆధ్యాత్మిక విషయములు విదితము కానేరవనుటలో ఇసుమంతయును సంశయములేదు. అందువలననే మన ప్రాచీన గురుకులాశ్రమములలో ప్రతిదినము వేదాధ్యయ నము, ఆధ్యాపనము, వేదాంతవిచారణ జరుగుచుండెడిది. తద్వారా సాధకులు వేదాంత రహస్యములను బాగుగా గ్రహించి, సాధనల నొనర్చి, ఆత్మానుభూతి ననతికాలములోనే పొందుచుండెడివారు. నేటిరోజులలో ఈ అధ్యయన, అధ్యాపనములు అరుదు అనియే చెప్పవలసియున్నది.

ప్రస్థానత్రయమును చక్కని అనుభవముఁగల గురువు వద్ద అధ్యయనము చేసిననేకాని సామాన్యముగా అర్థముకావు. భగవద్గీత కంటే ఉపనిషత్తులు, ఉపనిషత్తులకంటే బ్రహ్మసూత్రములు చాలా జఠిలములును, రహస్యములునై యున్నవి. శ్రీ వేదవ్యాస మహర్షులవారు "బ్రహ్మము"ను గూర్చి ప్రబోధించుటకై వేదములలోను, ఉపనిషత్తులలోను ఉన్న సుదీర్ఘ వాక్యములను, గూఢ రహస్యములను "బ్రహ్మసూత్రముల"ను పేరుతో సూత్రప్రాయముగా రచించిరి. తక్కువ అక్షరములు కలదియు, సారగర్భితమై నదియు, విశాలభావము కలదియు, "సూత్రమ"ని చెప్పఁబడును. "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" యను సూత్రముతో ప్రారంభించి "అనావృత్తిః శబ్దాదనావృత్తిః

శబ్దాత్" అను సూత్రము వరకుఁగల 555 సూత్రములను శ్రీ వేదవ్యాసులవారు అనేక దృష్టాంత, ద్రాష్టాంతముల ద్వారా బ్రహ్మమునుఁగూర్చి విశదపరచిరి. ఈ బ్రహ్మసూత్రములను అనుభవశాలియైన సద్గురువువద్ద అధ్యయన మొనర్చి గ్రహించి, అభ్యాసానుష్ఠానముల నొనర్చినచో అవశ్యముగా బ్రహ్మానుభూతి కలుగును. ఈ బ్రహ్మసూత్రములకు ఆచార్యత్రయము, మరికొందఱు మేధావులు సంస్కృతభాషలో గొప్పగొప్ప వ్యాఖ్యానములను వ్రాసిరి. వ్యాఖ్యాన ములన్నింటిలో శ్రీ శంకరాచార్యులవారి వ్యాఖ్యానమే మిన్నయని పండిత ప్రకాండుల అభిప్రాయము. శ్రీ శంకరాచార్యులవారు శ్రీ వేదవ్యాస మహర్షుల వారి దివ్యానుగ్రహము, ఆశీర్వాదము, ఆజ్ఞలను పొంది బ్రహ్మసూత్రములకు వ్యాఖ్యానమును వ్రాయుటవలన, అది సర్వులకు శిరోధార్యమై యున్నది.

నేటి ప్రజలలో సంస్కృత భాషా జ్ఞానముకంటె ఆంగ్ల భాషాజ్ఞానము అధికముగా నుండుటచే, ఆంగ్లభాషావేత్తలు కూడా ఈ బ్రహ్మసూత్రములను పఠించి, అందలి రహస్యములను గ్రహించి, తరించవలయునను తలంపుతో బ్రహ్మలీనులైన పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు శివానంద సరస్వతీ స్వాముల వారు దయాపూరితులై 1949 సం॥లో ఆంగ్లభాషలో చాలా విపులముగా సులభశైలిలో రచించిరి.

ఆ యాంగ్లభాషలో నున్న "బ్రహ్మసూత్రముల"ను ఆంధ్రభాషా వేత్తలైన ముముక్షువుల ఉపయోగార్థమై ప్రియాత్మీయులును, శ్రీ శివానందాశ్రమ వాసులునగు శ్రీ హంసానంద స్వాములవారు ఎంతో ఓపికతో, శ్రద్ధతో తెలుగు భాషలోనికి అనువదించిరి. వారి ఓపిక, సహనము, శ్రద్ధ అత్యద్భు తము. వ్రాతపనిలో వారికి వారే సాటియని చెప్పినచో అతిశయోక్తి కానేరదు. చక్కటి సరళమైన భాషలో శ్రీ సద్గురుదేవులవారి భావమునకు లోటురాకుండా అనువాదము చేసిరి. ప్రస్తుతము తెలుగుభాషలో "బ్రహ్మసూత్ర" గ్రంథము లభించుటలేదు. కావున ఈ గ్రంథము "శివానంద శతజయంతిమాల"లో అష్టమ పుష్పముగా ముద్రింపబడుచున్నందుకు ముదావహముగా నున్నది.

ఈ గ్రంథము  ముద్రింపబడిన వెంటనే ప్రతి ముముక్షువు, ప్రతిసాధకుడు ఈ గ్రంథమును సంపాదించి, అధ్యయన మొనర్చినచో బ్రహ్మసూత్రముల యందున్న రహస్యములను గుర్తెఱింగి, బ్రహ్మానుభూతిని బడయజాలుదురని విశ్వసించుచున్నాను.

శ్రీ వేదవ్యాస మహర్షికీ జై

శ్రీ జగద్గురు శంకరాచార్యులవారికి జై

శ్రీ సద్గురు శివానంద స్వాములవారికి జై

ఓం తత్సత్

ఇట్లు

ది. 8-9-1982
శ్రీ శివానంద జయంతి

**మీ దేవానంద- చిన్నస్వామి**

# ఓం నమో భగవతే శివానందాయ

" శ్రుతి ప్రస్థానము, స్మృతి ప్రస్థానము; న్యాయ ప్రస్థానము" అని పేర్కొనబడిన ఈ ప్రస్థానత్రయము "ఉపనిషత్తులు, భగవద్గీత; బ్రహ్మ సూత్రాలు" అను పేర్లతో వ్యవహరింపబడుతూ ఉన్నాయి. ఇవి మన హిందూమతానికే గాక భారతీయ తత్త్వశాస్త్రానికే ప్రామాణిక గ్రంథాలు. ఈ ప్రస్థానత్రయములో "బ్రహ్మసూత్రాలు" పరబ్రహ్మతత్త్వాన్ని సూటిగా, క్రమబద్ధంగా వ్యక్తీకరించినాయి. పరమగోప్యమైన పరబ్రహ్మ తత్త్వాన్ని అతితక్కువ సంఖ్యగల వాక్యాలలో – క్లుప్తంగా – అతి క్లుప్తంగా – మహోన్నతభావగర్భితంగా – ఐదువందలా యాభైయైదు సూత్రాలలో ఇమిడ్చి పరమదయానిధియైన బాదరాయణుడు "బ్రహ్మసూత్రాలు" అను పేరుతో ప్రపంచాని కందించినాడు. అమరత్వంతో – దేదీప్యమానంగా విరాజిల్లుతూ ఉండే ఈ బ్రహ్మసూత్రాలకు త్రిమతాచార్యులు, పలువురు పరమహంస పరివ్రాజకులు ఎందరో తత్త్వశాస్త్రనిష్ణాతులు, మరెందరో పండితప్రకాండులు – తమతమ ప్రజ్ఞాపాటవాలతో, ధ్యానాధ్యయ నాదులతో సముపార్జించుకొన్న విజ్ఞానపటిమతో, పాండిత్య ప్రతిభతో భాష్యాలు, టీకలు, టిప్పణీలు సమృద్ధిగా వ్రాసినారు.

ఈ ఇరవయ్యవ శతాబ్దంలో – పూర్వార్థము యొక్క చతుర్థ పాదంలో తమ ఆంగ్లభాషాపాండిత్యంతో ప్రాక్పశ్చిమ దేశాలలో సనాతన వేదాన్త తత్త్వాన్ని ఢంకా బజాయించి, విస్తృత పంథాలో ప్రచారంలో

సాగించిన ప్రముఖ తత్త్వవేత్తలలో డాక్టర్ శివానంద సరస్వతీస్వాముల వారిది ఒక ప్రత్యేకమైన స్థానం. నిగూఢమైన తాత్త్వికరహస్యాలను పలుకోణాలతో విపులంగా విశదీకరిస్తూ పాఠకుల చిత్తానికి హత్తుకొనే విధంగా రచనలు సాగించటంలో శ్రీ శివానందస్వాములవారు సిద్ధహస్తులు; అది వారికి వెన్నతో పెట్టిన విద్య. శ్రీ స్వాములవారిచే రచింపబడిన త్రిశతాధిక గ్రంథాలలో వారు (1948లో) వ్రాసిన "బ్రహ్మసూత్రాల వ్యాఖ్య" ఒక ప్రత్యేకమైన ఆధిక్యతను సంపాదించు కొనింది. శ్రీ ఆదిశంకరులవారి అద్వైత సిద్ధాన్తాను గుణ్యంగా శ్రీ స్వాములవారు తమ వ్యాఖ్యను నడిపించినారు. ఆ వ్యాఖ్యకు సరియైన ఆంధ్రానువాదమే ప్రస్తుతం మీ చేతులలో ఉన్న ఈ గ్రంథం. ఇది 'పూర్వార్ధం' మాత్రమే. ఉత్తరార్ధం 1985లో అచ్చైనది.

ఆంధ్రప్రదేశ్ భక్తులకు చిరపరిచితులైన శ్రీ హంసానందస్వాముల వారు ఈ మహత్తర గ్రంథాన్ని ఆంధ్రీకరించినారు. ఆంగ్లభాషాపరిచయం తగినంతలేని ఆంధ్రజిజ్ఞాసువులకు శ్రీ శివానందాశ్రమ సాహిత్యాన్ని ఆంధ్రీకరించి, పుస్తకరూపంలో అందించే కృషికి శ్రీ హంసానంద స్వాములవారు పరహారుసంవత్సరాల క్రితమే (1966) లో శ్రీకారము చుట్టినారు. "శ్రీగురుభ్యోనమః హరిః ఓమ్" అంటూ ప్రప్రథమంలో శ్రీగురు దేవులచే రచింపబడిన "THE FOUNDATIONS OF SPIRITUAL DEVELOPMENT" అను గ్రంథాన్ని "ఆధ్యాత్మిక పురోభివృద్ధికి పునాదులు" అనే పేరుతో ఆంధ్రీకరించి తమ ఆంధ్రానువాద సేవాకార్యకలాపానికి చక్కటి పునాదిని వేసుకున్నారు. ఆ తరువాత వారు శ్రీ శివానంద స్వాములవారి గ్రంథాలతోపాటు శ్రీచిదానంద స్వాములవారి గ్రంథాలు, శ్రీకృష్ణానందస్వాములవారి గ్రంథాలు – చిన్నవీ, పెద్దవీ కలిపి ఇప్పటికి

పందొమ్మిది పుస్తకాలను ఆంధ్రీకరించి అచ్చువేయించ గల్గినారు. ఇది ఇరవయ్యవ గ్రంథము.

రానున్న "శ్రీశివానందస్వాములవారి శతజయన్తీ మహోత్సవము" (8.9.1987) నాటికి శ్రీశివానంద స్వాములవారి రచనలలోనుండి నూరు గ్రంథాలను ఎన్నుకొని, వాటిని ఆంధ్రీకరించి, అచ్చువేయించాలనే సంకల్పముతో పూజ్యపాద శ్రీదేవానంద– చిన్నస్వాములవారు, శ్రీహంసానందస్వాములవారు –కంకణబద్ధులై నిర్విరామకృషిని చేస్తూ ఉన్నారు. వీరి కృషి విజయవంతం కావాలని వినమ్రతతో – ముకుళితహస్తాలతో భగవంతుని ప్రార్థించటం ఆంధ్రజిజ్ఞాసువుల కర్తవ్యము. హరిఃఓం తత్సత్

"గంగాతీరనివాసాయ శివానందాయ మంగళమ్"

గురునివాస్,
శ్రీశివానందాశ్రమము, **–స్వామి అసంగానంద సరస్వతి**
ఋషీకేశ్. 8.9.1982.

# అనువాదకునిపై అనుభవజ్ఞుల అనుగ్రహము

బ్రహ్మజ్ఞానోపలబ్ధికై సాధన సంపత్తినొసంగునట్టి వందలాది గ్రంథములను ఆంగ్లభాషలో విరచించిన స్థానమగు శ్రీగురుదేవులవారి కుటీరములో నాకు స్థానమునొసంగి, అవ్యక్తరూపముగా నన్నాశీర్వదించి, అనుగ్రహించుచున్న బ్రహ్మలీనులై శ్రీ సద్గురు శివానంద సరస్వతీ స్వాములవారి చరణారవిందములకు ప్రప్రథమముగా వందనముల నర్పించుకొనుచున్నాను.

సద్గురు శివానంద కృతమగు "Brahma Sutras"అను ఆంగ్ల గ్రంథమును ది. 25.1.1979 వ తేదీన నేను ఆంధ్రీకరించుటకు ప్రారంభించి, ది. 12.7.1984 తేదీ ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు ముగించినట్టి వ్రాత ప్రతిని గురుపూర్ణిమ రోజు చూపగా ప్రసన్నచిత్తులై, ఆ వ్రాతప్రతిని ప్రెస్సుకు పంపి, ఎస్టిమేట్‌ను తెలుసుకొమ్మని నన్ను ప్రోత్సహించి, కరుణించినట్టి పూజ్యశ్రీ చిదానంద గురుదేవుల పాద పద్మములకు నేను ప్రణమిల్లుచున్నాను.

ఆంధ్రీకరించుమని ఆదేశించినారేమోయన్నట్లు "Brahma Sutras" అను ఆంగ్ల గ్రంథములో తమ కరకమలముల ద్వారా May God Bless You అని వ్రాసి, సంతకము చేసి, ది. 30.1.1978 వ తేదీన నా చేతికందించి, ఆశీర్వదించినట్టి పూజ్యపాద శ్రీకృష్ణానందగురుదేవుల చరణయుగ్మమునకు నేను మోకరిల్లుచున్నాను.

బ్రహ్మసూత్రముల నధ్యయనము చేయుటకై ఏతెంచు సాధకులు నలుగురేయైనను, ఏయొక్క విద్యార్థి రాకున్నను, అతడు వచ్చువరకు వేచియుండి, శ్రద్ధతోను, సహనముతోను, పట్టుదలతోను మాకు బ్రహ్మసూత్ర ప్రబోధమును ది. 24.3.1978 వ తేదీన ప్రారంభించి, ది. 31.12.1981వ తేదీన ముగించినట్టి అచార్యుడగు పూజ్యశ్రీ నీలకంఠానంద స్వాములవారి పాదపంకజములకు ప్రణామముల నొనర్చుచున్నాను.

స్వర్గాశ్రమములోని చైతన్యకుటీరమును నివాసముగా చేసికొని, జపతప సాధనల నొనర్చుచున్న న్యాయ, వేదాంత శిరోమణియగు పూజ్యశ్రీ నారాయణానందస్వాములవారు ప్రతిరోజు శ్రమయనుకొనక పడవలో గంగానదిని దాటివచ్చి బ్రహ్మసూత్రవ్రాతప్రతి నంతటిని ఒక నెల రోజులలో పఠించి, సవరించి, సంస్కరించి, ఈ గ్రంథమునకు మెఱుగులు దిద్దినందులకు వారి చరణకమలములకు నేను నమస్కరించుచున్నాను.

కుమారి K. సుజాతారావుగారు, (I.A.S. Jt. Collector) నాకు నూతనపరిచయస్థురాలే యైనను, వారు శివానందాశ్రమమున కేతెంచి నప్పుడు బ్రహ్మసూత్రగ్రంథ ప్రచురణ విషయమై వారితో మాట్లాడగా శ్రీ P.V.R.K. ప్రసాద్ (I.A.S., Executive Officer, TTD.) గారి ద్వారా తిరుపతి–తిరుమల దేవస్థానములనుండి రు. 5,000/– లను సాంక్షన్ చేయించినందులకు నేను వారికి కృతజ్ఞతాభివందనముల నర్పించు కొనుచున్నాడను.

చక్కని తొలిపలుకులను, మలిపలుకులను వ్రాసి ఇచ్చినట్టి శ్రీ దేవానంద స్వాములవారికి, మఱియు శ్రీ అసంగానంద స్వాముల వారికి మదీయ కృతజ్ఞతాభివందనములు.

ఏతద్బృహద్గ్రంథమును శ్రమయనుకొనక సర్వాంగ సుందర ముగా ముద్రించి ఇచ్చినట్టి శ్రీ చక్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి, గృహ కృత్యములనేకములున్నను సమయదానమును, శ్రమదానము నొసంగి, ఈ గ్రంథమునకు పర్యవేక్షకులుగానుండి సహకరించినట్టి శ్రీ యు. నారాయణరావు (రాజోలు) గారికి మదీయ కృతజ్ఞతాభి వందనములనర్పించుకొనుచున్నాడను.

ఈ గ్రంథముద్రణకై ద్రవ్యదానమొసంగియు, శ్రమదాన మొసంగియు, సమయదానమొసంగియు ఎన్నియో విధములుగా సహకరించిన ఎందఱో మహానుభావులందఱికి నా వందనముల నర్పించుకొనుచున్నాను.

పూర్వార్ధ–ఉత్తరార్ధ గ్రంథములను కలిపి ఏకైక గ్రంథముగా ముద్రింపబడుటకు ఆర్థిక సహాయము నొనర్చిన శ్రీమతి బొబ్బా వసుంధరమ్మగారికి, శ్రీ సీతారామారావుగారికి అసంఖ్యాక వందనములు. ద్వితీయ ముద్రణ ప్రతులు త్వరలోనే పూర్తియైనవని తెలిసికొని మరల పైన పేర్కొనబడినవారే తృతీయ ముద్రణ గావించుచున్నందుకు పునఃప్రణామములు.

ఇట్లు
బుధజన విధేయుడు,
**– స్వామి హంసానంద**

తేది. 21.2.2020
మహాశివరాత్రి

# బ్రహ్మసూత్రములు

## ఉపోద్ఘాతము

శ్రీగణేశాయనమః

శ్రీ సద్గురు పరమాత్మనేనమః

హరిః ఓమ్

విష్ణువు యొక్క అవతారము, బాదరాయణుడు మఱియు శ్రీ కృష్ణద్వైపాయనుడనెడి శ్రీ వ్యాసులవారికి సాష్టాంగప్రణామములు.

యజ్ఞయాగాదులతో కూడిన కర్మకాండ, పూజావిధానముతో కూడిన ఉపాసనాకాండ మఱియు బ్రహ్మజ్ఞానముతో కూడిన జ్ఞానకాండ యనెడి మూడు విభాగములను వేదములు కలిగియున్నవి. కర్మకాండ మానవుని పాదములకు, ఉపాసనాకాండ హృదయమునకు మఱియు జ్ఞానకాండ శిరస్సునకు ప్రతీకములై యున్నవి. మానవునికి శిరస్సు మిక్కిలి ప్రధానమైనట్లు, జ్ఞానవిభాగముతో కూడియున్న ఉపనిషత్తులు వేదమునకు శిరస్సువలె శోభిల్లుచున్నవి. కావున ఇది వేదశిరస్సని చెప్పఁబడుచున్నది.

పవిత్రమైన గ్రంథములయందున్న భావార్థమును పరిశోధించుటయే మీమాంస యనఁబడును. ఇది పూర్వమీమాంస, ఉత్తరమీమాంస యని ద్వివిధములుగా నున్నది. పూర్వమీమాంస – సంహిత, బ్రాహ్మణములతో కూడియున్న యజ్ఞయాగాది విభాగమగు కర్మకాండను ప్రతిపాదించును. ఉత్తరమీమాంస – బ్రాహ్మణములు మఱియు ఉపనిషత్తులయందున్న ఆరణ్యక విభాగమగు జ్ఞానకాండను ప్రతిపాదించును. జైమిని పూర్వమీమాంసకు కర్త. జైమినికి గురువైన శ్రీ వేదవ్యాసుడు

(బాదరాయణుడు లేక కృష్ణద్వైపాయనుడు) బ్రహ్మసూత్రములు లేదా వేదాంత సూత్రములకు కర్త. బ్రహ్మసూత్రాధ్యయనము ఉపనిషత్సంధానాధ్యయనము వంటిది. ఇది వేదాంత దర్శనమునుఁగూర్చి ప్రబోధించును.

వేదములు శాశ్వతమైనవి. అవి ఒక వ్యక్తిచే వ్రాయఁబడినవి కావు. అవి హిరణ్యగర్భుని (బ్రహ్మదేవుడు) శ్వాసనుండి బయల్వెడలినవి. వేదముల యొక్క అంతము, లేక సారాంసమే వేదాంతము. ఇది జ్ఞానకాండనుఁ గూర్చి ప్రబోధించును. కేవలము విమర్శించుటయే వేదాంత లక్ష్యము కాదు. అది హైందవ మహర్షులు, లేక ద్రష్టలయొక్క అపూర్వానుభవము, లేక ప్రత్యక్ష ఆత్మజ్ఞానమునకు ప్రాతిపదిక వంటిది. ఆత్మజ్ఞాన విజ్ఞానమే బ్రహ్మసూత్రములని చెప్పవచ్చును.

సంక్షిప్తములగు సిద్ధాంతములే సూత్రములనఁబడును. ఒక విషయముపైఁగల వాదవివాదములలోని సారాంశమును అవి మనకొసంగును. సాధ్యమైనంత తక్కువ శబ్దములలో గొప్ప విచారణాశక్తిని ఈ సూత్రములు మన కొసంగును. వీటిని జ్ఞప్తియందుంచుకొనుట మిక్కిలి సులభము. ఆత్మసాక్షాత్కారజ్ఞానముఁగల గొప్ప మేధావంతులు మాత్రమే ఇట్టి సూత్రములను కూర్పఁగలుగుదురు. అవి జ్ఞాపకశక్తికి కీలకములు, లేక సహాయకముల వంటివి. భాష్యము లేకుండా మనకవి అర్థము కావు. ఆ భాష్యమును అర్థమొనర్చుకొనుటకు సైతము మిక్కిలి విశాలమైన వివరణము ఆవశ్యకమైయున్నది. ఈ విధముగా ఈ సూత్రముల నభివర్ణించుటలో వృత్తులు మఱియు కారికలనెడి అనేకరకములగు రచనాసాహిత్యము లభ్యమగుటకు కారణమయ్యెను. నానావిధ దర్శనములకు మూలపురుషులైన ఆయా ఆచార్యులు తమ సిద్ధాంతములను స్థాపించుకొనుటకై ఈ సూత్రములకు తమ స్వంత భాష్యములను వివరించిరి. ఈ బ్రహ్మసూత్రములపై శ్రీశంకరాచార్యులవారు వ్రాసిన భాష్యము శరీరక భాష్యమని చెప్పఁబడును. కేవలాద్వైతమే వీరి సిద్ధాంతము. విశిష్టాద్వైత స్థాపకులగు శ్రీరామానుజాచుర్యులవారి భాష్యము శ్రీభాష్యమని చెప్పఁబడును. శ్రీనింబార్కాచార్యులవారి భాష్యము వేదాంత పారిజాత సౌరభమని చెప్పఁబడును. శుద్ధాద్వైత సంస్థాపకులగు శ్రీ వల్లభాచార్యులవారి భాష్యము అణుభాష్యమని చెప్పఁబడును.

సంస్కృతము ఒక సొగఁదీయు ద్రవ్యము వంటిది. ఇది ఒక కామధేనువు, లేక కల్పతరువు వంటిది. నీ బుద్ధిచాతుర్యము ననుసరించియు, అధ్యాత్మికానుభవమునుఁబట్టియు నీవు దీనినుండి అనేకరకము లగు రసములను చవిచూడవచ్చును. కావుననే వివిధాచార్యులు ఈ సూత్రములపై తామొనర్చిన వివిధ భాష్యములచే వివిధములగు మతములకు మతకర్తలు కాఁగలిగిరి. మధ్వాచార్యులవారు ద్వైతమతమును స్థాపించిరి. భాగవతులు, లేక పాంచ రాత్రులనఁబడెడి వైష్ణవులు మఱియు పాశుపతులు, లేక మాహేశ్వరులనఁబడెడి శైవులీ బ్రహ్మసూత్రములకు తమ కభిరుచికరమగు భాష్యములను వివరించిరి. నింబార్కాచార్యులవారు భేదాభేద–ద్వైతాద్వైత సిద్ధాంతానుసారముగా ఆ వేదాంత సిద్ధాంతము నభివర్ణించిరి. తొమ్మిదవ శతాబ్దములోని పూర్వార్ధభాగమునందు సుప్రసిద్ధులైన శ్రీ భాస్కరుల వారి ప్రబోధముచే వీరు ప్రభావితులైరి. ఈ భాస్కర–నిబార్కుల సిద్ధాంతమును సనాతన ఋషియైన ఔడులోమి కలిగియుండెను. ఈ సిద్ధాంతమునుఁగూర్చి బాదరాయణుడు స్వయముగా తన బ్రహ్మసూత్రముల యందు పేర్కొనియున్నాడు.

బ్రహ్మసూత్రములపై పదునాలుగుకంటె ఎక్కువ భాష్యములు కలవు. శ్రీ అప్పయ్యదీక్షితారులవారు తన పరిమళము చేతను, శ్రీ వాచస్పతి మిశ్రుడు తన భామతిచేతను మఱియు శ్రీ అమలానందసరస్వతి తన కల్పతరువు చేతను శ్రీ శంకరాచార్యులవారి భాష్యమును మిక్కిలి తేటతెల్లమొనర్చిరి.

మానవుని క్లేశములు, కష్టములు మఱియు జనన మరణములకు మూల కారణము, శరీరమును శుద్ధమైన ఆత్మతో తాదాత్మ్యము నొందించుటయే నైయున్నది. నీవు శరీరముతో తాదాత్మ్యము నొందినవాడవై "నేను అందముగా, నల్లగా, లావుగా, లేక సన్నగానున్నాన"ని పలుకుచుందువు. మఱియు "నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను డాక్టరును" అని పలుకుదువు. నీవు ఇంద్రియములతో తాదాత్మ్యము నొందినవాడవై "నేను గ్రుడ్డివాడను, నేను మూగవాడన"ని పలుకుదువు. నీవు మనస్సుతో తాదాత్మ్యము నొందినవాడవై "నాకేమియు తెలియదు, నాకన్నియు తెలియును. నేను కోపోద్రిక్తుడనైతిని, నేను ఆనందముగా భుజించితిని, నేనీ వ్యాధిచే

బాధపడుచున్నాన"ని పలుకుదువు. అవిద్యకు, కష్టములకు మఱియు క్లేశములకు కారణభూతమైయున్న శరీరముతో ఆత్మకుఁగల తాదాత్మ్యతను తొలగించుటయేఁగాక, బ్రహ్మజ్ఞానము ద్వారా మోక్షధామమును చేర్చుట ఈ బ్రహ్మసూత్రము లన్నింటికి లక్ష్యమైయున్నది.

ప్రారంభమునందు ఉపనిషత్తులు పరస్పర ఖండనలతో నిండియున్నట్లు తోచును. అవియొక క్రమబద్ధమైన విచారణను కలిగియుండవు. శ్రీవ్యాసులవారు తమ బ్రహ్మసూత్రములయందు ఈ యుపనిషత్తులయందున్న వేదాంతవిచారణను క్రమబద్ధమొనర్చిరి. ఉపనిషత్తులయందున్న పరస్పర విరుద్ధ భూమికలు ఈ సూత్రములలో సవరణ మొనర్పఁబడినవి. నిజమైన విచారణా పరునికి పరస్పర ఖండనలిందు కానఁబడవు. ఔడులోమి, ఆశ్మరథ్యుడు కూడా ఈ కార్యమును తమకు సాధ్యమైనంతవరకు సాధించి, తమ తమ మతములను స్థాపించుకొనిరి.

వేదాంత దర్శనము నధ్యయనము నొనర్పఁగోరువారు దశోపనిషత్తులను మఱియు బ్రహ్మసూత్రాలను పఠింపవలసియుండును. ఆచార్యులందఱున్నూ బ్రహ్మసూత్రములకు భాష్యములను వ్రాసిరి. భారతీయ దర్శనము లన్నింటికిని ఇదియే గొప్ప ప్రమాణమైయున్నది. ఏ యాచార్యుడైన తన మతము, శాఖ, లేక సిద్ధాంతమును స్థాపింపఁబూనినచో అతడు బ్రహ్మసూత్రములకు తన స్వంతభాష్యమును వ్రాయవలసి యుండును. అప్పుడు మాత్రమే అది ప్రమాణముగా స్వీకరింపఁబడును.

కేవలాద్వైతస్థాపకులగు శ్రీ శంకరులు, విశిష్టాద్వైత స్థాపకులగు శ్రీరామానుజులు, భేదాభేదవాద స్థాపకులగు శ్రీ నింబార్కుడు, ద్వైతవాదస్థాపకులగు శ్రీ మధ్వుడు, శుద్ధాద్వైతవాద స్థాపకులగు శ్రీ వల్లభుడు ఈ యైదుగురు ఆచార్యులున్నూ ఈ ప్రపంచమునకు బ్రహ్మమే కారణమనియు మఱియు బ్రహ్మజ్ఞానమే జీవిత లక్ష్యమైయున్న మోక్షమును చేర్చుననియున్నూ అంగీకరించిరి. బ్రహ్మము కేవలము శాస్త్రముల ద్వారా తెలియఁబడునేఁగాని, కేవల తర్కము ద్వారా తెలియఁ బడదనియున్నూ వీరు మాటిమాటికి హెచ్చరించి చెప్పిరి. కాని బ్రహ్మము యొక్క

స్వరూపము, బ్రహ్మముతో జీవాత్మకుఁగల సంబంధము, ముక్తదశలో ఆత్మయొక్క స్థితి, దానిని పొందు సాధనము మఱియు ఈ విశ్వముతో దానికిగల కారణత్వములనుఁగూర్చి వారు పరస్పర అభిప్రాయభేదములను కలిగియున్నారు.

శ్రీశంకరసిద్ధాంతము ననుసరించి పరిపూర్ణ అఖండ సచ్చిదానంద స్వరూపమైయున్న పరబ్రహ్మ మొక్కటే కలదు. సత్తున్నూ, అసత్తున్నూ కాని బ్రహ్మము యొక్క మిథ్యాశక్తియగు మాయ కారణముచే ఈ జగత్తు మనకు కానఁబడుచున్నది. ఈ ప్రపంచము అసత్యము. మాయ ద్వారా బ్రహ్మమే ఈ విశ్వముగా కానఁబడును. బ్రహ్మము మాత్రమే సత్యము. అవిద్య కారణముచే జీవాత్మ శరీరము మొదలగు ఉపాధులచే తాదాత్మ్ ్యమునొంది సంకుచిత మొనర్పఁబడుచున్నది. తన స్వార్థపూరితములగు కర్మలద్వారా అతడు తన కర్మల యొక్క ఫలము ననుభవించు చున్నాడు. అతడు కర్త మఱియు భోక్త యగుచున్నాడు. అవిద్య, లేక అంతఃకరణోప కరణము ద్వారా అతడు నీచదశనొంది కర్తగా భావించుచున్నాడు. తన అవిద్య తొలగింపఁబడి నప్పుడు జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యమునొందును. నిజమునకు జీవుడు సర్వవ్యాపకుడు మఱియు బ్రహ్మముతో సమానుడైయున్నాడు. మాయ యొక్క సృష్టియే ఈశ్వరుడు, లేక సగుణ బ్రహ్మము. ఈశ్వరపూజ క్రమముగా ముక్తికి దారితీయును. సగుణ బ్రహ్మజ్ఞానముఁగల మహాభక్తులు బ్రహ్మలోకమునకేగి, ఉన్నత జ్ఞానము ద్వారా బంధవిముక్తులగుదురు. వారీ ప్రపంచమునకు తిరిగిరారు. వారు ప్రళయకాలమునందు నిర్గుణ బ్రహ్మమునొందుదురు. కేవలము నిర్గుణ బ్రహ్మజ్ఞానమే ముక్తికి సాధనము. నిర్గుణ బ్రహ్మవేత్తలు సద్యోముక్తిని బడయుదురు. వారు దేవయాన మార్గము గుండా వెళ్ళనవసరము లేదు. వారు స్వయముగ పరబ్రహ్మమునందు లీనమగుదురు. వారు ఏ యితర లోకమునకుఁగాని ప్రపంచమునకుఁగాని వెళ్ళరు. శ్రీ శంకరులవారి బ్రహ్మము నిర్విశేషబ్రహ్మము, లేక నిర్గుణబ్రహ్మమని చెప్పఁబడును.

శ్రీరామానుజులవారి మతానుసారముగా బ్రహ్మము సవిశేషము. ఆ బ్రహ్మము సమస్త కళ్యాణ గుణములతో కూడియుండును. అది స్వయముగా తెలివి కాదు. తెలివియే దానికి ప్రధానమైన గుణము. ఉనికి కలిగియున్న దానినంతటిని అది

తనయందే కలిగియున్నది. ప్రపంచము మఱియు జీవసమూహము బ్రహ్మమునందు నిజముగా వెలసియున్నవి. చిత్తు, అచిత్తులు దేవుని శరీరమునుండి వెలువడినవి. నారాయణుడే అంతర్యామి. చిత్తు, అచిత్తులు అతనికి ప్రాకారముల వంటివి. జీవులు బ్రహ్మమునందు పూర్తిగా ఎన్నటికిని లయింపఁబడరు. రామానుజ మతానుసారముగా బ్రహ్మము ఏకైకము మఱియు అఖండము కాదు. ప్రళయకాలమునందు జీవులు సంకోచస్థితి నొందుదురు. సృష్టికాలమునందవి వికాసము నొందును. శ్రీరామానుజులవారి బ్రహ్మము సగుణమైన దేవుడు. రామానుజులవారి జీవుడు నిజముగా నున్న ఒక వ్యక్తి. ఈతని వ్యక్తిత్వము ఎల్లకాలముందును. ఆత్మ వైకుంఠము నందెల్లకాలము ఆనంద భూమికయందుండి, నారాయణుని దివ్యమైన ఐశ్వర్యమునను భవించును. ముక్తికి భక్తియే మూలము. కాని జ్ఞానము కాదు. శ్రీరామానుజులు తన భాష్యమునందు బోధాయన సిద్ధాంతము ననుసరించిరి.

శ్రీనింబార్కాచార్యులవారి మతానుసారముగా బ్రహ్మము ఈ ప్రపంచమునకు నిమిత్త మఱియు ఉపాదాన కారణమైయున్నది. బ్రహ్మము నిర్గుణము మఱియు సగుణమునైయున్నది. ఈ విశ్వము మిథ్య కాదు. కాని బ్రహ్మము యొక్క పరిణామమేనైయున్నది. (శ్రీరామానుజులు కూడా "పాలు పెరుగుగా ఎట్లు మారునో, అట్లే బ్రహ్మము స్వయముగా ఈ విశ్వముగా మారెన"ను దృష్టిని కలిగియున్నారు.) తరంగము, లేక బుడగ నీరైనా నీటికి భిన్నముగా మనకెట్లు కానబడునో, అదే విధముగా ఈ ప్రపంచము బ్రహ్మమేనై బ్రహ్మమునకు భిన్నముగా నున్నది. జీవులు పరమాత్మ యొక్క అంశములు. అవి పురుషోత్తమునిచే నియమింపఁ బడుచున్నవి. ఆత్మయొక్క నిజమైన స్వరూపమును తెలిసికొనుటయే మోక్షము. ఇది భక్తిచేత పొందఁబడును. మోక్షదశయందు కూడా జీవాత్మయొక్క వ్యక్తిత్వము నశించదు. శ్రీరామానుజులు కూడా జీవుడు నారాయణుని వంటి దివ్యమైన దేహమును ధరించి, చతుర్భుజుడై వైకుంఠమునందు భగవదైశ్వర్యము ననుభవించునని పలికిరి.

దైవసాక్షాత్కారమునొందిన మహాపురుషులు కూడా ఇట్టి భేదాభిప్రాయముల నేలకలిగియున్నారు? మఱియు నానావిధములగు మతసిద్ధాంతముల నేలకలిగి యున్నారు? అని నీవు ప్రశ్నింపవచ్చును. శ్రీ శంకరులు నుడివినట్టి జీవ

బ్రహ్మైక్యరహస్యమును జనబాహుళ్యము గ్రహింపఁజాలదు. కావున శ్రీమధ్వ, శ్రీరామానుజులు తమతమ భక్తిమతములను స్థాపించిరి. యోగమను నిచ్చెన యందు నానావిధములగు శాఖలు నానావిధ సోపానముల వంటివి. సాధకుడు క్రమముగా ఒక్కొక్క సోపానమును దాటుచు శ్రీ శంకరులవారి కేవలాద్వైత మనెడి పూర్ణత్వ శిఖరాగ్రము నందుకొనవలసి యుండును. సాధకునియొక్క అభిరుచి, శక్తి సామర్థ్యము మఱియు వికాసభూమిక ననుసరించి ఉన్నతి నొందుటకై వివిధశాఖలు కూడా అత్యవసరములై యున్నవి. కావున మతశాఖలు మఱియు వివిధ దర్శనము లావశ్యకములైనవి. అవి తమ ప్రత్యేకస్థానమును మఱియు స్థాయిని కలిగి యున్నవి.

బ్రహ్మము యొక్క ప్రత్యేకాంశమునుఁ గూర్చి ఆయా ఆచార్యులు తమతమ మతానుసారముగా కలిగియున్న దృష్టులు సత్యదూరములు కావు. శంకరులు బ్రహ్మమునుఁ గూర్చి భావాతీత దృష్టిని కలిగియున్నచో, రామానుజులు ముఖ్యముగా బ్రహ్మముయొక్క సర్వవ్యాపక దృష్టిని కలిగియున్నారు. శ్రీ శంకరాచార్యుల వారి కాలములో ప్రజలు అంధప్రాయముగా కర్మకాండ నొనర్చుచుండిరి. వారు భాష్యము వ్రాయు సమయములో గ్రుడ్డితనముగా కర్మకాండ ననుసరించుటచే కలుగు కష్టదశను నివారించు దృష్టిని వారు కలిగియుండిరి. వారు నిస్వార్థసేవ, లేక నిష్కామ కర్మయోగమునేమాత్రము ఖండింపలేదు. స్వార్థపూరితమైన కర్మాచరణను మాత్రమే వారు ఖండించిరి.

భాష్యములన్నింటిలో శంకరభాష్యము మిక్కిలి పురాతనమైనది. ఇతర దేవతల కంటె అతీతమైన ఉపనిషత్తులలోని పరమాత్మను శుద్ధబ్రహ్మస్వరూపముగా ఈ భాష్యము వర్ణించును. ఇది వేదాంతభేరిని మ్రోగించుటయేఁగాక, జీవబ్రహ్మైక్య మునుఁగూర్చి పునఃపునః ప్రతిపాదించును. శంకరుని వేదాంతదృష్టి బాదరాయణుని భావమునసనుగమించును. వీరి భాష్యమునందు శ్రీ వ్యాసులవారి భావార్థము ఉన్నదున్నట్లుగా ప్రస్ఫుట మగును. దీనియందు సంశయమునకుఁగాని, తర్కమునకుఁగాని తావులేదు.

కేవలాద్వైత దర్శనము నెఱుంగఁగోరు ముముక్షువులు శ్రీ శంకరలవారి గంభీరమైన, నిరుపమానమైన, శారీరక భాష్యమును పఠింపనగును. బ్రహ్మ

సూత్రములను సవ్యముగా అర్థమొనర్చుకొనుట కిదియే ప్రమాణమై యున్నది. భారతదేశము, జర్మనీ, అమెరికా మఱియు ఇంగ్లండులోని ప్రధాన తత్త్వవేత్త లందఱున్నూ ఈ వేదాంత దర్శనమునే అనుసరించిరి. వేదాంతమును ప్రతిపాదించు గ్రంథము లన్నింటియందు ఇది మహోన్నత స్థానము నాక్రమించును. అద్వైతవేదాంతము హిందువులకు మిక్కిలి పవిత్రమైన మఱియు గంభీరమైన దర్శనమైయున్నది.

శ్రేష్ఠములైన ద్వాదశోపనిషత్తుల జ్ఞానమును కలిగి యున్నచో నీవు బ్రహ్మసూత్రముల నర్థమొనర్చు కొనఁగలుదువు. సాంఖ్య, న్యాయ, యోగ, మీమాంస, వైశేషిక దర్శనములు మఱియు బౌద్ధమత సిద్ధాంతము కూడా నీకు తెలిసియున్నచో, నీకు రెండవ అధ్యాయము అర్థమగును. శ్రీ శంకరాచార్యులు ఈ దర్శనముల నన్నింటిని ఖండించిరి. శ్రీ శంకరుల వారి భాష్యము ఉత్తమోత్తమమైనది. ఈ భాష్యమును Dr. Thibaut తమ భాష యందనువదించిరి. "బ్రహ్మసూత్రములు" ప్రస్థానత్రయము నందొకటి. ఇది హైందవ దర్శనముల యందొక ప్రామాణిక గ్రంథము. *ఈ గ్రంథమునందు 4 అధ్యాయములు, 16 పాదములు, 191 అధికరణములు మఱియు 555 సూత్రములు కలవు.* ప్రథమాధ్యాయము (సమన్వయాధ్యాము) బ్రహ్మసమన్వయ మొనర్చును. ద్వితీయాధ్యాయము (అవిరోధాధ్యాయము) తదితర దర్శనములను ఖండించును. తృతీయాధ్యాయము (సాధనాధ్యాయము) బ్రహ్మమును చేఱు సాధనక్రమము నభివర్ణించును. ఇఁక చతుర్థాధ్యాయము (ఫలాధ్యాయము) ఆత్మ సాక్షాత్కారముచే కలుగు ఫలితములనుఁగూర్చి ప్రతిపాదించును. ప్రతి అధ్యాయమునందు నాలుగు పాదములున్నవి. ప్రతిపాదమునకు అధికరణములున్నవి. ప్రతి అధికరణమునందు తత్సంబంధములగు ప్రశ్నోత్తరములున్నవి. ప్రథమాధ్యాయములోని మొదటి ఐదు అధికరణములు మిక్కిలి ప్రధానములై యున్నవి.

వేదవిభాగము నొనర్చి పదునెనిమిది పురాణములను రచించినట్టి చిరంజీవియు, మహర్షియు, పరాశర పుత్రుడునగు శ్రీ వ్యాసభగవానునికి జయమగుఁగాక! అతని ఆశీర్వచనములు మీ అందరి యందుండునుఁ గాక!

# బ్రహ్మసూత్రములు

## ప్రథమాధ్యాయము

### ప్రథమ పాదము

## పీఠిక

శారీరకమగు పరబ్రహ్మమునుఁగూర్చి ప్రతిపాదించునవగుటచే వేదాంతసూత్రములు "శారీరక మీమాంస" యని చెప్పఁబడును.

వైదికగ్రంథములన్నియును సర్వతోముఖముగా బ్రహ్మమును సూచించును. దానియందే సమన్వయమును కలిగియున్నవని సూత్రకారుడు ప్రథమాధ్యాయము నందు విస్తరించెను. వేదాంతము మఱియు ఇతర శాస్త్రములయందు వైరుధ్యము లేదని ద్వితీయాధ్యాయమునందు నిరూపింపఁబడినది. బ్రహ్మమును చేఱుమార్గములు తృతీయాధ్యాయమునందు వర్ణింపఁబడినవి. బ్రహ్మసాక్షాత్కారముచే కలుగు ఫలితము చతుర్థాధ్యాయమునందు వివరింపఁబడినది.

మనశ్శాంతిఁగలవాడు, శమదమాది షట్సంపత్తిఁగలవాడు, విశ్వాసపరుడు, సత్సాంగత్యము మఱియు సద్భావనను నిరంతరము కలిగియుండువాడు, కృతకృత్యతచే హృదయశుద్ధికలవాడు, ఫలము నాశింపక మతాచారములను నెఱవేర్చువాడున్నూ శాస్త్రము నధ్యయన మొనర్చి, దాని నర్థమొనర్చుకొనుటకు అధికారియని చెప్పఁబడును. ఈ శాస్త్రమొనర్చు బ్రహ్మముయొక్క వర్ణనయే సంబంధమనఁబడును. పరమ పవిత్రమైన పరబ్రహ్మమే ఈ శాస్త్రమునకు విషయము. బ్రహ్మసాక్షాత్కారమున కాటంకములగు వాటిని తొలగించి, పరబ్రహ్మానుభవమును కలిగించుటయే ఈ శాస్త్రమునకుఁగల ప్రయోజనము.

ఈ శాస్త్రము అనేకాధికరణములను, లేక విషయములను కలిగి యున్నది. ప్రతి అధికరణమునకు ఐదు విభాగములున్నవి. (1) విషయము, (2) సంశయము, (3) పూర్వపక్షము, (4) సిద్ధాంతము, (5) సంగతి లేక శాస్త్రముయొక్క ఇతర విభాగములతో ఆ యధికరణమునకుఁగల అన్వయము.

వేదాంతసూత్ర గ్రంథమునందంతటను బ్రహ్మమే ప్రధానచర్చనీయాంశమై యున్నది. ఏ పరిచ్ఛేదములోని వ్యాఖ్యానమైనను బ్రహ్మ విషయమును విడిచిలేదు. ప్రతి అధ్యాయము స్వయముగా ఒక ప్రత్యేక విషయమును కలిగియున్నది. ఆ యధ్యాయమునందుఁగల విషయమునుఁగూర్చియే ప్రతిపరిచ్ఛేదము వ్యాఖ్యానించవలసి యుండును. అధికరణములకు, లేక విషయములకు మధ్య ఒక ప్రత్యేక సంబంధము కలదు. ప్రత్యేక భావసంబంధముచే ఒక అధికరణము మరియొక అధికరణమునకు దారితీయును. ఒక పాదమునందనే కాధికరణము లుండును. కాని అవి అవకతవకలుగా అమర్పఁబడి లేవు.

# విషయ సంగ్రహము

ఈ విభాగమునందు పరబ్రహ్మము, జీవాత్మ మఱియు విశ్వమునకుఁగల పరస్పర సంబంధము సూచింపఁబడి, బ్రహ్మమునుఁగూర్చి ధ్యానించు పద్ధతులు విహంగమ దృష్టితో వివరింపఁబడినవి.

**(1) అధికరణము :** 1వ సూత్రమునందు బ్రహ్మజ్ఞానము నొందుటకు తీవ్రమైన ఇచ్ఛ కలిగియున్న వానికే ఈ గ్రంథము ఉపకరించునని సూచింపఁబడినది.

**(2) అధికరణము :** 2వ సూత్రమునందు ప్రపంచోత్పత్తికి కారణము బ్రహ్మమే! యను విషయము నిరూపింపఁబడినది.

**(3) అధికరణము :** 3వ సూత్రమునందు వేదములకు బ్రహ్మమే మూలమనియు, కేవలము శ్రుత్యధ్యయనముచేతనే బ్రహ్మము తెలియఁబడుననియు, ఏ యితర జ్ఞానము చేతను తెలియఁబడదనియు స్పష్టీకరింపఁబడినది.

**(4) అధికరణము :** 4వ సూత్రమునందు వేదాంత గ్రంథములన్నింటి యందుఁగల ముఖ్య విషయము బ్రహ్మమేయని నిరూపింపఁబడినది.

**(5) అధికరణము :** 5 నుండి 11 వరకుఁగల సూత్రములలో ప్రపంచమునకు కారణము బ్రహ్మము తప్ప మరియొకటి కాదని శ్రుతియొక్క అంగీకారము తెలుపఁబడినది. విశ్వమునకు కారణమైయున్న వేదాంత గ్రంథములు చాటిచెప్పు బ్రహ్మము చైతన్యవంతమైనదనియు, సాంఖ్య సిద్ధాంతము ననుసరించి ప్రపంచోత్పత్తికి కారణము జడమైన ప్రధానము కాదనియును నానావిధములగు వాదవివాదములచే నిరూపింపఁబడినది.

**(6) అధికరణము :** 12 నుండి 19 వరకుఁగల సూత్రములలో తైత్తిరీయోపనిషత్తులోని "ఆనందమయము" జీవుడా? లేక పరమాత్మయా? యను ప్రశ్న రేకెత్తించఁబడినది. శ్రుతిలోని "ఆనందమయము" జీవునికి, లేక సాంఖ్యుల ప్రధానమునకు చెందినది కాదనియు, బ్రహ్మమే ఆనందమయమనియు చెప్పఁబడినది. శ్రుతులన్నియును బ్రహ్మమును తప్ప మరియొక దానిని వర్ణించుట లేదని ఈ సూత్రములు నిరూపించుచున్నవి.

**(7) అధికరణము :** 20 మఱియు 21 సూత్రములలో సూర్యునియందు చూడఁబడు హిరణ్మయ పురుషుడు మఱియు నేత్రములోని పురుషుడు ఒకానొక ఉన్నతపురుషుడు కాదనియు, కాని పరమాత్మ, లేక పరబ్రహ్మమే యనియు చెప్పఁబడినది.

**(8) అధికరణము :** 22 వ సూత్రమునందు జీవులన్నింటికి మూలకారణమైయున్న ఆకాశము భూతాకాశము కాదనియు, అది పరబ్రహ్మమే ననియు నిరూపింపఁబడినది.

**(9) అధికరణము :** 23 వ సూత్రమునందు ఛాం. ఉ. 1-11-15 లో సూచింపబడిన ప్రాణముకూడా పరబ్రహ్మమే యని నిరూపింపఁబడినది.

**(10) అధికరణము :** 24 నుండి 27 సూత్రములలో ఛాం. ఉ. 3-13-7 లో చెప్పఁబడిన ప్రకాశము సామాన్యమైన భౌతికప్రకాశము కాదనియు, అది పరబ్రహ్మమే ననియును స్పష్టీకరింపఁబడినది.

**(11) అధికరణము :** 28 నుండి 31 సూత్రములలో కౌ. ఉ. 3-2లో సూచింపఁబడిన ప్రాణము బ్రహ్మమే యను విషయము నిశ్చయింపఁబడినది.

ఓం శ్రీ సద్గురు పరమాత్మనే నమః ।
ఓం శ్రీ వేదవ్యాసాయ నమః ॥
ఓం గం గణపతయే నమః ।
ఓం ఐం సరస్వత్యై నమః ॥
ఓం శ్రీ శంకరాచార్యాయ నమః ।
ఓం శ్రీ బ్రహ్మవిద్యా గురుభ్యో నమః ॥

# ప్రథమాధ్యాయము

## ప్రథమ పాదము

## సమన్వయాధ్యాయము

## 1. జిజ్ఞాసాధికరణము

### *1-1-1 అథాతో బ్రహ్మ జిజ్ఞాసా.*

కావున ఇప్పుడు బ్రహ్మ జిజ్ఞాస చేయఁబడుచున్నది.

అథ = ఇప్పుడు, అతః = అందువలన, బ్రహ్మ జిజ్ఞాసా = బ్రహ్మ విచారణ (బ్రహ్మము యొక్క నిజమైన స్వరూపమునుఁగూర్చిన పర్యాలోచన)

సూత్రమనగా దారమని అర్థము. వేదాంత భూమికలనెడి పుష్పములను ఏకీకృతమొనర్చు దారముగ ఇది పనిచేయును.

ప్రస్తుతము విచక్షణ చేయఁబోవు విషయము క్రొత్తది కాదనుటకై "అథ"

శబ్దము ప్రయోగింపఁబడినది. పరంపరగా వచ్చుచున్న విషయమునిది సూచించు చున్నది.

కొన్ని పూర్వ నిబంధనలపై బ్రహ్మజిజ్ఞాస ఆధారపడి యుండును. ముముక్షువు కొన్ని ప్రత్యేక ఆధ్యాత్మిక లక్షణములను కలిగియుండవలసి యుండును. అప్పుడు మాత్రమే ఈ జిజ్ఞాస సాధ్యమగును.

**అథ** – చతుర్విధ పురుషార్థముల వంటి కొన్ని ప్రత్యేక ప్రారంభ లక్షణములను కలిగియున్న తర్వాత. (1) నిత్యా నిత్య వస్తు వివేకము :(ఇది నిత్యము, అనిత్యమని తెలిసికొను జ్ఞానము) (2) ఇహాముత్రార్థఫలభోగ విరాగము: (ఇహలోక– పరలోక భోగములను, కర్మఫలములను ఆశింప కుండుట). (3) షట్సంపద (శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము), (4) ముముక్షుత్వము (మోక్ష కాంక్ష).

బ్రహ్మజ్ఞానము నొందుటకు తీవ్రమైన ఇచ్ఛఁగలవారు మాత్రమే వేదాంత సూత్రముల నధ్యయనము చేయుటకు అర్హులు. యజ్ఞయాగాది కర్మకాండ జ్ఞానము లేకున్నను, శ్రుతుల నధ్యయనము చేసిన మాత్రముచే బ్రహ్మజ్ఞానము నొందువాంఛ కలుగును. బ్రహ్మ విచారణ కర్మాచరణపై ఆధారపడి యుండును.

శాశ్వతమైన బ్రహ్మమును నీవు తెలిసికొని సాక్షాత్కారించుకొనవలసి యుండును. అప్పుడు మాత్రమే నీవు శాశ్వతానందము, స్వతంత్రత, పూర్ణత్వము మఱియు అమృతత్వము నొందఁగలుగుదువు. నీ అన్వేషణకు పూర్వమే నీవు కొన్ని ప్రత్యేక లక్షణములను కలిగియుండవలసి యుండును. నీవు బ్రహ్మమునుఁగూర్చి విచారణ యొనర్పనేల? ఎందుచేతననగా యజ్ఞయాగాదులచే కలుగు ఫలితములు అశాశ్వతములు, మఱియు బ్రహ్మజ్ఞానము శాశ్వతమై యున్నది. నీ వొనర్చు నానావిధ కర్మలద్వారా పొందునట్టి ఇహలోక, స్వర్గలోక జీవితములు అనిత్యములు. బ్రహ్మమునుఁగూర్చి తెలిసికొన్నప్పుడు నీవు శాశ్వతానందమును మఱియు అమృతత్వము నొందుదువు. ఈ కారణముచేతనే నీవు బ్రహ్మము, సత్యము లేక పరమ నైజమునుఁగూర్చి తెలిసికొనవలసి యున్నది.

ఒకప్పుడు మానవునికి కర్మలనేవగించుకొను సమయమాసన్న మగును. దుఃఖము, చింత, భయము లేకుండా కర్మలు శాశ్వతానందము నొసంగజాలవను విషయమాతనికి తెలియును. కావున కర్మల కతీతమైనయున్న, శాశ్వతానందమునకు మూలమైయున్న, విశ్వవ్యాపకము, శాశ్వతమునగు బ్రహ్మజ్ఞానమునుఁబడయు కోరిక స్వాభావికముగా మానవునియందు జనించును.

చార్వాకులు, లేక లోకాయతికులు శరీరమునే ఆత్మగా తలంతురు. కొందఱు ఇంద్రియములనే ఆత్మగా భావింతురు. మరికొందఱు మనస్సే ఆత్మయని తలపోయుదురు. కొందఱు బుద్ధియే ఆత్మయని అనుకొందురు. ఆత్మ కేవలము ఒక క్షణకాల భావన యని కొందఱు తలంతురు. నిజమునకు ఏమియు లేదని మరి కొందరు భావింతురు. కొందఱు ఈ శరీరమునకు ఆత్మ భిన్నమైనదనియు, అదియే కర్మఫలములకు కర్త మఱియు భోక్త యనియు చింతింతురు. ఇతరులు అది కర్త కాదనియు, కేవలము భోక్త యనియు చెప్పుదురు. కొందఱు జీవాత్మ పరమాత్మయొక్క అంశమని పలుకుదురు. వేదాంతులు జీవాత్మ పరమాత్మతో తాదాత్మ్యము నొందునని వక్కాణింతురు. నానావిధ దార్శనికులు నానావిధ దృష్టులను కలిగియుందురు. కావున పదార్థములలోని సత్యమును మిక్కిలి జాగరూకతతో పరీక్షించుట ఆవశ్యకమై యున్నది.

బ్రహ్మజ్ఞానముచే దుష్కార్యములన్నింటికి మూలకారణమైయున్న, లేక సంసారవృక్షమునకు బీజమైయున్న అవిద్య నశించును. కావున బ్రహ్మజ్ఞానవాంఛను నీవు కలిగియుండవలయును. బ్రహ్మజ్ఞానము నిన్ను పరమ గమ్యస్థానమును చేర్చును. కావున బ్రహ్మమునుఁగూర్చి చర్చించు శ్రుతుల నధ్యయనము చేయుట ద్వారా బ్రహ్మవిచారణ యొనర్చుట అత్యావశ్యకమై యున్నది.

ఇప్పుడీ ప్రశ్న ఉదయించును. "బ్రహ్మము యొక్క గుణము లేవి?" ఈ క్రింది సూత్రమునందు బ్రహ్మము యొక్క స్వరూపము వర్ణింపఁబడినది.

# 2. జన్మాద్యధికరణము

## 1-1-2 జన్మాద్యస్యయతః

ఈ ప్రపంచము యొక్క ఉత్పత్తి, స్థితి, లయములు దేనినుండి జనించునో అదియే బ్రహ్మము.

జన్మాది = ఉత్పత్తి మొదలగునవి. అస్య = ఈ ప్రపంచము యొక్క, యతః = దేనినుండి.

బ్రహ్మవిచారణకు సమాధాన మీ సూత్రమునందు సంక్షిప్తముగా ఇవ్వఁబడినది. ఈ ప్రపంచముయొక్క సృష్టిస్థితి ప్రళయమునకు కేవలము నిత్యబుద్ధముక్త స్వభావముతో కూడిన బ్రహ్మమే కారణమని నుడువఁబడినది. ఈ విశాల ప్రపంచమును సృష్టించి, పోషించి,లయింపఁజేయు బ్రహ్మము అనంత శక్తులను మఱియు గుణములను కలిగియుండక తప్పదు, కావుననే అతడు సర్వశక్తిమంతుడు మఱియు సర్వజ్ఞుడనఁబడును. ఈ సర్వశక్తిమంతుడు మఱియు సర్వజ్ఞుడగు బ్రహ్మముఁగాక మరెవ్వడీ ప్రపంచమును సృష్టించి, పోషించి, లయింపఁజేయఁగలుగును? నిశ్చయముగా కేవలము అణువులుఁగాని, అదృష్టముఁగాని ఈ కార్యమును నెఱవేర్పఁజాలవు. అసత్తునుండి సత్తు జనింపజాలదు. ప్రజ్ఞారహితమైయున్న ప్రధానము, లేక ప్రకృతినుండి ప్రపంచము జనింపజాలదు. కార్యసిద్ధికై ప్రత్యేక దేశకాల కారణము లావశ్యకము లగుటచే అది స్వాభావికముగా తనకుతాను కారణము లేకుండా ఉత్పన్నము కాదు.

బ్రహ్మమునకు కొన్ని గుణములుండవలయును. ఆ గుణములనుఁగూర్చి మనన మొనర్చుటద్వారా నీవు బ్రహ్మజ్ఞానమునుఁబడయఁ గలుగుదువు. లేనిచో ఇట్టి జ్ఞానము నొందుట అసాధ్యము. వేదాంత గ్రంథముల కభిన్నమైయుండు అనుమాన ప్రమాణము సమ్యగ్ జ్ఞానమునకు సాధనమై యున్నది.

బ్రహ్మసాక్షాత్కారము నొందిన ద్రష్టలగు ఋషీశ్వరులయొక్క ప్రత్యక్షానుభవమును కలిగియున్న శాస్త్రములు మాత్రమే పరమసత్యమునకు ప్రమాణములై యున్నవి. బుద్ధిహీనుని బుద్ధిమంతుడు జయించు కారణముచే నీవీ బుద్ధిని

విశ్వసించుట యుక్తముకాదు. బ్రహ్మము ఇంద్రియములకు విషయము కాదు. అది ఇంద్రియములకు మఱియు బుద్ధికి అతీతమై యున్నది.

ఈ రెండవ సూత్రము అనుమానమును బ్రహ్మజ్ఞానమునకు సాధనముగా అంగీకరించదు. బ్రహ్మస్వరూపమును వర్ణించునట్టి ఒక వేదాంత పరిచ్ఛేదము నిదిసూచించును. ఐతే ఈ వేదాంత పరిచ్ఛేద మెయ్యది? ఇది తైత్తిరీయోపనిషత్తులోని (3–1) వ వాక్యము. భృగువగు వారుణి తన తండ్రియగు వరుణుని సమీపించి "అయ్యా! నాకు బ్రహ్మమునుఁగూర్చి ఉపదేశింపుమ"ని అడిగెను. వరుణుడు ఇట్లనెను. "యతోవా ఇమానిభూతాని జాయంతే, యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ, తద్ బ్రహ్మేతి" –దేనినుండి ఈ జీవులు ఉత్పన్నమగునో, పుట్టిన తర్వాత దేనివలన జీవించునో, మరణానంతరము దేనియందవి ప్రవేశించునో దానిని తెలిసికొనుటకు ప్రయత్నించుము. అదియే బ్రహ్మము."

నీవు ఆత్మసాక్షాత్కారమును బ్రహ్మధ్యానము చేతను, లేక వేదాంత గ్రంథములో నిర్ణయింపఁబడిన సత్యము చేతను పొందఁగలుగుదువు. కాని కేవలము అనుమాన ప్రమాణముచే పొందలేవు. ఆత్మసాక్షాత్కారమునకు శుద్ధమైన బుద్ధి సహకరించును. అది శాస్త్రములలోని సత్యములను శోధించి, తేటతెల్లమొనర్చును. ఆత్మ సాక్షాత్కార సాధనములయందది యొకటి. కాని విపరీతబుద్ధి గొప్ప ఆటంకమును కలిగించును. అది మానవుని సత్యమునకు సుదూర మొనర్చును.

ప్రపంచమునకు కారణమైయున్నదేదో, అదియే బ్రహ్మము. ఇది తటస్థ లక్షణమనఁబడును. సృష్టిస్థితి ప్రళయములు ఈ ప్రపంచమునకు లక్షణములు. అవి మార్పులేని శాశ్వత బ్రహ్మమునకు సంబంధించినవి కావు. ఐనను ఈ విశ్వమునకు కారణమైయున్న బ్రహ్మమునే ఇవి సూచించును. శ్రుతులు బ్రహ్మమునకు మరియొక నిర్వచనము నొసంగినవి. ఇది దానియొక్క నైజస్వభావమునుఁవర్ణించును. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" సత్యము, జ్ఞానము, అనంతత్వమే బ్రహ్మము. ఇది స్వరూప లక్షణమనఁబడును.

మానవుని ఊహకంటె, ఒక వస్తువు యొక్క స్వరూపజ్ఞానమా వస్తువునందే ఇమిడి యుండును. బ్రహ్మజ్ఞానము కూడా స్వయముగా తత్పదార్థమగు బ్రహ్మముపైననే ఆధారపడి యుండును. ఒక కార్యము పూర్తిగా నీ సంకల్పముపై ఆధారపడి యుండును. కాని దృశ్యము సంకల్పశక్తి యొక్క కార్యము కాదు. అది చూడఁబడుచున్న పదార్థముపై ఆధారపడియుండును. నీవు సంకల్పశక్తిచే ఒక వృక్షమును మానవునిగా మార్పజాలవు. ఒక వృక్షమెల్లప్పుడు వృక్షముగానే మిగిలియుండును. ఇదే విధముగా బ్రహ్మసాక్షాత్కారము వస్తు తంత్రమువంటిది. అది పదార్థము యొక్క సత్యతపై ఆధారపడియుండును. ఇది పురుష తంత్రము కాదు. ఇది సంకల్పశక్తిపై ఆధారపడి యుండదు. ఇది కర్మచేత సాధింపఁబడునది కాదు. బ్రహ్మము ఇంద్రియములకు విషయము కాదు. జ్ఞానము యొక్క ఇతర సాధనములతో దానికి సంబంధములేదు. ఇంద్రియములు అంతవంతములు మఱియు ఒకదానిపై ఆధారపడి యుండునట్టివి. వాటికి విషయములు భౌతిక పదార్థములే! కాని బ్రహ్మము కాదు. రజోగుణ ప్రభావముచే అవి బహిర్ముఖ ప్రవృత్తిని కలిగి యున్నవి. అవి స్వాభావికముగా భౌతిక పదార్థములవైపు పరుగెత్తునట్లు నిర్మింపఁబడినవి. అవి బ్రహ్మమును దర్శింపజాలవు.

కేవలము అనుమాన ప్రమాణముచే బ్రహ్మజ్ఞానము కలుగదు. ఆత్మజ్ఞానము ద్వారా నీకీ జ్ఞానము ప్రాప్తించును. బ్రహ్మజిజ్ఞాసయందు సహజజ్ఞానవే అంత్యఫలితమై యున్నది. సత్పదార్థమే విచారణకు విషయమై యున్నది. దీనిని నీవు అపరోక్షానుభవము చేతనే తెలిసికొనవలసి యున్నది. బ్రహ్మము యొక్క శ్రవణ మనన నిది ధ్యాసనములు అపరోక్షానుభూతికి దారితీయును. సాధన చతుష్టయసంపత్తి, గురువాక్య ప్రబోధము మఱియు "తత్త్వమసి" మహావాక్యార్థమును గ్రోలినట్టి సాత్త్వికాంతః కరణముచేతనే బ్రహ్మాకారవృత్తి జనించును. ఈ బ్రహ్మాకారవృత్తిచే జననమరణములకు, సకల బంధనములకు కారణమైయున్న మూలావిద్య నశించును. ఈ యజ్ఞానమనెడి తెర తొలగింపఁబడినప్పుడు స్వయంప్రకాశ స్వరూపమైయున్న బ్రహ్మము తన అఖండమైన ప్రతిభతో వెలుగొందును. సాధారణ దృశ్యము నందు మనస్సు ఆ పదార్థము యొక్క రూపమునుఁదాల్చును. మానసిక కిరణము, లేక వృత్తిచే పదార్థమున కావరణ

భంగమగును మఱియు మనస్సుయొక్క వృత్తి సహిత చైతన్యముచే ఆ పదార్థము మనకు గోచరించును. అప్పుడు మాత్రమే నీవొక పదార్థమును చూడఁగలుగుదువు. ఒక పదార్థమునుఁగాంచునప్పుడు వృత్తివ్యాప్తి మఱియు ఫలవ్యాప్తి రెండున్నూ సంభవించును. నీకు వృత్తి మఱియు వృత్తి సహిత చైతన్యముకూడా అవసరమైయుండును. కాని బ్రహ్మ దర్శనమునందు ఫలవ్యాప్తితో పనిలేదు. బ్రహ్మము స్వయం ప్రకాశమానమగుటచే, దానియందు వృత్తివ్యాప్తి మాత్రమే కలదు. ఒక కుండయందు దీపమున్నచో, ఆ కుండ పగిలినప్పుడా దీపమును చూచుటకు నీకు కేవలము నేత్రములవసరమై యుండును. అప్పుడు నీకు దీప మవసరము లేదు.

# 3. శాస్త్రయోనిత్వాధికరణము

## 1-1-3 శాస్త్రయోనిత్వాత్

సమ్యగ్ జ్ఞానమునకు శాస్త్రము లాధారములగుటచే

శాస్త్ర = శాస్త్రము, యోనిత్వాత్ = సమ్యక్ జ్ఞానమునకు సాధన మగుటచే.

శాస్త్రాధారముచే బ్రహ్మము సర్వజ్ఞమని చెప్పఁబడును . కేవలము శ్రుతులు మాత్రమే బ్రహ్మమునకు ప్రమాణమని ఈ సూత్రము స్పష్టీకరించుచున్నది.

ప్రపంచమునకు కారణము బ్రహ్మమగుటచే బ్రహ్మ సర్వజ్ఞమని మనమూహించవలసి యున్నది. బ్రహ్మముయొక్క సమ్యగ్ జ్ఞానమునకు కేవలము శాస్త్రములే ప్రమాణములై యుండుటచే 2వ సూత్రములోని అభిప్రాయము నిశ్చితమగుచున్నది. బ్రహ్మము కేవలము ఈ ప్రపంచమునకు సృష్టిస్థితి లయముల నొనర్పదు. బ్రహ్మము ఇంద్రియములు మఱియు బుద్ధి కతీతమై యుండుటచే మహర్షుల ఆధ్యాత్మికానుభవములతో కూడియున్న శ్రుతులచేతనే తెలియఁబడును. బ్రహ్మముయొక్క నిశ్వసితమే వేదములని శ్రుతులు పలుకుచున్నవి. కావున ఇట్టి దివ్యజ్ఞాన సంభరితములగు శ్రుతులకు, లేక వేదములకు కారణమైనవాడు సర్వజ్ఞుడు మఱియు సర్వశక్తిమంతుడై యుండవలయును.

ఒక దివిటీవలె శాస్త్రములు పదార్థముల నన్నింటిని ప్రకాశింపఁజేయును. బ్రహ్మస్వరూపమును తెలియఁజేయు సమ్యగ్ జ్ఞానమునకు శాస్త్రములు మూలాధారములై యున్నవి. ఇతర గ్రంథముల ద్వారా తెలియఁబడని జ్ఞానమును శ్రుతులు మనకందించును. శ్రుతులకు భిన్నమైన ఏలాటి జ్ఞానముచేతను బ్రహ్మము మనకు తెలియఁబడదు. బ్రహ్మము అరూపము, అవర్ణము మఱియు నిర్గుణమై యున్నది. కావున అది ఇంద్రియములకు ప్రత్యక్షముగా గోచరింపదు. ధూమము ద్వారా అగ్నియొక్క ఉనికిని నీవు అనుమానింపవచ్చును. కాని బ్రహ్మము నిర్గుణమగుట చేతను, దానికి సాటియైన మరియొక పదార్థము లేకుండుట చేతను అనుమానము, లేక ఉపమానముచే అది తెలియఁబడజాలదు. బ్రహ్మము అద్వితీయము మఱియు అనంతమైనది. శ్రుతి జ్ఞానము లేనివానికి పరమాత్మ తెలియఁబడదు. జ్ఞాన సాధనములు సరియైనవే కాని అవి స్వతంత్రములు కావు. శ్రుతులచే బ్రహ్మము ప్రతిపాదించబడిన తర్వాత అవి అనుబంధముగా ఉపకరించును.

# 4. సమన్వయాధికరణము

## 1-1-4 తత్తు సమన్వయాత్

వేదాంత గ్రంథములన్నింటికి ముఖ్యాంశమైనదగుటచే బ్రహ్మము కేవలము శాస్త్రములచేతనే తెలియఁబడును. కాని ఏ యితర సాధనముచేతను తెలియఁబడదు.

తత్ = అది, తు = కాని, సమన్వయాత్ = ముఖ్యాంశ సమన్వయముచే.

2వ సూత్రాంశము చర్చింపఁబడుచున్నది. బ్రహ్మసిద్ధాంతముచేతనే శాస్త్రవాక్యలన్నియు సమన్వయము లగుచుండుటచే కేవలము శాస్త్రముచేతనే బ్రహ్మము తెలియఁబడును. బ్రహ్మమే వాటికి ముఖ్యాంశమగుటచే, వేదాంత గ్రంథములన్నియు బ్రహ్మమును గూర్చియే ప్రభోదించుచున్నవి. శాస్త్ర ప్రమాణ వాక్యమగుటచే జగత్కారణము బ్రహ్మమే యను సిద్ధాంతము ప్రతిపాదించబడినది. ఈ విషయమును వేదాంత గ్రంథములన్నియు అంగీకరించును.

పూర్వపక్షమును ఖండించుటకై “తు” యను శబ్దము ప్రయోగింపఁబడినది. వేదాంత గ్రంథము లన్నింటియందు బ్రహ్మమే ప్రధానాంశమని నుడువుటయే సరియైనది. ఏల? సమన్వయాత్. షడ్లింగములచే ఒక విషయమును ప్రతిపాదించుట అన్వయమని చెప్పబడును. (1) ఉపక్రమ- ఉపసంహార- ఏకవాక్యత (ఆద్యంతములలో సమానత) (2) అభ్యాసము (పునరావృత్తి) (3) అపూర్వత (అసామాన్యత) (4) ఫలము (ఫలితము) (5) అర్థవాదము (స్తుతి) (6) యుక్తి (ఉపపత్తి). ఈ షడ్లింగములచే ప్రతి గ్రంథములోని ప్రధానాంశమును పరిగ్రహింప వచ్చును. ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయములోని పరిచ్ఛేదము లన్నింటికి ప్రధానాంశము బ్రహ్మమేనై యున్నది. ప్రారంభమునందది “సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ ” అనిపలికి “ సయథాతత్ర నాదాహ్యైతైతదాత్మ్యమిదగ్ం సర్వంతత్సత్యగ్ం స ఆత్మా”అని అంతమొందించెను. ఈ యాద్యంత పరిచ్ఛేదములలో సామ్యత కలదు. ఇదియే ఉపక్రమోపసంహార మనఁబడును. ఆచార్యుడైన ఉద్దాలకుడు తన శిష్యుడైన శ్వేత కేతువునుఁ గూర్చి తొమ్మిది మారులు “తత్త్వమసి” యని ఉచ్చరించెను. ఇదియే అభ్యాసమఁనబడును. బ్రహ్మము అనంతము మఱియు అద్వితీయమైన దగుటచే అది నిస్సంశయముగా సాటిలేనిది. ఇది అపూర్వత. బ్రహ్మజ్ఞానము నొంది నప్పుడు నీవు సర్వజ్ఞుడవగుదువు. ఇదియే ఫలము.

శాస్త్రములలో తర్కమున్నూ కలదు. కుండలయందెట్లు మట్టితప్ప మరి యొకటిలేదో, ఆభరణముల యందెట్లు బంగారము తప్ప మరియొకటిలేదో, అట్లే ఈ నామరూప ప్రపంచమునందు బ్రహ్మము తప్ప మరియొకటిలేదు. నీకు మట్టి స్వరూపము తెలిసినచో మట్టితో చేయఁబడు పదార్థము లన్నింటి స్వరూపము కూడా నీకు తెలియును. అదే విధముగా నీవు బ్రహ్మమును తెలిసికొన్నచో, ప్రతి పదార్థమున్నూ నీకు తెలియఁబడును. విశ్వముయొక్క సృష్టిస్థితి ప్రళయములకు బ్రహ్మమే మూలమై యున్నది. ఇది ఆర్థవాదము, లేక స్తుతి వాదమని చెప్పఁబడును. యుక్తి అనగా ఉపపత్తి యని అర్థము. “కుండలు అసత్యము, మట్టి సత్యము” అనునట్లు “సృష్టిమిథ్య, బ్రహ్మము సత్యము” అనునది యుక్తి వేదాంత గ్రంథములన్నింటికి ముఖ్యమైన అంశము బ్రహ్మమే! యను విషయమును ఈ షడ్లింగములు సూచించును.

వేదాంత గ్రంథము లన్నియును బ్రహ్మమే ముఖ్యాంశముగా కలిగి యున్నవి. ఉదాహరణమునకు "సదేవ సోమ్యే దమగ్ర ఆసీదేకమేవా ద్వితీయమ్" (ఛాం.ఉ.6-2-1) "ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్"(ఐ.ఉ.1-1-1) "తదేతద్బ్రహ్మాపూర్వమనపరమనం తరమబాహ్యమ్ అయమాత్మా బ్రహ్మసర్వానుభూః" (బృ.ఉ.2-5-19). "బ్రహ్మైవేద మమృతం పురస్తాత్" (ముం.ఉ.2-2-12) మఱియు ఇట్టివే మరికొన్ని పరిచ్ఛేదములు కలవు. ఈ పరిచ్ఛేదములకు మరియొక అర్థమున్నదని తలంచుట భావ్యముకాదు. ఈ పరిచ్ఛేదములు యజమానులను, ధార్మిక కర్తవ్యమునకు సంబంధించిన దేవతలను సూచింపవు. (బృ.ఉ.2-4-14)లో నీవు "తత్కేనకం పశ్యేత్" అను వాక్యమును చూడఁగలుగుదువు. దీనిచే కర్త, కర్మ, సాధనము లేవియు లేవను విషయము స్పష్టమగుచున్నది.

బ్రహ్మము మిక్కిలి సూక్ష్మము, ప్రత్యగాత్మ అనంతము మఱియు సర్వ వ్యాపకమునగుటచే అది చూడఁబడదు మఱియు తెలిసికొనఁబడజాలదు. అంతవంతము,అజ్ఞానప్రదమైన పదార్థముచే అనంతత్వ మెట్లు తెలియఁబడును? ఇంద్రియములు, మనస్సు తమ శక్తి ప్రకాశములను తనకు మూలమైన బ్రహ్మమునుండి పొందును. బ్రహ్మము స్వయంప్రకాశము, స్వయంభువు, ఆత్మజ్ఞానము, ఆత్మతృప్తి మఱియు ఆత్మానుభూతమునై యున్నది. "తత్త్వమసి" (ఛాం.ఉ.6-8-7) యను వేదాంత వాక్య సహాయము వినా బ్రహ్మము సాక్షాత్కరింపఁబడదు.

బ్రహ్మసాక్షాత్కారము నొందినవాడు నిశ్శేషముగా పలువిధములగు దుఃఖములు మఱియు బాధలనుండి విముక్తుడగును. అతడు జీవితలక్ష్యము నొందును. కర్త, కర్మ యనెడి ద్వంద్వభావన నశించును. ఆత్మసాక్షాత్కార మొక కర్మఫలము కాదు. అది నీ సంకల్పము లేక కార్యఫలితముకాదు. జీవబ్రహ్మైక్య రహస్యము నెఱుంగుటయే దీనికి ఫలము. అవిద్య, లేక అజ్ఞానావరణను తొలగించుటయే శాస్త్రము యొక్క లక్ష్యము. అప్పుడు స్వయంప్రకాశమానమగు బ్రహ్మము తన ప్రతిభతో వెలుగొందును. మోక్షధామము శాశ్వతమైనది. కర్మఫలములవలె అది మార్పు నొందునది కాదు. కర్మ సంకల్పముపై ఆధారపడి యుండును; జ్ఞానము పదార్థము యొక్క స్వరూపముపై ఆధారపడి యుండును. కాని జ్ఞాతయొక్క సంకల్పముపై ఆధారపడి యుండదు.

వేదాంత గ్రంథములను సవ్యముగా అర్థమొనర్చుకొనుటచే మానవుడు మోక్షము నొందఁగలుగును. ఇందులకై అతడు అమానుషకృత్యము నొనర్చుటకై కృషియొనర్పబనిలేదు. మానవుని భయము నివారింపఁబడుటకై “ఇది కేవలము త్రాడు. పాము కాదు.” అని మాత్రము తెలిసికొనవలసి యుండును. శాస్త్రము కేవలము నైతిక మఱియు ధార్మిక కర్తవ్యములను మాత్రము నిర్దేశింపదు. అది ఆత్మను వ్యక్తమొనర్చి, మానవుడాత్మ సాక్షాత్కారము నొందుటకు సహకరించును. వేదాంత గ్రంథముల నాధారముగాఁగొని, శరీరతాదాత్మ్యతను నిషేధింపఁగలిగిన ముని దుఃఖము ననుభవింపఁజాలడు. కేవలము శరీరముతో తాదాత్మ్యము నొందియున్న అజ్ఞానియగు ప్రాపంచిక మానవుడు మాత్రమే దుఃఖము ననుభవించును.

స్వర్గలోకప్రాప్తి, పుత్రలాభము, వర్షమును పొందుట మొదలగునవి మానవునికి బ్రహ్మజ్ఞానమునందు కుతూహలము కలుగుటకై వేదములలో నేర్పఁబడినవి. ఇది సామాన్య మానవునికి భగవంతునిపై విశ్వాసము కలిగించును. వేదమంత్రములు వర్షమును కలిగించుటకు శక్తివంతములని తెలిసికొన్నప్పుడాతనికి వాటిపై విశ్వాసముకలిగి వాటి నధ్యయనము చేయుటకు సమకట్టును. క్రమముగా ఆతనికి భౌతికపదార్థములపై ఏవగింపు కలిగి, నిత్యానిత్య వివేకము ద్వారా ముక్తి నొందుటకు తీవ్రమైన వాంఛకలవాడగును. అతనికి బ్రహ్మముపై అభిరుచి ఏర్పడును. కావున వేదము లన్నియును బ్రహ్మముఁగూర్చియే ప్రబోధించును. స్వార్థపూరిత కర్మలగు యజ్ఞయాగాదులచే మానవుడు భౌతిక ఫలములను మాత్రముఁ బడయఁగలుగును. కాని అవి నిష్కామభావముతో ఒనర్పఁబడినప్పుడు హృదయశుద్ధిని కలిగించి, ఆత్మ జ్ఞానమునకు సహకరించును. కావున అనేక దేవతల పూజావిధానములను నేర్పునట్టి కర్మకాండయే బ్రహ్మజ్ఞానమునకు దోహద మగును. స్వార్థపరత్వము తొలగింపఁబడినప్పుడది నిజముగా బ్రహ్మమును పూజించుటయే యగును. ఇట్టి పూజచే హృదయశుద్ధి కలిగి బ్రహ్మవిచారణ యందభిరుచి ఏర్పడును. ఇది ఏలాటి ప్రాపంచిక వాంఛను కలిగింపదు.

కర్తవ్యనిర్వహణమే కర్మకాండ విచారణకు విషయము. కాని వేదాంత విచారణకు విషయము జ్ఞేయము, సాధ్యము, అస్తిత్వమైయున్న పూర్ణబ్రహ్మము. కర్మనిర్వహణపై ఆధారపడియున్న కర్తవ్య జ్ఞానఫలము, బ్రహ్మజ్ఞానఫలమునకు విభిన్నమై యుండును.

నీవు ఉపనిషత్తులలో "ఆత్మావా అరేద్రష్టవ్యః"(బృ.ఉ.2-4-5) "య ఆత్మాపహత పాప్మావిజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽ పిపాసస్సత్య కామస్సత్య సంకల్పస్సో న్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః" (ఛాం.ఉ.8-7-1) "ఆత్మేత్యేవోపాసీత" (బృ.ఉ. 1-4-7) "ఆత్మానమేవ లోక ముపాసీత"(బృ.ఉ.1-4-15) "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ముం.ఉ.3-2-9) అను వాక్యములనుఁగాంతువు. ఈ విషయములచే నీకు బ్రహ్మమును గుర్తెఱుంగు ఆకాంక్ష పొడమును. వేదాంత గ్రంథములు బ్రహ్మమును శాశ్వతము, సర్వజ్ఞము, నిరంకుశము నిత్య శుద్ధ బుద్ధ ముక్తము, ఆనందమయము, స్వయంప్రకాశము మఱియు అఖండముగా వర్ణించినవి. బ్రహ్మధ్యానమునకు ఫలముగా మానవుడు ముక్తిధామమును చేరును.

వేదాంత గ్రంథములు నుడివిన విషయమేమనగా:- "అశరీరగ్ం శరీరే ష్వనవస్థేష్వవస్థితం, మహాన్తం విభుమాత్మానం మత్వాధీరోనశోచతి" (కఠ.ఉ.2-22) "అప్రాణోహ్య మనాశ్శుభ్రః" (ముం.ఉ.2-1-2) "అసంగోహ్య యం పురుషః"(బృ. ఉ.4-3-15) ఇవన్నియును ముక్తిపథము కర్మఫలము లన్నింటికి భిన్నమైనదనియు, అది శాశ్వతమైన శరీరరహిత స్థితియనియును స్థిరపఱచుచున్నవి. మోక్షము కూటస్థ నిత్యము, శాశ్వతము, మార్పులేనిది. బ్రహ్మము ఆకాశమువలె సర్వవ్యాపకము (ఆకాశవత్సర్వగతః) నిర్వికారము, పరిపూర్ణము, నిరపేక్షము, అఖండమునై యున్నది. అది నిష్కళముకూడా. అది స్వయంప్రకాశము, స్వయంజ్యోతి.

కఠోపనిషత్తు నందు "అన్యత్ర ధర్మాదన్యత్రా ధర్మాదన్యత్రా స్మాత్కృతా కృతాత్, అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యతి తద్వద"(కఠ.ఉ.1-2-14) అని కలదు. మోక్షమే బ్రహ్మము. మోక్షము, లేక బ్రహ్మము కర్మఫలముకాదు. అది కర్మలకు శేషపూరణము వంటిదికాదు. అట్లైనచో అది అశాశ్వతమగును.

బ్రహ్మమును గుర్తెఱుంగుట బ్రహ్మమే యగుటవంటిది. "బ్రహ్మవేద బ్రహ్మైవభవతి" యని ముండకోపనిషత్తు నుడువుచున్నది. బ్రహ్మము స్వయంభువు.

కాబట్టి బ్రహ్మమును గుర్తెఱుంగుట కర్మ కాండవంటి ఒక క్రియకాదు. ఆత్మజ్ఞానము ద్వారా అవిద్య నశించినప్పుడు, మిథ్యాసర్పము తొలగింపబడినప్పుడు త్రాడు వ్యక్తమైనట్లు బ్రహ్మము స్వయముగా వ్యక్తమగును. నీ అంతరాత్మయే బ్రహ్మమగుటచే ఏలాటి క్రియచేతను నీవు దానిని పొందఁజాలవు. అజ్ఞానము తొలగింపబడినప్పుడది తన స్వంత ఆత్మగాతెలియఁబడును. "ఆత్మ సాక్షాత్కారింపఁబడవలయును" మొదలగు వాక్యములు సిద్ధాంతములు కావు. అది సాధకుని మనస్సును భౌతిక పదార్థముల నుండి త్రిప్పి, అంతర్ముఖమొనర్చుటకై ఉద్దేశింపఁబడినది.

బ్రహ్మము గుర్తెఱుంగబడునట్టి పదార్థము కాదు. "అన్యదేవత ద్విదితాదథో అవిదితాదధి" (కేన. ఉ. 1-3) "యేనేదం సర్వం విజానాతితం కేన విజానీయాత్" (బృ. ఉ. 2-4-14) "తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిదముపాసతే" (కేన. ఉ. 1-5) అను వాక్యములలో ఉపాసనకు ఫలము బ్రహ్మము కాదని స్పష్టముగా తెలుపఁబడినది.

బ్రహ్మము ఇదమిత్థమని శాస్త్రము వర్ణింపదు. బ్రహ్మము శాశ్వత పదార్థమనియు, ప్రత్యగాత్మ యనియు, అంతరాత్మ యనియు, అదిభౌతిక పదార్థము కాదనియు తెలుపుటయే దాని ఉద్దేశ్యము. ఆచార శుద్ధిచే మోక్షము, లేక బ్రహ్మము పొందఁబడునని తలంపరాదు. శాశ్వతమగు శుద్ధబ్రహ్మమునందు శుద్ధీకరణమను క్రియకు తావులేదు.

బ్రహ్మము సర్వులకు ఆత్మ; దానికై మనము ప్రయత్నింపలేము, లేక నిషేధింపలేము. పంచభూత సమ్మిశ్రితములై యుండుటచే పదార్థము లన్నియును నశించును. కాని ఆత్మ, లేక బ్రహ్మము అమరమైనది మఱియు మార్పులేనిది. అది శాశ్వతముగా శుద్ధమైనది మఱియు స్వతంత్రమైనది.

ఈ శరీరముతో తాదాత్మ్యము నొందువాడు దుఃఖము ననుభవించును. దేహాధ్యాస లేనిదియు, సర్వవ్యాపకమునగు శుద్ధ బ్రహ్మముతో తాదాత్మ్యము నొందు ముని దుఃఖము ననుభవింపడు. ఒక గర్విష్ఠుడైనయున్న ధనవంతుడు, తన ధనమును పోగొట్టుకున్నప్పుడు మిక్కిలి దుఃఖము ననుభవించును. కాని అతడు ప్రపంచము నుండి విముక్తుడైనప్పుడు మఱియు సన్న్యసించినప్పుడా ద్రవ్యనష్టముచే ప్రభావితుడు కాదు. బ్రహ్మజ్ఞానమునొందిన ముని పూర్వమువలె కేవలమొక ప్రాపంచిక మనుజుడు

కాదు. మునిపటివలె అతడీ ప్రపంచమునకు చెందినవాడు కాదు. ప్రాపంచికుడు ఆత్మజ్ఞానమునొందిన మునివలె అకర్త మఱియు అభోక్త కాఁజాలడు. శ్రుతులు నుడివినదేమనగా 'అశరీరం వావసంతం నప్రియా ప్రియే స్పృశతః' (ఛాం. ఉ. 8.12.1) పూర్వపక్షి ఇట్లు పలుకవచ్చును. "మానవుడు మరణించిన పిమ్మటనే అతనికి శరీరమునుండి ముక్తి లభించును. మానవుడు శరీరముతో తాదాత్మ్యము నొందుటకు కారణము అజ్ఞానమగుటచే ఇది మిక్కిలి పొరపాటు; బ్రహ్మజ్ఞానము నొందిన మఱియు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందిన ముని తాను జీవించి యున్నప్పుడే ఈ శరీరమునుండి విముక్తినొందును. శ్రుతియు ఇట్లు నుడువు చున్నది. "తద్యథాహి నిర్ల్వయనీ వల్మీకేమృతా ప్రత్యస్తాశయీా తైవమే వేదం శరీరం శేతే। అథాయమశరీరోఽమృతః ప్రాణోబ్రహ్మైవతేజ ఏవ" (బృ. ఉ. 4-4-7) బ్రహ్మమునకు నేత్రము లుండియు నేత్రములు లేనిదై యుండును. శ్రోత్రము లుండియు శ్రోత్రములు లేనిదై యుండును. వాక్కుండియు వాక్కులేనిదై యుండును. మనస్సుండియు మనోరహితమై యుండును. ప్రాణముండియు ప్రాణరహితమై యుండును. మునీశ్వరుడు ఏలాటి క్రియచేతను అంటుఁబడక యుండును.

వేదాంత గ్రంథములలో సృష్టిక్రమమునందు బ్రహ్మము సూచింపఁ బడలేదనియు, ఆదికారణము మఱియు సత్త్వరజస్తమోగుణోపేతమై యుండు ప్రధానమే సూచింపఁబడినదనియు సాంఖ్యులు పలుకుదురు. సృష్టిక్రమమును ప్రబోధించు వేదాంత గ్రంథము లన్నియును ప్రకృతి, ఆత్మ, లేక పురుష సంబంధముచే కార్యకారణ ఫలితముగా ప్రపంచోత్పత్తిని సూచించినవి. కణాదులు (వైశేషికులు) ఈ విశ్వమునకు దేవుడు విశేషకారణమనియు, అణువులు పదార్థకారణమనియును పలుకుదురు.

సాంఖ్యులు పలుకునదేమనగా "పదార్థములన్నింటికి కారణమగుటచే సర్వశక్తిత్వమును ప్రధానమున కొసంగవలయును. అది సర్వజ్ఞము కూడానై యున్నది. జ్ఞానమే సత్వగుణమునకు ఫలము. ప్రధానమునందు సత్త్వగుణమొక అంశము. కావున ప్రధానమే సర్వజ్ఞమైయున్నది. ప్రత్యేక శుద్ధబుద్ధితో కూడియున్న ఆత్మ లేక పురుషునికి సర్వజ్ఞత్వము, లేక అల్పజ్ఞత్వము నాపాదించుట పాడిఁగాదు. కావున చైతన్యరహితమై యున్నను ప్రధానమే సర్వజ్ఞమైనదని వేదాంత గ్రంథములు నుడువుచున్నవి."

“ బ్రహ్మమునకు కర్మేంద్రియములు లేవు. ప్రధానమునందు మూడంశము లుండుటచే మట్టి అనేక పదార్థములుగా మార్పునొందునట్లు పరిణామ మొందుటకు సమర్థమై యున్నది. కాని అమిశ్రమము, అఖండము, నిర్వికారమైయుండు బ్రహ్మమునకట్టి సామర్థ్యము లేదు. కావున వేదాంత గ్రంథములన్నియును స్పష్టముగా ప్రధానమే ప్రపంచమునకు ప్రథమ కారణముగా ప్రబోధించుచున్నవి.” ఇట్టి నిర్ణయమునకు శ్రీ వ్యాసులవారు ఈ క్రింది సూత్రమునందు సమాధానము నొసంగుచున్నారు.

# 5. ఈక్షత్యధికరణము

## (5–11 సూత్రములు)

### 1–1–5. ఈక్షతేర్నాశబ్దమ్

ప్రథమకారణమైన ప్రధానమునకు ఉపనిషత్తులచే ఆలోచించుట, లేక చూచుట ఆరోపింపఁబడినది. కాని ప్రధానము శాస్త్రాధారము కాకుండుటచే ఉపనిషత్తులచే సూచింపఁబడిన ప్రథమకారణము కాదు.

ఈక్షతేః = చూచుటచే (ఆలోచించుట) న = కాదు, అశబ్దమ్ = శబ్ద ప్రమాణ శూన్యము.

5 నుండి 11 వరకుఁగల సూత్రములు సాంఖ్యవాదములను ఖడించి బ్రహ్మమే ప్రథమ కారణముగా నిరూపించును.

శాస్త్రాధారము కాకుండుటచే జడమైయున్న ప్రధానమునకు వేదాంత గ్రంథములలో స్థానములేదు. ఏల? శ్రుతియందు చూచుట, లేక ఆలోచించుట కారణమున కారోపింపఁబడినది. సృష్టికి పూర్వము ప్రథమ కారణము సంకల్పించెను, లేక ఊహించెనని శ్రుతియందు చెప్పఁబడినది. ఛాందోగ్యోపనిషత్తునందు “సత్త్వేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్, తదైక్షత బహుస్యాంప్రజాయే యేతి తత్తేజోఽసృజత” (6–2–2,3) అని చెప్పఁబడినది. ఐతరేయోపనిషత్తు “స ఈక్షత లోకాన్నుసృజా ఇతి, స ఇమాంల్లోకాన సృజత” (1–1–1,2) అని నుడివినది.

ప్రశ్నోపనిషత్తులో "స పురుషోయస్మిన్నేతాః షోడశకలాః ప్రభవంతీతి, స ఈక్షాంచక్రే, స ప్రాణమ సృజత" (6-2,3,4) అని చెప్పఁబడినది. జడమైన ప్రధానము నందు ఏలాటి ఊహ, లేక సంకల్పముండజాలదు. ప్రథమకారణము బ్రహ్మము వలె చైతన్యవంతమై యుండిననే అది సాధ్యమగును.

కాల్చఁబడిన ఇనుము దహించుటచే అగ్నియని చెప్పఁబడినట్లు, ప్రకృతియు తాత్కాలికముగా ఇట్టి గుణమును కలిగియుండునని చెప్పినచో దానికి సమాధానమేమనగా:- సృష్టి శక్తి మఱియు సర్వజ్ఞత బ్రహ్మమునందు ప్రాముఖ్యమై యుండగా, అప్రధానమైన ప్రకృతియందు వీటి నారోపించుటేల?

బ్రహ్మము యొక్క జ్ఞానము శాశ్వతమైనది. జ్ఞానేంద్రియము లాతని కనావశ్యకములు. అతనికి శరీరమవసరములేదు. అతని జ్ఞానము నిరాటంకమైనది. శ్వేతాశ్వతరోపనిషత్తు ఇట్లు నుడివినది. "నతస్యకార్యం కరణంచ విద్యతే, నతత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే, పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే, అపాణిపాదో జవనోగ్రహీతా పశ్యత్యచక్షుస్స శృణోత్యకర్ణః, సవేత్తివేద్యం నచతస్యాప్తివేత్తా తమాహురగ్ర్యం పురుషం మహాన్తమ్"(6-8, 3-19).

సృష్టికర్త జీవుడై శరీరమునందు ప్రవేశించినాడని చెప్పఁబడుటచే, నీవు ప్రధానమునందు చేతనత్వమును తాత్కాలికముగా నైనను ఆరోపింప జాలవు. జడపదార్థము చైతన్యవంతమైన ఆత్మగా ఎట్లు పరిణమించును? బ్రహ్మమును గుర్తెఱుంగుటచే సర్వము తెలియఁబడునని వేదాంత గ్రంథములు నొక్కి వక్కాణించుచున్నవి. ఇఁక జడపదార్థమును తెలిసి కొనుటచే ఆత్మలను గుర్తెఱుంగుటెట్లు?

"ఈక్షతేః" అను శబ్దమును ప్రయోగించిన శాస్త్రమునకు విరుద్ధమై యుండుటచే, ప్రధానము ప్రపంచమునకు కారణమైయున్న "సత్పదార్థము" కాదు. "జీవులందఱికి దేవుడైనవాడే ఈ ప్రపంచమునకు సృష్టికర్త"యను వాక్యము శ్వేతాశ్వతరోపనిషత్తునందున్నది. కావున ఈ ప్రపంచమునకు కారణము బ్రహ్మమేకాని, ప్రధానము కాదను విషయము సుస్పష్టము.

చైతన్యమే ప్రపంచమునకు కారణమను విషయమును వేదాంత గ్రంథములన్నియు ఏకధాటిగా నుడువుచున్నవి. ప్రధానమునందు రూపము

లన్నియును బీజరూపమునందుండును. ప్రళయకాలమందు ప్రపంచమంతయు దానియందు సూక్ష్మమైన బీజరూపమునందున్నను, అది జడమై యుండుటచే సృష్టికర్తయని చెప్పఁబడఁజాలదు. ఒక చైతన్య పదార్థము సంకల్పించి ఈ విశ్వమును సృష్టించెనని శ్రుతులు నొక్కి చెప్పుచున్నవి. ఛాందోగ్యోపనిషత్తునందు“ ఆది యందు సత్తుండెను. అది అద్వితీయమై యుండెను. అది అనేకమగుటకై సంకల్పించెను. అది అగ్నిని సృష్టించెన”ని చెప్పఁబడినది.

ప్రధానమునందు త్రిగుణములు సమత్వమునందుండుటచే ప్రధానము సర్వజ్ఞమై యున్నదని సాంఖ్యులు వాదింతురు. గుణసామ్యావస్థయందు ప్రధానము సర్వజ్ఞమై యున్నచో సాత్త్విక జ్ఞానమును రాజసిక, తామసిక అజ్ఞానము కుంటువడఁజేయుటచే అది కించిజ్ఞమే యని చెప్పవలసి యుండును. కావున ఒకవైపు సత్త్వము దానిని సర్వజ్ఞమొనర్చినచో మరియొక వైపు రాజస తామసములు దానిని కించజ్ఞమొనర్చును. ఇది నిజముగా పారస్పరిక భిన్నత్వమును కలిగియున్నది. ఇఁక సాక్షిమాత్రునికి సంబంధించని సత్త్వముయొక్క మార్పుదశ జ్ఞానమని చెప్పబడజాలదు. జడమైన ప్రధానము ఇట్టి సూత్రమునకు భిన్నమైయున్నది. కావున సర్వజ్ఞత్వమును ప్రధానమునకారోపించుట తగదు.

ఈ వృత్తాంతము యోగుల విషయమునందు వర్తించదు. వారు సత్త్వగుణాధిక్యతచే సర్వజ్ఞత్వమును బడయుదురు. సత్త్వమునకు భిన్నముగా ఆతనియందు చైతన్యుడగు సాక్షి స్వరూపుడున్నాడు. దైవానుగ్రహముచే యోగి భూతభవిష్యద్ జ్ఞానమును బడసినప్పుడు బ్రహ్మజ్ఞానముయొక్క శాశ్వతత్వమును మఱియు అనంతత్వమును నీవు నిషేధింపలేవు. మార్పులేని శుద్ధచైతన్య తత్వమే బ్రహ్మము. బ్రహ్మమునకు సర్వజ్ఞత్వము మఱియు సృష్టికార్యము సాధ్యము కాదని పలికినచో, బ్రహ్మము సర్వజ్ఞమై యుండియు తన మాయా శక్తిచే సృష్టికార్యము నొనర్చునని చెప్పవలసియుండును. నిజమునకు ఆకాశమేకమేనైయున్నను ఉపాధిభేదముచే ఘటాకాశము మఠాకాశమని మనమెట్లు పలుకుదుమో అట్లే శరీరము, మనస్సు మున్నగు ఉపాధుల కారణములచే జీవుడు మరియు ఈశ్వరుడనెడి భేదభావము ఏర్పడుచున్నది.

సాంఖ్యులు మరియొక ఆక్షేపణను లేపుదురు. అగ్ని మరియు జలము కూడా చైతన్యవంతములేనని వారు చెప్పుదురు. “తత్తేజ ఐక్షత బహుస్యాం

ప్రజాయేయేతి తదపోఽ సృజత తా ఆపఐక్షంత బహ్వ్యస్స్యామ ప్రజాయే మహీతితా అన్నమ సృజన్త”(ఛాం.ఉ.6-2-3,4) ఇచ్చట అగ్ని జలములు జడపదార్థములైనను వాటికి సంకల్పమారోపించఁబడినది. ఇదేవిధముగా ఉపనిషత్తులలోఁగల సత్తుయొక్క సంకల్పమును ప్రధానమునందు కూడా ఆరోపించవచ్చును. కావున ప్రధానము జడమైనను అది ఆదికారణము కావచ్చును.

ఈ క్రింది సూత్రము ఈ వాదమును ఖండించును.

## 1-1-6 గౌణశ్చేన్నాత్మ శబ్దాత్

చూచుట, లేక సంకల్పించుటయను శబ్దము గౌణముగా ప్రయోగింపఁబడినదని చెప్పినచో, అట్లుకాదు. ఏలననగా ప్రాపంచిక కారణమునకు ఆత్మ శబ్దము ప్రయోగింపబడినది.

గౌణః = పరోక్షము, చేత్ = ఒక వేళ, న = కాదు, ఆత్మ శబ్దాత్ = ఆత్మ శబ్ద ప్రయోగము వలన.

“సత్” శబ్దము జడమైన ప్రధానము, లేక ప్రకృతికై ప్రయోగింపఁబడినదనియు “ సంకల్పించుట యనునది అగ్ని మఱియు నీటికివలె గౌణముగా ప్రయోగింపఁబడినదనియును నీవు పలుకుదువు. జడపదార్థములు ఒక్కొక్కప్పుడు జీవముఁగల పదార్థములుగా వర్ణింపఁబడునని నీవు వాదింపవచ్చును. కావున ప్రధానము నిరాటంకముగా ప్రపంచమునకు నిమిత్తకారణమై యున్నదని నీవు చెప్పుదువు. కాని దీనికి స్థానము లేదు. ఇది నిశ్చయముగా అప్రతిపాద్యము. కారణమేమనగా శ్రుతియందు ప్రపంచమునకు కారణముగా ఆత్మ శబ్దము పేర్కొనఁబడినది. ఈ విశ్వమునకు సారమదియే. అదియే సత్యము, అదియే ఆత్మ. ఓ శ్వేతకేతూ! అదియే నీవై యున్నావు.” (ఛాం.ఉ 9. 6-8-7) (ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువునకు ఉపదేశించిన వాక్యము).

ఛాందోగ్యములో 6-2వ పరిచ్ఛేదము “స దేవ సోమ్యే దమగ్ర ఆసీత్”తో ప్రారంభమగును. అగ్ని, జలము, పృథ్విని సృష్టించిన తర్వాత “జీవునిగానే నీ మూటియందు ప్రవేశించి నామరూపములుగా వికసింతునుఁగాక!” యని సంకల్పించెను. (ఛాం.ఉ.6-3-2) ప్రథమ కారణమైన సత్తు చైతన్యసూత్రమైన

జీవుడు లేక ఆత్మయై యున్నది. జీవ శబ్దముచే శరీరమును పాలించినట్టి మఱియు ప్రాణమునకాధారమైయున్నట్టి చైతన్య సూత్రమని తెలియవలయును. ఇట్టి సూత్రము జడమైన ప్రధానమునకు ఆత్మ ఎట్లగును? ఆత్మ శబ్దముచే జీవుని స్వస్వరూపముగా గుర్తెఱుంగ వలయును. కావున చైతన్యుడగు జీవునికి జడమైన ప్రధానముయొక్క స్వభావముండదనుట సుస్పష్టము. అగ్ని జలముల సంకల్పము సత్తుచే అవి పరిపాలింపఁబడుటపై ఆధారపడియుండును. కావున "సంకల్పమ"ను శబ్దము గౌణముగా ప్రయోగింపఁబడినదని పలుకుట అయుక్తము.

ఇప్పుడు సాంఖ్య మొక నూతన ఆక్షేపణతో ముందుకు వచ్చును. జడమైయున్నను ప్రధానముపై ఆత్మ శబ్దము ప్రయోగింపఁబడవచ్చునని అతడనును. తన కోరికలన్నింటిని నేరవేర్చునట్టి "గోవిందుడు నా ఆత్మయే" యని ఒక రాజనును. ఒక రాజును మంత్రి ఎట్లు సేవించునో, అదే విధముగా ప్రధానము ఆత్మయొక్క భోగ మోక్షములకై సేవించును. కావున ఆత్మ శబ్దము ప్రధానమునకు వర్తించును, లేక భూతాత్మ ఇంద్రియాత్మలకు వలె మఱియు జ్యోతియను శబ్దము జ్యోతిష్టోమ మునకు మఱియు దీపమునకు వలె ఆత్మ శబ్దము జడచైతన్య పదార్థములకు రెండింటికి వర్తించును. కావున ఆత్మ శబ్దమును ప్రధానమునకు కూడా ప్రయోగింపవచ్చును. అయితే ఆత్మ శబ్దముచే "సంకల్పమ"ననునది విశ్వ కారణమున కారోపింపఁబడినదనుట గౌణ మెట్లు కాదు?

ఈ వాదమును ఈ క్రింది సూత్రము ఖండించును.

## 1-1-7 తన్నిష్ఠస్యమోక్షోపదేశాత్

ఆత్మ శబ్దముచే ప్రధానము తెలియఁబడదు. కారణమేమనగా:- ఆ సత్పదార్థమునందు నిష్ఠ కలిగి యుండువానికే మోక్షమని చెప్పబడినది.

తత్ = దానియందు, నిష్ఠస్య = నిష్ఠకలిగియుండువానికి, మోక్షోపదేశాత్ = మోక్షమని ఉపదేశింపఁబడుటచే.

ప్రధాన మీ ప్రపంచమునకు కారణముకాదని ఈ సూత్రము నిరూపించుచున్నది.

జడమైన ప్రధానము ఆత్మ శబ్దముచే తెలియఁబడదు. కారణమేమనగా ఛాందోగ్యమిట్లు నుడువినది. "ఓ శ్వేతకేతూ, ఆ సూక్ష్మమైన సత్తే ఆత్మ, తత్త్వమసి"

శ్వేతకేతువు వంటి చైతన్య స్వరూపుడగు మనుజుడు జడమైన ప్రధానముతో తాదాత్మ్యము నొందదు. సచ్ఛబ్దముచే జడమైన ప్రధానము తెలియఁబడినచో "తత్త్వమసి" మహావాక్యము యొక్క అర్థము "త్వం జడమసి" యగును. ప్రబోధము యొక్క సారాంశమిట్టిదిగా పరిణమించును. నీవు అచేతనుడవు. లేక జడస్వరూపుడవు మరియు ఇట్టి జడత్వము నొందుటయే ముక్తి యగును. అప్పుడు శ్రుతులన్నియు దోష భూయిష్టములగును. శాస్త్రములన్నియు మానవుని శ్రేయస్సునకు వ్యతిరేక భూమికలై సవ్యజ్ఞానదాయకములు కాకుండును. నిర్దుష్టములగు శ్రుతి ప్రబోధములను ఇట్లు నశింపఁజేయుట భావ్యముకాదు. శ్రుతులు సవ్యజ్ఞానము నొసంగజాలవని చెప్పినచో ఇది నిశ్చయముగా అసంగతమే యగును.

సత్తు నెవ్వడాశ్రయించునో, సత్తునందెవ్వడు స్థిర ప్రతిష్ఠితుడై యుండునో, అతడే పరమపదము నొందునని శ్రుతులు నుడువుచున్నవి. అది జడమైన ప్రధానమును ధ్యానించుటచే పొందఁబడజాలదు. "తస్యతావదేవచిరం యావన్న విమోక్షేఽథ సంపత్స్యఇతి" (ఛాం.ఉ.6-14-2).

సవ్యజ్ఞానమును ప్రబోధించు శాస్త్రమొక వేళ మోక్షాపేక్ష కలిగియు దాని మార్గము తెలియని మనుజుని చూపినచో, అతడు జడమైన దానినాత్మగా తలచిన వాడై ఒక గ్రుడ్డివాడు ఎద్దుయొక్క తోకను పట్టుకొని తన గ్రామమునకు వెళ్ళదలంచినట్లు యెన్నటికిని తన నిజస్వరూపమగు ఆత్మానుభూతి నొందఁజాలడు.

కావున "ఆత్మ" శబ్దము సత్పదార్థమునకు కేవలము గౌణముగా ప్రయోగింపఁబడలేదు. అది చైతన్యమునకే ప్రాధాన్యము నొసగి ప్రయోగింపఁ బడినది. ప్రధానకారణమైన "సత్తు" చైతన్యాత్మనే సూచించును, కాని ప్రధానమును కాదు. ప్రపంచమునకు కారణమైన సృష్టికర్తకు శరణాగతుడగువాడు మోక్షధామము నొందునని శ్రుతులు వాకొనుచున్నవి. గ్రుడ్డిదగు ప్రధానమునకు ప్రపన్నుడైన వానికి ముక్తి కలుగుననుట భావ్యము కాదు. కావున ప్రధాన మీ ప్రపంచమునకు సృష్టికర్త కాఁజాలదు.

## 1-1-8 హేయత్వా వచనాచ్చ

మఱియు "ఆత్మ" శబ్దముచే ప్రధానము తెలియఁబడదు. ఏలననగా "సత్తు" నిషేధింపఁబడునట్లు శాస్త్రములు సూచించుటలేదు.

హేయత్వ = త్యజింపఁదగినదను, అవాచనాత్ = శాస్త్ర వచనము లేకుండుటచే, చ = మఱియు.

ప్రధాన మీ విశ్వమునకు సృష్టికర్త కాదనుటకు మరియొక కారణ మీ సూత్రమునందొసంగఁబడినది.

చిన్న నక్షత్రమైన "అరుంధతి"ని నీవొక మనుజునికి చూపఁదలచినచో, అది అరుంధతి కాకున్నను దానికి ప్రక్కనున్న ఒక పెద్ద నక్షత్రమును చూపించి, "ఇదియే అరుంధతి" యని నీవు పలుకుదువు. అప్పుడు నీవు నిజమైన అరుంధతిఁగూర్చి చెప్పుదువు. అదే విధముగా ఆచార్యుడొక శిష్యునకు ఆత్మనుఁగూర్చి చెప్పఁదలచినచో క్రమముగా స్థూలమైన అనాత్మలను నిషేధించి తుట్టతుదకు ప్రధానమును కూడా నిషేధించును. కాని ఇట్టి ప్రబోధమిచ్చుట కానఁబడదు. ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయ మంతయు సత్తే "ఆత్మ" యని నిరూపించినది.

కారణముపై తన మనస్సును కేంద్రీకరించి ధ్యానించుమని ఒక సాధకుడు ప్రబోధింపబడెను. జడమైన ప్రధానమునుఁగూర్చి ధ్యానించినచో నిశ్చయముగా అతడు ముక్తినిఁబడయఁజాలడు. ప్రపంచమునకు కారణము ప్రధానమే యని శ్రుతి పలికియుండినచో, ముక్తికై మరియొక కారణమును వెదకుమని అది సాధకునికి చెప్పియుండెడిది. కావున ప్రధానము ఆధ్యాత్మిక విచారణయొక్క చరమదశ, లేక లక్ష్యము కాఁజాలదు.

"చ" యను శబ్దము పూర్వభూమిక కిది మరియొక నిషేధాత్మక కారణమను విషయమును సూచించును.

"ఏది తెలిసినచో సమస్తము తెలియఁబడునో, అది ఏది?" యను ప్రశ్నతో ఆరవ అధ్యాయము ప్రారంభింపఁబడును. ఓ బిడ్డా! శ్రోత్రముచే ఏది వినఁబడదో, నేత్రముచే ఏది చూడఁబడదో, మనస్సుచే ఏది తెలియఁబడదో అట్టి ప్రబోధమును గూర్చి నీవు అడిగితివా? ఒకవేళ "సత్తే" ప్రధానమైనచో, ప్రధానమే ప్రాథమిక కారణమైనచో, ప్రధానము తెలియఁబడినచో సర్వము తెలియఁబడవలసి యుండును. కాని ఇది సత్యము కాదు. ప్రధానమునకు భిన్నమైన భోక్త (ఆత్మ) ఏదైతే ప్రధానము యొక్క కార్యము కాదో, అది ప్రధానమును తెలిసికొనుటచే తెలియఁబడదు. ఒకవేళ

“సత్తే” ప్రధానమైయున్నచో, దానినుండి వైఁదొలగుమని శ్రుతులు మనకు చెప్పియుండెడివి. కాని ఇది నిజముకాదు. దానిని తెలిసికొన్నచో సమస్తము తెలియఁబడునని అది మనకు హామీ యొసంగుచున్నది. జడపదార్థమును తెలిసికొన్నచో ఆత్మ ఎట్లు తెలియఁబడును? భోజ్యమును తెలిసి కొన్నచో భోక్త ఎట్లు తెలియఁబడును? కావున సచ్ఛబ్దముచే ప్రధానము సూచింపఁబడదు. శ్రుతి ననుసరించి దేనిని తెలిసికొన్నచో సమస్తము తెలియబడునో అట్టి ప్రథమ కారణమదికాదు.

దీనికై సూత్రకారుడు మరియొక కారణమును చూపుచున్నాడు.

## 1-1-9 స్వాప్యయాత్

జీవుడు స్వాత్మయందు లయించుటచే, ఆత్మప్రధానము కాజాలదు.

స్వాప్యయాత్ = తన సొంత ఆత్మయందు లయించుటచే.

ప్రధానము విశ్వకారణము కాదని నిరూపించు విషయమింకను విస్తరింపఁబడుచున్నది.

పదార్థములను తెలిసికొనుటకై మనస్సు ఇంద్రియములు మరియు శరీరములు పనిచేయుస్థితియే జాగ్రదవస్థ యనఁబడును. జీవుడు స్వయముగా స్థూలశరీరముతో తాదాత్మ్యము నొందును. స్వప్నావస్థయందు శరీరము, ఇంద్రియములు విశ్రమించును. మఱియు భౌతిక పదార్థములచే కలిగిన సంస్కారముచే మనస్సు ఆటలాడును. మనస్సు వాసనాజాలము నల్లును. గాఢనిద్రయందు జీవుడు మానసిక సంకుచితత్వము నుండి విడివడును. అతడజ్ఞాన దశయందున్నను తన స్వాత్మయందు విశ్రమించును.

“సత్” శబ్దముచే సూచింపఁబడిన కారణము నాధారముగాఁగొని శ్రుతిచెప్పునదేమనగా “స్వప్నాంతంమే సోమ్యవిజానీహీతియత్రై తత్పురుష స్స్వపితి నామసతా సోమ్యతదా సంపన్నోభవతి స్వమపీతోభవతి తస్మాదేనం స్వపితీత్యాచక్షతే స్వంహ్యపీతోభవతి” (ఛాం.ఉ. 6-8-1) జీవుడు గాఢనిద్ర యందు విశ్వాత్మయందు లయించుననుటచే శ్రుతియందు పరమసత్యముగా తెలుపఁబడిన ఆత్మయే ప్రపంచమునకు కారణమగును. కాని ప్రధానము కాదు.

జీవుడు సత్తునందు లయించునని ఛాందోగ్యోపనిషత్తు స్పష్టముగా నుడివినది. చైతన్యాత్మ జడమైన ప్రధానమునందు లయింపదనుట సుస్పష్టము, కావున ప్రథమ కారణమని చెప్పఁబడిన "సత్తు" ప్రధానము కాజాలదు. ఏ విశ్వచైతన్యమునందు చైతన్యాత్మలన్నియు లయించునో, అదియే సత్తనఁబడును. కాని ప్రధానము కాదు.

ప్రధానము కారణము కాదనుటకై మరియొక కారణము మరియొక సూత్రము నందు చూపఁబడినది.

## 1-1-10 గతి సామాన్యాత్.

వేదాంత గ్రంథములయందు సర్వసామాన్యమైన దృష్టియుండుటచే బ్రహ్మమే కారణముగా గ్రహింపఁబడినది.

గతి = దృష్టి, సామాన్యాత్ = సర్వసామాన్యమై యుండుటచే.

విశ్వకారణము ప్రధానము కాదని నిరూపించు వాదమింకను కొనసాగు చున్నది.

చైతన్యసూత్రమే ప్రథమకారణమని వేదాంత గ్రంథములన్నియు ఏకథాటిగా సూచించుచున్నవి. కావున బ్రహ్మమే కారణమని తెలియవలయును. ప్రపంచము నకు కారణము బ్రహ్మచైతన్యమే యని వేదాంత గ్రంథములన్నియు నుడివినవి. శ్రుతులిట్లు నుడువుచున్నవి. "యథాగ్నేర్వి స్ఫులింగా విప్రతిష్ఠేరన్నేవమే వైతస్మాదాత్మనః ప్రాణాయథాయతనం విప్రతిష్ఠంతే ప్రాణేభ్యో దేవాదేవేభ్యో లోకాః" (కౌ.ఉ.3-3) "ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః" (తై.ఉ.2-1) "ఆత్మత ఏవేదం సర్వమ్" (ఛాం.ఉ.7-26-1) ఈ పరిచ్ఛేదములన్నియును ఆత్మయే కారణమని తెలిపినవి. "ఆత్మ" శబ్దము చేతన పదార్థమును సూచించును. సమస్త వేదాంత గ్రంథముల సమరసదృష్టినిఁబట్టి సర్వజ్ఞమగు బ్రహ్మమే ప్రపంచమునకు కారణమని చెప్పవలసి యుండును.

ఈ నిశ్చయమునకు మరియొక కారణ మీ క్రింది సూత్రము నందొసంగఁ బడినది.

## 1-1-11 శ్రుతత్వాచ్చ

శ్రుతియందు సూటిగా చెప్పఁబడుటచే సర్వజ్ఞమగు బ్రహ్మము మాత్రమే ఈ విశ్వమునకు కారణమై యున్నది.

శ్రుతత్వాత్ = శ్రుతియందు చెప్పఁబడుటచే, చ =కూడా.

ప్రపంచమునకు కారణము ప్రధానముకాదను వాదమింకను కొనసాగుచున్నది.

సర్వజ్ఞుడగు ప్రభువే ఈ విశ్వమునకు కారణము. ఈ విషయము శ్వేతాశ్వతరోపనిషత్తు (6-9) నందు తెలుపఁబడినది. "నతస్యకశ్చిత్పతిర స్తిలోకే నచేశితానై వచ తస్యలింగం, సకారణం కరణాధిపాధిపోన చాస్యకశ్చిజ్జనితాన చాధిపః" ఈయధ్యాయములోని "అతడ" ను శబ్దము సర్వజ్ఞుడగు ప్రభువును సూచించును. కావున సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడగు బ్రహ్మమే ప్రథమ కారణమనియు; జడమైన, లేక అచేతనమైన ప్రధానము గాని, మరియొకటిగాని కాదనియును నిశ్చయింపఁబడినది.

ఇట్లు 1-1-11 వ సూత్రమునందు నిరూపింపఁబడినట్లు వేదాంత గ్రంథములన్నియు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడగు ప్రభువు ప్రపంచముయొక్క సృష్టి స్థితి ప్రళయములకు కారణమైయున్నాడని స్పష్టముగా తెలుపుచున్నవి. సమరసదృష్టి (1-1-10) నిఁబట్టి శ్రుతులన్నియును చేతనమగు కారణమునే అంగీకరించు చున్నవని ఇదివరకే చెప్పఁబడినది.

12వ సూత్రమునుండి ప్రథమాధ్యాయాంతము వరకు ఒక నూతనాంశము చర్చింపఁబడినది. ఉపనిషత్తులు నిర్గుణ బ్రహ్మము, సగుణబ్రహ్మ మనెడి ద్వివిధ బ్రహ్మములను గూర్చి నుడివినవి.

ఉపనిషత్తులు పలుకునదేమనగా "ద్వైతమున్నంతవరకు ఒకడు మరియొకనిని చూచును. కాని ఇదియంతయు ఆత్మయే యైనప్పుడు, అతడు మరియొక దానినెట్లు చూచును?" (బృ. ఉ. 4-5-15) ఎవడైనను ఎచ్చోట ఏమియు చూడడో, ఏమియు వినడో, ఏమియు తెలిసికొనడో, అదియే అనంతమైన "భూమ" యని చెప్పఁబడును. ఎచ్చట ఎవడైనను దేనినైనను చూచునో, దేనిఁగూర్చియైనను వినునో,

దేనిఁగూర్చియైనను అర్థమొనర్చు కొనునో అదియే అంతవంతమని చెప్పఁబడును. "ఏది భూమయో అదియే అమృతము, అల్పమైనదే మర్త్యమని చెప్పఁబడును." (ఛాం.ఉ.7-24-1) "సమస్త నామరూపములను సృష్టించినట్టి బుద్ధిమంతుడు వాటిని నామములతో పిలచుచు కూర్చొనియుండును."(తై. ఆ. 3-12-7).

"నిష్కలం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనం, అమృతస్యపరం సేతుం దగ్ధేంధనమివానలమ్" (శ్వే. ఉ. 6-19) "నేతినేతి" (బృ. ఉ. 2-3-6) "అస్థూల మనణు" (బృ. ఉ. 3-8-8).

బ్రహ్మము అజ్ఞానమునకు, జ్ఞానమునకున్నూ మూలభూతమైయుండుటచే గ్రంథములన్నియు దీనిని ద్వంద్వస్వభావము కలదానిగా వర్ణించినవి. సగుణ బ్రహ్మము అజ్ఞానతత్త్వమునావరించియుండును. ఇది నానావిధ ఫలముల నొసంగునట్టి ఉపాసనకు మూలమైయున్నది. ఇది కొందఱికి పారిశుద్ధ్యమును, కొందఱికి క్రమముక్తిని, మరికొందఱికి కర్మఫలములనొసంగును. అది అజ్ఞానమునకు నిలయమైనప్పుడు భక్తుల రకములు, భజనీయము, పూజా విధానములు దానియందుండును. వివిధగుణభేదముచేతను, ఉపాధిభేదముచేతను ఉపాసనావిధానములు భేదించును. వివిధగుణముల ననుసరించిన పూజా విధానమునుఁబట్టి భక్తిఫలములు కూడా విభేదించును. "మానవుడెట్లు పూజించునో అట్లేయగున"ని శ్రుతి వచనము. "అథ ఖలుక్రతుమయః పురుషోయథాక్రతు రస్మింల్లోకే పురుషోభవ తితథేతః ప్రేత్యభవతి సక్రతుం కుర్వీత" (ఛాం. ఉ. 3-14-1) సగుణ బ్రహ్మోపాసనచే సద్యో ముక్తి కలుగదు. అది కేవలము క్రమముక్తినిఁ బడయుటకు సహకరించును.

వేదాంతులు, లేక జ్ఞానుల యొక్క నిర్గుణ బ్రహ్మము గుణోపాధులచే విముక్తమై యుండును. అది నిరుపాధికము అనగా ఉపాధి, లేక మాయనుండి విముక్తమై యుండును. ఇది జ్ఞానమునకు విషయము. నిర్గుణ బ్రహ్మజ్ఞానము మాత్రమే సద్యోముక్తికి దారితీయును.

కొన్ని వేదాంత పరిచ్ఛేదములు సంశయగ్రస్తమగు భూమికను కలిగి యున్నవి. బుద్ధిశక్తిచే నీవు వాటి నిజతత్త్వము నన్వేషించవలసి యుండును. సద్యోముక్తిని కలిగించు ఆత్మజ్ఞానము నొందుటకై నీవు వేదాంత గ్రంథార్థమును పరిశోధింపవలసి

యుండును. 1-1-2 సూత్రముననుసరించి జ్ఞానమున కాధారము సగుణ బ్రహ్మమా? లేక నిర్గుణ బ్రహ్మమా? యను సంశయము మొలకెత్తవచ్చును.

బ్రహ్మము స్పష్టముగా గుణోపాధులచే వర్ణింపఁబడినట్లు అనేక ఉపనిషత్తులలో నీవు కాంచఁగలుగుదువు. బ్రహ్మజ్ఞానముచే సద్యోముక్తి కలుగునని శ్రుతులు వాకొనుచున్నవి. ఉపాధులచే సంకుచితమైయున్న బ్రహ్మమును పూజించుటచే సద్యోముక్తి కలుగదు. కాని ఈ గుణోపాధులే సర్వస్వమని తలంపక, ఇవి కేవలము బ్రహ్మమును సూచించునవని భావించి, నిర్గుణబ్రహ్మము నుపాసించువారు సద్యోముక్తినిఁబడయుదురు. కావున శ్రుతివాక్యములను విచారణాశక్తి, బుద్ధిశక్తులచే క్షుణ్ణముగా పరిశోధించి నిజమైన భావార్థమును నీవు గ్రహింపవలసియుండును.

వేదాంత గ్రంథమునందు కొన్ని స్థలములలో సగుణబ్రహ్మము చెప్పఁబడినదో, లేక జీవునిఁగూర్చి చెప్పఁబడినదో నీవు తెలిసికొనవలసియుండును. సంశయగ్రస్తమగు భూమికలోని నిజతత్త్వమును నీవు విచారణాశక్తిచేతను, బుద్ధిశక్తిచేతను కనుగొనవలసి యుండును. తీక్ష్ణమైన, సూక్ష్మమైన, శుద్ధమైన బుద్ధిఁగల వివేకియగు ముముక్షువునకు దీనినర్థమొనర్చుకొనుట తేలికయే. గురువుయొక్క సహకారమెల్లప్పుడు ఆవశ్యకమై యుండును.

ఒక విభాగమునకు చెందిన పదునొకండు సూత్రములను గూర్చిన వ్యాఖ్యానమింతటితో ముగిసినది.

# 6. ఆనందమయాధి కరణము
# (12-19 సూత్రములు)

## 1-1-12 ఆనందమయోఽ భ్యాసాత్.

పరమాత్మను సూచించు " ఆనంద" శబ్దము అనేకసార్లు చెప్పఁబడుటచే "ఆనందమయమ"నగా పరబ్రహ్మమని భావము.

ఆనందమయః = ఆనందమయము, అభ్యాసాత్ = అనేకసార్లు ప్రయోగింపఁబడుటచే.

ఇప్పుడు వ్యాసులవారు సమన్వయ విషయమునుఁగూర్చి నుడువు చున్నారు. శ్రుతులయందున్న అనేక సందేహాస్పదశబ్దములు బ్రహ్మమును సూచించుచున్నవని వారు సృష్టీకరించిరి. వారు "ఆనందమయ" శబ్దముతో ప్రారంభించి అధ్యాయాంతము వరకు ఒక్కొక్క శబ్దమునుఁగూర్చి వ్యాఖ్యానించిరి.

"నవా ఏవపురుషోన్నరసమయః తస్యేదమేవశిరః, అయందక్షిణః పక్షః, అయముత్తరః పక్షః అయమాత్మా ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా, తదప్యేషశ్లోకో భవతి" (తై. ఉ. 2-1-3)

ఈ యానందమయము జీవుడా? లేక పరబ్రహ్మమా? యను సంశయమిచ్చట కలుగును. అన్నమయ కోశమునుండి ప్రారంభింపఁబడిన ఆత్మలన్నియు పరమాత్మనుఁగూర్చి తెలుపకుండుటచే "ఆనందమయము" కూడా జీవునిఁగూర్చి తెలుపునే కాని, పరమాత్మనుఁగూర్చి తెలుపుట లేదని పూర్వపక్షి వాదించును. ఆనందమయ పురుషుడు అన్నింటికావల యున్నాడని చెప్పినను, ఆనందము మొదలగు ఉపాధులచే రూపముఁదాల్చి యుండుటచే అతడు పరమాత్ముడన బడజాలడు. "అది మానవరూపమును కలిగియున్నది. మొదటిదానికి వలెనే రెండవదానికిన్నీ మానవరూపము కలదు." ఆనందము, తృప్తి మొదలగునవి పరమాత్మతో తాదాత్మ్యము నొందియున్నచో, అది దానిని ప్రభావితమొనర్చజాలదు. కాని "ఆనందమే దాని తల"యని శ్రుతియందు స్పష్టముగా చెప్పబడినది. "ఆ యానందము నుండి జీవుడు రూపొందును." (తై. ఉ. 2-5-2) శరీరము కలిగియున్నదానికి నిశ్చయముగా సుఖదుఃఖములుండును. ఆనందమయ శబ్దము మార్పును సూచించును. కావున మార్పులేని బ్రహ్మమునది సూచింపదు. మఱియు ఈ యానందమయాత్మకు తల, కుడిభుజము, ఎడమభుజము, నడుము, తోక అను ఐదు విభాగములు సూచింపబడినవి. కాని బ్రహ్మము విభాగరహితము కావున ఆనందమయాత్మ కేవలము జీవుడే.

సిద్ధాంతి ఇట్లు సమాధానమొసంగును. ఆనందమే బ్రహ్మమని ఈ సూత్రము సూచించుచున్నది. "పునరుక్తి" కారణముచే ఆనందమయాత్మను పరమాత్మగా తెలిసికొనవలయును. విశేషణములేని ఒక శబ్దము మరల మరల ఉచ్చరింపఁ బడుటయే పునరుక్తియని చెప్పఁబడును. ఒక పరిచ్ఛేదములోని విషయమును నిశ్చయించి చెప్పు షడ్లింగములయందిది యొకటి.

పరమాత్మకు “ఆనంద” శబ్దము మరల మరల ప్రయోగింపబడినది. తైత్తరీయోపనిషత్తిట్లు చెప్పినది: “రసోవైసః రసంహైవాయంలబ్ధ్వానందీ భవతి” (2-7-1). ఆనందమే పరమాత్మ. ఆ యానందమునొందిన పిదప జీవుడానందమయుడగును. “కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ । యదేష ఆకాశ ఆనందోనస్యాత్ ఏషహ్యే వానందయాతి” (తై. ఉ. 2-7). “ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చన” (తై.ఉ. 2-9). ఆనందమే బ్రహ్మమని భృగువు ధ్యానానంతరము తెలిసికొనెను. “ఆనందోబ్రహ్మేతి వ్యజానాత్” (తై. ఉ. 3-6).

వరుణుడు తన పుత్రుడైన భృగువుకు బ్రహ్మమునుఁగూర్చి ఉపదేశించెను. అతడు ప్రథమమునందు ఈ విశ్వముయొక్క సృష్ట్యాదులకు కారణమైయున్న బ్రహ్మమునుఁగూర్చి వర్ణించి, ఈ భౌతికపదార్థములన్నియు బ్రహ్మమేయని ప్రబోధించెను. అన్నమే బ్రహ్మము, ప్రాణమే బ్రహ్మము, మనస్సే బ్రహ్మము మున్నగు వాక్యములను చెప్పెను. ఇవన్నియు ఈ ప్రపంచమునకు సామగ్రియని చెప్పునిమిత్తమై అతడీ విషయమును నుడివెను. “ఆనందమే బ్రహ్మమ”ను వాక్యముతో అతడు తన ప్రబోధమును ముగించును. నా ప్రబోధము పరబ్రహ్మమునాధారముగాఁ గొనియున్నదని నిశ్చయించి, అతడు తన ప్రబోధమును సమాప్తమొనర్చును. (తై. ఉ. 3-6-1).

“విజ్ఞానమానందం బ్రహ్మ” (బృ. ఉ. 3-9-28) “ఆనందము” బ్రహ్మము నిమిత్తమై మరల మరల ప్రయోగింపఁబడుటచే, ఆనందమయాత్మయు బ్రహ్మమేయని మనము నిశ్చయింపనగును.

అన్నమయాది కోశముల వరుసయందుండుటచే ఆనందమయాత్మ జీవుడే యగుననను వాక్యముచే పై విషయము ఖండింపఁబడుచున్నది. ఇది నిలువఁబడజాలదు. ఏలననగా ఆనందమయాత్మ అన్నింటి కంతర్గతమై యున్నది. తక్కువ జ్ఞానము కలవారుకూడా సులభముగా అర్థమొనర్చుకొనుటకై శ్రుతి క్రమక్రమముగా మనుజుని స్థూలమునుండి సూక్ష్మమునకు, భౌతికమునుండి ఆంతరికమునకు గొంపోవును. ప్రాపంచిక జనులీ శరీరమునే ఆత్మగా తలంచుటచే ప్రథమమునందీ భౌతిక శరీరమే ఆత్మగా చెప్పబడినది. అప్పుడది ప్రాణమయాత్మకు, తదనంతరము మరియొక దానివైపు చలించును. సులభముగా అర్థమగుటకై అది అనాత్మనే ఆత్మగా సూచించును. ఒక మానవుడు అరుంధతి కాని నక్షత్రములను

మొదట అరుంధతిగా సూచించి, తుట్టతుదకు నిజమైన అరుంధతి నెట్లు దర్శింపఁజేయునో, అట్లే అంతర్గతమైయున్న నిజమైన ఆనందమయాత్మఁగూర్చి ఇది చిట్టచివరికి ప్రబోధించును. అందుచే ఇచ్చట కూడా చివరిదైన ఆనందమయాత్మయే నిజమైన ఆత్మగా భావింపఁబడును.

"తోక" యొక్క భావము అవయవము కాదు. జీవుని కాధారభూత మగుటచే బ్రహ్మమే జీవునికి మూలమై యున్నదని భావము.

శరీరము, దాని విభాగములు, తృప్తియను తలను కలిగియుండుట, తెలివియనెడి విజ్ఞానమయ కోశమును కలిగియుండుట ఇవన్నియు ఆత్మ కారోపింపఁబడినవి. అవి నిజముగా నిజమైన ఆత్మకు సంబంధించినవి కావు. అన్నమయ కోశముతో ప్రారంభింపఁబడిన శరీరపరంపరకు చెందినదగుటచే, ఆనందమయకోశాత్మకు కూడా శరీర మారోపింపఁబడినది. కావున ఆనంద మయాత్మయే పరబ్రహ్మమని చెప్పఁబడినది.

## 1-1-13 వికారశబ్దాన్నేతిచేత్ న ప్రాచుర్యాత్

మార్పునొందు కారణముచే ఆనందమయ శబ్దము పరమాత్మను సూచింపదని పలికినచో "మయ"శబ్దము బహుళత్వమును సూచించుటచే పై విషయము ఖండింపబడుచున్నది.

వికారశబ్దాత్ – మార్పును సూచించు ఆనందమయశబ్దముచే, న – కాదు, ఇతి – ఈ విధముగా, చేత్ – ఒకవేళ, న – అట్లుకాదు, ప్రాచుర్యాత్ – బహుళత్వకారణముచే.

12 వ సూత్ర నిషేధమును ఈ సూత్రము ఖండించుచున్నది.

"మయ" అనగా మార్పని పూర్వపక్షి పలికినచో అది సరికాదు. అవికారియగు బ్రహ్మము విషయమునందు మార్పును సూచించుట సరికాదు. మా ప్రత్యుత్తర మేమనగా "మయ" యనగా పూర్ణత్వము, సమృద్ధి, ఆనందమయమనగా ఆనందముయొక్క వికారము కాదు, కాని ఆనందమయత్వము, లేక పూర్ణానందమగును.

"ఆనందమయ" శబ్దము నిశ్చయముగా పరమాత్మను సూచించునేగాని జీవునిఁగూర్చి కాదు. (తై. ఉ. 2-8) నందు బ్రహ్మానందమే పరమశ్రేష్ఠమైనదిగా చెప్పఁబడినది. కావున "మయ" శబ్దము సమృద్ధిని, లేక పూర్ణత్వమును సూచించును.

దుఃఖము, లేక చింతలేకుండుట "ఆనందమయ" మనఁబడదు. అది కేవలము దుఃఖనివృత్తికాదు. కాని అది బ్రహ్మము యొక్క సహజలక్షణము. ఎవ్వని సహజ స్వరూప మానందమైయున్నదో, అతడే ఆనందమయుడనఁబడును. సూర్యుడమితమైన కాంతిని కలిగియున్నాడని మనము చెప్పినప్పుడు, వెలుతురే సహజలక్షణముగా కలిగియున్న జ్యోతిర్మయుడే అతడని అర్థము. కావున ఆనందమయుడనగా బ్రహ్మమే, కాని జీవుడు కాడు. "ఆనందమయుడ"నగా "ఆనందస్వరూపుడ"ని అర్థము. "మయ"శబ్దమునకిచ్చుట వికారమని అర్థముకాదు.

శ్రుతులయందు కేవలము బ్రహ్మమును సూచించుటకై "ఆనంద"శబ్దము పునఃపునః ప్రయోగింపఁబడినది. "మయ" అనగా బ్రహ్మము ఆనందముయొక్క వికారము, లేక మార్పని అర్థముకాదు. "మయ" అనగా పరివ్యాప్తమని అర్థము.

"యజ్ఞము అన్నమయమ"నగా- అన్నముతో కూడిన యజ్ఞమని భావము. కాని, "ఆహారముయొక్క మార్పు లేక ఉత్పత్తి" అని అర్థము కాదు. కావున ఇచ్చట కూడా ఆనందముతో కూడిన బ్రహ్మమే ఆనందమయుడనఁబడును.

## 1-1-14 తద్ధేతు వ్యపదేశాచ్చ.

ఆనందమునకు కారణమని చెప్పబడుటచే "మయ" అనగా పూర్ణత్వము, లేక విస్తారమని అర్థము.

తద్ + హేతు = ఆనందమునకు కారణము, వ్యపదేశాత్ = ఉపదేశింపఁబడుటచే, చ = కూడా.

12వ సూత్రమును బలపఱచుటకై మఱియొక వాదమొసంగఁబడినది.

శ్రుతివచనమేమనగా "ఏషహ్యేవానందయాతి" (తై. ఉ. 2-7-1). అన్నింటి ఆనందమునకు కారణమేదో అదియే బ్రహ్మము. ఇతరులకు ధనమునొసంగువాడు స్వయముగా ఎట్లు ధనవంతుడైయుండునో, అట్లే ఆనందమునకు కారణమై యున్నవాడు స్వయముగా ఆనందస్వరూపుడైయుండును. "మయ"శబ్దము సమృద్ధిని సూచించినను ఆనందమయాత్మ "బ్రహ్మమే"యనఁబడును.

జీవుని ఆనందమునకు కారణము బ్రహ్మమని శ్రుతి పలుకుచున్నది. దానకర్త దానగ్రాహికి భిన్నుడై యుండును. కావున 12వ సూత్రమునందు చెప్పబడిన "ఆనందమయుడు" బ్రహ్మమే.

## 1-1-15 మాంత్రవర్ణికమేవ చ గీయతే

ఇంతేకాకుండా బ్రాహ్మణములోని మంత్రవిభాగమునందు "బ్రహ్మము" ఆనందమయుడుగా గానము చేయcబడినది.

మాంత్రవర్ణికమ్ = మంత్రవిభాగమునందు వర్ణింపcబడినవాడు, ఏవ = అదే, చ = ఇంతేకాకుండా, గీయతే = పాడcబడినది.

12వ సూత్రమును బలపఱచు వాదమింకను కొనసాగుచున్నది. పూర్వనిరూపణలు లింగములయందు లభించును. ప్రస్తుతవాదము ప్రకరణముల నుండి పరిగ్రహింపcబడినది.

ఈ క్రింది కారణముచేత కూడా ఆనందమయాత్మ పరబ్రహ్మమని చెప్పcబడును. తైత్తిరీయోపనిషత్తు లోని రెండవ అధ్యాయమిట్లు ప్రారంభమగును. "బ్రహ్మవిదాప్నోతిపరం, తదేషాభ్యుక్తా, సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ" (తై. ఉ. 2-1-1). తరువాత బ్రహ్మమునుండి మొమ్మొదట ఆకాశముద్భవించినది. తదనంతరము సకల చరాచరజీవులు కలిగినవని చెప్పcబడినది. బ్రహ్మము జీవులయందు ప్రవేశించి, హృదయాంతర్భాగము నందుండును. తదనంతరము నానా విధాత్మలు గణింపc బడినవి. సులభగ్రాహ్యతకై అది ఈ యంతరాత్మకు భిన్నమైయున్నదని చెప్పcబడినది. ఈ మంత్రమునందు పేర్కొనబడిన బ్రహ్మమే తుట్టతుదకు మరల మరియొక పరిచ్ఛేదమునందిట్లు పేర్కొనcబడినది. "ఆనందమయాత్మ దీనికి భిన్నమై యున్నది". మంత్రములు పలికిన దానినే బ్రాహ్మణము వివరించును. మంత్రములు మఱియు బ్రాహ్మణవిభాగములలో విభేదము లేదు.

ఆనందమయాత్మకు విభిన్నమైయున్న మఱియొక ఆత్మ చెప్పcబడలేదు. కాని ఆనందమయాత్మ కనుగొనcబడినది. "ఆనందం ప్రయంత్యభిసం విశంతీతి సైషాభార్గవీవారుణీ విద్యా" (తై. ఉ. 3-6-1). కావున ఆనందకోశాత్మయే పరమాత్మ.

"బ్రహ్మవిదాప్నోతిపరమ్" బ్రహ్మవేత్త పరమ గమ్యస్థానము నొందును, అనగా ఉపాసకుడగు జీవుడు, ఉపాస్యమగు బ్రహ్మమునొందును. కావున సాధ్యుడగు బ్రహ్మముకంటె సాధకుడగు జీవుడు వేఱై యుండవలయును. ఏలననగా సాధ్యుడు, సాధకుడు ఏకమైయుండుట పొసగదు. కావున ఆనందమయుడు జీవుడు కాదు. "సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ"యని మంత్రములలో వర్ణింపఁబడినది బ్రహ్మము, తదనంతరము బ్రాహ్మణములలో ఆనందమయునిగా వర్ణింపఁబడినది. వేదములలోని మంత్రములు మఱియు బ్రాహ్మణములలోని తాదాత్మ్యతను గుర్తెఱుంగుట మన కర్తవ్యమైయున్నది.

## 1-1-16 నేతరోఽ నుపపత్తేః

ఇచ్చట బ్రహ్మమే సూచింపబడినది. కావున జీవునిఁగూర్చి ఊహించుటయే అసాధ్యము.

న = కాదు, ఇతరః = రెండవది (జీవుడు), అనుపపత్తేః = అసాధ్యమగుటచే.

12వ సూత్రమును బలపరచు వాదమింకను కొనసాగుచున్నది.

ఇట్టి నిర్మాణ మశక్యమగుటచే " సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ" యను మంత్రము జీవుని సూచించుట లేదు.

"ఆనందమయాత్మ" జీవునిఁగూర్చి చెప్పుటలేదు. ఏల? అసాధ్య మగుటచే ఏలననగా ఆనందమయాత్మనుఁగూర్చి శాస్త్రమిట్లు పలుకుచున్నది. "నే ననేకముగా వృద్ధినొందుదునుఁగాక! యని అతడు సంకల్పించి ధ్యానించెను. ధ్యానానంతర మీ సమస్తమును వ్యక్తమొనర్చెను."

" ఆనందమయాత్మ" పరిచ్ఛేదములో సూచింపఁబడినవాడీ సమస్తమునకు సృష్టకర్త. "యదిదంకించ తత్సత్యమిత్యాచక్షతే" (తై. ఉ. 2-6-3) నిశ్చయముగా జీవుడిట్టి కార్యము నొనర్పలేడు. కావున "ఆనందమయాత్మ" పరిచ్ఛేదములో సూచింపఁబడినవాడీతడు కాడు.

## 1-1-17 భేదవ్యపదేశాచ్చ.

ఆనందమయాత్మకు మఱియు జీవునికి మధ్య భేదము చెప్పఁబడుటచే ఈ పరిచ్ఛేదము జీవుని సూచించుట లేదు.

భేద = భేదము, వ్యపదేశాత్ = ఉపదేశింపఁబడుటచే, చ = కూడా.

12వ సూత్రమును బలపఱచు వాద మింకను కొనసాగుచున్నది.

రెండింటికి మధ్య విభేదమును శ్రుతి నుడువుచున్నది. మొదటిది ఆనందము నొసంగునదనియు, రెండవది ఆనందమును స్వీకరించున దనియు అది వర్ణించినది. ఆనందమును పొందునట్టి జీవుడు, ఆనందము నొసంగు ఆనందమయుడు కాడు "రసోవైసః (బ్రహ్మము) రసంహ్యేవాయం (జీవుడు) లబ్ధ్వానందీ భవతి" (తై. ఉ. 2-7-1).

సాధ్యసాధకులు ఏకము కాజాలరు. కావున ప్రస్తుతము చర్చింపఁబడుచున్న అంశము జీవుడు కాజాలడు.

## 1-1-18 కామాచ్చ నానుమానాపేక్షా.

శాస్త్రమునందు సంకల్పము చెప్పఁబడియుండుటచే ఆనందమయాత్మ ప్రధానమని ఊహించుటకైనను వీలులేదు.

కామాత్ = కోరిక, లేక సంకల్పముచే; చ = మఱియు, న = కాదు, అనుమాన = అనుమానింపఁబడిన ప్రధానము యొక్క, ఆపేక్షా = ఆవశ్యకత.

12వ సూత్రమును బలపఱచు వాద మింకను కొనసాగుచున్నది.

శ్రుతియందున్న "ఆకామయత" శబ్దమునుఁబట్టి జడపదార్థము సంకల్పించుటకు వీలులేకుండుటచే "ఆనందమయము" ప్రధానము కాజాలదు. ప్రకృతి జడమగుటచే దానికి కామన, లేక సంకల్పముండదు. కావున కామనా శబ్దము ప్రయోగింపఁబడినట్టి ఆనందమయుడు ప్రకృతి, లేక ప్రధానము కాజాలదు. సాంఖ్యులచే ఊహింపఁబడిన జడమైన ప్రధానము జగత్కారణము, లేక ఆనందమయాత్మకాజాలదు.

## 1-1-19 అస్మిన్నస్యచ తద్యోగంశాస్తి.

మఱియు జ్ఞానము నార్జించిన పిదప ఈ జీవుడు ఆయానందమయాత్మతో ఏకీభవించునని శాస్త్రము బోధించుచున్నది.

అస్మిన్ = ఈ ప్రకరణమునందు, అస్య = ఈ జీవునియొక్క, చ = మఱియు, తత్ = ఆయానందమయునితో, యోగం = కలయికను, శాస్తి = బోధించును.

ఈ సూత్రములో 12వ సూత్రమును బలపఱచు విషయము పరిసమాప్తమైనది.

జ్ఞానము నార్జించిన పిమ్మట ఆనందమయాత్మతో ఏకీభవించినప్పుడు, జీవుడు ముక్తి నొందునని శాస్త్రము నుడువుచున్నది. శ్రుతివచన మేమనగా "యదాహ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽ నాత్మ్యేఽ నిరుక్తేనిలయనేఽ భయం ప్రతిష్ఠాంవిందతే, అథసోభయంగతో భవతి, యదాహ్యేష ఏతస్మిన్నుదర మంతరం కురుతే, అథతస్యభయం భవతి" (తై. ఉ. 2-7-2).

ఆనందమయాత్మ లేక పరమాత్మను తెలిసికొనుటచేత మాత్రమే పూర్ణత్వము ప్రాప్తించునుఁగాని, ప్రధానము లేక జీవుని తెలిసికొనుట చేతకాదు. కావున ఆనందమయాత్మ పరమాత్మ, లేక పరబ్రహ్మమే యను విషయము నిరూపింపఁబడినది.

# 7. అంతరధికరణము

## (20-21 సూత్రములు)

### 1-1-20 అంతస్తద్ధర్మోపదేశాత్

బ్రహ్మలక్షణములుండుటచే సూర్యుడు మఱియు నేత్రమునందున్న పురుషుడు బ్రహ్మమే.

అంతః = సూర్యుడు మఱియు నేత్రమునందున్న అంతరాత్మ, తద్ధర్మ = అతని ధర్మము, ఉపదేశాత్ = శ్రుతి ప్రబోధకారణముచే.

ఛాందోగ్యోపనిషత్తునందు 1, 6, 7 అధ్యాయములలో వర్ణింపఁబడిన అద్భుతమైన పురుషుడు బ్రహ్మమే.

సూర్యునిలోను, మానవుని నేత్రములోను నిబిడియున్న అంతరాత్మ లక్షణములు ఛాందోగ్యోపనిషత్తు యొక్క వర్ణనానుసారముగా బ్రహ్మమునకు సంబంధించినవేకాని, జీవునికి సంబంధించినవి కావు. ఛాందోగ్యము (1-6-6,7) నందిట్లు కలదు. "అథయదేవై తదాదిత్యస్య శుక్లంభాస్సైవసాఽ థయన్నీలం పరఃకృష్ణం తదమస్తత్సా మాథయేషోఽ ంతరాదిత్యేహిరణ్మయః పురుషోదృశ్యతే

హిరణ్యశ్మశ్రుర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణః॥ తస్యయథాకప్యాసం పుండరీకమేవమక్షిణీతస్యోదితి నామ స ఏషసర్వేభ్యః పాప్మభ్యఉదిత ఉదేతి హవైసర్వేభ్యః పాప్మభ్యోయ ఏవం వేద.”

ఇఁక శరీరమును సూచించుచు (ఛాం. ఉ. 1-7-5) నందిట్లు చెప్పఁబడినది. “అథయఏషోఽ ంతరక్షిణి పురుషోదృశ్యతే సైవర్క్తత్సామ తదుక్థం తద్యజుస్త ద్బ్రహ్మ, తస్యైతస్యతదేవరూపం యదముష్యరూపం యావముష్య గేష్ణౌతౌ గేష్ణౌ యన్నామ తన్నామ.”

ఈ పరిచ్ఛేదములు జ్ఞానసాధనము, పుణ్యకార్యములచే ఉన్నతి నొందిన ఒక ప్రత్యేక జీవుని సూచించునా? లేక శాశ్వతమగు పరిపూర్ణ పరబ్రహ్మమును సూచించునా? ఒక నిశ్చితమైన ఆకారమును, ప్రత్యేకస్థానమునుఁగూర్చి నుడువుటచే ఒక జీవునిఁగూర్చి చెప్పబడినదని పూర్వపక్షి పలుకును. బంగారుకాంతిఁగల గడ్డము కలిగియుండుట మున్నగు లక్షణములను సూర్యుని యందలి పురుషుని కారోపింపఁ బడినవి. నేత్రమునందున్న పురుషుడు కూడా ఇట్టి లక్షణములనే కలిగి యున్నాడు.

ఇఁక పరమాత్మునికి ఎట్టి ఆకారముండదు. “అశబ్దమస్పర్శమరూప మవ్యయమ్” (కఠ. ఉ. 1-3-15)

మఱియు ఒక నిశ్చిత స్థానము సూచింపఁబడినది. “సూర్యుని యందున్న వాడు, నేత్రమునందున్నవాడు” దీనినిఁబట్టి ఈతడు జీవుడే యని తెలియుచున్నది. పరమాత్ముడో, అతనికొక ప్రత్యేకస్థానము లేదు.“సభగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి, స్వేమహిమ్ని” (ఛాం. ఉ. 7-24-1)

ఆ పురుషుని శక్తి సంకుచితమైనది. “అతడు ప్రపంచములన్నింటికి ప్రభువే కాక, దేవతల కోరికలననుసరించి యున్నాడ”నుటచే సూర్యునిలోని పురుషుని శక్తి సంకుచితమైనది. “అతడు ప్రపంచములన్నింటికి ప్రభువే కాక, మానవుల కోరికల ననుసరించియుండు”ననుటచే నేత్రమునందున్న పురుషునిశక్తి సంకుచితమగును. కాని పరమాత్ముని శక్తి అనంతము. “అతడు అందరికి ప్రభువు, అందరికి చక్రవర్తి, అన్నింటిని సంరక్షించువాడు.” దీనిచే దేవుడేలాటి కొరతలు

లేనివాడని తెలియచున్నది. కావున సూర్యునియందు మఱియు నేత్రమునందున్న పురుషుడు పరమాత్ముడు కాఁజాలడు.

ఈ సూత్రము పూర్వపక్షియొక్క పై వాదమును ఖండించును. సూర్యునియందు మరియు నేత్రమునందున్న పురుషుడు పరమాత్ముడే, కాని జీవుడు కాడు. ఏల? అతని ప్రధాన లక్షణములు చెప్పఁబడుటచే.

సూర్యునియందున్న పురుషుని పేరు ప్రథమమునందు "ఉత్" అని చెప్పఁబడినది. తర్వాత అతడు సమస్త పాపములచే అంటుబడనివాడఁని చెప్పఁబడినది. అదే పేరు నేత్రమునందున్న పురుషునికి కూడా సూచింపఁబడినది. "మొదటివాని పేరే రెండవవాని పేరు." పాపములనుండి పూర్ణ విముక్తి పరమాత్మకు మాత్రమే చెప్పఁబడినది. "అపహతపాప్మా" (ఛాం. ఉ. 8-7-1), ఒక పరిచ్ఛేదమునందు "అతడే ఋక్కు, అతడే సామము, ఉక్థము, యజుస్సు, బ్రహ్మ"ని చెప్పఁబడినది. నేత్రమునందున్న పురుషుడే సామము మొదలగువానియందున్న ఆత్మయని దీనిభావము. ఈ పురుషుడు అన్నింటికి కారణమైన, అన్నింటి కాత్మయైన దేవుడైనప్పుడే ఇది సాధ్యమగును.

ఇఁక దేవతల విషయమునందు "ఋక్సామములే అతనికి కీళ్ళ"ని చెప్పఁబడినది. మఱియు శరీర విషయమునందు "మొదటివాని కీళ్ళే రెండవవాని కీళ్ళ"ని చెప్పఁబడినది. కావున అన్నింటి కాత్మయైనవాని విషయమే ఇచ్చట చర్చనీయాంశమని తేలుచున్నది.

సూర్యనేత్రములనెడి ప్రత్యేకస్థాన నిర్దేశము, బంగారు కాంతిఁగల గడ్డము మఱియు శక్తి పరిమితత్వములు కేవలము ధ్యానము, లేక ఉపాసన నిమిత్తమై చెప్పఁబడినవి. తన భక్తుల నాశీర్వదించి, రక్షించుటకై పరమాత్ముడు మాయద్వారా తన కిష్టమైన రూపమును ధరించుటకు సమర్థుడే. స్మృతి కూడా ఇట్లు చెప్పినది. "ఓ నారదా! నీవు చూచునదంతయు నా యొక్క మాయా ప్రసరణమే. కావున జీవులందఱి గుణములను నాయందారోపింపకుము." దేవతలు మఱియు శరీరము యొక్క వ్యత్యాసమును తెలియఁజేయు బ్రహ్మము యొక్క శక్తి పరిమితత్వము కేవలము ధ్యానాసక్తిని కలిగించుటకే ధ్యానానుకూలతకై మాత్రమే బ్రహ్మమునందీ

పరిమితులారోపింపఁబడినవి. అతని నిజస్వరూపమునందాతడు వీటన్నింటి కతీతుడై యున్నాడు. కావున శాస్త్రమునందు నుడువఁబడిన సూర్యునియందు మఱియు నేత్రమునందున్న పురుషుడు పరమాత్ముడే యని నిశ్చయింపఁబడినది.

## 1-1-21 భేదవ్యప దేశాచ్చాన్యః

జీవాత్మలకు భిన్నమైయున్న సూర్యునికి చైతన్యము నొసంగు పురుషుడు వేఱుగా నున్నాడనుట కేవలము వ్యత్యాసమును వ్యక్తమొనర్చుటకే.

భేద = భేదము, వ్యపదేశాత్ = చెప్పుటచే, చ = మఱియు, అన్యః = జీవునికి భిన్నమైనవాడు.

20వ సూత్రమును బలపఱచు వాద మిచ్చుట ఉదహరింపఁబడినది.

అన్యః = శారీరాదన్యః = దేహముగల జీవునికంటె భిన్నమైనవాడు. అంతరంగ పరిపాలకుడును, సూర్యునికి మఱియు శరీరములకు చైతన్యము నొసంగువాడును, జీవాత్మలకు భిన్నమైనవాడునగు మరియొక పురుషుడున్నాడు. శ్రుతులలోని ఈ క్రింది పరిచ్ఛేదములలో పరమాత్మునకు మఱియు జీవులకుఁగల భేదము చెప్పఁబడినది. "య ఆదిత్యేతిష్ఠన్నాదిత్యాదంతరోయమాదిత్యోనవేదయ స్యాదిత్యశ్శరీరం, య ఆదిత్యమంతరో యమయత్యేషత ఆత్మాంతర్యామ్యమృతః" (బృ. ఉ. 3-7-9). సూర్యునియందుండియు, సూర్యుడెవరిని గుర్తెఱుంగడో" యనుటచే అంతరాత్మయందున్న పరిపాలకుడు, సూర్యుడే శరీరముగాఁగల జీవునికి భిన్నమై యున్నాడని స్పష్టమగుచున్నది. పరమాత్ముడు సూర్యునియందుండియు సూర్యునితో తాదాత్మ్యమునొందిన జీవునికి భిన్నుడైయున్నాడని శాస్త్రము స్పష్టీకరించుచున్నది. పూర్వసూత్రమునందుఁగల భావమునిది దృఢపఱచు చున్నది. కావున ప్రస్తుత పరిచ్ఛేదము పరమాత్మను సూచించుచున్నదే, కాని ఒక ఘనుడైన జీవునిఁగూర్చి కాదని నిశ్చయమైనది.

# 8. ఆకాశాధికరణము

## 1-1-22 ఆకాశస్తల్లింగాత్

బ్రహ్మము యొక్క గుణచిహ్నముల కారణముచే ఆకాశశబ్దమిచ్చట బ్రహ్మముగా తెలియవలయును. ఆకాశః = ఆకాశశబ్దము, తద్ = ఆ బ్రహ్మము యొక్క, లింగాత్ = చిహ్నకారణముచే.

ఈ సూత్రమునందు బ్రహ్మము ఆకాశముగా తెలుపఁబడినది. ఛాం. ఉ. 1-9 లోని ఆకాశము బ్రహ్మమే.

ఛాందోగ్యము 1-9లో ఈ క్రింది అంశమున్నది. "ఈ ప్రపంచమునకు మూలమేమి? ఆకాశమని అతడు సమాధానమొసంగెను". ఏలననగా ఈ జీవులన్నియు ఆశాశమునుండియే జనించును. మఱియు ఆకాశమునందే లయించును. వీటన్నింటికంటె ఆకాశము గొప్పనైనది. "ఆకాశోహ్యేవైభ్యోజ్యాయా నాకాశః పరాయణమ్" (శిలక-ప్రవాహణ సంవాదము) ఆకాశమే పరమ గమ్యస్థానము. ఇచ్చట ఆకాశశబ్దము పరబ్రహ్మమును లేక పరమాత్మను సూచించునా? లేక భూతాకాశమును సూచించునా? యను సంశయము కలుగును.

సమస్త సృష్టియొక్క ఉత్పత్తి మఱియు ప్రళయకాల లయము వంటి బ్రహ్మలక్షణములు నుడువఁబడుటచే ఆకాశము పరబ్రహ్మను సూచించునేగాని భూతాకాశమును సూచింపదు. శ్రుతివచనానుసారముగా ఈ చిహ్నములు ఆకాశమును కూడా సూచించును. "ఆకాశమునుండి వాయువు, వాయువునుండి అగ్ని మున్నగునవి కలిగినవి. మఱియు ప్రళయకాలమునందవి తిరిగి ఆకాశమునందు లయించును." కాని "ఈ పదార్థము లన్నింటికి మూలమాకాశమేనై యున్నద"ను వాక్యము స్పష్టముగా పరబ్రహ్మమునే సూచించును. కారణమేమనగా శ్రుతులన్నియు "సమస్త పదార్థములకు మూలము పరబ్రహ్మమే"యని చాటి చెప్పుచున్నవి.

భూతాకాశముకూడా వాయువు, అగ్ని మొదలగు భూతములకు కారణమైయున్నదని పూర్వపక్షి పలుకవచ్చును. కాని అప్పుడు "సర్వాణిహవా" మఱియు "ఏవ" యను వైదికశబ్దముల బలము క్షీణించిపోవును. దానిని నిలుపుటకై

ఆకాశ సహితముగా అన్నింటికి మూలకారణమైయున్న బ్రహ్మమునే ఇచ్చట గ్రహింపవలసి యుండును.

ఇతర గ్రంథములలో కూడా "ఆకాశ"శబ్దము బ్రహ్మముగా ప్రయోగింపఁబడినది. "ఆకాశోవైనామ నామరూపయోర్నిర్వహితా తేయదంతరా తద్బ్రహ్మ" (ఛాం. ఉ. 8-14-1). "అవి ఆకాశమునందు లయించున"ను వాక్యము మఱియు "ఆకాశము వీటన్నిటికంటె గొప్పనైనది. ఆకాశమే వాటికి పరమగమ్యస్థానమ"నెడి వాక్యములున్నూ బ్రహ్మమునే సూచించును. ఏలననగా పరమశ్రేష్ఠత్వమును శాస్త్రము పరమాత్మకు మాత్రమే ఆపాదించును.

శ్రుతియందు సూచింపఁబడినట్లు బ్రహ్మము మాత్రమే "అన్నింటికి గొప్పది" మఱియు వాటికి "పరమ గమ్యస్థానము"నై యున్నది. ఈ క్రింది పరిచ్ఛేదములలో పై విషయములు తెలుపఁబడినవి. "జ్యాయాన్ పృథి వ్యాజ్యాయానంత రిక్షాజ్జ్యాయాన్దివోజ్యాయానేభ్యోలోకేభ్యః" (ఛాం. ఉ. 3-14-3) బ్రహ్మమే జ్ఞానము మఱియు ఆనందము. త్యాగశీలునికి అతడే పరమ లక్ష్యమైయున్నాడు. "విజ్ఞానమానందంబ్రహ్మ, రాతిర్ధాతుః పరాయణమ్" (బృ. ఉ. 3-9-28)

పదార్థములన్నియు ఆకాశమునుండియే జన్మించినవని శ్రుతి పలుకుచున్నది. ఇట్టి కారణత్వము కేవలము బ్రహ్మమునకు మాత్రమే అన్వయించును. ఆకాశము అన్నింటికి గొప్పదనియు, ఆకాశమే పరమలక్ష్యమనియు మఱియు అది అనంతమైనదనియు శ్రుతి నుడువుచున్నది. ఈ సూచనలచే ఆకాశమనగా బ్రహ్మమేయని నిరూపింపఁబడుచున్నది.

బ్రహ్మమును సూచించుటకై ఆకాశముయొక్క వివిధ పర్యాయపదములు ప్రయోగింపఁబడినవి. "పరమేవ్యోమన్ప్రతిష్ఠితా, సయ ఏవంవేదప్రతితిష్ఠతి" (తై. ఉ. 3-6). "ఓమ్ కం బ్రహ్మ ఖం బ్రహ్మ" (ఆకాశము) (ఛాం. ఉ. 4-10-5) "ఖం పురాణమ్" (బృ. ఉ. 5-1).

కావున అగ్ని ఏ విధముగా ప్రారంభమునందొక బాలునిగా సూచింపఁబడి, తర్వాత అగ్నిగా చెప్పఁబడినదో, అదే విధముగా ఆకాశమను శబ్దము బ్రహ్మమును మాత్రమే సూచించునను విషయము నిశ్చయింపఁబడినది.

# 9. ప్రాణాధికరణము

## 1-1-23 అత ఏవ ప్రాణః

ఈ కారణముననుసరించియే శ్వాసకూడ బ్రహ్మమునే సూచించును.

అత ఏవ = ఈ కారణముచేతనే, ప్రాణః = శ్వాస (కూడా బ్రహ్మమును సూచించును).

ప్రపంచమునకు కారణము ప్రాణముగా వర్ణింపఁబడినది. ఇట్టి వర్ణన కేవలము బ్రహ్మమునకు మాత్రమే అన్వయించును.

"ఐతే దాని కధిష్ఠాన మేది?" "ప్రాణమ"ని అతడు పలికెను. ప్రస్తావము మొదలగువాటికి చెందిన అధిష్ఠాన దేవతయే "ప్రస్తోతృ" వని ఉద్గీథ విషయమునందు (ఛాం. ఉ. 1-10-9) మఱియు (1-2,4,5) లోను చెప్పఁబడినది.

ఏలననగా జీవులన్నియును ప్రాణమునందే లయించును. మఱియు ప్రాణము నుండియే జనించును. ఇది ప్రస్తావమునకు చెందిన అధిష్ఠాన దేవత. (ఛాం. ఉ . 1-2-4,5). ఈ ప్రాణము శ్వాసయా? లేక బ్రహ్మమా? యనెడి సంశయమిచ్చట కలుగును. ప్రాణమనెడి శబ్దము పంచవిధ శ్వాసలనుసూచించునని పూర్వపక్షి పలుకును. "కాద"ని సిద్ధాంతి యొక్క వాదము. జీవులన్నియు ప్రాణము నుండియే జనించి, దానియందే లయమగునని చెప్పఁబడుటచే పూర్వసూత్రమువలె ఇది కూడా బ్రహ్మమునే సూచించును. ఇది కేవలము పరమాత్మకు సంబంధించిన విషయమునందే సంభవించును.

పూర్వపక్షి ఇట్లు పలుకును. "శ్రుతియందీ క్రింది విషయము కలదు. మానవుడు నిద్రించునప్పుడు నిశ్చయముగా వాక్కు శ్వాసయందు లయించును. అతడు మేల్కొన్నప్పుడు అవి మరల శ్వాసనుండియే ఉత్పన్నమగును." వేదమిచ్చట దైవిక క్రియనే సూచించుచున్నది. ఏలననగా నిద్రా సమయములో నిరంతరము శ్వాసక్రియ జరుగుచుండగా ఇంద్రియక్రియలన్నియు ఉడిగిపోవును. మరల మానవుడు మేల్కొన్నప్పుడు మాత్రమే అవి వ్యక్తములగును. కావున విషయేంద్రియములే జీవులన్నింటికి సారము. జీవులయొక్క ఉత్పత్తిలయములను ముఖ్యప్రాణముతో కూడా అన్వయింప వచ్చును.

ఇది అసంభవము. "ప్రాణస్యప్రాణమ్" (బృ. ఉ. 4-4-18) అనుటచే ప్రాణమిచ్చుట బ్రహ్మమునకు బదులుగా ప్రయోగింపఁబడినది. "నిశ్చయముగా ప్రాణమే బ్రహ్మము" (కౌ. ఉ. 3-3) "ఈ జీవులన్నియు ప్రాణమునందే లయించును. మఱియు ప్రాణమునుండియే జనించును." (ఛాం. ఉ. 1-11-5) అని శ్రుతివచనము. గాఢ నిద్రయందు ఇంద్రియములు మాత్రమే లయమునొందుటచే ప్రాణము బ్రహ్మమే యగును. కాని శ్వాసకానేరదు.

# 10. జ్యోతిశ్చరణాధికరణము

**(24-27 సూత్రములు)**

## 1-1-24 జ్యోతిశ్చరణాభిధానాత్

జ్యోతికి సంబంధించిన పరిచ్ఛేదమునందు పాదములు పేర్కొనఁబడుటచే "జ్యోతి"యే బ్రహ్మమగును.

జ్యోతిః = వెలుతురు, చరణ = పాదములు, అభిధానాత్ = పేర్కొనఁబడుటచే.

"జ్యోతి"యే ప్రస్తుత చర్చనీయాంశము. నాలుగు పాదములు కలిగియున్నట్లు వర్ణింపబడుటచే ఛాందోగ్యము (3-13-7) లోని జ్యోతి బ్రహ్మమును సూచించునే, గాని భౌతికమైన జ్యోతిని కాదు.

శ్రుతివచన మేమనగా "ఈ స్వర్లోకమునకు పైన ప్రకాశించు వెలుగు అన్నింటికి పరమైనది, ప్రతిపదార్థమున కతీతమైనది. దేనికిపైన మరియొక లోకము లేదో అట్టి లోకమునందుండునదేదో, అట్టి జ్యోతియే మానవుని అంతరాత్మయందున్నది." ఈ జ్యోతిశ్శబ్దము సూర్యుని భౌతికమైన వెలుతురు మొదలగువాటిని సూచించునా? లేక పరమాత్మను సూచించునా? యను సంశయమిచ్చుట కలుగును.

సర్వసామాన్యమైన అర్థము నొసంగుటచే ఈ జ్యోతిశబ్దము సూర్యుని వెలుగువంటి దానిని సూచించునని పూర్వపక్షి పలుకును. ఇంతే కాకుండా "ప్రకాశించు"ననెడి శబ్దము సూర్యునివంటి కాంతినికేతనమును సూచించును.

బ్రహ్మము వర్ణరహితమైనది. కావున "ప్రకాశించున"నెడి ప్రాథమిక భావమిచ్చుట నుడువఁబడలేదు. ఇఁక ఆకాశమునంటి యున్నదనుటచే జ్యోతి శబ్దము వెలుతురునే సూచించును. (స్వర్లోకమునకు పైన ప్రకాశించు వెలుగు). సర్వజీవుల యందుండెడి, సర్వవ్యాపకము, అనంతము మఱియు సకల చరాచర పదార్థములకు మూలమైన బ్రహ్మమునకు ఆకాశమొక హద్దుకాజాలదు. ఉత్పత్తియై, ఐక్యమైయున్న వెలుతురునకు మాత్రమే ఆకాశమొక హద్దురూపము నందుండును.

జ్యోతి శబ్దమున కర్థము దృష్టికి సహకరించునట్టి సూర్యుని భౌతికమైన వెలుతురు కాదు. అది బ్రహ్మమును సూచించును. ఏల? రెండవ పరిచ్ఛేదమునందు దానికి పాదములు సూచింపఁబడుటచే. "తావానస్య మహిమాతతో జ్యాయాంశ్చపూరుషః, పాదోస్యఽ సర్వాభూతాని త్రిపాద స్యామృతందివీతి" (ఛాం. ఉ. 3-12-6). ఈ బ్రహ్మము యొక్క మహిమ ఇంతటిది. పురుషుడు దీనికంటెను ఉత్కృష్టుడు. భూతములన్నియు ఇతనికి ఒక పాదము. ఈ పురుషుని మూడుపాదములు అమృతము, ప్రకాశమయమైన స్వాత్మ యందున్నవి.

పూర్వపరిచ్ఛేదములయందేఁగాక, తదనంతర విభాగమునందుకూడా శాండిల్యవిద్య (ఛాం. ఉ. 3-14) యను పేరుతో బ్రహ్మవిద్య ఉపదేశింపఁబడినది. "జ్యోతి"ని మనము సామాన్యమగు వెలుతురుగా భావించినచో, ముఖ్యాంశమును త్యజించి మరియొక నూతన విషయమును చేపట్టినట్లుండుటచే, మనము దోషభూయిష్ఠుల మగుదుము. ఈ విభాగమునందు బ్రహ్మమే ముఖ్యాంశమై యుండుటచే, తదనంతర పరిచ్ఛేదము (ఛాం. ఉ. 3-14) కూడా ఈ విషయమునే చర్చించుననుట నిర్వివాదము. కావున మధ్యనున్న విభాగము (ఛాం. ఉ. 3-13) కూడా బ్రహ్మమునుఁగూర్చియే నుడువుచున్నదనుట సమంజసమై యున్నది. ఇందుచే ఈ పరిచ్ఛేదము నందున్న "జ్యోతి" శబ్దము బ్రహ్మమునే సూచించుననుట నిశ్చయము.

నేత్రముయొక్క, కార్యము దేనిపై ఆధారపడియున్నదో, అట్టి వెలుతురునే "జ్యోతి" శబ్దము సూచించుననుటకు వీలులేదు. దానికి మరియొక అర్థమున్నది. ఉదాహరణమునకు "వాచైవాయంజ్యోతిషాస్తే" (బృ. ఉ. 4-3-5) "వాక్కనెడి వెలుగుచేతనే మానవుడు వసించును." ఏదైతే మరియొక దానిని ప్రకాశింపఁజేయునో,

అదియే "జ్యోతి"యని చెప్పబడును. కావున సమస్త విశ్వమునకు వెలుగు నిచ్చునటువంటి జ్ఞానస్వరూపుడైన బ్రహ్మమునకు ఇచ్చట "జ్యోతి" శబ్దము వర్తించును. శ్రుతి ఇట్లు నుడివినది. "తమేవభాంత మనుభాతిసర్వం, తస్యభాసాసర్వమిదం విభాతి" (కౌ. ఉ.2-5-15) మఱియు "తద్దేవాజ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేమృతమ్" (బృ. ఉ. 4-4-16).

"వెలుతురు, స్వర్లోకమునకు సంబంధించి యుండుట, ప్రత్యేక స్థానమును కలిగియుండుట" వంటి బ్రహ్మము యొక్క ఉపాధులను పేర్కొనుట ప్రగాఢధ్యాననిష్ఠకై సహకరించును. సూర్యుడు, నేత్రము, హృదయమువంటి ప్రత్యేక పదార్థములతో బ్రహ్మము సంబంధము కలిగియుండుటను సూచించుటద్వారా శ్రుతులు నానా విధములగు ఉపాసనలనుఁగూర్చి ప్రబోధించు చున్నవి.

కావున "జ్యోతి" యను శబ్దమిచ్చట బ్రహ్మమును మాత్రమే సూచించు చున్నదనుట నిశ్చయము.

## 1-1-25 ఛాందోఽభిధానాన్నేతిచేన్న తథాచేతోఽర్పణ నిగదాత్తథాహి దర్శనమ్

గాయత్రీ ఛందస్సు కారణముచే బ్రహ్మమునుఁగూర్చి ఇచ్చట చెప్పఁబడలేదని పలికినచో, అట్లుకాదని మా సమాధానము. ఏలననగా ఈ ఛందస్సుద్వారా బ్రహ్మముపై మనస్సును కేంద్రీకరించుట సుకరము. ఈ విషయమితర పరిచ్ఛేదములయందున్నూ కాననగును.

ఛందః = గాయత్రీ ఛందస్సు, అభిధానాత్ = చెప్పఁబడుటచే, న = కాదు, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, తథా = ఆ విధముగా, చేతోర్పణ = మనస్సు నర్పించుట, నిగదాత్ = చెప్పఁబడుటచే, తథాహి = ఆ విధముగా, దర్శనమ్ = చూడఁబడినది.

24వ సూత్రమునకు భిన్నమైన వాద మీ సూత్రమునందు ఖండింపఁబడినది.

"పాదోఽస్యవిశ్వాభూతాని" యను పరిచ్ఛేదమునందు గాయత్రీ ఛందస్సు మాత్రమే సూచింపఁబడినది, కాని బ్రహ్మము కాదని పూర్వపక్షి పలుకును. ఏలననగా అదే ఉపనిషత్తులోని రెండవ విభాగము యొక్క ప్రథమ పరిచ్ఛేదమునందు "ఇచ్చట ఉన్న సమస్తము గాయత్రియే" యని చెప్పఁబడినది. కావున పూర్వసూత్రమునందు

సూచింపఁబడిన పాదములు ఈ ఛందస్సుకు సంబంధించినవే, కాని బ్రహ్మమునకు సంబంధించినవి కావు.

దానికి సమాధానమేమనగా అట్లుకాదు, ఏలననగా "గాయత్రియే నిశ్చయముగా ఈ సమస్తమనెడి బ్రాహ్మణ పరిచ్ఛేదము ఈ ఛందస్సుకు సంబంధించిన బ్రహ్మమునుఁగూర్చి ధ్యానించుమని ప్రబోధించుచున్నది. బ్రహ్మము సమస్తమునకు కారణమై యుండుటచే గాయత్రికి కూడా సంబంధించియున్నది. కావున ఈ బ్రహ్మమే ధ్యానింపఁదగినదై యున్నది."

బ్రహ్మమును గాయత్రి రూపమునందు ధ్యానింపఁదగును. ఈ వివరణముచే సమస్తము అనుగుణ్యమగును. ఒకవేళ గాయత్రి ఛందస్సే యైనచో "ఇచ్చట ఉన్న సమస్తము గాయత్రియే" యని నుడువుట కవకాశము లేదు, ఏలననగా నిశ్చయముగా ఛందస్సే సమస్తముకాదు. కావున సూత్రము "తాథాహి దర్శనమ్" "ఆ విధముగా మనము చూచుచున్నామ"ని నుడివినది. ఇట్టి వివరణము ద్వారానే పై పరిచ్ఛేదము సంగతమైన అర్థమునొసంగును. లేనిచో "ఛందస్సే సర్వస్వమ"నెడి అసంగత విషయమును మనమంగీకరింప వలసి వచ్చును. కావున గాయత్రీ ద్వారా బ్రహ్మమును ధ్యానించువిధానము చూపఁబడినది.

"ఇదియంతయు గాయత్రీయే"యని పలుకుటతో గ్రంథమునందు మనస్సు యొక్క చాలనము వ్యక్తమొనర్పఁబడినది. ఛందస్సునకు సంబంధించియున్నట్టి బ్రహ్మమువైపు గాయత్రీఛందస్సు ద్వారా మనస్సును త్రిప్పవలయునని ఈ పరిచ్ఛేదము మనకు ప్రబోధించుచున్నది.

అదే విభాగమునందు బ్రహ్మమే ముఖ్యాంశమైయున్న ఇతర వాక్యము "సర్వం ఖల్విదం బ్రహ్మ" (ఛాం. ఉ. 3-14-1) ననుసరించి ఈ వ్యాఖ్యానమొనర్పఁబడినది.

కార్యబ్రహ్మము ద్వారా బ్రహ్మమును ధ్యానించు విధానము ఇతర వాక్యములయందున్నూ చూపబడినది. ఉదాహరణమునకు (ఐ.ఆర్. 3-2-3) "దేనినైతే బహ్వృచులు మహాప్రాణము, లేక మహదుక్థమను నామముతో ఉపాసింతురో, అధర్వులు అగ్నిరూపమునందుపాసింతురో, ఛందోగులు మహావ్రతరూపముగా ఉపాసింతురో అట్టి మహాయజ్ఞమే గాయత్రియని ప్రసిద్ధినొందిన పరబ్రహ్మము.

కావున ఇచ్చట బ్రహ్మమే పేర్కొనబడినది. కాని గాయత్రి ఛందస్సు కాదు.

## 1-1-26, భూతాది పాదవ్యపదేశోపపత్తే శ్చైవమ్.

గాయత్రి ప్రయోగింపఁబడిన పూర్వసూత్రమునందు ఈ విధముగా కూడా బ్రహ్మమే ముఖ్యాంశమై యున్నది. ఏలనన అట్టి వ్యాఖ్యానముచేతనే పరమపురుషునికి చరణములు సాధ్యమగును.

భూతాది = పృథ్వి-శరీరము-హృదయము మొదలగు భూతములు. పాద = చరణము, వ్యపదేశ = పేర్కొనుట, ఉపపత్తేః = నిరూపణముచే, చ = కూడా, ఏవం = ఈ విధముగా.

24వ సూత్రమును బలపఱచు వాదమిచ్చుట చేర్చఁబడినది.

జీవులు, పృథ్వి, శరీరము మఱియు హృదయము బ్రహ్మముచేతనే అనుభూతమగుచున్నవి. కాని కేవలము అక్షరసముదాయమైయున్న గాయత్రి ఛందస్సు ద్వారా కాదు. జీవులు మొదలగునవి గాయత్రికి పాదములుగా చెప్పఁబడుటచే పూర్వసూత్రమునందు బ్రహ్మమే ముఖ్యాంశమైయున్నది. సూత్రము ప్రారంభమునందు జీవులు, పృథ్వి, శరీరము మఱియు హృదయమునుఁగూర్చిచెప్పి తదనంతరము "ఆ గాయత్రి ఆరు విధములుగా నుండి నాలుగుపాదములను కలిగియున్నద"ని వర్ణించినది. ఒకవేళ అచ్చట బ్రహ్మము సూచింపబడకున్నచో "ఇట్టి మహిమోపేతమైనది" మొదలగు వాక్యముల కవకాశము లేకుండెడిది.

గాయత్రి ఛందస్సునకు సంబంధించియుండుటచే ఇచ్చట గాయత్రియనగా బ్రహ్మమని భావము. "గాయత్రియే సమస్తము" మొదలగు వాక్యములచే గాయత్రిరూపమునందు బ్రహ్మముయొక్క సర్వాత్మకత్వము ప్రకటింపఁబడినది.

కావున పూర్వసూత్రమునందు కూడ బ్రహ్మమే ముఖ్యవిషయముగా చెప్పఁబడినది. ఇదే బ్రహ్మము మరల (ఛాం. ఉ. 3-13-7)నందు జ్యోతిగా పేర్కొనఁబడినది.

భూతములు, పృథ్వి, శరీరము మఱియు హృదయము గాయత్రికి నాలుగు పాదములుగా తలంపఁబడవు. అవి పరమపురుషునియొక్క చతుర్విధ సృష్టులుగా తలంపఁబడును. "స్వర్గ" మనెడి శబ్దము భావగర్భితమైనది. అది "జ్యోతి"సంబంధముగా ప్రయోగింపఁబడుట "గాయత్రి"తో కూడా సంబంధించి ప్రయోగింపఁబడుటను మనకు స్మృతికిఁదెచ్చును. కావున స్వర్గమునకు పైన

"జ్యోతి" ప్రకాశించుట "గాయత్రి"తన మూడు పాదములను స్వర్గమునందు కలిగియుండుట వంటిది.

## 1-1-27 ఉపదేశభేదాన్నే తిచేన్నో భయస్మిన్నప్యవిరోధాత్.

ప్రత్యేకతనుఁబట్టియు, పదభేదమునుఁబట్టియు గాయత్రి సూత్రమందున్న దానితో ఏకీభవించదని చెప్పినచో, అట్లుకాదు. ఏలననగా రెండు పేర్ల భావమునందేలాటి భిన్నత్వము కానఁబడదు.

ఉపదేశ = వ్యాకరణాత్మక ప్రబోధముయొక్క, భేదాత్ = భేదమువలన, న = కాదు, ఇతిచేత్ = ఒకవేళ చెప్పినచో, న = కాదు, ఉభయస్మిన్ = రెంటియందు, అపి = కూడా, అవిరోధాత్ = విరోధము లేకుండుటచే.

24 వ సూత్రమునకు వ్యతిరిక్తమైన మరియొక వాదము చూపఁబడి, ఖండింపఁబడినది. ''దివి'' శబ్దవిషయమునందు గాయత్రి శ్రుతిలోను విభక్త్యంతములు విభిన్నములై యున్నవని వాదించినచో, అది సరికాదు. ఏలననగా ఈ రెండింటి యందు ప్రధానమైన విరోధము లేదు.

గాయత్రి సూత్రమునందు "త్రిపాదస్యామృతందివి" యనుటచే స్వర్గలోకము బ్రహ్మస్థానముగా సూచింపబడినది. ఇఁక తదనంతర సూత్రమునందు "స్వర్లోకమునకు పైన ప్రకాశించు జ్యోతి"యనుటచే బ్రహ్మము స్వర్లోకమునకు పైన ఉనికిని కలిగియున్నట్లు వర్ణింపఁబడినది. కావున ప్రథమ సూత్రమందున్న విషయము. ద్వితీయసూత్ర విషయమునకు భిన్నమైనదని ఎవరైనను తలంపవచ్చును. "ఒకే బ్రహ్మము ఈ రెండింటి యందెట్లు వర్తించున"ని పూర్వపక్షి వాదింపవచ్చును. ఇచ్చట విరోధముండియు లేకున్నది. ఏ విధముగానైతే సామాన్యభాషలో ఒక పక్షి ఒక వృక్షాగ్రమునందున్నప్పుడు చెట్టుపై నున్నదనియు, చెట్టుకు పైభాగము నందున్నదనియును పలుకుదుమో, అదే విధముగా బ్రహ్మముకూడా స్వర్గము నందున్నను స్వర్గమునకు అతీతముగా నున్నదని చెప్పఁబడినది.

సప్తమీ విభక్తియగు "దివి" మఱియు పంచమీ విభక్తియగు "దివః" ఈ రెండింటిలో విభేదము లేదు. పంచమీ విభక్తియొక్క అర్థమును మరొక విధముగా తెలియఁజేయుటకై శాస్త్రములలో సప్తమీ విభక్తి సామాన్యముగా ప్రయోగింపఁ బడుటచే "దివ్" శబ్దము యొక్క విభక్త్యంత భేదమునందు విరోధములేదు.

కావున ముందు వాక్యమునందు చెప్పఁబడిన బ్రహ్మమే తర్వాతి వాక్యమునందున్నూ చెప్పఁబడినదని తెలియవలయును. “జ్యోతి” శబ్దము బ్రహ్మమునే సూచించునను మాట నిశ్చయము.

శ్రుతి వాక్యమునందు వ్యాకరణమునకు సంబంధించిన విభక్తులలో విభేదమున్నను, విషయము మాత్రము ఏకమేనను విషయము సుస్పష్టము.

# 11. ప్రతర్దనాధికరణము

## (28-31 సూత్రములు)

## 1-1-28 ప్రాణస్తథానుగమాత్.

ప్రాణమునకు సంబంధించిన వాక్య సంబంధమునుఁబట్టి ప్రాణమే బ్రహ్మమని తెలియవలెను.

ప్రాణః = శ్వాస, తథా = ఆ విధముగా, అనుగమాత్ =అర్థము చేసుకొన్న కారణముచే.

“ప్రాణ” విషయమిచ్చట మరల చర్చింపఁబడుచున్నది.

కౌషీతక్యుపనిషత్తులో ఇంద్రప్రతర్దనుల సంవాదమున్నది. దివోదాసుని పుత్రుడైన ప్రతర్దనుడు ఇంద్రలోకమునకు బలప్రదర్శనమునకై మఱియు యుద్ధమొనర్చుటకై ఏగెను. ప్రతర్దనుడు ఇంద్రునితో “మానవునికి ప్రయోజనకరమైన వరమేదో నీవే ఆలోచించి నాకొసంగుమ”నెను. ఇంద్రుడిట్లనెను. “నన్నే తెలిసికొనుము. ఇదియే మానవునికి ప్రయోజనకరమైనదని నేను తలంతును. నేనే ప్రాణమును, ప్రజ్ఞాత్మను, ప్రాణముఁగాను, అమృతత్వముఁగాను నన్ను ధ్యానించుము. (3-2). “ఆ ప్రాణమే నిశ్చయముగా ప్రజ్ఞాత్మ, ఆనందము, అజరము, అమృతము” (3-8).

ఇచ్చట ప్రాణశబ్దము కేవలము శ్వాసయా? లేక దేవేంద్రుడా? లేక జీవుడా? లేక పరబ్రహ్మమా? యనెడి సంశయమొదవును.

మానవశ్రేయస్సున కనుకూలమైనదిగా వర్ణింపఁబడుటచే ప్రాణశబ్ద మీ వాక్యమునందు బ్రహ్మమునే సూచించును. బ్రహ్మమునకు మించిన శ్రేయస్సు మానవునికి మరొకటి లేదు. ఇంతేకాకుండా ప్రాణము ప్రజ్ఞాత్మగా వర్ణింపఁబడినది. ప్రజ్ఞారహితమైన వాయువు నిశ్చయముగా ప్రజ్ఞాత్మ కానేరదు.

చరమవాక్యమునందు సూచింపఁబడిన ఆనందము, అజరము, అమృతము మున్నగు విశేషణములు కేవలము బ్రహ్మమునే సూచించునను మాట సత్యము. మఱియు ప్రాణముయొక్క జ్ఞానము సమస్త పాపములనుండి విముక్తమొనర్చును. "స యో మాం విజానీయాన్నాస్యకేనచ కర్మణా లోకోమీయతే న మాతృవధేన పితృవధే"(కౌ. ఉ. 3-1)

పరబ్రహ్మమును అంగీకరించిననే తప్పక ఈ వాక్యములన్నియును అర్థవంతములగును. కాని, శ్వాసలోని వాయువు నంగీకరించుటచే కాదు. కావున "ప్రాణ"శబ్దము కేవలము బ్రహ్మమునే సూచించును.

## 1-1-29 నవక్తురాత్మోపదేశాదితి చేదధ్యాత్మ సంబంధ భూమాహ్యస్మిన్

వక్త తన్ను గూర్చి తాను చెప్పుకొనుటచే ఈ వాక్యములలో బ్రహ్మము సూచింపఁబడలేదని పలికినచో, అట్లు కాదు. ఏలననగా ఈ యుపనిషత్తులలో అంతరాత్మనుఁగూర్చి మిక్కిలిగా వర్ణింపఁబడినది.

న = కాదు, వక్తుః = వక్తయైన ఇంద్రునియొక్క, ఆత్మ = తనయొక్క, ఉపదేశాత్ = ఉపదేశముచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, అధ్యాత్మ సంబంధభూమా = అంతరాత్మనుఁగూర్చిన ప్రబోధబాహుళ్యము, హి = ఏలననగా, అస్మిన్ = ఈ యుపనిషత్తునందు

28వ సూత్రములోని ఖండన ఖండింపఁబడినది.

ప్రాణము బ్రహ్మమును సూచించుననెడి నిశ్చయమునకు భిన్నమైన వాదమిచ్చుట చూపఁబడినది. "వక్తయైన ఇంద్రుడు తన్ను తానే పేర్కొనుటచే ప్రాణ శబ్దమిచ్చుట పరబ్రహ్మమును సూచింపద"ని పూర్వపక్షి పలుకును. ఇంద్రుడు ప్రతర్దనుతో "నన్నే తెలిసికొనుము. నేనే ప్రాణమును, ప్రజ్ఞాత్మను" అని పలికెను. వ్యక్తిత్వమును సూచించు ప్రాణము, దేనికి వక్తయొక్క విశేషణమారోపింపఁ బడజాలదో, అట్టిది బ్రహ్మమెట్లగును? "బ్రహ్మము వాగ్రహితము, మనోరహితమ'ని (బృ. ఉ. 3-8-8) శ్రుతి పలుకును.

ఇంకను వక్తయగు ఇంద్రుడు తన్నుతాను పొగడుకొనును. "నేను మూడు తలలుగల త్వష్టయొక్క కుమారుని చీల్చివేసితిని. సాలావృక భక్తులను, అరుణ్ముఖులను నేను విడుదల చేసితిని. నేను ప్రహ్లాదుని ప్రజలను సంహరించితిని" మున్నగునవి.

తన బలపరాక్రమ కారణమునే ఇంద్రుడు ప్రాణముగా చెప్పఁబడ వచ్చును. కావున ప్రాణము బ్రహ్మమును సూచింపదు.

ఈ యాక్షేపణకు విలువలేదు. కారణమేమనగా ఈ యధ్యాయమునందు బ్రహ్మము, లేక అంతరాత్మనుఁగూర్చి అనేక ఉదాహరణములున్నవి. అవి ఏవనగా "ప్రజ్ఞాత్మయైన ప్రాణము మాత్రమే ఈ శరీరమును ధరించి, దానిని లేవనెత్తుచున్నది. ఏ విధముగా ఒక బండిచక్రములోని పరిధి దాని కొయ్యలపై ఆధారపడియుండునో, మఱియు ఆ కొయ్యలు ఒక దిమ్మపైఆధారపడియుండునో, అదే విధముగా పదార్థములన్నియు ఇంద్రియములపై ఆధారపడియుండును. మఱియు ఇంద్రియములు ప్రాణముపై

ఆధారపడియుండును. నిశ్చయముగా ఈ ప్రాణమే ప్రజ్ఞాత్మ, ఆనందము, అజడము మఱియు అమృతమై యున్నది. "అయమాత్మా బ్రహ్మసర్వానుభూః" (బృ. ఉ. 2-5-19). "అతడే నేనని తెలిసికొనఁబడునుఁగాక! ఈ యాత్మయే సర్వజ్ఞమైన బ్రహ్మము".

ఇంద్రుడు ప్రతర్దనునితో "నన్ను ప్రాణముగా ఉపాసించుమ"ని పలికెను. ఇది కేవలము బ్రహ్మమునే సూచించును. ఏలననగా బ్రహ్మోపాసనమే మానవునికి హితతమమైన ముక్తి నొసంగఁగలుగును. ఈ ప్రాణమునుఁగూర్చి ఇట్లు చెప్పఁబడినది. "ఈ లోకములను దాటఁదలంచువానిచే ప్రాణము సత్కార్యము చేయించును." దీనిచే ప్రాణముచేతనే ప్రతికార్యము సాధింపఁబడుచున్నదని తెలియుచున్నది. కావున ఇది బ్రహ్మమునుఁగూర్చియే తెలుపును గాని శ్వాస, లేక ఇంద్రుని గూర్చి కాదు. కావున "ప్రాణమి"చ్చట బ్రహ్మమును మాత్రమే సూచించుచున్నది.

ఈ యధ్యాయమునందు బ్రహ్మమును సూచించునట్టి అంతరాత్మకు సంబంధించిన అనేకమైన ఉదాహరణములున్నవి. కాని, ఏదోయొక అధిష్ఠానదేవత యొక్క ఆత్మకు సంబంధించిన ఉదాహరణములు లేవు.

కాని ఇంద్రుడు నిజముగా బ్రహ్మోపాసననుఁగూర్చియే ప్రబోధించియున్నచో "నన్ను పూజించుమ"ని ఏల చెప్పును? ఇది నిజముగా అంధకారబంధురమై యున్నది. దీనికి క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-1-30 శాస్త్ర దృష్ట్యాతూపదేశోవామదేవవత్.

ఇంద్రుడు తానే బ్రహ్మమని పలుకు సిద్ధాంతము, వాయుదేవునివలె శ్రుతియందున్న ఆత్మజ్ఞానముచే సాధ్యమగును.

శాస్త్రదృష్ట్యా = శాస్త్రదృష్టి ననుసరించి, తు = కాని, ఉపదేశః = ఉపదేశము, వామదేవవత్ = వామదేవునివలె.

29వ సూత్రములోని నిషేధము మరల ఖండింపబడుచున్నది.

"తు" యను శబ్దము సంశయమును నివారించును. ప్రతర్దనునికి ఉపదేశించునప్పుడు వామదేవునివలె ఇంద్రుడు బ్రహ్మముతో తదాత్మ్యము నొందుటచే, తన్ను తాను ప్రాణముగా వర్ణించుకొనుట ఉచితమేయగును.

వామదేవుడు బ్రహ్మసాక్షాత్కారమునొంది ఇట్లనెను, "అహంమనుర భవం సూర్యశ్చేతి, తద్యోయోదేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తదభవత్" (బృ. ఉ. 1-4-10). ఇంద్రుని ప్రబోధము కూడా ఇట్టిదే. ఋషివంటి ఆత్మజ్ఞానము ద్వారా ఇంద్రుడు బ్రహ్మసాక్షాత్కారము నొంది, పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందినవాడై "నన్నే తెలిసికొనుము" అను మాటలచే ప్రతర్దనునికుపదేశించును.

ఇంద్రుడు బ్రహ్మజ్ఞానముఁగూర్చి స్తుతించెను. కావున ఈ క్రింది విధముగా చెప్పునప్పుడది తనయొక్క ప్రతిభకాదు. "నేను త్వష్టయొక్క పుత్రుని చంపితిని" మొదలగునవి. ఈ వాక్యమునకర్థమేమనగా "నేనిట్టి క్రూరకృత్యముల నొనర్చినను, నా వెంట్రుకకు కూడా నష్టము లేదు. ఏలననగా నేను బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నాను. కావున నన్ను తెలిసికొన్న ఏ వ్యక్తియైనను అతడొనర్చు కార్యములచే దోషయుక్తుడు కాడు". కావున ఈ యధ్యాయమంతయు బ్రహ్మమునుఁగూర్చియే సూచించుచున్నది.

## 1-1-31 జీవముఖ్య ప్రాణలింగాన్నేతి చేన్నోపాసాత్రైవిధ్యాదాశ్రితత్వాదిహ తద్యోగాత్.

జీవుడు మఱియు ముఖ్యప్రాణముల యొక్క విశేషణములు సూచింపఁబడుటచే ఇచ్చట బ్రహ్మము చెప్పఁబడలేదని పలికినచో, అట్లు కాదని మా సమాధానము. ఏలననగా ఇట్టి వ్యాఖ్యానమునందు త్రివిధములగు ఉపాసనలున్నవి. మఱియు శ్రుతి యందు మరియొకచోట ప్రాణమే బ్రహ్మముగా అంగీకరింపఁబడినది.

ఇంతేఁగాక, ఇచ్చట కూడా ప్రాణవిషయమునందు బ్రహ్మమును సూచించు శబ్దములు ప్రయోగింపఁబడినవి.

జీవముఖ్యప్రాణలింగాత్ = జీవుడు మఱియు ముఖ్యప్రాణములయొక్క విశేషణములచే, న = కాదు, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, ఉపాసా = పూజ, త్రైవిధ్యాత్ = త్రివిధములుగా నుండుటచే, ఆశ్రితత్వాత్ = శ్రుతియందు ప్రాణమే బ్రహ్మముగా అంగీకరింపఁబడుటచే, ఇహ = ఇచ్చట (కౌషీతకీ వాక్యమునందు), తద్యోగాత్ = బ్రహ్మమును సూచించు పదములు ప్రాణవిషయమునందు ప్రయోగింపఁబడుటచే.

కాని మరియొక ఆక్షేపణ ఇచ్చట లేకెత్తించఁబడినది. ప్రాణోపాసనము మఱియు ప్రాణమును బ్రహ్మముతో ఐక్యమొందించుటనుఁగూర్చిన అధికరణము మరల చెప్పఁబడుటకుఁగల కారణమేమి? ప్రాణమనగా బ్రహ్మమని పూర్వసూత్రమగు 1-1-23 నందు చూపఁబడినది కదా!

దీనికి మా సమాధానమేమనగా – ఈ యధికరణమిచ్చట అనావశ్యకమైనది కాదు. 1-1-23 సూత్రమునందున్న సంశయము కేవలము ప్రాణశబ్దము యొక్క అర్థమునుఁగూర్చినదైయుండెను. ఈ యధికరణమునందున్న సంశయము ప్రాణశబ్దము యొక్క అర్థమునుఁగూర్చి ధ్యానించు చిహ్నములు మఱియు శబ్దములనుఁగూర్చినదై యున్నది. ఈ సంశయమును నివారించుటకై ఈ కౌషీతక్యుపనిషత్తులో చర్చింపఁబడిన అంశము కేవలము బ్రహ్మమేననియు, జీవుడుఁగాని, శ్వాసఁగాని కాదనియును స్పష్టీకరింపఁబడినది.

కావున సూత్రకారునిచే ఈ యధికరణము వేఱుగా సూచింపఁబడినది.

ప్రాణము జీవుని, లేక ముఖ్యప్రాణవాయువును, లేక రెండింటిని సూచించునేగాని, బ్రహ్మమును సూచింపదని పూర్వపక్షి పలుకును. ఒకవైపు జీవుని మరియొకవైపు ముఖ్యప్రాణవాయువు యొక్క లక్షణములను ఈ యధ్యాయము సూచించుచున్నదని అతడు పలుకును.

"మానవుడు వక్తనుఁగూర్చి తెలిసికొనవలయునేఁగాని, వాక్కునుఁగూర్చి విచారింపవలద"(కౌ. ఉ. 3-4)ను వాక్యము జీవుని లక్షణమునుఁగూర్చియే తెలుపుచున్నది. "ప్రాణము శరీరమున కాధారముగానుండి, దానిని లేవనెత్తుచున్నద" (కౌ. ఉ. 3-3)ను వాక్యము ముఖ్యప్రాణవాయువును సూచించును.

ఏలననగా:– శరీరమును పోషించుటయే ప్రాణవాయువు యొక్క ముఖ్యలక్షణము. తర్వాత మరియొక వాక్యము నందు "అప్పుడు ప్రాణమింద్రియములతో ఇట్లనెను: మోసపోకుడు. నేనే ఐదు విధములుగా విభజింపఁబడి ఈ శరీరమును పోషించి, దీనికాధారముగా నుందును". (ప్ర. ఉ. 2–3) అని కలదు. తదనంతర వాక్యమిట్లు న్నది. "ప్రాణమే ప్రాజ్ఞుడు, ప్రాజ్ఞుడే ప్రాణము."

ఇట్టి దృష్టిని ఈ సూత్రము ఖండించి ఇట్లు పలుకును. "ప్రాణము" కేవలబ్రహ్మమునే సూచించును. ఏలననగా పై వ్యాఖ్యానమునందు త్రివిధములగు ఉపాసనలు ఇమిడియున్నవి. (1) జీవుడు (2) ముఖ్యప్రాణ వాయువు (3) బ్రహ్మము. పై వాదము నిశ్చయముగా శాస్త్రదృష్టికి విరుద్ధముగానున్నది. ఒకే వాక్యము త్రివిధములగు ఉపాసనలనుఁగూర్చి పలుకుచున్నదనుట సరికాదు.

ఇఁక ఆరంభమునందు "నన్నే తెలిసికొనుమ"నియు, అనంతరము "నేనే ప్రాణమును, ప్రజ్ఞాత్మను'' నన్ను ప్రాణముగా, అమృతత్వమునుగాను ధ్యానించుమనియు మరియు తుట్టతుదకు "ప్రాణమే నిశ్చయముగా ప్రజ్ఞాత్మ, అనందము, అజరము, ఆమృతమ"నియును చెప్పఁబడినది. దీని ఆద్యంత విభాగములు సామ్యరూపమునందున్నవి. కావున ఇవి ఏకైక పదార్థమునే సూచించుచున్నవనియు మరియు ఒకే విషయము సర్వత్ర కొనసాగింపఁబడిన దనియును నిశ్చయింపఁబడినది.

కావున "ప్రాణము" బ్రహ్మమును మాత్రమే సూచింపవలసియుండును. బ్రహ్మలక్షణములను సూచించు ఇతర వాక్యములలో "ప్రాణ"శబ్దము బ్రహ్మమను అర్థమునందు వాడఁబడినది. అందుచే ఈ యధ్యాయమంతటికి బ్రహ్మమే ముఖ్య విషయమను విషయము నిర్ణయింపఁబడినది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్రములలోని**

**ప్రథమాధ్యాయమునందలి ప్రథమ పాదము**

**పరిసమాప్తమైనది**

# బ్రహ్మసూత్రములు

# ప్రథమాధ్యాయము

# ద్వితీయ పాదము

## పీఠిక

ప్రథమపాదమునందు ఈ సమస్త విశ్వము యొక్క సృష్టి స్థితి లయములకు బ్రహ్మమే మూలకారణమని చెప్పఁబడినది. పరబ్రహ్మము నన్వేషించు విధానము నేర్పఁబడినది. శాశ్వతత్వము, సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత, సర్వాత్మత్వము మొదలగు బ్రహ్మముయొక్క ప్రత్యేక లక్షణములు నుడువఁబడినవి.

ప్రథమ పాదాంత్యమునందు శ్రుతిలోని ఆనందమయము, జ్యోతి, ప్రాణము, ఆకాశము మున్నగు నానార్థముల నొసంగు ప్రత్యేక శబ్దము బ్రహ్మమును సూచించునవిగా వివేచింపఁబడినవి. సంశయగ్రస్తములై యున్న కొన్ని ప్రత్యేక శ్రుతి వాక్యములు స్పష్ట బ్రహ్మలింగములను కలిగియుండుటచే బ్రహ్మముగా పేర్కొనఁబడినవి. దీనియందు మఱియు తర్వాత పాదమునందు అస్పష్ట బ్రహ్మలింగములను కలిగియున్న మరికొన్ని సందేహాస్పదములగు వాక్యములు చర్చింపఁబడినవి. శ్రుతిలోని కొన్ని ప్రత్యేక వాక్యములు బ్రహ్మమును సూచించునా? యను సంశయము కలుగును. అట్టి వాక్యములీ పాదమునందును, శేషించిన పాదముల యందును చర్చింపఁబడినవి.

ప్రథమ పాదమునందు వలెనే రెండు, మూడు పాదములలో కూడా కొన్ని ప్రత్యేక శబ్దములు మరియు వాక్యములు అస్పష్టములై యున్నను, అవి బ్రహ్మమునే సూచించునని చెప్పఁబడినది.

# విషయ సంగ్రహము

శ్రుతియందున్న కొన్ని ప్రత్యేక వాక్యములు బ్రహ్మమును సూచించుచున్నవా? లేక మరియొక దానినిఁగూర్చి సూచించుచున్నవా? యను సంశయము కలుగవచ్చును. ఈ వాక్యము లీ పాదమునందును, తర్వాతి పాదముల యందును చర్చింపఁబడినవి.

వివిధ శ్రుతులయందున్న వివిధమైన ఉక్తులు ఆ యనంత బ్రహ్మమునే సూచించుచున్నవని ఈ పాదమునందు నిరూపింపఁబడినది.

ఛాందోగ్యోపనిషత్తులోని శాండిల్య విద్యయందు ఈ విధముగా చెప్పఁబడినది. "ఈ జన్మలోని కోరికలు మఱియు ఆలోచనల ననుసరించియే ఒక వ్యక్తి యొక్క భవిష్యజ్జీవిత రూపగుణములు నిశ్చయింపఁబడును. కావున మానవుడు పూర్ణము, సచ్చిదానందము, అమరము, స్వయంప్రకాశము, శాశ్వతము, శుద్ధము, అజము, అమృతము, అనంతము మొదలగు లక్షణములతో కూడిన బ్రహ్మమునుఁగూర్చి మాత్రమే నిరంతరము చింతించి, స్మరించి, తదనుగుణ రూపుడు కావలయును."

**1వ అధికరణము (1-8 సూత్రములు):-** ఛాందోగ్యమునందు సూచింపఁబడిన (3-14) శ్వాసయే శరీరముగాఁగలిగిన మనోమయ పురుషుడు బ్రహ్మమే కాని జీవుడు కాడని తెలుపును.

**2వ అధికరణము (9-10 సూత్రములు):-** బ్రాహ్మణ క్షత్రియు లెవ్వరికాహారమై యున్నవో, అట్టివాడు (కఠ. ఉ. 1-2-25) పరమాత్మ, లేక పరబ్రహ్మమని నిశ్చయించును.

**3వ అధికరణము (11-12 సూత్రములు):-** గుహయందు ప్రవేశించిన రెండింటిలో (కఠ. ఉ. 1-3-1) ఒకటి బ్రహ్మమనియు, మరియొకటి జీవుడనియు సూచించును.

**4వ అధికరణము (13-17 సూత్రములు):-** ఛాం. ఉ. (4-15-1) లో సూచింపఁబడిన నేత్రమునందున్న వ్యక్తి బ్రహ్మమునే సూచించునుఁగాని, ఒక ప్రతిబింబమునుఁగాని లేక ఒక జీవునిఁగాని సూచింపదని నిరూపించును.

**5వ అధికరణము (18-20 సూత్రములు):-** బృ. ఉ.(3-7-3) లో వర్ణింపఁబడినట్టి భూమ్యాకాశ పృథ్వ్యప్తేజములలోను, స్వర్గసూర్యచంద్ర నక్షత్రాదులలోను వ్యాపించియున్న అంతర్యామి, బ్రహ్మము తప్ప మరియొకటి కాదని నుడువును.

**6వ అధికరణము (21-23 సూత్రములు):-** ముం. ఉ. (1-1-3)లో సూచింపఁబడిన "అదృష్టమ వ్యవహార్యమ్" మొదలగునవి బ్రహ్మమునే సూచించునని నిరూపించును.

**7వ అధికరణము (24-32 సూత్రములు):-** ఛాందోగ్యములోని (5-11-6) వైశ్వానరాత్మ బ్రహ్మమేయని వాకొనినది.

జైమిని, ఆశ్మరథ్యుడు మఱియు బాదరివంటి ఋషుల వివిధాభిప్రాయములు కూడా ఇచ్చట ఒసంగఁబడుటతో, అనంత బ్రహ్మము కొన్ని సమయములలో ధ్యానమున కనుకూలముగా ఉండుటకై తల, మొండెము, పాదములు మఱియు ఇతరావయవములను కలిగియున్నట్లు భావింపఁబడి, ఒక ఉపాధివలె తలంపఁబడుచున్నది.

# 1. సర్వత్రప్రసిద్ధ్యధికరణము

## మనోమయ బ్రహ్మము

## (1-8 సూత్రములు)

### 1-2-1 సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్

బ్రహ్మము విశ్వమునకు కారణమైయున్నదని ఉపనిషత్తులలో నుడువఁబడుటచే మనోమయమే బ్రహ్మమని తెలియవలయును.

సర్వత్ర = అన్ని ఉపనిషత్తులయందు, ప్రసిద్ధ = ప్రసిద్ధమైన, ఉపదేశాత్ = ప్రబోధముచే.

శ్రుతి ఇట్లు పలికినది "సర్వంఖల్విదం బ్రహ్మతజ్జలానితి శాంత ఉపాసీత, అథఖలు క్రతుమయః పురుషోయథా క్రతురస్మింల్లోకే పురుషోభవతి తథేతః ప్రేత్య భవతి సక్రతుం కుర్వీత, మనోమయః ప్రాణశరీరోభారూపస్సత్య సంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామస్సర్వ గంధస్సర్వరసస్సర్వమిద మభ్యాత్తోఽ వాక్యనాదరః" (ఛాం. ఉ. 3-14-1,2)

ఇచ్చట మనోమయమనెడి లక్షణము తెలుపుట ద్వారా ధ్యేయవస్తువు జీవుడా? లేక పరబ్రహ్మమా? యను సంశయము కలుగును.

బ్రహ్మజ్ఞానము ఈ వాక్యమునకు లక్ష్యముకాదు. ఇది మనోనాశమును మాత్రమే లక్ష్యముగా కలిగియున్నది. తదనంతరము చెప్పఁబడిన "సర్వకర్మా సర్వకామః" అనెడి ఇతర లక్షణములు జీవునికి చెందియున్నవి. శ్రుతి ఇట్లు పలికెను. "బియ్యపుగింజ కంటెను, బార్లిగింజ కంటెను సూక్ష్మమై హృదయము నందున్న వాడను నేనే". ఒక ములుకోల కొనవంటి పరిమాణమును కలుగి యున్నావాడు జీవుడే యగును. కాని అనంతమైన బ్రహ్మము కాజాలదు.

దీనికి మా సమాధానమేమనగా :- మనోమయము మొదలగు లక్షణములతో తెలుపఁబడినట్టి పరబ్రహ్మమే ధ్యానింపఁదగినది. ఏలననగా "బ్రహ్మైవేదం సర్వమ్" అను వాక్యముచే శ్రుతి ప్రారంభింపఁబడినది. సమస్త

శ్రుతివాక్యములలో తెలుపఁబడిన ప్రపంచమునకు కారణమైయున్న బ్రహ్మమే ఇచ్చట కూడా "తజ్జలాన్" అను పదముచే సూచింపబడినది. ఆది యందు బ్రహ్మమును సూచించినట్లే సుప్రసిద్ధ లక్షణములను కలిగి యుండుటచే "మనోమయము" కూడా బ్రహ్మమునే సూచింపవలసి యుండును. ఈ విధముగా ఉన్న విషయమును తొలగించి, అనవసరముగా మరియొక విషయమును చొప్పించు దోషమును మేము నివారింతుము. ఇంతేకాదు, శ్రుతి ధ్యానోపాసలనుగూర్చి ప్రబోధించును. కావున ధ్యేయవస్తువైయున్న ఇతర వాక్యములన్నింటియందు వర్ణింపఁబడిన బ్రహ్మమే ఇచ్చట చెప్పఁబడినది. కాని జీవునిఁగూర్చి కాదు. ధ్యేయము, లేక ఉపాస్యము జీవుడని ఎచ్చటను చెప్పఁబడలేదు.

ఇంతేకాదు, శాంతస్వరూపమైన బ్రహ్మధ్యానముచే నీవు నిశ్చయముగా ప్రశాంతతనుఁ బడయఁగలుగుదువు. ముం. ఉ. (2.2.7), తై. ఉ. (1-6-1), కఠ. ఉ. (7-9) లలో మనోమయమే బ్రహ్మముగా చెప్పఁబడినది. పై వాక్యములన్నింటియందు బ్రహ్మముగా చెప్పబడిన సుప్రసిద్ధ మనోమయమే ఛాందోగ్యమునందు కూడా నుడువఁబడినది. కావున మనోమయము పరబ్రహ్మమును మాత్రమే సూచించును.

## 1-2-2 వివక్షిత గుణోపపత్తేశ్చ.

ఇంతేకాకుండా ఈ చెప్పఁబడిన లక్షణములన్నియును బ్రహ్మమునందే సాధ్యమగును. కావున ఈ వాక్యము బ్రహ్మమునే సూచించును.

వివక్షిత = చెప్పఁబడిన, గుణ = గుణములు, ఉపపత్తేః = ఉచితమగుటచే, చ = ఇంతేకాకుండా.

1వ సూత్రమును బలపఱచు చర్చ కొనసాగుచున్నది. శ్రుతిచే నుడువఁబడిన పై తెలుపఁబడిన లక్షణములు బ్రహ్మమునకే ఉచితములై యుండుట చేత ఈ వాక్యము బ్రహ్మమునే సూచించుచున్నదని చెప్పవలసియుండును.

"మనోమయః ప్రాణశరీరోభారూపస్సత్యసంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామస్సర్వ గంధస్సర్వ రసస్సర్వమిద మభ్యాత్తోఽవాక్యనాదరః" (ఛాం. ఉ. 3-14-2). ధ్యానమున కనుకూలమైన ఈ విశేషణములు బ్రహ్మమునకు మాత్రమే ఉచితములై యున్నవి.

మరియొక వాక్యమునందు పరమాత్మకు సత్కామము, సత్సంకల్పములను విశేషణములు చెప్పఁబడినవి. "అపహత పాప్మా" (ఛా. ఉ. 8-7-1) ఎవరి ఆత్మ ఆకాశమై యున్నదో అను వాక్యములు బ్రహ్మము సమస్త విశ్వమునకు కారణమై, సమస్త పదార్థముల కాత్మయై, ఆకాశమునకు కూడా ఆత్మయై యున్నప్పుడే సాధ్యములగును. ఈ విధముగా ధ్యానయోగ్యములుగా నుడువఁబడిన విశేషణములు బ్రహ్మముయొక్క స్వరూపముతో తాదాత్మ్యము నొందుచున్నవి

బ్రహ్మమునందీ గుణములు సాధ్యములగుటచే, పరబ్రహ్మము మాత్రమే ధ్యేయవిషయమై యున్నదని మా నిశ్చయము.

## 1-2-3 అనుపపత్తేస్తు న శారీరః

ఇంతేకాకుండా జీవునియందీ గుణములసాధ్యములగుటచే, మనోమయము మొదలగునవి జీవుని సూచింపవు.

అనుపపత్తేః = అనుచితమగుటచే, తు = ఇంతేకాకుండా, న = కాదు, శారీరః = జీవుడు.

ఇట్టి గుణములు జీవునికి పొసగవు. మొదటి సూత్రమును బలపఱచు చర్చ ఇంకను కొనసాగుచున్నది. ఈ చెప్పఁబడిన గుణములు బ్రహ్మమున కన్వయించునని పూర్వసూత్రమునందు సూచింపఁబడినది. ఈగుణములు జీవుని కన్వయించునని ఈ సూత్రమునందు చెప్పఁబడుచున్నది. బ్రహ్మము మాత్రమే మనోమయము మొదలగు గుణములను కలిగియుండును, కాని జీవుడు కాదు.

"సత్యసంకల్పుడు, ఆకాశాత్మ, అవాచ్యుడు, శాంతస్వరూపుడు, పృథ్వికంటె అధికుడు" మొదలగు గుణములు జీవుని కన్వయింపవు. శరీరమునందుండువాడు "శారీరుడ "ని భావము.

“ దేవుడు శరీరమునందు కూడా ఉండు”నని పూర్వపక్షి పలికినచో అది నిజమే. శరీరమునందు కూడా అతడు నివసించును. కాని కేవలము శరీరమునందు కాదు, ఏలననగా “దేవుడు పృథ్వికంటె ఘనుడు, స్వర్గముకంటె అధికుడు, ఆకాశమువలె సర్వవ్యాపకుడు, శాశ్వతుడ”ని శ్రుతి వివరించినది. ఇఁక జీవుడు కేవలము శరీరమునందు మాత్రమే ఉనికిని కలిగియుండును.

బ్రహ్మమును సూర్యప్రకాశముతో పోల్చినచో, జీవుడొక మిణుగురు పురుగు వంటివాడు. శ్రుతియందు వర్ణింపఁబడిన మహాగుణములు నిశ్చయముగా జీవుని కన్వయింపవు.

దేవుడు జీవుడు కాకుండుటచే, అతని సర్వవ్యాపకతను నుడువుటకు శక్యము కాదు. మఱియు అన్ని శరీరములందొకే జీవుడుండుటయు అసత్యమున్నూ, అశక్యమున్నూ ఐయున్నది.

## 1-2-4 కర్మ కర్తృవ్యపదేశాచ్చ.

సాధ్యసాధకులనుఁగూర్చి వివరింపఁబడిన కారణముచే, మనోమయము బ్రహ్మమును సూచించునే, కాని జీవుని కాదు.

కర్మ = సాధ్యము, కర్తృ = సాధకుడు, వ్యపదేశాత్ = ఉపదేశింపబడిన కారణముచే, చ = మఱియు.

3వ సూత్రమును బలపఱచు చర్చ కొనసాగుచున్నది.

కర్త మఱియు కర్మకు మధ్య భేదమిచ్చుట చూపఁబడినది. కావున మనోమయుని లక్షణములు జీవునికి చెందవు. శ్రుతివచన మేమనగా:-“మరణానంతరము నేనాతనిని పొందుదును” (ఛాం. ఉ. 3-14-4) ఇచ్చట “అతడ”ను శబ్దము ప్రస్తుత చర్చనీయాంశమును సూచించును. మనోమయుడు, ధ్యేయపదార్థముల విషయమటుండగా “నేను పొందఁగలనను వాక్యము ధ్యాతయగు జీవుడు, లేక కర్తను సూచించును.

కర్త మఱియు కర్మలకు ఒకే విషయము చెప్పఁబడినదని మనము తలంపరాదు. సాధ్యము మఱియు సాధకుడు ఏకము కాజాలవు. ధ్యాత ధ్యేయమునకు

భిన్నుడై యుండును. శ్రుతియందు “నేను” అనెడి సర్వనామముచే జీవుడు సూచింపఁబడెను.

పై కారణముచేత కూడా మనోమయుడు మున్నగు లక్షణములతో కూడియున్నవాడు జీవుడు కాఁజాలడని తెలియుచున్నది.

## 1-2-5 శబ్ద విశేషాత్.

శబ్దములయందుఁగల భేదము వలన.

శబ్ద = శబ్దములయందలి, విశేషాత్ = భేదమువలన.

1వ సూత్రమున కనుకూలమగు చర్చ కొనసాగుచున్నది. శబ్దవిభేద కారణముచే “మనోమయుడు” మున్నగు లక్షణములు కలవాడు జీవుడు కాడు.

శతపథ బ్రాహ్మణమునందు ఇదే భావము ఇవే శబ్దములతో తెలుపఁబడినది. “బియ్యపుగింజవలె, యవగింజవలె, చామగింజవలె, లేక చామగింజలోని పప్పువలె ఆత్మయందీ సువర్ణమయపురుషుడున్నాడు” (10-6-3-2). ఇచ్చట సప్తమీ విభక్తియగు “ఆత్మయంద”ను పదము జీవుని మఱియు “పురుషుడ”నఁబడు ప్రథమావిభక్తి మనోమయుడు మొదలగు లక్షణములతో కూడిన ఆత్మను సూచించుచున్నది.

కావున ఈ రెండున్నూ విభిన్నమైనవనియును మఱియు ప్రస్తుత చర్చనీయాంశము జీవుని కాదనియును మా నిశ్చయమైయున్నది.

## 1-2-6 స్మృతేశ్చ.

ప్రస్తుత చర్చనీయాంశము జీవునికి భిన్నమైయున్నదని స్మృతివలన కూడా మనకు తెలియచున్నది.

స్మృతేః = స్మృతివలన, చ = కూడా.

1వ సూత్రమును బలపఱచు చర్చ కొనసాగుచున్నది.

స్మృతియగు భగవద్గీతయందున్నూ ఇట్లే చెప్పఁబడినది. ప్రస్తుత చర్చనీయాంశము జీవునికి భిన్నమై యున్నదను విషయము స్మృతి వలన కూడా ప్రస్ఫుట మగుచున్నది, “ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి, భ్రామయన్

సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" (18-61) యని స్మృతియందు కూడా జీవుడు పరమాత్మకు భిన్నుడై యున్నట్లు సూచింపఁబడినది.

ఈ భేదము మిథ్యయే కాని నిజము కాదు. "తత్త్వమసి" మహావాక్యమెంత వరకు బోధపడదో మఱియు అజ్ఞానమెంతవరకు నశింపదో, అంతవరకీ విభేదముండును. విశ్వాత్మయే సత్యమను విషయమును గుర్తెఱింగినప్పుడీ సంసార బంధము నుండి విముక్తి లభించును.

## 1-2-7 అర్భకౌ కస్త్వాత్తద్వ్యపదేశాచ్చనేతి చేన్నని చాయ్యత్వా దేవం వ్యోమవచ్చ.

హృదయకుహరము చిన్నదై యుండుట చేతను మఱియు సూక్ష్మత్వము సూచింపఁబడుటచేతను ఈ వాక్యము బ్రహ్మమును సూచింపదని పలికినచో, అట్లు కాదు. ఏలననగా ఇది ఆకాశమును పోలియున్నది. మఱియు బ్రహ్మమునిట్లు ఉపాసింపవలసియున్నది.

అర్భకౌకస్త్వాత్ = స్థానము చిన్నదగుటచేతను, తద్వ్యపదేశాత్ = సూక్ష్మత్వ వర్ణనచేతను, చ = మఱియు, న = కాదు, ఇతి = అట్లు కాదు, చేత్ = ఒక వేళ, న = కాదు, నిచాయ్యత్వాత్ = హృదయమునందు ధ్యానింపదగిన దగుటచే, ఏవం = ఈ విధముగా, వ్యోమవత్ = ఆకాశమువలె, చ = మఱియు.

1వ సూత్ర ఖండన ఖండింపఁబడినది.

బ్రహ్మము కంటె జీవుని కనుకూలమైన వర్ణన యుండుటచే, ఛాందోగ్యములోని మనోమయుడు జీవుడే కాని, బ్రహ్మము కాదని వాదింపఁబడుచున్నది. శ్రుతి వచనమేమనగా, "ఏషమ ఆత్మాంతర్హృదయే ణీయాన్ వ్రీహేర్వాయవాద్వా" (ఛాం.ఉ . 3-14- 3) దీనిచే అణువంతటి చిన్న స్థలమును మనోమయుడాశ్రయించునని తెలియఁబడుటచే, ఇది బ్రహ్మము కాజాలదు.

ఈ సూత్రము దీనిని ఖండించును. ఒక పురుషుడు పృథ్వియంతటికి రాజైనప్పటికిని, అతడయోధ్యాధిపతియని కూడా చెప్పఁబడును. విష్ణుదేవుడు పవిత్రమైన సాలిగ్రామశిల యందెట్లు సాక్షాత్కరింపఁబడునో, అట్లే హృదయగుహ యందు కూడా అతడు సాక్షాత్కరింపఁబడుటచే, అనంతము అణువుగాను చెప్పఁబడును. దేవుడు సర్వాంతర్యామియైయున్నను, హృదయాంతర్వాసిగా

ధ్యానించినచో అతడు తృప్తి నొందును. సూదిలోని రంధ్రము కూడా ఈ విషయమునే సూచించును. ఆకాశము సర్వవ్యాపకమై యున్నను, సూది రంధ్రము యొక్క సంబంధముచే అది సూక్ష్మమైనదిగాను, సంకుచితమైనది గాను చెప్పఁబడును. ఇదే విధముగా బ్రహ్మముఁగూర్చి కూడా చెప్పఁబడినది.

సర్వవ్యాపకమైన అనంతబ్రహ్మమునుఁగూర్చి ధ్యానించుట దుష్కరమగుటచే, ధ్యానానుకూలతకై సూక్ష్మత్వము మఱియు సంకుచితత్వము ఆరోపింపఁబడినది. ఇది నిశ్చయముగా అతని సర్వవ్యాపకతను భంగపఱచదు. బ్రహ్మము నందీ సంకుచితత్వములు కేవలము ఊహామాత్రములు. అవి ఏ మాత్రము నిజము కావు.

అదే వాక్యమునందు బ్రహ్మము భూమివలె అనంతమనియు, ఆకాశమువలె సర్వవ్యాపకమనియు చెప్పఁబడినది. "పృథ్వికంటె ఘనమైనది, ఆకాశముకంటె ఘనమైనది, స్వర్గముకంటె ఘనమైనది, ఈ లోకములన్నింటి కంటె ఘనమైనది." అతడు సర్వవ్యాపకుడై యున్నను, తన భక్తులను రంజింపఁజేయు నిమిత్తమై అతడు తన మాయాశక్తిచే అణుస్వరూపుడగును. తన భక్తులున్న స్థలములన్నింటియందును ఒకే సమయమునందాతడు కానఁబడును. బ్రహ్మము వ్యక్తమైయున్న రూపము నందుకూడా ఒకే సమయమునందు సర్వత్ర అణురూపముగా కానఁబడుటచే అతని సర్వవ్యాపకతను చాటి చెప్పుచున్నది. గోపికలు శ్రీకృష్ణభగవానుని సర్వత్రఁ గాంచిరి.

పూర్వపక్షి ఇట్లు వాదించును. "ఒకవేళ బ్రహ్మము హృదయవాసియై యున్నచో, ఒక్కొక్క శరీరమునందొక్కొక్క హృదయస్థానము భిన్నమై యుండుటచే, విభాజ్యములైక్యత నొందఁగోరుట, అనిత్యత్వము మొదలగు దోషములు బ్రహ్మము నావరించును. శరీరసంబంధజన్యములగు అనుభవముల కాతడు గురియగును. దీనికీ క్రింది సూత్రమునందు సూత్రకారుడు తగిన సమాధానము నొసంగుచున్నాడు.

## 1-2-8 సంభోగ ప్రాప్తిరితిచేన్న వైశేష్యాత్.

సర్వవ్యాపకమగు బ్రహ్మము జీవులందఱి హృదయములతో సంబంధించి యుండుటచే, అది సుఖదుఃఖానుభవమునకు కూడా గురియగునని పలికినచో, ఈ రెండింటి స్వరూపభేదముచే అది అసంభవమని సమాధాన మొసంగఁబడినది.

సంభోగప్రాప్తిః = సుఖదుఃఖానుభవము, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, వైశేష్యాత్ = స్వరూప భేదముచే.

ఇచ్చట మరియొక ఆక్షేపణ ఖండింపఁబడుచున్నది.

సంభోగశబ్దము పరస్పరానుభవమును సూచించును. "సంభోగము" లోని "సం" సహనుండి కలిగినది. కేవలము శరీరములో నివసించిన మాత్రముచే, అది ఎల్లప్పుడు శరీరమునకు సంబంధించిన సుఖదుఃఖములకు కారణమని నుడువుటకు వీలులేదు. మంచిచెడ్డ కర్మల ప్రభావముచే ఈయనుభవము కలుగును. బ్రహ్మమున కిట్టి కర్మలేదు. అతడు నిష్క్రియుడు, లేక అకర్త. గీతయందు పరమాత్ముడిట్లు పలికెను. "నమాం కర్మాణి లింపంతి, నమే కర్మఫలే స్పృహా."

బ్రహ్మము మఱియు జీవుని అనుభవమునందు సామ్యమేమియు లేదు. ఏలననగా:– బ్రహ్మము సర్వవ్యాపకుడు మఱియు జీవుడు అల్పశక్తిమంతుడు, అన్నింటి కాధారపడియుండువాడు.

బ్రహ్మము సర్వవ్యాపకుడైనను, జీవులందఱి హృదయములతో సంబంధించియున్నను, వారివలె ప్రజ్ఞావంతుడైయున్నను, అతడు సుఖదుఃఖములకు గురి కాజాలడు. ఏలననగా జీవుడు కర్త. అతడు సుకృత దుష్కృత కర్మల నొనర్చును. కావుననే అతడు సుఖదుఃఖముల ననుభవించును. బ్రహ్మము కర్తకాడు. అతడు శాశ్వతుడగు సచ్చిదానందస్వరూపుడు. అతడు సర్వపాప విముక్తుడు.

పూర్వపక్షి ఇట్లనును. "జీవుడు తుట్టతుదకు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందును. కావున జీవునిచే అనుభవింపఁబడు సుఖదుఃఖములకు బ్రహ్మముకూడా గుఱియగును." ఇది బుద్ధిహీనమగు వాదము. ఇది అవిశ్వసనీయము. నిజమునకు జీవుడుఁగాని, సుఖదుఃఖములుఁగాని లేవు. సుఖదుఃఖములు మానసిక కల్పన మాత్రమే. జీవుడు అజ్ఞానావరణయందున్నప్పుడు, అతడు సుఖదుఃఖములకు గుఱియగుచున్నానని మూర్ఖముగా చింతించును.

సామీప్యతచే బ్రహ్మమునకు సుఖదుఃఖము లంటవు. ఆకాశములోని ఒక పదార్థము అగ్నిచే దగ్ధమైనచో,ఆ యాకాశమునకు అగ్నిచే ప్రమాదము లేదు. బాలురు పలికినంత మాత్రముచే ఆకాశము నీలవర్ణముగా నుండునా? సుఖదుఃఖముల సూక్ష్మమైన మచ్చకూడా బ్రహ్మమున కారోపింపఁదగదు.

శ్రుతి ఇట్లు పలికినది. "ద్వాసుపర్ణాసయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలంస్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి" (ముం. ఉ . 3-1-1).

ఛాందోగ్యోపనిషత్తులోని (3-14) విభాగము బ్రహ్మమునే సూచించును, కాని జీవుని కాదను విషయమును 1 నుండి 8 వరకుఁగల సూత్రములు నిరూపించినవి.

# 2. అత్త్రధికరణము

## (9-10 సూత్రములు)

### 1-2-9 అత్తా చరాచర గ్రహణాత్.

చరాచర జగత్తంతయు బ్రహ్మమున కాహారమగుటచే, అతడే భోక్తయనఁబడును.

అత్తా = భోక్త, చరాచర గ్రహణాత్ = చరాచర జగత్తంతయు అతని కాహారమగుటచే.

కఠోపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది. కఠోపనిషత్తు (1-2-25)లో ఇట్లున్నది. " యస్యబ్రహ్మాచ క్షత్రంచ ఉభేభవత ఓదనః మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థావేదయత్రసః" ఈ పరిచ్ఛేదములోని "ఆహారము" మఱియు "ఊరగాయ" శబ్దములచే ఒక భోక్త ఉన్నాడనిమనకర్థమగుచున్నది.

ఈ భోక్త ఎవరు? ఇచ్చట అగ్నియే భోక్తగా సూచింపఁబబడినదా? "సోమ ఏవాన్నమగ్నిరన్నాదః" (బృ. ఉ. 1-4-6) లేక ఇచ్చట జీవుడే భోక్తగా సూచింపఁబడినాడా? "తయోరన్యః పిప్పలంస్వాద్వత్తి" (ముం. ఉ. 3-1-1) లేక పరమాత్మయా?

చరాచరజగత్తు సూచింపఁబడుటచే ఇచ్చట పరమాత్మయే భోక్తయని మా సమాధానము. జగత్తంతయు బ్రహ్మమునందు లయించును. బ్రహ్మమునకు

మృత్యువే ఊరగాయకాగా, చరాచరజగత్తంతయు ఆహారమగును. సమస్త ప్రపంచమునకు భోక్త, ఈ సమస్త పదార్థములను లయమొనర్చు కొనువాడు కేవలము బ్రహ్మమే యగును, కాని మరియొకటి కాదు.

బ్రాహ్మణులు మఱియు క్షత్రియులు ప్రథమస్థానము నాక్రమించుట చేతను, జీవసృష్టియందు వారు మొదటివారగుటచేతను వీరు కేవలము ఉదాహరణార్థము గైకొనఁబడిరి. ఈ శబ్దములు కేవలము ఉపమానాత్మకములు.

మృత్యువుచే చిలకరింపఁబడిన జగత్తంతయు ఇచ్చట ఆహారముగా సూచింపఁబడినది. ఇతర పదార్థములను రుచ్యములుగా నొనర్చి, వాటిని సంతుష్టిగా భుజించునట్లొనర్చునదే ఊరగాయ. కావున ఇతర పదార్థములను రుచికరముగా నొనర్చు ఊరగాయవంటి మృత్యువే స్వయముగా మ్రింగఁబడును. కావున మృత్యువుచే ఈ సమస్త ప్రపంచము భోక్తకు రుచికరముగా నొనర్పఁబడునను మాట లయకర్తయగు బ్రహ్మమునే సూచించును. ప్రళయకాలమునందీ సమస్త ప్రపంచము నాతడు తన యందు లయమొనర్చుకొనును. కావున ఇచ్చట పరమాత్మయే భోక్తగా గ్రహింపవలయును.

పూర్వపక్షి ఇట్లనును. "బ్రహ్మమిచ్చట భోక్తకాజాలదు. శ్రుతివచన మేమనగా "అనశ్నన్నన్యోఽభిచాకశీతి" దీనికి విలువ లేదని మా సమాధానము. కర్మఫలములను నిషేధించుటయే ఈ వాక్యమునకు లక్ష్యమైయున్నది. ప్రపంచము బ్రహ్మమునందు తిరిగి లయించుటను నిషేధించుట దీనిభావము కాదు. ఏలననగా ప్రపంచముయొక్క సృష్టి స్థితి ప్రళయములకు బ్రహ్మమే కారణమై యున్నదను విషయము శ్రుతులన్నింటిచే నిరూపింపఁబడినది. కావున ఇచ్చట భోక్త బ్రహ్మమేనైయున్నది.

## 1-2-10 ప్రకరణాచ్చ.

మఱియు సందర్భము ననుసరించికూడా ఇచ్చట బ్రహ్మమే భోక్తయై యున్నది.

ప్రకరణాత్ = సందర్భము ననుసరించి, చ = కూడా.

9వ సూత్రమును బలపఱచువాదమిచ్చట ఒసంగఁబడినది.

బ్రహ్మము చర్చనీయాంశము. ప్రారంభమునందు నచికేతుడు ధర్మరాజు నిట్లడిగెను. "అన్యత్ర ధర్మాదన్యత్రా ధర్మాదన్యత్రా స్మాత్కృతాకృతాత్, అన్యత్రభూతాచ్చ భవ్యాచ్చయత్తత్పశ్యతి తద్వద" (కఠ. ఉ. 1-2-14). దానికి యముడిట్లనెను.

"తత్తేపదం సంగ్రహేణ బ్రవీవ్యోమిత్యేతత్" (కఠ. ఉ. 1-2-15). "నజాయతేమ్రియతేవా" (కఠ. ఉ. 1-2-18) చిట్టచివరికి యముడిట్లనెను.

"యస్యబ్రహ్మ చ క్షత్రంచ ఉభే భవత ఓదనః మృత్యుర్యప్యోపసేచనం క ఇత్థావేదయత్రసః (కఠ. ఉ . 1-2-25)

బ్రహ్మమే ముఖ్యాంశమై యున్నదని ఇవన్నియును స్పష్టముగా తెలుపుచున్నవి. ఈ ముఖ్యాంశము ననుసరించి యుండుటయే సరియైన మార్గము. కావున ఇచ్చట బ్రహ్మమే భోక్త. ఇంక "క ఇత్థా వేదయత్రసః అను వాక్యాంశముచే ఆత్మసాక్షాత్కారము దుర్లభమని తెలియుచున్నది. దీనిచే పరమాత్మయే తెలియ బడుచున్నది.

"చ" యను శబ్దముచే స్మృతియగు భగవద్గీత కూడా ఇదే విషయమును సూచించుచున్నదని తెలియవలయును.

"పితాసిలోకస్య చరాచరస్య, త్వమస్యపూజ్యశ్చ గురుర్గరీయాన్। నత్వత్సమోఽ స్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్య ప్రతిమప్రభావ" (గీత 11-43).

# 3. గుహాప్రవిష్టాధికరణము.

# (11-12 సూత్రములు)

## 1-2-11 గుహాం ప్రవిష్టావాత్మానౌహితద్దర్శనాత్

అది ఆ విధముగా చూడఁబడుటచే హృదయగుహలో ప్రవేశించిన రెండింటిలో ఒకటి జీవుడు, రెండవది పరమాత్మయని తెలియవలయును.

గుహామ్ = హృదయగుహను, ప్రవిష్టౌ = ప్రవేశించిన, ఆత్మానౌ = ఆత్మపరమాత్మలు రెండు, హి = నిశ్చయముగా, తద్దర్శనాత్ = అది ఆ విధముగా చూడఁబడుటచే.

కఠోపనిషత్తులోని మరియొక వాక్యము చర్చింపఁబడుచున్నది. కఠోపనిషత్తు (1-3-1)లో ఇట్లు చెప్పఁబడినది. "ఋతం పిబంతౌ సుకృతస్యలోకే గుహాంప్రవిష్టౌ పరమే పరార్థే, ఛాయాత పౌ బ్రహ్మవిదోవదంతి పంచాగ్నయోయేచ త్రిణాచికేతాః."

ఇచ్చట సూచింపఁబడిన ద్వివచనము జీవుడు మఱియు బుద్ధిని సూచించు నేమోయనెడి సంశయము కలుగును.

ఈ రెండున్నూ ప్రజ్ఞతో కూడిన ఒకే స్వభావమును కలిగియుండుటచే, ఈ వాక్యము జీవుడు మఱియు పరమాత్మనుఁగూర్చి తెలుపుచున్నదని నుడువలసియుండును. సామాన్యముగా మనము ద్వివచనము పేర్కొనినపుడు అవి ఒకే వర్గమునకు చెందినవిగా మన మర్థమొనర్చుకొందుము. ఒక ఎద్దు మనవద్దకు తీసుకొని రాఁబడిప్పుడు మనము "మరియొక దానిని తీసుకురమ్ము, రెండవ దానిని వెదకుమ"ని పలుకుదుము. దీని కర్థము మరియొక ఎద్దు; గుఱ్ఱముగాని, మానవుడుగాని కాదు. కావున హృదయగుహయందు జీవునితో పాటు మరియొకటి ప్రవేశించినదని చెప్పినప్పుడు అదే వర్గమునకుచెందిన మరియొక ప్రజ్ఞాన్విత పదార్థమగునే కాని, జడమైన బుద్ధికాదు.

గుహయందున్న పరమాత్మనుఁ గూర్చియే శ్రుతిస్మృతులు పలుకుచున్నవి. కఠోపనిషత్తు (1–2–12) ఇట్లు పలుకుచున్నది. "తం దుర్దర్శం గూఢమను ప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్" తైత్తిరీయోపనిషత్తు (2–1) ఇట్లు నుడువుచున్నది. "గుహయందు దాగియున్న ఉన్నతాకాశము నెవడు తెలిసికొనునో" మఱియు "గుహాప్రవిష్టుడైన ఆత్మనుఁగూర్చి అన్వేషింపుము." ధ్యానధారణలకై సర్వవ్యాపియగు బ్రహ్మమునకు ప్రత్యేకస్థాన మొసంగఁబడినది. దీనియందు తర్కవైరుధ్యములేదు.

ఒక మనుష్య సమూహమునందొకే ఒకడు గొడుగును కలిగియున్నను. "గొడుగును కలిగియున్న మనుష్యుల"ని చెప్పునప్పుడు ఆ సమూహమునకంతటికెట్లు వర్తించునో, అట్లే ఒక సమూహములోని ఒకానొకని గుణములు ఒక్కొక్కప్పుడా సమూహమున కంతటికి పరోక్షముగా వర్తించును. అదే విధముగా ఇచ్చట కూడా కర్మఫలములను ఒకేయొకడనుభవించుచున్నను, ఉభయులు కర్మఫలములను భుజించుచున్నట్లు చెప్పఁబడినది.

నిజమునకు పరమాత్ముడు కర్మఫలముల ననుభవింపక, కేవలము జీవుడు మాత్రమే కర్మఫలముల ననుభవించుచున్నను "పిబంతౌ" అను ద్వివచనశబ్దముచే ఇది ఉభయులకు వర్తించుచున్నది. కేవలము జీవుడు త్రాగుచున్నను, జీవుని త్రాగునట్లు చేయునది పరమాత్ముడగుటచే అతడు కూడా త్రాగుచున్నాడని ఈ వాక్యమునందు చెప్పఁబడినదని మనము వివరింపవచ్చును. జీవుడు ప్రత్యక్షకర్త. పరమాత్ముడు కారణకర్త. అనగా జీవుడు ప్రత్యక్షముగా త్రాగును, మఱియు పరమాత్ముడు జీవుని త్రాగునట్లు చేయును.

"నీడ" మఱియు "వెలుతుర"ను శబ్దములచే పరమాత్ముని అనంత జ్ఞానము మఱియు జీవుని పరిచ్ఛిన్నమగు జ్ఞానము తెలియఁబడుచున్నది. లేక జీవుడు సంసారమను సంకెలచే బంధింపఁబడినాడనియు, పరమాత్ముడు సంసారమున కతీతుడై యున్నాడనియును తెలియుచున్నది.

కావున "రెండు గుహలయందు ప్రవేశించినవ"ను మాటచే జీవుడు మఱియు పరమాత్మయని తెలియవలయును.

ఈ వ్యాఖ్యానమునకు మరియొక కారణ మీ క్రింది సూత్రమునందు చూపఁబడినది.

## 1-2-12 విశేషణాచ్చ.

తదనంతర శ్రుతి వాక్యములో ఈ రెండింటియొక్క లక్షణములు విభిన్నముగా చెప్పఁబడుటచే.

విశేషణాత్ = విభిన్న లక్షణములచే, చ = కూడా

11వ సూత్రమును బలపఱచు వాదమిచ్చుట పేర్కొఁనబడినది.

కఠోపనిషత్తులోని ఇతర విభాగములలోఁగల వర్ణనచేతను ఇది స్పష్టమగుచున్నది.

ఇఁక శ్రుతియందు సూచింపఁబడిన విభిన్న లక్షణములు కేవలము జీవుడు మఱియు పరమాత్మకే వర్తించును. ఏలననగా తర్వాతి (1-1-3) వాక్యమునందు హృదయ గుహయందు ప్రవేశించిన రెండింటి లక్షణములు చెప్పఁబడినవి. ఈ రెండు జీవుడు మఱియు బ్రహ్మమని సూచింపఁబడినవి. "ఆత్మ రథికుడనియు, శరీరము రథమనియు తెలిసికొనుము." రథికుడైన జీవుడు మార్పునొందు సత్తా ద్వారా ముక్తదశ నొందుటకు ప్రయత్నించును. మఱియు "సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్" అని (కఠ. ఉ. 1-3-9) లో చెప్పబడినది. సారథి చేరవలసిన గమ్యస్థానము పరమాత్మయని ఇచ్చట సూచింపఁబడినది. జీవుడు మఱియు పరమాత్మ, లేక బ్రహ్మమనెడి సాధ్యసాధకులు రెండు ఇచ్చట సూచింపఁబడినవి.

పూర్వవాక్యము (1-2-12) నందు కూడా "తం దుర్దర్శం గూఢమను ప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్, అధ్యాత్మయోగాధిగమేనదేవం మత్వాధీరోహర్షశోకౌజహాతి"అని చెప్పఁబడినది.

ఇచ్చట ధ్యాత మఱియు ధ్యేయమనెడి రెండింటినిఁగూర్చి పలుకఁబడినది.

ఇంతేకాకుండా పరమాత్మ ప్రధానాంశమైయున్నది. కావున ఈ వాక్యములో చర్చింపఁబడిన అంశము జీవుడు మఱియు పరమాత్మ యని స్పష్టమగుచున్నది.

# 4. అంతరాధికరణము

## (13-17 సూత్రములు)

### 1-2-13 అంతర ఉపపత్తేః

కేవలము బ్రహ్మమునకు తగిన లక్షణములు సూచింపఁబడుటచే నేత్రమునందున్న వ్యక్తి బ్రహ్మమే యగును.

అంతరే = నేత్రమునందున్న పురుషుడు, ఉపపత్తేః = తగిన లక్షణము లుండుటచే.

నేత్రములోని పురుషుడు బ్రహ్మమే. ఏలననగా ఉపనిషద్వాక్యము పరమాత్మకే అన్వయించును. కాని మరియొకదాని కన్వయింపదు.

ఛాందోగ్యము (4-15- 1) లోని మరియొక భాగమునందున్న నేత్రములోని పురుషుడే పరబ్రహ్మమనెడి ఉపాసనా విధానము చర్చనీయాంశముగాఁ గైకొనఁబడినది.

ఛాందోగ్యము (4-15-1) నందు "య ఏషోఽక్షిణి పురుషోదృశ్యత ఏషఆత్మేతి హోవా చైతదమృత మభయమేతద్బ్రహ్మ" అను వాక్యము కలదు. ఇచ్చట ఈ వాక్యములో నేత్రమునందు చూడఁబడునది ఆత్మయా? లేక జీవుడా? లేక, ఈ నేత్రమునకుఁగల అధిష్ఠాన దేవతయా? లేక పరమాత్ముడా? యను సంశయము కలుగును.

"అమృతము, అభయము" వంటి లక్షణములు చెప్పఁబడుటచే ఈ కంటిలోని పురుషుడు బ్రహ్మమేయని ఈ సూత్రము నుడువుచున్నది.

పాపముచే అంటువడని "సంయద్వామ"మున్నగు లక్షణములు పరమాత్మకే చెందును. అందరికి నాయకుడగు "వామనీ " మఱియు పూర్ణప్రకాశమగు "భామనీ"

యనెడి నేత్రములోని పురుషునికి చెప్పఁబడిన లక్షణములు బ్రహ్మము విషయము నందును వర్తించును.

కావున పరస్పర సామ్యతచే నేత్రములోని పురుషుడు పరమాత్మ, లేక పరబ్రహ్మమే యగును.

## 1-2-14 స్థానాది వ్యపదేశాచ్చ.

మఱియు స్థానము మొదలగువానిని సూచించుటచే.

స్థానాది = స్థలము మొదలగునవి, వ్యపదేశాత్ = చెప్పఁబడిన కారణముచే, చ = మఱియు.

13వ సూత్రమును బలపఱచువాద మిచ్చుట ఒసంగఁబడినది.

ఇతర సూత్రములలో ధ్యానానుకూలతకై స్థానము, నామము, రూపము మొదలగు లక్షణములు స్వయముగా బ్రహ్మమున కాపాదింపఁబడినవి. కాని సర్వవ్యాపియగు బ్రహ్మము నేత్రమువంటి చిన్న స్థలమునందెట్లుండఁగలుగును? విష్ణువును ధ్యానించుటకై సాలిగ్రామమువలె, ఉపాసనానిమిత్తమై సర్వవ్యాపియగు బ్రహ్మమునకు హృదయగుహ, నేత్రము, భూగోళము, సూర్యబింబము మొదలగు ప్రత్యేకస్థానము లొసంగఁబడినవి. ఇది న్యాయ విరుద్ధము కాదు.

నిర్గుణబ్రహ్మము ధ్యానయోగ్యము కాకుండుటచే, ధ్యానానుకూలతకై బ్రహ్మమునకు స్థానముతోపాటు నామరూపములు కూడా ఆరోపింపఁబడినవని సూత్రములోని "చ" అను శబ్దము సూచించుచున్నది. "అతని పేరు ఉత్". "ఆతడు బంగారు గడ్డమును కలిగియున్నాడు." (ఛాం. ఉ. 1-6-6, 7). ఇవి దీనికి ప్రమాణములై యున్నవి.

## 1-2-15 సుఖవిశిష్టాభిధానాదేవచ.

మఱియు ఆనందము (బ్రహ్మము) నకు విశేషణముగా చెప్పఁబడిన కారణముచే.

సుఖ = ఆనందము, విశిష్ట = విశేషించి, అభిధానాత్ = వర్ణింపఁబడుటచే, ఏవ = కేవలము, చ =మఱియు.

13వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

వైదిక గ్రంథము  పరమాత్మను సూచించుచున్నదేగాని, క్లేశపూర్ణుడగు జీవుని సూచింపని కారణముచే.

అధ్యాయారంభమునందు "శ్వాసయే బ్రహ్మము, క బ్రహ్మము, ఖ బ్రహ్మమనెడి వాక్యములచే సూచింపఁబడిన ఆనంద విశిష్టమగు బ్రహ్మమును ఇచ్చట కూడా గ్రహింపవలయును. ఏలననగా చర్చనీయాంశమును దృష్టియందుంచుకొనుట మనకు సవ్యమై యున్నది.

బ్రహ్మమునుఁగూర్చి గురువు ఉపకోసలునికి నేర్పిన "శ్వాసయే బ్రహ్మము. ఆనందమే బ్రహ్మము, ఆకాశమే బ్రహ్మమ"నెడి అగ్నుల (ఛాం. ఉ. 4-10-5) యందున్న బ్రహ్మమే "నేత్రములోని పురుషుడు"గా వర్ణింపఁబడెను.

"శ్వాసయే బ్రహ్మము, క బ్రహ్మము, ఖ బ్రహ్మమ"నెడి అగ్నుల వృత్తాంతము విన్న తర్వాత ఉపకోసలుడిట్లనెను. "శ్వాసయే బ్రహ్మమనెడి విషయము నాకర్థమైనది. కాని క మఱియు ఖ బ్రహ్మమనెడి విషయము నాకర్థము కాలేదు. "అప్పుడా అగ్నులిట్లు పలికెను. "క యే ఖ, మఱియు ఖ యే  క."

"క"యను శబ్దము సామాన్యభాషయందు విషయసుఖమును సూచించును. క కు విశేషణముగా ఖ శబ్దము ప్రయోగింపఁబడకున్నచో, మనము సామాన్యమగు ప్రాపంచిక సుఖముగా తలంచియుందుము. కాని  క, ఖ శబ్దములు ఒకే చోట యుండుటచేతను, ఒక దాని  కొకటి విశేషణములై యుండుటచేతను, అవి ఆనందమయమగు బ్రహ్మమునే సూచించుచున్నవి. కావున ఇచ్చట పరమానందము పేర్కొనఁబడుటచే, ఇది కేవలము బ్రహ్మము యొక్క  వర్ణనయేనై యున్నది.

"క బ్రహ్మమ"ను వాక్యములో బ్రహ్మమను శబ్దము చేర్చఁబడకుండునేని మఱియు "క, ఖ బ్రహ్మమ"ను వాక్యము చెప్పఁబడియుండునేని, క శబ్దము కేవల విశేషణమై యుండెడిది. ఈ విధముగా కేవల విశేషణమైయున్న ఆనందము ధ్యేయవిషయము కాకుండెడిది. దీనిని నివారించుటకై క, ఖ యనెడి రెండు శబ్దములున్నూ బ్రహ్మముతో చేర్చఁబడినవి. "క బ్రహ్మము, ఖ బ్రహ్మము." కావున విశేషణములు మఱియు విశేషణములతో కూడియున్న పురుషులున్నూ ధ్యేయ విషయములై యున్నవి.

## 1-2-16 శ్రుతోపనిషత్క గత్యభిధానాచ్చ.

మఱియు ఉపనిషదర్థమును గుర్తెఱింగిన వాని మార్గము సూచింపఁబడిన కారణముచే.

శ్రుత = విన్న, ఉపనిషత్క = ఉపనిషత్తులుఁగలవాని, గతి = మార్గము, అభిధానాత్ = చెప్పఁబడుటచే, చ = మఱియు.

13వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఈ క్రింది కారణముచేత కూడా నేత్రములోని పురుషుడు పరమాత్ముడనఁబడును. బ్రహ్మజ్ఞానియొక్క మార్గము శ్రుతివల్ల మనకు తెలియుచున్నది. మరణానంతర మాతడు దేవయాన మార్గముగుండా ప్రయాణము చేయును. ఆ మార్గము (ప్ర. ఉ. 1-10) యందు వర్ణింపఁబడినది. "అథోత్తరేణ తపసాబ్రహ్మచర్యేణ శ్రద్ధయా విద్యయాత్మాన మన్విష్యాదిత్య మభిజయంతే ఏతద్వై ప్రాణానామాయ తన మేతదమృత మభయ మేతత్పరాయణమే తస్మాన్న పునరావర్తంత ఇత్యేషనిరోధః తదేషశ్లోకః"

నేత్రములోని పురుషుని గుర్తెఱింగినవాడు కూడా మరణానంతర మీ మార్గమునే అనుసరించును. బ్రహ్మజ్ఞుని మార్గమేదో, అదే మార్గము ఇచ్చటకూడా వర్ణింపఁబడుటచే నేత్రములోని పురుషుడు బ్రహ్మమే యను విషయము స్పష్టమగుచున్నది.

ప్రతిబింబితాత్మ జీవుడు, లేక సూర్యదేవుడని చెప్పుటకలవికాదని ఈ క్రింది సూత్రము నిరూపించును.

## 1-2-17 అనవస్థితే రసంభవాచ్చనేతరః

నేత్రములోని పురుషుడు పరమాత్మయే కాని, మరియొకడు కాడు. (జీవుడు మొదలగునవి) ఏలననగా ఇవి ఎల్లకాలముండునవి కావు. మఱియు ఈ పురుషుని యొక్క లక్షణములను మరియొక దానిపై ఆరోపించుట అసాధ్యము.

అనవస్థితేః = ఎల్లప్పుడుండునది కాకుండుటచే, అసంభవాత్ = అసాధ్యమగుటచే, చ = మఱియు, న = కాదు, ఇతరః = మరియొకటి.

13వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచుచన్నది.

ప్రతిబింబితాత్మ శాశ్వతముగా నేత్రము నందుండదు. ఒక వ్యక్తి నేత్రమును

సమీపించినప్పుడా వ్యక్తి యొక్క ప్రతిబింబము నేత్రమునందగుపడుచు, అతడు వెళ్ళిపోయినప్పుడా ప్రతిబింబము అదృశ్యమగును.

నేత్రములోని రూపమును ధ్యానించుటకై నీవు నిశ్చయముగా ఒక వ్యక్తిని నీ ముందుంచుకొనవు. ఇట్టి చంచలమైన రూపము ధ్యేయ పదార్థము కాదు. అవిద్యా కామ కర్మలచే కూడియున్న వాడగుట చేతను, పరిపూర్ణుడు కాకుండుట చేతను ఆతడు జీవుడని నుడువుటకున్నూ వీలులేదు. కావున ఆతడు ధ్యేయవస్తువు కాజాలడు. ప్రతిబింబితాత్మకుఁగాని, జీవునికిఁగాని లేక సూర్యదేవునికిఁగాని అమృతత్వము, నిర్భయత, సర్వవ్యాపకత, శాశ్వతత్వము, పూర్ణత్వము మొదలగు గుణముల నారోపించుటకు వీలులేదు. కావున నేత్రములోని పురుషుడు పరమాత్ముడే తప్ప మరియొకడు కాజాలడు. నేత్రములోని అక్షిపురుషుడు పరమాత్ముడేయని మనము భావింపవలసి యుండును.

# 5. అంతర్యామ్యధికరణము

## (18-20 సూత్రములు)

### 1-2-18 అంతర్యామ్యధి దైవాదిషుతద్ధర్మవ్యపదేశాత్.

బ్రహ్మము యొక్క విశేషణములు చెప్పఁబడుటచే, దేవతలు మొదలగు వారి యొక్క అంతరంగ పరిపాలకుడు బ్రహ్మమే నైయున్నది.

అంతర్యామి = అంతరంగమును పాలించువాడు, అధిదైవాదిషు = దేవతలు మున్నగువారియందు, తత్ = ఆతనియొక్క, ధర్మ = విశేషణములు, వ్యపదేశాత్ = చెప్పబడుటచే.

ఇప్పుడు బృహదారణ్యకములోని ఒక వాక్యము చర్చింపబడు చున్నది. (బృ. ఉ. 3-7-1) లో "య ఇమం చ లోకం పరంచలోకం సర్వాణి చ భూతాని యోఽ౨ంతరోయమయతి" యనియు మఱియు (బృ. ఉ. 3-7-3) లో "యః పృథివ్యాంతిష్ఠన్ పృథివ్యా అంతరోయం పృథివీనవేద యస్య పృథివీశరీరం యః పృథివీ మంతరోయమయత్యేష త ఆత్మాఽ౨ంతర్యామ్య మృతః" అనియు కలదు.

ఇచ్చట అంతర్యామి జీవుడా? లేక సూక్ష్మశరీరము ధరించుట మొదలగు

అమానుష శక్తులు గల ఒక యోగియా? లేక అధిష్ఠాన దేవతయా? లేక ప్రధానమా? లేక పరబ్రహ్మమా? యనెడి సంశయము కలుగును.

అంతర్యామి, భూమి కధిష్ఠానదేవతయైన ఒకానొక దేవుడై యుండ వచ్చునని పూర్వపక్షి పలుకును. కర్మేంద్రియములను కలిగియుండుటచే అతడు మాత్రమే భూమినేలుటకు సమర్థుడు. పరిపాలకత్వము అతనికి మాత్రమే ఆరోపింపఁ బడవలయును. లేక తన అమానుష శక్తులచే అందరి యందు ప్రవేశించుట కావశ్యమైయున్న కర్మేంద్రియములు లేనివాడగుటచే నిశ్చయముగా పరబ్రహ్మము పరిపాలకుడు కాజాలడు.

దానికి మేమీ క్రింది సమాధానము నొసంగుదుము. అంతరంగ పరిపాలకుడు పరబ్రహ్మమే యగును. ఏలయనగా ప్రస్తుత వాక్యమునందాతని లక్షణములు చెప్పబడినవి. సృష్టింపఁబడిన పదార్థములన్నింటికి బ్రహ్మమే కారణమైయున్నది. పరమాత్మకు మాత్రమే విశ్వపరిపాలకత్వము తగిన లక్షణమైయున్నది. సర్వశక్తిమత్త్వము, అంతరంగత్వము, అమృతత్వము మున్నగునవన్నియు బ్రహ్మమునకు మాత్రమే ఆరోపింపబడవలయును.

"యం పృథ్వీనవేద" యను వాక్యముచే అంతరంగ పరిపాలకుడు భూదేవతకాదని తెలియుచున్నది. కావున అంతరంగ పాలకుడు ఆ దేవతక భిన్నుడై యున్నాడని స్పష్టమగుచున్నది. "అదృశ్య" "అశ్రోత్ర" లక్షణములు కూడా రూపము ఆదిగాఁగల ఇంద్రియగోచరములగు గుణములకు విలక్షణమైయున్న పరమాత్మనే సూచించుచున్నవి.

అతడు భూమి, సూర్యుడు, నీరు, అగ్ని, ఆకాశము, ఇంద్రియములు మున్నగు సమస్త పదార్థములయందుండి, వాటిని పరిపాలించుచుండుటచే సర్వవ్యాపక విభాగమునందున్నూ వర్ణింపఁబడియున్నాడు. దీనిచే పరమాత్మ,లేక పరబ్రహ్మము మాత్రమే తెలియఁబడుచున్నది. ఈ కారణము లన్నింటిచే అంతరంగ పరిపాలకుడు పరమాత్మ, లేక పరబ్రహ్మమేయని రూఢియగు చున్నది.

## 1-2-19 న చ స్మార్త మతద్ధర్మాభిలాపాత్.

మరియు అంతరంగ పరిపాలకుడనగా సాంఖ్యస్మృతియందు తెలుపఁబడిన ప్రధానము కాదు. ఏలననగా దానికి విభిన్నమైన లక్షణము లిచ్చుట చెప్పబడినవి.

న = కాదు, చ= మఱియు, స్మార్తం = సాంఖ్యస్మృతియందు చెప్పఁబడినది. అతద్ధర్మాభిలాపాత్ = దానికి విలక్షణమైన లక్షణములు చెప్పబడుటచే.

18వ సూత్రమును బలపఱచు వాద మొసంగఁబడినది.

చైతన్యరహితమగుటచేతను, ఆత్మపదార్థము కాకుండుటచేతను అంతర్యామి శబ్దము ప్రధానమును సూచింపదు.

"ఏషత ఆత్మాంతర్యామ్యమృతోఽ దృష్టోద్రష్టాశ్రుతః శ్రోతామతో మంతా విజ్ఞాతో విజ్ఞాతానాన్యోఽ తోఽ స్తి ద్రష్టానాన్యోఽ తోఽ స్తిశ్రోతా నాన్యోఽ తోఽ స్తి మంతానాన్యోఽ తోఽ స్తి విజ్ఞాతైషత ఆత్మాంతర్యామ్యమృతోఽ తో ఽ న్యదార్తమ్ (బృ. ఉ. 3-7-23) ఈ లక్షణములను అచేతనమైన గ్రుడ్డితనముఁగల ప్రధానమున కారోపింపఁదగదు. కావున ప్రధానము "అంతర్యామి" అనఁబడజాలదు.

పూర్వపక్షి ఇట్లనును. "సరి అంతర్యామి పదము ఆత్మయు, ద్రష్టయు కాకుండుటచే ప్రధానమును సూచింపనిచో బుద్ధిమంతుడు, ద్రష్ట, శ్రోత, మంత, జ్ఞాత మఱియు అంతర్గతుడగుటచే ఆత్మస్వరూపుడై యున్న జీవుని నిశ్చయముగా సూచించును. ఇంతేగాక, భోక్త యగుటచే జీవునికి ఇంద్రియముల నాజ్ఞాపించు శక్తియు కలదు. కావున జీవుడు "అంతర్యామి" యని చెప్పుటకు వీలున్నది."

దీనికీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-2-20 శారీరశ్చోభయేఽ పి హి భేదేనైన మధీయతే.

మఱియు బృహదారణ్యకోపనిషత్తులోని కాణ్వమాధ్యందిన శాఖలు రెండున్నూ దీనికి భిన్నముగా చెప్పుటచే జీవుడు అంతర్యామి కాజాలడు.

శారీరః = జీవుడు, చ = మఱియు , (న = కాదు), ఉభయే = కాణ్వమాధ్యందిన శాఖలవారు, అపి = కూడా, హి = ఏలననగా, భేదేన = భేదముచే, ఏనం = ఈ జీవుని, అధీయతే = చెప్పుదురు.

18వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది. "కాద"నెడి శబ్దమును పూర్వసూత్రమునుండి గ్రహింపవలయును.

జీవుడు అంతర్యామికి భిన్నుడని ఉభయశాఖల అనుయాయులున్నూ తమ గ్రంథములలో పేర్కొనియున్నారు. కాణ్వులు "యో విజ్ఞానే తిష్ఠన్ " (బృ. ఉ. 3-7-22)అని పలుకుదురు. ఇచ్చట జ్ఞానము జీవునికి బదులుగా చెప్పబడినది. మాధ్యందినులు "య ఆత్మని తిష్ఠన్ " అని పలుకుదురు. ఇచ్చట జీవునికి బదులుగా ఆత్మ చెప్పఁబడినది. ఈ రెండింటియందును జీవుడు అంతర్యామికి భిన్నముగా చెప్పఁబడెను. ఏలననగా అంతర్యామి జీవుని కూడా పరిపాలించువాడై యున్నాడు.

ఉపాధికారణముచే జీవునికి, బ్రహ్మమునకు మధ్య భేదమేర్పడినది, కేవలము అవిద్య, లేక అజ్ఞానకారణముచే జీవునికి, అంతర్యామికి మధ్య భేదమేర్పడినది. అజ్ఞాన జనితమగు కర్మేంద్రియములను కలిగిన జీవునికి కారణమొకటి కలదు. కావున భేదము పూర్తిగా నిజమైనది కాదు. ఏలననగా అంతరంగమునందున్నది ఒకే ఆత్మ కాని, రెండు ఆత్మలుండుట కవకాశము లేదు. ఘటాకాశము మఱియు మఠాకాశమునందున్న భేదమువలె, ఉపాధుల కారణముచే ఒకే ఆత్మ రెండు ఆత్మలుగా మనకు గోచరించును.

"యత్రహిద్వైత మివ భవతి తదితర ఇతరం పశ్యతి" అను శ్రుతి వాక్యానుసారముగా అజ్ఞానపరిధియందే ప్రపంచము ఉనికిని కలిగియుండుననియు "అంతయు ఆత్మయేనై యున్నప్పుడెవ్వడైనను రెండవదాని నెట్లు గాంచున"నెడి తదనంతర వాక్యానుసారముగా సత్యజ్ఞాన మండలమునందు ప్రపంచమదృశ్య మగుననియు స్పష్టమగుచున్నది.

# 6. అదృశ్యత్వాధికరణము
# (21-23 సూత్రములు)

## 1-2-21 అదృశ్యత్వాది గుణకోధర్మోక్తేః

అదృశ్యత్వాది గుణములు చెప్పబడుటచే, ఇట్టి గుణములు కలిగియున్నవాడే బ్రహ్మమని తెలియనగును.

అదృశ్యత్వ = కనఁబడకుండుట, ఆది = మొదలగు, గుణకః = గుణములను కలిగియున్నవాడు, ధర్మోక్తేః = ఈ గుణములు చెప్పఁబడుటచే.

ముండకోపనిషత్తులోని కొన్ని ఉక్తులిప్పుడు చర్చనీయాంశములుగా గైకొనబడినవి.

ముండకము (1-1-5,6)నందు "అథ పరా యయాతదక్షర మధిగమ్యతే, యత్తదద్రేశ్య మగ్రాహ్యమగోత్ర మవర్ణ మచక్షుశ్రోత్రం తదపాణిపాదమ్, నిత్యం విభుంసర్వగతం సు సూక్ష్మం తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరాః" అను వాక్యము కలదు.

ఇచ్చట అగ్రాహ్యము మొదలగు లక్షణములచే చెప్పఁబడిన భూతయోని ప్రధానమా? జీవుడా? పరమాత్మయా? లేక పరమేశ్వరుడా? యను సంశయము కలుగును.

అగ్రాహ్యము మొదలగు లక్షణములచే చెప్పఁబడిన భూతయోని పరమాత్మ లేక పరబ్రహ్మమేనై యున్నది. మరియొకటి కాదు. ఏలననగా:- "యస్సర్వజ్ఞ స్సర్వవిత్" (ముం. ఉ. 1-1-9) అని చెప్పఁబడిన గుణములు కేవలము బ్రహ్మమునకు మాత్రమే చెందును. కాని జడమైన ప్రధానమునకు చెందదు. తన నిమ్న పరిస్థితులచే సంకుచితుడై యుండుటచే ఇచ్చట నిశ్చయముగా జీవుడని చెప్పుటకున్నూ వీలులేదు. ఈ వాక్యములుగల విభాగము కూడా పరావిద్యకు సంబంధించినదై యున్నది. కావున ఇది బ్రహ్మమునే సూచించును. కాని ప్రధానమునుఁగాని, జీవునిఁగాని సూచింపదు.

## 1-2-22 విశేషణ భేద వ్యపదేశాభ్యాం చ నేతరౌ.

విభిన్నమైన గుణములు మఱియు భేదములు చెప్పఁబడుటచే, ఇతరములగు రెండున్నూ (జీవుడు మఱియు ప్రధానము) భూతయోనియని చెప్పఁబడజాలవు.

విశేషణభేదవ్యపదేశాభ్యాం = విలక్షణములగు గుణములు మఱియు భేదములు చెప్పఁబడుటచే, చ = మఱియు, న = కాదు, ఇతరౌ = మిగిలిన రెండు.

21వ సూత్రమును బలపఱచు వాద మొసంగఁబడినది.

ఈ క్రింది కారణముచేత కూడా భూతయోని బ్రహ్మము, లేక పరమాత్మయే యగునుఁగాని, శేషించిన రెండు అనగా జీవుడు మఱియు ప్రధానములు కావు.

ముండకోపనిషత్తు (2-1-2) లో "దివ్యోహ్యామూర్తః పురుషస్స బాహ్యాభ్యంత రోహ్యజః అప్రాణోహ్యమానాశ్శుభ్రోహ్యక్షరాత్పరతః పరః"యను వాక్యము కలదు. ఇచ్చట సూచింపఁబడినట్టి దివ్య, అజ, శుభ్ర మొదలగు విలక్షణ గుణములు జీవుని కేమాత్రము చెందవు. ఏలననగా ఆతడు తాను నామరూములచేతను, అజ్ఞానము చేతను ఆవరింపఁబడిన వాడుగా తలంచుటయేఁగాక ఉపాధిఁ గలవాడనియు, అపవిత్రుడనియు, సశరీరుడనియును భావించును. కావున ఈ వాక్యము ఉపనిషత్తులన్నింటికి విషయమై యున్న బ్రహ్మము, లేక పరమాత్మనే సూచించునను మాట సుస్పష్టము.

"అక్షరాత్పరతః పరః" (ప్రధానము) అని గడిచిన సూత్రములో భూత యోనిగా చెప్పఁబడినది. ప్రధానము కాదు. కాని దానికి భిన్నమైన మరియొక పదార్థమై యున్నది. ఇచ్చట అక్షరమనెడి శబ్దము నామరూపములకు బీజరూపమైయున్న దేవునియందు తన్మాత్రరూపమునందున్న అవ్యక్తము, లేక అవ్యాకృతమును సూచించును. ఈ కార్యమునకు కారణము లేకుండుటచే, ఇది కార్యములన్నింటికి ఆదియై యున్నది. బుద్ధి, మనస్సు, అహంకారము, తన్మాత్రలు, ఇంద్రియము లన్నియును దీనినుండియే జన్మించినవి. "అక్షరాత్పరతః పరః" యని భేదము సూచింపఁబడుటచే ఇది పరమాత్మ, లేక పరబ్రహ్మమునే సూచించుచున్నదనుట సుస్పష్టము.

ప్రధానము, లేక అవ్యక్తమున కతీతముగా పరబ్రహ్మము కలదు. కావున భూతయోని పరమాత్మ, లేక పరబ్రహ్మమే యని నిశ్చితమగుచున్నది.

ఇదే విషయమును నిర్ణయించుటకై మరియొక వాద మీ క్రింది సూత్రము నందొసంగఁబడినది.

## 1-2-23 రూపోపన్యాసాచ్చ.

మఱియు దానియొక్క రూపము చెప్పఁబడుటచే, ప్రస్తుతవాక్యము బ్రహ్మమును సూచించుచున్నది.

రూప = రూపము, ఉపన్యాసాత్ = సూచింపఁబడుటచే, చ = కూడా.

21వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఇక ఆతని రూపము ముండకము (2-1-4) నందిట్లు వర్ణింపఁబడినది. "అగ్నిర్మూర్ధాచక్షుషీ చంద్ర సూర్యౌదిశశ్శ్రోత్రేవాగ్వివృతాశ్చవేదాః వాయుః ప్రాణోహృదయం విశ్వమస్య పద్భ్యాం పృథివీహ్యేష సర్వభూతాంతరాత్మా."

ఇట్టి రూపవర్ణన కేవలము పరమాత్మ, లేక పరబ్రహ్మమునకు మాత్రమే చెల్లును. జీవుడు న్యూనమైన శక్తి కలవాడగుటచేతను, ప్రధానము ఆత్మఁగాని అంతర్యామిఁగాని కాకుండుటచేతను ఇట్టి వర్ణన బ్రహ్మమునకు మాత్రమే సరిపోవును.

భూతయోని ప్రధాన విషయమగుటచే "ఏతస్మాజ్జాయతే ప్రాణః " మొదలుకొని "సర్వభూతాంతరాత్మా" వరకుఁ గల పరిచ్ఛేదమంతయు "భూతయోని" నే సూచించును.

"పురుష ఏ వేదం విశ్వం కర్మతపోబ్రహ్మ పరామృతమ్" (ముం. ఉ. 2-1-10) అను వాక్యము భూతయోని పరబ్రహ్మమునకు అన్యము కాదని సూచించుచున్నది. ఏలననగా అదియే సమస్త జీవుల కంతర్యామియైయున్నది.

# 7. వైశ్వానరాధి కరణము

## (24-32 సూత్రములు)

## 1-2-24 వైశ్వానరః సాధారణ శబ్దవిశేషాత్.

వైశ్వానరుడు మఱియు ఆత్మలకు మధ్య భేదము సూచింపఁబడుటచే నరుడు బ్రహ్మమే యగును.

వైశ్వానరః = వైశ్వానరుడు, సాధారణశబ్ద = సామాన్య శబ్దము, విశేషాత్ = భేదము చెప్పఁబడుటచే.

శ్రుతియందు ఉపాసన నిమిత్తమై ప్రయోగింపఁబడిన "వైశ్వానర" శబ్దము బ్రహ్మమును సూచించునని ఈ సూత్రము నిరూపించును.

ఛాం. ఉ. (5-18-1,2) నందు "యస్త్వేతమేవం ప్రాదేశ మాత్రమభి విమాన మాత్మానం వైశ్వానరముపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేష్వాత్మ స్వన్నమత్తి, తస్యహవా ఏతస్యాత్మనో వైశ్వానరస్య మూర్ధైవ సుతేజాశ్చక్షుర్విశ్వరూపః ప్రాణః పృథగ్వర్త్మాత్మా సందేహో బహులో వస్తిరేవరయిః పృథివ్యేవపాదావుర ఏవవేదిర్లోమాని బర్హిర్హృదయం గార్హ్యపత్యోమనోఽన్వాహార్యపచన ఆస్యమా హవనీయః"అను మంత్రములు కలవు.

ఈ "వైశ్వానర" శబ్దము జఠరాగ్నిని సూచించునా? భూతాగ్నిని సూచించునా? అగ్నియొక్క అధిష్ఠాన దేవతను సూచించునా? జీవాత్మను సూచించునా? లేక బ్రహ్మమును సూచించునా? యనెడి సంశయమిచ్చట ఉత్పన్నమగును.

మానవుడు భుజించిన ఆహారమును పచన మొనర్చునట్టి జఠరాగ్నియే వైశ్వానరుడని పూర్వపక్షి పలుకును. (బృ. ఉ. 5-9) లేక అది భూతాగ్ని కావచ్చును; లేదా అగ్ని కధిష్ఠానదేవత కావచ్చును; లేక వైశ్వానరాగ్నికి సామీప్యమునందుండి భోక్తయని చెప్పఁబడు జీవుడై యుండవచ్చునని అతడనును.

ఈ శబ్దములను వివరించు అవయవములుండుటచే ఇచ్చట బ్రహ్మము. లేక పరమాత్మయే సూచింపఁబడినదని సిద్ధాంతి నుడువును."ఈ వైశ్వానరునికి స్వర్గమే శిరస్సు. సూర్యుడే నేత్రము" మున్నగునవి ఈ అవయవములు. ఇట్టిది పరమాత్మ విషయమునందే సాధ్యమగును.

మరియొక వాక్యమునందు "ప్రపంచములన్నింటియందును, అన్ని ఆత్మలయందుండి అతడాహారమును భుజించున"ని కలదు. వైశ్వానరుని పరమాత్మగా అంగీకరించినప్పుడే ఇది సాధ్యపడును.

"వైశ్వానరాత్మను ఉపాసించుటచే కోరికలన్నియు పొందఁబడును. మఱియు సమస్త పాపములు నశించున"ని (ఛాం. ఉ. 5-24-3)లో కలదు. పరమాత్మను అంగీకరించినప్పుడే ఇది సత్యమగును. ఇంతే కాకుండా "ఆత్మయనగానేమి? బ్రహ్మమనగా నేమి?" అను ప్రశ్నలతో ఈ యధ్యాయము ప్రారంభమగును. ఈ

"ఆత్మ" మఱియు "బ్రహ్మ" శబ్దములు బ్రహ్మమునకు చిహ్నములగుటచే పరమాత్మనే సూచించును. బ్రహ్మ శబ్దమిచ్చట ప్రధానముగా ప్రయోగింపఁబడినది. కావున ఈ యధ్యాయమంతయు "బ్రహ్మము"నుఁ గూర్చియే వివరించుచున్నదని తలంచుట యుక్తము. ఇంతేఁగాక వ్యుత్పత్తినిఁబట్టి కూడా వైశ్వానరుడనగా బ్రహ్మమే. ఏలననగా "విశ్వ" అనగా సమస్తము, "నర"అనగా మనుష్యులు. కావున "తనయందు సమస్త మానవులను కలిగియున్నవాడ"ని దీని భావము. ఇట్టి పురుషుడు బ్రహ్మమేయనక తప్పదు.

కాబట్టి "వైశ్వానర" శబ్దము కేవలము బ్రహ్మమునే సూచించునను విషయము నిశ్చయింపఁబడినది.

## 1-2-25 స్మర్య మాణ మనుమానం స్యాదితి.

ఏలననగా స్మృతియందు వర్ణింపఁబడిన పరమాత్ముని విశ్వరూపము ఒక అనుమానమై యున్నది. దీనిచే ప్రస్తుత చర్చనీయాంశము యొక్క అర్థమును ఊహింపవచ్చును.

స్మర్యమాణం = స్మృతియందు సూచింపఁబడినట్టి, అనుమానం = సూచించు చిహ్నము, స్యాత్ = కావచ్చును, ఇతి = ఇందుచే.

24 వ సూత్రమును బలపఱచు వాద మొసంగఁబడినది. "ఇతి" శబ్దము కారణమును సూచించును. శ్రుతియందున్న విషయమునిది ధృఢపఱచును. శ్రుతిలోని వాక్యములను స్మ ృతులు వ్యాఖ్యానించును. కావున శ్రుతిలోని వాక్యమునందు సంశయము కలిగినప్పుడు, ఆ విషయమును తేటతెల్ల మొనర్చుకొనుటకై స్మృతిని మనము పరిశీలింపవలసి యుండును. పరమాత్ముని విశ్వరూపవర్ణన స్మృతియందిట్లు కలదు. "అగ్ని ముఖుడెవ్వడో, స్వర్గమే శిరస్సుగా కలిగినవాడెవ్వడో, ఆకాశమే నాభియై యున్నవాడెవ్వడో, సూర్యచంద్రులే నేత్రములుగా కలవాడెవ్వడో, దిక్కులే శ్రోత్రములుగా కలవాడెవ్వడో, ప్రపంచమే శరీరమైయున్నవాడెవ్వడో, అతనికి నా ప్రణామములు". ఈ వర్ణన ప్రస్తుత చర్చనీయాంశమునకు అనుకూలముగా నున్నది. శ్రుతియందు చెప్పఁబడిన దేవుడే, స్మృతియందున్నూ వర్ణింపఁబడినాడు.

"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్" (భగవద్గీత 15-14). ఈ వైశ్వానర శబ్దము కూడా పరమేశ్వరునకే చెందియున్నది. ఈ స్మృతివాక్యమునందు భగవంతుని సత్యత వివరింపఁబడుటచే, ఛాందోగ్యోపనిషత్తులోని వైశ్వానరవిద్యయున్నూ భగవంతుని రహస్యమునే బయల్పఱచుచున్నదని తెలియవలయును. కావున వైశ్వానరుడనగా పరమేశ్వరుడేనై యున్నాడు. కాబట్టి ఈ పరిచ్ఛేదమునందు పరబ్రహ్మమే సూచింపఁబడినదనుట నిర్వివాదమగు నిర్ణయమై యున్నది.

వైశ్వానరుడు జఠరాగ్నిని సూచించునేమో యను సంశయమును ఈ క్రింది సూత్రము నివారించును.

## 1-2-26 శబ్దాది భ్యోఽ ంతః ప్రతిష్ఠానాచ్చనేతిచేన్న, తథాదృష్ట్యుప దేశాద సంభవాత్పురుషమపి చైన మధీయతే.

వైశ్వానరునికి జఠరాగ్ని యనెడి నిశ్చితార్థ ముండుటచేతను మఱియు జఠరాగ్నివలె అంతరంగమునం దుండుటచేతను వైశ్వానరుడు బ్రహ్మము, లేక పరమాత్మకాదని చెప్పినచో, "అట్లుకాద"ని సమాధానము. ఏలననగా బ్రహ్మమును జఠరాగ్నిగా భావించవలయుననెడి సిద్ధాంతమొకటి కలదు. కారణమేమనగా స్వర్గము మున్నగు వాటిని శిరస్సు మఱియు ఇతర అవయవములుగా కలిగియుండుట జఠరాగ్నికి అసంభవము. ఇంతేకాకుండా వాజసనేయులు వైశ్వానరుని ఒక మానవునిగా అభివర్ణించిరి. ఈ విషయము జఠరాగ్నికి వర్తించదు.

శబ్దాదిభ్యః = శబ్దాది కారణముచే, అంతః = అంతరంగమునందు, ప్రతిష్ఠానాత్ = ప్రతిష్ఠింపబడుటచే, చ = మఱియు, న = కాదు, ఇతిచేత్ = అనిచెప్పినచో, న = అట్లుకాదు, తథా = ఈ విధముగా, దృష్ట్యుపదేశాత్ = దానిని ఊహించు సూత్రముచే, అసంభవాత్ = అసంభవమగుటచే, పురుషం = పురుషునివలె, అపి = కూడా, చ = మఱియు, ఏనం = అతనిని, అధీయతే = వారు వర్ణింతురు.

24 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

పూర్వ పక్షి ఈక్రింది నిషేధమును చూపును. అగ్నియే వైశ్వానరునికి సామాన్యార్థము. ఇంతేకాకుండా వైశ్వానరుడు అంతరంగమునందున్నాడని శ్రుతి నుడువుచున్నది. "మానవునియందున్న వానిని అతడు గుర్తెంఱుంగును." (శత.

బ్రా. 10-6-1-11) అనునని జఠరాగ్నిని మాత్రమే సూచించును. కావున ప్రస్తుత చర్చనీయాంశము జఠరాగ్నికే వర్తించును. కాని బ్రహ్మమునకు వర్తింపదు.

ఈ సూత్రము ఈ నిషేధమును నిరాకరించును. సిద్ధాంతి ఈ క్రింది సమాధానము నొసంగును. "మనస్సే బ్రహ్మమని మానవుడు ఉపాసించును గాక!" (ఛాం. ఉ. 3-18-1) ఇట్టి వాక్యములవలె శ్రుతి ఇచ్చట బ్రహ్మమును జఠరాగ్నిగా ఉపాసించుమని ప్రబోధించుచున్నది.

ఇంతేగాక, జఠరాగ్ని స్వర్గమనెడి శిరస్సు మున్నగు అవయవములను కలిగియుండదు. మఱియు వాజసనేయులు వైశ్వానరుని ఒక పురుషునిగా భావింతురు. "ఈ వైశ్వానరుడనెడి అగ్ని ఒక మానవుడు." (శత. బ్రా. 10-6-1-11)

కావున ఇచ్చట "వైశ్వానరుడు" బ్రహ్మమును మాత్రమే సూచించును. ఈ వాక్యములోని వైశ్వానరుడు భూతాగ్నియు, అగ్నిదేవతయు కాదని ఈ క్రింది సూత్రమునందు సూత్రకారుడు నిరూపించుచున్నాడు.

## 1-2-27 అత ఏవ న దేవతా భూతంచ.

ఈ కారణముచేతనే వైశ్వానరుడు అగ్నిదేవతగాని, భూతాగ్నిగాని కాజాలడు.

అత ఏవ = ఈ కారణముచే, న = కాదు, దేవతా = అగ్నికధిష్ఠాన దేవత, భూతం = భూతాగ్ని, చ = మఱియు.

24 వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును. "అగ్నికధిష్ఠానదేవత బలమైనవాడు. అతడు మహాప్రభువు మఱియు మహాశక్తిమంతుడు. కావున స్వర్గలోకము మొదలగు వాటిని శిరస్సు మున్నగు అవయవములుగా కలిగియుండుట కాతడు సమర్థుడే యగును. కావున ఈ వాక్యము అతని కన్వయించుననుట యుక్తమై యున్నది.

26 వ సూత్రమునందు వివరింపఁబడిన కారణములచే వైశ్వానరుడు అగ్నిదేవతయు, భూతాగ్నియు కాదు. భూతాగ్ని కేవలము వేడి మఱియు వెలుతురై యున్నది. స్వర్గాదులను దానికి శిరస్సు మున్నగు వాటిగా ఆరోపింపదగదు. ఏలననగా ఒక కార్యము మరియొక కార్యమునకు కారణము కాజాలదు. మఱియు అగ్నిదేవత స్వర్గలోకము ఇత్యాదులను శిరస్సు మున్నగు వానిగా ఆరోపించుట పాడిగాదు. ఏలననగా అది కేవలము కార్యరూపమై యున్నది. కాని పరమకారణము

కాదు. దాని శక్తి, లేక ప్రతిభ యంతయు పరమాత్మునిపై ఆధారపడియుండును. వీటికి "ఆత్మ" శబ్దము ఏ మాత్రమున్నూ అన్వయింపదు.

## 1-2-28 సాక్షాదప్య విరోధం జైమినిః

వైశ్వానరుని సాక్షాద్బ్రహ్మముగా భావించి ఉపాసించినచో, విరోధములేదని జైమిని స్పష్టీకరించెను.

సాక్షాత్ = సాక్షాత్తుగా, అపి = కూడా, అవిరోధం = విరోధము లేదు, జైమినిః (ఆహ) అని జైమిని పలికెను.

24 వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

వైశ్వానరుడు దేవునికి చిహ్నమైయున్న అగ్నియని చెప్పు ఆవశ్యకత లేదని జైమిని పలికెను. అది సాక్షాత్తుగా బ్రహ్మమును సూచించును. కాని ప్రాథమిక దశయందది సరైనదనియు, యోగ్యమైనదనియు చెప్పవచ్చును. "వైశ్వానరుడ" నెడి ఒకే యొక శబ్దము జీవిత సర్వస్వమును మఱియు బ్రహ్మమును సూచించును. ఏలననగా అతడు సర్వాత్మమయుడై యున్నాడు. (సర్వాత్మత్వాత్).

వైశ్వానరుడనగా స్వయముగా విశ్వనరుడు, అనగా సర్వవ్యాపియగు బ్రహ్మమే యగుటచే సాక్షాత్తుగా బ్రహ్మభావనచే ఉపాసింపవచ్చునని ఈ సూత్రము విశదీకరించుచున్నది. అక్షరశః వైశ్వానరుడనగా "మనుజులందరి కధీశుడు" లేక విశ్వమునకంతటికి నాయకుడ"ని అర్థము. కావున వైశ్వానరశబ్దము వ్యుత్పత్తి ననుసరించి పరబ్రహ్మమునే సూచించును.

## 1-2-29 అభివ్యక్తే రిత్యాశ్మరథ్యః

వ్యక్తమైన కారణముచేతయని ఆశ్మరథ్యుడు పలికెను.

అభివ్యక్తేః = వ్యక్తమైన కారణముచే, ఇతి = ఈ విధముగా, ఆశ్మరథ్యః = ఆశ్మరథ్యుడు పలికెను.

24 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఛాందోగ్యమునందు వైశ్వానరుడు ఒకే జేన పరిమాణముగా వర్ణింపబడెను. అనంతమైయున్న బ్రహ్మము ఒక జేన పరిమాణమునందెట్లణగి యుండును? ఇట్టి శంకకు సూత్రకారుడీ క్రింది సూత్రమునందు సమాధాన మొసంగుచున్నాడు.

ఉపాసకుని నిమిత్తమై స్వయముగా అనంతమైయున్న బ్రహ్మము అంతవంతుడగు వ్యక్తియందు దేహము, లేక మానవుని హృదయమునందు వ్యక్తమగునని ఆశ్మరథ్యముని పలికెను. కావున జఠరాగ్నికి బదులుగా వాడబడు "వైశ్వానర" శబ్దము బ్రహ్మమును సూచించుచున్నదనుటలో దోషము లేదు. బ్రహ్మము సర్వవ్యాపకుడై యున్నను, అతడు స్వర్గలోకమునుండి భూలోకమువరకు, లేక ప్రత్యేకముగా హృదయమునందు తన భక్తుల నిమిత్తమై స్వయముగా వ్యక్తమగును.

మనస్సులోని మానసికరూపమునందును, లేక బాహ్యముగా భౌతికరూపమునందును అనంతబ్రహ్మము తన అనుగ్రహము ద్వారా ప్రత్యక్షమగునని ఆశ్మరథ్యుడు పలికెను. అంగుష్ఠమాత్రుడుగా తమ హృదయమునందు బ్రహ్మమును ధ్యానించు భక్తులు అతనిని అదే పరిమాణమునందు దర్శింతురు. ఏలననగా అతడు వారికి అదే రూపమునందు వ్యక్తమగును. ఇది ఆశ్మరథ్యుని అభిప్రాయము.

కావున ఆశ్మరథ్యాచార్యుని మతము ననుసరించి, శాస్త్ర నిర్దిష్టమైయున్న అంగుష్ఠమాత్ర పురుషుడు పరబ్రహ్మము, లేక పరమాత్ముని సూచించును.

## 1-2-30 అనుస్మృతేర్బాదరిః

ధ్యాన నిమిత్తమై, లేక నిరంతరస్మరణ కొఱకని బాదరిముని పలికెను.

అనుస్మృతేః = ఉపాసన నిమిత్తమై, లేక నిరంతరము స్మరించుటకై, బాదరిః = అని బాదరిముని పలికెను.

24 సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

ఈ యంగుష్ఠపరిమాణము, ఉపాసన కనుకూలముగానుండుటకై మనస్సు పన్నిన యుక్తియని బాదరి ముని పలికెను.

ఈ యంగుష్ఠపరిమాణము మానసిక ఊహయేకాని, నిజముగా అది దాని పరిమాణము కాదని అతని అభిప్రాయము.

హృదయాంతర్వాసియు, అంగుష్ఠపరిమాణము కలవాడునగు పురుషుడు మనస్సుచే స్మరింపఁబడుటకు లేక ధ్యానింపఁబడుట కనుకూలుడగుటచే పరమాత్ముడు "అంగుష్ఠమాత్రుడ"ని చెప్పఁబడును. హృదయముయొక్క పరిమాణము అంగుష్ఠ మాత్రమై యుండును. హృదయపద్మ నివాసిగా బ్రహ్మము ఉపాసింపఁబడుటచే, ముముక్షువు అప్రయత్నముగా అంగుష్ఠమాత్ర

పురుషుని యందు రతుడు కాగలుగును. ఈ మానసిక కలయిక, లేక అనుస్మృతియే బ్రహ్మము ప్రాదేశమాత్రుడు, లేక అంగుష్ఠమాత్రుడని పిలువఁ బడుటకు కారణమైయున్నది.

కావున నిజముగా వైశ్వానరుడు బ్రహ్మమేయని చెప్పనొప్పును.

## 1-2-31 సంపత్తేరితి జైమిని స్తథా హిదర్శయతి.

ఊహాతాదాత్మ్యతచే పరమాత్మ ప్రాదేశమాత్రుడు (అంగుష్ఠమాత్రుడు) గా చెప్పఁబడవచ్చును. ఇది శ్రుతివాక్యమని జైమిని పలికెను.

సంపత్తేః = మిథ్యాతాదాత్మ్యతచే, ఇతి = ఇట్లు, జైమినిః = జైమిని పలికెను, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, దర్శయతి = శ్రుతి పలుకుచున్నది.

24 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

నీ శరీరములోని శిరస్సుయొక్క సహస్రారమునుండి నీ చిబుకము వరకుఁగల రూపమును సాక్షాత్కరించుకొను వర్ణనను ఇది సూచించుచున్నదని జైమిని పలికెను. శిరస్సుయొక్క ఉపరితలమునుండి చిబుకము వరకుఁగల ఉపాసకుని శిరస్సే స్వర్గము, ఆతని నేత్రములే సూర్యచంద్రులు ఇత్యాదులు. ఈ యుపాసనయందు వైశ్వానరుడు శిరస్సుయొక్క సహస్రారమునుండి చిబుకము వరకుఁగల జేనెడు పరిమాణముఁగలవాడుగా గ్రహింపఁబడును. కావున ప్రస్తుత పరిచ్ఛేదమునందు పరమేశ్వరుడు జేనెడు పరిమాణముఁగలవాడుగా తలంపఁబడెనని జైమిని పలికెను.

శ్రుతి కూడా ఇట్లు విస్తరించెను. “తన శిరస్సును చూపుచు ఆచార్యుడిట్లనెను. ఇదియే వైశ్వానరుని శిరస్సు. ఇదియే మహావైశ్వానరుడఁనబడును”. – వాజసనేయి *బ్రాహ్మణము.*

## 1-2-32 ఆమనంతి చైనమస్మిన్.

ఇంతేకాకుండా శిరస్సు మఱియు చిబుకము మధ్యగల స్థలమునందే పరమాత్ముడు పాసింపఁ బడవలయునని జాబాలురు ప్రబోధింతురు.

ఆమనంతి = వారు ప్రబోధింతురు, చ = ఇంతేకాకుండా, ఏనం = దీనిని, అస్మిన్ =దీనియందు.

24 వ సూత్రమును బలపఱచు వాదము పరిసమాప్తమైనది.

ఇంతేకాకుండా శిరస్సు మఱియు చిబుకము మధ్యగల స్థలమునందు పరమాత్ముడున్నాడని తమ గ్రంథములలో జాబాలురు ప్రబోధించియున్నారు.

జాబాలశ్రుతియున్నూ ఇట్లే పలుకును. ఆతడు వారణ (పాపమును తొలగించువాడు) మఱియు నాసి (పాపమును నశింపఁజేయువాడు). కావున ఆతడు విముక్తుడై యున్నాడని జాబాలశ్రుతి పలుకును. "దీనికి స్థానమేది?" "కనుబొమ్మలు మఱియు నాసిక కలియుచోటు, శిరస్సు యొక్క ఉపరితలము స్వర్గలోకముగా భావింపఁబడినది. మఱియు రెండవదగు భూలోకము చిబుకముగా తలంపఁ బడినది." (జాబాలోపనిషత్తు-1).

"జేనెడుగా వర్ణింపఁబడిన ప్రాదేశకమాత్రుడగు పరమేశ్వరుడు స్వర్లోకము నుండి భూలోకము వరకు విస్తరించి యున్నాడ"నుట సరియైనదని 27 నుండి 32 వరకుఁగల సూత్రములు వర్ణించుచున్నవి.

వీటన్నింటిచే వైశ్వానరుడు పరబ్రహ్మమేయని నిరూపింపఁబడినది. (జాబాలోపనిషత్తు- 1 నిఁ గాంచుడు).

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**ప్రథమాధ్యాయ ద్వితీయపాదము**

**సమాప్తము**

# బ్రహ్మసూత్రములు

## ప్రథమాధ్యాయము

## తృతీయ పాదము

### పీఠిక

పూర్వపాదమునందు బ్రహ్మమును సూచించు సంశయాత్మకములగు అంశములు వ్యాఖ్యానింపఁబడినవి. రెండవపాదములో చర్చింపఁబడని వివిధశ్రుతులయందున్న ఉపాసనాయోగ్యములగు మరికొన్ని అంశములు కూడా అనంతబ్రహ్మమునే సూచించుననెడి విషయమిప్పుడు చర్చింపఁబడి, నిరూపింపఁబడుచున్నది.

ప్రథమాధ్యాయములోని ప్రథమపాదమునందు సూత్రకారుడు ప్రపంచమునందు వ్యక్తమైయున్న ఆకాశము, ప్రాణము, జ్యోతి మున్నగు శబ్దములు నిజముగా బ్రహ్మమునే సూచించుననెడి విషయమును నిర్ణయంచెను. రెండవపాదమునందు సూత్రకారుడు మానవశరీరములోని అంశములను పేర్కొని, అవి బ్రహ్మమునే సూచించునను విషయమును నిరూపించెను. ఈ విభాగము సగుణబ్రహ్మమునుఁ గూర్చి చర్చించినది. తృతీయపాదము నిర్గుణబ్రహ్మమును సూచించును. దీనిలోని చర్చనీయాంశము పరబ్రహ్మము, లేక నిర్గుణ బ్రహ్మమై యున్నది.

# సారసంగ్రహము

రెండవపాదములో చర్చింపఁబడని వివిధ శ్రుతులయందున్న ధ్యానయోగ్యము లగు మరికొన్ని వాక్యము లిప్పుడు చర్చింపఁబడి అవి యన్నియు అనంతము, శాశ్వతము, సర్వవ్యాపకము, అమరమైన సచ్చిదానంద పరబ్రహ్మమునే సూచించుచున్నవను విషయము నిరూపింపఁబడుచున్నది.

**1 వ అధికరణము (1 నుండి 7 సూత్రములు):-** స్వర్గలోకము, భూలోకము మున్నగునవి దేనియందోతప్రోతమై (ముం. ఉ. 2-2-5) యున్నవో, అది బ్రహ్మమేయని నిరూపించును.

**2 వ అధికరణము (8-9 సూత్రములు):-** ఛాం. ఉ. 7-23లో సూచింపఁబడిన "భూమ" బ్రహ్మమే యని నిరూపించును.

**3 వ అధికరణము (10 నుండి 12 సూత్రములు):-** ఆకాశముచే ఓతప్రోతమైయున్న అక్షరుడు (బృ. ఉ. 3-8-8) బ్రహ్మమేయని ప్రబోధించును.

**4 వ అధికరణము (13 సూత్రము):-** ఓంకారముచే ధ్యానింపఁబడు పురుషోత్తముడు (ప్ర. ఉ. 5-5) సగుణబ్రహ్మము కాదనియు, అది నిర్గుణబ్రహ్మమనియు నిశ్చయించును.

**5 వ అధికరణము (14 నుండి 21 సూత్రములు):-** ఛాం. ఉ. 8-1లో సూచింపఁబడిన హృదయ కమలములోని దహరాకాశము బ్రహ్మమేయని నిరూపించును.

**6 వ అధికరణము (22, 23 సూత్రములు):-** "తమేవ భాంతమనుభాతి సర్వం, ఈస్యభాసాసర్వమిదం విభాతి" (కఠ. ఉ. 2-5-15) యనునది భౌతికముగా ప్రకాశించు ఏదో ఒక శరీరము కాదనియు, అది స్వయముగా బ్రహ్మమేయనియును ఋజువుపఱచును.

**7 వ అధికరణము (24, 25 సూత్రములు):-** కఠ. ఉ. 2-4-12 లో సూచింపఁబడిన అంగుష్ఠమాత్ర పురుషుడొక వ్యక్తి కాదనియు, అది బ్రహ్మమేయనియు నిశ్చయించును.

**8 వ అధికరణము (26 నుండి 33 సూత్రములు):-** తర్వాతి రెండధికరణములు అప్రధానములైనవి. అవి ఉపమార్గముననుసరించినవై వేదవచనానుసారముగా ఇష్టదేవతలు కూడా బ్రహ్మవిద్యాభ్యాసమున కనుకూలమైనవను విషయమును నిశ్చయించును. 29, 30 సూత్రములు వేదములు శాశ్వతములను విషయమును నిర్ణయించును.

**9 వ అధికరణము (34 నుండి 38 సూత్రములు):-** బ్రహ్మవిద్యకు శూద్రులు అనర్హులనెడి విషయమును వివరించును.

**10 వ అధికరణము (39వ సూత్రము):-** సమస్తమును కదిలింపఁజేయు ప్రాణము (కఠ. ఉ. 2-6-2) బ్రహ్మమే యను విషయమును ఋజువుచేయును.

**11 వ అధికరణము (40వ సూత్రము):-** ఛాం. ఉ. 8-12-3 లో సూచింపబడిన జ్యోతియే పరబ్రహ్మమనెడి విషయమును నిరూపించును.

**12 వ అధికరణము (41వ సూత్రము):-** నామరూపములను వ్యక్తమొనర్చు ఆకాశము (ఛాం. ఉ. 8-14) భూతాకాశము కాదనియు, అది బ్రహ్మమేయనియును నిశ్చయించును.

**13 వ అధికరణము (42, 43 సూత్రములు):-** విజ్ఞానమయ కోశము (బృ. ఉ. 4-3-7) జీవుడు కాదనియు, అది బ్రహ్మమే యనియును ప్రబోధించును.

# 1. ద్యుభ్వాద్యధికరణము

## (1-7 సూత్రములు)

### 1-3-1 ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్.

స్వశబ్దముచే స్వర్గలోకము, భూలోకము మున్నగునవి బ్రహ్మమేనై యున్నవి.

ద్యు = స్వర్గలోకము, భూ = భూలోకము, ఆది = మొదలగునవి, ఆయతనం = స్థానము, స్వ = ఆత్మ, శబ్దాత్ = శబ్దముచే.

ముండకోపనిషత్తులోని ఒక అంశము చర్చింపఁబడుచున్నది.

ఈ వాక్యము నందాత్మ శబ్దము ప్రయోగింపఁబడుటచే స్వర్గలోకము, భూలోకము ఇత్యాదుల కాధారము పరబ్రహ్మమేనైయున్నదని తెలియవలయును. ముండకము (2-2-5) నందిట్లు కలదు. "యస్మిన్ద్యౌః వృథివీ చాంతరిక్షమోతం మనస్సహ ప్రాణైశ్చ సర్వైః, తమేవైకం జానథాత్మాన మన్యావాచో విముంచథ అమృతస్యైషసేతుః".

ఈ స్థానము పరబ్రహ్మమా? లేక మరియొకటా? యను సంశయమిచ్చట కలుగును.

"అతడమృతత్వమునకు వంతెన వంటి వాడ" ను వాక్యముచే ఈ స్థానము మరియొకటని పూర్వపక్షి పలుకును. అతడిట్లనును:- వంతెన మరియొక ఒడ్డుకు చేర్చునను విషయము మనకు నిత్యము అనుభవసిద్ధమే. ఇది పరబ్రహ్మమునక తీతమైనదని చెప్పుట అసాధ్యము. ఏలననగా:- "బ్రహ్మము అపరిమితము, అనంతమ" (బృ. ఉ. 2-4-12) ని శ్రుతులుద్ఘోషించుచున్నవి. ప్రధానము ప్రధానకారణమగుటచే అది ప్రధానస్థానమని చెప్పఁబడును. లేక సూత్రాత్మయే

ఈ స్థానమైయుండవచ్చును. శ్రుతులిట్లు పలికినవి: "ఓ గౌతమా! వాయువే త్రాడు వంటిది. ఓ గౌతమా! వాయువనెడి త్రాటిచే ఇహపరలోకములు మఱియు జీవులందఱును ఒక్కుమ్మడిగా కట్టఁబడియున్నారు." (బృ. ఉ. 3–7–2) కావున వాయువే పదార్థములన్నింటి కాధారమై యున్నది. లేక విషయములకు భోక్తయగుటచే జీవుడు ఆధారమై ఉండవచ్చును.

ఎవడు మూలస్థానముగా చెప్పఁబడినాడో, ఎవనియందు స్వర్గలోకము, భూలోకము మున్నగునవి ఓతప్రోతమైయున్నవో, అది బ్రహ్మమేనైయున్నది. బ్రహ్మమును స్వీకరించినప్పుడే స్వశబ్దప్రయోగము అన్వయించును. కాని ప్రధానము లేక సూత్రాత్మలను స్వీకరించినప్పుడు కాదు. ("అతనిని ఆత్మగా గుర్తెఱుంగుమ"నెడి వాక్యమునందు "ఆత్మ" శబ్దము మనకు లభించును.)

స్వశబ్దప్రయోగముచే శ్రుతియందు బ్రహ్మమే ప్రధానస్థానముగా చెప్పఁబడినది. ఈ శబ్దములు నిశ్చయముగా బ్రహ్మమునే సూచించును. ఉదాహరణమునకు "సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజాస్సదాయతనా స్సత్ప్రతిష్ఠాః" (ఛాం. ఉ. 6–8–4)

ఇట్లే ముం. ఉ. 2–1–10 మఱియు 2–2–12 నందున్నూ బ్రహ్మముఁగూర్చి చెప్పఁబడినది. కావున ప్రస్తుత చర్చనీయాంశమగు బ్రహ్మమే శ్రుతులన్నింటియందు చెప్పఁబడినదనుట యుక్తమైయున్నది. పైన పేర్కొనఁబడిన శ్రుతులు మఱియు వ్యాపకతను గూర్చి పలికినవి. "బ్రహ్మైవేదం విశ్వమ్" అని ముండకము 2–2–12 నందు కలదు. దీనిచే ఆకులు, శాఖలు, బోదె, వేఱు మున్నగువాటిని కలిగియున్న వృక్షమువలె బ్రహ్మమునందు కూడా వివిధములగు అనేక పదార్థములున్నవా? యనెడి సంశయము కలుగును. ఈ సంశయమును నివారించుటకై "అతనిని ఆత్మగా గుర్తెఱుంగుమ"నెడి వాక్యము ప్రబోధింపబడినది. అవిద్యా జనితమగు మిథ్యావాదమును తొలగింపవలయునని దీని భావము. ఈ ప్రపంచమును నిజమని నమ్ము మానవుని గూర్చి మరియొక శ్రుతివాక్యమిట్లు నుడివినది. "మృత్యోస్స మృత్యుంగచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి" (కఠ. ఉ. 2–4–11)

"బ్రహ్మైవేదం సర్వం" అను వాక్యముచే ప్రపంచముయొక్క మిథ్యాత్వము నిరూపింపబడినది. దీనిచే బ్రహ్మము నానావిధములుగా విభిన్నమైయున్న దనుకొనరాదు. సూత్రములలో బ్రహ్మముయొక్క అఖండత్వము స్పష్టముగా

నిరూపింపఁబడినది. "లవణఖండమున కేవిధముగా అంతర్బాహ్యములు లేవో, అఖండమైన ఉప్పదనమునది ఎట్లు కలిగియుండునో, అట్లే బ్రహ్మమునందు కూడా అంతర్బాహ్యములు లేవు. అది అఖండ జ్ఞానఖనియైయున్నది." (బృ. ఉ. 4-5-13) ఈ కారణములన్నింటిచే స్వర్గలోకము, భూలోకాదుల కాధారము పరబ్రహ్మమేయని తెలియవలయును.

"అమృతస్యసేతుః" అను వాక్యములోఁగల సేతు శబ్దముచే సృష్టింపఁబడిన పదార్థములన్నింటికది ఆధారమైయున్నదనియు మఱియు అది అమృతత్వము నొందించుటకు సాధనమనియును గుర్తెఱుంగ వలయును. "సేతు" శబ్దమునందుఁ గల భావమును ఒక ఆధారముగా గ్రహింపవలయునేఁగాని దానికి మఱియొక ఒడ్డు కలదని భావింపరాదు. ఈ వంతెనను కలప, లేక రాళ్ళచే నిర్మింపఁబడినట్టి సామాన్య వంతెనగా తలంపరాదు. ఏలననగా బంధించుటయను అర్థముఁగల "షిఞ్"యను ధాతువునుండి "సేతు"శబ్ద మేర్పడినది. ఈ శబ్దము ఏకైకమొనర్చుట, లేక ఆధారముగా నుండుటయను అర్థము నొసంగును.

## 1-3-2 ముక్తోప సృప్యవ్యపదేశాత్

ముక్తపురుషులచే పొందఁబడునదని శాస్త్రములుద్ఘోషించుటచే.

ముక్తోపసృప్య = ముక్తపురుషులచే పొందఁబడునదని, వ్యపదేశాత్ = ఉపదేశింపఁబడుటచే. 1వ సూత్రమును బలపఱచువాద మొసంగఁబడినది.

పైన తెలుపబడిన "ద్యుభ్వాద్యాయతనం" అను శబ్దము పరబ్రహ్మమును సూచించును. ఏలననగా అతడు ముక్తపురుషునిచే పొందఁబడునని వర్ణింపఁబడినది.

ప్రస్తుత పరిచ్ఛేదమునందు బ్రహ్మము సూచింపఁబడినదనుటకు మరియొక కారణము చెప్పఁబడుచున్నది. ముక్తపురుషులకు బ్రహ్మమే గమ్యస్థానమైయున్నది. "భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః, క్షీయంతేచాస్యకర్మాణి తస్మిన్ దృష్టేపరావరే" (ముం. ఉ. 2-2-9) వంటి శ్రుతివాక్యములచే బ్రహ్మము ముక్తపురుషులచే మాత్రమే పొందఁబడునని తెలియుచున్నది. "విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్" (ముం. ఉ. 3-2-8) "హృదయములోని వాంఛలన్నియు ఎప్పుడు నశింపఁజేయఁబడునో, అప్పుడు మర్తుడమరుడగును మఱియు అతడు బ్రహ్మమునుఁబడయును. (బృ.ఉ .4-4-7).

ముక్తపురుషునిచే ప్రధానము మఱియు తత్సదృశములు పొందఁబడునను విషయము నీకెచ్చటను కానరాదు.

“అతనిని పొందిన విద్వాంసుడు జ్ఞానాభ్యాసము నొనర్చునుఁగాక! కేవలము వాచామాత్రమైన శబ్దజాలము నందాతడు పడకుండునుఁగాక!” (బృ. ఉ. 4-4-21) అను వాక్యమునుఁబట్టి కూడా స్వర్గలోకము, భూలోకము మున్నగువాటికాధారము పరబ్రహ్మమే యను విషయము రూఢియగుచున్నది.

## 1-3-3 నానుమాన మతచ్ఛబ్దాత్

ప్రధానమును సూచించు శబ్దము లేకుండుటచే స్వర్గలోకాదుల కాధారము ప్రధానము కాఁజాలదు.

న = కాదు, అనుమానం = ఊహింపఁబడు ప్రధానము, అతచ్ఛబ్దాత్ = దానిని సూచించు శబ్దము లేకుండుటచే,

1 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ప్రధానమును సూచించు వాక్యము ముండకోపనిషత్తునందు లేకుండుటచే 1 వ సూత్రమునందు సూచింపఁబడినస్థానము ప్రధానము కాజాలదు. దీనికి భిన్నముగా “సర్వజ్ఞః, సర్వవిత్ (ముం. ఉ. 1-1-9) పదములు ప్రధాన స్వరూపమునకు భిన్నమైన ఒక చైతన్యపదార్థమును సూచించును. ఈ కారణముచేతనే సూత్రాత్మయనఁబడు వాయువు స్వర్గలోక, భూలోకాదులకు ఆధారముగా అంగీకరింపఁబడదు.

## 1-3-4 ప్రాణభృచ్చ

జీవుడున్నూ కాదు.

ప్రాణభృత్ = ప్రాణమున కాధారమైయున్న జీవుడు, చ = కూడా (న = కాదు)

1వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

‘న’ యను శబ్దమును పూర్వసూత్రమునుండి గ్రహింపవలసియుండును.

జీవుడు ప్రజ్ఞాన్వితుడై యుండుటచే “ఆత్మ”గా సూచింపఁబడినను, ఉపాధులచే అతని జ్ఞానము కుంటువడియుండుటచే సర్వజ్ఞత్వము మున్నగు గుణము లాతనికి

చెందవు. అతడు పరిచ్ఛిన్నుడగుటచేతను, సర్వవ్యాపకుడు కాకుండుటచేతను సమస్తప్రపంచమునకాతడు ఆధారభూతుడు కాడు.

ఈ క్రింది కారణముచేత కూడా జీవుడు స్వర్గలోక, భూలోకాదుల కాధారము కాజాలడు.

## 1-3-5 భేదవ్యపదేశాత్

జీవుడు మఱియు స్వర్గలోకాదుల మధ్య భేదము చెప్పఁబడుటచేతను.

భేదవ్యపదేశాత్ = భేదము చెప్పఁబడుటచే.

1వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

"తమేవైకం జానథాత్మానమ్" (ముం. ఉ. 2-2-5) అను ప్రస్తుత శ్రుతి వాక్యమునందు భేదము తెలుపఁబడినది. ముముక్షువగు జీవుడు జ్ఞాత, మఱియు స్వర్గలోకము జ్ఞేయమై యున్నది. జ్ఞేయపదార్థమైయున్న మఱియు "ఆత్మ" శబ్దముచే సూచింపఁబడిన బ్రహ్మమే భూలోకాదుల కాధారమైయున్నదని గ్రహింపవలయును.

ఈ క్రింది కారణములచేత కూడా జీవుడు స్వర్గలోక భూలోకాదుల కాధారముగా అంగీకరింపఁబడజాలడు.

## 1-3-6 ప్రకరణాత్.

విషయ సందర్భము ననుసరించి.

ప్రకరణాత్ = ప్రకరణములోని విషయ సందర్భము ననుసరించి.

1వ సూత్రమును బలపరచు వాదము కొనసాగుచున్నది.

ఈ యధ్యాయమంతటికి పరబ్రహ్మమే విషయమైయున్నది. "కస్మిన్నుభగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" (ముం. ఉ. 1-1-3) అను వాక్యముచే దీనిని నీవు గ్రహింపవచ్చును. ఇచ్చట ఒక జ్ఞానముపై సమస్తజ్ఞానమాధారపడియున్నదని చెప్పఁబడినది. ఏలననగా సమస్తమున కాత్మయై యున్న బ్రహ్మము తెలియఁబడినప్పుడు, విశ్వమంతయు తెలియఁబడును. కాని కేవలము జీవుడు తెలియఁబడినప్పుడు కాదు.

ముండకోపనిషత్తు "కస్మిన్ను భగవో విజ్ఞాతే" యని ప్రారంభించి "బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి" అను వాక్యముతో అంతమొందించును. కావున ఆది నుండి అంతము

వరకుఁగల ఈ యుపనిషత్తులోని విషయమంతయు బ్రహ్మమునే సూచించుచున్నదని స్పష్టమగుచున్నది. కావున స్వర్గలోక భూలోకాదుల కాధారమని చెప్పఁబడినది కూడా ఇదే బ్రహ్మమని తెలియవలయును.

జీవునికి భిన్నముగా మరియొక హేతువు ఈ క్రింది సూత్రము నందొసంగఁబడినది.

## 1-3-7 స్థిత్యదనాభ్యాంచ.

రెండింటిలో ఒకటి నిస్సంగమైయున్న పరమాత్మయనియు, రెండవది భుజించుచున్న జీవుడనియు చెప్పఁబడుటచే.

స్థితి = ఉనికి, అదనాభ్యాం = తినుటవలన, చ = మఱియు.

1వ సూత్రమును బలపఱచువాదము సమాప్తమైనది.

ముండకోపనిషత్తు 3-1-1 లో "ద్వాసుపర్ణాసయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి" అను వాక్యము కలదు. ఈ పరిచ్ఛేదమునందు బ్రహ్మము స్వాత్మానందపూర్ణమనియు, జీవుడు సుకృత దుష్కృత కర్మల ననుభవించువాడనియును సూచింపఁబడినది. ఇచ్చట బ్రహ్మము మౌనముగానుండు సాక్షిగా వర్ణింపఁబడినది. ఈ వాక్యము బ్రహ్మము యొక్క నిష్క్రియమైన అస్తిత్వమును మాత్రము వర్ణించినది. జీవుడు తానొనర్చిన కర్మలయొక్క ఫలములగు సుఖదుఃఖముల ననుభవించుటచే అతడు బ్రహ్మమునకు భిన్నమైయున్నాడు. అస్తిత్వము మఱియు అనుభవము లనెడి భూమికలచే బ్రహ్మము మఱియు జీవుడు సూచింపఁబడిరి. స్వర్గలోకాదులకాధారము బ్రహ్మమై యున్నప్పుడు మాత్రమే, ఈ రెండింటియొక్క భేదవర్ణన యోగ్యమైనదగును. లేనిచో, ఈ విషయము ముందుకు సాగకుండును.

జీవుని వర్ణించుటయే శ్రుతికి లక్ష్యము కాకుండుటచే, ఈ వాక్యము కేవలము జీవుని స్వరూపమును వర్ణించుచున్నదనుట పాడిఁగాదు. జీవుడే కర్త మఱియు భోక్తయని అందఱికి తెలియును. కాని సామాన్యానుభవముచే బ్రహ్మము తెలియఁబడదు. శ్రుతులన్నింటికి బ్రహ్మమే ముఖ్యవిషయమై అందఱికి తెలియఁబడని బ్రహ్మమునుఁగూర్చి వర్ణించి, దానిని స్థిరముగా ప్రతిష్ఠించుటయే శాస్త్రము లన్నింటికి లక్ష్యమై యున్నది.

# ౨. భూమాధికరణము

## (8-9 సూత్రములు)

## 1-3-8 భూమా సంప్రసాదా దధ్యుపదేశాత్.

సుషుప్త్యవస్థ యందున్నూ జాగృతమైయుండు ప్రాణము తర్వాత చెప్పఁబడుటచే "భూమ" బ్రహ్మమేనైయున్నది.

భూమా = పూర్ణము, సంప్రసాదాత్ అధి = సుషుప్త్యవస్థ, లేక ప్రాణమున కతీతముగా, ఉపదేశాత్ = ఉపదేశింపఁబడుటచే.

"భూమ"యను శబ్దము గణ్యమానమైన వైశాల్యమును సూచింపదు. కాని పూర్ణవ్యాపకతను సూచించును. సంప్రసాదమనగా అవిఘ్నస్థానము. ఆనందము లేక సుషుప్త్యవస్థ యగును. సుషుప్తి యందానందానుభవము కలుగును. అధియనగా అతీతమని అర్థము.

ప్రాణమున కతీతమైనదని శ్రుతి పలుకుటచే భూమ బ్రహ్మమును సూచించును. ఇది ఇచ్చట గాఢనిద్ర యందనుభవింపఁబడు ఆనందముగా పేర్కొనఁబడినది. సుషుప్తియందు కూడా మేల్కొని పని చేయునట్టి ప్రాణము, లేక సంప్రసాదమున కతీతమైనదని ఈ వాక్యము ప్రబోధించుటచే "భూమ" బ్రహ్మమునే సూచించును.

ఇప్పుడు ఛాందోగ్యోపనిషత్తులోని ఒక పరిచ్ఛేదము పరిశోధింపఁబడుచున్నది. ఛాందోగ్యోపనిషత్తులోని ఏడవ అధ్యాయమునందు సనత్కుమారుడు నారదునికి ఉపదేశించును. అతడు "నామము"తో ప్రారంభించి, తన శిష్యునికి క్రమక్రమముగా ఉపదేశించును. అతడున్నతోన్నత దశలకేగి, తుట్టతుదకు పరమసత్యమైయున్న భూమ, లేక అనంతత్వముఁగూర్చి ప్రబోధించును. "భూమ"యే ఆనందమని సనత్కుమారుడు నారదముని కుపదేశించెను. "మనుజుడెచ్చట మరియొకదానిని చూడజాలడో, మరియొకదానిని శ్రవణమొనర్పలేడో, మరియొకదానిని గ్రహించలేడో, అట్టి భూమనుఁగూర్చి తెలిసికొను కోరిక కలవాడవైయుండుము". (7-23-24)

ఇచ్చట భూమయనునది ప్రాణమా? లేక బ్రహ్మమా? యను సంశయమేర్పడును.

ప్రాణమే భూమయని పూర్వపక్షి వాదించును. అతడిట్లనును: ఆత్మయొక్క రహస్యములను తెలిసికొనుటకై నారదుడు సనత్కుమారుని సమీపించును. వారి సంభాషణయందీ క్రింది విధమైన ప్రశ్నోత్తరములుండును. "నామము కంటె గొప్పదేదైన కలదా? వాక్కు నామము కంటె గొప్పది. వాక్కు కంటె గొప్పదేదైన కలదా? నామమునుండి ప్రాణము వరకు వ్యాపించియున్న మనస్సు వాక్కుకంటెను గొప్పది." అప్పుడు నారదుడు దీనికంటెను గొప్పదేదైన కలదా? యని ప్రశ్నింపడు. ఐనను సనత్కుమారుడు భూమనుఁగూర్చి ప్రబోధించెను. కావున భూమ, ఇతఃపూర్వమే ప్రబోధింపఁబడిన ప్రాణమునకు భిన్నము కాదని తెలియుచున్నది.

మఱియు ప్రాణమును గుర్తెఱింగిన వానిని అతివాది యని, అతడు పలుకును. దీనిచే ప్రాణమే పరమ సత్యమని స్పష్టమగుచున్నది.

ఈ సూత్ర మీ వాదమును ఖండించి భూమయే బ్రహ్మమని పలుకును. సనత్కుమారుడు ప్రత్యేకముగా నారదునితో ఇట్లు పలికెను. "ఏషతువా అతివదతి యస్సత్యేనాతివదతి" (ఛాం.ఉ. 7-16-1) ఇది స్పష్టముగా ప్రాణమున కతీతమైయున్న పదార్థమును సూచించును. ఈ పరమసత్యమును గుర్తెఱింగిన మానవుడే నిజముగా అతివాదియగును.

నారదుడు సనత్కుమారుని "ప్రాణముకన్న గొప్పదేదైన కలదా?" యని ప్రశ్నింపకున్నను పరమ సత్యమైయున్న బ్రహ్మము (భూమ)నుఁగూర్చిన శీర్షిక ప్రారంభింపఁబడినది. "అయ్యా! సత్యము ద్వారానే నొక అతివాది నగుదునుఁగాక!" యని నారదుడు సనత్కుమారునితో పలికెను. సనత్కుమారుడు నారదుని క్రమక్రమముగా, సోపానక్రమముగా బ్రహ్మజ్ఞానము వరకు తీసికొనివెళ్ళి, భూమయే బ్రహ్మమని అతనికుపదేశించెను.

నారదుడు ప్రథమముగా సనత్కుమారుడొసంగిన ప్రబోధమును, ప్రాణము వరకుఁగల వివిధ విషయములను శ్రవణమొనర్చి మౌనమును ధరించెను. అప్పుడు బుద్ధిమంతుడగు సనత్కుమారుడు పరమసత్యమును గుర్తెఱింగినవాడే అతివాదియనియు, అసజ్జనితమగు ప్రాణమునుఁగూర్చిన జ్ఞానము నిస్సారమైనదనియు నారదుడడుగకుండానే ధారాప్రవాహముగా ప్రబోధించును.

బ్రహ్మమే పరమసత్యమగుటచే "సత్యమ"ను శబ్దము పరబ్రహ్మమును సూచించును. అప్పుడు సనత్కుమారుడు నారదుని సోపానుక్రమముగా జ్ఞానమునుండి "భూమ" జ్ఞానము వరకుఁగొంపోవును. కావున భూమయే పరబ్రహ్మమనియు, అది ప్రాణమునకు విభిన్నమైనదనియును మనము నిశ్చయింపవచ్చును.

ప్రాణమే భూమయైయున్నచో సనత్కుమారుడు తన ప్రబోధమును విరమించియుండెడివాడు. "ప్రాణోవా ఆశాయా భూయాన్" (7-15-1) అని చెప్పి అతడు తన ప్రబోధమును పరిసమాప్తమొనర్చి యుండెడివాడు. కాని 23, 24, 25 ఖండములలో అతడు భూమ యొక్క స్వరూపమును స్పష్టముగా వర్ణించెను. కావున భూమ మాత్రమే బ్రహ్మము, లేక పరమసత్యమైయున్నది.

"ఆత్మతత్త్వము" ప్రాణమునకు సంబంధించినది కాదు. ఇంతేకాదు, పరబ్రహ్మ జ్ఞానముచేత మాత్రమే మానవుడు దుఃఖరహితుడు కాగలుగును. బ్రహ్మము మాత్రమే పరిపూర్ణమైయున్నది. భూమయొక్క భావము కూడా పరిపూర్ణమే. ప్రతిపదార్థమునకు కారణము, మూలము, ఆధారము మఱియు బీజమైయున్న పరబ్రహ్మ లక్షణములతో భూమ ఏకీభవించును. ప్రబోధక్రమమునందు భూమ చిట్టచివరికి చెప్పఁబడినది. ఇది అనంతానందనిధియైయున్నది. కావున ఇదియే అన్నింటికన్న ఉన్నతోన్నతమైయున్నది.

నామమునుండి ఆశ వరకుఁగల ఉపాసనకంటె ప్రాణోపాసన శ్రేష్ఠమైనది. కావున ప్రాణోపాసన యొనర్చువాడు అతివాదియని చెప్పఁబడును. అతనికి నిమ్నదశయందున్న వారితో పోల్చినప్పుడాతడతివాది యగును. కాని పరబ్రహ్మోపాసన, ప్రాణోపాసన కంటెను శ్రేష్ఠమైనది. కావున ఎవడైతే బ్రహ్మమును, లేక భూమను ఉపాసించునో, అతడే నిజమైన అతివాదియని చెప్పఁబడును.

ఆత్మోపదేశమింతటితో పూర్తియైనదని నారదుడు తలంచెను. కావున అతడు మరియొక ప్రశ్న వేయలేదు. ప్రాణమునుఁగూర్చిన జ్ఞానము, ఉన్నతోన్నతమైన జ్ఞానము కాదని సనత్కుమారునికి తెలియును. కావున అతడు నారదునికి తన ప్రబోధమును ధారావాహినిగా కొనసాగించినవాడై బ్రహ్మము, లేక భూమ యొక్క జ్ఞానమే ఉన్నతోన్నతమైనదని చెప్పెను. బ్రహ్మమునుండియే ప్రాణముత్పన్నమైనదని శ్రుతులు పలుకుచున్నవి. కావున ప్రాణము బ్రహ్మముకన్న నికృష్టమైనది. కావున ప్రస్తుతము చర్చింపఁబడుచున్న ఛాందోగ్యోపనిషత్తులోని వాక్యములోని భూమ కేవలము బ్రహ్మమే.

## 1-3-9 ధర్మోపపత్తేశ్చ

మరియు శ్రుతి వాక్యములలోని భూమయొక్క లక్షణములు కేవలము పరబ్రహ్మమునకు మాత్రమే సరిపోవుటచే.

ధర్మ = లక్షణములు, ఉపపత్తేః = సరిపోవుటచే, చ = మఱియు

8వ సూత్రమును బలపఱచువాదమొసంగఁబడినది.

శాస్త్రమునందు భూమకు చెప్పఁబడిన లక్షణములు బ్రహ్మమునకు సరిగా సరిపోవును. భూమయందు చూచుట మొదలగు సామాన్యకార్యములుండవు. "ఎచ్చటనైతే మానవుడు మరియొక దానిని చూడజాలడో, మరియొక దానినిఁగూర్చి శ్రవణమొనర్పజాలడో, మరియొకదానిని తెలియజాలడో అదియే భూమ"యని శ్రుతి వివరించుచున్నది. ఇదియే పరమాత్మయొక్క లక్షణమని మరియొక శ్రుతి వలన మనకు తెలియుచున్నది. "ఆత్మయే సర్వస్వమైయున్నప్పుడాతడు మరియొకదానినెట్లు చూడఁగలుగును? (బృ. ఉ. 4-5-15)

ప్రస్తుతము చర్చింపఁబడుచున్న శ్రుతియందు పేర్కొనఁబడిన గుణములగు సత్యత్వము, స్వయంభువత్వము, అద్వైతము, ఆనందము, అనంతత్వము, సర్వాత్మత్వము, సర్వవ్యాపకత్వము, అమరత్వము మున్నగునవి పరబ్రహ్మమునకు మాత్రమే చెందియున్నవి. కాని ఈ గుణము లేవియు లేని కార్యరూపమైయున్న ప్రాణమునకు చెందునవి కావు.

ఈ కారణములన్నింటిచే భూమ పరమాత్మ లేక పరబ్రహ్మమను విషయము నిరూపింపఁబడినది.

# 3. అక్షరాధికరణము
# (10-12 సూత్రములు)

## 1-3-10 అక్షరమంబరాంత ధృతేః

ఆకాశము వరకుఁగల పదార్థములన్నింటి కాధారమైయుండుటచే అక్షరము బ్రహ్మమేనైయున్నది.

అక్షరం = క్షయములేనిది, అంబరాంతధృతేః = ఆకాశము వరకుఁగల పదార్థములన్నింటి కాధారమైయుండుటచే.

బృహదారణ్యకములోని వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది. "ఆకాశము దేనియందోతప్రోతమై యున్నద?"ని (బృ. ఉ. 3-8-7) గార్గియాజ్ఞవల్క్యమహర్షి నడిగెను. "ఓ గార్గీ! బ్రాహ్మణులు దీనిని అక్షరమని నుడువుదురు. దీనియందు స్థూలసూక్ష్మ హ్రస్వదీర్ఘాదులు లేవు." (బృ. ఉ. 3-8-8) అని అతడు సమాధానము నొసంగెను. ఇచ్చట ఆక్షరమను శబ్దము ఓంకారమును సూచించునా? లేక బ్రహ్మమును సూచించునా? యనెడి సంశయమేర్పడును. వ్యుత్పత్తిక్రమము ననుసరించి ధ్యానయోగమగు ఓంకారమే అక్షరమని పూర్వపక్షి పలుకును. ఒక శబ్దము యొక్క స్థిరమైన అర్థమును అంగీకరింపకుండుట భావ్యము కాదని అతడు వాదించును.

పై అభిప్రాయమును ఈ సూత్రము ఖండించుచు "అక్షర శబ్దము బ్రహ్మమును మాత్రమే సూచించున"ని పలుకును. ఏలననగా అక్షరము భూమినుండి ఆకాశము వరకుఁగల సమస్త పదార్థముల కాధారమైయున్నదని చెప్పఁబడినది. "ఓ గార్గీ! అక్షరమునందాకాశము ఓతప్రోతమైయున్నద"ని (బృ. ఉ. 3-8-11) శ్రుతి వచించుచున్నది. కావున ఆకాశము వరకుఁగల సమస్తపదార్థములన్నింటి కాధారమైయున్నది. ఏలననగా అది ఈ విశ్వమునందు సృష్టింపఁబడిన పదార్థములన్నింటికి కారణమైయున్నది. కావున అక్షరము ప్రధానమెందుకు కాకూడదు? ఈ సంశయమునకీ క్రింది సూత్రము సమాధానమొసంగును.

## 1-3-11 సాచ ప్రశాసనాత్.

ఈ యాధారము పరమాత్ముడు ప్రకాశించుటవల్లనే, కాని ప్రధానము ప్రకాశించుటవల్ల కాదు.

సా = అది (ఆకాశము వరకుఁగల సమస్తపదార్థముల కాధారమైయుండుట

చ = మఱియు, ప్రశాసనాత్ = శాసించుటవలన.

10వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

ఆకాశమువరకుఁగల సమస్త పదార్థముల కాధారమైయుండుట యనునది పరమాత్ముని పనియే. ఏల? ప్రశాసనమువలన. "ఓ గార్గీ! అక్షరపురుషుని ప్రశాసనమువలన సూర్యచంద్రులు ఆకాశామునందు సంచరించుచున్నవి". (బృ. ఉ. 3-8-9) అని శ్రుతి శాసించుచున్నది. ఈ ప్రశాసనము పరమాత్ముని కార్యమే. కాని జడమైన ప్రధానముయొక్క కార్యము కాదు. ఏలననగా కారణమైయున్న మట్టివంటి జడపదార్థములు కార్యరూపములైయున్న కుండలు మొదలగువాటిని శాసింపజాలవు. కావున ఆకాశము వరకుఁగల పదార్థము లన్నింటి కాధారమైయున్న "అక్షరము" ప్రధానము కాజాలదు.

## 1-3-12 అన్యభావ వ్యావృత్తేశ్చ.

బ్రహ్మమునకు భిన్న స్వభావముఁగల పదార్థములను అక్షరునికి వేఱుగా శ్రుతి పేర్కొనుట.

అన్య = మరియొక, భావ = స్వభావము, వ్యావృత్తేః = తీసివేయుటచే, చ = మఱియు.

10వ సూత్రమును బలపఱచు వాదము పూర్తియైనది. బ్రహ్మమునకు భిన్నమైన పదార్థముల గుణవర్ణన ఆ శ్రుతియందు లేకుండుటచే "అక్షరము" ప్రధానము, లేక జీవుడు కాజాలదు. అదే ఉపనిషత్తులోని వాక్యశేషమునందు ఈ యక్షరుని వర్ణనయే కలదు. కాని ప్రధానము, లేక జీవుని వర్ణన లేదు. ఏలననగా దాని స్వభావమునివి కలిగిలేవు.

చూచుట, వినుట, ఆలోచించుట, తెలిసికొనుట ఇత్యాది గుణములు శ్రుతియందిట్లు చెప్పఁబడినవి. "ఓ గార్గీ! ఆ యక్షరము చూచును, కాని చూడఁబడదు;

తెలిసికొనును, కాని తెలిసికొనఁబడదు. దానికన్న మరియొక ద్రష్టగాని, శ్రోతగాని, మంతగాని, జ్ఞాతగాని లేదు. ఓ గార్గీ! ఆ యక్షరమునందే ఆకాశము ఓతప్రోతమైయున్నది. (బృ. ఉ. 3-8-11) ఇవి యన్నియు ఒక చైతన్యవంతమగు పదార్థమును సూచించుటచే, జడమైన పదార్థమును నిషేధించుచున్నవి.

అక్షరునివలె ఉపాధిరహితుడు కాకుండుటచే "అక్షర" శబ్దము జీవుని సూచింపదు. "అక్షరుడు నేత్ర, శ్రోత్ర, వాగ్రహితుడు మఱియు అమనుస్కు"డని (బృ. ఉ. 3-8-8) శ్రుతులు నుడువుచున్నవి.

కావున అక్షరుడు కేవలము పరబ్రహ్మమేయను విషయము స్థిరముగా రూఢియైనది.

# 4. ఈక్షతి కర్మవ్యపదేశాధికరణము

## 1-3-13 ఈక్షతి కర్మవ్యపదేశాత్సః

ఉపాస్యవస్తువని చెప్పఁబడుటచే బ్రహ్మమే ధ్యేయమైయున్నాడు.

ఈక్షతి = సాక్షాత్కరించుకొనుటయను, కర్మ = కర్మపదార్థము, వ్యపదేశాత్ = సూచింపఁబడుటచే, సః = అతడు.

ప్రశ్నోపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

పరబ్రహ్మము ఉపాస్యవస్తువుగా వర్ణింపఁబడినది. ఈక్షణ పదార్థము స్పష్టముగా పరమాత్మనే సూచించును.

"ఏతద్వైసత్యకామ పరంచాపరంచ బ్రహ్మయదోంకార స్తస్మాద్విద్వానేతే నైనాయత నేనైకతరమన్వేతి" అని ప్రశ్నోపనిషత్తు (5-2) నుడువుచున్నది. మఱియు "యఃపునరేతం త్రిమాత్రేణోమిత్యేతేనై వాక్షరేణ పరం పురుషమభిధ్యాయీత" (ప్ర. ఉ. 5-5) అని నుడువబడినది. ఇచ్చట ధ్యేయవస్తువు నిర్గుణ బ్రహ్మమా? లేక సగుణబ్రహ్మమా? యనెడి సంశయము కలుగును. ఏలననగా (5-2) నందు ఈ రెండున్నూ సూచింపఁబడినవి. మఱియు ఈ పరమపురుషుని ఉపాసించుటచే కలుగు ఫలము బ్రహ్మలోకప్రాప్తియని చెప్పఁబడినది.

ఇచ్చట ధ్యేయవస్తువు పరబ్రహ్మమే యగును. కాని హిరణ్యగర్భుడు కాదని ఈ సూత్రము నుడువుచున్నది. ఏలననగా "అతడు పరమపురుషునిఁ గాంచు"నని దృశ్యపదార్థము చెప్పఁబడినది. దీనిచే అతడు నిజముగా పరమపురుషుని సాక్షాత్కరించుకొనును, లేక అతనితో తాదాత్మ్యము నొందునని తెలియుచున్నది. ఉన్నతోన్నతమగు దృక్పథమునందు హిరణ్యగర్భుడు కూడా మిథ్యయగును. నిజమున కాతడు మాయామండలమునందున్నాడు. అతడు మాయతో కూడియున్నాడు. కావున కేవలసత్యమైయున్న పరమపురుషుడనగా పరబ్రహ్మమేయగును. పరిచ్ఛేదారంభమునందీ బ్రహ్మమే ధ్యేయవస్తువుగా నుడువఁబడెను.

"యథాపాదోదర స్త్వచావినిర్ముచ్యత ఏవంహవై స పాప్మనా వినిర్ముక్తః" అని పాపపరిహారమే ధ్యాన ఫలముగా శ్రుతి నుడువుచున్నది. దీనిచే ధ్యేయపదార్థము పరబ్రహ్మమేయను విషయము స్పష్టమగుచున్నది.

పరబ్రహ్మమునుపాసించుటచే కలుగు బ్రహ్మలోకప్రాప్తి నికృష్టమైన ఫలముగా తలంపరాదు. ఏలననగా అది క్రమముక్తి యందొక సోపానమైయున్నది. త్రిమాత్రలతో కూడిన ఓంకారాక్షరమును సాధనముగాఁగొని పరబ్రహ్మము నెవ్వడుపాసించునో, అతడు ప్రథమఫలముగా బ్రహ్మలోకమునొందును. తదనంతరము కైవల్యమోక్షము, లేక పరబ్రహ్మముతో ఏకత్వమునుఁబడయును.

"ఓంకారోపాసనచే అతడీ స్థితిని చేరుకొనును. భయము, జరామరణముల నుండి విముక్తుడై విద్వాంసుడు పరబ్రహ్మమునందు విశ్రమించున"ని ప్రశ్నోపనిషత్తు నుడువును. జరామరణ భయములనుండి విముక్తుడై ఉన్నతోన్నత దశ నొందుట పరబ్రహ్మమునకే అన్వయించును. కాని హిరణ్యగర్భునికన్వయింపదు.

బ్రహ్మలోక శబ్దము బ్రహ్మముయొక్క లోకమును సూచింపదు. కాని స్వయముగా బ్రహ్మమేయైయున్న లోకము, లేక స్థితియని అర్థము. "నిషాదస్థపతి"యను సమాసమునకు నిషాదులయొక్క ప్రముఖుడని మనము అర్థము చెప్పము. కాని ఎవడు నిషాదుడో అట్టి ప్రముఖుడని అర్థము చెప్పుదుము. అది కర్మధారయ సమాసమనఁబడును. కావున "బ్రహ్మలోకము" బ్రహ్మముయొక్క లోకమును సూచింపదు కాని ఏదైతే బ్రహ్మమో, అదియే లోకముగా వర్ణింపఁబడినది.

# 5. దహరాధికరణము

## (14-21 సూత్రములు)

### 1-3-14 దహర ఉత్తరేభ్యః

ఉత్తరవాదము ననుసరించి దహరాకాశము బ్రహ్మమేయగును.

దహరః = చిన్నది, ఉత్తరేభ్య = రాబోవు వాక్యముల ననుసరించి.

ఛాందోగ్యములోని మరియొక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

తర్వాతి వాక్యములలో కారణము స్పష్టీకరింపఁబడుటచే "దహర" శబ్దము బ్రహ్మమును సూచించును.

"అథయది దమస్మిన్ బ్రహ్మపురేదహరం పుండరీకం వేశ్యదహరోఽస్మిన్నంతరాకాశ స్తస్మిన్యదంత స్తదన్వేష్టవ్యంతద్వావ విజిజ్ఞాసి తవ్యమితి" అని ఛాందోగ్యము (8-1-1) నందు కలదు.

ఇచ్చట శ్రుత్యుక్తమగు హృదయకమలమునందున్న ఆకాశము భూతాకాశమా? లేక జీవుడా? లేక పరమాత్మయా? యను సంశయము కలుగును.

ఆకాశ శబ్దమునకు సామాన్యార్థము భూతాకాశమేయని పూర్వపక్షి పలుకును. చిన్నదైన హృదయ స్థానమునందుండుటచే అది దహరాశాశమనఁబడును. లేక బ్రహ్మపురి శబ్దముచే దహరాకాశమును జీవునిగా గ్రహింపవచ్చును. తన కార్యములచే సంపాదింపఁబడిన శరీరమును తన స్థానముగా జీవుడు కలిగియుండుటచే, శరీరమిచ్చట బ్రహ్మపురియని చెప్పఁబడినది. ఇచ్చట జీవుడు రూపకాలంకారముగా బ్రహ్మమని చెప్పఁబడెను. శరీరమునకు ప్రభువు కాకుండుటచే మఱియు దానితో సంబంధము లేకుండుటచే ఇచ్చట పరబ్రహ్మమనెడి అర్థమసంగతమగును. ఒక రాజు తన రాజ్యములోని ఒక స్థలమునందెట్లు నివసించునో, అట్లే జీవుడున్నూ శరీరమనెడి పురమునకు ప్రభువై హృదయ స్థానమునందు నివసించును. ఇంతేకాకుండా జీవుని ఉపాధియగు మనస్సు హృదయమునందుండును. శ్రుతియందు కేవల మీ జీవుడే సూచ్యగ్ర పరిమాణముగా పోల్చఁబడినాడు.

ఇచ్చట దహరాకాశము బ్రహ్మమేయగును. కాని "చిన్నద"ను విశేషణమున్నను భూతాకాశము కాదు. ఇది సంకుచితత్వమును సూచింపదు. ఏలననగా తదనంతరము శ్రుతియందు "సబ్రూయాద్యావాన్వా అయమాకాశస్తావా నేషోంఽ తర్హృదయ ఆకాశ ఉభే అస్మిన్ ద్యావా పృథివీ అంతరేవసమాహితే" (ఛాం. ఉ. 8-1-3) అని బ్రహ్మము యొక్క స్వరూపము వర్ణింపఁబడినది. దీనిచే నిజమునకది చిన్నది కాదని స్పష్టమగుచున్నది.

ఆకాశము తనతో తాను పోల్చఁబడదు. ఉపాధులతో కూడిన అంతవంతుడగు జీవుడు కూడా సర్వవ్యాపకమగు ఆకాశముతో పోల్చఁబడజాలడు. "ఉభే అస్మిన్ ద్యావా పృథివీ అంతరేవ సమాహితే"యని శ్రుతి పలుకుచున్నది. దీనిచే ఈ యాకాశము విశ్వమంతటి కాధారమైయున్నదని తెలియుచున్నది. దీనిచే ఈ వ్యక్తమైయున్న ఆకాశమే పరమాత్మయని రూఢియగుచున్నది.

"ఏష ఆత్మాఽ పహత పాప్మావిజరోవిమృత్యుర్విశోకోఽ విజిఘత్సోఽ పిపాస స్సత్య కామ స్సత్య సంకల్పః" అని ఛాందోగ్యము (8-1-5) నందు కలదు. ఇది కేవలము భౌతికాకాశమున కన్వయించదు. ఇవి యన్నియు పరబ్రహ్మము యొక్క ప్రధాన లక్షణములు. ఏలననగా అనంతాకాశముతో పోల్చఁబడుట మఱియు దానియందు స్వర్గలోకము, భూలోకములున్నవనెడి విషయమున్నూ అంతవంతుడగు జీవుని కన్వయింపవు.

బ్రహ్మపురిలోని బ్రహ్మశబ్దము బ్రహ్మమును మాత్రమే సూచించును. నీవా శబ్దమును జీవునిగా గ్రహించినను, తత్ప్రబోధము హృదయమనెడి బ్రహ్మపురియందు సాక్షాత్కరింపఁబడు బ్రహ్మమును మాత్రమే సూచించును. ఇంతేకాకుండా దహరాకాశమును గుర్తెఱింగినవానికి అనంతానందము కలుగుననెడి వాక్కుచే పరబ్రహ్మగ్రహణము మాత్రమే ఇచ్చట యుక్తమైయున్నది.

ఈ వివరింపఁబడిన కారణములన్నింటిచే, ఆ యాకాశము పరమాత్మ లేక పరబ్రహ్మమేయని తెలియవలయును.

## 1-3-15 గతిశబ్దాభ్యాం తథా దృష్టం లింగం చ.

బ్రహ్మలోక శబ్దముచేతను మఱియు బ్రహ్మమునందు ప్రవేశించు కర్మచేతను దహరాకాశము బ్రహ్మమేనై యున్నది. ఏలననగా జీవులు బ్రహ్మమునందు

ప్రవేశించు విషయము తదితర శ్రుతులయందున్నూ కాననగును. మఱియు గాఢనిద్రయందు జీవులు ప్రతినిత్యము బ్రహ్మమునందు ప్రవేశించుచుండుటచే "బ్రహ్మలోకము" యొక్క సరియైన అర్థమును మనము గ్రహింపవచ్చును.

గతి శబ్దాభ్యాం = వెళ్ళుటచేత, శబ్దముచేతను, తథా = ఈ విధముగా, దృష్టం = చూడఁబడినది, లింగం = ఒకదానినూహించు చిహ్నము, చ = మఱియు

14వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

తర్వాతి వాక్యములలో చెప్పఁబడిన కారణములనుఁబట్టి దహరాకాశము బ్రహ్మమేయని పూర్వసూత్రమునందు నుడువఁబడినది. ఆ వాక్యములిప్పుడు వర్ణింపఁబడుచున్నవి.

"వెళ్ళుట" మఱియు "శబ్దము" బ్రహ్మమును సూచించును. "ఇమాస్సర్వాః ప్రజా అహరహర్గచ్ఛంత్య ఏతం బ్రహ్మలోకం నవిందంత్యనృతేన హి ప్రత్యూఢాః"అని ఛాందోగ్యము (8-3-2) నందు కలదు. ఈ వాక్యముచే జీవులన్నియు ప్రతినిత్యము బ్రహ్మలోకమనెడి "దహరాకాశము"న కేగుచున్నవని తెలియుచున్నది. దహరా కాశము బ్రహ్మమేయని ఇది సూచించుచున్నది.

సుషుప్తియందు ప్రతినిత్యము జీవులు బ్రహ్మమునందు ప్రవేశింతురను విషయము మరియొక శ్రుతివాక్యము నందిట్లు తెలుపఁబడినది. "ఏతత్పురుషస్స్వపితి నామ సతాసోమ్యతదా సంపన్నో భవతిస్వమపీతో భవతి తస్మాదేనం స్వపితీత్యా చక్షతే స్వంహ్యపీతో భవతి (ఛాం. ఉ. 6-8-1)

సామాన్యముగా గాఢనిద్రయందున్న మానవునిఁగూర్చి మనము "అతడు బ్రహ్మమైనాడ"నియు, "అతడు బ్రహ్మభావము నొందినాడ"నియు పలుకుచుందుము.

"బ్రహ్మలోకమ"నెడి శబ్దమిచ్చట స్వయముగా బ్రహ్మమనెడి అర్థము నొసంగునేకాని, బ్రహ్మలోకము (సత్యలోకము) అనెడి అర్థము నొసంగదు. ఏలననగా ఈ వాక్యమునందీ విషయమును సూచించు చిహ్నము కలదు. ఈ చిహ్నమేమి? జీవుడీ లోకమునకు ప్రతిరోజు వెళ్ళునని చెప్పఁబడినది. జీవుడు ప్రతిరోజు బ్రహ్మలోకమునకు వెళ్ళుట నిశ్చయముగా అసాధ్యమైన కార్యమే. కావున "బ్రహ్మలోక"శబ్దమిచ్చట స్వయముగా బ్రహ్మమును సూచించును.

## 1-3-16 ధృతేశ్చ మహిమ్నోఽ స్యాస్మిన్నుపలబ్ధేః

ఇంతేగాకుండా ఆధారమైయున్న కారణముచేత కూడా దహరాకాశము బ్రహ్మమేయగును. ఏలననగా ఇట్టి మహిమను ఇతర శ్రుతివాక్యములనుఁబట్టి బ్రహ్మమునందే మనముఁగాంచఁగలుగుదుము.

ధృతేః = ఆకాశము ప్రపంచమునకాధారమైయుండుటచే, చ = కూడా, అస్యమహిమ్నః = ఈ గొప్పదనము, అస్మిన్ = బ్రహ్మమునందు, ఉపలబ్ధేః = పొందఁబడుటచే.

14వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

లోకములన్నింటికాధారమైయుండు గొప్పదనము బ్రహ్మమునందే కానఁబడుటచే, 14వ సూత్రమునందుఁగల దహరాకాశము కేవలము బ్రహ్మమునే సూచించును. మఱియు "ఆధారమైయుండుట"ను ఁబట్టి దహరాకాశము పరబ్రహ్మమేనైయున్నది. అది ఎట్లు? శ్రుత్యారంభమునందు "దానియందీ దహరాకాశము కలద"ను వాక్యములో ప్రధానవిషయము చర్చింపఁబడినది. తర్వాత ఈ ఘటాకాశము మఠాకాశముతో పోల్చఁబడినది. దానియందు సమస్తము కలదు. తర్వాత ఆత్మయను శబ్దము దానికి చేర్చఁబడినది. అప్పుడది పాపవినిర్ముక్తముగా వర్ణింపఁబడినది. తుట్టతుదకు "అథయ ఆత్మా స సేతుర్విధృతి రేషాంలోకానామ సంభేదాయ" (ఛాం. ఉ. 8-4-1) అని చెప్పబడినది. ఈ వాక్యమునందు లోకముల కాధారమైయున్న దహరాకాశము యొక్క మహిమను మనము చూడవచ్చును. పొలములలోని హద్దులు తెగిపోకుండా గట్లు నీటినెట్లు నిలువ చేయునో, అదే విధముగా ప్రపంచములోని జాతులు, ఆశ్రమములో సంకరముకాకుండా ఈ యాత్మ ఒక గట్టువలె పనిచేయును.

ఆధారమైయుండు ఈ మహిమ కేవలము బ్రహ్మమునకే చెందియున్నదని ఇతర శ్రుతులు కూడా ఘోషించుచున్నవి. "ఏతస్యవా అక్షరస్యప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌవిధృతౌ తిష్ఠతః (బృ. ఉ. 3-8-9) "అతడన్నింటికి ప్రభువు, రాజులకు రాజు, పదార్థములన్నింటికి పోషణకర్త. ఈ లోకములు పడిపోకుండా ఉండుటకై అతడొక సేతువు మఱియు తీరము వంటివాడు." (బృ. ఉ. 4-4-22). దీనిచే లోకములకు హద్దు మఱియు ఆధారమైయుండుట కేవలము బ్రహ్మముయొక్క

ప్రత్యేక లక్షణమని తెలియుచున్నది. కావున "ఆధారమైయుండు" కారణముచే దహరాకాశము బ్రహ్మమేయని తెలియుచున్నది.

## 1-3-17 ప్రసిద్ధేశ్చ.

ఆకాశమే బ్రహ్మమను సుప్రసిద్ధమగు అర్థముండుటచే దహరాకాశము కూడా బ్రహ్మమేయగును.

ప్రసిద్ధేః = సుప్రసిద్ధమగు అర్థముండుటచే, చ = కూడా.

14వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

బ్రహ్మమునకు ఆకాశమనెడి స్థిరమైన పేరు కలదు. ఆకాశశబ్దముచే బ్రహ్మము సూచింపఁబడుట శ్రుతియందు సుప్రసిద్ధమైయున్నది. కావున "దహరాకాశము" కూడా బ్రహ్మమునే సూచించును.

"ఆకాశోవైనామ నామరూపయోర్నిర్వహితా" యని (ఛాం. ఉ. 8-14-1) నందు కలదు. "సర్వాణి హవా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యంత" అని (ఛాం. ఉ. 1-9-1) నందు కలదు. "కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్, యదేష ఆకాశ ఆనందో నస్యాత్" అని (తై. ఉ. 2-7) నందు కలదు. ఈ శ్రుతులన్నింటి యందునుఁగల "ఆకాశము" బ్రహ్మమునే సూచించును.

## 1-3-18 ఇతర పరామర్శాత్స ఇతి చేన్నా సంభవాత్.

ఉపవాక్యమునందు సూచింపఁబడుటచే రెండవది (జీవుడు)అనెడి అర్థము నిచ్చుననినచో, అట్లు కాదు. ఏలననగా అది అసాధ్యము.

ఇతర = రెండవది, పరామర్శాత్ = సూచింపఁబడుటచే, సః = అతడు (జీవుడు), ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, అసంభవాత్ = అసాధ్యమగుటచే.

14వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

"ప్రశాంతుడైయున్న జీవుడే భౌతికశరీరమునుండి పైకెగిరినవాడై, ఉన్నతమైన ప్రకాశస్వరూపము నొందినవాడై, తన సత్స్వరూపమునందు కానఁబడును. అదియే ఆత్మ అనఁబడును. అతడిట్లు పలికెను" అను వాక్యము ఛాందోగ్యమునందు కలదు.

**పూర్వపక్షి ఇట్లు పలుకును :-** "ఉపవాక్యమునందు జీవుడు సూచింపఁబడియున్నాడు. (ఛాం. ఉ. 8-1-1) లోని దహరాకాశము కూడా జీవుడే యగును. సుషుప్తిని సూచించునట్టి"సంప్రసాదమ"ను శబ్దము జీవభావమునే మనకొసంగును. "శరీరమునుండి పైకెగురుట" యనునది కూడా దహరాకాశమే స్థానముగాఁగల జీవుని సూచించును. ఆకాశ సూచనానుసారముగా ప్రస్తుతవాక్యము కేవలము జీవుని మాత్రమే ప్రతిపాదించును."

ఇట్లు కాజాలదు. ప్రప్రథమముగా అంతఃకరణము మరియు ఇతర ఉపాధుల కారణముచే సంకుచితుడై యున్న జీవుడు సర్వవ్యాపకమైయున్న ఆకాశముతో పోల్చఁబడజాలడు.

ఇఁక రెండవకారణమేమనగా:- ప్రస్తుతవాక్యమునందు సూచింపఁబడినట్టి ఆకాశముయొక్క "పాపవిముక్తి" మున్నగు లక్షణములు జీవునికి నిజముగా అన్వయింపవు. కావున ఈ పరిచ్ఛేదము కేవలము బ్రహ్మమునే సూచించును.

## 1-3-19 ఉత్తరాచ్చేదా విర్భూత స్వరూపస్తు.

తదనంతర శ్రుతులచే జీవుడే సూచింపఁబడునని పలికినచో, అది నిజమునకు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందిన జీవస్వరూపమును సూచించునని మేము పలుకుదుము.

ఉత్తరాత్ = తదనంతర శ్రుతులచే, చేత్ = ఒకవేళ, ఆవిర్భూత స్వరూపః = తన నిజస్వరూపమును వ్యక్తమొనర్చుటతో, తు = కాని.

14వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

దహరాకాశము జీవుని సూచించునని నిరూపించుటకై పూర్వపక్షి మఱియొక విధముగా నిషేధించుచున్నాడు. "య ఆత్మాపహతపాప్మా విజరోవిమృత్యుర్విశోకో విజిఘత్సోఽ పిపాసస్సత్యకామస్సత్య సంకల్పస్సోఽ న్వేష్టవ్యస్స విజజ్ఞాసితవ్యః" (ఛాం. ఉ. 8-7-1) అని ప్రజాపతి ప్రకటించును. తదనంతరము "య ఏషోఽ క్షిణి పురుషోదృశ్యత ఏష ఆత్మా" అని అతడు పలుకును. (ఛా. ఉ. 8-7-4) ఇది జీవుని సూచించును. తదనంతరమాతడు జీవుని యొక్క వివిధ దశలనుఁ గూర్చి వర్ణించును. "య ఏష స్వప్నే మహీయమానశ్చరత్యేష ఆత్మా" (ఛాం. ఉ. 8-10-1)

"తద్యత్రైతత్సుప్తస్సమస్తస్సంప్రసన్న స్స్వప్నంన విజానాత్యేష ఆత్మా" (ఛా. ఉ. 8-11-1) ఈ యాత్మనుఁగూర్చిన వర్ణనలలోని "అమృతాభయ" శబ్దములచే జీవుని పాపరహితత్వము మొదలగు లక్షణములు వివరింపఁబడినవి. బ్రహ్మమునందు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు లేకుండుటచే నిశ్చయముగా జీవుడే ఇచ్చట సూచింపఁబడిన విషయము స్పష్టమగుచున్నది. అది పాపరహితమనియున్నూ చెప్పఁబడినది. కావున దహరాకాశము జీవుని సూచించునేఁగాని, బ్రహ్మమును సూచింపదు.

ఈ సూత్రము దీనిని ఖండించును. "ఎవరి స్వరూపము వ్యక్తమైయున్నదో అతడ"ని సూత్రమునందు ప్రయోగింపబడినది. బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్న జీవుని నిజమైన స్వరూపమును, లేక బ్రహ్మ సాక్షాత్కరము నొందినవానినిఁగూర్చియే ఇది సూచించును. కాని యథాతథముగానున్న జీవునిఁగూర్చి కాదు. "ఏషసంప్రసాదోఽ స్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్యస్వేన రూపేణాభి నిష్పద్యతే స ఉత్తమః పురుషః (ఛాం. ఉ. 8-12-3) బ్రహ్మముతో తాదాత్మ్యము నొందినప్పుడు మాత్రమే జీవుడు పాపవిముక్తుడగునుఁ గాని ఆతడు సశరీరుడై యున్నప్పుడుఁగాని, లేక ఉపాధులతో కూడియున్నప్పుడుఁగాని కాదు. కర్తృత్వభోక్తృత్వములు, రాగద్వేషములు జీవత్వమును సూచించును. వీటిని తొలగించినప్పుడు జీవుడు బ్రహ్మసదృశ ప్రకాశము కలవాడగును.

ద్వంద్వరూపమునందున్న అవిద్యనుండి జీవుడు తొలగింపఁబడనంతవరకు, "అహం బ్రహ్మాస్మి" యనెడి మహావాక్యము ద్వారా నిర్వికారమగు సచ్చిదానంద స్వరూపమైయున్న పరబ్రహ్మజ్ఞానమునుఁ బడయనంతవరకు, అతడు జీవుడుగానే శేషించియుండును. జీవుని అజ్ఞానమును, చీకటియందున్న ఒక స్తంభమును మానవునిగా తలంచు అజ్ఞానము మఱియు ఒక త్రాటిని పాముగా తలంచు అజ్ఞానముతోను పోల్చవచ్చును.

జీవుడు శరీరేంద్రియ మనస్సులతో తాదాత్మ్యమును తొలగించుకున్నప్పుడు మఱియు పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొన్నప్పుడు "యోహవైతత్పరమం బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" (ముం. ఉ. 3-2-9) అను వాక్యానుసారముగా నిర్వికారమగు సచ్చిదానంద పరబ్రహ్మస్వరూపుడే యగును. ఇదియే జీవుని నిజస్వరూపము. దీనిచే అతడు శరీరమునుండి ఉత్థితుడై తన నైజస్వరూపముతో భాసించును.

దహరమనెడి ఈ యధికరణమునందు జీవుడే సూచింపఁబడినాడని పలికినచో దానికి సమాధానమీ క్రింది సూత్రమునందు కలదు.

## 1-3-20 అన్యార్థశ్చ పరామర్శః

మఱియొక ఉద్యేశ్యముచే జీవుడిచ్చట సూచింపఁబడినాడు.

అన్యార్థః = మఱియొక ప్రయోజనము కొరకు, చ = మఱియు, పరామర్శః = సూచన.

14వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఇచ్చట జీవుడు సూచింపఁబడుటలో మఱియొక భావమున్నది. జీవుడిచ్చట సూచింపఁబడుట జీవుని స్వరూపమును తెలియఁజేయుటకొరకు కాదు; కాని పరబ్రహ్మము యొక్క స్వరూపమును తెలియఁజేయుట కొరకై యున్నది. జీవుని త్రివిధదశలు పేర్కొనఁబడుట జీవుని స్వరూపమును నిరూపించుట కొరకు కాదు. కాని బ్రహ్మమున కభిన్నమైయున్న అతని నిజస్వరూపమును గుర్తెఱుంగఁజేయుట కొరకైయున్నది.

ఇచ్చట మఱియొక ఆక్షేపణ చెప్పఁబడుచున్నది. "దహరము" హృదయము నందొక చిన్న స్థలము నాక్రమించునని శ్రుతి వర్ణించినది. జీవుడు చిన్నవాడగుటచే దహరమున్నూ చిన్నదైయున్నది. కావున ఇతఃపూర్వము పేర్కొనఁబడినట్లు "దహరము" జీవుడేనై యుండును. దీనికీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-3-21 అల్ప శ్రుతేరితి చేత్తదుక్తమ్.

దహరాకాశము చిన్నదని శ్రుతి వర్ణించుటచే అది బ్రహ్మమును సూచింపదని పలికినచో, ఇది ఇతఃపూర్వమే వివరింపఁబడినదని మేము చెప్పుదుము.

అల్పశ్రుతేః = చిన్నదని శ్రుతి చెప్పుట. ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, తత్ = అది, ఉక్తమ్ = ఇంతకు పూర్వమే వివరింపఁబడినది.

14వ సూత్రమును బలపఱచు వాదము ముగిసినది.

"దానియందీ దహరాకాశము కలద"నెడి శ్రుతివచనములోని దహరాకాశము యొక్క సూక్ష్మత్వము బ్రహ్మమున కన్వయించదనియు, అంకుశాగ్రముతో

పోల్చఁబడుటచే అది జీవుని సూచించుననియును పూర్వపక్షి పలుకును. ఈ విషయము ఇతఃపూర్వమే ఖండింపఁబడినది. ఉపాసనా నిమిత్తమై బ్రహ్మమునకు సూక్ష్మత్వమారోపింపఁబడినదను విషయము 1-2-7వ సూత్రమునందు చెప్పఁబడినది. ఇచ్చట కూడా ఇదే ఖండన వర్తించును. "ఈ యాకాశమెంత పెద్దదో, హృదయాకాశమున్నూ అంతే పెద్దద"ని నుడువుట ద్వారా శ్రుతి హృదయాకాశమును విశ్వాకాశముతో పోల్చి, ఆ సూక్ష్మత్వమును ఖండించినది.

# 6. అనుకృత్యధికరణము

## (22-23 సూత్రములు)

### 1-3-22 అనుకృతేస్తస్యచ

పరమాత్మయొక్క ప్రకాశముచేతనే సూర్యచంద్రాదులు ప్రకాశించుచున్నారని చెప్పఁబడుటచే.

అనుకృతేః = అనుసరించుటచే, తస్య = దానియొక్క, చ = మఱియు.

ముండకోపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

ముండకోపనిషత్తు 2-2-11 లోను మఱియు కఠోపనిషత్తు 5-15 లోను ఈ క్రింది వాక్యము కలదు. "నతత్ర సూర్యోభాతి న చంద్రతారకం, నేమా విద్యుతోభాంతి కుతోయమగ్నిః। తమేవభాంతమను భాతిసర్వం, తస్యభాసాసర్వమిదం విభాతి".

ఇచ్చట "తమేవ భాంతమను భాతి సర్వం, తస్యభాసా సర్వమిదం విభాతి" యనునది ఒకానొక ప్రకాశపుంజమా? లేక పరమాత్మయా? యను సంశయము కలుగును.

శ్రుతిలోని "అనుభాతి" మఱియు "తస్యభాసా సర్వమిదం విభాతి" యనునవి పరమాత్మ, లేక బ్రహ్మమునకు మాత్రమే అన్వయించును. ఆ పరమాత్మనుఁగూర్చి మఱియొక శ్రుతి ఇట్లు వచించుచున్నది. "భారూపస్సత్య సంకల్పః" (ఛాం. ఉ. 3-14-2) "తద్దేవా జ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్" (బృ. ఉ. 4-4-16)

ప్రస్తుత శ్రుతి వాక్యములోని "తమేవ భాంతమ"ను వాక్యాంశము "అనుభాతి సర్వమ్"ను సూచించును.

సూర్యప్రకాశాదులకు కారణమైయున్న మరియొక భౌతికప్రకాశము మనకు తెలియఁబడకున్నది. ఒక ప్రకాశము మరియొక ప్రకాశముచే ప్రకాశింపఁ జేయఁబడుచున్నదనుట అసంగతమే యగును. బ్రహ్మమును ప్రకాశింపఁజేయు భౌతికప్రకాశము సూర్యుడు తప్ప మరియొకటి మనకు కానరాదు.

సమస్తరూపములు మఱియు వర్ణములు వ్యక్తమగుటకు సూర్యప్రకాశమెట్లు కారణమైయున్నదో, అట్లే ఈ విశ్వమంతయు వ్యక్తమగుటకు కారణము బ్రహ్మప్రకాశమేనై యున్నది. బ్రహ్మము స్వయంప్రకాశము. అది తన మహిమయందు ఉనికిని కలిగియుండును. అది సూర్యచంద్ర నక్షత్రములను, విద్యుత్తును, అగ్నిని, మనోబుద్ధీంద్రియములను మఱియు సమస్త పదార్థములను ప్రకాశింపఁజేయును. దానిని ప్రకాశింపఁజేయుటకు మరియొక ప్రకాశమవసరము లేదు. "జ్యోతిషాం జ్యోతిః" వంటి శ్రుతివాక్యములచే బ్రహ్మము స్వయంప్రకాశమని స్పష్టమగుచున్నది. బ్రహ్మము నాధారముగాఁగొని సూర్యచంద్రాదుల ప్రకాశమున కునికి లేదని చెప్పవచ్చును. ఏలననగా ఈ జగత్తంతయు కేవలము బ్రహ్మముయొక్క ప్రకాశముచేతనే చూడఁబడుచున్నది. బ్రహ్మము స్వయంప్రకాశమానమగుటచే, ఏ యితర ప్రకాశముచేతను అది చూడఁబడజాలదు.

ప్రతి పదార్థము బ్రహ్మమునుండియే వ్యక్తమగును. కాని బ్రహ్మమును వ్యక్తమొనర్చునదేదియును లేదు. "అయంపురుష ఇత్యాత్మైవాస్యజ్యోతిర్భవతి" అను వాక్యము (బృ. ఉ. 4-3-6) నందు కలదు. ఈ నామరూప ప్రపంచమంతయు బ్రహ్మము యొక్క మహిమపై ఆధారపడియున్నదని "సర్వమ్"అను శబ్దము సూచించుచున్నది. ప్రకాశమంతటికి బ్రహ్మమే కారణమైయుండుటచే "అను"యనెడి శబ్దము బ్రహ్మమును సూచించును.

## 1-3-23 అపిచస్మర్యతే

ఇంతేకాకుండా విశ్వప్రకాశమే బ్రహ్మమని స్మృతి కూడా నుడువుచున్నది.
అపి = ఇంతేకాకుండా, స్మర్యతే = స్మృతి పలుకుచున్నది.

22వ సూత్రమును బలపరచువాదమొసంగఁబడినది.

స్మృతియగు గీత కూడా అట్లే నుడువుచున్నది. “నతద్భాసయతే సూర్యో నశశాంకో నపావకః యద్గత్వాన నివర్తంతే తద్ధామ పరమం మమ” (15-6) మఱియు “యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్, యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ (గీ. 15-12)

# 7. ప్రమితాధికరణము

## (24-25 సూత్రములు)

### 1-3-24 శబ్దాదేవ ప్రమితః

శబ్దమాత్రముచేతనే అంగుష్ఠమాత్ర పురుషుడు బ్రహ్మమని తెలియవలయును.

శబ్దాత్ = శబ్దమాత్రముచే, ఏవ = స్వయముగా, ప్రమితః = అంగుష్ఠమాత్రముగా కొలువఁబడినది.

కఠోపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

కఠోపనిషత్తులోని 2-4-12 నందు “ అంగుష్ఠమాత్రః పురుషోమధ్య ఆత్మని తిష్ఠతి” మఱియు 2-4-13 నుందు “అంగుష్ఠమాత్రః పురుషోజ్యోతిరివాధూమకః ఈశానో భూత భవ్యస్య స ఏవాద్యస ఉశ్వః ఏతద్వైతత్” అని చెప్పఁబడినది.

ఇచ్చట అంగుష్ఠమాత్రుడుగా నుడువఁబడిన పురుషుడు జీవుడా? లేక పరబ్రహ్మయా? యను సంశయము కలుగును.

అంగుష్ఠమాత్ర పురుషుడు జీవునికే అన్వయించునని పూర్వపక్షి పలుకును. ఏలననగా అనంతుడైయున్న పరమాత్మకు అంగుష్ఠమాత్రుడనెడి కొలతను శ్రుతి ఆరోపించుట అసంగతమగును.

అంగుష్ఠమాత్రపురుషుడు కేవలము బ్రహ్మమేయని మేము దీనికి సమాధానమునొసంగుదుము. ఏల? “ఈశానోభూత భవ్యస్య” అను వాక్యాంశమే దీనికి ప్రమాణమైయున్నది. భూతభవిష్యత్తులను పరిపాలించువాడు కేవలమా పరమేశ్వరుడే. ఇంతేకాకుండా “ఏతద్వైతత్” అను వాక్యాంశము అడుగఁబడిన వాక్యముతో సంబంధించియున్నది. కావున ఇదియే చర్చనీయాంశమైయున్నది.

నచికేతుడు బ్రహ్మమునుఁ గూర్చియే అడిగియుండెను. నచికేతుడు యముని ఇట్లడిగెను:– “అన్యత్ర ధర్మా దన్యత్రా ధర్మా దన్యత్రాస్మాత్కృ తాకృతాత్, అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చయ త్తత్పశ్యసి తద్వద” (కఠ. ఉ. 1–2–14). యముడు అంగుష్ఠమాత్ర పురుషుని సూచించి “నీవు తెలిసికొనఁగోరినదిదియే” అని పలికెను.

బ్రహ్మము సర్వాంతర్యామియైనను, అతడంగుష్ఠ మాత్ర పరిమాణముఁ గలవాడని చెప్పఁబడెను. ఏలననగా మానవుని సంకుచిత ప్రదేశమగు హృదయగుహయందే అతడు సాక్షాత్కరింపఁబడును.

“ఈశానోభూత భవ్యస్య”యను విశేషణము జీవునికెంతమాత్రమున్నూ అన్వయింపదు. ఏలననగా తన భూతభవిష్యత్తులు తన స్వకర్మలచే బంధింపఁ బడియున్నవి. మఱియు అతనికింతటి ఘనమైన మహిమ లేదు.

కాని సర్వాంతర్యామియైన దేవుని అంగుష్ఠమాత్రపరిమాణముతో పరిమితుని చేయుట తగునా? ఈ ప్రశ్నకీ క్రింది సూత్రము సరియైన సమాధానమునొసంగును.

## 1–3–25 హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్

మానవుడు మాత్రమే వేదాధ్యయనము, ధ్యాననిష్ఠ మఱియు ఆత్మసాక్షాత్కారములకర్హుడగుటచే బ్రహ్మము హృదయములోని అంగుష్ఠమాత్ర పురుషపరిమాణముఁగలవాడుగా చెప్పఁబడెను.

హృది = హృదయమునందు, అపేక్షయా = సూచనచే, తు = కాని, మనుష్యాధికారత్వాత్ = మనుష్యులకర్హత ఉండుటచే.

24వ సూత్రమునకనుగుణమగు వర్ణన ఒసంగఁబడినది. మఱియు ఉపాసనకుఁగల అర్హత చర్చింపఁబడినది.

బ్రహ్మము సర్వవ్యాపకమైయున్నను, అంగుష్ఠమాత్ర పరిమాణమాతని కారోపింపబడినది. అతడు అంగుష్ఠపరిమాణముతో హృదయమునందు నివసించియుండుటయే దీనికి కారణమైయున్నది. బ్రహ్మము జీవులందఱి హృదయములలో వసించియున్నాడు. హృదయములు జంతువుల వైశాల్యముననుసరించి భిన్నభిన్న పరిమాణముఁగలవైయుండును. హృదయములు కొన్ని పెద్దవిగను, కొన్ని చిన్నవిగను, కొన్ని అంగుష్ఠము కంటె పెద్దవిగను, మఱికొన్ని

అంగుష్ఠముకంటె చిన్నవిగను ఉండును. "ఆంగుష్ఠమే" పరిమాణముగా ఏలచెప్పఁబడినది? మానవుని హృదయమే ఏల చెప్పఁబడినది? మఱియొక జంతువుయొక్క హృదయమేల చెప్పఁబడలేదు? ఈ సూత్రము యొక్క ఉత్తరాంశము దీనికి సమాధానము నొసంగును. "మనుష్యాధికారత్వాత్". మానవుడు మాత్రమే వేదాధ్యయనమునకు, ధ్యాననిష్ఠకు మఱియు వాటియందు నుడువఁబడిన వివిధములగు బ్రహ్మోపాసనల ననుష్ఠించుటకు అర్హుడైయున్నాడు. కావున అంగుష్ఠమాత్ర పరిమాణము కేవలము ఆతనిఁ గూర్చియే ప్రయోగింపఁబడినది.

తన శరీరమునందున్న అంగుష్ఠమాత్ర పరిమాణముఁగల బ్రహ్మముతో జీవుని తాదాత్మ్యము నొందించుటయే ఇచ్చట లక్ష్యముగా చెప్పఁబడినది. వేదాంతవాక్యములు ద్వివిధ లక్ష్యములను కలిగియుండును. వాటిలో కొన్ని బ్రహ్మముయొక్క స్వరూపమునుఁగూర్చి వర్ణించును. మఱికొన్ని జీవ బ్రహ్మైక్యమునుఁగూర్చి ప్రబోధించును. మన ఈ ప్రస్తుత వాక్యము జీవబ్రహ్మైక్యమునుఁగూర్చి ప్రబోధించునేఁగాని, ఏదైన ఒక పదార్థము యొక్క పరిమాణమునుఁగూర్చి కాదు. ఉపనిషత్తునందీ విషయము ముమ్మందు తేటతెల్లమొనర్పఁబడినది. "అంగుష్ఠమాత్రః పురుషోఽంతరాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః, తం స్వాచ్ఛరీరాత్ప్రవృహేన్ముంజాది వేషీకాం ధైర్యేణ, తం విద్యాచ్ఛు క్రమమృతమితి" (కఠ. ఉ. 2-6-17).

# 8. దేవతాధికరణము
# (26-33 సూత్రములు)

## 1-3-26 తదుపర్యపి బాదరాయణః సంభవాత్.

బాదరాయణుని మతము ననుసరించి మనుష్యులకు పైనున్న దేవతలు కూడా వేదాధ్యయమునకు మఱియు వాటి నాచరించుటకు యోగ్యులైయున్నారు.

తదుపరి = మనుష్యులకు పైనున్న దేవతలు, అపి = కూడా, బాదరాయణః = బాదరాయణుని అభిప్రాయము, సంభవాత్ = సాధ్యమైయుండుటచే.

వేదాధ్యయనము మఱియు ధ్యాననిష్ఠల యొక్క యోగ్యత వర్ణింపఁబడుచున్నది.

ఈ పాదములోని 26 నుండి 38 వరకుఁగల సూత్రములలో ప్రధానాంశము దిగజాఱిపోయినది. ఇంద్రియములు లేనివారగుటచే దేవతలు ధ్యాననిష్ఠకు యోగ్యులు కారని పూర్వపక్షి పలుకును. కావున ధ్యానమొనర్చు సామర్థ్యము వారికి లేదు. ఇంద్రునివంటి దేవతలు కేవలము మంత్రోచ్చారణచే సృష్టింపఁబడిన కల్పితరూపములు. వారికి వైరాగ్య వివేకములను కలిగియుండు కోరిక లేదు. దీనికి సూత్రకారుడీ సూత్రమునందు సమాధానము నొసంగుచున్నాడు. పూర్వసూత్రమునందు కేవలము మానవులుమాత్రమే వేదాధ్యయనమునకర్హులని చెప్పఁబడుటచే, దేవతలు దానికనర్హులనెడి సంశయము కలుగవచ్చును. ఈ సంశయమును ఏతత్సూత్రము నివారించును.

దేవతలు మానవులకన్న శ్రేష్ఠులగుటచే వారు కూడా వేదాధ్యయనమునకు ధ్యాననిష్ఠకు మఱియు బ్రహ్మజ్ఞానమున కర్హులేయని శ్రీ బాదరాయణుని మతము. అది ఎట్లు? వారు కూడా సశరీరులగుటచే, ఇది వారికి కూడా సాధ్యమేయగును. ఉపనిషత్తులు, వైదికమంత్రవిభాగములు, ఇతిహాసములు, పురాణములన్నియును ఒక్కుమ్మడిగా దేవతలు శరీరములను కలిగియున్నారని వర్ణించుచున్నవి. వారొనర్చు కార్యములు, శక్తులు, వస్తువులన్నియును అశాశ్వతములగుటచే కైవల్య మోక్షమునొందు కోరిక వారికుండక తప్పదు. బ్రహ్మజ్ఞానమును బడయుట కావశ్యకమైయున్న చతుర్విధసాధన సంపత్తిని కలిగియుండు వాంఛ వారియందుండ వచ్చును. జ్ఞానము నొందుటకై దేవతలు కూడా శిష్యత్వము నాచరింపవలసివచ్చును.

"నూరున్నొక్క సంవత్సరములు ఇంద్రుడు ప్రజాపతికి శిష్యునిగా శుశ్రూష యొనర్చెన"ని ఛాం. ఉ. 8-2-3 నందు కలదు. "భృగుర్వైవారుణిః, వరుణం పితరముపససార, అధీహి భగవో బ్రహ్మేతి" (తై. ఉ. 3-1). దేవుడైన వరుణుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడగుటచే, తన పుత్రుడైన భృగువునకు దానిని ప్రబోధించెను.

ధ్యాననిష్ఠ కనుకూలమైన లక్షణముల నన్నింటిని దేవతలు కూడా కలిగియుందురు. కావున వారు కూడా వేదాధ్యయమునకు మఱియు ఆత్మసాక్షాత్కారమున కర్హులే యగుదురు. ఉపనయనము మఱియు వేదాధ్యయనము లేకుండానే దేవతలకవి స్వయముగా సంప్రాప్తించును.

దేవతలయొక్క హక్కు నంగీకరించినప్పుడు అంగుష్ఠమాత్ర పురుషునిఁగూర్చి చెప్పఁబడినవాక్యము దేవతలకు కూడా సమానముగా వర్తించును. వారి విషయమునందగుష్ఠమాత్ర పురుషునిగా వర్ణింపఁబడిన శ్రుతివచనము దేవతల యొక్క అంగుష్ఠముల పరిమాణమును సూచించును.

"దేవతలకు శరీరములు కలవని మనమంగీకరించినచో యజ్ఞయాగాదుల విషయములో సంకట మేర్పడును. ఏలననగా యజ్ఞయాగాదులలో తన భక్తులందఱిచే ఆహ్వానింపఁబడినప్పుడు ఒకే సమయములో ఆయా స్థలములకేగుటకు నాశవంతుడును, సశరీరుడునగు ఇంద్రునికి సాధ్యము కాకుండును. అందువలన యజ్ఞయాగాదులు నిష్ప్రయోజనములగున"ని పూర్వపక్షి పలుకును. ఇట్టి ఆక్షేపణకీ క్రింది సూత్రములో సూత్రకారుడు సమాధానము నొసంగుచున్నాడు.

## 1-3-27 విరోధః కర్మణీతి చేన్నానేక ప్రతిపత్తేర్దర్శనాత్.

దేవతలయొక్క సశరీరత్వము యజ్ఞయాగాదులను ఖండించునని పలికినచో, అట్లు కాదని మేము సమాధానము చెప్పుదుము. ఏలననగా ఒకే సమయములో దేవతలు అనేక రూపములను ధరించు విషయము శాస్త్రప్రామాణ్యమై యున్నది.

విరోధః = విరోధము, కర్మణి = యజ్ఞయాగాదులలో, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, అనేక = అనేక శరీరములు, ప్రతిపత్తేః = ధరించుటచే, దర్శనాత్ = శాస్త్రములలో చెప్పఁబడుటచే.

26వ సూత్రమునకు విరుద్ధమైన నిషేధము చెప్పఁబడి, ఖండింపఁబడినది.

ఒకే సమయములో అనేక రూపములను ధరించు సామర్థ్యము దేవతకున్నది. అనేక స్థలములలో ఆచరింపఁబడుచున్న యజ్ఞయాగాదులలో అతడొకే

సమయములో దర్శన మొసంగఁగలుగును. స్మృతియున్నూ ఇట్లు పేర్కొన్నది. "ఓ యోగీ! ఓ భరతశ్రేష్ఠుడా! అతని శక్తిచే ఆతని ఆత్మ అనేక వేల రూపములను ధరించి, ఈ ధరిత్రిపై సంచరించునుఁగాక! కొన్నింటియందాతడు సుఖభోగముల ననుభవించునుఁగాక! మరి కొన్నింటియందాతడు తపశ్చర్య నొనర్చునుఁగాక! తుట్టతుదకాతడు సూర్యుడు తన కిరణముల నుపసంహరించు కొన్నట్లు వాటినన్నింటిని ఉపసంహరించుకొనునుఁగాక!" అమానుషశక్తులుఁగల యోగులు సైతము సూక్ష్మ శరీరధారులై ఒకే సమయమునందనేక శరీరములను ధరించు శక్తిఁగలవారై యుందురని స్మృతివచనమై యున్నచో, ఇఁక స్వాభావికముగా అమానుషశక్తులను కలిగియున్న దేవతలకెట్టి సామర్థ్యముండునో మన మూహించుకొనవచ్చును. ఒక దేవత తనకు తాను వివిధరూపములలో విభజించుకొని, ఏకకాలమునందనేక యజ్ఞములలో పాల్గొనఁగలుగును. అదృశ్యశక్తిని కలిగియున్న ఫలితముగా అతడెంత కాలమైనను ఇతరులచే చూడఁబడకుండా ఉండఁగలుగును. ఒకే మనుష్యుడు అనేక వ్యక్తుల వందనముల నందుకొనునట్లు, ఒకే దేవత అనేక యజ్ఞముల కాధారమై ఎందుకుండరాదు?

## 1-3-28 శబ్ద ఇతి చేన్నాతః ప్రభవాత్ప్రత్యక్షానుమానాభ్యామ్.

శబ్దముచే విరుద్ధము సంభవించునని పలికినచో, అట్లు కాదు. ఏలననగా శబ్దముచే ఈ ప్రపంచ ముత్పన్నమగునని శ్రుతిస్మృతులచే తెలియుచున్నది.

శబ్దే = వైదికశబ్దమునందు, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, అతః = ఈ శబ్దముచే, ప్రభవాత్ = సృష్టికలుగుటచే, ప్రత్యక్షాను మానాభ్యామ్ = శ్రుతిస్మృతులచే.

26వ సూత్రములోని దేవతల సశరీరత్వమునుఁగూర్చిన మరియొక నిషేధము చెప్పఁబడి, ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లు సమర్థించును. "వైదికశబ్దములు ఆద్యంతములు లేనివనియు, శాశ్వతమైనవనియును పూర్వమీమాంసాదర్శనము నుడువును. కావున దేవతలు శరీరధారులైయున్నచో, జీవులకువలె వారు జనన మరణములను కూడా కలిగియుండవలయును. అందువలన దేవతల జన్మకు పూర్వము వైదికశబ్దముల కునికి లేకుండవలయును. లేక ఆ శబ్దములు ఏలాటి దేవతలనైనా సూచింప

కుండవలయును. ఏలననగా ప్రళయకాలమునందవి నశించును. కావున వైదికశబ్దముల శాశ్వతత్వము అసంగతమగును.”

దేవతలకు మూలము వైదికశబ్దములని శ్రుతిస్మృతులు రెండున్నూ నుడువుటచే, ఇట్టి అసంగతత్వమునకు తావులేదని మా సమాధానము.

వైదికశబ్దములు శాశ్వతముగా నిలిచియున్నవి. వాటికొక సుస్థిరమైన అర్థమున్నది. దేవతలయొక్క వైదికనామములు వాటి జాతులను సూచించునేఁగాని వ్యక్తులను సూచింపవు. కావున దేవతల యొక్క జనన మరణములు జాతులను ప్రభావితమొనర్చవు. ఇఁక వైదికశబ్దముల శాశ్వతత్వమును బాధింపవని వేరుగా చెప్పవలయునా?

ఆవులు అసంఖ్యాకములైనను “ఆవు” శబ్దము ఒకే జాతిని సూచించును. “ఆవు” శబ్దము శాశ్వతమైనది. ఆ తెగకు చెందిన ఆవులయొక్క జననమరణములతో దానికి సంబంధము లేదు. దేవతలను సూచించు శబ్దములు ఆయా తెగలకు సంబంధించినవేఁగాని, ఆయా వ్యక్తులకు సంబంధించినవి కావు. రాజప్రతినిధి వలె ఇంద్రశబ్దమొక పదవిని సూచించును. అట్టి దివ్యకార్యము నొనర్చువాడెవడైనను ఇంద్రుడని చెప్పఁబడును. కావున వేదములకు అశాశ్వతమనునది లేదు.

దేవతాశబ్దము కూడా వైదికశబ్దమునుండియే జనించినది. శాస్త్రీయశబ్దములు ప్రపంచమునకు మఱియు దేవతలకు కూడా మూలాధారమైయున్నవి. బ్రహ్మమే ప్రాపంచికకారణమని పలుకు 1-1-2 సూత్రమును ఈ సిద్ధాంతము నిషేధించునని నీవు పలికినచో, బ్రహ్మము ఉపాదాన కారణమని మేము సమాధాన మొసంగుదుము. వేదము ఇట్టి ఉపాదాన కారణము కాదు. సృష్టికర్త వైదికశబ్దముల నుచ్చరించి సృష్టించును. అతడు “భూః” ఇత్యాది శబ్దములను పలికి భూలోకాదులను సృష్టించును.

ఒక కుమ్మరివాడు తన మనస్సులో “కూజా” రూపమును ధరించినవాడై “కూజా”ను ఎట్లు నిర్మించునో అట్లే బ్రహ్మదేవుడున్నూ ఆయా రూపసమన్వితములగు ఆయా శబ్దముల నుచ్చరించి, ఆయా రూపములను జ్ఞప్తియందుంచుకొన్నవాడై, ఆయా రూపలక్షణములను మనస్సునందుంచుకొని ఇంద్రుడు, ఆవు వంటి జీవరాసులన్నింటిని సృష్టించినాడు.

ప్రతి వైదికశబ్దమున్నూ ఎల్లప్పుడొక ప్రత్యేకజాతికి చెందిన రూపమును వ్యక్తమొనర్చునేఁగాని ఒక వ్యక్తినిఁగూర్చి కాదు. ఆయా శబ్దములచే సూచింపఁబడు ప్రత్యేకరూపములను జ్ఞప్తియందుంచుకొని బ్రహ్మదేవుడీ ప్రపంచమును సృష్టించును. వ్యక్తిగతమగు స్థూలరూపమును ధరించుటకు పూర్వము, ఆకృతులు శాశ్వతత్వమనెడి మూలమూర్తుల రూపమునందుండును. "ఏతే" (ఇవి) యను శబ్దమును మననము చేయుచు సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు దేవతలను సృష్టించెను. "అసృగ్రమ్" అను శబ్దముచే అతడు మానవులను, "ఇందవః" అనుశబ్దముచే పితృదేవతలను, "తిరస్పవిత్రమ్" అను శబ్దముచే నక్షత్రమండలములను, "అసువ" అనుశబ్దముచే పాటలను, "విశ్వాని" శబ్దముచే మంత్రములను మఱియు సమస్త ఇతర ప్రాణులను "అభిసౌభగ" శబ్దముచేతను సృష్టించెను.

"ఏతత్" శబ్దము దేవతలకు సృష్టికర్తయైన బ్రహ్మదేవునికి ఇంద్రియాధిష్ఠాతను జ్ఞప్తికిఁదెచ్చును. "అసృగ్ర" యనుశబ్దమునకర్థము రక్తమగుటచే, రక్తమే ముఖ్యాంశమైయున్న మనుష్యులు మొదలగు ప్రాణులాతనికి జ్ఞప్తికి వత్తురు. "ఇందు" శబ్దము చంద్రుని సూచించుటచే చంద్రలోకమునందుండు పితృదేవతల నాతడు స్మరించును. "శుద్ధమైన అమృతమును ధరించునద"ను అర్థమునొసంగు "తిరస్ పవిత్రమ్" శబ్దముచే సోమరసముఁగలమండలము లాతనికి జ్ఞప్తికి వచ్చును. ప్రవహించుట అను అర్థమునిచ్చు "అసుర" శబ్దముచే అతనికి మధురమైన గానప్రవాహము జ్ఞాపకమునకు వచ్చును. "విశ్వాని" శబ్దముచే విశ్వేదేవతలకు పవిత్రములైన గానములాతనికి జ్ఞప్తికి వచ్చును "మహైశ్వర్యమ"ను అర్థమునొసంగు అభిసౌభగ" శబ్దముచే అతడు సమస్త ప్రాణులను స్మరించును. "వైదికశబ్ద సమన్వితమగు వాక్కుతోను, మనస్సుతోనుకూడియున్నవాడ"ను వాక్యము బృదారణ్యకోపనిషత్తునందుకలదు.

ప్రతిశబ్దము తదనుగుణమగు ఒక రూపమును, లేక పదార్థమును సూచించును. నామరూపములు అభిన్నములు. నీవొక రూపమును స్మరించినప్పుడు, దానిపేరు కూడా నీకు వెంటనే స్మరణకు వచ్చును. ఒక నామము నుచ్చరించినప్పుడు దాని రూపము నీకు గోచరమగును. నామ రూపముల మధ్యఁగల సంబంధము శాశ్వతము.

వేదమీ విశ్వమున కుపాదాన కారణము కాదు. వేదము అశాశ్వతులైన వసువులు, రుద్రులు, ఆదిత్యులు, ఇతర దేవతలు జన్మించినట్లు పలుకుటచే వేదములు కూడా అశాశ్వతములేయని నీవు పలుకుదువేని, ద్రవ్యగుణ కర్మలయొక్క అభివ్యక్తీకరణములే జన్మించినవిఁగాని ఆకృతులు, లేక యోనులు కావని మేము సమాధాన మొసంగుదుము. "శబ్దము"చే విశ్వముత్పన్నమైన విషయమును బ్రహ్మమువలె శబ్దమీ విశ్వమునకుపాదాన కారణముగా తలంపరాదు.

"ఆది యందాతడు వైదిక శబ్దములచే వివిధములగు నామములను, కర్మలను మఱియు సమస్త వస్తుజాలమును సృష్టించెను. (మను. 1-21)

సంకల్పము ప్రప్రథమముగా ఒక శబ్దముగా రూపొందును. తదనంతరమది స్థూలరూపమునుఁ దాల్చును. సంకల్పమును నీవు నామరూపములనుండి విడఁదీయలేవు. నీవొక కార్యమును చేయఁదలంచినప్పుడు మొదట నీవు ఆ వస్తువునకు సంబంధించిన శబ్దమును స్మరింతువు. అప్పుడు నీవా కార్యము నొనర్చుట కుపక్రమింతువు. సృష్టికి పూర్వమే సృష్టికర్తయైన ప్రజాపతి యొక్క మనస్సులో వైదిక శబ్దములు వ్యక్తములయ్యెను. తదనంతర మా శబ్దముల కనుగుణములైన పదార్థముల నాతడు సృష్టించెను. "భూః శబ్దము నుచ్చరించి అతడు భూలోకమును సృష్టించెను." (తై. బ్రా. 2-2-4-2)

నాశవంతములగు అక్షరములచే ఈ విశ్వము సృష్టింపఁబడలేదనియు, శబ్దమునకు కారణ ద్రవ్యమైయున్న శాశ్వతమగు ''స్ఫోటము''చే శబ్దముత్పన్నమగుటచే, ఈ "స్ఫోటమే" విశ్వమునకు కారణమై యున్నదనియు పూర్వపక్షి పలుకును. శబ్దముయొక్క అర్థమును సూచించు అర్థాధికేతు "స్ఫోటమ"నఁబడును. శబ్దముయొక్క అక్షరముచే వ్యక్తమైన పరమశ్రేష్ఠమగు పదార్థమే స్ఫోటమనఁబడును. మఱియు మనస్సుచేత ఊహింపఁబడినప్పుడది శబ్దార్థము నొసంగును.

పూర్వపక్షి యొక్క ఈ వాదము నిరాధారమైనది. ఇది నిశ్చయముగా మన స్వానుభవము కాదు. ఉచ్చరింపఁబడిన ధ్వనులకు నాశము లేదు. ఏలననగా ఉచ్చారణ యొక్క అంతమునందది మరల ఉచ్చరింపఁబడు దానితో తాదాత్మ్యము నొందుటను మనముఁగాంచుచున్నాము. ఒకే శబ్దమును రెండుమార్లుచ్చరించినప్పుడు స్వరభేదముండవచ్చును. దీనిచే తాదాత్మ్యత నిషేధింపఁబడదు. ఏలననగా భేదము

కేవలము తాత్కాలికమైయున్నది. అక్షరము లనేకమైయున్నను, అక్షరసమూహముచే ఒక ఊహ మనకు కలుగవచ్చును. (పది, నూరు మొదలగునవి) కావున స్ఫోటసిద్ధాంతమిచ్చుట అనావశ్యకమని చెప్పవచ్చును.

ఈ కారణముచే వైదిక శబ్దములు శాశ్వతములను మాట సుస్పష్టము మరియు వాటి మూలముననే దేవతల సహితముగా సమస్తవిశ్వము సృష్టింపఁబడినదను సిద్ధాంతమునందు దోషమేమాత్రమున్నూ లేదు.

## 1-3-29 అత ఏవ చ నిత్యత్వమ్.

ఈ కారణముచేతనే వేదములు నిత్యములని చెప్పవచ్చును.

అత ఏవ = ఈ కారణముచే, చ = కూడా, నిత్యత్వం = వేదముల యొక్క శాశ్వతత్వము.

28వ సూత్రమునుండి ఊహింపఁబడిన ఒక ఉపవాక్యము చెప్పఁబడుచున్నది.

28వ సూత్రమునందుదహరింపఁబడిన కారణములచే కూడా వైదిక శబ్దముల యొక్క శాశ్వతత్వము నిరూపింపఁబడుచున్నది. ఏలననగా ఆ శబ్దములు శాశ్వతమైన తెగలను సూచించును.

ఇతఃపూర్వమే నిరూపింపఁబడిన వేదములయొక్క శాశ్వతత్వము నీ సూత్రము దృఢపఱచుచున్నది. వైదికశబ్దము చేతనే దేవతల వంటి శాశ్వతమైన తెగలు, లేక యోనులతో కూడిన ఈ విశ్వము సృష్టింపఁబడినది. ఈ కారణముచేతనే వైదికశబ్దము యొక్క శాశ్వతత్వము నంగీకరింపక తప్పదు. దేవతలు మున్నగు తెగలు శాశ్వతములగుటచే, వైదిక శబ్దములున్నూ శాశ్వతములే యగును.

వేదములెవ్వరిచేతను వ్రాయఁబడలేదు. అవి నిశ్చయముగా పరమేశ్వరుని శ్వాసయైయున్నవి. అవి శాశ్వతమైనవి. ఋషులు వేదములకు కర్తలు కారు, వారు కేవలము వాటి నావిష్కరించిరి. "తమ పూర్వజన్మసుకృతముచే యాజ్ఞికులు వేదములనర్థమొనర్చుకొనఁగలిగిరి. వారు ఋషులనుండి వాటిని పొందిరి" అను మంత్రము మఱియు "యజ్ఞసాధనచే వారు వాక్కును కనుఁగొనిరి. వారు దానిని ఋషులయందుపొందఁగలిగిరి." (ఋగ్వేద సంహిత 10-71-3) మంత్రముచేతను ఋషులచేత ఆవిష్కరింపఁబడిన వాక్కు శాశ్వతమైనదని తెలియుచున్నది.

శ్రీవేదవ్యాసులు కూడా ఇట్లు పలికిరి: "పూర్వము స్వయముగా స్వయంభువుచే ఋషులాజ్ఞాపింపఁబడిరి. వారి తపశ్చర్య ద్వారా వేదములు, ఇతిహాసములు బయల్పడెను. అవి యుగాంతమునందు దాచిపెట్టఁబడెను."

## 1-3-30 సమాన నామరూప త్వాచ్చావృత్తావప్య విరోధో దర్శనాత్స్మృతేశ్చ

ప్రతి నవీనయుగమునందును ఒకే నామరూపములుండుటచేతను, లోకవృత్తములు సంచరించుచున్నను వైదికశబ్దములు శాశ్వతముగా నిలచియుండునని శ్రుతి స్మృతి ప్రామాణ్యమైయున్నది.

సమాన నామరూపత్వాత్ = సమానమైన నామరూపములుండుటచే, చ = మఱియు, ఆవృత్తౌ = పునరావృత్తియందు, అపి = కూడా, అవిరోధః = విరోధము లేదు, దర్శనాత్ = శ్రుతివలన, స్మృతేః = స్మృతి వలన, చ = మఱియు.

29వ సూత్రమున కనుకూలమగు వాదమీ సూత్రమునందొసంగఁబడినది.

పూర్వపక్షి ఇట్లు పలుకును. "యుగాంతమునందు సమస్తము సంపూర్ణముగా నశించును. ద్వితీయ యుగారంభమునందు నూతన సృష్టి కలుగును. సత్తాయొక్క ఉనికియందు విఘ్నముకలుగును. కావున దేవతల వంటి తెగలు శాశ్వతములు కావు. మఱియు వైదికశబ్దముల యొక్క శాశ్వతసంబంధముతో పాటు అవి సూచించునట్టి వస్తువులు కూడా శేషించి ఉండవు. తత్ఫలితముగా శాశ్వతత్వమునకు మఱియు వేద ప్రామాణ్యమునకు విరుద్ధ మేర్పడును."

అట్లు కాదని మేము పలుకుదుము. నిద్రనుండి మేల్కాంచిన మనుజుడు నిద్రకు పూర్వమనుభవించిన రూపమునే ఎట్లు కలిగియుండునో,అట్లే ప్రళయకాలమునందీ ప్రపంచము సూక్ష్మ(బీజ) రూపము నందుండును. రెండవ యుగాంతమునందది మరల అదే నామరూపములతో వ్యక్తమగును. కావున వైదికశబ్దములు మఱియు తద్వస్తువులయొక్క శాశ్వత సంబంధమునకు విరోధము లేదు. తత్ఫలితముగా వేదప్రామాణ్యము సమంజసమగును. శ్రుతిస్మృతులీ విషయమున కాధారములైయున్నవి. ఋగ్వేదము (10-190-3) నందీ క్రిందివాక్యము కలదు. "పరమేశ్వరుడు పూర్వము సూర్యచంద్రులను స్వర్గభూమ్యాకాశాదుల నాజ్ఞాపించెను." మఱియు స్మృతియందీ క్రిందివాక్యము కలదు. "కాలము

గడచిన కొలది అవే ఋతువులు మరల మరల ఎట్లు వచ్చునో, అట్లే యుగాంతరమునందున్నూ జీవులు మరల మరల ఉత్పన్నమై లయించుచుందురు."

సంశయనివారణకై సూత్రమునందు "చ" శబ్దము ప్రయోగింపఁబడినది. పూర్వసృష్టియందున్న నామరూపములే నూతనసృష్టియందున్నూ కానఁబడుటచే, మహాప్రళయానంతరము కూడా వైదికశబ్దములు శాశ్వతముగా నిలచియుండుననుట వాస్తవము. మహాప్రళయమునందు వేదములు మఱియు వైదికశబ్దములచే సూచింపఁబడిన తెగలున్నూ పరమేశ్వరునియందు లయించును. మఱియు అతనియందైక్య మగును. అతనియందవి బీజరూపమునందుండును. పరమేశ్వరుడు వాటిని సృష్టింపఁదలంచినప్పుడు, తిరిగి అతనినుండి అవి బయల్వెడలి వ్యక్తములగును. జీవసృష్టి ఎల్లప్పుడు వైదికశబ్దములు మఱియు అవి సూచించునట్టి తెగలపై ఆధారపడియుండును.

మహాప్రళయానంతరము పరమేశ్వరుడు పూర్వము వలెనే యథాతథముగా వేదములను సృష్టించి, వాటినాజ్ఞాపించి, అమర్చును. అతడు శబ్దములను మఱియు తెగలను ధ్యానించి, సమస్త విశ్వమును సృష్టించును. ఉత్తరసృష్టి పూర్వసృష్టిని పోలియుండును. ఒక కుమ్మరివాడు "కుండ" శబ్దమును మఱియు తద్రూపమును తన మనస్సులో స్మరించి కుండనెట్లు తయారుచేయునో, అట్లే పరమేశ్వరుడున్నూ, ఈ విశ్వమును సృష్టించును. మహాప్రళయానంతరము పరమేశ్వరుడు స్వయముగా మహత్తునుండి బ్రహ్మాండము వరకుఁగల సమస్త పదార్థములను సృష్టించును. ఆతడు బ్రహ్మదేవుని తన శరీరమునుండి సృష్టించి మానసికముగా వేదములనాతనికి నేర్పి, ముమ్ముందు జరుగవలసిన సృష్టికార్యమునాతనికప్పగించును. సామాన్యప్రళయమునందు బ్రహ్మదేవుడుఁగాని, పదార్థములుఁగాని, నశింపవు. సామాన్యప్రళయానంతరము బ్రహ్మదేవుడు స్వయముగా ఈ ప్రపంచమును సృష్టించును.

మనము నిద్రించి మేల్కొన్న తర్వాత, ఇతఃపూర్వమనుభవించిన భౌతికవిశ్వానుభవము మనకు జ్ఞప్తికి వచ్చును. కాని ప్రపంచ ప్రళయ విషయమునందిది సాధ్యము కాదని ఎవరైనను నిషేధింపవచ్చును. దీనికి మా సమాధానమేమనగా పరమేశ్వరుడైన హిరణ్యగర్భుని, లేక బ్రహ్మదేవుని అనుగ్రహముచే ప్రళయమునకు పూర్వముఁగల ప్రాపంచికదశ తెలియఁబడును.

శ్వేతాశ్వతరమిట్లు నుడువుచున్నది: "ప్రళయకాలమునందు రూపములన్నియు నశించును. కాని సాక్షి మాత్రము శేషించియుండును. దాని మూలముననే మఱియొక సృష్టి సంభవించును." లేకున్నచో సృష్టికి కారణము శున్యమని ఊహింపవలసి యుండును.

## 1-3-31 మధ్వాదిష్వసంభవాద నధికారం జైమినిః

మధువిద్యాదులకు దేవతలర్హులనుటచే వారు ఉపాసనకుఁగాని, బ్రహ్మ విద్యకుఁగాని లేక ఆత్మజ్ఞానమునకుఁగాని అనధికారులని జైమినియొక్క అభిప్రాయము.

26వ సూత్రమునకు మరియొక నిషేధము చెప్పఁబడుచున్నది.

మధుఆదిషు = మధువిద్యాదులయందు, అసంభవాత్ = అసాధ్యమగుటచే, అనధికారం = అనర్హత, జైమినిః = జైమినియొక్క అభిప్రాయము.

మధువిద్య (ఛాం. ఉ. 3-1-11) యందు సూర్యుడు మున్నగు ఇతరదేవతలు పూజింపఁబడుటచే, వారు పూజించువారగుట అసాధ్యమని పూర్వమీమాంస కర్తయగు జైమినిమహర్షి నుడువుచున్నాడు. కావున శ్రుతి వాక్యము ననుసరించి వారు ఉపాసన కర్హులుకారు. ఏలననగా వారు తమ్ముతాము పూజించుకొనుట అసభ్యమగును. మధువిద్యయందు శ్రేయోదాయకుడు (మధువు) గా సూర్యుడు పూజింపఁబడును. ఇట్టి పూజ సూర్యునికి సాధ్యముకాదు. ఏలననగా ఒకేయొక పురుషుడు ఉపాసకుడు మఱియు ఉపాస్యము కాజాలడు.

ఇఁక వసువు మున్నగు దేవతలు వసువు మున్నగు వర్గమునకు చెందియున్నారు. అట్టివారికి ఫలము ఇతఃపూర్వమే ప్రాప్తమైయుండుటచే, వారి విషయము నందు ఉపాసన నిష్ప్రయోజనమగును. దేవతల కిట్టి ఉపాసనచే లభించున దేమియులేదు. కావున ఇట్టి ఉపాసనాకాంక్ష వారికుండదు. ఏలననగా ఇట్టి ఉపాసనచే కలుగు ఫలమును వారు ఇతఃపూర్వమే పొందియున్నారు.

## 1-3-32 జ్యోతిషి భావాచ్చ

సూర్యచంద్రాది దేవతలే కేవలము జ్యోతిర్మండలములుగా పేర్కొనఁబడుటచే, దేవతలు విద్యలకు అర్హులు కారు.

జ్యోతిషి = కేవలము జ్యోతిర్మండలములలో, భావాత్ = దేవతల ఉనికి యుండుటచే, చ = మఱియు.

32 వ సూత్రములోని నిషేధమును బలపఱచు వాద మొసంగఁబడినది.

పూర్వపక్షి మరియొక విధముగా నిషేధించుచున్నాడు. "జ్యోతిర్మండలములు ధ్యానాదికార్యముల నొనర్పలేవు. ఇతరమైన ప్రకాశవంతములగు అగ్న్యాదులకు హస్తములు, హృదయము, బుద్ధితోకూడిన శరీరము లేదు. అవి భౌతికమైన జడపదార్థములు. వాటికి వాంఛలు లేవు. మానవ కల్పితములగుటచేతను, స్వయముగా అవి మరియొక జ్ఞానసాధనముపై ఆధారపడియుండుటచేతను ఇతిహాసములు మఱియు పురాణములపై మనము విశ్వాసమునుంచలేము. మంత్రములు ప్రామాణ్య జ్ఞానలబ్ధికి ఉచితమైన సాధనములు కావు. అర్థవాదవాక్యములు దేవతలయొక్క ఉనికిని నిరూపింపఁజాలవు. తత్ఫలితముగా దేవతలేలాటి విద్యకుఁగాని, లేక బ్రహ్మజ్ఞానమునకుఁగాని అధికారులు కాజాలరు.

## 1-3-33 భావంతు బాదరాయణోఽస్తిహి

కాని బ్రహ్మవిద్యకు దేవతలధికారులని బాదరాయణుని భావమైయున్నది. ఏలననగా ఇట్టి జ్ఞానమునకు సాధనములగు శరీరము, వాంఛ ఇత్యాదులను దేవతలు కలిగియున్నారను శ్రుతి వాక్యప్రమాణము కలదు.

భావం = మధువిద్యాదుల నభ్యసించుటకుఁగల అర్హత, తు = కాని, బాదరాయణః = బాదరాయణముని, అస్తి = ఉన్నది, హి = ఏలననగా.

పూర్వము చెప్పఁబడిన సూత్రద్వయవాదమునీ సూత్రము ఖండించి, చర్చను చాలించుచున్నది. శ్రుతియందు పేర్కొనఁబడిన కారణముచే దేవతలకు కూడా ధ్యానోపాసనలు మఱియు బ్రహ్మవిద్య కధికారము కలదని బాదరాయణుని అభిప్రాయమైయున్నది. ప్రతి ప్రకాశమండలమున్నూ శరీరము, బుద్ధి వాంఛలతోపాటు ఒక అధిష్ఠాన దేవతను కలిగియున్నదని అతడు నుడువును. దేవతలు తమ సంకల్పానుసారముగా ఏ రూపమైనను ధరింతురు. ఇంద్రుడొక మానవరూపధారియై కుంతిని సమీపించెను. "దేవా ఆత్మానముపాసతే" అను వాక్యము ఛాందోగ్యము (8-12-6) నందు కలదు. మధువిద్య యనెడి ప్రత్యేక

ఉపాసనకు సూర్యుడు అనర్హుడు కావచ్చును. అతడు తన్నుతానుపాసించుకొనం జాలకున్నను బ్రహ్మవిద్య, బ్రహ్మజ్ఞానమువంటి ఇతర ఉపాసనల కయోగ్యుడని చెప్పుట యోగ్యముకాదు. ఇతర దేవతల విషయముకూడా ఇట్టిదే.

" తు" యను శబ్దము పూర్వపక్షిని ఖండించుటకై ప్రయోగింపంబడినది.

దేవతలు యోగ్యులేయని శ్రుతి వచించుచున్నది. "యోయోదేవానాం ప్రత్యబుధ్యత స ఏవ తద భవత్తథా" యని (బృ. ఉ. 1-4-10) నుడువుచున్నది. "సోఽన్వేష్టవ్యస్సవిజిజ్ఞాసితవ్యస్స సర్వాంశ్చలోకానాప్నోతి సర్వాంశ్చకామాన్ యస్తమాత్మాన మనువిద్య విజానాతీతి " (ఛాం. ఉ. 8-7) అని పలుకుచు ఇంద్రుడు ప్రజాపతిని సమీపించెను.

దేవతలయొక్క రూపవర్ణన నిజమైనది. యజ్ఞయాగాదులను దేవతలకర్పించునప్పుడు అసత్యమైన దేవతలరూపములను మన మనస్సెట్లూహింపంగలుగును? సామాన్య ప్రజలువారి రూపములను దర్శింపలేరు. కాని వ్యాసునివంటి మునులువారిని చూచియున్నారు. వారు దేవతలతో మాట్లాడియున్నారు. ''స్వాధ్యాయముచే మనముపాసించు దేవతతో సంభాషింపవచ్చున"ని యోగసూత్రములు నుడువుచున్నవి. యౌగికశక్తులను నీవెట్లు నిరాకరింతువు? ఋషులు అత్యద్భుతశక్తులను కలిగియుండిరి.

కావున దేవతలు రూపములను కలిగియున్నారు. మఱియు వారుబ్రహ్మవిద్యకు అర్హులై యున్నారు.

# 9. అపశూద్రాధికరణము

# (34- 38 సూత్రములు)

## 1-3-34 శుగస్య తదనాదర శ్రవణాత్తదా ద్రవణాత్ సూచ్యతేహి

హంసరూపమునందున్న ఒక ముని తన్నుఁగూర్చి తిరస్కారమైన మాటలను పలుకుటను విని, జానశ్రుతిరాజు దుఃఖపూరితుడయ్యెను. అట్టి వ్యాకులతతో అతడు రైక్వుని సమీపించినప్పుడా రైక్వుడాతనిని "ఓ శూద్రుడా !" అని పలికెను. ఏలననగా రైక్వునిచే అతని దుఃఖము సూచింపఁబడెను.

శుక్ = శోకము, అస్య= ఇతనియొక్క, తత్ = ఆ హంసముఖము నుండి, అనాదరశ్రవణాత్ = అనాదరపూర్వకమైన మాటలను వినుటచే, తదా= అప్పుడు, ఆద్రవణాత్ = రైక్వుని వద్దకు వెళ్ళుటచే, సూచ్యతే = సూచింపఁబడుచున్నది, హి = ఏలననగా.

25 వ సూత్రమునందారంభింపఁబడిన దివ్యోపాసనాధికార చర్చ కొనసాగుచున్నది.

శూద్రులనుఁగూర్చిన ఈ యధికరణమంతయు మఱియు దేవతలనుఁగూర్చిన పూర్వాధికరణమున్నూ తదనంతర సూత్రకారునిచే చేర్చఁబడినట్లు గోచరించుచున్నది.

దేవతలు వేదాధ్యయనమునకు మఱియు బ్రహ్మవిద్యకు అర్హులను విషయము పూర్వసూత్రమునందు చెప్పఁబడినది. ఇఁక శూద్రులు వీటికర్హులా? కాదా? యనువిషయమీ సూత్రమునందు చర్చింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును. "శూద్రులకు కూడా శరీరము మఱియు వాంఛలున్నవి. కావున వారు కూడా అర్హులే. ఆతని నుండి శ్రవణము చేయఁగోరు జానశ్రుతిని రైక్వుడు శూద్రుడను నామముతో సంబోధించును.

"తముహపరః ప్రత్యువాచాహహారేత్వాశూద్రతవైవ సహగోభిరస్త్వితి" (ఛాం. ఉ. 4-2-3). కాని అతడు రెండవ పర్యాయము సమీపించినపుడు రైక్వుడాతని కానుకలను స్వీకరించి అతనికి ప్రబోధించును. శూద్రులైన తల్లులనుండి జన్మించినట్టి

విదురాదులు పరమజ్ఞాన సంపన్నులని స్మృతి నుడువుచున్నది. కావున శూద్రులకు బ్రహ్మవిద్యాధికారము కలదు.”

శూద్రులకు వేదాధ్యయనాధికారము లేదని నుడువుచు ఈ సూత్రము దానిని నిషేధించుచున్నది. “శూద్ర”శబ్దమిచ్చట జన్మశూద్రుడని అర్థము నొసంగదు. కాని సాంకేతికార్థమునిచ్చును. ఏలననగా జానశ్రుతి క్షత్రయరాజైయుండెను. ఇచ్చట మనమా శబ్దముయొక్క వ్యుత్పత్యర్థమును స్వీకరింపవలయును. “శుచం అభిదుద్రావ” శోకగ్రస్తుడై రైక్వుని వద్దకు పరుగెత్తెనను అర్థము చెప్పవలయును. అతడు క్షత్రియుడను విషయమును ఈ క్రింది సూత్రము కూడా నిరూపించును.

## 1-3-35 క్షత్రియత్వావ గతేశ్చోత్తరత్ర చైత్రరథేన లింగాత్.

అనుమానిక చిహ్మముచేతను, చైత్రరథ సంబోధనచేతను జానశ్రుతియొక్క క్షత్రియత్వము తెలియఁబడు చున్నది.

క్షత్రియత్వ = క్షత్రియత్వము, అవగతేః = తెలియఁబడుటచే, చ = మఱియు, ఉత్తరత్ర = తదనంతర శ్రుతియందు, చైత్రరథేన = చైత్రరథునిచే, లింగాత్ = అనుమానిక చిహ్నముచేత.

34వ సూత్రమును బలపరచువాదమొసంగఁబడినది.

ఇదే విద్యయందు జానశ్రుతితోపాటు క్షత్రియుడగు చైత్రరథ అభిప్రతారుడు కూడా పేర్కొనఁబడెను. కావున జానశ్రుతి కూడా క్షత్రియుడేయని మనమూహింపవచ్చును. ఏలననగా నియమానుసారముగా సమాన స్కందులతో సమానస్కందులే పేర్కొనఁబడుదురు. కావున శూద్రులు బ్రహ్మజ్ఞానమున కధికారులు కారు.

## 1-3-36 సంస్కార పరామర్శాత్తదభావాభిలాపాచ్చ.

ఏలననగా ద్విజుల విషయమునందు శుభసంస్కారములు పేర్కొనఁబడినవి. మఱియు తదితర కార్యములు శూద్రుల విషయమునందు చెప్పబడినవి.

సంస్కార = యజ్ఞోపవీతధారణము, పరామర్శాత్ = సూచింపఁబడుటచే, తత్ = ఆ సంస్కారము, అభావ = లేకుండుట, అభిలాపాత్ = చెప్పఁబడుటచే, చ = మఱియు.

శూద్రులకు బ్రహ్మవిద్యాధికారమునుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

విద్యలనుఁగూర్చిన వివిధస్థలములలో ఉపనయన సంస్కారము పేర్కొనఁబడినది. అన్ని రకములగు విద్యలకు ఉపనయన సంస్కారమత్యావశ్యకమని శాస్త్రములు వచించుచున్నవి. ప్రశ్నోపనిషత్తు (1-1) నందు "ఏతే బ్రహ్మపరాః బ్రహ్మనిష్ఠాః పరం బ్రహ్మాన్వేషమాణా ఏషహవై తత్సర్వం వక్ష్యతీతి తేహసమిత్పాణయో భగవంతం పిప్పలాదముపసన్నాః" అను వాక్యము కలదు. ఉపనయన సంస్కారము ఉన్నతవర్గములకు సూచింపఁబడినది. ఇఁక శూద్రుల విషయమునందు సంస్కారరాహిత్యము శాస్త్రములలో పలుమార్లు చెప్పఁబడినది. "శూద్రుడు నిషేధింపఁబడిన ఆహారమును భుజించుటలో పాపములేదు. మఱియు అతడేలాంటి సంస్కారమునకు అర్హుడు కాదు." (మను. 10-12-6) జన్మశూద్రుడు ఉపనయనము మఱియు ఇతర సంస్కారములకర్హుడు కాడు. మఱియు అవి లేకుండా వేదాధ్యయనము నొనర్పఁదగదు. కావున శూద్రులకు వేదాధ్యయనాధికారము లేదు.

శూద్రుడు సంస్కారమునకర్హుడు కాడను విషయమును తదనంతర సూత్రము బలపఱచుచున్నది.

## 1-3-37 తదభావ నిర్ధారణేచ ప్రవృత్తేః

జాబాలసత్యకామునిలో శూద్రత్వము లేదని నిశ్చయింపఁబడిన తర్వాతనే గౌతముడు జ్ఞానోపదేశము నొసంగుట కుద్యుక్తుడగుటచే.

తత్ = శూద్రత్వము, అభావ = లేకుండుట, నిర్ధారణే = నిశ్చయింపఁబడిన తర్వాత, చ = మఱియు, ప్రవృత్తేః = ఉద్యుక్తుడగుటచే.

శూద్రాధికారవిషయమే చర్చింపఁబడుచున్నది.

జాబాలుడు సత్యము పలుకుటచే, అతడు శూద్రుడు కాడని నిశ్చయించిన తర్వాతనే గౌతముడాతనికి ప్రబోధోపదేశముల నొసంగెను. "తం హోవాచనైతద బ్రాహ్మణోవివక్తు మర్హతి సమిధం సోమ్యాహరోపత్వా నేష్యేన సత్యాదగా ఇతి" (ఛాం. ఉ.4-4-5).

శూద్రులకు దీక్షాధికారము లేదను విషయమునీ శాస్త్రవాక్యము మనకు సూచించుచున్నది.

## 1-3-38 శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ

శూద్రులకు వేదములను శ్రవణమొనర్చుటకు, అధ్యయన మొనర్చుటకు, అర్థమొనర్చుకొనుట కధికారము లేదని స్మృతి నిషేధించుటచే వారు వైదిక కార్యముల నొనర్చుటకు మఱియు బ్రహ్మజ్ఞానమునుఁ బడయుటకున్నూ అర్హులు కారు.

శ్రవణ = శ్రవణమొనర్చుట, అధ్యయన = అధ్యయనము చేయుట, అర్థ = అర్థమొనర్చుకొనుట, ప్రతిషేధాత్ = నిషేధింపఁబడుటచే, స్మృతేః = స్మృతి వలన, చ = మఱియు.

శూద్రాధికారచర్చ ఇంతటితో సమాప్తమైనది.

శూద్రులు వేదములను శ్రవణమొనర్పరాదనియు, అధ్యయనమొనర్ప రాదనియు, వాటినర్థమొనర్చుకొన రాదనియు మరియు వైదికకర్మల నాచరింపరాదనియు స్మృతి నిషేధించుచున్నది. "వేదములను శ్రవణమొనర్చువాని చెవులను కరిగించిన సీసము మఱియు లక్కతో నింపవలయును." ఏలననగా శూద్రుడొక శ్మశానము వంటివాడు. కావున శూద్రుని సమీపమునందు వేదమును పఠింపరాదు. "దానినుచ్చరించిన వాని నాలుకను చీల్చివేయవలయును. దానిని కలిగియున్న వాని శరీరమును ఖండింపవలయును." విదురుడు మఱియు వేటకాడైన ధర్మవ్యాధుని వంటి శూద్రులు పూర్వజన్మలలో చేయఁబడిన పుణ్యకర్మల ప్రభావముచే జ్ఞానము నార్జింపఁగలిగిరి. శూద్రులు వేదసారనిహితములగు పురాణములు, గీత, కావ్యములు, రామాయణము, మహాభారతములను పఠించుట ద్వారా అట్టి జ్ఞానమునుఁ బడయవచ్చును.

శూద్రులకు వేదాధికారము లేదను విషయము సునిశ్చితమైయున్నది.

26 వ సూత్రము నుండి ప్రారంభింపఁబడిన అప్రస్తుత ప్రసంగమింతటితో సమాప్తమై, మరల ముఖ్యవిషయము చర్చింపఁబడుచున్నది.

# 10. కంపనాధి కరణము

## 1-3-39 కంపనాత్.

ప్రపంచమంతయు స్పందించుటచే, లేక కంపించుటచే ప్రాణమే బ్రహ్మమని చెప్పఁబడును.

కంపనాత్ = కంపించుటచే లేక స్పందించుటచే.

25-38 సూత్రములలో అప్రస్తుత ప్రసంగమును చర్చించిన అనంతరము సూత్రకారుడు మరల ప్రధాన విషయముపై తన దృష్టిని సారించుచున్నాడు.

24 వ సూత్రమును బలపఱచువాద మిచ్చట ఒసంగఁబడినది.

బ్రహ్మవిద్యాధికారమునుఁగూర్చిన చర్చ పూర్తియైనది. మనమిప్పుడు ప్రధానవిషయమగు వేదాంత తాత్పర్య విచారణ నొనర్చుటకు యత్నింతము.

కఠోపనిషత్తు (2-3-2) నందు "యదిదంకించ జగత్సర్వం ప్రాణఏజతినిఃసృతమ్, మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవంతి" అను వాక్యము కలదు.

ప్రాణము గాలిని, లేక పంచవృత్తులతో కూడిన ప్రాణశక్తిని సూచించునని పూర్వపక్షి పలుకును. సిద్ధాంతి ఇట్లనును. "ఇచ్చట ప్రాణము బ్రహ్మమేయగును, కాని ప్రాణశక్తి కాదు. ఏలననగా ఈ యధ్యాయము యొక్క పూర్వోత్తరములలో బ్రహ్మముఁగూర్చియే చెప్పఁబడినది. అట్టిచో మధ్యభాగమునందు ప్రాణశక్తినిఁగూర్చి చెప్పఁబడినదని ఊహించుటెట్లు పొసగును?"

" ప్రాణమునందు ప్రపంచమంతయు ప్రకంపించును." ఇచ్చట బ్రహ్మము యొక్క లక్షణము మనకు గోచరించుచున్నది. అనగా ఇది ప్రపంచమంతటి కాధారమైయున్నది. "ప్రాణస్యప్రాణమ్"(బృ. ఉ. 4-4-18) అను వాక్యముచే "ప్రాణ" శబ్దము పరమాత్మను సూచించును. "న ప్రాణేన నాపానేన మర్త్యోజీవతి కశ్చన, ఇతరేణ తు జీవంతి యస్మిన్నేతావుపాశ్రితౌ" (కఠ. ఉ. 2-2-5) అని శ్రుతి వచించుచున్నది. తదనంతర పరిచ్ఛేదమునందు "భయాదస్యాగ్ని స్తపతి భయాత్తపతి సూర్యః, భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః" అను వాక్యము కలదు.

ప్రాణసహితముగా విశ్వమంతటిని భయకంపితమొనర్చు బ్రహ్మమే ఇచ్చట పేర్కొనఁబడినది, కాని ప్రాణశక్తి కాదు. ప్రాణసహిముగా విశ్వమంతటికి జీవనాధారము కేవలము బ్రహ్మమేనై యున్నది.

అగ్ని, వాయువు, సూర్యుడు, ఇంద్రుడు మఱియు యముని యందున్నూ భయోత్పాదనమును కలిగించుటచే బ్రహ్మము పిడుగుతో పోల్చఁబడెను. మఱియు ఈ ప్రాణమును గుర్తెఱింగినవాడు అమృతత్వము నొందుననియు చెప్పఁబడినది. “తమేవ విదిత్వాతి మృత్యుమేతి, నాన్యః పంథావిద్యతేయనాయ” (శ్వే. ఉ.6-15) శ్రుతియందు బ్రహ్మమును సూచించుటకు ప్రాణముకూడా తఱచుగా వాడఁబడినది.

# 11. జ్యోతిరధికరణము

## 1-3-40 జ్యోతిర్దర్శనాత్

శ్రుతివాక్యమునందు బ్రహ్మము పేర్కొనఁబడుటచే జ్యోతియే బ్రహ్మమనబడును.

జ్యోతిః = జ్యోతిబ్రహ్మము, దర్శనాత్ = శ్రుతియందు చూడఁబడుటచే.

24 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

“ఏవమేవైషసంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణాభి నిష్పద్యతే” (ఛాం. ఉ. 8-12-3) అని శ్రుతి నుడువుచున్నది.

ఇచ్చట “జ్యోతి” యను శబ్దము అంధకారమును పోగొట్టునట్టి దృష్టికి విషయమైయున్న భౌతిక ప్రకాశమును సూచించునా? లేక పరబ్రహ్మమును సూచించునా? యను సంశయము కలుగును.

“ఇది సాంకేతిక శబ్దమగుటచే జ్యోతిశ్శబ్దము, సుప్రసిద్ధమైన భౌతిక ప్రకాశమును సూచించున”ని పూర్వపక్షి వాదించును.

దీనికి మేమీ క్రింది సమాధానము నొసంగుదుము :- జ్యోతిశ్శబ్దము కేవలము పరబ్రహ్మమునే సూచించును. ఏలననగా ఈ యధ్యాయమంతయు బ్రహ్మమునుఁ గూర్చియే చర్చించినది. తదనంతర మా శ్రుతియందు పరంజ్యోతి “పరమపురుషుడ”ని కూడా చెప్పఁబడినది. ఈ జ్యోతియందైక్యమైనవాడు

శరీరమునుండి విముక్తుడగునని చెప్పఁబడినది. శ్రుతి ఇట్లు వచించినది. "అశరీరం వా వసంతం న ప్రియాప్రియే స్పృశతః (ఛాం. ఉ. 8-12-1) బ్రహ్మమునకు బాహ్యముగా శరీరవిముక్తి సాధ్యముకాదు. బ్రహ్మముతో తాదాత్మ్యము నొందినప్పుడు మాత్రమే మానవుడు సర్వతంత్ర స్వతంత్రుడగును. లేక అశరీరస్థితి నొందును.

# 12. అర్థాంతరత్వాదివ్యపదేశాధికరణము

## 1-3-41 ఆకాశోఽర్థాంతరత్వాది వ్యపదేశాత్

నామరూపములకు విభిన్నమై యుండుటచే ఆకాశమే బ్రహ్మమైయున్నది.

ఆకాశః = ఆకాశము, అర్థాంతరత్వాది వ్యపదేశాత్ = విభేదమైయున్నట్లు చెప్పఁబడుటచే.

ఛాందోగ్యములోని మఱియొక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

ఛాందోగ్యోపనిషత్తు (8-14-1) నందీ క్రింది వాక్యము కలదు. "ఆకాశోవైనామ నామరూపయో ర్నిర్వహితా తేయదంతరా తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా".

ఇచ్చట చెప్పఁబడిన ఆకాశము పరబ్రహ్మమా? లేక సామాన్యమగు భూతాకాశమా? యను సంశయము కలుగును.

ఈ శబ్దమునకు గల సాంకేతికార్థముచే ఆకాశమిచ్చట భూతాకాశమునే సూచించునని పూర్వపక్షి పలుకును.

దీనికి సిద్ధాంతి ఈ క్రింది సమాధానము నొసంగును :- మరియొక పదార్థముగా పేర్కొనఁబడుటచే ఇచ్చట "ఆకాశమ"నగా బ్రహ్మమేయగును. నామరూపములీయాకాశమునందున్నట్లు చెప్పఁబడుటచే, ఇది వీటికి విభిన్నమైయున్నది.

నామరూపములన్నింటికాధారమైయున్నట్లు చెప్పఁబడుటచే ఆకాశశబ్దమిచ్చట బ్రహ్మమును సూచించును. ఇంతేకాకుండా ఇది "అనంతము, అమరము, ఆత్మ"వంటి విశేషణములను కలిగియున్నది. "నామరూపాతీతమ"ను వర్ణన కేవలము బ్రహ్మమునకే పొసగుటచే, ఆకాశశబ్దము బ్రహ్మమునే సూచించును.

# 13. సుషుప్త్యుత్క్రాంత్యధికరణము
# (42-43 సూత్రములు)

## 1-3-42 సుషుప్త్యుత్క్రాంత్యోర్భేదేన

సుషుప్తి మఱియు మృత్యుదశలలో పరమాత్మ జీవాత్మకు భిన్నమైయున్నదని చెప్పఁబడుటచే.

సుషుప్త్యుత్క్రాంత్యోః = గాఢనిద్ర మఱియు మృత్యువునందు, భేదేన = భేదముచే.

బృహదారణ్యకములోని ఆరవ అధ్యాయమునందుఁగల ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

బృహదారణ్యకములోని ఆరవ ప్రపాఠకమునందుఁగల "కతమ ఆత్మేతి" (4-3-7) అను ప్రశ్నకు సమాధానముగా "యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః పురుషః" అను సుదీర్ఘమైన ఆత్మ స్వరూపవర్ణన ఒసంగఁబడినది.

ఇచ్చట ఆత్మ, పరమాత్మయా? లేక జీవుడా? యను సంశయము కలుగును.

అది పరమాత్మయేయని ఈ సూత్రము నిరూపించుచున్నది. ఏలననగా సుషుప్త్యవస్థయందును మఱియు మృత్యుసమయమునందును అది జీవునికి భిన్నమైయున్నట్లు తెలియుచున్నది. "అయంపురుషః ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో న బాహ్యం కించన వేదనాంతరమ్" (బృ. ఉ. 4-3-21) ఉన్నతమైన ప్రాజ్ఞ లేక బ్రహ్మమునకు గాఢనిద్రలోని పురుషుడు, లేక జీవుడు భిన్నమైయున్నాడని దీనిచే స్పష్టముగా సూచింపఁబడుచున్నది.

గాఢనిద్రలోని అంతర్బాహ్యాజ్ఞానశూన్యత జీవునికి చెందియుండుటచే "పురుషుడ"ను శబ్దమిచ్చుట జీవుని మాత్రమే సూచించును. ప్రాజ్ఞాత్మ బ్రహ్మమునకు చెందియుండుటచే అది బ్రహ్మమే. బ్రహ్మము సర్వజ్ఞత్వమునకు భిన్నమైలేదు. ఇదే విధముగా మృత్యువుఁగూర్చి చర్చింపఁబడిన పరిచ్ఛేదము (జీవాత్మ విజ్ఞానాత్మచే అధిష్ఠంపఁబడి నిట్టూర్పుతో చలించును.) న్నూ జీవాత్మ పరమాత్మకు భిన్నమైయున్నదను విషయమును సూచించును. మృత్యుగ్రస్తమగు శరీరమును

త్యజించునట్టి జీవుడు పరమాత్మ, లేక బ్రహ్మమునకు భిన్నుడైయున్నాడు. జీవుడు మాత్రమే సుషుప్త్యవస్థ మఱియు మృత్యుముఖమునకు గుఱియగును. బ్రహ్మమునకు నిద్రcగాని, మృత్యువుcగాని లేదు. అతడెల్లప్పుడు మేల్కొనియేయుండును.

కావున ఈ పాదమునందు బ్రహ్మమే ముఖ్యాంశమైయున్నది. ఈ పాదమునకంతటికి బ్రహ్మస్వరూపమును వర్ణించుటయే లక్ష్యమైయున్నది. నిజమునకు జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందునని నిరూపించుటకే, ఈ పాదమునందు జీవునిcగూర్చి విస్తృతమైన వర్ణన ఒసంగcబడినది.

## 1-3-43 పత్యాది శబ్దేభ్యః

"పతి" ఇత్యాది శబ్దములాతనికి పేర్కొనcబడుటచే 42వ సూత్రమునందు చెప్పcబడిన పురుషుడు బ్రహ్మమేయగును. "సర్వస్యవశీసర్వస్యేశానః సర్వస్యాధిపతిః" (బృ. ఉ. 4-4-22) పత్యాది శబ్దేభ్యః = "పతి" మున్నగు శబ్దములవలన గ్రంథమునందు చర్చింపcబడుచున్న ఆత్మ, పరమాత్మయైయున్నది.

42వ సూత్రమును బలపరచు వాదమొసంగcబడినది.

ప్రస్తుతము చర్చింపcబడుచున్న విషయము పూర్తిగా నిరంకుశమైనదని ఈ విశేషణములు సూచించుటచే, ఈ విశేషణములు కేవలము బ్రహ్మమునకే అన్వయించును. కావున ఆత్మ శబ్దము పరమాత్మ లేక బ్రహ్మమునే సూచించునుcగాని జీవుని సూచింపదు. ఈ కారణములన్నింటిచే ఈ యధ్యాయమంతయు బ్రహ్మమునే సూచించుచున్నదని మేము నిర్ణయించుచున్నాము.

**ఇట్లు**
**బ్రహ్మసూత్ర**
**ప్రథమాధ్యాయ తృతీయపాదము**
**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## ప్రథమాధ్యాయము

## 4వ పాదము

## పీఠిక

సాంఖ్యుల ప్రధానము శాస్త్ర ప్రమాణముపై ఆధారపడిలేదనియు, విజ్ఞానాత్మయైన బ్రహ్మమే సృష్టికి ప్రథమ కారణమని శ్రుతులన్నియును వక్కాణించుచున్నవనియును ప్రథమ పాదములోని 5వ అధికరణము నందు చెప్పబడినది.

బ్రహ్మ స్వరూపము 1-1-2 నందు వర్ణింపబడినది. ప్రపంచమునకు కారణము బ్రహ్మమే యగును, కాని ప్రధానముకాదను సిద్ధాంతమును నిర్ధారించుటయే వేదాంత శాస్త్రములన్నింటికి లక్ష్యమైయున్నది.

కొన్ని శాఖలలో ప్రధానమే ప్రాధాన్యమైయుండుటచే, ప్రధానమునకు శాస్త్రప్రామాణ్యము లేదను విషయము సంతృప్తికరముగా నిరూపించఁబడలేదని సాంఖ్యులు పలుకుదురు.

ప్రధానమే ప్రపంచమునకు కారణమని ఇతర వేదాంత గ్రంథములద్వారా నిరూపించు సాంఖ్యుల భావమును ఈ పాదము సరిదిద్దుటకుపక్రమించును.

సాంఖ్యులయొక్క అపవాదములకు సవ్యమైన మఱియు సమ్మతమైన సమాధానములీ 4వ పాదమునందొసంగఁబడినవి.

# సార సంగ్రహము

ప్రథమాధ్యాయములోని చతుర్థపాదము సాంఖ్య సిద్ధాంతఖండనకు ప్రత్యేకింపఁబడినది. సాంఖ్యుల యొక్క జడపదార్థమునకు పేర్లుగా తలంపఁబడు ఉపనిషత్తులలోని కొన్ని వాక్యములయందున్న పదముల నీపాదము విమర్శించును. వేదాంత గ్రంథములు సాంఖ్యులయొక్క సృష్టివిధానమునకుఁగాని, ప్రధాన సిద్ధాంతమునకుఁగాని తావొసంగవని ఇది ప్రామాణికముగా నిరూపించును. బ్రహ్మమే ఈ ప్రపంచమునకు నిమిత్తకారణము మఱియు ఉపాదాన కారణమై యున్నదని ఈ పాదము నిరూపించును.

**1వ అధికరణము (1–7 సూత్రములు)** : మహత్తును, అవ్యక్తమును సూచించునట్టి కఠోపనిషత్తులోని 1–3–10,11 వాక్యములనుఁగూర్చి చర్చించును. సాంఖ్యశాస్త్రమునందు అవ్యక్తము, ప్రధానమునకు పర్యాయపదమై యున్నది. సాంఖ్యదర్శనమునందు మహత్తనగా బుద్ధి, అవ్యక్త పదము సూక్ష్మ శరీర మును, స్థూలశరీరమును మఱియు మహద్బ్రహ్మను కూడా సూచించునని శ్రీ శంకరాచార్యులవారు నిరూపించిరి.

**2వ అధికరణము ( 8–10 సూత్రములు)** : శ్రీ శంకరమతానుసారముగా శ్వేతాశ్వతరము (4–5) లోని త్రైవర్ణికమగు 'అజ' శబ్దము సాంఖ్యుల ప్రధానమును సూచింపదనియు, అది ప్రపంచ సృష్టికి మూలమైన దైవశక్తినిఁగాని, లేక ఆ శక్తిచే ప్రప్రథమముగా సృష్టింపఁబడిన ప్రాథమిక మూలకారణమునుఁగాని సూచించునని నిరూపించును.

**3వ అధికరణము (11–13 సూత్రములు)** : బృహదారణ్యకము (4–4–17)లో సూచింపఁబడిన 'పంచపంచ జనాః' యనునది సాంఖ్యములోని పంచవింశతి సూత్రములు కావని నిరూపించును.

**4వ అధికరణము (14–15 సూత్రములు)** : సృష్టి క్రమమునందు విరోధమున్నను, శాస్త్రమీ ప్రపంచమునకు కారణము మఱియు జ్ఞానసారమైయున్న ప్రధానమైన బ్రహ్మమును స్వయముగా నిషేధింపదని నిరూపించును.

**5వ అధికరణము (16–18 సూత్రములు)** : 'పురుషోఽ శయిష్ట యత్రైతదభూద్యత ఏతదగాత్' (కౌ. ఉ. 4–19) లో సూచింపఁబడినది ప్రాణముఁగాని, జీవుడుఁగాని కాదనియు అది బ్రహ్మమే యనియును ఋజువు పఱచును.

**6వ అధికరణము (19–22 సూత్రములు)** : 'ఆత్మావా అరేద్రష్టవ్యః శ్రోతవ్యః' (బృ. ఉ. 2–4–5) యనునది పరమాత్మయే యగును, కాని జీవుడు కాదని నిశ్చయించును. జైమిని, ఆశ్మరథ్య, ఔడులోమి మఱియు కాశకృత్స్నుల మతములు కూడా వివరింపఁబడినవి.

**7వ అధికరణము (23–27 సూత్రములు)** : బ్రహ్మమీ ప్రపంచమునకు కేవలము నిమిత్తకారణమే కాకుండా ఉపాదానకారణము కూడానైయున్నదని ప్రబోధించును. పరిణామ విధానము (26వ సూత్రము)తో బ్రహ్మమునుండి ఈ ప్రపంచము ఉత్పన్నమగును.

**8వ అధికరణము (28వ సూత్రము)** : సాంఖ్యసిద్ధాంత ఖండన, ప్రపంచోత్పత్తికి కారణము అణువులని వాదించు అణుసిద్ధాంతాదులకున్నూ అన్వయించునని నిరూపించును.

# 1. ఆనుమానికాధికరణము

## (1-7 సూత్రములు)

### *1-4-1 ఆనుమానికమప్యేకేషామితి చేన్న శరీర రూపక విన్యస్త గృహీతేర్దర్శయతి చ.*

కొన్ని వేదవిభాగములలో ప్రధానము కూడా సూచింపఁబడినదని పలికినచో, అట్లుకాదని మా సమాధానము. ఏలననగా : కఠోపనిషత్తులోని "అవ్యక్తమ"ను పదము శరీరమునకు ఉపమానముగా వాడఁబడినది. కావున దానికి శరీరమని అర్థమేకాని, సాంఖ్యులయొక్క ప్రధానము కాదు. దీనినిఁగూర్చి శ్రుతి కూడా వివరించుచున్నది.

ఆనుమానికం = అనుమానింపఁబడిన ప్రధానము, అపి = కూడా, ఏకేషాం = శ్రుతిలోని కొన్ని శాఖలయొక్క, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, శరీరరూపక విన్యస్త గృహీతేః = శరీరమున కుపమానముగా సూచింపఁబడుటచే, దర్శయతి = శ్రుతి వివరించుచున్నది, చ = కూడా.

సాంఖ్యులు మరియొక నిషేధమును పలుకుచున్నారు. కఠాదిశాఖలలో ప్రధానము సూచింపఁబడుటచే, ప్రధానము శాస్త్రప్రామాణికమైయున్నదని వారు పలుకుదురు. 'మహతః పరమవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః' (కఠ. ఉ. 1-3-11).

'మహత్తు, అవ్యక్తము మఱియు పురుష' శబ్దములు శ్రుతియందున్నూ సాంఖ్యదర్శన క్రమమునందు పేర్కొనబడుటచే 'అవ్యక్త' శబ్దమిచ్చట ప్రధానమును సూచించునని సాంఖ్యులు పలుకుదురు. కావున అవి సాంఖ్యుల తెగకు సంబంధించినవని స్పష్టమగుచున్నది. శబ్దాది విశేషణరహితమై యుండుటచే ప్రధానము 'అవ్యక్తమ'ని చెప్పబడును. కావున ప్రధానము శాస్త్ర ప్రామాణ్యముకాదని

పలుకుట యోగ్యము కాదు. శ్రుతి స్మృతి తర్కబలముచే ప్రధానమే ప్రపంచమునకు కారణమైయున్నదని మేము ప్రకటింతుము.

ఈ సూత్రమిట్లు ఖండించును. 'అవ్యక్త' శబ్దము ప్రధానమును సూచింపదు. అది శరీరమున కుపమానముగా ప్రయోగింపఁబడినది. ఈ యధ్యాయమునకు పూర్వభాగమునందు ఆత్మ, శరీరము ఇత్యాదులు రథికుడు, సారథి మున్నగువాటితో పోల్చబడుట కాననగును. 'ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు, బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవచ । ఇంద్రియాణి హయానా హుర్విషయాం స్తేషుగోచరాన్, ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః' (కఠ. ఉ. 1-3-3,4).

ఈ శ్లోకములలో సూచింపఁబడిన విషయములన్నియును ఈ దిగువ శ్లోకములలో కాననగును. 'ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరంమనః మనసస్తు పరాబుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్పరః। మహతః పరమవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః పురుషాన్నపరం కించిత్సాకాష్ఠాసా పరాగతిః' (కఠ. ఉ. 1-3-10, 11).

ఇప్పుడీ పరిచ్ఛేద ద్వయమును పోల్చుము. పూర్వోపమానమునందు గుఱ్ఱములు మున్నగువాటితో పోల్చబడిన వాటిని ఈ పరిచ్ఛేదమునందు ఇంద్రియాదులుగా గ్రహింపనగును. ఇంద్రియములు, బుద్ధి మఱియు మనస్సు రెండు పరిచ్ఛేదములలోను ఒకే నామములతో పేర్కొనబడినవి. రెండవ పరిచ్ఛేదములోని విషయములు, మొదటి పరిచ్ఛేదములో ఇంద్రియములయొక్క మార్గములుగా పేర్కొనఁబడినవి. తర్వాతి పరిచ్ఛేదములోని మహత్తు విశ్వబుద్ధిని సూచించును. ప్రథమపరిచ్ఛేదమునందు బుద్ధియే సారథిగా చెప్పఁబడినది. దానియందు జీవుని బుద్ధి, విశ్వబుద్ధి సమ్మిళితమై యున్నది. ప్రథమ పరిచ్ఛేదములోని ఆత్మ, రెండవ పరిచ్ఛేదములోని పురుషుని సూచించును. మఱియు ప్రథమ పరిచ్ఛేదములోని శరీరము, రెండవ పరిచ్ఛేదములోని అవ్యక్తమును సూచించును. కావున ఇచ్చట అవ్యక్తమనునది శరీరమగునేకాని, ప్రధానము కాదు. ప్రథమ పరిచ్ఛేదములో రథముతో పోల్చఁబడిన శరీరము మాత్రమే ఇప్పుడు మిగిలియుండును.

ఇప్పుడు మరియొక నిషేధము చెప్పఁబడుచున్నది. స్థూలముగా వ్యక్తమైచూడఁబడుచున్న శరీరమెట్లు అవ్యక్తముగా చెప్పబడును? దీనికి క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-4-2 సూక్ష్మంతు తదర్హత్వాత్.

అట్లు చెప్పఁబడుట కర్హమైనదగుటచే సూక్ష్మశరీరమిచ్చట అవ్యక్తముగా చెప్పఁబడినది.

సూక్ష్మం = సూక్ష్మము, తు = కాని, తదర్హత్వాత్ = అట్లు చెప్పఁబడుయోగ్యతను కలిగియుండుటచే.

1వ సూత్రములోని నిషేధము ఖండింపఁబడుచున్నది.

'అవ్యక్త' శబ్దముచే సూక్ష్మమైన కారణశరీరము సూచింపబడినదని ఈ సూత్రము సమాధానము నొసంగును. సూక్ష్మమైన ఏ పదార్థమైనను 'అవ్యక్త'మని చెప్పఁబడును. అపంచీకృతములైన పంచతన్మాత్రలచే శరీర మేర్పడుటచే, అవి సూక్ష్మశరీరముగా చెప్పబడును. అవి సూక్ష్మమై, అవ్యక్తమై యుండుటచేతను మఱియు ఇంద్రియగోచరములు కాకుండుటచేతను అవి 'అవ్యక్త' శబ్దముచే సూచింపఁబడుట యుక్తమేయగును.

కార్యమును కారణముచే సూచించుట సర్వసామాన్యమగు విషయమై యున్నది. కావున పరోక్షముగా ఇచ్చట స్థూలశరీరము సూచింపఁబడినది. ఉదాహరణమునకు ఈ పోలికను చూడుము. 'సోమరసమును ఆవు (పాలు) తో కలుపుము' (ఋగ్వేదము 9-46-4) మరియొక శాస్త్ర వాక్యమిట్లు నుడువుచున్నది. 'పూర్వము నామరూపరహితమగు సూక్ష్మావస్థయందుండుటచే, నామరూపముగా వ్యక్తమైయున్న ఈ ప్రపంచమంతయు 'అవ్యక్తము'గా పేర్కొనఁబడుట ఉచితమైయున్నది.

బృహదారణ్యకోపనిషత్తు (1-4-7) నందు కారణశరీరము అవ్యక్తముగా చెప్పబడినది. ఈ ప్రపంచము వ్యక్తమగుటకు పూర్వము, అది సూక్ష్మశరీరమనెడి బీజరూపమునందుండెను.

మరియొక ఆక్షేపణ ఇప్పుడు చెప్పబడుచున్నది. కారణశరీరముతో కూడిన సూక్ష్మావస్థయే అవ్యక్తమైయున్నచో, అది సాంఖ్య సిద్ధాంతానుసారముగా ప్రధానమని నుడువుటలోఁగల దోషమేమి? ఏలననగా అచ్చటకూడా అవ్యక్తము సూక్ష్మావస్థగా చెప్పఁబడినది. ఈ యాక్షేపణకీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-4-3 తదధీనత్వాదర్థవత్.

అది పరమాత్మపై ఆధారపడియుండుటచే, ప్రపంచముయొక్క సూక్ష్మావస్థ అంగీకరింపఁబడును. ఏలననగా ఇట్టి అంగీకారము యుక్తియుక్తమైయున్నది.

తద్ = దానికి, అధీనత్వాత్ = అధీనమై యుండుటచే, అర్థవత్ = అర్థవంతమైయున్నది.

1వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును : స్థూల ప్రపంచమునకు సూక్ష్మమైన కారణావస్థ అంగీకరింపఁబడినప్పుడు, ప్రధానమంగీకరింపఁబడినట్లే యగును. ఏలననగా, విశ్వమునకు పూర్వావస్థయే ప్రధానమని సాంఖ్యులమైన మేము విశ్వసింతుము.

సిద్ధాంతి ఈ క్రింది సమాధానము నొసంగును : సాంఖ్యుల ప్రధానము ఒక స్వతంత్రమైన పదార్థము. ఇచ్చట చెప్పఁబడిన సూక్ష్మమైన కారణావస్థ పరబ్రహ్మముపై ఆధారపడియున్నది. విశ్వమునకు పూర్వముగల సూక్ష్మావస్థ, అవశ్యకముగా అంగీకరింపఁబడవలసి యున్నది. అది నిజముగా యుక్తియుక్తము. ఏలననగా అది లేకుండా దేవుని సృష్టికార్యము జరుగదు. అది బ్రహ్మముయొక్క సూక్ష్మమైన శక్తి. ఈ శక్తిచేతనే అతని లీలానాటకము జరుగుచున్నది. ఈ సూక్ష్మశక్తి లేకున్నచో అతడు కార్యరతుడై యుండెడివాడు కాదు. ఇది బ్రహ్మమున కంతర్గతమైయున్న కారణశక్తియైయున్నది. ఆ కారణశక్తి అజ్ఞానరూపము నందున్నది.

ఈ కారణశక్తి పూర్ణజ్ఞానముచే నశింపఁజేయఁబడుటచే, జీవన్ముక్తులకు పునర్జన్మ యుండదు. కావున దీనికి 'అవ్యక్తమ'ను శబ్దము తగియున్నది. ఇది పరబ్రహ్మమే ఆధారముగా కలిగియున్నది. దీని స్వరూపము మిథ్యయైయున్నది. ఇది అనిర్వచనీయమై యున్నది. అది ఉన్నదనియు, లేదనియు చెప్పుటకు వీలులేనిది.

ఈ యవ్యక్తము కొన్ని సమయములలో 'ఆకాశ' శబ్దముచే సూచింపఁబడును. 'తస్మిన్నుఖల్వక్షరేగార్గ్యాకాశ ఓతశ్చప్రోతశ్చేతి' (బృ. ఉ. 3-8-11) కొన్ని వేళలలో ఇది అక్షర శబ్దముచే సూచింపఁబడినది. 'అక్షరాత్పరతః పరః' (ముం.ఉ. 2-1-2).

మూలాధారమైయున్న త్రాడు లేకుండా కేవలాజ్ఞానముచే త్రాటియందు సర్పభ్రాంతి ఎట్లు అసాధ్యమో, అట్లే మూలాధారమైయున్న పరబ్రహ్మము లేకుండా

కేవలాజ్ఞానముచే ప్రపంచము సృష్టింపఁబడజాలదు. కావున సూక్ష్మమైన కారణావస్థ పరబ్రహ్మముపై ఆధారపడియున్నది. ఐనను సర్పము విషముచే అవిలిప్తమైయున్నట్లు, పరబ్రహ్మము అజ్ఞానముచే ఏ మాత్రమున్నూ అంటుఁబడకుండును. 'మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్' (శ్వే. ఉ. 4-10).

కావున అవ్యక్తము పరమేశ్వరుని సృష్టికి సహకారియై యున్నది. దానిని సాధనముగాఁగొని పరమేశ్వరుడీ విశ్వమును సృష్టించును. అది పరమేశ్వరునిపై ఆధారపడియున్నది. అది సాంఖ్యుల ప్రధానమువలె స్వతంత్రమైన పదార్థము కాదు.

పరమేశ్వరుడు మాయపై తన దృష్టిని ప్రసరింపఁజేసి దానిని శక్తిమంత మొనర్చును. అప్పుడు దానికి ప్రపంచమును సృష్టించుశక్తి కలుగును. అది స్వయముగా జడమైయున్నది.

కఠోపనిషత్తులోని 'అవ్యక్తము' ప్రధానమని నుడువుటకు వీలులేదనుటకు సూత్రకారుడు మరియొక కారణమును తదనంతర సూత్రమునందు పేర్కొనుచున్నాడు.

## 1-4-4 జ్ఞేయత్వావచనాచ్చ.

అవ్యక్తము తెలిసికొనఁబడవలయునని చెప్పఁబడకుండుటచే, అది సాంఖ్యులయొక్క ప్రధానము కాజాలదు.

జ్ఞేయత్వ = తెలిసికొనఁబడదగినదని, అవచనాత్ = చెప్పఁబడకుండుటచే, చ = మఱియు.

1వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

సాంఖ్యసిద్ధాంతము ననుసరించి ప్రకృతి (అవ్యక్తము) పురుషుల భేదము తెలియఁబడినప్పుడు ముక్తి కలుగును. ఏలననగా ప్రధానమునందున్న పదార్థస్వరూపజ్ఞానము కలుగనంతవరకు వాటికి, ఆత్మకు మధ్యఁగల భేదమును గుర్తించుట అసాధ్యము. కావున సాంఖ్య సిద్ధాంతముననుసరించి అవ్యక్తమే తెలియఁబడవలసి యున్నది. కాని ఇచ్చట అవ్యక్తమును తెలిసికొను ప్రశ్నయే ఉదయింపదు. కావున ఇది సాంఖ్యుల యొక్క ప్రధానము కాజాలదు.

శ్రుతియందు బోధింపఁబడని పదార్థజ్ఞానముచే మానవునికేదైన ప్రయోజనము కలదని చెప్పుట అసాధ్యము; ఈ కారణముచేత కూడా 'అవ్యక్త' పదము ప్రధానమును సూచింపదని చెప్పవచ్చును.

అవ్యక్తము, లేక ప్రధానమే ప్రథమకారణమని సాంఖ్యులు పలుకుదురు. కాని శ్రుతియందు ప్రథమకారణము తెలిసికొనఁబడదగినదని, శ్రుతియందు 'అవ్యక్తము' అన్వేషింపఁబడవలయునని చెప్పఁబడలేదు. కావున అది ప్రథమకారణము కాజాలదు. మఱియు తత్ఫలితముగా అది సాంఖ్యుల పదార్థమని నుడువుటకు వీలులేదు.

సాంఖ్యసిద్ధాంతము ననుసరించి పురుషుడు ప్రకృతికి భిన్నుడని తెలిసికొనుట ద్వారా మోక్షము పొందఁబడును. కావున ప్రకృతియొక్క జ్ఞానమిచ్చుట అత్యావశ్యకమై యున్నది. కాని పరమపదమునొందుటకై 'అవ్యక్తము' యొక్క జ్ఞానమావశ్యకమను విషయము కఠోపనిషత్తునందెచ్చటను చెప్పఁబడలేదు. కావున కఠోపనిషత్తులోని అవ్యక్తము, సాంఖ్యుల ప్రకృతి కాజాలదు.

ప్రధానము జ్ఞేయము, లేక ఉపాస్యమని శ్రుతియందెచ్చటను చెప్పఁబడలేదు. 'తద్విష్ణోః పరమంపదమ్' విష్ణువుయొక్క పరమపదమే స్తుతింపఁబడఁదగినది మఱియు తెలిసికొనఁబడదగినదని శ్రుతులు వక్కాణించుచున్నవి.

## 1-4-5 వదతీతిచేన్న ప్రాజ్ఞోహి ప్రకరణాత్.

శ్రుతియందు జ్ఞేయవిషయముగా ప్రధానము చెప్పఁబడినదని నీవు పలికినచో, దానిని మేము నిషేధింతుము. ఏలననగా దానిలోని ముఖ్యవిషయమంతయు ప్రాజ్ఞుడైన పరమాత్మనే సూచించుచున్నది.

వదతి = శ్రుతిపలుకును, ఇతి = ఈవిధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, ప్రాజ్ఞః = ప్రాజ్ఞుడు, హి = ఏలననగా, ప్రకరణాత్ = ప్రకరణముచే.

4వ సూత్రమునకు ఆక్షేపణ చెప్పఁబడి, ఖండింపఁబడినది.

సాంఖ్యులిట్లు పలుకుదురు. 'అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగంధవచ్చయత్, అనాద్యనంతం మహతః పరం ధ్రువం నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే' (కఠ. ఉ. 1-3-15).

పరమధామము నొందుటకు ప్రధానము తెలిసికొనఁబడవలయునని శ్రుతి వచించుచున్నది. ఏలననగా ఇచ్చట వర్ణింపఁబడిన పదార్థముకూడా మహత్తునకతీతమైయుండుటచే ఇది ప్రధానమున కన్వయించును. కావున 'అవ్యక్తమ'ను శబ్దముచే ప్రధానమే సూచింపఁబడినదని మేము నిర్ణయింతుము.

ఈ సూత్రము దీనిని ఖండించును. అవ్యక్తముచే మహత్తున కతీతుడై యున్న ప్రాజ్ఞుడగు పరమాత్మ సూచింపఁబడును. ఏలననగా ఈ విభాగములోని ముఖ్యవిషయమిదియేనై యున్నది.

ఇంతేకాకుండా 'అశబ్ద' ఇత్యాది గుణములతో కూడియున్న పరమాత్మయే వేదాంత గ్రంథము లన్నింటియందు పేర్కొనఁబడినది. ఈ విశేషణములు పై శ్లోకము నందున్నవి.

కావున శ్రుతియందీ ప్రధానము జ్ఞేయపదార్థముగా చెప్పఁబడలేదు. మఱియు 'అవ్యక్త' శబ్దముచేతను సూచింపఁబడలేదని తెలియచున్నది.

సాంఖ్యదర్శన ప్రతిపాదకులున్నూ ప్రధానమును తెలిసికొనుటచే మృత్యురహితమగు ముక్తి కలుగునని చెప్పజాలరు. ప్రాజ్ఞుడైన పురుషజ్ఞానముచే అది సంభవించునని వారు పలుకుదురు.

కఠోపనిషద్వాక్యము ప్రధానమును సూచింపదనుటకు మరియొక కారణమును సూత్రకారుడు సూచించుచున్నాడు.

## 1-4-6 త్రయాణామేవ చైవముపన్యాసః ప్రశ్నశ్చ.

మఱియు మూడు విషయములనుఁగూర్చియే ప్రశ్నోత్తరములు కలవు. కాని ప్రధానమునుఁగూర్చి కాదు.

త్రయాణామ్ = నచికేతునిచే అడుగఁబడిన మూడు వరములయొక్క, ఏవ = మాత్రమే, చ = మఱియు, ఏవమ్ =ఈ విధముగా, ఉపన్యాసః = సమాధానమొసంగఁబడినది, ప్రశ్నః = ప్రశ్న, చ = మఱియు.

5వ సూత్రములోని ఆక్షేపణ ఇంకను ఖండింపఁబడుచున్నది.

కఠోపనిషత్తులో నచికేతుడు యముని యాగాగ్నిఁగూర్చియు, జీవునిఁగూర్చియు మఱియు పరమాత్మనుఁగూర్చియు మూడు ప్రశ్నలను మాత్రమడిగెను. యముడు సమాధానమొసంగిన మూడు విషయములకు నచికేతుడడిగిన ప్రశ్నలు సరిపోవును. ప్రధానమిచ్చుట పేర్కొనఁబడలేదు. మరియొకటి అడుగఁబడలేదు, మఱియు చెప్పఁబడలేదు. ప్రధానమునకు సంబంధించిన ప్రశ్న లేకుండుటచే, దానినిఁగూర్చిన ప్రసంగముయొక్క ప్రసక్తియే లేదు. అడుగఁబడని ప్రధానమునుఁగూర్చి యముడు ప్రబోధించినాడని పలుకుటయు పాడిఁగాదు. కావున ప్రబోధము నందు ప్రధానమునకు స్థానములేదు.

## 1-4-7 మహద్వచ్చ.

మఱియు అవ్యక్త శబ్ద విషయము మహచ్ఛబ్దమువలె నున్నది.

మహద్వత్ = మహత్తువలె, చ = మఱియు.

1వ సూత్రమును బలపరచు వాద మొసంగఁబడినది.

మహత్తువలెనే అవ్యక్తము కూడా వేదములలో సాంఖ్యుల భావమునకు భిన్నమైన అర్థమునందు ప్రయోగింపఁబడినది. సాంఖ్యులు 'మహత్' పదమును ప్రథమజన్యమైన బుద్ధిని సూచించుటకు ప్రయోగింతురు. ఈ శబ్దము వైదిక గ్రంథములలో మరియొక అర్థము నొసంగును. వైదిక గ్రంథములయందిది ఆత్మ శబ్దమునకు సంబంధించియున్నది. ఈ విషయమును ఈ క్రింది వాక్యములలో మనముఁగాంచవచ్చును. 'బుద్ధేరాత్మామహాన్పరః (కఠ. ఉ. 1-3-10). 'మహాంతం విభుమాత్మానమ్' (కఠ. ఉ. 1-2-22), 'వేదాహమేతం పురుషం మహాంతమ్' (శ్వే. ఉ. 3-8). కావున శ్రుతులయందు పేర్కొనబడిన 'అవ్యక్త' పదము కూడా ప్రధానమును సూచింపదని మా నిర్ణయము. సాంఖ్యదర్శనమునందవ్యక్తము ప్రధానము, లేక ప్రకృతి యను అర్థము నొసంగినను, శ్రుతి గ్రంథములయందిది మరియొక అర్థము నొసంగును. కావున ప్రధానము శాస్త్రప్రామాణికము కాదు. కాని అది కేవలము అనుమాన ప్రమాణమైయున్నది.

సాంఖ్యులయొక్క బుద్ధియే మహత్తనఁబడును. కాని కఠోపనిషత్తునందు మహత్తు బుద్ధికంటెను శ్రేష్ఠమని చెప్పఁబడినది. 'బుద్ధేరాత్మా మహాన్పరః' కావున కఠోపనిషత్తులోని మహత్తు, సాంఖ్యుల మహత్తుకు భిన్నమైయున్నది.

# ౨. చమసాధికరణము
# (8-10 సూత్రములు)

## 1-4-8 చమసవదవి శేషాత్.

'అజ' అనగా ప్రధానమని చెప్పుటకు వీలులేదు. ఏలననగా ఒక గిన్నెవలె ప్రత్యేక లక్షణములు చెప్పఁబడలేదు.

చమసవత్ = ఒక గిన్నెవలె, అవిశేషాత్ = ప్రత్యేక లక్షణము చెప్పఁబడకుండుటచే.

1వ సూత్రమును బలపఱచుటకై శ్వేతాశ్వతరోపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

శ్వేతాశ్వతరములోని ఒక శ్లోకమునకు సాంఖ్యులొసంగిన తప్పుడు వాఖ్యానము నిప్పుడు సూత్రకారుడు ఖండించుచున్నాడు.

శ్వేతాశ్వతరము (4-5) నందు 'అజామేకాం లోహితశుక్ల కృష్ణాం బహ్వీః ప్రజాస్సృజమానాంసరూపాః' అను వాక్యము కలదు.

ఇచ్చట ఈ 'అజ' యనునది సాంఖ్యులయొక్క ప్రధానమును సూచించునా? లేక అగ్ని, జలము, పృథ్వి యొక్క తన్మాత్రలను సూచించునా? యను సంశయము కలుగును. 'అజ' శబ్దమిచ్చట జన్మలేని ప్రధానమునే సూచించునని సాంఖ్యులు పలుకుదురు. శ్వేత, రక్త, కృష్ణవర్ణములు సత్త్వరజస్తమోగుణములను సూచించునని వారు నుడువుదురు. అది ఒక కార్యము కాకుండుటచే 'అజ' యని చెప్పఁబడును. నిస్సహాయమగు తన స్వప్రయత్నముచే అది అనేక ప్రజలను ఉత్పన్నమొనర్చునని చెప్పఁబడినది.

దీనినీ సూత్రము ఖండించును. ఈ మంత్రము సాంఖ్య సిద్ధాంతమును ప్రతిపాదించదు. ప్రత్యేక లక్షణము లేకుండుటచే ఇట్టి ప్రత్యేక ప్రతిపాదన కాధారము లేదు. మంత్రములో సూచింపఁబడిన గిన్నెతో ఈ విషయము పోల్చఁబడినది. 'అర్వాగ్బిలశ్చమస ఊర్ధ్వబుధ్నః' (బృ. ఉ. 2-2-3). శ్రుతి ఏరకమైన గిన్నెను సూచించినదో నిశ్చయించుట అసాధ్యము. అదే విధముగా కేవలము శ్రుతిచే 'అజ' యొక్క అర్థమును నిర్ణయించుట అసాధ్యము.

కాని గిన్నెనుఁగూర్చిన మంత్రమునకు సంబంధించిన అనుబంధ వాక్యమొకటి కలదు. దానిచే అది ఏరకమైన గిన్నెయో మనము గ్రహింపవచ్చును; 'మూతి దిగువభాగమునందును, అడుగు పై భాగమునందును కలిగియున్న గిన్నెతల పుఱ్ఱె యనఁబడును.' అదే విధముగా 'అజ' యొక్క అర్థమును నిర్ణయించునప్పుడు కూడా అనుబంధ వాక్యము నిచ్చట పరిశోధింపవలసియుండును. దానియొక్క అర్థము ప్రధానమని మనము నిర్ణయించుటకు వీలులేదు.

శ్వేతాశ్వతరములోని 'అజ' శబ్దము ఏ ప్రత్యేక విషయమును సూచించునో మనము గ్రహించునదెట్లు? ఈ ప్రశ్నకీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 1-4-9 జ్యోతిరుపక్రమా తు తథాహ్యధీయత ఏకే.

ప్రకాశముచే ప్రారంభమైన భూతములన్నియును 'అజ' శబ్దముచే సూచింపఁబడును. ఏలననగా కొన్ని శ్రుతులయందీ విషయము కలదు.

జ్యోతిరుపక్రమా = ప్రకాశముతో ప్రారంభమైన భూతములు, తు = కాని, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, అధీయతే = కొన్ని శ్రుతులయందధ్యయనము చేయఁబడుచున్నది, ఏకే = కొందఱు.

ఇది 8వ సూత్రమును వ్యాఖ్యానించుచున్నది.

'అజ' శబ్దముచే, అగ్ని, జలము, పృథ్వికి కారణమైయున్న విషయమును మనము గ్రహింపవలయును. ప్రకాశముతో ప్రారంభమైన విషయమునందు అగ్ని, జలము మఱియు పృథ్వి కూడా ఇమిడియున్నవి. 'తు' అను శబ్దము ఈ నిశ్చయమును బలపఱచును. ఒకశాఖ వాటికి రక్తాదివర్ణములను నిర్ణయించును. 'యదగ్నే రోహితం రూపం తేజసస్తద్రూపం యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్య' (ఛాం. ఉ. 6-4-1).

ఈ వాక్యము 'అజ' శబ్దముయొక్క అర్థమును నిర్ణయించును. వేటినుండి ఈ ప్రపంచము సృష్టింపఁబడినదో అట్టి అగ్ని, పృథ్వి, జలములను ఇది సూచించును. ఇది త్రిగుణములతో కూడియున్న సాంఖ్యుల ప్రధానము కాదు. రక్త, శుక్ల, కృష్ణ శబ్దములు ముఖ్యముగా ప్రత్యేక వర్ణములను సూచించును. గౌణమైన అర్థమునందు మాత్రమే వాటికి సాంఖ్యులయొక్క త్రిగుణములు వర్తించును. సంశయగ్రస్తములగు

వాక్యములు వ్యాఖ్యానింపఁబడునప్పుడు, నిస్సంశయములగు వాక్యములు ప్రయోగింపఁబడవలయును. ఇది సర్వసామాన్యమగు సిద్ధాంతము.

శ్వేతాశ్వతరములోని ప్రథమాధ్యాయమునందు 'దేవాత్మశక్తి' యను శబ్దముతో 'అజ' శబ్దము ప్రయోగింపఁబడినది. కావున 'అజ' ప్రధానమును సూచింపదు.

సృజనశక్తి బ్రహ్మమున కంతర్నిహితమైన శక్తియైయున్నది. ఇది సృష్టి కాలమునందాతని నుండి ప్రాదుర్భవించును. ప్రకృతి స్వయముగా బ్రహ్మమునుండి ఉత్పన్నమైనది. కావున అక్షరశః జన్మరహితమను అర్థము నొసంగు 'అజ' ప్రకృతి, లేక ప్రధానమునకు వర్తింపదు. శ్రీకృష్ణపరమాత్మ 'మమయోనిర్మహ ద్బ్రహ్మ తస్మిన్గర్భం దధామ్యహం, సంభవస్సర్వభూతానాం తతోభవతి భారత' యని నుడివెను. దీనిచే ప్రకృతి స్వయముగా పరమాత్మచే సృష్టింపఁబడినదని తెలియుచున్నది.

## 1-4-10 కల్పనోపదేశాచ్చ మధ్వాది వదవిరోధః

ఇచ్చట రూపకాలంకారము చెప్పఁబడుటచే 'అజ' కారణ విషయమును సూచించుచున్నదనుటలో విరోధము లేదు ఉపాసనకొరకై మధువిద్యయందు మధువు, సూర్యుని సూచించును. ఇట్టి ఉపమానము లనేకములు కలవు.

కల్పన = సృజనాత్మక సంకల్పశక్తి, ఉపదేశాత్ = ప్రబోధముచే, చ = మఱియు, మధ్వాదివత్ = తేనె మున్నగు విషయములకు వలె, అవిరోధః = విరోధము లేదు.

8వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును : 'అజ' శబ్దము ఒకానొక జన్మరహిత పదార్థమును సూచించును. అది సృష్టింపఁబడిన త్రివిధములగు కారణభూతములుగా ఛాందోగ్యోపనిషత్తు ఎట్లు సూచించును? ఇది న్యాయవిరుద్ధము.

సూత్రమిట్లు నుడువును : దీనియందు విరోధములేదు. సకలజీవులకు మూలమైయున్న అగ్ని, జలము మఱియు పృథ్వి రూపకాలంకారముగా 'ఆడమేక'తో పోల్చఁబడినది. ఒకానొక ఆడమేక కొంతభాగము ఎఱుపు, కొంతభాగము తెలుపు, కొంతభాగము నలుపు వర్ణములను కలిగియుండవచ్చును. తన వర్ణమును పోలిన అనేకమైన చిన్నమేకలనది కలిగియుండవచ్చును. ఒకానొక మగమేక దానిని ప్రేమించి, దాని ప్రక్కన పడియుండవచ్చును. ఇఁక మరియొక మగమేక

దానిననుభవించిన పిమ్మట దానిని త్యజించి యుండవచ్చును.

అదే విధముగా విశ్వమునకు కారణమైన పదార్థము అగ్ని, నీరు, పృథ్వి వర్ణములుఁగలదై తనకు వలెనే అనేక చరాచర పదార్థములను సృష్టించును. మఱియు అవిద్యచే బంధింపఁబడిన జీవులచే అనుభవింపఁబడును. ఇఁక నిజమైన బ్రహ్మజ్ఞానము నార్జించిన జీవులచే పరిత్యజింపఁబడును.

సూత్రములోని 'మధు, వత్' శబ్దములు సూర్యుడు తేనె కాకున్నను, తేనెగా పోల్చఁబడినట్లును (ఛాం. ఉ. 3-1), వాక్కు ఆవువలెను (బృ. ఉ. 5-8), స్వర్గాది లోకములు అగ్నుల వలెను (బృ. ఉ. 6-2-9) ప్రయోగింపఁబడినవి. అదే విధముగా ఇచ్చటకూడా కారణపదార్థము త్రైవర్ణికమగు ఆడమేక కాకున్నను, రూపకాలంకారముగా అట్లు వర్ణింపఁబడినది. కావున 'అజ' శబ్దము అగ్ని, జలము మఱియు పృథ్వి యొక్క సమూహముగా సూచింపఁబడుటలో విరోధము లేదు. 'అజ' అనగా జన్మరహితమైనదని అర్థముకాదు. 'అజ' స్వరూపవర్ణన సత్యమును బోధించు ఊహావిధాన మార్గమైయున్నది. సూర్యుడు నిజమునకు తేనె కాకున్నను, దేవతలకు సూర్యుడు తేనె వంటివాడై యున్నాడు.

# 3. సంఖ్యోపసంగ్రహాధికరణము

## 1-4-11 న సంఖ్యోప సంగ్రహాదపి నానాభావాదతిరేకాచ్చ.

శ్రుతిలోని ఇరువదియైదంశములను సూచించు సంఖ్యనుఁబట్టి కూడా ఇది ప్రధానమును సూచించునని చెప్పుటకు వీలులేదు. ఏలననగా ఈ యంశములలో విభేదములున్నవి. మఱియు సాంఖ్యుల సంఖ్యను మించియున్నవి.

న = కాదు, సంఖ్య = సంఖ్య, ఉపసంగ్రహాత్ = పట్టికచే, అపి = కూడా, నానాభావాత్ = విభేదములచే, అతిరేకాత్ అధిక సంఖ్యచే, చ = మఱియు.

సాంఖ్య దర్శనములోని ఇరువదియైదు అంశములను శ్రుతి అంగీకరించునా? యను విషయమునుఁ గూర్చి ఈ సూత్రము చర్చించుచున్నది.

'అజ'నుఁగూర్చి పలుకు శ్రుతిభాగమునందు తన సిద్ధాంతమును నెలకొల్పు ప్రయత్నమునందు పూర్వపక్షి విఫలుడయ్యెను. అతడు మరల ముందుకు వచ్చి మరియొక శ్రుతిని పేర్కొనుచున్నాడు. 'యస్మిన్ పంచ పంచజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితః, తమేవ మన్య ఆత్మానం విద్వాన్ బ్రహ్మామృతోऽమృతమ్' (బృ. ఉ. 4-4-17).

ఐదైదులు ఇరువదియైదగును. ఇది సాంఖ్యతత్త్వములను తెలుపు సరియైన సంఖ్య. ప్రధానముయొక్క సిద్ధాంతము శాస్త్రప్రామాణికమైయున్నది. మా దర్శనమునకిది శ్రుతిప్రమాణమైయున్నది.

ఇట్టి ఊహను ఈ సూత్రము ఖండించును. 'పంచ పంచజనాః' యనునది సాంఖ్యులయొక్క ఇరువదియైదు అంశములను సూచింపదు. సాంఖ్య తత్త్వములలో ఒక్కొక్కటి వ్యక్తిగత భేదమును కలిగియున్నది. ప్రతి తత్త్వమునకు సర్వసామాన్యమగు గుణములు లేవు. ఇరువదియైదు తత్త్వములన్నియు ఒకదానికొకటి విభిన్నమై యుండుటచే, సాంఖ్యతత్త్వములను ఏ దృక్పథము ననుసరించియు ఐదైదు సమూహములుగా విభజింపలేము.

మఱియు సంఖ్యాధిక్యతచేత కూడా ఇది సాధ్యముకాదు. ఆకాశమొక ప్రత్యేక తత్త్వముగా పేర్కొనఁబడినది. దీనిచే మొత్తము సంఖ్య ఇరువదియారగును. ఇది సాంఖ్యసిద్ధాంతమున కనుకూలింపదు.

కేవలము 25వ సంఖ్యామానముచే ఇది సాంఖ్యులయొక్క ఇరువదియైదు తత్త్వములను సూచించునని నుడువుటకు వీలులేదు. మఱియు దీనిచే సాంఖ్యసిద్ధాంతము వేదప్రామాణ్యమనియును పలుకుట కవకాశము లేదు.

ఈ వాక్యము ఆత్మను కూడా సూచించును. అప్పుడు మొత్తము సంఖ్య ఇరువదిఏడగును. ఆత్మ ఇతర పదార్థముల కాధారముగా వర్ణింపఁబడినది. కావున అది ఇరువదియైదు తత్త్వములయందొకటి కాజాలదు.

సాంఖ్యదర్శన తత్త్వములు పురుషునికి స్వతంత్రముగా ప్రతిపాదింపఁబడినవి. కాని ఇచ్చట ఈ యంశములు బ్రహ్మము, లేక ఆత్మపై పూర్తిగా ఆధారపడి యున్నట్లు చెప్పఁబడినవి. వాటన్నింటి ఆత్మయే బిగుత్రాడువంటిదై యున్నది. కావున అవి సాంఖ్యులయొక్క స్వతంత్ర తత్త్వములుగా అంగీకరింపఁబడజాలవు.

'పంచజనాః' యను శబ్దము ఒక సమూహమును సూచించును. ఇది ఆ సమూహములోని సభ్యులందరికి సంబంధించినట్టి ప్రత్యేక నామము. ఒక సమూహమునందు ఐదుగురు సభ్యులుందురు. ఒక్కొక్క సమూహము 'పంచజనాః' అని చెప్పఁబడును. కావున 'పంచ పంచజనాః' యను శబ్దసముదాయము ఇరువదియైదు జీవులను సూచింపదు. కాని ఐదు జీవులను సూచించును.

వాటియందొక్కక్కటి 'పంచజనాః' అని చెప్పఁబడును. ఇది బృహత్సప్తర్షి మండలమును సూచించు తారాగణ సప్తకమును తెలుపు 'సప్తర్షి' యను సమాసము వంటిది. ఈ నక్షత్రములలో ఒక్కొక్కదానికి 'సప్తర్షి' యను ప్రత్యేక నామము కలదు. మనము ఏడుగురు సప్తర్షులని పలికినప్పుడు ఏడుమార్లు సప్తనక్షత్రములుగా భావింపము. కావున 'పంచపంచ జనాః' యనుటచే ఐదుమార్లు ఐదుగురు జనులుగా భావింపరాదు. కాని 'పంచజనాః' అని పిలువఁబడు ఐదుగురు జనులు మాత్రమని భావింపవలయును. సాంఖ్యుల ఇరువదియైదు తత్త్వములు ఈ దిగువచెప్పఁబడుచున్నవి. 1.ప్రకృతి, 2 నుండి 8 వరకు కార్యకారణములైయున్న మహత్తు మున్నగు సప్త ప్రకృతి వికారములు. 9 నుండి 24 వరకు పదునాఱు వికారములు. 25 కార్యకారణములు కాని ఆత్మ.

ఐతే 'పంచజనాః' అని చెప్పఁబడు వారెవ్వరు? దీనికీ దిగువ సూత్రము సమాధానము నొసంగును.

## 1-4-12 ప్రాణదయోవాక్యశేషాత్.

ఉపవాక్యమునందు తెలుపఁబడిన ప్రాణాదులే 'పంచజనాః' అని సూచింపఁబడినవి.

ప్రాణాదయః = ప్రాణము మొదలగునవి, వాక్యశేషాత్ = ఉపవాక్య కారణముచే.

11వ సూత్రమునకీ సూత్రము వ్యాఖ్యానమువంటిదై యున్నది.

'పంచజనాః' అని సూచింపఁబడిన శ్రుతి విభాగము, బ్రహ్మముయొక్క స్వరూపమును వర్ణించుటకై సూచింపఁబడిన ప్రాణాది పంచకముఁగల మరియొక శ్రుతివిభాగము ననుసరించియున్నది. 'ప్రాణస్య ప్రాణము 'త చక్షుషశ్చక్షురుత శ్రోత్రస్య శ్రోత్రమన్నస్యాన్నం మనసోయేమనోవిదుః' (బృ. మాధ్యందిన 4-4-21).

'పంచజనాః' యనునది ప్రాణము మఱియు ఇతరములగు నాల్గింటిని సూచించుటయేఁగాక, బ్రహ్మముయొక్క స్వరూపమును వర్ణించుటకై ప్రయోగింపఁబడినది.

ప్రాణము, నేత్రము, శ్రోత్రము మున్నగువాటికి 'ప్రజలు' అనెడి శబ్దమెట్లు వర్తించునని సాంఖ్యులడుగుదురు. మీ తత్త్వములకు మాత్రమిది ఎట్లు వర్తించునని మేము తిరిగి ప్రశ్నింతుము. ఈ రెండు విషయములందును 'జనాః' అను శబ్దము ప్రాణములకే వర్తించును. 'తేవాఏతే పంచబ్రహ్మ పురుషాః' (ఛాం. ఉ. 3-13-6) 'ప్రాణోహ పితా ప్రాణో మాతా' (ఛాం. ఉ. 7- 15 -1).

పూర్వపక్షి ఇట్లనును : 'అన్నస్య అన్నమ్' అను మరియొక వాక్యాంశమునుఁ గూర్చి చెప్పు మాధ్యందినుల పరిష్కారమునందే ఇది సాధ్యమగును. కాని కాణ్వుల సంశోధనయందీ 'అన్నస్య అన్నమ్' అను వాక్యాంశము లోపమొనర్పఁబడినది. మనకిప్పుడు నాలుగు మాత్రమే మిగిలియున్నవి. ఈ యాక్షేపణకు సూత్రకారుడీ దిగువ సూత్రమునందు సమాధానము నొసంగుచున్నాడు.

## 1-4-13 జ్యోతిషైకేషామ సత్యన్నే.

ఆహారము సూచింపఁబడని కాణ్వసంశోధన విభాగమునందు పూర్వ శ్లోకములోని జ్యోతి'ని చేర్చినచో ఐదవసంఖ్య వచ్చును.

జ్యోతిషా = జ్యోతిచే, ఏకేషామ్ = కాణ్వశాఖ పరిష్కారమునందు, అసతి = లేనప్పుడు, అన్నే = అన్నము.

11వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

'దీర్ఘాయుష్యము నొసంగు జ్యోతులకు జ్యోతియైన అమృతత్త్వమును దేవతలు పూజింతురు (బృ. ఉ. 4-4-10). శతపథ బ్రాహ్మణములోని కాణ్వశాఖ ననుసరించి పూర్వసూత్రమునందు ఆహారము సూచింపఁబడకున్నను, ఆ శ్లోకములోని నాలుగు మఱియు పైన పేర్కొనబడిన 'జ్యోతి' కలసి ఐదుగురు ప్రజలగుదురు.

ఇట్లు ప్రధాన సిద్ధాంతము శ్రుతి సమ్మతముకాదని నిరూపింపఁబడినది. ఈ సిద్ధాంతము స్మృతిచేతను, తర్కముచేతను నిరూపింపఁబడజాలదను విషయము ఇకముందు చర్చింపఁబడును.

# 4. కారణత్వాధికరణము

## (14-15 సూత్రములు)

## 1-4-14 కారణత్వేన చాకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః

ఆకాశము మున్నగు సృష్టింపఁబడిన పదార్థములను గూర్చి వేదాంత గ్రంథములలో విభేదమున్నను, బ్రహ్మమే ప్రథమ కారణమను విషయమునందీ విభేదము లేదు. ఏలననగా సమస్త గ్రంథములయందాతని యునికి వర్ణింపబడి యున్నది.

కారణత్వేన = ప్రథమకారణముగా, చ =మఱియు, ఆకాశాదిషు = ఆకాశము మున్నగువాటియందు, యథా = వలె, వ్యపదిష్ట = విభిన్న శ్రుతులలోని ప్రబోధము, ఉక్తేః = చెప్పఁబడుటచే.

ఈ విశ్వమునకుఁగల కారణము, నానావిధ శ్రుతులలో నానావిధములుగా నిర్ణయింపఁబడవచ్చుననెడి 13వ సూత్రమువలన కలిగెడి సందేహమును ఈ సూత్రము నిర్మూలించును.

పూర్వభూమికయందు బ్రహ్మముయొక్క సరియైన నిర్వచన మొసంగఁబడినది. శ్రుతులన్నింటియందును బ్రహ్మమే ప్రధాన విషయముగా ప్రబోధింపఁబడినదను విషయము నిరూపింపఁబడినది. ప్రధానసిద్ధాంతము శాస్త్రప్రామాణ్యముకాదను విషయము కూడా ఋజువు చేయఁబడినది. కాని ఇప్పుడు సాంఖ్యమొక క్రొత్త ఆక్షేపణను చూపుచున్నది.

సాంఖ్యసిద్ధాంతి ఇట్లనును : విశ్వమునకు మూలకారణము బ్రహ్మమనియు శ్రుతులన్నియును బ్రహ్మమునే సూచించుననియును నిరూపించుట సాధ్యము కానిపని. ఏలననగా వేదాంత వాక్యములు పరస్పరము భిన్నములై యున్నవి. శ్రుతులన్నియును సృష్టిక్రమమును నానావిధముగా పేర్కొనియున్నవి. నిజమునకవి నానా ప్రకారములగు సృష్టులనుఁగూర్చి పలుకును. ఆత్మ, లేక బ్రహ్మమునుండి సృష్టి ఉత్పన్నమగునని ( తై. ఉ. 2-1-1) నందు కలదు. 'ఏతస్మాదాత్మన, ఆకాశస్సంభూతః, ఆకాశాద్వాయుః' అను వాక్యము సృష్టికి కారణము ఆత్మయని నిరూపించుచున్నది. మరియొక స్థలమునందు సృష్టికార్యము అగ్నిచే ప్రారంభమైనదని

చెప్పఁబడినది. (ఛాం. ఉ. 6–2–3). ఇంకొకచోట 'పురుషుడు శ్వాసను సృష్టించెను. శ్వాసనుండి శ్రద్ధ కలిగెన'ని (ప్ర. ఉ. 4–4) కలదు. వేఱొకస్థానమునందు 'ఆత్మచే ఈ ప్రపంచములు, నీరు, స్వర్గలోకము, ప్రకాశము,పృథ్వీ, పాతాళలోకములు సృష్టింపఁబడినవ'ని (ఐతేరేయ ఆరణ్యకము 2–4–1–2,3) నందు కలదు. అచ్చట ఏలాటి క్రమము చెప్పఁబడలేదు. అసత్తు నుండి సృష్టిరచన జరిగినదని ఒకానొకచోట చెప్పఁబడినది. 'అసద్వాఇదమగ్ర అసీత్, తతోవైసద జాయత' (తై. ఉ. 2–7) 'అసదేవేదమగ్ర ఆసీత్, తత్సదాసీత్తత్సమభవత్' (ఛాం. ఉ. 3–19–1). మరియొక స్థలమునందిట్లు చెప్పఁబడినది. 'తద్ధైక ఆహురస దేవేదమగ్ర ఆసీదేకమేవా ద్వితీయంతస్మాద సతస్సజ్జాయత, కుతస్తుఖలు సోమ్యైవం స్యాదితిహోవాచకథమ సతస్సజ్జాయేత' (ఛాం. ఉ. 6–2–1,2).

విశ్వమునకు కారణము సత్తేయని వేరొక స్థలమునందు చెప్పఁబడినది. 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్' (ఛాం. ఉ. 6–2–1). మరియొక స్థానమునందు ప్రాపంచిక సృష్టి ఆకస్మికముగా జరిగినదని చెప్పఁబడినది. ప్రపంచకారణము అవ్యక్తమని ఇంకొకస్థామునందున్నది. 'తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్తన్నామరూపా భ్యామేవవ్యాక్రియత' (బృ. ఉ. 1–4–7). ఈ విధముగా ఉపనిషత్తులు విశ్వసృష్టి విషయమునందు అనుగుణములై లేవు. ఈ విధముగా ప్రపంచకారణము బ్రహ్మమేయని ఉపనిషత్తులు ప్రబోధించిన విషయమును నిశ్చయించుటకు సాధ్యముకాకున్నది. పరస్పర విరోధములు కానఁబడుటచే శ్రుతులు విశ్వకారణమును నిర్ణయించుటకు ప్రమాణములుగా అంగీకరించుటకు వీలులేకున్నది. కావున శ్రుతి మఱియు తర్కము నాధారముగాఁగొని మనము విశ్వమునకుఁగల మరియొక కారణము నంగీకరింపవలసియున్నది.

ఇతఃపూర్వము సూచింపఁబడిన బృహదారణ్యకోపనిషద్వాక్యము ననుసరించి ప్రధానమే ప్రపంచకారణముగా ప్రబోధింపఁబడినదని నుడువనగును. ఇఁక సత్తు, అసత్తు, ప్రాణము, ఆకాశము, అవ్యాకృతమనెడి శబ్దములు ప్రధానమునకే అన్వయింపఁబడవలయును. ఏలననగా ఆకాశము, ప్రాణము వంటి శబ్దములు ప్రధానము యొక్క కార్యములైయున్నవి. ఇతర శబ్దములు స్వయముగా ప్రధానమునకు పర్యాయపదములై యున్నవి. ఈ శబ్దములన్నింటిని బ్రహ్మమున కన్వయించుటకు వీలులేదు.

కొన్ని పరిచ్ఛేదములలో ఆత్మ మఱియు బ్రహ్మము కూడా ప్రపంచ కారణములుగా పేర్కొనఁబడినవి. కాని ఈ రెండు శబ్దములు ప్రధానమునకు కూడా వర్తించును. 'ఆత్మ' శబ్దమునకు సర్వవ్యాపకమని వ్యుత్పత్త్యర్థము. ప్రధానము సర్వ వ్యాపకమైయున్నది. బ్రహ్మమునకు మిక్కిలి గొప్ప (బృహత్) దని వ్యుత్పత్త్యర్థము. ప్రధానము కూడా బ్రహ్మమని చెప్పఁబడును. కార్యరూపాంశము నందు ప్రధానము అసత్తని చెప్పఁబడును; మఱియు కారణావస్థయందది సత్తని నుడువఁబడును. తన నుండి ఉత్పన్నమైన పదార్థమగుటచే ప్రధానము ప్రాణమనియు చెప్పఁబడును. కార్యారంభమును సూచించు ఆలోచన ఇత్యాదులున్నూ న్యూనార్థము నందు ప్రధానమున కన్వయించును. 'నేను అనేకమగుదునుఁగాక, యని అది సంకల్పించెన'ని ఉపనిషత్తు పలికినప్పుడు ఆ ప్రధానము వృద్ధినొందు కార్యము నారంభించెనని అర్థము. కావున సృష్టికి సంబంధించిన ఉపనిషద్వాక్యము లన్నియును బ్రహ్మముకంటె ప్రధానమే సృష్టికర్తయను ప్రామాణ్యము నంగీకరించునని నుడువుటయే శ్రేష్ఠమైయున్నది.

సిద్ధాంతి ఈ క్రింది సమాధానము నొసంగును. ఆకాశము మున్నగు సృష్టింపఁబడిన పదార్థముల క్రమము పరస్పరము భిన్నమైనదిగా శ్రుతులు నుడివినను, అవి బ్రహ్మమే ప్రథమ కారణమని ఏకధాటిగా వాకొనుచున్నవి. ప్రపంచ కారణమును నిర్ణయించునట్టి వేదాంత వాక్యములన్నియును సమన్వయ పూరితములేనై యున్నవి. విశ్వసృష్టికి సంబంధించిన సిద్ధాంతములచే కారణ బ్రహ్మమునుఁగూర్చిన సిద్ధాంతములు బాధింపఁబడుననుటకు వీలులేదు. సృష్టిని గూర్చి ప్రబోధించుట వేదాంతగ్రంథములయొక్క ముఖ్యోద్దేశ్యము కాదు. కావున దీనిని గుఱించి అంతగా విచారింపనవసరము లేదు. బ్రహ్మమే ప్రధాన కారణమని ప్రబోధించుటయే శ్రుతులయొక్క ముఖ్యోద్దేశ్యమై యున్నది. ఈ విషయము నందేలాటి వైరుధ్యములేదు.

విశ్వమునకు సంబంధించిన ఈ పరస్పర విరుద్ధములైన వాక్యములను కూడా సూత్రకారుడు మున్ముందు సమన్వయ పఱచగలడు.

## 1-4-15 సమాకర్షాత్.

బ్రహ్మమునుఁగూర్చి నుడువు వాక్యములోని అసత్తనునది బొత్తిగా శూన్యము కాకుండుటచే.

సమాకర్షాత్ = మరియొక స్థలమునందున్న వాక్యమునకు సంబంధించి యుండుటచే.

తైత్తిరీయ, ఛాందోగ్య మఱియు బృహదారణ్యకములలోని కొన్ని వాక్యములిచ్చట చర్చింపఁబడిచున్నవి.

సాంఖ్యులు మరియొక ఆక్షేపణను పలుకుదురు. ప్రథమ కారణముఁగూర్చి పరస్పర వైరుద్ధ్యము కలదని వారు చెప్పుదురు. ఏలననగా, ఆత్మయే ఈ ప్రపంచములను సృష్టించినదని కొన్ని పరిచ్ఛేదములు చాటిచెప్పును. (ఐ.ఆర్. 2-4-1, 2,3) అసత్తునుండి సృష్టి కలిగినదని కొన్ని శ్రుతులు వాకొనును. (తై. ఉ . 2-7) మరికొన్నింటిలో సత్తే ప్రథమకారణముగా ప్రబోధింపఁబడినది. (ఛాం. ఉ. 6-1-2) కొన్ని శ్రుతులు ఆకస్మిక సృష్టిని గూర్చి నుడువును. వేదాంతవాక్యములలోని ఈ పరస్పర విరుద్ధములగు సిద్ధాంతములచే, శ్రుతులు ఏకముఖముగా బ్రహ్మమే ప్రథమ కారణమని నుడువుచున్నవని చెప్పుటకు వీలులేదు.

సిద్ధాంతి ఈ క్రింది సమాధానము నొసంగును. 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' అని (తై. ఉ. 2-7) నందు కలదు. అసత్తనగా ఇచ్చట బొత్తిగా శూన్యమని అర్థముకాదు. అవ్యక్తమైన ఉనికియని దీనికర్థము. ఆదియందు 'సత్తా' నామరూపములుగా విభజింపఁబడెను. 'అసన్నేవసభవతి, అసద్బ్రహ్మేతి వేదచేత్, అస్తిబ్రహ్మేతిచేద్వేద, సంతమేనం తతోవిదురితి' అని (తై. ఉ. 2-6) నందు కలదు. మఱియు అన్నమయాదికోశక్రమము ద్వారా అది ప్రతిపదార్థమున కంతరాత్మగా సూచింపఁబడినది. ఆ ప్రకరణమునందిదే బ్రహ్మము మరల పేర్కొనఁబడినది. 'నేననేకమగుదునుఁగాక' యని అతడు సంకల్పించెను. దీనిచే సమస్త విశ్వమును బ్రహ్మమే సృష్టించెనను విషయము స్పష్టమగుచున్నది.

'సత్తా' శబ్దము సామాన్యముగా నామరూపములచే వ్యక్తమైయున్న దానిని సూచించును. అదే పదార్థము అవ్యక్తరూపమునందున్నప్పుడది 'అసత్త'నఁబడును. బ్రహ్మము 'అసత్త'ని చెప్పఁబడును. ప్రాపంచికసృష్టికి పూర్వమునందున్న స్థితి దీనిచే తెలియఁబడును.

ఛాందోగ్యము (6-2-2) లోని 'కథమసతస్సజ్జాయేత' అనువాక్యముచే ఈ సంభవము స్పష్టముగా నిషేధింపఁబడుచున్నది.

'తద్ధేదంతర్హ్య వ్యాకృతమాసీత్' (బృ. ఉ. 1-4-7) అను వాక్యముచే పరిపాలకుడు లేకుండా విశ్వరచన జరిగినదని నుడువుటకు వీలులేదు. ఏలననగా ఇది 'స ఏష ఇహ ప్రవిష్టః, ఆనఖాగ్రేభ్యః' (ప్ర. ఉ. 1-4-7)అను మరియొక వాక్యముతో సంబంధించియున్నది. 'ఏష' యను శబ్దమిచ్చట పరిపాలకుని సూచించును. కావున పరిపాలకుడైన ఆ పరమేశ్వరుడే అవ్యక్తమునుండి వ్యక్తమైనాడని మనము గ్రహింపవలసియున్నది.

ఒక పరిపాలకుని ఆధిపత్యము ననుసరించి విశ్వరచన పరిఢవిల్లినదని మరియొక శ్రుతి ప్రకరణము వర్ణించుచున్నది. 'అనేనజీవేనాత్మనాను ప్రవిశ్యనామ రూపేవ్యాకరవాణి' (ఛాం. ఉ. 6-3-2).

పంట పండించువాడు మరియొకడున్నను, మనము సామాన్యముగా 'పొలములో పంట స్వయముగా పండుచున్నద'ని పలుకుచుందుము. మఱియు 'గ్రామము సమీపించుచున్నద'ని చెప్పుచుందుము. ఇచ్చట మనము దేవదత్తుడు, లేక మరియొకనిని ఆరోపించుకొనవలసియుండును.

బ్రహ్మము ఒకానొక స్థలమునందు సత్తుగా వర్ణింపఁబడినది. మరియొక స్థలమునందది సర్వాత్మగా వర్ణింపఁబడినది. కావున వేదాంత గ్రంథములన్నియును బ్రహ్మమునే ప్రథమకారణముగా సూచించుచున్నవని ధృఢముగా నిశ్చయింపనగును. నిశ్చయముగా ఈ విషయమునందేలాటి వైరుధ్యము లేదు.

అసత్తే కారణమని పరిచ్ఛేదమునందు సూచింపఁబడినను, అచ్చట సత్తు కూడా పేర్కొనఁబడినది. అసత్తే కారణశక్తిగా శ్రుతివర్ణించినను, సత్తును సూచించుటతో అది అంతమగుచున్నది.

అదే శ్రుతియందున్న మరియొక వాక్యముతో సంబంధము నేర్పఱచుకొనుట ద్వారా ఒక శబ్దము, లేక వాక్యములోని సంశయము నివారింపఁబడును. ఏలననగా శ్రుతిలోని వివిధ వాక్యములలో పరస్పర సంబంధము కలదు. సాంఖ్యులయొక్క అవ్యక్తమైన ప్రధానము, లేక అవ్యాకృతమని చెప్పబడు 'అసత్తు'నకు సరియైన అర్థము బ్రహ్మమేయని నిశ్చయింపఁబడినది. 'సోకామయత బహుస్యాం ప్రజాయేయేతి' (తై. ఉ. 2-6-2) మఱియు 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' (తై. ఉ. 2-7-1) అను రెండు శ్రుతివాక్యములను పోల్చిచూడుము. సృష్టికి పూర్వము

విశ్వముయొక్క స్థితికి సమాధానమును స్పష్టమొనర్చిన మొదటి వాక్యము ద్వారా రెండవ వాక్యములోని అసచ్ఛబ్దమున కర్థము బ్రహ్మమే యని నిశ్చయింపఁబడినది.

'తద్ధేదంతర్హ్వ్యవ్యాకృతమాసీత్' (బృ. ఉ. 1-4-7) అను వాక్యములోని అవ్యాకృతశబ్దమున కర్థము బ్రహ్మమని నిశ్చయింనఁబడినది. కాని అది అవ్యక్తస్థితియందున్నదని 'స ఏష ఇహ ప్రవిష్టః, ఆనఖాగ్రేభ్యః' అను వాక్యముచే తెలియఁబడుచున్నది. చివరి వాక్యములోని 'సః, ఏషః' అను శబ్దములచే అవ్యాకృతము మిక్కిలి స్పష్టమొనర్పబడినది.

ప్రపంచ కారణమును సూచించు వాక్యములయందెచ్చటను సాంఖ్యులయొక్క ప్రధానమునకు స్థానములేదు. 'అసత్' మఱియు 'అవ్యాకృత' పదములు కూడా బ్రహ్మమునే సూచించును.

'అసత్' శబ్దము పూర్వశ్లోకమునకు విషయమైయున్న బ్రహ్మమును సూచించును. సృష్టికి పూర్వము నామరూపవిభేదము లేకుండెను. బ్రహ్మము కూడా ఉనికిలేనివాడై యుండెను. అనగా అతడు నామరూపములతో సంబంధము లేనివాడై యుండెను. నామరూపములు లేనికారణముచే అతడప్పుడు అసత్తని చెప్పబడెను.

ఈ వాక్యముయొక్క వర్ణన కేవలము బ్రహ్మమునకు సంబంధించిన దగుటచే అసచ్ఛబ్దము చైతన్యరహితమగు జడపదార్థమును సూచింపదు.

ఆ శబ్దముయొక్క వ్యుత్పత్తినిఁబట్టి బ్రహ్మమున కర్థము 'అసత్తు' కాదు; ఉపనిషద్ద్రష్ట ఈ శబ్దమును సామాన్యార్థమునకు విలక్షణముగా ప్రయోగించెను.

# 5. బాలాక్యధికరణము

## (16-18 సూత్రములు)

### 1-4-16 జగద్వాచిత్వాత్.

జగత్కార్యమునకు కారణము బ్రహ్మమగుటచే.

జగత్ = ప్రపంచము, వాచిత్వాత్ = సూచింపఁబడుటచే.

కౌషీతక్యుపనిషత్తులోని ఒక వాక్యమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

'నేను బ్రహ్మమునుఁగూర్చి చెప్పగలన'ని పలికి బాలాకిముని కౌషితకీ

బ్రాహ్మణమునందు బ్రహ్మమునుఁగూర్చి ప్రబోధింతునని వాగ్దానమొసంగెను. మఱియు ఆదిత్యునితో ఆరంభించి అతడు పదునాఱు పదార్థములను బ్రహ్మముగా వర్ణించిచెప్పెను. బాలాకి తన ప్రసంగమును ముగించిన పిదప, వీటిలో ఏదియు బ్రహ్మముకాదని రాజైన అజాతశత్రువు వాటినన్నింటిని నిరాకరించెను. ఈ క్రింది మాటలతో అజాతశత్రువు బ్రహ్మమునుఁగూర్చి ప్రబోధించెను. "ఓ బాలాకీ, నీవు సూచించిన పురుషులనెవ్వడు సృష్టించెనో మఱియు ఈ దృశ్యమానమగు జగత్తెవ్వని కార్యమైయున్నదో, అదియే తెలిసికొనఁబడఁదగినది".

'తంహోవాచాజాతశత్రుర్యమేవైష ఏతద్బాలాకే పురుషోశయిష్ట యత్రైతదభూద్యత ఏతదాగాత్' (కౌ. ఉ.4-19) అను బాలాకి, అజాతశత్రు సంవాదము కౌషీతక్యుపనిషత్తునందు కలదు.

ఇచ్చట జ్ఞేయపదార్థము జీవుడా? ప్రాణమా? లేక పరబ్రహ్మమా? యనెడి సంశయము కలుగును. ఇచ్చట ప్రాణము సూచింపఁబడినదని పూర్వపక్షి పలుకును. ఏలననగా 'ఇది ఎవ్వని కార్యమో' యనెడి వాక్యాంశము ప్రాణముయొక్క కార్యమును సూచించును. మఱియు తదనంతర వాక్యమునందు 'ప్రాణమ'ను శబ్దము కానఁబడుచున్నది. 'ఆత్మనః ప్రాణాయథాయతనమ్' (కౌ. ఉ. 4-19).

'ప్రాణ'మను శబ్దము శ్వాసను సూచించును. ఇది సుప్రసిద్ధమే కదా! ఇక ప్రాణము సూర్యునిలోని పురుషుడు, చంద్రునిలోని పురుషుడు ఇత్యాది పురుషులన్నింటికి కర్తయైయున్నది. సూర్యుడు ఇత్యాది అధిష్ఠానదేవతలు ప్రాణముయొక్క విభేదములేయుని మరియొక శ్రుతి ప్రకరణముచే మనకవగతమగుచున్నది. 'కతమ ఏకో దేవ ఇతిప్రాణ ఇతి స బ్రహ్మత్యదిత్యాచక్షతే' (బృ. ఉ. 3-9-9).

లేదా ఈ వాక్యము జీవుడే జ్ఞేయపదార్థముగా సూచించును. ఉపవాక్యము నందు జీవునిఁగూర్చిన అనుమాన చిహ్నము కలదు. 'తద్యథా శ్రేష్ఠి సైర్భుంక్తే యథావాః శ్రేష్ఠినం స్వాభుంజంత ఏవమేవైష ప్రజ్ఞాత్మై తైరాత్మభిర్భుంక్తే ఏవమేవైత ఆత్మన ఏతమాత్మానం భుంజంతి' (కౌ. బ్రా. 4-20). జీవుడు ప్రాణమున కాధారమై ప్రస్తుతవాక్యము జీవునిఁగాని, లేక ముఖ్యప్రాణమునుఁగాని సూచించునేఁగాని, అనుమాన ప్రమాణము లేనందుచే పరమేశ్వరుని సూచింపదని మేము నిశ్చయింతుము.

ఈ సూత్రము వీటినన్నింటిని నిరాకరించి ప్రకరణములోని కర్త బ్రహ్మమును సూచించుననని పలుకును. ఏలననగా 'నేను నీకు బ్రహ్మమునుఁ గూర్చి ప్రబోధింతున'ని చెప్పఁబడుటచే ఇచ్చట బ్రహ్మమే చర్చనీయంశమైయున్నది. మఱియు 'ఇది' అనగా ప్రపంచమే అతని కార్యమైయున్నది. దీనిచే 'ఏషః' అనగా బ్రహ్మమేయని స్పష్టమగుచున్నది.

ప్రపంచము పేర్కొనఁబడుటచే కౌషీతకీ బ్రాహ్మణములోని వాక్యము పరబ్రహ్మమునే సూచించును. ప్రపంచమును సృష్టించినవాడు పరమేశ్వరుడగుటచే, అతని కార్యము ప్రపంచమని చెప్పఁబడును.

కావున కర్త ప్రాణముఁగాని, జీవుడుఁగాని కాదు, కాని పరమేశ్వరుడేనై యున్నాడు. ప్రపంచమునకు కర్త పరమేశ్వరుడేయని వేదాంతగ్రంథములన్నియును నిశ్చయించియున్నవి.

## 1-4-17 జీవముఖ్యప్రాణలింగాన్నేతిచేత్తద్ వ్యాఖ్యాతమ్.

పై వాక్యములోని 'పదార్థమ'ను శబ్దముచేతను మఱియు జీవుడు, ముఖ్యప్రాణముయొక్క అనుమాన ప్రమాణముచేతను ఇచ్చట బ్రహ్మము సూచింపఁబడలేదని పలికినచో, ఆ విషయ మితఃపూర్వమే వివరింపఁబడిదని మేము సమాధానము నొసంగుదుము.

జీవ = జీవుడు, ముఖ్యప్రాణ = ముఖ్యప్రాణము, లింగాత్ = అనుమాన చిహ్నములచే, న ఇతి = ఇట్లు కాదని, చేత్ = ఒకవేళ, తత్ = అది, వ్యాఖ్యాతమ్ = ఇతః పూర్వమే వివరింపఁబడినది.

16వ సూత్రమునకు ఆక్షేపణ చెప్పఁబడి, ఖండింపఁబడినది. 1-1-31 వ సూత్రమునందీ ఆక్షేపణ ఇతఃపూర్వమే నివారింపఁబడినది.

1-1-31వ సూత్రములోని ఇంద్రప్రతర్దన సంవాదమునందీ ఆక్షేపణ చెప్పఁబడి, దానికి సమాధానమొసంగఁబడినది. అచ్చటి వివాదములన్నియును ఇచ్చట కూడా వర్తించును. ఒక ప్రకరణములోని ఆద్యంత వాక్యములలో బ్రహ్మమును సూచించుచు, వ్యాఖ్యానింపఁబడినప్పుడు జీవుడు, లేక ప్రాణము మున్నగు ఇతర విషయములను సూచించు అనుమాన చిహ్నములు కూడా ప్రధాన

విషయమున కనుగుణముగా వ్యాఖ్యానింపఁ బడవలయునను విషయమచ్చట చెప్పఁబడినది.

ఇచ్చట కూడా 'నీవు బ్రహ్మముఁగూర్చి చెప్పుమందువా?' అను ప్రారంభవాక్యమునందు బ్రహ్మముఁగూర్చి సూచింపబడినది. దుర్గుణముల నన్నింటిని జయించి దీనినెవ్వడు గుర్తెఱుంగునో, అట్టివాడు జీవులన్నింటియందు ప్రాధాన్యతను, శ్రేష్ఠత్వమును మఱియు ఔన్నత్యము నొందును' అనునది చరమ వాక్యము. ఈ విధముగా ఆద్యంత వాక్యములు బ్రహ్మమునుఁ గూర్చియే సూచించుచున్నవి. ఒకవేళ ప్రకరణములోని మధ్యభాగమునందు జీవుడు, లేక మరియొక విషయమును సూచించు చిహ్నమున్నచో, ఆ వాక్యమునందు వైరుద్ధ్యము లేకుండా బ్రహ్మమును సూచించునట్లుగనే వ్యాఖ్యానింపఁబడవలయును.

1-1-31వ సూత్రమునందీ విషయము చెప్పఁబడిన కారణముచే ఇది పునరుక్తియనఁబడజాలదు. ఏలననగా అక్రమ వ్యాఖ్యానమునకు గుఱియగుచున్న 'కర్మ' శబ్దమిచ్చట ముఖ్యముగా చర్చింపఁబడినది. కావున ఈ యధికరణము నిశ్చయముగా క్రొత్త విషయమునుఁ గూర్చి మనకు ప్రబోధించుచున్నది.

'ప్రాణబంధనం హి సోమ్యమనః' (ఛాం. ఉ. 6-8-2) అను వాక్యములోని ప్రాణశబ్దము బ్రహ్మమును సూచించును.

## 1-4-18 అన్యార్థంతు జైమినిః ప్రశ్న వ్యాఖ్యానాభ్యామపి చైవమేకే.

శంకాసమాధాన కారణముచే ప్రకరణములోని జీవుడు మరియొక ఉద్దేశ్యమును కలిగియుండుటను సూచించునని జైమిని తలంచును. ఇంతేకాకుండా వాజసనేయులు కూడా తమ ప్రకరణమునందిట్లు పఠింతురు.

అన్యార్థం = మరియొక ఉద్దేశ్యముచే, తు = కాని, జైమినిః = జైమిని, ప్రశ్న వ్యాఖ్యానాభ్యాం = శంకాసమాధానములచే, అపి = కూడా, చ =మఱియు, ఏవం = ఈ విధముగా, ఏకే = కొన్ని శ్రుతులు.

16వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

జీవుని సూచన మరియొక ఉద్దేశ్యమును కలిగియున్నది. అనగా దాని లక్ష్యము బ్రహ్మమును సూచించుటయేనై యున్నది.

నిద్రించుచున్న మనుజుని మేల్కొలిపి, ఆత్మ ప్రాణమునకు భిన్నమైయున్నదని అజాతశత్రువు బాలాకికి ప్రబోధించిన అనంతరమాతడు ఈ క్రింది విధముగా ప్రశ్నించును. 'యమేవై ష ఏతద్బాలాకే పురుషోఽశ యిష్టయత్రైతదభూద్యత ఏతదాగాత్' (కౌ. ఉ. 4-19). ఈ ప్రశ్నలు స్పష్టముగా జీవునికి భిన్నమైన ఒకానొక పదార్థమును సూచించును. సమాధానము కూడా ఆ విధముగానే యున్నది. 'సుషుప్తియందు జీవుడు బ్రహ్మమునందు లీనమగును.' (కౌ. ఉ. 4-20).

గాఢనిద్రయందున్నప్పుడాతడు స్వప్నమునుఁగాంచడు. అప్పుడాతడు కేవలము ప్రాణముతో ఐక్యమునొందును. మఱియు 'ఆ యాత్మనుండి ప్రాణములన్నియును ఉత్పన్నమగును. ఆయా ప్రాణముల నుండి ఆయా దేవతలు, ఆయా దేవతల నుండి ఆయా లోకములు కలుగును.'

ఈ సంభాషణ బృహదారణ్యకమునందున్నది. 'విజ్ఞానమయ' శబ్దముచే ఇది స్పష్టముగా జీవుని సూచించి, దానిని పరమాత్మతో విభిన్న మొనర్చును. 'విజ్ఞానమయాత్మ ఎచ్చటుండెను? అతడెచ్చట నుండి తిరిగివచ్చెను?' (బృ. ఉ. 2-1-16). తదనంతర మీ ప్రశ్నకు ఈ క్రింది సమాధానమొసంగఁబడెను. 'అథయదిదమస్మిన్ బ్రహ్మపురేదహరం పుండరీకం వేశ్మదహరోఽస్మిన్నంతరాకాశ స్తస్మిన్యదం త స్తదన్వేష్టవ్యంతద్వావ విజిజ్ఞాసితవ్యమితి' (ఛాం. ఉ. 8-1-1).

# 6. వాక్యాన్వయాధికరణము

## (19-22 సూత్రములు)

### 1-4-19 వాక్యాన్వయాత్.

వాక్యములు సంబంధించిన అర్థముచే చూడఁబడునట్టి, శ్రవణ మొనర్పబడునట్టి ఆత్మయే పరమాత్మయని తెలియవలయును.

వాక్యాన్వయాత్ = వాక్యములకు సంబంధించినట్టి అర్థముచే.

బృహదారణ్యకములోని ఒక వాక్యమిప్పుడు చర్చింపబడుచున్నది.

అన్వయక్రమము ననుసరించిన అధ్యయనముచే పరమాత్మయే సూచింపఁబడు విషయము స్పష్టమగుచున్నది.

బృహదారణ్యకములోని మైత్రేయీబ్రాహ్మణమునందీ క్రింది వాక్యము కలదు.

'నవా అరే పత్యుః కామాయ పతిః ప్రియోభవత్యాత్మన స్తుకామాయ పతిః ప్రియో భవతి, ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యోమంతవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయ్యాత్మని ఖల్వరే దృష్టేశ్రుతేమతే విజ్ఞాత ఇదం సర్వం విదితమ్' (బృ. ఉ. 4-5-6).

ఇచ్చట చూడఁబడు మఱియు వినఁబడు పదార్థము జీవాత్మయా? లేక పరమాత్మయా? యను సంశయము కలుగును

పూర్వపక్షి ఇట్లనును : పతిమున్నగు ప్రియమైన వస్తువులచే ఆత్మ సూచింపఁబడుటచే, ఇది భోక్తను సూచించును. దీనిచే ఈ ప్రకరణము జీవాత్మను సూచించునని తెలియుచున్నది.

ఈ సూత్ర మీ విషయమును ఖండించి ఈ వాక్యము పరమాత్మను సూచించును, కాని జీవాత్మను కాదని పలుకును. ఈ విభాగమునందంతటను బ్రహ్మమే చర్చింపఁబడినది. మైత్రేయి తన పతియైన యాజ్ఞవల్క్యునితో ఇట్లనును, 'నేను అమృతత్వమునుఁబడయఁజాలని ధనముతో నాకేమి పని? నా ప్రాణనాథుడైన మీకు తెలిసిన విషయమునే నాకు ప్రబోధింపుడు'. అప్పుడు యాజ్ఞవల్క్యుడామెకు ఆత్మజ్ఞానమునుఁ గూర్చి ప్రబోధించెను. కేవలము పరమాత్మజ్ఞానముచేతనే అమృతత్వము పొందఁబడునని శ్రుతిస్మృతులు పలుకుచున్నవి. యాజ్ఞవల్క్యుడీ ప్రకరణము ముగించుచు 'ఏతావదరేఖల్వమృతత్వమ్'అని పలుకును.

అమృతత్వము పరమాత్మ, లేక పరబ్రహ్మజ్ఞానముచే పొందఁబడునేఁగాని జీవాత్మజ్ఞానముచే పొందఁబడదు. కావున కేవలము బ్రహ్మమే ప్రస్తుత పరిచ్ఛేదమునకు విషయమైయున్నది. శ్రవణ మనన నిదిధ్యాసనల ద్వారా బ్రహ్మము మాత్రమే చూడఁబడవలయును, లేక సాక్షాత్కరింపఁబడవలయును.

పదార్థములు, ఇంద్రియములు, మనస్సుతోకూడిన ఈ సమస్త ప్రపంచమునకు ఆత్మయే కేంద్రమైయున్నదనియు, దానికి బాహ్యాభ్యంతరములు లేవనియు, అది జ్ఞానమునకు గనివంటిదనియును యాజ్ఞవల్క్యుడు ప్రబోధించెను. వీటన్నింటిచే చూడఁబడునది. శ్రవణమొనర్పఁబడునది పరమాత్మయేనైయున్నదని శ్రుతి ప్రబోధించుచున్నదను విషయము సుస్పష్టమగుచున్నది.

ఇంతేఁగాక ఆత్మజ్ఞానముచే సమస్తము తెలియఁబడునని ఈ ప్రకరణము పలుకుచున్నది. అంతవంతుడగు జీవుని జ్ఞానముచే సమస్తము తెలియఁబడుటెట్లు? కావున ఆత్మ, బ్రహ్మమేయను విషయము సువిదితమగుచున్నది.

## 1-4-20 ప్రతిజ్ఞా సిద్ధేర్లింగ మాశ్మరథ్యః

జ్ఞేయవస్తువు జీవుడే యను విషయము ప్రతిపాదమునకు చిహ్నమైయున్నదని ఆశ్మరథ్యుడు తలంచును.

ప్రతిజ్ఞాసిద్ధేః = ప్రతిపాదన నిరూపణచే, లింగమ్ = చిహ్నము, ఆశ్మరథ్యః = ఆశ్మరథ్యుడను ముని.

19 వ సూత్రమున కనుగుణమగు వాదమొనంగబడినది. పరమకారణమగు బ్రహ్మము యొక్క అంశమై యున్న జీవుడు బ్రహ్మమున కభిన్నుడై యున్నాడని సూచింపఁబడినది. కావున కారణమైయున్న బ్రహ్మము తెలియఁబడినప్పుడు సమస్తము తెలియఁబడును.

ఒకవేళ జీవుడు బ్రహ్మమునకు భిన్నుడైయున్నచో, బ్రహ్మమును తెలిసికొనుట ద్వారా సమస్తము తెలియఁబడకుండెడిది. చేసిన ప్రతిజ్ఞ నెఱవేర్పఁబడుటకై జీవుడు పరమాత్మ కభిన్నుడైయున్న విషయము ప్రారంభ భూమికకు లక్ష్యమైయున్నది. జీవబ్రహ్మైక్యతచే 'ఆత్మని విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి' 'ఇదం సర్వం యదయమాత్మా' అను సిద్ధాంతము ప్రతిపాదింపఁబడును.

పై వాక్యములు జీవబ్రహ్మైక్యతను నిరూపించునని ఆశ్మరథ్యుని అభిప్రాయము. ఏలననగా అప్పుడు మాత్రమే 'బ్రహ్మజ్ఞానముచే సమస్తము పొందఁబడున' (1-4-20) నెడి ప్రతిజ్ఞ నెఱవేర్పఁబడును.

అగ్నియొక్క స్వభావమును కలిగియుండుటచే అగ్నినుండి ఉద్భవించినట్టి మిణుగురులు అగ్నికి పూర్తిగా భిన్నమైనవి కావు. అవి అగ్నికి పూర్తిగా అభిన్నమైనవి కూడా కావు. ఏలననగా అవి అగ్ని నుండి పరస్పరము భిన్నములై యుండెడివి కావు. అదే విధముగా బ్రహ్మము నుండి జనించినట్టి జీవులు కూడా బ్రహ్మమునకు పూర్తిగా భిన్నమైనవి కావు. ఏలననగా దీనిచే అవి చైతన్యరహితములనవలసి వచ్చును. ఇఁక అవి బ్రహ్మమున కభిన్నమైనవియు కావు. అట్లగునేని అవి పరస్పర భిన్నతను కలిగి లేకుండెడివి. మఱియు అవి బ్రహ్మముచే తాదాత్మ్యము నొందియుండుటచే, అవి సర్వజ్ఞములై యుండెడివి. కావున వాటికి ప్రబోధమనావశ్యకమై యుండెడిది. కాబట్టి జీవులు ఒకింత బ్రహ్మమునకు

భిన్నములనియు, ఒకింత బ్రహ్మమున కభిన్నములనియు చెప్పవలసియుండును. ఆశ్మరథ్యుని ఈ సిద్ధాంతము భేదాభేదవాదమ'ని చెప్పఁబడును. ఇది ఆశ్మరథ్యమునియొక్క అభిప్రాయమై యున్నది.

## 1-4-21 ఉత్క్రమిష్యత ఏవం భావాదిత్యౌడులోమిః

జీవుడు శరీరము నుండి ఉత్క్రమించునప్పుడు  పరమాత్మ స్వరూపుడుగా మారుటచే జీవబ్రహ్మైక్యమునే  ప్రారంభభూమిక సూచించునని ఔడులోమి తలంచును.

ఉత్క్రమిష్యతః = శరీరమునుండి నిర్గతుడగువానియొక్క , ఏవంభావాత్ = ఈ స్థితిచే, ఇతి = ఈ విధముగా, ఔడులోమిః = ఔడులోమి యను మహర్షి.

19వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

శరీరము, ఇంద్రియములు, మనస్సనెడి ఉపాధులతోకూడియున్న జీవుడు ధ్యానము మఱియు జ్ఞానముచే ముక్తి నొందును. శరీరమునుండి నిర్గతుడైనప్పుడు అనగా శరీరస్మృతి లేనివాడై స్వతంత్రుడైనప్పుడాతడు బ్రహ్మముతో తాదాత్మ్యమునొందును. కావున అతడు పరమాత్మకభిన్నుడని చెప్పఁబడును. ఇది ఔడులోమియనెడి ఆచార్యుని మతమైయున్నది.

శ్రుతులయందు కూడా 'ఏవమేవైషసంప్రసాదోఽస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతిరుప సంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే' (ఛాం. ఉ. 8-12-3) అను వాక్యము కలదు. ముండకోపని షత్తిట్లు పలుకును. 'యథానద్యస్స్యంద మానాస్సముద్రేఽస్తంగచ్ఛంతి నామరూపే విహాయ, తథావిద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్' (ముం. ఉ. 3-2-8).

జీవుడు పరమాత్మకు పూర్తిగా భిన్నుడై యున్నాడు. అతడు శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధియనెడి నానారకములగు ఉపాధులచే సంకుచితుడై యున్నాడు. కాని జ్ఞాన ధ్యానములచే శుద్ధమొనర్పఁబడి శరీరమును త్యజించిన జీవుడు పరమాత్మతో ఐక్యము నొందుటకు వీలుండుటచే, అతడు బ్రహ్మమున కభిన్నుడైయున్నాడని ఉపనిషత్తులు పలుకును.  ముక్తినొందువరకు జీవుడు నిజముగా

భిన్నత్వమును కలిగియున్నను, ఉపనిషత్తు జీవుని భౌతికభూమికయగు అభిన్నత్వమును పేర్కొనును. అజ్ఞాన భూమికయందు జీవుడు మఱియు బ్రహ్మమునందు గల భేదము సత్యమనెడి సిద్ధాంతమును ఔడులోమి ప్రతిపాదించెను. ఇదియే 'సత్యభేదవాదమ'నఁబడును.

## 1-4-22 అవస్థితేరితి కాశకృత్స్నః

పరమాత్మ జీవాత్మస్థితియందుండుటచే ప్రారంభభూమిక ప్రారంభింపఁబడినదని కాశకృత్స్నముని తలంచును.

అవస్థితేః = ఉనికి కలిగియుండుటచే, ఇతి = ఈ విధముగా, కాశకృత్స్నః = కాశకృత్స్నముని.

19వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

స్వాభావికముగా జీవుడు బ్రహ్మమునకు పూర్తిగా భిన్నుడైయున్నాడు. ముక్తావస్థయందు జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యమునొందుట అసాధ్యము. కావున స్వయముగా పరమాత్ముడే జీవుని రూపమునందున్నాడని కాశకృత్స్నముని తలంచును. పరమాత్ముడు జీవుని రూపమునందును ఉనికి కలిగియుండుటచే, ప్రారంభభూమిక ఈ రెండింటి అభేదమును సూచించుట సాధ్యమగునని కాశకృత్స్నముని యొక్క అభిమతమైయున్నది.

జీవాత్య పరమాత్మ పూర్తిగా అభిన్నములై యున్నవి. అవిద్యాజనితములగు ఉపాధుల కారణముచే తాత్కాలిక భేదము కన్పట్టుచున్నది. భావాతీత దృష్టిననుసరించి ఈ భేదము అసత్యము, లేక మిథ్యయైయున్నది. కావున ఆత్మజ్ఞానము, లేక బ్రహ్మజ్ఞానముచే సమస్తము తెలియబడుట సాధ్యమగును.

'నేనీ పాణాత్మతో వాటియందు ప్రవేశించి, నామరూపములను ప్రకాశింపజేయుదునుఁగాక'! యనెడి బ్రాహ్మణవాక్యముచే పరమాత్మయే జీవుడుగా భాసించుచున్నాడను విషయము స్పష్టమగుచున్నది.

'అది తెలియఁబడినచో సమస్తము తెలియఁబడున'నెడి సిద్ధాంతము జీవాత్మ పరమాత్మలయొక్క అభిన్నత్వమును తెలుపుచున్నదని 20వ సూత్రము సూచించుచున్నది. జీవబ్రహ్మైక్యము, పరిశుద్ధమైన పూర్ణాత్మచే పరమాత్మ

పొందఁబడుటను సూచించునని 21వ సూత్రము వ్యక్తమొనర్చును. ఇప్పుడు కూడా పరమాత్మ జీవాత్మస్థితియందున్నదని 22వ సూత్రము తెలియజేయును. జీవాత్మపరమాత్మ యందు లయింపదు. మన పరిచ్ఛిన్న భావము మఱియు నానాత్వభ్రాంతి తొలగిననేఁగాని, జీవుడు నిజమునకు శాశ్వతముగా పరమాత్మ స్వరూపుడు కాజాలడు.

ఈ త్రివిధాభిప్రాయములలో కాశకృత్స్నుని అభిప్రాయము శాస్త్రసమ్మతమై యున్నది. ఏలననగా శ్రుతులన్నింటి ప్రబోధమునకిది అనురూపమైయున్నది.

ఆశ్మరథ్యుని సిద్ధాంతము ననుసరించి జీవాత్మపరమాత్మకు పూర్తిగా భిన్నుడు కాడు. 'ప్రతిజ్ఞను నెఱవేర్చుటకై' అని వ్యక్తమొనర్చుట ద్వారా అతని సిద్ధాంతము జీవాత్మ పరమాత్మల మధ్య కార్యాచరణ సంబంధము కలదని సూచించును. ఈ ప్రతిజ్ఞ రెండు వాక్యములలో చేయఁబడినది. 'ఆత్మ తెలియఁబడినప్పుడు, ఇది యంతయు తెలియఁబడును'. మఱియు 'ఈ సమస్తము ఆత్మయే' ఆశ్మరథ్యుని మతము ననుసరించి జీవాత్మ పరమాత్మయొక్క అంశమైయున్నది. కావున కారణము తెలియఁబడినచో, సమస్తము తెలియఁబడును. జీవాత్మ పరమాత్మలు అభిన్నమైయుండునేని 'ఒకటి తెలియఁబడినచో సమస్తము తెలియఁబడున'నెడి ప్రతిజ్ఞ నెఱవేరుట కవకాశము కలదు.

ఔడులోమి దృష్టి ననుసరించి రెండింటి భిన్నాభిన్నతలు స్థితిభేదముపై ఆధారపడి యుండును. జీవుడు కేవలము పరమాత్మయొక్క ఒక అవస్థయైయున్నాడు. కావున ఆశ్మరథ్యుడు మఱియు ఔడులోమియొక్క దృష్టులు నిలువజాలవు.

జీవత్వము అసత్యమైనది. అది అవిద్యయొక్క సృష్టి. నిజమునకు జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నాడు. మిథ్యమైన ఉపాధుల కారణముచే మనము సంకుచితులమై యున్నామనియు మఱియు బ్రహ్మమునకు భిన్నులమై యున్నామనియును అజ్ఞాన కారణముచే మనము భావించుచుందుము. నిజమునకు జీవాత్మకు జననమరణములు లేవు. ఒకవేళ జీవత్వము నిజమేయైనచో, అది నశింపఁజేయఁబడజాలదు మఱియు ముక్తి అసాధ్యమే యగును . ఒకవేళ జీవాత్మ పరమాత్మతో తాదాత్మ్యము నొందునేని, అది ముక్తావస్థ నొందునప్పుడు జీవత్వము మిథ్యయగును . అగ్ని నుండి మిణుగురులవలె పరమాత్మ నుండి

జీవుల సృష్టి నిజమైనది కాదు. అది కేవలము ఉపాధుల ననుసరించి పరికింపఁ బడవలసియుండును.

పూర్వపక్షి ఇట్లనును : 'ఈ భూతములచే సృష్టింపఁబడినవాడై అతడు మరల వాటితో నశించును. అతడు నశించిన పిదప అతనికి జ్ఞానమనునది ఉండదు.' అను వాక్యము జీవునియొక్క సర్వనాశనము సూచించునేఁగాని, అది పరమాత్మతో ఏకత్వము నొందుటను సూచింపదు.

ఇది అసంగతమని మా సమాధానము. జీవుడు శరీరమును వదలునప్పుడు సమస్తేంద్రియ జ్ఞానము నశించునని ఈ వాక్యము యొక్క భావము. కాని ఆత్మ నశించునని అర్థముకాదు. చైతన్యఘనమై శాశ్వతమై మార్పులేని ఆత్మ నిశ్చయముగా నశింపదనియు, కాని సత్యమైన ఆత్మ జ్ఞానముచే అజ్ఞానజనితములగు భూతములు మఱియు ఇంద్రియములతోగల సంబంధము తొలగిపోవుననియును ఈ వాక్యము నిర్దేశించుచున్నది.

జీవాత్మపరమాత్మలు నామమాత్రముగా విభేదించియున్నవి. పరిపూర్ణ జ్ఞానముచే ఈ రెండింటియొక్క పూర్ణైకత్వము సిద్ధించుననుట నిశ్చయము. ఆత్మ నానా విధములగు నామములచే పిలువఁబడినను, అది ఏకమేనై యున్నది. పూర్ణజ్ఞానము మోక్షమునకు ద్వారము వంటిది. మోక్షము అశాశ్వతమైన ఒకానొక కార్యజనిత పదార్థము కాదు. అది శాశ్వతమైనది. మఱియు అద్వితీయము, అజరము, అమరము, విశుద్ధమైయున్న బ్రహ్మమున కభిన్నమైయున్నది. జీవాత్మ పరమాత్మలకు మధ్య భేదమున్నదని పలుకువారు వేదాంతగ్రంథసారము నాఘ్రాణింపనివారే యగుదురు.

# 7. ప్రకృత్యధికరణము

# (23-27 సూత్రములు)

## 1-4-23 ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాంతానుపరోధాత్

శ్రుతియందు పేర్కొనఁబడిన ఉపమానములు మఱియు ప్రతిపాదనకు విరోధము లేకుండుటచే బ్రహ్మము ఉపాదాన కారణము కూడానైయున్నది.

ప్రకృతిః = ఉపాదాన కారణము, చ =మఱియు, ప్రతిజ్ఞా = ప్రతిపాదనము, దృష్టాంత = ఉపమానములు, అనుపరోధాత్ = విరోధము లేకుండుటచే.

బ్రహ్మమీ విశ్వమునకు నిమిత్త కారణము మఱియు ఉపాదాన కారణము కూడానై యున్నదను విషయమును ఈ సూత్రము ప్రతిపాదించును.

ఈ విశ్వముయొక్క సృష్టి స్థితి ప్రళయములు దేనినుండి కలుగునో, అదియే బ్రహ్మమని నిర్వచింపఁబడినది. ఇచ్చట బ్రహ్మము మట్టి, లేక బంగారమువలె ఉపాదాన కారణమా? లేక కుమ్మరివాడు, లేక స్వర్ణకారునివలె నిమిత్తకారణమా? యను సంశయము కలుగును.

పూర్వపక్షి ఇట్లనును : 'స ఈక్షాంచక్రే, సప్రాణమసృజత' (ప్ర. ఉ. 6-3-4) అను మంత్రముచే బ్రహ్మము ప్రపంచమునకు కేవలము నిమిత్తకారణమై యున్నది. కుమ్మరివాని ఆలోచనవంటి నిమిత్తకారణముచేతనే కర్మ ఉద్భవించునని ఈక్షణానుభవములు సూచించును. కావున సృష్టికర్త కూడా ఇట్టివాడేనై యున్నాడని నుడువుట సమంజసమై యున్నది. సృష్టికర్త 'ప్రభువు'గా పేర్కొనఁబడెను. రాజులవంటి ప్రభువులు నిమిత్త కారణములే యగుదురుకదా! కావున పరమేశ్వరుడు కూడా నిమిత్తకారణముగనే పరిగణింపఁబడవలయును.

పూర్వపక్షియొక్క ఈ బాహ్యదృష్టిని ఈ సూత్రము ఖండించును. బ్రహ్మ మీ విశ్వమునకు ఉపాదాన కారణము కూడానైయున్నది. 'చ' యను శబ్దము బ్రహ్మము నిమిత్తకారణము కూడానైయున్నదను విషయమును సూచించును. 'తమాదే శమప్రాక్ష్యోయేనాశ్రుతం శ్రుతంభవత్యమతం మత మవిజ్ఞాతం విజ్ఞాతమితి' (ఛా. ఉ. 6-1-3) అను ప్రకరణము ద్వారా బ్రహ్మము విశ్వమునకు ఉపాదాన

కారణమైనప్పుడు మాత్రమే బ్రహ్మజ్ఞానముచే సమస్తము తెలియబడుననుట సాధ్యమగును. సామాన్యముగా లోకమునందు వడ్లవాడు తాను నిర్మించిన గృహమునకు భిన్నుడై యుండుట చూడcబడుటచే, కార్యములు తమ నిమిత్త కారణమునకు భిన్నములు కావని తెలియుచున్నది.

'యథాసోమ్యైకేనమృత్పిండేన సర్వంమృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారంభణం వికారోనామధేయం మృత్తికేత్యేవ సత్యమ్' (ఛాం. ఉ. 6–1–4) అను ఉపమానముల ద్వారా బ్రహ్మ మీ విశ్వమున కుపాదానకారణమై యున్నదని స్పష్టమగుచున్నది; లేనిచో ఈ యుపమానములు అర్థవిహీనములగును.

ఇతర స్థలములలో కూడా ప్రతిజ్ఞాపూర్వకములను సిద్ధాంతములు చెప్పcబడినవి. ఉదాహరణమునకు 'కస్మిన్ను భగవోవిజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి' (ముం. ఉ. 1–1–3). 'ఆత్మనిఖల్వరే దృష్టే శ్రుతేమతే విజ్ఞాత ఇదం సర్వం విదితమ్' (బృ.ఉ. 4–5–6). ఇట్టి ప్రతిజ్ఞాపూర్వక సిద్ధాంతములు మఱియు దృష్టాంతవాక్యము లన్నియును శ్రుతులలో కానcబడుటచే, బ్రహ్మము ఉపాదానకారణము కూడానై యున్నదని నిరూపింపcబడుచున్నది.

బ్రహ్మమునకు మించిన మార్గదర్శకుడు మరియొకడు లేడు. కావున బ్రహ్మము నిమిత్తకారణము కూడానైయున్నాడని నిశ్చయింపవలసియుండును. మట్టిముద్దలు మఱియు స్వర్ణఫలకములు తాము పాత్రలుగాను, ఆభరణములుగాను మారుటకై తమకు అన్యమైయున్న నిమిత్తకారణములగు కుమ్మరివాడు మఱియు స్వర్ణకారునిపై ఆధారపడియుండును. కాని ఉపాదానకారణమగు బ్రహ్మమునకు బాహ్యముగా ఉపాదానకారణమున కావశ్యకమైయున్న మరియొక నిమిత్త కారణములేదు. ఏలననగా సృష్టికి పూర్వము అద్వితీయమైన ఏకైక బ్రహ్మమే శేషించి యుండెనని శ్రుతి పలుకుచుచన్నది. మరియొకటేమియు లేనప్పుడు బ్రహ్మమును మించిన వేఱొక నిమిత్తకారణమేమైయుండును?

ఒకవేళ ఉపాదానకారణమునకు భిన్నమైన సూక్ష్మమైన సూత్రమొకటి కలదని అంగీకరించినచో, ఒకే పదార్థముచే సమస్త పదార్థములు తెలియcబడజాలకుండును. తత్ఫలితముగా ప్రామాణిక సిద్ధాంతములు మఱియు దృష్టాంతము లన్నియును అర్థరహితములగును.

కావున మరియొక నియామకుడు లేకుండుటచే బ్రహ్మమే నిమిత్తకారణమై యున్నది. విశ్వసృష్టికి తోడ్పడునట్టి మరియొక పదార్థము లేకుండుటచే, బ్రహ్మము ఉపాదానకారణము కూడానైయున్నది.

ప్రతిపాదనమునందును, దృష్టాంతములయందును సామ్యతను స్థాపించుటకై బ్రహ్మమీ ప్రపంచమునకు ఉపాదానకారణమై యున్నదని మేము నిశ్చయింతుము. బ్రహ్మము నిమిత్తకారణముకూడా నైయున్నదని శ్రుతి నొక్కిచెప్పుచున్నది.

## 1-4-24 అభిధ్యోపదేశాచ్చ.

సృష్టించుటకై పరమాత్ముడు సంకల్పించిన కారణముచే అతడు ఉపాదాన కారణమైయున్నాడు.

అభిధ్య = సంకల్పము, ఉపదేశాత్ = ప్రబోధకారణముచే, చ = కూడా.

23వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది. 'నేను అనేక మగుదునుఁగాక! నేను వృద్ధినొందుదునుఁగాక! అని అతడు సంకల్పించెను. ఈ ప్రకరణమునందుఁగల సంకల్పము మఱియు నిధిధ్యాసనలచే బ్రహ్మము నిమిత్తకారణమైయున్నదని తెలియుచున్నది.

'నేననేకమగుదునుఁగాక!' యను వాక్యముచే బ్రహ్మము స్వయముగా అనేకముగా మారెనని స్పష్టమగుచున్నది. కావున అతడు ఉపాదానకారణము కూడానైయున్నాడు.

అతడు అనేకముగా అనగా విశ్వముగా వ్యక్తమగుటకు సంకల్పించెను. అతడు స్వయముగా తననుండి ఈ విశ్వమును సృష్టించుటకు సంకల్పించెను. దీనిచే అతడీ సృష్టికి ఉపాదానకారణము యఱియు నిమిత్తకారణము కూడానై యున్నాడని నిరూపింపఁబడుచున్నది.

## 1-4-25 సాక్షాచ్చోభయామ్నానాత్.

విశ్వముయొక్క సృష్టిప్రళయములు రెండింటికి బ్రహ్మమే నిమిత్తోపాదాన కారణమైయున్నదని శ్రుతి పేర్కొనుటచే.

సాక్షాత్ = ప్రత్యక్షము, చ = మఱియు, ఉభయామ్నానాత్ = రెండింటిని శ్రుతి పేర్కొనుటచే.

23వ సూత్రమును బలపరచు వాదము కొనసాగుచున్నది. బ్రహ్మము సర్వసామాన్యముగా అంతటికి నిమిత్తోపాదన కారణమైయున్నదని ఈ సూత్రము నిరూపించును.

ఒక వస్తువుదేని నుండి ఉద్భవించి, తిరిగి దేనియందు అస్తమించి లయించునో అదియే నిమిత్తోపాదాన కారణమని చెప్పఁబడును. ఇది సుప్రసిద్ధ విషయమైయున్నది. దృష్టాంతముగా పృథ్వి- బియ్యము, బార్లివంటి పదార్థములకు ఉపాదానకారణమై యున్నది. 'సర్వాణిహవా ఇమానిభూతాన్యాకాశాదేవ సముత్పద్యంత ఆకాశం ప్రత్యస్తంయంతి' (ఛాం. ఉ. 1-9-1).

'యతోవా ఇమాని భూతాని జాయంతే, యేనజాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసం విశంతి, తద్విజిజ్ఞాసస్వ, తద్బ్రహ్మేతి' (తై. ఉ. 3-1) ఈ యుపనిషద్వాక్యములచే బ్రహ్మము నిమిత్తము మఱియు ఉపాదాన కారణము కూడానై యున్నదను విషయము స్పష్టమగుచున్నది.

సూత్రములోని 'సాక్షాత్' శబ్దముచే మరియొక ఉపాదాన కారణములేదనియు, ఈ సమస్తము ఆకాశము (బ్రహ్మము) చేతనే ఉత్పన్నమైనదనియును తెలియుచున్నది. కార్యములు తమయొక్క ఉపాదానకారణము వినా మరియొకదానియందు తిరిగి లయింపవను విషయమును వీక్షణానుభవములు మనకు ప్రబోధించుచున్నవి.

## 1-4-26 ఆత్మకృతేః

అది స్వయముగా మార్పునొంది సృష్టింపఁబడుటచే, బ్రహ్మమీ ప్రపంచమునకు ఉపాదాన కారణమైయున్నది.

ఆత్మకృతేః = స్వయముగా సృష్టింపఁబబడినది.

## 1-4-27 పరిణామాత్.

పరిణామాత్ = మార్పునొందుట ద్వారా.

23వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది. 'తాదాత్మానం స్వయమ కురుత'యను వాక్యము (తై. ఉ. 2-7) నందు కలదు. దీనిచే బ్రహ్మము స్వయముగా మార్పునొందుట ద్వారా తన నుండియే ఈ విశ్వము సృష్టింపఁబడినదని తెలియుచున్నది. దీనిచే ఆత్మ కర్తయు, కర్మయునై యున్నదని విశదమగుచున్నది.

కావున అతడే కర్తయు, కర్మయునై యున్నాడు. పరిణామరూపముచే అతడీ సృష్టిగా మారును.

'ఆత్మ' శబ్దము తాను వినా మరియొక నిమిత్తకారణము లేదని సూచించుచున్నది. ఈ మార్పు వివర్తమని శ్రీ శంకరాచార్యులవారి మతము. ఇది సత్యమని శ్రీ రామానుజాచార్యులవారి మతము. ప్రపంచము అశాశ్వతమగుటచే ఇది అసత్యమైయున్నది. ఇది కేవలము భౌతికమైయున్నది. ఇది కేవలము భౌతికమైన అస్తిత్వమును కలిగియుండుటచేతను, బ్రహ్మమునకు వేఱుగా ఉనికి లేనిదగుట చేతను ఇది మిథ్యయని చెప్పఁబడును.

## 1-4-28 యోనిశ్చహి గీయతే.

మఱియు బ్రహ్మమే మూలమని చెప్పఁబడుటచే.

యోనిః = ఉత్పత్తికి మూలము, చ = మఱియు, హి = ఏలననగా, గీయతే = చెప్పఁబడుచున్నది.

23వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది. శ్రుతియందాతడీ విశ్వమునకు మూలమని చెప్పఁబడుటచేత కూడా బ్రహ్మమీ విశ్వమునకు ఉపాదానకారణమైయున్నాడు.

'కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్' (ముం. ఉ. 3-1-3) అనియు 'యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరాః' (ముం. ఉ. 1-1-6) అనియు ముండకోపనిషత్తు నుడువును.

'అచింత్యమవ్యక్తమనంతరూపం, శివం, ప్రశాంత మమృతం బ్రహ్మయోనిం, తమాదిమధ్యాంత విహీనమేకం విభుం చిదానంద మరూప మద్భుతమ్' అతడు చింతింపనలవికానివాడు, అనిర్వచనీయుడు, అనంతమైన రూపము కలవాడు. శ్రేష్ఠుడు, ప్రశాంతస్వరూపుడు, అమరుడు, విశ్వమునకు ఉత్పత్తిస్థానము, ఆది మధ్యాంతరహితుడు, అద్వితీయుడు, సర్వవ్యాపకుడు, చిదానందరూపుడు, అగోచరుడు మఱియు అద్భుతుడై యున్నాడు. దీనిచే బ్రహ్మమీ ప్రపంచమునకు ఉపాదానకారణమైయున్నాడని తెలియుచున్నది.

'పృథ్వి– చెట్లు చేమలకెట్లు యోని, లేక గర్భమై' యున్నదో అట్లే ఈ యోని, లేక గర్భమను శబ్దమెల్లప్పుడు ఉపాదానకారణమును సూచించును. ఈ విధముగా బ్రహ్మమీ విశ్వమునకు ఉపాదానకారణమై యున్నదను విషయము నిరూపింపఁబడినది.

# 8. సర్వవ్యాఖ్యానాధికరణము.

## 1–4–29. ఏతేనసర్వేవ్యాఖ్యాతావ్యాఖ్యాతాః

ఈ విధముగా వేదాంత గ్రంథములకు విరుద్ధములైయున్న ప్రపంచోత్పత్తినిఁగూర్చిన సిద్ధాంతము లన్నియును వివరింపఁబడినవి.

ఏతేన = ఇంతవరకు చెప్పఁబడిన దానిచే, సర్వే = అన్నియును, వ్యాఖ్యాతాః = వివరింపఁబడినది.

ఈ సూత్రముతో తర్కమంతయును పరిసమాప్తమైనది.

ప్రపంచకారణమైయున్న బ్రహ్మమును గూర్చిన శ్రుతి ప్రబోధము ఇంతవరకుఁగల సూత్రముల యందొసంగఁబడినది.

ప్రపంచకారణము ప్రధానముకాదను సిద్ధాంతము ద్వారా అన్నియును ఖండింపఁబడినవి. సర్వాధికారిని ఓడించుట ద్వారా శేషించిన వారందఱును ఓడిపోవునట్లు, ప్రధాన తార్కికుని జయించుటద్వారా ఇతరులున్నూ జయింపఁబడినవారే యగుదురు. ఈ విధముగా సృష్టిని పరమాణువులకు మఱియు ఇతర సిద్ధాంతముల కారోపించువారందఱును అపజయము నొందినవారే యగుదురు.

రెండు విభిన్నకారణములనుఁగూర్చి పలుకు సిద్ధాంతములన్నియును ఖండింపఁబడినవి. అణుసిద్ధాంతము, తదితర సిద్ధాంతములన్నియును శాస్త్రసమ్మతములు కావు. అవి అనేక శ్రుతి ప్రమాణములకు విరుద్ధములై యున్నవి.

విశ్వమునకు కారణము ప్రధానమని అంగీకరించు సాంఖ్య సిద్ధాంతము 1–1–5 సూత్రము నుండి ఆరంభింపఁబడి, మరలమరల ఖండింపఁబడినది.

వేదాంత సిద్ధాంతమునకువలె కార్యకారణములయొక్క అభిన్నతను అంగీకరించుటచే ప్రధాన సిద్ధాంతమునకు, వేదాంత సిద్ధాంతమునకు

సామీప్యమునందున్నదని నుడువవచ్చును. మఱియు ఇది దేవలుడు మున్నగువారి వంటికొందఱు ధర్మసూత్రకారులచే అంగీకరింపఁబడియున్నది. అంతేకాకుండా శ్రుతులలోని కొన్ని వాక్యములు కొందఱు మందమతులకు ప్రధానమును సూచించునట్టి ఆనుమానిక చిహ్నములుగా కానఁబడును. ఈ కారణము లన్నింటిచే ప్రధాన సిద్ధాంతమును ఖండించుటకై వ్యాఖ్యాత ప్రత్యేకమగు ప్రయత్నము నొనర్చును. అతడు అణ్వాది ఇతర సిద్ధాంతములనుఁ గూర్చి ప్రత్యేకమగు శ్రద్ధను గైకొనలేదు.

'వ్యాఖ్యాతాః' అను పదముయొక్క ద్విరుక్తిచే ఈ యధ్యాయముయొక్క పరిసమాప్తి సూచింపఁబడినది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**ప్రథమాధ్యాయ చతుర్థపాదము**

**పూర్తియైనది.**

**ప్రథమాధ్యాయము సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## ద్వితీయాధ్యాయము

### 1వ పాదము

# అవిరోధాధ్యాయము

## పీఠిక

స్మృతిన్యాయ విరోధపరిహారము ప్రథమ పాదమునకు ముఖ్యవిషయమై యున్నది. స్మృతివిరోధము 1-3 సూత్రములు మఱియు 12వ సూత్రమునందున్నూ సాధింపబడినది. శేషించిన సూత్రములలో న్యాయ విరోధము పేర్కొనబడినది. రెండవపాదము నానావిధ దర్శనములను తమతమ భూమికలలోనే ఎదుర్కొని ఖండించినది. మూడు, నాలుగు పాదములు నానావిధ వేదాంత వాక్యముల యందున్న అసంగతములును, పరస్పరవిరుద్ధములునగు భావభూమికలను సమన్వయపఱచును. ఈ విధముగా అవిరోధమను శీర్షిక ఈ యధ్యాయమునకు తగియున్నది.

కుండలకు మన్ను మఱియు ఆభరణములకు సువర్ణమెట్లు ఉపాదాన కారణములైయున్నవో, అట్లే ఈ ప్రపంచమునకు సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడే మూలకారణమైయున్నాడని మఱియు బ్రహ్మమే ప్రథమకారణమైయున్నదనియును

ప్రథమ పాదము నిరూపించును. ఇది సమన్వయముచే నిరూపింపబడినది.

ఇంద్రజాలమునకై ఇంద్రజాలికుడెట్లు కారణమో, అట్లే ఈ విశ్వమునకు కారణము దీనికి పోషణకర్తయగు బ్రహ్మమేనైయున్నది. చతుర్విధప్రాణులు తిరిగి భూమియుండెట్లు లయించునో, అట్లే ప్రళయకాలమునందీ సృష్టింపబడిన జగత్తంతయు తిరిగి లయించును.

పరమాత్మయే ప్రాణులన్నింటి కాత్మయైయున్నదని ముందు నిరూపింపఁ బడినది.

శాస్త్ర ప్రామాణ్యము కాకుండుటచే ప్రధానము ప్రపంచమునకు కారణమను సిద్ధాంతము ప్రథమాధ్యాయమునందు నిషేధింపబడినది.

బ్రహ్మము ప్రథమకారణమను తార్కికసిద్ధాంత వాదములీ పాదమునందు ఖండింపఁబడినవి. అంతేకాకుండా ప్రధాన సిద్ధాంతము మఱియు అణు సిద్ధాంతములున్నూ స్మృతి ప్రామాణ్యములను వాదములు కూడా ఈపాదమునందు ఖండింపఁబడినవి.

# సారసంగ్రహము

ప్రధానము ప్రపంచమునకు కారణము కాదను విషయ మితఃపూర్వము శ్రుతి ప్రామాణ్యముగా నిరూపింపఁబడినది. చైతన్యవంతమైన బ్రహ్మము మాత్రమే ఈ విశ్వమునకు కారణమైయున్నదని వేదాంత గ్రంథములు ఏకముఖముగా వాకొనుచున్నవని ప్రథమాధ్యాయమునందు నిరూపింపఁబడినది. వేదాంతమునకు విరుద్ధములైన సిద్ధాంతములను ముఖ్యముగా సాంఖ్యసిద్ధాంతమును ప్రతిపాదించు శాస్త్రమొక్కటియు కానరాదనియున్నూ నిరూపింపఁబడినది.

శ్రుతి ప్రామాణ్యముచేఁగాక, కేవలము చింతనచే వేదాంత సిద్ధాంతమునకు విరుద్ధమైన నిషేధములను రెండవ అధ్యాయములోని మొదటి రెండు పాదములు ఖండించును. వేదాంతముతో సమానముగా ఏ యితర సిద్ధాంతమున్నూ సంతృప్తికరముగా సమన్వయింపఁబడనేరదని కూడా అవి మనకు నిరూపించును.

బ్రహ్మమే ఈ ప్రపంచమునకు కారణమైయున్నదని నిరూపించుటయేఁగాక, ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదము ఈ నిర్ణయమునకు వ్యతిరిక్తమైన అంశములనన్నింటిని నిషేధించును.

**1వ అధికరణము (1-2 సూత్రములు) :-** వేదాంత సిద్ధాంతము నంగీకరించుట ద్వారా స్మృతియందు పేర్కొనఁబడిన సాంఖ్యసిద్ధాంతము నిషేధింపఁబడుననెడి సాంఖ్యుల నిషేధమును ఖండించును. సాంఖ్యస్మృతి నంగీకరించుటద్వారా సాంఖ్యసిద్ధాంతమునకు వ్యతిరిక్తమైన మనుస్మృతి ఇత్యాదులను మేము నిషేధింపవలసి వచ్చునని వేదాంతము పలుకును. చైతన్యవంతుడగు సృష్టికర్తయైన బ్రహ్మము చేతనే ఈ విశ్వము జనించినదని ప్రబోధించు స్మృతులనుఁగూర్చియే వేదములు నొక్కివక్కాణించును. కాని సాంఖ్యస్మృతినిఁగూర్చి కాదు.

**2వ అధికరణము (3వ సూత్రము) :–** అదే వాదమును యోగస్మృతి వరకు కొనసాగించును. ప్రపంచ కారణమునుఁగూర్చి చెప్పిన పాతంజల యోగసిద్ధాంతమునిది నిషేధించును.

**3వ అధికరణము (4,5 సూత్రములు) :–** బ్రహ్మము మఱియు ప్రపంచములలో ఒకటి చైతన్యము, మరియొకటి జడమైయుండుట చేతను అవి తమ స్వభావమునందును, ధర్మములయందును సామ్యతను కలిగి లేకుండుటచేతను బ్రహ్మమీ విశ్వమునకు కారణము కాదనుమాటను నిషేధించును.

**3వ అధికరణము (6,7 సూత్రములు) :–** శరీరమునుండి వెండ్రుకలు జనించినట్లు మఱియు ఆవుపేడ నుండి తేళ్ళు ఉత్పన్నమైనట్లు అజడము నుండి జడము మఱియు జడము నుండి అజడమున్నూ కలుగుట సంభవమేయని పలికి పై ఆక్షేపణను నిషేధించును. కార్యకారణములు అన్ని అంశములయందును సామ్యతను కలిగియుండనవసరము లేదని అవి నిరూపించును.

**3వ అధికరణము (8వ సూత్రము) :–** మహాప్రళయకాలమునందీ ప్రపంచము బ్రహ్మమునందు లయించినప్పుడు, బ్రహ్మము ప్రపంచముచే కలుషిత మొనర్పఁబడునను ఆక్షేపణను నిషేధించును.

**3వ అధికరణము (9వ సూత్రము) :–** మట్టిచే చేయఁబడిన కుండలు మట్టియందు లయించినప్పుడవి మట్టికి తమవంటి ఆకారమును కలుగఁజేయవు, సరికదా! స్వయముగా అవియే మట్టిరూపమును ధరించుటచే పై ఆక్షేపణ ఖండింపఁబడునని నిరూపించును.

**3వ అధికరణము (10, 11వ సూత్రములు) :– 4వ అధికరణము (12వ సూత్రము), 9వ అధికరణము (29వ సూత్రము) :–** బ్రహ్మము ప్రపంచమునకు కారణమనుదృష్టియందుగల వాదములు, సాంఖ్యులు మఱియు వైశేషికులు మున్నగు ప్రతివాదులయందున్నూ సమన్వయింపఁబడునని నిరూపించును. ఏలననగా సాంఖ్యసిద్ధాంతమునందు అప్రధానమైన ప్రధానము సమస్త నామరూపములను సృష్టించును. మఱియు వైశేషిక సిద్ధాంతమునందు అదృశ్యములు మఱియు రూపరహితములగు పరమాణువులు కలిసి దృశ్యమాన ప్రపంచముగా రూపొందును.

అనంతములైన వాదములచే ఏదియు నిశ్చయింపఁబడనేరదనియు, వేదనిర్ణయమునే గౌరవింపవలయుననియును ఈ సూత్రములు నిరూపించును. వేదవిరుద్ధములైన మతము లన్నియును నిర్దుష్టముగ ఖండింపఁబడవలయును.

**5వ అధికరణము (13వ సూత్రము) :-** నిజమునకు సముద్రముతో తాదాత్మ్యము నొందియున్నను సముద్రములోని అలలు, బుడగలు, నురుగు భిన్నభిన్నములుగా ఎట్లు పరిగణింపఁబడునో, అట్లే నిజమునకు అంతయు బ్రహ్మమేనైయున్నను కర్మననుభవించు జీవులు మఱియు పదార్థములు భిన్నభిన్నములుగా భావింపఁబడునని ప్రబోధించును.

**6వ అధికరణము (14-20 సూత్రములు) :-** వైశేషికులకు విరుద్ధమైన వేదాంతసిద్ధాంతమగు కార్యకారణ తాదాత్మ్యతనుఁగూర్చి నిరూపించును. వైశేషికుల మతము ననుసరించి కార్యము, కారణమునకు భిన్నమైయున్నది.

**7వ అధికరణము (21, 22 సూత్రములు) :-** జీవుని రూపమునందున్న బ్రహ్మము సుఖదుఃఖములకు గుఱియగునను విషయమును ఖండించును. బ్రహ్మము జీవరూపమును ధరించినను, అది దాని నతిక్రమించియుండును, మఱియు జీవుని ఏలాటి ధర్మముచేతను అంటుఁబడకుండును. అది జీవుని అంతరంగికముగా అదుపునందుంచుకొనును. జీవుడు స్వయముగా బ్రహ్మమేనై యున్నను, బ్రహ్మము ప్రభువుగా శేషించియుండి, సుఖదుఃఖముల కంటుఁబడకుండును. జీవుడు అవిద్యకు బానిసవంటివాడు. బ్రహ్మము మాయకు నియామకుడు. జీవుడు అవిద్యనుండి విముక్తుడైనప్పుడాతడు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందును.

**8వ అధికరణము (23, 24, 25 సూత్రములు) :-** ఉపాదాన, నిమిత్త కారణములు లేనిదైయున్నను, బ్రహ్మము తన సత్సంకల్పము ద్వారా ఈ ప్రపంచమును సృష్టింపఁగలుగును. దేవతలు తమ ఇచ్ఛాశక్తి ద్వారా భవనములను, జంతువులను సృష్టింపఁగలుగుట మఱియు పాలు స్వయముగా పెరుగుగా మారుటయే దీనికి దృష్టాంతములైయున్నవని చెప్పును.

**9వ అధికరణము (26-29 సూత్రములు) :-** బ్రహ్మము అపరిచ్ఛిన్నమైయున్నను, అది పూర్తిగా విశ్వరూపముగా పరిణమించదు.

ప్రపంచమును తన నుండి ఉత్పన్నమొనర్చినను అతడు ఏకైకమై, అభేద్యమై శేషించును. ప్రపంచము అసత్యము. త్రాటిలోని పామువలె మార్పు తాత్కాలికమైనది, కాని నిజము కాదు. సృష్టి యందు బ్రహ్మము క్షయించిపోలేదని వివరించును.

**10వ అధికరణము (30, 31 సూత్రములు) :-** బ్రహ్మము కారణరహితమైయున్నను, తనకుఁగల నానావిధశక్తులచే విశ్వమును సృష్టింపఁగలుగునని ప్రబోధించును.

**11వ అధికరణము (32, 33 సూత్రములు) :-** ఏదో ఒక ఉద్దేశ్యముచే బ్రహ్మమీ ప్రపంచమును సృష్టింపలేదనియు, కాని అతనియందంతర్గతమైయున్న లీలావిశేషమే ఈ విశ్వసృష్టికి కారణమైయున్నదనియు వర్ణించును.

**12వ అధికరణము (34, 36 సూత్రములు) :-** ప్రపంచమంతయు దుఃఖాలయముగా పరిణమించుట మఱియు నానావిధ వ్యక్తులయొక్క హోదాలు విభేదించుట, ఒకడు దురదృష్టవంతుడుగను, మరియొకడు అదృష్టవంతుడుగను మారుటచే బ్రహ్మమున కారోపింపఁబడు పక్షపాతము మఱియు క్రూరత్వమును ఖండించును. బ్రహ్మము సృష్టికర్తగను మఱియు జీవుల పుణ్యపాపముల ననుసరించి ఫలప్రదాతగను నటించును.

**13వ అధికరణము (37వ సూత్రము) :-** పూర్వవాదముల నన్నింటిని క్రోడీకరించి సర్వజ్ఞత, సర్వశక్తిమత్వము మున్నగు లక్షణము లన్నియును బ్రహ్మమునకే తగియుండుటచే, అతనికివి నా విశ్వసృష్టికి తగిన సమర్థుడు లేడని ప్రతిపాదించును. కావున ప్రపంచమునకు కారణము బ్రహ్మమే యగును.

//==//

# 1. స్మృత్యధికరణము

## (1-2 సూత్రములు)

### 2-1-1 స్మృత్యనవకాశదోష ప్రసంగ ఇతిచేన్నాన్యస్మృత్య నవకాశదోష ప్రసంగాత్.

ప్రపంచమునకు కారణము బ్రహ్మమనెడి సిద్ధాంతముచే కొన్ని స్మృతులను నిషేధింపవలసిన దోషమేర్పడునని పలికినచో, అట్లు కాదని మా సమాధానము. ఏలననగా ఆ సిద్ధాంతమును నిషేధించుటచే మరికొన్ని స్మృతులకు స్థానము లేకుండు దోషము సంభవించును.

స్మృతి = సాంఖ్యస్మృతి, అనవకాశ = స్థానము లేకుండు, దోష = దోషము, ప్రసంగః = ఫలితము, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, అన్యస్మృతి = ఇతర స్మృతులకు, అనవకాశదోష ప్రసంగాత్ = స్థానము లేకుండు దోషము సంభవించుటచే.

ప్రథమాధ్యాయములోని నాల్గవ పాదమునందు ప్రపంచమునకు కారణము బ్రహ్మమేయను విషయమును సాంఖ్యము తప్ప శేషించిన స్మృతులన్నియును రూఢిపఱచినవి. ఈ స్మృతులన్నింటిలో మనుస్మృతి అనాదియు, మిక్కిలి ప్రామాణికమునైయున్నది.

ప్రపంచమునకు కారణము ప్రధానము కాదని పలికినచో కొన్ని స్మృతులు నిషేధింపఁబడునని చెప్పినచో, శ్రుతులపై ఆధారపడియున్న మనుస్మృతి మాత్రము నిషేధింపఁబడదని మా సమాధానము. కావున బ్రహ్మము కారణము కాదని పలికినచో మిక్కిలి ప్రామాణికమైన స్మృతి నిషేధింపఁబడుటలేదా? బ్రహ్మమే కారణమని శ్రుతి పలుకునని మేము నిరూపించితిమి. శ్రుతిని పూర్తిగా అనుసరించు

స్మృతులు మాత్రమే ప్రామాణికములైయున్నవి. కపిలుడు మున్నగువారు సిద్ధ పురుషులైతే అగుదురుఁగాక! సిద్ధి ధర్మము పైనను, ధర్మము వేదముల పైనను ఆధారపడియుండును. శ్రుతికి విరుద్ధమైన మతముఁగలవాడైనచో, ఏలాటి సిద్ధపురుషుడు కూడా ప్రామాణికుడు కానేరడు. వేదవిరుద్ధములైన స్మృతులు నిర్దాక్షిణ్యముగా నిషేధింపఁబడవలయును.

కపిలుడు ఆత్మలనేకములు కలవని పలుకును. ఒకేయొక విశ్వాత్మ కలడను సిద్ధాంతము నాతడంగీక రించడు. కపిలుని మతము వేదమునకు విరుద్ధమైయున్నది. అతడు నిరంకుశమైన ప్రధానమును పేర్కొనుటయేఁగాక, అనేకమైన ఆత్మలు కలవని తలంచును. కపిలస్మృతిని నిషేధింపకుండా మేము వేదాంత విభాగములను వర్ణింపలేము. కపిలస్మృతి శ్రుతి విరుద్ధమైనది. కావున దానిని నిషేధింప వలసియున్నది.

శ్వేతాశ్వతరము 5-2 శ్లోకము సాంఖ్యసిద్ధాంత సంస్థాపకుడగు కపిలుని సూచింపదు. అది పూర్తిగా భిన్నమైన వ్యక్తిని సూచించును. 'ప్రపంచసృష్టికి పూర్వమెవ్వడు విశ్వరచనకై బంగారు వర్ణముగల బ్రహ్మము (కపిలుడు) ను సృష్టించెనో అతడ'ని ఆ శ్లోకముయొక్క నిజమైన భావమైయున్నది. ఇచ్చట కపిలశబ్దమున కర్థము 'బంగారు వర్ణముఁగల బ్రహ్మమై'యున్నది. అతనికి హిరణ్యగర్భుడనెడి మరియొక పేరు కూడా కలదు.

## 2-1-2 ఇతరేషాంచానుపలబ్ధేః

మఱియు సాంఖ్యసిద్ధాంతము ననుసరించిన ప్రధానముయొక్క లక్షణములు శాస్త్రములలో పేర్కొనఁబడకుండుటచే సాంఖ్యసిద్ధాంతము ప్రామాణ్యము కాజాలదు.

ఇతరేషామ్ = ఇతర స్మృతికారుల మతమున, చ = మరియు, అనుపలబ్ధేః = పేర్కొనఁబడ కుండుటచే.

1వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

ఇఁక ప్రధానకార్యములైయున్న మహత్తు మున్నగునవి వేదమునందుఁగాని, సామాన్యానుభవము నందుఁగాని కానఁబడుటలేదు. కాని దీనికి భిన్నముగా వేదమునందును, విశ్వమునందును భూతములు మఱియు ఇంద్రియములు

గోచరించుచున్నవి. కావున ఇవి స్మృతులయందు పేర్కొనఁబడినవి. ఈ కారణముచే స్మృతులలో పేర్కొనఁబడిన మహత్తు మున్నగు శబ్దములు ప్రధానకార్యములను సూచింపవు. కాని శ్రుతులయందున్న ఇతరమైన అంశములను సూచించును. (1-4-1 ని చూడుము.)

వేదములయందెచ్చటను సాంఖ్యులయొక్క ఇతరమైన అంశములు పేర్కొనఁబడలేదు. కావున సాంఖ్య సిద్ధాంతము ప్రామాణికము కాజాలదు.

మహత్తను శబ్దముచే హిరణ్యగర్భుడు, లేక జీవుడుగా గ్రహింపవలయునేఁగాని ఎట్టి సందర్భము నందైనను సాంఖ్యసిద్ధాంతము ననుసరించి ప్రకృతికి ప్రథమజన్మమైనను మహత్తుగా భావింపరాదని శ్రీ శంకరులు నిరూపించిరి. ప్రధానము సృష్టికర్తయని సాంఖ్యము బోధించుటచే అది అప్రామాణ్యమగుటయేఁ గాక, అది బోధించు అనేక ఇతర సిద్ధాంతములున్నూ వేదములలో మనకు కానరావు. ఆత్మలు శుద్ధచైతన్యములనియు, అవి సర్వవ్యాపకములనియు, బంధవిముక్తులు ప్రకృతికార్యములనియున్నూ అది ప్రబోధించును. అన్నింటికి ప్రభువైన పరమాత్మ లేడని కూడా అది బోధించును. మఱియు ప్రాణములు కేవలము పంచేద్రియముల కార్యములనియు, అవి తమ ప్రత్యేకమైన ఉనికిని కలిగిలేవనియున్నూ ప్రతిపాదించును. ఇట్టి విపరీతమైన సిద్ధాంతములిందు కానఁబడును. కావున సాంఖ్యమతము ప్రామాణికము కాజాలదు.

# 2. యోగ ప్రత్యుక్త్యధికరణము

## 2-1-3 ఏతేన యోగః ప్రత్యుక్తః

దీనిచే యోగదర్శనము కూడా ఖండింపఁబడెను.

ఏతేన = సాంఖ్యస్మృతిని ఖండించుట ద్వారా, యోగః = యోగదర్శనము, ప్రత్యుక్తః = కూడా ఖండింపఁబడెను.

ఇచ్చట పతంజలియొక్క యోగదర్శనము ఖండింపఁబడినది. యోగము 'సేశ్వరసాంఖ్య'మని చెప్పఁబడును.

పూర్వపక్షి ఇట్లనును. శ్వేతాశ్వతరాది ఉపనిషత్తులయందున్నూ యోగదర్శన మొసంగఁబడినది. 'త్రిరున్నతంస్థాప్యసమం శరీరమ్' (శ్వే. ఉ. 2-8) 'ఆత్మావా

అరేద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః' (బృ. ఉ. 2-4-5) 'తాం యోగమితి మన్యంతే స్థిరామింద్రియధారణామ్' (కఠ. ఉ. 2-6-11) 'లబ్ధ్వా విద్యామేతాంయోగ విధించ కృత్స్నమ్' (కఠ. ఉ. 2-6-18) యోగము మానసిక ధారణకు సహాయకమై యున్నది. ధారణ లేకుండా బ్రహ్మజ్ఞానము కలుగదు. కావున యోగము జ్ఞానసాధనమైయున్నది. యోగస్మృతి శ్రుతులనాధారముగాఁగొని యుండుటచే అది ప్రమాణికమైయున్నది. యోగస్మృతి ప్రథమకారణమైయున్న ప్రధానము నంగీకరించును.

ప్రకృతి ఈ విశ్వమునకు కారణమని అంగీకరించుటచే సాంఖ్యసిద్ధాంతము నకు వలెనే పతంజలి యొక్క యోగదర్శనము కూడా ఖండింపఁబడినది.

సాంఖ్యస్మృతి ఖండనచే యోగస్మృతియు ఖండింపఁబడినట్లుగనే తలంచవలయునని ఈ సూత్రము సూచించును. ఏలననగా యోగదర్శనము కూడా శాస్త్రవిరుద్ధముగా నిరంకుశమైన ప్రధాన మీ ప్రపంచమునకు మఱియు మహత్తు ఇత్యాదులకు కారణముగా తలంచును. వేదము మఱియు సామాన్యానుభవము ఈ దృక్పథములకు ప్రతికూలములైయున్నవి.

స్మృతి ఆంశికముగా ప్రామాణికమైయున్నను, ఇతరాంశములలో శ్రుతి విరుద్ధమైయుండుటచే దీనిని మనము నిషేధింపవలసియున్నది.

ఆత్మనుఁగూర్చి వివరించు స్మృతులనేకములున్నను, సాంఖ్యము మఱియు యోగములను ఖండించుటకే మేము ప్రయత్నపరులమైయున్నాము. ఏలననగా అవి మానవుడు పరమపదము నొందుటకై సాధనములని సర్వత్ర సుప్రసిద్ధములై యున్నవి. అంతేఁగాక అనేక మహాపురుషుల మన్ననలను అవి పొందియున్నవి. మఱియు 'తత్కారణం సాంఖ్యయోగాధిగమ్యం జ్ఞాత్వాదేవం ముచ్యతే సర్వపాశైః' (శ్వే. ఉ. 6-13) అను శ్రుతివాక్యముచే వాటిస్థాయి మహోన్నత మొనర్పఁబడినది.

సాంఖ్యస్మృతి జ్ఞానముచేతను, లేక యోగాభ్యాసముచేతను మానవుడు పరమగమ్యస్థానము నొందలేడని మేము పలుకుదుము. వైదికప్రబోధమగు కేవలాత్మైక్యజ్ఞానము చేతనే పరమ గమ్యస్థానము, లేక పరమపదము పొందఁబడునని శ్రుతి స్పష్టముగా వచించియున్నది. 'తమేవ విదిత్వాతిమృత్యుమేతినాన్యః పంథావిద్యతేఽయనాయ' (శ్వే. ఉ. 3-8).

సాంఖ్యము మఱియు యోగసిద్ధాంతములు ద్వైతమతమును ప్రతిపాదించును. అవి ఆత్మైక్యతను వివేచింపవు. 'తత్కారణం సాంఖ్యయోగాధిగమ్యం' అను వాక్యములోని 'సాంఖ్యము' మఱియు 'యోగమ'ను శబ్దములు వైదికజ్ఞానమును మఱియు ధ్యానమును సూచించును. ఏలననగా ఈ యాఖ్యాయిక, వైదికజ్ఞానమును సూచించు ఆఖ్యాయికకు సమీపమునందున్నది.

వేదవిరుద్ధముకాని ఈ రెండు సిద్ధాంతములుగల విభాగములకు మేము నిశ్చయముగా అవకాశము నొసంగుదుము. 'ఆత్మసర్వధర్మ విముక్తమ'ని (అసంగము) సాంఖ్యులు పలుకుదురు. పురుషుడు పూర్ణముగా పవిత్రుడని పలుకు వేదవాక్యముతో ఇది సామ్యతను కలిగియున్నది. 'భవత్యసంగోహ్యయం పురుషః' (బృ. ఉ. 4-3-16).

పరివ్రాజకుడగు సన్న్యాసికి నివృత్తిమార్గమును యోగముపదేశించును. ఇది శ్రుతిచే బలపఱచఁ బడినది. 'శిఖాం యజ్ఞోపవీతం చేత్యేతత్సర్వం భూస్వాహేత్యప్సుపరిత్యజ్యాఽఽత్మాన మన్విచ్ఛేత్, యథాజాతరూపధరః' (జా. ఉ. 4-7).

వారియుక్తిని ఆత్మసాక్షాత్కారపర్యంతము అంగీకరింపవలసియున్నది.

స్మృతివాదములన్నింటికి పై వివరణములు సమాధానము నొసంగును. కేవలము వేదాంత శ్రుతులచేతనే సత్యము సాక్షాత్కరింపఁబడునని మా మతము. 'వేదము తెలియనివాడు ఆ మహాపురుషుని గుర్తెఱుంగజాలడు' (తై. బ్రా. 3-12, 9,7) 'ఔపనిషదం పురుషం పృచ్ఛామితమ్' (బృ. ఉ. 3-9-26).

# 3. న విలక్షణత్వాధికరణము

# (4-11 సూత్రములు)

## 2-1-4 న విలక్షణత్వాదస్యతథాత్వంచ శబ్దాత్

ప్రపంచము బ్రహ్మమునకు విభిన్నమైన స్వభావమును కలిగియుండుటచే బ్రహ్మము ప్రపంచమునకు కారణము కాజాలదని పూర్వపక్షి పలుకును. ప్రపంచము బ్రహ్మమునకు విరుద్ధమైయున్నదను విషయము శ్రుతులచే తెలియఁబడుచున్నది.

న = బ్రహ్మము ప్రపంచమునకు కారణము కాదు, విలక్షణత్వాత్ =

విలక్షణస్వభావమును కలిగి యుండుటచే, అస్య = ఈ ప్రపంచముయొక్క తథాత్వం = అది అట్లుండుట, చ = మఱియు, శబ్దాత్ = శ్రుతివాక్యముచే.

ఈ యధికరణమునందెనిమిది సూత్రములు కలవు. మొదటి రెండు సూత్రములు పూర్వపక్షమును మఱియు ఇతర సూత్రములు సిద్ధాంతమును వ్యక్తమొనర్చును.

బ్రహ్మమీ విశ్వమునకు నిమిత్తకారణము మఱియు ఉపాదానకారణము కూడానై యున్నదను సిద్ధాంతమునకు విరుద్ధముగానున్న స్మృతి నిషేధములు ఖండింపఁబడినవి. ఇప్పుడు మేము వాటిని తార్కికముగా ఖండించుట కుపక్రమించుచున్నాము.

ఈ సూత్రమునందును, రెండవ సూత్రమునందును బ్రహ్మము ప్రపంచమునకు కారణము కాదనెడి కొన్ని యుక్తియుక్తములగు ఆక్షేపణలు పేర్కొనఁబడినవి.

పూర్వపక్షి ఇట్లనును : బ్రహ్మము చైతన్యవంతమైనది మఱియు పరిశుద్ధమైనది. కాని విశ్వము భౌతికము, జడము మఱియు అపరిశుద్ధమైనది. కావున అది బ్రహ్మమునకు వ్యతిరిక్తమైన స్వభావమును కలిగియున్నది. కాబట్టి బ్రహ్మమీ ప్రపంచమునకు కారణము కాజాలదు.

కార్యము కారణము వంటి స్వభావమును కలిగియుండవలయును. కార్యము, మరియొక రూపమునందు కారణమేనైయున్నది. కార్యకారణములు పూర్తిగా విరుద్ధమైన స్వభావమును కలిగియుండవు. చైతన్యవంతము, ప్రాణవంతమైన బ్రహ్మము, అచేతనము, జడమునగు భౌతికప్రపంచమును సృష్టింపజాలదు. ఒకవేళ బ్రహ్మమీ ప్రపంచమునకు కారణముగా అంగీకరించినచో, ఈ రెండింటి స్వభావములు సారూప్యములై యుండవలయును. కాని అవి పరస్పర విరుద్ధ స్వభావమును కలిగియున్నట్లు గోచరించును. కావున బ్రహ్మమీ ప్రపంచమునకు కారణము కాజాలదు.

శ్రుతిప్రమాణముచేతను ఈ వైరుధ్యము మనకు గోచరించును. 'విజ్ఞానం చా విజ్ఞానం చ' (తై. ఉ. బ్రహ్మానందవల్లి, ఆరవ అనువాకము). కావున ఈ భౌతికవిశ్వమునకు బ్రహ్మము కారణము కానేరదు. పరిశుద్ధాత్మయైన బ్రహ్మము, అపరిశుద్ధమైన విశ్వమునకు కారణమగుననుట అసమంజసము. సుఖదుఃఖ

సమన్వితము, మోహగ్రస్తమునగు ప్రపంచము బ్రహ్మము నుండి ఉత్పన్నమగుననుట అనుచితమైయున్నది.

## 2-1-5 అభిమాని వ్యపదేశస్తు విశేషాను గతిభ్యామ్

కాని ప్రత్యేక లక్షణము చెప్పఁబడుటచేతను మఱియు అధిష్ఠానదేవత నిజముగా ఉనికిని కలిగియుండుటచేతను అవయవములలోని అధిష్ఠానదేవతలను సూచించును.

అభిమాని = అవయవములు మఱియు భూతములకధిష్ఠాన దేవతలు, వ్యపదేశః = సూచన, తు = కాని, విశేషానుగతిభ్యామ్ = విశేషశబ్ద ప్రయోగము మఱియు వాటి తత్త్వములయందు దేవతల ప్రవేశ వర్ణనల వలనను.

ఈ సూత్రము 4వ సూత్రమువలె ఆక్షేపణను సూచించును. 'తు' యనెడి శబ్దముచే సంశయ విచ్ఛేదము కలుగును.

స్మృతియందెచ్చటైనను ఒక అచేతనపదార్థము, చేతన పదార్థవర్తనను కలిగియున్నట్లు వర్ణింపఁబడి నప్పుడు మనము దాని కధిష్ఠానదేవత సూచింపఁబడుటను గ్రహింపవలయును. చైతన్యము నపేక్షించు మాట్లాడుట, వాదించుట మున్నగు క్రియలలో శ్రుతులు కేవలము భూతములు మఱియు అవయవములను సూచింపవు. కాని చైతన్యవంతములగు వాటి కధిష్ఠానదేవతలను సూచించును.

'ఏతాహవై దేవతా అహంశ్రేయసేవివదమానాః' 'తావా ఏతాః సర్వదేవతాః ప్రాణేని శ్రేయసంవిదిత్వా' (కౌ. ఉ. 2-14) అను వాక్యములు కౌషీతక్యుపనిషత్తు నందున్నవి. కేవలము భౌతికావయవముల భావనను తుడిచివేయుటకై కౌషీతకులు దేవతల'నెడి శబ్దమును ప్రయోగించిరి.

'అగ్నిర్వాగ్భూత్వా ముఖంప్రావిశత్' అను వాక్యము ఐతరేయము 1-2-4 నందు కలదు. దీనిచే ప్రతి అవయవమున్నూ స్వయముగా దానికిఁగల అధిష్ఠానదేవతకు సంబంధించియున్నదని తెలియుచున్నది.

'తేహేమేప్రాణా అహంశ్రేయసేవి వదమానాః' అను వాక్యము బృహదారణ్యకము 6-1-7 నందు కలదు.

ఈ యధిష్ఠానదేవతల ఉనికి విషయమై ఛాందోగ్యోపనిషదాఖ్యాయికలు

కూడా వచించుచున్నవి. 'అగ్ని సంకల్పించి జలమును సృష్టించెను.' దీనిచే అచేతనపదార్థమును పరివేష్టించియున్న అధిష్ఠానదేవతయే అగ్నిదేవుడుగా చెప్పఁబడుచున్నాడని తెలియుచున్నది. సంకల్పము, కార్యములకు సంబంధించినట్టి అధిష్ఠానదేవతకు చెందియున్నది. వీటన్నింటిచే శ్రుతులు అధిష్ఠానదేవతలను సూచించునను ఊహ బలపడుచున్నది.

ఈ కారణములన్నింటిచే విశ్వముయొక్క స్వరూపము బ్రహ్మమునకు విభిన్నమైయున్నదను విషయము నిశ్చయింపఁబడుచున్నది. కావున బ్రహ్మము విశ్వమునకు ఉపాదాన కారణము కాజాలదు. పూర్వపక్షియొక్క అక్షేపణకీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 2-1-6 దృశ్యతే తు.

కాని అచేతనము నుండి చేతనము జన్మించుట కూడా చూడఁబడుచున్నది.

దృశ్యతే = చూడఁబడుచున్నది, తు = కాని.

4 మఱియు 5వ సూత్రములలోని ఆక్షేపణ ఇప్పుడు ఖండింపఁబడుచున్నది.

'తు'యను శబ్దము పూర్వపక్షమును నిషేధించును. 'తు' శబ్దముచే పూర్వసూత్రమునందు వ్యక్తమొనర్పఁబడిన పూర్వపక్షియొక్క మతములు ఖండింపఁబడును. అనగా, స్వరూపమునందు విభిన్నమై యుండుటచే ఈ విశ్వము బ్రహ్మముచే సృష్టింపఁబడలేదను విషయము ఖండింపఁబడును. అది ఎట్లనగా, చేతనుడైన మానవుని నుండి అచేతనములైన వెంట్రుకలు, గోళ్ళు సృష్టింపఁబడుచున్నవి. మఱియు అచేతనమైన ఆవుపేడ నుండి చేతనములైన తేళ్ళు మున్నగునవి సృష్టింపఁబడుచున్నవి. కావున 4, 5 సూత్రములలో చూపఁబడిన ఆక్షేపణలు నిర్వీర్యములేయనఁబడును. కాబట్టి చైతన్యస్వరూపుడైన బ్రహ్మముచే ఈ భౌతికవిశ్వము సృష్టింపఁబడినదనుట సుసాధ్యమే యగును. చైతన్యవంతుడగు సృష్టికర్త నుండి అచేతనమైన సృష్టి కలిగినదనుట అసమంజసము కాజాలదు.

'యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ, యథా పృథివ్యామోషధయః సంభవంతి, యథాసతః పురుషాత్కేశ లోమాని, తథాక్షరాత్సంభవతీహ విశ్వమ్' అను వాక్యము ముండకము 1-1-7 నందు కలదు.

వెంట్రుకలు మఱియు గోళ్ళకు మానవుని శరీరమే కారణమగును. కాని మానవుడు కాదనియు, అదే విధముగా ఆవుపేడ తేలు యొక్క శరీరమునకు కారణమగుననియు పూర్వపక్షి పలుకవచ్చును. అట్లైనను కారణమైన ఆవుపేడకు మఱియు కార్యమైన తేలు యొక్క శరీరమునకున్నూ భేదమున్నది. తేలు యందున్న జీవాత్మకు తేలుయొక్క జడమైన దేహము స్థానమైయున్నది. కాని జడమైన ఆవుపేడ కాదు. అవి అన్ని విషయములయందు సామ్యతను కలిగిలేవు. అవి సామ్యతను కలిగియున్నచో కార్యకారణములే లేకుండెడివి. బ్రహ్మముయొక్క లక్షణములన్నింటిని నీవీ ప్రపంచమునందు చూడఁగోరుదువేని, కార్యకారణముల మధ్య భేదమేముండును?

కార్యకారణములు అన్ని విషయములలో సామ్యతను కలిగియుండవు. కాని కారణములోని ఒకానొక అంశము కార్యమునందున్నూ గోచరించును. రెండింటి ఆకారము మున్నగునవి విభిన్నములైయున్నను, మట్టిముద్దలోని మన్ను మట్టికుండయందును ఉండును. కార్యకారణ సంబంధమే ఈ రెండింటియందేదోయొక భేదమున్నదని నిశ్చయించును. కార్యమైన విశ్వమునందు కారణ బ్రహ్మము యొక్క సత్తా మఱియు చైతన్యము వంటి కొన్ని లక్షణములు మాత్రము కాననగును. విశ్వమునందన్ని రకములగు పదార్థములు కలవు. విశ్వమునకీ లక్షణము సత్తాస్వరూపమైన బ్రహ్మమునుండి కలిగినది. మఱియు బ్రహ్మచైతన్యముచే సమస్త ప్రపంచము ప్రకాశించుచున్నది. బ్రహ్మము యొక్క సత్తా, చైతన్యము లనెడి రెండు లక్షణములీ విశ్వమునందు కాననగును. కావున ఇతర విషయములలో కొంత భేదమున్నను, బ్రహ్మమీ విశ్వమునకు కారణమైయున్నదని నుడువుట సముచితమై యున్నది.

## 2-1-7 అసదితి చేన్న ప్రతిషేధమాత్రత్వాత్

ఐతే కార్యమైన ప్రపంచము సృష్టికి పూర్వమే ఉనికి లేనిదగునని పలికినచో, అట్లుకాదని మా సమాధానము. ఏలననగా అది కేవలము నిరాధారముగా నిషేధింపఁబడుచున్నది.

అసత్ = అసత్తు, ఇతిచేత్ = అని పలికినచో, న = కాదు, ప్రతిషేధమాత్రత్వాత్ = నిషేధింపఁబడుటచే.

6వ సూత్రమునకు ఆక్షేపణ చెప్పcబడి, ఖండింపcబడినది.

పూర్వపక్షి ఇట్లనును : చైతన్యము, శుద్ధము, శబ్దాదిగుణ వర్జితమైన బ్రహ్మము, తద్వ్యతిరిక్తమైన అచేతనము, అపవిత్రము, శబ్దాదిగుణ సమన్వితమగు ప్రపంచమునకు కారణమగునని పలికినచో, సృష్టికి పూర్వము కార్యమైన ప్రపంచము ఉనికి లేనిదగును. ఏలననగా అప్పుడు కేవలము బ్రహ్మము మాత్రమే శేషించియుండెను. అనగా ఉనికి లేని ఒకానొక పదార్థము సృష్టింపcబడినదని భావము. కాని కారణమునందు కార్యమిమిడియున్నదను వేదాంతసిద్ధాంతము దీని నంగీకరించదు.

పూర్వపక్షిచే లేవనెత్తcబడిన ఈ యాక్షేపణ నిజమైన ఆక్షేపణ యనcబడదు. ఇది కేవలము మిథ్య యగుటచే దీనియందు సత్తా లేదు.

ఈ సూత్రము పూర్వపక్షి యొక్క ఆక్షేపణను ఖండించును. ఈ యాక్షేపణ కేవలము అర్థరహితమగు భూమికపై ఆధారపడియున్నదని అది వివరించును. సృష్టికి పూర్వము కార్యము యొక్క ఉనికిని నీవు నిషేధించినచో, అది కేవలము నిరర్థకమైన ఆక్షేపణయే యగును. సృష్టికి పూర్వము, సృష్ట్యనంతరము కూడా కార్యము నిశ్చయముగా కారణమునందునికి కలిగియుండును. సృష్టికి పూర్వముcగాని, తర్వాతcగాని కార్యము కారణమును విడిచి స్వతంత్రమైన ఉనికిని కలిగియుండదు. 'సర్వం తం పరాదాద్యోఽ న్యత్రాత్మనో సర్వం వేద' యని (బృ. ఉ. 2-4-6) నందు శ్రుతివచనము కలదు.

కావున బ్రహ్మమునందీ విశ్వము సృష్టికి పూర్వము కూడా ఉనికిని కలిగియున్నది. అది కేవలము అసత్తు కాదు.

## 2-1-8 అపీతౌ తద్వత్ప్రసంగాద సమంజసమ్

ప్రళయకాలమునందు జగత్తు బ్రహ్మమునందు లయించునని చెప్పినందువలన, విశ్వమునకు కారణము బ్రహ్మమనెడి సిద్ధాంతమసంగతమగును.

అపీతౌ = ప్రళయకాలమునందు, తద్వత్ = కార్యమువలె, ప్రసంగాత్ = ఫలితములచే, అసమంజసమ్ = అసంగతము.

ప్రపంచమునకు కారణము బ్రహ్మము కాదని యుక్తియుక్తముగా ఇచ్చట నిషేధింపcబడుచున్నది.

పూర్వపక్షి మరికొన్ని ఆక్షేపణలను పేర్కొనుచున్నాడు.

ప్రళయకాలమునందు కార్యమైన ప్రపంచము, కారణమైన బ్రహ్మమునందు లయించును. తత్ఫలితముగా కారణము కార్యరూపమును ధరించునని తేలుచున్నది. కార్యముయొక్క స్వభావముచే కారణము బాధింపఁబడును. కార్యము నందంతర్నిహితములైయున్న దోషములు కారణమును కూడా ఆవరించును. ప్రాపంచిక స్వభావముచే బ్రహ్మము కూడా బాధింపఁబడును. నీటియందు ఉప్పు వేసినప్పుడు, ఆ ఉప్పుచే నీరు కూడా బాధింపఁబడును కదా! ఏదైన ఊరగాయయందు కలుపఁబడిన ఇంగువ యొక్క తీక్ష్ణమైన వాసన ఆహారమంతయు వ్యాపించును కదా! అప్పుడాతడు ఉపనిషద్వచనానుసారముగా విశ్వమునకు కారణమైయున్న సర్వజ్ఞుడు కాకుండుటయేఁగాక, అపవిత్రుడు కావలసివచ్చును. అప్పుడాతడు ప్రపంచమువలె జడత్వము, స్థూలత్వము మఱియు పరిచ్ఛిన్నత్వములను కలిగియుండవలసివచ్చును. ఇది అసంగతమైన విషయము కదా! కావున బ్రహ్మము ప్రపంచమునకు కారణము కాజాలదు.

మరియొక ఆక్షేపణ కూడా కలదు. ప్రళయకాలమునందు పదార్థము లన్నియును బ్రహ్మముతో ఏకీభవించును. లయావస్థయందు భేదభావమంతయును అభేదస్థితి నొందును. కావున విశ్వము నూతనముగా సృష్టింపఁబడుటకై ప్రత్యేక కారణమనునది మిగిలియుండదు. తత్ఫలితముగా అనుభవించు జీవులు, అనుభవింపఁబడు పదార్థములు మున్నగు భేదములతో కూడిన నూతన ప్రపంచము సృష్టింపఁబడుట కవకాశము లేదు. సృష్టియొక్క పునర్నిర్మాణమునకు కావలసిన అంశమేమియును శేషించియుండదు.

మూడవ ఆక్షేపణ ఏమనగా ఒకవేళ నూతనసృష్టి సంభవించుట సాధ్యమైనను బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్న ముక్తపురుషులు కూడా పునర్జన్మ నెత్తవలసివచ్చును.

లయావస్థయందు కూడా బ్రహ్మమునందీ విశ్వము విభిన్నమైయుండుననుటకు వలనుపడదు. అట్లగునేని అది లయావస్థయని చెప్పఁబడదు. కార్యము కారణముకు భిన్నముగా ఉనకిని కలిగియుండుట అసాధ్యము.

కావున విశ్వమునకు కారణము బ్రహ్మమనెడి వేదాంతసిద్ధాంతమనేక రకములగు అయుక్తతలచే కూడియుండుటచే ఇది అంగీకరింపఁబడజాలదు.

దీనికీ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 2-1-9 నతు దృష్టాంత భావాత్

కాని దృష్టాంతములుండుటచే అది అట్లు కాజాలదు.

న = కాదు, తు = కాని, దృష్టాంతభావాత్ = దృష్టాంతములుండుటచే.

8వ సూత్రములోని ఆక్షేపణ ఖండింపఁబడినది.

'తు' యను శబ్దముచే ఆక్షేపణయొక్క సాధ్యత్వము తొలగింపఁబడినది.

ఈ యాక్షేపణలు బలహీనములు. కారణమునందు లయమునొందిన కార్యము మరల తన దోషములను చెప్పుకొనుట ద్వారా కారణమునేల బాధింపవలయును? కార్యము కారణమునందు లయము నొందినప్పుడు అది తన కార్యములచే కారణము నేమాత్రమున్నూ ప్రభావితమొనర్పకుండును. దీనికసంఖ్యాకములగు ప్రమాణములు కలవు. ఒక మంచి ఆభరణము బంగారముగా కరగింపఁబడినప్పుడు, ఆ బంగారము నందా ఆభరణముయొక్క ప్రత్యేకరూపమెట్లు గోచరించును?

ఒక మట్టికుండ పగిలిపోయి తిరిగి తన నిజరూపమగు మట్టిగా మారినప్పుడు, అది తన ప్రత్యేక లక్షణములను మనకొసంగఁజాలదు. అది మట్టిని కుండలుగా, ముంతలుగా మార్పజాలదు. కాని అది స్వయముగా మట్టిరూపమునొందును. భూజనితములగు చతుర్విధసావయవ జీవులు లయావస్థయందు తమ గుణములను భూమికొసంగవు.

కార్యము తన కారణావస్థయందు లయించిన అనంతరము కూడా అది తన వ్యక్తిగత ధర్మములను విడువకున్నచో, లయావస్థయే సంభవింపదు.

కార్యకారణ తాదాత్మ్యత కలిగియున్నను, కార్యముయొక్క ఆత్మ కారణమునందున్నది. కాని కారణము కార్యమునందు లేదు. కారణము యొక్క స్వభావమును కార్యము కలిగియున్నది. కాని కార్యము యొక్క స్వభావమును కారణము కలిగిలేదు. కావున కార్యము యొక్క గుణములు కారణము నంటుకొనజాలవు.

ప్రళయకాలమునందు బ్రహ్మము ప్రపంచముగా మారుటకు బదులుగా, ప్రపంచము బ్రహ్మముగా మార్పునొంది అతనియందు లయించును. కావున 8వ సూత్రమునందు సూచింపఁబడినట్టి భూమికను బట్టి బ్రహ్మమును ప్రపంచమునకు కారణమగా అంగీకరించుటలో దోషము లేదు.

ప్రపంచము దుఃఖాదులతో నిండియున్నను, బ్రహ్మము పవిత్రత ఇత్యాదులతో పరిపూర్ణమైయున్నది. అతడెల్లప్పుడును దోషవివర్జితుడై యుండును. బాల్యయౌవన వృద్ధావస్థలు శరీరమునకు చెందినవేఁగాని ఆత్మకెట్లు సంబంధించిలేవో, గ్రుడ్డిఁదనము మఱియు చెవిటిఁదనము మున్నగునవి ఇంద్రియములకు చెందునేఁగాని ఆత్మకెట్లు సంబంధించిలేవో, అదే విధముగా ప్రాపంచిక దోషములు బ్రహ్మమునకు సంబంధించి లేవు. మఱియు అవి పరిశుద్ధమగు బ్రహ్మమునందు ప్రవేశింపవు.

నీవు పలికినట్లు కార్యకారణములు భిన్నములైయుండునేని, ప్రళయమనునది ఏ మాత్రము సంభవింపనేరదు. కార్యకారణములు ఏకైకమై యుండుటచే కార్యమునందున్న దోషములు కారణమును బాధించుననెడి ఆక్షేపణ కేవలము ప్రళయమునకు ప్రత్యేకింపఁబడదు. పూర్వపక్షి చెప్పినది నిజమైనచో, ఇప్పుడు కూడా దోషము కారణము నావరింపవలసియుండును. కార్యకారణములైన విశ్వము మఱియు బ్రహ్మము యొక్క తాదాత్మ్యత అన్ని వేళలయందుండవలయును. కాని శ్రుతివచనానుసారముగా కేవలము ప్రళయకాలమునందే ఉండరాదు. ఉదాహరణార్థము : 'అయంవా ఆత్మా సర్వేషాం భూతానాం లోకః' (బృ. ఉ. 1-4-16) 'ఆత్మై వేదం సర్వమ్' (ఛాం. ఉ. 7-25-2) 'బ్రహ్మైవేదమమృతం పురస్తాత్' (ముం. ఉ. 2-2-12) 'సర్వం ఖల్విదం బ్రహ్మ' (ఛాం. ఉ. 3-14-1).

అవిద్యాభాసచే కార్యములలో దోషములు కన్పట్టుటచే అవి కారణమును బాధింపనేరవని పలికినచో, ఈ విషయము లయావస్థయందు కూడా వర్తింపవలసి యుండును.

త్రాచుపాము విషముచే బాధింపఁబడదు. గారడివాడు తాను స్వయముగా సృష్టించిన గారడి ఆటచే ప్రభావితుడు కాడు. ఏలననగా అది అసత్యమైయున్నది. అదే విధముగా బ్రహ్మము మాయచే బంధింపఁబడదు. ప్రపంచము కేవలము మిథ్య. ఒక త్రాడు పామువలె కానఁబడునట్లు, బ్రహ్మము ఈ విశ్వముగా కన్పట్టును. కావున బ్రహ్మము మాయచే ప్రభావితము కాదు. స్వప్నములోని దృశ్యములచే ఎవ్వడున్నూ బాధింపఁబడడు. ఏలననగా అవి జాగ్రదవస్థయందును మఱియు సుషుప్త్యవస్థ యందును మనలననుసరింపవు. అదే విధముగా చైతన్యావస్థలన్నింటికి శాశ్వతసాక్షియైన పరబ్రహ్మమీ ప్రపంచముచేతఁగాని, లేక మాయచేతఁగాని

బాధింపఁబడదు.

రెండవ ఆక్షేపణ కూడా ఈ విధముగానే నిరాధారమైయున్నది. ఈ విషయమునందు కూడా ఏతత్సదృశములగు దృష్టాంతములు కలవు. సుషుప్త్యవస్థయందు నీవేమియు చూడకుందువు. ఆత్మ సారస్వ రూపమైన అభేదావస్థయందు ప్రవేశించును. అప్పుడు నానాత్వముండదు. కాని నీవు మేల్కాంచిన వెంటనే నానాత్వసమన్వితమగు ప్రపంచము నీకు దృష్టిగోచరమగును. అవిద్య, లేక అజ్ఞానము నశింపకుండుటచే భేదభావమనెడి పూర్వస్థితి నీకు మరల కలుగును. ఛాందోగ్యమునందీ క్రింది వాక్యము కలదు. 'ఇమాస్సర్వాః ప్రజాస్సతి సంపద్య న విదుస్సతి సంపద్యా మహ ఇతి, త ఇహవ్యాఘ్రోవా సింహో వా వృకోవా వరాహోవా కీటోవా పతంగోవా దంశోవా మశకోవా యద్యద్భవంతి తదా భవంతి' (ఛాం. ఉ . 6-9-2,3).

ప్రళయమునందిట్టి స్థితియే కలుగును. లయావస్థయందు కూడా భేదము అవిద్యవలె సూక్ష్మరూపము నందుండును. నిద్ర నుండి మేల్కాంచిన మానవునివలె మూలావిద్య, లేక అజ్ఞానమున్నంత వరకు ప్రళయానంతరము సృష్టి కలుగుచుండును.

ముక్తపురుషులు పునర్జన్మ నొందరు. ఏలననగా పరిపూర్ణ పరబ్రహ్మజ్ఞానముచే వారి అజ్ఞానము నిశ్శేషముగా నశించును.

ప్రళయకాలమునందు కూడా ప్రపంచము బ్రహ్మమునకు భిన్నమైయుండవల యుననెడి పూర్వపక్షి యొక్క మతము వేదాంతులచే అంగీకరింపఁబడదు.

కావున ఉపనిషత్ప్రతిపాదిత సిద్ధాంతము సర్వవిధములుగా నిర్దోషమై యున్నదని నిర్ణయించుట యుక్తమగును.

## 2-1-10 స్వపక్షదోషాచ్చ.

మఱియు వేదాంతసిద్ధాంతమునకు విరుద్ధముగా పలుకఁబడిన సాంఖ్యుల ఆక్షేపణలు, సాంఖ్యమతమునకు కూడా వర్తించును.

స్వపక్షదోషాత్ = తన పక్షమునందుఁగల దోషముచే, చ = మఱియు.

4 మఱియు 8వ సూత్రములలో పేర్కొనఁబడిన ఆక్షేపణలు పూర్వపక్షి పక్షమునందే త్రిప్పఁబడినవి.

ఇప్పుడు విషయము తాఱుమారైనది. సాంఖ్యులు వేదాంతసిద్ధాంతములనుఁ గూర్చి పలికిన ఆక్షేపణలు తమ సిద్ధాంతమునకే వర్తించును. అతని కారణసిద్ధాంతము నందు కూడా నామరూపములతో కూడియున్న ప్రపంచము, నామరూపములు లేని ప్రధానము మఱియు ప్రకృతి నుండి జనించును. ఈ విధముగా ఇక్కడ కూడా కారణము కార్యమునకు భిన్నమైయున్నది. లయావస్థయందు పదార్థములన్నియును ప్రధానమునందు లయించి ఏకత్వము నొందును.

ప్రాపంచిక కార్యములన్నియు ప్రధానమునందు ప్రవేశించును. లయావస్థయందు కార్యము తన కారణముతో అభిన్నత నొందునని సాంఖ్యులు కూడా అంగీకరింతురు. కావున 8వ సూత్రములోని ఆక్షేపణ ప్రధానమునకు కూడా వర్తించును. కార్యముయొక్క అనారంభస్థితి యందది ఉనికి లేనిదైయుండెనని సాంఖ్యులంగీకరింపవలసియుండును. వేదాంతమునకు విరుద్ధముగా ఏయే ఆక్షేపణలు చెప్పఁబడినవో, అవన్నియును సాంఖ్యుల విషయమునందు నిజముగా నిరూపింపఁబడును. ఇట్టి వ్యర్థమైన తర్కముచే శ్రుతి సమ్మతమగు ప్రపంచకారణమైన బ్రహ్మము త్రోసివేయఁబడదు. వేదాంతము శ్రుతి సమ్మతమైయున్నది. కావున వేదాంతసిద్ధాంతము ప్రామాణికమైనది. మఱియు అమోఘమైనది. కావున అది అంగీకరింపఁబడ వలయును. మఱియు వేదాంతదృష్టికోణముననుసరించి ఆక్షేపణలు నిర్మూలింపఁబడుటచే, వేదాంత దృక్పథమును మనమనుసరింపవలసి యున్నది. సాంఖ్యదృష్టి కోణముననుసరించి ఆయాక్షేపణలు నిర్మూలింపఁబడుట అసాధ్యము.

## 2-1-11 తర్కా ప్రతిష్ఠానాదప్యన్యథానేమేయమితి చేదేవ మప్యనిర్మోక్ష ప్రసంగః

తర్కవితర్కములచే మన నిర్ణయము స్థిరపడకున్నచో మన బుద్ధిని మార్చుకొనవలయునని చెప్పినచో, అట్లైనను మోక్షము సిద్ధించుట సంభవింపదని మా సమాధానము.

తర్క = తర్కము, అప్రతిష్ఠానాత్ = నిర్ణయము లేకుండుటచే, అపి = కూడా, అన్యథా = లేకున్నచో, అనుమేయమ్ = ఊహింపఁబడవలయును, ఇతిచేత్ = అని చెప్పినచో, ఏవం = ఇట్లు, అపి = కూడా, అనిర్మోక్ష = మోక్షము కలుగకుండుట, ప్రసంగః = ఫలితము.

4 మఱియు 8 సూత్రములలో చెప్పఁబడిన ఆక్షేపణలింకను ఖండింపఁ బడుచున్నవి.

మహామేధావులగు కపిలుడు, కణాదుడు పరస్పర ఖండనమండనల నొనర్చినట్లు కాననగుచున్నది. తర్కమునకొక నిర్ణయముగాని, అంతముగాని లేదు. ఒక తార్కికుని పరామర్శమును మరియొక తార్కికుడు త్రోసిపుచ్చును. తర్కముచే ఒక మానవుడు నిర్ణయించిన దానిని మఱియొక ప్రజ్ఞావంతుడు, తెలివితేటలుఁ గలవాడు ఖండింపఁగలుగును. ఆత్మకు దృష్టాంతముఁగాని, వివాదముఁగాని వర్తించదు. ఎంతటి బుద్ధిమంతుడైయున్నను కేవలము తర్కముచే నిర్ణయింపఁబడు నిశ్చయములు శాస్త్రప్రామాణ్యములు కాకుండుటచే వాటినంగీకరింపదగదు. ఏలననగా ఇంకను మిక్కిలి కుశలురగు కుతర్కవాదులచే అవి ఖండింపఁ బడుటకవకాశము కలదు. కావున శ్రుతి ప్రామాణ్యమగు విషయమునే అంగీకరింపవలసి యుండును.

తర్కమున కేలాటి స్థానము నొసంగకుండా విశ్వమున కుపాదానకారణము బ్రహ్మమేయని మనము విశ్వసింపవలసియున్నది. ఏలననగా ఉపనిషత్తుల ప్రబోధమిట్టిదేనైయున్నది.

శ్రుతిసమ్మతములగు వేదాంత సిద్ధాంతములు ప్రామాణికములు మఱియు అమోఘములైయున్నవి. ఒక నిశ్చితమైన అధారములేని తర్కము వేదాంత సిద్ధాంతమును త్రోసిపుచ్చజాలదు.

తర్కము తన స్వంత ఆశయమును మఱియు స్థానమును కలిగియుండును. కొన్ని ప్రత్యేక ప్రాపంచిక విషయములయందది ప్రయోజనమును కలిగియుండును. కాని బ్రహ్మము యొక్క అస్తిత్వము, పరమపదప్రాప్తి, పారలౌకికజీవనము, మానవబుద్ధి యొనర్చు తీర్మానములనుఁగూర్చి నిస్సంశయమగు నిర్ణయము నొసంగదు. ఏలననగా ఇయ్యవి బుద్ధికతీతములగు విషయములైయున్నవి. తర్కమునకేదైన నిశ్చయమున్నచో, అది ఆత్మకు సంబంధించిన సిద్ధాంతనిర్ణయము నొసంగదు. ఏలననగా ఇంద్రియములకు ఆత్మ పట్టుఁబడదు. బ్రహ్మము దృష్టికిఁగాని, లేక దృష్టి నాధారముగా కలిగియున్న అనుమానమునకుఁగాని ఒక విషయము కాదు. బ్రహ్మము దృష్టికగోచరము మఱియు తర్కమున

కభేద్యమునైయున్నది. కఠోపనిషత్తిట్లు నుడువుచున్నది. 'నైషాతర్కేణ మతిరాపనేయాప్రోక్తా ఽన్యేనైవసుజ్ఞానాయప్రేష్ఠ' (కఠ. ఉ. 1-2-9).

పూర్వపక్షి ఇట్లనును : తర్కము 'సుప్రతిష్ఠితము కాదని నీవు పలుకలేవు. ఏలననగా తర్కముఁగూర్చిన విచారణ కూడా తర్కముచేతనే పొందఁబడును. తర్కమున కాధారము తర్కము కాదను విషయము నీకు స్వయముగా తెలియును. కావున తర్కమునకొక నిశ్చితమైన ఆధారము లేదనుట అసంగతము. మఱియు తర్కములన్నియును అలభ్యములైయున్నచో, మానవజీవితమిప్పటికి సమాప్తమైయుండెడిది. నీవు సవ్యముగాను, సక్రమముగాను తర్కింపవలసియున్నది.

అట్లగునేని 'మోక్షప్రాప్తి' అసంభవమని మేము పూర్వపక్షియొక్క వాదమును ప్రతిఘటింపవలసివచ్చును. తర్కము కొన్ని ప్రత్యేక విషయములలో సుప్రతిష్ఠితమైయున్నను, ప్రస్తుత చర్చనీయాంశమునుఁబట్టి 'మోక్షము లభింపకుండుట' సంభవించును.

పూర్ణజ్ఞానముచేతనే జీవుడు పరమగమ్యస్థానమునొందునని ఋషులు వచించియున్నారు. పూర్ణజ్ఞాన మెల్లప్పుడు సౌమ్యరూపమునందుండును. ఇది స్వయముగా సత్తాపై ఆధారపడియుండును. ఏ పదార్థము శాశ్వతముగా ఏకైక స్వరూపమును కలిగియుండునో, అదియే సత్పదార్థమనఁబడును. ఇట్టి పదార్థజ్ఞానము పూర్ణజ్ఞానము లేక సత్యజ్ఞానమనఁబడును. మానవుల పరస్పర విరుద్ధభావములీ పూర్ణజ్ఞానము, లేక సత్యజ్ఞానమునందుండుటకవకాశము లేదు. కాని తార్కికసిద్ధాంతములొక సౌమ్యరూపమునందుండవు. సాంఖ్యులు తర్కముద్వారా ప్రధానమే విశ్వమునకు కారణమని వాదింతురు. పరమాణువులే ప్రపంచమునకు కారణమని తర్కముద్వారా నైయాయికులు నిర్ణయింతురు. దేని నంగీకరింప వలయును? కావున తర్కముపై ఆధారపడియున్నదేదియో మఱియు ఏది ఎల్లప్పుడేకైక నిర్ణయమును కలిగిలేదో, అట్టి జ్ఞానము పూర్ణజ్ఞానమునకు సాధన మెట్లగును? శ్రుతివిరుద్ధమైన తర్కముద్వారా మనమొక సవ్యమగు నిశ్చయమునకు రాజాలము. వేదము శాశ్వతమైనది. అది జ్ఞానమునకు నిధివంటిది. దృఢప్రతిష్ఠితములైయున్న సిద్ధాంతములే దానికి విషయమైయున్నది. వైదిక ప్రతిపాదిత జ్ఞానము భూతభవిష్యద్వర్తమాన తార్కికులచేత కూడ నిషేధింపఁబడదు.

తర్కము ద్వారా సత్యము తెలియఁబడకుండుటచే తార్కికులకు ముక్తి కూడా అసంభవము.

ఉపనిషత్తులు, లేక శ్రుతుల సహాయముచే పొందఁబడు బ్రహ్మజ్ఞానము ద్వారా ముక్తినిఁ బడయవచ్చునను నిర్ణయమునకు మనమేతెంచితిమి. శ్రుతుల సహాయము లేకుండా పూర్ణజ్ఞానమునుఁ బడయుట అసాధ్యము. శ్రుతులను తృణీకరింతుమేని పరమపదప్రాప్తి లభ్యముకాదు. శ్రుతివిరుద్ధమైన తర్కముచే జ్ఞానము లభించుట కల్ల.

శాస్త్రాధారముచేతను మఱియు శాస్త్రమున కనుబంధమగు బుద్ధికుశలత చేతను విశ్వమునకు కారణము మఱియు ఆధారము చైతన్యవంతమగు బ్రహ్మమేనైయున్నదను తుది నిర్ణయమునకు మన మేతెంచితిమి.

# 4. శిష్ట పరిగ్రహాధికరణము

## 2-1-12 ఏతేన శిష్టా పరిగ్రహా అపి వ్యాఖ్యాతాః

సాంఖ్యమునకు విరుద్ధమైన ఈ వివరణముచే సిద్ధపురుషులచే అంగీకరింపఁబడని ఇతర సిద్ధాంతములు కూడా ఖండింపఁబడినట్లేయగును.

ఏతేన = సాంఖ్య విరుద్ధమగు వివరణముచే, శిష్టాపరిగ్రహాః = శిష్టులచే అంగీకరింపఁబడని మతములు, అపి = కూడా, వ్యాఖ్యాతాః = వివరింపఁబడినవి, లేక ఖండింపఁబడినవి.

వేదవిరుద్ధమైన ఇతర మతములు, లేక సిద్ధాంతములు ఖండింపఁబడినవి.

శిష్టా : వేదములోని 'అణుసిద్ధాంతము' వంటి ఇతర సిద్ధాంతములు.

అపరిగ్రహా : ఈ విషయములలో వేదములను ప్రమాణముగా అంగీకరించని మతములు, మఱియు వేదములచే గణింపఁబడని కేవల తర్కము నాధారముగాఁ గొనియున్న సిద్ధాంతములు.

శిష్టాపరిగ్రహా : వేదపారంగతులచే అంగీకరింపఁబడని ఇతర మతములు, లేక సిద్ధాంతములు, వేదవిరుద్ధములైన నానా విధములగు ఇతర మతములు.

సాంఖ్యమునకు విరుద్ధమైయున్న పై వివాదముచే వేదవిరుద్ధములైయున్న మఱియు జ్ఞానుల మతమునకు ప్రతికూలములైయున్న నానావిధములగు సిద్ధాంతములన్నియును ఖండింపఁబడినవి.

ప్రధానము, లేక ప్రకృతి ప్రపంచమునకు కారణమైయున్నదని పలుకు సిద్ధాంతమువలె పరమాణువులు కారణములని ప్రతిపాదించు సిద్ధాంతములున్నూ శాస్త్ర సవ్యజ్ఞాన నిష్ణాతులైయున్న మనువు మఱియు వ్యాసులవారిచే ఖండింపఁ బడినవి. వైదిక సిద్ధాంతమునకు సామీప్యమునందున్నదియు పుష్టివంతము, బలవంతమునగు ప్రధానమును ప్రతిపాదించు సిద్ధాంతము ప్రప్రథమముగా ప్రతిఘటింపఁబడుటకు యోగ్యమైయున్నది. మఱియు కొంతవరకిది వేద ప్రామాణ్యము ననుసరించి పోషింపఁబడుచున్నది. మిక్కిలి ప్రధానమైన శత్రువు జయింపఁబడినప్పుడు ఉపశత్రువులు కూడా జయింపఁ బడినవారే యగుదురు. అదేవిధముగా సాంఖ్యసిద్ధాంతము ఖండింపఁబడినప్పుడు ఇతర సిద్ధాంతము లన్నియును ఖండింపఁబడినవే యగును.

సాంఖ్యసిద్ధాంతమునున్మూలించుట ద్వారా వేదములలో కానరాని కణాద, గౌతమ, అక్షపాద, బౌద్ధ ఇత్యాది ఇతర మత సిద్ధాంతములున్నూ ఖండింపఁబడినవే యగునని ఈ సూత్రము మనకు ప్రబోధించును. ఏలననగా ఈ విషయములలో వేదములనివి ప్రతిఘటించును. సాంఖ్యసంబంధ విషయములే ఇందుకు కారణము.

పరమాణుసిద్ధాంతమునందు ఏకైక అభిప్రాయము కానరాదు. బౌద్ధుల చతుర్విధ మతములు దానిని అశాశ్వతమని పలుకగా కణాదుడు మఱియు గౌతముడు దానిని శాశ్వతమని పేర్కొనిరి. వైభాషిక బౌద్ధులు పరమాణువులను క్షణికములనియు, అర్థభూతములనియును ప్రతిపాదించిరి. యోగాచారబౌద్ధులు దానిని కేవలము జ్ఞానరూపముగా పేర్కొనిరి. మాధ్యమికులు దానిని శూన్య రూపముగా తలంచిరి. జైనులు దానిని సదసద్రూపముగా విశ్వసించిరి.

# 5. భోక్త్రాపత్త్యధికరణము

## 2-4-13 భోక్త్రాపత్తేర విభాగశ్చేత్ స్యాల్లోకవత్.

బ్రహ్మము కారణమైయున్నచో భోగ్యపదార్థములు భోక్తగా మాఱుటచే భోక్తృభోగ్యాభేదము సిద్ధించునని పలికినచో, ఇట్టి భేదము లోకసామాన్యానుభవమునుఁ బోలియుండవచ్చునని మేము సమాధానము నొసంగుదుము.

భోక్తృ = సుఖదుఃఖముల ననుభవించువాడు, ఆపత్తేః = నిషేధింపఁబడినచో, అవిభాగః = అభేదము, చేత్ = చెప్పఁబడినచో, స్యాత్ = ఉండవచ్చును, లోకవత్ = ప్రపంచానుభవరీత్యా.

బ్రహ్మము కారణమను విషయమునకు విరుద్ధముగా తార్కికమగు మరియొక ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

భోక్తయగు జీవునికి మఱియు భోగ్యపదార్థములకు మధ్యగల భేదము సామాన్యానుభవముచే సుప్రసిద్ధమై యున్నది. సదేహులైన చైతన్యవంతములగు జీవులు భోక్తలు మఱియు శబ్దాదులు భోజ్యములునై యున్నవి. ఉదాహరణార్థము రామకృష్ణుడు భోక్త మఱియు అతడు భుజించు మామిడిపండు భోగ్యపదార్థమై యున్నది. విశ్వమునకు ఉపాదానకారణము బ్రహ్మమైయున్నచో, కార్యరూపమైన ప్రపంచము బ్రహ్మమున కభేదమైయుండెడిది. జీవుడు మఱియు బ్రహ్మము తాదాత్మ్యములై ఒకదానియందింకొకటి చొచ్చుకొని యుండుటచే, కర్తకర్మలకు భేదరాహిత్య మేర్పడియుండెడిది. తత్ఫలితముగా బ్రహ్మము విశ్వమునకు ఉపాదానకారణమని చెప్పఁబడజాలదు. ఏలననగా దానిచే సుప్రతిష్ఠమైయున్న భోక్తృ భోగ్య విభేదము నిర్మూలింపఁబడును.

ప్రపంచమునకు కారణము బ్రహ్మమని చెప్పు సిద్ధాంతముచే భోక్తృ భోగ్యమేళనము కలుగునని నీవు పలికినచో, మా విషయమునందు కూడా ఇట్టి విభేదము యోగ్యరూపమునందున్నదని మేము బదులు పలుకుదుము. దీనికి ప్రపంచములోని సముద్రము, దాని అలలు, బుడగలు, నురుగు మఱియు సూర్యుడు, సూర్యకిరణములు దృష్టాంతములైయున్నవి. సముద్రపుటలలు, నురుగులు మఱియు

బుడగలు ఏకమైయున్నను ఈ విశ్వమునందు విభిన్నములుగా దృష్టిగోచరములగును. బ్రహ్మము మఱియు ప్రపంచము కూడా ఇట్టివేనైయున్నవి. అతడు సృష్టించి, ఆ సృష్టియందు ప్రవేశించెను. మఠాకాశము మఱియు ఘటాకాశము వేర్వేఱుగా ఉన్నట్లు కన్పట్టినను అవి ఎట్లేకమేయగునో, అట్లే అతడు తన సమస్త సృష్టితో తాదాత్మ్యము నొందియున్నాడు.

కావున నామరూపముల కారణముచే పదార్థములు ఒకే సమయమునందు భేదమును మఱియు అభేదమును కలిగియుండుట సాధ్యమగును. భోక్తలు మఱియు భోగ్యపదార్థములు ఒకదానియందొకటి చొఱఁబడవు. ఐనను అవి పరబ్రహ్మమునకు భిన్నమైలేవు. బ్రహ్మముయొక్క దృష్టికోణము ననుసరించి భోక్తలు మఱియు భోగ్యపదార్థములకు భేదము లేదు. కాని భోక్తృ భోగ్య విభేదమును మాత్రము అవి కలిగియున్నవి. దీనియందు వైరుధ్యము లేదు.

తుది నిర్ణయమేమనగా బ్రహ్మమున కభేదమైయున్నను, భోక్తృభోగ్య పదార్థములు విభేదమును కలిగియుండుట సాధ్యమగును. సముద్రము దాని అలలు, నురుగులు, బుడగల యొక్క ఉపమానము వలె ఇవి తమ పరమ కారణమైయున్న బ్రహ్మమునకు విభిన్నమైలేవు.

# 6. ఆరంభణాధికరణము
## (14-20 సూత్రములు)

## 2-1-14 తదనన్యత్వమారంభణ శబ్దాదిభ్యః

కార్యకారణ తాదాత్మ్యత 'ఆరంభణా'ది శబ్దములచే లభ్యమగును.

తత్ = విశ్వము యొక్క, అనన్యత్వం = అభేదము, ఆరంభణ శబ్దాదిభ్యః = 'ఆరంభణ' ఇత్యాది శబ్దములచే.

ఇచ్చట కార్యము కారణమునకు భిన్నము కాదని తెలుపఁబడినది.

సూత్రకారుడు 13వ సూత్రమునందు పరిణామవాదదృష్టి ననుసరించి ప్రబోధించుచు, దృష్టికి విరుద్ధముగానున్న బ్రహ్మము ఉపాదానకారణము కాదనెడి పూర్వపక్షి యొక్క ఆక్షేపణను ఖండించెను. పరిణామవాదమునందు బ్రహ్మము నిజముగా మార్పునొందును. అదే ఆక్షేపణ ఇప్పుడు వివర్తవాదదృష్టిచే త్రోసివేయఁ

బడుచున్నది. వివర్తవాదమునందు కేవలము తాత్కాలికమైన మార్పుండును. త్రాడు పాముపలె కన్పట్టును. కాని అది నిజముగా సర్పముగా మారలేదు. ఇదియే శ్రీ శంకరులవారి అద్వైతసిద్ధాంతము.

పూర్వసూత్రమునందు పదార్థములలోని తాత్కాలిక విభేదము నంగీకరించుచు, సముద్రము మఱియు తరంగముల దృష్టాంతము చూపఁబడినది. కాని నిజమునకు ఇప్పుడు కూడా కార్యకారణములు ఏకమేనై యున్నవి. మట్టిముద్ద తెలియఁబడినప్పుడు మట్టిపాత్రలన్నియును తెలియబడునట్లు 'ఆరంభణ' శబ్దముచే ఇదియంతయు స్పష్టమగుచున్నది. నామము కేవలము వాచిక విభేదమైయున్నది. మట్టి మాత్రమే నిజమైన పదార్థము. ఒక కుండ ఇప్పుడు కూడా మన్నేయైయున్నది. అదే విధముగా ప్రపంచము ఇప్పుడు కూడా బ్రహ్మమేనైయున్నది. సముద్రము మఱియు అలలు మున్నగువానివలె ఏకత్వ, నానాత్వములు రెండున్నూ సత్యములేయని పలుకుట పొరపాటు. 'మృత్తికేత్యేవ'లోని 'ఏవ' శబ్దముచే నానాత్వము అసత్యమని తెలియుచున్నది. ఆత్మ బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నది.

పూర్వపక్షి ఇట్లనును : ఏకైక సత్యమగు బ్రహ్మముండియున్నచో నానా విధములగు దృశ్యపదార్థముల కునికి లేకుండెడిది. అప్పుడు నైతికసిద్ధాంతము నిష్ప్రయోజనమగును. విభేదముల కాధారమైయున్న నిజమైన ఉనికి తెలియఁబడనప్పుడు శ్రుతులలోని విధినిషేధములు తమ లక్ష్యమును కోల్పోవును. ఇంతేకాకుండా ఒకవేళ గురుశిష్యుల మధ్యఁగల భేదమసత్యమైయున్నచో దీని నాధారముగాఁగొనియున్న జీవుని ముక్తి పథమునందున్నూ సత్యత యుండదు. బంధము లేనప్పుడు ముక్తియున్నూ ఉండనేరదు. జీవుని విజ్ఞానమే అసత్యమైనప్పుడు అది సత్యత్వమునకు దారితీయదు. మోక్షసిద్ధాంతమే అసత్యమైయున్నప్పుడు, జీవుని తాదాత్మ్యత నిజమని ఎట్లు చెప్పఁగలము?

కాని మెలకువ రానంతవఱకు స్వప్నములోని పదార్థములు నిజముగా తలంపఁబడునట్లు, బ్రహ్మజ్ఞానము కలుగనంతవఱకు ఈ యైహికప్రపంచమంతయు నిజముగా కన్పట్టుటచే ఈ యాక్షేపణలు నిర్వీర్యములైయున్నవి. స్వప్నానంతరము మేల్కొన్నప్పుడు స్వప్నప్రపంచము అసత్యమని మనకు తెలియును. కాని స్వప్నజ్ఞానము మాత్రము అసత్యము కానేరదు. ఇంతేకాకుండా కొన్ని వేళలలో స్వప్నములు కూడ సత్యమైన మృత్యువునుఁ గూర్చిన నిశ్చయమును సూచించును. అజ్ఞానమును

మఱియు మోహమును నశింపజేయునదగుటచే బ్రహ్మసాక్షాత్కార సత్యతను మిథ్యగా తలంపరాదు.

## 2-1-15 భావేచోపలబ్ధేః

మఱియు కారణము యొక్క అస్తిత్వము చేతనే కార్యము అనుభూతమగును. భావే = కార్యసత్తా ఉండగా, చ = మఱియు, ఉపలబ్ధేః = అనుభూతమగుటవలన.

14వ సూత్రమునందారంభింపఁబడిన ప్రపంచము తన కుపాదాన కారణమైయున్న బ్రహ్మమునకు భిన్నము కాదనెడి వాదము కొనసాగుచున్నది.

కారణము యొక్క అస్తిత్వమున్నప్పుడే కార్యము చూడఁబడును. కాని ఇతరత్ర కాదు. కుమ్మరివాడుఁగాని, లేక సాలెవాడుఁగాని లేనప్పుడు ఒక కుండఁగాని, ఒక వస్త్రముఁగాని ఉనికి కలిగియుండును. కాని మట్టిఁగాని, దారముఁగాని లేనప్పుడు కాదు. దీనిచే కార్యము కారణమునకు భిన్నమై లేదని నిరూపింపఁ బడుచున్నది. ఛాందోగ్యమునందీ క్రింది వాక్యము కలదు. 'సన్మూలాస్సోమ్యే మాస్సర్వాః ప్రజాస్సదాయత నాస్సత్ప్రతిష్ఠాః (6-8-4)

పూర్వపక్షి ఇట్లనును : ధూమమునందగ్ని కానరాదు. ధూమము అగ్ని యొక్క కార్యమగుటచే, దానియందగ్ని కనఁబడవలసియుండెను.

దీనికి మా సమాధానమేమనగా, ధూమము నిజముగా తేమగానున్న ఇంధనము యొక్క కార్యమే యగును. తడిగానున్న కర్ర అగ్నితో కలిసినప్పుడది తనలోని పృథ్వి సంబంధ విభాగములను ధూమము యొక్క రూపమునందు బయటికి నెట్టివేయును. ధూమము మఱియు ఇంధనములు తాదాత్మ్యములు. ధూమమునందు మనము ఇంధనమునుఁ గాంచవచ్చును. పొగ ఇంధనము వంటి వాసనను కలిగి యుండుటయే దీనికి ప్రమాణము. సామాన్యముగా పొగ ఇంధనము వంటి స్వభావమును కలిగియుండును.

బ్రహ్మము యొక్క ఉనికి చేతనే ఈ భౌతిక విశ్వము వ్యక్తమగును. బ్రహ్మము వినా అది నిశ్చయముగా మనకు కానఁబడదు. కావున కార్యమైన ప్రపంచము కారణమైన బ్రహ్మమునకు భిన్నమైలేదు.

## 2-1-16 సత్త్వాచ్చావరస్య

మఱియు సృష్టికి పూర్వము కారణము ఉనికిని కలిగియుండుటచే.

సత్త్వాత్ = సత్తా కారణముచే, చ = మఱియు, అవరస్య = కార్యమైన ప్రపంచము యొక్క.

14వ సూత్రమునందారంభింపఁబడిన వాదమింకను కొనసాగుచున్నది.

సృష్టికి పూర్వము కారణావస్థయైన బ్రహ్మమునందు కార్యమైన ప్రపంచము ఉనికిని కలిగియుండెనని శ్రుతి వచించుచున్నది.

'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్' (ఛాం. ఉ. 6-2-1) ఓ సౌమ్యుడా! ప్రారంభమునందు ఇది మాత్రమే ఉండియుండెను. 'ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ (ఐ. ఆర. 1-1-1) ప్రారంభమునందు నిశ్చయముగా ఏకైకమగు ఆత్మయే ఉనికిని కలిగియుండెను. 'బ్రహ్మావా ఇదమగ్ర ఆసీత్' (బృ. ఉ. 1-4-10) సృష్టికి పూర్వము ఈ విశ్వము బ్రహ్మముగా ఉనికిని కలిగియుండెను.

సృష్టికి పూర్వము విశ్వము తనకు కారణమైయున్న బ్రహ్మమునందునికిని కలిగియుండెనని ఉపనిషత్తులుద్ఘోషించుచున్నవి. అది బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియుండెను. సృష్టికి పూర్వము ప్రపంచము కారణమున కభిన్నమైయుండుటచే సృష్ట్యనంతరము కూడా అది అభిన్నముగనే యుండును.

కార్యమైన ప్రపంచము కారణమైన బ్రహ్మమున కభిన్నమైయున్నది. ఏలననగా అది కారణమునందునికిని కలిగియున్నది. కాలమునందు తారతమ్యమున్నను సృష్టికి పూర్వమది తాదాత్మ్యతను కలిగియుండెను.

ఒక పదార్థము రెండవ పదార్థమునందునికిని కలిగియుండనిచో దానియొక్క ఆత్మనుండి రెండవ పదార్థము సృష్టింపఁబడదు. దృష్టాంతముగా ఇసుకనుండి నూనె సృష్టింపఁబడదు. మనము నూనెను వేఱుసెనగనుండి పొందవచ్చును. ఏలననగా అది దానియందున్నది. కాని అది సూక్ష్మరూపమునందున్నది. ఇసుకలో నూనె లేకుండుటచే అది దానినుండి ఉత్పన్నము కాదు. ప్రపంచమునందును, బ్రహ్మమునందును ఒకే విధమైన సత్తా యుండును. బ్రహ్మమునందు ప్రతిపదార్థము ఉనికిని కలిగియుండుటచే అది దానినుండి ఏతెంచుట కవకాశము కలదు.

అన్నివేళలయందు బ్రహ్మమేపరిమాణమునందున్నదో దానికి ఎక్కువఁగాని, తక్కువఁగాని అది పరిణామము నొందదు. కావున కార్యరూపమైన ప్రపంచము కూడా అన్ని వేళలయందొకే పరిమాణము నందుండును. ఉన్నదేదో అది ఏకమేనైయున్నది. కావున కార్యము కారణమున కభిన్నమైయున్నది.

## 2-1-17 అసద్వ్యపదేశాన్నేతిచేన్న ధర్మాంతరేణ వాక్యశేషాత్.

లేనిదేదో అదియని కార్యము వర్ణింపఁబడుటచే సృష్టికి పూర్వము కార్యమున కునికిలేదని చెప్పినచో 'అట్లుకాద'ని మా సమాధానము. ఏలననగా 'లేనిదేదో అది' యను శ్రుత్యుత్తరభాగమునందున్న శబ్దసముచ్చయము మరియొక గుణమును సూచించును.

అసద్వ్యపదేశాత్ = అసత్తని వర్ణింపఁబడుటచే, న= కాదు, ఇతిచేత్ = అని పలికినచో, న = లేదు, ధర్మాంతరేణ = మఱియొక ధర్మముచే, వాక్యశేషాత్ = ఉత్తరభాగములోని శ్రుతిచే.

సృష్టికి పూర్వము ప్రపంచమున కునికి లేదనువాదము ఖండింపఁబడినది.

ఉనికి లేని అర్థము నొసంగు శ్రుతిలోని 'అసత్' శబ్దముచే సృష్టికి పూర్వము ప్రపంచమునకునికి లేదని వాదింపఁబడవచ్చును. కాని ఈ వాదము నిలువనేరదు. ఏలననగా సృష్టికి పూర్వము ప్రపంచము యొక్క ఉనికిని వర్ణించునప్పుడు శ్రుతియొక్క ఉత్తరభాగము 'అసత్తు' నకు భిన్నమైన లక్షణములను పేర్కొనినది. దీనిచే సృష్టికి పూర్వము ప్రపంచముండియుండెనని మనకర్థమగుచున్నది. ఇది తర్కముచేత కూడా నిరూపింపబడును. ఏలననగా శూన్యమునుండి ఏ పదార్థమైనను ఉత్పన్నము కాదు. మఱియు శ్రుతియొక్క తదితర భూమికలయందున్నూ ఇది స్పష్టమొనర్చఁబడినది. 'అసద్వా ఇదమగ్ర ఆసీత్' (తై. ఉ. 6-1) ప్రారంభమునందు నిశ్చయముగా ఇది అసత్తేయైయుండెను.

'అసదేవేదమగ్ర ఆసీత్' (ఛాం. ఉ. 3-19-1) ఈ విశ్వము ప్రారంభమునందు అసత్తేయై యుండెను. నిశ్చయముగా ఇది ఆదియందసత్తైయుండెను. దాని నుండియే నిశ్చయముగా సత్తు ఉత్పన్నమైనది. 'తత్సదాసీత్' (అది సత్తైయుండెను) అనునది ఈ పరిచ్ఛేదము యొక్క ఉత్తరభాగము. 'అసత్త'ను శబ్దమిచ్చుట పూర్ణముగా ఉనికి లేకుండుటయను అర్థము నొసంగదు. కాని విశ్వము స్థూలమైన. విభిన్నమైన

ఉనికిని కలిగి లేకుండెనని భావము. అది మిక్కిలి సూక్ష్మమైన అవ్యక్తస్థితి యందుండెను. అది అపంచీకృతమై యుండెను. దానికి నామరూపములు లేకుండెను. ప్రపంచము సృష్టింపఁబడిన అనంతరమది స్థూలమై, దానికి నామరూపము లేర్పడెను. 'అది ఉనికిని కలిగియుండెను'. 'అది వృద్ధి నొందెను' అను శ్రుతి విభాగమును పఠించినచో నీకు దీని అర్థమవగాహనమగును.

అసత్తు ఉనికిని కలిగియుండెనని చెప్పుట అసంగతము. కావున సత్ అనగా వ్యక్తమగుట, లేక నామరూపములను కలిగియుండుటయని భావము. ఇక అసత్ అనగా కేవలము సూక్ష్మము, నిర్మలము మఱియు అవ్యక్తమని భావము. 'అసత్ అనునది కార్యము యొక్క మఱియొక లక్షణమును అనగా అవ్యక్తమును సూచించును. సదసచ్ఛబ్దములు ఒకేయొక పదార్థము యొక్క రెండు లక్షణములను అనగా స్థూలమైన, లేక వ్యక్తమైయున్న స్థితిని మఱియు సూక్ష్మమైన, లేక అవ్యక్తమైన స్థితిని సూచించును.

'అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వైసదజాయత। తదాత్మానం స్వయమకురుత। తస్మాత్ తత్సుకృత ముచ్యత ఇతి। యద్వైతత్సుకృతమ్।'

ప్రారంభమునందిది నిశ్చయముగా అసత్తైయుండెను. నిశ్చయముగా దానినుండియే సత్తు జనించెను. అది స్వయముగా దానికి ఆత్మయయ్యెను. కావున అది స్వయంభువని చెప్పఁబడును.

'తత్' అను శబ్దము యొక్క నిజమైన అర్థమునందుఁగల సంశయమును 'అసత్తు స్వయముగా దానికి ఆత్మయయ్యెన'ను శబ్ద సమూహము నివారించును. ఒకవేళ 'అసత్త'ను శబ్దము పూర్తిగా శూన్యమును అర్థమునొసంగునేని, అప్పుడు శబ్దముల మధ్య పరస్పర వైరుధ్యమేర్పడును. ఏలననగా అసత్తు స్వయముగా మరియొక పదార్థమున కాత్మ కానేరదు. 'అసత్'కు చేర్చఁబడిన 'ఆసీత్' (ఉండెను) అను శబ్దమసంగతమగును. ఏలననగా పూర్తిగా శూన్యమైయున్న పదార్థము ఉన్నదని చెప్పఁబడదు. మఱియు 'ఆసీత్' అనగా 'ఉండెన'ని అర్థము. పూర్తిగా శూన్యమైయున్న ఒక పదార్థము భూతకాలముతోఁగాని, వర్తమానకాలముతోఁగాని, సంబంధమును కలిగియుండదు. మఱియు 'అది స్వయముగా దాని కాత్మయయ్యెన'నెడి వాక్యానుసారముగా దానికేలాటి కర్తృత్వము కూడా ఉండనేరదు.

కావున 'అసత్' శబ్దము ఒక పదార్థముయొక్క సూక్ష్మమైన భూమికనుఁగూర్చి వివరించునని చెప్పవచ్చును.

## 2-1-18 యుక్తేః శబ్దాంతరాచ్చ

యుక్తిచేతను మఱియు ఇతర శ్రుతిచేతను కార్యకారణ సంబంధము స్పష్టమగుచున్నది.

యుక్తేః = తర్కముచే, శబ్దాంతరాత్ = మరియొక శ్రుతిచే, చ = మఱియు.

సృష్టికి పూర్వము కార్యమున్నదనియు మఱియు అది కారణమున కభిన్నమైయున్నదనియును తర్కముచేతను మఱియు వేదములలోని ఇతర శ్రుతివాక్యము చేతను స్పష్టమగును.

ఈ విషయము న్యాయముచే, లేక తర్కముచేత కూడా స్పష్టమగును. అట్లు కాదేని ప్రతిపదార్థము ఏ పదార్థము చేతనైనను సృష్టింపఁబడియుండెడిది. అసత్తే కారణమైయున్నచో, అనివార్యమైన క్రమమేల యుండవలయును? పాలనుండియే పెరుగు ఉత్పన్నము కానేల? మట్టి నుండి ఏల ఉత్పన్నము కాకూడదు? కారణమునకు భిన్నమైయున్న కార్యమును వేయి సంవత్సరముల తర్వాత కూడా తీసికొనివచ్చుట అసంభవము. ప్రత్యేక కారణములు ప్రత్యేక కార్యములను మాత్రము జనింపఁజేయును. కారణమునందున్న శక్తియే కార్యమును సృష్టింపఁజేయును. కార్యకారణ సంబంధము (మట్టి మఱియు మట్టి పాత్రలకు గల సంబంధము) తాదాత్మ్య సంబంధమైయున్నది. మట్టిముద్ద ఒక మూతి, శూన్యమైయున్న కడుపువంటి ఒక ప్రత్యేక రూపమునుఁదాల్చినప్పుడు 'కుండ ఉన్నద' ని మనమూహింపఁ గలుగుదుము మఱియు చెప్పఁగలుగుదుము. కాని ఆ పదార్థమంతయు మట్టిగానే శేషించియుండును. దీనికి విరుద్ధముగా మట్టికుండ పగిలిపోయినప్పుడు 'కుండ లేద'ని మనమూహింతుము మఱియు పలుకుదుము. కావున అస్తిత్వము మఱియు నాస్తిత్వము వాటియొక్క వేర్వేరు భూమికలను మాత్రము సూచించును. ఈ సందర్భమునందు నాస్తిత్వమనగా పూర్తిగా శూన్యత్వమని అర్థము కాదు. ఇదియే యుక్తియని చెప్పఁబడును.

ఒక నటుడు అనేకరూపములను ధరించినను, అతడేకముగనే శేషించి యుండునట్లు పరమకారణమైన బ్రహ్మము ఈ నానావిధ పదార్థములుగా

గోచరించినను అది ఏకైకమైయున్నది.

కావున కార్యములకు పూర్వము కారణము ఉనికిని కలిగియుండును, మఱియు అది కార్యమునకభిన్నమైయున్నది.

కార్యము కారణమునందవ్యక్తస్థితియందుండును. అది సృష్టిసమయమునందు వ్యక్తమగును. అంత మాత్రమే. కుందేటికొమ్ము వలె పూర్తిగా ఉనికిలేని పదార్థము ఎన్నటికైనను సృష్టింపఁబడనేరదు. కారణమునందునికి కలిగిలేని ఒక నూతన పదార్థమును అది ఎన్నటికిని సృష్టింపజాలదు.

మఱియు ఛాందోగ్యములోని సుప్రసిద్ధమగు 'సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్' (ఛాం. ఉ. 6-2-1) అను వాక్యమునందు కార్యము సృష్టికి పూర్వమే ఉనికిని కలిగియుండుననియు మఱియు అది కారణమున కభిన్నమై యున్నదనియును చెప్పఁబడినది.

కార్యము కారణముతో తాదాత్మ్యము నొందియుండునను సిద్ధాంతమును దృఢపరచుటకై గ్రంథకర్త ఇప్పుడు కొన్ని దృష్టాంతముల నొసంగుచున్నాడు.

## 2-1-19 పటవచ్చ.

మఱియు ఒక గుడ్డముక్క వలె.

పటవత్ = ఒక గుడ్డముక్క వలె, చ = మఱియు.

17వ సూత్రమును బలపఱచుటకై ఒక దృష్టాంతమొసంగఁబడినది.

చుట్టఁబడిన, లేక మడత వేయఁబడిన ఒక గుడ్డముక్క తదనంతరము చుట్టఁబడకుండా, లేక మడత లేకుండా ఎట్లు చేయఁబడునో, అట్లే సృష్టికి పూర్వము అవ్యక్తరూపముగా విశ్రమించియున్న ప్రపంచమున్నూ తదనంతరము వ్యక్తమగును. సృష్టికి పూర్వమీ ప్రపంచమొక మడతవేయఁబడిన గుడ్డ వలె యుండును. సృష్ట్యనంతరమది ఒక పఱచఁబడిన గుడ్డ వలె యుండును. మడవఁబడిన ఒక గుడ్డ అది పఱచఁబడనంతవరకు ఒక గుడ్డవలె కానఁబడదు. నేయఁబడనంతవరకు పోగులు ఒక గుడ్డవలె కానఁబడవు. అదే విధముగా కార్యము కారణమునందున్నది. మఱియు అది కారణముతో ఏకీభవించి యున్నది. మడచియున్న స్థితియందది ఒక గుడ్డయో, లేక మరియొక పదార్థమో నీకు తెలియదు. కాని అది పఱచఁబడినప్పుడు అది గుడ్డయను విషయము నీకు స్పష్టముగా తెలియును.

ప్రళయకాలమునందు బ్రహ్మమునందీ ప్రపంచము ఒక బీజరూపమునందు, లేక సూక్ష్మావస్థయందుండును.

నామరూపముల కునికి లేదు. ఈ విశ్వమొక అవ్యక్తస్థితి యందున్నది. సృష్ట్యనంతరమది స్థూల రూపమును ధరించును. అప్పుడు నామరూపములేర్పడి వ్యక్తమగును.

ఒక గుడ్డముక్క నూలుపోగులకెట్లు భిన్నమై లేదో, అట్లే కార్యమైన ఈ ప్రపంచమున్నూ కారణమైయున్న బ్రహ్మమునకు భిన్నమై లేదు.

సూత్రములోని 'చ' (మఱియు) యను శబ్దముచే వృక్షము మఱియు బీజమువంటి ఇతర దృష్టాంతములను కూడా ఇచ్చట గ్రహింపవచ్చునని భావము.

ఒక గుడ్డ మడవఁబడి యున్నప్పుడు దాని సరియైన పొడవెంతయో, వెడల్పెంతయో నీకు తెలియదు. కాని అది విప్పఁబడినప్పుడు ఈ వివరములన్నియును నీకు తెలియును. మఱియు మడవఁబడిన పదార్థమున కంటె ఈ బట్ట భిన్నముకాదను విషయము కూడా నీకు తెలియును. కారణమైన పోగులయందునికిని కలిగియున్నంత వరకు కార్యమైన గుడ్డ అవ్యక్తస్థితి యందుండెను. నాడె, మగ్గము, సాలెవాడు మున్నగునవి పనిచేసినప్పుడది వ్యక్తమై స్పష్టముగా చూడఁబడును.

ఈ విధముగా కార్యము కారణమునకు భిన్నము కాదను విషయము నిశ్చయింపఁబడినది.

## 2-1-20 యథా చ ప్రాణాది.

మఱియు వివిధములగు ప్రాణముల విషయము నందువలె.

యథా = వలె, చ = మఱియు, ప్రాణాది = ప్రాణము ఇత్యాదులు.

17వ సూత్రమును బలపఱచునట్టి మరియొక దృష్టాంతమొసంగఁబడినది.

సూత్రములోని 'చ' (మఱియు) శబ్దముచే గుడ్డముక్క యనెడి ప్రథమ దృష్టాంతము మఱియు ప్రాణశక్తులనెడి ప్రస్తుత దృష్టాంతము ఒకే విషయమునుఁ గూర్చిన దృష్టాంతములుగా భావింపవలయునని తెలియవలయును.

వివిధములగు పంచప్రాణములు ప్రాణాయామాభ్యాసముచే నిగ్రహింపఁ బడినప్పుడు శ్వాసకు కారణమైయున్న ముఖ్యప్రాణమునందవి లయించును. అప్పుడు

కేవలము శ్వాస మాత్రము పనిచేయుచుండును. వంగుట, అవయవములను కదలించుట మున్నగు ఇతర కార్యములు నిలిపివేయఁబడును. దీనిచే కార్యములైయున్న వివిధములగు ప్రాణములు, వాటికి కారణమైయున్న ముఖ్యప్రాణమునకు భిన్నములు కావని తెలియుచున్నది. వివిధములగు ప్రాణములు ముఖ్యప్రాణము యొక్క వృత్తులేనైయున్నవి. ఈ విషయము సమస్తకార్యములందును వర్తించును. అవి కారణమునకు అభిన్నములై యుండును.

ఈ విధముగా కార్యమైన ప్రపంచము కారణమైయున్న బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నదను విషయము సిద్ధాంతీకరింపఁబడినది. కావున బ్రహ్మమును తెలిసికొనుట ద్వారా సమస్తము తెలియఁబడును. ప్రపంచమంతయు బ్రహ్మము యొక్క కార్యమగుటచేతను మఱియు దాని కభిన్నమైయుండుటచేతను 'యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి' (ఛాం. ఉ. 6-1-3) అనెడి శ్రుతి వాక్యము ప్రామాణికమగుచున్నది.

# 7. ఇతర వ్యపదేశాధికరణము

## (21-23 సూత్రములు)

### 2-1-21 ఇతర వ్యపదేశాద్ధితా కరణాది దోషప్రసక్తిః

ఇతరుడగు జీవుడు బ్రహ్మమున కభిన్నుడని చెప్పుటచే బ్రహ్మమునకు హితకార్యముల నొనర్పకుండుట మున్నగు దోషము లాపాదింపఁబడును.

ఇతర వ్యపదేశాత్ = ఇతరుడు బ్రహ్మమున కభిన్నుడని చెప్పుటచే, హితాకరణాది దోష ప్రసక్తిః = హితకార్యముల నొనర్పకుండుట ఇత్యాది దోషము లేర్పడును.

ప్రపంచమునకు బ్రహ్మముతోఁగల సంబంధమునుఁగూర్చిన చర్చలిప్పుడు పరిసమాప్తమైనవి. ఈ సూత్రమునందు బ్రహ్మముతో జీవునికిగల సంబంధమునుఁగూర్చిన విరుద్ధాత్మకమగు ప్రశ్న వేయఁబడినది.

పూర్వాధికరణమునందు కార్యమైన ప్రపంచమునకు కారణమైయున్న బ్రహ్మముతోఁగల తాదాత్మ్యత నిరూపింపఁబడినది.

ఈ సూత్రమునందు పూర్వపక్షి మరియొక ఆక్షేపణను చెప్పుచున్నాడు. అతడిట్లనును : ప్రపంచమునకు కారణము బ్రహ్మమైయున్నదను దృష్టికోణము సరియైనది కాదు. ఏలననగా శ్రుతివచనాను సారముగా జీవుడు బ్రహ్మమేయగుటచే అతడు శరీరమును పొందుట ద్వారా జననమరణములు, ఆధివ్యాధుల వంటి వాటిచే తనకుతాను చెరుపు చేసికొనడు. పరమపవిత్రుడైయున్న ఒకానొక పురుషుడు పూర్తిగా అపవిత్రమైన శరీరమును ధరించి, దానికాత్మగా రూపొందజాలడు.

'తదాత్మా' యనెడి శ్రుతివాక్యానుసారముగా ఇతరుడైన జీవుడు బ్రహ్మముతో ఏకత్వము నొందును. 'తత్త్వమసి శ్వేతకేతో' (ఛాం. ఉ. 6-8-7) జీవుడు బ్రహ్మమునకభిన్నుడైయున్నాడని ప్రతిపాదించుటద్వారా బ్రహ్మము జనన మరణములచే తనకుతాను దుఃఖములను మఱియు కష్టములను తెచ్చుకొనుట ద్వారా తనకు తాను అహితమునకు కారణమగుచున్నాడనెడి దోషమేర్పడును. తనకుతాను అహితకరమైన మఱియు నష్టదాయకమైన కార్యమునెవడైనా యొనర్చునా? తాను ప్రపంచమును సృష్టించినాడను విషయమాతనికి జ్ఞప్తియందుండదా? తన దుఃఖమునకు కారణమైయున్నదానినాతడు నశింపఁజేయడా? జీవునికి ఏ మాత్రము దుఃఖమునుఁగాని, బాధనుఁగాని కలిగింపని పూర్ణసంతుష్టి నొసంగు మిక్కిలి అందమైన ప్రపంచమునాతడు సృష్టింపవలసియుండెను. కాని అది ఇట్లు లేదు. కావున వేదాంతమతానుసారముగా బ్రహ్మము ప్రపంచమునకు కారణము కాజాలదు. హితకరమైన కార్యము చేయఁబడకుండుటను మనముఁగాంచుటచే చైతన్యకారణమైన బ్రహ్మమునుండి ఈ ప్రపంచము కలిగినదని ఊహించుట అంగీకారము కాదు.

## 2-1-22 అధికం తు భేద నిర్దేశాత్

కాని జీవుడు మఱియు బ్రహ్మమునందుఁగల భేదమును శ్రుతులు పేర్కొనుటచే, సృష్టికర్తయగు బ్రహ్మము జీవునికంటె అధికుడై యున్నాడు.

అధికం = జీవునికంటె అధికము, తు = కాని, భేదనిర్దేశాత్ = భేదము సూచింపఁబడుటచే.

21వ సూత్రమునందున్న ఆక్షేపణ ఖండింపఁబడినది.

'తు'యను శబ్దము పూర్వసూత్రములోని ఆక్షేపణను ఖండించును. ఇది పూర్వపక్షమును పరిహరించును.

ఈ ప్రపంచము యొక్క సృష్టికర్త సర్వశక్తిమంతుడు. అతడు శరీరమునందు బంధింపఁబడిన జీవుడు కాడు. పూర్వసూత్రమునందు సూచింపఁబడినట్టి హితకరకార్యములను చేయకుండుట ఇత్యాది దోషములు బ్రహ్మమునకంటవు. ఏలననగా శాశ్వతమైన స్వాతంత్ర్యమే అతనికి స్వస్వరూపమై యున్నది. మఱియు అతనికి సత్కార్యాచరణముఁగాని, లేక అసత్కార్య నిషేధమనునదిఁగాని లేదు. ఇంతేకాకుండా అతడు సర్వజ్ఞుడు మఱియు సర్వశక్తిమంతుడగుటచే అతని జ్ఞానశక్తులకడ్డు లేదు. అతడు కేవలము సాక్షి మాత్రుడు. అతడు ప్రపంచము మఱియు జీవుని అసత్యతను గుర్తెఱుంగును. అతనికి మంచిచెడ్డలు లేవు. కావున మంచిచెడ్డలతో కూడిన విశ్వమాతనిచే సృష్టింపఁబడినదనుట నిరాక్షేపమే యగును.

జీవుడు భిన్నమైన స్వరూపమును కలిగియున్నాడు. అజ్ఞానదశయందున్నంత వరకు పూర్వసూత్రములో సూచింపబడిన దోషములు జీవునికి మాత్రమే చెందియుండును. జీవునికి మఱియు సృష్టికర్తకుగల భేదమునుఁగూర్చి శ్రుతులు స్పష్టముగా నుడువుచున్నవి. 'ఆత్మావా అరేద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః' (బృ. ఉ. 2-4-5). అజ్ఞానకారణముచే ఈ విభేదము లన్నియును ఊహామాత్రములు, లేక మిథ్యయైయున్నవి. జీవుడు బ్రహ్మజ్ఞానము నొందినప్పుడు అతనికి బ్రహ్మముతోఁగల తాదాత్మ్యత జ్ఞప్తికి వచ్చును. అప్పుడు అజ్ఞానజనితమగు ఈ దృష్టిగోచరమగు సమస్తజగత్తు అదృశ్యమగును. అప్పుడు జీవుడుఁగాని, సృష్టికర్తఁగాని ఉనికిని కలిగియుండడు.

ఈ బ్రహ్మము జీవునికన్నా శ్రేష్ఠమైనది. జీవుడీ విశ్వమునకు సృష్టికర్త కాడు. కావున 21వ సూత్రములోని ఆక్షేపణ నిలువజాలదు. బ్రహ్మమునకు దోషములంటుకొనుట అసాధ్యము.

బ్రహ్మము జీవరూపము నొందినను, అతడంతటితో పరిసమాప్తి నొందడు. కాని, అతడు జీవునికి నియామకుడై శేషించియుండును. శ్రుతియందు పేర్కొనఁబడిన విభేదమునుఁబట్టి ఈ విషయము స్పష్టమగు చున్నది. కాబట్టి 21వ సూత్రములో చెప్పఁబడిన దోషమున కవకాశము లేదు.

## 2-1-23 అశ్మాదివచ్చ తదనుపపత్తిః

మఱియు భూజన్యములైన రాళ్ళు మున్నగువాటి కనురూపమైయుండుటచే ఆక్షేపణ నిరాధారమై యున్నది.

అశ్మాదివత్ = రాళ్ళుమున్నగువానివలె, చ = మఱియు, తదనుపపత్తిః = అది అసమంజసము (తత్ = తస్య = దానియొక్క 21వ సూత్రములోని ఆక్షేపణ యొక్క)

21వ సూత్రములోని ఆక్షేపణ ఇంకను ఖండింపఁబడుచున్నది.

జ్ఞాననిధి, ఆనందఘనము మఱియు అవికార్యమైయున్న బ్రహ్మము, నానాత్వము మఱియు మంచి చెడ్డలతో కూడియున్న విశ్వమునకు కారణము కాజాలదని పూర్వపక్షి నుడువవచ్చును. ఈ యాక్షేపణ నిలువజాలదు. ఏలననగా భౌతికమైన ఒకేయొక పృథ్వినుండి అనేకరకములగు విలువలు కలిగినట్టి వజ్రములు, వైడూర్యములు, స్ఫటికములు మఱియు సామాన్యమైన రాళ్ళు కూడా ఉత్పన్నమగుచుండుటను మనము గాంచుచున్నాము. ఒకే భూమియందు నాటఁబడిన బీజములనుండి తమ ఆకులు, పుష్పములు, ఫలములు, సువాసన, రసము మున్నగు విషయములయందు గొప్ప భేదమును కలిగియున్నట్టి చందనము మఱియు గుమ్మడి వంటి అనేకరకములగు మొలకలు జనించుచున్నవి. ఒకే ఆహారముచే రక్తము, వెంట్రుకలు, గోళ్ళు ఇత్యాది వివిధములగు పదార్థము లేర్పడుచున్నవి. అదేవిధముగా ఏకైకమైయున్న బ్రహ్మమునందు కూడా జీవులు మఱియు పరమాత్మయను విభేదముండవచ్చును. మఱియు అనేకరకములగు కార్యముల నుత్పన్నమొనర్పవచ్చును. అదే విధముగా ఆనందనిధి, జ్ఞానఖని యగు బ్రహ్మము కూడా మంచిచెడ్డలుఁగల ప్రపంచమును సృష్టింపఁజాలును.

కావున బ్రహ్మమే ప్రపంచమునకు కారణమనెడి సిద్ధాంతమునకు విరుద్ధమైన ఇతరుల ఆక్షేపణకు స్థానము లేదు.

ఇంతే కాకుండా కార్యములన్నింటికి వాక్కే మూలస్థానమని శ్రుతి వచించుచున్నది. స్వప్నము ననుభవించు మానవుడొక్కడే, కాని స్వప్నపదార్థము లనేకములైయుండును. ఈ విషయములు సూత్రములోని 'చ'యను శబ్దముచే సూచింపఁబడినవి.

# 8. ఉపసంహార దర్శనాధికరణము

## (24 - 25 సూత్రములు)

## 2-1-24 ఉపసంహార దర్శనాన్నేతిచేన్న క్షీరవద్ధి

ఏదైన ఒక పదార్థనిర్మాణమునకై సామగ్రిని ప్రోగుచేయునట్టి ఒక కర్త ఆవశ్యకమైయుండుటను మనముఁగాంచుచుండుటచే, పరికరములు లేని బ్రహ్మమీ విశ్వమునకు కారణము కాజాలదని నీవు నిషేధించినచో అట్లుకాదని మా సమాధానము. ఏలననగా అది పాలు పెరుగుగా మారుట వంటిది.

ఉపసంహారదర్శనాత్ = సామగ్రి ప్రోగుచేయcబడుట చూడcబడుటచే, న = కాదు, ఇతిచేత్ = అని చెప్పినచో, న = కాదు, క్షీరవత్ = పాలవలె, హి = ఉన్నందువలన.

దర్శనాత్ = చూడcబడుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, వత్ = వలె, 'తేనతుల్యం క్రియా' (పాణిని సూత్రము).

ప్రాపంచిక సృష్టికై పరికరముల అవసరములనెడి ఆక్షేపణ ఇచ్చట ఖండింపcబడుచున్నది.

బ్రహ్మము పరికరములు మఱియు సామగ్రి లేనివాడైయున్నను, అతడు విశ్వమునకు కారణమై యున్నాడు. ఒకవేళ నిమిత్తకారణమైయున్న కుమ్మరివాడు పరికరముల నుపయోగించుటను మనముc గాంచుటచే, బ్రహ్మము ఉపాదాన కారణము మఱియు నిమిత్తకారణమున్నూ కాజాలదని నీవు ఆక్షేపించినచో, అది పాలు పెరుగుగా మారుటవంటిదని మేము సమాధానమొసంగుదుము.

పూర్వపక్షి ఇట్లనును : కృషికులు తమ పనుల నొనర్చుటకై పదార్థములను ప్రోగుచేయుదురు. ప్రపంచమును సృష్టించుటకై బ్రహ్మమునకు కూడా సామగ్రి ఆవశ్యకమైయున్నది. కాని సృష్టికి పూర్వము బ్రహ్మము వినా మరియొక పదార్థము లేకుండెను. అతడద్వితీయుడై యుండెను. ఒక కుమ్మరివాని ఎదుట మన్ను, నీరు, కఱ్ఱ, చక్రము మున్నగు పదార్థములు లేకున్నచో అతడు కుండలనెట్లు సృష్టించెడివాడు

కాడో, అట్లే బ్రహ్మమున్నూ పదార్థములు లేనందుటచే ఈ సృష్టికార్యము నొనర్చియుండెడివాడు కాదు.

ఈ యాక్షేపణ బలహీనమైనది. ప్రతి విషయమునకు సామగ్రితో నిమిత్తము లేదు. ఉపమానమునకు పాలు స్వయముగా పెరుగుగా మారును. పాలు పెరుగుగా మార్పునొందుటకు బాహ్యముగా ఒక కర్త అవసరము లేదు. పాలు పెరుగుగా మారుటకు వేడి అవసరమై యున్నదని నీవు పలికినచో, వేడి కేవలము శీఘ్రముగా పెరుగుగా మార్పునొందించుటకు మాత్రము సహకరించునని మేము సమాధానమొసంగుదుము. పాలయందంతర్నిహితమైయున్న సామర్థ్యము చేతనే పెరుగు తయారగును. వేడియొక్క సహాయముచే నీవు నీటిని పెరుగుగా మార్చజాలవు. పెరుగుగా చేయు సామర్థ్యము పాలయందుండుటచేతనే ఆ కార్యము కేవలము సహాయక సాధన సహకారము ద్వారా నెఱవేర్చఁబడినది.

తన గూఢమైన శక్తి ద్వారా బ్రహ్మము స్వయముగా ఈ విశ్వముగా వ్యక్తమగును. అతడు కేవలము సంకల్పించును. అప్పుడీ విశ్వమంతయు విస్తరింపఁబడును. సర్వశక్తిమంతము, అనంతమునైయున్న బ్రహ్మము పరికరములు మఱియు బాహ్యోపకరణములు లేకుండా కేవలము తన సంకల్పశక్తిచేత మాత్రమే ఈ విశ్వము నేల సృష్టింపఁజాలడు?

బ్రహ్మము సర్వశక్తిమంతుడు మఱియు అనంతుడు. కావున ఈ ప్రపంచమును సృష్టించుటకై అతనికి పరికరములచేతఁగాని, బాహ్యోపకరణములచేతఁగాని పనిలేదు. శ్రుతి కూడా ఇట్లు నుడువుచున్నది. 'నతస్య కార్యం కరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే, పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీజ్ఞాన బలక్రియా చ' (శ్వే. ఉ. 6-8)

కావున బ్రహ్మము ఏకైకమైయున్నను, తన అనంతశక్తుల కారణముచే ఏలాటి పరికరములు మఱియు బాహ్యోపకరణముల సహాయము లేకయే స్వయముగా ఈ విశ్వరూపముగా పరిణమించుటకు శక్తిమంతుడై యున్నాడు.

## 2-1-25 దేవాది వదపి లోకే.

సామాన్య ప్రాపంచికానుభవమునందు దేవతలు మఱియు ఇతర జీవులవలె బ్రహ్మమీ ప్రపంచమును సృష్టించును.

దేవాదివత్ = దేవతలు మఱియు ఇతర మునులు, అపి = కూడా, లోకే = లోకమునందు.

'వత్' అను శబ్దమిచ్చట షష్ఠీవిభక్తిని సూచించును. 'అపి'కి బదులుగా 'ఇతి'యను పాఠంతరము కూడా కలదు.

24వ సూత్రమును బలపరచువాదమిచ్చట పేర్కొనఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును : జడమైన పదార్థమగుటచే పాలు పెరుగుగా మారు దృష్టాంతమిచ్చుట సరియైనది కాదు. కుమ్మరివానివంటి చేతనులగు కర్తలు తమకు కావలసిన పూర్తి పరికరములను సమకూర్చుకొన్న తర్వాతనే వారు తమ పనిని ఆరంభింతురు. ఐతే చైతన్యవంతుడగు బ్రహ్మము ఏలాటి పరికరములు, బాహ్యోపకరణముల సహాయము లేకనే ఈ సృష్టికార్యము నొనర్చునని ఎట్లు చెప్పగలము?

'దేవతలు మఱియు ఇతరులవలె' యని మేము దీనికి సమాధానమొసంగుదుము. భౌతికసహాయము లేకుండా, తమ సంకల్పశక్తిచేతనే ఈ ప్రపంచమునందు దేవతలు మఱియు మునులు రాజభవనములు, రథములు మున్నగు ప్రత్యేక పదార్థములను సృష్టించుచుండుటను మనముఁగాంచుచున్నాము. అట్టి ఎడల సర్వశక్తిమంతుడగు సృష్టికర్త తన సత్సంకల్పముచే, లేక అనంతమాయాశక్తిచే ఈ ప్రపంచమునేల సృష్టింపజాలడు?

ఒక సాలెపురుగు తన నోటినుండి దారమునెట్లు బయల్పఱచునో, ఒక ఆడకొంగ మొగకొంగ లేకుండానే పిడుగుయొక్క ధ్వనిని విన్నంతమాత్రముచే ఎట్లు గర్భమును ధరించునో, ఏ వాహనము లేకుండానే పద్మము ఒక సరస్సునుండి మరియొక సరస్సునకెట్లేగునో, అదే విధముగా చైతన్యవంతుడగు బ్రహ్మము కూడా భౌతికపరికరముల సహాయము లేకుండానే స్వయముగా ఈ ప్రపంచమును సృష్టించును.

బ్రహ్మము కుమ్మరివానివంటి కర్తలకు భిన్నమైయున్నది. సృష్టి యొనర్చుటకై బ్రహ్మమునకు బాహ్యోపకరణములచే పనిలేదు. కుండలను సృష్టించుటలో సంకుచిత్వము కలదు. కుండలను సృష్టించుటలోఁగల నియమములచే బ్రహ్మముయొక్క సృష్టిబాధితము కాదు. బ్రహ్మము సర్వశక్తిమంతుడు.

# 9. కృత్స్న ప్రసక్త్యధికరణము

## (26–29 సూత్రములు)

## 2–1–26 కృత్స్నప్రసక్తిర్నిరవయవత్వ శబ్ద కోపోవా.

బ్రహ్మమంతయు పూర్తిగా మార్పునొందుటను అంగీకరింపవలసియుండును. లేనియెడల బ్రహ్మము ప్రపంచమునకు ఉపాదానకారణమైయున్నచో, బ్రహ్మము నిరవయవమని చెప్పు శ్రుతులనైనా ఉల్లంఘింప వలసియుండును.

కృత్స్నప్రసక్తిః = బ్రహ్మమంతయు మార్పునొందుట, నిరవయత్వ శబ్ద కోపః = బ్రహ్మము నిరవయవమనెడి శ్రుతి ప్రామాణ్యమును నిషేధించుట, వా = లేదా.

బ్రహ్మము ప్రపంచమునకు ఉపాదానకారణము కాదనెడి ఆక్షేపణ ఈ సూత్రమునందు పేర్కొనఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును : బ్రహ్మమంతయు ప్రపంచముగా మారినచో ప్రపంచమునకు భిన్నమైన బ్రహ్మము శేషించియుండదు. మఱియు బ్రహ్మములోని ఒక భాగము ప్రపంచముగా మారినచో, బ్రహ్మము అవిభాజ్యమని చెప్పిన శ్రుతులు ఉల్లంఘింపఁబడును.

బ్రహ్మము అవిభాజ్యమైయుండియు విశ్వమునకు ఉపాదానకారణమగునేని, అప్పుడు బ్రహ్మమంతయు విశ్వముగా పరిణమించునని మన మంగీకరింపవలసి యుండును. అట్టియెడల బ్రహ్మము శేషించియుండదు. కాని కార్యమైన విశ్వము మాత్రమే శేషించియుండును. ఇంతేకాకుండా బ్రహ్మము అవికార్యమనెడి శ్రుతి ప్రమాణమునకు కూడా వైరుధ్యమేర్పడును.

దీనికి విరుద్ధముగా ఒకవేళ బ్రహ్మముయొక్క ఒక భాగము మాత్రమే విశ్వముగా మారునని చెప్పినచో అప్పుడు బ్రహ్మమునందు విభాగములున్నవని మన మంగీకరింపవలసివచ్చును. కాని ఇది శ్రుతిప్రమాణమునకు విరుద్ధమగును. శ్రుతివాక్యములిట్లు నుడువుచున్నవి.

'నిష్కళం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనమ్ దివ్యోహ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యంతరోహ్యజః। ఇదం మహద్భూతమనంత మపారం విజ్ఞాన ఘన ఏవ। స ఏషనేతి నేతీత్యాత్మా అస్థూలమనణు' ॥

'ఎవడు అవిభాజ్యుడో, నిష్క్రియుడో, శాంతస్వరూపుడో, దోషరహితుడో, నిరంజనుడో ఆతడు' (శ్వే. ఉ. 6-19). 'ఆ దివ్యపురుషుడు అశరీరుడు అతడు బాహ్యాభ్యంతరముల యందున్నాడు. అతడు జన్మరహితుడు' (ముం. ఉ. 2-1-2). 'ఆ మహాపురుషుడు అనంతుడు, పారములేనివాడు, విజ్ఞానఘనుడు' (బృ. ఉ. 2-4-12). 'అతడు 'నేతినేతి'యని వర్ణింపఁబడును'. (బృ. ఉ. 3-9-26). 'అది స్థూలమున్నూ కాదు, సూక్ష్మమున్నూ కాదు'. (బృ. ఉ. 3-8-8). ఈ వాక్యములన్నింటిచే బ్రహ్మమునందు విభాగములు లేవని నిరూపింపఁబడుచున్నది.

రూపముగల పదార్థములన్నియును నాశవంతములు. కావున బ్రహ్మము కూడా నాశవంతము, లేక అశాశ్వతమనవలసియుండును.

మఱియు విశ్వము బ్రహ్మమగునేని, తెలిసికొనఁదగిన పదార్థ (ద్రష్టవ్యము) మెచ్చటుండును? బ్రహ్మమును తెలిసికొనుటకై ప్రయత్నించుమని ప్రబోధించు శ్రుతులన్నియు అర్థరహితములగును. ఏలననగా బ్రహ్మముయొక్క కార్యములు అప్రయత్నముగానే చూడఁబడును. మఱియు వాటికి భిన్నముగా బ్రహ్మమునకునికి లేకుండును. తుట్టతుదకు బ్రహ్మము జన్మరహితుడనెడి శ్రుతిసిద్ధాంతము ఖండింపఁబడును.

కావున బ్రహ్మమీ విశ్వమునకు ఉపాదానకారణము కాజాలదు. తర్వాతి సూత్రమునందీ ఆక్షేపణ ఖండింపఁబడును.

## 2-1-27 శ్రుతేస్తు శబ్దమూలత్వాత్

కాని శ్రుతివాక్యములచేతను మఱియు బ్రహ్మము కేవలము శ్రుతిమూలమగుటచేతను అది ఇట్లు కాజాలదు.

శ్రుతేః = శ్రుతివాక్యానుసారముగా, తు = కాని, శబ్దమూలత్వాత్ = శ్రుతిమూలమై యుండుటచే.

25వ సూత్రములోని ఆక్షేపణ ఖండింపఁబడినది.

శ్రుతివాక్యానుసారముగా బ్రహ్మమంతయు ప్రపంచముగా మార్పునొందదు. మరియు బ్రహ్మము కేవలము శ్రుతి మూలముననే తెలియఁబడును.

'తు'యనెడి శబ్దము ఆక్షేపణను నివారించును. ఇది పూర్వసూత్రము యొక్క దృష్టిని ఖండించును. మేము శ్రుతిని విశ్వసించియుండుటచే ఈ యాక్షేపణలు శక్తిహీనములై యున్నవి.

విశ్వమునకు మూలము బ్రహ్మమని శ్రుతి వచనమైయున్నను, బ్రహ్మమంతయు మార్పునొందదు. శ్రుతి ఇట్లనును : 'అతనియందొక పాదమే సకలజీవులు మఱియు మూడు పాదములు స్వర్గలోకమునం దమృతమైయున్నవి' (పాదోఽ స్యవిశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి.)

ఇంతే కాకుండా శ్రుతివచనానుసారముగా మనము గాఢనిద్రయందు బ్రహ్మముతో ఏకత్వమునొంది యుందుము. బ్రహ్మమంతయు ప్రపంచముగా మారియుండినచో, ఇది ఎట్లు సంభవించును?

మఱియు బ్రహ్మమును మనము హృదయమునందు సాక్షాత్కరించు కొనవచ్చునని శాస్త్రము నుడువు చున్నది. బ్రహ్మమంతయు ప్రపంచముగా మారియుండినచో ఇది ఎట్లు సంభవించును?

ఇంతేకాకుండా ఇంద్రియముల ద్వారా బ్రహ్మము యొక్క కార్యములు చూడఁబడునేఁగాని, బ్రహ్మమింద్రియగోచరము కాదని నుడువఁబడినది.

బ్రహ్మము నిష్కళమైనదని శ్రుతి వచించుచున్నది. అట్టియెడల ఒక కళ ఎట్లు వ్యక్తమగును? అది కేవలము అవిద్యాఫలమని మేము దానికి సమాధానమొసంగుదుము.

నీ దృష్టిదోషముచే నీవు ఇద్దఱు చంద్రులను చూచినప్పుడు నిజముగా ఇద్దఱు చంద్రులుందురా? మనస్సున కతీతమైయున్న దానిని తెలిసికొనుటకై నీవు శాస్త్రప్రమాణము నంగీకరింపవలయునేఁగాని తర్కమును కాదు.

బ్రహ్మము కేవలము శ్రుతిప్రామాణ్యమున కందును. బ్రహ్మమునుఁగూర్చి పవిత్రమైన శాస్త్రములు మాత్రమే ప్రమాణములగును, కాని ఇంద్రియములు కావు. కావున శ్రుతి సిద్ధాంతములను మనము నిస్సందేహముగా అంగీకరింపవలసి యుండును.

శ్రుతులొకవైపు పూర్తి బ్రహ్మము కార్యరూపమును ధరించదనియును, మరియొకవైపు బ్రహ్మము నిష్కళమనియును వచించును. మణులు, మంత్రములు, మూలికలు మున్నగు కొన్ని సామాన్యములగు పదార్థములు సైతము దేశకాలస్థితి భేదము ననుసరించి వివిధములగు విభిన్న కార్యముల నుత్పన్నమొనర్చు శక్తులను కలిగియుండును. ప్రబోధము వినా ఈ శక్తుల సంఖ్యను, వాటి అనుకూల పరిస్థితులను, పదార్థములను, ప్రయోజనాదులను కేవల మననముచే ఎట్టివాడైనను తెలిసికొనజాలడు. సామాన్యపదార్థముల విషయమై ఇట్లుండగా, శ్రుతిసహాయము వినా అగాధమైయున్న బ్రహ్మస్వరూపమును మఱియు అతని శక్తులను గుర్తెఱుంగుట అసాధ్యమైన కార్యము కదా? 'అచింత్య విషయమునకు తర్కము నిష్ప్రయోజనమ'ని శాస్త్రములు వచించుచున్నవి.

కావున ఇంద్రియాతీతములగు విషయములలో కేవలము శాస్త్రములే ప్రమాణములైయున్నవి. తర్కమునందు నిలువకున్నను పరస్పరము భిన్నమైయున్న శాస్త్రోక్తమగు ఈ ద్వివిధ దృష్టులను సత్యముగా మనమంగీకరింపవలసియున్నది. బ్రహ్మములోని మార్పు కేవలము తాత్కాలికమనియు, అది నిజము కాదనియును మనము జ్ఞప్తియందుంచుకొనవలసి యున్నది. త్రాడు పామువలె కనఁబడునట్లు బ్రహ్మమేదో యొక విధముగా విశ్వమువలె కన్పట్టును. బ్రహ్మము సమస్తమునకు మూలమైయున్నది. అది మార్పునొంది తాత్కాలిక విశ్వముగా పరిణమించును. కాని ఇట్టి దశయందును అది తన నిజమైన మఱియు సత్యమైన స్వరూపమును కోల్పోకుండా యుండును.

## 2-1-28 ఆత్మని చైవం విచిత్రాశ్చహి.

మఱియు జీవునియందు కూడా స్వప్నములు, దేవతలు, గారడివారు మున్నగువారివలె వివిధమైన సృష్టి ఉనికిని కలిగియుండును. ఈ విషయము బ్రహ్మమునకున్నూ వర్తించును.

ఆత్మని = జీవునియందు, చ = కూడా, ఏవం = ఈ విధముగా, విచిత్రాః = విచిత్రమైన, చ = మఱియు, హి = ఏలననగా.

26వ సూత్రములోని ఆక్షేపణ మరియొక దృష్టాంతము ద్వారా ఖండింపఁబడుచున్నది.

ఆత్మయొక్క స్వరూపమునందు మార్పులేకుండా నానారకమగు సృష్టికి ఆస్కార ముండునను సిద్ధాంతమునకు దోషము నాపాదించుట నిష్కారణమేయగును. స్వప్నావస్థయందు మనము మనయందిట్టి నానారకమగు మఱియు ఆశ్చర్యజన కమగు సృష్టినిఁ గాంతుము. 'నతత్రరథా నరథయోగా నపంథా నోభవంత్యథరథాన్ రథయోగా న్పథ స్సృజతే' (బృ. ఉ. 4-3-10) ఐనను జీవుని స్వరూపము దానిచే బాధితమగుట లేదు. దీనిచే జీవుని పూర్ణత్వము హెచ్చుటఁగాని, తగ్గుటఁగాని జరుగదు.

సామాన్యజీవితమునందున్నూ దేవతలు, గారడివారియందు ఏనుగులు, గుఱ్ఱములవంటి నానావిధమగు సృష్టులు వాటియందేమాత్రము మార్పులేకుండా సంభవించుటను మనముఁగాంచుచున్నాము. అవి వాటియొక్క సమైక్యతను బాధించుట లేదు. అదే విధముగా బ్రహ్మమునుండి కూడా తన సమగ్రస్వరూపము నకు తన అచింత్యమగు మాయాశక్తిచే నానావిధమగు సృష్టి జనించును. ఐనను బ్రహ్మము స్వయముగా మార్పు నొందనిదై శేషించియుండును.

స్వప్నములు, దేవతలు మఱియు గారడివారియందిట్టి అద్భుతములగు విషయములను మనముఁ గాంచుచుండగా బ్రహ్మముయొక్క గూఢమైన శక్తులను విశ్వసించుటకు వెనుకాడనేల? యని రెండవ 'చ' యను శబ్దము సూచించుచున్నది. 'హి' యను శబ్దముచే పై తెలుపఁబడిన విషయములు శాస్త్రములలో సుప్రసిద్ధములై యున్నవని గమనింపనగును.

## 2-1-29 స్వపక్ష దోషాచ్చ.

మఱియు పూర్వపక్షి యొక్క దృష్టియందు స్వయముగా ఈ దోషములుండుటచే.

స్వపక్ష = తన స్వంత దృష్టియందు, దోషాత్ = దోషములుండుటచే, చ = కూడా.

26వ సూత్రములోని ఆక్షేపణ ఇంకను ఖండింపఁబడుచున్నది.

26వ సూత్రములోని వాదము నిలువనేరదు. ఏలననగా ఆక్షేపకుని విషయమునందు కూడా ఈ వాదము సమముగానే వర్తించును.

రూపములేని, అనంతమైన, శబ్దాదిగుణరహితమగు ప్రధాన మీ ప్రపంచమును సృష్టించుననెడి నీ సిద్ధాంతమునందు కూడా నీచే రేకెత్తింపఁబడిన ఆక్షేపణ

వర్తించును. సాంఖ్యులిట్లు నుడువవచ్చును. మా ప్రధానమునందు విభాగములు లేవని మేము చెప్పలేదు. సత్త్వరజస్తమోగుణముల సమైక్యస్థితియే ప్రధానమనఁబడును. త్రిగుణములనెడి విభాగములను కలిగియున్న పూర్ణరూపమే ప్రధానమని చెప్పఁబడును. సత్త్వరజస్తమో గుణములు సమముగా అవిభాజ్యములై యుండుటచే, ఇట్టి విభజనముచే ప్రస్తుత ఆక్షేపణ తొలగింపఁ బడదని మా సమాధానము.

ప్రతి గుణమున్నూ మిగిలిన రెండు గుణముల సహాయముచే తత్స్వరూప సాదృశ్యము నొందియున్న ప్రాపంచిక విభాగమునకు ఉపాదాన కారణముగా రూపొందును. కావున ఇట్టి ఆక్షేపణ సాంఖ్యదృష్టికి ప్రతికూలమైయున్నది.

ప్రధానము నిజముగా విభజనశీలమని నీవు విశ్వసించినప్పుడు తర్కము నందు అస్థిరత్వమేర్పడును. అప్పుడు ప్రధానము శాశ్వతము కాజాలదని నిరూపితమగును.

అప్పుడు ప్రధానముయొక్క వివిధ శక్తులయొక్క నానావిధములగు కార్యములే దానికి విభాగములై యొప్పుచున్నవని చెప్పవలసివచ్చును. అట్టిచో మా సమాధానమేమనగా బ్రహ్మమునందు ప్రాపంచిక కారణమునుఁ గాంచునట్టి మేము కూడా ఇట్టి నానావిధశక్తుల నంగీకరింతుము. నీ యొక్క అణుసిద్ధాంతము నందు కూడా ఇదే ఆక్షేపణ వర్తించును.

ప్రపంచమునకు కారణము పరమాణువులని పలుకు సిద్ధాంతమునకు కూడా ఈ యాక్షేపణలే వర్తించును. పరమాణువునందు విభాగములు లేవు. ఇక పరమాణువు మరియొక పరమాణువుతో కలిసినప్పుడది పూర్తిగా మరియొక పరమాణువునందు ప్రవేశింపవలసియుండును. రెండవదానితో పాక్షిక సంబంధమును కలిగియున్నప్పుడది దానియందు ప్రవేశింపజాలదు. అవి పూర్తిగా ఒకదానియందొకటి చొచ్చుకొనియుండును. కావున పరిమాణమునందు కూడా వృద్ధియుండదు. రెండు పరమాణువుల యొక్క సమ్మిశ్రణము ఒక పరమాణువు యొక్క స్థలముకంటె ఎక్కువ స్థలము నాక్రమించదు. సంయోగఫలము కేవలము పరమాణువేనైయుండును. కాని పరమాణువు యొక్క ఒక అంశము మాత్రమే సంయోగము నొందునని నీవు తలంతువేని, పరమాణువులు అవిభాజ్యములనెడి ఊహకది విరుద్ధమగును.

సాంఖ్యుల మతానుసారముగా ఒకవేళ ప్రధానమే విశ్వమునకు కారణముగా అంగీకరింతుమేని, ప్రధానము కూడా అవిభాజ్యమగుటచే విశ్వమునకు కారణము బ్రహ్మమనెడి వేదాంతమతమునకు వలెనే సాంఖ్యమతమున్నూ ఆక్షేపణలకు గుఱియగును. బ్రహ్మసిద్ధాంత ప్రతిపాదకుడు స్వమత విరుద్ధమగు ఆక్షేపణల నితఃపూర్వమే ఖండించియున్నాడు.

# 10. సర్వోపేతాధికరణము

## (30-31 సూత్రములు)

## 2-1-30 సర్వోపేతాచ తద్దర్శనాత్.

శ్రుతివచనానుసారముగా బ్రహ్మము సర్వశక్తి సమన్వితమైయున్నది.

సర్వోపేతా = సర్వశక్తి సమన్వితము, చ = మఱియు, తద్దర్శనాత్ = శ్రుతి ప్రోక్తమగుటచే.

26వ సూత్రములోని ఆక్షేపణ ఇంకను ఖండింపఁబడుచున్నది.

శ్రుతి వచనానుసారముగా బ్రహ్మము సర్వశక్తిమంతుడనుట సుస్పష్టము. కావున పూర్ణముగా అతడు తన శక్తులచేతనే వ్యక్తమగును. అతడొకే సమయమునందు ప్రపంచరూపముగాను, దానికతీతముగను ఉండును.

పూర్వపక్షి ఇట్లనును : భౌతికశరీరమును కలిగియున్న మనుష్యులు కొన్ని శక్తులను కలిగియుండుటను మనముఁగాంచుచున్నాము. కాని బ్రహ్మమునకు శరీరములేదు. కావున అతడిట్టి శక్తులను కలిగియుండజాలడు.

దీనికి బలము లేదు. బ్రహ్మము మాయాశక్తి సమన్వితుడని ఈ సూత్రము నిరూపించును. బ్రహ్మము సర్వశక్తి సమన్వితుడని నానావిధ శ్రుతులు పేర్కొనుచున్నవి. 'సర్వకర్మా సర్వకామ స్సర్వగంధ స్సర్వ రస స్సర్వ మిద మభ్యాత్తో వాక్యనాదర ఏషమ ఆత్మాంతర్హృదయ ఏతద్బ్రహ్మ' (ఛాం. ఉ. 3-14-4) 'సత్యకామ స్సత్యసంకల్పస్సోన్వేష్టవ్యః'(ఛాం. ఉ. 8-7-1) 'యస్సర్వజ్ఞస్సర్వ విద్యస్యజ్ఞాన మయంతపః' (ఛాం. ఉ. 1-1-9) 'ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్ర మసౌవిధృతౌ తిష్ఠతః' (బృ. ఉ. 3-8-9) 'మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్ (శ్వే. ఉ. 4-10) ఇత్యాదులు.

## 2-1-31 వికరణత్వాన్నేతి చేత్తదుక్తమ్.

అవయవరహితుడగుటచే బ్రహ్మమునకు సృష్టించుశక్తి లేదని పలికినచో, ఇది ఇదివరకే వివరింపఁబడినదని మేము సమాధానమొసంగుదుము.

వికరణత్వాత్ = కర్మేంద్రియ రహితుడగుటచే, న = కాదు, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, తత్ = ఆ నిషేధమునకు, ఉక్తమ్ = సమాధానమొసంగఁ బడినది.

ప్రపంచమునకు కారణము బ్రహ్మము కాదనెడి మరియొక ఆక్షేపణ ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును : బ్రహ్మము అవయవరహితుడు. కావున ఆతడు సర్వశక్తిమంతుడైనను, సృష్టించుటకసమర్థుడు. శ్రుతి ఇట్లు వచించుచున్నది. 'అచక్షుష్కమశ్రోత్రమవాగమనః' (బృ. ఉ. 3-8-8) మరికొన్ని శ్రుతులు 'నేతినేతి'యని పలుకును. దీనిచే సమస్త విశేషణములు నిషేధింపఁబడును. దేవతలు మఱియు ఇతర చైతన్యముఁగల పురుషులు శారీరక కర్మేంద్రియములను కలిగియుండుటచేతను, సమస్త శక్తి సమన్వితులగుటచేతను సృష్టించుటకు సమర్థులైయున్నారని మంత్రములు, అర్థవాదములు ఇత్యాదులచే మనకవగతమగుచున్నది.

ఈ సూత్రమునందు ఆక్షేపణ మఱియు సమాధానమున్నూ కలదు. 'వికరణత్వాన్నేతిచేత్' అనునది ఆక్షేపణ విభాగము మఱియు 'తదుక్తమ్' అనునది సమాధాన విభాగమైయున్నది.

బ్రహ్మమునకు నేత్రములు, శ్రోత్రములు, హస్తపాదములు లేకున్నను అతడు సర్వశక్తిమంతుడే యగును. ఈ విషయము ఇతఃపూర్వమే 2-1-4 మఱియు 2-1-25 సూత్రములలో వివరింపఁబడినది. అవిద్య, లేక మాయద్వారా అతడు నానావిధరూపములను ధరించును. బ్రహ్మము విషయములో శ్రుతి మాత్రమే ప్రమాణమైయున్నది, కాని తర్కము కాదు. బ్రహ్మము నిరవయవమైయున్నను, అది సమస్త శక్తి సామర్థ్యములను కలిగియున్నదని శ్రుతి వచించుచున్నది. 'అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్య చక్షుస్సశృణోత్యకర్ణః' (శ్వే. ఉ. 3-19). బ్రహ్మము నిర్గుణుడైయున్నను, అవిద్య, లేక మాయ ద్వారా అతడు సమస్త శక్తులను కలిగియున్నాడు.

# 11. ప్రయోజనవత్వాధికరణము
# (32-33 సూత్రములు)

## 2-1-32 న ప్రయోజన వత్త్వాత్

ప్రతి కార్యమునకొక ప్రయోజనముండుటచే బ్రహ్మమీ విశ్వమునకు కారణము కాజాలదు.

న = బ్రహ్మము సృష్టికర్త కాజాలడు, ప్రయోజనవత్త్వాత్ = ప్రయోజనమును కలిగియుండుటచే.

ప్రపంచమునకు కారణము బ్రహ్మమను విషయమునందు మరియొక ఆక్షేపణ చూపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును : ఈ ప్రపంచమునందు ప్రతివాడును ఏదోయొక ప్రయోజనమును కోరి కార్యమునొనర్చును. తన కోరికను నెఱవేర్చుకొనుటకై అతడేదో యొక కార్యము నొనర్చును. ఈ సామాన్యానుభవము యొక్క ఫలితమును దృఢపఱచునట్టి ఒక శ్రుతివాక్యమున్నూ కలదు. 'నవాఅరే సర్వస్య కామాయ సర్వం ప్రియం భవత్యాత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి' (బృ. ఉ. 2-4-5) కాని బ్రహ్మము పరిపూర్ణుడు, ఆత్మసంతృప్తుడు మఱియు సర్వాత్ముడునైయున్నాడు. సృష్టి వలన అతనికి కలుగు ప్రయోజనమేమియును లేదు. కావున ఇట్టి నిష్ప్రయోజనమగు సృష్టికార్యమునందాతడు తగుల్కొనడు. కావున బ్రహ్మమీ విశ్వమునకు కారణము కాజాలడు.

ఈ విశాల ప్రపంచమును సృష్టించు కార్యమును చేపట్టుట నిశ్చయముగా భారభూతమే యగును. ఒక కోరికను నెఱవేర్చుకొనుటకై ఒకవేళ బ్రహ్మము సృష్టికార్యము నొనర్చునేని, అతడు నెఱవేర్పఁబడిన కోరికలు లేనివాడై శాశ్వతానంద ప్రపూర్ణుడగు పురుషుడుగా పరిగణింపఁబడజాలకుండును. ఒకవేళ అతనికి కోరికయే లేకున్నచో, అప్పుడాతనికి సృష్టించు తలంపు కలుగదు. కావున సృష్టి యనునదే ఉండియుండెడిది కాదు. నిష్ప్రయోజనముగా ఒక బుద్ధిహీనుడగు మనుజునివలె ఉన్మత్తుడై అతడు సృష్టించునని చెప్పుటకున్నూ వలను పడదు. అది నిశ్చయముగా అతని సర్వజ్ఞత్వమునకు విరుద్ధమగును.

కావున బ్రహ్మమునుండి సృష్టి కలిగినదను సిద్ధాంతము అసంగతమగును.

## 2-1-33 లోకవత్తు లీలా కైవల్యమ్

ప్రపంచము, లేక సామాన్యజీవితమునందు చూడఁబడుటచే బ్రహ్మముయొక్క సృష్టికార్యము కేవలమొక లీల వంటిది.

లోకవత్ = ప్రపంచమునందువలె, తు = కాని, లీలాకైవల్యమ్ = కేవల వినోదము.

32వ సూత్రములోని ఆక్షేపణకు సమాధానమొసంగఁబడినది.

'తు' యను శబ్దముపై ఆక్షేపణను తొలగించును. బ్రహ్మమీ ప్రపంచమును ఏలాటి కోరికచేతను, లేక ప్రయోజనముతోను సృష్టింపలేదు. కాని ఇది అతనికి కేవలము లీలామాత్రము. ఇది అతని స్వరూపజనితము. అది అతనియందంత ర్భూతమై, విడదీయరానిదైయున్నది. కొన్ని సందర్భములలో ఇది మనకు ప్రపంచము నందును గోచరించును. ఒక ధనవంతుడుఁగాని, లేక యువరాజుగాని కేవలము తన వినోదము కొరకై ఏలాటి ప్రయోజనముఁగాని, ఉద్దేశ్యముఁగాని లేకుండా కొన్ని కర్మలనొనర్చును. బాలురు తమ వినోదము కొరకై ఆటాడుదురు. ఏ ఉద్దేశ్యముఁగాని, ప్రయోజనముఁగాని లేకుండా మనుజులు శ్వాసింతురు. ఏలననగా అది తమకు స్వభావమైయున్నది. ఏ విధముగానైతే గాఢనిద్రనుండి మేల్కాంచిన మనుజుడు ఏ ప్రయోజనము లేకుండా కేవలము తన వినోదము కొరకై సంతోషస్వాంతుడై నాట్యము చేయుటకు మొదలిడునో అదే విధముగా బ్రహ్మము తన స్వరూపజనితమగు లీలావినోదము కొరకై ఏ ప్రయోజనము లేకుండా ఈ సృష్టికార్యము నొనర్చును.

మనకీ విశ్వసృష్టి మిక్కిలి భారభూతముగను. కష్టప్రదముగను తోచినను, అనంతశక్తియుక్తుడగు ఆ సర్వేశ్వరునికిది లీలామాత్రమే యగును.

సూక్ష్మముగా విచారించినచో సామాన్యముగా వినోదకార్యముల యందున్నూ ఏదో ఒక ఉద్ధేశ్యము మనకు కన్పట్టును. (బంతిఆట మున్నగు ఆటలచే యువరాజునకు సంతోషము కలుగుటచే అది పూర్తిగా నిష్ప్రయోనము కాదు.) కాని సర్వేశ్వరుని క్రియలున్నూ ఇట్టివేయని నుడువుట పాడిగాదు. పరమేశ్వరుడు కృతకృత్యుడనియు, పరిపూర్ణుడనియు, పూర్ణసంతృప్తుడనియు, ఆత్మసంతుష్టుడని యున్నూ శ్రుతులు ప్రబోధించుచున్నవి.

కాని పరబ్రహ్మదృష్టి ననుసరించి సృష్టికి ఉనికియే లేదను విషయమును మఱువరాదు. ఏలననగా నామరూపములు కేవలము అవిద్యకు సంబంధించి యున్నవి. ఇంతేకాకుండా బ్రహ్మము మఱియు ఆత్మ నిజమునకు ఏకమేనైయున్నది.

పూర్వపక్షి మరల ఒక ఆక్షేపణను లేవనెత్తును. కొందఱు మనుజులు ఆనందము ననుభవించుచు మఱి కొందఱు దుఃఖార్తులగుచుండుటచే బ్రహ్మము పక్షపాతియనియు, లేక క్రూరుడనియు బ్రహ్మము సృష్టికర్తయనెడి సిద్ధాంతమున కాక్షేపణ కలుగును. కావున ఈ సిద్ధాంతమసంబద్ధమైయున్నది. ఈ యాక్షేపణ ఈ దిగువ సూత్రముచే తొలగింపఁబడును.

# 12. వైషమ్యనైర్ఘృణ్యాధికరణము

## (34-36 సూత్రములు)

### 2-1-34 వైషమ్యనైర్ఘృణ్యేన సాపేక్షత్వాత్తథాహి దర్శయతి.

ఆ విషయమునందు జీవులయొక్క పుణ్యపాపములు కారణములగుటచే, బ్రహ్మమునకు పక్షపాతము మఱియు క్రూరత్వము నాపాదింపరాదని శ్రుతి వచించుచున్నది.

వైషమ్య = పక్షపాతము, నైర్ఘృణ్యే = క్రూరత్వము, న = బ్రహ్మమున కాపాదింపరాదు, సాపేక్షత్వాత్ = జీవులయొక్క కర్మపై ఆధారపడియుండుటచే, తథా = ఆ విధముగా, హి = ఎలననగా, దర్శయతి = శ్రుతి వచించుచున్నది.

తన ప్రాపంచిక సృష్టియందు బ్రహ్మమునకు పక్షపాతము మఱియు క్రూరత్వమున్నదనెడి దోషము తొలగింపఁబడినది.

కొందఱు ధనవంతులుగను, మరికొందఱు బీదవారుగను సృష్టింపఁబడి యున్నారు. కావున బ్రహ్మమునకు పక్షపాతము కలదు. అతడు ప్రజలను బాధించును. కావున అతడు క్రూరుడు. ఈ రెండు కారణములచే బ్రహ్మమీ ప్రపంచమునకు కారణము కాజాలడు'. ఈ యాక్షేపణ అనుచితమైయున్నది. పరమేశ్వరునియందు వైషమ్యత మఱియు క్రూరత్వము కలదని నేరము నారోపించుట తగదు. ఏలననగా జీవులితఃపూర్వమొనర్చిన పుణ్యపాపకర్మలచే వారికి

సుఖదుఃఖానుభవము కలుగుచున్నది. శ్రుతియున్నూ ఇట్లు నుడువుచున్నది. 'పుణ్యోవైపుణ్యేన కర్మణాభవతి పాపః పాపేన' (బృ. ఉ. 3-2-13)

దైవానుగ్రహము, బీజములకు తమ స్వభావమున కనుగుణముగా శక్తినొసంగు వర్షము వంటిది. నానా విధములగు కర్మల ననుసరించి నానా విధములగు సుఖదుఃఖానుభవములు కలుగును.

పరమేశ్వరుని పరిస్థితి వర్షము నొసంగు పర్జన్యుని పోలియుండును. బియ్యము, బార్లి వంటి పైరు ఉత్పన్నమగుటకు సామాన్యముగా వర్షము కారణమైయున్నది. ఆయా బీజములయందు దాగియున్న విభిన్నమైన శక్తులు విభిన్నమైన యోనులకు కారణమై యున్నవి. అదే విధముగా దేవతలు, మనుష్యులు మున్నగు సమస్తసృష్టికి సర్వేశ్వరుడు సామాన్యకారణమైయున్నాడు. జీవులకు సంబంధించిన నానా విధములగు పుణ్యపాపములచే నానా విధ వర్గవిభేదమేర్పడినది.

శ్రుతియున్నూ ఇట్లు నుడువును. 'ఏషహ్యేవైనం సాధుకర్మకారయతి యమన్వానునేషత్యేష ఏవైన మసాధు కర్మకారయతి తం యమేభ్యో లోకేభ్యో మనుత్సత' (కౌ. ఉ. 3-9) 'పుణ్యోవైపుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన' (బృ. ఉ. 3-2-13) జీవులయొక్క ప్రత్యేక కర్మలననుసరించియే స్మృతి కూడా నుడువుచున్నది. 'యే యథామాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్' (భ. గీ. 4-11).

## 2-1-35 న కర్మావిభాగాదితిచేన్నానాదిత్వాత్.

సృష్టికి పూర్వము పుణ్యపాపవిభేదము లేకుండుటచే, దేవునికి పుణ్యపాప విచక్షణ యుండదని ఆక్షేపించినచో, అట్లు కాదని మా సమాధానము. ఏలననగా ఈ ప్రపంచము అనాదియైయున్నది.

న = కాదు, కర్మావిభాగాత్ = సృష్టికి పూర్వము కర్మవిభేదము లేకుండుటచే, ఇతిచేత్ = ఇట్లు ఆక్షేపించినచో, న = ఈ యాక్షేపణ నిలువనేరదు, అనాదిత్వాత్ = అనాది యగుటచే.

34వ సూత్రమునకు విరుద్ధమైన ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

ఈ సూత్రము ఆక్షేపణ మఱియు సమాధానమనెడి రెండు విభాగములను కలిగియున్నది. 'న కర్మా విభాగాదితిచేత్' అనునది ఆక్షేపణ విభాగము. మఱియు, 'న అనాదిత్వాత్' అనునది సమాధాన విభాగము.

ఇప్పుడొక ఆక్షేపణ ఆరోపింపఁబడినది. శ్రుతి ఇట్లనును : ఆదియందద్వితీయమైన పదార్థమొకటే ఉండియుండుటచే, ఈ ప్రపంచసృష్టికి పూర్వము కర్మవిభేదము లేకుండెను. ఆదియందు కేవలయొకే సత్పదార్థము, లేక బ్రహ్మము ఉనికిని కలిగియుండెను. సృష్ట్యాదియందు ఒకడు ధనవంతుడుగను, మరియొకడు బీదవాడుగను, దుఃఖపూరితుడుగను ఉండుట నిశ్చయముగా పురాకృతమగు ఆయా పుణ్యపాప కర్మలపై ఆధారపడియుండదు. ప్రప్రథమసృష్టి విషమత్వమునుండి విముక్తమై ఉండియుండును.

ఈ యాక్షేపణ నిరాధారమైనది. ఈ ప్రపంచము యొక్క సృష్టి కూడా అనాదియై యున్నది. కేవలము ఆదియైయున్న సమయమనునది లేకుండెను. అందువలన ప్రప్రథమ సృష్టియనెడి ప్రశ్నయే ఉదయింపదు. సృష్టికి ఉత్పత్తిలేదు. ప్రపంచము యొక్క సృష్టిప్రళయములు ఆద్యంతములు లేకుండా నిరంతరము పరిభ్రమించుచున్నవి. ఏదైన ఒక ప్రత్యేక సృష్టి వలయమునందలి జీవులయొక్క దశ పూర్వవలయములోని తమ పూర్వకర్మలచే నిశ్చయింపఁబడును.

కర్మ అనాదియగుటచే నానావిధ సృష్టిజాలమునకు కారణమైన కర్మ సృష్టికి పూర్వము ఉనికిని కలిగిలేదని చెప్పుటకవకాశము లేదు. పూర్వము ఉనికిని కలిగియున్నట్టి కర్మయనెడి బీజమునుండియే సృష్టి మొలకెత్తును.

ప్రపంచము అనాదియగుటచే, పాత్రత మఱియు అసమత్వము బీజము మఱియు మొలకలవంటివి. బీజాంకుర న్యాయమువలె కార్యకారణ సంబంధము ఒక అంతులేని గొలుసు వంటిది. కావున పరమేశ్వరుని సృష్టి కార్యమునందు వైరుధ్యము లేదు.

## 2-1-36 ఉపపద్యతే చాప్యుపలభ్యతే చ.

ప్రపంచము మఱియు కర్మ అనాదియని నుడువుట న్యాయసమ్మతము. మఱియు ఈ విషయము శ్రుతులయందున్నూ చూడఁబడుచున్నది.

ఉపపద్యతే = న్యాయ సమ్మతము, చ = మఱియు, అపి = నిశ్చయముగా, ఉపలభ్యతే = శ్రుతియందుఁగాంచఁబడుచున్నది, చ = మఱియు.

కర్మ అనాదియైయున్నది. ఇది న్యాయసమ్మతము మఱియు శ్రుతిని ఆధారముగా కలిగియున్నది. తర్కముచేత కూడా ప్రపంచము అనాదియనియే

నిశ్చయింపఁబడును. ఏలననగా ఒకవేళ ప్రపంచము బీజరూపమునందుండి యుండనిచో, సృష్టి సమయమునందు ఏ మాత్రము ఉనికిలేని పదార్థము సృష్టింపఁబడి యుండెడిది. మఱియు ముక్తినొందిన పురుషులు తిరిగి జన్మించుట కూడా సాధ్యమయ్యెడిది. ఇంతేకాకుండా ప్రజలు అనుభవమునకు తగిన కర్మనొనర్పకున్నను సుఖదుఃఖానుభవములను కలిగియుండెడివారు. అర్హతలేని సుఖదుఃఖానుభవము నిశ్చితమగు కారణమేదియు లేకుండుటచే పూర్వమొనర్చిన పుణ్యపాప కర్మలకు సంబంధము లేకుండానే కార్యము సంభవించును. ఇది నిశ్చయముగా అసంగతమైన విషయము. ఒకవేళ కారణము వినా కార్యము కలుగునని మనమంగీకరింతుమేని, సృష్టిక్రమమునందేలాటి నియమముండజాలదు. సృష్టి 'అనాది' యని శ్రుతి వచించుచున్నది.

ఇంతేకాకుండా ఏకరూపమైయున్న కేవలావిద్య, నానావిధమైన సృష్టికి కారణము కాజాలదు. కర్మచే కలిగిన వాసనలచే అవిద్య నానావిధరూపమునొంది, ఇట్టి ఫలితమేర్పడును. నానావిధఫలములనుత్పన్న మొనర్చుటకై అవిద్యకు వ్యక్తిగతమగు నానావిధ పురాకృతకర్మ లావశ్యకములై యుండును. ఆగ్రహము, అసూయ మున్నగు మానసిక వ్యసనములచే ఒనర్పఁబడు కర్మఫలముచే కలుగు విషమత్వమునకు కారణము అవిద్యయని నుడువవచ్చును.

పూర్వకల్పములలో విశ్వమునకు అస్తిత్వమున్నట్లు ఈ క్రిందివిధముగా శ్రుతులు రూఢియొనర్చుచున్నవి. 'సూర్యాచంద్రమసౌధాతాయథాపూర్వమకల్పయత్' (ఋగ్వేద సంహిత 10-190-3). ఈ కారణముచే పక్షపాతము మఱియు క్రూరత్వములను పరమేశ్వరుని కారోపించుట న్యాయసమ్మతము కాజాలదని నిరూపింపఁబడుచున్నది.

# 13. సర్వధర్మోపపత్త్యధికరణము

## 2-1-37 సర్వధర్మోపపత్తేశ్చ.

మఱియు ప్రపంచ సృష్టికి కావలసిన గుణములన్నియును కేవలము బ్రహ్మమునందే ఉనికిని కలిగియుండుట నిరూపింపఁబడుటచే, అతడే ఈ విశ్వమునకు కారణమను విషయమునంగీకరింవలసి యుండును.

సర్వ = అన్ని, ధర్మ = గుణములు, ఉపపత్తేః = నిరూపింపఁబడుటచే, చ = మఱియు.

బ్రహ్మమీ ప్రపంచమునకు కారణమైయున్నాడని నిరూపించుటకై మరియొక కారణము చెప్పఁబడుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును : ఉపాదాన కారణము కార్యముగా పరిణామము నొందును. ఇట్టి కారణము గుణములతో కూడియుండును. బ్రహ్మము నిర్గుణుడగుటచే అతడీ విశ్వమునకు ఉపాదాన కారణము కాజాలడు. ఈ యాక్షేపణకీ సూత్రము సరియైన సమాధానము నొసంగును.

బ్రహ్మమునందు నిజమైన మార్పులేదు. కాని అతని అచింత్యమగు మాయాశక్తిచే బ్రహ్మమునందు తాత్కాలికమగు మార్పు మనకు గోచరించును.

త్రాడు ఒక పాముగా గోచరించునట్లు బ్రహ్మమీ విశ్వముగా కన్పట్టును. సృష్టికార్యమున కావశ్యకమై యున్న సర్వశక్తిమత్త్వము, సర్వజ్ఞత్వము వంటి గుణములన్నియును మాయాశక్తిచే బ్రహ్మమునందునికిని కలిగియున్నవి. కావున తాత్కాలికమగు మార్పు ద్వారా బ్రహ్మమీ విశ్వమునకు ఉపాదాన కారణము, నిమిత్త కారణము కూడానై యున్నాడు.

కావున విశ్వమునకు కారణము బ్రహ్మమేయని ప్రతిపాదింపఁబడినది. ఉపనిషత్ప్రతిపాదితమగు వేదాంతసిద్ధాంతము ఏలాటి ఆక్షేపణకున్నూ లొంగదు. ఈ విధముగా సమస్త సృష్టి పరబ్రహ్మము నుండియే జనించినదని నిరూపింపఁబడినది.

బ్రహ్మమీ ప్రపంచమునకు ఉపాదాన మఱియు నిమిత్త కారణము కూడానైయున్నదని వేదాంత సిద్ధాంతమునందు ఋజువొనర్పఁబడినది. పూర్వపక్షిచే

ఆరోపింపఁబడిన స్వరూపభేదమువంటి ఆక్షేపణలు జగదాచార్యునిచే ఖండింపఁ బడినవి. అతడు స్వసిద్ధాంతము బలపడునట్లీ పాదమును ముగించుచున్నాడు. తదితరాచార్యుల యొక్క అభిప్రాయములను ఖండించుటయే తర్వాతి అధ్యాయమునకు ముఖ్యలక్ష్యమై యున్నది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**ద్వితీయాధ్యాయ ప్రథమపాదము**

**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## ద్వితీయాధ్యాయము

## 2వ - పాదము

## పీఠిక

ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదమునందు న్యాయసమ్మత ముగను, శ్రుతి ప్రామాణ్యముగను ప్రపంచమునకు బ్రహ్మముయొక్క కర్తృత్వము ప్రతిపాదింపఁబడినది. బ్రహ్మమీ విశ్వమునకు కారణము కాదనెడి వాదముల న్నియును ఖండింపఁబడినవి.

ప్రస్తుత పాదమునందు సూత్రకారుడు తన కాలమునందు వ్యవహారము నందున్న ఇతర మతములయొక్క సృష్టిసిద్ధాంతములను పరిశోధించుచున్నాడు. వేద ప్రామాణ్యమును స్వీకరించకుండా కేవలము తర్కము చేతనే ఇతర మత సిద్ధాంతములన్నియును ఖండింపఁబడినవి. ఈ పాదమునందాతడు తర్కము ద్వారా సాంఖ్యులయొక్క ప్రధానమును, వైశేషికుల పరమాణుసిద్ధాంతమును, బౌద్ధులయొక్క క్షణిక మఱియు శూన్యవాదములను, జైనులయొక్క సమకాల అస్తిత్వనాస్తిత్వములను,

పాశుపతుల యొక్క సముదాయ ద్వైతమును మఱియు చైతన్యశూన్యమగు శక్తి సిద్ధాంతములను ఖండించెను.

బ్రహ్మము ప్రపంచమునకు కారణముగా నిరూపించుటకై తన మాయద్వారా బ్రహ్మము సర్వశక్తి మత్వము, సర్వజ్ఞత్వము మున్నగు సమస్త గుణములను కలిగియున్నట్లు ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదముయొక్క చివరి సూత్రమునందు చెప్పఁబడినది.

వీటి నన్నింటిని సాంఖ్యదర్శనము యొక్క ప్రధానము ప్రతిపాదించునా? లేదా? యనెడి ప్రశ్న ఈ రెండవ పాదమునందు పరిశీలింపఁబడుచున్నది.

# సార సంగ్రహము

## 1

సంక్షేపముగా చెప్పవలయునేని, శ్రీ వ్యాసభగవానుడీ పాదమునందు తన కాలమునందు పరివ్యాప్తమైయున్న వేదాంత సిద్ధాంతమునకు వ్యతిరిక్తములైయున్న సిద్ధాంతముల నన్నింటిని ఖండించెను. అవి ఏవనగా: (1) ప్రధానమే ప్రథమ కారణమనెడి సాంఖ్య సిద్ధాంతము (2) బ్రహ్మమును ప్రథమ కారణముగా అంగీకరింపని వైశేషికమతము (3) వైశేషికులయొక్క పరమాణు సిద్ధాంతము (4) బౌద్ధులయొక్క క్షణిక మఱియు శూన్యవాదములు (5) బౌద్ధుల విజ్ఞానవాదము (6) జైనమత సిద్ధాంతము (7) పరమాత్ముడు ప్రపంచమునకు నిమిత్త కారణమే కాని, ఉపాదాన కారణముకాదని వాదించు పాశుపత సిద్ధాంతము (8) ఆత్మ దేవుని నుండి ఉద్భవించునని పలికెడి పాంచరాత్రము, లేక భాగవత సిద్ధాంతము.

ద్వితీయాధ్యాయములోని ప్రథమపాదమునందు న్యాయసమ్మతమగు శ్రుతి ప్రామాణ్యముచే బ్రహ్మమీ ప్రపంచమునకు కర్తయని ప్రతిపాదింపఁబడినది. విశ్వోత్పత్తి విషయమునందు వేదాంతదృష్టికి విరుద్ధములైయున్న ప్రముఖులగు దార్శనిక సిద్ధాంతములను శ్రుతి ప్రామాణ్యము లేకుండా తర్కము ద్వారా ఖండించుట రెండవ పాదమునకు విషయమై యున్నది.

**1వ అధికరణము (1–10 సూత్రములు) :** సాంఖ్యమతము నెదుర్కొనినది. జడమైన, ప్రథమకారణమైన సాంఖ్యులయొక్క ప్రధానము సృష్టించుటకు మఱియు లయమొనర్చుటకున్నూ అసమర్థమైనదని ఇది నిరూపించును.

**2వ 3వ అధికరణములు (11-17 సూత్రములు) :** అదృష్టపదార్థముచే చలింపఁజేయఁబడుచున్న పరమాణువులచే ప్రపంచము సృష్టింపఁబడినదని వచించు వైశేషిక సిద్ధాంతమును ఖండించును.

**4వ అధికరణము (18-27 సూత్రములు) :** భౌతిక మఱియు అంతరిక ప్రపంచములు నిజమని వాదించు బౌద్ధుల యొక్క ప్రత్యక్ష విజ్ఞానవాదమును ఖండించును.

**5వ అధికరణము (28-32 సూత్రములు) :** భావములు మాత్రము నిజమని నమ్మునట్టి విజ్ఞానవాదుల దృష్టిని ఖండించును. ఈ యధికరణములోని చివరి సూత్రము ఏ పదార్థము కూడా నిజముకాదని ప్రబోధించు మాధ్యమిక, లేక శూన్యవాద సిద్ధాంతమును ఖండించును.

**6వ అధికరణము (33-36 సూత్రములు) :** జైనుల యొక్క సిద్ధాంతమును ఖండించును.

**7వ అధికరణము (37-41 సూత్రములు) :** పరమాత్ముఁడీ ప్రపంచమునకు కేవలము నిమిత్తకారణమగునేకాని, ఉపాదాన కారణము కాదని ప్రబోధించు పాశుపత మతమును ఖండించును.

**8వ అధికరణము (42-45 సూత్రములు) :** భాగవత, లేక పాంచరాత్ర సిద్ధాంతమును ఖండించును.

# 2

1 నుండి 10 వరకుఁగల సూత్రములలో తర్కముద్వారా సాంఖ్యదర్శన సిద్ధాంతము మరల ఖండింపఁబడినది. ప్రధానము, లేక చైతన్యశూన్యమగు పదార్థము జడమైయున్నది. అది అచేతనమైయున్నది. ఈ ప్రాపంచిక కారణత్వము నందొక క్రమబద్ధత యున్నది. కావున చైతన్య సహాయము లేకుండా ఈ జడమైన ప్రకృతికి ప్రపంచమును సృష్టించు సంకల్పమున్నట్లు భావించుట అయుక్తమగును.

నదులలో నీరు, మేఘముల నుండి వర్షము, పొదుగునుండి పాలు ధారళముగా ప్రవహించునట్లు జడమైన ప్రధానమున్నూ స్వయముగా బుద్ధి, అహంకారము, మనస్సు, తన్మాత్రాదులుగా మారి ప్రపంచరూపముగా పరిణామము నొందునని సాంఖ్యులు పలుకుదురు. సాంఖ్యుల యొక్క ఈ వాదము అస్థిరమైనది. ఏలననగా పరమేశ్వరుని సంకల్పము చేతనే నీరు ప్రవహించుట, పాలు చేపుటలు జరుగుచున్నవి.

సాంఖ్యమతానుసారముగా ఏదేని ఒక కార్యముయొక్క ప్రవృత్తికిఁగాని, నివృత్తికిఁగాని భౌతికముగా ప్రధానమును ప్రేరేపించు కర్తలేడు. ప్రధానము స్వతంత్రముగా పనిచేయఁగలుగును. వారి పురుషుడెల్లప్పుడు నిష్క్రియుడు మఱియు తటస్థుడై యుండును. అతడొక కర్తకాడు. కావున పురుషుని సమక్షములో ప్రధానము కార్యోన్ముఖమగుననుట పొసగదు.

ఒక ఆవుచే మేయఁబడిన గడ్డి స్వయముగా పాలుగా మార్పునొందినట్లు ప్రధానము స్వయముగా ఈ దృశ్యమాన ప్రపంచముగా మార్పునొందినదని సాంఖ్యులు వాదింతురు. ఈ వాదము నిరాధారమైనది. ఏలననగా ఒక ఎద్దుచే మేయఁబడిన గడ్డి పాలుగా మారుటలేదుకదా! కావున పాలుగా మారుటకు భగవత్సంకల్పమే కారణముకాని, ఆవుగడ్డిని మేయుట కారణము కాజాలదు. కావున ప్రధానము స్వయముగా ప్రపంచమునకు కారణము కానేరదు.

ఒక కుంటివాడు ఒక గ్రుడ్డివాని భుజములపై కూర్చొని చలింపఁ జేయునట్లు, పురుషుడు నిష్క్రియుడై యున్నను అతడు ప్రధానమును కార్యోన్ముఖమొనర్పఁగలుగునని సాంఖ్యులు పలుకుదురు. స్వతంత్రము మఱియు జడమైన ప్రధానము, స్తబ్ధుడు మఱియు చైతన్యవంతుడైన పురుషునితో కలిసి ఈ ప్రపంచమును సృష్టించును. ఈ వాదము కూడా నిరాధారమైనది. ఏలననగా పురుషుని పూర్ణ నిష్క్రియత్వము మఱియు తాటస్థ్యముతో ప్రధానముయొక్క పూర్ణస్వతంత్రత పరస్పరము ఒకదానితో ఒకటి ఏకీభవించదు.

ప్రధానమునందు సత్త్వరజస్తమములనెడి మూడు గుణములున్నవి. అవి సృష్టికి పూర్వము సమత్వస్థితి యందుండెను. ఏ గుణము కూడా ఒకటి శ్రేష్ఠము, మరియొకటి నికృష్టమై లేకుండెను. పురుషుడు పూర్ణముగా తటస్థుడు. ప్రధానము యొక్క సమత్వమును ఛిన్నాభిన్న మొనర్చుట కాతని కాసక్తిలేదు. సమత్వము తారుమారైనప్పుడు మఱియు ఒక గుణము మరి రెండు గుణములు నతిశయించినప్పుడు సృష్టి ప్రారంభమగును. సృష్ట్యాదియందు సమత్వస్థితిని చెదరగొట్టుటకు ఏలాటి కారణము లేకుండుటచే, ప్రధానము ప్రపంచముగా మార్పునొందుట అసాధ్యమే యగును.

11 నుండి 17 వరకు గల సూత్రములలో అభేద్యమైన, సూక్ష్మమైన పరమాణువులే ప్రపంచమునకు కారణమని వాదించు వైశేషిక పరమాణు సిద్ధాంతము ఖండింపఁబడినది. ఒక పరమాణువునం దేమాత్రము పరిమాణముఁగల విభాగమున్నను, అది పరమాణువనఁబడజాలదు. అట్లైనచో అది ఇంకను విభజింపఁబడుట కవకాశముండును. ఒకవేళ వైశేషికదర్శనమునందు వర్ణింపఁబడినట్లుగా దానియందేలాటి విభాగము లేకున్నచో, ఇట్టి అవిభాజ్యములగు రెండు పరమాణువుల మేళనముచే ఏలాటి పరిమాణముఁగల పదార్థమున్నూ సృష్టింపఁబడజాలదు. కావున పరమాణువుల సమ్మేళనముచే మిశ్రద్రవ్యములు రూపొందవు. అందువలన అభేద్యమైన పరమాణువుల నుండి ప్రపంచ ముత్పన్నమైనదనెడి వైశేషిక సిద్ధాంతము అసంగతమగును.

మిశ్రపదార్థములుగా రూపొందుటకై అచేతనములగు పరమాణు వులకు స్వయముగా ఐక్యమొందుటకుఁగాని, అతుకుకొనుటకుఁగాని యోగ్యతలేదు. అదృష్టపదార్థము పరమాణువు లనైక్యమొనర్చుటచే, మరియొక పరమాణువునకు

స్థానమేర్పడుటతో సంచలనము కలుగునని వైశేషికులు నుడువుదురు. భవిష్యత్కాలమునందు ఫలము నొసంగుటకై వేచియున్న అంతర్నిహితమగు పురాకృతకర్మల శక్తి సమూహమే అదృష్ట మనఁబడును. ఈ విధముగా ప్రపంచమంతయు పరమాణువులచే ఉత్పన్నమగును.

అదృష్టము అచేతనమగుటచే దానికి చలనము లేదు. పరమాణువుల యందది ఉనికిని కలిగియుండదు. అది ఆత్మయం దంతర్నిహితమై యుండనోవును. ఒకవేళ అదృష్టము పరమాణువులయం దంతర్భూతమై యుండు ద్రవ్యమగునేని, పరమాణువులెల్లప్పుడు కలిసియే యుండును. కావున ప్రళయముఁగాని, నూతనసృష్టిఁగాని సంభవించుట కవకాశము లేకుండును.

రెండు పరమాణువులు పూర్ణముగా ఐక్యమైనప్పుడది స్థూలరూపము నొందకుండుటచే, అది పరమాణువుగానే శేషించియుండును. ఒకవేళ పాక్షికముగా ఐక్యమైనచో, పరమాణువులలో విభాగములుండక తప్పదు. ఇది వైశేషిక సిద్ధాంతమునకు విరుద్ధము. కావున పరమాణువుల సమైక్యతయే ప్రపంచమునకు కారణమని పలుకు వైశేషిక సిద్దాంత మసంగతమగును.

పరమాణుసిద్దాంతమునందు మరియొక క్లిష్టత కలదు. స్వాభావికముగా పరమాణువులు క్రియాశీలములై యున్నచో, సృష్టి శాశ్వతముగా నుండును. అప్పుడు ప్రళయము సంభవింపనేరదు. ఒకవేళ స్వాభావికముగా అవి జడమైయున్నచో, సృష్టియే సంభవించదు; ప్రళయమే శాశ్వతముగా నుండును. ఈ కారణముచేత కూడా పరమాణు సిద్ధాంతము అసంగతమగును.

వైశేషిక మతానుసారముగా పరమాణువులు వర్ణాదులను కలిగి యుండును. రూపము, వర్ణము, ఇత్యాదులను కలిగియున్నదేదో అది స్థూలము మఱియు అశాశ్వతమై యుండును. తత్ఫలితముగా పరమాణువులు స్థూలములు మఱియు అశాశ్వతములగును. దీనిచే పరమాణువులు సూక్ష్మములు మఱియు శాశ్వతములని పలుకు వైశేషిక సిద్ధాంతమునకు వైరుధ్యమేర్పడును.

స్థూలభూతములవలె ఆయా భూతములలోని పరమాణువులు కూడా అదే సంఖ్యగల గుణములను కలిగియున్నచో, వాయు పరమాణువు నందొకే గుణము మఱియు పృథ్వీపరమాణువునందు నాలుగు గుణములుండవలసి వచ్చును. కావున

నాలుగు గుణములను కలిగియున్న పృథ్వీపరమాణువు యొక్క పరిమాణమునందు స్థూలత ఏర్పడును. అప్పుడది ఏమాత్రమున్నూ పరమాణువని చెప్పఁబడజాలదు. కావున ఏవిధముగా చూచినను ప్రాపంచిక కారణమును నిరూపించు వైశేషికుల పరమాణు సిద్ధాంతమున కాస్పదము లేదు. ఈ పరమాణుసిద్ధాంతమును వేదము లంగీకరింపవు.

18 నుండి 32 వరకు గల సూత్రములు బౌద్ధమతములోని క్షణిక మఱియు శూన్యవాదములను ఖండించును. వైశేషికులు సర్వాస్తిత్వవాదులు. వారు క్రమముగా భౌతికపదార్థములను మఱియు చైతన్యమును, భావములను కలిగియున్న భౌతిక ప్రపంచము మఱియు అంతరంగిక ప్రపంచము ఈ రెండింటి యొక్క ఉనికి నిజమని అంగీకరింతురు. సౌత్రాంతికులు విజ్ఞానవాదులు. వారు కేవలము భావనయే నిజమని భావింతురు. భావనలు మాత్రమే ఉనికిని కలిగియుండుననియు, భౌతికపదార్థములు భావనలచేతనే ఊహింపబడుననియు వారు తలపోయుదురు. కేవలము భావనలే నిజమనియు, ఈ భావనల ననుసరించిన భౌతిక ప్రపంచము లేదనియును యోగాచారులు తలంతురు. భౌతిక పదార్థములు స్వప్న పదార్థములవలె అసత్యములు, భావనలు కూడా అసత్యములనియు, శూన్యము వినా మరియొక దానికి ఉనికి లేదనియును మాధ్యమికులు తలపోయుదురు. ప్రతిపదార్థము శూన్యము మఱియు అసత్యమని పలుకువారు శూన్యవాదులనఁబడుదురు. ప్రతి వస్తువు క్షణికమని ప్రతివారును అంగీకరింతురు. పూర్వక్షణము నందున్న పదార్థములు ఉత్తర క్షణమునందుండవు.

బౌద్ధమతము ననుసరించి పరమాణువులు మఱియు చైతన్యము ఈ రెండున్నూ అచేతనములే. పరమాణువుల నొక భౌతికపదార్థముగా ఏకీకృత మొనర్చు టకుఁగాని, అఖండముగా మానసికస్థాయిగా రూపొందించుటకుఁ గాని శాశ్వతమగు చైతన్యమనునది లేదు. కావున ఈ బౌద్ధమత సిద్ధాంతము అసంరక్షణీయమైయున్నది.

కారణసంబంధమునందు అజ్ఞానము మున్నగునవి కేవలము ఒకదానికొకటి అడ్డుగా నిలచియుండును. రాసులయొక్క ఉనికియందు వాటిని గణింపరాదు. బౌద్ధమత సిద్ధాంతము ననుసరించి ప్రతిపదార్థము క్షణికమే నైయున్నది. ప్రస్తుత క్షణమునందున్న పదార్థము, తదనంతర పదార్థము వ్యక్తమైన మరుక్షణమునందే

మటుమాయమగును. ఉత్తర పదార్థము ప్రత్యక్షమైన సమయమునందు పూర్వపదార్థము నశించును. కావున పూర్వపదార్థము ఉత్తర పదార్థమునకు కారణమగుట అసాధ్యము. తత్ఫలితముగా ఈ సిద్ధాంతము నిరాధారమగును.

సత్తు అసత్తునుండి జనించునని బౌద్ధులు పలుకుదురు. ఏలననగా కారణము నశింపకుండా కార్యముత్పన్నముకాదని వారు తలంతురు. బీజము నశింపకుండా వృక్షము మనకు ప్రత్యక్ష గోచరము కాదు కదా! వస్త్రమునందు దారమున్నట్లే కార్యమునందు కారణముండుటను మనమెల్లెడలఁ గాంచుచున్నాము. కావున బౌద్ధమతము అపసవ్యము, అప్రతిపాద్యము మఱియు అనంగీకారమైయున్నది.

అజ్ఞానము ఇత్యాది భూమికల ద్వారా కారణము కార్యముగా పరిణమించుటయు తత్తుల్యమగు చైతన్యము లేకుండా సంభవింపదు. ప్రతి పదార్థము కేవలము క్షణికమైన ఉనికిని కలిగియుండునని బౌద్ధులు పలుకుదురు. రెండు భిన్నమైన క్షణములు ఏకకాలమునందునికిని కలిగియుండుటను వారి మతమంగీకరింపదు. కార్యరూపము నొందువరకు కారణము ఉనికిని కలిగియున్నచో క్షణికవాదమునకు నాశమేర్పడును.

బౌద్ధమతానుసారముగా అజ్ఞానము నశించిన తర్వాత ముక్తి పొందఁబడును. క్షణికమైన పదార్థములను శాశ్వతములని తలపోయుటయే అజ్ఞానమునఁబడును.

తపస్సు, జ్ఞానము ఇత్యాది సాధనముల ద్వారా అజ్ఞానము ప్రయత్న పూర్వకముగా, లేక స్వాభావికముగా తొలగింపఁబడును. కాని ఈ రెండున్నూ దోషయుక్తములై యున్నవి. ఏలననగా ఈ యజ్ఞానము తపస్సు ఇత్యాది సాధనముల ద్వారా తొలగింపఁబడదు. ఏలననగా బౌద్ధమతము ననుసరించి ఇతర పదార్థముల వలెనే సాధనములు కూడా క్షణికములై యున్నవి. కావున అవి అజ్ఞానమును నిషేధించు సామర్థ్యమును కలిగియుండవు. నిషేధము తనకు తానే స్వయముగా సంభవింపదు. అట్లయినచో బౌద్ధమత నిలయములు, క్రమశిక్షణలు మఱియు ముక్తికై ప్రబోధింపఁబడిన ధ్యానపద్ధతులన్నియును నిష్ప్రయోజనములగును.

ఆకాశముయొక్క అస్తిత్వమును బౌద్ధు లంగీకరింపరు. ఆకాశము శూన్యమని వారు తలంతురు. ఇది అసంగతము. ఆకాశమునందు శబ్దగుణమున్నది. పృథ్వి, జలాదులవలెనే దానికి ప్రత్యేకమైన ఉనికి యున్నది. ఒకవేళ ఆకాశము శూన్యమైయుండునేని, అప్పుడీ ప్రపంచమంతటికి స్థలాభావ మేర్పడియుండెడిది.

'ఆత్మన ఆకాశస్సంభూతః' అని శ్రుతి వాక్యము నుడువుచున్నది. కావున ఆకాశము సత్యమైయున్నది. దానికి అస్తిత్వమున్నది. కాని నాస్తిత్వము లేదు.

ఒక వేళ ప్రతిపదార్థము క్షణికమైయున్నచో, ఒకానొక పదార్థము ననుభవించు వాడు కూడా క్షణికుడై యుండవలయును. కాని మనకు గడచిన అనుభవములు జ్ఞప్తియందుండుటచే భోక్త క్షణికుడు కాజాలడు. పూర్వమనుభవించిన దానిని మానవుడు జ్ఞప్తియందుంచుకొనును. కనీసము రెండు నిముషములైనను అతడు దానితో సంబంధమును కలిగియుండును. దీనిచే నిశ్చయముగా క్షణికవాదము ఖండింపఁబడును.

నాస్తిత్వముచే అస్తిత్వము సృష్టింపఁబడుట మనమెచ్చటనుఁ గాంచము. కావున నాస్తిత్వము కారణమైయుండుట పొసగదు. సత్యమైయున్న ప్రపంచము నాస్తిత్వముచే కలిగినదని బౌద్ధులు వాదింతురు. ఇది అసంగతము, మట్టి లేకుండా కుండ ఉత్పన్నమగుట మనమెచ్చటనుఁ గాంచము. ఒకవేళ అస్తిత్వము నాస్తిత్వముచే ఉత్పన్నమొనర్పఁబడునేని, ఏ పదార్థమైనను ఏ పదార్థముచేతనైనను ఉత్పన్నమగును. ఏలననగా అన్ని విషయములలో నాస్తిత్వము ఏకైకమైయున్నది. ఒక ఆమ్రబీజమునుండి ఒక పనసచెట్టు ఉత్పన్నమగుట సంభవించును. నాస్తిత్వము నుండి అస్తిత్వముఁగల పదార్థముత్పన్నమైనచో ఒక తటస్థుడై, సోమరియైయున్న మనుజుడు కూడా అప్రయత్నముగా మోక్షము నొందును. వాయుపాతమువలె ముక్తి లభ్యమగును. రైతు తన పొలమును సాగుచేయకున్నను ధాన్యము పండును.

భౌతిక పదార్థములు స్థూలమైన సత్యమును కలిగిలేవని విజ్ఞానవాదు లందురు. ప్రతి పదార్థమున్నూ తత్సంబంధమగు సత్యతను కలిగిలేని ఒక భావమై యున్నది. ఇది సరియైనది కాదు. భౌతిక పదార్థములు జ్ఞానేంద్రియములచే నిజముగా చూడఁబడుచున్నవి. కుందేటి కొమ్మువలె భౌతిక ప్రపంచము ఉనికిలేనిది కాదు.

భౌతిక ప్రపంచమొక స్వప్నమువంటిదని బౌద్ధక్షణికవాదులందురు. ఇది పొరపాటు, స్వప్నములోని ప్రజ్ఞ జాగ్రదవస్థలోని పూర్వప్రజ్ఞపై ఆధారపడియుండును. కాని జాగ్రదవస్థలోని ప్రజ్ఞ ఇంద్రియముల ప్రత్యక్షానుభవముపై తప్ప మరి ఏయితర పదార్థముపైనను ఆధారపడియుండదు. ఇంతేకాకుండా మనము మేల్కాంచిన వెంటనే స్వప్నానుభవములు అసత్యములగును.

ఒక భౌతిక పదార్థము నిజముగా ఉనికి కలిగి లేకున్నను, దాని సంస్కారమునకు ఉనికి యుండుటచే ఈ సంస్కారముల ప్రభావముచే కుర్చి, చెట్టువంటి నానా విధ భావముల కస్తిత్వమేర్పడునని బౌద్ధక్షణికవాదులు పలుకుదురు. ఇది అసాధ్యము. ఏలననగా స్వయముగా అస్తిత్వము కలిగిలేని భౌతిక పదార్థము చూడఁబడుటకే అవకాశము లేదు. భౌతిక పదార్థము చూడఁబడకున్నచో, అది సంస్కారమును కలుగఁజేయుననుట ఎట్లు పొసగును?

మానసిక సంస్కారముల కస్తిత్వము లేదు. ఏలననగా వారి దృష్టియందు ఈ సంస్కారములను గ్రహించు అహంకారము స్వయముగా క్షణికమైయున్నది.

దేనికిని ఉనికి లేదనెడి బౌద్ధుల శూన్యవాదము భ్రాంతిజనకము. ఏలననగా అది ప్రత్యక్షము, అనుమానము, శబ్దము మఱియు దృష్టాంతములలో ఏ ప్రమాణము చేతను నిరూపింపబడజాలదు.

33 నుండి 36 వరకుగల సూత్రములు జైనమతమును ఖండించును. జైనమతము ననుసరించి ప్రతిపదార్థము అస్తిత్వనాస్తిత్వములను కలిగియుండును. ఈ వాదము నంగీకరించుట అసాధ్యము. ఏలననగా ఒకే పదార్థమునందు పరస్పర విరుద్ధమైన ధర్మములు ఏకకాలమునందునికిని కలిగియుండుట అసాధ్యము. ఒకే సమయమునందొక పదార్థము వేడిగాను, చల్లగాను ఉండుటను మనమెచ్చటనుఁ గాంచము. ఒకే స్థలమునందు చీకటి మఱియు వెలుతురు ఏకకాలమునందుండుట అసాధ్యము.

జైనమత సిద్ధాంతానుసారముగా స్వర్గలోకము మఱియు ముక్తికి అస్తిత్వముండవచ్చును, లేకుండవచ్చును. ఈ విషయమునందది ఒక నిశ్చితాభిప్రాయమును కలిగిలేదు. ఏ విషయముఁగూర్చియైనను ఇదమిత్థమని అది పలుకదు.

ఆత్మ శరీరపరిమాణము కలిగియుండునని జైనులు వాదింతురు. నానావిధ వర్గములకు చెందిన జీవుల శరీర పరిమాణములు నానావిధములై యుండుటచే, మానవుని ఆత్మ తన పురాకృతకర్మచే ఒక ఏనుగు శరీరమును ధరింపవలసి వచ్చినప్పుడా ఆత్మ ఏనుగు శరీరమును నింపుటకు చాలదు. అదే విధముగా ఏనుగుయొక్క ఆత్మ ఒక చీమయొక్క శరీరమునందు పట్టుటకు స్థలము లేకుండును.

ఈ విధముగా ఆత్మయొక్క పరిమాణ స్థాయి చెఱుపఁబడును. జైన సిద్ధాంతమిట్లు స్వయముగా భూపతనమగును.

37 నుండి 41 వరకుఁగల సూత్రములు పాశుపతపద్ధతి ననుసరించువారి సిద్ధాంతమును రద్దు పఱచును. ఈ మతము ననుసరించువారు పరమేశ్వరుని నిమిత్త కారణముగా భావింతురు. మూలప్రకృతిని వారు ఈ ప్రపంచమునకు ఉపాదాన కారణముగా తలంతురు. దీనిచే బ్రహ్మము ఉపాదానకారణము మఱియు నిమిత్త కారణము కూడా నైయున్నదని పలికెడు శ్రుతివచనమునకు వైరుద్ధ్య మేర్పడును. కావున పాశుపత సిద్ధాంతము నంగీకరించుట భావ్యము కాదు.

వారి దృష్టియందు పరమేశ్వరుడు నిష్క్రియుడు మఱియు నిర్గుణుడైన పరిశుద్ధ స్వరూపుడు. కావున అతనికి మఱియు మూల ప్రకృతికి మధ్య ఏలాటి సంబంధముండజాలదు. ప్రకృతి పనిచేయు నట్లాతడు ప్రేరేపింపజాలడు, మఱియు నియమింపజాలడు. శరీరములన్నియును నాశవంతములగుటచే, పరమేశ్వరుడు శరీరమును ధరించి ప్రపంచమునకు నిమిత్తకారణమగునని పలుకుటయు అయుక్తమేయగును. పాశుపత మతానుసారముగా పరమేశ్వరుడు శాశ్వతుడగుటచే, అతడీ నాశవంతమగు శరీరమును ధరించి ఈ భౌతిక పరికరముపై ఆధాపడి యుండడు.

ఒకవేళ జీవుడు అదృశ్యములైన ఇంద్రియములను పరిపాలించునట్లు పరమేశ్వరుడున్నూ ప్రధానము మున్నగువాటిని పరిపాలించునని పలికినచో అదియు పాడికాదు. ఏలననగా అట్టి ఎడల పరమేశ్వరుడు కూడా సుఖదుఃఖముల ననుభవింపవలసివచ్చుటచే, తన దైవత్వమును జారవిడువ వలసివచ్చును. దానిచే అతడు జననమరణములకు గుఱియగుటచే సర్వజ్ఞత్వమును కోల్పోవును. అతడు తన గొప్పఁదనమంతటిని పోగొట్టుకొన వలసివచ్చును. ఇట్టిరకమగు దేవుడు పాశుపతులచే అంగీకరింపఁబడడు.

42 నుండి 45 వరకు గల సూత్రములు భాగవత, లేక పాంచరాత్ర సిద్ధాంతమును ఖండించును. ఈ మతముననుసరించి పరమేశ్వరుడీ విశ్వమునకు ఉపాదానము మఱియు నిమిత్తకారణము కూడా నైయున్నాడు. ఇది శ్రుతి ప్రామాణ్యమున కనుకూలమైయున్నది. కాని ఈ సిద్ధాంతముయొక్క రెండవ అంశము

ఆక్షేపణకు గుఱియగును. సంకర్షణుడు, లేక జీవుడు, వాసుదేవుడు ప్రద్యుమ్నులకు జన్మించుట, మనస్సు సంకర్షణుడు మఱియు అనిరుద్ధుని నుండి జన్మించుట, అహంకారము ప్రద్యుమ్నుని నుండి జన్మించుట యను సిద్ధాంతము అసంగతమగును. ఇట్టి సృష్టి అసాధ్యము. ఇట్టి జన్మ ఉండియుండునేని, ఆత్మ సృష్టింపఁబడునేని అది నశింపక తప్పదు. కావున ముక్తికాస్పదముండదు.

వ్యూహములన్నియు బుద్ధిబలము, ప్రభుత్వము, శక్తి సామర్థ్యము మున్నగు వాటిని కలిగియున్న వాసుదేవుడే యనియు మఱియు అవి దోషములు, అసంపూర్ణతల నుండి నిర్ముక్తములనియును భాగవతులు నుడువవచ్చును. అట్లగునేని అనేక ఈశ్వరుల అస్తిత్వము నంగీకరింపవలసివచ్చును. దీనిచే వారి సిద్ధాంతాను సారముగా ఒకేయొక నిజమైన అస్తిత్వముగల పవిత్రుడగు వాసుదేవుడున్నాడను విషయమునకు వైరుధ్యమేర్పడను. ఇంతేకాకుండా ఈ సిద్ధాంతమునందు నానావిధములగు పరస్పర ఖండనమండనలున్నవి. వేద విరుద్ధములగు పరిచ్ఛేదములు కూడా ఇందున్నవి. వేదములను తిరస్కరించు శబ్దములున్నూ ఇందు కలవు. కావున భాగవత సిద్ధాంత మంగీకారము కాజాలదు.

# 1. రచనాను పపత్త్యధికరణము

## (1-10 సూత్రములు)

### 2-2-1 రచనానుపపత్తేశ్చనానుమానమ్.

సాంఖ్యులచే ఊహింపఁబడిన ప్రధానము ప్రపంచమునకు కారణము కాజాలదు. ఏలననగా అట్లయినచో సృష్టియందు చూడఁబడుచున్న క్రమము అసాధ్యమైయుండెడిది.

రచనా = సృష్టినిర్మాణక్రమము, అనుపపత్తేః = అసాధ్యమగుటచే, చ = మఱియు, న = కాదు, అనుమానమ్ = సాంఖ్యులచే ఊహింపబడిన ప్రధానము.

సాంఖ్యుల ప్రధానము ప్రపంచమునకు కారణము కాదనెడి వాద మొసంగఁబడినది.

వేదములలోని సత్యతతను నిరూపించుటయే వేదాంత సూత్రములకు ప్రధాన లక్ష్యమైయున్నది. తదితర దర్శనములయందున్న తప్పుడు సిద్ధాంతములను ఖండించుటను కూడా అవి తమ లక్ష్యమునందుంచు కొనును. పూర్వవిభాగమునందు సాంఖ్యసిద్ధాంతము శ్రుతి ప్రామాణ్యముచే అచ్చటచ్చట ఖండింపఁబడినది. 1 నుండి 10 వరకుఁగల సూత్రములు దానిని తర్కము ద్వారా ఖండించును.

ప్రధానము, లేక మూలప్రకృతి జడమైయున్నది. అదియొక అచేతనమగు పదార్థము. ఇట్టి విశాలమైన, సర్వతోముఖమైన, అశ్చర్యకరమైన, క్రమబద్ధమైన, అన్వయక్రమమైన మఱియు కళాప్రపూర్ణమైన ఈ విశ్వరచన నొనర్చుటకావశ్యకమగు ప్రజ్ఞ దీనికి లేదు. విశ్వముయొక్క సర్వతోముఖమగు క్రమబద్ధతను రచించు సామర్థ్యము దీనికి లేదు. శిల్పకళాకారుడు, తాపీపనివాడు మున్నగు ప్రజ్ఞాదురంధరుల సహాయము లేకండా కేవలము ఇటుకలు, సున్నము మున్నగు వాటిచే ఆకస్మికముగా ఒక అందమైన భవనము నిర్మింపబడుటను ఎవ్వడైననుఁగాంచజాలడు. కావున ప్రధాన మీ ప్రపంచము నకు కారణము కాజాలదు.

మన్ను స్వయముగా కుండగా మారజాలదు.

ప్రధానమీ ప్రపంచమునకు కారణము కాజాలదు. ఏలననగా దానియందు ప్రపంచములోని సుఖదుఃఖములు, తమస్సు ఇత్యాదులు గణనకు రావు. కారణమేమనగా ఆశ్చర్యకరమైన, క్రమబద్ధమైన విశ్వమును సృష్టించుటకు ఒక జడపదార్థమునకు సామర్థ్యములేదు. ఇంతేకాకుండా సుఖదుఃఖములు మఱియు తమస్సు ప్రపంచమునకు బాహ్యముగా ఉండునని నీవెట్లు చెప్పఁగలవు? ఆంతరికానుభవములైన సుఖదుఃఖములకు భౌతిక పదార్థములు భాజకములగును. అంతేకాదు, భౌతిక పదార్థములు లేకున్నను సుఖదుఃఖముల కునికియుండును. అట్టిఎడల అవి అచేతనములని నీవు ఎట్లు ఆరోపింపఁగలుగుదువు?

పుష్పములు, ఫలములు మున్నగు భౌతికపదార్థములు సుఖమునొసంగు గుణమును కలిగియున్నవనుట నిస్సంశయము. కాని ఆ సుఖానుభూతి నిజమునకు ఆంతరికానుభవమైయున్నది. ఫలపుష్పములు మానవునియందు సుఖమును ప్రకోపింపఁజేసినను, అవి స్వయముగా సుఖస్వరూపములై యున్నవని మనము చెప్పజాలము. నిజమునకు సుఖము ఆత్మగుణమైయున్నది. కాని ప్రధానముయొక్క గుణముకాదు. కావున ప్రధానము, లేక ప్రకృతియందు సుఖము ఇత్యాదిగుణములున్నవని చెప్పుటకు వీలులేదు.

## 2-2-2 ప్రవృత్తేశ్చ.

మఱియు క్రియాశీలత అసాధ్యమగుటచే.

ప్రవృత్తేః = క్రియాశీలతవలన, చ = మఱియు (మాత్రమే).

ఇది 1వ సూత్రమును బలపఱచుచు వాదించును.

ప్రధానమీ ప్రంచమునకు కారణము కాజాలదు. ఏలననగా దానికి సృష్టించు సంకల్పము కలుగుట కూడా అసాధ్యము.

త్రిగుణాత్మకసామ్యతను కలిగియున్న ప్రధానమెట్లు శక్తిమంతము మఱియు సృజనాత్మకమగును? అది తన స్వంత సమత్వమును భంగపఱుపఁజాలదు. జడమైన ప్రధానమునకు కోరికనుఁగాని, సృజనాత్మక ప్రవృత్తినిఁగాని ఆరోపించుట తగదు, జడమైన రథము తాను స్వయముగా కదలదు. కేవలము ప్రజ్ఞాన్వితుడగు సారథి మాత్రము గుఱ్ఱములను తోలుట ద్వారా రథమును చలింపఁజేయును.

ప్రజ్ఞాన్వితుడగు కుమ్మరివాని కర్తృత్వము లేకుండా మట్టి స్వయముగా కుండను నిర్మించుటను మన మెచ్చటనుఁగాంచము. మనము చూచిన దానిచే చూడని దానినిఁగూర్చి నిశ్చయింతుము. తెలిసినదాని నుండి మనము తెలియని దానివైపు కేగుదుము, ఐతే జడమైన ప్రధానము విశ్వమునకు కారణము కాజాలదు. ఏలననగా దానియందు విశ్వ సృష్టికి కావలసిన కార్యశీలత లుప్తమైయున్నది. అందునిమిత్తమై ఒక మార్గదర్శియగు ప్రజ్ఞావంతుడగు పురుషుడు, లేక పదార్థమావశ్యకమైయున్నది.

జడప్రకృతి, లేక ప్రధానమునకు బదులుగా పథప్రదర్శకుడగు ప్రజ్ఞావంతునిపై కార్యశీలత నారోపింప వలసియుండును. ప్రధానమును, లేక ప్రకృతిని చలింపఁజేయునదేదో అదియే నిజమైన కర్తయనబడును. ప్రతికార్యమున్నూ ప్రజ్ఞావంతుడగు కర్తచేతనే ఒనర్పఁబడుటను మనముఁగాంచుచున్నాము. కావున ప్రధానము, లేక జడ ప్రకృతికి కర్తృత్వము లేదు. ప్రకృతి, లేక ప్రధానమునకు స్వభావజన్యమైన స్వకార్యమనునది లేదు.

'కేవలము శరీరము కదులుటయే నాకు కానఁబడుచున్నది. కాని ఆత్మ కదలుట నాకు కానఁబడకున్నద'ని పూర్వపక్షి నుడువవచ్చును. ఆత్మలేకుండా చలనమే లేదని దానికి మేము సమాధాన మొసంగుదుము.

ఆత్మ శుద్ధచైతన్యమగుటచే దానికి కార్యశీలత యుండదని అతడు మరల పలుకవచ్చును. అయస్కాంతము చలింపకున్నను అది ఇనుమును చలింపఁజేయునట్లు, ఆత్మ స్వయముగా చలింపకున్నను అది చలనమునకు ప్రేరణ యొసంగునని మేము బదులు పలుకుదుము. స్థిరముగా నున్న ఒక జడపదార్థము మన ఇంద్రియములలో చలనమును కలిగించుటకు కారణమగును.

ఆత్మ ఏకైకము మఱియు అనంతమైయుండుటచే, దానికి చలనమును కలిగించు సామర్థ్యములేదని పూర్వపక్షి మరల పలుకవచ్చును. అవిద్యకారణముచే మాయవలన సృష్టింపఁబడిన నామరూపములలో చలనమును కలిగించుటకది కారణమగునని మేము సమాధాన మొసంగుదుము.

కావున చలనము చైతన్యవంతమగు ప్రథమ కారణమునకే వర్తించును. కాని సాంఖ్యుల యొక్క జడమైన ప్రథమకారణమగు ప్రధానమునకు వర్తించదు.

## 2-2-3 పయోంబువచ్చేత్తత్రాపి

పాలు, లేక నీటివలె ప్రజ్ఞయొక్క సహాయము లేకుండానే ప్రధానము స్వయముగా మార్పునొందును లేక, చలించునని పలికినచో, అచ్చట కూడా ప్రజ్ఞయే కారణమైయున్నదని మేము సమాధాన మొసంగుదుము.

పయోంబువత్ = పాలు మఱియు నీటివలె, చేత్ = ఒకవేళ, తత్ర = ఆ విషయమునందును, అపి = కూడా.

1వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

పాలు, లేక నీటివలె స్వయముగా చలించు స్వభావమును కలిగియుండవచ్చునని పూర్వపక్షి పలికినచో, ఆ విషయమందున్నూ చైతన్యవంతుడగు కర్తయే పనిచేయునని మేము సమాధానము నొసంగుదుము. నదులలో నీరు, మేఘము నుండి వర్షము, పొదుగు నుండి పాలు ఎట్లు అఖండముగా ప్రవహించునో, అట్లే జడమైన ప్రధానమున్నూ స్వయముగా బుద్ధి, అహంకారము, మనస్సు, తన్మాత్రాదులుగా పరిణమింపవచ్చునని సాంఖ్యులు పలుకుదురు.

సూత్రముయొక్క ఉత్తరభాగమగు 'తత్రాపి' ద్వారా ఇది ఖండింపఁబడినది. నీరుఁగాని, పాలుఁగాని ప్రవహించుట కూడా పరమేశ్వరుని ఆజ్ఞచేతనే జరుగుచున్నది. రథము ఇత్యాది దృష్టాంతములచే దీనిని మనమూహింపవచ్చును. రథములోని ప్రజ్ఞాన్వితుడగు సారథిని మనము చూడకపోవచ్చును. కాని రథము కదులుటచే అతని ఉనికిని మనమూహింతుము.

శ్రుతులు కూడా ఇట్లనును. 'యో ప్సుతిష్ఠన్నద్భ్యోఽ ంతరోయమాపోనవిదుః" (బృ.ఉ.3-7-4). 'ఏతస్యవా అక్షరస్యప్రశాసనేగార్గి ప్రాచ్యోఽ న్యానద్యస్స్యందంతే' (బృ.ఉ.3-8-9). ఈ ప్రపంచములోని ప్రతిపదార్థమున్నూ పరమేశ్వరునిచే పరిపాలింపఁబడుచున్నది.

ఇంతేకాదు, ఆవు ఒక చైతన్యముఁగల జంతువు. అది తన దూడను ప్రేమించుటచే, తన సంకల్పమువలన పాలను స్రవింపఁజేయును. మఱియు ఆవుదూడ పాలను కుడుచుటచే పాలు స్రవించును. నీటి ప్రవాహము భూమియొక్క పల్లముపై ఆధారపడియుండును.

## 2-2-4 వ్యతిరేకానవస్థితేశ్చానపేక్షత్వాత్

మఱియు ప్రధానము దేనిపైనను ఆధారపడిలేకుండుటచేతను, దానికండగా భౌతికముగా ఏలాటి కర్త లేకుండుటచేతను అది చలింపజాలదు.

వ్యతిరేకానవస్థితేః = దానికండగా భౌతికకర్తృత్వము లేకుండుటచే, చ = మఱియు, అనపేక్షాత్వాత్ = ఆధారపడి లేకుండుటచే.

1వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

సాంఖ్యమతము ననుసరించి ప్రధానమును కార్యోన్ముఖమొనర్చుటకై, లేక దానినుండి నివృత్తి నొందించుటకై భౌతికముగా ఏలాటి కర్త లేదు. వారి పురుషుడు విభిన్నుడైయున్నాడు. అతనికి కార్యమునందు ప్రవృత్తిఁ గాని, దానినుండి నివృత్తిఁగాని లేదు. అతడొక కర్తకాడు. సృష్టికార్యమారంభమగుటకై అతడు ప్రథమముగా ప్రేరణనొసంగడు. కావున మూల ప్రకృతియొక్క సమత్వమును చెదరఁగొట్టుటకై ఏలాటి కర్తృత్వము లేదు. ఈ కారణముచే సాంఖ్యులయొక్క ప్రధానము ప్రపంచమునకు ప్రథమకారణము కాజాలదు.

త్రిగుణములు సమత్వస్థితియందున్న స్థితియే సాంఖ్యులచే ప్రధానమని చెప్పఁబడును. సాంఖ్యమతము ననుసరించి ప్రధానమును నియమించుటకు ఏలాటి చైతన్య శక్తియు పనిచేయదు. పురుషుడు సుస్థిరుడు మఱియు నిశ్చలుడైయుండును.

కావున ప్రధానమును నియమించుటకు చైతన్యవంతుడగు ఏలాటి పరిపాలకుడు లేకుండుటచే ఇప్పుడొక మార్గమునందు, మరియొకప్పుడు మరియొకమార్గమునందది చలింపవచ్చును. లేక, ఏమాత్రము చలింపకపోవచ్చును. కాని పరమాత్ముడు సర్వజ్ఞుడు మఱియు సర్వశక్తిమంతుడు. అతనికి మాయపై పూర్ణాధికారమున్నది. అతని ఇచ్ఛానుసారముగా సృష్టింపవచ్చును, సృష్టింపకను పోవచ్చును.

సాంఖ్యుల ప్రధానము జడమైయుండుటచే అది స్వయముగా కార్యోన్ముఖము కాజాలదు. ఒకవేళ కార్యోన్ముఖమైనను, అది స్వయముగా దానినుండి నివృత్తినొందనేరదు. కావున చైతన్యవంతుడగు పరిపాలకుడు లేకుండుటచే సాంఖ్యులు సృష్టి ప్రళయములను నిరూపింపజాలరు. తదితర సిద్ధాంతము లన్నియును ప్రధానము యొక్క కార్యములేనైయున్నవి. కావున అవి దీనిపై ఏలాటి

ప్రభావమును చూపజాలవు. కాబట్టి ప్రధాన సిద్ధాంతము స్వవచోవ్యాఘాతమును కలిగించును.

## 2-2-5 అన్యత్రా భావచ్చన తృణాదివత్.

మఱియు గడ్డి మున్నగునవి పాలుగా మారునట్లు ప్రధానము కూడా స్వయముగా మార్పునొందునని నుడువుటకు వీలులేదు. ఏలననగా పాలుగా మారుట ఆవులలో తప్ప ఎద్దులలో సంభవించుట లేదు కదా!

అన్యత్ర = ఆవులలో తప్ప తద్వ్యతిరిక్త జంతువులలో, అభావాత్ = లేకుండుటచే, చ = మఱియు, న = కాదు, తృణాదివత్ = గడ్డి మున్నగువాటివలె.

'చ' అను పదమిచ్చుట 'కేవలము' అను అర్థమును సూచించును.

గడ్డి పాలుగా మారునట్లు ప్రధానము ప్రపంచముగా పరిణమించవచ్చునని ఆక్షేపకుడనును. ఐతే గడ్డి తన స్వయంశక్తిద్వారా పాలుగా మారునా? లేదు. అట్లగునేని గడ్డినుండి పాలనుత్పత్తి చేయుటకు ప్రయత్నము చేయుము. కేవలము ఆవు మాత్రమే గడ్డినిపాలుగా మార్చఁగలుగును. ఒక ఎద్దు అట్లు చేయఁగలుగునా?

ప్రధానము అఖండముగా మార్పునొందుట అసాధ్యము. గడ్డి అన్ని సందర్భములలో పాలుగా మారదు. ఆవు గడ్డిని తిన్నప్పుడే అది పాలుగా మారును. కాని ఎద్దు తిన్నప్పుడు కాదు. ఇచ్చట కూడా పరమేశ్వరుని సంకల్పము చేతనే ఈ మార్పు కలుగును. కాని ఆవు గడ్డిని తిన్నందువల్ల కాదు.

దృష్టాంతము నిష్ప్రయోజనము. ఇది నిలువనేరదు. సాంఖ్యుల వాదము స్థిరమైనది కాదు. కావున ప్రధానము స్వయముగా మార్పునొందుననుట అంగీకార్యము కాదు. గడ్డి ఇత్యాది ఉపమానముల ద్వారా ప్రధానము అఖండముగా మార్పునొందునను విషయము నిరూపింపఁబడదు.

## 2-2-6 అభ్యుపగమేఽ ప్యర్థాభావాత్.

ఒకవేళ ప్రధానము అఖండముగా మార్పునొందుననెడి సాంఖ్యమతము నంగీకరించినను, అది విశ్వమునకు కారణము కాజాలదు. ఏలననగా అది ఏలాటి లక్ష్యమును కలిగిలేదు.

అభ్యుపగమే = అంగీకరించినను, అపి = కూడా, అర్థ = ఉద్దేశ్యము, అభావాత్ = లేనందుచే.

1వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

తర్కముకొఱకై ఒకవేళ ప్రధానము అఖండముగా క్రియాశీలమైయుండునని అంగీకరించినను, అది తమ మతమునకే విరుద్ధమగును. ఒకవేళ ప్రధానము అఖండముగా క్రియాశీలమైయున్నను, అంతరంగికముగా మార్పునొందు స్వభావమునది కలిగియున్నను, దాని క్రియకొక లక్ష్యము లేదు. దీనిచే ప్రధానము యొక్క మార్పు భోగము మఱియు మోక్షము కొరకనెడి సాంఖ్యుల మతము ఖండింపఁబడును.

పూర్ణస్వరూపుడై యున్న పురుషుడు అనుభవింపఁదగిన భోగమునునది లేదు. ఒకవేళ అనుభవించునేని, అతడా అనుభవము నుండి ఎట్లు విముక్తుడగును? అతడు నిత్యముక్తుడు. అతడు పరమానందస్థితి యందుండి యున్నాడు. అతడు పూర్ణుడగుటచే, అతనికి కోరిక యనునదుండజాలదు.

జడమైన ప్రధానము వృద్ధినొందు కోరికను కలిగియుండదు. కావున కోరికను తీర్చుకొనుట ప్రధానముయొక్క క్రియాశీలతను లక్ష్యముగా తలంపఁబడదు. సృజనశక్తి నిరర్థకముగా పరిగణింపఁబడు కారణముచే వికాసము సిద్ధాంతీకరింపఁ బడవలయునని నీవు పలుకుదువేని, అట్లయినచో సృజనశక్తి ఎల్లప్పుడు పనిచేయుచుండును. మఱియు పరమానందము నొందుట ద్వారా దాని నుండి విముక్తి కలుగకుండునని మేము సమాధాన మొసంగుదుము.

కావున ఆత్మ కొరకై ప్రధానము క్రియాశీలమగునని నుడువుట అసంగతమగును. అది విశ్వమునకు కారణము కాజాలదు.

## 2–2–7 పురుషాశ్మవదితిచేత్తథాపి.

ఒకవేళ ఒక కుంటి వాడు ఒక గ్రుడ్డివానికి మార్గదర్శియగునట్లు, లేక అయస్కాంతము ఇనుమును చలింపఁజేయునట్లు పురుషుడు ప్రధానమును చలింపఁజేయునని పలికినను అది దోషముక్తము కాజాలదు.

పురుష = పురుషుడు, అశ్మ = అయస్కాంతము, వత్ = వలె, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, తథాపి = ఐనను.

1వ సూత్రమును బలపఱచువాదమింకను కొనసాగుచున్నది.

ఒక కుంటివాడు ఒక గ్రుడ్డివాని భుజములపై కూర్చొని అతనికి మార్గమును చూపునట్లు, లేక ఒక అయస్కాంతము ఇనుమును ఆకర్షించునట్లు పురుషుడు నిష్క్రియుడై యున్నను, అతడు ప్రధానమును చలింపఁజేయును; లేక, చలనమునకు ప్రేరణ యొసంగునని సాంఖ్యులు పలుకుదురు. కాని ఈ దృష్టాంతములిచ్చుట పొసగవు. ఒక కుంటివాడు మాట్లాడుటతో గ్రుడ్డివానికి మార్గదర్శియగును. గ్రుడ్డివాడు చూచుట కసమర్థుడైయున్నను, కుంటివాని మాటలను అర్థమొనర్చుకొని తదనుసారముగా వర్తించుటకు శక్తిమంతుడై యున్నాడు. కాని పురుషుడు పూర్తిగా తటస్థుడై యుండును. అతనికేలాటి క్రియాకలాపములు లేవు. కావున ప్రధానము ననుసరించిన వర్తనను అతడు కలిగియుండడు.

ఇంతేకాకుండా కుంటివాడు, గ్రుడ్డివాడు ఇరువురును చైతన్యవంతులు మఱియు ఇనుము, అయస్కాంతము రెండున్నూ అచేతనములై యున్నవి. తత్ఫలితముగా దృష్టాంతములు అనుచితములై యున్నవి. సాంఖ్యమతాను సారముగా ప్రధానము స్వతంత్రమైయున్నది. కావున ఇనుము చలించుటకై అది అయస్కాంతముపై ఆధారపడియుండునట్లు, ప్రధానము చలించుటకై అది పురుషునిపై ఆధారపడియుండునని చెప్పుట అసమంజసమగును. ఇనుము సమీపమునకు గొనివచ్చినప్పుడు అయస్కాంతము దాని నాకర్షించును. ఇనుమునకు అయస్కాంతము యొక్క సామీప్యత శాశ్వతమైనది కాదు. అది ఒక ప్రత్యేక ప్రక్రియపైనను మఱియు అయస్కాంతముయొక్క ప్రత్యేక పరిస్థితి పైనను ఆధారపడియుండును. కాని ఎవడు కూడా పురుషుని ప్రధానము యొక్క సమీపమునకు తీసుకొనిరాడు. ఒకవేళ పురుషుడెల్లప్పుడు సమీపస్థుడైయున్నచో, అప్పుడు సృష్టి శాశ్వతముగా కొనసాగుచుండును. అట్టి ఎడల మోక్షమున కవకాశము లేకుండా పోవును.

పురుషుడు మఱియు ప్రధానము పూర్తిగా విభిన్నములు మఱియు స్వతంత్రములై యున్నవి. ప్రధానము జడము, అచేతనము మఱియు స్వతంత్రమై యున్నది. పురుషుడు అజ్ఞాతుడు మఱియు తటస్థుడైయున్నాడు. ఈ రెండింటిని కలుపుటకై మూడవ పదార్థమనునది లేదు. కావున ఈ రెండింటికి మధ్య సంబంధమసంభవమగును.

సాంఖ్య సిద్ధాంతముననుసరించి సృష్టికార్యమే అసంభవమగును. ఒకవేళ ఇట్టి కార్యమున కునికియున్నను, సృష్ట్యాత్మక కారణము శమింపకుండుటచే మోక్షమున కవకాశము లేకుండెడిది.

వేదాంతమునందు విశ్వమునకు కారణమైయున్న బ్రహ్మము తటస్థమై యుండును. కాని అతడు మాయద్వారా గుణాత్మకుడు మఱియు క్రియాశీలుడై యున్నాడు. అతడు తన స్వస్వరూపమునందంతర్నిహితుడై నిష్క్రియుడుగను మఱియు మాయ యందంతర్భూతుడై చలనశక్తి సమన్వితుడునైయున్నాడు. ఇట్లాతడు సృష్టికర్తయగును. అతడు స్వాభావికముగా తటస్థుడు మఱియు మాయచే క్రియాశీలుడై యున్నాడు. కావున అతని సృజనశక్తి స్పష్టముగా నిరూపింపఁబడినది. అతడు సాంఖ్యుల పురుషునికన్న మిన్నయైయున్నాడు.

## 2-2-8 అంగిత్వానుపపత్తేశ్చ.

మఱియు ప్రధానము చైతన్యవంతము కాజాలదు. ఏలననగా త్రిగుణముల మధ్య ముఖ్యము మఱియు గౌణము యొక్క సంబంధమసంభవమగును.

అంగిత్వానుపపత్తేః = ముఖ్య, గౌణముల సంబంధమసంభవమగుటచే, చ = మఱియు.

1వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

త్రిగుణములయొక్క సమత్వస్థితియే ప్రధానమని నిర్వచింపఁబడినది. ప్రధానము సత్త్వరజస్తమములనెడి మూడు గుణములను కలిగియున్నది. ఈ త్రిగుణములు ఒకదానికొకటి పరస్పరము స్వతంత్రములై యున్నవి. ఇవి సృష్టికి పూర్వము సమత్వస్థితి యందుండెను. ప్రధానభూమిక యందు ఒకగుణము రెండవ గుణమునకు శ్రేష్ఠముగ, నికృష్టముగను పరిగణింపఁబడకుండెను. ప్రతియొక్కటియు రెండవదానికి సమానమైయుండెను. తత్ఫలితముగా ముఖ్యము మఱియు గౌణమునకు సంబంధము లేకుండెను. పురుషుడు పూర్తిగా తటస్థుడై యుండెను. ప్రధానముయొక్క సమత్వస్థితిని చెదరఁగొట్టుట కాతడు ఆసక్తి లేనివాడై యుండును. సమత్వస్థితి చెదరఁగొట్టఁబడినప్పుడే సృష్టి ప్రారంభమగును. మఱియు ఒక గుణము శేషించిన గుణద్వయము నతిక్రమించును. గుణసంచాలనమునకై

ఏలాటి అన్యసూత్రము లేకుండుటచే, నిమిత్తకారణమునకు కావలసిన మహాసూత్రము మఱియు తత్కార్యములు ఉత్పన్నము కాకుండుటచే గుణములు విషమస్థితి నొందుట అసంభవమగును. ఏలాటి భౌతికబలము లేకుండా సమత్వము చెదరఁగొట్టఁబడదు. సమత్వ స్థితియందున్న గుణములు పూర్ణ స్వాతంత్ర్యమును కలిగి యుండును. తన స్వాతంత్ర్యమును కోల్పోకుండా ఒక గుణము మరియొక గుణమునకు సహకారి కాజాలదు; కావున సృష్టి అసంభవమగును.

ఇట్టి గుణాధిక్యము సాధ్యముకాదని ఈ సూత్రము నుడువును. ఒక గుణము మరియొక గుణమునేల అతిక్రమించవలయునను విషయమునకు సాంఖ్యులు సమాధానము నొసంగలేరు. కావున ఒక గుణము మరియొక గుణము నధిగమించుట అసాధ్యమగుటచే, ప్రధానమీ ప్రపంచమునకు కారణముగా అంగీకరింపఁబడదు.

## 2-2-9 అన్యథానుమితౌచజ్ఞశక్తి వియోగాత్.

ఒకవేళ అది ఊహింపఁబడినను ప్రధానము చైతన్యశక్తి శూన్యమై యుండుటచే, విశ్వమునకు కారణము ప్రధానము కాదనెడి ఇతర ఆక్షేపణలకు బలము కలుగును.

అన్యథా = మఱియొక విధముగా, అనుమితౌ = ఊహింపఁబడినచో, చ = కూడా, జ్ఞశక్తి = బుద్ధిశక్తి, వియోగాత్ = లేకుండుటచే.

1వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

ఒకవేళ ప్రధానమునందు మార్పునొందు శక్తి అంతర్నిహితమైయున్నదని ఆక్షేపకు డంగీకరించినను, అది అయుక్త మేయగును. ఏలననగా ప్రధానము అచేతనమై యున్నది.

సాంఖ్యులిట్లు పలుకుదురు : గుణములు స్వతంత్రములనియు, నిస్సంబంధములనియు మఱియు మార్పులేనివనియును మేమంగీకరించము. వాటి కార్యముల ననుసరించి మేము గుణములయొక్క స్వరూపము నూహింతుము. కార్యోన్ముఖమగుటయే వాటికి స్వభావమైయున్నదని మేము విశ్వసింతుము, గుణములలో అస్థిరత వంటి కొన్ని లక్షణములు, విభిన్నమైన విశేషణములు మఱియు అద్భుతశక్తులు అంతర్నిహితమైయున్నవి. తత్ఫలితముగా సమత్వస్థితి యందున్నను,

గుణములు స్వయముగా విషమస్థితి యందు ప్రవేశించుటకు శక్యమగును. అట్లయినను ప్రధానమునకు బుద్ధి శక్తి లేకుండుటచే, ప్రపంచము యొక్క సక్రమ నిర్మాణమసాధ్యమగుటచే పైనుదువఁబడిన ఆక్షేపణలకు బలము కలుగునని మేము సమాధాన మొసంగుదుము. ప్రధాన మచేతనమగుటచే దానికి స్వయంప్రజ్ఞయను శక్తి లేదు. అది ప్రజ్ఞారహితమైయుండుటచే దానికొక యుక్తిఁగాని, విధానముఁగాని తెలియదు. 'ఈ ప్రపంచమును నేనీ ప్రకారముగా సృష్టింతునుఁగాక !' యని ప్రజ్ఞఁగల పదార్థము పలుకునట్లది పలుకఁజాలదు. శిల్పులు మఱియు తాపీపనివారి కర్తృత్వము లేకుండా ఒక గృహము కేవలము ఇటుకలు మఱియు గచ్చుచే నిర్మింపఁబడజాలదు. అదే విధముగా ప్రధానము, లేక జడపదార్థము నుండి సృష్టి సంభవింపనేరదు. గుణములెంతటి అద్భుతమైన శక్తులను, లక్షణములను కలిగియున్నను ప్రేరణాత్మకమగు ప్రజ్ఞ లేకుండా అవి స్వయముగా విశ్వమునకు కారణము కాజాలవు.

ప్రజ్ఞలేని కారణముచే విశ్వము యొక్క సక్రమ నిర్మాణమను భూమికపై ఆక్షేపణలు కలుగుటతో అఖండ సృష్టికి ఆస్కారము కలుగదు. మఱియు ప్రధానము విశ్వమునకు కారణము కాజాలదను విషయము నాపాదించును. (1,4,7 సూత్రములు).

## 2-2-10 విప్రతిషేధాచ్చాసమంజసమ్.

మఱియు ప్రతిఘటనల కారణముచే సాంఖ్య సిద్ధాంతమసమంజసమై యున్నది.

విప్రతిషేధాత్ = ప్రతిఘటన కారణముచే, చ = కూడా, అసమంజసమ్ = అయుక్తము.

1వ సూత్రమును బలపఱచువాదము పరిసమాప్తమైనది.

మఱియు సాంఖ్యదర్శనమునందు నానావిధములగు ఖండనలుండుటచే అది అసంగతమైయున్నది. కొన్ని వేళలలో ఇంద్రియములు పదునొకండనియు, మరియొకప్పుడవి ఏడనియును చెప్పఁబడినవి. కొన్ని వేళలలో తన్మాత్రలు మహత్తు నుండి సంభవించినవనియు, మరికొన్ని వేళలలో అవి అహంకారము నుండి కలిగినవనియును అది పలుకును. కొన్ని వేళలలో మూడు అంతఃకరణములున్నవని

అది చెప్పును. మరికొన్ని సమయములలో ఒకేయొక అంతఃకరణమున్నదని అది నుడువును.

ఇంతేకాకుండా వారి సిద్ధాంతము, పరమేశ్వరుడీ విశ్వమునకు కారణమైయున్నాడనియు మరియు స్మృతి శ్రుతిపై ఆధారపడియుండుననియును ప్రబోధించు శ్రుతికి విరుద్ధమైయున్నది. ఈ హేతువు చేత కూడా సాంఖ్యసిద్ధాంతము గర్హనీయమై యున్నది. దాని నంగీకరింపఁదగదు.

ఇప్పుడు సాంఖ్యము మరియొక విధముగా ప్రతిఘటించును. అతడిట్లనును: ఇట్టి అయోగ్యత మీ సిద్దాంతమునందున్నూ కలదు. ఒకవేళ బ్రహ్మము కార్యము మఱియు కారణమైయున్నచో, కార్యముచే ముక్తి సంభవించునా? యనియు మఱియు ముక్తిని ప్రతిపాదించని శ్రుతి నిష్ప్రయోజనము కాదా? యనియును అతడు ప్రశ్నించును. అగ్ని వేడి మఱియు వెలుతురు నివ్వకుండా ఉండదనియు, నీటిలో అలలు లేకుండా ఉండవనియును అతడు వాదించును. కార్యకారణములలో విభేదమున్నప్పుడు మాత్రమే, ముక్తియనునది అర్థవంతమగును.

పురుషుడు స్వాభావికముగా పరిశుద్ధుడగుటచే అతడు క్షోభింపఁబడనేరడనియు మఱియు ఈ కలతకు కారణము అవిద్యయగుటచే, ఇది నిశ్చయముగా అసత్యమనియును ఆక్షేపకు డంగీకరింపవలసియుండునని మేము సమాధాన మొసంగుదుము. మా పరిస్థితియున్నూ ఇట్టిదే నైయున్నది. కాని నీవు అవిద్యకొక శాశ్వతస్థానము నొసంగుచున్నావు. తత్ఫలితముగా ఒకవేళ పురుషుడు దానినుండి విముక్తుడైనను, ఇట్టి వియోగము శాశ్వతముగా ఉండునని నిశ్చయించి చెప్పఁజాలము. మేము ఒకే యొక పురుషుని సిద్ధాంతీకరింతుము. క్రియలన్నియును సాపేక్షములగుటచే, అవి పూర్ణసత్యమును బాధింపఁజాలవు.

# ౨. మహద్దీర్ఘాధికరణము

## 2-2-11 మహద్దీర్ఘవద్వా హ్రస్వపరిమండలాభ్యామ్

చిన్నదైన మఱియు సూక్ష్మమైన దానినుండి పొడవైనది మఱియు గొప్పదైనది ఉద్భవించుటచే ఈ ప్రపంచమున్నూ పరబ్రహ్మము నుండి ఉత్పన్నమగును.

మహద్దీర్ఘవత్ = గొప్పనైన మఱియు పొడవైన దానివలె, వా = లేక, హ్రస్వపరి మండలాభ్యామ్ = చిన్నది మఱియు సూక్ష్మమైన దాని నుండి.

రూపరహితములగు అఖండమైన పరమాణువులు ప్రపంచ నిర్మాణమునందు ప్రవేశించుననెడి వైశేషికుల పరమాణు సిద్ధాంతమిప్పుడు ఖండింపఁబడుచున్నది.

వైశేషికమతమునకు కణాద ఋషి మూలపురుషుడు. నాశవంతమగు రూపముఁగల ఏ పదార్థమైనను సూక్ష్మము, అఖండము, రూపరహితము మఱియు నిర్వికారములైన అణువులచే నిర్మింపఁబడునని అతడు విశ్వసించును. ఈ యణువులు ప్రపంచమునకు కారణముగా పరిగణింపఁబడును. అణువులు చతుర్విధములు. (1) భూమి యొక్క అణువులు (2) నీటి అణువులు (3) అగ్ని అణువులు (4) వాయు అణువులు. ఈ యణువులకు రూపము లేకున్నను ఒకదానికొకటి విభిన్నమైయుండును. సృష్ట్యారంభమునందు ఒక పరమాణువు మరియొక పరమాణువుతో కలిసి ద్వ్యణుకమగును. ఈ ద్వ్యణుకము మరియొక పరమాణువుతో కలిసి త్ర్యణుకమగును. ఇట్టి సమ్మిశ్రణ పరంపరలచే దృశ్యజగత్తు రూపొందును.

వైశేషికులిట్లు వాదింతురు : కారణపదార్థమునం దంతర్నిహితమైయున్న గుణములు కార్యరూపమునుఁదాల్చు పదార్థమునందు ప్రతిబింబించును. తెల్లని వస్త్రము దానికి భిన్నమైన వర్ణముఁగల వస్త్రముచే ఉత్పన్నమగును. అదే విధముగా చైతన్యవంతుడగు బ్రహ్మము విశ్వమునకు కారణమైయుండగా, కార్యరూపమైన విశ్వమునందు కూడా ఆ చైతన్య మంతర్నిహితమై యుండవలయును. కాని అది అట్లు లేదు. కావున చైతన్యవంతమగు బ్రహ్మము విశ్వమునకు కారణము కాజాలదు.

ఈ వాదము స్వయముగా వైశేషికసిద్ధాంత భూమికయందే భ్రాంతిజనకమై యున్నదని సూత్రకారుడు నిరూపించును.

1 నుండి 10 వరకుగల సూత్రములలో సాంఖ్యసిద్ధాంతము ఖండింపఁబడినది. ఇప్పుడు 11 నుండి 17 వరకుఁగల సూత్రములలో వైశేషిక సిద్ధాంతము ఖండింపఁబడుచున్నది. వైశేషికులయొక్క ఏకాణువులు మఱియు ద్వ్యణుకములు కలిసి త్ర్యణుకములు మఱియు చతురణుకములుగా రూపొందునను విషయము జడమైన ప్రధానము నుండి ప్రపంచముత్పన్నమగునని పలుకు సాంఖ్యసిద్ధాంతము వలె అసంగతమై యున్నది. పరమాణువునం దేలాటి పరిమాణముఁగల విభాగములున్నను, అది పరమాణువనఁబడజాలదు. అప్పుడది ఇంకను విభజింపఁబడుటకు యోగ్యమై యుండును. ఒకవేళ అవి వైశేషికులు వర్ణించునట్లు ఏలాటి పరిమాణముఁగల విభాగములను కలిగిలేకున్నచో, ఇట్టి అభేద్యములగు రెండు అణువులు కలిసి ఒక పరిమాణముఁగల పదార్థము నుత్పన్న మొనర్పజాలవు. త్ర్యణుకములు మున్నగువాని విషయము కూడా ఇట్టిదేనైయున్నది. కావున పరమాణువులు కలియుటచే మిశ్రపదార్థము లేర్పడవు. కావున అభేద్యమైన పరమాణువులచే ప్రపంచ ముత్పన్నమగునవెడి వైశేషికుల సిద్ధాంత మసంగత మగును.

వైశేషిక సిద్ధాంతము ననుసరించి అదృష్టము మున్నగు వాటిచే రెండు పరమాణువులు కలిసి ఒక ద్వ్యణుకమగును. కాని చిన్నదైన ద్వ్యణుకమునందు పరమాణు స్వభావము గోచరింపదు. రెండు ద్వ్యణుకములు కలిసి సూక్ష్మత్వమును కోల్పోయినట్టి పెద్దదియు, పొడవునైయున్న ఒక చతురణుక మేర్పడును. ఒకవేళ పరమాణువు దానికి భిన్నమైన పదార్థమును సృష్టింపఁగలిగినచో జ్ఞానానందములతో కూడియున్న బ్రహ్మము జడము, అచేతనము మఱియు దుఃఖప్రదమైన ప్రపంచమును సృష్టింపఁగలుగుననుట అనౌచిత్యమెట్లగును? ఇతర చిహ్నములను కలిగియున్న మిశ్రపదార్థములలో పరమాణుస్వరూప మెట్లు గోచరింపదో, అట్లే ప్రపంచము నందున్నూ బ్రహ్మముయొక్క చైతన్య స్వరూపము గోచరింపకున్నది.

వైశేషిక సిద్ధాంతము ననుసరించి పరమాణువే ప్రపంచమునకు మూల భూతమైయున్నది. పరమాణువులు శాశ్వతములు, అవియే విశ్వమునకు పరమకారణములై యున్నవి. ప్రళయ సమయమునందీ విశ్వము పరమాణుస్థితి యందుండును. ఒక పరమాణువు అత్యంత సూక్ష్మమై యుండును. ఒక ద్వ్యణుకము సూక్ష్మము మఱియు హ్రస్వమైయుండును. చతురణుకము పెద్దదిగను, పొడవుగను ఉండును.

ఒకవేళ రెండు గోళాకార పరమాణువులు కలిసి గోళాకార పరమాణు స్వరూపమును కలిగిలేని ఒక సూక్ష్మమైన మఱియు హ్రస్వమైన ద్వ్యణుకమును సృష్టింపఁగలిగినచో హ్రస్వమైన, సూక్ష్మమైన ద్వ్యణుకమలు ద్వ్యణుకమువంటి హ్రస్వత్వమునుఁగాని, సూక్ష్మత్వమునుఁగాని కలిగిలేని ఒకపెద్దనైన మఱియు దీర్ఘమైన చతురణుకమును సృష్టింపఁగలుగునేని, కారణముయొక్క గుణములన్నియును కార్యమునందు ప్రస్ఫుటించవను విషయము సుస్పష్టమగుచున్నది. కావున చైతన్యవంతము, ఆనందప్రపూర్ణమైన బ్రహ్మము అచేతనము మఱియు దుఃఖప్రదమైన ప్రపంచమునకు కారణమైయుండుట సుసాధ్యమే యగును.

# 3. పరమాణుజగదకారణత్వాధికరణము

## (12-17 సూత్రములు)

### 2-2-12 ఉభయథాపి న కర్మాతస్తదభావః

అదృష్టము పరమాణువులయం దంతర్నిహితమైయున్నను, లేక ఆత్మ యందంతర్నిహితమై యున్నను పరమాణువులు చలించుట అసాధ్యము. కావున పరమాణువుల కలయిక ద్వారా సృష్టి కలుగునను విషయము నిషేధింపఁబడినది.

ఉభయథా = రెండు విధములుగా, అపి = కూడా, న = కాదు, కర్మ = కదలిక, అతః = అందువలన, తదభావః = పరమాణువుల కలయికచే ప్రపంచము సృష్టింపఁబడునను నిషేధము.

11వ సూత్రము నందారంభింపఁబడిన వైశేషికసిద్ధాంత విరుద్ధమగువాదము కొనసాగుచున్నది.

పరమాణువులపై పనిచేయు ప్రథమ కారణమేది? ఒక పరమాణువునందున్న అదృష్టము, దానిని రెండవ పరమాణువుతో జోడింపఁజేయునని వైశేషికులు నుడువుదురు. ఈ విధముగా ద్వ్యణుకాది మిశ్రమము లేర్పడి, తుట్టతుదకు వాయుభూతమును సృష్టింపఁజేయును. ఇదే విధముగా అగ్ని, జలము, పృథ్వి మఱియు సావయవ శరీరము సృష్టింపఁబడును. ఇట్లు పరమాణువుల నుండి ప్రపంచమంతయు ఉత్పన్నమగును. దారముయొక్క గుణము ననుసరించి

వస్త్రముయొక్క గుణముండునట్లు, పరమాణువుల యందంతర్నిహితములై యున్న గుణముల ననుసరించి ద్వ్యణుకాది మిశ్రమముల గుణములుండును. వైశేషిక దర్శనముయొక్క సిద్ధాంత ప్రబోధమిట్టిదైయున్నది.

జీవుని సుకృత దుష్కృతకర్మలయొక్క ఫలితమగు అదృష్టము పరమాణువుల యందుండకుండుటచే, పరమాణువుల చలనమునకు కారణము పరమాణువులలోని అదృష్టము కాజాలదు. అది జీవునియందే అంతర్నిహితమై యుండును. జీవునియందునికిని కలిగియున్న అదృష్టము పరమాణువునకు చలనమును కలిగింపఁజాలదు. ఈ రెండు దృష్టికోణముల ననుసరించియు పరమాణువుయొక్క చలనము నిరూపింపఁబడజాలదు. అదృష్టము జడమైనదగుటచే అది చలింపజాలదు. అదృష్టము జీవుని యందుండగా అది పరమాణువుల నెట్లు చలింపఁజేయును? ఒకవేళ అది చలింపఁజేయఁగలిగినను, దానిని నిగ్రహిం చుటకొక కర్త లేకుండుటచే ఇట్టి చలనము శాశ్వతముగా కొనసాగుచుండును. రెండు పరమాణువులు కలిసినప్పుడవి పూర్ణముగా సమ్మిశ్రణమునొందునా? లేదా? ఒకవేళ అవి పూర్ణముగా కలిసియున్నచో, పరస్పరము మేళనము నొందినచో, అది స్థూలరూపము నొందకుండుటచే, పరమాణురూపమే శేషించియుండును. ఒకవేళ పాక్షికముగా మేళవింపఁబడినచో, అప్పుడు పరమాణువులయందు విభాగములున్నట్లు నిరూపణ యగును. అప్పుడు వైశేషిక సిద్ధాంతమునకు వైరుధ్యమేర్పడును. ఇంతేకాకుండా ఒకప్పుడైక్యమైన అనంతరమవి తిరిగి విభజింపఁబడనేరవు. కర్మఫలముల ననుభవింపఁజేయుటకై కావలసిన సృష్టిని అదృష్టముత్పన్న మొనర్చును. ఈ కారణములచే ప్రపంచమునకు కారణము పరమాణువులనెడి సిద్ధాంతము పరిత్యజింపఁబడవలసి యున్నది.

ఒక నిశ్చితమైన అదృష్టమును కలిగియున్న జీవుల సాన్నిధ్యము నొందిన వెంటనే పరమాణువులలో సంచలన మారంభమగునని వైశేషికులు వాదింపవచ్చును. ఇదియున్నూ అసంగతమే యగును. ఏలననగా అవిభాజ్యమైన జీవులతో అవిభాజ్యమైన పరమాణువులు సంబంధమును కలిగియుండుట జరుగదు.

ఒక అచేతన పదార్థము జడమైయుండుటచే అది మరియొక పదార్థమును చలింపఁజేయనేరదు. చైతన్యవంతుల బుద్ధిబలముచేతనే పదార్థములన్నియును

చలింపఁజేయఁబడును, ప్రబోధింపఁబడును. మఱియు ప్రవర్తింపఁజేయఁబడును.

సృష్ట్యారంభమునందు పరమాణువులయొక్క ప్రథమ చలనమునకు కారణము జీవుడు కానేరడు. ఏలననగా వైశేషిక మతానుసారముగా ప్రళయమునందు జీవుడు స్వయముగా చైతన్యరహితుడై నిగూఢస్థితియందుండును. కావున ఆతడు పరమాణువుకంటె ఎంతమాత్రమును శ్రేష్ఠుడు కాజాలడు.

జీవుల అదృష్టము ననుసరించిన దేవుని సంకల్పమే పరమాణువుల ప్రథమ చలనమునకు కారణమనియు చెప్పజాలము. ఏలననగా జీవుల అదృష్టములు పరిపక్వమై జాగృతములు కాజాలవు. కావున దైవసంకల్పము పనిచేయనేరదు.

ఈ విధముగా సృష్ట్యారంభమునందు పరమాణువులకు చలనము లేకుండుటచే అవి ఏకముఖమై సామూహికము కాజాలవు. తత్ఫలితముగా ద్వ్యణుక మిశ్రణము లేర్పడకుండుటచే సృష్టి సంభవింపనేరదు.

వైశేషిక మతానుసారముగా పరమాణుసంయోగముచే విశ్వము సృష్టింపఁబడినది. ఐతే ఈ సంయోగమునకుఁగల కారణమేమి? ఒకవేళ అది చూడఁబడుకారణమైనచో, అది శరీరసృష్టికి పూర్వము అసంభవము. ఒక చూడఁబడుకారణము ప్రయత్నముఁగాని, సంయోగముఁగాని ఐయుండును. జీవునికి మనస్సుతో సంబంధము లేనప్పుడు అతడు ప్రయత్నము నొనర్పలేడు. సృష్టికి పూర్వము శరీరముఁగాని, మనస్సుఁగాని లేకుండుటచే, ఏలాటి ప్రయత్నముండ నేరదు. ఇట్లే సంయోగము మున్నగువాని విషయము కూడా నైయున్నది.

అదృష్టము జీవుని యందంతర్నిహితమై యుండునా? లేక, పరమాణువుల యందా? ఒకవేళ అది జీవునియందంతర్నిహితమై యున్నచో, ఆ సమయమునందు జీవుడు జడుడైయుండుటచే అదృష్టమునకు మార్గదర్శియగు చేతనపదార్థ ముండదు. ఇంతేకాదు, పరమాణువులవలె జీవుడుకూడా అవిభాజ్యుడై యున్నాడు. తత్ఫలితముగా జీవుడు మఱియు పరమాణువుల మధ్య ఏలాటి సంబంధ ముండనేరదు. కావున ఒకవేళ అదృష్టము జీవునియం దంతర్నిహితమైయున్నచో, జీవునితో సంబంధము లేని పరమాణువుల యందది చలనమును కలిగింపఁ జాలదు.

ఒకవేళ అదృష్టము పరమాణువులయం దంతర్నిహితమైయుండునేని, ప్రళయము సంభవింపకుండును. ఏలననగా అదృష్టమెల్లప్పుడు ఉనికిని కలిగియుండుటచే పరమాణువు లెల్లప్పుడు చలనమును కలిగియుండును.

కావున పరమాణువులలో ప్రథమచలన మసాధ్యమగుటచే, పరమాణువుల సంయోగమున్నూ అసాధ్యమే యగును.

కాబట్టి విశ్వమునకు కారణము పరమాణు సంయోగమే! యనెడి వైశేషిక సిద్ధాంత మసంగతమగును.

## 2-2-13 సమవాయాభ్యుపగమాచ్చ సామ్యాదనవస్థితేః

మఱియు సమవాయము నంగీకరించుటచే, అట్టి సమానమైన తర్కమువలన అనవస్థాదోషము సంప్రాప్తించుటచే వైశేషిక సిద్ధాంత మసంగతమగును.

సమవాయాభ్యుపగమాత్ =సమవాయము నంగీకరించుటచే, చ = మఱియు, సామ్యాత్ = సమానతర్కముచే, అనవస్థితేః = అనవస్థాదోషము ప్రాప్తించుటచే.

11వ సూత్రమునం దారంభింపఁబడిన వైశేషిక సిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

అభేద్యమై అంతర్నిహితమైయుండు శక్తియే సమవాయమనఁబడును. ఇది వైశేషిక దర్శనములోని సప్తవిధానములయందొకటి. ఇది పరమాణువులను ఐక్యమొనర్చు సంబంధమును కలిగియున్నది.

సమవాయ సంబంధముచే రెండు పరమాణువులు కలిసి ఒక ద్వ్యణుకమగునని వైశేషికులు పలుకుదురు. మఱియు ద్వ్యణుకము, పరమాణువులు భిన్నమైన గుణములను కలిగియుండుటచే సమవాయముచే ద్వ్యణుకము పరమాణువులతో సంబంధము నేర్పఱచుకొనును. పరమాణువులకు మఱియు ద్వ్యణుకమునకు భిన్నమైయున్న సమవాయముచే వాటికి సంబంధమేర్పడును. అది చలించుటకు మరియొక సమవాయము లేనిదే అది ఏల చలింపవలయును? ఆ క్రొత్త సమవాయము మొదటి సమవాయముతో సంబంధము ఏర్పఱచుకొనుటకు మరియొక సమవాయము కావలసియుండును. ఈ విధముగా దీని కంతముండదు. ఇట్టి అనవస్థాదోషముచే వారి సిద్ధాంతము భ్రష్ట మొనర్పఁబడును.

వాదము దోషయుక్తమైయున్నది. కావున పరమాణువుల సంయోగమునకై సమవాయసంబంధము సంగీకరించు పరమాణుసిద్ధాంత మసంగతమైయున్నది.

ఇది అసంబద్ధప్రలాపము మఱియు నిష్ప్రయోజనమగుటచే, దీనిని మనము పరిత్యజింపవలసియున్నది.

## 2-2-14 నిత్యమేవచ భావాత్

మఱియు నిష్క్రియత్వముఁగాని, క్రియాశీలతఁగాని శాశ్వతమైన ఉనికిని కలిగియుండుటచే అణు సిద్ధాంతము అంగీకార యోగ్యము కాజాలదు.

నిత్యమ్ = శాశ్వతము, ఏవ = నిశ్చయముగా, చ = మఱియు, భావాత్ = ఉనికి కలిగి యుండుటచే.

11వ సూత్రమునందారంభింపబడిన వైశేషిక విరుద్ధమగువాదము కొనసాగుచున్నది. అణుసిద్ధాంతమునందు మరియొక దోషము కలదు. ఒకవేళ పరమాణువులు స్వాభావికముగా క్రియాశీలములైయున్నచో, సృష్టి శాశ్వతముగా ఉండి యుండెడిది. ప్రళయము సంభవించియుండెడిది కాదు. ఒకవేళ అవి స్వాభావికముగా నిష్క్రియములైయున్నచో, సృష్టియే సంభవించెడిది కాదు. లయావస్థయే శాశ్వతముగా ఉండి యండెడిది. స్వవచోవ్యాఘాతమును కలిగించుటచే అవి క్రియాశీలత మఱియు నిష్క్రియత్వములను రెండింటిని కలిగియుండవు. ఒకవేళ వాటియందీ రెండున్నూ లేకున్నచో, వాటి క్రియాశీలత మఱియు నిష్క్రియత్వములు అదృష్టమువంటి నిమిత్త కారణముపై ఆధారపడి యుండెడివి. అదృష్టము శాశ్వతముగా పరమాణువుల సాన్నిధ్యమునందుండుటచేతను, అదృష్టమెల్లప్పుడు పరమాణువులతో సంబంధమును కలిగియుండుటచేతను అవి శాశ్వతముగా క్రియాశీలములైయుండును. తత్ఫలితముగా సృష్టి శాశ్వతముగా కొనసాగుచుండును. ఒకవేళ నిమిత్తకారణము లేకున్నచో, పరమాణువులకు చైతన్యము లేకుండెడిది. తత్ఫలితముగా సృష్టికి ఉనికి లేకుండెడిది.

ఈ కారణముచేత కూడా అణుసిద్ధాంతము అసంగతము మఱియు అనంగీకారయోగ్యమైయున్నది.

## 2-2-15 రూపాది మత్త్వాచ్చ విపర్యయో దర్శనాత్.

మఱియు పరమాణువులు వర్ణాదులను కలిగియుండుటచే వైశేషిక మత వైరుధ్ధ్యము సంభవించును. ఏలననగా అది చూడఁబడుచున్నది, లేక పరికింపఁబడుచున్నది.

రూపాదిమత్త్వాత్ = వర్ణాదులను కలిగియుండుటచే, చ = మఱియు, విపర్యయః = వ్యతిరేకము, దర్శనాత్ = సామాన్యానుభవమునందు చూఁడబడుటచే.

11వ సూత్రమునం దారంభింపఁబడిన వైశేషిక వ్యతిరిక్తమగు వాదము కొనసాగుచున్నది.

వైశేషిక మతానుసారముగా పరమాణువులు వర్ణాదులను కలిగియున్నట్లు చెప్పఁబడినది. ఇట్లు కాదేని, కారణములోని గుణములు కార్యమునందున్నూ సంక్రమించుటచే, కార్యములలో ఈ గుణములు లేకుండవలయును. అప్పుడు పరమాణువులు ఎంతమాత్రమున్నూ సూక్ష్మములు మఱియు శాశ్వతములు కాజాలవు. ఏలననగా రూపము, వర్ణము ఇత్యాదులను కలిగియున్నట్టిది స్థూలము, క్షణభంగురము మఱియు అశాశ్వతముగా పరిగణింపఁబడును. తత్ఫలితముగా వర్ణాదులను కలిగియున్న పరమాణువులు మున్నగునవి స్థూలములు మఱియు అశాశ్వతములగును. దీనిచే పరమాణువులు సూక్ష్మములు మఱియు శాశ్వతములని పలుకు వైశేషిక సిద్ధాంతము పటాపంచలగును.

కావున స్వవచోవ్యాఘాతమును కలిగించునట్టి అణుసిద్ధాంతము అంగీకార యోగ్యము కాదు. పరమాణువులీ విశ్వమునకు మూలకారణము కాజాలవు. పరమాణువులు వర్ణాదులను కలిగియుండు కారణముచే వైశేషిక భావమునకు వైరుధ్ధ్య మేర్పడును.

## 2-2-16 ఉభయథా చ దోషాత్.

మఱియు ఉభయ పక్షములలో దోషములుండుటచే అణుసిద్ధాంతము అంగీకార యోగ్యము కాజాలదు.

ఉభయథా = రెండు పక్షములలో, చ = కూడా, దోషాత్ = దోషములుండుటచే.

వైశేషిక విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

పృథ్వికి రూపరసగంధములనెడి గుణములుండుటయేఁగాక అది స్థూలమై యున్నది. జలమునకు రూపరసస్పర్శ లుండియు, అది సూక్ష్మమై యున్నది. అగ్నికి రూపము మఱియు స్పర్శమాత్ర ముండుటచే అది ఇంకను సూక్ష్మమై యున్నది. వాయువు కేవలము స్పర్శగుణమును కలిగియుండి, అది అన్నింటి కంటెను సూక్ష్మమైయున్నది. పృథ్వి, జలము, అగ్ని, వాయువులనెడి నాలుగు స్థూలభూతములు పరమాణువుల నుండి సృష్టింపఁబడినవి.

స్థూలభూతములలోని గుణముల సంఖ్యనే ఆయా భూతములలోని పరమాణువులు కూడా కలిగియుండునని మనమూహించినచో, అప్పుడు వాయువుయొక్క పరమాణువు ఒకే గుణమును మఱియు పృథ్వియొక్క పరమాణువు నాలుగు గుణములను కలిగియుండవలసివచ్చును. కావున నాలుగు గుణములను కలిగి యున్న పృథ్వి యొక్క పరమాణువు పరిమాణమునందు పెద్దదై యుండును. అట్టి ఎడల అది పరమాణువని ఏమాత్రము చెప్పఁబడజాలదు. అది పరమాణువు యొక్క నిర్వచనమున కనుగుణమై యుండదు.

ఒకవేళ అవియన్నియును గుణములయొక్క సమానసంఖ్యను కలిగియుండునని భావించినచో, కార్యరూపములైన స్థూలభూతముల గుణములలో భేదముండదు. ఏలననగా కారణమైన పరమాణువులయొక్క గుణములే కార్యములైన స్థూలభూతములలో ప్రతిబింబించును.

ఒకవేళ పరమాణువు ఏకైకమై ఒకే గుణమును కలిగియున్నచో, ఒక గుణమును మించి మరియొక గుణమును మనము కాంచజాలము. అగ్నియందు స్పర్శతో పాటు రూపముండకుండును. ఇట్లే తదితరములని తలంపవలయును.

కావున రెండు విధములుగను వైశేషిక సిద్ధాంతము దోషయుక్తమైయుండుటచే అది అసంగతమే యగును. అది న్యాయసమ్మతము కాజాలదు.

## 2-2-17 అపరిగ్రహాచ్చాత్యంతమనపేక్షా.

మఱియు అణుసిద్ధాంతమును ప్రామాణికమునులైన మనువు మున్నగువారు అంగీకరింపకుండుటచే అది పూర్తిగా నిషేధింపఁబడవలసియున్నది.

అపరిగ్రహాత్ = అంగీకరింపఁబడకుండుటచే, చ = మఱియు, అత్యంతమ్ = పూర్తిగా. అనపేక్షా = ఉపేక్షింపవలయును.

వైశేషిక విరుద్ధమగు వాదము సమాప్తమైనది.

ప్రధానముయొక్క సాంఖ్య సిద్ధాంతము మనువు ఇత్యాది వేదజ్ఞులచే కొంతవరకైనను అంగీకరింపఁబడినది. కావున అణు సిద్ధాంతములోని ఏ విభాగమైనను ప్రామాణికుడైన ఏలాటి పురుషునిచేతను అంగీకరింపఁబడలేదు. కావున వైదిక ప్రామాణ్యము నంగీకరించు వారెవరైనను దానిని బొత్తిగా లక్ష్యము నందుంచుకొనరాదు.

ఇంతేకాదు, వైశేషిక సిద్ధాంతమునందు మరికొన్ని ఆక్షేపణలున్నవి. వైశేషికులు (1) ద్రవ్య, (2) గుణ, (3) కర్మ, (4) సామాన్య, (5) విశేష, (6) సమవాయములనెడి ఆఱు పదార్థములనూహింతురు. ఈ యాఱు పదార్థములు ఒకదానికొకటి పూర్తిగా విభిన్నములై యున్నవనియు మఱియు మానవుడు, గుఱ్ఱము, కుందేలువలె వాటి స్వభావములు విభేదించియుండుననియును వారు తలపోయుదురు. ఈ పదార్థములు స్వతంత్రములై యున్నవని వారు పలికినను, ద్రవ్యముపై ఇతర పంచపదార్థము లాధారపడియుండునని వారు విశ్వసింతురు. దీనిచే మొదటి విషయమునకు విరోధమేర్పడును. ఇది పూర్తిగా అసంగతమైయున్నది. జంతువులు, గడ్డి, వృక్షములు మున్నగునవి ఒకదానికొకటి పూర్తిగా విభిన్నములై యుండుటచే ఒకదానిపై ఒకటి ఆధారపడియుండకుండునట్లు, గుణాదులు కూడా ద్రవ్యమునకు విభిన్నములై యుండుటచే అవి దానిపై ఆధారపడియుండుననుట అసంగతమగును.

ద్రవ్యము మఱియు గుణము అవిభాజ్యమగు సంబంధమును కలిగియున్నవని వైశేషికులు నుడువుదురు. ప్రతి యొక్కటి తన కార్యము నారంభించుననియున్నూ వారు పలుకుదురు. దారములచే వస్త్రము నేయఁబడును. మఱియు దారములలోని తెలుపుఁదనముచే వస్త్రమునందున్నూ తెలుపుఁదనము కలుగును. 'ద్రవ్యాణి ద్రవ్యాంతర మారభంతే గుణాశ్చగుణాంతరమ్' (వైశేషిక సూత్రములు 1-1-10). ఒకవేళ దారము మఱియు దానిగుణములు ఒకే స్థలము నాక్రమించునేని మఱియు అవి ఏకైకమైయుండునేని, ఇది ఎట్లు సంభవించును? ఒకవేళ ద్రవ్యము మఱియు గుణము ఒకే సమయమునం దవిభాజ్యములై యుండునేని, ఆవు యొక్క రెండు కొమ్ములు కలిసి పెరుగుచుండెడివి. ఒకవేళ ద్రవ్యగుణస్వభావ మేకైకమై యున్నచో, ఈ రెండున్నూ తాదాత్మ్యములేయని చెప్పకున్నావేల? కావున గుణము ద్రవ్యముపై ఆధారపడియుండుననియు మఱియు ద్రవ్యగుణములు అవిభాజ్యము లనియు నుడువు సిద్ధాంతము అసంగతము మఱియు అసమ్మతమైయున్నది.

ఇంతేకాదు, వైశేషికులు సంయోగ సమవాయముల మధ్య భేదమును పాటింతురు. వేర్వేఱుగా ఉనికిని కలిగియున్న పదార్థముల సంబంధమే సంయోగమనియు, వేర్వేఱు ఉనికిని కలిగిలేని పదార్థముల సంబంధమే సమవాయమనియును వారు పలుకుదురు. కార్యమునకు ముందున్న కారణము ప్రత్యేకస్థితిని కలిగియుండుట సహజమగుటచే ఈ విభేద మసంగతమగును. సంయోగ-సమవాయములు కార్యకారణములకు భిన్నమైన ఉనికిని కలిగియుండునని నిరూపించునదేమి? లేక, సంబంధమును కలిగియున్న పదార్థములకు భిన్నముగా ఏదైన సంయోగముఁగాని సమవాయముఁగాని ఉండునా? ఒకే మానవుడు తాను స్వయముగా తలంచునట్లును, లేక ఇతరులకు తాను సంబంధించియున్న విధముగను అనేక నామములకు మఱియు అభిప్రాయములకు పాత్రుడగును. ఈ విధముగా అతడు మానవుడు, బ్రాహ్మణుడు, వేదజ్ఞుడు, దానశీలుడు, యువకుడు, వృద్ధుడు, తండ్రి, కుమారుడు, మనుమడు, సోదరుడు, అల్లుడు మున్నగు పేర్లతో వ్యవహరింపఁబడును. మఱియు తలంపఁబడును. ఒకే అంకె దాని స్థానము ననుసరించి పది, నూరు, లేక వెయ్యి వంటి విభిన్న సంఖ్యలను సూచించును.

ఇంతేకాకుండా స్థలము నాక్రమించు పదార్థముల మధ్య తప్ప ఇతర పదార్థములలో మనము సంయోగమునుఁగాంచజాలము. కాని నీ మతాను సారముగా మనస్సు అణుస్వరూపమగుటచే అది స్థలము నాక్రమింపదు. దానికై ఏదో కొంత స్థలము నూహింపవచ్చునని నీవు నుడువజాలవు. ఒకవేళ నీ విట్లూహింతువేని, ఇట్టి యూహల కంతముండదు. వైశేషికులు నిర్ణయించిన ఈ యాఱు వర్గములకు తోడుగా నీవు మరి నూరుఁగాని, వెయ్యిఁగాని పదార్థములనేల చేర్చకూడదో, దానికి కారణము తెలియకున్నది.

ఇంతేకాదు, రూపముఁగల ద్వ్యణుకముతో రూపములేని రెండు పరమాణువులు ఐక్యము నొందఁజాలవు. కఱ్ఱ మఱియు మెఱుగునూనె (వార్నిస్) కు మధ్య ఉండు సంబంధమువంటి సన్నిహితసంబంధము ఆకాశము మఱియు పృథ్వి మధ్య యుండదు.

లేక, కార్యకారణములలో ఏది దేనిపై ఆధారపడియుండునో వర్ణించుటకు సమవాయసిద్ధాంత మావశ్యకమగునా? ఇవి పరస్పరము ఆధారపడియున్నవి.

వేదాంతులు కార్యకారణములలో ఏలాటి భేదము నంగీకరించరు. మరియొక రూపమును ధరించిన కారణమే కార్యమైయున్నది. వేదాంతులు కార్యకారణ విభేదమునుఁగాని, ఆధారాధేయ సంబంధమునుఁగాని పాటింపరు. వేదాంత సిద్ధాంతము ననుసరించి కార్యము కారణముయొక్క ఒక ప్రత్యేక భూమికయై యున్నది.

ఇంతేకాదు, పరమాణువులు అంతవంతములగుటచే అవి రూపమును కలిగి యుండును. రూపము కలిగియున్నదేదో అది ఒకప్పుడు నశింపవలసి యుండును.

ఈ విధముగా అణుసిద్ధాంతము యొక్క వాదము మిక్కిలి బలహీనమైనదని స్పష్టమగుచున్నది. పరమేశ్వరుడు ముఖ్యకారణమని పలుకు శ్రుతివాక్యముల కిది విరుద్ధమైయున్నది. దీనిని మనువు మున్నగు మునీశ్వరులు కూడా అంగీకరింప కున్నారు. కావున బుద్ధిమంతులచే ఇది పూర్తిగా పరిత్యజింపఁబడవలసియున్నది.

# 4. సముదాయాధికరణము

## (18-27 సూత్రములు)

### 2-2-18 సముదాయే ఉభయహేతుకేఽపితదప్రాప్తిః

ఒకవేళ రెండు రకములగు సమూహములు తమ రెండు కారణములనుండి ఉత్పన్నమైనను రెండు సమూహములయొక్క ఉనికిలేమి సంభవించును.

సముదాయః = సమూహము, ఉభయహేతుకే = రెండు కారణములు కలిగి యుండుట, అపి = కూడా, తదప్రాప్తిః = అది సంభవింపదు.

వైశేషికుల అణుసిద్ధాంత ఖండనానంతరము, ఇప్పుడు బౌద్ధ సిద్ధాంతములు ఖండింపఁబడుచున్నవి.

బుద్ధదేవునికి నలుగురు శిష్యులుండిరి. వారు క్రమముగా (1) వైభాషిక (2) సౌత్రాంతిక (3) యోగాచార (4) మాధ్యమికమత సిద్ధాంతములను స్థాపించిరి. క్రమముగా భౌతిక పదార్థములను మఱియు మానసిక భావములను కలిగియున్న భౌతిక మఱియు ఆంతరిక ప్రపంచములను రెండింటి నంగీకరించు సర్వాస్తిత్వ వాదులే వైభాషికులనఁబడుదురు. విజ్ఞానవాదులే సౌత్రాంతికులనఁబడుదురు.

కేవలము సంకల్పమే సత్యమని వారు విశ్వసింతురు. భౌతికపదార్థము ఆ యొక్క నిజమైన ఉనికికి నిరూపణ లేదనియు, ఈ భావములచేతనే భౌతిక పదార్థములు అనుమానింపఁబడుచున్నవనియును వారు ప్రతిపాదింతురు. భౌతిక పదార్థములు అనుమానింపఁబడుచున్నవనియును వారు ప్రతిపాదింతురు. భౌతికపదార్థములు ప్రత్యక్షముగా పరికింపఁబడుచున్నవని వైభాషికులు పలుకగా, భావములచేతనే భౌతిక ప్రపంచ మూహింపఁబడుచున్నదని సౌత్రాంతికులు నుడువుదురు. భావములే సత్యములనియు, ఈ భావముల కనుగుణమైన భౌతిక ప్రపంచము లేదనియును మూడవవర్గమైన యోగాచారులు ఉగ్గడింతురు. భౌతిక పదార్థములు స్వప్నపదార్థ ములవలె అసత్యములు.

ఇఁక భావములు స్వయముగా అసత్యములనియు, శూన్యము వినా మరియొకటి ఉనికి కలిగిలేదనియును మాధ్యమికులు విశ్వసింతురు. వారు ప్రతిపదార్థమును అభావముగా, అసత్యముగా విశ్వసించు శూన్యవాదులనఁబడు దురు. ప్రతిపదార్థము క్షణికమని వారందఱును అంగీకరింతురు. ఏ పదార్థము కూడా ఒక క్షణమును మించియుండదు. పూర్వక్షణమునందున్న పదార్థములుత్త రక్షణము నందుండవు. ఒక పదార్థము కానఁబడినప్పుడు రెండవ క్షణము నందది రెండవ పదార్థముగా మారును. ఒకదానికి రెండవదానితో సంబంధముండదు. నానావిధములగు వేర్వేఱు బొమ్మలు కనఁబడి మాయమగు ఒక సినిమాలోని దృశ్యమునుఁబోలి ఈ ప్రాపంచిక పదార్థము లుండును.

సర్వాస్తిత్వవాదులు జడమైన భౌతిక ప్రపంచము మఱియు అంతరిక మానసిక ప్రపంచములనెడి రెండు సమూహములు కలియుటచే ఈ విశ్వమేర్పడునని విశ్వసింతురు. భౌతిక ప్రపంచము చతుర్విధములైన పరమాణువుల సమూహముచే నిర్మింపఁబడును. (1) స్థూలమైన పృథ్వి అణువులు (2) జిగటయైన జలము యొక్క అణువులు (3) వేడిగానున్న అగ్నియొక్క అణువులు (4) చలించునట్టి వాయువుయొక్క అణువులు.

అంతరిక ప్రపంచమునకు ఐదు స్కంధములు, లేక సమూహములు కారణములై యున్నవి. (1) రూపస్కంధము (2) విజ్ఞానస్కంధము (3) వేదనాస్కంధము (4) సంజ్ఞాస్కంధము (5) సంస్కారస్కంధము. దృశ్యములు మఱియు

వాటియందున్న పదార్థములు రూపస్కంధమనఁబడును. 'నేన' నెడి భావము నొసంగు ప్రజ్ఞయే విజ్ఞానస్కంధమనఁబడును. సుఖదుఃఖానుభవమే వేదనాస్కంధమనఁబడును. రామకృష్ణుడు మున్నగు నామములతో కూడియుండునదే సంజ్ఞాస్కంధమనఁబడును. ఈ విధమైన శబ్దములన్నియును సంజ్ఞాస్కంధముయొక్క కోవకు చెందును. ఐదవదగు సంస్కారస్కంధమునందు మానసిక వృత్తులైన రాగద్వేషములు, మోహము, ధర్మాధర్మములు మున్నగునవి ఉండును. అంతరిక పదార్థములన్నియును చివరి నాలుగు స్కంధములలో ఏదో యొకదానికి చెందును. చివరి నాలుగు స్కంధములు అంతరిక పదార్థములు రూపముఁదాల్చును. క్రియలన్నియును అంతరిక పదార్థములపై ఆధారపడి యుండును. అంతరిక పదార్థములు ప్రతిపదార్థము యొక్క అంతరిక భావనకు సంబంధించియుండును. అంతరిక పదార్థములన్నియును రూపస్కంధమనెడి ఒకే స్కంధమునకు చెంది యుండును. ఈ విధముగా ఈ విశ్వమంతయు అంతరిక, భౌతికములనెడి ద్వివిధములగు పదార్థములచే నిండియున్నది. అంతరిక సమూహము, లేక మానసిక ప్రపంచము చివరి నాలుగు స్కంధములనెడి సమూహముచే రూపొందించఁబడును. అంతరికము మఱియు భౌతికములైన ఈ రెండు సమూహములే ఈ సూత్రమునందు సూచింపఁబడినవి.

పదార్థములన్నింటిని భౌతికాంతరికములనెడి ద్వివిధ సమూహములుగా వర్గీకరించిన బౌద్ధ సిద్ధాంతము ప్రాపంచిక క్రమమును వర్ణించుటకు చాలదు. ఏలననగా ఈ సమూహములన్నియును జడమైనవి. మఱియు ఈ సమూహముల నుత్పన్నమొనర్చు శాశ్వత చైతన్యము బౌద్ధులచే అంగీకరింపఁబడలేదు. బౌద్ధమతానుసారముగా ప్రతి పదార్థమున్నూ క్షణికమైయున్నది. ఈ స్కంధమలను సంయోగపఱచు శాశ్వతమగు చైతన్య పదార్థమనునది లేదు. ఒక చైతన్యవంతుడగు మార్గదర్శియొక్క మధ్యవర్తిత్వము లేకుండా ఈ భౌతికమైన పరమాణువులు మఱియు బాహ్యములగు ఇంద్రియగ్రాహ్యత కొనసాగుట అసాధ్యమగును. ఒకవేళ తమ స్వంత అంతరిక చలనము ద్వారా అవి ఏకీభవించునని పలికినచో, అప్పుడు ప్రపంచము శాశ్వతము కావలసియుండును. ఏలననగా స్కంధములు శాశ్వతములగుటచేతను మఱియు తమ స్వంత చలనమును కలిగియుండుటచేతను అవి నిరంతరము సృష్టికార్యము నొనర్చుచుండును. ఈ విధముగా ఈ సిద్ధాంత మసంగతమగును.

ఈ సమూహములెట్లు ఉత్పన్నములగునో వివరించుటకు వలను పడదు. ఏలననగా భౌతికసమూహములకు కారణమైయున్న విభాగములు ప్రజ్ఞాన్వితములు కావు. పరమాణువుల నేకీకరించుటకు కారణమైన భోగపురుషుడు, లేక పరిపాలకుడగు ప్రభువువంటి శాశ్వతుడగు చైతన్య పురుషుని బౌద్ధులంగీకరింపరు.

సమూహములెట్లు రూపమునుఁ దాల్చును? ఈ సమూహములకు వెనుక ఒక కారణము, మార్గదర్శి, నియామకుడు, లేక సంచాలకుడగు చైతన్య పురుషుడెవడైనా కలడా? లేక, అది స్వయముగా కొనసాగుచుండునా? ఒకవేళ ఒక చైతన్య పురుషుడు కలడని నీవు పలుకుదువేని, అతడు శాశ్వతుడా? లేక క్షణికుడా? ఒకవేళ అతడు శాశ్వతుడైనచో, బౌద్ధసిద్ధాంతమగు క్షణికవాదమునకు విరోధమేర్పడును. ఒకవేళ అది క్షణికమైనచో, అది ప్రథమమునందస్తిత్వమును కలిగియుండవలయును. అనంతరమది పరమాణువులను ఐక్యమొనర్పవలసి యుండును. అప్పుడు కారణము ఒక క్షణముకంటె ఎక్కువ కాలము ఉనికిని కలిగియుండవలసియుండును. ఒకవేళ సంచాలకుడు, లేక నిమాయకుడుగా ఎవడైన ఒక చైతన్యముఁగల పురుషుడు లేకున్నచో, అచేతనములగు పరమాణువులు మఱియు స్కంధములు ఒక క్రమానుగతముగా ఎట్లు ఏకీభవించును? ఇంతేకాదు. సృష్టి శాశ్వతముగా కొనసాగుచుండును. అప్పుడు ప్రళయమునకు ఉనికి లేకుండును.

ఈ కారణములన్నింటిచే సమూహములు రూపొందు విధానము సక్రమముగా వర్ణింపఁబడజాలదు. పృథ్వియొక్క అస్తిత్వమునకు సమూహ సంకల్ప మావశ్యక మగుటచే, సమూహములు లేకున్నచో పృథ్వియొక్క సంచలనము ఆగిపోవలసివచ్చును. కావున ఈ బౌద్ధమత సిద్ధాంతము అసంగతము మఱియు అనంగీకారయోగ్యమై యున్నది.

## 2-2-19 ఇతరేతర ప్రత్యయత్వాదితిచేన్నోత్పత్తి మాత్రనిమిత్తత్వాత్.

ఒకవేళ పరస్పరకారణ సంబంధమునం దునికిని కలిగియున్న అవిద్య ద్వారా సమూహములు రూపొందునని నుడివినచో, అట్లుకాదని, మా సమాధానము. అది కేవలము తదనుగుణములగు అంశములకు మూలమైయున్న దానికి నిమిత్తకారణమై యున్నది. కాని సమూహమునకు కాదు.

ఇతరేతర = పరస్పరము, ప్రత్యయత్వాత్ = ఒకదానికొకటి కారణమగుటచే, ఇతిచేత్ = అని పలికినచో, న = కాదు, ఉత్పత్తిమాత్ర నిమిత్తత్వాత్ = అవి కేవలము మూలమునకు నిమిత్తకారణములగుటచే.

18వ సూత్రమునకు విరుద్ధమగు ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

బౌద్ధశాస్త్రమునందు అవిద్యాదిక్రమము ఈ క్రింది విధముగా నున్నది. అవిద్య, సంస్కారము, విజ్ఞానము, నామరూపములు, షడాయతనము, స్పర్శ, వేదన, తృష్ణ, ఉపాదానము, భవ, జాతి, జరా, మరణము, శోకము, పరిదేవన, దుఃఖము, దుర్మనస్త్వము ఇత్యాదులు.

క్షణికమై, అపవిత్రమైయున్న దానిని శాశ్వతముగను, పరిశుద్ధమైనదానిగను తలంచుటయే అవిద్య యొనర్చు దోషము. సంస్కారమునందు రాగద్వేషములు మఱియు అవి యొనర్చు కార్యములంతర్నిహితములై యుండును. గర్భమునందే ఆత్మచైతన్యము మేల్కొనుట (అహమితి ఆలయ విజ్ఞానస్యవృత్తి లాభః) విజ్ఞానమని చెప్పఁబడును. పిండోత్పత్తి సమయములోని బుడగవంటి స్థితియే నామము మఱియు రూపమని నుడువఁబడును. పిండముయొక్క పురోగమస్థితియే షడాయతన మనఁబడును. మఱియు ఈ పిండము షడింద్రియములకు స్థానమైయున్నది. పిండము శీతోష్ణములు మున్నగువాటి ననుభవించుటయే స్పర్శ యనఁబడును. వాటిచే సుఖదుఃఖానుభవము నొందుటయే వేదన యనఁబడును. ఆనందము ననుభవించుట మఱియు దుఃఖమును నివారించుకొనుట యందుఁగల కోరికయే తృష్ణ యనఁబడును. కోరికచే కలుగు ప్రయత్నమే ఉపాదాన మనఁబడును. గర్భాశయమునుండి బయటపడుటయే భవయనఁబడును. నూతనముగా జన్మించిన జీవుడు ఏ వర్గమునకు చెందునో, అది జాతి యనఁబడును. ముమూర్షదశయందున్న జీవుని దశలు జరా మరణావస్థలుగా వర్ణింపఁబడినవి. తనకు సంబంధించిన కోరికలు విఫలమగుటయే శోకమనఁబడును. అందునిమిత్తమై పరితపించుటయే పరిదేవన మనఁబడును. పంచేంద్రియములచే కలుగు బాధయే దుఃఖ మనఁబడును. మానసికమగు బాధయే దుర్మనస్త్వ మనఁబడును. 'మున్నగునవి' అనుదానిచే జీవుడు పరలోకగతుడగుట మఱియు తిరిగి జన్మించుటలు సూచింపఁబడినవి.

బౌద్ధసర్వాస్తిత్వవాది ఇట్లనును : ఎవరి ప్రభావముచే సమూహములు రూపొందునో అట్టి జీవుని పరిపాలించుటకు శాశ్వత చైతన్యము లేకున్నను,

అజ్ఞానము మున్నగువాటి పరస్పరకారణముచే భౌతికముగా దాని ఉనికి సాధ్యమేయగును. ఇందుచే మనము మరియొక సంయోగసూత్రమునకై అన్వేషింపనవసరము లేదు.

అవిద్య, సంస్కారము ఇత్యాదులచే కార్యకారణములనెడి అవిచ్ఛిన్నమైన గొలుసు అల్లఁబడును. పైన నుడువఁబడిన అంశములలో వెంటనే ఉత్పన్నమైన అంశము తర్వాతి అంశమునకు కారణమగును. నీటి చక్రమువలె కార్యకారణ చక్రము నిరంతరము చలించుచుండును. మఱియు సమూహములు లేకుండా ఇది సంభవింపదు. కావున సమూహములు సత్యములై యున్నవి.

మా సమాధానమేమనగా : ఒక క్రమమునందుగల పూర్వాంశము ఉత్తరాంశమునకు కారణమైయున్నను, సమూహములకు కారణమనునది లేదు. పరమాణువులు మఱియు అఖండ విషయానుభవ ప్రవాహముయొక్క కలయికచే వాటియందుఁగల పరస్పర ఆధారాధేయతలు నిరూపింపబడునని నీవు వాదింపవచ్చును. కాని ఈ వాదము నిలువనేరదు. ఏలననగా ఈ పరస్పర ఆధారాధేయత్వము వాటి సంబంధమునకు కారణము కాజాలదు. రెండు వస్తువులలో ఒకటి రెండవదానిని సృష్టింపవచ్చును. కాని అవి ఏకమగుననుట నిర్హేతుకమైన విషయము.

ఒకవేళ చేతనపదార్థము యొక్క కర్తృత్వము లేకుండానే అవిద్య, సంస్కారము, విజ్ఞానము, నామరూపములు ఇత్యాదులు కార్యకారణరూపములుగా పరిణమించినను, తత్సదృశమైన మనస్సుయొక్క సహకారము లేకుండా ఇవి యన్నియును ఏకకాలమునందెట్లు ఉనికిని కలిగియుండును?

అవిద్యాదుల పరస్పరబంధముచే ఈ సమూహము, లేక ప్రపంచమేర్పడునని ఒకవేళ నీవు పలుకుదునేని, అట్లు కాదని మా సమాధానము. ఏలననగా నీ కారణాంశము కేవలము పూర్వాంశము ఉత్తరాంశమునకు మూలమైయున్నదని మాత్రమే తెలుపును. విజ్ఞానము సంస్కారము నుండి ఎట్లు కలుగును? ఇత్యాదులను మాత్రమే అది వివరించును. సమూహము ఎట్లు కలుగును? అను విషయమునది అభివర్ణింపదు. భోగము ననుభవించుటకు సృష్టింపఁబడిన సంఘాతమనెడి సమూహము ఒక నమూనా వంటిది. గృహమనెడి ఒక సంఘాతము ఇటుకలు,

సున్నపుగచ్చు మున్నగువాటి కలయికయని చెప్పవచ్చును. కాని దానియందొక క్రమము చెప్పఁబడలేదు. శాశ్వతమైన ఆత్మ లేదని నీవు పలుకుదువు. నీ యాత్మ కేవలము క్షణికమైనది. నీవు క్షణికవాదివి. ఇట్టి క్షణికమైన ఆత్మకు అనుభవముఁగాని, ఆనందముఁగాని ఉండదు. ఏలననగా ఫలముల ననుభవించుటకు కారణమైన పుణ్యపాపములను ఆత్మ సృష్టించి యుండలేదు. అవి మరియొక క్షణికాత్మచే సృష్టింపబడినవి. పైతృకాత్మచే సృష్టింపబడిన కర్మఫలములను క్షణికాత్మ అనుభవించునని నీవు నుడువజాలవు. అట్లయినను పైతృకాత్మ క్షణికముకాక, శాశ్వతమైనదని చెప్పవలసియుండును. ఒకవేళ నీవు ఏదైన ఆత్మను శాశ్వతముగా తలంతువేని, ప్రతిపదార్థము క్షణికమని చెప్పు నీ సిద్ధాంతమునకు విరోధమేర్పడును. కాని నీవు ప్రతిపదార్థము అశాశ్వతమని విశ్వసింతువేని, నీ సిద్ధాంతము ఇతః పూర్వము నుడివిన ఆక్షేపణకు గుఱియగును. కావున బౌద్ధుల సంఘాతసిద్ధాంత మసంగతమగును. అది తర్కమునకు నిలువఁజాలదు.

పరమాణువులు శాశ్వతములు మఱియు నిత్యములని తలంపఁబడినను, అవి స్వయముగా సంయోగము నొందఁజాలవు. వైశేషిక సిద్ధాంతమును విమర్శించునప్పుడు మనము దీనిని గూర్చి నిరూపించియున్నాము. అవి క్షణికమైనప్పుడు వాటి సంయోగమింతకంటె మిక్కిలి అసాధ్యమగును.

పరమాణువులు కారణత్వమునకు సంబంధించియున్నప్పుడు పరమాణువులకు సంయోగసూత్ర మనావశ్యకమని బౌద్ధులు పలుకుదురు. పరమాణువులు తమకు తామే సంయోగము నొందును. ఇది సరికాదు. ఆయా క్షణములలో పరమాణువుల యొక్క ఉత్పత్తిని మాత్రము కారణత్వము వివరించును. పరమాణువు ఒక సంఘాతముగా సంయోగము నొందుటనుఁగూర్చి అది నిశ్చయముగా వర్ణింపదు. దాని వెనుక ఒక చైతన్యవంతుడగు కర్త ఉన్నప్పుడు మాత్రమే సంఘాతముయొక్క సంయోగమేర్పడును. లేనియెడల జడమైన మఱియు క్షణికమైన పరమాణువులు ఐక్యము నొందునని నిరూపించుట అసాధ్యమేయగును.

శాశ్వతమైన సంసారమునందు ఒక అఖండమైన గొలుసువలె సంఘాతములు ఒకటి తర్వాత మరియొకటి ఏతెంచుననియు, కావున అవిద్య మున్నగునవి ఆ సమూహముల నావరించుననియును నీవు పలుకవచ్చును. కాని అట్లయినచో

ప్రతి సంఘాతము తనవంటి మరియొక సంఘాతమును అవశ్యముగా ఉత్పన్నమొనర్చునని అంగీకరింపవలసియుండును. లేదా, ఏలాటి నిశ్చితమైన నియమము లేకుండా తనకు సదృశమైన, లేక తద్భిన్నమైన వాటిని ఉత్పన్నమొనర్చునని ఒప్పుకొనవలసియుండును. ప్రథమాంశమునందొక మానవ శరీరము ఒక దేవతగాఁగాని, లేక, ఒక జంతువుగాఁగాని, లేక, అధోలోక సంబంధమైన జీవిగాఁగాని, పరిణమింపఁజాలదు. కారణమేమనగా ఒక సంఘాతము తత్సదృశమైన సంఘాతమును మాత్రమే సృష్టింపజాలును కదా! ఇక రెండవ అంశమునందు మానవుడొక నిమిషమునందు ఏనుగుగను, లేక దేవతగను పరిణమించి మరల మనుజునిగా రూపొందును. ఇట్లు రెండంశముల యందును నీ సిద్ధాంతమునకు విరోధమేర్పడును.

జీవియొక్క భోగార్థమీ శరీరమనెడి సంఘాతము ఉనికిని కలిగియున్నచో, అదియున్నూ క్షణికమేనై యున్నది. కావున అది భోక్తకాజాలదు. జీవుడు క్షణికుడగుటచే, ఇఁక మోక్షమెవరికి? శాశ్వతుడైన భోక్త లేకుండుటచే, ఈ సంఘాతములయొక్క అవశ్యకతయున్నూ లేదు. అవిద్య మున్నగు క్రమానుగతములగు అంశములలో కారణసంబంధముండి యుండవచ్చును. కాని భోక్తయగు శాశ్వతమైన ఆత్మ లేకుండుటచే, అట్టి పరిస్థితి యందు సంఘాతములయొక్క ఉనికిని నిర్ణయించుట అసాధ్యమగును. కావున బౌద్ధమతము లోని సర్వాస్తిత్వవాదుల క్షణికత్వ సిద్ధాంతము నిలువఁజాలదు.

## 2-2-20 ఉత్తరోత్పాదేచ పూర్వనిరోధాత్.

అవిద్యాదుల మధ్య కారణసంబంధము కూడా ఉండదు. ఏలననగా ఉత్తర పదార్థము ఉత్పన్నమైన వెంటనే పూర్వ పదార్థము ఉనికి లేనిదగును.

ఉత్తరోత్పాదే = ఉత్తర పదార్థము ఉత్పన్నమైన సమయమునందు, చ = మఱియు, పూర్వనిరోధాత్ = పూర్వపదార్థము నాశమగుటచే.

18వ సూత్రమునందు ప్రారంభింపఁబడినట్టి బౌద్ధసిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

సంఘాతముల ఉనికియందు పరిగణింపఁబడకుండా అవిద్యాదులు కేవలము పరస్పరకారణ సంబంధములుగా నిలచియుండునని మనమింతవరకు వాదించితిమి.

అవి వేటికి సంబంధించియున్నవో, ఆ క్రమమునందున్న అంశములకవి నిమిత్త కారణములు కూడా ఇప్పుడు మేము నిరూపింపఁబోవు చున్నాము.

బౌద్ధసిద్ధాంతానుసారముగా ప్రతిదియు క్షణికమైయున్నది. ఈ క్షణము నందున్న పదార్థము, దాని వారసుడేతెంచిన మరుక్షణమునందే నశించిపోవును. ఉత్తర పదార్థము కానఁబడిన సమయమునందు, పూర్వ పదార్థము మటుమాయ మగును. కావున ఉత్తరపదార్థమునకు పూర్వపదార్థము కారణమగుట అసాధ్యము. తత్ఫలితముగా ఈ సిద్ధాంతము అసంగతము మఱియు అనంగీకార్యమగును. అది తర్కమునకు నిలువనేరదు.

దారము వస్త్రమునందణగియున్నట్లు కారణము కార్యమునందణగి యుండుటను మనమెల్లప్పుడుఁ గాంచుచుందుము. కాని బౌద్ధలు అస్తిత్వము నాస్తిత్వము నుండి జనించునని విశ్వసింతురు. ఏలననగా కారణము నశింపకుండా కార్యము వ్యక్తముకాదని వారు తలపోయుదురు. బీజము నశింపనంతవరకు వృక్షము మనకు గోచరింపదు.

తుల్యమైన ప్రజ్ఞలేకుండా కారణము కార్యముగా పరిణమించుటలోగల అవిద్యాది భూమికలు ఏర్పడుటకున్నూ అవకాశముండదు. ప్రతిపదార్థము కేవలము క్షణికమైన అస్తిత్వమును కలిగియుండునని నీవు పలుకుదువు. క్రమానుగతములగు రెండు క్షణములు ఏకకాలము నందు ఉనికిని కలిగియుండుటను నీ మతమంగీకరింపదు. కార్యముగా పరిణమించు వరకు ఒకవేళ కారణమున కునికియున్నచో, క్షణికత్వ సిద్ధాంతము నశించిపోవును.

పూర్వక్షణికాస్తిత్వము పూర్ణ వికాసము నొందినప్పుడది ఉత్తరక్షణికాస్తిత్వమునకు కారణమగునని నీవు పలుకవచ్చును. అట్లు సంభవించుటకు కూడా రెండవ క్షణ మావశ్యమగుటచే, ఇదియున్నూ అసాధ్యమే యగును. దీనిచే క్షణికత్వవాదమునకు విరోధమేర్పడును.

క్షణికత్వ సిద్ధాంతము నిలువనేరదు. ఒక ఆభరణము చేయఁబడిన తర్వాత దానియందున్న బంగారమే ఆయాభరణమునకు కారణమగును. కాని అంతకు పూర్వమున్న బంగారముఁగాని, ఆభరణమును కరిగించిన తర్వాతి బంగారముఁగాని

కారణము కాజాలదు. ఒకవేళ ఇప్పటికిని అది కారణముగా పరిగణింపఁబడినచో, అస్తిత్వము నా స్తిత్వము నుండి జనింపవలసియుండును. ఇది అసాధ్యము. కార్యము నూతన రూపమునందున్న కారణమే యను సిద్ధాంతమును క్షణికత్వవాదము ఖండించును. కారణము కార్యమునందునికిని కలిగియుండునని ఈ సిద్ధాంతము సూచించును. దీనిచే అది క్షణికము కాదని స్పష్టమగుచున్నది. ఇంతేకాదు. క్షణికత్వముచే సృష్టి ప్రళయములకు తారతమ్యమున్నదని నీవు పలుకుదువేని, పదార్థము ఒక క్షణము కంటె ఎక్కువ కాలముండునని మన మంగీకరింపవలసి యుండును. కావున క్షణికత్వసిద్ధాంత మసంగతమను విషయము ఇంకను దృఢీభూతమగును.

## 2-2-21 అసతి ప్రతిజ్ఞోపరోధో యౌగపద్య మన్యథా.

ఒకవేళ కార్యమునకుఁగల కారణము శూన్యముగా పరిగణింపఁబడినచో, ప్రతిపాదనము ప్రతిఘటింపఁబడును. లేనియెడల కార్యకారణము లేకీభవించును.

అసతి = కారణము వినా కార్యము సంభవించునని పలికినచో, ప్రతిజ్ఞా = ప్రతిపాదనము, ఉపరోధః = ఖండనము, యౌగపద్యమ్ = ఏకీభవించుట, అన్యథా = లేనియెడల.

బౌద్ధ సిద్ధాంతమునకు విరుద్ధమైన వాదము కొనసాగుచున్నది.

కారణము వినా కార్యము సృష్టింపఁబడునని ఒకవేళ బౌద్ధులు పలికినచో, ప్రతికార్యమునకు కారణము కలదనెడి తమ ప్రతిపాదనను స్వయముగా ఖండించుకొని నట్లగును, కారణము విఫలమగుటచే మనస్సు, నేత్రము, ప్రకాశము, పదార్థము ఏకీభవించుటతో నీలివర్ణము మున్నగునవి గోచరించి బౌద్ధుల ప్రతిపాద నము అంగీకరింపఁబడును. అన్నిరకములగు కార్యములు మేళవింపఁబడును.

ఒకవేళ కారణమూహింపఁబడునేని, రెండవక్షణమునందు కార్యకారణములు పరస్పరము మేళవింపఁబడునని మనమంగీకరింపవలసియుండును. కారణము ఒక క్షణముకంటె ఎక్కువకాలము ఉనికిని కలిగియుండును. కార్యరూపము నొందునంత వరకు కారణముయొక్క అస్తిత్వముండును. అట్టియెడల క్షణికత్వవాదమున కపజయము కలుగును.

## 2-2-22 ప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యానిరోధాప్రాప్తిరవిచ్ఛేదాత్.

నిరాటంక కారణముచే కర్తృత్వ మఱియు అకర్తృత్వ వినాశము అసాధ్యమగును.

ప్రతిసంఖ్యా ప్రతిసంఖ్యానిరోధ = కర్తృత్వ వినాశము, అకర్తృత్వ వినాశము; అప్రాప్తిః = అసాధ్యము, అవిచ్ఛేదాత్ = నిరభ్యంతరకారణముచే.

విశ్వప్రళయము ఎల్లప్పుడు జరుగుచున్నదనియు మఱియు ఈ ప్రళయము (1) కర్తృత్వము (2) అకర్తృత్వమని రెండు విధములుగా నుండుననియును బౌద్ధులు విశ్వసింతురు. ఒక మానవుడొక కుండను పగులఁగొట్టఁదలంచి దానిని పగులఁగొట్టునట్లు. కర్తృత్వవినాశము ఒక సంకల్పప్రక్రియపై ఆధారపడియుండును. పదార్థములు స్వాభావికముగా నశించుట అకర్తృత్వ వినాశమనఁబడును.

కార్యకారణప్రవాహము నిరాటంకముగా కొనసాగుచుండుటచే ఈ రెండు వినాశములయం దేయొక్కటియు సంభవింపఁజాలదు. లేదా, తదనంతర సృష్టి యందు గోచరించుటచే, ఈ క్రమములోని ఏ ప్రత్యేక అంశమైనను పూర్తిగా నశించునని నుడువుటకు వీలులేదు.

ఈ ద్వివిధములగు వినాశములున్నూ అసంభవములు. ఏలననగా అది క్షణికాస్తిత్వక్రమమునైనను సూచింపవలయును. లేక, ఆక్రమమునందున్న ఏకైక అంశమునైనను సూచింపవలయును.

ప్రథమాంశము అసాధ్యము; ఏలననగా క్షణికాస్తిత్వ క్రమమునందంతటను ఆ క్రమమునందున్న అంశములు కార్యకారణములతో అవినాభావసంబంధమును కలిగియుండును. కావున ఈ క్రమమునందాటంక మేర్పడదు. ఇదే విధముగా రెండవ అంశమున్నూ అంగీకారయోగ్యము కాదు. ఏలననగా పూర్వాస్తిత్వమునకు సంబంధము లేకుండా ఏదైన క్షణికాస్తిత్వము అనిర్వచనీయమై పూర్తిగా నిషేధింపఁబడుననుట అసాధ్యము. ఒక పదార్థము నానావిధములుగా మార్పునొంది ఏలాటి పరిస్థితియందున్నను, తత్సంబంధాస్తిత్వమును మనము గుర్తింపఁగలుగు చున్నాము కదా! ఒక కుండ పగిలిపోయినప్పుడు కుండపెంకులలో మనము మట్టిని, లేక పగిలిన తునుకలనుఁగాంతుము. లేక కుండపెంకులు విసరఁబడినచో, తచ్చూర్ణమును మనముఁగాంతుము. కాలిన ఇనుముపై ఒక నీటిబిందువు

పడినప్పుడది అదృశ్యమైనట్లు గోచరించినను, అది ఆవిరి యనెడి మరియొక రూపమునందు ఉనికిని కలిగియుండును.

క్షణికాస్తిత్వమములోని కార్యకారణరూపమునందున్న గొలుసు అఖండముగా సాగిపోవుచుండును, కాని ఆగిపోదు. ఏలననగా నిషేధమునకు పూర్వమున్నట్టి చివరి క్షణికాస్తిత్వము దాని కార్యమును సృష్టింపవలసియుండును. లేక సృష్టింపకనుపోవచ్చును. ఒకవేళ సృష్టించినచో, ఆ క్రమము అఖండముగా సాగిపోవుటతో అవి నశింపకుండును. ఒకవేళ అది కార్యమును సృష్టింపకున్నచో, నిమిత్తకారణముగా బౌద్ధులు నిర్వచించు సత్తాయనఁబడు చివరి కొక్కెము నిజముగా ఉనికి లేనిదగును. మఱియు ఈ చివరి కొక్కెముయొక్క నాస్తిత్వముచే సమస్త అంశముల నాస్తిత్వము దృఢీభూతమగును.

ఈ క్రమమునందున్న వ్యక్తిగతాంశములలో రెండు విధములగు వినాశములుండఁజాలవు. ప్రతి అంశముయొక్క క్షణికాస్తిత్వకారణముచే కర్తృత్వ వినాశము అసాధ్యమగును. వ్యక్తిగతాంశము పూర్తిగా నిషేధింపఁబడనందుచే అకర్తృత్వ వినాశమున్నూ సంభవింపదు. కేవలము సత్తాస్వరూపము మార్పునొందుటయే వినాశమునకు నిజమైన అర్థము.

ఒక క్రొవ్వువత్తి కాల్చఁబడిన తర్వాత అది పూర్తిగా నశించినదని నీవు చెప్పలేవు. ఒక క్రొవ్వువత్తి కాల్చఁబడినప్పుడది నశించలేదు. కాని అది తన రూపమును మార్చుకొనినది. కాల్చఁబడిన తర్వాత క్రొవ్వువత్తిని మనము నిశ్చయముగా చూడజాలము. కాని దానియందున్న పదార్థములు సూక్ష్మరూపమును ధరించిన కారణముచే అవి మనకు దృగ్గోచరములు కాకుండును.

ఈ కారణములన్నింటిచే బౌద్ధులు సూచించు రెండు రకములగు వినాశములు నిరూపింపఁబడుట కవకాశము లేదు.

## 2-2-23 ఉభయథా చ దోషాత్.

రెండు విధములుగను దోషమున్న కారణముచేత కూడా.

ఉభయథా = రెండు విధములుగను, చ = మఱియు, దోషాత్ = ఆక్షేపణ కారణముచే.

బౌద్ధ సిద్ధాంతవిరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

అవిద్య, లేక అజ్ఞానము ఆత్మజ్ఞానముచే నశించినను, లేక స్వయముగా నశించినను అది ఉభయతః భ్రాంతి జనకమైయున్నది.

బౌద్ధమతానుసారముగా అజ్ఞానవినాశమే మోక్షమనఁబడును. అజ్ఞానము నశించినప్పుడు ముక్తి లభించును. క్షణికమైన పదార్థములను శాశ్వతములని భ్రమించుటయే అజ్ఞానము.

తపస్సు, జ్ఞాన సముపార్జనము మున్నగు సాధనముల (కర్తృత్వవినాశము) చేతను, లేక స్వాభావికము (అకర్తృత్వము వినాశము) గను అజ్ఞానము తొలగింపఁబడును. కాని ఈ రెండు వికల్పములున్నూ దోషపూరితములై యున్నవి. ఏలననగా తపస్సు ఇత్యాది సాధనములచే ఈ యజ్ఞానము తొలగింపఁబడదు. కారణమేమనగా బౌద్ధమతానుసారముగా ఇతర పదార్థములకువలె సాధనము కూడా క్షణికమైయున్నది. కావున అది అజ్ఞానమును తొలగింపఁజాలదు. ఈ నిషేధము స్వయముగా కూడా సంభవింపదు. అట్లయినచో బౌద్ధుల ప్రబోధములు, నియమములు, ధ్యాన విధానములు ముక్తినిఁబడయుటకు మార్గములని నుడువుట అర్థరహితమగును.

బౌద్ధసిద్ధాంతము ననుసరించి ముముక్షువు తన వర్తమాన ప్రాపంచికానుభవములను, లేక అజ్ఞానమును తొలగించుకొనుటకు బుద్ధిపూర్వక ప్రయత్న ముండదు. కారణములు తమ కార్యముల నుత్పన్న మొనర్చుచుండుట నిరంతరము జరుగుచుండుటచే అవి ఒకప్పుడు నిశ్శేషమగుననెడి ఆశ లేదు. కార్యములు మరల తమ స్వంత కార్యముల నుత్పన్నమొనర్చును. ఈ విధముగా మోక్షమార్గము నభ్యసించుట కవకాశము లేకుండును.

ఇట్లు బౌద్ధ సిద్ధాంతమునందు మోక్షము ప్రతిపాదింపఁబడజాలదు. బౌద్ధుల యొక్క ప్రబోధము తర్కములోని విమర్శన నెదుర్కొనఁజాలదు.

## 2-2-24 ఆకాశే చా విశేషాత్.

ఆకాశముయొక్క కారణము ఇతరములగు రెండు వినాశములకు విభిన్నము కాకుండుటచే అది కూడా శూన్యము కాజాలదు.

ఆకాశే = ఆకాశ విషయమునందు, చ=కూడా, అవిశేషాత్=ప్రత్యేక భేదము లేకుండుటచే.

బౌద్ధ సిద్ధాంతవిరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

రెండు రకములగు వినాశములు నిశ్శేషముగా గుణవర్జితములు కాకుండుటచే అవి శూన్యములు కావని 22, 23 సూత్రములలో వివరింపఁబడినది. అదే విషయమును ఇప్పుడు మేము ఆకాశ విషయమునందు నిరూపింపఁబోవుచున్నాము.

ఆకాశముయొక్క అస్తిత్వమును బౌద్ధు లంగీకరింపరు. వారు ఆకాశమును శూన్యముగా తలంతురు. ఆవరణాభావమే ఆకాశమనఁబడును. ఇది అసంగతము. భూమికి గంధము, నీటికి రుచి, అగ్నికి రూపము, గాలికి స్పర్శ యున్నట్లే ఆకాశమునకు శబ్దమునెడి గుణమున్నది. పృథ్వి, జలము మున్నగు వాటివలె ఆకాశము కూడా ఒక ప్రత్యేక భూతమై యున్నది. కావున భూమి, నీరు ఇత్యాదులు భూతములుగా పరిగణింపఁబడుచుండగా, ఆకాశమును నిషేధించుటకుఁగల హేతువేమో తెలియకున్నది.

ఘ్రాణము ఇత్యాది గుణములకు నిలయమైయున్న పృథ్వి, వాయ్వాదులు భూతములుగా పరిగణింపఁబడినట్లే, శబ్దమునకు నిలయమైయున్న ఆకాశము కూడా భూతముగా పరిగణింపఁబడవలయును. పృథ్వి, నీరు మున్నగునవి తమ క్రమానుగత గుణములగు వాసన, రుచి, రూపము, స్పర్శలచే అనుభవింపఁ బడుచున్నది. ఆకాశము యొక్క ఉనికి తన గుణమగు శబ్దము ద్వారా తెలియఁ బడుచున్నది. కావున ఆకాశము కూడా ఒక భూతమనియే చెప్పవలసియుండును.

పృథ్వి ఘ్రాణము ద్వారా ఊహింపఁబడినట్లే, ఆకాశమున్నూ దాని గుణమగు శబ్దముద్వారా ఊహింపఁబడును. సత్తా మఱియు గుణముయొక్క సంబంధమెచ్చట ఉండునో, అచ్చట వస్తువుండును, ఆకాశము ఆవరణాభావమాత్రమని బౌద్ధులు పలుకుదురు. అట్లయినచో అడ్డులేకుండుటచే ఒక పక్షి క్రిందికి పడిపోవచ్చును, కాని అది పైకి ఎట్లెగురఁగలుగును? ఆకాశము అవరణాభావమాత్రమైయున్నను అదియొక భూతము, లేక పదార్థమగునేకాని శూన్యము కాఁజాలదు.

ఆకాశము కేవలము శూన్యమనెడి సిద్ధాంత మసంగతమైయున్నది. నీవట్లు చెప్పనేల? అవిశేషాత్, ఏలననగా దృగ్గోచరమగు ఏ యితర పదార్థమునకైనను ఆకాశము భిన్నమైలేదు. 'కాకి ఆకాశమునం దెగురుచున్నద'ని చెప్పినప్పుడు మన మాకాశమునుఁగాంతుము. కావున ఆకాశము పృథ్వ్యాదుల వలెనే నిజమైన

భూతమైయున్నది. గంధగుణముచే పృథ్విని, రసగుణములచే జలమును ఇత్యాదులను ఁగాంచునట్లే, పదార్థములన్నింటిని మనము వాటి గుణములచే గ్రహింపవచ్చును. మఱియు ఆకాశముయొక్క అస్తిత్వమును శబ్దగుణముచే గ్రహింపవచ్చును. ఈ విధముగా ఆకాశము నిజమైన భూతమగునే కాని శూన్యము కాదు.

ఒకవేళ ఆకాశము శూన్యమై యుండునేని, అప్పుడీ ప్రపంచమంతయు స్థలా భావమును కలిగియుండెడిది.

'ఆత్మన ఆకాశస్సంభూతః' అని శ్రుతి వాక్యము నుడువుచున్నది. కావున ఆకాశము నిజమైన పదార్థమై యున్నది. అదియొక అస్తిత్వముగల వస్తువగునే కాని నాస్తిత్వము కాదు.

ఓ బౌద్ధులారా! వాయువు ఆకాశమునం దునికిని కలిగియుండునని మీరు పలుకుదురు. బౌద్ధగ్రంథములలో 'ఓపూజనీయా! ఈ పృథ్వి దేనిపై ఆధారపడి యున్నది?' అను వాక్యముచే ప్రారంభింపఁబడిన ప్రశ్నోత్తర పరంపరలున్నవి. వాటియందు 'వాయువు దేనిపై ఆధారపడియున్నది?' అను ప్రశ్నయు కలదు. దానికి 'ఆకాశముపై వాయువాధారపడియున్నద'ను సమాధాన మొసంగఁబడినది. కావున ఆకాశమొక ఆస్తిత్వముఁగల పదార్థమే కాని, శూన్యము కాదను విషయము రూఢియగుచున్నది. ఒకవేళ ఆకాశము శూన్యమైయుండినచో, గాలి కాధారముగా ఉండు పదార్థమేమై యుండును?

ఒక స్థలము నాక్రమించు పదార్థము కానిదేదో, అదియే ఆకాశమని మనము చెప్పఁజాలము. ఇది కూడా తర్కమునకు నిలువఁజాలదు. ఒక స్థలము నాక్రమించు పదార్థము కానిదేదో అదియే ఆకాశమని నీవు పలికినచో, స్థలము నాక్రమించు ఒక పక్షి ఎగిరినప్పుడు అదే సమయమునందు మరియొక పక్షి ఎగురుట కవకాశముండకుండును. ఆవరణలేని స్థలమునందు రెండవ పక్షి ఎగురఁగలుగునని నీవు సమాధాన మొసంగవచ్చును. కాని ఆవరణలేని పదార్థములను ప్రత్యేకించునదేదో, అదియే ఆకాశభూతమనియు, అది శూన్యము కాదనియును మేము పలుకుదుము.

ఇంతేకాకుండా బౌద్ధుల త్రివిధములగు నిరుపాఖ్యములలో స్వవచో వ్యాఘాతము కలదు. నిరుపాఖ్యములు నిర్వచింపఁబడజాలవనియు, అవి శాశ్వతములనియును వారు పలుకుదురు. ఒక శూన్యపదార్థమును శాశ్వతమనిఁగాని, అశాశ్వతమనిగాని పలుకుట అసంగతమగును. ఆరోపణలయొక్క కర్తకర్మ విభేదము కేవలము సత్యమైన పదార్థములయందు వర్తించును. ఇట్టి విభేదమున్న చోట అనిర్వచనీయముకాని, లేక శూన్యముకానట్టి ఘటాది సత్యమైన పదార్థములుండును.

## 2-2-25 అనుస్మృతేశ్చ.

జ్ఞాపకముండు కారణముచేతను పదార్థములు క్షణికములు కావు.

అనుస్మృతేః = జ్ఞాపకముండు కారణముచే, చ = మఱియు.

బౌద్ధ సిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ఇచ్చట బౌద్ధులయొక్క క్షణికత్వసిద్ధాంతము ఖండింపఁబడినది. ఒకవేళ ప్రతిపదార్థము క్షణికమైయున్నచో, ఒకానొక పదార్థము ననుభవించువాడు కూడా క్షణికుడై యుండవలయును. కాని ప్రజలకు పూర్వానుభవములు స్మృతి యందుండుటచే, భోక్త క్షణికుడు కాజాలడు. పూర్వమనుభవించిన దానినే మానవుడు జ్ఞప్తియందుంచుకొనఁగలుగును. ఏలననగా ఒక మానవుడనుభవించిన దానిని మరియొక మానవుడు జ్ఞప్తియందుంచుకొనఁజాలడు. కదా! ఒకడు చూచినదానిని మరియొకడు జ్ఞప్తియందుంచుకొనుట మన కనుభవ సిద్ధము కాదు. 'నేను చూచితిని, మఱియు నేను చూచినది నాకిప్పుడు జ్ఞప్తియందున్నది.' అనునది మనయొక్క అనుభవము. అనుభవించువాడు మఱియు జ్ఞప్తియందుంచుకొను వాడున్నూ ఒకడే. అతడు కనీసము రెండు క్షణములతోనైనా సంబంధమును కలిగియుండును. ఇది నిశ్చయముగా క్షణికత్వ సిద్ధాంతమును ఖండించును.

సాదృశ్యకారణముచే జ్ఞప్తి కలుగునని బౌద్ధులు పలుకవచ్చును. కాని భూత వర్తమానములయం దేకత్వమునుఁగాంచు శాశ్వతుడగు ఒక కర్త లేకున్నచో 'పూర్వముండిన పాత్ర ఇది, కుర్చీ ఇది' యని మానవుడు పలుకజాలడు. పూర్వము చూచినట్టి, ఇప్పుడు జ్ఞప్తియందుంచుకొనినట్టి ఆత్మ ఏకైకము కాకున్నచో, కేవలము సాదృశ్యమాత్రముచే 'నేను చూచితిని, మఱియు ఇప్పుడు నాకది జ్ఞప్తియందున్నద'నెడి

ప్రత్యభిజ్ఞ మానవుని కెట్లు కలుగును? కావున జ్ఞాత శాశ్వతుడై యుండవలయునే కాని, క్షణికుడు కాఁజాలడు.

భౌతిక పదార్థమునుఁగూర్చిన సంశయమిచ్చట కలుగును. అది పూర్వము నీవుఁ గాంచిన పదార్థమేనా? లేక తత్సదృశమగు పదార్థమా? అని నీవు చెప్పఁజాలకుందువు. కాని ద్రష్టయగు ఆత్మనుఁగూర్చి చెప్పునప్పుడు నేను పూర్వమున్నవాడనేనా? యను సంశయము కలుగఁజాలదు. ఏలననగా రెండవ వానిచే చూడఁబడిన పదార్థము తన స్వాత్మయందు జ్ఞప్తియందుండుట అసాధ్యమగును.

ఒకవేళ నీ వితఃపూర్వము చూచిన పదార్థమువలె నీకు జ్ఞప్తియందున్న పదార్థమున్నదని నీవు పలికినచో, ఆ సందర్భమునందున్నూ రెండు పదార్థములు ఒకే కర్తకు సంబంధించియుండును. ఒకవేళ నీవు చూచిన పదార్థము విభిన్నమై పూర్తిగా అదృశ్యమైయుండునేని, అది సూచింపఁబడుట కవకాశముండకుండును. ఇంతే కాకుండా మన అనుభవము 'ఇది దానివలె ఉన్నది' వంటిదికాక 'ఇదియే అది' వంటిదై యున్నది.

భౌతిక పదార్థ విషయములో కొన్ని వేళలలో ఇదియే అదియా? లేక, ఇది దానిని పోలియున్నదా? యనెడి సంశయము కలుగునని మేమున్నూ అంగీకరింతుము. ఏలననగా మన మనస్సునకు బాహ్యమునందున్న విషయములనుఁగూర్చి పొరపాటు జరుగవచ్చును. కాని ప్రజ్ఞాన్వితమగు కర్తకు అది స్వయముగా తానేనా? లేక, తనవంటిది మరియొకటియా? యనెడి సంశయము కలుగఁజాలదు. నిన్నటి అనుభవము నేడు స్పష్టముగా జ్ఞప్తియందుంచు కొనఁగలుగుటయేఁ గాక, తాను ఏకైకమను ప్రజ్ఞను అది కలిగియుండును. జ్ఞప్తియందుంచుకొన్నవాడు మఱియు, చూచిన వాడు ఒకడేయను విషయము నందెవరికైనను సంశయము కలుగునా?

ఈ కారణముచేత కూడా బౌద్ధుల క్షణికత్వవాదము తృణీకరింపఁ బడుచున్నది.

ఒక క్షణములో వస్తువులు అస్తిత్వమును కలిగియుండి మరియొక క్షణములో మాయమగుటను మనము చూచుటలేదు. ఈ విధముగా పదార్థములన్నియును క్షణికములనెడి సిద్ధాంతము ఖండింపఁబడుచున్నది.

## 2-2-26 నా సతోऽ దృష్టత్వాత్.

అది చూడఁబడకుండుటచే, నాస్తిత్వమునుండి అస్తిత్వము ఉత్పన్నము కాదు.

న = కాదు, అసతః = అసత్తు నుండి, అదృష్టత్వాత్ = చూడఁబడకుండుటచే,

బౌద్ధసిద్ధాంతవిరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ఒక అసత్పదార్థము సత్పదార్థమును సృష్టించుటను మనముఁ గాంచుట లేదు. కావున అసత్పదార్థము కారణమని భావించుట బుద్ధిగ్రాహత్యకు ప్రతికూలమగును.

మార్పులేని ఏలాటి శాశ్వత పదార్థము నుండియైనను కార్యముత్పన్నము కాదని బౌద్ధులు (వైనాశికులు) విశ్వసించుదురు. ఏలననగా మార్పులేని పదార్థముచే కార్యము సృష్టింపఁబడజాలదు. కావున కార్యముత్పన్నమగుటకు పూర్వము కారణము నశించునని వారు పలుకుదురు. శిథిలమైన బీజమునుండియే ఒక చిన్న మొక్క మొలకెత్తుననియు, చెఱుపఁబడిన పాలే పెరుగుగా మారుననియు, మట్టిముద్ద మటుమాయమైనప్పుడే ఒకకుండ తయారగుననియును వారు పలుకుదురు. కావున సత్పదార్థము అసత్పదార్థముచే జనించును.

ఒకవేళ సత్తు అసత్తునుండి, అస్తిత్వము నాస్తిత్వము నుండి జనించినచో ప్రత్యేక కారణములు ఏ మాత్రము అర్థవంతములు కాకుండును. అట్లయినచో ఏదైనను, దేని నుండియైనను జనింపవచ్చును. ఏలననగా అన్ని విషయములలోను నాస్తిత్వము ఏకమైయుండును కదా! ఒక మామిడి విత్తనము మఱియు పనస విత్తనము యొక్క నాస్తిత్వముల మధ్య విభేదము లేదు. కావున ఒక మామిడి విత్తనము నుండి ఒక పనసచెట్టు జనింపవచ్చును. కుందేటికొమ్ము నుండి మొలకలు కూడా మొలకెత్తవచ్చును. ఒకవేళ ఈ నాస్తిత్వము పద్మములలోని నీలివర్ణమువంటి ప్రత్యేక గుణములవలె అనేక విభేదములను కలిగియున్నచో, ఒక మామిడి విత్తనము యొక్క నాస్తిత్వము పనస విత్తనము యొక్క నాస్తిత్వమునకు విభిన్నమైయుండును. దీనిచే నాస్తిత్వము అస్తిత్వముగా పరిణమించును.

ఇంతేకాకుండా ఒకవేళ అస్తిత్వము నాస్తిత్వము నుండి జనించినచో కార్యములన్నియును నాస్తిత్వముతో ప్రభావితములయ్యెడివి. కాని అవి తమ వివిధములగు ప్రత్యేక లక్షణములచే అస్తిత్వము నాకళించుకొనును.

కుందేటికొమ్ముకు అస్తిత్వము లేదు. ఆ కొమ్ము నుండి ఏదైన ఉత్పన్నమగునా? బంగారము నుండి ఆభరణమువలె ఒక పదార్థము నుండి మరియొక పదార్థమేతెంచుటను మనము గాంచుచున్నాము.

బౌద్ధమతానుసారముగా మనస్సు మఱియు మానసిక ప్రవృత్తులన్నియును నాలుగు స్కంధములనుండి జనించును. మఱియు భౌతిక సమూహములన్నియును పరమాణువులనుండి జనించును. ఐనను అదే సమయమునందు అస్తిత్వము నాస్తిత్వము నుండి జనించునని కూడా వారు పలుకుదురు. ఇది నిశ్చయముగా అసంగతము, మఱియు స్వవచోవ్యాఘాతశీలమైయున్నది. వారు తమ స్వసిద్ధాంతము బుద్ధిహీనమైనదిగా తెలుపుకొనుటయేఁగాక, అనావశ్యకముగా ప్రతి మనుజుని మనస్సును కలవరమొనర్తురు.

## 2-2-27 ఉదాసీనానామపి చైవం సిద్ధిః

ఒకవేళ అస్తిత్వము నాస్తిత్వము నుండి జనించినచో, తటస్థులు మఱియు నిష్క్రియులైయున్న వారిచేత కూడా మోక్షము పొందఁబడును.

ఉదాసీనానామ్ = తటస్థులై (నిష్క్రియులై) యున్న వారికి, అపి = కూడా, చ = మఱియు, ఏవం = ఈ విధముగా, సిద్ధిః = మోక్షప్రాప్తి.

బౌద్ధ సిద్ధాంతవిరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ఒకవేళ అస్తిత్వము నాస్తిత్వమునుండి జనించునని అంగీకరింతుమేని, సోమరులు మఱియు నిష్క్రియులైన ప్రజలకు కూడా తమ ప్రయోజనము సిద్ధించును. రైతు తన పొలమును సేద్యము చేయకున్నను, ధాన్యము పండవలసి యుండును. కుమ్మరివాడు మట్టిని ఆవముపై త్రిప్పకున్నను, కుండలు తమకు తావే రూపమునుఁదాల్చవలసియుండును. సాలెవాడు కూడా తన మగ్గముపై నేయకున్నను, వస్త్రములు తయారు కావలసియుండును. స్వర్గలోకమునకు చేరుటకుగాని, లేక పరమపదము నొందుటకుఁగాని ఎవడున్నూ ఎట్టి ప్రయత్నమునైనను ఒనర్పవలసిన పని లేకుండెడిది. ఇదియంతయు అసంగతమగుటచే, ఎవరి చేతను సమర్థింపబడజాలదు.

ఈ విధముగా అసత్తు నుండి సత్తు జనించు సిద్ధాంతము అసంగతము మఱియు అసమ్మతమై యున్నది.

# 5. అభావాధికరణము

## (28-32 సూత్రములు)

### 2-2-28 నాభావ ఉపలబ్ధేః

మనయొక్క అనుభవకారణముచే శాశ్వత పదార్థముల యొక్క నాస్తిత్వము సమర్థింపఁబడఁజాలదు.

న = కాదు, అభావః = నాస్తిత్వము, ఉపలబ్ధేః = మన అనుభవజన్యమగుటచే.

బౌద్ధ సిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది. ఈ సూత్రము నుండి బౌద్ధవిజ్ఞానవాదుల ఖండన ప్రారంభమగును.

బౌద్ధుల భౌతిక పదార్థములయొక్క క్షణికత్వసిద్ధాంత మింతవరకు ఖండింపఁబడినది. ఇప్పుడు సూత్రకారుడు భావములు తప్ప మరియొక దాని కునికి లేదనెడి బౌద్ధుల భావ క్షణికవాదమును ఖండించుట కుపక్రమించుచున్నాడు.

విజ్ఞానవాదుల మతానుసారముగా భౌతిక ప్రపంచమున కునికిలేదు. ప్రతి దృశ్యపదార్థమున్నూ తత్సదృశమగు నైజము లేకుండా ప్రజ్ఞ మఱియు భావముగా విడిపోవునని వారు సమర్థింతురు. ఇది సరికాదు. మన జ్ఞానేంద్రియములచే స్పష్టముగా చూడఁబడుచుండుటచే, భౌతిక జగత్తు అసత్తని నుడువుటకు వీలులేదు. భౌతిక జగత్తు మన ఇంద్రియముల ద్వారా అనుభవింపఁబడు ఒక పదార్థమై యున్నది. కావున అది కుందేటి కొమ్మువలె అసత్తు కాజాలదు.

విజ్ఞానవాదులిట్లు నుడువుదురు: చైతన్యమును విడిచి ఎట్టి భౌతిక పదార్థమునకున్నూ ఉనికి లేదు. భౌతిక పదార్థములు ఉనికిని కలిగియుండుట అసాధ్యమగును. ఏలననగా ఒకవేళ భౌతిక పదార్థముల నంగీకరించినచో కుర్చీ, కుండ మున్నగు వాటివలె అవి పరమాణువులుఁగాని, పరమాణు సమూహములుఁగాని కావలసియుండును. కాని పరమాణువులు కుర్చీ మున్నగు భావములుగా గ్రహింపఁబడజాలవు. పదార్థములు పరమాణువుల వలె సూక్ష్మములుగా చూడఁబడుట అసాధ్యము. పరమాణువులను మనము గాంచజాలకుండుటచే పదార్థములు పరమాణువులు కాజాలవు. అవి పరమాణు

సంయోగములున్నూ కావు. ఏలననగా ఈ సంయోగములు పరమాణు సంబంధములా? లేక, తదితరములా? యని మనము నిశ్చయించి చెప్పఁజాలము.

విజ్ఞానవాదులు, లేక యోగాచార మతానుసారముగా విజ్ఞానస్కంధము, లేక భావము మాత్రమే సత్యమైయుండును. బాహ్యముగా కానఁబడు కుండ, లేక కుర్చీ వంటి ఒక పదార్థము భావము వినా అన్యము కాదు. విజ్ఞానము, లేక భావము స్వయముగా ఒక పదార్థముగా రూపొందును. స్వప్నము నందు భావనావస్తుజాలముచే సమస్త కార్యములు నెఱవేర్పఁబడునట్లు, ప్రాపంచిక కార్యకలాపములన్నియును కేవలము భావనలచే జరుగును. భావములు మాత్రమే ఉనికిని కలిగియుండును. పదార్థము భావనకు భిన్నమైయున్నదని భావించుట నిష్ప్రయోజనము. స్వప్నమునందు వలె భౌతిక పదార్థములు లేకుండగనే భావనాసిద్ధిని మఱియు సంసర్గమును పొందుట సాధ్యమగును. భావనాసత్యతను అంగీకరించిన మాత్రముచే నైష్ఠిక ప్రయోజనము లన్నియును సిద్ధించును. ఏలననగా ఆంతరిక భావనలకు సంబంధించిన భౌతిక పదార్థములను చేర్చుటచే ఏలాటి శ్రేయస్సు కలుగఁజాలదు.

నానావిధ వాసనలచే కూడియున్న కారణముచే మనస్సు నానావిధ రూపములను ధరించును. ఈ వాసనలు స్వప్నప్రపంచమును సృష్టించినట్లే, జాగ్రదవస్థలోని భౌతిక ప్రపంచము కూడా వాసనలయొక్క ఫలితమే నైయున్నది. కావున భౌతిక పదార్థముయొక్క రూపకల్పన అనావశ్యకము. దృష్టి మఱియు పదార్థమునకు మధ్య ఏలాటి భేదము మనకు కానఁబడదు. స్వప్నమునందు పదార్థములు లేకుండగనే మనము చూడఁగలుగుదుము. అదే విధముగా జాగ్రదవస్థయందును పదార్థములు లేకుండగనే దృశ్యమేర్పడును. మన అనంత వాసనాజాలమే ఇట్టి దృశ్యములకు కారణమగును.

జాగ్రదవస్థలోని దృశ్యము ఒక స్వప్నము వంటిది. భౌతిక పదార్థము లేకున్నను స్వప్నకాలమునందు భావనలుండుటచే, అవియే కర్త కర్మలరూపమును ధరించును. కావున మన జాగ్రదవస్థయందు సంభవించు కుర్చీ, కుండ వంటి భావనలు భౌతికపదార్థముల వలె స్వతంత్రమైనవి. ఏలననగా అవి కూడా కేవలము భావనలే నైయున్నవి.

ఈ వాదము భ్రాంతి జనకమైయున్నది. నీవొక కుర్చీనిఁగాని, కుండనుఁగాని చూచినప్పుడు దానినెట్లు నిషేధింపఁగలవు? నీవు భుజించినప్పుడు నీ ఆకలి తీరిపోవును. ఆకలిని గురించిఁగాని, ఆహారమునుఁగూర్చి గాని నీకు సంశయ మేర్పడునా? నీ దృష్టికి భిన్నముగా మరియొక పదార్థము లేదని నీ చపలత్వ కారణముచే నీవు పలుకుదువు. ఒక కుర్చీని ఒక కుండగా నీవేల చూచుటలేదు? ఒకవేళ స్వప్నమువలె ఒక పదార్థము కేవలము మానసిక సృష్టియై యున్నచో, అది మనస్సుకు బాహ్యమగా ఉందనేల?

బౌద్ధుడిట్లు పలుకవచ్చును. ఒక పదార్థమునుఁ గూర్చిన ప్రజ్ఞ నాకు లేదని నేను నిశ్చయించి చెప్పలేను. పదార్థము ఒక భౌతిక వస్తువుగా కానఁబడుట నాకున్నూ అనుభవసిద్ధమే. కాని నా స్వంతభావములు తప్ప మరియొకదాని ప్రజ్ఞ నాకు లేదని మాత్రము నేను నిశ్చయించి చెప్పుదును. నా భావము మాత్రమే ఒకానొక భౌతిక పదార్థముగా ప్రకాశించును. తత్ఫలితముగా భౌతిక పదార్థజ్ఞానము నా స్వయంభావ ఫలితమేనైయున్నది.

భౌతిక పదార్థము చేతనే భౌతిక భావము కలుగునని స్వయముగా నీ ప్రజ్ఞయే నిరూపించుచున్నదని మేము సమాధాన మొసంగుదుము. స్వయముగా ప్రజ్ఞయొక్క భూమిక ననుసరించి ప్రజ్ఞకు భిన్నముగా భౌతిక పదార్థమున్నదను విషయమును మన మంగీకరింపవలసివచ్చును. ఎవడైనను ఒక కుర్చీనిఁగాని, కుండనుఁగాని చూచునప్పుడు తన దృష్టినిఁగూర్చిన ప్రజ్ఞను మాత్రమే కలిగియుండడు. కాని అందఱున్నూ కుర్చీ, లేక కుండవంటి దృశ్యపదార్థములనేఁ గాంతురు.

అంతరంగిక భావనయే భౌతికముగా గోచరించునని విజ్ఞానవాదులైన మీరు వచింతురు. దీనిచే భౌతిక ప్రపంచము నిజమని సూచింపఁబడుచున్నది. ఒకవేళ అది అసత్యమైనచో, భౌతికమని నీవు చెప్పునది అర్థరహితమగును. 'వలె' అనుశబ్దముచే నీవు భౌతిక పదార్థముల సత్యతను అంగీకరించిన వాడవగుదువు. లేనిచో నీవీ శబ్దమును ప్రయోగించి యుండెడివాడవు కావు. ఏలయనగా పూర్తిగా అసత్యమైయున్న పదార్థముతో ఎవడున్నూ పోల్చి చెప్పఁజాలడు. రామకృష్ణుడు గొడ్రాలి బిడ్డవలె ఉన్నాడని ఎవడున్నూ పలుకడు.

ఒక భావము వ్యక్తమగుటకు ఒకదీపమువంటి ఉత్తరోత్తర విజ్ఞాన సూత్రమావశ్యకమై యుండును. విజ్ఞానమునకు ఆద్యంతములు కలవు. అది జ్ఞేయ వర్గమునకు కూడా చెందియున్నది. పదార్థములు చూడఁబడుటకు జ్ఞాతయు అత్యావశ్యకమగును.

## 2-2-29 వైధర్మ్యాచ్చన స్వప్నాదివత్.

మఱియు జాగ్రదవస్థలోని అనుభవము స్వప్నావస్థానుభవమునకు భిన్నమైయుండుట ఇత్యాదికారణములచే.

వైధర్మ్యాత్ = భిన్నత్వకారణముచే, చ = మఱియు, న = కాదు, స్వప్నాదివత్ = స్వప్నాదులవలె.

బౌద్ధ సిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

పోలిక లేకుండుటచే జాగ్రదవస్థ స్వప్నావస్థకు భిన్నమైయున్నది. వాటి స్వరూపమునందు భిన్నత్వముండుటచే జాగ్రదవస్థలోని భావములు స్వప్నావస్థలోని భావములవలె ఉండవు.

బౌద్ధులిట్లు పలుకుదురు : భౌతిక ప్రపంచ దృశ్యము స్వప్నమువంటిది. స్వప్నమునందు భౌతిక పదార్ధములు లేకున్నను కర్త, కర్మ భావము లుత్పన్న మగును. అదేవిధముగా భౌతిక ప్రపంచ దృశ్యము పదార్థముల సత్యతకు విభిన్నమై యున్నది.

జాగ్రత్ప్రపంచమును స్వప్న ప్రపంచముతో పోల్చిచెప్పుట పొరపాటు. స్వప్నములోని ప్రజ్ఞ జాగ్రదవస్థలోని ప్రజ్ఞకు విభిన్నమైయున్నది. స్వప్నములోని ప్రజ్ఞ జాగ్రదవస్థలోని పూర్వప్రజ్ఞపై ఆధారపడియుండును. కాని జాగ్రదవస్థలోని ప్రజ్ఞ ఇంద్రియముల ప్రత్యక్షానుభవముపై తప్ప మరియొకదానిపై ఆధారపడి యుండదు. ఇంతేకాకుండా మానవుడు మేల్కాంచిన వెంటనే స్వప్నానుభవము మిథ్యయగును. మేల్కొన్న వెంటనే కలఁగన్న మనుజుడిట్లనును: 'కలెక్టరును కలిసి కొన్నట్లు నేను మిథ్యయైన కలను కంటిని. కాని అతనిని కలియుట సంభవించలేదు. నా మనస్సు నిద్రచే మొద్దుఁబారుటచే ఇట్టి మిథ్యాభావములు మొలకెత్తినవి'. ఏతద్విరుద్ధముగా జాగ్రదవస్థలోని స్తంభాదులు ఏ యవస్థయందును

నిషేధింపఁబడవు. అవి ఖండనకుఁగాని, ఆక్షేపణకుఁగాని గుఱికావు. నూరు సంవత్సరముల తర్వాత కూడా అవి ఇప్పటివలెనే కానఁబడును.

ఇంతేకాకుండా జాగ్రదవస్థయం దనుభవింపఁబడిన సత్పదార్థముల స్మృతియే స్వప్నముగా భాసించును. ఒక పదార్థము లేనప్పుడు స్మృతి ఏర్పడుననియు, అది యున్నప్పుడనుభవము కలుగుననియును ప్రతియొక్కరికి తెలిసిన విషయమే. తన కుమారుడు తన వద్ద లేనప్పుడొక మనుజుని కాతడు జ్ఞప్తికివచ్చినచో, అతడు తన కుమారుని ప్రత్యక్షముగా కలువఁజాలడు. స్వప్నావస్థయందు మఱియు జాగ్రదవస్థయందు కేవలము సాదృశ్యమున్నంత మాత్రముచే అవి ఒకే స్వభావమును కలిగియుండునని మనము చెప్పలేము. ఒకవేళ ఒక లక్షణము ఒక పదార్థమునకు స్వభావము కాకున్నచో, కేవలము ఆ స్వభావమును కలిగియున్న పదార్థముతో పోలియున్న మాత్రముచే అది దాని కంతర్నిహితమగు స్వభావము కానేరదు. మండుచున్న అగ్ని చల్లగా ఉన్నదని నీవు చెప్పఁజాలవు. ఏలననగా ఆ లక్షణము సామాన్యముగా జలమునందుండును.

కావున స్వప్నావస్థ మఱియు జాగ్రదవస్థ తమ అంతరంగిక స్వభావము ననుసరించి పూర్తిగా విభిన్నములై యున్నవి.

## 2-2-30 న భావోఽనుపలబ్ధేః

భౌతిక పదార్థములు చూడఁబడుకుండుటచే బౌద్ధుల మతానుసారముగా సంస్కారములయొక్క ఉనికి అసాధ్యము.

న = కాదు, భావః = సంస్కారముల యొక్క ఉనికి, అనుపలబ్ధేః = అవి చూడఁబడకుండుటచే.

బౌద్ధసిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

నీవు పదార్థముల ఉనికిని నిషేధించుటచే నీ సిద్ధాంతానుసారముగా వాసనల అస్తిత్వమునకవకాశము లేదు.

ఒక భౌతిక పదార్థము నిజముగా లేకున్నను, దాని సంస్కారములకునికి యుండుననియు, ఈ సంస్కారములచే దృష్టిభేదములు మఱియు కుర్చీ, వృక్షము వంటి భావములుత్పన్నములగుననియును నీవు పలుకుదువు. స్వయముగా

ఉనికిని కలిగిలేని భౌతికపదార్థము కానరాకుండుటచే, ఇది అసాధ్యము. ఒకవేళ భౌతికపదార్థము కానరాకున్నచో, దాని సంస్కారము మనయందెట్లు పడును?

ఒకవేళ వాసనలు అనాదియని నీవు పలికినచో, దీనిచే అనవస్థాదోష మేర్పడును. ఈ కారణముచే ఎట్లయినను నీ సిద్ధాంతమునకవకాశము లేకుండును. వాసనలు, లేక సంస్కారములు కారణమును మఱియు మూలద్రవ్యమును కలిగియుండును. కాని నీ మతము ననుసరించి, వాసనలకు కారణముఁగాని, మూలద్రవ్యముఁగాని లేదు. ఏలననగా, అది ఏలాటి జ్ఞానేంద్రియముచేతను చూడఁబడదని నీవు పలుకుదువు.

## 2-2-31 క్షణికత్వాచ్చ

మఱియు, ఆలయవిజ్ఞానము యొక్క క్షణికత్వ కారణము చేతను అది సంస్కారములకు నిలయము కాజాలదు.

క్షణికత్వాత్ = క్షణికత్వ కారణముచే, చ = మఱియు.

బౌద్ధసిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ఒక నిలయము లేకుండా సంస్కారములు నిలువజాలవు. బౌద్ధమతానుసారముగా ఆలయవిజ్ఞానము (అహంకార చైతన్యము) కూడా క్షణికమగుటచే అదియున్నూ సంస్కారములకు నిలయము కాజాలదు.

భూతభవిష్యద్వర్తమానములకు సంబంధించిన ఒక అఖండమైన శాశ్వత సూత్రమున్నప్పుడు తప్ప, లేక సమస్తమును పరికింపఁగలుగు ఏలాటి మార్పులేని ఆత్మ యున్నప్పుడు తప్ప, మనము దేశకాలకారణములపై ఆధారపడియుండు సంస్కారములను కలుగఁజేయు జ్ఞాపకశక్తిని, గ్రహణశక్తిని కలిగియుండజాలము. ఒకవేళ ఆలయవిజ్ఞానము కొంతవరకు శాశ్వతమని నీవు పలుకుదువేని, నీ క్షణికత్వ సిద్ధాంతమునకు విరోధమేర్పడును.

ఈ విధముగా మనము బౌద్ధులయొక్క భౌతికప్రపంచపు క్షణికత్వ సత్యత్వ సిద్ధాంతమును మఱియు కేవలము భావనలకే అస్తిత్వమున్నదని వివరించు సిద్ధాంతమును కూడా ఖండించితిమి.

## 2-2-32 సర్వథానుప పత్తేశ్చ

మఱియు, బౌద్ధసిద్ధాంతము సర్వవిధములుగా యుక్తి విరుద్ధమైయుండుటచే, అది అంగీకారయోగ్యము కాదు.

సర్వథా = సర్వవిధముగా, అనుపపత్తేః = యుక్తి విరుద్ధమగుటచే, చ = మఱియు.

ఇచ్చట బౌద్ధసిద్ధాంత విరుద్ధమగు వాదము పరిసమాప్తమైనది.

అంతయు శూన్యమని నిశ్చయించు బౌద్ధుల శూన్యవాదమసంగతము. ఏలననగా, అది ప్రత్యక్షము, అనుమానము, శబ్ద మఱియు ఉపమానములనెడి సమస్త నిరూపణలకు విరుద్ధమైయున్నది. అది శ్రుతి విరుద్ధము మఱియు సక్రమజ్ఞాన సాధనములన్నింటికి విరుద్ధమై యున్నది. కావున తమ స్వాత్మానందమును మఱియు సంక్షేమమును వాంఛించువారు దానిని పూర్తిగా విసర్జింపవలసియుండును. ఇసుకనేలలో త్రవ్వఁబడిన బావిగోడలు అన్నివైపులనుండి పడిపోవునట్లు, ఇదియున్నూ అన్ని విధములగు లోపములను కలిగియుండుటచే దీనినిఁగూర్చి విస్తారముగా చర్చింపవలసిన అవసరము లేదు. విశ్రమించుటకు దీనికేలాటి ఆధారము లేదు. జీవితానుష్ఠాన విధానమునందు దీనిని మార్గదర్శకముగా స్వీకరించు ప్రయత్నము కేవలము విఫలతకు కారణమగును.

ఓ శూన్యవాదులారా! నీవు స్వయముగా సత్తామాత్రుడవనియు, మఱియు నీ తర్కము కూడా శూన్యము కాదనియును నీవు అంగీకరింపవలసియుండును. దీనిచే సమస్తము శూన్యమనెడి మీ సిద్ధాంతమునకు విరోధమేర్పడును.

ఇంతేకాకుండా శూన్యత్వమును నిరూపించెడి జ్ఞానసాధనమైనను సత్యము కావలసివచ్చును. మఱియు సత్యమని అంగీకరింపవలసివచ్చును. ఏలననగా, ఒకవేళ ఈ జ్ఞాన సాధనములు మఱియు వివాదములు స్వయముగా ఉనికి లేనివైనచో, శూన్యవాదము ప్రతిష్ఠింపఁబడజాలదు. ఒకవేళ ఈ సాధనములు మఱియు వివాదములు సత్యములైనచో, అప్పుడు నిశ్చయముగా ఒకానొకటి నిరూపింపఁబడవలయును. అప్పుడు కూడా శూన్యవాదము స్థాపింపఁబడజాలదు.

# 6. ఏకస్మిన్న సంభవాధికరణము

## (33-36 సూత్రములు)

## 2-2-33 నైకస్మిన్న సంభవాత్.

ఒకే సమయమునం దొకే పదార్థమునందు విరుద్ధములగు గుణములుండుట అసంభవమగుటచే, జైన సిద్ధాంతము అంగీకర యోగ్యము కాజాలదు.

న = కాదు, ఏకస్మిన్ = ఒకదానియందు, అసంభవాత్ = అసంభవమగుటచే.

బౌద్ధసిద్ధాంతములగు క్షణికత్వ, విజ్ఞాన, శూన్యవాదములు ఖండింపఁబడిన తర్వాత జైనసిద్ధాంతము చర్చింపఁబడి, ఖండింపఁబడుచున్నది.

జైనులు సప్తతత్త్వముల నంగీకరింతురు. (1) జీవుడు (2) అజీవుడు (3) ఆస్రవము (4) సంవరము (5) నిర్జరము (6) బంధము (7) మోక్షము ఈ తత్త్వములను జీవుడు మఱియు అజీవుడనెడి రెండు ముఖ్య సమూహములుగా విభజింపవచ్చును. ఐదు అస్తికాయములున్నవని కూడా జైనులు పలుకుదురు. అవి ఏవనగా : (1) జీవుడు (2) పుద్గలము (శరీరము) (3) ధర్మము (4) అధర్మము (5) ఆకాశము.

సప్తభంగి న్యాయము వారి ముఖ్యసిద్ధాంతము. ప్రతిపదార్థము యొక్క సత్యతనుఁగూర్చి వారు సప్తవిధ దృష్టులను కలిగియుందురు. (1) దానికి ఉనికి ఉండవచ్చును. (2) ఉనికి లేకుండవచ్చును (3) ఉనికి ఉండియు లేకుండవచ్చును. (4) ఉన్నది కాని అవర్ణనీయము (5) ఉనికి కలిగియుండియు అవర్ణనీయము (6) ఉనికి లేనిది మఱియు అవర్ణనీయము (7) ఉనికిని కలిగియుండియు, లేకుండియు అవర్ణనీయము.

పదార్థములనుఁగూర్చిన ఈ దృష్టి అంగీకారయోగ్యము కాదు. ఏలననగా ఒకే సమయములో ఒకే పదార్థమునందు విరుద్ధమైన గుణములుండుట అసంభవము. ఒకే సమయమునందొకే పదార్థము వేడిగను మఱియు చల్లగను ఉండుట ఎవ్వడును చూడఁజాలడు. ఒకే స్థలమునందొకే సమయమునందు వెలుతురు మఱియు అంధకారముండుట అసాధ్యము.

జైన సిద్ధాంతము ననుసరించి స్వర్గము మఱియు మోక్షము ఉండవచ్చును, లేక, లేకుండవచ్చును. ఈ ప్రపంచము మఱియు స్వర్గమోక్షములు కూడా సంశయగ్రస్తములై యుండును. ఒక నిశ్చితమగు నిర్ణయజ్ఞానమును మనము కలిగియుండజాలము. దేని గురించియైనను ఒక నిశ్చయము లేకుండుచే స్వర్గమోక్షముల ప్రాప్తికిఁగాని, నరక నివారణకుగాని ఏలాటి నియమములను నిర్ణయించినను అవి యన్నియు నిష్ప్రయోజనమగును. స్వర్గమొకప్పుడు నరకముగా పరిణమింపవచ్చును. మఱియు మోక్షమీ రెండింటికి అభిన్నమైయుండవచ్చును. సమస్తము సందిగ్ధమైయుండుటచే స్వర్గ, నరక, మోక్షములను ప్రత్యేకించుట కవకాశము లేకుండును.

కేవలము ప్రాపంచిక పదార్థమును గూర్చియే కాకుండా, ప్రపంచమునుఁగూర్చి కూడా భ్రమ ఉత్పన్నమగును. ఒకవేళ పదార్థములు అనిశ్చితములైయున్నచో మఱియు సమస్తము 'కావచ్చును, కాకపోవచ్చును' అనెడి సంశయముతో కూడియున్నచో ఒక మానవుడు తన దప్పికను తీర్చుకొనుటకై నీటికి బదులుగా అగ్నిని సేవించ వలసియుండును. ఇట్లే తదితరములు. ఏలననగా అగ్ని వేడిగా ఉండవచ్చును, లేక చల్లగా ఉండవచ్చును.

ఇట్టి సంశయమున్నప్పుడు సత్యమైన జ్ఞానమెట్లు చేకూరును? సమస్తము సంశయగ్రమస్తమైయున్నచో జైనాచార్యులు దేనిగురించియైనను నిశ్చయముగా ఎట్లు బోధింపఁగలుగుదురు? వారి అనుయాయులిట్టి ప్రబోధమును శ్రవణమొనర్చి, ఎట్లు దాని నాచరింపఁగలుగుదురు?

వారి పంచాస్తికాయములకు ఈ సప్తభంగిన్యాయమును చేర్చినచో ఐదు నాలుగుగాఁగాని, లేక తక్కువ సంఖ్యగాగాని మారును. ఒకవేళ అవి అనిర్వచనీయ ములైయున్నచో, వాటిని గూర్చి వారు చర్చింపనేల? అణుసంయోగ ముచే పుద్గల మేర్పడునని అణువాదముచే ఆధారపడియున్న జైన సిద్ధాంత మితఃపూర్వమే మాచే ఖండించబడినది. కావున జైన సిద్ధాంతము అసంగతము మరియు అసమ్మతమైయున్నది. వారి తర్కము సాలీడు దారమువలె దుర్బలమైన దగుటచే బుద్ధిజలమునకు నిలువజాలదు.

## 2-2-34 ఏవం చాత్మాకార్త్స్న్యమ్

మఱియు ఇదే విధముగా జైన సిద్ధాంతముచే ఆత్మకు అసంపూర్ణత సిద్ధించును.

ఏవం = జైనసిద్ధాంతప్రోక్తముగా, చ = మఱియు, ఆత్మాకార్త్స్న్యమ్ = ఆత్మయొక్క అసంపూర్ణత.

జైనసిద్ధాంతములోని తదితరదోషములు చూపఁబడుచున్నవి.

జైనులయొక్క స్వాద్వాదముచే కలుగు దుష్పరిణామమింతవరకు చెప్పఁబడినది. అనగా ఒకే పదార్థమునందు విరుద్ధములగు గుణములుండవను విషయము సూచింపఁబడినది. ఇప్పుడు వారి సిద్ధాంతమువలన జీవుడు సర్వవ్యాపకుడు కాజాలడని ఆక్షేపింపఁబడుచున్నది.

శరీరపరిమాణమునుఁబట్టి ఆత్మపరిమాణముండునని జైనులు పలుకుదురు. అట్లయినచో ఆత్మకు సంకుచితత్వమేర్పడి దానియందు విభాగము లేర్పడును. కావున అది శాశ్వతము మఱియు సర్వవ్యాపకము కాకుండును.

ఇంతే కాకుండా జీవుల నానావర్గములగు శరీరములు నానా ప్రకారములగు పరిమాణములను కలిగియుండుటచే, తన పూర్వకర్మ వశముచే మానవుని ఆత్మ ఒక ఏనుగు శరీరము నాక్రమింపవలసి వచ్చినప్పుడది ఆ శరీరమును పూర్తిగా ఆక్రమింపఁజాలకుండును. ఒక చీమయొక్క ఆత్మకూడా ఒక ఏనుగు యొక్క శరీరమును నింపజాలకుండును. ఒక ఏనుగు యొక్క ఆత్మ ఒక చీమయొక్క శరీరమునందిముడుటకు తగినంత స్థలము లేకుండును. ఆత్మయొక్క ఎక్కువ అంశము ఆ శరీరమునకు బాహ్యముగా ఉండవలసివచ్చును. ఒక బాలుని, లేక ఒక యువకుని ఆత్మ చిన్న పరిమాణమును కలిగియుండుటచే వయస్సు ముదిరిన మనుజుని శరీరమునది పూర్తిగా నింపజాలకుండును.

ఇట్లు ఆత్మయొక్క పరిమాణముయొక్క స్థిరతకుహాని కలుగును. ఈ విధముగా జైనసిద్ధాంతము స్వయముగా భూపతనమగును.

జీవునికి అనంతములగు అవయవములుండుటచే అతడు సంకోచ వికాసముల నొందఁగలుగునని జైనులు సమాధాన మొసంగవచ్చును. కాని ఆ యనంతములగు అవయవములు ఒకే స్థలమునందుండునా? లేదా? ఒకే

స్థలమునందు లేనిఎడల అవి ఒక చిన్నస్థలమునందెట్లు ఇముడఁగలుగును? ఒకవేళ అవి ఒకే స్థలమునందున్నచో, అవి ఒక పెద్ద శరీరముగా వ్యాపకము నొందఁజాలవు. ఇంతేకాకుండా జీవునికి అనంతమైన అంగములు కలవని చెప్పుటకు వారికి హక్కులేదు. ఒక చిన్న పరిమాణముఁగల శరీరమునందనంత సంఖ్యాకము లగు ఆత్మయొక్క అంశములున్నవని పలుకుట ఎట్లు సమంజసమగును?

సరి, ఇప్పుడు జైనులిట్లు పలుకవచ్చును. ఆత్మ పెద్ద శరీరమును ప్రవేశించినప్పుడు కొన్ని అంశములు చేర్చఁబడును. ఇఁక చిన్న శరీరమును ప్రవేశించినప్పుడు వాటిలో కొన్ని అంశములు తీసివేయఁబడును.

ఇట్టి ఊహకు ఈ క్రింది సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 2-2-35 న చ పర్యాయాదప్య విరోధో వికారాదిభ్యః

ఆత్మయొక్క పరిణామము మున్నగువాటి కారణముచే ఇట్టి విభిన్నములగు శరీరములకు ఆత్మాంశములు చేర్పఁబడుట మఱియు విడిపోవుట అవిరోధము కాదు.

న = కాదు, చ = మఱియు, పర్యాయాత్ = ఒకటి తర్వాత మరియొకటి, అపి = కూడా, అవిరోధః = విరోధము లేదు, వికారాదిభ్యః = మార్పు ఇత్యాదులచే.

ఈ సూత్రమునందు జైనసిద్ధాంతములోని మరికొన్ని దోషములు చూపఁబడినవి.

ఆత్మపరిమాణమునందు నిశ్చయముగా ఒక నిర్ణయమును కలిగిలేదని జైనులు పలుకవచ్చును. కావున అది శరీరమును పోషించునప్పుడు ఒక బాలుడు, లేక ఒక యువకునివంటి పరిమాణమును కలిగియుండును. మఱియు అది గుఱ్ఱములు, లేక ఏనుగుల శరీరములను ప్రవేశించునప్పుడది వాటి పరిమాణముగా వికాసము నొందును. వాయువువలె వికాసమునొంది అది తాత్కలికముగా శరీరమునంతటిని ఆక్రమించుకొనును. కావున ఆత్మశరీర పరిమాణమును కలిగియుండునను మా సిద్ధాంతమున కాక్షేపణ యుండజాలదు.

శరీరము చిన్నదిగను, పెద్దదిగను ఉన్నప్పుడు తదనుసారముగా ఆత్మయొక్క అంశములు బయటికి వచ్చుననియు, లేక ముడుచుకొనుననియు ఒకవేళ నీవు

పలికినను, ఇట్టి సందర్భములో ఆత్మ మార్పునొందుటచే అది శాశ్వతము కాకుండుననెడి ఆక్షేపణను నీవు తప్పించుకొనజాలవు. అప్పుడు బంధమోక్షములు అర్థరహితములగును. మోక్షము మఱియు తద్రహస్య ప్రబోధమంతయు వ్యర్థము కావలసివచ్చును.

ఒకవేళ ఆత్మాంశములు వచ్చుచు, పోవుచుండినచో అది శారీరక స్వభావమునకు భిన్నమైనదిగా ఎట్లు చెప్పఁబడును? కావున ఈ యంశములో ఒకటి మాత్రమే ఆత్మ కావలసియుండును. దీనిని నిర్ణయించు వారెవరు? ఆత్మయొక్క అంశములు ఎచ్చట నుండి ఏతెంచును? అవి ఎచ్చట విశ్రమించును? అవి భూతముల నుండి ఉత్పన్నమై తిరిగి భూతములయందు ప్రవేశింపఁజాలవు. ఏలననగా ఆత్మ అమరమైయున్నది. అవయవములు వచ్చును, పోవుచుండును. అప్పుడాత్మ ఒక అనిశ్చితమైన స్వభావమును కలిగియుండి, ఒక మనుజుని పొడవును కలిగియుండవలసి వచ్చును.

ఆత్మయొక్క పరిమాణము అప్పుడప్పుడు మారినను, అది శాశ్వతమై యుండనోపునని జైనులు పలుకవచ్చును. గంగాజలము అఖండముగా పారుచున్నను అది శాశ్వతమైయున్నది కదా!

అప్పుడు బౌద్ధులకు విరుద్ధముగా వాదింపఁబడిన ఆక్షేపణయే ప్రభవిల్లును. ఒకవేళ ఇట్టి అఖండత అసత్యమై కేవలము తాత్కాలికమైయున్నచో, ఆత్మయనునదే లేకుండెడిది. మనము సర్వసామాన్యమగు శూన్యసిద్ధాంతమునకు తిరిగి రావలసివచ్చును. ఒకవేళ అది కొంతవరకు సత్యమైయుండినచో, ఆత్మ పరిణామమునకు గుఱియగును. మఱియు ఆ కారణముచే అశాశ్వతము కావలసివచ్చును. దీనిచే జైనదృక్పథమునకు తావులేకుండును.

## 2-2-36 అంత్యావస్థితేశ్చోభయనిత్యత్వాదవిశేషః

ముక్తినొందినప్పుడు ఆత్మయొక్క అంత్య పరిమాణము శాశ్వతమై యుండుటచేతను మఱియు రెండు పూర్వపరిమాణములచే శాశ్వతత్వము సిద్ధించుటచేతను, ఎప్పుడు కూడా ఆత్మయొక్క పరిమాణమునందు భేదము లేదు.

అంత్యావస్థితేః = అంత్యపరిమాణము శాశ్వతమగుటచే, చ = మఱియు, ఉభయ నిత్యత్వాత్ = రెండున్నూ శాశ్వతమగుటచే, అవిశేషః = భేదము లేకుండుట.

జైన సిద్ధాంతములోని దోషములనుఁగూర్చి చర్చించుట పరిసమాప్తమైనది.

ఇంతేకాకుండా జైనులు స్వయముగా ఆత్మయొక్క అంత్యపరిమాణము శాశ్వతమైనదిగా అంగీకరింతురు. ఇది ముక్తదశయందు సంభవించును. దీనిచే దాని ప్రారంభ పరిమాణము మఱియు మధ్యవర్తిత్వ పరిమాణములు కూడా శాశ్వతములని తెలియుచున్నది. కావున ఈ మూడు పరిమాణములలో భేదము లేదు. ముక్తదశయందున్న ప్రత్యేకత ఏమి? జైనమతానుసారముగా ముక్తదశ యందు మఱియు లౌకిక దశయందేలాటి ప్రత్యేకభేదము లేదు. ఆత్మయొక్క వివిధ శరీరములొకే పరిమాణమును కలిగియుండును. మఱియు ఆత్మ పెద్ద శరీరమునందుఁగాని, చిన్న శరీరమునందుఁగాని ప్రవేశింపఁజాలదు. ఆత్మ ఎల్లప్పుడొకే పరిమాణము నందుండునని తలంపఁబడుచున్నది. అది సూక్ష్మమై యుండవచ్చును. లేక అనంతమై యుండవచ్చును. కాని శరీరములయొక్క నానావిధ పరిమాణములనుఁబట్టి యుండదు.

కావున శరీరపరిమాణము ననుసరించి ఆత్మయు విభిన్నమైయుండుననెడి జైనసిద్ధాంత మసంగతము మఱియు అనంగీకారమైయున్నది. బౌద్ధసిద్ధాంతమునకు మించిన యుక్తియుక్తతను కలిగి లేకుండుటచే ఇది పరిత్యజింపఁబడదగినదై యున్నది.

# 7. పత్యధికరణము

## (37-41 సూత్రములు)

### 2-2-37 పత్యురసామంజస్యాత్.

ఆ సిద్ధాంత మసమంజసమగుటచే పశుపతి ప్రపంచమునకు నిమిత్తకారణము కాజాలదు.

పత్యుః = పశుపతియొక్క, అసామంజస్యాత్ = అసమంజస కారణముచే.

పాశుపతులు, లేక మాహేశ్వరులను చతుర్విధములుగా విభజింప వచ్చును. (1)కపాల (2)కాలముఖ (3)పాశుపత (4) శైవ. వారి శాస్త్రము పంచవిధ నియమములను వర్ణించును. (1)కారణము (2) కార్యము (3) ధ్యానయోగము (4) విధి (5) దుఃఖాంతము అనగా మోక్షము. పశువు, లేక జీవుని బంధ

వివోచనమునకై ఈ నియమములు పశుపతిచే స్వయముగా వ్యక్త మొనర్పbబడినవి.

ఈ పద్ధతి యందు పశుపతి నిమిత్తకారణమగును. మహత్తు ఇత్యాదులు కార్యములగును. సగుణధ్యానముద్వారా పశుపతియందైక్యమగుటయే సంయోగమనcబడును. 'దినమునకు మూడుసార్లు స్నానమొనర్చుట, భస్మమును నొసట ధరించుట, అంగుళి ముద్రలను వేయుట, కంఠమునందు మఱియు భుజములయందు రుద్రాక్షలను ధరించుట, మానవుని తల పుఱ్ఱెయందు భుజించుట, కాల్చcబడిన మానవ శరీరముయొక్క బూడిదను దేహమునందు ధరించుట, ఒక సారాయి పాత్రయందు మునిగియున్న దేవతను ఆరాధించుట' – ఇవి వారికి విధులైయున్నవి. పశుపతిని ఆరాధించుట ద్వారా జీవాత్మ దేవుని సన్నిధి నొందును. అప్పుడు సమస్త కోరికలు మఱియు సమస్త దుఃఖములు ఉపశమించును. అదియే మోక్షమనcబడును.

ఈ మతము ననుసరించువారు ఈశ్వరుని నిమిత్తకారణముగా తలంతురు. మూల ప్రకృతిని వారీ ప్రపంచమునకు ఉపాదాన కారణముగా భావింతురు. దీనిచే బ్రహ్మము ప్రపంచమునకు నిమిత్తకారణము మఱియు ఉపాదాన కారణము కూడానై యున్నదనెడి శ్రుతి వాక్యమునకు వైరుధ్యము కలుగును. కావున పాశు పత సిద్ధాంతము అంగీకార యోగ్యము కాcజాలదు.

వేదాంతమతానుసారముగా పరమేశ్వరుడీ విశ్వమునకు ఉపాదాన కారణము మఱియు నిమిత్త కారణము కూడా నైయున్నాడు. నైయాయికులు, వైశేషికులు, యోగులు మఱియు మాహేశ్వరులు పరమేశ్వరుడు కేవలము నిమిత్తకారణమని పలుకుదురు. నైయాయికులు మఱియు వైశేషికుల మతానుసారముగా పరమాణువులు ఉపాదాన కారణమగును. ఇక యోగులు మఱియు మాహేశ్వరుల మతానుసారముగా ప్రధానము ఉపాదాన కారణమైయున్నది. తనకు భిన్నమైయున్న ప్రధానము మఱియు జీవుల కాతడు పరిపాలకుడై యున్నాడు.

ఈ దృక్పథము దోషయుక్తము మఱియు అసమంజసమైయున్నది. ఏలననగా దీనిచే దేవుడు కొందఱికి పాక్షికుడు, మరికొందఱికి ప్రతికూలుడు కావలసివచ్చును. కారణమేమనగా ఈ విశ్వమునందు కొందఱు ఐశ్వర్యవంతులుగను, మరి కొందఱు

దుఃఖపూరితులునైయున్నారు. ఈ భేదము కర్మవిభేదమునుంబట్టి ఏర్పడినదని నీవు చెప్పఁజాలవు. ఏలననగా ఒకవేళ దేవుడు కర్మకు నియామకుడై యున్నచో అవి పరస్పరము ఆధారాధేయములగును. పరస్పర ఆధారాధేయ దోషము సంభవించుటచే, దీనిని అనాది భూమికగా వర్ణింపఁజాలవు.

దేవుడొక ప్రత్యేకతగల జీవునిగా నీవు భావించుటచే నీ సిద్ధాంత మసమంజసమైయున్నది. దీనిచే అతడు సమస్తకర్మ రహితుడైయున్నాడని తెలియుచున్నది.

ఈ గ్రంథములోని పూర్వపాదమునందు సూత్రకారుడు స్వయముగా దేవుడీ ప్రపంచమునకు ఉపాదాన కారణము మఱియు నిమిత్త కారణము కూడానై యున్నాడని నిరూపించియున్నాడు.

దేవుడీ ప్రపంచమునకు కేవలము నిమిత్తకారణుడై యుండుట అసాధ్యము. ఏలననగా దీనిచే ప్రపంచముతో అతనికిఁగల సంబంధము నిరూపింపఁబడజాలదు. సామాన్యముగా ప్రాపంచిక జీవితమునందు కుండకు కేవలము నిమిత్తకారణుడై యున్న కుమ్మరివాడు కుండను రూపొందించు మట్టితో ఒక ప్రత్యేకమగు సంబంధమును కలిగియుండుటను మనముఁగాంచుచున్నాము.

'బహుస్యాం ప్రజాయేయేతి' (తై. ఉ. 2-6) ఇత్యాది శ్రుతులుద్ఘోషించుచున్నవి. దీనిచే పరమాత్ముడీ విశ్వమునకు నిమిత్తకారణము మఱియు ఉపాదాన కారణము కూడానై యున్నాడని తెలియుచున్నది.

## 2-2-38 సంబంధానుపపత్తేశ్చ.

ఏలననగా పరమాత్ముడు మఱియు ప్రధానము, లేక జీవుల మధ్య సంబంధము అసాధ్యమై యున్నది.

సంబంధ = సంబంధము, అనుపపత్తేః = అసాధ్యమగుటచే, చ = మఱియు.

పాశుపతమత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ప్రధానము మఱియు జీవులకు భిన్నుడైయున్న పరమేశ్వరుడు వాటితో ప్రత్యేక విధమగు సంబంధము లేకుండా వాటికి నియామకుడు కాజాలడు. పరమేశ్వరుడు ప్రధానము మఱియు జీవులు అనంతముగా పరివ్యాప్తమై

యుండుటచేతను మఱియు విభాగరహితమై యుండుటచేతను అది సంయోగము నొందఁజాలదు. కావున అవి అతనిచే పరిపాలింపఁబడజాలవు.

తంతుపటము (దారము, వస్త్రము) నందువలె అపరిచ్ఛిన్న మఱియు పరిచ్ఛిన్న సంబంధము, లేక ద్రవ్యగుణ సంబంధమగు సమవాయ సంబంధమున్నూ ఉండఁజాలదు. ఏలననగా ఈ విషయమునందు ఆధారాధేయము లేవియో నిర్వచించుట అసాధ్యమగును.

వేదాంతుల విషయమునందిట్టి క్లిష్టతలేదు. బ్రహ్మమీ ప్రపంచమునకు అభిన్ననిమిత్తోపాదాన కారణమై యున్నదని వారు పలుకుదురు. వారు తాదాత్మ్య సంబంధమును నిర్ణయింతురు. ఇంతే కాకుండా వారు శ్రుతులను ప్రమాణముగా స్వీకరింతురు. శ్రుతిని ఆధారముగాఁగొని వారు కారణస్వరూపము ఇత్యాదులను నిర్వచింతురు. కావున వారు ప్రతిపక్షు లొనర్చునట్లు తమ సిద్ధాంతములను కేవలము తమకు తోచినట్లుగా ప్రతిపాదించుటకు తలపెట్టరు.

దేవుడు సర్వజ్ఞుడని నిశ్చయించుటకు పాశుపతులు ఆగమములు (శ్రుతులు, తంత్రములు) ఆధారములై యున్నవని పలుకరు. ఇట్టి ప్రతిపాదనమునకు తార్కికసిద్ధ సాధనదోషము సంభవించును. ఏలననగా సర్వేశ్వరుని సర్వజ్ఞత శాస్త్రసిద్ధాంతముపైనను మఱియు శాస్త్రప్రామాణ్యము సర్వేశ్వరుని సర్వజ్ఞతపైనను ఆధారపడియున్నది.

ఈ కారణములన్నింటిచే పరమేశ్వరుడు ప్రమాణరహితుడని పలుకు సాంఖ్యయోగాది సిద్ధాంతములు అప్రమాణము లగును. వేదప్రామాణ్యములు కాని ఇట్టి ఇతర సిద్ధాంతములు తదనుగుణములగు వాద వివాదములచే ఖండింపఁబడును.

## 2-2-39 అధిష్ఠానానుపపత్తేశ్చ.

మఱియు పరమాత్ముని పరిపాలకత్వము అసాధ్యమగుటచే.

అధిష్ఠాన = పరిపాలకత్వము, అనుపపత్తేః = అసాధ్యమగుటచే, చ = మఱియు.

పాశుపత మతమునకు విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

నైయాయికుల వంటి తార్కికదార్శనికుల పరమేశ్వరుడు ఊహమాత్రుడు మఱియు అప్రతిపాదకుడగును. నైయాయికుల ఈశ్వర సిద్ధాంతమునందు మరియొక తార్కికదోషము కలదు. ఒక కుమ్మరివాడు మట్టితో కుండలను నిర్మించినట్లు పరమేశ్వరుడు ప్రధానాదుల సహాయముచే ఈ ప్రపంచమును సృష్టించునని వారు పలుకుదురు.

కాని ఇది అంగీకారయోగ్యము కాదు. ఏలననగా ప్రధానమునందు వర్ణము ఇత్యాది ఇతర గుణములు లేకుండుటచే అది దృశ్యవస్తువు కాదు. కావున అది మట్టివంటి పదార్థములకు పూర్తిగా విభిన్నమైయున్నది. కావున అది పరమేశ్వరుని కర్మకు విషయము కాఁజాలదు. పరమేశ్వరుడు ప్రధానమునకు నియామకుడు కాఁజాలడు.

ఈ సూత్రమునకు మరియొక అర్థము కూడా కలదు. ఈ ప్రపంచమునందు మనము శరీరుడగు రాజునే చూతుము, గాని అశరీరుడగు రాజును చూడఁజాలము. కావున పరమేశ్వరుడు కూడా తన అవయవములకు మూలాధారమైయున్న శరీరమును కలిగియుండవలసి యుండును. శరీరము సృష్టికి అనంతరము సంభవించునదగుటచే, పరమేశ్వరునికి మనము శరీరము నెట్లు ఆరోపింపఁ గలుగుదుము?

పరమేశ్వరునికి భౌతికమైన ఆధారము లేకుండుటచే, అతడు క్రియాశీలుడు కాకుండును. మఱియు కర్మకు భౌతికపదార్థ మావశ్యకమను విషయము మనకనుభవ సిద్ధమైయున్నది. సృష్టికి పూర్వము పరమేశ్వరుని అవయవముల కాధారముగా ఒకానొక శరీరమున్నదని తలంచుటయు పాడిఁగాదు. ఏలననగా ఒకవేళ పరమేశ్వరునికి శరీరమున్నచో, అతడు సామాన్యజీవులవలె విషయానుభవము నొందవలసివచ్చును. అప్పుడాతడు పరమేశ్వరుడుగా పరిగణింపఁబడఁజాలడు.

పరమేశ్వరుడు శరీరమును ధరించుట కూడా అసంగతమగును. కావున పశుపతి ప్రధానమునకు నియామకుడు కాఁజాలడు. పరమేశ్వరుడు శరీరమును ధరించుటచే ప్రపంచమున కాతడు నిమిత్తకారణుడగునని పలుకుటయు భ్రాంతి జనకమైయున్నది. శరీరమును ధరించిన కుమ్మరివాడు మట్టిచే కుండను రూపొందించుటను మనమీ ప్రపంచమునందుఁగాంచుచున్నాము. ఈ దృష్టాంత

ముచే పరమేశ్వడీ ప్రపంచమునకు నిమిత్తకారణుడని తలంతుమేని, అతనికి శరీరమున్నదని మనమంగీకరింప వలసివచ్చును. కాని శరీరములన్నియును నాశవంతములు. పాశుపతులు కూడా పరమేశ్వరుడు శాశ్వతుడని అంగీకరింతురు. శాశ్వతుడైన పరమేశ్వరుడు అశాశ్వతమైన శరీరమునందుండుననియు మఱియు ఈ విధముగా అతడు మరియొక కారణముపై ఆధారపడియుండుననియు పలుకుట అసంగతమగును. కావున పరమేశ్వరునికి శరీరమున్నదని తలంచుట భావ్యము కాదు.

అతనికి మరియొక అర్థము కూడా కలదు. ఇంతేకాకుండా అతనికొక ప్రత్యేక స్థలము లేదు. కుమ్మరివాడు మున్నగువారు భూమిపై నిలఁబడి తమ కార్యముల నొనర్తురు. వారు నిలఁబడుట కొక స్థానము కలదు. పశుపతికి అదియున్నూ లేదు.

## 2-2-40 కరణవచ్చేన్న భోగాదిభ్యః

ఒకవేళ దృశ్యమానములు కాని ఇంద్రియములకు జీవుడు నియామకుడై యున్నట్లు పరమేశ్వరుడు కూడా ప్రధానాదులకు నియామకుడై యున్నాడని పలికినచో, భోగము ఇత్యాది కారణములచే అట్లుకాదని మేము సమాధాన మొసంగుదుము.

కరణవత్ = ఇంద్రియములు కలదని, చేత్ = తలంపఁబడినచో, న = అది అంగీకరింపఁబడదు, భోగాదిభ్యః = భోగాదుల కారణముచే.

38వ సూత్రమునకు విరుద్ధమగు ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకాసమాధానము లనెడి రెండు విభాగములు కలవు. 'కరణవచ్చేత్' అనునది శంక. ఇఁక 'నభోగాదిభ్యః' అనునది సమాధానము.

పూర్వపక్షి ఇట్లనును : దృశ్యమానములు కాని విషయేంద్రియములను జీవుడెట్లు పరిపాలించునో, అట్లే పరమేశ్వరుడు ప్రధానాదులను పరిపాలించును.

జీవుడు సుఖదుఃఖముల ననుభవించుటచే, ఈ దృష్టాంతము సవ్యమైనది కాదు. ఒకవేళ ఈ దృష్టాంతము సత్యమగునేని, పరమేశ్వరుడు కూడా ప్రధానాదులచే సుఖదుఃఖానుభవము నొందవలసి వచ్చును. మఱియు దీనిచే అతడు తన దైవత్వము నుండి వంచితుడు కావలసివచ్చును.

## 2-2-41 అంతవత్త్వమ సర్వజ్ఞతావా.

వారి సిద్ధాంతముచే పరమేశ్వరునికి వినాశముఁగాని, లేక అసర్వజ్ఞత్వముఁ గాని ప్రాప్తించును.

అంతవత్త్వమ్ = వినాశము, అసర్వజ్ఞతా = అసర్వజ్ఞత్వము, వా = లేక.

40వ సూత్రములోని వాదమింకను ఖండిపఁబడుటతో పాశుపత సిద్ధాంతము నిషేధింపఁబడినది.

న్యాయ, పాశుపత, మాహేశ్వరాది మతసిద్ధాంతానుసారముగా పరమేశ్వరుడు సర్వజ్ఞుడు మఱియు శాశ్వతుడై యున్నాడు. పరమేశ్వరుడు, ప్రధానము మఱియు జీవులు అనంతములును, విభిన్నములునై యున్నవి. సర్వజ్ఞుడగు పరమేశ్వరునికి ప్రధానము, జీవుడు మఱియు తనయొక్క పరిమాణము తెలియునా? లేదా? ఒకవేళ వారి పరిమాణము పరమేశ్వరునికి తెలిసియున్నచో, అవి యన్నియు అంతవంతములగును. కావున అవి యన్నియును నశించు సమయము ఒకప్పుడేతెంచును. ఒకవేళ సంసారము నశించుటతో ప్రధానము లేకుండా పోయినచో, దేవుడు దేనికి మూలాధారమై యుండును? లేక, అతని సర్వజ్ఞత్వము దేనిపై పరివ్యాప్తమైయుండును? ఒకవేళ ప్రకృతి మఱియు జీవులు అంతవంతములై యున్నచో, వాటికి ఆది కూడా ఉండియుండవలయును. వాటికి ఆద్యంతములున్నచో, శూన్యవాదమున కవకాశమేర్పడును. వాటినిఁగూర్చి అతనికి తెలియకున్నచో, అతడేమాత్రము సర్వజ్ఞుడు కాకుండును. పరమేశ్వరుడు ప్రపంచమునకు కేవలము నిమిత్తకారణుడనెడి సిద్ధాంతము రెండు విధములగను అసంగతము, అసమంజసము మఱియు అనంగీకార యోగ్యమైయున్నది.

40వ సూత్రమునందు సూచింపఁబడినట్లుగా ఒకవేళ దేవునికి విషయేంద్రియములున్నవనియు మఱియు అతడు సుఖదుఃఖములకు గుఱియగుననియు అంగీకరింతుమేని, అతడొక సామాన్య మానవునివలె జననమరణముల నొందవలసివచ్చును. అప్పుడాతడు తన సర్వజ్ఞత్వమును కోల్పోవును. ఇట్టి రకమగు దేవుడు పాశుపతుల చేత కూడా అంగీకరింపఁ బడఁజాలడు. కావున దేవుడు ప్రపంచమునకు ఉపాదానకారణము కాదనెడి పాశుపత సిద్ధాంతము నంగీకరించుటకు వీలులేదు.

# 8. ఉత్పత్త్య సంభవాధికరణము

# (42-45 సూత్రములు)

## 2-2-42 ఉత్పత్త్య సంభవాత్.

పరమాత్ముని నుండి జీవాత్మ ఉత్పన్నమగుట అసంభవమగుటచే భాగవత, లేక పాంచరాత్ర సిద్ధాంతము అంగీకారయోగ్యము కాజాలదు.

ఉత్పత్తి = సృష్టి, అసంభవాత్ = అసాధ్యమగుటచే.

పాంచరాత్ర, లేక భాగవత సిద్ధాంత మిప్పుడు ఖండింపఁబడుచున్నది.

ఈ మతము ననుసరించి పరమేశ్వరుడీ విశ్వమునకు నిమిత్తకారణము మఱియు ఉపాదాన కారణము కూడా నైయున్నాడు. ఇది శ్రుతి సమ్మతమైయుండుటచే ప్రామాణికమై యున్నది. వీరి సిద్ధాంతములోని ఒక అంశము వేదాంత సిద్ధాంతమును పోలియున్నది. దీనిని మేమున్నూ అంగీకరింతుము. కాని ఈ సిద్ధాంతముయొక్క మరియొక అంశము ఆక్షేపణకాస్పదమైయున్నది.

శుద్ధజ్ఞానస్వరూపుడైన వాసుదేవుడు నిజమైన ఉనికిని కలిగియున్నాడని భాగవతులు పలుకుదురు. అతడు తనను స్వయముగా చతుర్విధములుగా విభజించుకొని వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధయనెడి చతుర్విధ వ్యూహములుగా రూపొందును. వాసుదేవుడు పరమాత్మను, సంకర్షణుడు జీవుని, ప్రద్యుమ్నుడు మనస్సును మఱియు అనిరుద్ధుడు అహంకారమును సూచించును. ఈ నలుగురు వాసుదేవుల నుండి పరమకారణమేర్పడును. ఇక దీని నుండి కార్యత్రయముత్పన్నమగును.

అభిగమనము (భక్తితో మందిరమున కేగుట), ఉపాదానము (పూజాసామగ్రిని సమకూర్చుట), ఇజ్యము (ఆహుతి), స్వాధ్యాయము (పవిత్ర గ్రంథ పఠనము, మంత్రోచ్చారణము), యోగము (ధ్యాననిష్ఠ) లచే వాసుదేవుని చిరకాలము భక్తితో ఆరాధించుటచే దుఃఖములు, చింతలు, బాధలు తొలగి

ముక్తినొందుటతో పరమపదము ప్రాప్తించునని వారు పలుకుదురు. ఈ సిద్ధాంతమును మేమున్నూ అంగీకరింతుము.

కాని సంకర్షణుడనఁబడు జీవుడు మున్నగువారు వాసుదేవుని నుండి జన్మించినారనెడి సిద్ధాంతమును మేమంగీకరింపము. ఇట్టి సృష్టి అసాధ్యము. ఒకవేళ ఇట్టి జన్మయున్నచో, ఒకవేళ జీవుడు సృష్టింపఁబడినచో అది నాశవంతమగును. మఱియు ఈ కారణముచే మోక్షమనునది లేకుండును. జీవుడు సృష్టిపఁబడజాలడను విషయము 2-3-17 వ సూత్రమునందు వివరింపఁబడును.

ఈ కారణముచే పాంచరాత్ర సిద్ధాంతము అంగీకారయోగ్యము కాఁజాలదు.

## 2-2-43 న చకర్తుః కరణమ్.

మఱియు ఉపకరణము కర్తచే ఉత్పన్నమగుటను మనముఁగాంచుట లేదు.

న = కాదు, చ = మఱియు, కర్తుః = కర్తనుండి, కరణమ్ = ఉపకరణము.

పాంచరాత్ర సిద్ధాంత విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

కర్తయగు కట్టెలు కొట్టువాని నుండి గొడ్డలి మున్నగు ఆయుధములు ఉత్పన్నమగుటను మనముఁ గాంచుట లేదు. కాని కర్తయగు జీవుని నుండి సంకర్షణుడు, దాని నుండి అంతఃకరణమగు మనస్సు (ప్రద్యుమ్నుడు), మనస్సు నుండి అహంకారము (అనిరుద్ధుడు) ఉత్పన్నమగునని భాగవతులు ప్రబోధింతురు.

మనస్సు ఆత్మకు ఉపకరణము వంటిది. ఉపకరణము కర్తనుండి ఉత్పన్నమగుట మనమెచ్చటనుఁగాంచము. లేక, మనస్సు నుండి అహంకారము జనించుటయు మన మంగీకరింపఁజాలము. ఈ సిద్ధాంతము అంగీకారయోగ్యము కాదు. అనుభవజ్ఞానములేని ఇట్టి సిద్ధాంతము నిర్ణయింపఁబడజాలదు. దీనికనుకూలమగు ఏలాటి శ్రుతివాక్యము మనకు కానఁబడదు. ప్రతిపదార్థము బ్రహ్మము నుండి ఉత్పన్నమగునని శ్రుతి నిరూపించుచున్నది.

## 2-2-44 విజ్ఞానాది భావే వా తదప్రతిషేధః

ఒకవేళ ఈ నాలుగు వ్యూహముల కనంతజ్ఞానము కలదని చెప్పినను, 42వ సూత్రములోని ఆక్షేపణ కడ్డు లేకుండును.

విజ్ఞానాదిభావే = ఒకవేళ విజ్ఞానాదులను కలిగియున్నచో, వా = లేక, తత్ = దానికి, అప్రతిషేధః = నిషేధము లేదు.

పాంచరాత్ర సిద్ధాంతమునకు విరుద్ధమగు వాదము కొనసాగుచున్నది.

ఒకవేళ వ్యూహములన్నియును విజ్ఞానము కలిగియున్న దేవతలని వారు పలికినను, ఈ సిద్ధాంతమునందు దోషముండియే యుండును.

సమస్త రూపములు పరమాత్ముడైన వాసుదేవుడేయనియు, అవి యన్నియును జ్ఞానము, ప్రభుత్వము, బలము, శక్తి మున్నగువాటిని కలిగియున్నవనియు, అవి దోషములు మఱియు అసంపూర్ణతల నుండి విముక్తములై యున్నవనియును భాగవతులు పలుకవచ్చును.

అట్లయినచో అనేక ఈశ్వరుల ఉనికికి అవకాశమేర్పడును. అప్పుడు నిజమైన సత్యస్వరూపుడు పవిత్రుడైన ఒకేయొక వాసుదేవుడని పలుకు నీ స్వసిద్ధాంతమునకు విరోధమేర్పడును. సమస్త కార్యములు ఒకే పరమాత్మునిచే చేయఁబడును. అట్టియెడల నలుగురు ఈశ్వరులేల యుండవలయును?

ఇంతేకాకుండా కారణమెల్లప్పుడు కార్యముకంటె గొప్పదగుటచేతను, భాగవతమతానుసారముగా అవి యన్నియును సమానమగుట చేతను ఒకదాని నుండి మరియొకటి ఉత్పన్నమగుట కవకాశము లేదు. కార్యకారణములలో కారణమున కాధిక్యత యుండుట మన కనుభవసిద్ధమైన విషయము. ఉదాహరణమునకు మట్టి మఱియు కుండలలో కార్యముకన్న కారణమెక్కువ ఆధిక్యతను కలిగియుండును. ఇట్టి ఆధిక్యత లేకున్నచో, వీటిమధ్య సంబంధము అసాధ్యమగును. వాసుదేవుడు మఱియు ఇతర దేవతలకు మధ్య జ్ఞానము, శక్తి మున్నగు విషయములలో భాగవతులు ఆధిక్యతా భేదమును పాటింపరు. కాని అవి యన్నియు ఏలాటి ప్రత్యేక విభేదములేని వాసుదేవుని రూపములని మాత్రము వారు పలుకుదురు.

ఇఁక ఆబ్రహ్మస్తంబ పర్యంతము పరమేశ్వరుని వ్యక్తీకరణమగుటచే, వాసుదేవుని రూపములు కేవలము నాలుగేయని చెప్పనేల? సమస్త ప్రపంచము వాసుదేవుని వ్యూహమేయని చెప్పవలసియుండును.

## 2-2-45 విప్రతిషేధాచ్చ.

పరస్పర ఖండనల కారణముచే పాంచరాత్ర సిద్ధాంతము అసంగతమగును.

విప్రతిషేధాత్ = పరస్పర ఖండనచే, చ = మఱియు.

ఇచ్చట భాగవత సిద్ధాంత విరుద్ధమగు వాదము పరిసమాప్తమైనది.

పాంచరాత్రసిద్ధాంతమునందు ఇతరములగు అనేక ఖండనలు, పరస్పర వైరుధ్యములు కాననగును. జ్ఞానము, ఐశ్వర్యము, శక్తి, బలము, వీర్యము, తేజస్సులు గుణములుగా వివరింపఁబడినవి. మరియొకచోట అవి తిరిగి ఆత్మలుగా, వాసుదేవులుగా పరిగణింపఁబడినవి. వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు మఱియు అనిరుద్ధులకు భిన్నుడని అది నుడువును. ఐనను ఇవి యన్నియు వాసుదేవుడేయని మరల పలుకును. కొన్ని సమయములలో ఈ నాలుగు రూపములు ఆత్మయొక్క గుణములని పలుకును. మరికొన్ని వేళలలో అది స్వయముగా ఆత్మయేయని చెప్పును.

ఇంతేకాకుండా వేదవిరుద్ధములగు వాక్యములిందు కాననగును. వేదతిరస్కారములగు శబ్దములిందు కలవు. మోక్షసాధనము వేదములయందు లేకుండుటనుఁగాంచి శాండిల్యుడు పాంచరాత్ర సిద్ధాంతమును నెలకొల్పెనని అది పలుకును. వేదములలో పరమానందము లభ్యము కాకుండుటచే శాండిల్యుడీ శాస్త్రము నధ్యయనమొనర్చెను.

ఈ కారణముచేత కూడా భాగవతసిద్ధాంతము అంగీకారయోగ్యము కాజాలదు. ఈ సిద్ధాంతము శ్రుతులన్నింటికి విరుద్ధముమై యుండుటచేతను, వాటిచే ఖండింపఁబడుటచేతను మఱియు వివేకులకు జుగుప్సను కలిగించు నదగుటచేతను ఇది గౌరవస్థానమునలంకరింపదు.

ఈ విధముగా ఈ పాదమునందు సాంఖ్య, వైశేషిక మార్గములు మఱియు పాంచరాత్ర సిద్ధాంతాదులు కంటకావృతములు మఱియు దోషయుక్తములై యున్నవనియు, ఇఁక వేదాంతమార్గము ఈ దోషములన్నింటిచే విముక్తమై యున్నదనియు మఱియు ముక్తిని, పరమపదమును వాంఛించు ప్రతివ్యక్తియు అనుసరించుటకు యోగ్యమైనదనియును వర్ణింపఁబడినది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**ద్వితీయోధ్యాయ ద్వితీయ పాదము**

**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## ద్వితీయాధ్యాయము

## 3వ పాదము

## పీఠిక

పూర్వపాదమునందు వేదాంతమత విరుద్ధములగు నానావిధ సిద్ధాంతముల అసంగతత్వము నిరూపింపఁబడినది. ఇతర సిద్ధాంతములయొక్క అసంగతత్వము మఱియు అయోగ్యతను నిరూపించిన అనంతరము వేదాంత సూత్రములకు కర్తయైన శ్రీ వ్యాసులవారు, శ్రుతి సిద్ధాంతమునందుఁగల తాత్కాలిక ఖండనలు మఱియు అసంగతత్వములనుఁగూర్చి వర్ణించుచున్నారు. ఏలననగా భూతములు, ఇంద్రియములు మున్నగువాని ఉత్పత్తి సిద్ధాంతమునందు నానావిధములగు వైరుద్ధ్యములు మనకు గోచరించును.

పరస్పర ఖండనల కారణముచే ఇతర దార్శనిక సిద్ధాంతములు నిర్వీర్యములై యున్నవను విషయము ఇప్పుడు మనకవగతమైనది. ఆంతరిక ఖండనల కారణముచే వేదాంత సిద్ధాంతము కూడా నిర్వీర్యమైనదే యను సంశయము మనకు కలుగవచ్చును. కావున సృష్టినిఁ గూర్చి వివరించు వేదాంత వాక్యములలోని సమస్త సంశయములను నివారించి, పాఠకుల మనస్సులలోని సందేహమును నివర్తింపఁజేయుటకై నూతనమగు చర్చ ఆరంభింపఁబడుచున్నది. ఆరంభమునందు

ఆకాశమునకు మూలమున్నదా? లేదా? యను విషయము మనకు చర్చనీయాంశమైయున్నది.

3 మఱియు 4 పాదములలో శ్రుతిగ్రంథములోని తాత్కాలిక ఖండనలు అందముగా అమర్చఁబడి, సరిపుచ్చఁబడినవి. ప్రారంభమునందు పూర్వపక్షి యొక్క శ్రుతిగ్రంథములోని స్వపక్షఖండనను నిరూపించు ప్రయత్నమునకు సంబంధించిన వివాదమొసంగఁబడినది. అనంతరము సిద్ధాంతి దానిని ఖండించును.

# సారసంగ్రహము

రెండవ అధ్యాయములోని మూడవ పాదమునందు శ్రుతి ప్రబోధమగు ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి యనెడి పంచమూలభూతములయొక్క సృష్టినిగూర్చిన వివరమొసంగఁబడినది. ఈ భూతములకు మూలమున్నదా? లేదా? లేక, అవి బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నవా? లేక ఆయా సమయములలో అవి బ్రహ్మమునుండి ఉత్పన్నమై తిరిగి బ్రహ్మమునందు లయించునా? యనెడి సంశయమిందు చర్చింపఁబడినది. జీవుని యొక్క సారస్వరూపము కూడా ఇందు నిశ్చయింపఁబడినది.

మొదటి ఏడు అధికరణములు పంచమహాభూతములనుఁగూర్చి చర్చించును.

**1వ అధికరణము (1-7 సూత్రములు)** : ఆకాశము బ్రహ్మముతో సమానముగా శాశ్వతము కాదనియు. అది బ్రహ్మము యొక్క ప్రథమ సృష్టియనియును ప్రబోధించును. ఛాందోగ్యమునందు ఆకాశము సూచింపఁబడకున్నను, ఆకాశము యొక్క చేరిక ఊహింపఁబడును.

**2వ అధికరణము (8వ సూత్రము)** : ఆకాశమునండి వాయువు ఉత్పన్నమగునని సూచించును.

**3వ అధికరణము (9వ సూత్రము)** : బ్రహ్మమునకు మూలముండుట అసాధ్యమగుటచేతను మఱియు అది న్యాయ విరుద్ధమగుటచేతను బ్రహ్మమునకు ఉత్పత్తిస్థానము లేదని ప్రబోధించును.

**4,5,6 అధికరణములు (10, 11, 12 సూత్రములు)** : వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథ్వి జనించినవని ప్రబోధించును.

**7వ అధికరణము (13వ సూత్రము)** : ఒక భూతమునుండి మరియొక భూతము జనించుటకు కారణము స్వయముగా ఆ భూతము కాదనియు, కాని దానియందుండి పనిచేయుచున్న బ్రహ్మమేయనియు ప్రబోధించును. నిజమునకు వాటియందంతర్నిహితమైయున్న బ్రహ్మమే భూతవ్యాప్తికి కారణమైయున్నది.

**8వ అధికరణము (14వ సూత్రము)** : సృష్టికి వ్యతిరేకక్రమమునందు భూతములు బ్రహ్మమునందు లయించునని తెలుపును.

**9వ అధికరణము (15 సూత్రము)** : ప్రాణము, మనస్సు మఱియు ఇంద్రియముల యొక్క సృష్టి లయములచే భూతముల యొక్క సృష్టిలయముల క్రమము బాధింపఁబడదని ప్రబోధించును. ఏలననగా అవి కూడా బ్రహ్మము నుండియే సృష్టింపఁబడినవి. మఱియు భూతముల స్వభావము ననుసరించి యుండును. కావున అవి ఆయా భూతములతో పాటు సృష్టింపఁబడి లయము నొందుచుండును.

ఈ పాదము యొక్క శేషభాగమునందు జీవుని యొక్క ప్రత్యేక స్వభావమునుఁగూర్చి వివిధములగు శ్రుతులు నుడువుచున్నవను విషయము వర్ణింపఁబడినది.

**10వ అధికరణము (16 సూత్రము)** : "రామకృష్ణుడు జన్మించెను", "రామకృష్ణుడు మరణించెను" అను వాక్యములు కేవలము శరీరమునకే చెందియున్నవనియు మఱియు శరీరముతో ఆత్మ సంబంధించి యున్నంతవరకవి ఆత్మపై ఆరోపింపఁబడుననియును వివరించును.

**11వ అధికరణము (17వ సూత్రము)** : శ్రుతి మతానుసారముగా జీవుడు నిత్యుడు, శాశ్వతుడై యున్నాడని ప్రబోధించును. కావున అది సృష్టికాలమునందు బ్రహ్మమునుండి ఆకాశము మఱియు ఇతర భూతములవలె సృష్టింపఁబడునట్టిది కాదు. నిజమునకు జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నాడు. కేవలము ఆత్మకు సంబంధించిన ఉపాధులగు మనస్సు, శరీరము, ఇంద్రియాదులు మాత్రమే సృష్టింపఁబడును. ఇంతే కాకుండా ఈ సంబంధము మిథ్యామాత్రమైయున్నది.

**12వ అధికరణము (18వ సూత్రము)** : జీవుని స్వరూపమును గూర్చి వర్ణించును. విజ్ఞానమే జీవునికి సారమైయున్నదని ఈ సూత్రము వెల్లడించును.

**13వ అధికరణము (19-32 సూత్రములు)** : జీవుడు అణువువంటి సూక్ష్మమైన పరిమాణముఁ గలవాడా? లేక, సర్వవ్యాపకుడా? అను ప్రశ్ననుఁగూర్చి విస్తరించును. 19-28 సూత్రములలో పూర్వపక్షి మతానుసారముగా జీవుడు అణుస్వరూపుడని సూచింపఁబడును. ఇఁక 29వ సూత్రమునందు జీవుడు సర్వవ్యాపకుడనెడి సిద్ధాంతము నిర్ణయింపఁబడును. జీవుడు సంసారమునందు తగుల్కొని యున్నంతవరకు అణుపరిమాణముఁగల అంతఃకరణములోని గుణములచే అతడావరింపఁబడియుండుటచే, కొన్ని శ్రుతివాక్యములలో అతడణుస్వరూపుడని చెప్పఁబడినది.

జీవుడు సంసారమునందున్నంతవరకు బుద్ధిగ్రస్తుడైయుండుటచే అతడణుస్వరూపుడుగా చెప్పఁబడునని 30వ సూత్రము వివరించును.

సుషుప్త్యవస్థయందు జీవుడు సూక్ష్మరూపమునందు బుద్ధితో సంబంధముఁ గలవాడై యుండుననియు, ఇఁక జాగ్రదవస్థయందా సంబంధము నిజముగా వ్యక్తమగుననియును 31వ సూత్రము సూచించును.

ఒకవేళ బుద్ధికి అస్తిత్వమే లేకుండినచో నిరంతరము దృశ్యముండుటఁగాని, లేక నిరంతరము దృశ్యము లేకుండుటఁగాని సంభవించెడిదని 32వ సూత్రము సూచించును.

**14, 15వ అధికరణములు (33-40 సూత్రములు)** : జీవుడు కర్తయా? కాదా? యని విమర్శించి, అతని కర్తృత్వమును సూచించును.

33-39 సూత్రములు జీవుడు కర్తయని వర్ణించెను. కర్మోపకరణములగు బుద్ధి మున్నగు వాటిచే సంబంధించియున్నప్పుడు జీవుడు కర్తయనఁబడును. ఒక వడ్లవాడు తన పనిముట్లను ఉపయోగించుకొను నంతవరకు పనిచేసి, వాటిని ఒక ప్రక్కకు పెట్టినప్పుడెట్లు విశ్రమించునో, అట్లే జీవుడు తన ఉపకరణములతో సంబంధించి లేనప్పుడాతడు కర్త కానేరడని 40వ సూత్రము సూచించును.

**16వ అధికరణము (41-42 సూత్రములు)** : జీవుని కర్తృత్వము పరమాత్మని అధీనమునందు అతనిచే జీవుడు నియమింపఁబడునని ప్రబోధించును. పూర్వజన్మలలో జీవుడొనర్చిన సుకృత, దుష్కృత కర్మలను బట్టి పరమాత్ముడాతనిని ఎల్లప్పుడు నియమించును.

**17వ అధికరణము (43-53 సూత్రములు)** : జీవునికి బ్రహ్మముతోఁగల సంబంధమునుఁగూర్చి నుడువును.

జీవుడు బ్రహ్మము యొక్క ఒక అంశమని 43వ సూత్రము ప్రతిపాదించును. జీవుడు ఉపాధులతో కూడియున్నను అతడు పరమాత్మయే యనెడి "అవచ్ఛేదవాదము"నుఁగూర్చి ఈ సూత్రము వర్ణించును.

ప్రతిబింబము చలించినను సూర్యుడెట్లు విచలితుడు కాడో, అట్లే జీవుడనుభవించు సుఖదుఃఖముచే పరమాత్ముడు ప్రభావితుడు కాడని ఈ క్రింది సూత్రములు సూచించును.

శంకర మతానుసారముగా "అంశ" యనునది "అంశ ఇవ" యని అర్థమొనర్చుకొనఁబడవలయును. విశ్వవ్యాప్తమగు అఖండబ్రహ్మమునందు నిజముగా విభాగములు లేవు. కాని ఉపాధుల కారణముచే అది విభజింపఁబడినట్లు కానఁబడును.

జీవుడు నిమ్నోన్నత శరీరములతో సంబంధించియున్నప్పుడు శాస్త్రవిధులను మఱియు నిషేధములను పాటింపవలసియుండునని 47వ సూత్రము ప్రబోధించును. అగ్ని ఏకమేయైయున్నను దహనగుండములోని అగ్ని నిషేధింపఁబడి, యజ్ఞములోని అగ్ని అంగీకరింపఁబడును. ఈ విషయమే ఆత్మయందును వర్తించును. ఆత్మ శరీరముతో తాదాత్మ్యము నొందియున్నప్పుడు నైతికసూత్రములను పవిత్రాపవిత్ర భావములను పాటింపవలసియుండును.

కర్మలు, లేక దోషపూరితమగు కర్మలయందు గజిబిజి లేదని 49వ సూత్రము సూచించును. ఒకే సమయమునందు జీవుడు శరీరములన్నింటితో సంబంధమును కలిగిలేడు. అతడొకే శరీరముతో సంబంధమును కలిగియుండి కేవలము దాని ప్రత్యేకములగు ధర్మములతో ప్రభావితుడగును.

బుద్ధియందు పరమాత్మ ప్రతిబింబింపఁబడినప్పుడాతడు జీవుడనఁబడుననెడి ఆభాసవాదము లేక ప్రతిబింబ వాదమునుఁగూర్చి 50వ సూత్రము ప్రతిపాదించును.

సాంఖ్యదర్శనమునందు జీవుడు సర్వవ్యాపకుడుగా నిర్దేశింపఁబడెను. ఒకవేళ ఈ దృక్పథము నంగీకరించినచో కార్యములు మఱియు వాటి ఫలితములనుఁ గూర్చిన సంభ్రమమేర్పడును. కావున సాంఖ్యుల యొక్క ఈ దృక్పథము అనుచితమగు నిర్ణయము నొసంగును.

# 1. వియదధికరణము

## (1-7 సూత్రములు)

### 2-3-1 న వియ దశ్రుతేః

శ్రుతి నుడువకుండుటచే ఆకాశము సృష్టింపఁబడలేదని పూర్వపక్షి పలుకును.

న = కాదు, వియత్ = ఆకాశము, అశ్రుతేః = శ్రుతి నుడువకుండుటచే.

ఆకాశము సృష్టింపఁబడకుండుటచే అది బ్రహ్మమునుండి ఉత్పన్నము కాలేదని పూర్వపక్షి వాదించును. ఈ బాహ్యదృక్పథము తర్వాతి సూత్రమునందు ఖండింపఁబడినది.

సృష్టినిఁగూర్చి చర్చించు పాఠ్యభాగముచే ఇది ఆరంభింపఁబడినది. ఆకాశము సృష్టింపఁబడలేదని పూర్వపక్షి పలుకును. శ్రుతి అగ్నియొక్క సృష్టినిఁగూర్చి "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తేజోఽసృజత" (ఛాం. ఉ. 6-2-3) అని సూచించినను, ఆకాశము సృష్టింపఁబడుటనుఁ గూర్చి పలుకకుండుటచే అది శాశ్వతమైయున్నది. బ్రహ్మముచే ఆకాశము సృష్టింపఁబడుట ఇచ్చట సూచింపఁబడలేదు. అతీంద్రియ పదార్థ జ్ఞానమునకై మనకు కేవలము శాస్త్రవాక్యమే ప్రమాణమగుట చేతను మఱియు ఆకాశము సృష్టింపఁబడినట్లు శాస్త్రవచనము లేకుండుటచేతను ఆకాశమునకు మూలము లేదని మనము తలంపవలసియున్నది. కావున ఆకాశమునకొక ఆధారము లేదు. అది శాశ్వతమై యున్నది.

వేదాంత గ్రంథములలో నానా పదార్థముల మూలములనుఁగూర్చి అనేక స్థలములలో అనేక ప్రామాణిక వాక్యములు మనకు కానఁబడును. కొన్ని

గ్రంథములు ఆకాశము మఱియు వాయువు సృష్టింపఁబడినవని పలుకును. మరికొన్ని అట్లు పలుకవు. జీవుడు మఱియు ప్రాణవాయువులనుఁగూర్చి మరికొన్ని గ్రంథములు సమానమైన అభిప్రాయము నొసంగును. శ్రుతులలోని మరికొన్ని స్థలములలో సృష్టి క్రమమునుఁగూర్చి పరస్పర వైరుధ్యమును కలిగియున్నవి.

## 2-3-2 అస్తితు

కాని ఆకాశము సృష్టింపఁబడినట్లు ఒక శ్రుతి ప్రమాణమున్నది.

అస్తి = ఉన్నది, తు = కాని.

1వ సూత్రములోని ఖండన పాక్షికముగా తొలగింపఁబడినది.

పూర్వసూత్రములోని సంశయమును నివారించుటకై "తు" యనెడి శబ్ద మీ సూత్రమునందు ప్రయోగింపఁబడినది.

కాని ఈ విషయమును స్పష్టముగా విశదీకరించు శ్రుతివాక్యమొకటి కలదు. ఆకాశము యొక్క మూలమునుఁగూర్చి ఛాందోగ్యమునందు ప్రామాణిక వాక్యము లేకున్నను, అది సృష్టింపఁబడినట్లు తైత్తిరీయ శ్రుతివాక్య మొకటి కలదు. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః"- "ఆత్మ (బ్రహ్మము)నుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృథ్వియు సంభవించినవి" (తై. ఉ. 2-1).

## 2-3-3 గౌణ్య సంభవాత్

ఆకాశముయొక్క సృష్టి అసాధ్యమగుటచే, ఆకాశము యొక్క సృష్టికి సంబంధించిన శ్రుతివాక్యము గౌణమై యున్నది.

గౌణి = గౌణార్థమునందు ప్రయోగింపఁబడినది, అసంభవాత్ = అసంభవమగుటచే.

2వ సూత్రమునకు విరుద్ధమైన ఆక్షేపణ ఇచ్చట ఒసంగఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును : ఆకాశము సృష్టింపఁబడఁజాలకుండుటచే, పూర్వ సూత్రమునందు తైత్తిరీయ శ్రుతి సూచించినట్టి ఆకాశముయొక్క సృష్టిని గౌణముగా గ్రహింపవలయును. దానియందు విభాగములు లేవు. అందుచే అది సృష్టింపఁ బడఁజాలదు.

ఆకాశము సృష్టింపఁబడు విషయమును వైశేషికులు నిషేధింతురు. సృష్టికి మూడు విషయము లావశ్యకములని వారు పలుకుదురు. (1)సమవాయి కారణము (సంయుక్త కారణము). (2) అసమవాయి కారణము (అసంయుక్త కారణము), (3) నిమిత్తకారణము (మానవుని కర్తృత్వము). ఒక వస్త్రమును నేయుటకు దారములు, వాటి సంయుక్తత మఱియు ఒక సాలెవాడు ఆవశ్యకమై యుండును. ఆకాశమునందిట్టి కారణము లుండవు.

అగ్నికి పూర్వము మనమొక ప్రకాశరాహిత్య స్థితిని నిర్దేశించునట్లు, ఆకాశమునకు ఆకాశరాహిత్య స్థితిని మనము నిర్దేశింపఁజాలము.

ఇంతేకాకుండా భూమ్యాదులకు భిన్నముగా ఆకాశము సర్వవ్యాపకమై యుండుటచే, అది సృష్టింపఁబడి యుండకుండును. అది శాశ్వతమైనది, దానికి మూలములేదు.

"స్థలము చేయుము", "అచ్చట స్థలమున్నది" అను వాక్యములో ఆకాశ శబ్దము గౌణార్థమునందు ప్రయోగింపఁబడినది. ఆకాశము ఏకైకమై యున్నను ఘటాకాశము, మఠాకాశమని పలుకునప్పుడది నానారూపములుగా కల్పింపఁబడుచున్నది. "ఆకాశములో క్రూరమృగములను నివసింపఁజేయు వాడాతడే"యని వేద వాక్యము కూడా కలదు. కావున ఆకాశముయొక్క సృష్టినిఁగూర్చి పలుకు శ్రుతి విభాగములు కూడా గౌణార్థమునందు ప్రయోగింపఁబడినవని మా నిశ్చయము.

## 2-3-4 శబ్దాచ్చ

మఱియు శ్రుతివాక్యములలో కూడా ఆకాశము శాశ్వతమను విషయమును మనముఁగాంచుచున్నాము.

శబ్దాత్ = శ్రుతివాక్యములచే, చ = కూడా.

2వ సూత్రమునకు విరుద్ధమైన ఆక్షేపణ ఇచ్చట చెప్పఁబడినది.

పూర్వసూత్రమునందు ఆకాశము శాశ్వతమని సూచింపఁబడినది. అది శాశ్వతమని నిరూపించుటకై పూర్వపక్షి ఈ సూత్రమునందొక శ్రుతివాక్యమును పేర్కొనుచున్నాడు. ఆకాశము సృష్టింపఁబడలేదనియు, దానికి మరియొక కారణము

లేదనియు, శ్రుతి వర్ణించుచున్నట్లు అతడు సూచించును. "వాయుశ్చాంతరిక్షం చైతదమృతమ్" (బృ. ఉ. 2-3-3) అమరమైనదానికి మూలముండదు.

"ఆకాశవత్సర్వగతశ్చనిత్యః" యనెడి మరియొక శ్రుతివాక్యమున్నూ కలదు. బ్రహ్మముయొక్క ఆ రెండు గుణములు ఆకాశమునకు కూడా చెందియున్నవని ఈ వాక్యము సూచించుచున్నది. కావున ఆకాశమునకు మూలము ఆరోపింపబడఁజాలదు.

ఇతరములగు శ్రుతివాక్యము లేవనగా "ఆకాశము అనంతమైనట్లే, ఆత్మయు అనంతమని తెలిసికొనవలయును." "బ్రహ్మమునకు శరీరమే ఆకాశము, ఆకాశమే ఆత్మ". ఒకవేళ ఆకాశమున కాదియున్నచో ఒక కమలమునకు నీలిరంగువలె అది బ్రహ్మమున కారోపింపఁబడఁజాలదు.

కావున శాశ్వతమైన బ్రహ్మము ఆకాశమువంటి స్వభావమును కలిగియున్నది. ఇది పూర్వపక్షియొక్క దృష్టియై యున్నది.

## 2-3-5 స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్

బ్రహ్మశబ్దమువలె "సంభూతః" యను శబ్దము గౌణముగను, ప్రధానముగను ప్రయోగింపఁబడుట సాధ్యమగును.

స్యాత్ = సాధ్యమగును, చ = కూడా, ఏకస్య = ఒకే శబ్దము యొక్క, బ్రహ్మశబ్దవత్ = బ్రహ్మశబ్దమువలె.

పై ఆక్షేపణను పూర్వపక్షి బలపఱచుచున్నాడు.

పూర్వపక్షి ఇట్లనును : "ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః, ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః" (తై. ఉ. 2-1) అను వాక్యములోని "సంభూతః" యను ఒకే శబ్దము ఆకాశము ననుసరించి గౌణముగను, వాయువు-అగ్న్యాదుల ననుసరించి ముఖ్యముగను ప్రయోగింపవచ్చును. ఇదే విధముగా ఇతర శ్రుతులలో "బ్రహ్మమ"ను శబ్దము ప్రయోగింపఁబడిన దానిని సూచించుచు అతడు తన సిద్ధాంతమును బలపఱచును. "తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ, తపో బ్రహ్మేతి" (తై. ఉ. 3-2). ఇచ్చట బ్రహ్మము ఒకే వాక్యమునందు ముఖ్యముగను, గౌణముగను ప్రయోగింపఁబడినది.

బ్రహ్మమనెడి ఒకే శబ్దము బ్రహ్మమును తెలిసికొనుటకు సాధనమైన తపస్సును సూచించు అర్థాలంకారముగను మఱియు జ్ఞేయవస్తువైన బ్రహ్మముగను ప్రయోగింపఁబడినది.

మఱియు "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" (తై. ఉ. 3-2) "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" (తై. ఉ. 3-6) ఇచ్చట బ్రహ్మము రెండు పూరక వాక్యములలో క్రమముగా గౌణముగను ముఖ్యముగను ప్రయోగింపఁబడినది.

సిద్ధాంతి ఇట్లనును : ఐతే "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" యనెడి సిద్ధాంతమును సప్రమాణముగా ఋజువుపఱచుటెట్లు? ఏలననగా ఒకవేళ ఆకాశము శాశ్వతముగా బ్రహ్మముతో కలిసియున్న రెండవ పదార్థమై యున్నచో, బ్రహ్మమునందు ద్వైతమున్నదని తెలియుచున్నది. అట్లయినచో "యేన అవిజ్ఞాతం విజ్ఞాతం భవతి" (ఛాం. ఉ. 6-3) అనెడి వాక్యమెట్లు సమంజసము కాఁగలుగును?.

"ఏకమేవ" యను శబ్దములు కార్యములను సూచించుటకై ప్రయోగింపఁ బడినవని పూర్వపక్షి సమాధానమొసంగును. ఏ విధముగానైతే ఒక మానవుడు ఒక కుమ్మరివాని ఇంటిలో మట్టిముద్ద, కఱ్ఱ, చక్రము ఇత్యాదులను ఈ రోజు చూచి, రెండవ రోజు అనేకములగు కుండలనుఁగాంచి నిన్నటి రోజు మట్టి మాత్రమే ఉండెనని పలికినప్పుడు కార్యములైన కుండలు లేకుండెనను అభిప్రాయమును ఎట్లు వెలిబుచ్చునో మఱియు కుమ్మరివాని చక్రమునుఁగాని, కఱ్ఱనుఁగాని ఎట్లు నిషేధింపడో అట్లే ఈ వాక్యమునందు ప్రపంచమున కుపాదాన కారణమైయున్న బ్రహ్మమునకు మరియొక కారణము లేదని సూచింపఁబడినది. "అద్వితీయమ్" అను శబ్దముచే ఆకాశముయొక్క శాశ్వతత్వము నిషేధింపఁబడును. పాత్రలకు ఉపాదాన కారణమైయున్న మట్టితోపాటు నిర్వహణాధికారియగు కుమ్మరివాడు కూడా ఉనికిని కలిగియున్నాడు. కాని విశ్వమునకు ఉపాదాన కారణమైయున్న బ్రహ్మమునకు వేఱుగా మరియొక నిర్వహణాధికారి లేదు.

పూర్వపక్షి ఇంకను వాదించునదేమనగా :- ఆకాశముయొక్క ఉనికిచే రెండు పదార్థముల యొక్క ఉనికిని మనము గ్రహింపరాదు. ఏలననగా భిన్నమైన పదార్థములున్నప్పుడు మాత్రమే ఒక సంఖ్య ఏర్పడును. సృష్టికి పూర్వము బ్రహ్మమునకు మఱియు ఆకాశమునకిట్టి విభేదములేదు. ఏలననగా ఈ రెండున్నూ

సర్వవ్యాపకములు మరియు అనంతములై యున్నవి. ఇంతేకాదు ఇవి కలుపఁబడిన పాలు, నీరు వలె అవిభాజ్యములై యున్నవి. కావుననే శ్రుతి "ఆకాశ శరీరం బ్రహ్మ" యని పలికినది. అనగా ఈ రెండున్నూ తాదాత్మ్యములై యున్నవని గ్రహింప వలయును.

ఇంతేకాకుండా సృష్టింపఁబడిన పదార్థము లన్నియును బ్రహ్మముతో ఏకత్వము నొందియున్న ఆకాశముతో ఏకత్వము నొందియున్నవి. కావున కార్యసహిత బ్రహ్మము తెలియఁబడినచో, ఆకాశము కూడా తెలియఁబడును.

ఈ విషయము ఒక గిన్నెలోని పాలలో కొన్ని నీటిబిందువులను పడవేయుటను పోలియున్నది. పాలు త్రాగఁబడినప్పుడు ఈ నీటిబిందువులు కూడా త్రాగఁబడును. నీటిబిందువులను త్రాగుట పాలను త్రాగుటకు భిన్నమైనదిగా పరిగణింపఁబడదు. అదే విధముగా దేశకాలములలో బ్రహ్మము నుండి అభిన్నమైయున్న ఆకాశము తత్కార్య సహితముగా బ్రహ్మమునందణగియుండును. కావున ఆకాశము యొక్క మూలమునుఁ గూర్చిన పరిచ్ఛేదములను మనము గౌణముగా అర్థమొనర్చు కొనవలయును.

ఈ విధముగా పూర్వపక్షి ఆకాశము సృష్టిపఁబడలేదనియు, అది ఒక కార్యము కాదనియు మఱియు శ్రుతివచనమగు "సంభూత" యనునది కేవలము గౌణార్థమునందు ప్రయోగింపఁబడినదనియును నిరూపించుటకు ప్రయత్నించును.

## 2-3-6 ప్రతిజ్ఞా హాని రవ్యతిరేకాచ్ఛబ్దేభ్యః

ఒకే జ్ఞానముచే సమస్తము తెలియఁబడునను వాక్యము పరిత్యజింపఁ బడకుండుట, సమస్త ప్రపంచము బ్రహ్మమున కభిన్నమై యుండుటచేతను సిద్ధించును. శ్రుతివాక్యములు లేక వైదికశబ్దములు కార్యకారణ తాదాత్మ్యతనుఁ గూర్చియే వివరించును.

ప్రతిజ్ఞా హానిః = వాక్యమును పరిత్యజింపకుండుట, అవ్యతిరేకాత్ = అభిన్నత్వకారణముచే, శబ్దేభ్యః = శబ్దములచే అనగా శ్రుతులచే.

1వ సూత్రమునందారంభింపఁబడి 3,4,5 సూత్రములలో వాదింపఁబడిన ఆక్షేపణ కిప్పుడు సమాధాన మొసంగఁబడుచున్నది.

సూత్రకారుడు పూర్వపక్షి యొక్క అభిప్రాయమును ఖండించి, తన మతమును ప్రతిష్ఠించు కొనుచున్నాడు. ప్రపంచములోని ప్రతిపదార్థము బ్రహ్మముయొక్క కార్యమైయున్నప్పుడు మాత్రమే, ఏకైక పదార్థ (బ్రహ్మ) జ్ఞానముచే సమస్తము తెలియఁబడుననెడి శ్రుతివాక్యము సత్యము కాఁగలుగును. ఏలననగా కార్యములు కారణమునకు భిన్నములు కావని శ్రుతి పలుకుచున్నది. కావున కారణమైయున్న బ్రహ్మము తెలియఁబడినచో, కార్యములు కూడా తెలియఁబడును. ఒకవేళ ఆకాశము బ్రహ్మమునుండి ఉత్పన్నము కాకున్నచో, బ్రహ్మమును తెలిసికొనుట ద్వారా మనము ఆకాశమును తెలిసికొనఁజాలము. కావున పై నిర్ణయము నిజము కాజాలదు. బ్రహ్మము యొక్క కార్యము కాకుండుటచే ఆకాశమింకను తెలిసికొనఁబడవలసి యుండును. కాని ఒకవేళ ఆకాశము సృష్టింపఁబడినచో ఇట్టి సమస్యకేలాటి అవకాశము లేకుండును. కావున ఆకాశమొక కార్యమైయున్నది. అది సృష్టింపఁబడినది. ఒక వేళ అది సృష్టింపఁబడకున్నచో వైదిక ప్రామాణ్యము మటుమాయమగును.

తైత్తిరీయ, ఛాందోగ్యములకు సమన్వయము లేదని తలంచు పూర్వపక్షి యొక్క ఊహ పూర్తిగా పొరపాటు. ఛాందోగ్యశ్రుతియందు నీవు "ఆకాశము మఱియు వాయువును సృష్టించిన అనంతరము" అను వాక్యాంశమును చేర్చవలసియుండును. అప్పుడు శ్రుతి ఆకాశము మఱియు వాయువును సృష్టించిన అనంతరము "బ్రహ్మము అగ్నిని సృష్టించెను" అని పలికినట్లగును. ఇప్పుడే మాత్రము వైరుధ్యము లేకుండును.

ఇంతేకాకుండా పాలు మఱియు నీటివలె బ్రహ్మము మఱియు ఆకాశము ఏకమనియు, ఆకాశము సర్వత్ర వ్యాపించియుండుటచే బ్రహ్మము మఱియు దాని కార్యములను తెలిసికొనుట ద్వారా అది తెలియఁబడుననెడి ప్రతిపాదనము పూర్తిగా దోషయుక్తమై యున్నది. ఏలననగా పాలు మఱియు నీరు ఏకమనెడి జ్ఞానము అక్రమమై యున్నది. శ్రుతియందొసంగఁబడిన దృష్టాంతము పాలు మఱియు నీరు కాదు. కాని కార్యములన్నియును కారణమునకు భిన్నములు కావని సూచించు మట్టి మఱియు కుండల దృష్టాంత మొసంగఁబడినది. ఏలననగా "ఏకమేవా ద్వితీయమ్" లోని "ఏవ" శబ్దముచే పాలు మఱియు నీటివంటి మిశ్రమము నిషేధింపఁబడును. మఱియు ఒకే పదార్థము కారణమై యున్నదని పలుకును.

శ్రుతి వచించునట్టి ఒకే పదార్థజ్ఞానముచే సమస్త పదార్థజ్ఞానము కలుగునను విషయము పాలలో నీటిని కలిపిన దృష్టాంతము తెలియఁబడదు. ఏలననగా ఒక మట్టిముద్దను తీసుకొనివచ్చినప్పుడు భౌతిక కార్యకారణముల సంబంధములచే మనకు సమస్త వస్తు జ్ఞానమనుభవగోచరమగును. (ఛాం. ఉ. 6-1-4). కారణజ్ఞానమునందు కార్యజ్ఞానమిమిడియుండును. ఇఁక సమస్త వస్తుజ్ఞానము పాలు మఱియు నీటి జ్ఞానము వంటిదనుకొన్నచో, అది సమ్యగ్ విజ్ఞానమనఁబడదు. ఏలననగా పాలయందు కలుపఁబడిన నీటిజ్ఞానము పూర్వజ్ఞానముచే గ్రహింపఁ బడదు. కారణమేమనగా నీరు పాలయందు కలుపఁబడినను, అది దానికి భిన్నమైయున్నది.

బ్రహ్మమునకు భిన్నముగా ఏ పదార్థమున్నూ స్వతంత్రమైన ఉనికిని కలిగిలేదను విషయము "సర్వం ఖల్విదం బ్రహ్మ", "ఇదం సర్వం యదయమాత్మా" (బృ. ఉ. 2-4-6) యనెడి శ్రుతివాక్యములచే దృఢమొనర్పఁ బడుచున్నది.

## 2-3-7 యావద్వికారం తువిభాగోలోకవత్

కాని ఎచ్చటెచ్చట కార్యములుండునో, అచ్చటచ్చట ప్రత్యేకతలుండుటను మనమీ ప్రాపంచిక సామాన్య జీవితమునందుఁ గాంచుచున్నాము.

యావద్వికారం = ఎచ్చటెచ్చట కార్యముండునో, తు = కాని, విభాగః = ప్రత్యేకత, లోకవత్ = ప్రపంచము వలె.

6వ సూత్రమునందారంభింపఁబడిన వాదమిచ్చట సమాప్తమైనది.

"తు" యను శబ్దము సృష్టింపఁబడలేదను విషయమును ఖండించును. పూర్వసూత్రములోని సంశయము నివారింపఁబడుచున్నదను విషయమునిది సూచించును.

మఱియొకచోట చెప్పఁబడిన పంచీకరణము (పంచభూత కలయిక) కు బదులుగా మూడు మూర్తభూతములగు త్రివృత్కరణ విధానమును దృష్టియందుంచుకొని, ఛాందోగ్యోపనిషత్తు బుద్ధిపూర్వకముగా గణన నుండి ఆకాశము మఱియు వాయువును తొలగించును.

భూతములన్నియు బ్రహ్మము నుండి సృష్టింపఁబడును. ఛాందోగ్యము నందు ఆకాశము మఱియు వాయువు పేర్కొనఁబడక అగ్ని, నీరు, పృథ్వి మాత్రము

బ్రహ్మమునుండి ఉత్పన్నములైనవని సూచింపఁబడుట ఇచ్చట గమనార్హమైయున్నది. ఇది ఒక ప్రత్యేక వ్యక్తియైన రామకృష్ణుని పుత్రులందఱిలో కొందఱిని మాత్రమే పేర్కొను సామాన్య ప్రాపంచికానుభవము వంటిదైయున్నది.

ఇది ప్రపంచమునందు సామాన్యముగా మనముఁగాంచు విషయము వంటిదైయున్నది. "వీరందఱు నారాయణుని పుత్రుల"ని పలికి వారియందొకానొకని పుట్టుకనుఁగూర్చిన వివరమొసంగినచో, అది శేషించిన వారందఱికి వర్తించును. అదే విధముగా "వీటన్నింటి ఆత్మ బ్రహ్మమునందు కలద"ని ఉపనిషత్తు పలికి తదనంతరము బ్రహ్మమునుండి అగ్ని, నీరు, పృథ్వి వంటి కొన్నింటి సృష్టినిఁ గూర్చి పలికినచో, అతనినుండి ఇతరములు ఉత్పన్నము కాలేదని భావము కాదు. కాని వాటినిఁ గూర్చిన ఉత్పత్తిని చెప్పుట అనావశ్యకమని మాత్రము భావింపఁబడినది. కావున ఆకాశము యొక్క ఉత్పత్తినిఁగూర్చి ఛాందోగ్యము నుడువకున్నను, విశ్వప్రాతిపదకమగు "సమస్త పదార్థములయొక్క ఆత్మ బ్రహ్మమునందు కలద"ను వాక్యానుసారముగా ఆకాశముయొక్క ఆత్మ బ్రహ్మమునందున్నదని మనమూహింపవచ్చును. కావున అది బ్రహ్మమునండి ఉత్పన్నమైనది.

ఆకాశము– అగ్ని మఱియు వాయువు వంటి ఒక భూతము. కావున దానికుత్పత్తి ఉండియుండును. అశాశ్వతమైన శబ్దగుణమునకది ఆధారమైయున్నది. కావున అదియున్నూ అశాశ్వతమే యగును. ఆకాశము యొక్క ఉత్పత్తి వినాశములను నిరూపించుటకిది ప్రత్యక్షప్రమాణమై యున్నది. "మూలము లేనిదేదో అది బ్రహ్మము వలె శాశ్వతమైనది" అనునది పరోక్ష ప్రమాణమైయున్నది. మఱియు శాశ్వతమైన గుణములను కలిగియున్నదేదో, అది ఆత్మవలె శాశ్వతమైనది. కాని ఆకాశమీ విషయములలో బ్రహ్మమును పోలి లేకుండుటచే అది శాశ్వతము కాఁజాలదు.

ఆకాశమునకు మూలమున్నట్లు మనకు గోచరము కాకున్నను, ఆకాశము బ్రహ్మమునుండి ఉత్పన్నమగుననుట నిశ్చయము.

సృష్టింపఁబడిన పదార్థములన్నియు ఒకదానికొకటి విభిన్నములై యుండుటను మనమీ విశ్వమునందుఁ గాంచుచున్నాము. ఒక పదార్థము యొక్క కార్యములైయున్న కుండలు, కడవలు, కంకణములు, కడియములు, చెవిపోగులు, సూదులు,

బాణములు, కత్తులు– ఇవియన్నియును వేఱువేఱుగా నుండుటను మనముఁ గాంచుచున్నాము. కుండలు, కడవలు మున్నగు వాటివలె విభిన్నములై యున్నవన్నియును కార్యములనఁబడును. కార్యము కానిదేదో అది ఆత్మ లేక బ్రహ్మమువలె అవిభాజ్యమైయుండును. ఒక కుండ ఒక గుడ్డముక్కకు విభిన్నమై యుండును కదా! ఇట్లే ఇతరములు, విభేదము కలిగియున్న ప్రతియొక్కటి సృష్టింపఁబడును. అది శాశ్వతము కాఁజాలదు. ఒక పదార్థము ఇతర పదార్థములకు భిన్నమై యుండియు శాశ్వతమైనదిగా తలంచుట భావ్యము కాఁజాలదు.

ఆకాశము భూమ్యాదులకు విభిన్నమైయున్నది. కావున ఆశాశము కూడా ఒక కార్యమై యుండవలసి యుండును. అది శాశ్వతము కాఁజాలదు. అది ఒక సృష్టింపఁబడిన పదార్థము.

ఒకవేళ ఆత్మ కూడా ఆకాశాదులకు స్పష్టముగా విభిన్నమై యుండుటచే అదియున్నూ ఒక కార్యమై యుండవలయునని నీవు పలికినచో, అట్లు కాదని మేము సమాధానమొసంగుదుము. ఏలననగా ఆకాశము స్వయముగా ఆత్మనుండి ఉత్పన్నమైనది. "ఆత్మన ఆకాశస్సంభూతః" (తై. ఉ. 2–1) అని శ్రుతి నుడువుచున్నది. ఒకవేళ ఆత్మ కూడా కార్యమైయున్నచో ఆకాశము మున్నగువాటికి స్వరూపము లేకుండెడిది. తత్ఫలితముగా శూన్యవాదమేర్పడియుండెడిది. ఆత్మ అస్తిత్వమగుటచే అది నిషేధింపఁబడుటకు వీలులేదు. "ఆత్మత్వాచ్చాత్మనోనిరాకరణ శంకానుపపత్తిః" అది స్వయంసిద్ధము. "నహ్యాత్మాగంతుకః కస్యచిత్, స్వయం సిద్ధత్వాత్" అది ఆత్మ ప్రామాణ్యమును కలిగియున్నది. "నహ్యాత్మా ఆత్మానః ప్రమాణాపేక్షయాసిద్ధ్యతి".

ఆకాశము మున్నగునవి స్వయంసిద్ధములని, ఎవరిచేతను చెప్పఁబడలేదు. కావున ఎవడున్నూ ఆత్మను నిషేధింపఁజాలడు. ఏలననగా నిషేధించువాడు స్వయముగా ఆత్మయైయున్నాడు. ఆత్మ ఉనికిని కలిగియున్నది. మఱియు శాశ్వతమైయున్నది.

ఆకాశముయొక్క సర్వవ్యాపకత్వము మఱియు శాశ్వతత్వము కేవలము సాపేక్షికముగా సత్యములై యున్నవి. ఆకాశము సృష్టింపఁబడినది. అది బ్రహ్మముయొక్క కార్యమైయున్నది.

"ప్రస్తుతక్షణములో ప్రస్తుతమున్నది నాకు తెలియును. గడచిన క్షణములలోని అత్యంత సామీప్య, అత్యంత దూరస్థమగు భూతకాలము నాకు తెలియును. భవిష్యత్కాలములలోని కొద్దికాలములో జరుగనున్న మఱియు చాలకాలము తర్వాత జరుగనున్న భవిష్యత్కాలము నాకు తెలియును" అను వాక్యములలోని జ్ఞేయ పదార్థము భూతభవిష్యద్వర్తమానములనుఁబట్టి విభిన్నమైయుండును. కాని శాశ్వతమైన ఉనికిని కలిగియుండుటచే జ్ఞాతయగు కర్తయందు మార్పులేదు. ఆత్మయొక్క స్వరూపము శాశ్వతత్వమగుటచే శరీరము బూడిదగా కాల్చఁబడినను, అది నిషేధింపఁబడఁజాలదు. అది ఉన్న స్థితినుండి భిన్నత్వము నొందునని కూడా నీవు తలంపఁజాలవు. కావున ఆత్మ లేక బ్రహ్మము ఒక కార్యము కాదు. తద్భిన్నముగా ఆకాశము కార్యవర్గమునకు చెందియున్నది.

ఇంతేకాకుండా ఒక కార్యము ఉత్పన్నము కాకపూర్వము అనేక పోలికలుగల కారణాంశములు ఆవశ్యకములై యుండునని నీవు పలుకుచున్నావు. ఈ వాదము సరికాదు. దారములు ద్రవ్యము. వాటి సంయోగము గుణమనఁబడును. ఐనను ఈ రెండున్నూ ఒక కార్యమునుత్పన్నమొనర్చుటకు అంశములై యున్నవి. పోలికఁగల అనేక కారణాంశములు కేవలము సమవాయి కారణమునకు వర్తించునని నీవు పలికినను, ఈ రకమైన వివరణము సరికాదు. ఏలననగా త్రాడు దారముచే మఱియు జంబుఖానా ఉన్నిచే అల్లఁబడును.

ఇంతేకాదు, అనేక కారణాంశములు ఆవశ్యకములని నీవు పలుకనేల? పరమాణువు, లేక మనస్సు విషయములో ప్రారంభచలనము అనేక కారణాంశములచే జరుగదని అంగీకరింపఁబడినది. కేవలము ద్రవ్యమునకు మాత్రము అనేక కారణాంశము లావశ్యకములని నీవు చెప్పఁజాలవు. దారము మఱియు వస్త్రమునకు వలె సంయోగమే కార్యమునకు కారణమైయున్నప్పుడది వర్తించును. కాని పాలు పెరుగుగా మాఱుటవంటి అనేక దృష్టాంతములలో ఒకే ద్రవ్యము మరియొక ద్రవ్యముగా మార్పునొందును. సంయోగమునందు అనేక కారణములచేత మాత్రమే ఒక కార్యముత్పన్నమగుననుట దైవనియమము కాదు. కావున శ్రుతిని ఆధారముగాఁగొని మేము నిశ్చయించునదేమనగా:– ప్రపంచమంతయు ఒకే బ్రహ్మము నుండి ఉత్పన్నమైనది. ఆకాశము ఆదియందు

సృష్టింపఁబడి, తదనంతరము వరుసగా ఇతర భూతములు సృష్టింపఁబడినవి. (చూడుము: 2-1-24)

ఆకాశసృష్టి విషయమునందు దాని పూర్వాపర కారణస్థితికి మధ్య ఏలాటి కాలభేదము లేదని పలుకుటయు పొసగదు. శ్రుతియందు బ్రహ్మము "అస్థూలమనణు" అని వర్ణింపఁబడినది. శ్రుతి ఒక అనాకాశస్థితినిఁగూర్చి సూచించును.

"అనాకాశమ్" (బృ. ఉ. 3-8-8) అను వాక్యము ననుసరించి బ్రహ్మము ఆకాశము యొక్క కోవకు చెందదు. కావున ఆకాశము సృష్టింపఁబడుటకు పూర్వము, బ్రహ్మము ఆకాశరహితమైయుండెననుట నిర్ణీతమగు నిశ్చయమై యున్నది.

ఇంతేకాకుండా ఆకాశము, భూమ్యాదుల స్వరూపమునకు విభిన్నమై యున్నదనెడి పూర్వపక్షివగు నీ మాట నిశ్చయముగా దోషయుక్తమై యున్నది. ఆకాశము సృష్టింపఁబడలేదనుట శ్రుతి వచనమునకు విరుద్ధమైయున్నది. కావున ఇట్టి ఊహయందు శ్రేయస్సు లేదు.

ఆదిని కలిగియున్న పృథ్వి ఇత్యాది భూతముల స్వరూపమునకు విరుద్ధమైయుండుటచే ఆకాశము అనాదియని తలంచు నీ యూహకు విలువ లేదు. ఏలననగా శ్రుతి విరుద్ధమై యుండుటచే అది అసంగతమై యున్నది. ఆకాశము ఒక సృష్టింపఁబడిన పదార్థమని నిరూపించుటకు మేము బలమైన, యుక్తియుక్తమైన మఱియు శక్తివంతమైన వాదముల నొసంగియున్నాము.

ఆకాశము అనిత్యగుణమును కలిగియున్నది. కావున అది కూడా అనిత్యమైనదే. ఆకాశము అశాశ్వతమైనది. ఏలననగా అశాశ్వత గుణమైన శబ్దమునకది మూలమైయున్నది. అశాశ్వతగుణములను కలిగియున్న వాటికి మూలమైయున్న మట్టికుండలు ఇత్యాది పదార్థములు స్వయముగా అశాశ్వతములై యున్నవి కదా! ఉపనిషత్తులను ప్రమాణముగా స్వీకరించు వేదాంతి, ఆత్మ ఆశాశ్వతమైన గుణములకు మూలమైయున్నదను విషయము నంగీకరింపడు.

ఆత్మ శాశ్వతమైయున్నదని శ్రుతి ఘోషించుటచే, ఆత్మ అశాశ్వతము కూడానై యున్నదని నీవు చెప్పఁజాలవు.

స్వర్గలోకవాసులగు దేవతలను అమరులుగా వర్ణించునట్లే శ్రుతి గౌణార్థము నందు ఆకాశమును అమృతము (శాశ్వతము) గా వర్ణించినది. ఆకాశముయొక్క సృష్టి ప్రళయములకవకాశమున్నదని నిరూపింపఁబడినది.

ఈ శబ్దములు కేవలము ఆత్మయొక్క గొప్పఁదనము మఱియు అనంతత్వమును సూచించుటకు మాత్రమే ప్రయోగింపఁబడినవి. కాని ఆత్మ మఱియు ఆకాశము సమానములని చెప్పుటకు కాదు. ఈ ప్రయోగము "సూర్యుడు బాణము వంటి వేగముతో పరుగెత్తును" అను వాక్యము వంటిది. సూర్యుడు బాణము వంటి వేగముతో పరుగెత్తునని చెప్పినప్పుడు అతడు మిక్కిలి వేగముగా పరుగెత్తునని అర్థమగునే కాని, బాణముతో సరిసమానమైన వేగముతో పరుగెత్తునని అర్థము కాదు.

"బ్రహ్మము ఆకాశము కంటెను విశాలమైనవాడు" ఇత్యాది వాక్యములచే బ్రహ్మము కంటె ఆకాశము యొక్క వైశాల్యము తక్కువయని ఋజువగుచున్నది. "నతస్య ప్రతిమాస్తి" (శ్వే. ఉ. 4-19) వంటి వాక్యములచే బ్రహ్మముతో పోల్చఁదగిన పదార్థమేదియు లేదని తెలియుచున్నది. "అతోఽన్యదార్తమ్ (బృ. ఉ. 3-4-2) వంటి వాక్యములచే బ్రహ్మమునకు భిన్నమైయున్న ఆకాశమువంటి పదార్థము లన్నియును దుష్టములని రూఢియగుచున్నది. బ్రహ్మమునకితరములైన వన్నియును క్షుద్రములు. కావున ఆకాశము బ్రహ్మమునకు కార్యమైయున్నది.

శ్రుతులు మఱియు తర్కముచే ఆకాశమునకు మూలమున్నదని తెలియు చున్నది. కావున ఆకాశము బ్రహ్మమునకు కార్యమైయున్నదనుటయే రూఢియగు తుదినిర్ణయమైయున్నది.

# 2. మాతరిశ్వాధికరణము

## 2-3-8 ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః

ప్రస్తుతము చర్చింపఁబడుచున్న ఆకాశము ఉత్పన్నమైనదగుటచే వాయువు కూడా ఒక కార్యమై యున్నదని వివరింపఁబడుచున్నది.

ఏతేన = ఆకాశము ఉత్పన్నమైనదని చర్చింపఁబడిన కారణముచే, మాతరిశ్వా = వాయువు, వ్యాఖ్యాతః = వ్యాఖ్యానింపఁబడినది.

వాయువు కూడా ఆకాశమువలె బ్రహ్మమునుండి మఱియు బ్రహ్మముచేత ఉత్పన్నమైనదని ఈ సూత్రము నిరూపించుచున్నది.

ఈ సూత్రము ఆకాశమునకు సంబంధించిన తర్కమును ఆకాశమే ఆధారముగా కలిగియున్న వాయువు వరకు విస్తృతమొనర్చినది. ఛాందోగ్యములోని సృష్టి క్రమమునందు సూచింపఁబడకుండుటచే వాయువు సృష్టింపఁబడలేదని పూర్వపక్షి పలుకును. తైత్తిరీయములో సూచింపఁబడినట్టి వాయువు యొక్క ఉత్పత్తి కేవలము గౌణమని పూర్వపక్షి నుడువును. ఏలననగా ఆకాశముతో పాటు వాయువు కూడా అమరమైన వాటియందొకటిగా చెప్పఁబడినది.

"సైషాన స్తమితాదేవతాయద్వాయుః" (బృ. ఉ. 1-5-22) వాయువు అస్తమింపకుండుట వాయు రూపము నందున్న బ్రహ్మమును ధ్యానించు అపరావిద్యను సూచించును. మఱియు అది కేవలము సాపేక్షికమై యున్నది.

వాయువు యొక్క మహిమ పూజనీయపదార్థముగా సూచింపఁబడినది. "వాయువు అస్తమింపద"ని శ్రుతి పలికినది. వాయువు శాశ్వతమని కొందఱు మందబుద్ధులు తలంపవచ్చును. ఈ సంశయమును నివారించుటకై పూర్వవాదము వాయువు వరకు ఒక క్రమపద్ధతి యందు పొడిగింపఁబడినది.

వాయువు అమరమైనదని గౌణార్థమునందు మాత్రము చెప్పఁబడినది. వాయువు కూడా ఆకాశమువలె మూలమును కలిగియున్నది.

# 3. అసంభవాధికరణము

## 2-3-9 అసంభవస్తు సతోఽనుపపత్తేః

కాని ఆధారము అసాధ్యమగుటచే, బ్రహ్మమునకు మూలము లేదు. అసంభవః = సృష్టి లేదు, తు = కాని, సతః = శాశ్వతమగు బ్రహ్మమునకు, అనుపపత్తేః = తర్కమునకు నిలువకుండుటచే.

తర్కమునకు నిలువకుండుటచేతను, శ్రుతి సమ్మతము కాకుండుటచేతను బ్రహ్మమునకు మూలము లేదని ఈ సూత్రము ప్రతిపాదించును.

"తు" యను శబ్దము సంశయ నివృత్తికై ప్రయోగింపఁబడినది.

"త్వంజాతోభవసి విశ్వతోముఖః" (శ్వే. ఉ. 4-3) అను వాక్యమునందు బ్రహ్మము సృష్టింపఁబడినట్లు శృతి నుడువుచున్నదని పూర్వపక్షి పలుకును.

ఆకాశము మఱియు వాయువు వలె బ్రహ్మము కూడా సృష్టింపఁబడినదని మనము చెప్పలేము. ఆకాశాదులవలె బ్రహ్మమొక కార్యము కాదు. ఏలాటి ప్రామాణిక విధానముచేతను బ్రహ్మముయొక్క సృష్టి నిరూపింపఁబడజాలదు.

బ్రహ్మము స్వయముగా సత్తాస్వరూపమైయున్నది. దానికి కారణము లేకుండుటచే అది కార్యము కాజాలదు. బ్రహ్మమునకు పూర్వికుడెవడున్నూ లేడని శ్రుతి స్పష్టముగా నుడువుచున్నది. "సకారణం కరణాధిపాధిపోనచాస్య కశ్చిజ్జనితానచాధిపః" (శ్వే. ఉ. 6-9)

ఇంతే కాకుండా అది ఏ పదార్థముకున్నూ భిన్నమై లేదు. అసత్తునకునికి లేకుండుటచే, అసత్తునుండి సత్తు జనింపదు. దేనికి ఉనికి లేదో దానియందాత్మ యుండదు. కావున అది కారణము కాఁజాలదు. ఏలననగా కారణము తన కార్యములకు ఆత్మయై యున్నది. "కథమసతస్సజ్జాయేత" (ఛాం. ఉ. 6-2-2) యని శ్రుతి వచించుచున్నది.

కారణమునకొక ప్రత్యేకాధిక్యత లేకున్నచో కార్యకారణ సంబంధమున కవకాశము లేకుండుటచే, సత్తునుండి సత్తు జనించినదనియున్నూ నీవు చెప్పఁజాలవు. కారణమునందులేని ఏదోయొక ప్రత్యేకత కార్యమునందుండవలసి యుండును. బ్రహ్మము నాశములేని అస్తిత్వమాత్రుడై యున్నాడు.

అనుభవ విరుద్ధమగుటచే బ్రహ్మము ఏదోయొక ప్రత్యేకతను కలిగియున్న పదార్థమునుండి ఉద్భవింపఁజాలదు. ఏలననగా మట్టినుండి కుండలు, పాత్రలవలె సర్వసామాన్యమైన పదార్థమునుండి ప్రత్యేకరూపములుఁగల పదార్థములు జనించుటను మనముఁగాంచుటలేదు. కావున సత్తాసామాన్యమగు బ్రహ్మమునకు కారణము ఏదైన ఒక ప్రత్యేక పదార్థము కాఁజాలదు.

ఒకవేళ శాశ్వతమగు ప్రథమ కారణము లేకున్నచో, అనవస్థాదోషము వాటిల్లక తప్పదు. మూలకారణ ద్రవ్యము నంగీకరింపకున్నచో, అనవస్థాదోషము మనలనావరించును. "సవాఏష మహానజ ఆత్మాఽజరోఽమరోఽమృతః" (బృ. ఉ. 4-4-25) అని శ్రుతి వచించుచున్నది.

బ్రహ్మమునకేలాటి ఆధారము లేదు. శ్రుతి మతానుసారముగా కేవలమాతడే సత్యమైన, శాశ్వతమైన ఉనికిని కలిగియున్నాడు. బ్రహ్మమున కాధారమున్నట్లు తలంచినచో, అతడు శాశ్వతుడు కాఁజాలడు. కావున ఇట్టి భావన శ్రుతి విరుద్ధమైయున్నది. ఇది తర్కమునకు కూడా విరుద్ధమైయున్నది. ఏలననగా ఇట్టి మూలమునంగీకరించినచో, మరల ఆ మూలమునకుఁగల ఆధారమేమి? – వంటి ప్రశ్న పరంపరలు ఉత్పన్నమగును. ఈ విధముగా ఈ వాదమునకు అనవస్థాదోష మేర్పడుటతో ఒక నిశ్చయమునకు మనము రాజాలకుందుము.

సర్వసామాన్యమగు సత్తాను కలిగియున్న మూలకారణద్రవ్యమేదో, అదియే బ్రహ్మమని చెప్పఁబడును.

కావున బ్రహ్మమొక కార్యము కాదు. కాని అది శాశ్వతమైయున్నది.

# 4. తేజోధికరణము

## 2-3-10 తేజోఽ తస్తథాహ్యాహ

వాయువునుండి అగ్ని ఉత్పన్నమైనదని శ్రుతి స్పష్టముగా నుడువుచున్నది.

తేజః = అగ్ని, అంతః = 8వ సూత్రమునందు చెప్పఁబడిన వాయువు నుండి, తథా = ఈ విధముగా, హి = నిశ్చయముగా, ఆహ = పలుకుచున్నది.

"వాయోరగ్నిః" (తై. ఉ. 2-1) వాయువునుండి అగ్ని జనించినదని తైత్తిరీయము నుడువుచున్నది. "తత్తేజోఽ సృజత" (ఛాం. ఉ. 6-2-3) అని ఛాందోగ్యము పలుకుచున్నది.

ఈ రెండు శ్రుతుల సమరసత్వము 13వ సూత్రమునందు చూపఁబడినది.

ఈ విధముగా అగ్నియొక్క మూలమునుఁగూర్చి శ్రుతి వాక్యములో వైరుధ్యము కలదు. అగ్నికి మూలము బ్రహ్మమని పూర్వపక్షి వాదించును. ఏలననగా ప్రారంభమునందు సత్తామాత్రమే ఉనికిని కలిగియుండెననని శ్రుతి పలుకుచున్నది. అది అగ్నిని సృష్టించెను. బ్రహ్మమునుండి సమస్తము సృష్టింపఁబడినప్పుడు మాత్రమే, బ్రహ్మము ద్వారా సమస్తము తెలియఁబడుననెడి నిశ్చయము సాధ్యమగును. "తజ్జలాన్" (ఛాం. ఉ. 3-14-1) అనెడి శ్రుతి ప్రతిపాదనము ఏలాటి భేదమును

ప్రత్యేకించి చెప్పదు. "ఏతస్మాజ్జాయతే ప్రాణో, మనస్సర్వేంద్రియాణిచ, ఖం వాయుర్జ్యోతిరాపః, పృథ్వీవిశ్వస్య ధారిణీ'' (ముం. ఉ. 2-1-3) అని ముండకోపనిషత్తు వచించుచున్నది. "సతపస్తప్త్వా ఇదం సర్వమసృజత, యదిదం కించ" (తై. ఉ. 2-6) అని తైత్తిరీయము పలుకుచున్నది. కావున "వాయోరగ్నిః" (తై. ఉ. 2-1) అనెడి వాక్యము సృష్టిక్రమమును మాత్రము బోధించును. వాయ్వనంతరము అగ్ని సృష్టింపఁబడెను.

బ్రహ్మము వాయువును సృష్టించిన అనంతరము అగ్నిని సృష్టించెనను క్రమమునందు తైత్తిరీయోపనిషద్వాక్యమును వ్యాఖ్యానించినచో, పై రెండు ఉపనిషత్తులలోని వాక్యములు సమన్వయింపఁబడునని పూర్వపక్షి పలుకును.

ఈ సూత్రము దీనిని ఖండించి, అగ్ని వాయువునుండి సృష్టింపఁబడినదని పలుకును. దీనిచే ఛాందోగ్యోపనిషత్తునకు వైరుద్ధ్యమేర్పడును. అనగా వాయువు బ్రహ్మముచే సృష్టింపఁబడినది, మఱియు అగ్ని కూడా వాయురూపమును ధరించిన బ్రహ్మమునుండి సృష్టింపఁబడినదని భావము. అగ్ని బ్రహ్మమునుండి ప్రత్యక్షముగా కాకుండా, పరోక్షముగా ఉత్పన్నమైనది. ఇదే విధముగా మనము పాలు, పెరుగు, జున్ను ఇవన్నియును ఆవునుండి కలుగునని పలుకుదుము.

ప్రతిపదార్థము బ్రహ్మమునుండి ఉత్పన్నమగునని నిశ్చయించుటకు పదార్థములన్నింటికి మూల కారణము అదియే యనియు, కాని తత్పూర్వమునందున్న కార్యము కాజాలదనియును మనము గుర్తెఱుంగ వలసియుండును. ఈ విధముగా వైరుద్ధ్యమునకవకాశమేర్పడదు. దీనియందేలాటి సమస్యకు తావుండదు.

వాయువునుండి అగ్ని సృష్టింపఁబడినదని తైత్తిరీయోపనిషత్తు స్పష్టముగా పలుకుటచే, వాయువును సృష్టించిన అనంతరము బ్రహ్మము స్వయముగా అగ్నిని సృష్టించెనని పలుకుట పాడిఁగాదు. బ్రహ్మము మూలకారణమని నుడువుటయందు మాత్రము సంశయము లేదు.

# 5. అబధికరణము

## 2-3-11 ఆపః

అగ్నినుండి నీరు ఉత్పన్నమైనది.

ఆపః = నీరు.

(అతః = దానినుండి, తథా = ఈ విధముగా, హి = ఏలయనగా, ఆహ = శ్రుతి పలుకును.)

ఇదే విషయము జలమునకున్నూ వర్తించును.

పూర్వసూత్రమునుండి మనము "అతస్తథా హ్యాహ" యను శబ్దములను గ్రహించి ఈ సూత్రమునకు చేర్చవలసియుండును.

పూర్వసూత్రమునందు సూత్రకారుడు అగ్నియొక్క సృష్టినిఁగూర్చి వర్ణించియున్నాడు. తర్వాతి సూత్రమునందాతడు పృథ్వియొక్క సృష్టినిఁగూర్చి వర్ణించును. జలమును చేర్చి సృష్టిక్రమమును సూచించుటకై అతడు ఈ సూత్రమును ప్రతిపాదించుచున్నాడు.

"అగ్నేరాపః" అగ్నినుండి నీరు ఉత్పన్నమైనది. (తై. ఉ. 2-1) "తత్తేజ ఐక్షత బహుస్యాం ప్రజాయేయేతి తదపోఽసృజత" (ఛాం. ఉ. 6-2-3) "నేను అనేకమగుదునుఁ గాక!" "నేను పెంపొందుదునుఁ గాక!" యని అగ్ని తలంచి అది జలమును సృష్టించెను.

శంక :- నీరు నేరుగా అగ్నినుండి ఉత్పన్నమగునా? లేక, బ్రహ్మము నుండియా?

ఛాందోగ్యోపనిషత్ప్రబోధానుసారముగా జలము నేరుగా బ్రహ్మమునుండి జనించునని పూర్వపక్షి పలుకును.

సిద్ధాంతి :- దీనియందు వైరుధ్యము లేదు. ఏలనననగా అగ్నినుండి నీరు ఉత్పన్నమైనదని శ్రుతి నుడువుచున్నది.

ఇచ్చట కూడా అగ్ని బ్రహ్మమునుండి ఉత్పన్నమైనట్లే, అగ్ని రూపమునందున్న బ్రహ్మము నుండి జలము ఉత్పన్నమైనదని చెప్పవలసియుండును. స్పష్టము మఱియు అసందిగ్ధమైయున్న శ్రుతిని గూర్చి వ్యాఖ్యానించు ఆవశ్యకత ఇచ్చట లేదు.

నీరు అగ్నినుండి ఏల ఉత్పన్నమగునో, ఆ కారణము ఛాందోగ్యము నందొసంగఁబడినది. కావున ఎవనికైనను, ఎచ్చటైనను వేడిచే చెమట పట్టినప్పుడు అగ్నినుండియే నీరు జనించును. అదే విధముగా ఒక మానవుడు దుఃఖముచే శోకగ్రస్తుడై వేడినొందినప్పుడు, అతడేడ్చుటచేత కూడా అగ్నినుండి నీరు ఉత్పన్నమగును. స్పష్టమైన ఈ ప్రతిపాదనలచే నిస్సంశయముగా అగ్నినుండి జలము ఉత్పన్నమగునని తెలియుచున్నది.

# 6. పృథివ్యధికరణము

## 2-3-12 పృథివ్యధికార రూపే శబ్దాంతరేభ్యః

విషయము, వర్ణము మఱియు ఇతర శ్రుతివాక్యముల కారణముచే "అన్న" శబ్దముచే పృథ్వి సూచింపఁబడును.

పృథివీ = భూమి, అధికార = విషయ సందర్భ కారణముచే, రూప = వర్ణము, శబ్దాంత రేభ్యః = ఇతర శ్రుతి వాక్యములచే, భూమికి కూడా ఇదే విషయము వర్తించును.

"అద్భ్యః పృథివీ" (తై. ఉ. 2-1) "తా అన్నమసృజంత" (ఛాం. ఉ. 6-2-4). ఈ రెండు శ్రుతివాక్యములలో స్పష్టమైన విభేదము కలదు. ఏలననగా మొదటి వాక్యములో జలము పృథ్విని సృష్టించినట్లును, రెండవ వాక్యములో అన్నమును సృష్టించినట్లును చెప్పఁబడినది.

ఛాందోగ్యములోని "అన్నము"న కర్థము ఆహారము కాదనియు, దాని కర్థము పృథ్వియనియును ఈ సూత్రము నుడువుచున్నది. ఏల? సందర్భ విషయమునుఁబట్టి, వర్ణము ననుసరించి మఱియు ఇతర శ్రుతివాక్యముల ననుసరించి, పూర్వ వాక్యములనుఁబట్టి విషయము పంచభూతములకు సంబంధించి యున్నదని మనకు స్పష్టముగా తెలియుచున్నది. "అది అగ్నిని సృష్టించెను. అది జలమును సృష్టించెను." సృష్టి క్రమమును వర్ణించునప్పుడు భూమిని విడిచి ఒకేసారి నీటి నుండి అన్నము వరకు గంతువేయుట పొసగదు. సృష్టి క్రమము పంచభూతములకు సంబంధించియున్నది. కావున 'అన్నము' ఒక భూతమును సూచించునే కాని, ఆహారమును కాదు.

మఱియు "యత్కృష్ణం తదన్నస్య" (ఛాం. ఉ. 6-4-1) యనెడి వాక్యము కూడా కలదు. ఇచ్చట వర్ణము యొక్క సూచననుఁబట్టి "అన్నమ"నగా భూమియని స్పష్టమగుచున్నది. పృథ్వికి నలుపు వర్ణము తగును. నలుపే భూమికి ముఖ్యమైన వర్ణము. భోజ్యములగు వండిన పదార్థములు, అన్నము, బార్లీ మున్నగు వాటికి నలుపుగా ఉండు ఆవశ్యకత లేదు. పౌరాణికులు కూడా భూమి యొక్క వర్ణమును "రాత్రి" శబ్దముచే సూచింతురు. రాత్రి నలుపుగా ఉండును. కావున భూమి యొక్క వర్ణము కూడా నలుపని మేము నిర్ణయింతుము.

"ఆపోవా అర్కస్త ద్యదపాంశర ఆసీ త్తత్సమ హన్యతసా పృథివ్యభవత్" (బృ. ఉ.1-2-2) వంటి ఇతర శ్రుతి వాక్యములు కూడా నీటినుండి పృథ్వి ఉత్పన్నమైనదని స్పష్టముగా సూచించుచున్నవి.

ఇంతేకాకుండా "పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽ న్నమ్" (తై. ఉ. 2-1)అను వాక్యముచే పృథ్వి నుండి ఓషధులు, అన్నము మున్నగునవి సృష్టింపఁబడినవని స్పష్టమగుచున్నది.

"ఎప్పుడైతే వర్షించునో" యనెడి ఉపవాక్యమునుఁబట్టి కూడా బియ్యము, బార్లివంటి ఆహారము పృథ్వితత్వము ననుసరించి యుండుటచే భూమి స్వయముగా జలమునుండి ఉత్పన్నమగునని సూచింపఁబడుచున్నది.

కావున ఈ కారణము లన్నింటిచే "అన్నమ"నెడి శబ్దము ఈ పృథ్విని సూచించును. నిజమునకు

ఛాందోగ్యము మఱియు తైత్తిరీయోపనిషత్తులలో వైరుధ్యము లేదు.

# 7. తదభి ధ్యానాధికరణము

## 2-3-13 తదభిధ్యానాదేవతు తల్లింగా త్సః

కాని భూతములయందారోపింపఁబడిన లింగమునుఁబట్టి భూతముల యందంతర్నిహితమై యున్న బ్రహ్మమే సృష్టికి కారణభూతమైయున్నది.

తదభిధ్యానాత్ = బ్రహ్మ సంకల్ప శక్తిచే, ఏవ = మాత్రమే, తు = కాని, తల్లింగాత్ = దానిని సూచించు చిహ్నముల కారణముచే, సః = అతడు.

10వ సూత్రములోని వివాదము ఇప్పుడు ఖండింపఁబడుచున్నది.

"తు" యనెడి శబ్దము సంశయ నివారణకై ప్రయోగింపఁబడినది.

"బ్రహ్మము సమస్తమునకు సృష్టికర్తయని శ్రుతులు వాకొనుచున్నవ"ని పూర్వపక్షి పలుకును. కాని "ఆకాశాద్వాయుః" (తై. ఉ. 2-1) అని తైత్తిరీయోపనిషత్తు నుడువును. దీనిచే ప్రత్యేక భూతములు స్వతంత్రముగా ప్రత్యేక కార్యములనుత్పన్న మొనర్చునని సూచితమగుచున్నది. ఇట్లు శ్రుతివాక్యములలో వైరుధ్యమేర్పడును. ఈ సూత్ర మీ ఆక్షేపణను ఖండించును.

ఆకాశము, అగ్ని, వాయువు, జలముయొక్క సృష్టి పూర్తిగా దైవ సంకల్పమునుఁబట్టియే జరుగును. తన స్వంతశక్తిచే ఒక భూతము మరియొక భూతమును సృష్టింపఁజాలదు. ఒక భూతముయొక్క రూపమునందున్న దేవుడే తన సంకల్ప శక్తి ద్వారా మరియొక భూతమును సృష్టించును.

భూతములు జడములు; వాటియందు సృజన శక్తిలేదు. భూతముల యందంతర్నిహితమైయున్న బ్రహ్మమే ఆ భూతములకు నిజమైన సృష్టికర్త. బృహదారణ్యకమునందు "యోఽగ్నౌతిష్ఠన్నగ్నేరంతరో యమగ్నిర్న వేదయస్యాగ్ని శ్శరీరం యోఽగ్నిమంతరో యమయత్యేషత ఆత్మాంతర్యామ్యమృతః" (బృ. ఉ. 3-7-5)అను వాక్యము కలదు.

ఈ శ్రుతి వాక్యముచే కేవలము పరమాత్ముడే పరపాలకుడనియు, భూతముల కేలాటి స్వతంత్రము లేదనియును సూచింపఁబడుచున్నది.

ఒక భూతము మరియొక భూతమును సృష్టించినట్లు ఛాందోగ్యము పలికినను, బ్రహ్మము తన సంకల్పశక్తిచే ఈ ప్రపంచమును సృష్టించెనని శ్రుతి నుడువుటచే నిశ్చయముగా పరమేశ్వరుడే సమస్తమునకు సృష్టికర్తయగును.

"సోఽకామయత, బహుస్యాం ప్రజాయేయేతి" (తై. ఉ. 2-6) మఱియు "తదాత్మానం స్వయమకురుత" (తై. ఉ. 2-7) అను వాక్యములచే పరమేశ్వరుడే సమస్తమునకు ఆత్మయై యున్నాడని స్పష్టమగుచున్నది. "నాన్యోఽతో స్తిద్రష్టా" అను వాక్యముచే బ్రహ్మమునకు వినా మరియొక ద్రష్టఁగాని, మంతఁగాని లేదని తెలియుచున్నది. ప్రారంభవాక్యమగు "తదైక్షత బహుస్యాం ప్రజాయేమేతి" (ఛాం.

ఉ. 6-2-3) చే ఈ యధ్యాయమంతటికి ద్రష్టయగు బ్రహ్మమే విషయమై యున్నదని నుడువనగును.

ఛాందోగ్యమునందు "అగ్ని సంకల్పించెను. జలము సంకల్పించెన"ని చెప్పఁబడినది. కాని జడమైన భూతములకు సంకల్పము అసాధ్యము. సమస్త భూతములకు అంతర్యామియు, భూతముల కంతర్నిహితుడై యున్నవాడునగు పరమేశ్వరుడే సంకల్పించి, ఈ కార్యములను సృష్టించెను. ఇదియే నిజమైన భావార్థము. వాటియందంతర్నిహితుడై వాటికి పరిపాలకుడై యున్న పరమేశ్వరుని కర్తృత్వము చేతనే భూతములు కారణభూతములైనవి. కావున ఈ శ్రుతిద్వయమునందేలాటి వైరుధ్యము లేదు.

విచారశీలుడు, మననశీలుడు నగు వివేకియగు మానవునికి ఇందు వైరుధ్యము కానఁబడదు. శ్రుతివాక్యములు అమోఘములు మరియు ప్రామాణికములై యుండును. ఈ విషయము నెల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనుము. నిర్వికల్ప సమాధియందాత్మజ్ఞానానుభవము నొందిన అనుభవజ్ఞులగు మునుల హృదయముల నుండి ఈ శ్రుతి వాక్యములు వెలువడినవి. అవి చపలచిత్తమగు బుద్ధిచే జనించినవి కావు.

# 8. విపర్యయాధికరణము

## 2-3-14 విపర్యయేణ తు క్రమోऽత ఉపపద్యతేచ

ప్రళయకాలమునందు భూతములు బ్రహ్మమునందు లయించు విధానము, అవి సృష్టింపఁబడిన క్రమమునకు విరుద్ధముగా నుండును. ఇది సముచితము కూడా.

విపర్యయేణ = విరుద్ధ క్రమమునందు, తు = నిశ్చయముగా, క్రమః = ప్రళయక్రమము, అతః = సృష్టిక్రమమునుండి, చ= మఱియు, ఉపపద్యతే = సముచితమై యున్నది.

ఈ సూత్రమునందు భూతముల ప్రళయక్రమము వర్ణింపఁబడినది.

ఇచ్చట "తు" యనెడి శబ్దము "కేవలమ"నెడి అర్థము నొసంగును. ప్రాపంచిక ప్రళయకాలము నందు భూతములు బ్రహ్మమునందు ఒక అనిశ్చితక్రమము నందు

లయించునా? లేక సృష్టిక్రమము ననుసరించి లయించునా? లేక, సృష్టి విరుద్ధమగు క్రమమునుఁబట్టి లయించునా? యనెడి ప్రశ్న ఇచ్చట ఉదయించును.

సృష్టి క్రమము పైనుండియు, ప్రళయక్రమము దిగువనుండియు సంభవించును. ప్రళయ క్రమము సృష్టి క్రమమునకు విపరీతముగా నుండును. ఇదియే సవ్యము మఱియు యుక్తియుక్తమై యున్నది. ఏలననగా సామాన్యముగా ఒక మానవుడు మెట్లనెక్కినప్పుడు, విపరీతక్రమముగా ఆ మెట్లను దిగవలసి యుండుటను మనముఁగాంచుచున్నాము.

స్థూలమైన పదార్థములు సూక్ష్మపదార్థములయందు లయించును. సూక్ష్మ పదార్థములు అతి సూక్ష్మములైన పదార్థములయందు లయించును. ఈ విధముగా సృష్టియంతయు తనకు మూలకారణమై యున్న బ్రహ్మమునందు లయించును. ప్రతి భూతము తనకు కారణమైన దానియందు లయించును. ఈ క్రమము ఆకాశమును చేరువఱకు జరిగి, ఆ యాకాశము బ్రహ్మమునందు లయించును.

సృష్టియందు ప్రప్రథమముగా సృష్టింపఁబడిన పదార్థములు మిక్కిలి శక్తిమంతములై యుండును. తత్ఫలితముగా అవి ఎక్కువకాలము మనును. కావున చివరి సృష్టి బలహీనమై యుండుటచే, అది ప్రథమముగా ఉన్నతశక్తి యందు లయించుట న్యాయసమ్మతమై యున్నది. ఉన్నత శక్తులు తదనంతరము లయము నొందును. వామనపురాణమిట్లు నుడువుచున్నది. "ప్రప్రథమముగా" సృష్టింపఁబడిన పదార్థమునందు దేవుని మహిమ గర్భితమై యుండును. తత్పలితముగా ఆదియందు సృష్టింపఁబడిన పదార్థములు శక్తిమంతములై యుండుటచే, అవి చిట్టచివరకు లయింపఁబడును. ఈ కారణముచేతనే నిస్సందేహముగా అవి ఎక్కువగా వైశాల్యమును కలిగియుండును.

# 9. అంతరావిజ్ఞానాధికరణము

## 2-3-15, అంతరా విజ్ఞాన మనసీక్రమేణ తల్లిం గాదితి చేన్నా విశేషాత్

ఒక వేళ బ్రహ్మము మఱియు భూతములమధ్య బుద్ధి మఱియు మనస్సు సూచింపఁబడుటచే సృష్టి క్రమమునందు వాటి ప్రళయములను సూచించుటచే భూతముల సృష్టి క్రమమునందు భంగము కలుగునని పలికినచో, బుద్ధి మఱియు

మనస్సు భూతములకు విభిన్నములు కాకుండుటచే అది సంభవించదని మేము సమాధాన మొసంగుదుము.

అంతరా = మధ్యవచ్చుట, విజ్ఞానమనసీ = బుద్ధి మఱియు మనస్సు, క్రమేణ = క్రమముగా, తల్లింగాత్ = దీనినిఁగూర్చి శ్రుతి సూచించుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = ఈ యాక్షేపణ నిలువనేరదు, అవి శేషాత్ = శ్రుతియందు ప్రత్యేకమగు విభేదము చెప్పఁబడకుండుటచే.

ప్రప్రథమ భూతములకుఁగల కారణము బ్రహ్మమను విషయమై మరియొక ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు ఆక్షేపణ మఱియు ఖండనయనెడి రెండు విభాగము లున్నవి. "అంతరా విజ్ఞానమనసీక్రమేణ తల్లింగాదితిచేత్" అనునది ఆక్షేపణను, మఱియు "నా విశేషాత్" అనునది ఖండనను సూచించును.

అథర్వణ వేదములోని ముండకోపనిషత్తునందుఁగల సృష్టినిఁగూర్చి నుడువఁబడిన అధ్యాయమునందు "ఏతస్మాజ్జాయతేప్రాణో, మనస్సర్వేంద్రియాణిచ, ఖంవాయుః జ్యోతిరాపః, పృథివీ విశ్వస్యధారిణీ" (2-1-3) యను వాక్యము కలదు.

ముండకోపనిషత్తునందు వర్ణింపఁబడిన సృష్టిక్రమమునకు, ఛాందోగ్యము (6-2-3) మఱియు ఇతర శ్రుతులలో వర్ణింపఁబడిన భూతముల సృష్టిక్రమమునకు వైరుధ్యము కలదని పూర్వపక్షి పలుకును.

దీనికి మేమీ క్రింది సమాధానము నొసంగుదుము : ఇది కేవలము ఇంద్రియములు మరియు భూతములయొక్క గణనమాత్రమై యున్నది. ఇది నిశ్చయముగా సృష్టిక్రమమునుఁగూర్చి ప్రతిపాదించదు. ఇవన్నియు బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవని మాత్రము ముండకోపనిషత్తు నుడువును.

అథర్వణవేదము (ముండకోపనిషత్తు) నందు భూతముల గణనకు మధ్య మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియములు సూచింపఁబడినవి. దీనిచే సృష్టిక్రమమునందు మార్పురాదు. ఏలననగా మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియములు భూతములయొక్క కార్యములై యుండుటచే, వాటి వ్యావర్తనము భూతముల వ్యావర్తనము నందు చేరియుండును.

బుద్ధి, మనస్సు మఱియు ఇంద్రియములు భూతములనుండి ఉత్పన్నములైనవి. కావున భూతములు సృష్టింపఁబడిన అనంతరమే అవి సృష్టింపఁబడును. మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియములయొక్క సృష్టిలయములు భూతముల సృష్టిలయముల వంటివేనై యున్నవి. ఏలననగా ఇంద్రియములు మఱియు భూతములకు మధ్య భేదము కానరాదు.

ఒకవేళ మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియములు భూతములకు భిన్నములైయున్నను, సృష్టిక్రమమునందు మనస్సు మఱియు ఇంద్రియములు భూతములననుసరించియైనను, లేక భూతములు మనస్సు మఱియు ఇంద్రియముల ననుసరించియైనను ఉండును, ఎట్లైనను వాటియందొక క్రమమైన వికాసముండును.

మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియములు భూతములయొక్క వికారములనియు మఱియు అవి భూతముల వంటి స్వభావమును కలిగియుండుననియు "అన్నమయం హి సోమ్యమన ఆపోమయః ప్రాణస్తే జోమయీ వాగితి". (ఛాం. ఉ. 6-6-5) వంటి శ్రుతివాక్యముల ద్వారా నిరూపింపఁబడును.

కావున ముండకోపనిషత్తులోని సృష్టిక్రమము మఱియు ఛాందోగ్య, తైత్తిరీయోపనిషత్తుల్లోని సృష్టిక్రమమునకు మధ్య వైరుధ్యము లేదు. అవయవముల సృష్టిచే భూతములయొక్క సృష్టిక్రమమునందు విఘాతము కలుగదు.

పూర్వపక్షి మరల ఇట్లనును : శ్రుతియందు మనస్సు మఱియు ఇంద్రియములు సూచింపఁబడుటచే, ఆకాశము మఱియు ఇతర భూతములు బ్రహ్మమునుండి జనించుననియు, తిరిగి అవి బ్రహ్మమునందు లయించుననియు తలంపరాదు. కాని ముండకోపనిషత్సూచనాను సారముగా అవి మనస్సు మఱియు ఇంద్రియములనుండి సృష్టింపఁబడి తిరిగి వాటియందే లయించును.

భూతముల సృష్టియందు ప్రత్యేకముగా పేర్కొనఁబడకుండుటచే ఈ వాదమసంగతమై యున్నది. మనస్సు, బుద్ధి మఱియు ఇంద్రియము లన్నియును బ్రహ్మమునుండియే సృష్టింపఁబడినవని పేర్కొనఁబడినది.

శ్రుతి వాక్యములోని "ఏతస్మాత్ " అను శబ్దము ప్రాణము, మనస్సు మున్నగు వాటన్నింటికి ప్రయోగింపఁబడవలయును. ఈ విధముగా "ఏతస్మాత్ప్రాణః ఏతస్మాత్ మనః" మున్నగు వాక్యములచే "అతని నుండియే ప్రాణము, అతనినుండియే మనస్సు, అతని నుండియే ఇంద్రియములు జనించినవ"ను అర్థమును స్వీకరింపవలయును.

# 10. చరాచరవ్యపాశ్రయాధికరణము

## 2-3-16 చరాచర వ్యపా(శయస్తు స్యాత్తద్వ్యపదేశోభాక్త స్తద్భావ భావిత్వాత్

కాని జీవుని జనన మరణములు చరాచరజీవుల శరీరములకు మా(తము తగియుండును. వాటిని ఆత్మకారోపించుట గౌణమగును. ఏలననగా ఆ శబ్దముల ఉనికి శరీరముయొక్క ఉనికిపై ఆధారపడియుండును.

చరాచర వ్యపా(శయః = చరాచరా శరీరముల సంబంధము, తు = కాని, స్యాత్ = ఐ యుండవచ్చును, తద్వ్యపదేశః = ఆత్మ జనన మరణముల నొందునని పేర్కొనుట, భాక్తః = గౌణము, తద్భావ భావిత్వాత్ = ఈ శబ్దములు శరీరముయొక్క ఉనికిపై ఆధారపడి యుండుటచే.

ఇప్పుడు జీవుని నిజస్వరూపము చర్చింపఁబడుచున్నది.

"రామకృష్ణుడు జనించెను. రామకృష్ణుడు మరణించెన"ను వాక్యములు వాడుకయందుండుటచేతను మఱియు జనన మరణ సమయములలో చేయవలసిన జాతకర్మ, (పేతకర్మ మున్నగువాటిని శాస్త్రములు విధించుట చేతను జీవునికి జనన మరణములున్నవనెడి సంశయము కలుగవచ్చును.

ఈ సూ(త మీ సంశయమును నివారించి, జీవునికి జనన మరణములు లేవని నిరూపించును. ఆత్మతో సంబంధమును కలిగియున్న శరీరమునకు మా(తము జనన మరణములున్నవి. కాని ఆత్మకు లేవు. ఒకవేళ జీవుడు నశించినచో, రెండవ జన్మలో సుఖభోగము మఱియు దుఃఖ త్యాగమునకై చేయఁబడు కర్మకాండ (విధి నిషేధములు) నిరర్థకమగును.

సర్వసామాన్యముగా ఆత్మ శరీరముతో సంబంధమును కలిగియుండుటయే జన్మయనియు మఱియు శరీరమునుండి ఆత్మ విడిపోవుటయే మరణమనియు చెప్పఁబడును. "జీవాపేతం వావకిలేదం(మియతే నజీవో(మియతే" (ఛాం. ఉ. 6-11-3) అని (శుతి పలుకుచున్నది. కావున జనన మరణములు చరాచర జీవుల శరీరములకు ముఖ్యార్థమునందు మఱియు ఆత్మకు కేవలము గౌణార్థము నందు చెప్పఁబడినవి.

“సవా అయం పురుషోజాయమానశ్శరీర మభిసంపద్యమానః పాప్మభిస్సం సృజ్యతే స ఉత్క్రా మన్మ్రియమాణః పాప్మనోవిజహాతి” (బృ .ఉ. 4-3-8) అను శ్రుతి వాక్యమునందు సూచింపఁబడినట్టి “జనన మరణ” శబ్దములచే శరీర సంయోగ వియోగములు సూచితములగుచున్నవి.

ఆత్మకు ఉత్పత్తి లేకుండుటచే, జాతకర్మ మహోత్సవము కూడా శరీరముయొక్క ఉత్పత్తినే సూచించును.

కావున జనన మరణములు శరీరమునకు సంభవించునేకాని, ఆత్మకు సంభవింపవు.

# 11. ఆత్మాధికరణము

## 2-3-17 నాత్మాశ్రుతేర్ని త్యత్వాచ్చతాభ్యః

శ్రుతి సమ్మతము కాకుండుటచే జీవాత్మ సృష్టింపఁబడలేదు. కాని శ్రుతి వాక్యానుసారముగా అది శాశ్వతమైయున్నది.

న = సృష్టింపఁబడలేదు, ఆత్మ = జీవాత్మ, అశ్రుతేః = శ్రుతి సమ్మతము కాకుండుటచే, నిత్యత్వాత్

= అది శాశ్వతమగుటచే, చ = కూడా, తాభ్యః = శ్రుతి మతానుసారముగా.

జీవాత్మ యొక్క ముఖ్యమైన లక్షణములు చర్చింపఁబడుచున్నవి.

“ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్” (1-1) అని ఐతరేయోపనిషత్తు ఉద్ఘోషించుచున్నది. కావున అప్పుడు బ్రహ్మము తప్ప మరియొకటి లేకుండుటచే, జీవాత్మ సృష్టింపఁబడలేదని పలుకుట యుక్తి యుక్తము కాజాలదు.

“యథాగ్నేః క్షుద్రావిస్ఫులింగా వ్యచ్చరంత్యేవ మేవాస్మాదాత్మనః సర్వేప్రాణాస్సర్వేలోకా స్సర్వేదేవా స్సర్వాణి భూతాని వ్యచ్చరంతి” (బృ. ఉ. 2-1-20) యని కూడా శ్రుతి వచించుచున్నది. “యథాసుదీప్తాత్పావ కాద్విస్ఫులింగాః । సహస్రశః ప్రభవంతే సరూపాః తథాక్షరా ద్వివిధాస్సోమ్యభావాః ప్రజాయంతే, తత్రచైవాపి యంతి” (ముం. ఉ. 2-1-1) కావున ఆకాశాది భూతములు ఉత్పన్నమైనట్లే, జీవాత్మయు సృష్ట్యారంభమునందు ఉత్పన్నమైనదని పూర్వపక్షి వాదించును.

ఈ సూత్రము దీనిని ఖండించి, జీవాత్మ ఉత్పన్నము కాలేదని పలుకును. ఏలననగా ఇది శ్రుతి సమ్మతము కాదు. కారణమేమనగా సృష్టిని వివరించు శ్రుతి వాక్యములు స్పష్టముగా జీవాత్మయొక్క పుట్టుకను నిషేధించును.

శ్రుతి వాక్యములనుఁబట్టి ఆత్మ శాశ్వతమనియు, దానికి జన్మలేదనియు, అది మార్పు లేనిదనియు, నిర్వికారమగు బ్రహ్మమే ఆత్మకు ద్రవ్యమనియు, ఆత్మయొక్క మూలము బ్రహ్మమునందున్నదనియును మనకు తెలియుచున్నది. ఇట్టి స్వభావమును కలిగియున్న జీవాత్మ సృష్టింపఁబడజాలదు.

ఈ విషయమై ఈ క్రింది శ్రుతి వాక్యములు ఉదహరింపఁబడుచున్నవి. "సవాఏష మహానజ ఆత్మా ఽ జరోఽ మరోఽ మృతోఽ భయోబ్రహ్మాభయంవై బ్రహ్మాభయంహివై బ్రహ్మ భవతి య ఏవం వేద" (బృ. ఉ. 4-4-25) "నజాయతే మ్రియతే వా విపశ్చిత్" (కఠ. ఉ. 1-2-18) "అజో నిత్యశ్శాశ్వతోఽ యంపురాణః" (కఠ. ఉ. 1-2-18).

అద్వితీయమగు బ్రహ్మము బుద్ధిని ప్రవేశించి జీవాత్మగా రూపొందును. "తత్సృష్ట్వా, తదేవాను ప్రావిశత్" ( తై. ఉ.2-6 ) "అనేనైవ జీవేనాత్మనాను ప్రవిశ్య నామరూపేవ్యా కరోత్" ( ఛాం. ఉ. 6-3-2) "స ఏష ఇహ ప్రవిష్టః ఆనఖాగ్రేభ్యః" (బృ. ఉ. 1-4-7).

"తత్త్వమసి" (ఛాం. ఉ. 6-8-7) "అహంబ్రహ్మాస్మి" (బృ. ఉ. 1-4-10) "అయమాత్మా బ్రహ్మ సర్వాను భూః"(బృ. ఉ. 2-5-19). ఈ వాక్యములన్నియు ఆత్మయొక్క శాశ్వతత్వమును వెల్లడించుచున్నవి. మఱియు ఈ విధముగా అది ఉత్పన్నమైనదను మతమును ఖండించుచున్నవి.

కావున నిజమునకు జీవునికి మఱియు బ్రహ్మమునకు మధ్య భేదము లేదు. జీవుడు సృష్టింపఁబడలేదు. అది ఒక ఉత్పాదక ద్రవ్యము కాదు. అది ఆకాశము మఱియు ఇతర భూతములవలె ఉత్పన్నము కాలేదు. జీవాత్మ సృష్టింపఁబడలేదని పలుకుటచే "ఆత్మావా ఇదమే క ఏవాగ్ర ఆసీత్" (ఐ. ఉ. 1-1) అనెడి శ్రుతి వాక్యము ఖండింపఁబడదు.

తదితర శ్రుతి వాక్యములలో నుడువఁబడిన జీవులయొక్క సృష్టివర్ణన కేవలము గౌణమైయున్నది. కావున "తత్సృష్ట్వా, తదేవాను ప్రావిశత్" అనెడి శ్రుతి వాక్యము ఖండింపఁబడదు.

జీవులు బ్రహ్మమునుండి సృష్టింపఁబడినారను సిద్ధాంతము సరియైనది కాదు. బ్రహ్మమునుండి జీవులు జన్మించినారనెడి ఈ సిద్ధాంతము నంగీకరించువారు, బ్రహ్మము తెలియఁబడినచో సమస్తము తెలియఁబడుననెడి శ్రుతివాక్యము యొక్క సత్యతనంగీకరింపవలసి యుండును. ఏలననగా బ్రహ్మమే కారణమై యున్నాడు మఱియు కారణము తెలియఁబడినచో, సమస్తమున్నూ తెలియఁబడును. ఇంకను వారు బ్రహ్మము జీవులతో తాదాత్మ్యము నొందలేదనియును పలుకుదురు. ఏలననగా అతడు పాపరహితుడు మఱియు సమర్థుడు. కాని జీవులట్టివారు కారు. వారు ఇంకను నుడువున దేమనగా:- భిన్నమై యున్నదంతయు కార్యమనఁబడును. కావున జీవులు విభిన్నమై యుండుటచే అవియున్నూ కార్యములుగనే పరిగణింపఁబడును.

జీవులు విభిన్నులు కారు. "ఏకో దేవస్సర్వ భూతేషు గూఢ స్సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా" (శ్వే. ఉ. 6-11) అని శ్రుతి ఉద్ఘోషించుచున్నది. ఘటాది సంబంధముచే ఆకాశము విభిన్నమై తోచునట్లు, మనస్సు ఇత్యాది ఉపాధుల ద్వారా అది విభిన్నమై యున్నట్లు మనకు కన్పట్టును. అతడు బుద్ధితో సంబంధించి యుండుటద్వారా జీవుడని పిలువఁబడుచున్నాడు. ఘటాకాశము మఠాకాశముతో తాదాత్మ్యము నొందియున్నది. జీవబ్రహ్మైక్యము యథార్థమగుటచే పై ఆక్షేపణ లేవియు నిలువనేరవు. కావున బ్రహ్మము తెలియఁబడుటచే సమస్తము తెలియఁబడుననెడి శ్రుతి ప్రమాణమునకు భంగము లేదు. జీవ సృష్టి కేవలము శరీరమునకు సంబంధించి యున్నది.

# 12. జ్ఞాధికరణము

## 2-3-18 జ్ఞోఽత ఏవ

జీవుడు స్వయముగా విజ్ఞానము కలవాడగుటచే, అతడు సృష్టింపఁబడలేదు.

జ్ఞః = జ్ఞాని, అత ఏవ = ఈ కారణముచేతనే.

జీవుని ముఖ్యలక్షణములనుఁగూర్చి చర్చింపఁబడుచున్నది.

జీవుడెల్లప్పుడు స్వాభావికముగా శుద్ధ చైతన్య స్వరూపుడై యున్నాడని సాంఖ్య సిద్ధాంతము నుడువు చున్నది.

గాఢనిద్రయందు, మూర్ఛయందు విజ్ఞానము లేకుండుటచే, జీవుడు స్వాభావికముగా విజ్ఞానవంతుడు కాడని వైశేషికులు నుడువుదురు. జీవుడు జాగ్రదవస్థ నొంది మనస్సుతో ఐక్యమైనప్పుడు అతడు విజ్ఞానవంతుడగును. ఒక ఇనుపకడ్డీ అగ్నితో మేళవింపఁబడి నప్పుడది ఎట్లు ఎఱ్ఱనగునో, అట్లే ఆత్మ మనస్సుతో కలిసి నప్పుడది ఆకస్మికముగా విజ్ఞానవంతమగును.

ఒకవేళ ఆత్మ శాశ్వతము, విజ్ఞానవంతమగునేని, ఆ విజ్ఞానము గాఢనిద్ర, మూర్ఛాది భూమికల యందును ఉండవలసి యుండెడిది. నిద్రనుండి మేల్కొన్న వారు మాకేమియు తెలియకుండెనని పలుకుదురు. కావున విజ్ఞానము వచ్చిపోవుచుండుటచే జీవుని విజ్ఞానము ఆకస్మికమైనదని మేము నిర్ణయింతుము.

జీవుడు శాశ్వత విజ్ఞానము కలవాడని మేము దీనికి సమాధానమొసంగుదుము. విజ్ఞానమే బ్రహ్మముయొక్క ముఖ్యస్వరూపమై యున్నది. ఈ విషయము మనకీ క్రింది శ్రుతివాక్యములచే తెలియుచున్నది. "విజ్ఞాన మానందం బ్రహ్మ" (బృ. ఉ. 3-9-28). "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" (తై. ఉ. 2-1). "అరేఽయ మాత్మాఽ నంతరోఽ బాహ్యః" "కృత్స్నః ప్రజ్ఞాన ఘన ఏవ" (బృ. ఉ. 4-4-13). వేడి మఱియు వెలుతురు అగ్నియొక్క స్వరూపమెట్లగునో, అట్లే జీవుడా పరబ్రహ్మమే యై యున్నచో శాశ్వత విజ్ఞానమే జీవుని స్వరూపమై యుండవలయును.

విజ్ఞాన ఘనుడైన బ్రహ్మము స్వయముగా శరీరము, మనస్సు ఇత్యాది ఉపాధులద్వారా జీవునిగా వ్యక్తమగును. కావున విజ్ఞానము జీవుని సహజస్వరూపమై యున్నది. మఱియు అది సుషుప్తి, లేక మూర్ఛయందేఁగాక ఎప్పుడును నశింపఁజేయఁబడదు.

జీవుడు స్వయం ప్రకాశమానమగు విజ్ఞాన స్వరూపుడై యున్నాడని శ్రుతివాక్యములు ప్రత్యక్షముగా నుడువుచున్నవి. "అసుప్తస్సుప్తానభిచాకశీతి" (బృ. ఉ. 4-3-11). "అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి" (బృ. ఉ. 4-3-14) "నహి విజ్ఞాతుర్విజ్ఞా తేర్విపరిలోపోవిద్యతే" (బృ. ఉ. 4-3-30).

"యోవేదేదం జిఘ్రాణీతి స ఆత్మా" (ఛాం. ఉ. 8-12-4) అను వాక్యానుసారముగా సమస్త విషయేంద్రియములద్వారా విజ్ఞానముతో సంబంధముఁగల వాడై యుండుటచే జీవుడు విజ్ఞాన స్వరూపుడని తెలియుచున్నది.

ఆత్మ స్వయముగా విజ్ఞాన స్వరూపమై యున్నప్పుడు ఇంద్రియములతో ప్రయోజనమేమి? యని ప్రశ్నింపవచ్చును. వృత్తి జ్ఞానమును మఱియు భావములను క్రోడీకరించుటకై ఇంద్రియము లావశ్యకములై యుండును.

జీవుడు విజ్ఞాన స్వరూపుడగుటచే అతనికి ఇంద్రియములు అనావశ్యకములని నుడువుటకు వీలులేదు. ఏలననగా ఘ్రాణము వంటి ఇంద్రియము యొక్క వృతిజ్ఞానమును నిశ్చయించుటకవి ఉపకరించును. "యోవేదేదం జిఘ్రాణీతి స ఆత్మాగం ధాయఘ్రాణమ్" (ఛాం. ఉ. 8-12-4) అని శ్రుతి స్పష్టముగా ఘోషించుచున్నది.

"యద్వైతన్న పశ్యతి పశ్యన్వైతన్న పశ్యతి, న హిద్రష్టుర్ద్రష్టేర్విపరిలోపో విద్యతేఽ వినాశిత్వాత్, నతు తద్ద్వితీయ మస్తి తతోఽ న్య ద్విభక్తం యత్పశ్యేత్" (బృ. ఉ. 4-3-23) అను శ్రుతివాక్యము ద్వారా సుషుప్తియందున్న మానవుని కేమియు తెలియదను విషయము నిషేధింపఁబడుచున్నది.

గాఢనిద్రయందు విషయ జ్ఞానము లేకుండుటకుఁగల కారణము విషయము లేకుండుటయేఁగాని, చైతన్యము లేకుండుట కాదు. జీవుడు తన దృక్ఛక్తిని కోల్పోడు. చూచుటకే పదార్థమున్నూ లేకుండుటచే అతడు చూడఁజాలడు. అసాధ్యమగుటచే అతడు తన విజ్ఞానమును కోల్పోడు. ప్రకాశింపఁజేయుటకు పదార్థములు లేకుండుటచే ఆకాశమునందు వ్యాపించియున్న వెలుతురు మనకు అనుభవగోచరము కాదు. కాని తన స్వస్వరూపమును కోల్పోవుటచే కాదు. అదే విధముగా విషయ రాహిత్యముచేతనే నిజముగా విజ్ఞానము రహితమై యున్నట్లు కన్పట్టును. కాని విజ్ఞానముయొక్క అభావము చేతకాదు.

ఒకవేళ సుషుప్తి మున్నగు వాటియందు విజ్ఞానమే లేకున్నచో, దానికిఉనికి లేదని పలుకు వాడెవ్వడు? అది ఎట్లు తెలియఁబడును? గాఢనిద్రనుండి మేల్కాంచిన మానవుడిట్లు పలుకును. "నేను హాయిగా నిద్రించితిని. నేను పూర్ణ విశ్రాంతి ననుభవించితిని. నా కేమియు తెలియకుండెను". "నా కేమియు తెలియదు. నేను పూర్ణవిశ్రాంతి ననుభవించితిన"ని పలుకువాడు ఆ సమయమునందుండి యుండును. అట్లు కాదేని ఆ యవస్థలోని పరిస్థితిని అతడెట్లు జ్ఞప్తియందుంచు కొనఁగలుగును.

కావున జీవుని విజ్ఞానము ఏ పరిస్థితి యందైనను నష్టము కాదు. వైశేషికులు మఱియు తదితరుల తర్కము కేవలము భ్రాంతి జనకము అది శ్రుతి విరుద్ధము. కావున శాశ్వత విజ్ఞానమే జీవుని ముఖ్యస్వరూపమై యున్నదని మేము నిశ్చయించి ముగించుచున్నాము.

# 13.ఉత్క్రాంతి గత్యధికరణము

## (19-32 సూత్రములు)

## 2-3-19 ఉత్క్రాంతి గత్యా గతీనామ్

జీవుడు గమనాగమనముల నొందునని శ్రుతి పలుకుటచే, అణుత్వమే పరిమాణమగును. కాని అనంతత్వము కాదు.

ఉత్క్రాంతి = బయటకు వచ్చుట, గతి = వెళ్ళుట, ఆగతీనామ్ = తిరిగివచ్చుట.

జీవుని స్వరూపమునుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

ఈ సూత్రము నుండి 32వ సూత్రము వరకు జీవుని పరిమాణము అణుత్వమా? మాధ్యమికమా? లేక అనంతత్వమా? యను విషయము చర్చింపఁబడును. మొదటి పది సూత్రములు (19-28) జీవుడణుస్వరూపుడా? మాధ్యమికుడా? అనంతుడా? యని చర్చించును. తర్వాతి నాలుగు సూత్రములు దానికి సమాధానము నొసంగును.

"ఏకోదేవ స్సర్వభూతేషు గూఢ స్సర్వవ్యాపీ" అని శ్వేతాశ్వతరోపనిషత్తు (6-11) పలుకును. "ఏషోఽణురాత్మా" అని ముండకోపనిషత్తు (3-1-9) నుడువును. ఈ రెండు శ్రుతులు పరస్పరము విరుద్ధమై యున్నవి. కావున మనమొక నిర్ణయమునకు రావలసియున్నది.

జీవునికి ఉత్పత్తి లేదనియు మఱియు శాశ్వత విజ్ఞానమాతనికి స్వరూపమైయున్నదనియును పైన నుడువఁబడినది. కావున అతడు పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నాడని తెలియుచున్నది. పరబ్రహ్మముయొక్క అనంతత్వము శ్రుతులలో స్పష్టముగా నిరూపింపఁబడినది. అట్టియెడల జీవుని పరిమాణమునుఁ గూర్చిన చర్చ ఆవశ్యకమగునా? మేము నిజమైన సమాధానము నొసంగుచున్నాము. కాని శ్రుతి వాక్యములలో జీవుడు శరీరమునుండి బయటకు వచ్చుట (ఉత్క్రాంతి),

వెళ్ళుట (గతి) మఱియు తిరిగివచ్చుట (ఆగతి) చెప్పఁబడుటచే బాహ్యదృష్టి ననుసరించి జీవుడు  సంకుచితుడని నిరూపింపఁబడుచున్నది. ఇంతేకాకుండా కొన్ని స్థలములలో జీవుడు అణుస్వరూపుడని శ్రుతి స్పష్టముగా పలుకుచున్నది. కావున ఈ సంశయమును నివారించుటకై ప్రస్తుత చర్చకొనసాగుచున్నది.

ఉత్క్రాంతి, గతి, ఆగతులు చెప్పఁబడుటచే జీవుడు అణుస్వరూపుడై యుండవల యునని పూర్వపక్షి పలుకును. "సహోత్క్రామ తస్తస్యైషైవదృష్టి రేతద్విజ్ఞానమ్" (3-3) అని ఉత్క్రాంతినిఁగూర్చి కౌషీతక్యుపనిషత్తు నుడువుచున్నది. "అస్మాల్లో కాత్ప్రయంతి చంద్రమసమేవతే సర్వే గచ్ఛంతి" అని కౌషీతక్యుపనిషత్తు (1-2) నందు గతినిఁగూర్చి చెప్పఁబడినది. ఇఁక "తాస్మాల్లో కాత్పునరేత్యస్మై లోకాయ కర్మణః"  అని ఆ గతినిఁ గూర్చి బృహదారణ్యకోపనిషత్తు (6-4-6) నుడువుచున్నది. జీవుడీ శరీరము నుండి ఉత్క్రాంతి నొందుట, స్వర్గాదిలోకముల కేగుట మఱియు ఈ ప్రపంచమునకు తిరిగివచ్చుట వంటి ప్రతిపాదనలచే జీవుడు సంకుచిత స్వరూపుడని తెలియుచున్నది. ఏలననగా సర్వాంతర్యామియగు పురుషునికి చలనము అసాధ్యము కదా!  ఒకవేళ ఆత్మ అనంతమైయున్నచో అది ఉత్క్రాంతి నొంది, వెళ్ళి, తిరిగివచ్చుటలు దానికెట్లు సాధ్యమగును? కావున ఆత్మ అణుస్వరూపమై యున్నది.

## 2-3-20 స్వాత్మనా చోత్తరయోః

మఱియు గత్యాగతులు వాటికి కర్తయగు జీవునికి సంబంధించి యుండుటచే జీవాత్మ అణుస్వరూపమై యున్నది.

స్వాత్మనా = జీవాత్మకు సంబంధించి యుండుటచే, చ = మఱియు, ఉత్తరయోః = పూర్వ సూత్రములోని గత్యాగతులు.

19వ సూత్రమును బలపఱచు వాదమీ సూత్రమునందొసంగఁబడినది.

ఒకవేళ "ఉత్క్రాంతి"యనగా కేవలము శరీరముతో సంబంధము లేకుండాయని చెప్పినను, ఆత్మ అనంతమని ప్రతిపాదించువారు అది చంద్రుని వరకు వెళ్ళి అచ్చటనుండి తిరిగి వచ్చునని చెప్పుట కెట్లు సాధ్యపడును?

ఒకవేళ ఆత్మ అనంతమై యుండియు అది శరీరమునుండి ఉత్క్రాంతి నొందునని చెప్పినను, ఒకవేళ ఆ శబ్దము శరీరపాలన నుండి విముక్తమగుటను సూచించినను,

తత్ఫలితముగా పూర్వకర్మలు వినాశమొందును. ఒక గ్రామాధికారి తన ఉద్యోగము నుండి వైదొలగఁబడినప్పుడాతనిని బయటికి పంపివేయుదురుఁగదా! ఒక మానవుడొక కార్యాలయము నుండి బయటకు వచ్చిన అనంతరము అతడా నిశ్చిత కార్యమునుండి విముక్తుడైనట్లు, శరీరమునుండి ఉత్క్రాంతుడగుటయు ఒక నిశ్చితకార్య విముక్తతను సూచించును.

కాని సర్వాంతర్యామియగు జీవునికి చంద్రునివరకేగుట, తిరిగి ఈ లోకమునకు వచ్చుటలు అసాధ్యమే యగును.

కావున జీవాత్మ అణుపరిమాణమును కలిగియున్నది.

## 2-3-21 నాణు రతచ్ఛ్రుతే రితిచే న్నేతరాధికారాత్

సర్వాంతర్యామిగా శ్రుతులు ప్రతిపాదించుటచే జీవుడు అణుస్వరూపుడు కాడని చెప్పినచో, అట్లుకాదని మేము సమాధాన మొసంగుదుము. ఏలననగా ఆ వాక్యములలోని విషయము జీవునికి భిన్నమైన పరబ్రహ్మమై యున్నది.

న = కాదు, అణు = సూక్ష్మమైన అణువు, అతత్ = అణువుకు వ్యతిరిక్తమైన, శ్రుతేః = శ్రుతి ప్రతిపాదితమగుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు, ఇతర = జీవునికి భిన్నమైన పరమాత్మ, అధికారాత్ = అధ్యాయ సంబంధమగు విషయము ననుసరించి.

19వ సూత్రమునకొక ఆక్షేపణ చెప్పఁబడి, ఖండింపఁబడినది.

ఈ సూత్రమునుండి శంకా సమాధానములున్నవి. "నాణు రతచ్ఛ్రుతే రితిచేత్" అనునది శంక. "నేతరాధికారాత్" అనునది సమాధానము.

ఆత్మ మఱియు అనంతత్వమునుఁగూర్చి వర్ణించు వాక్యములు కేవలము పరబ్రహ్మమునకే వర్తించును, కాని జీవునికి వర్తించవు.

"ఏకోదేవస్సర్వ భూతేషుగూఢస్సర్వవ్యాపీ" (శ్వే. ఉ. 6-11) "సవాఏష మహానజ ఆత్మాయోఽయం విజ్ఞానమయః ప్రాణేషుయ ఏషోఽంతర్హృదయ ఆకాశః" (బృ. ఉ. 4-4-22). "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ, యోవేద నిహితం గుహాయాం పరమేవ్యోమన్" (తై. ఉ. 2-1) వంటి శ్రుతి వాక్యములు ఉపాధియుక్తమై

యున్న జీవుని సూచింపవు. కాని జీవునికి భిన్నమై యున్న పరబ్రహ్మమును సూచించును. ఇంతేకాదు, ఇది వేదాంత గ్రంథము లన్నింటికి ముఖ్యవిషయమై యున్నది. ఏలననగా బ్రహ్మమే జ్ఞేయవస్తువు. కావున ఇది వేదాంత వాక్యములన్నింటియందు ప్రతిపాదింపఁబడినది.

## 2-3-22 స్వశబ్దానుమానాభ్యాంచ

శ్రుతి వాక్యములలో అణుపరిమాణముగా ప్రతిపాదింపఁబడుటచేతను మఱియు అత్యంత సూక్ష్మమై యుండుటచేతను జీవుడు అణుస్వరూపుడై యున్నాడు.

స్వశబ్దానుమానాభ్యాం = శ్రుతి ప్రతిపాదనచేతను మఱియు అత్యంత సూక్ష్మమైయుండుటచేతను, చ = మఱియు.

19వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

సూక్ష్మాతి సూక్ష్మమని శ్రుతి స్పష్టముగా చెప్పుచుండుటచే జీవాత్మ అణుస్వరూపుడై యుండవలయును.

"ఏషోఽణురాత్మా" అని ముండకోపనిషత్తు (3-1-9) వివరించుచున్నది. "వాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్యచ" (5-9) "ఆరాగ్ర మాత్రోహ్యపరోపిదృష్టః" (5-8) అని శ్వేతాశ్వతరము నుడువుచున్నది.

కావున జీవాత్మ పరమాణు పరిమాణమును కలిగియున్నది.

కాని ఇచ్చట ఒక ఆక్షేపణ కవకాశమున్నది. ఒకవేళ జీవాత్మ పరమాణు పరిమాణమును కలిగియున్నచో, అది కేవలము శరీరములోని ఒక అంశమును మాత్రము ఆక్రమించును. అట్టియెడల శరీరమంతట వ్యాపించియున్న విషయగ్రాహ్యత న్యాయసమ్మతము కాకుండును. ఐనను గంగానదియందు స్నానమొనర్చు వారు తమ శరీరములయందంతట చల్లదనమును అనుభవించు చుండుటను మనముఁ గాంచుచున్నాము. ఎండకాలములో జనులు తమ శరీరములందంతట వేడి ననుభవింతురు. ఈ యాక్షేపణ కీ క్రింది సూత్రము తగిన సమాధానము నొసంగును.

## 2-3-23 అవిరోధశ్చందనవత్

చందన గంధమువలె విరోధము లేదు.

అవిరోధః = విరోధము లేదు, చందనవత్ = చందన గంధమువలె.

19వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

చందన గంధముయొక్క ఒక బిందువు శరీరములోని ఒక భాగమునందు పూయఁబడినను శరీరమంతయు ఎట్లు ఘుమఘుమలాడునో, అట్లే జీవాత్మ స్వాభావికముగా సూక్ష్మమైయున్నను, శరీరమంతయు వ్యక్తమై సుఖదుఃఖానుభవములను పొందించును. జీవాత్మ అణుస్వరూపమై యున్నను చందన బిందువు శరీరములోని ఒకే ఆంశమునందుండియు సర్వవ్యాపకమైనట్లు, శరీరమంతయు విషయగ్రాహ్యతను కలిగించును.

అనుభవమునకు నిలయమైన చర్మముచే జీవాత్మ సంబంధించియుండుటచే, జీవుని విషయగ్రాహ్యత శరీరమంతయు వ్యాపించుననుట న్యాయవిరుద్ధము కాదు. ఏలననగా జీవాత్మ మఱియ చర్మముయొక్క సంబంధము చర్మమంతయు వ్యాపించియుండును. మఱియు చర్మము శరీరమంతటిని ఆవరించియుండును.

## 2-3-24 అవస్థితి వైశేష్యాదితిచే న్నాధ్యుపగమాద్ధృది హి

ఒకవేళ చందన గంధమునందున్న ప్రత్యేక స్థానము జీవాత్మయందు లేకుండుటచే ఈ రెండు విషయముల సాదృశ్యమయుక్తమై యున్నదని పలికినచో, దానిని మేము నిషేధింతుము. ఏలననగా జీవుని ప్రత్యేక స్థానము హృదయమునందున్నదని శ్రుతి వచించుచున్నది కదా!

అవస్థితి = స్థానము, వైశేష్యాత్ = ప్రత్యేకముగా చెప్పఁబడుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ వాదించినచో, న = ఈ వాదము నిలుననేరదు, అధ్యుపగమాత్ = సూచింపఁబడుటచే, హృది = హృదయమునందు, హి =నిశ్చయముగా.

23వ సూత్రమునకు విరుద్ధమైన ఆక్షేపణ పూర్వపక్షిచే చెప్పఁబడి, ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకా సమాధానములనెడి రెండు విభాగములున్నవి. “అవస్థితి వైశేష్యాదితిచేత్” అనునది శంక, “నాభ్యుపగమాద్ధృదిహి'' అనునది సమాధానము.

స్వపక్ష విరుద్ధమగు ఆక్షేపణను పూర్వపక్షి పలుకుచున్నాడు. పోల్చఁబడిన రెండు విషయములు సాదృశ్యతను కలిగి లేకుండుటచే, పూర్వసూత్రములోని వివాదము అసంజసమైయున్నది. సాదృశ్యత సముచితమైలేదు. దృష్టాంతము సవ్యముగా లేదు. చందన గంధము విషయమునందది శరీరములోని ఒక ప్రత్యేకమగు అంశము నాక్రమించి, శరీరమంతటిని సుగంధిత మొనర్చును. కాని జీవాత్మ విషయమునందది ఒక ప్రత్యేక స్థలమునందుండదు. ఐనను అది శరీరమునందంతట విషయగ్రాహ్యతను కలిగియుండును. దానికొక ప్రత్యేకస్థానము, లేక ప్రత్యేక ఆసనమున్నట్లు మాకు కానఁబడదు. జీవాత్మకొక ప్రత్యేక ఆసనము లేకున్నచో, అది చందన గంధమువలె శరీరమునందొక ప్రత్యేక స్థానము కలిగియుండుటచే అది అణుస్వరూపమును కలిగియుండునను విషయమును మేమూహింపఁజాలము. ఏలననగా ఆకాశమువలె సర్వవ్యాపకుడగు జీవుడు, లేక చర్మమువలె శరీరమంతట వ్యాపించియున్న జీవాత్మ కూడా అదే ఫలితమును కలుగఁజేయును.

మేమీ క్రింది విధముగా తర్కింపజాలము. చందన గంధముయొక్క ఒక బిందువువలె శరీరమంతటిని ప్రభావిత మొనర్చుటచే జీవుడణుస్వరూపుడు. ఏలననగా ఈ తర్కము స్పర్శేంద్రియమునకు వర్తించును. చర్మముకూడా అణుస్వరూపమని మనము చెప్పఁజాలము. కావున ప్రత్యక్ష ప్రమాణము లేకుండా జీవునియొక్క పరిమాణమునుఁగూర్చి నిశ్చయించి చెప్పుట సులభసాధ్యము కాదు.

ఈ క్రింది శ్రుతివాక్యములను పేర్కొనుటద్వారా పూర్వపక్షిపై ఆక్షేపణను ఖండించును. “హృదిహ్యేష ఆత్మా” (ప్ర. ఉ. 3-6). “సవాఏష ఆత్మాహృది” (ఛాం. ఉ. 8-3-3). “కతమ ఆత్మేతియోయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః పురుషః” (బృ. ఉ. 4-3-7). ఈ వాక్యములచే జీవాత్మ శరీరములోగల హృదయము నందు ప్రత్యేకస్థానము కలదని ప్రస్ఫుటమగుచున్నది. కావున అది అణుస్వరూపమై యున్నది.

దృష్టాంతము నిర్దుష్టమైయున్నది. అది సరియైయున్నది. ఈ రెండు విషయములు సాదృశ్యతను కలిగియున్నవి. కావున 23వ సూత్రములోని వాదము ఆక్షేపణీయము కాజాలదు.

## 2-3-25 గుణాద్వా లోకవత్

లేక ఒక దీపములోని వెలుతురువలె విజ్ఞానమనెడి గుణమును కలిగి యుండుటచే.

గుణాత్ = విజ్ఞానమనెడి గుణముచే, వా = లేక, లోకవత్ = లోకములోని దీపమువలె.

23 వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

లేక జీవాత్మ తన స్వభావముచే గృహమంతటిని ప్రకాశింపఁజేయు ఒక చిన్న దీపమువంటిది. జీవాత్మ శరీరములోని ఒక ప్రత్యేక స్థలము నాక్రమించి అణు పరిమాణముఁగలదై యున్నను, తన కిరణములచే గదినంతటిని వ్యాపించు దీపమువలె అది తన విజ్ఞానగుణముచే శరీరమంతటిని వ్యాపించును. ఈ విధముగా అది శరీరమంతట సుఖదుఃఖానుభవములను పొందును.

అణుస్వరూపమైయున్న ఆత్మ శరీరమంతట అనుభవజ్ఞానము నెట్లు కలిగియుండునో తెలుపుటకై మరియొక ఉదాహరణ మొసంగఁబడుచున్నది.

## 2-3-26 వ్యతిరేకో గంధవత్

సువాసన సుగంధద్రవ్యము నతిక్రమించునట్లు, ఆత్మయందున్న విజ్ఞాన గుణము దాని నతిక్రమించును.

వ్యతిరేకః = ఆత్మ నతిక్రమించుట, గంధవత్ = సుగంధమువలె.

ఈ సూత్రముచే 23 వ సూత్రమింకను విశదీకరింపఁబడుచున్నది.

పుష్పములలోని సుగంధము వాటి నతిక్రమించి విశాల స్థలములలో ఎట్లు విస్తరింపఁబడునో, అట్లే అణుస్వరూపమై యున్న ఆత్మయొక్క విజ్ఞానమున్నూ ఆత్మ నతిక్రమించి శరీరమంతట వ్యాపించును.

ద్రవ్యగుణము ద్రవ్యమునకభిన్నమై యుండుటచే మఱియు దీపపు వెలుతురు దీపముయొక్క సూక్ష్మరూపమే యగుటచే పై సూత్రములోని దృష్టాంత మసంగతమై

యున్నదని పలికినచో, సుగంధముయొక్క దృష్టాంతము దీనికి వర్తించును కదా! ఒక పుష్పము దూరముగా ఉన్నను దాని సుగంధము నలువైపుల వ్యాపించునట్లు, ఆత్మ అణుస్వరూపమై యున్నను దానికి శరీరముయొక్క పూర్తి ప్రజ్ఞ ఉండుట సాధ్యమగును. పుష్పముయొక్క సుగంధము కూడా పుష్పముయొక్క సూక్ష్మాంశములే యను భూమికపై ఈ దృష్టాంతమున్నూ సరికాదనుట పాడికాదు. ఏలననగా మనము సుగంధము ననుభవించుచున్నామే కాని, దాని సూక్ష్మాంశములను కాదు.

## 2-3-27 తథాచ దర్శయతి

శ్రుతి ఈ విధముగా కూడా వివరించును.

తథా = ఇదే విధముగా, చ = కూడా, దర్శయతి = శ్రుతి వివరించును.

ఆత్మ హృదయమునందుండుననియు, అది అణుపరిమాణముఁ గలదనియును నిరూపించిన పిమ్మట శ్రుతి ఈ క్రింది వాక్యముల మూలముగా తనకు గుణమైన విజ్ఞానము ద్వారా ఆత్మ శరీరమంతటిని వ్యాపించునని తెలుపును. "ఆలోమభ్య అనఖేభ్యః" (ఛాం. ఉ. 8-8-1) (కౌ. ఉ. 4-19).

## 2-3-28 పృథగుపదేశాత్

తన గుణమైన విజ్ఞానముద్వారా ఆత్మ శరీరమంతటిని వ్యాపించునని శ్రుతి ప్రత్యేకముగా ప్రబోధించుటచే.

పృథక్ = వేఱుగా, ఉపదేశాత్ = ప్రబోధించుటచే.

విజ్ఞానము జీవునికి గుణమగుటచే అది దానికి భిన్నమైయున్నదను పూర్వసూత్రమున కీ సూత్రము రక్షణ వంటిది.

పూర్వ సూత్రముయొక్క ప్రతిపాదనను స్థాపించుటకై ఇచ్చట మరికొంత చర్చఁగావింపఁబబడుచున్నది.

"ప్రజ్ఞాయా శరీరం సమారుహ్య " అని కౌషీతక్యుపనిషత్తు (3-6) నుడువుచున్నది. దీనిచే విజ్ఞానము ఆత్మకు భిన్నమై యున్నదనియు అది ఆత్మకు ప్రతినిధిగను, ఉపకరణముగను సంబంధించి యున్నదనియు మఱియు ఈ విజ్ఞానగుణముద్వారా ఆత్మ శరీరమంతట వ్యాపించియున్నదనియును తెలియుచున్నది.

మఱియు "ఏష విజ్ఞానమయః పురుషస్తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ" (బృ. ఉ. 2-1-17) అను వాక్యముచే విజ్ఞానము కర్తయగు జీవునికి భిన్నమై యున్నదని తెలియుచున్నది. ఈ విధముగా మా మతము ప్రతిష్ఠింపఁబడుచున్నది.

జీవునికి మఱియు విజ్ఞానమునకు మధ్య ముఖ్యమైన భేదము లేకున్నను, విజ్ఞానము మూలద్రవ్యమైన జీవునికి విశేషణమై యున్నది. ఆ విశేషణమును జీవుడు ధరించియున్నాడు. ఏలననగా ఈ రెండింటియందు శ్రుతి విభేదమును సూచించును.

## 2-3-29 తద్గుణ సారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్

ప్రజ్ఞానం బ్రహ్మ (సగుణ బ్రహ్మము) యందు వలె గుణసారమైన బుద్ధి కారణముచే ఆత్మయొక్క అణుపరిమాణము సూచింపఁబడినది.

తద్గుణ సారత్వాత్ = బుద్ధియొక్క గుణసారమును కలిగియున్న కారణముచే, తు = కాని, తద్వ్యపదేశః = అణుస్వరూపోపదేశము, ప్రాజ్ఞవత్ = ప్రజ్ఞానం బ్రహ్మయందువలె.

16 వ సూత్రమునందు ప్రారంభింపఁబడిన జీవుని నిజరూపమునుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

'' తు'' యను శబ్దము 19-28 సూత్రములలో చెప్పఁబడిన విషయమునంతటిని ఖండించి, ఆత్మ సర్వవ్యాపకమను విషయమును నిశ్చయించును.

ఈ సూత్రమునుండి నాలుగు సూత్రములు సరియైన సిద్ధాంతమును సూచించుటచే "సిద్ధాంత సూత్రముల"ని చెప్పఁబడును.

జన్మయున్నట్లు శ్రుతి సూచింపనందుచే ఆత్మ అణుపరిమాణము కలదికాదు. పరబ్రహ్మమే జీవునిరూపముగా ఈ విశ్వమునందు ప్రవేశించినదనియు, జీవాత్మ పరమాత్మతో తాదాత్మ్యమునొంది యున్నదనియు మఱియు జీవుడు పరబ్రహ్మమున కభిన్నుడనియును శ్రుతి వివరించుచున్నది. ఒకవేళ ఆత్మ పరబ్రహ్మమేయైనచో, అది బ్రహ్మమువంటి వైశాల్యమును కలిగియుండవలెను. బ్రహ్మము సర్వవ్యాపకమని శ్రుతి వచించుచున్నది. కావున ఆత్మ కూడా సర్వవ్యాపకమైయున్నది.

ఆత్మ అణుస్వరూపమై యున్నను, చర్మముతో దానికిఁగల సంబంధముచే శరీరమునందు సంభవించు దానినంతటిని అది చూడఁగలుగునని నీవు వాదించియున్నావు. కాని ఈ వాదన అసమంజసమైనది. ఏలననగా ఒక ముల్లు గ్రుచ్చుకొన్నప్పుడు ఆ గ్రుచ్చుకొనిన స్థలమునందు మాత్రమే మనము బాధ ననుభవింతుము. ఇంతేకాకుండా గుణము గుణికి భిన్నము కాకుండుటచే, నీవొసంగిన దీపము–వెలుతురు మఱియు పుష్పము–సువాసలనెడి దృష్టాంతము లిచ్చుట యోగ్యమైనవి కావు. వెలుతురు మఱియు సువాసన, దీపము మఱియు పుష్పముయొక్క సూక్ష్మమైన అంశములేనై యున్నవి. ఇఁక ఆత్మయొక్క స్వరూపము చైతన్యమగుటచే, శరీరమంతయు తెలిసికొనఁబడుటచే ఆత్మకూడా శరీరమంతటి పరిమాణమును కలిగియుండవలసి వచ్చును. ఈ సిద్ధాంత మితఃపూర్వమే ఖండంపఁబడినది. కావున ఆత్మ అనంతమై యుండవలయును.

బుద్ధితో తాదాత్మ్యము నొంది యుండుటచే జీవుడు అణుస్వరూపుడుగా చెప్పఁబడును.

బుద్ధియొక్క వైశాల్యమునుఁబట్టి జీవుని పరిమాణము నిశ్చయింపఁబడినది. ఆత్మబుద్ధితో సంబంధముఁగలదై బంధింపఁబడినట్లు ఊహింపఁబడుచున్నది. ఉత్క్రాంతి గమనాగమనములు బుద్ధియొక్క లక్షణములైనను, అవి జీవునిపై ఆరోపింపఁబడినవి. బుద్ధియొక్క సంకుచితత్వ కారణముచే జీవుడు అణుస్వరూపుడుగా తలంపఁబడెను. మార్పులేని శాశ్వతమైన స్వతంత్రాత్మ అభోక్త మఱియు అకర్తయైనను, బుద్ధియొక్క గుణసారమును కలిగియుండుటచే బుద్ధియొక్క పరిమాణముగా చెప్పఁబడినది. ఇది బుద్ధితో కృత్రిమమైన సంబంధమును కలిగియున్నది. ఇది సర్వవ్యాపకుడగు పరమాత్మ ఉపాసన నిమిత్తమై సంకుచితుడగుటవంటిది.

"వాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్యచ, భాగో జీవస్సవిజ్ఞేయస్సచానంత్యాయకల్పతే" యని శ్వేతాశ్వతరోపనిషత్తు (5–9) నుడువుచున్నది. ఈ శ్రుతి వాక్యము ప్రథమమునందు ఆత్మను అణుస్వరూపముగా వర్ణించి, తదనంతరము అది అనంతమైనదని ప్రబోధించును. ఆత్మ నిజముగా అనంతమై అణుత్వము కేవలము రూపకాలంకారమైనప్పుడే పై వాక్యము యొక్క ఔచిత్యము మనకు

గోచరించును. ఏలననగా ఈ రెండు సిద్ధాంతములు ఒకే కాలమునందు ప్రధానమైనవిగా పరిగణింపఁబడజాలవు. బ్రహ్మమునందు జీవాత్మలోని ఆత్మకలదని ఉపనిషత్తులన్నియును నిరూపించుటచే, రూపకమునందు అనంతత్వము నిశ్చయముగా అర్థమొనర్చుకొనఁబడజాలదు.

"బుద్ధేర్గుణేనాత్మ గుణేనచైవ ఆరాగ్రమాత్రోహ్యపరోఽపి దృష్టః" (శ్వే. ఉ. 5-8) అనెడి మరియొక వాక్యము ఆత్మయొక్క పరిమాణమునుఁగూర్చి నుడువుచు స్వయముగా తననుఁగూర్చిఁగాక బుద్ధియొక్క గుణములతో దానికిఁగల సంబంధమును తెలుపుటకై ఆత్మయొక్క అణుత్వ పరిమాణమునుఁగూర్చి ప్రబోధించును.

"ఏషోఽణు రాత్మాచేత సావేదితవ్యః" అని ముండకోపనిషత్తు (3-1-9) ఘోషించుచున్నది. నేత్రాదులచే గ్రహింపఁబడజాలని బ్రహ్మమీ అధ్యాయమునకు విషయమగుటచే ఈ యుపనిషత్తు ఆత్మయొక్క అణుత్వమునుఁగూర్చి ప్రబోధింపదు. కాని అది జ్ఞానప్రకాశముచేత మాత్రము సాక్షాత్కరింపఁబడునని తెలుపును. ఇంతే కాకుండా శబ్దముయొక్క ప్రాధాన్యతనుఁబట్టి ఆత్మ అణుపరిమాణము కలది కాదు.

కావున అణుత్వ సిద్ధాంతము ఆత్మను గ్రహించుటయందుఁగల కష్టసాధ్యతను సూచించుననియు, లేక అది తన ఉపాధులకు చెందియున్నదనియును అర్థమొనర్చు కొనఁబడవలయును .

బుద్ధి హృదయమునందుండును. కావున ఆత్మ హృదయము నందుండునని చెప్పఁబడినది. నిజమునకు ఆత్మ సర్వవ్యాపకమై యున్నది.

ఆత్మ సంసారమునందు తగుల్కొనియుండుటచేతను మఱియు బుద్ధియొక్క గుణసారమునది కలిగియుండుటచేతను, అది సూక్ష్మమైనదిగా చెప్పఁబడినది.

## 2-3-30 యావదాత్మభావిత్వాచ్చ నదోషస్తద్దర్శనాత్

పూర్వ సూత్రములో చెప్పఁబడినట్టి ఆత్మ బుద్ధితో సంబంధమును కలిగి యుండునను విషయమునందు దోషములేదు. జీవాత్మకు ఉనికి యున్నంతవరకిది వర్తించును. ఏలననగా ఇది శ్రుతి సమ్మతమై యున్నది.

యావత్ = ఎంతవరకైతే , ఆత్మభవిత్వాత్ = జీవాత్మకు ఉనికి యున్నంతవరకు, చ = కూడా, నదోషః = దోషములేదు, తద్దర్శనాత్ = ఇది శ్రుతి సమ్మతమైన దగుటచే.

29 వ సూత్రమును బలపఱచు మరియొక కారణమొసంగఁబడినది.

పూర్వపక్షి ఒక ఆక్షేపణను రేకెత్తించును. చాలా మంచిది జీవుని మార్పునొందుస్థితి బుద్ధియొక్క గుణసారముచే కలుగునని మనమూహింతముఁగాక! అట్లయినచో భిన్నపదార్థములై యున్న ఆత్మ మఱియు బుద్ధియొక్క సంయోగము ఒకప్పుడంతము కావలసియుండును. బుద్ధిచే విడివడిన ఆత్మకు ఉనికి లేకుండా పోవలయును; లేక, కనీసము సంసారియగు జీవత్వమును కోల్పోవలసియుండును.

ఈ యాక్షేపణకీ సూత్రము సమాధానమొసంగును. పూర్వసూత్రములోని వాదమునందిట్టి దోషముండజాలదు. ఏలననగా పూర్ణజ్ఞానముద్వారా జీవుడు సంసారమును తరింపజాలనంతవరకు అతడు బుద్ధితో సంయోగమును కలిగియుండును. ఎంతవరకైతే తన ఉపాధియగు బుద్ధితో జీవుడు సంబంధమును కలిగియుండునో, అంతవరకు జనన మరణావస్థల నొందుచు జీవుడు జీవుడుగానే శేషించియుండును.

బుద్ధితో తాదాత్మ్యము నొందని జీవుడంటూలేడు. కేవలము సత్యజ్ఞానము చేతనే బుద్ధితో జీవునికిఁగల సంబంధము తొలగింపఁబడును. "వేదాహమేతం పురుషంమహాంతమాదిత్య వర్ణం తమసః పరస్తాత్, తమేవ విదిత్వాతిమృత్యు మేతినాన్యః పంథావిద్యతేఽ యనాయ" (శ్వే. ఉ. 3-8) అని శ్రుతి వచించుచున్నది.

జీవుడు ఉనికిని కలిగియున్నంతవరకాతడు బుద్ధితో సంయోగము నొందియున్నాడని తెలిసికొనుటెట్లు? మనకీ విషయమునుఁగూర్చి శ్రుతి నుడువుచున్నదని మేము సమాధానము నొసంగుదుము. మృత్యుసమయము నందున్నూ ఈ సంబంధము ఛేదింపఁబడదని శ్రుతులు నుడువుచున్నవి. "కతమ

ఆత్మేతియోయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యంతర్జ్యోతిః పురుషః ససమానస్సన్ను భౌలోకావను సంచరతిధ్యాయ తీవలేలా యతీవ” (బృ. ఉ. 4-3-7) అని శ్రుతి వర్ణించుచున్నది. ఇచ్చట “విజ్ఞానమయః” అను శబ్దము బుద్ధిని సూచించును. “ససమానస్సన్ను భౌలోకావను సంచరతి” అను వాక్యముచే ఆత్మ మరియొక లోకమునకేగినను అది బుద్ధిచే విడివడదని అర్థమొనర్చుకొనవలయును. “ధ్యాయతీవ, లేలాయతీవ” యను శబ్దములచే జీవుడు స్వయముగా ఆలోచించడు మఱియు కదలడు, కాని కేవలము బుద్ధియొక్క సంయోగముచే అతడట్లుఁగావించునని తెలియుచున్నది. జీవుడు ఆలోచించుచున్న వానివలె మఱియు కదలుచున్నవానివలె గోచరించును. ఏలననగా నిజమునకు దానితో సంయోగము నొందియున్న బుద్ధి మాత్రము ఆలోచించును మఱియు చలించును.

జీవుడు తనకుపాధియైన బుద్ధితో సంయోగమునొందుట మిథ్యాజ్ఞానముపై ఆధారపడియున్నది. పూర్ణజ్ఞానముచే తప్ప మరియొకదానిచే మిథ్యాజ్ఞానము తొలగదు. కావున ఎంతవరకైతే బ్రహ్మజ్ఞానము కలుగదో, అంతవరకు ఆత్మకు బుద్ధి మఱియు ఇతర ఉపాధులతోఁగల సంబంధము తొలగఁజాలదు.

## 2-3-31 పుంస్త్వాదివత్త్వస్య సతోఽభివ్యక్తియోగాత్

పుంస్త్వాది శక్తులవలె ఆ సంబంధము వ్యక్తమగుట యుక్తియుక్తమగుటచే.

పుంస్త్వాదివత్ = పుంస్త్వాది శక్తులవలె, తు = నిశ్చయమగుట, అస్య = బుద్ధితోఁగల సంబంధము యొక్క, సతః = ఉనికి, అభివ్యక్తి యోగాత్ = వ్యక్తమగుట సాధ్యమగుటచే.

జీవునికి మఱియు బుద్ధికి మధ్యఁగల శాశ్వత సంబంధమును చూపించుటకై 29 వ సూత్రమున కనుకూలమగు ఒక నిరూపణ ఒసంగఁబడినది.

పైన నుడువఁబడిన ఆక్షేపణను తొలగించుటకై “తు” యను శబ్దము ప్రయోగింపఁబడినది.

“సతాసోమ్యతదా సంపన్నోభవతి స్వమపీతోభవతి” (ఛాం. ఉ. 6-8-1) అను శ్రుతివాక్యానుసారముగా సుషుప్తి మఱియు ప్రళయకాలమునందు బుద్ధితో సంబంధముండజాలదనెడి ఆక్షేపణ చెప్పఁబడుచున్నది. అట్టి ఎడల జీవుడున్నంత కాలము బుద్ధితో సంబంధముండునని చెప్పుట ఎట్లు యుక్తమగును?

దీనిని సూత్రము ఖండించి గాఢనిద్రయందుకూడా ఈ సంబంధము సూక్ష్మరూపమునందుండునని పలుకును. అట్లు కాదేని, అది జాగ్రదవస్థయందు వ్యక్తము కాకుండెడిది. బాల్యావస్థయందు సూక్ష్మరూపమునందున్న మగతనము యౌవన కాలమునందెట్లు వ్యక్తమగునో, అట్లే ప్రళయకాలమునందు మఱియు సుషుప్త్యవస్థయందు సూక్ష్మరూపమునందున్న సంబంధము సృష్టికాలమునందు మఱియు జాగ్రదవస్థయందు వ్యక్తమగుచుండుట సుస్పష్టము.

సుషుప్తియందును, ప్రళయకాలమునందును జీవునికి బుద్ధితోఁగల సంబంధము సూక్ష్మ రూపమునందుండి తిరిగి జాగ్రదవస్థయందును, సృష్టికాలమునందును వ్యక్తమగును.

శరీరమునందు సూక్ష్మరూపమునందుండిననేఁగాని మానవునియందు మగతనము వ్యక్తము కాఁజాలదు. కావున జీవుడు సాంసారిక స్థితియందున్నంత వరకు అతనికి బుద్ధితోఁగల సంబంధము నిలచియుండును.

## 2-3-32 నిత్యోపలబ్ధ్యనుపలబ్ధి ప్రసంగోఽ న్యతరనియమోవాన్యథా

ఒకవేళ బుద్ధికి ఉనికియే లేకుండినచో నిరంతర గోచతర్వముఁగాని, లేక నిరంతర అగోచరత్వముఁగాని సిద్ధించును. లేనియెడల ఆత్మ, లేక ఇంద్రియ ములయొక్క సంకుచితత్వ మేర్పడును.

నిత్యోపలబ్ధ్యనుపలబ్ధి ప్రసంగః = నిత్య గోచరత్వము, లేక నిత్య అగోచరత్వము సిద్ధించును, అన్యతరనియమః = రెండింటియందొక నియమము, వా = లేక, అన్యథా = లేకున్నచో.

జీవోపాధిని కలిగియున్న అంతఃకరణము వివిధ స్థలములలో మనస్సు, బుద్ధి, విజ్ఞానము, చిత్తము ఇత్యాది నానావిధ నామములతో పిలువఁబడును. అది సంశయగ్రస్తమై యున్నప్పుడు మనస్సని చెప్పఁబడును.

అది నిశ్చయాత్మకమైనప్పుడు బుద్ధియని చెప్పఁబడును. నిత్యగోచరత్వము, లేక నిత్యఅగోచరత్వము సిద్ధించు కారణముచే మనమిప్పుడు అంతఃకరణముయొక్క ఉనికిని అంగీకరింపకతప్పదు. దృశ్యమునకు కారణమైయున్న ఆత్మ, ఇంద్రియములు, విషయముల యొక్క సంయోగముచే నిత్యగోచరత్వ మేర్పడును. లేనియెడల ఈ

మూడింటి సంయోగకారణము నిష్ఫలమైనచో, అప్పుడు నిత్య అగోచరత్వమేర్పడును. కాని ఈ రెండింటియందే యొక్కటియు మనకు కానcబడుటలేదు.

లేకున్నచో ఆత్మ, లేక ఇంద్రియములయొక్క శక్తిక్షీణతను మనమంగీకరింప వలసివచ్చును. కాని ఆత్మ అవికార్యమగుటచే శక్తి క్షీణత సాధ్యముకాదు. పూర్వక్షణమునందుcగాని, ఉత్తరక్షణమునందుcగాని ఇంద్రియముల శక్తి క్షీణింపకుండా మధ్యకాలమునందది సంభవించుననుటయు పాడిcగాదు.

కావున దేని సంబంధముచేతను, నిస్సంబంధముచేతను దృశ్యాదృశ్యము లేర్పడునో అట్టి అంతఃకరణముయొక్క ఉనికిని మనమంగీకరింపవలసియున్నది. "అన్యత్రమనా అభూవంనాదర్శమన్యత్ర మనా అభూవం నాశ్రౌషమితి మనసాహ్యేవ పశ్యతి మనసా శృణోతి" (బృ. ఉ. 1-5-3) అని శ్రుతి నుడువుచున్నది. ఇంకను శ్రుతి వచించునదేమనగా వాంఛ, ప్రాతినిధ్యము, సంశయము, విశ్వాసము, అవిశ్వాసము, జ్ఞాపకశక్తి, మఱుపు, సిగ్గు, చింత, భయము ఇవన్నియును మనస్సే.

కావున అంతఃకరణమున కునికియుండుటయేcగాక, అది ఆత్మతో సంయోగము నొందినప్పుడు ఆత్మ జీవునివలె కానcబడును. లేక ఆత్మ సంసారమగ్నమైనట్లు గోచరించును. ఈ విషయము 29 వ సూత్రమునందు వర్ణింపcబడినది. కావున 29వ సూత్రములోని వర్ణన యుక్తియుక్తమై యున్నది.

# 14. కర్త్రధికరణము
## (33-39 సూత్రములు)

### 2-3-33 కర్తా శాస్త్రార్థవత్త్వాత్

శాస్త్రముయొక్క ముఖ్యార్థకారణముచే జీవుడు కర్తయైయున్నాడు.

కర్తా = కర్త, శాస్త్రావర్థవత్త్వాత్ = శాస్త్రములు అర్థవంతములగుటవలన.

జీవుని మరియొక లక్షణము చెప్పcబడుచున్నది.

ఇంతవరకు జీవుని పరిమాణ విషయమై చెప్పcబడినది. ఇప్పుడు జీవుని మరియొక లక్షణము చర్చింపcబడుచున్నది. జీవుడు కర్తయైయున్నాడు. అట్లు కాదేని శాస్త్రసిద్ధాములన్నియును నిష్ప్రయోజనములగును. ఈ యూహచేతనే "అతడు

యజ్ఞ మొనర్పవలయును.” అతడు అగ్నియందాహుతిని వ్రేల్చవలయును. “అతడు దానమొసంగవలయును.” ఇత్యాది శ్రుతివాక్యములు అర్థవంతములగును; లేకున్నచో అవి అర్థరహితములగును. కర్తచే చేయఁబడు కొన్ని ప్రత్యేకవిధులను శాస్త్రములు విధించును. ఒకవేళ జీవుడు కర్త కాకున్నచో ఈ విధులన్నియు అర్థవిహీనములగును. ఈ యూహచేతను ఈ క్రింది వాక్యమునకర్థము సిద్ధించును.“ఏష హిద్రష్టా స్ప్రష్టాశ్రోతాఘ్రాతారసయితా మంతాబోద్ధాకర్తా విజ్ఞానాత్మాపురుషః’ (ప్ర. ఉ. 4-9) “స్వర్గలోకమును వాఛించువాడు యజ్ఞముల నాచరింపవలయును. మఱియు ముక్తినొందఁగోరువాడు బ్రహ్మమును పూజించి, ధ్యానింపవలసియుండును”.

## 2-3-34 విహారోపదేశాత్

మఱియు దానియొక్క విహారమునుఁగూర్చి శ్రుతి ప్రబోధించుటచే.

విహార = ఇచ్ఛానుసారముగా సంచరించుట, ఉపదేశాత్ = శ్రుతివచించుటచే.

33వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

“స ఈయతే అమృతోయత్రకామమ్” (బృ. ఉ. 4-3-12) మఱియు “ఏష ఏత త్ప్రాణాన్గృహీత్వాస్వే శరీరే యథాకామం పరివర్తతే” (బృ. ఉ.2-1-18) అని శ్రుతి ప్రబోధించుచున్నది. స్వప్నమునందు జీవుని సంచారమునుఁగూర్చి వర్ణించు ఈ వాక్యములచే జీవుడు కర్తయను విషయము స్పష్టమగుచున్నది.

## 2-3-35 ఉపాదానాత్

కరణములను గ్రహించుటచేత కూడా అతడు కర్తయనఁబడును.

ఉపాదానాత్ = కరణములను గ్రహించుటచే.

33 వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

పూర్వసూత్రమునందు సూచింపఁబడిన శ్రుతికూడా స్వప్నావస్థయందున్న జీవుడు తనతో కరణములను తీసుకొని వెళ్ళునని నుడువును. “తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ” ప్రాణాన్ గృహీత్వా” (బృ. ఉ. 2-1-17,18) అను వాక్యములచే జీవుడు కర్తయను విషయము స్పష్టమగుచున్నది.

ఇంద్రియములను ఉపయోగించునని చెప్పఁబడుటచే ఈతడు కర్తయే

యగును. స్వప్నావస్థయందు తన స్వశరీరమునందు సంచరించుచు తనతో తన కార్యమున కుపకరణములుగ ఇంద్రియములను తీసికొని వెళ్ళునని శ్రుతి వర్ణించుటచే, జీవుడు కర్తయనియే అంగీకరింపవలసియుండును. “ఏవమే వైష ఏతత్ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరేయథాకామం పరివర్తతే” (బృ. ఉ. 2-1-18).

భగవద్గీత కూడా “శరీరం యదావాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్” (15-8) అని నుడువుచున్నది.

## 2-3-36 వ్యపదేశాచ్చ క్రియాయాం నచేన్నిర్దేశ విపర్యయః

క్రియల ననుసరించిన నామముండుటచే జీవుడు కర్తయేయగును. అట్లు కాదేని, అతని పేరులో మార్పుండవలసియుండును.

వ్యపదేశాత్ = శ్రుతినిర్దేశ కారణముచే, చ = కూడా, క్రియాయాం = కర్మకాండాచరణ విషయమునందు, నచేత్ = అట్లుకాదేని, నిర్దేశ విపర్యయః = సిద్ధాంత వాక్యమునకు విరుద్ధమేర్పడును.

33వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

“విజ్ఞానం యజ్ఞంతనుతే, కర్మాణితనుతేఽపిచ” (తై. ఉ. 2-5) అను వాక్యమునందు “విజ్ఞానమ”నగా జీవుడని అర్థమగునే కాని, బుద్ధికాదు. దీనిచే జీవుడు కర్తయనెడి విషయము స్పష్టమగుచున్నది.

విజ్ఞానము జీవుని సూచించునే కాని, బుద్ధిని కాదు. ఏలననగా ఒకవేళ బుద్ధిని సూచించునేని “విజ్ఞానేన”యను శబ్దమును శ్రుతి ప్రయోగించియుండెడిది. “విజ్ఞానం యజ్ఞం తనుతే” యను వాక్యములోని ప్రథమావిభక్తికి బదులుగా “విజ్ఞానేన” యనెడి తృతీయావిభక్తి ప్రయోగింపఁబడినచో ఉపకరణముద్వారా యనెడి భావము మనకు గోచరించెడిది.

“తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ” (బృ. ఉ. 2-1-17) అను మరియొక శ్రుతి వాక్యమునందు బుద్ధిని సూచించు “విజ్ఞాన” శబ్దము తృతీయావిభక్తియందు ప్రయోగింపఁబడినది. ప్రస్తుతము చర్చింపఁబడుచున్న వాక్యమునందు “విజ్ఞాన” శబ్దము కర్తయొక్క లక్షణమును తెలుపుటకై ప్రథమావిభక్తియందు ప్రయోగించఁబడినది. కావున అది బుద్ధికి భిన్నమైయున్న జీవుని సూచించుచున్నది.

## 2-3-37 ఉపలబ్ధివ దనియమః

దృష్టియందువలె ఇచ్చట కూడా నియమము లేదు.

ఉపలబ్ధివత్ = దృష్టియందు వలె, అనియమః = నియమము లేదు.

33వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఒకవేళ జీవుడు స్వతంత్రుడైన కర్తయైనచో అతడు లాభకరమైన, లేక, నష్టదాయకమైన సమస్త కర్మలనేల ఆచరింపఁజాలడనెడి ఆక్షేపణ చెప్పఁబడుచున్నది. అతడు సుకృత, దుష్కృత కర్మలను కాకుండా కేవలము తనకు లాభకరమైన కర్మలను మాత్రము ఆచరించియుండెడివాడు.

ఈ సూత్రమునందీ ఆక్షేపణ ఖండింపఁబడినది. జీవుడు స్వతంత్రుడైయున్నను అతడు సుఖదుఃఖ దాయకములగు రెండు పదార్థములనెట్లుఁగాంచునో, అట్లే అతడు సుకృత, దుష్కృత కర్మలను రెండింటి నొనర్చును. అతడు కేవలము లాభదాయక ములగు కర్మల నొనర్చవలయుననియు మఱియు హానికరములగు దుష్టకర్మలను త్యజింపవలయుననియు నియమము లేదు.

కర్మల నొనర్చునప్పుడు జీవుడు నానావిధములగు స్థలములు, సమయములు మఱియు నిమిత్త కారణములపై ఆధారపడియుండుటచే అతడు పూర్తిగా స్వతంత్రుడు కాఁడు. కాని కర్తకు సహాయ మవసరమగుటచే అతడు కర్తృత్వమునుండి విడువఁ బడఁజాలడు. ఒక వంటవానికి ఇంధనము, జలము ఇత్యాదులవసరమై యున్నను, వంటకు అతడు కర్తగానే పరిగణింపఁబడును. అతని వంటవానితన మెల్లప్పుడు శేషించియే యుండును.

## 2-3-38 శక్తి విపర్యయాత్

బుద్ధి శక్తి పరావర్తనము నొందుటచే.

శక్తి విపర్యయాత్ = బుద్ధి శక్తి పరావర్తనము నొందుటవలన.

33వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఒకవేళ ఉపకరణమైయున్న బుద్ధి కర్తయైనచో మఱియు ఉపకరణ కార్యమును నెఱవేర్పకున్నచో శక్తి పరావర్తనమగును. అనగా బుద్ధియొక్క ఉపకరణశక్తి త్రోసివేయఁబడి, కర్తృత్వశక్తి తత్స్థానమునందుంచఁ బడును.

ఒకవేళ బుద్ధికి కర్తృత్వశక్తి ఉండియున్నచో, అది అహం ప్రత్యయమునకు విషయమైయున్నదని కూడా అంగీకరింపవలసివచ్చును. ఏలననగా సమస్త కర్మలు అహం ప్రత్యయముచే చేయఁబడుచుండుట చేతనే “నేను వెళ్ళెదను, నేను వచ్చెదను, నేను భుజించెదను, నేను త్రాగెదను, నేను చేయుదును, నేను అనుభవింతును” అని మనము పలుకుచున్నాము.

ఒకవేళ బుద్ధికి కర్తృత్వశక్తి ఉండియున్నచో మఱియు అది పదార్థము లన్నింటిని ప్రభావిత మొనర్పఁ గలిగినచో, అది పదార్థములను ప్రభావితమొనర్చుటకు మఱియొక ఉపకరణమును దానికారోపింపవలసి యుండును. ఏలననగా ప్రతి కర్తకు ఉపకరణమావశ్యకమైయుండును. కావున ఈ వివాదమంతయు నామ మాత్రమే. కర్మేంద్రియమునకు భిన్నమైనది కర్తయగుటచే, రెండువిధములుగను నిజమైన భేదము మనకు కన్పట్టదు. రెండువిధములుగను కర్త ఉపకరణమునకు భిన్నమైనట్లు మనమంగీకరింప వలసియుండును.

## 2-3-39 సమాధ్యభావాచ్చ

మఱియు సమాధి అసాధ్యమగుటచే.

సమాధ్యభావాత్ = సమాధి అసాధ్యమగుటచే, చ = మఱియు.

33వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఒకవేళ జీవుడు కర్త కాకున్నచో ముక్తిని పొందుట దుర్లభమగును. ఒకవేళ జీవుడు కర్త కాకుండునేని “ఆత్మావా అరేద్రష్టవ్యః” (బృ. ఉ. 2-4-5) వంటి శ్రుతివాక్యములలో నుడువఁబడిన సమాధి ద్వారా ఆత్మసాక్షాత్కారము పొందఁబడుట అనునది అసాధ్యమగును. జీవుడు కర్తయైనప్పుడే వేదాంతగ్రంథములలో ప్రబోధింపఁబడిన ఉపాసన సాధ్యమగును. “ఆత్మావా అరేద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిది ధ్యాసితవ్యః” (బృ. ఉ. 2-4-5). “సోఽన్వేష్టవ్యస్స విజిజ్ఞాసి తవ్యః” (ఛాం. ఉ. 8-7-1). “ఓమిత్యే వంధ్యా యథాత్మానమ్” (ముం. ఉ. 2-2-6) అను వాక్యముల చేత కూడా జీవుడు కర్తయను విషయము నిరూపింపఁబడుచున్నది.

సమాధినిఁబడయుటకు మఱియు అవినాశమగు జ్ఞానమునొందుటకై శ్రవణ, మనన, నిధిధ్యాస, ధ్యానాదుల నభ్యసించుటకు జీవుడు సమర్థుడు కాకుండును.

కావున ఆత్మకు మోక్షమనునది లేకుండును. ఈ కారణముచే ఆత్మయే కర్తయగును, కాని బుద్ధికాదని నిర్ధారింపఁబడుచున్నది.

# 15. తక్షాధికరణము

## 2-3-40 యథాచ తక్షోభయథా

మఱియు వడ్లవాడు ఉభయపక్షమునందున్నట్లు.

యథా = వలె, చ = మఱియు, తక్షా = వడ్లవాడు, ఉభయథా = రెండు విధములుగా.

33వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

33 నుండి 39వ సూత్రము వరకు చెప్పఁబడిన కారణముచే జీవుడు కర్తయను విషయము నిరూపింపఁబడినది. ఇఁక ఈ కర్తృత్వము జీవునికి స్వాభావికమైనదా? లేక ఉపాధుల కారణముచే అతనికి కర్తృత్వము ఆరోపంపఁబడినదా? అను విషయమును మనమిప్పుడు చర్చింపవలసియున్నది. అది దానికి స్వాభావికమని న్యాయ సిద్ధాంతము ప్రతిపాదించును.

దీనినీ సూత్రము ఖండించి కర్తృత్వము జీవునిపై ఆరోపింపఁబడినదే, కాని నిజముకాదని ప్రతిపాదించును. ఇట్టి కర్తృత్వము జీవునికి స్వాభావికము కాదు. ఏలననగా ఒకవేళ అది స్వాభావికమగునేని, అగ్ని స్వాభావికముగా వేడినొసంగుటచే అది వేడిని విడువనట్లు జీవునికి మోక్షము సంభవింపకుండెడిది. కర్తృత్వము సహజముగా బాధతో కూడియుండును. కర్తృత్వశక్తియున్నను, ఆ కర్తృత్వముచేతనే ముక్తి కలుగునని నీవు చెప్పఁజాలవు . ఏలననగా ఒకానొక సమయములో అతడు తన కర్తృత్వశక్తిని వినియోగింపవలసియే యుండును. ఆత్మ నిత్య శుద్ధ బుద్ధ చైతన్య స్వరూపమైయున్నదని శ్రుతి పలుకును. కర్తృత్వము దానికి సహజమైయున్నచో ఇది ఎట్లు పొసగును? కావున ఉపాధి కార్యతాదాత్మ్యతనుఁబట్టి దానికి కర్తృత్వమేర్పడుచున్నది. కాఁబట్టి పరబ్రహ్మమునకు భిన్నమైన కర్తఁగాని, భోక్తఁగాని లేదు. అట్లయినచో అవిద్య కారణముచేతనే కర్తృత్వ భోక్తృత్వము లేర్పడుటచే, దేవుడు కూడా సంసారి యగునని నీవు చెప్పఁజాలవు.

తన కార్యమునకు వడ్లవాని శరీరము కారణము కాఁజాలదు. అతని ఉపకరణములే కారణములగును. అదే విధముగా మనస్సు ఇంద్రియముల కారణము చేతనే జీవుడు కర్తయగుచున్నాడు. శాస్త్రవిధులు కర్తృత్వము నాదేశింపవు. కాని అవిద్యచే కలిగిన కర్తృత్వము నాధారముగాఁగొని చేయఁబడవలసిన కర్మలను గూర్చి ఆదేశించును.

"అసంగోహ్యయం పురుషః" (బృ. ఉ. 4-3-15) అని శ్రుతి వచించును. ఏ విధముగానైతే సామాన్యజీవితము నందొక వడ్లవాఁడు తన ఉపకరణముతో పనిచేయునప్పుడు బాధపడి, తన పని ముగిసిన తర్వాత ఎట్లు సంతోషించునో; అదే విధముగా ఆత్మ బుద్ధ్యాదులచే సంబంధమును కలిగియుండి, జాగ్రత్స్వప్నావస్థలలో పనిచేయుచు బాధపడును. మఱియు సుషుప్తియందు కర్తృత్వమునుండి విడివడినదై ఆనందము నొందును.

శాస్త్రవిధులు ప్రత్యేక కర్మలనాదేశించునప్పుడు ఆత్మయొక్క భూమికను సూచించును. స్వాభావికముగా ఆత్మ నిష్క్రియమైయున్నది. బుద్ధ్యాది ఉపాధుల సంబంధముచే అది క్రియాశీలమగును. నిజమునకు కర్తృత్వము బుద్ధికి సంబంధించియున్నది. శాశ్వతమగు చైతన్యము ఆత్మయందున్నది. కర్తృత్వము అహంకారముతో కూడి యుండును. కావున ఇట్టి స్వభావముఁగల కర్తృత్వము బుద్ధికి సంబంధించినదే, కాని ఆత్మకు సంబంధించినది కాదు.

శాస్త్రవిధులు ప్రత్యేక కర్మలనాదేశించునప్పుడు అవిద్యచే ప్రతిష్ఠింపఁబడిన కర్తృత్వమును ముందుగా ఊహించును. కాని అవి స్వయముగా ఆత్మను కర్తగా తీర్మానించవు. ఆత్మయొక్క కర్తృత్వము దాని నిజమైన స్వరూపము కాదు. ఏలననగా దాని నిజస్వరూపము బ్రహ్మమైయున్నదని శ్రుతి వచించుచున్నది. కావున వైదిక విధులలోని అవిద్యచే ఏర్పడిన జీవుని కర్తృత్వము సార్థకమైనదని మేము నిర్ణయింతుము.

స్వప్నములోని విహార వర్ణనచేత కూడా కర్తృత్వమును నీవు ఊహింపలేవు, ఏలననగా స్వప్నమునందు కూడా మనస్సు, లేక బుద్ధితో సంబంధముండి యుండును. స్వప్నావస్థయందు కూడా ఆత్మయొక్క ఉపకరణము లకు పూర్తి విశ్రాంతి యుండదు. ఏలననగా, అప్పుడు కూడా అది బుద్ధితో సంబంధమును

కలిగియుండునని శ్రుతి నుడువుచున్నది. "బుద్ధితో కూడా స్వప్నముగా మారి, అది ఈ ప్రపంచమునతిక్రమించును." శ్రుతి కూడా ఇట్లు పలుకును: "ఇంద్రియములు విశ్రాంతినొంది, విషయములచే ఆవరించియున్న మనస్సుకు విశ్రాంతిలేని స్థితియే స్వప్నమనఁబడును."

ఈ విధముగా జీవునికిఁగల కర్తృత్వము కేవలము దాని ఉపాధియైన బుద్ధిచేతనే ఏర్పడునను విషయము నిశ్చయింపఁబడుచున్నది.

# 16. పరాయత్తాధికరణము

## (41-42 సూత్రములు)

### 2-3-41 పరాత్తుతచ్ఛ్రుతేః

కాని జీవుని కర్తృత్వము కూడా పరమాత్ముని పైననే ఆధారపడియుండునని శ్రుతి వచించుచున్నది.

పరాత్ = పరమాత్ముని నుండి, తు = కాని, తత్ = కర్తృత్వము, శ్రుతేః = శ్రుతి నుడువుటవలన.

33వ సూత్రమునకొక హద్దు చెప్పఁబడినది.

ఉపాధికారణముచే అజ్ఞానదశయందు జీవుని కేర్పడిన కర్తృత్వము పరమాత్మనాధారముగాఁగొని యుండునా? లేక తనపైననే ఆధారపడియుండునా? యను చర్చలోనికి మనమిప్పుడు ప్రవేశింతము.

పూర్వపక్షియొక్క సంశయమును "తు" యను శబ్దము నివారించును. దేవుడే కారణమని శ్రుతి వచించుటచే, జీవుని కర్తృత్వము అతని కోరికలు మఱియు ఇంద్రియములనాధారముగాఁగొనియుండును. కాని దేవుడు దానికాధారము కాదని పలుకుట దోషయుక్తమగును.

జీవుని కర్తృత్వమునకు కూడా పరమేశ్వరుడే ఆధారమైయున్నాడు. జీవుని కర్తృత్వము అప్రధానమైనదనియు మఱియు అది పరమేశ్వరునిచే నియమింపఁ బడుననియును శ్రుతి ప్రబోధించు చున్నది. దేవునిచే ప్రేరితుడై జీవుడు సుకృత దుష్కృత కర్మలనొనర్చును.

శ్రుతి ఇట్లు నుడువుచున్నది: "ఏషహ్యేవ సాధుకర్మకారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్ననీయతే। ఏషహ్యేవైనం సాధుకర్మకారయతి తం యమేభ్యో" (కౌ. ఉ . 3-9) మఱియు "ఆత్మయందు నివసించువాడు ఆత్మను అంతరంగములోనికి లాగును." (శత. బ్రా. 14-6-7-30). "అంతః ప్రవిష్టః శాస్తాజీవానామ్" "దేవుడు అందఱి హృదయములయందుండి, జీవులందఱిని పరిపాలించుచున్నాడు.

జీవుడు కర్తయనియు మఱియు ఈ కర్తృత్వమునకు కారణము కర్మఫలముల నొసంగునట్టి, సర్వవ్యాపకుడైన, సకల కర్మలకు సాక్షియైన, ప్రేరణదాయకుడైన మఱియు సర్వులకు మార్గదర్శియైన పరమేశ్వరుడనియు శ్రుతి పలుకుచున్నదని మేము దీనికి సమాధానమొసంగుదుము.

## 2-3-42 కృతప్రయత్నా పేక్షస్తు విహిత ప్రతిషిద్ధా వైయర్థ్యాదిభ్యః

కాని దేవుడు జీవుని ప్రవర్తింపఁజేయుట, అతనిచే చేయఁబడిన కర్మలపై ఆధారపడియుండును. ఏలననగా: అట్లు కాకున్నచో శాస్త్రముయొక్క విధి నిషేధములు నిష్ప్రయోజనములగును.

కృతప్రయత్నాపేక్షః = చేయఁబడిన కర్మలపై ఆధారపడియుండుట, తు = కాని, విహిత ప్రతిషిద్ధా వైయర్థ్యాదిభ్యః = శాస్త్రములోని విధినిషేధకర్మలు నిరర్థకములు కాకుండునట్లు.

ఈ సూత్రము కొన్ని ప్రత్యేక నియమములచే 41వ సూత్రములోని ఆశయమును నివారించుటకు ప్రయత్నించుచున్నది.

ఒకవేళ కర్తృత్వకారణము దేవునికి చెందియున్నచో, అతడు క్రూరత్వము మఱియు పక్షపాతములను కలిగియుండవలసివచ్చుటచే, తాను చేయని కర్మఫలమును జీవుడనుభవింపవలసివచ్చును. కొందఱిచే సత్కర్మలను, మరికొందఱిచే దుష్కర్మలను చేయించుటచే అతడు క్రూరుడు మఱియు చాదస్తుడున్నూ కావలసివచ్చును. ఈ సూత్రమీ సంశయమును నివారించును.

"తు" యను శబ్దము ఆక్షేపణలను తొలగించును. జీవుడు పూర్వజన్మల యందొనర్చినట్టి సుకృత దుష్కృత కర్మలననుసరించియే దేవుడెల్లప్పుడు అతనిని ప్రవర్తింపఁజేయును. మఱియు మంచిచెడ్డ ఫలముల నొసంగును. బీజముయొక్క శక్తిననుసరించి దానిని ఫలింపఁజేయుటకాతడు వర్షము వంటివాడు. కర్తృత్వము దేవునిపై ఆధారపడియున్నను, చేయువాడు జీవుడేనైయున్నాడు. జీవుడేమిచేయునో

దానినే దేవుడాతనిచే చేయించును. ఇట్టి కార్యము పూర్వజన్మయందొనర్చిన కర్మఫలమైయున్నది. మఱియు వాసనలు కూడా పూర్వమొనర్చిన కర్మల ననుసరించియుండును. సంసారము అనాదియగుటయే దీనికి కారణము. అందుచే దేవుని మార్గదర్శకత్వము కొఱకై కర్మలతో కూడిన పూర్వజన్మలెల్లప్పుడుండును. కావున అతడు క్రూరుడనియు, పక్షపాతియనియు, చాదస్తుడనియు నుడువఁదగదు. ఫలముల నొసంగుటకై పరమాత్ముడు జీవుడొనర్చు కర్మలపై ఆధారపడియుండును. అట్లుకాదేని శాస్త్రములలోని విధినిషేధములన్నియు నిరర్థకములగును. ఒకవేళ దేవుడు ఫలముల నొసంగుటకై జీవుడొనర్చు కర్మలపై ఆధారపడకున్నచో, పురుషార్థమునకేమాత్రము తావులేకుండును. ఈ సిద్ధాంతముల ననుసరించుట ద్వారా జీవునకేలాటి ప్రయోజనముండఁజాలదు.

ఇంతేకాకుండా, ఒకవేళ మనకర్మలు ఉపాదాన కారణము మఱియు దేవుడు పరమ కారణము కాకున్నచో, దేశకాల కారణములు కార్యకారణ సంబంధమునను సరించియుండక, చపలతతో కూడియుండెడివి.

# 17. అంశాధికరణము
# (43-53 సూత్రములు)

## 2-3-43 అంశో నానావ్యపదేశా దన్యథా చాపిదాశకితవాదిత్వ మధీయత ఏకే

రెండింటియందు భేదము చెప్పఁబడుటచే జీవుడు దేవునియొక్క అంశమైయున్నాడు. లేక, అతడు బ్రహ్మమున కభిన్నుడనియు చెప్పవచ్చును. ఏలననగా కొన్ని వైదిక గ్రంథములలో బ్రహ్మము జాలరి, వంచకుడు ఇత్యాదిగా చెప్పఁబడియున్నది.

అంశః = అంశము, నానావ్యపదేశాత్ = భేదము చెప్పఁబడుటచే, అన్యథా = లేకున్నచో, చ = మఱియు, అపి = కూడా, దాశకితవాదిత్వం = జాలరి, వంచకుడు ఇత్యాదులు, అధీయతే = చెప్పుచున్నారు, ఏకే = ఒక శాఖవారు.

జీవుడు బ్రహ్మమునకు భిన్నుడు మఱియు అభిన్నుడు కూడానై యున్నాడని ఈ సూత్రము నుడువుచున్నది.

దేవుడు జీవుని పరిపాలించునని పూర్వాధికరణమునందు చెప్పఁబడినది. ఇప్పుడు జీవుడు బ్రహ్మముతో ఎట్టి సంబంధమును కలిగియున్నాడను విషయము చర్చింపఁబడుచున్నది. అది స్వామి సేవక సంబంధమా? లేక అగ్ని మఱియు అగ్ని కణముల సంబంధమా?

అది స్వామి సేవక సంబంధమని పూర్వపక్షి పలుకును. ఏలననగా పోష్యపోషక సంబంధమునందిదియే సుప్రసిద్ధమైయున్నది.

మిణుగురు అగ్నియొక్క అంశమెట్లగునో, అట్లే జీవుడు దేవునియొక్క అంశముగా తలంపఁబడ వలయునని ఈ సూత్రము నుడువును. ఐతే జీవుడు నిజముగా ఒక అంశముకాదు, కాని అంశమువంటివాఁడు. బ్రహ్మమునందేలాటి విభాగములు లేకుండుటచే ఇది కేవలము కల్పితమైయున్నది. బ్రహ్మము నిష్కళము, అఖండము మఱియు నిరవయవమైయున్నది.

ఐతే అది దేవుని కభిన్నమైయున్నదని చెప్పఁబడక, అంశమని ఏల చెప్పఁబడినది? ఏలననగా ఈ క్రింది శ్రుతివాక్యములు వాటియందు భేదమును వచించుచున్నవి. "సోన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః" (ఛాం. ఉ. 8-7) "ఏతమేవ విదిత్వాము నిర్భవతి'' (బృ. ఉ. 4-4-22) ''అంతరోయమయత్యేషత ఆత్మాంతర్యామీ" (బృ. ఉ. 3-7-23) "ఆత్మావా అరేద్రష్టవ్యః" (బృ. ఉ. 2-4-5) ఈ విభేదము తాత్కాలిక దృష్టికోణము ననుసరించి చెప్పఁబడినది. కాని పూర్ణదృష్టి కోణము ననుసరించి అవి అభిన్నములై యున్నవి.

"జాలరులు బ్రహ్మమే, సేవకులు బ్రహ్మమే, జూదరులు బ్రహ్మమే" అను వాక్యమునుఁబట్టి నీచులు కూడా బ్రహ్మమైయుండగా ఇఁక స్త్రీపురుషులు, బాలురు మఱియు జీవులందఱు బ్రహ్మమేయను విషయము వేఱుగా చెప్పవలయునా? యను విషయము సూచింపఁబడినది.

"త్వం స్త్రీ త్వంపుమానసిత్వం కుమార ఉతవాకుమారీ, త్వం జీర్ణోదండేన వంచసిత్వం జాతోభవసి సర్వతోముఖః" (శ్వే. ఉ. 4-3) వంటి వాక్యములు కూడా ఇదే దృష్టికోణమును కలిగియున్నవి. "అతడు వినా మరియొకటిలేద"నెడి వాక్యము మఱియు తత్సదృశములగు వాక్యములున్నూ ఇదే సత్యమును వెలిఁబుచ్చు చున్నవి. వేడిమి అగ్ని మఱియు మిణుగురులకెట్లు సంబంధించియుండునో, అట్లే

అభిన్నమైన విజ్ఞానము జీవునికి మఱియు దేవునికి సంబంధించియున్నది.

భిన్నాభిన్నములగు ఈ రెండు దృష్టుల ననుసరించి జీవుడు దేవుని అంశమేయను విస్తారమైన దృష్టి మనకు లభ్యమగును.

## 2-3-44 మంత్రవర్ణాచ్చ

మంత్రములోని శబ్దములనుఁబట్టి కూడా జీవుడు దేవుని అంశమని తెలియుచున్నది.

మంత్రవర్ణాత్ = మంత్రములోని అక్షరములనుఁబట్టి, చ = కూడా.

జీవుడు బ్రహ్మముయొక్క అంశమని ప్రతిపాదించునట్టి 43వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

"పాదము" మఱియు "అంశమ"నెడి శబ్దములు రూపాంతరములై యున్నవి. ఈ రెండున్నూ విభాగమనెడి అర్థము నొసంగును.

కావున జీవుడు దేవునియొక్క అంశమని మేము నిర్ణయింతుము. ఈ క్రింది కారణముచేతనే కూడా పై నిర్ణయము సమంజసమగును.

## 2-3-45 అపిచ స్మర్యతే

ఈ విధముగా స్మృతియందున్నూ ప్రతిపాదించబడినది.

అపి = కూడా, చ =మఱియు, స్మర్యతే = స్మృతియందిట్లు ప్రతిపాదింపఁ బడినది.

జీవుడు బ్రహ్మముయొక్క అంశమనెడి వాదమిచ్చుట పరిసమాప్తమైనది.

జీవుడు బ్రహ్మముయొక్క అంశమని స్మృతి కూడా నుడువుచున్నది. "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (భగవద్గీత 15-7).

## 2-3-46 ప్రకాశాదివ న్నైవం పరః

ప్రతిబింబముల కదలికచే ప్రకాశము ప్రభావితముకానట్లు, జీవునివలె పరమాత్ముడు దుఃఖములచే ప్రభావితుడు కాఁడు.

ప్రకాశాదివత్ = ప్రకాశాదులవలె, న = కాదు, ఏవం = ఇట్లు (జీవునివలె), పరః = పరమాత్మ.

ఈ సూత్రమునందు పరమేశ్వరుని ప్రత్యేకత ప్రతిపాదింపఁబడినది.

ఇచ్చట పూర్వపక్షి మరియొక ఆక్షేపణను లేవదీయుచున్నాడు. ఒకవేళ జీవుడు దేవునియొక్క అంశ

మైయున్నచో, జీవునివలె దేవుడుకూడా సుఖ దుఃఖముల ననుభవింపవలసి యుండును. కాలుకుఁగాని, చేతికిఁగాని, మరి ఏ యితర అవయవమునకుఁగాని బాధకలిగినప్పుడు పూర్తి రామకృష్ణుడు బాధపడుటను మనము సర్వసామాన్యముగాఁ గాంచుచున్నాము. కావున దేవుని ప్రాప్తించుట గొప్ప దుఃఖమును మఱియు బాధను కొని తెచ్చుకొనుటయగును. దీనికంటె పూర్వము జీవుడు కలిగియున్న తక్కువ బాధయే శ్రేష్ఠమని చెప్పనగును.

దీనినీసూత్రము ఖండించును. దేవుడు జీవునివలె సుఖ దుఃఖములనను భవింపడు. అజ్ఞానవశముచే జీవుడు శరీరేంద్రియ మనస్సులతో తాదాత్మ్యము నొందుటచే సుఖదుఃఖముల ననుభవించును. పరమాత్ముడు శరీరముతో తాదాత్మ్యమునొందడు. లేక దుఃఖముచే వ్యసనమునొందడు.

జీవుని దుఃఖముకూడా నిజముకాదు. అది కేవలము ఊహామాత్రము. దీనికి కారణము అవిద్యాజనితములగు శరీరేంద్రియ మనస్సులనుండి ఆత్మను వేఱుచేయకుండుటయే యగును.

మానవుడేవిధముగా భ్రమచే శరీరముతో తాదాత్మ్యము నొందుటచే ఒక కాల్పుచేతను, గాయముచేతను దుఃఖము ననుభవించునో, అదే విధముగా అతడు భ్రమచే తాదాత్మ్యము నొందుటచేతనే తన కుమారులు, లేక, స్నేహితులు పొందు దుఃఖమును తాను స్వయముగా అనుభవించును. మోహము,లేక, ప్రేమచే అతడు వారియందు ప్రవేశించి "నా కుమారుడు, నా స్నేహితుడు" అని తలంచును. కావున కేవలము భ్రమపూరితమగు ఊహచేతనే దుఃఖానుభవము కలుగునని స్పష్టమగుచున్నది.

కొందఱు స్త్రీ పురుషులొకచోట గుమిఁగూడి మాట్లాడుకొనుచున్నప్పు డొకానొకడు "కుమారుడు చనిపోయెన"ని కేక వేసినచో మోహముచే కుమారులతో తాదాత్మ్యతను, సంబంధమును, ప్రగాఢమగు ప్రేమను కలిగియున్నవారి మనస్సులలోనే దుఃఖముత్పన్నమగును. కాని ఇట్టి ఊహనుండి వివర్జితులైయున్న

మునులు, లేక సన్న్యాసుల మనస్సులలో దుఃఖముత్పన్నము కాదు. తన బంధువులు, స్నేహితుల మృత్యువుచే వివేకజ్ఞానము కలిగియున్న మునియే దుఃఖము నొందనప్పుడు, ఇఁక కేవలుడు, శుద్ధచైతన్యుడు, శాశ్వత విజ్ఞానవంతుడు, ఆత్మానందస్వరూపుడు, నిరవయవుడునగు పరమేశ్వరునికి దుఃఖమే మాత్రము లేకుండునని వేఱుగా చెప్పవలయునా?

దీనిని నిరూపించుటకై ఈ సూత్రము ప్రకాశాదులను దృష్టాంతముగా స్వీకరించినది. ఏ విధముగా నైతే సర్వవ్యాపకమైన సూర్యప్రకాశము కొన్ని ప్రత్యేక పదార్థముల సంబంధముచే నిలువుగను, వక్రముగను ఐనట్లు కానఁబడునో, కాని నిజమునకది ఎట్లు కదలఁజాలదో, లేక నీటిలోని సూర్యబింబము చలించినట్లు కానఁబడినను, నిజమునకా సూర్యుడెట్లు చలింపడో అదే విధముగా దేవుడున్నూ సుఖదుఃఖాది వ్యసనములచే ప్రభావితుడు కాఁజాలడు. కాని దేవుని అంశమైయున్న అజ్ఞాన జనితమగు బుద్ధిచే సంకుచితుడై యున్న జీవుడు మాత్రము ఈ సుఖ దుఃఖాదుల ననుభవించును.

పృథ్విలోని అపవిత్రతలచే సూర్యుని అంశములైన సూర్యకిరణములెట్లు అంటుఁబడవో, అదే విధముగా జీవుడు దేవునియొక్క అంశమేనైయున్నను, జీవుని సుఖదుఃఖములచే పరమాత్ముడు ప్రభావితుడు కాఁజాలడు.

అజ్ఞాన నిర్మూలనానంతరము జీవుని వ్యక్తిత్వమెప్పుడు నశించునో, అప్పుడది బ్రహ్మమగును. "తత్త్వమసి". ఈ విధముగా జీవుని దుఃఖముచే పరమాత్ముడు ప్రభావితుడు కాఁజాలడు.

## 2-3-47 స్మరంతిచ

ఈ విషయమును స్మృతులు కూడా ప్రతిపాదించుచున్నవి.

స్మరంతి = స్మృతులు ప్రతిపాదించుచున్నవి, చ = కూడా.

ఈ రెండింటిలో పరమాత్ముడు శాశ్వతుడుగను, నిర్గుణుడుగను చెప్పఁబడినాడు. నీటిలోని పద్మపత్రము వలె అతడు కర్మఫలములచే ఏ మాత్రము అంటుఁబడడు. ఈ విధముగా పరమాత్ముడు సుఖదుఃఖముల ననుభవింపడను విషయమును స్మృతివాక్యములు ప్రతిపాదించుచున్నవి.

## 2-3-48 అనుజ్ఞాపరిహారౌ దేహసంబంధాజ్జ్యోతిరాదివత్

ప్రకాశాది విషయములకువలె ఆత్మ దేహముతో సంబంధించియుండుటచే, విధినిషేధములు సాధ్యములగును.

అనుజ్ఞాపరిహారౌ = విధినిషేధములు, దేహసంబంధాత్ = దేహ సంబంధముచే, జ్యోతిరాదివత్ = జ్యోతి ఇత్యాదులవలె.

విధినిషేధాది నియమములను పాటించుటయందుఁగల ఆవశ్యకత వర్ణింపఁబడినది.

ఆత్మ, లేక పరమాత్మ ఏకైకము. ఆత్మ విషయములో విధినిషేధములుండఁ జాలవు. కాని అది శరీరముతో సంబంధించియున్నంతవరకు దానికి విధినిషేధము లావశ్యకములగును. ఈ విధినిషేధము లెట్టివి? "అతడు తన భార్యను ఋతుకాలమునందే సమీపించవలయును." "అతడు తన గురుపత్నిని దరిఁజేఁరాదు". "అగ్నిష్టోమమునకు చెందిన జంతువు నాతడు చంపవలయును", మఱియు "అతడేలాటి ప్రాణిని హింసింపరాదు".

అగ్ని ఏకమేనైయున్నను, కాష్ఠములోని అగ్ని నిషేధింపఁబడును. కాని యజ్ఞములోని అగ్ని అంగీకరింపఁబడును. రత్నగర్భితమగు భూభాగము కోరఁబడును. కాని శవములుఁగల భూభాగము త్యజింపఁబడును. గోమూత్రము మఱియు ఆవుపేడ పరిశుద్ధముగా భావింపఁబడి, వినియోగింపఁబడును. కాని ఇతర జంతువుల మలమూత్రములు పరిత్యజింపఁబడును. పరిశుభ్రమైన పాత్రనుండి పోయఁబడిన నీరు, లేక పవిత్రుడైన మానవుడొసంగిన జలము అంగీకరింపఁ బడును. కాని అపరిశుభ్రమైన పాత్రలోని నీరు, లేక అపవిత్రుడైన మానవుడొసంగిన జలము నిషేధింపఁబడును. ఆత్మ విషయము కూడా ఇట్టిదేనై యున్నది.

ఆత్మ శరీరముతో తాదాత్మ్యము నొందియున్న స్థితియందు శుద్ధాశుద్ధములగు నైతికభావములు అత్యావశ్యకములై యుండును.

## 2-3-49 అసంత తేశ్చావ్యతికరః

మఱియు తన స్వశరీరము నధిగమించి జీవుడు వ్యాపింపకుండుటచే కర్మఫలములనుఁగూర్చిన గజిబిజి లేదు.

అసంతతేః = తన శరీరము నధిగమించిన ఉనికి లేకుండుటచే, చ = మఱియు, అవ్యతికరః = కర్మ ఫలములనుఁగూర్చిన తబ్బిబ్బు లేదు.

జీవుని ప్రత్యేక లక్షణమునుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

ఆత్మైక్యత కారణముచే కర్మఫలముల ననుభవించుటకు ఒకే యజమాని ఉండుటచే కర్మఫలములనుఁ గూర్చిన సంభ్రమ మేర్పడునని ఆక్షేపణ పేర్కొనఁబడినది. ఈ విషయమును ఈ సూత్రము ఖండించును.

అట్లు సంభవించుటకు వీలులేదు. ఏలననగా ఆత్మయొక్క అనుభవక్రియలు శరీరములన్నింటితో సంబంధించిలేవు. జీవుడు తన ఉపాధులపై ఆధారపడియుండును. మఱియు ఉపాధులకు వ్యాపకము లేకుండుటచే, జీవునికి కూడా వ్యాపకము లేదు. జీవులు పరస్పరము భిన్నులై యున్నారు. ఒక్కొక్క జీవుడు ఒక్కొక్క శరీరము, మనస్సు ఇత్యాదులతో సంబంధించియున్నాడు.

జీవుడు ఏకకాలమునందు శరీరములన్నింటితో సంబంధమును కలిగిలేదు. అతడు ఒకే శరీరమునకు సంబంధించియున్నవాడై దాని ప్రత్యేక ధర్మములచే ప్రభావితుడగుచుండును. కావున ఒక శరీరముచే ఒనర్పఁబడిన క్రియాఫలములు ఆ శరీరమునకు చెందియుండును. కాని మరియొక శరీరమునకు చెందవు. ఒక ప్రత్యేకజీవిచే ఒనర్పఁబడిన కర్మలచే సమస్త జీవులు ప్రభావితులు కాఁజాలరు.

శరీరములన్నియును పరస్పరము భిన్నములైయుండుటచే, ఏకైకమైన ఆత్మ శరీరములన్నింటి సుఖ దుఃఖముల ననుభవించుటకు సాధ్యపడదు.

కావున కర్మలు, లేక కర్మఫలములయొక్క సంభ్రమమున కవకాశము లేదు.

## 2-3-50 ఆభాస ఏవచ

మఱియు జీవుడు పరమాత్ముని ప్రతిబింబమువంటివాడేనై యున్నాడు.

ఆభాస = ప్రతిబింబము, ఏవ = మాత్రము, చ = మఱియు.

వేదాంతమతానుసారముగా జీవుడు నీటిలోని సూర్యబింబమువలె మనస్సు నందు పరమాత్ముని ప్రతిబింబమువంటివాడై యున్నాడు. విభిన్నములైన నీటికుండలలో సూర్యుడు విభిన్నములుగా కానఁబడునట్లు, విభిన్నములైన మనస్సులలో పరమాత్ముని ప్రతిబింబములు విభిన్నములై కన్పట్టును. ఒక సరస్సులోని

నీటియందలి సూర్యబింబము చలించినను, మరియొక సరస్సులోని నీటియందలి సూర్యబింబము చలింపనట్లు; ఒక ప్రత్యేక జీవి తన సుఖదుఃఖాది కర్మఫలముల ననుభవించినను, ఇతర జీవులు వాటిననుభవింపఁజాలరు. ఒక శరీరములోని జీవుడు తన కర్మఫలముల ననుభవించినప్పుడు మరియొక శరీరములోని జీవుడు దానిచే ప్రభావితుడుకాఁడు.

జీవులసంఖ్యాకములనియును, మఱియు అవి సర్వవ్యాపకములనియు నుడువునట్టి సాంఖ్య, వైశేషిక, నైయాయికులయొక్క కర్మఫలములు సంభ్రమము నొందించును. ఏలననగా సుఖదుఃఖముల నుత్పన్నమొనర్చు కారణములకు సమీపమునందే ప్రతిజీవియొక్క ఉనికి సుస్థిరమైయున్నది.

సాంఖ్యమతానుసారముగా శుద్ధ చైతన్య స్వరూపములును, నిర్గుణములును, సర్వోత్కృష్టములునగు అనేక సర్వవ్యాపకములగు జీవులు ఉనికి కలిగియున్నవి. ఈ సమస్త జీవులు సర్వసామాన్యముగా భోగమోక్షముల ననుభవించుట కాధారముగా ప్రధానము ఉనికిని కలిగియున్నది.

సాంఖ్యదర్శనమునందు జీవుడు సర్వవ్యాపకుడుగా ప్రతిపాదింపఁబడినాడు. ఒకవేళ ఈ మతము నంగీకరించినచో కర్మలు మఱియు కర్మఫలములయందు సంభ్రమమేర్పడును. కావున సాంఖ్యుల యొక్క ఈ మతము అసంగతమగు నిర్ణయము నొసంగును.

ఈ కారణముచే కర్మఫలములయొక్క సంభ్రమమునకవకాశము లేదు.

## 2-3-51 అదృష్టానియమాత్

సర్వవ్యాపకములగు అనేక జీవులను విశ్వసించువారికి అదృష్ట సిద్ధాంతముపై స్థిరత్వము లేకుండుటచే కర్మలు మఱియు కర్మఫలములయొక్క సంభ్రమమున కవకాశములేదు.

అదృష్టానియమాత్ = అదృష్ట సిద్ధాంతమునుఁగూర్చిన స్థిరత్వము లేకుండుటచే.

50వ సూత్రమునందారంభింపఁబడిన చర్చ కొనసాగుచున్నది.

సర్వవ్యాపకములగు అసంఖ్యాక జీవుల యొక్క ఉనికిని ప్రతిపాదించునట్టి

సాంఖ్యాది మత సిద్ధాంతములను 51 నుండి 53 వరకుఁగల సూత్రములు ఖండించును. దానిచే వాటి అసంగతత్వము ఋజువగును.

అదృష్టమును చేర్చుటతో ఈ సంభ్రమము తొలగిపోదు. ఏలననగా జీవులన్నియును సమానముగా సర్వవ్యాపకములై యున్నచో, ఆ యదృష్టఫలము ప్రయోగింపఁబడుటకొక నియమము లేకుండును.

సాంఖ్యమతానుసారముగా అదృష్టము సమస్త జీవులకు సర్వసామాన్యమై యున్న ప్రధానమునం దంతర్నిహితమై యుండును, కాని జీవులయందు కాదు. కావున ప్రత్యేకమగు అదృష్టమును ప్రత్యేక జీవునియందు ప్రవర్తింపఁజేయుట కేలాటి పదార్థము లేకున్నది.

ఇతరములగు రెండు మతసిద్ధాంతములు కూడా ఇదే ఆక్షేపణకు గుఱియగును. న్యాయ వైశేషిక మతానుసారముగా జీవుడు మనస్సుతో కూడియున్నప్పుడు అదృష్టము సృష్టింపఁబడును. ఇచ్చట కూడా ప్రత్యేకమగు అదృష్టమును ప్రత్యేక జీవునియందు ప్రవర్తింపఁజేయుటకేలాటి పదార్థము లేదు. ఏలననగా ప్రతి జీవుడు సర్వవ్యాపకుడగుటచే మనస్సులన్నింటితో సమానమైన సంబంధమును కలిగియుండును.

కావున కర్మఫలములయొక్క సంభ్రమము అనివార్యమైయున్నది.

## 2-3-52 అభిసంధ్యాదిష్వపి చైవమ్

మఱియు నిశ్చయాదులలో కూడా ఇదే విషయము వర్తించును.

అభిసంధ్యాదిషు = నిశ్చయాదులలో, అపి = కూడా, చ= మఱియు, ఏవమ్ = ఈ విధముగా.

50వ సూత్రములో ప్రారంభింపఁబడిన చర్చ కొనసాగుచున్నది.

కర్మలనొనర్చు దృఢసంకల్పమునందు కూడా ఇదే విధమగు తార్కికదోషము వాటిల్లును. కర్మలనొనర్చు సంకల్పమునందు స్థిరత్వముండదు. ఒకవేళ జీవుడు సర్వవ్యాపకుడుగా పరిగణింపఁబడినచో, వ్యక్తిగత నిశ్చయాదులయందొక క్రమముండదు.

ఒకవేళ ఎవడైనను ఒక పదార్థమును పొందుటకు, లేక పరిత్యజించుటకై చేయు నిశ్చయము కూడా ప్రత్యేక జీవునియందుంగల అదృష్టమునకు సంబంధించినదని పలికినచో, అట్లయినను ఈ కర్మఫలముల సంభ్రమమేర్పడును. ఏలననగా జీవుడు మఱియు మనస్సుయొక్క కలయికచేతనే దృఢసంకల్ప మేర్పడును. కావున ఇచ్చట కూడా పై వాదమే వర్తించును.

ఒకవేళ జీవుడు సర్వవ్యాపకుడై యున్నచో "నేను ఈ కార్యము నొనర్తును." లేక "నేనీ కార్యము నొనర్పను." వంటి వ్యక్తిగతమగు భావములు మఱియు నిశ్చయములలో ఒక క్రమబద్ధత ఉండజాలదు. ఏలననగా అట్టిఎడల ప్రతియొక్కడు ప్రతివాని నిశ్చయమును గుర్తెఱుంగుట కవకాశము కలదు. కావున దృఢసంకల్పమును ఆచరణయందుంచుటలో ఒక క్రమము పోషింపంబడంజాలదు. ఇంతేకాకుండా సంకల్పములో సంభ్రమము అనివార్యమగును. కాని ఈ ప్రపంచమునందు ప్రతిచోటను మనమొక క్రమబద్ధతనుం గాంచుచున్నాము.

కావున జీవుడు సర్వవ్యాపకుడు కాడను విషయము ఋజువగుచున్నది.

## 2-3-53 ప్రదేశా దితిచే న్నాంతర్భావాత్

ఒకవేళ స్థలభేద కారణముచే సుఖదుఃఖాది విభేదమేర్పడునని పలికినచో, ఆత్మ సమస్త శరీరములయందుండుటచే అట్లుకాదని వేము సమాధానమొసంగుదుము.

ప్రదేశాత్ = స్థలభేద కారణముచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = ఈ వాదము నిలువనేరదు, అంతర్భావాత్ = ఆత్మ సమస్త శరీరముల యందుండుటచే.

52వ సూత్రమున కొక ఆక్షేపణ చెప్పంబడి, ఖండింపంబడినది. ఈ సూత్రమునందు ఆక్షేపణ మఱియు దానికి సమాధానములనెడి రెండు విభాగములున్నవి. "ప్రదేశాదితిచేత్" అనునది ఆక్షేపణ విభాగము, "న అంతర్భావాత్" అనునది సమాధాన విభాగము.

నైయాయికులు మఱియు ఇతరులు ఈ క్రింది వాదము ద్వారా పూర్వ సూత్రములోని సమస్యను నివారించుటకు యత్నింతురు. ప్రతి జీవుడు సర్వవ్యాపియైనను, మనస్సుతో దానికింగల సంబంధము దాని శరీరమునకు

మాత్రము సంకుచితమై యున్నదని తలంచినప్పుడు కర్మఫలములయొక్క సంభ్రమమున కవకాశము లేకుండును.

ఇదికూడా నిలువనేరదు. అది అన్నిటియందుండుటచే ఇది కూడా సాధ్యము కాకుండును. ఏలననగా ఆత్మలన్నియు సమానముగా అనంతములై యుండుటచే అవి అన్ని శరీరములయందుండును. ప్రతిజీవియు సర్వవ్యాపి యగుటచే అది సమస్త శరీరముల యందంతర్గతమైయుండును. ఆయా జీవిని ఆయా శరీరమునందు ప్రవర్తింపఁజేయుట కేమియు లేకుండును.

ఇంతేకాకుండా స్థలభేద పరిచ్ఛిన్న సిద్ధాంత కారణముచే కొన్ని సమయములలో ఒకే రకమగు సుఖ దుఃఖములను ఇద్దఱు జీవులు అనుభవింప వలసివచ్చును. ఇద్దఱు జీవులయొక్క అదృష్టము ఒకే స్థలము నాక్రమించుటచే, వారి భోగముకూడా  ఏకమై యుండవలసివచ్చును.

ఇఁక అదృష్టములు నిర్ణీత స్థలముల నాక్రమించునను సిద్ధాంతముననుసరించి స్వర్గలోక  సుఖము అనుభవయోగ్యముకాదని తెలియుచున్నది. ఏలననగా అదృష్టము బ్రాహ్మణ శరీరమువంటి నిర్ణీత స్థలముల యందు  మాత్రము ప్రభావము చూపును. మఱియు స్వర్గలోకానుభవము మరియొక నిర్ణీత స్థలమునకు సంబంధించి యుండును.

సర్వవ్యాపకమగు పదార్థము ఒకటినిమించి యుండజాలదు. ఒకవేళ సర్వవ్యాపకములగు అనేక పదార్థము లున్నచో, అవి పరస్పరము పరిచ్ఛిన్నత నొందుటచే అవి అనంతత్వమును, లేక సర్వవ్యాపకతను కోల్పోవును. కావున ఒకేయొక ఆత్మ కలదు, కాని అనేకమైన ఆత్మలు లేవు. ఏకైకాత్మఁను గూర్చి నిర్దేశించునట్టి ఈ సిద్ధాంతము ఏలాటి ఆక్షేపణకు గుఱికాకుండును. వేదాంతములోని ఆత్మలనెడి బహువచన ప్రయోగము కేవలము అవిద్య, లేక అజ్ఞానజనితమే యగును. కాని  నిజముకాదు.

**ఇట్లు**
**బ్రహ్మసూత్ర ద్వితీయాధ్యాయ**
**తృతీయ పాదము**
**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## 2వ అధ్యాయము

## 4వ పాదము

## పీఠిక

ఆకాశము మఱియు ఇతర భూతములయొక్క ఉత్పత్తిస్థానమునుఁగూర్చి శ్రుతి వాక్యములు తాత్కాలిక విరోధమును కలిగించవచ్చును. అవి యన్నియు సమరసమొనర్చబడి, అయ్యవి బ్రహ్మమునుండియే ఉత్పన్నమైనవని మూడవ పాదమునందు నిరూపింపఁబడినది. ఆకాశాది ఉత్పత్తి విషయములో వైదిక వాక్యములలో వైరుద్ధ్యము లేదని ఋజువొనర్పఁబడినది. ఈ పాదమునందు ప్రాణేంద్రియములకు సంబంధించినట్టి అదే విషయము చర్చింపఁ బడినది. ప్రాణములు మఱియు ఇంద్రియములయొక్క ఉత్పత్తిస్థానము బ్రహ్మమేయను విషయమును ఈ పాదము నిరూపించును.

# సారసంగ్రహము

రెండవ అధ్యాయములోని ఈ నాల్గవ పాదము ఇంద్రియములు మఱియు ముఖ్య ప్రాణము యొక్క ఉత్పత్తినిఁగూర్చి చర్చించును. అవి బ్రహ్మమునండి ఉత్పన్నమైనవని ఇది నిరూపించును.

**1వ అధికరణము (1-4 సూత్రములు):-** ప్రాణములు (ఇంద్రియములు) బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవని బోధించును.

**2వ అధికరణము (5-6 సూత్రములు):-** ఇంద్రియముల సంఖ్య పదునొకండని సూచించును.

**3వ అధికరణము (7 సూత్రము):-** ఇంద్రియములు అణుపరిమాణమును కలిగియున్నవి. కాని సర్వవ్యాపకములు కావని సూచించును.

**4వ అధికరణము (8 సూత్రము):-** ముఖ్యప్రాణము కూడా బ్రహ్మమునుండియే ఉత్పన్నమైనదని నుడువును.

**5వ అధికరణము (9-12 సూత్రములు):-** ముఖ్యప్రాణముపైన నుడువఁబడిన ప్రాణములు (ఇంద్రియములు) మఱియు వాయువునకు భిన్నమైయున్నదని పలుకును.

**6వ అధికరణము (13 సూత్రము):-** ముఖ్యప్రాణము అణుపరిమాణమును కలిగియున్నది. కాని సర్వవ్యాపకముకాదని ప్రబోధించును.

**7వ అధికరణము (14-16 సూత్రములు):-** అధిష్ఠానదేవతల ద్వారా ఇంద్రియములు చలింపజేయఁబడుననియు, ప్రవర్తింపఁజేయఁబడుననియును ప్రబోధించును. ఇంద్రియములు జీవునితో శాశ్వత సంబంధమును కలిగియుండి,

అతనికి ఉపయుక్తమైయుండును. కావున వాటికి యజమాని జీవుడేఁయగును. కాని అధిష్ఠాన దేవతలు కాదు.

**8వ అధికరణము (17-19 సూత్రములు):-** ఇంద్రియములు ముఖ్యప్రాణముయొక్క కార్యములు కావనియు, అవి స్వతంత్రములనియును సూచించును. ప్రాణము ఏకాదశేంద్రియములన్నింటి కార్యముల యొక్క సమైక్యతాఫలము కాదు. ప్రాణము ఇంద్రియములకు భిన్నమైయుండుటచే, తమ పదునొకండవ సంఖ్యయందది చేర్చఁబడలేదు. ఐనను అది ఒక కర్మేంద్రియమును పోలియున్నది. ఏలననగా అది ఇంద్రియములకాధారమై జీవితమునకు పోషకమై, శరీరమునకు సంరక్షకమై యుండుటచే ప్రత్యేక విశేష ప్రయోజనమును కలిగియున్నది.

**9వ అధికరణము (20-22 సూత్రములు):-** నామరూప వ్యాకరణము దేవుని కార్యమే యగును. కాని జీవుని కార్యము కాదని వాకొనును.

మాంసము పృథ్వినుండి జనించును. ఇతరములగు అగ్ని జలముల విషయము కూడా ఇట్టిదేనై యున్నది.

స్థూలభూతములలో తత్సంబంధమగు ప్రత్యేకభూతమతిశయించియుండుటచే ఆ భూతమా నామముచే పేర్కొనఁబడినది. దృష్టాంతమునకు స్థూలమైన జలము పంచమూల భూతముల కలయికచే సృష్టింపఁబడినది. కాని దానియందు జలతత్త్వము అతిశయించియుండుటచే అది జలమను నామముతో పేర్కొనఁబడినది.

# 1. ప్రాణోత్పత్త్యధికరణము

## (1-4 సూత్రములు)

## 2-4-1 తథా ప్రాణాః

ఈ విధముగా ప్రాణములు బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవి.

తథా = పూర్వపాదమునందు ప్రతిపాదింపఁబడిన పంచమహాభూతములవలె, ప్రాణాః = ఇంద్రియములు.

ప్రాణములు, లేక ఇంద్రియముల సృష్టినిఁగూర్చి ఇప్పుడు వర్ణింపఁబడుచున్నది.

ప్రాణములు ముఖ్యములు, గౌణములని రెండు వర్గములుగా విభజింపఁబడును. ఏకాదశేంద్రియములు, నేత్రశ్రోత్రాదులు గౌణప్రాణము లనఁబడును. వీటిలో సూత్రకారుడు ప్రప్రథమముగా గౌణప్రాణములగు ఏకాదశేంద్రియములను ఁగూర్చి చర్చించుచున్నాడు.

పూర్వపక్షి :- ప్రాణములు జీవులవలె శాశ్వతములగుటచేతను మఱియు సృష్టికి పూర్వము ఉనికిని కలిగియుండుటచేతను వాటికి మూలము లేదు.

సిద్ధాంతి :- ప్రాణములకు మూలమున్నది.

పూర్వపక్షి :- పదార్థోత్పత్తినిఁగూర్చి నుడువు అధ్యాయములలో ప్రాణోత్పత్తిని గూర్చి చెప్పఁబడలేదు. "తత్తేజోస్సృజత" (ఛాం. ఉ. 6-2-3) "ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః" (తై. ఉ. 2-1) ప్రాణములు సృష్టింపఁబడలేదని కొన్ని స్థలములలో స్పష్టముగా చెప్పఁబడినది. "ఇదియంతయు నిశ్చయముగా ఆదియందసత్తేనై యుండెను. అనత్తనగానేమి? నిశ్చయముగా ఆ ఋషులే ఆదియందసత్తై యుండిరి. ఆ ఋషులెవ్వరు? నిశ్చయముగా ప్రాణములే (ఇంద్రియములే) ఆ ఋషులైయుండిరి. (శత. బ్రా. 6-1-1-1) దీనిచే ప్రాణములు శాశ్వతమనియు, అవి సృష్టింపఁలేదనియును తెలియుచున్నది.

ఈ సూత్ర మీ దృష్టికోణమును ఖండించి, ఆకాశమువలె ప్రాణములు కూడా బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవని పలుకును. "తథా" యను శబ్దము పూర్వపాదమునందున్న పూర్వవిషయములగు జీవుల బహుళత్వమునుఁగూర్చి తెలుపును. వాటి పుట్టుకనుఁగూర్చి శ్రుతి వాక్యములు స్పష్టముగా ఇట్లు నుడువుచున్నవి. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్సర్వేంద్రియాణి చ" (ముం. ఉ. 2-1-3) "యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగా వ్యుచ్చరంత్యేవమేవా స్మాదాత్మనః సర్వేప్రాణావ్యుచ్చరంతి" (బృ. ఉ. 2-1-20). "సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" (ముం. ఉ. 2-1-8). "సప్రాణమసృజత ప్రాణాచ్ఛ్రద్ధాంఖం వాయుర్జ్యోతిరాపః పృథివీంద్రియం, మనోఽ న్నమ్" (ప్ర. ఉ. 6-4).

కావున ఇంద్రియములు సృష్టింపఁబడినవి.

ఒకవేళ కొన్ని స్థలములలో ప్రాణముయొక్క సృష్టినిఁగూర్చి చెప్పఁబడకున్నచో, దానిచే సృష్టినిఁగూర్చి చెప్పఁబడిన వాక్యముల బలమునకు లోటురాదు. "నహి క్వచిద శ్రవణమన్యత్ర శ్రుతం నివారయితు ముత్సహతే" "తత్తేజో సృజత" "ఏతస్యాజ్జాయతే ప్రాణః".

కొన్ని స్థలములలో ఒక పదార్థమునుఁగూర్చిన స్థితిగతులు చెప్పఁబడకున్నచో, ఇతరస్థలములలో దానినిఁగూర్చి ప్రతిపాదింపఁబడిన విషయమునకు లోటురాదు.

కావున ఆకాశము మున్నగువాటివలెనే ప్రాణములు కూడా సృష్టింపఁబడినవను శ్రుతివాక్యముల ప్రతిపాదనను మనమంగీకరించుటయే ఉచితమగును.

## 2-4-2 గౌణ్యసంభవాత్

ప్రాణములయొక్క ఉత్పత్తి అసంభవమగుటచే.

గౌణీ = గౌణవార్థము, అసంభవాత్ = అసంభవమగుటచే.

1వ సూత్రమునకు యుక్తముగా కానఁబడు ఆక్షేపణ ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును :- సృష్టికి పూర్వము ప్రాణముల ఉనికినిఁగూర్చి శతపథ బ్రాహ్మణము నుడువుచున్నది. వాటి సృష్టినిఁగూర్చి నుడువు శ్రుతివాక్యములు కేవలము గౌణాత్మకములై యున్నవి.

ఈ సూత్రము దీనిని ఖండించును. ప్రాణముల సృష్టినిఁగూర్చిన ప్రతిపాదనమును గౌణాత్మకముగా స్వీకరింపరాదు. ఏలననగా దానిచే ముఖ్యమైన సిద్ధాంతమును పరిత్యజింపవలసివచ్చును. "ఒకానొక విజ్ఞానముచే సమస్తము తెలియఁబడును." "కస్మిన్నుభగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" (ముం. ఉ. 1-1-3). కావున ప్రాణములు బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవి.

బ్రహ్మమునుండి సమస్తము ఉత్పన్నమైనదను విషయము శ్రుతులయందు మరల మరల చెప్పఁబడినది. దీనిని నిషేధించు శ్రుతి ఏదియును లేదు. "యతోవా ఇమాని భూతాని జాయంతే" "దేనినుండి ఈ సమస్త భూతములు ఉత్పన్నములైనవో" (తై. భృగువల్లి 1-1) సమస్త పదార్థములు బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవను శ్రుతి ప్రతిపాదనమునందు ప్రాణములు (ఇంద్రియములు) వర్ణింపఁబడుట అసంగతమగును.

శతపథ బ్రాహ్మణమునందు సృష్టికి పూర్వము ఉనికినిఁగూర్చి నుడువఁబడిన విషయము హిరణ్యగర్భునికి చెందియున్నది. సమిష్టిప్రాణమే హిరణ్యగర్భుడు. విశ్వముయొక్క పాక్షికవలయమునందది విడఁదీయఁబడజాలదు. మహాప్రళయమునందు హిరణ్యగర్భుడు కూడా విడఁదీయఁబడును.

## 2-4-3 తత్ప్రాక్ శ్రుతేశ్చ

ఆ కారణముచే సృష్టిని సూచించు ప్రాణములకు సంబంధించిన శబ్దము ప్రప్రథమమునందు పేర్కొనఁబడినది.

తత్ = అది, ప్రాక్ = ప్రథమమునందు, శ్రుతేః = శ్రుతివాక్యము సూచించుటచే, చ = మఱియు.

2వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

ప్రాణములు బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవని సూచించుటకు ఈ సూత్రమునందు మరియొక కారణము చెప్పఁబడినది.

ఇఁక ఆకాశాదులకు పూర్వము ఉనికిని కలిగియున్నట్టి ప్రాణము విషయమై "జాయతే"యను శబ్దము ప్రయోగింపఁబడుటచే ప్రాణములు (ఇంద్రియములు) బ్రహ్మమునుండియే ఉత్పన్నమైనవను విషయము స్పష్టమగుచున్నది. ప్రాణోత్పత్తినిఁ

గూర్చిన శ్రుతి ప్రతిపాదనమును కేవలము ముఖ్యార్థమునందు మాత్రమే స్వీకరింపవలయును. "ఏతస్మాజ్జాయతేప్రాణో మనస్సర్వేంద్రియాణి చ, ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్యధారిణీ" (ముం. ఉ. 2-1-3)యని శ్రుతి నుడువుచున్నది. ఇచ్చట "జాయతే" యను శబ్దము పదార్థముల సృష్ట్యారంభమునందే వాడఁబడినది. ఒకవేళ ఈ శబ్దము ఆకాశాది విషయములయందు ముఖ్యార్థముగా స్వీకరింపఁబడినచో, దానికి పూర్వము ప్రయోగింపఁబడినట్టి ప్రాణేంద్రియ మనస్సులకు కూడా అది వర్తింపవలసియుండును.

శ్రుతి ప్రాణములను ఆకాశము, వాయువు ఇత్యాదులకు పూర్వము ప్రయోగించుటచే, గౌణార్థము ఇచ్చట అంగీకరింపఁబడును. "జాయతే"యను శబ్దము ప్రప్రథమమునందు ప్రయోగింపఁబడినది. తదనంతరము ప్రాణేంద్రియములను సూచించు శబ్దములు చిట్టచివరకు ఆకాశము, వాయువు ఇత్యాది శబ్దములుప్రయోగింపఁబడినవి. ఐనచో "జాయతే" యను శబ్దము ఆకాశాదుల విషయములో ముఖ్యార్థముగా అంగీకరింపఁబడినప్పుడు, ఆకాశాది శబ్దములకు ముందుగా ప్రాణములను శ్రుతి ప్రయోగించుటచే అది గౌణార్థము నందేల స్వీకరింపఁబడవలయును?

ఒకే అధ్యాయమునందొకే వాక్యములో ఇతరములగు అనేక శబ్దములతో కలిసి ఒకచోటనే పేర్కొనఁబడిన శబ్దమును కొన్ని విషయములలో ముఖ్యార్థముగను, ఇతరమైనవాటిని గౌణార్థముగను నిశ్చయించుట అసంగతమగును. ఏలననగా ఇట్టి నిశ్చయముచే సమరూపత సమసిపోవును. చిట్టచివరికి ప్రయోగింపఁబడిన "జాయతే" యను శబ్దమును వాక్యారంభమునందు సూచింపఁబడిన ప్రాణములతో జోడింపవలసియుండును.

## 2-4-4 తత్పూర్వ కత్వాద్వాచః

అగ్ని మొదలగు ఇతర భూతములకంటె వాక్కు ప్రథమమైనదగుటచే.

తత్పూర్వ కత్వాత్ = భూతముల కంటె ముందుండుటచే, వాచః = వాగింద్రియము.

2వ సూత్రమును బలపఱచు మరియొకవాద మొసంగఁబడినది.

"అన్నమయంహిసోమ్యమన అపోమయః ప్రాణస్తే జోమయీ వాగితి"

(6-5-4) అని ఛాందోగ్యము స్పష్టీకరించుచున్నది. ఇంద్రియాదులు భూతములచే జనించినవని ఈ వాక్యముచే స్పష్టమగుచున్నది. ఇఁక భూతములు బ్రహ్మమునుండి ఉత్పన్నమగును. కావున ప్రాణములు కూడా బ్రహ్మమునుండియే ఉత్పన్నమైనవని చెప్పవలసియుండును. ప్రాణములు భూతములయొక్క ఉత్పాదకములగుటచే, భూతసృష్టినిఁగూర్చి నుడువు శ్రుతివాక్యములలో ఇవి వేఱుగా పేర్కొనఁబడలేదు.

శ్రుతి సూటిగా భూతములయొక్క కారణత్వమును ప్రతిపాదించుటచే ప్రాణములకు మూలకారణము బ్రహ్మమేయను విషయము సూచింపఁబడినది.

ఇంతేకాకుండా ఈ ప్రపంచమంతయు బ్రహ్మముయొక్క సృష్టియేయనియు, అది బ్రహ్మముయొక్క స్వరూపమే యనియు బ్రహ్మముచే ఆవృతమైయున్నదనియును నుడువుటతో ఈ పరిచ్ఛేదము సమాప్తమగును.

కావున ప్రాణములు కూడా బ్రహ్మముయొక్క కార్యమేయను విషయము సునిశ్చితమైనది. ఆకాశాది భూతములవలెనే ప్రాణములు ఉత్పన్నములైనవి కావున అవి శాశ్వతములు కావు.

# ౨. సప్తగత్యధికరణము

**(5-6 సూత్రములు)**

## 2-4-5 సప్తగతేర్విశేషితత్వాచ్చ

శ్రుతివాక్యముల ద్వారా ప్రాణముల సంఖ్య ఏడనియు మఱియు వాటి ప్రత్యేకతయున్నూ తెలియఁబడుచున్నది.

సప్త = ఏడు, గతేః = శ్రుతివాక్యములచే తేలియఁబడుచున్నది, విశేషితత్వాత్ = ప్రత్యేకత కారణముచే, చ = మరియు.

ప్రాణముల సంఖ్యనుఁగూర్చి ప్రస్తుతము చర్చింపఁబడుచున్నది.

దీనియందును తదనంతర సూత్రమునందును ఇంద్రియములయొక్క సంఖ్య నిశ్చయింపఁబడినది. శ్రుతివాక్యములలో వైరుద్ధ్యతచే ఇచ్చట ఒక సంశయమేర్పడును. ఒక స్థలమునందు సప్తమార్గములు నుడువఁబడినవి. "సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" (ముం. ఉ. 2-1-8) మరియొక స్థలమునందు గ్రహముల పేరుతో

ఎనిమిది ప్రాణములు పేర్కొనఁబడినవి. "అష్టౌగ్రహా అష్టావతిగ్రహా ఇతి" (బృ. ఉ. 3-2-1) ఇంకొక స్థానమునందు తొమ్మిది చెప్పఁబడినవి. "తలలోని ప్రాణములు ఏడు. దిగువభాగమునందున్నవి రెండు"(తై. సంహిత 5-3-2-5) మరికొన్ని వేళలలో పది చెప్పఁబడినవి. "మానవునియందు నిశ్చయముగా తొమ్మిది ప్రాణములున్నవి. పదియవది నాభిస్థానము" (తై. సంహిత 5-3-2-5). మరికొన్ని వేళలలో పదునొకండు చెప్పఁబడినవి. "దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశః" (బృ. ఉ. 3-9-4) మరికొన్ని ప్రదేశములలో పండ్రెండు పేర్కొనఁబడినవి. "సర్వేషాం స్పర్శానాం త్వగేకాయతనమ్" (బృ. ఉ. 2-4-11) మరికొన్ని స్థానములలో పదమూడు చెప్పఁబడినవి. "చక్షుశ్చ ద్రష్టవ్యంచ" (ప్ర. ఉ. 4-8) ఈ విధముగా శ్రుతివాక్యములు ప్రాణముల సంఖ్యనుఁగూర్చి భిన్నాభిప్రాయములను కలిగియున్నవి.

ఈ సూత్రము పూర్వపక్షియొక్క దృష్టికోణమును మనకొసంగును. నిజమునకు ప్రాణములసంఖ్య ఏడని పూర్వపక్షి ప్రతిపాదించును. ఏలననగా "సప్తప్రాణాః ప్రభవంతి తస్మాత్" (ముం. ఉ. 2-1-8) వంటి శ్రుతివాక్యములలో ఆ సంఖ్య పేర్కొనఁబడినది. ఇంతేకాకుండా "తలలోని ప్రాణములు నిశ్చయముగా ఏడు" అని తైత్తరీయ సంహిత (5-1-7-1)లో ప్రత్యేకించి చెప్పఁబడినది.

కొన్ని గ్రంథములలో ఎనిమిది, లేక తొమ్మిది ఇంద్రియములు గణింపఁ బడినవి. కాని అవి కేవలము అంతరింద్రియముల యొక్క మార్పులైయున్నవి. కావున శ్రుతివాక్యములలోని సంఖ్యను ఏడుగా గ్రహించినచో వైరుధ్యము లేదు.

పూర్వపక్షియొక్క ఈ వాదనకు తదనంతర సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 2-4-6 హస్తాదయస్తు స్థితేఽతో నైవమ్

కాని ఈ పేర్కొనఁబడిన సప్తప్రాణముల నతిశయించి హస్తములున్నవి. ఇది నిశ్చయమైన విషయమగుటచే, కేవలము సప్తప్రాణములున్నవని మనము నిశ్చయింపరాదు.

హస్తాదయః = హస్తములు ఇత్యాదులు, తు = కాని, స్థితే = నిశ్చయముగా శరీరమునందుండుట, అతః = కావున, న = కాదు, ఏవమ్ = ఈ విధముగా.

5వ సూత్రము ఖండింపఁబడి, ప్రాణముయొక్క సరియైన సంఖ్య నిశ్చయించి చెప్పఁబడినది.

'తు'యను శబ్దము పూర్వసూత్రముయొక్క దృష్టికోణమును నిషేధించును. 6వ సూత్రము సిద్ధాంత సూత్రమునఁబడును.

సప్తసంఖ్య సరియైనది కాదు.

సప్తప్రాణములతోపాటు శ్రుతి హస్తాది ఇతర ప్రాణములను కూడా సూచించును. "హస్తౌవై గ్రహస్స కర్మణాతిగ్రాహేణ గృహీతో హస్తాభ్యాం హి కర్మ కరోతి" (బృ. ఉ. 3-2-8) మఱియు "దశేమే పురుషేప్రాణా ఆత్మైకాదశః" (బృ. ఉ. 3-9-4) మున్నగునవి. హస్తాదులు అధికమైన అవయవములని ఈ వాక్యములు సూచించును. కావున ఇతఃపూర్వము సూచింపఁబడినట్టి నేత్రములు, నాసిక, చెవులు, నాలుక, స్పర్శేంద్రియము, వాక్కు, మనస్సులతోపాటు హస్తములు, పాదములు, గుదస్థానము మఱియు జననేంద్రియములను కూడా చేర్చవలసియుండును. బుద్ధ్యహంకారచిత్తములు భిన్నమైన ఇంద్రియములు కావు. అవి కేవలము మనస్సు యొక్క వృత్తులు.

కావున ఇంద్రియములన్నింటి సంఖ్య పదునొకండు. ఇదియే నిర్ణీతమైన సంఖ్యయగును. అవి ఏవనగా జ్ఞానేంద్రియములైదు, కర్మేంద్రియములైదు మఱియు అంతరింద్రియమగు మనస్సొకటి.

ఇంద్రియముల యొక్క విభిన్నమైన కార్యముల నేకీకృతమొనర్చుటకై భూతభవిష్యద్వర్తమానములను జ్ఞప్తియందుంచుకొని, సమైక్యతను సాధింపఁగలుగునట్టి ఒకానొక ఇంద్రియమావశ్యకమైయున్నది. ఏలననగా ఇట్టి ఇంద్రియము లేకున్నచో ఇంద్రియములయొక్క కార్యము కలతనొంది, విషమత్వము నొందును. ఈ సమైక్యత నొందించు ఇంద్రియమే మనస్సనఁబడును. ఈ యంతరింద్రియము వృత్తిభేదమననుసరించి మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనెడి చతుర్విధరూపములనొందును.

"మానవునియందు నిశ్చయముగా తొమ్మిది ప్రాణములున్నవి. పదియవది నాభిస్థానము"నెడి వాక్యములోని "దశప్రాణములు" మానవశరీరములోని విభిన్నములైన నిర్గమస్థానములను సూచించును. కాని విభిన్నమైన ప్రాణములను

సూచింపవు. ఏలననగా నాభియను పేరుఁగల ప్రాణమనునది లేదు. నాభిస్థానము ముఖ్యప్రాణము యొక్క ప్రత్యేకస్థానములయందొకటి యగుటచే, ఇచ్చట ఇది దశమప్రాణముగా గణింపఁబడినది.

కేవలము పదునొకండు ప్రాణములున్నవి. "దశేమే పురుషే ప్రాణా ఆత్మైకాదశః" యనెడి శ్రుతివాక్యముచే ఈ నిశ్చయము దృఢీభూతమగుచున్నది. ఆత్మశబ్దము ఇంద్రియములను పరిపాలించునట్టి అంతరింద్రియముగా మనము పరిగ్రహింపవలయును.

# 3. ప్రాణాణుత్వాధికరణము

## 2-4-7 అణవశ్చ

మరియు అవి సూక్ష్మములై యున్నవి.

అణవః = సూక్ష్మములు, చ = మఱియు పరిమాణమునుఁగూర్చి ఇచ్చట నిశ్చయింపఁబడినది.

సూత్రకారుడిప్పుడు ఇంద్రియములయొక్క స్వరూపము మఱియు పరిమాణమునుఁగూర్చి చర్చించుచున్నారు. ఈ యింద్రియములు సర్వవ్యాపకములా? లేక సూక్ష్మములా? ఇంద్రియములు సర్వవ్యాపకములని పూర్వపక్షి పలుకును. ఏలననగా మనము దూరశ్రవణమొనర్చఁగలుగుచున్నాము. మఱియు దూరముగానున్న పదార్థములను చూడఁగలుగుచున్నాము. కాని సిద్ధాంతదృష్టిననుసరించి ఇంద్రియములు అణుస్వరూపములైయున్నవి.

"చ"యను శబ్దము నిశ్చయమునుఁగూర్చి తెలుపును. అనగా ఇంద్రియములు సర్వవ్యాపకములు కావు. కాని అణుస్వరూపములైయున్నవి. ఇంద్రియములు సర్వవ్యాపకములని నిర్ధరించు సాంఖ్యమత సిద్ధాంతమును ఈ సూత్రము ఖండించును.

ఇంద్రియములు సూక్ష్మములు. సూక్ష్మములనగా అణుస్వరూపములని అర్థము కాదు. కాని పరిమాణలేశమును కలిగియున్నవని భావము.

ఇంద్రియములు సూక్ష్మములై యుండవలయును. ఏలననగా ఒకవేళ అవి

స్థూలములైయున్నచో మృత్యుసమయమునందు శరీరమునుండి అవి నిర్గమించునప్పుడు ఒక పాము బిలమునుండి బయల్వెడలునట్లు మనము వాటిని చూడఁగలిగియుండెడివారము. అవి ఆకాశమువలె సర్వవ్యాపకములైయున్నచో, అవి కదలుటకు సాధ్యము కాకుండెడిది మఱియు శ్రుతులు వచించునట్టి శరీరమునుండి నిర్గమించుట మఱియు జనన మరణములలో జీవుని రాకపోకలు ఖండితము లయ్యెడివి. జీవునికి అవి సారస్వరూపములు కాకుండెడివి.

అవి సర్వవ్యాపకములైయున్నను శరీరమునందలి కొన్ని ప్రత్యేక కార్యములనొనర్చునని మనము చెప్పఁజాలము. ఏలననగా ప్రత్యేకకార్యమునే మనము ఇంద్రియమనెడి పేరుతో వ్యవహరించుచున్నాము. ఇంతేకాకుండా ప్రపంచమంతట జరుగుచున్న దానిని మనము ఇంద్రియమల ద్వారా చూడఁజాలము. ఒకవేళ అవి సర్వవ్యాపకములైయున్నచో నిశ్చయముగా మనము వాటిద్వారా ప్రపంచమునందంతట సంభవించుచున్న దానినిఁగాంచఁగలిగి యుండెడివారము.

కావున ఇంద్రియములు సూక్ష్మములు మఱియు అంతవంతములై యున్నవి. అనగా పరిమాణ లేశమును కలిగియున్నవి.

# 4. ప్రాణశ్రేష్ఠాధికరణము

## 2-4-8 శ్రేష్ఠశ్చ

మఱియు ముఖ్యప్రాణము కూడా ఉత్పన్నమైనది.

శ్రేష్ఠః = ముఖ్యప్రాణము, చ = కూడా.

ముఖ్యప్రాణముయొక్క స్వరూపమిచ్చుట తెలుపఁబడినది.

ముఖ్యప్రాణమునకు కూడ మూలమున్నది. అది బ్రహ్మముయొక్క కార్యమైయున్నది.

పూర్వపక్షి ఇట్లు పలుకును :- "ఏతస్మాజ్జాయతే ప్రాణః (ముం. ఉ. 2-1-3) మఱియు "వాయువు లేకుండా స్వయముగానే అది శ్వాసించుచుండెను. దానికి భిన్నమైనదిఁగాని, దాని నధిగమించినదిఁగాని లేకుండెను" (ఋగ్వేదము 10-129-2). ఇచ్చట "శ్వాసించుచుండెను" అను వాక్యాంశముచే సృష్టికి పూర్వము

ప్రాణము, లేక శ్వాస ఉనికిని కలిగియుండెనని తెలియుచున్నది. కావున ప్రాణము సృష్టింపఁబడ లేదని నిశ్చయింపవచ్చును. దాని సృష్టినిఁగూర్చిన వైరుద్ధ్యమిచ్చట గోచరించుచున్నది.

ఈ సూత్రముపై దృష్టికోణమును ఖండించి, ముఖ్యప్రాణము కూడా బ్రహ్మమునుండి ఉత్పన్నమైనదని స్పష్టీకరించును.

"శ్వాసించుచుండెను" అను శబ్దములు "వాయువు లేకుండా" యను విశేషణముతో సమన్వితములై యున్నవి. కావున సృష్టికి పూర్వము ప్రాణము ఉనికిని కలిగియున్నదను విషయమునిది సూచింపదు.

ఇంతేకాకుండా "అ ప్రాణోహ్యమనాశ్శుభ్రః" (ముం. ఉ. 2-1-2) వంటి శ్రుతివాక్యములచే బ్రహ్మము ప్రాణాది గుణవర్జితమైయున్నదని తెలియఁబడుచున్నది. కావున "శ్వాసించుచుండెను"యను శబ్దములు కేవలము కారణము యొక్క ఉనికిని మాత్రము సూచించును. "సదేవసోమ్యేదమగ్ర ఆసీత్" (ఛాం. ఉ. 6-2-1) వంటి శ్రుతివాక్యముచే సృష్టికి పూర్వము ఉనికిని కలిగియున్న కారణబ్రహ్మమునుఁగూర్చి అవి సూచించుచున్నవని తెలియుచున్నది.

"ఆనీదవాతమ్" అనెడి శ్రుతివాక్యములోని "ఆవాత" శబ్దముచే ప్రాణమునకు పూర్వమునందున్న వస్తువు సూచింపఁబడినది. కావున "ఆనీత్" శబ్దము బ్రహ్మమును సూచించును.

"ప్రాణోవావజ్యేష్ఠశ్చ" శ్రేష్ఠశ్చ (ఛాం. ఉ. 5-1-1) అను శ్రుతివాక్యములోని "శ్రేష్ఠ"శబ్దము ముఖ్య ప్రాణమును సూచించును. బాలుడు గర్భమునందు న్నప్పటినుండియు తన కార్యమును నిర్వర్తించుచుండుటచే ప్రాణము ముఖ్యమైనది, లేక పురాతనమైనదిగా చెప్పఁబడినది. తమ ప్రత్యేకస్థానములైన చెవులు ఇత్యాదులు రూపొందిన తర్వాత మాత్రమే శ్రవణాదీంద్రియములు పనిచేయుట కారంభించును. కావున అవి పురాతనమైనవి కావు. శ్రేష్ఠమైన గుణములను కలిగియుండుటచేతను మఱియు "నవై శక్ష్యామ స్త్వదృతే జీవితుమితి" (బృ. ఉ. 6-1-13) అనెడి వాక్యముచేతను అది పురాతనము, లేక ముఖ్యమని చెప్పఁబడినది. శరీరసంరక్షణకు కారణమైయుండుటచే ముఖ్యప్రాణము శ్రేష్ఠమని చెప్పఁబడినది.

# 5. వాయుక్రియాధికరణము

# (9-12 సూత్రములు)

## 2-4-9 నవాయుక్రియే పృథగుపదేశాత్

ముఖ్యప్రాణము వేఱుగా సూచింపఁబడుటచే అది వాయువున్నూ కాదు, క్రియయున్నూ కాదు.

న = కాదు, వాయుక్రియే = వాయుక్రియలు, పృథక్ = వేఱుగా, ఉపదేశాత్ = సూచింపఁబడుటచే.

ఈ సూత్రమునందు ముఖ్యప్రాణముయొక్క స్వరూపమునుఁగూర్చి చర్చింపఁబడినది.

ప్రాణమనెడి వేఱొక ద్రవ్యము లేదనియు, శ్రుతివాక్యానుసారముగా ప్రాణమనగా వాయువేయనియు పూర్వపక్షి వాదించును. ఏలననగా "శ్వాసయే వాయువ"ని శ్రుతివచించుచున్నది. ఆ వాయువు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములనెడి ఐదు రూపములను ధరించుచున్నది. లేక, దానిని అవయవము లన్నింటి సమిష్టికార్యముగా భావింపవచ్చును. ఏ విధముగానైతే ఒక పంజరములోని పదునొకండు పక్షులు వాటి సమైక్య పరిశ్రమ కారణముచే ఆ పంజరమును చలింపఁజేయగలుగునో, అదే విధముగా శరీరములోని పదునొకండు ప్రాణముల సమైక్య పరిశ్రమ కారణముచే ప్రాణమనెడి సామాన్య కార్యము ఉత్పన్నమగును. ఇది సాంఖ్యులయొక్క దృష్టికోణమైయున్నది. పంచవాయువులు, ప్రాణములు మున్నగునవి ఇంద్రియముల యొక్క సామాన్యకారణమని సాంఖ్యులు ప్రబోధింతురు. కావున ప్రాణమనెడి వేఱొక ద్రవ్యము లేదు.

ఈ సూత్రమీ దృష్టికోణములను ఖండించి ప్రాణము వాయువున్నూ కాదు, లేక అవయవసంబంధ క్రియయున్నూ కాదని పలుకును. ఏలననగా ఇది వాయువు మఱియు ఇంద్రియకార్యములకు భిన్నముగా సూచింపఁబడినది. "ప్రాణఏవ బ్రహ్మణశ్చతుర్థః పాదః సవాయునా జ్యోతిషాభాతి చ తపతి చ" (ఛాం. ఉ. 3-18-4). ఇచ్చట ఇది వాయుమునుండి ప్రత్యేకింపఁబడినది. ప్రతి ఇంద్రియము మఱియు దాని కార్యము తాదాత్మ్యములై యున్నవి.

ఇతర వాక్యములలో కూడా మరల ప్రాణము వాయువు, ఇంద్రియముల నుండి ప్రత్యేకింపఁబడుట సూచింపఁబడినది. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్సర్వేంద్రియాణి చ, ఖం వాయుర్జ్యోతిః" (ముం. ఉ. 2-1-3). దీనిచే ప్రాణము ఏ అవయవము యొక్క కార్యమున్నూ కాదని సూచింపఁబడినది. ఏలననగా అట్లగునేని అది ఇంద్రియములనుండి ప్రత్యేకింపఁబడకుండెడిది.

ఇంద్రియములన్నియు సమైక్యకార్యమును కలిగియుండుటయు మఱియు ఆ కార్యము ప్రాణమని నుడువుటయు అసమంజసమగును. ఏలననగా ప్రతి అవయవము తన ప్రత్యేకమగు కార్యము నొనర్చును. మఱియు సామూహికక్రియయందు తన స్వశక్తి శూన్యమైయుండును. క్రియలు విభిన్నములై యుండుటచే, ఇంద్రియముల యొక్క సామూహిక క్రియాఫలితమే ప్రాణమని నుడువుటకు వీలులేదు.

"ప్రాణమే వాయువ"నెడి వాక్యము సరియైనది. ఏలననగా కార్యము రెండవ రూపమునందున్న కారణమేనై యున్నది. ప్రాణము శరీరమునందు కార్యమొనర్చు వాయువేనైయున్నది. ఆధ్యాత్మిక భూమికలోని కేగుచు. ఐదు విధములుగా విభజింపఁబడినదై ప్రత్యేక స్థితియందున్న వాయువే ప్రాణమని చెప్పఁబడును.

పంజరములోని పక్షుల దృష్టాంతము ఇచ్చట సరిపడదు. ఏలననగా అవియన్నియును పంజరమును కదిలించునట్టి ఒకేయొక కార్యమునందనురక్తమై యున్నవి. కాని ఇంద్రియము లొనర్చు కార్యములు ఒకే రకమైనవి కావు. అవి ఒకదానికొకటి పరస్పరము భిన్నమైయున్నవి. అవి కూడా ప్రాణమునకు భిన్నమైన స్వరూపమును కలిగియున్నవి. ప్రాణము శ్రవణము మున్నగువాటిని పోలియుండదు. కావున అవి జీవిత నిర్మాణమున కనుకూలమైనవి కావు. కావున ప్రాణమొక భిన్నమైన పదార్థమైయున్నది.

ఇంతేకాకుండా ఒకవేళ ప్రాణము కేవలము ఇంద్రియములొనర్చు కార్యమేయైయున్నచో, అది శ్రేష్ఠమని చెప్పఁబడజాలకుండెడిది. మఱియు వాక్కు ఇత్యాదులు ప్రాణమునకు లోకువైయుండెడివి కావు. కావున ప్రాణము వాయువు మఱియు ఇంద్రియములొనర్చు క్రియలకు భిన్నమై యున్నది.

## 2-4-10 చక్షురాదివత్తు తత్సహశిష్ట్యాదిభ్యః

కాని నేత్రాదులవలె ప్రాణము ఆత్మకు లోకువయైయున్నది. ఏననగా శాస్త్రములలో అది నేత్రాదులతోపాటు ప్రబోధింపఁబడినది. మఱియు ఇతర కారణముచేత కూడా.

చక్షురాదివత్ = నేత్రాదులవలె, తు = కాని, తత్సహ = వాటితోపాటు, శిష్ట్యాదిభ్యః = శాస్త్రముల యందది ప్రబోధింపఁబడుట ఇత్యాది కారణములచే.

ప్రాణముయొక్క లక్షణములింకను నుడువఁబడుచున్నవి.

పూర్వపక్షి ఇట్లనును :- జీవునివలె ప్రాణముకూడా శరీరమునందు స్వతంత్రమైనదిగా తలంపఁబడ వలయును. ఏలననగా అది శ్రేష్ఠమనియు మఱియు వాగాదీంద్రియములు దానికి లోకువయైయున్నదనియును శ్రుతి నుడువుచున్నది. శ్రుతివాక్యములలో దానికి అనేక శక్తులు ఆరోపింపఁబడినవి. వాగాది ఇతరములగు ఇంద్రియములు నిద్రించినప్పుడు ప్రాణము మాత్రమే మేల్కొనియుండుననియు, ప్రాణమునకు మాత్రమే మృత్యువు లేదనియు, ప్రాణము వాగాదులను లయింపఁజేసుకొనుననియు, తల్లి తన పిల్లలనువలె ప్రాణము ఇతర ప్రాణములను (ఇంద్రియములను) పోషించుననియును చెప్పఁబడినది. కావున ప్రాణము జీవునివలె స్వతంత్రమైనదని నిరూపింపఁబడుచున్నది.

ఈ సూత్రము దీనిని ఖండించి, ప్రాణము జీవునికి లోకువయైయున్నదని నుడువును.

"తు"యను శబ్దము ప్రాణము యొక్క నిరంకుశత్వమును నివారించును. అది సంశయమును తొలగించును.

"ఆది"శబ్దము "ప్రాణము" విషయేంద్రియముల కొఱకు కూడా ప్రయోగింపఁబడినదని సూచించును. స్వతంత్రమైనది కాదని సూచించుటకై ఇంద్రియములతో పాటు ప్రాణముకూడా గణింపఁబడినది.

ఇంద్రియములవలె ప్రాణము కూడా జీవునికి లోకువయైయున్నది. ఏలననగా అది వాటితోపాటు పేర్కొనఁబడినది. జీవునియొక్క ముఖ్యప్రాణము స్వతంత్రమైనది కాదు. కాని అది ఇంద్రియములవలె కర్త మఱియు భోక్తయగుటకు

సాధనమైయున్నది. జీవుడు రాజువంటివాడు. ప్రాణము అతనికి మంత్రి వంటిది. ఇంద్రియములాతనికి ప్రజలవంటివి. ప్రాణము ఇంద్రియములతోపాటు పేర్కొనబడినది. అది శరీరమునందు ఇంద్రియములవలె వసించును. ఇంతేకాకుండా అది వాటి వలెనే అచేతనమైయున్నది. అది విభాగములచే కూర్పఁబడినది. ప్రాణము యొక్క నిరంకుశత్వమును ఖండించుటకు అవి ఇతర కారణములైయున్నవి. కావున అది జీవునిపై ఆధారపడియుండి, ఇంద్రియములవలె జీవుని సేవించును.

ప్రాణము నేత్రాదులకు ముందుగా పేర్కొనఁబడినను, అది జీవునికి ఒక ఉపకరణము వంటిది. ఏలననగా అది నేత్రాది ఇతర ఇంద్రియముల వర్గములో చేర్చఁబడినది. ఈ విషయము బృహదారణ్యకము (6-1-7-14) లోని ఇంద్రియముల పరస్పర సంభాషణచే తేటతెల్లమగుచున్నది. బృహత్సామము మరియు రథంతర సామము వలె సమాన లక్షణములుఁగల పదార్థములు సామూహికంగా ప్రబోధింపఁబడును. కావున అది జీవునికంటె న్యూనమైయున్నది.

## 2-4-11 అకరణత్వాచ్చ నదోషస్తథాహి దర్శయతి

మఱియు అది ఒక ఉపకరణము కాకుండుటచే ఆక్షేపణకు విలువ లేదు. ఏలననగా ఇట్లు శ్రుతి వచించుచున్నది.

అకరణత్వాత్ = అది ఒక ఉపకరణము కాకుండుటచే, చ = మఱియు, న = కాదు, దోషః = ఆక్షేపణ, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, దర్శయతి = శ్రుతి వచించుచున్నది.

10వ సూత్రమునకు విరుద్ధమైన ఆక్షేపణ ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును: ఒకవేళ ప్రాణము అవయవములవలె జీవునికి న్యూనమైయున్నచో, అది అవయవములవలె ఉపకరణములకు సంబంధించి యుండవలయును. సాదృశ్యమగు వర్ణముగల మఱియొక విషయేంద్రియమును మనము ఊహింపవలసియుండును. కాని పంద్రెండవ విషయేంద్రియమనునది లేదు. కేవలము పదునొకండు క్రియలు మఱియు పదునొకండు ఇంద్రియము లున్నవి. పంద్రెండవ విషయేంద్రియము లేకుండుటచే, పంద్రెండవ ఇంద్రియము యొక్క అస్తిత్వమునకున్నూ అవకాశము లేదు.

“చ”యను శబ్దమిచ్చట “కాని”యను అర్థము నొసంగును. మఱియు పైన నుడువఁబడిన సంశయమును నివారించుటకై ప్రయోగింపఁబడినది.

ఈ సూత్రముపై ఆక్షేపణను ఖండించును. ప్రాణమొక ఉపకరణము కాదు. ఇతరేంద్రియములకు సంబంధింపని ప్రత్యేకమగు క్రియను ముఖ్యప్రాణము కలిగియున్నదని శ్రుతి నుడువుచున్నది. శరీరము మఱియు ఇంద్రియములన్నియును ముఖ్యప్రాణకారణముచే జీవించుచున్నవి. శ్రుతివాక్యములిట్లు నుడువుచున్నవి. “తాన్ వరిష్ఠః ప్రాణ ఉవాచ, మామోహ మాపద్యథాహమేవైతత్ పంచధాత్మానం ప్రవిభజ్యైతద్బాణమ వష్టభ్య విధారయామీతి” (ప్ర. ఉ. 2-3) మఱియు “ప్రాణేన లక్షన్నవరం కులాయమ్” (బృ. ఉ. 4-3-12) ఈ వాక్యముచే శరీరపోషణ ప్రాణములపై ఆధారపడియున్నదని తెలియుచున్నది.

శరీరసంరక్షణ ప్రాణముపై ఆధారపడియున్నదని మరిరెండు వాక్యములు నుడువుచున్నవి. “యస్మాత్కస్మాచ్చాంగాత్ప్రాణ ఉత్క్రామతి తదేవ తచ్ఛుష్యతి” (బృ. ఉ. 1-3-19) “యదనేనాన్నమత్తి తేనైతా స్తృప్యంతి” (బృ. ఉ. 1-3-18) జీవుడు నిర్గమించుట, నిలుకడ కలిగియుండుటయు ప్రాణముపై ఆధారపడియుండునని మరియొక వాక్యము నుడువుచున్నది. “స ఈశాంచక్రే, కస్మిన్నహ ముత్క్రాంత ఉత్క్రాంతో భవిష్యామి కస్మిన్వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామీతి” (ప్ర. ఉ. 6-3)

శరీరమును పోషించుట మఱియు సంరక్షించుటయే ప్రాణముయొక్క కార్యమని ఈ వాక్యములన్నియు తెలుపుచున్నవి. శరీరము పతనము కాకుండా ప్రాణము దానిని రక్షించును. శారీరకబలము మఱియు ఇంద్రియబలము కూడా ప్రాణముపై ఆధారపడియుండును. ప్రాణము శరీరమునకాధారముగా ఉండి, ఇంద్రియాలన్నింటిచే దానిని ఉత్తేజితమొనర్చును. ఇది దీని ప్రత్యేక కార్యమైయున్నది.

ఇతర అవయవములన్నింటికి ఆధారమైయుండుట ద్వారా ప్రాణము జీవునికి గొప్ప సహాయకారియై యున్నది. ఇది ఇంద్రియముల కాధారమై యుండుటయేఁగాక శరీరమునకు జీవనప్రదమైయున్నది. కావున జీవునికిది గొప్ప ప్రాముఖ్యతను కలిగియున్నది.

సర్వసామాన్యదృష్టియందు ప్రాణమునకొక కార్యమనునది లేదు. కావున అది ఒక ఇంద్రియముగా పరిగణింపఁబడజాలదు. ఈ కారణముచే అది పదునొకండింద్రియముల పట్టికలో చేర్చఁబడలేదు.

ముఖ్యప్రాణము కూడా జీవునికొక ఉపకరణము వంటిది. నేత్రములు, చెవులు మున్నగు ఇంద్రియములు జీవునికి కచేరీలవంటివగుటచే అవి అతని కార్యకలాపములందును, భోగానుభవము నందును సహకరించును. కాని ముఖ్యప్రాణమతనికి ముఖ్యమంత్రి వంటిది. అది అతనికి ఉన్నతకార్యము లందును మఱియు సమస్త వాంఛాపూరణమునందును సహకరించును.

ప్రాణమొనర్చు కార్యము కేవలమిదియే కాదు. ఇతర కార్యములు కూడా కలవు. ఇతర కార్యములనుఁగూర్చి తదనంతర సూత్రము వర్ణించును.

## 2-4-12 పంచవృత్తిర్మనోవద్ వ్యపదిశ్యతే

మనస్సువలె ఇది పంచవృత్తులను కలిగియున్నదని ప్రబోధింపఁబడినది.

పంచవృత్తిః = పంచవిధ కార్యములను కలిగియుండుట, మనోవత్ = మనస్సువలె, వ్యపదిశ్యతే = ప్రబోధింపఁబడినది.

ముఖ్యప్రాణముయొక్క లక్షణములనుఁగూర్చిన వర్ణన కొనసాగుచున్నది.

ప్రశ్నోపనిషత్తు (2-3) ఇట్లు నుడువుచున్నది. "అహమేవైతత్ పంచధాత్మానం ప్రవిభజ్యైతద్బాణ మవష్టభ్య విధారయామి".

పంచేంద్రియ సంబంధముచే మనస్సెట్లు పంచవిధములుగా రూపొందునో, అట్లే ప్రాణమున్నూ ప్రాణాపాన వ్యానోదాన సమాన రూపములను ధరించును. ప్రాణము శ్వాసక్రియ నొనర్చును. అపానము విసర్జనక్రియ నొనర్చును. సమానము ఆహారపదార్థములను జీర్ణమొనర్చును. వ్యానము రక్తమును ప్రసరింపఁజేయును మఱియు ఉదానము విడదీయు క్రియ నొనర్చును. మృత్యుసమయమునందు శరీరము నుండి జీవుని విడదీయుటకై ఉదానము సహకరించును. ఈ విధముగా ప్రాణము మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, హృదయములనెడి పంచవిధములుగా రూపొందిన అంతఃకరణమును పోలియున్నది.

ఏ విధముగానైతే మనస్సు, వాంఛ, విశ్వాసము, ధారణ, సంకల్పము, అనుభవము, జ్ఞానము మున్నగు క్రియలతో కూడియుండి జీవుని సేవించునో, అదే విధముగా ముఖ్యప్రాణము పంచవిధ వృత్తులను కలిగియున్నదై జీవునికి శ్రేయస్సు నొనఁగూర్చును.

పతంజలి మహర్షియొక్క రాజయోగము ననుసరించి సవ్యజ్ఞానము, దోషము, ఊహ, నిద్ర మఱియు జ్ఞాపకశక్తి మానసికవృత్తులైయున్నవి. అట్లు కాదేని సూత్రమునందు దార్ష్టాంతిక సాధనముగా పంచవిధ వృత్తులకు బదులుగా కేవలము బహువచనము ప్రయోగించి యుండెడిది.

మనస్సువలె పంచవిధ వృత్తులను కలిగియున్న కారణముచే ప్రాణము జీవునికి నిమ్నమైనదిగా నుడువఁబడినది.

# 6. శ్రేష్ఠాణుత్వాధికరణము

## 2-4-13 అణుశ్చ

మఱియు ముఖ్యప్రాణము సూక్ష్మమైయున్నది.

అణుః = సూక్ష్మము, చ = మఱియు

ముఖ్యప్రాణము యొక్క లక్షణములనుఁగూర్చిన వర్ణన కొనసాగుచున్నది.

ఇంద్రియములవలె ముఖ్యప్రాణము కూడా సూక్ష్మమైయున్నది. ఇచ్చట కూడా ముఖ్యప్రాణము యొక్క సూక్ష్మత్వమును పరిమాణ లేశముగా తలంప వలయునేఁగాని, అణుపరిమాణముగా తలంపరాదు. ఏలననగా అది తన పంచవిధ వృత్తులచే శరీరమంతట వ్యాపించును.

శరీరమునుండి నిర్గమించునప్పుడు చూడఁబడఁజాలకుండుటచే ప్రాణము సూక్ష్మమని చెప్పఁబడినది. అది సంకుచితము, లేక అంతవంతమైయున్నది. ఏలననగా దాని ఉత్క్రమణము మరియు గమనాగమనములు శ్రుతియందు పేర్కొనఁ బడినవి. ఒకవేళ అది సర్వవ్యాపకమైయున్నచో, దానియందు చలనము లేకుండెడిది.

కావున ప్రాణము కూడా అంతవంతము, లేక సంకుచితమైయున్నది.

"సమఃప్లుషిణా సమోమశకేన సమోనాగేన సమ ఏభిస్త్రిభిర్లోకైస్సమోఽ నేన సర్వేణ" (బృ. ఉ. 1-3-11) అను వాక్యముచే ప్రాణము సర్వవ్యాపకమని నీవు నుడువవచ్చును. కాని ఈ వాక్యములో సర్వవ్యాపకత హిరణ్యగర్భుడు, సమష్టి ప్రాణమునకు సంబంధించియున్నది. సమిష్టి దృష్టి ననుసరించి ఇది సర్వవ్యాపకమైయున్నది. వ్యష్టి దృష్టిననుసరించి ఇది సంకుచితమైయున్నది.

"మశకముతో సమానమైనది". ఇత్యాది వాక్యములచే ప్రతి జీవియందంతర్నిహితమైయున్న ప్రాణముయొక్క పరిమాణము సూచింపఁబడుచున్నది.

# 7. జ్యోతిరాద్యధికరణము

## (14-16 సూత్రములు)

## 2-4-14 జ్యోతిరాద్యధిష్ఠానంతు తదామననాత్

కాని ఇంద్రియములపై అగ్న్యాద్యధిష్ఠాన దేవతలున్నవని శ్రుతి నుడువుచున్నది.

జ్యోతిరాద్యధిష్ఠానమ్ = అగ్న్యాదులు అధిష్ఠించియుండుట, తు = కాని, తదామసనాత్ = శ్రుతి ప్రబోధ కారణముచే.

ఇంద్రియములు, లేక అదిష్ఠాన దేవతలయొక్క పరాధీనతనుఁగూర్చి ఇప్పుడు చర్చింపఁబడుచున్నది.

ప్రాణములు (ఇంద్రియములు) తమ స్వశక్తిచే ప్రవర్తించునని పూర్వపక్షి పలుకును. ఒకవేళ అధిష్ఠానదేవతల మార్గదర్శిత్వముచేతనే ప్రాణములు ప్రవర్తించునని అంగీకరించినచో, కర్మఫలములను ఆ యధిష్ఠాన దేవతలే అనుభవింపవలసి వచ్చును. ఈ విధముగా జీవుడు అనుభవయోగ్యుడు కాజాలకుండును.

"తు" అను శబ్దము సంశయ నివారణకై ప్రయోగింపఁబడినది. ఇది పూర్వపక్షములను త్రోసిపుచ్చును.

ప్రాణములు మఱియు ఇంద్రియములు తమ స్వశక్తిచే కాకుండా, వాటి నధిష్ఠించియున్న దేవతల శక్తిచే క్రియల నొనర్చును.

ప్రాణములు, ఇంద్రియములు వాటి నధిష్ఠించియున్న అగ్న్యాది దేవతల అధీనమునందున్నవి. శ్రుతికూడా ఇట్లే ప్రతిపాదించుచున్నది. "అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్" అని ఐతరేయారణ్యకము (1-2-4) నందున్నది. ఇంద్రియములు జడములు. అవి స్వయముగా చలింపఁజాలవు.

ప్రాణములు తమ స్వశక్తి కారణముచే కార్యముల నొనర్చు సామర్థ్యమును కలిగియున్నవనుట అసంగతము. ఏలననగా చలనశక్తిని కలిగియున్న బండ్లు మున్నగు కొన్ని పదార్థములు ఎద్దులు మున్నగు వాటిచే లాగఁబడిప్పుడే కదలు చుండుటను మనముఁగాంచుచున్నాము.

కావున ప్రాణములు మఱియు ఇంద్రియములు అధిష్ఠాన దేవతలపై ఆధారపడియున్నవని తెలియుచున్నది.

## 2-4-15 ప్రాణవతా శబ్దాత్

ఇంద్రియములు జీవునికి సంబంధించియుండుటచే, జీవుడే భోక్తయగును. కాని దేవతలు కాదు. శ్రుతిమూలమున ఈ విషయము మన కవగతమగుచున్నది.

ప్రాణవతా = ఇంద్రియములను కలిగియున్నదానిచే, శబ్దాత్ = శ్రుతి వలన.

ఇంద్రియములకు మార్గదర్శులగుటచే దేవతలు భోక్తలై యుండవచ్చునను సంశయము పూర్వ సూత్రముచే కలుగవచ్చును. ఈ సూత్రముచే అట్టి సంశయము నివారింపఁబడును.

"ప్రాణమి"చ్చట ఇంద్రియమునకు పర్యాయపదమైయున్నది.

ఇంద్రియములు జీవునికి సంబంధించియున్నవి. ఈ విషయము శ్రుతియందు వర్ణింపఁబడియున్నది. దేవతలు ఇంద్రియములకు మార్గదర్శకములై యున్నను, అవి ఇంద్రియములకు అధిష్ఠానదేవతలై యున్నను, అవి భోక్తలు కాఁజాలవు. జీవుడే యజమానియై యున్నాడు. ఇంద్రియములాతనికి సేవకులవంటివి. జీవునియొక్క ఇచ్ఛానుకూలముగా ఇంద్రియములు వర్తించును. కర్మేంద్రియ సంఘాతమునకు జీవుడు ప్రభువు వంటివాడు. తాను చూచుచున్నట్లు వినుచున్నట్లు జీవుడు మాత్రమే గ్రహింపఁగలుగును.

శ్రుతి ఇట్లు వచించుచున్నది. "అథయత్రై తదాకాశమను విషణ్ణం చక్షుస్సచాక్షుషః పురషోదర్శనాయ చక్షురథ యోవేదేదం జిఘ్రాణీతిస ఆత్మాగంధాయ ఘ్రాణమ్" (ఛాం. ఉ. 8-12-4). దీనిచే జీవుడే భోక్త యగును. కాని దేవతలు కారని స్పష్టమగుచున్నది. ఇంద్రియములు కేవలము జీవునికి మాత్రమే సంబంధించి యున్నవి.

నేత్రము స్వయముగా తనకు సంబంధించినదని జీవుడు తలపోయును, మరియు వాదించును. దృశ్యపదార్థములను సమకూర్చుట ద్వారా నేత్రము అతనిని సేవించును. ఇదే విధముగా ఇతరములగు ఇంద్రియములు కూడా జీవునికి భృత్యువులై యున్నవి. కావున ఇంద్రియములకు జీవుడే ప్రభువు మఱియు భోక్త యగును. కాని అధిష్ఠానదేవతలు కారు.

ప్రాణములాతనికి చెందియుండుటచే జీవుడు "ప్రాణవత్" అని చెప్పఁబడును. భోగ్యవస్తువులను సాధించుటకై జీవుడు ఇంద్రియములను పోషించును. కేవలము ఇంద్రియములకు తమ కర్మల నొసంగుట ద్వారా దేవతలు వాటిని పోషించును. సౌఖ్యము ననుభవించుటకై జీవుడు ఇంద్రియములను పరిపాలించును.

ఇంతేకాకుండా శరీరమునందనేక దేవతలు కలరు. ఒక్కొక్క ఇంద్రియమును ఒక్కొక్క దేవత అధిష్ఠించి యుండును. ఇంద్రియములను పోషించు దేవతలయొక్క బహువచనప్రయోగముచే అవి శరీరమునందనుభవించుటకు తమ అయోగ్యత సూచింపఁబడుచున్నది. లేకున్నచో జ్ఞాపకశక్తి లేక తాదాత్మ్య గ్రాహ్యత అసాధ్యమగును.

కావున దేవతలు ఇంద్రియముల నధిష్ఠించి వాటికి మార్గదర్శకములైయున్నను, వాటి ననుభవించువాడు జీవుడే, కాని దేవతలు కారు.

## 2-4-16 తస్యచ నిత్యత్వాత్

మఱియు జీవుడు శరీరమునందు నిత్యుడై యుండుటచే అతడే భోక్త యగును, కాని దేవతలు కారు.

తస్య = దానియొక్క, చ = మఱియు, నిత్యత్వాత్ = నిత్యమైయుండుటచే.

15వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

జీవుడు మంచిచెడ్డలచే ప్రభావితుడగును. సుఖదుఃఖముల ననుభవించుచు,

భోక్తయై ఈ శరీరమునందు నిత్యుడైయున్నాడు. జీవుడ మాత్రమే శరీరములోని ఇంద్రియములతో శాశ్వతమైన సంబంధమును కలిగియున్నాడు. కావున జీవుడే వాటికి యజమాని యగును. కాని అధిష్ఠానదేవతలు కారు. జీవుని పూర్వకర్మల యొక్క ఫలితమే ఈ శరీరమైయున్నది. ప్రారబ్ధకర్మ సంజనితమైన దానిని మాత్రమే జీవుడీ శరీరము నందనుభవింపఁగలుగును. ఇతరులైన దేవతలు ఈ దేహము నందనుభవింపఁ జాలరు.

మహామహిమాన్వితులు మఱియు శక్తిమంతులగు దేవతలు క్షుద్రమైన మానవ శరీరమునందనుభవింపఁజాలరు. వారు ఉన్నతమైన స్థితియందున్నారు. మానవశరీరము ద్వారా అనుభవింపఁబడు ఈ క్షుద్రమైన భోగములను వారు హేయముగా తలంతురు.

దౌర్భాగ్యమైన ఈ శరీరమునకు భోక్తలుగా వారీ శరీరమునందు ప్రవేశింపఁజాలరు. శ్రుతి కూడా ఇట్లు నుడువుచున్నది. "పుణ్యమేవాముంగచ్ఛతి సహవైదేవాన్పాపంగచ్ఛతి" (బృ. ఉ. 1-5-20)

సశరీరుడగు జీవునికి మాత్రమే ఇంద్రియములు శాశ్వతముగా సంబంధించియున్నవి. జీవుడు వెడలిపోవునప్పుడు ఇంద్రియములు అతని ననుసరించును. దీని నీ క్రింది వాక్యములలో మనముఁ గాంచఁగలుగుదుము. "తముత్క్రామంతం ప్రాణోఽనూత్క్రామతి ప్రాణమనూత్క్రామంతం సర్వేప్రాణా అనూత్క్రామంతి" (బృ. ఉ. 4-4-2)

ఇంద్రియముల కధిష్ఠానదేవతలున్నను, జీవుడే యజమానియగుటచే అతడే భోక్తయైయున్నాడు. దేవతలు కేవలము ఇంద్రియములకు మాత్రమే సంబంధించియున్నారు. కాని వారు భోక్తయగు జీవుని భూమికకు సంబంధించిన వారు కారు.

# 8. ఇంద్రియాధికరణము
# (17-19 సూత్రములు)

## 2-4-17 త ఇంద్రియాణి తద్వ్యపదేశా దన్యత్ర శ్రేష్ఠాత్

ముఖ్యప్రాణము వినా ఇతర ప్రాణములు ఇంద్రియములని శ్రుతి వచించుచున్నది.

తే = అవి, ఇంద్రియాణి = ఇంద్రియములు, తద్వ్యపదేశాత్ = ఇట్లు ప్రబోధింపఁబడుటచే, అన్యత్ర = ఇతరత్ర, శ్రేష్ఠాత్ = ముఖ్యప్రాణము కంటె.

ముఖ్యప్రాణము మఱియు ఇతర ప్రాణముల యొక్క భేదమిచ్చట సూచింపఁబడినది.

నేత్రములు, చెవులు మున్నగు అవయవముల యొక్క క్రియలు ముఖ్యప్రాణమునకు సంబంధించినవా? లేక, స్వతంత్రములా? యనెడి సంశయమిచ్చట కలుగును.

శ్రుతి వచనానుసారముగా అవి కేవలము క్రియలని పూర్వపక్షి పలుకును. శ్రుతి ఇట్లు నుడువుచున్నది

"యచ్చప్రాణితి యచ్చనేతి పయసి హీదం సర్వం ప్రతిష్ఠితం యచ్చ ప్రాణితి యచ్చన" (బృ. ఉ. 1-5-2).

ఈ సూత్ర మీ విషయమును ఖండించి, ఏకాదశేంద్రియములు ముఖ్య ప్రాణము యొక్క క్రియలు కావని పలుకును. అవి భిన్నమైన వర్గమునకు చెందియున్నవి. అవి భిన్నములని శ్రుతివాక్యములు నిరూపించుచున్నవి. "ఏతస్మాజ్జాయతే ప్రాణో, మనస్సర్వేంద్రియాణి చ" (ముం. ఉ. 2-1-3). దీనియందును, ఇతర వాక్యములయందును ప్రాణములు మఱియు విషయేంద్రియములు భిన్నములని సూచింపఁబడినది. బృహదారణ్యకోపనిష ద్వాక్యమును గౌణముగా గ్రహింపవలయును.

ఇంద్రియములు భిన్నములని శ్రుతి పేర్కొనుటచే, ముఖ్యప్రాణము యొక్క పంచవృత్తులవలె ఇంద్రియములు కూడా దాని క్రియలేయని నిశ్చయముగా నుడువుటకవకాశము లేదు. ఇంద్రియములు భిన్నమైన స్వతంత్ర సూత్రము

లైయున్నవి. ఇంద్రియములు మఱియు మనస్సు కలిసి పదునొకండుగా వర్ణింపఁబడినవి.

## 2-4-18 భేదశ్రుతేః

భేదమును శ్రుతి ప్రతిపాదించుచుండుటచే.

భేదశ్రుతేః = భేదమును శ్రుతి ప్రతిపాదించిన కారణముచే.

17వ సూత్రమున కనుకూలమగు వాదమొసంగఁబడినది.

సమస్తము వ్యాపించియున్న ప్రాణము ఇంద్రియములకు విభిన్నముగా చెప్పఁబడినది. బృహదారణ్యకము (1-3-2) నందు ఇంద్రియములొక ప్రత్యేక ఖండమునందు వర్ణింపఁబడినవి. అవి సమాప్తమైన తర్వాత ప్రాణము ప్రథమ ఖండమునందు వివరింపఁబడినది. దీనిచే అవి ఒకే వర్గమునకు సంబంధించినవి కావని స్పష్టమగుచున్నది.

ఈ విభేదమును సూచించుటకు ఇతర వాక్యములు కూడా కలవు. "మనోవాచం ప్రాణంతాన్యాత్మనే కురుత" (బృ. ఉ. 1-5-3)

"దేవాసుర సంగ్రామములో వాక్కు, నాసిక, నేత్రము, చెవి, మనస్సు మున్నగు ఇంద్రియములు అసురులచే భేదింపఁబడుటను దేవతలుఁగాంచిరి. కావున వారు ముఖ్యప్రాణముయొక్క సహాయము నర్థించిర"ని బృహదారణ్యకము (1-3-2)నందు సూచింపఁబడినది. అసురులు ముఖ్యప్రాణమును భేదింపఁజాలకుండిరి. ఇట్లు దేవతలు అసురులపై విజయమును సాధించిరి. ఇచ్చట ముఖ్యప్రాణము ఇంద్రియములన్నింటికి శ్రేష్ఠమైనదిగను, విభిన్నమైనదిగను చెప్పఁబడినది. దీనికి క్రింది వాక్యము ప్రమాణమై యున్నది. "అప్పుడు దేవతలు ఇంద్రియములన్నింటి కధిపతియైన ముఖ్యప్రాణమునకు విన్నవించుకొనిరి." (బృ. ఉ. 1-3-7)

కావున ఇంద్రియములు స్వతంత్ర సూత్రములై యున్నవి. కాని ముఖ్య ప్రాణము యొక్క వృత్తులు కావు.

## 2-4-19 వైలక్షణ్యాచ్చ

మఱియు విలక్షణమైయున్న కారణముచే.

వైలక్షణ్యాత్ = విలక్షణత్వ కారణముచే, చ = మఱియు.

17వ సూత్రమున కనుకూలమగు వాదమొసంగఁబడినది.

ఇంతేకాకుండా ముఖ్యప్రాణము మఱియు ఇంద్రియముల మధ్య విలక్షణత కలదు. సుషుప్తియందు ఇంద్రియములు పనిచేయవు. కాని ప్రాణము పనిచేయును. ఇతర ప్రాణములంతమొందినను, ముఖ్యప్రాణమున కంతము లేదు. శరీరముయొక్క పోషణ మఱియు మృత్యువునకు కారణము ముఖ్యప్రాణము యొక్క నిలకడ మరియు పరిత్యాగములేయగును. కాని విషయేంద్రియములు కావు.

వస్తుపరిగ్రహణమునకు విషయేంద్రియములే కారణమగును. కాని ముఖ్యప్రాణము కాదు. ఇంద్రియములు అలసిపోవును. కాని ముఖ్య ప్రాణమలసిపోదు. ఒక్కొక్క ఇంద్రియము నశించినను మృత్యువు సంభవింపదు. కాని ప్రాణము బహిర్గతమైనప్పుడు శరీరము మృత్యువాతఁబడును.

ఈ విధముగా ఇంద్రియములనుండి ప్రాణమును వేఱుచేయుటకు అనేక విభేదములు కలవు. దీనిచేత కూడా ఇంద్రియములు ప్రాణమునకు విభిన్నమైయున్నవని తెలియుచున్నది.

"ఇంద్రియములు ప్రాణముయొక్క రూపమును ధరించెన"నెడి శ్రుతి వాక్యమును గౌణముగా ప్రయోగింపవలయును. "ప్రాణమ"నెడి శబ్దము విషయేంద్రియములకు గౌణముగా ప్రయోగింపఁబడినది. వాటి క్రియలు ప్రాణముపై ఆధారపడియుండునని దీని భావము. అనగా యజమానిని సేవకులు అనుసరించునట్లు ఇంద్రియములు ప్రాణము ననుసరించునని భావము. ముఖ్యప్రాణము ఇంద్రియములకు పాలనకర్త, యజమాని, లేక గురువువంటిది. ఇంద్రియములన్నింటికి ప్రాణము శ్రేష్ఠమైనదని శ్రుతి వర్ణించుచున్నది.

కావున ఇంద్రియములు స్వతంత్ర సూత్రములగునే కాని, ముఖ్యప్రాణము యొక్క వృత్తులు కావు.

# 9. సంజ్ఞామూర్తిక్ల ృప్త్యధికరణము
# (20-22 సూత్రములు)

## 2-4-20 సంజ్ఞామూర్తిక్లృప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్

కాని త్రివృత్కరణము నొనర్చువానిచే ఈ నామరూపములతో కూడిన సృష్టి సంభవించినదని శ్రుతి ప్రబోధించుచున్నది.

సంజ్ఞామూర్తి క్లృ ప్తిః = నామరూప సృష్టి, తు = కాని, త్రివృత్కుర్వతః = త్రివృత్కరణము నొనర్చిన వానియొక్క, ఉపదేశాత్ = శ్రుతి ప్రబోధించు కారణముచే.

శ్రుతి ఇట్లనును: "సేయందేవతైక్షత హన్తాహమిమాస్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనాను ప్రవిశ్యనామ రూపేవ్యాకరవాణీతి, తాసాంత్రివృతం త్రివృతమేకై కాంకర వాణీతి సేయం దేవతే మాస్తి స్రోదేవతా అనే నైవ జీవేనాత్మనాను ప్రవిశ్యనామ రూపే వ్యాకరోత్". (ఛాం. ఉ. 6-3-2,3).

ఇచ్చట నామరూప వికాసమునకు కర్త జీవుడా? లేక పరమాత్ముడా? యనెడి సంశయము కలుగును.

"అనేన జీవేనాత్మనా" యను శబ్ద సమూహకారణముచే జీవుడే కర్తయని పూర్వపక్షి పలుకును.

"తు"యనెడి శబ్దము పూర్వపక్షమును ఖండించును. ఈ సూత్రము దీనిని ఖండించి ఇట్లు పలుకును:- స్థూలప్రపంచమును సృష్టించుటకు జీవునికి శక్తిలేదు. ఈ సమస్త ప్రపంచ సృష్టి నిశ్చయముగా అగ్ని, జలము, పృథ్విని సృష్టించినట్టి పరమాత్ముని కార్యమేనైయున్నది. ఈ వాక్యములోని 'జీవ' శబ్దము వాక్య ప్రక్రియానుసారముగా 'అనుప్రవిశ్య' అను శబ్దమునకు సంబంధించియున్నది. కాని నామరూప సృష్టికి సంబంధించిలేదు.

నామరూపములను వికాసమొనర్చినవాడే పరమాత్ముడనెడి విషయము ఉపనిషత్తులన్నింటిచే అంగీకరింపఁబడినది. ఈ క్రింది వాక్యము దీనిని నిరూపించును. "ఆకాశోవైనామ నామరూపయోర్నిర్వ హితా" (ఛాం. ఉ. 8-14-1)

"తాసాం త్రివృతం త్రివృతమే కైకాంకరవాణి" (ఛాం. ఉ. 6-3-3) అను

మరియొక శ్రుతివాక్యముచే కేవలము పరమాత్ముడే ఈ నామరూపములను, స్థూలభూతములను మఱియు విశ్వమును సృష్టించుచున్నాడని స్పష్టమగుచున్నది.

పరమాత్ముడు ప్రతి వస్తువునందు వసించును. సమస్త సృష్టిని ప్రవర్తింపఁజేయును. కుమ్మరివానిచే కుండలు మున్నగువాటిని సృష్టింపఁజేయుట కాతడు అంతర్నియంతయై యున్నాడు.

## 2-4-21 మాంసాది భౌమం యథాశబ్ద మితరయోశ్చ

శ్రుతి వచనానుసారముగా పృథ్వినుండి మాంసాదులు ఉత్పన్నమగును. మఱియు ఇతరములగు అగ్ని, జలము విషయము కూడా ఇట్టిదే.

మాంసాది = మాంసము మున్నగునవి, భౌమం = భూమియొక్క కార్యములు, యథాశబ్దమ్ = శ్రుతి వచనానుసారముగా, ఇతరయోః = అగ్ని, జలములనెడి రెండింటి యొక్క, చ = మఱియు.

మానవునిచే భుజింపఁబడిన మాంసాది ఆహారము త్రివిధరూపములను ధరించునని శ్రుతి పలుకుచున్నది. "అన్నమశితన్త్రేధా విధీయతే తస్యయః స్థవిష్ఠోధాతు స్తత్పురీషం భవతి యోమధ్యమ స్తన్మాం సంయోఽణిష్ఠస్తన్మనః" (ఛాం.ఉ. 6-5-11). ఇదే విధముగా ఇతరములగు అగ్ని, జలముల యొక్క కార్యములను కూడా మనము శ్రుతినుండి గ్రహింపవలసియుండును. మనము త్రాగిన నీటియొక్క స్థూలాంశముచే మూత్రము, మధ్యమాంశముచే రక్తము మఱియు సూక్ష్మాంశముచే ప్రాణముత్పన్నమగును. మనము గ్రహించునట్టి అగ్నియొక్క స్థూలాంశము ఎముకలుగను, మధ్యమాంశము మజ్జగను మఱియు సూక్ష్మాంశము వాక్కుగను పరిణమించును.

## 2-4-22 వైశేష్యాత్తు తద్వాతస్తద్వాదః

కాని ప్రత్యేక భూతముయొక్క ఆధిక్యకారణముచే స్థూలభూతములు ఆ నామముచే పేర్కొనఁబడినవి.

వైశేష్యాత్ = ఆధిక్యకారణముచే, తు = కాని, తద్వాదః = ఆ ప్రత్యేక నామము, తద్వాదః = ఆ ప్రత్యేక నామము, తద్వాదః = ఆ ప్రత్యేక నామము.

21వ సూత్రమిచ్చుట విస్తరించి చెప్పఁబడినది.

ఇచ్చుట ఒక ఆక్షేపణ చెప్పఁబడినది. ఒకవేళ స్థూలభూతములన్నియును

మూడు సూక్ష్మభూతములను కలిగియున్నచో "ఇది అగ్ని, ఇది నీరు, ఇది పృథ్వి" యనెడి భేదమేర్పడుటకు కారణమేమి? మఱియు మానవ శరీరములోని పదార్థములలో మాంసాదులు మనము భుజించిన ఆహారముయొక్క కార్యము లనియు, రక్తాదులు మనము త్రాగిన జలము యొక్క కార్యములనియు, ఎముకలు ఇత్యాదులు మనము జీర్ణమొనర్చు కొనిన అగ్నియొక్క కార్యములనియును నుడువనేల?

"తు"యనెడి శబ్దము ఈ యాక్షేపణను తొలగించును. ఈ సూత్రము ఆక్షేపణను ఖండించును.

ప్రతి భూతమునందును ఇతర రెండు భూతములు కలిసియున్నవి. ఏ భాగము అధికాంశమునందున్నదో ఆ భాగముయొక్క పేరుఁపెట్టఁబడినది.

పదార్థములన్నియును త్రివృత్కరణము నొందియున్నను, నానాస్థలములలో నానాభూతములు అధికాంశమునందుండుటను మనముఁగాంచుచున్నాము. అగ్నియందు వేడి, జలమునందు ద్రవము, పృథ్వియందు ఆహారము అధికాంశము నందుండును. ప్రతి స్థూలభూతమునందును సూక్ష్మభూతముల యొక్క నిష్పత్తి సమానముగా లేకుండుటచే, వాటి నిర్మాణక్రమమునందే సూక్ష్మభూతము అధికాంశము నందున్నచో దానికా పేరు పెట్టఁబడినది.

ఈ విధముగా శుద్ధమైన అగ్ని అధికాంశమునందున్న మిశ్రమమునకు అగ్నియని పేరు పెట్టఁబడినది. ఇదే విధముగా దేవతలు తేజస్వంతులుగా చెప్పఁబడుటకు కారణమేమనగా, వారి శరీరములు అగ్ని అధికాంశమునందున్న పదార్థములచే నిర్మింపఁబడియున్నవి.

"తద్వాదః" అని రెండు పర్యాయములు చెప్పఁబడుటచే అధ్యాయము యొక్క సమాప్తి సూచింపఁబడినది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర ద్వితీయాధ్యాయ**

**చతుర్థపాదము**

**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## 3వ అధ్యాయము

## సాధనాధ్యాయము

## 1వ పాదము

## పీఠిక

ఇప్పుడీ మూడవపాదమునందు పరబ్రహ్మము, లేక అనంతత్వము నొందుటకు సాధనములు నిశ్చయించి చెప్పఁబడినవి. ఈ యధ్యాయములోని మొదటి రెండు పాదములలో ముముక్షువు బ్రహ్మసాక్షాత్కారమునుఁబడయుటకై తీవ్రమైన ఇచ్ఛను కలిగియుండుట మఱియు బ్రహ్మేతరములగు పదార్థములన్నింటిపై బలిష్ఠమగు వైరాగ్యమును కలిగియుండుట యనెడి రెండు విషయములు బోధింపఁబడినవి. ఏలననగా సాధనలన్నింటియందు ఈ రెండు పదార్థములు ప్రధానములైయున్నవి.

వైరాగ్యోత్పాదనము కొఱకై ప్రథమ పాదములోని సూత్రములు ఛాందోగ్యోపనిషత్తులోని పంచాగ్ని విద్యయందు బోధింపఁబడినట్టి మృత్యువనంతరము జీవుడు ఒక దశనుండి మరియొకదశకెట్లు పరివర్తనము నొందునో వర్ణించుచు, ఈ యైహిక జీవితముయొక్క అనిత్యతనుఁగూర్చి తెలుపును.

ప్రథమపాదము పునర్జన్మ సిద్ధాంతమును, భౌతిక దేహమునుండి జీవాత్మ నిర్గమించు విధానమును, మూడవలోకమగు చంద్రమండలమునకది పయనించు విధానమును మఱియు అది తిరిగి భూలోకమునకేతెంచు విధానమునున్నూ ప్రబోధించును. ఇహలోక, పరలోకములలోని విషయభోగములయందు వైరాగ్యము నుత్పన్నమొనర్చుటకై ఇది ప్రబోధింపఁబడినది. రెండవపాదమునందు పరబ్రహ్మము యొక్క సర్వజ్ఞత, సర్వశక్తిమత్వము, కారుణ్యము ఇత్యాది అత్యద్భుత గుణములు వర్ణింపఁబడినవి. దీనిచే జీవుడు దేవునిపైపు ఆకర్షింపఁబడి, అతడు దైవాన్వేషణము నొనర్చుటకు ప్రయత్న పరుడగును.

# సారసంగ్రహము

**1వ అధికరణము (1 నుండి 7 సూత్రములు)** :– ఆత్మ శరీరమునుండి వీడిపోవునప్పుడది సూక్ష్మభూతములు, ఇంద్రియములు మఱియు ప్రాణములతో కలసి వెళ్ళునని బోధించును. సూక్ష్మభూతములు ఆత్మనంటియున్న ప్రాణములకాధారమై యుండును. 7వ సూత్రము యజ్ఞము నొనర్చువారు చంద్రలోకములోని దేవతలకు ఆహారమగుదురని నుడువును. అనగా వారు తమ ఉనికిచేతను, సేవచేతను దేవతల సౌఖ్యమునకు కారణమగుదురని భావము.

**2వ అధికరణము (8 నుండి 11 సూత్రములు)** :– చంద్రలోకమునందు తమ పూర్వకర్మలఫలము ననుభవించిన అనంతరము జీవులు తమ కర్మశేషము (అనుశయము) తో భూమిపైకి దిగివత్తురు. ఇది నూతన శరీరముయొక్క స్వరూపమును, లేక నూతన జీవిత స్వభావమును నిశ్చయించునని తెలుపును.

**3వ అధికరణము (12 నుండి 21 సూత్రములు)** :– దుష్కర్మల నొనర్చిన వారు మృత్యువనంతరము చంద్రలోకము వరకు వెళ్ళజాలకుండుటచే, వారి గ్రహచారమునుఁగూర్చి చర్చించును.

**4, 5, 6 అధికరణములు (22, 23 మఱియు 24 నుండి 27 వరకుఁగల సూత్రములు)** :– చంద్రలోకము నుండి దిగువకేతెంచు జీవుల యొక్క సూక్ష్మశరీరములు ఆకాశము, వాయువు ఇత్యాది పదార్థముల ద్వారా భూపతనమగుటచే అవి వాటితో తాదాత్మ్యత నొందవనియు, అవి కేవలము వాటియందు వసించుననియును ప్రబోధించును. ధాన్యము, లేక ఒక మొక్కయందు ప్రవేశించిన అనంతరము ఆత్మ కేవలము దాని

నంటియుండి, రెండవ జీవునిచే అది కదలింపఁబడును. జీవుడు ధాన్యము, లేక మొక్కయందు ప్రవేశించిన తర్వాత ఆ ధాన్యమును, లేక మొక్క యొక్క ఫలమును భుజించిన వానియందు ప్రవేశించి, సంభోగక్రియ నొనర్చును. రతిక్రియ ద్వారా తల్లి యొక్క గర్భమునందు ప్రవేశించునంతవరకాతడు పురుషునియందంతర్భూతుడై యుండును. తుట్టతుదకాతడు తల్లియొక్క గర్భమునందు ప్రవేశించి, శిశువుగా జన్మించును.

# 1. తదంతర ప్రతిపత్త్యధికరణము

## (1 నుండి 7 సూత్రములు)

### 3-1-1 తదంతర ప్రతిపత్తౌరంహతి సంపరిష్వక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్

ఛాందోగ్యోపనిషత్తులోని ప్రశ్నోత్తరములనుఁబట్టి మరియొక శరీరమును పొందుటకై జీవుడు సూక్ష్మభూతసహితముగా వెళ్ళునని తెలియుచున్నది.

తదంతర ప్రతిపత్తౌ = నూతన శరీరమును పొందునిమిత్తమై, రంహతి = విడిచివెళ్ళును, సంపరిష్వక్తః = సూక్ష్మభూతములతో కూడుకొని, ప్రశ్ననిరూపణాభ్యాం = శంకాసమాధానములచే.

రెండవ అధ్యాయమునందు శ్రుతితర్కముల నాధారముగాఁగొని బ్రహ్మమునుఁ గూర్చి వేదాంతదృష్టికి విరుద్ధమైయున్న ఆక్షేపణలన్నియును ఖండింపఁబడినవి. ఇతర దృష్టులన్నియును అసత్యములనియు, అవి నిరాధారములనియు మఱియు వేదాంత గ్రంథములలో ఆరోపింపఁబడిన పరస్పర ఖండనలకు అస్తిత్వము లేదనియును నిరూపింపఁబడినది. ఇంతేకాదు, జీవునికి భిన్నమైన ప్రాణము ఇత్యాది పదార్థములన్నియును జీవుడు భోగించుటకై బ్రహ్మమునుండి ఉత్పన్నమైనవని చెప్పఁబడినది.

వైరాగ్యమును ఉత్పన్నమొనర్చుటకై ఈ యధ్యాయమునందు జీవుడు మరణానంతరము తన ఉపాధి సహితముగా నానాలోకములకు పయనించు విధానము, జీవుని నానావిధగతులు, బ్రహ్మస్వరూపము, విద్య (ఉపాసన)ల యొక్క

భిన్నత్వము మఱియు అభిన్నము, బ్రహ్మము సవిశేషమా? లేక నిర్విశేషమా? యను శంకకు సమాధానము, సమ్యగ్దర్శన జ్ఞానముచే జీవిత లక్ష్యమును చేఱువిధానము, నానా విధములగు సమ్యగ్దర్శన జ్ఞానముచే జీవిత లక్ష్యమును చేఱు విధానము, నానా విధములగగు సమ్యగ్దర్శన సాధనములు మఱియు పూర్ణజ్ఞానఫలమగు మోక్షము కొఱకు ప్రత్యేక నియమములు లేకుండుట వంటి విషయములు చర్చింపఁబడినవి.

జీవుడు మనఃప్రాణేంద్రియముల సహితముగా పూర్వ శరీరమును వదలి, నూతన శరీరమును ధరించును. అతడు తనతో కూడా అవిద్యను, పుణ్యాపాపకర్మలను మఱియు తన పూర్వజన్మ వాసనలను తీసికొని వెళ్ళును.

ఇచ్చట జీవుడు పునర్జన్మ నొందునప్పుడు నూతన శరీరమును ధరించుటకై బీజరూపముగా సూక్ష్మ భూతములను కలిగియుండునా? లేదా? యను ప్రశ్న ఉదయించును. సూక్ష్మభూతములు సర్వత్ర సులభముగా లభించుటచే, జీవుడు వాటిని ధరించియుండదని పూర్వపక్షి పలుకును. ఈ సూత్రమీ విషయమును ఖండించి, జీవుడు నూతన శరీరమునకు బీజములైయున్న సూక్ష్మభూతములను తీసుకొని వెళ్ళునని పలుకును. ఇది మనకెట్లు తెలియును? శ్రుతియందలి ప్రశ్నోత్తరములచే దీనిని తెలిసికొనవచ్చును. ప్రశ్న ఏమనగా "ఐదవ ఆహుతి యందు నీరు పురుషుడుగా ఏల చెప్పబడెనో నీకు తెలియునా? (ఛాం. ఉ. 5-3-3). దీనికి సమాధానముగా "శ్రద్ధ, సోమము, వర్షము, ఆహారము మఱియు బీజములు క్రమముగా ద్యులోకము పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు మఱియు స్త్రీ యనెడి అగ్నులలో ఆహుతి యొనర్చబడు కారణముచే ఐదవ ఆహుతియైన నీరే పురుషుడని చెప్పఁబడినది. ఇచ్చట ఛాందోగ్యములోని 5వ అధ్యాయమునందున్న 3-10 భాగములలోని పంచాగ్ని విద్యను పఠించుము. దీనిచే జీవుడు నీటితో కలిసి వెళు ్ళనని అర్థమొనర్చు కొనవచ్చును. భూతములు సర్వత్ర ఉనికిని కలిగియున్నను, భవిష్యద్దేహమున కావశ్యకములగు బీజము లెచ్చటను మనకు సులభముగా లభ్యము కావు. జీవునితో వెళ్ళు ఇంద్రియాదులు భౌతికదేహము లేకుండా అతనిని వెంబడింపఁజాలవు.

ఒక గొంగళిపురుగు పదార్థమును విడుచుటకు పూర్వము మరియొక పదార్థము

నెట్లు ఆధారముగాఁ గొనునో, అట్లే ప్రస్తుత శరీరమును విడుచుటకు పూర్వము జీవునికి నూతన శరీరము దృష్టి గోచరమగును. కావున ఆత్మేంద్రియములు రెండున్నూ సర్వవ్యాపకములనియు మఱియు నూతన శరీరమును ధరించినప్పుడే కర్మానుభవ కారణముచే అవి పనిచేయుట కారంభించుననెడి సాంఖ్యవాదము, నూతన శరీరమునందు ఇంద్రియ రహితముగా కేవలము ఆత్మయే పనిచేయుననియు, నూతన ఇంద్రియములు నూతన శరీరమును ధరించుననెడి బౌద్ధవాదము, నూతన శరీరములోనికి కేవలము మనస్సు మాత్రమే వెళ్ళుననెడి వైశేషికవాదము, మఱియు ఒక చిలుక ఒక చెట్టునుండి మరియొక చెట్టు కెగురునట్లు కేవలము ఆత్మ మాత్రమే పూర్వ శరీరమునుండి ఎగిరి నూతన శరీరమునందు వాలుననెడి దిగంబర జైనవాదములు వైదిక సిద్ధాంత విరుద్ధములగుటచే సత్యసమన్వితములు కానేరవు. జీవుడు శరీరమునుండి మనస్సు, ప్రాణము, ఇంద్రియములు సూక్ష్మభూత సహితముగా వెళ్ళును.

కేవలము జలము మాత్రమే జీవుని అనుసరించుననియు, మరి ఏ యితర భూతము కూడా అనుసరించి వెళ్ళదనెడి ఆక్షేపణ ఇచ్చట చెప్పఁబడవచ్చును. అట్టిఎడ జీవుడు సమస్త సూక్ష్మభూత సమన్వితుడై వెళ్ళునని చెప్పుటకెట్లు వీలగును? ఈ యాక్షేపణకు తదనంతర సూత్రము సమాధానము నొసంగును.

## 3-1-2 త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్

జలమునందు భూతత్రయముండుటచే జీవుడు సమస్తభూత సమన్వితుడై యుండును. కాని కేవలము జలమును మాత్రము కలిగియుండడు. ఐనను మానవదేహమునందు జలాధిక్యకారణముచే శ్రుతియందు జలము మాత్రము పేర్కొనఁబడినది.

త్ర్యాత్మకత్వాత్ = జలము భూతత్రయమును కలిగియుండుటచే, తు = కాని, భూయస్త్వాత్ = జలాధిక్య కారణముచే.

జీవుని అనుసరించు జలము త్రిగుణాత్మకమైయున్నది. దానియందు యితర భూతములన్నియును అంతర్నిహితములై యున్నవి. మానవశరీరమునందు జలము అధికముగా ఉన్న కారణముచే శ్రుతి జలమునుఁ గూర్చి ప్రత్యేకముగా చెప్పినది. చలనముఁగల శరీరములన్నిటియందును రక్త, రసాది ద్రావకములు అధికముగానుండును.

"తు" యను శబ్దముచే పైన సూచింపఁబడిన ఆక్షేపణ తొలగింపఁబడును. నిజమునకు జలము స్థూలభూతముల త్రివృత్కరణ కారణము వలన జలము, అగ్ని మఱియు పృథ్వియొక్క మిశ్రమమైయుండుటచే అది సమస్త భూతములను సూచించును. కావున భూతత్రయము జీవుని అనుసరించి వెళ్ళును. కేవలము జలముచే ఏ శరీరమునకున్నూ రూపమేర్పడదు. ఇంతేకాదు, శరీరముయొక్క కారణావస్థయగు శుక్లము మఱియు ఋతుస్రావరక్తమునందు ద్రావకపదార్థము అతిశయించియుండును. మఱియు భవిష్యచ్ఛరీర నిర్మాణమునకు ఉపాదాన కారణమైయున్న కర్మకాండయందు సోమము, దుగ్ధము, వెన్న వంటి ద్రావక పదార్థములావశ్యకములై యుండును.

## 3-1-3 ప్రాణగతేశ్చ

ఆత్మతో కలిసి ప్రాణములు (విషయేంద్రియములు) కూడా వెళ్ళుటచే, భూతములు కూడా ఆత్మ ననుసరించి వెళ్ళును.

ప్రాణ = విషయేంద్రియముల యొక్క, గతేః = వెళ్ళుటచే, చ = కూడా.

శరీరము క్షయించునప్పుడు సూక్ష్మభూతసారముకూడా జీవుని అనుగమించునని చెప్పుటకు మరియొక కారణమొసంగఁబడినది. శరీరము నశించునప్పుడు జీవునితోపాటు ప్రాణేంద్రియములు కూడా విడిపోవునని శ్రుతి ప్రతిపాదించినది. అతడిట్లు విడిపోవునప్పుడు ఇతర ప్రాణములన్నియును దానిననుగమించును (బృ. ఉ. 4-4-2). అవి భూతములయొక్క ఆధారము లేకుండా నిలువఁజాలవు. కావున శరీరము క్షీణించునప్పుడు జీవుడు సూక్ష్మభూతసారముతో కూడియున్నవాడై విడిపోవునని తెలియుచున్నది. ప్రాణములు చలించుటకై సూక్ష్మభూతములు మూలాధారములగును. నిరాధారముగా ప్రాణములు బహిర్గతమగుట సాధ్యము కాదు. ఇట్టి ఆధారము లేకుండా ప్రాణములు చలింపవు. లేక ఎచ్చటనైనను స్థిరముగా నుండవు. ఈ విషయము ప్రాణముఁగల జీవులలో చూడఁబడుచున్నది.

ప్రాణములు రెండవ శరీరములోనికి వెళ్ళినప్పుడు మాత్రమే సుఖదుఃఖానుభవము సాధ్యమగును. జీవుడు విడిపోవునప్పుడు ముఖ్యప్రాణము కూడా అతని ననుసరించును. ముఖ్యప్రాణము విడిపోవుప్పుడు ఇతర ప్రాణములు మఱియు సమస్తేంద్రియములు దాని ననుగమించును. భూతసారములు

ప్రాణమునకు వాహనములవంటివి. భూతములెచ్చట ఉండునో, అచ్చట ఇంద్రియములు మఱియు ప్రాణములుండును. అవి ఎప్పుడున్నూ విడివడి యుండవు.

## 3-1-4 అగ్న్యాది గతి శ్రుతే రితిచేన్న భాక్తత్వాత్

ఒకవేళ శ్రుతివాక్యానుసారముగా ప్రాణేంద్రియములు ఆగ్న్యాదులలో ప్రవేశించుటచే అవి జీవుని అనుగమింపవని పలికినచో, అది గౌణార్థమునందు చెప్పఁబడుటచే అది సరికాదని మేము నుడువుదుము.

అగ్న్యాది = అగ్ని మున్నగునవి, గతి = ప్రవేశించుట, శ్రుతేః = శ్రుతి కారణముచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = అది అంగీకరింపఁబడదు, భాక్తత్వాత్ = అది గౌణార్థమునందు చెప్పఁబడుటచే.

నూతన శరీరము పొందఁబడునప్పుడు ప్రాణములు జీవుని అనుగమించునను విషయమును పూర్వపక్షి నిషేధించుచున్నాడు. ఏలననగా అవి అగ్న్యాదులలో ప్రవేశించునని శ్రుతి నుడువుచున్నది ఈ దృష్టికోణమును ఈ సూత్రము ఖండించును.

వెంద్రుకలు వృక్షమును ప్రవేశించునని చెప్పినట్లు, ప్రాణములు మరణ సమయమునందు అగ్న్యాది దేవతలలో ప్రవేశించునని చెప్పఁబడిన శ్రుతివాక్యము గౌణార్థమునందు ప్రయోగింపఁబడినది. ప్రాణములు అగ్న్యాది దేవతలయొక్క అనుగ్రహమును పొందునని మాత్రమే ఇచ్చట శ్రుతి యొక్క అభిమతమైయున్నది.

వాగాదులు అగ్నియందు ప్రవేశించుట రూపకాలంకారము వంటిది. శరీరములోని రోమములు పొదలలోను, తలలోని వెంట్రుకలు వృక్షములయందును ప్రవేశించునని శ్రుతి పలికినను, నిజముగా రోమములు శరీరమునుండి ఎగిరిపోయి, వృక్ష గుల్మాదులలో ప్రవేశించుననుకొనరాదు.

శ్రుతివాక్యము స్పష్టముగా ఇట్లు నుడువుచున్నది. “తముత్క్రామంతం ప్రాణోనూత్క్రామతి ప్రాణమనూత్క్రామంతం సర్వే ప్రాణా అనూత్క్రామంతి” (బృ. ఉ. 4-4-1).

ఇంతేకాకుండా ఒకవేళ ప్రాణము దాని ననుసరింపకున్నచో, ఆత్మ ఎంత మాత్రము బయలుదేరకుండెడిది. ప్రాణము లేకుండా ఆత్మ నూతన శరీరమునందు

ప్రవేశింపకుండెడిది. ప్రాణములు నూతన శరీరమునందు ప్రవేశింపకున్నచో దానియందు సుఖ దుఃఖానుభవము కలుగకుండెడిది.

ప్రాణేంద్రియాదులకు మార్గదర్శకములై వాటికి సహకరించుచున్న అగ్న్యాది దేవతలు మరణసమయమునందు సహకారము నొసంగుటను మానుకొనునని ఈ వాక్యము రూపకాలంకారముగా నుడువుచున్నది. తత్ఫలితముగా ప్రాణేంద్రియములు తమ కార్యములనుండి నివృత్తమై తమ అధిష్ఠాన దేవతలయందు లయించును. ఆ సమయమునందు ప్రాణేంద్రియములు నిశ్చలమైయుండి, పయనించుచున్న ఆత్మను అనుగమించుటకై వేచియుండును.

వాక్కు అగ్నియందు ప్రవేశించుట ఇత్యాదులు కేవలము మృత్యుసమయము నందీ ప్రాణేంద్రియములు తమ క్రియలనుండి విముఖములగుటనే సూచించును. కాని ఆత్మతో వాటికి పూర్తిగా సంబంధములేదని అర్థము కాదు. కావున మరణసమయమునందు ప్రాణేంద్రియములు ఆత్మ ననుసరించునను విషయము నిశ్చయింపఁబడినది.

## 3-1-5 ప్రథమేఽ శ్రవణాదితిచేన్న తా ఏవ హ్యుపపత్తేః

ఒకవేళ ప్రథమాహుతి జలముగా పేర్కొనఁబడలేదని ఆక్షేపింపఁబడునేని అట్లు కాదని మేము పలుకుదుము. ఏలననగా "శ్రద్ధ" యను పదము కేవలము జలమను అర్థమును సూచించును. కారణమేమనగా ఈ వాక్యములోని ఈ శబ్దమునకిదియే సరియైన అర్థమైయున్నది.

ప్రథమే = ఛాందోగ్యమునందు వర్ణింపఁబడిన పంచవిధాహుతులలో మొదటి దానియందు, అశ్రవణాత్ = పేర్కొనఁబడకుండుటచే, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = కాదు, తా ఏవ = ఆ నీరు, హి = ఏలననగా, ఉపపత్తేః = తగియుండుటచే.

పూర్వపక్షి ఒక ఆక్షేపణను చెప్పుచున్నాడు. "ప్రథమాహుతియందు జలమను అర్థము రాకుండుటచే "ఐదవ ఆహుతియందు జలమే పురుషుడ"ను వాక్యము యొక్క అర్థము ఎట్లు నిశ్చితమగును?" – "తస్మిన్నే తస్మిన్నగ్నౌ దేవాశ్శ్రద్ధాం జుహ్వతి" (ఛాం. ఉ. 5-4-2).

సిద్ధాంతి తన సమాధానము నొసంగుచున్నాడు – ప్రథమాగ్నియందు శ్రద్ధయను శబ్దమునకు "జలమ"ను అర్థమును స్వీకరింపవలయును. ఏల? ఈ యర్థమిచ్చుట సరిపోవునుఁగనుక. అప్పుడు మాత్రమే ఈ వాక్యముయొక్క ఆదిమధ్యాంతములయందు సమన్వయమేర్పడును. మఱియు సంపూర్ణవాక్యము యొక్క సంధానమునకు భంగమేర్పడకుండును. లేని ఎడల ప్రశ్నోత్తరములకు సంబంధమే లేకుండును. మఱియు ఈ కారణముచే సమస్త వాక్యమునందుఁగల ఏకత్వము నశించును.

స్వయముగా శ్రద్ధ ఒక భౌతికపదార్థమువలె స్వీకరింపఁబడి ఆహుతి యొనర్పఁబడదు. కావున శ్రద్ధను "జలమ"నెడి అర్థమునందు స్వీకరింపవలయును. శ్రుతి గ్రంథములలో జలము శ్రద్ధ యనఁబడును. "శ్రద్ధా వా ఆపః" శ్రద్ధయే జలము. (తై. ఉ. 1–6–8–1). ఇంతేకాకుండా వర్షము నొసంగు యజ్ఞమునకు శ్రద్ధయే కారణమైయున్నది.

సోమము, వర్షము, అన్నము మఱియు బీజములనెడి ఇతరములగు చతుర్విధాహుతులు శ్రద్ధయొక్క కార్యములుగా వర్ణింపఁబడినవి. స్వయముగా శ్రద్ధయే చతుర్విధములుగా పరిణామము నొందును. కారణము తన కార్యమునకభిన్నమై యుండుటచే, శ్రద్ధ ఆహారాది పదార్థ సంబంధమగు సారమైయుండవలయును. కేవలము కారణముయొక్క మార్పే కార్యమనఁబడును. కావున ఇచ్చుట శ్రద్ధను జలమనెడి అర్థమునందు స్వీకరించుట యుక్తమగును.

## 3–1–6 అశ్రుతత్వాదితిచే న్నేష్టాది కారిణాం ప్రతీతేః

ఒకవేళ శ్రుతియందు జీవుడు పేర్కొనఁబడకుండుటచే జీవుడు జలాదులతో కలిసి నిర్గమింపఁజాలడని పలికినచో, అట్లు కాదని మేము సమాధానమొసంగుదుము. ఏలననగా యజ్ఞయాగాది సత్కార్యముల నొనర్చువారు మాత్రమే స్వర్గలోకమున కేగుదురని శ్రుతులు ప్రబోధించుచున్నవి.

అశ్రుతత్వాత్ = శ్రుతియందది పేర్కొనఁబడకుండుటచే, ఇతి = ఇట్లు చెప్పుట, చేత్ = ఒకవేళ, న = కాదు, ఇష్టాదికారిణామ్ = యజ్ఞయాగాది కర్మల నొనర్చువారినిఁగూర్చి, ప్రతీతేః = అర్థమొనర్చుకొనఁ బడుటచే.

ఛాందోగ్యోపనిషత్తు (5–3–3) నందు జలము మాత్రము పేర్కొనఁబడినది. కాని జీవుడు పేర్కొనఁబడలేదను ఆక్షేపణ ఇచ్చుట చెప్పఁబడినది. ఈ యాక్షేపణ

నిలువనేరదు. ఈ వాక్యము దక్షిణాయనము, చంద్రలోకమార్గము, లేక ధూమమార్గమునకుఁగొంపోవు ఇష్ట (యజ్ఞములు) మఱియు పూర్త (చెఱువులను త్రవ్వించుట, దేవాలయములను కట్టించుట ఇత్యాదులు) కర్మలనొనర్చునట్టి మఱియు దానధర్మముల నొనర్చునట్టి వ్యక్తులనుఁగూర్చి సూచించును. (ఛాం. ఉ. 5-3-10)

ఇష్టకాది కర్మల నొనర్చిన వ్యక్తులకు అగ్నిహోత్రము, దర్శపూర్ణమాసము మఱియు ఇతర యజ్ఞములలో పాలు, మజ్జిగ, పెరుగు ఇత్యాది పదార్థరూపమునందు జలము సరఫరా చేయఁబడును. యజ్ఞములలో ఆహుతిగా అర్పింపఁబడినట్టి పాలు, పెరుగు ఇత్యాది పదార్థములు అపూర్వమనెడి సూక్ష్మరూపమును ధరించి, యజ్ఞకర్త ననుసరించియుండును. ఈ విధముగా యజ్ఞములలో ఆహుతి యొనర్పఁబడిన పదార్థములనెడి నీటితో కలిసి జీవులు పయనించుచుందురు. ఆహుతిరూపమును ధరించిన జలము అపూర్వమనెడిసూక్ష్మరూపమును ధరించి, జీవుల నాచ్ఛాదించి, వారిని కర్మఫలముల నుపభోగింపఁజేయుటకై స్వర్గలోకమునకు గొంపోవును.

ఇప్పుడు పూర్వపక్షిచే మరియొక ఆక్షేపణ రేకెత్తించఁబడినది. అతడిట్లనును. "తద్దేవా నామన్నంతం దేవాభక్షయంతి" (ఛాం. ఉ. 5-10-4). "తే చంద్రం ప్రాప్యాన్నం భవంతి - ఏనాం స్తత్ర భక్షయంతి తేషామ్" (బృ. ఉ. 6-12-16). ఒకవేళ వారిని పులులవలె దేవతలు భక్షించినచో, వారు తమ కర్మఫలముల నెట్లనుభవింపఁగలుగుదురు? ఈ క్రింది సూత్రము దీనికి సరియైన సమాధానము నొసంగును. యజ్ఞకర్తలు చంద్ర లోకమును చేరినప్పుడు వారు "సోమరాజు"యనెడి నామమును ధరింతురు. "సోమరాజు" యనెడి సాంకేతిక పదము ఇచ్చట జీవునికన్వయించును.

## 3-1-7 భాక్తం వా నాత్మ విత్త్వాత్తథాహి దర్శయతి

కాని శ్రుతియందు వర్ణింపఁబడిన విధముగా జీవులు ఆత్మజ్ఞానము నొందని కారణముచే, వారు స్వర్గలోకమునందు దేవతలచే ఆహారముగా భక్షింపఁబడుదురని గౌణార్థమునందు చెప్పఁబడినది.

భాక్తం = గౌణము, వా = కాని, అనాత్మవిత్త్వాత్ = ఆత్మజ్ఞానము లేని కారణముచే, తథా = ఆ విధముగా, హి = ఏలననగా, దర్శయతి = శ్రుతియందు చెప్పఁబడినది.

"జీవుడు దేవతలకు ఆహారమగున"ను వాక్యమునకు గౌణార్థమును స్వీకరింపవలయును. కాని ముఖ్యార్థమును స్వీకరింపరాదు. లేనిచో "స్వర్గకామోయజేత"యనెడి శ్రుతివాక్యము అర్థరహితమగును. ఒకవేళ దేవతలు జీవులను భక్షింతురేని, మానవులచ్చటికేగుటకు ప్రయత్నమునేల యొనర్పవలయును? మఱియు జ్యోతిష్టోమాది యజ్ఞమునేల నిర్వర్తింపవలయును? ఆహారము భోగసాధనమైయున్నది. యజ్ఞకర్తలచే దేవతలానందించుటయే "భుజించుట"యని అర్థము. పురుషులకు భార్యాపుత్రులు మఱియు పశుసంపద ఎట్లానందము నొసంగునో, అట్లే యజ్ఞములు దేవతలకు భోగసాధనములైయున్నవి. మధుర పదార్థములను నమిలి మ్రింగుటవలె అది నిజముగా భుజించుట కాదు. దేవతలు సామాన్య మానవులవలె భుజింపరు. శ్రుతి ఇట్లు పలుకుచున్నది. "దేవతలు తినరు మఱియు త్రాగరు, వారు కేవలము అమృతమును సందర్శించి, సంతృప్తినొందుదురు."

యజ్ఞముల నొనర్చువారు దేవతలకు నిమ్నదశయందున్నను, వారు రాజభృత్యులవంటి ఆనందము ననుభవింతురు. వారు దేవతలకు ఆనందమునొసంగి, వారితోపాటు ఆనందముననుభవింతురు. ఆత్మజ్ఞానము నొందనివారు దేవతలకు భోగ్యపదార్థములగుదురు. ఇది ఈ క్రింది శ్రుతివాక్యముచే బోధపడును. "అథయోఽన్యాందేవ తాముపాస్తేఽ న్యోసావన్యోఽహమస్మీతిన సవేద యథాపశు రేవం స దేవానామ్" (బృ. ఉ. 1-4-10) అనగా ఎవరైతే తన జీవితమునందు యజ్ఞయాగాది కర్మల ద్వారా దేవతలకు ప్రసన్న మొనఁగూర్చి పశువువలె వారిని సేవించి, లోకాంతరములలోను ఒక పశువువలె వారిపై ఆధారపడియుందురో, వారు దేవతలచే సూచింపఁబడిన విధముగా తమ కర్మఫలము ననుభవింతురు. వారు దేవతలకు సేవయొనర్చు వారికి సహకారులైయుందురు. వారు దేవతలయొక్క సాన్నిధ్యము ననుభవింతురు. కావున గౌణాత్మకముగా వారు దేవతలకు ఆహారమువంటివారని చెప్పఁబడుదురు. ఆ లోకమునందు తమ ఉనికిచేతను మఱియు సేవచేతను వారు దేవతలకు సౌఖ్యము నొనఁగూర్తురు. కావున జీవి తన సుకృత కర్మఫలముల ననుభవించుటకై లోకాంతరముల కేగునప్పుడు, సూక్ష్మభూత సారసమన్వితుడై వెళ్ళుననుట సుస్పష్టము. చంద్రలోకసౌఖ్యము ననుభవించి, పుణ్యక్షయానంతరమాతడు తిరిగి భూలోకమున కేతెంచును.

# ౨. కృతాత్యయాధికరణము

## (8-11 సూత్రములు)

## 3-1-8 కృతాత్యయేనుశయవాన్ దృష్టస్మృతిభ్యాం యథేతమనేవంచ

శ్రుతి స్మృతి వచనానుసారముగా పుణ్యక్షయానంతరము జీవుడు కర్మశేషముతో భూలోకమునకు తిరిగి వచ్చునప్పుడు, మృత్యువనంతరము అతడే మార్గముగుండా వెళ్ళెనో అదే మార్గముగుండా తిరిగి వచ్చును. లేక మఱియొక మార్గము ద్వారానైనను రావచ్చును.

కృత = కర్మయొక్క, అత్యయే = సమాప్తియందు, అనుశయవాన్ = కర్మశేషముఁ గలవాడు, దృష్ట స్మృతిభ్యాం = శ్రుతి స్మృతులలోని ప్రత్యక్షవచనములచే, యథేతం = అతడే మార్గముగుండా వెళ్ళెనో, అనేవం = భిన్నముగా, చ = మరియు.

ఇచ్చట ఒక నూతన అధికరణము చర్చింపఁడుచున్నది. స్వర్గలోకమునుండి తిరిగివచ్చు విధానము ఈ యధికరణము మనకు బోధించును. జీవులు సమస్త కర్మఫలములననుభవించిన అనంతరము కర్మశేషముతో భూలోకమునకు తిరిగివత్తురా? లేదా? యను ప్రశ్న రేకెత్తింపఁబడినది. కర్మశేషముండదని పూర్వపక్షి పలుకును. ఏల? "యావత్సంపుటమ్" అను వివరణముచే శ్రుతి ఇట్లు నుడివినది. "తస్మిన్యావత్సంపాతముషిత్వా ఉథైతమేవా ధ్వానం పునర్నివర్తంతే" (ఛాం. ఉ. 5-10-5). దీనిచే అచ్చట వారి సమస్తకర్మలు నశింపఁబడినవనియు, మరేమియు శేషము లేదనియును సూచింపఁబడుచున్నది.

ఈ దృష్టికోణము అసంగతము. సరియైన విషయమేమనగా అనుభవింపఁ బడని కర్మశేషముచే, లేక అనుశయ కర్మబలముచే జీవులు భూలోకమునకు తిరిగివత్తురు. సుకృతకర్మఫలము ననుభవించుటకై చంద్రలోకమున కేగుటకు సహకరించిన కర్మసంచయము పూర్తియైనప్పుడు, ఆనందానుభవము పరిసమాప్తమగుచున్నదనెడి విచారమును అగ్నిచే, సూర్యకిరణములచే వడగండ్లు కరిగిపోవునట్లు మఱియు అగ్నిసంబంధముచే ఘృతము కరగిపోవునట్లు ఆనందానుభవమునకై సృష్టింపఁబడిన జలతత్త్వశరీరము నశించును. అప్పుడా జీవులు కర్మశేషముతో భూపతనమగుదురు.

ఈ విషయము శ్రుతియందును, స్మృతియందును నిరూపింపఁబడినది. శ్రుతి ఇట్లనును: "తద్య ఇహరమణీయచరణా అభ్యాశోహయత్తే రమణీయాం యోనిమాపద్యేరన్ బ్రాహ్మణయోనింవా క్షత్రియ యోనింవా వైశ్యయోనింవాథయ ఇహకపూయచరణా అభ్యాశోహయత్తేకపూయాం యోనిమాపద్యేరన్ శ్వయోనింవసూకర యోనింవా చండాల యోనింవా" (ఛాం. ఉ. 5-10-7).

స్మృతి ఇట్లనును: "తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి, ఏవం త్రయా ధర్మమను ప్రపన్నాగతాగతం కామ కామాలభంతే" (భ. గీ. 9-21). కావున జీవుడు కర్మశేషముతో జన్మించును.

నిమ్నోన్నత జన్మలకు కారణమైన ఈ యనుశయ కర్మయనునదేమి? ఈ కర్మశేషమెట్టిదై యుండును? స్వర్గలోకప్రాప్తికై పూర్వజన్మయందొనర్పఁబడిన కర్మలు అనుభవింపఁబడిన తర్వాత శేషించిన కర్మలే అనుశయ కర్మ యనబడునని కొందఱందురు. ఆ కర్మశేషమును ఒక పాత్రయందు పోయఁబడిన తైలము ఖాళీచేయఁబడిన అనంతరము దానిలోపల అంటుకొనియుండు నూనెవంటిదని చెప్పవచ్చును. లేక ఒక రాజసభలోని పురుషుడు తన దర్బారు వేషమును విడిచి కేవలము తన గొడుగు మఱియు పాదరక్షలతో వచ్చువానితో పోల్చవచ్చును. ఈ దృష్టాంతములు స్పష్టముగా అసంగతములు. ఏలననగా పుణ్యకర్మచే జీవుడు స్వర్గలోకము నొందినప్పుడు దానిలో ఒక భాగముచే అతడు భూపతనమగుననుట సంభావ్యము కాదు. దీనిచే పుణ్యకర్మఫలముచే కేవలము స్వర్గలోకము ప్రాప్తించుననియు మఱియు కర్మశేషమేమాత్రము మిగిలియుండదనియును స్పష్టముగా నుడివెడి శ్రుతివాక్యమునకు వైరుధ్యమేర్పడును.

ఇంతేకాకుండా శ్రుతివాక్యమునందు "రమణీయ చరణాః కపూయ చరణాః" అనెడి కర్మశేష భేదములు చెప్పఁబడినవి. రెండవది స్వర్గలోకమును ప్రాప్తింపఁజేయు పుణ్యకర్మల యొక్క అంశము కాఁజాలదు. కావున అనుశయమనునది కర్మఫలములనొసంగు మరియొక కర్మసంఘాతశేషమై యున్నది. స్వర్గలోకము నందు పుణ్యకర్మలు పూర్తిగా అనుభవింపఁబడిన తర్వాత, ఈ లోకమునందను భవింపఁదగిన పుణ్యపాప కర్మలు శేషించుటచే, అట్టి అనుశయ కర్మచే జీవులీ భూలోకమున కేతెంతురు.

మరియొక దృష్టికోణమేమనగా మృత్యువనంతరము సమస్త కర్మఫలములు పరిసమాప్తమగును. కాంబట్టి జీవులు ఏలాటి అనుశయము లేకయే భూలోకమునకు తిరిగివత్తురు. ఇది పొరపాటు. ఇది అసంగతము. కొన్ని కర్మలు కేవలము ఒకే విధమగు జన్మయందును, మరికొన్ని కర్మలు వేరొక విధమగు జన్మయందును అనుభవింపంబడును. అవి ఒకే జన్మయందు గుమింగూడవు. వాటిలో కొంత అంశము కర్మఫలముల నొసంగవని నుడువుటకు వీలులేదు. ప్రాయశ్చిత్తము వినా కర్మఫలానుభవమును తప్పించుకొనలేము. ఒకవేళ మృత్యువనంతరము సమస్తకర్మలు ఫలములనొసంగినచో, స్వర్గనరకముల ననుభవించిన తర్వాతంగాని, జంతుజన్మను చాలించిన తర్వాతంగాని పునర్జన్మ కవకాశము లేకుండును. ఏలననగా వీటియందు పుణ్యపాపముల నొనర్చుటకు వీలు లేకుండును. ఇంతే కాకుండా బ్రహ్మహత్యవంటి ఘోరమైన పాపములచే అనేక జన్మలనెత్తవలసియుండును.

అట్టిఎడల సంపూర్ణకర్మ సంఘాతము కేవలము ఒకే జన్మకు కారణమెట్లగును? పుణ్యపాపములకు శ్రుతియే ప్రమాణమైయున్నది. అదేవిధముగా వర్షమును కోరువారు "కారీరి ఇష్టి"యను యజ్ఞము నొనర్చినచో అది వర్షమునకు హేతువగును. కావున దానిని నీవు మృత్యువనంతరము సంభవించు పురాకృత కర్మఫలమని చెప్పంజాలవు. కాబట్టి మృత్యువుచే సమస్తకర్మలు ఫలీభూతమగుననియు, సమస్త కార్యములు మృత్యువనంతరము సంభవించు సంపూర్ణ కర్మక్షయమనియును తలంచు దృష్టికోణము పూర్తిగా అసంగతము మఱియు నిరాధారమై యున్నది.

ఒక దీపము సమస్త పదార్థములను చూపునట్లు మృత్యువు సమస్త కర్మలను క్షీణింపంజేయునని పూర్వపక్షి పలుకును. ఈ దృష్టాంతము అప్రతిపాద్యమైయున్నది. ఏలననగా ఒక దీపము ఒక పెద్ద మఱియు ఒక మిక్కిలి చిన్న పదార్థమునకు సమాన దూరమునందున్నను, అది పెద్దపదార్థమును చూపునే కాని చిన్న పదార్థమును చూపదు. అదే విధముగా రెండు కర్మలు ఫలించుటకు సమానమైన అవకాశమున్నను, మృత్యువు బలవత్తరమైన కర్మలను ఫలింపంజేయునేంగాని, బలహీనమైన కర్మలను కాదు. ఈ కారణమువలన మృత్యువుచే సమస్త కర్మక్షయమగుననెడి దృష్టికోణము సరియైనది కాదు. ఏలననగా ఇది శ్రుతి, స్మృతి మఱియు బుద్ధి శక్తులకు విరుద్ధమైయున్నది.

కర్మశేషముచే మోక్షము అసంభవమని నీవు భయపడవలసిన అవసరము లేదు. ఏలననగా ఆత్మజ్ఞానముచే సమస్తకర్మలు రహితమగును. కావున

స్వర్గలోకమునండి జీవులు అనుశయసహితముగా భూపతనమగుదురనుట నిశ్చయము.

ఏ మార్గముగుండా జీవి భూపతనమగును? జీవులే మార్గముగుండా వెళ్ళిరో అదే మార్గము గుండా వారు తిరిగి వత్తురు. కాని కొంచము భేదము మాత్రముండును. "అధ్వాన్నం పునర్నివర్తంతే" మఱియు "ఆకాశాద్వాయుం వాయుర్భూత్వాధూమో భవతి" యను వాక్యాంశము (ఛాం. ఉ. 5-10-5) లచే వారు స్వర్గలోకమునకే మార్గము గుండా వెళ్ళిరో, అదే మార్గముగుండా తిరిగివత్తురని నిశ్చయమైనది. మేఘాదులు చేర్చఁబడుటచేతను మఱియు రాత్రి ఇత్యాదులు సూచింపఁబడకుండుట చేతను (ఛా. ఉ. 5-10-6) ఈ మార్గమునందు కొంచము వ్యత్యాసమున్నదని కూడా తెలియుచున్నది. ఒక ప్రత్యేక భూమిక వరకు అతడదే మార్గము గుండా దిగి, తర్వాత భిన్నమైన మార్గముననుసరించును. "రమణీయ చరణాః" అనగా సత్కర్మలని భావము. "కపూయ చరణాః" అనగా దుష్కర్మలని అర్థము. యావత్సంపుటమ్ అను శబ్దము సమస్త కర్మక్షయమును సూచింపదు. కాని స్వర్గలోక సౌఖ్యమననుభవించుట ద్వారా స్వర్గలోకమునకుఁ గొంపోవుటకు కారణమైన కర్మలు క్షీణించుటను సూచించును.

## 3-1-9 చరణాదితి చేన్నో పలక్షణార్థేతి కార్ష్ణాజినిః

ప్రవర్తనయే కారణమగుటచే పునర్జన్మకు అనుశయము ఆవశ్యకము కాదని పలికినచో, అట్లు కాదని మేము చెప్పుదుము; ఏలననగా "చరణమ"ను పదము పరోక్షముగా అనుశయమును సూచించుటకై ప్రయోగింపఁబడినదని కార్ష్ణాజినుని అభిమతమై యున్నది.

చరణాత్ = ప్రవర్తనయే కారణమగుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = అట్లు కాదు, ఉపలక్షణార్థా = పరోక్షముగా సూచించుటకు, ఇతి = ఈ విధముగా, కార్ష్ణాజినిః = కార్ష్ణాజినుడు తలంచును.

అనుశయకర్మలనుఁగూర్చి ఒక ఆక్షేపణ చెప్పఁబడినది. పూర్వసూత్రమునందు అనుశయము సూచింపఁబడి, ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లనును:- శ్రుతి ఇట్లు నుడివినది. "తద్య ఇహ రమణీయ చరణా అభ్యాశోహయత్తే రమణీయాం యోనిమాపద్యేరన్" (ఛాం. ఉ. 5-10-7).

నూతన జన్మయొక్క లక్షణము "చరణము"పై ఆధారపడియుండునేఁగాని,

అనుశయము నాధారముగాఁ గొనియుండదు. చరణము మఱియు అనుశయము పరస్పరము విభిన్నములైయున్నవి. ఏలననగా చరణమనగా చరిత్ర, ఆచారము, శీలము లేక ప్రవర్తనయని అర్థము. ఇఁక అనుశయమనగా కర్మశేషమని అర్థము.

కర్మ మఱియు ఆచరణ విభిన్నములని శ్రుతి కూడా నుడువుచున్నది. "యత్క్ర తుర్భవతి తత్కర్మ కురుతే యత్కర్మ కురుతే తదభి సంపద్యతే" (బృ. ఉ. 4-4-5).

ఆక్షేపణ బలహీనమైయున్నది. ఈ సూత్రము దీనిని ఖండించి "ప్రవర్తన"యనెడి పదము పరలోకము నందనుభవించిన తర్వాత శేషించిన సత్కర్మలను సూచించునని నుడువును. ప్రవర్తన సదాచార కర్మలను సూచించును. ఇది కార్ష్ణాజిని ముని యొక్క అభిమతమైయున్నది. ఇది శబ్దము యొక్క గౌణార్థము.

## 3-1-10 ఆనర్థక్యమితిచేన్న తదపేక్షత్వాత్

"ప్రవర్తన" యను పదమును సత్ప్రవర్తనయని వ్యాఖ్యానించినచో అది నిష్ప్రయోజనమగునని నుడివినచో, కర్మ సత్ప్రవర్తనపై ఆధారపడియుండుటచే అట్లు కాదని మేము పలుకుదుము.

ఆనర్థక్యం = నిష్ప్రయోజనము, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = అట్లుకాదు, తదపేక్షత్వాత్ = దానిపై ఆధారపడియుండుటచే.

"చరణ"శబ్దమునుఁగూర్చి మరియొక ఆక్షేపణ ఈ సూత్రమునందు రేకెత్తించఁబడి, ఖండింపఁబడినది.

పూర్వపక్షి ఇట్లు పలుకును :- అది యట్లే యగుఁగాక! కాని "చరణమ"ను పదమునకు ప్రత్యక్షార్థమగు ప్రవర్తనను పరిత్యజింపనేల? మఱియు కేవలము నిష్క్రియమైన "అనుశయమ"ను అర్థమును స్వీకరింపనేల? అప్పుడు మానవజీవితమునందు సత్ప్రవర్తన అర్థరహితమగును. ఏలననగా అది స్వయముగా ఫలము నొసంగకుండుటచే, నూతన జన్మల క్షీణమునకు కారణము కాఁజాలదు. ప్రత్యక్షార్థమును సూచించు ప్రవర్తన మంచిదైనను, చెడ్డదైనను, అది సుకృత, దుష్కృత జన్మలనెడి ఫలముల నొసంగును. ఏదోయొక ఫలమును దాని కారోపింప వలసియుండును; లేనిచో అది నిష్ప్రయోజనమగును.

ఈ సూత్రము దీనిని ఖండించును. సత్ప్రవర్తనఁగలవారు మాత్రమే వైదిక యజ్ఞములనొనర్చుట కర్హులగుటచే, ఈ సూత్రమీ దృష్టికోణమును నిషేధించుచున్నది.

దీనిపై ఆధారపడియుండుటచే ఈ యాక్షేపణకు బలము లేకున్నది. ఇది నిలువనేరదు. స్మృతి ఇట్లనును: “ఆచారహీనం న పునంతి వేదాః” సత్ప్రవర్తన లేనివాడు కేవలము యజ్ఞయాగాదుల నొనర్చుటచే ఆధ్యాత్మిక జ్ఞానమునుఁ బడయఁజాలడు. ప్రవర్తన కర్మ ఫలమును అతిశయింపఁజేయును. సత్ప్రవర్తన కర్మకు ఒక సహాయకము వంటిది. కావున దానికొక ప్రయోజనమున్నది. యజ్ఞము తన ఫలము నొసంగుట కారంభించినప్పుడు, యజ్ఞసంబంధమగు ప్రవర్తన తత్ఫలితమునందు అతిశయముగా ప్రతిఫలించును. కావున కార్ష్ణాజిని యొక్క దృష్టికోణము ననుసరించి “చరణమ”ను పదమునకు పరోక్షమగు అర్థము అనుశయమగునే కాని, నూతన జన్మకు ప్రవర్తన కారణము కాఁజాలదు. మానవుడు తన కాళ్ళతో తాను పరుగెత్తఁగలిగినప్పుడు అతడు నిశ్చయముగా తన మోకాళ్ళతో ప్రాకిపోడు. మానవుడొకవేళ తన కాళ్ళతో పరుగెత్తఁజాలనిచో, అతడు తన మోకాళ్ళపై పరుగెత్తఁగలుగునా?

## 3-1-11 సుకృత దుష్కృతే ఏవేతితు బాదరిః

కాని సుకృత దుష్కృతకర్మలే చరణమని బాదరిమునియొక్క మతమై యున్నది.

సుకృత = సత్కర్మలు, దుష్కృతే = దుష్కర్మలు, ఏవ = మాత్రమే, ఇతి = ఈ విధముగా, తు = కాని, బాదరిః = బాదరిముని.

“చరణమ”ను పదమునుఁగూర్చి ఇచ్చట మరికొంత చర్చింపబడుచున్నది. చరణము మఱియు కర్మయందు భేదమేమియులేదని ఈ సూత్రము నుడువుచున్నది. బాదరిమునియొక్క మతము ననుసరించి “రమణీయచరణ, కపూయచరణములు” సుకృత, దుష్కృతకర్మలను సూచించును.

చరణమనగా అనుష్ఠానము, లేక కర్మయగును. “చర”యనెడి ధాతువు నడచుట, లేక ప్రవర్తించుటయనెడి సామాన్యార్థమునందు ప్రయోగింపఁబడినది. సామాన్యముగా “ధర్మమార్గమునందు ప్రవర్తించుచున్నాడని” పలుకుదురు. ఆచారమను పదముకూడ కేవలము ఒక విధమగు ధార్మిక కర్తవ్యమును సూచించును. యజ్ఞము ఒక ధర్మకార్యము. ఆచారముకూడా ధర్మమే. బ్రాహ్మణులనుఁగూర్చి కర్మపదము మఱియు సన్న్యాసులను గూర్చి చరణపదము ప్రయోగింపఁబడును. చరణము మఱియు కర్మ ఏకమేయైనను, కొన్ని వేళలలో “కురుపాండవోక్తి”వలె అవి భేదమును సూచించును. పాండవులు కూడా

కురువులేయైనను, కురు-పాండవులలోని "కురు" యనెడి శబ్దము నిమ్నస్థాయి యందు ప్రయోగింపఁబడును. ఈ విధముగా ఎవరికర్మలు స్తుతి పాత్రములై యొప్పునో వారు "సదాచారపరుల"ని చెప్పఁబడుదురు. ఇఁక ఎవరి కర్మలు నిందింపఁదగినవో అట్టివారు "దురాచారపరుల"ని చెప్పఁబడుదురు. సామాన్యకర్మాచరణమునకు ప్రవర్తన యనెడి పదము ప్రయోగింపఁబడినది. చరణము కేవలము కర్మయే యగుటచే, స్వర్గలోకమునకు వెళ్ళువారు భూలోకమునందు నూతన జన్మనొందుటకై అనుశయమును కారణముగా కలిగియుందురను విషయము దృఢపడుచున్నది.

ఏవ = కేవలము. ఈ సూత్రములోని ఈ పదము సూత్రకారుని అభిప్రాయ మిదియేయై యున్నదను విషయమును బలపఱచును.

"తు = కాని" యను పదము ప్రత్యేకతను సూచించుటకు మఱియు తన నిశ్చయమును బలపఱచుటకున్నూ ప్రయోగింపఁబడినది.

# 3. అనిష్టాది కార్యధికరణము

## (12-21 సూత్రములు)

### 3-1-12 అనిష్టాది కారిణా మపిచ శ్రుతమ్

యజ్ఞయాగాదులను నెఱవేర్చనివారుకూడా చంద్రలోకమున కేగుదురని శ్రుతినుడువుచున్నది.

అనిష్టాదికారిణామ్ = యజ్ఞయాగాదుల నొనర్చని వారియొక్క, అపి = కూడా, చ = మఱియు, శ్రుతమ్ = శ్రుతిచే చెప్పఁబడినది.

దుష్కార్యముల నొనర్చు వ్యక్తులయొక్క చలనమిప్పుడు వర్ణింపఁబడుచున్నది. ఇది పూర్వపక్షి యొక్క సూత్రము.

యజ్ఞయాగాదుల నొనర్చువారు చంద్రలోకమున కేగుదురని చెప్పఁబడినది. యజ్ఞముల నొనర్చనివారు కూడా చంద్రలోకమున కేగుదురా? లేదా? యను ప్రశ్న ఇప్పుడు వేయఁబడినది.

నూతన జన్మకై పంచమ ఆహుతి ఆవశ్యకమగుటచే, యజ్ఞముల నొనర్చిన

వారివలె భోగభాగ్యముల ననుభవింపకున్నను, యజ్ఞముల నొనర్పనివారుకూడా స్వర్గలోకమునకు వెళ్ళుదురని పూర్వపక్షి పలుకును. ఇంతే కాకుండా శ్రుతి ఇట్లు వచించుచున్నది. "సహోవాచ యేవైకే చాస్మాల్లో కాత్ప్రయంతి చంద్రమసమేవతే సర్వే గచ్ఛంతి" (కౌ. ఉ. 1-2). "సర్వే" యను శబ్దముచే సమస్త జీవులనెడి భావము సూచింపఁబడినది. కావున మరణించువారందఱున్నూ అనగా పాపులు కూడా చంద్రలోకమున కేగుదురని తెలియుచున్నది.

**సిద్ధాంతి:-** పాపులు చంద్రలోకమునకు వెళ్ళరు. వారు యమలోకమునకు, లేక యాతనాలోకమున కేగుదురు. ఈ విషయ మీ క్రింది సూత్రమునందు చెప్పఁబడినది.

## 3-1-13 సంయమనే త్వనుభూయేతరేషా మారోహావ రోహౌ తద్గతి దర్శనాత్

కాని యజ్ఞయాగాదుల నొనర్పని ఇతరులు యమలోకమునకేగి, అచ్చట తమ దుష్కృత కర్మఫలముల ననుభవించి, తిరిగి భూలోకమున కేతెంతురని శ్రుతివారి మార్గమును సూచించినది.

సంయమనే = యమలోకమునందు, తు = కాని, అనుభూయ = అనుభవించి, ఇతరేషాం = యజ్ఞముల నొనర్పనివారికి, అరోహావరోహౌ = పై కేగి క్రిందికి వచ్చుటలు, తత్ = వారియొక్క గతి = గమనము, దర్శనాత్ = శ్రుతిచే తెలియఁబడుటవలన.

దుష్కృతకర్మల నొనర్చినవారి చలనముయొక్క వర్ణన కొనసాగుచున్నది. ఈ సూత్రము పూర్వసూత్రములయొక్క దృష్టికోణమును ఖండించును. ఇది సిద్ధాంత సూత్రము.

పాపులు యమలోకమునందు యాతనల ననుభవించి, మరల ఈ భూలోకమున కేతెంతురు. యముడు నచికేతునితో ఇట్లనెను. "నసాంపరాయః ప్రతిభాతిబాలం ప్రమాద్యంతం విత్తమోహేనమూఢమ్, అయంలోకోనాస్తి పర ఇతిమానీ పునః పునర్వశ మాపద్యతేమే" (కఠ. ఉ. 1-2-6).

తు = కాని, ఇది పూర్వపక్షమును ఖండించును. వ్యక్తులందఱును చంద్ర లోకము వెళ్ళుదురనుట నిజముకాదు. సత్కర్మఫలభోగముల ననుభవించుటకు మాత్రమే చంద్రలోకగమనము చెప్పఁబడినది. అది ఒక ప్రత్యేక కారణములేకుండా జరుగదు. లేక కేవలము భూలోకపతనమునకై జరుగదు. కావున దుష్కర్మల నొనర్చువనారు అచ్చటికి వెళ్ళరు. యజ్ఞముల నొనర్చినవారు మాత్రమే చంద్ర లోకమున కేగుదురు. కాని ఇతరులుకాదు.

అరోహావరోహౌ = ఎక్కుట-దిగుట అనగా ఊర్ధ్వలోకగమనము ఎక్కుట మఱియు అధోలోకగమనము దిగుట యని చెప్పఁబడెను. ఇది మధ్వాచార్యులవారి వ్యాఖ్యానము.

## 3-1-14 స్మరంతిచ

ఇట్లు స్మృతులు కూడా నుడువుచున్నవి.

స్మరంతి = స్మృతులు చెప్పుచున్నవి, చ = కూడా, దుష్కార్యములనొనర్చు వ్యక్తుల యొక్క ప్రయాణమును గూర్చి ఈ సూత్రము వర్ణించుచున్నది. పాపుల యొక్క అధోగతినిగూర్చి కూడా స్మ ృతులు చెప్పుచున్నవి. దుష్టకార్యముల నొనర్చువారు యమపాశమునకు గుఱియగుదురని స్మృతులు కూడా పలుకుచున్నవి. దుష్కార్యముల నొనర్చువారు నరకలోకమునకేగి, అచ్చట యాతనల ననుభవింతురని మనువు, వ్యాసుడు ఇత్యాది మునులున్నూ, పలికిరి. భగవద్గీతయందిట్లు చెప్పఁబడినది. "దక్షిణాయనముగుండా పాపులు వెంటనే యమలోకమునకు తీసుకొనిపోఁబడుదురు. ఆ మార్గమునందు వారు మిక్కిలి కష్టముతో నిరంతరము పడుచు, లేచుచు, అలసిపోయి, పయనించుచుందురు." "యముని నియమాను సారముగా చితి సమయమునందు దుష్కార్యములకు ప్రతిక్రియ యొనర్పఁబడున"ని మనువు మఱియు వ్యాసునియొక్క అభిమతమై యున్నది.

## 3-1-15 అపి చ సప్త

ఇంతేకాకుండా ఏడురకములగు నరకములున్నవి.

అపిచ = ఇంతేకాకుండా, సప్త = ఏడు నరకములు.

యమాలయముయొక్క వివరము ఒసంగఁబడినది. దుష్కార్యముల నొనర్చు వారికి యాతనాస్థలములై యున్న ఏడు నరకములనుఁగూర్చి స్మృతి పేర్కొనినది. రౌరవ, మహారౌరవ, వహ్ని, వైతరణి మఱియు కుంభీపాక నరకములు

తాత్కాలికములు. ఇఁక తామిస్ర, అంధతామిస్ర యను రెండు నరకములు శాశ్వతములై యున్నవి.

## 3-1-16 తత్రాపి చ తద్వ్యాపారాదవిరోధః

మఱియు యముడు నియామకుడై యుండుటచే, ఆ నరకములో కూడా వైరుధ్యముండదు.

తత్ర = ఆ నరకములో, అపి = కూడా, చ = మఱియు, తద్వ్యాపారాత్ = యముడు నియామకుడగుటచే, అవిరోధః = వైరుధ్యములేదు.

ఈ సూత్రమునందున్నూ అదే విషయము చర్చింపఁబడుచున్నది. పూర్వపక్షి ఇట్లనును:- దుష్కార్యముల నొనర్చువారు యముని హస్తములచే శిక్షింపఁబడుదురని శ్రుతి నుడువుచున్నది. చిత్రగుప్తాదులచే నడుపఁబడుచున్న రౌరవాది సప్తనరకములలో ఇది ఎట్లు సాధ్యమగును? ఈ సూత్ర మీ ఆక్షేపణను ఖండించును.

సప్త నరకములయందున్నూ ఒకే యముడు ముఖ్యమైన నియమాకుడగుటచే దీనియందు వైరుధ్యములేదు. చిత్రగుప్తాదులు కేవలము యముని క్రింది అధికారులు మఱియు ఉద్యోగస్థులైయున్నారు. వారందఱున్నూ యమునియొక్క అధిపత్యమునందున్నారు. చిత్రగుప్తాదులు యముని ఆజ్ఞలకు బద్ధులైయున్నారు.

## 3-1-17 విద్యాకర్మణో రితితు ప్రకృతత్వాత్

కాని జ్ఞానమార్గము మఱియు కర్మమార్గములనెడి రెండు విషయములిప్పుడు చర్చింపఁబడుచున్నవి.

విద్యాకర్మణోః = విద్యాకర్మలయొక్క, ఇతి = ఇట్లు, తు = కాని, ప్రకృతత్వాత్ = ఇవి ఇప్పుడు చర్చింపఁబడుచుండుటచే.

కాని పాపులు స్వర్గలోకమునకు వెళ్ళరు. ఏలననగా ఛాందోగ్యోపనిషత్తులోని రెండు మార్గములకు సంబంధించిన విషయము జ్ఞానులకు మఱియు కర్మరులకు చెందియున్నది. అది దుష్కార్యముల నొనర్చువారికి సంబంధించినది కాదు. ఛాందోగ్యములోని పంచాగ్ని విద్యలో వర్ణింపఁబడినట్టి విగతజీవులు పరలోక గమనమొనర్చు రెండు విభిన్నమైన మార్గములు జీవితమునందభ్యసింపఁ బడినట్టి జ్ఞానకర్మలయొక్క ఫలితములై యున్నవి. ఏలననగా ఈ రెండున్నూ చర్చనీయాంశములైయున్నవి.

ఎవరైతే జ్ఞానము నాలంబనముగాఁగొని దేవయానము ద్వారా బ్రహ్మ లోకమున కేగరో, లేక కర్మలనాలంబనముగాఁగొని పితృయానము ద్వారా చంద్రలోకమునకేగరో అట్టివారు క్షుద్రయోనులలో జన్మించి, తఱచుగా మరణించుచుందురని శ్రుతి వచించుచున్నది. ఒక వేళ పాపులు కూడా చంద్రలోకమునకు వెళ్ళుదురని పలికినచో, ఆ లోకమునందు స్థలము చాలకుందును. కాని అచ్చటి నుండి భూలోకమునకేగు జీవులు కూడా కలరని నీవు బదులు పలుకవచ్చును. కాని పాపులు అచ్చటికి వెళ్ళరని శ్రుతి స్పష్టముగా నుడువుచున్నది.

పాపులు తృతీయస్థానమున కేగుదురు. కాని స్వర్గమునకు వెళ్ళరు. శ్రుతివాక్యమిట్లు నుడువుచున్నది. "అథైతయోః పథోర్నకతరేణ చ నతానీమాని క్షుద్రాణ్యసకృదావర్తీని భూతాని భవంతి జాయస్వమ్రియ స్వేత్యేతత్తృతీయం స్థానం తేనాసౌలోకోన సంపూర్యతే" (ఛాం. ఉ. 5-10-8)

ఈ సూత్రములోని "తు" యనెడి శబ్దము కౌషీతుక్యుపనిషత్తులోని "విగతజీవులందఱును చంద్రలోకమునకు వెళ్ళుదురు"నెడి సంశయమును నివారించును., "అందఱు" అను శబ్దము సత్కర్మలనొనర్చినట్టి అర్హతఁగల జీవులను మాత్రము సూచించును, సమస్తార్హతలుఁగల జీవులు మాత్రమే చంద్రలోకమునకు వెళ్ళుదురు. ఆ లోకమునందు దుష్కర్మలనొనర్చు పాపులుండరు.

"తు" అను శబ్దము ఆక్షేపకుని దృష్టికోణమును అణచివేయును. ఒకవేళ పాపులు చంద్రలోకమునకు వెళ్ళకున్నచో, వారికి నూతన శరీరము సృష్టింపఁబడదు. ఏలననగా వారి విషయమునందు ఐదవ ఆహుతికి అవకాశము లేదు. ఇఁక పంచమాహుతి జీవుడు చంద్రలోకమునకు వెళ్ళుటపై ఆధారపడియుండును.

కావున నూతన శరీరమును పొందుటకై అందఱున్నూ చంద్రలోకమున కేగవలసియుండును. ఈ యాక్షేపణకు తదనంతర సూత్రము సరియైన సమాధానము నొసంగును.

## 3-1-18 న తృతీయే తథోపలబ్ధేః

శ్రుతివచనానుసారముగా తృతీయస్థానమునందది సంభవింపదు.

న = కాదు, తృతీయే = మూడవ దానియందు, తథా = ఈ విధముగా, ఉపలబ్ధేః = చూడఁబడుటవలన.

తృతీయ స్థానమున కేగువారికి పంచమాహుతితో ఆవశ్యకతలేదు. ఏలననగా శ్రుతి ఇట్లు వచించుచున్నది.

దుష్కార్యములనొనర్చు పాపులు ఆహుతులు లేకుండా జన్మించుటచే, వారి విషయమునందు పంచవిధములగు ఆహుతులుండ వలయునను నియమములేదు. "జాయస్వమ్రియస్వేత్యే తత్తృతీయం స్థానమ్" అని శ్రుతి పలుకును., అనగా ఈగలు, పురుగులు మున్నగు క్షుద్రజీవులు నిరంతరము పుట్టుచు, చచ్చుచుండును. పాపులు కీటకములు, మశకములు ఇత్యాది శరీరములను ధరించుటచే వారు క్షుద్రజీవులని పేర్కొనఁబడుదురు. వారి స్థలము ఇటు బ్రహ్మలోకముఁగాని, అటు చంద్రలోకముఁగాని కాకుండుటచే అది తృతీయ స్థానమని చెప్పఁబడును. కావున ఈ పాపులు స్వర్గలోకమునకు వెళ్ళకుండుటచే, అది పూరింపఁబడఁజాలదు. ఇంతే కాకుండా "పంచమాహుతియందు జలమే పురుషుడని చెప్పఁబడును.'' అనెడు వాక్యము నందు జలము కేవలము మానవుని శరీరముగా రూపొందును. కాని ఒక కీటకము, లేక పురుగు ఇత్యాది శరీరములుగా రూపొందదు. "పురుషుడ"నెడి శబ్దము కేవలము మానవయోనికి మాత్రమే వర్తించును.

## 3-1-19 స్మర్యతేఽపిచలోకే

ఇంతేకాకుండా ఈ ప్రపంచమునందు పంచవిధాహుతులు లేని పుట్టుకనుఁగూర్చి స్మృతులుకూడా వాకొనియున్నవి.

స్మర్యతే = స్మృతులలో పేర్కొనఁబడినది. అపి=కూడా, చ = మఱియు, లోకే = ప్రపంచమునందు.

12వ సూత్రమునందు రేకెత్తించఁబడిన ఆక్షేపణలను ఖండించుటకై 17వ సూత్రమునుండి ఆరంభింపఁబడిన చర్చ ఇంకను కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా వైదికేతరములగు ఐతిహ్యములు ద్రోణుడు, దృష్టద్యుమ్నుడు, సీత, ద్రౌపది ఇత్యాది ప్రత్యేక వ్యక్తులు సామాన్యులవలె మాతృగర్భమునుండి జన్మింపలేదని పలుకుచున్నవి. వారి విషయములలో స్త్రీయందు వ్రేల్చఁదగిన పంచమాహుతి లేకుండెను. దృష్టద్యుమ్నాదులలో స్త్రీయందు వ్రేల్చదగిన ఆహుతి మఱియు పురుషునియందుంచఁదగిన ఆహుతి ఈ రెండున్నూ మృగ్యమై యుండెను.

కావున అనేకుల విషయమునందు ఆహుతులు లేకున్నను శరీరధారణ సంభవించినది. ఆడ కొంగ మొగ కొంగ లేకుండానే గర్భమును ధరించును.

భవిష్యజ్జన్మకు పంచవిధాహుతులు అత్యంతావశ్యకములుకావు. పంచవిధాహుతుల నియమము సర్వత్ర వర్తించదు. అది కేవలము యజ్ఞముల నొనర్చు వారికి మాత్రము వర్తించును. కావున పాపులు స్వర్గలోకమునకు వెళ్ళనవసరము లేదు.

క్షుద్రయోనులలో జనన మరణములనొందు తృతీయమార్గమునకు పంచ విధాహుతులతో సంబంధములేదు. అవి కేవలము ఊర్ధ్వాధోలోక గమనముల నొనర్చు మానవ జన్మలను మాత్రము సూచించును. ఇతరుల విషయములో శరీరధారణము గర్భమునుండి కాక, మరియొక విధముగా సంభవించును.

"చ" యనెడి అవ్యయము ద్వారా సూత్రకారుడు ప్రాపంచిక దృశ్యము స్మృతి చేతకూడాఁ బలపఱచఁబడుటను సూచించెను.

## 3-1-20 దర్శనాచ్చ

దర్శనము వలన కూడా.

దర్శనాత్ = చూచుట వలన, చ = కూడా.

17వ సూత్రమునందారంభింపఁబడిన చర్చ కొనసాగుచున్నది.

అండజ, జరాయుజ, స్వేదజ, ఉద్భిజ్జములనెడి చతుర్విధయోనులలో చివరి రెండు తరగతులు లైంగిక సంయోగము లేకయే జన్మించుచుండుటచే, వాటి విషయము నందాహుతుల సంఖ్య ముఖ్యముకాదని కూడా తెలియుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును :- శ్రుతివాక్యము కేవలము మూడు తరగతుల జీవులనుఁ గూర్చి మాత్రము నుడువుచున్నది. "తేషాం ఖల్వేషాం భూతానాం త్రీణ్యేవబీజాని భవంత్యాండజం జీవజముద్భిజ్జమితి" (ఛాం.ఉ. 6-3-1). అట్టిఎడల నాలుగు తరగతులున్నవని ఎట్లు చెప్పనగును? ఈ యాక్షేపణకు ఈ క్రింది సూత్రము సమాధానము నొసంగును.

## 3-1-21 తృతీయ శబ్దావరోధః సంశోకజస్య

మూడవ రకమగు ఉద్భిజ్జములలో వేడి మఱియు తడిచే ఉత్పన్నమగు జీవులు ఇమిడియున్నవి.

తృతీయశబ్ద = మూడవ శబ్దము, అవరోధః = ఇమిడియుండుట, సంశోకజస్య = వేడి మఱియు తడిచే ఉత్పన్నమగునట్టి జీవియొక్క

రెండు తరగతులు స్థిరత్వమును కలిగియున్నట్టి పృథ్వి, లేక జలముచే ఉత్పన్నమగును. ఈ రెండింటియందొకటి పృథ్వినుండియు, మరియొకటి జలమునుండియు జన్మించును. తడిచే ఉత్పన్నమగు జీవులు ఉద్భిజ్జములయం దిమిడియుండుటచే దీని యందంతర మేమియును లేదు. స్వేదజోద్భిజ్జముల యందు ఏకరూపత కలదు. కావున దీనియందు వ్యతిరేకతలేదు. చెమటనుండి ఉత్పన్నమైనవి స్వేదజములనఁబడును. స్వేదజములు మఱియు ఉద్భిజ్జములు గర్భములనుండి జన్మింపవు. ఉద్భిజ్జములనెడి పదమునకు అక్షరశః చిట్లిపోయి జన్మించినవని అర్ధము. మొక్కలు భూమినుండి చిట్లి పైకివచ్చును. స్వేదజములు చెమటనుండి చిట్లి పైకివచ్చును. ఈ రెండున్నూ చిట్లి పైకి వచ్చుటచే, ఈ రెండింటి యొక్క మూలమునందు ఏకరూపత కలదు.

ఈ విధముగా దుష్కార్యముల నొనర్చువారు స్వర్గలోకమునకు వెళ్ళరు., కేవలము యజ్ఞముల నొనర్చువారు మాత్రము స్వర్గమున కేగుదురు. ఇదియే తుది నిర్ణయమైయున్నది.

# 4. సాభావ్యాపత్త్యధికరణము

## 3-1-22 తత్సాభావ్యాపత్తి రుపపత్తేః

జీవుడు చంద్రలోకమునుండి తిరిగి వచ్చునప్పుడు ఆకాశ, వాయ్వాదులతో ఏకరూపత నొందును, ఏలననగా కేవలమిదియే సాధ్యమగును.

తత్సాభావ్యాపత్తిః = వాటితో ఏకరూపత నొందుట, ఉపపత్తేః = ఉచిత మగుటచే.

చంద్రలోకమునుండి జీవుడు దిగివచ్చు మార్గమిప్పుడు చర్చింపఁబడు చున్నది. శ్రుతి ఇట్లు నుడువును. "అథైతమేవాధ్వానం పునర్నివర్తంతే యథేతమాకాశ మాకాశాద్వాయుం వాయుర్భూత్వా ధూమోభవతి ధూమోభూత్వాభ్రం భవతి, అభ్రం భూత్వామేఘోభవతి మేఘోభూత్వా ప్రవర్షతి" (ఛాం. ఉ. 5-10-5,6)

ఇప్పుడు జీవుడు నిజముగా ఆకాశాదులతో తాదాత్మ్యమునొందునా? లేక కేవలము వాటితో సాదృశ్యతను కలిగియుండునా? యను ప్రశ్న ఉదయించును.

అసాధ్యమైన విషయమగుటచే జీవులు వాటితో తాదాత్మ్యము నొందవని ఈ సూత్రము నుడువుచున్నది. శబ్దార్థము ననుసరించి ఒక పదార్థము మరియొక పదార్థముగా మారుట అసాధ్యము. ఒక వస్తువు మరియొక వస్తువుగా మారుటకు వీలులేదు. ఒకవేళ జీవులు ఆకాశముతో తాదాత్మ్యమునొందినచో, వారు వాయువు ద్వారా క్రిందికి దిగజాలకుందురు. జీవులు కేవలము ఆకాశ, వాయ్వాదులను పోలియుందురు. వారు ఆకాశమువంటి సూక్ష్మరూపమును ధరించి, వాయుబలముచే ధూమాదులతో మేళవింపఁబడుదురు. ధూమాదిదశ నొందుట యనగా అవి చలించినప్పుడు వాటితో పాటు చలించుట, అవి ఆగినప్పుడు ఆగిపోవుట మఱియు వాటియందు ప్రవేశించి, వాటివలె తేలికయగుట అని అర్థము. కావున ఈ వాక్యమున కర్థము జీవులు ఆకాశ, వాయ్వాది పదార్థములను పోలియుండుటయే యగును. కాని తత్పదార్థములతో తాదాత్మ్యము నొందుటకాదు.

# 5. నాతిచిరాధికరణము

## 3-1-23 నాతిచిరేణ విశేషాత్

ప్రత్యేకముగా ప్రతిపాదింపఁబడిన కారణముచే జీవి అచిరకాలమునందే అవరోహించును.

న = కాదు, అతిచిరేణ = చాలాకాలము, విశేషాత్ = శ్రుతి ప్రత్యేకముగా ప్రతిపాదించుటచే.

జీవుడు అవరోహించు మార్గము చర్చింపఁబడుచున్నది. జీవుడు ఆకాశము నుండి వరుణుని వరకు అవరోహించునప్పుడు అతడు ఒక్కొక్క భూమిక యందు చాలాకాలము వరకుండునా? లేక శీఘ్రముగా దాటిపోవునా? యనెడి మరియొక ప్రశ్న వేయఁబడినది. పూర్వపక్షి ఇట్లనును. "అతడు ఉండు సమయము నిశ్చయించి చెప్పఁబడకుండుటచే అతడు ప్రతి భూమికయందు చాలాకాలముండును." ఈ దృష్టికోణము ఏతత్సూత్రముచే ఖండింపఁబడినది. జీవుడు వాటిని శీఘ్రముగా దాటిపోవునని ఈ సూత్రము పలుకును. శ్రుతి ప్రత్యేకముగా ప్రతిపాదించిన సందర్భమునుఁబట్టి ఈ విషయమును మనమూహించుకొనవచ్చును.

శ్రుతి ఇట్లనును, "అభ్రంభూత్వా మేఘోభవతి, మేఘోభూత్వా ప్రవర్షతి త ఇహ వ్రీహియవా ఓషధి వనస్పతయస్తిల మాషాఇతి జాయంతేఽ తో వైఖలు దుర్నిప్రప్రతరం యోయోహ్యన్నమత్తియో రేతస్సించతి తద్భూయ ఏవభవతి" (ఛాం.ఉ . 5-10-5).

ఆకాశము, వాయువు, ధూమము, అభ్రము, మేఘము మఱియు వర్షములలో జీవుడు పయనించు సమయము అతడు ధాన్యము, శుక్లము, గర్భములలో పయనించు సమయముకంటె మిక్కిలి తక్కువగా నుండును. జీవుడు ధాన్యమునందు ప్రవేశించిన అనంతరము దానినుండి తప్పించుకొనుట కష్టమై, మిక్కిలి దుఃఖము ననుభవించునని శ్రుతి ప్రత్యేకముగా ప్రతిపాదించుచున్నది.

శ్రుతి "జీవులు ధాన్యమునందు ప్రవేశింతురని" పలుకుటతోపాటు అచ్చటి నుండి తప్పించుకొనుట మిక్కిలి కష్టతరము మఱియు దుఃఖదాయకమని నుడువును.

దీనిచే పూర్వభూమికలను దాటివచ్చుట సులభమనియు, సంతోషదాయకమనియు మఱియు శీఘ్రముగా పొందఁబడునవనియును సూచింపబడుచున్నది.

"అవరోహించుట కారంభించినవాడు అనేక స్థలములలో సంచరించినను, ఆరంభించిన ఒక సంవత్సరములోపుననే మాతృగర్భమునందు ప్రవేశించును." (నారదీయ పురాణము)

# 6. అన్యాధిష్ఠితాధికరణము

## (24-27 సూత్రములు)

### 3-1-24 అన్యాధిష్ఠితేషు పూర్వవ దభిలాపాత్

పూర్వమువలెనే శాస్త్రవచనానుసారముగా జీవుడు అవరోహించునప్పుడు ఓషధులలో ప్రవేశించి, ఇతర జీవులకు చలనమును కలిగించును.

అన్యాధిష్ఠితేషు = ఇతరులచే ఆక్రమింపఁబడిన వానియందు, పూర్వవత్ = మునుపటివలె, అభిలాపాత్ = శాస్త్రవచనానుసారముగా.

జీవుడు అవరోహించు మార్గక్రమము చర్చింపఁబడుచున్నది.

జీవుడు అవరోహించు వర్ణనయందు అతడు వ్రీహియవౌషధి వనస్పతులలో జన్మించునని చెప్పఁబడినది. ఈ జీవులు దిగునప్పుడు తమ కర్మశేషముతో స్వయముగా వ్రీహి, యవాదులలో జన్మింతురా? లేక కేవలమా ఓషధుల కంటుకొని యుందురా, యనెడి సంశయమిచ్చట కలుగును.

వారు వ్రీహియవాదులుగా జన్మించి, వారి ననుసరించియున్న కర్మశేషమును సుఖదుఃఖరూపమునం దనుభవింతురేగాని, కేవలము వాటి నంటుకొని యుండరని పూర్వపక్షి పలుకును. ఓషధులు కర్మఫలముల నుపభోగించుటకు అనుకూలమైన స్థలమై యుండవచ్చును. జీవహింసతో కూడిన యజ్ఞ నిర్వహణముచే సుఖదుఃఖానుభవము కలుగవచ్చును. కావున "జననమ"ను శబ్దమునకు వాచ్యార్థమును గైకొనవలయును.

ఈ సూత్రము ఏతద్దృష్టి కోణమును ఖండించును. జీవులు కేవలము ఇతర

జీవులచే చలింపఁజేయు వ్రీహి, యవాదుల నంటుకొనియుండును. కాని పూర్వమువలె సుఖదుఃఖాదుల ననుభవింపవు. జీవులు వాయువు, ధూమముగా మారుట కేవలము వాటితో సంబంధించియుండుట నెట్లు సూచించునో అట్లే వ్రీహ్యాదులుగా మారుట కేవలము వనస్పత్యాదుల నంటుకొనియుండుటను సూచించును. ఏలననగా ఆకాశాది పూర్వభూమికలకువలెనే ఈ భూమికల యుందున్నూ వాటికి సంబంధించిన కర్మ సూచింపఁబడలేదు. వారు ఈ యోషధులలో కర్మరహితముగా ప్రవేశింతురు., అచ్చట యున్నప్పుడు వారు సుఖదుఃఖముల ననుభవింపరు, జీవులు వ్రీహి, యవాదులతో తాదాత్మ్యము నొందకుండా వాటిని తమ విడిది స్థలముగా ఉపయోగించుకొనును. ఏలననగా ఆకాశ, వాయ్వాది భూమికలవలె ఇదియున్నూ ఒక చలించు భూమికయని శ్రుతి నొక్కి చెప్పుచున్నది. వారు తమ ప్రత్యేకతను కోల్పోరు. జీవులు ప్రతిఫలము ననుభవించుటకు అచ్చట జన్మింపరు. నిజముగా జన్మించినప్పుడు, వారి వారి కర్మఫలములగు సుఖదుఃఖానుభవము కలుగును. కర్మానుభవ మెట్లేర్పడునో, దానినిఁగూర్చి శ్రుతి ఇట్లు వచించినది. "తద్య ఇహ రమణీయ చరణా అభ్యాశోహయత్తే రమణీయాం యోనిమాపద్యేరన్" (ఛాం.ఉ. 5-10-7).

ఇంతేకాకుండా ఒకవేళ "జన్మ"యను పదమునకు వాచ్యార్థమును స్వీకరింతుమేని, జీవులు వ్రీహ్యాదులలో ప్రవేశించినప్పుడు వాటిని కదలించునట్టి జీవులు ధాన్యాదులను కొడవలితో కోయునప్పుడు, దంచునప్పుడు, వండునప్పుడు మఱియు భుజించునప్పుడు వాటిని వదలిపెట్టవలసియుండును. శరీరము నశించినప్పుడు దానికి చైతన్యము నొసంగు జీవి దానిని త్యజించివేయును.

కావున అవరోహణము నొనర్చు జీవులు ఇతర జీవులచే చలింపఁజేయఁబడు ఓషధ్యాదులతో కేవలము భౌతికముగా సంబంధమును కలిగియుండును. వారు నూతన జన్మ కవకాశమేర్పడునంతవరకు అచ్చటనే నివసింతురు.

## 3-1-25 అశుద్ధ మితిచేన్న శబ్దాత్

ఒకవేళ యజ్ఞాచరణము అపవిత్రమని పలికినచో, శాస్త్ర ప్రామాణ్యమునుఁబట్టి అట్లు కాదని మేము పలుకుదుము.

అశుద్ధమ్ = అపవిత్రము, ఇతి = అని, చేత్ = ఒకవేళ, న = అట్లుకాదు, శబ్దాత్ = శాస్త్ర ప్రామాణ్యమునుఁబట్టి.

24వ సూత్రమునకొక ఆక్షేపణ చెప్పఁబడి, ఖండింపఁబడినది.

జంతుబలితో కూడిన జ్యోతిష్టోమాది యజ్ఞములు అపవిత్రములనెడి ఆక్షేపణ చెప్పఁబడినది. కావున యజ్ఞకర్తయొక్క ఇట్టి క్రూరమైన కర్మకు ఫలితముగా అతడు నిజముగా ధాన్యము, ఓషది ఇత్యాది రూపములుగా జన్మింపవచ్చునను ఇట్టి ఆక్షేపణ నిరాధారమైయున్నది. ఏలననగా శాస్త్రసమ్మతమగుటటే యజ్ఞములలో జంతుబలి పాపహేతువు కాఁజాలదు.

శాస్త్రములు పుణ్యహేతువులని పలుకుటచే యజ్ఞములు అపవిత్రములు లేక పాపభూయిష్ఠములు కాఁజాలవు. కేవలము శాస్త్రములు మాత్రమే మనకు ధర్మాధర్మములనుఁగూర్చి మఱియు పవిత్రతా పవిత్రతలనుఁగూర్చి తెలుపఁ గలుగును. కర్తవ్యా కర్తవ్యములనుఁగూర్చిన మన జ్ఞానము పూర్తిగా శాస్త్రములపై ఆధారపడి యుండును. ఏలననగా ఇవి అతీంద్రియములు మఱియు గుణదోషములు కేవలము దేశకాల పరిస్థితులపై ఆధారపడియుండును. ఒక ప్రత్యేక దేశకాల పరిస్థితియందొనర్పఁబడిన కార్యము ధర్మమగునేని, మరియొక దేశకాల పరిస్థితియందది అధర్మమగును. కావున శాస్త్రము వినా ధర్మాధర్మములను గుర్తింపఁజాలము. "మాహింస్యాత్సర్వా భూతాని" యని శాస్త్రమాదేశించినదనుట నిస్సందేహము. అది సామాన్య ధర్మమని చెప్పఁబడును. "పవిత్రమైన జంతువును అతడగ్నిష్టోమమున కాహుతి యొనర్చునుఁగాక!" అనునది అపవాదమైయున్నది.

సామాన్యధర్మము మఱియు అపవాదము భిన్నమైన ప్రవృత్తులను కలిగి యుండును. అవి భిన్నమైన ఆశయములను కలిగియుండుటచే, వాటి యందు వైరుధ్యములేదు.

కావున చంద్రలోకమునుండి దిగిన జీవులు ఓషధులగునని శాస్త్రము నుడివినప్పుడు, జీవులు వనస్పతులతో కలిసియుండునని మేము నిర్ణయింతుము. ఈ భూమికలయందు వారు పూర్తిగా చైతన్యరహితులై యుందురు.

## 3-1-26 రేతస్సి గ్యోగో౾ ధ

అప్పుడాజీవుడు ఉత్పన్నక్రియ నొనర్చువానితో సంబంధమును కలిగి యుండును.

రేతస్సిగ్ = రేతస్సును బహిష్కరించువాడు, యోగః = సంబంధము ను కలిగియుండుట, అథ = తర్వాత.

జీవుడు అవరోహించు మార్గముఁగూర్చి చర్చింపఁబడుచున్నది. ఓషధులతో సంబంధమును కలిగియున్న జీవునికి ఇప్పుడేమి సంభవించునో సూచింపఁ బడుచున్నది.

ఛాందోగ్యము (5-10-6) నందీ క్రింది వాక్యముకలదు. "యోయోహ్యన్న మత్తియోరేతస్సించతి తద్భూయ ఏవ భవతి". ఇచ్చటకూడా "యోరేతస్సించతి తద్భూయఏవభవతి" అను దానికి వాచ్యార్థమును స్వీకరింపరాదు. ఏలననగా యౌవన దశయందున్న మానవుడే సృష్టించుటకు శక్తిఁగలవాడగును. కావున రేతస్సించనము చేయువానితోనే జీవుడు సంబంధమును కలిగియుండునని తెలియవలయును. దీనిని బట్టి కూడా జీవుడు ఓషధిగా మారుట కేవలము ఓషధినంటుకొని యుండుటయే యగును. కాని నిజముగా జన్మించుటకాదని ఊహించుకొనవచ్చును.

జీవుడు ధాన్యము లేక ఓషధియందు ప్రవేశించిన అనంతరమాతడు ధాన్యము లేక ఫలమును భుజించిన వారితో సంబంధమును కలిగియుండి సంభోగక్రియ నొనర్చును. తన మార్గములోని ప్రతి భూమిక యందును అతడు సంబంధమును కలిగియున్న శరీరములకు భిన్నమైన తన ప్రత్యేకత నాతడు మిగుల్చుకొనును.

మానవుడు ఆహారమును భుజించినప్పుడు, మఱియు రతిక్రియ నొనర్చి నప్పుడు, అవరోహించు జీవుడు తిరిగి ఆయాహారము మఱియు రేతస్సుగా మారును. సంభోగమునందు రేతస్సేచనము ద్వారా మాతృగర్భమునందు ప్రవేశింపనంతవరకే జీవుడాతనియందు రేతో రూపమునందును, ధాన్యాదులను భుజించుటచే ఏర్పడినట్టి రేతః స్పర్శను కలిగియుండి, తుట్టతుదకాతడు గర్భమునందు శరీరమును ధరించును.

నిజమునకు జీవుడు శరీరమును ధరింపడు మఱియు తనను సృష్టించినవానితో తాదాత్మ్యము నొందడు. ఏలననగా ఒక పదార్థము మరియొక పదార్థ రూపమును ధరింపదు. ఒక వేళ యథార్థముగా జీవుడు తనను సృష్టించిన వానితో తాదాత్మ్యము నొందునేని, అతడు మరియొక శరీరమును ధరించుట సాధ్యము కాకుండెడిది.

## 3-1-27 యోనే శ్శరీరమ్

యోని నుండి నూతన శరీరము ఉత్పన్నమగును.

యోనేః = గర్భాశయమునుండి, శరీరమ్ = శరీరము.

జీవుడవరోహించు విధానమునుఁగూర్చిన చర్చ ఇంతటితో ముగిసినది.

నానా విధములగు పూర్వ భూమికలను దాటిన అనంతరము జీవుడు చివరికి మాతృగర్భమునందు ప్రవేశించును. మాతృగర్భమునందాతడు పూర్ణరూపము నొందిన మానవ శరీరమును పొంది శేషించిన కర్మఫలముల నుపభోగించుటకు యోగ్యుడగును. అతడు జన్మింపవలసిన వంశక్రమము తన కర్మశేషమునుఁబట్టి నిర్ణయింపబడునని ఛాందోగ్యము (5-10-7) నందిట్లు తెలుపబడినది. "తద్య ఇహ రమణీయ చరణా అభ్యాశోహయత్తే రమణీయాం యోని మాపద్యేరన్ బ్రాహ్మణయోనిం వా క్షత్రియ యోనిం వా వైశ్య యోనిం వా అథయ ఇహ కపూయ చరణా అభ్యాశోహయత్తే కపూయాం యోని మా పద్యేరన్శ్వయోనిం వా సూకర యోనిం వా చండాల యోనిం వా".

జీవుడు ఆకాశాదులుగా మారిన విధముగనే, అతడు ఓషధ్యాదులుగా మారునని ఇట్లు స్పష్టమొనర్పఁబడినది.

అత్మ, లేక పరమాత్మ మాత్రమే పరమానందమునకు నిలయమై యున్నదను విషయమును బోధించుట మాత్రమే ఈ సమస్త పునర్జన్మ ప్రబోధమునకు లక్ష్యమైయున్నది. ఈ యాత్మ మాత్రమే నీచే అన్వేషింపఁ బడవలసి యున్నది. దుఃఖమును, శోకమును కలిగించు ఈ ప్రపంచమును నీవు ఏవగించుకొని, వివేక వైరాగ్యముల నలవరచుకొని, శాశ్వతమైన పరబ్రహ్మానందము నొందుటకై హృదయపూర్వకముగా ప్రయత్నించుము.

అజ్ఞానివగు ఓ మానవుడా! ఓ దౌర్భాగ్యుడా! ఓ మోహగ్రస్తుడా! దీర్ఘమైన నీ అజ్ఞాన నిద్ర నుండి మేల్కొనుము. నీ నేత్రములను తెఱువుము. చతుర్విధ పురుషార్థముల నలవరచుకొని, ఈ జీవితమునందే జీవితలక్ష్యమైన పరమార్థమును సాధించుము. ఈ యస్థిపరంజరము నుండి బయటికి రమ్ము. అనాది కాలము నుండి నీవీ శరీరమనెడి కారాగారము నందు బంధింపఁబడియున్నావు. నీవు మరల మరల గర్భవాసమును చేయుచుంటివి. అవిద్యా గ్రంథిని తెగఁద్రుంచి, ఉన్నతమైన శాశ్వతానంద భూమికలలో సంచరించుటకై పై కెగురుము.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర తృతీయాధ్యాయ**

**ప్రథమ పాదము.**

**సమాప్తము**

# బ్రహ్మసూత్రములు

## 3వ అధ్యాయము

## 2వ పాదము

## పీఠిక

స్వర్గలోకప్రాప్తికై యజ్ఞములనొనర్చు ప్రజలలో వైరాగ్యమును, లేక ఏవగింపును కలిగించుటకై పూర్వపాదమునందు జీవుడు నానావిధములగు లోకములకేగు మార్గములు మఱియు అతడు తిరిగివచ్చు విధానము వర్ణింపఁబడినది. ఒకవేళ వారు జీవునియొక్క దౌర్భాగ్యస్థితిని స్పష్టముగా అర్థమొనర్చుకొనఁగలిగినచో, వారు సహజమగు వైరాగ్యమును పొంది. మోక్షప్రాప్తికై పూర్ణప్రయత్నము నొనర్తురు.

జీవుని విభిన్నదశలగు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలనుఁగూర్చి వర్ణించుటతో ఈ పాదము ఆరంభింపఁబడును. జీవుని ఈ మూడు దశలయొక్క మిథ్యాత్వము మఱియు జీవబ్రహ్మైక్యము ఇందు నిరూపింపఁబడినది.

వేదాంత జిజ్ఞాసువులకు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలయొక్క జ్ఞానము అత్యంతావశ్యకమైయున్నది. దీనిచే వారికి తురీయావస్థయొక్క స్వరూపము బోధపడును. వేదాంత జిజ్ఞాసువుకు స్వప్నావస్థకువలెనే, జాగ్రదవస్థయు మిథ్యగా తోచును. సుషుప్త్యవస్థచే ఆనందమే పరమాత్మ స్వరూపమనియు, బ్రహ్మము అద్వితీయమనియు మఱియు ప్రపంచము మిథ్యామాత్రమనియును, విదితమగును. వేదాంతులు

చతుర్విధావస్థలను జాగరూకతతో అధ్యయన మొనర్తురు. వైజ్ఞానిక శాస్త్రవేత్తలు కేవలము జాగ్రదవస్థలోని అనుభవములనుఁబట్టియే తమ సిద్ధాంతములను నెలకొల్పినను, వేదాంతులు స్వప్నావస్థ మఱియు సుషుప్త్యవస్థలను అధ్యయనమొనర్చుటను విరమించరు. కావున వైజ్ఞానికుల విజ్ఞానము పరిమితము, పాక్షికము మఱియు అనుచితమై యుండును.

ఈ పాదము చివర జీవుని జాగ్రదవస్థనుఁగూర్చిన పూర్ణమైన వివరము కలదు. ప్రస్తుతము స్వప్నావస్థనుఁగూర్చి చర్చింపఁబడుచున్నది.

ఉపనిషత్తులోని “తత్త్వమసి” మహావాక్యము యొక్క భావార్థమును ముముక్షువులకు బోధించు నిమిత్తమై ఈ పాదమునందు “తత్” మఱియు “త్వమ్” పదములు వివరింపఁబడినవి.

# సార సంగ్రహము

స్వప్నావస్థ, సుషుప్త్యవస్థాదులను వర్ణించుటతో ఈ పాదము ప్రారంభమగును. తర్వాత అది బ్రహ్మము యొక్క సగుణ, నిర్గుణ రూపములనుఁగూర్చి చర్చించును. చిట్టచివరికది బ్రహ్మముతో జీవునికి మఱియు ప్రపంచమునకుఁగల సంబంధమునుఁగూర్చి వివరించును.

**1వ అధికరణము (1–6 సూత్రములు) :–** స్వప్నావస్థయందున్న జీవునిఁగూర్చి చర్చించును. స్వప్నదృశ్యములు ఆశ్చర్యకరములై యుండును. శంకర మతానుసారముగా మొదటి మూడు సూత్రములు కర్తృత్వము జీవునికి ఆరోపింపఁబడవలయునా? లేదా? యను ప్రశ్నకు సంబంధించి యున్నవి. ఏలననగా జాగ్రదవస్థయందు వలెనే, స్వప్నావనస్థయందును జీవుడు పదార్థములను సృష్టింపఁగలుగునని శ్రుతి వచించుచున్నది.

స్వప్నముగాఁగాంచుచున్న జీవుని సృష్టి మిథ్యయనియు, అవి నిజమైన పదార్థముల స్వరూపమును కలిగియుండుననియు మఱియు వాటి యందు జాగ్రదవస్థలోని సత్యత మృగ్యమై యుండుననియును 3వ సూత్రము నుడువును.

స్వప్నములు కేవలము మిథ్యయైయున్నను, అవి భవిష్యత్తును సూచించునని 4వ సూత్రము తెలుపును. భవిష్యత్తులో జరుగనున్న మేలునుఁగాని, కీడునుఁగాని కొన్ని స్వప్నములు మనకు సూచించును.

జీవుడు దేవుని పోలికను కలిగియున్నను, అతడు స్థూలశరీర సంబంధమును కలిగియుండుటచే ఆతని శక్తి జ్ఞానములు కుంటుపడియున్న కారణముచే అతడు స్వప్నములలో నిజమైన సృష్టికార్యము నొనర్పఁజాలడని 5,6 సూత్రములు బోధించును. జీవదశయందు అజ్ఞానకారణముచే పరిపాలకత్వము నిగూఢమై యున్నది. అతడు తన ప్రస్తుత దశయందు బంధింపబడియున్న కారణముచే,

భవిష్యద్ జ్ఞానము లేనివాడై యుండుటచేత జీవుడు తన ఇచ్ఛానుసారముగా చెడు స్వప్నమునుఁగాని, మంచి స్వప్నమునుఁగానిఁ గాంచజాలడు.

**2వ అధికరణము (7-8 సూత్రములు) :-** సుషుప్తిదశలో హృదయమునందున్న బ్రహ్మమునందు జీవుడు వసించునని ప్రబోధించును.

**3వ అధికరణము (9వ సూత్రము) :-** నిద్రనుండి మేల్కాంచిన జీవుడు, నిద్రించుటకు ముందుఁగల జీవుడు ఏకమేనని నుడివి, దానికిఁగల హేతువుల నొసంగును. నిద్రించుటకు పూర్వము ఒక వ్యక్తిచే సగమొనర్పఁబడిన కార్యము, అతడు మేల్కాంచిన తర్వాత పూర్తిచేయఁబడును. అతడు స్వాత్మజ్ఞానమును కూడా కలిగియుండును. అతనికి పూర్వ విషయములు జ్ఞప్తియందుండును, "నిద్రించి మేల్కొన్నవ్యక్తిని నేనే" యని అతనికి జ్ఞాపకమునందుండును.

**4వ అధికరణము (10వ సూత్రము) :-** మూర్ఛయొక్క స్వరూపమును వర్ణించును. అది సగము మృత్యువనియు, సగము సుషుప్తియనియు, ఈ రెండింటి యొక్క మిశ్రమమే మూర్ఛయనియును సూచించును.

**5వ అధికరణము (11-21 సూత్రములు) :-** సుషుప్త్యవస్థయందు జీవుడు లయము నొందినట్టి పరబ్రహ్మము యొక్క స్వరూపమునుఁగూర్చి సూచించును.

బ్రహ్మము నిర్విశేషమని 11వ సూత్రము అభివర్ణించును. కేవలము భక్తుల యొక్క ఉపాసనానిమిత్తమై సవిశేష బ్రహ్మము పేర్కొనఁబడినది. అది దాని నైజస్వరూపము కాదు.

ఉపాధికారణముచే ప్రతి రూపము బ్రహ్మముచే నిషేధింపఁబడినదని 12వ సూత్రము స్పష్టీకరించును. శ్రుతి యొక్క ప్రతి వాక్యమునందును తాదాత్మ్యత ప్రతిపాదింపఁబడినది. ఏకత్వమే పరమ సత్యమైయున్నది. భక్తి ప్రపత్తుల నిమిత్తమై విభేదము చెప్పఁబడినది. నిజమునకు కేవలము నిర్వికారమగు ఏకైకానంత సారతత్త్వము మాత్రము శేషించియుండును.

సమస్త ప్రపంచము భోక్తలు, భోగ్యపదార్థములు మఱియు వీటన్నింటికి నియామకుడైయున్న నిజతత్త్వమగు బ్రహ్మముచే పరివేష్టింపఁబడియున్నదని 13వ సూత్రము పలుకును.

నానాత్వము, లేక విభిన్నత నిషేధింపఁబడవలయునని 14వ సూత్రము సుడువును. బ్రహ్మము సమస్త రూప వివర్జితమైయున్నది.

బ్రహ్మము సవిశేషమైయున్నట్లు గోచరించునని 15వ సూత్రము సూచించును. సూర్యునిచే ప్రకాశింపఁజేయఁబడు వస్తుతత్వము ననుసరించి సూర్యకిరణములు నేరుగనో, వక్రముగనో కానఁబడునట్లు, మిథ్యయైన ఉపాధుల కారణముచే బ్రహ్మము సవిశేషముగా గోచరించును.

బ్రహ్మము ఏకైక అఖండ చైతన్య ఘనమనియు, దానియందంత ర్బాహ్యములు లేవనియు బృహదారణ్యకము నొక్కివక్కాణించుచున్నట్లు 16వ సూత్రమునందు చెప్పఁబడినది.

బ్రహ్మము నిర్గుణమైయున్నట్లు ఇతర శ్రుతివాక్యములు మఱియు స్మృతియున్నూ ప్రబోధించుచున్నదని 17వ సూత్రము పలుకును.

ఒకేయొక ప్రకాశమానుడగు సూర్యుడు నానావిధములగు జలములలో ప్రవేశించి ఉపాధుల కారణముచే నానారూపములను ధరించునట్లు; అజాయమాన మగు ఏకైక బ్రహ్మమున్నూ నానావిధరూపములను ధరించునని 18వ సూత్రము ప్రతిపాదించును.

19వ సూత్రమునందు పూర్వపక్షి ఆక్షేపించును. జలమునకువలె బ్రహ్మమునందు రెండవ పదార్థమున కవకాశము లేకుండుటచే, బ్రహ్మమునకు మఱియు సూర్యునికి పోలిక కుదురదు. బ్రహ్మము రూపవివర్జితము మఱియు సర్వవ్యాపకమై యున్నది. అదియొక జడపదార్థముకాదు. సూర్యునికి రూపమున్నది. అదియొక జడపదార్థము. జలము సూర్యునికి భిన్నమైనదగుటచే, అది దానికి దూరముగానుండును. కావున సూర్యుడు జలమునందు ప్రతిబింబించుట కవకాశముకలదు.

20 సూత్రము 19వ సూత్రములోని ఆక్షేపణను ఖండించును. ప్రతిబింబము యొక్క హెచ్చుతగ్గులు మఱియు వికారమును కలిగించు విషయమునందే పోలికకలదు. బ్రహ్మము తాను కలిగియున్న ఉపాధులు , శరీరము యొక్క స్థితిగతులు మఱియు నానావిధవికారములకు కారణమై యున్నట్లు తోచును. కొన్ని ప్రత్యేక విషయములందు మాత్రమే ఈ రెండు పదార్థములకు పోలిక చెప్పఁబడినది.

ఉపాధులయందాత్మ యున్నదని శ్రుతి వివరించుచున్నదని 21వ సూత్రము పలుకును.

**6వ అధికరణము (22–30 సూత్రములు) :** బృహదారణ్యకము (2–3–6) లోని "నేతి నేతి" యనెడి వాక్యాంగము కేవలము బృ. ఉ. 2–3–1 లో వివరింపఁబడిన బ్రహ్మముయొక్క స్థూల సూక్ష్మరూపములను మాత్రము నిషేధించును. కాని బ్రహ్మమును స్వయముగా నిషేధింపదని బోధించును.

నిజమునకు బ్రహ్మము, పూర్తిగా ఉపాధికారణముచే ఉనికిని కలిగియున్నట్టి గుణములచే రహితమైయున్నదని 23 నుండి 26 వరకుఁగల సూత్రములు వివరించును.

27–28 సూత్రములు భేదాభేదవాదుల దృష్టికోణములనుఁగూర్చి తెలుపును. జీవుడు మఱియు బ్రహ్మమునకు మధ్య భేదము మఱియు అభేదము కూడా ఉన్నదని వారు పలుకుదురు. అది చలించు సర్పము మరియు చలనములేని సర్పమువలె భేదాభేదములను కలిగియుండును.

29వ సూత్రము భేదాభేదవాదుల దృష్టికోణమును ఖండించి, 25వ సూత్రమునందు తెలుపఁబడిన పరమసత్యమును ప్రతిపాదించును. అనగా కల్పితమైన ఉపాధికారణముచే ఏర్పడిన భేదము మిథ్యయనియు మఱియు అభేదమే సత్యమనియును నిరూపించును.

30వ సూత్రము 29వ సూత్రమును బలపఱచును. భేదభావమును శ్రుతి ఖండితముగా నిషేధించును.

**7వ అధికరణము (31–37 సూత్రములు) :** బ్రహ్మము అద్వితీయమనియు, ఐనను రూపకాలంకారమునందు తాత్కాలిక భేదము గోచరించుననియును వర్ణించును.

బ్రహ్మము సేతువుగను, తీరముగను, ఆనకట్టగను పోల్చబడుఁట తనకు అతీతమైయున్న దానితో ప్రపంచమునకుఁగల సంబంధమును సూచించుటకు కాదు. కాని అతడు జగత్సంరక్షకుడనియు మఱియు ఈ సంసార సాగరమును దాటుటకొక ఆనకట్టవలె జీవుల కాధారమై యున్నాడని సూచించుట కొఱకై యున్నది.

ప్రజ్ఞామాంద్యముఁగలవారు ఉపాసించు నిమిత్తమై స్థానమునందున్న ఒకానొక చిహ్నముగ ఊహింపఁబడును.

**8వ అధికరణము (38–41 సూత్రములు) :–** జైమిని మతానుసారముగా కర్మఫలము నొసంగుటకు అపూర్వమునకు స్వాతంత్ర్యము లేదనియు, అది పరమేశ్వరునిచే ఒసంగఁబడుననియును సూచించును. సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుడు పుణ్య పాపముల ననుసరించి కర్మఫలముల నొసంగును.

# 1. సంధ్యాధికరణము

## (1-6 సూత్రములు)

### 3-2-1 సంధ్యే సృష్టి రాహ హి

జాగ్రత్సుషుప్తులకు మధ్యఁగల అవస్థయందు నిజమైన సృష్టి ఏర్పడునని శ్రుతి వచించుచున్నది.

సంధ్యే = జాగ్రత్సుషుప్తులకు మధ్యగల స్వప్నావస్థయందు, సృష్టి = నిజమైన సృష్టి. ఆహ = శ్రుతి పలుకుచున్నది. హి = ఏలననగా

స్వప్నావస్థ ఇప్పుడు విచారింపఁబడుచున్నది.

1,2 సూత్రములు పూర్వపక్షికి సంబంధించిన సూత్రములగుటచే "సృజతే" యనుశబ్దముచే స్వప్నమును మనముఁగాంచునది నిజమైన సృష్టియను దృష్టికోణమును ప్రారంభించును.

"సంధ్య" యను శబ్దమునకు స్వప్నమని అర్థము. అది జాగ్రదవస్థకు మఱియు సుషుప్త్యవస్థకు మధ్యయందుండుటచే దానికి "సంధ్య"యని పేరు జాగ్రత్సుషుప్తులనెడి రెండులోకములు కలియు స్థానమగుటచే, అది "సంధ్య" యని చెప్పఁబడును.

శ్రుతి ఇట్లు నిర్దేశించును. "న తత్ర రథా న రథయోగా న పంథానో భవంత్యథ రథాన్ రథ యోగాన్పథ స్సృజతే" (బృ.ఉ.4-3-10). ఈ స్వప్నములోని సృష్టి జాగ్రదవస్థలోని సృష్టివలె పారమార్థిక సత్తాను కలిగియున్నదా? లేక మిథ్యా మాత్రమా? యనెడి సంశయమిచ్చట కలుగును.

స్వప్నావస్థయందు నిజమైన సృష్టి ఏర్పడునని పూర్వపక్షి పలుకును.

"రథాన్ రథయోగాన్పథ స్స ృజతే" మఱియు "సృజతే సహి కర్తా" (బృ.ఉ. 4-3-10) అను శ్రుతి ప్రామాణ్యము ననుసరించి స్వప్నావస్థలోని సృష్టి నిజమైనదై యుండవలయును.

ఇంతేకాకుండా జాగ్రదవస్థలోని అనుభవమునకు మఱియు స్వప్నావస్థలోని

అనుభవమునకు భేదమేమియును లేదు. జాగ్రదవస్థకువలెనే స్వప్నములోని ఆత్మయు విమాన ప్రయాణముచేతను, శ్రావ్యమగు సంగీత శ్రవణముచేతను, సుందరములైన దృశ్యములనుఁగాంచుటచేతను, మఱియు రుచికరమగు ఆహారమును సేవించుట చేతను ఆనందము నొందును.

కావున ఆకాశాదులు పరమేశ్వరునిచే సృష్టింపఁబడినట్లే స్వప్నములోని సృష్టియు అతనినుండియే ఉత్పన్నమగుటచే అది నిజమైన సృష్టియైయున్నది.

## 3-2-2 నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ

మఱియు కాఠక శాఖవారు తాను సృష్టించిన పుత్రాదులు ప్రియులగుటచే, పరమేశ్వరుడే సృష్టికర్తయని ప్రతిపాదింతురు.

నిర్మాతారమ్ = సృష్టికర్తను, చ = మఱియు, ఏకే = ప్రత్యేకమగు వైదిక శాఖ ననుసరించు కొందఱు, పుత్రాదయః = పుత్రాదులు, చ = మఱియు.

స్వప్నములోని సృష్టినికూడా పరమేశ్వరుడే ఒనర్చునని చెప్పుటకు పూర్వపక్షి మరియొక విధముగా వాదించుచున్నాడు. "య ఏషసుప్తేషుజాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః, తదేవ శుక్రం తద్బ్రహ్మ" (కఠ, ఉ. 2-5-8).

ఈ వాక్యములోని "కామ" యను శబ్దముచే ప్రేమింపబడునట్టి పుత్రాదులను అర్థమును గైకొనవలయును. "కామ" యను శబ్దము కేవలము కోరికలను సూచింపదు. ఈ యర్థమునందు పూర్వవాక్యమునందు కూడా ఇది ప్రయోగింపఁబడినది. "యేయేకామా దుర్లభా మర్త్యలోకే సర్వాన్ కామాంఛందతః ప్రార్థయస్వ (కఠ. ఉ. 1-1-25). 'కామ' యను శబ్దమునకు పుత్రాదులను అర్థమును ఈ క్రింది వాక్యమునే స్వీకరింపవచ్చును. "శతాయుషః పుత్రపౌత్రాన్ వృణీష్వబహూన్ పశూన్ హస్తి హిరణ్యమశ్వాన్" (కఠ. ఉ. 1-1-23)

జాగ్రదస్థకువలెనే స్వప్నములలోకూడా స్వయముగా పరమేశ్వరుడే సృష్టికార్యము నొనర్చును. కావున స్వప్న ప్రపంచముకూడా సత్యమైనదే.

శ్రుతి ఇట్లనును. "అథోఖల్వాహుర్జాగరిత దేశ ఏవాస్యైష ఇతియానిహ్యేవ జాగ్రత్ పశ్యతితానిసుప్త ఇతి" (బృ. ఉ. 4-3-14). కావున స్వప్న ప్రపంచము నిజమైయున్నది.

దీనికి మేమీ క్రింది సమాధానము నొసంగుదుము.

## 3-2-3 మాయామాత్రంతు కార్త్స్న్యే నానభివ్యక్తస్వరూపత్వాత్

కాని దాని పూర్ణ స్వరూపము అభివ్యక్తము కాకుండుటచే, స్వప్నప్రపంచము కేవలము మిథ్యయైయున్నది.

మాయామాత్రం = కేవలము మిథ్య, తు = కాని, కార్త్స్న్యేన = పూర్తిగా, అనభివ్యక్తరూపత్వాత్ = దాని స్వరూపము అభివ్యక్తము కాకుండుటచే.

1-2 సూత్రములలో ఉదహరింపఁబడిన వాదమిప్పుడు ఖండింపఁ బడుచున్నది.

"తు" యను శబ్దము మొదటి రెండు సూత్రములలోని దృష్టికోణమును పరిహరించును. స్వప్న ప్రపంచము సత్యముకాదు. అది కేవలము మిథ్యామాత్రము. దానియందు అణుమాత్రమైన సత్యముకూడా లేదు. స్వప్న ప్రపంచముయొక్క స్వరూపము దేశము, కాలము, కారణము మఱియు యుక్తి యుక్తతయందు జాగ్రత్ప్రపంచముతో ఏ మాత్రము ఏకీభవింపదు. కావున స్వప్న ప్రపంచము జాగ్రత్ప్ర పంచమువలె సత్యమైనది కాదు.

ప్రథమముగా శరీరమనెడి సరిహద్దులలో స్వప్నమునందు రథాదులు పట్టుటకు చాలినంత స్థలములేదు. ఒకవేళ ఆత్మ బయటకేగి పదార్థముల ననుభవించునని, పలికినచో, అది వందలాదిమైళ్ళ దూరమువెళ్ళి, కొద్ది నిముషములలో ఎట్లు తిరిగిఁరాఁగలుగును?

స్వప్నమునందాత్మ శరీరమును విడిచి బయటకు వెళ్ళదు. ఏలననగా ఒకవేళ అది అట్లొనర్చునేని, అతడు బొంబాయిలో నిద్రించి స్వప్నమునందు లండన్‌కు వెళ్ళి, అక్కడ మేల్కొనవలసివచ్చును. కాని నిజమునకాతడు బొంబాయి యందు మాత్రమే మేల్కొనును.

ఇంతేకాకుండా తన స్వప్నమునందొక మానవుడు తన శరీరముతోపాటు మరియొక స్థలమున కేగినట్లు తలంచినను, ప్రక్కనున్నవారు అతని శరీరము మంచముపైననే ఉన్నట్లు గాంతురు.

ఇఁక స్వప్న ద్రష్ట తన స్వప్నమునందు నిజముగా ఉనికిని కలిగియున్న స్థలములకు భిన్నమైన స్థలములనుఁగాంచడు, ఒకవేళ వాటిని చూచుట కాతడు నిజముగా వెళ్ళునేని, అవి అతనికి జాగ్రదవస్థకువలె కానఁబడియుండెడివి.

స్వప్నము శరీరమునందే సంభవించునని శ్రుతి పలుకును. "సయత్రై తత్స్వ ప్న్యయాచరతి... ఏతత్ప్రాణాన్ గృహీత్వాస్వే శరీరే యథాకామం పరివర్తతే" (బృ. ఉ . 2-1-18).

రెండవ అంశమేమనగా స్వప్నములో సమయ వైరుద్ధ్యమేర్పడు చుండును. రాత్రియందు నిద్రించిన మనుజుడు పగటికలలనుఁ గాంచును. మరియొక మనుజుడు పదినిమిషముల కలలో 50 సంవత్సరములు జీవించినటుల అనుభవించును. ఒకానొక మానవుడు తన కలలో రాత్రియందు సూర్య గ్రహణమునుఁగాంచును.

ఇఁక మూడవఅంశమేమనగా, దృశ్యాదులనుఁ గాంచునట్టి ఇంద్రియములు స్వప్నమునందు పనిచేయవు. ఇంద్రియములు అంతర్ముఖ మొనర్పఁబడుటచే, స్వప్నమునుఁగాంచు వ్యక్తి రథాది పదార్థములనుఁగాంచుటకు నేత్రములను కలిగి యుండడు. రథాదులను నిర్మించుటకు కనుఱెప్పపాటు కాలములో అతడు పదార్థముల నెట్లు పొందఁగలుగును?

నాలుగవ అంశమేమనగా, మేల్కాంచిన వెంటనే రథాదులు అదృశ్యముల గును. రథాదులు స్వప్నసమయమునందుకూడా అదృశ్యములగును. స్వప్నము స్వయముగా తాను సృష్టించిన పదార్థములయొక్క ఆద్యంతములను నిషేధించును. రథము అకస్మాత్తుగా మనుజుడుగా మారును, మఱియు మనుజుడొక వృక్షముగా మారును.

స్వప్నములోని రథాదులకు నిజమైన ఉనికిలేదని శ్రుతి స్వయముగా నుడువును. "స్వప్నావస్థయందు రథములులేవు, మఱియు తురగాదులు లేవు" కావున స్వప్నదృశ్యములు కేవలము మిథ్యామాత్రములైయున్నవి.

జాగ్రత్ప్రపంచమువలెనే స్వప్న ప్రపంచముకూడా పరమేశ్వరుని సృష్టియగుటచే అది సత్యమైనదను వాదము నిజముకాదు. ఏలననగా స్వప్న ప్రపంచము జీవ సృష్టియగునే కాని, ఈశ్వర సృష్టికాదు. శ్రుతి ఇట్లనును. "సయత్ర ప్రస్వపిత్యస్యలోకస్య సర్వావతో మాత్రామపాదాయ స్వయం విహత్యస్వయం నిర్మాయస్వేన భాసాస్వేన జ్యోతిషాప్రస్వపి త్యత్రాయం పురుషస్స్వయంజ్యోతిర్భవతి". (బృ. ఉ. 4-3-9) ఈ శ్రుతివాక్యముచే స్వప్న ప్రపంచము జీవసృష్టియే యగునుఁగాని ఈశ్వర సృష్టికాదని నిరూపింపఁబడినది.

## 3-2-4 సూచకశ్చ హి శ్రుతే రాచక్షతేచ తద్విదః

కాని స్వప్న ప్రపంచము మిథ్యయైనను, అది భవిష్యత్తును సూచించును. ఏలననగా శ్రుతి మఱియు స్వప్న విద్యాపారంగతులుకూడా ఇట్లు నుడువుచున్నారు.

సూచకః = సూచించునది, చ = మఱియు, హి = ఏలననగా, శ్రుతేః = శ్రుతివలన, ఆచక్షతే = చెప్పఁబడినది. చ = కూడా, తద్విదః = స్వప్న రహస్యములను గుర్తెఱింగినవారు.

3వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

"తద్విదః" అను శబ్దముచే స్వప్నవ్యాఖ్యానమును గుర్తెఱింగినట్టి వ్యాసుడు, బృహస్పతి ఇత్యాదులని గ్రహింపవలయును.

సరి, ఐతే స్వప్నములు మిథ్యయగుటచే, వాటి యందణుమాత్రమైన సత్యము కూడా లేదు. అట్లుకాదని మా సమాధానము. ఏలననగా స్వప్నములు భవిష్యత్తులో జరుగనున్న కీడు, లేక మేలునుఁ గూర్చిన జోస్యము చెప్పును. కారణమేమనగా శ్రుతి ఇట్లు వచించును. "యదాకర్మసు కామ్యేషు స్త్రియం స్వప్నేషు పశ్యతి। సమృద్ధిం తత్రజానీ యాత్తస్మిన్ స్వప్ననిదర్శనే" (ఛాం.ఉ. 5-2-8), కొన్ని ప్రత్యేక స్వప్నములు శీఘ్రమరణమును సూచించునని ఇతర శ్రుతివాక్యములు నుడువుచున్నవి. "స్వప్నమునందెవడైనను నల్లని పండ్లతో కూడిన నల్లని మనుజునిఁగాంచినచో, అతడు స్వప్నమునుఁగాంచువానిని చంపును".

ఏనుగుపై స్వారిచేయుట ఇత్యాది స్వప్న దర్శనము అదృష్టమును సూచించుననియు, ఇఁక గాడిదపై స్వారిచేయుట ఇత్యాది స్వప్న దర్శనము దురదృష్టమును సూచించుననియును స్వప్నవైజ్ఞానిక వేత్తలు పలుకుదురు. "స్వప్నమునందొక వ్యక్తికి ఒక బ్రాహ్మణుడుఁగాని, దేవుడుఁగాని, ఎద్దుఁగాని, లేక రాజుఁగాని, చెప్పిన దంతయు నిశ్చయముగా సత్యమేయగును".

కొన్ని సమయములలో ఒకానొకడు స్వప్నమునందు మంత్రోపదేశమును పొందును. శివుడు విశ్వామిత్రునికి స్వప్నమునందు "రామరక్ష" యనెడి స్తోత్రమునుపదేశించెను. విశ్వామిత్రుడు నిద్రనుండి మేల్కాంచిన వెంటనే, దానిని ఉన్నదున్నట్లుగా ఉషఃకాలమునందు వ్రాసికొనెను.

ఈ సందర్భములన్నింటి యందును సూచింపఁబడిన విషయము సత్యమై యుండవచ్చును. కాని జాగ్రదవస్థచే ఖండింపఁబడుటచే, సత్య విషయమును సూచించిన స్వప్నము కూడా అసత్యమేయగును. ఈ విధముగా స్వప్నము మిథ్యయను సిద్ధాంతము ఖండింపఁబడఁజాలదు.

ప్రథమ సూత్రమునందు స్వప్నములోని "సృష్టి" యను పదము గౌణము మఱియు ఉపమానార్థమునందు ప్రయోగింపఁబడినది. జీవుడొనర్చిన పుణ్య పాపకర్మలు స్వప్నానుభవముద్వారా సుఖదుఃఖరూపమునంద నుభవింపఁబడును. జాగ్రదవస్థయందనుభవమును గడించుటకై ఆత్మప్రకాశము సూర్యప్రకాశముతో పాటు పనిచేయును. ఇఁక స్వప్నావస్థయందు ఇంద్రియములు పనిచేయకున్నను మఱియు ఏలాటి భౌతిక ప్రకాశము లేకున్నను ఆత్మయొక్క స్వయంక్రియాశీలత వ్యక్తమగును. ఇదియే ప్రధానముగా ప్రబోధింపఁబడు సత్యమైయున్నది. స్వప్నములోని సృష్టి గౌణమైయున్నది.

ఆకాశ ప్రపంచము సత్యమైనట్లు స్వప్న ప్రపంచము సత్యముకాదు. ఆకాశము, వాయువు ఇత్యాదులతో కూడిన సత్యమని చెప్పఁబడు సృష్టిపూర్ణముగా సత్యమైనది కాదను విషయమును మనము జ్ఞప్తియందుంచకొనవలయును. జీవాత్మ పరమాత్మతో తాదాత్మ్యము పొందినప్పుడు ఆకాశాది ప్రపంచము శూన్యమై నశించును.

స్వప్నసృష్టి ప్రతిదినము మనలను బుద్ధిహీనులుగా నొనర్చును, కావున స్వప్నము కేవలము మిథ్యయను విషయమును స్పష్టముగను, నిష్కర్షగను అర్థమొనర్చు కొనవలసియుండును.

## 3-2-5 పరాభిధ్యానాత్తు తిరోహితంతతో హ్యస్య బంధవిపర్యయౌ

కాని పరబ్రహ్మోపాసనచే అజ్ఞానముచే నిరోధింపఁబడియున్న జీవ బ్రహ్మైక్యత సిద్ధించును. ఏలననగా పరమాత్మ చేతనే జీవునికి బంధవిమోచనము లేర్పడును.

పరాభిధ్యానాత్ = పరబ్రహ్మోపాసనచే, తు = కాని, తిరోహితం = దాగి యున్నట్టి, తతః = పరమాత్మ నుండి, హి = ఏలననగా, అస్య = జీవునియొక్క బంధ విపర్యయౌ = బంధవిమోచనములు.

పూర్వపక్షి ఇట్లనును :- మిణుగురు అగ్నియొక్క అంశమెట్లగునో, అట్లే జీవాత్మ పరమాత్మయొక్క అంశమైయున్నది.. అగ్నికి మఱియు మిణుగురునకు కాల్చుశక్తి మఱియు ద్యోతకశక్తి ఎట్లు సామాన్యములై యున్నవో, అట్లే జీవాత్మ పరమాత్మలకు కూడా జ్ఞానశక్తి మఱియు పరిపాలకశక్తి సామాన్యములై యున్నవి. కావున జీవుడు కూడా దేవుని వలె తన సంకల్పశక్తి చే స్వప్నమునందు రథాది పదార్థములను సృష్టింపఁగలుగును.

ఈ సూత్రము దీనిని ఖండించి, అవిద్యాకారణముచే ఇప్పుడు జీవుడు దేవునికి భిన్నుడై యున్నాడని నుడువును. అజ్ఞాన కారణముచే జీవత్వమునందు పరిపాలకశక్తి దాగి యున్నది. అది కేవలము పరబ్రహ్మోపాసనచే మాత్రము వ్యక్తమగును. ఒక శక్తిమంతమగు ఔషధముద్వారా గ్రుడ్డివానికి దృష్టి ఏర్పడునట్లు. ఈ యజ్ఞానము “అహం బ్రహ్మాస్మి” యనెడి జ్ఞానము ద్వారా తొలగింపఁబడును.

శ్రుతి ఇట్లనును “జ్ఞాత్వాదేవం సర్వపాశాపహానిః క్షీణైః క్లేశైర్జన్మ మృత్యు ప్రహాణిః, తస్యాభిధ్యానాత్తృతీయం దేహభేదే విశ్వైశ్వర్యం కేవల ఆప్తకామః” (శ్వే. ఉ. 1-11), జ్ఞానోదయమగునంతవరకు జీవుడు తన ఇచ్ఛాను సారముగా ఏలాటి సత్యమైన పదార్థమును సృష్టింపఁజాలడు.

మానవునికి ప్రభుత్వాధికారము అప్రయత్నముగా రాదు. జీవునికి బంధ విమోచనములు దేవునిచే కలుగునట్లు, జనులందరికి అధికారము స్వయముగా వ్యక్తముకాదు. అనగా దైవసాక్షాత్కారముచే స్వాతంత్ర్యమేర్పడును. మఱియు తనకు స్వాభావికమైన అజ్ఞానకారణముచే బంధమేర్పడును. ఇట్టి సాక్షాత్కారము కలుగు నంతవరకు సృష్టించుశక్తి ఎచ్చటి నుండి కలుగును?

## 3-2-6 దేహయోగాద్వాసోఽపి

మఱియు జీవునికి శరీరముతోఁగల సంబంధకారణముచేత కూడా అతని అధికారము మఱుగు పఱచఁబడును.

దేహయోగాత్ = శరీరముతో దానికిఁగల సంబంధకారణముచే, వా = లేక, సః = జీవుని అధికారము మఱుగు పఱచఁబడుట, అపి = కూడా.

5వ సూత్రమిచ్చట విస్తరించి చెప్పఁబడినది.

జీవుడు శరీరమును ధరించు కారణముచే ఇట్లు శక్తి మఱుగు పఱచఁబడును. జీవుడు శరీరముతో కలిసి యుండుట అనగా శరీరము, ఇంద్రియములు, మనస్సు బుద్ధి, విషయములు, వాసనలచే యుక్తమై యుండుటచే అజ్ఞాన మేర్పడుటతో అతని జ్ఞానము మఱియు అధికారము మఱుగు పఱచఁబడును. జీవుడు నిజముగా పరమాత్మయేయైయున్నను, కఱ్ఱయందు, లేక బూడిదయందు అగ్ని దాగియున్నట్లు: జీవాత్మ యొక్క జ్ఞాన శక్తులు దాగి యున్నవి. కావున జీవుడు స్వయముగా సృష్టింపడు. ఒకవేళ అతడు సృష్టింపఁగలిగినను, దుఃఖదాయకములగు స్వప్నముల నాతడు సృష్టింపడు. ఎవడైనను తనకు తాను దుఃఖమును కోరి తెచ్చుకొనడు.

'నేను' శరీరమనెడి తప్పుడు భావనను కలిగియున్నంతవరకు మఱియు ఉపాధులకు భిన్నుడను కానను దురభిప్రాయమున్నంతవరకు జీవుని జ్ఞానము మఱియు స్వాతంత్ర్యము మఱుగుపడియుండును.

జీవుడు పరమాత్మకు అభిన్నుడని శ్రుతి పలుకును. "తత్సత్యంస ఆత్మాతత్త్వమసి శ్వేతకేతో" (ఛాం. ఉ. 6-9-4). కాని అది శరీరసంబంధమును కలిగి యుండుటచే దాని జ్ఞానశక్తులు మఱుగునపడినవి.

సాపేక్షిక సత్యము ననుసరించి స్వప్నప్రపంచము జాగ్రత్ప్రపంచమును పోలియున్నను, వాటికి నిజమైన అస్తిత్వములేదని శ్రుతి స్వయముగా నుడువును. జాగ్రదవస్థయందు పొందఁబడిన వాసనలే స్వప్నమునకు కారణమగుటచే, స్వప్నావస్థ జాగ్రదవస్థతో పోల్చఁబడినది.

వీటన్నింటిచే స్వప్నములు కేవలము మిథ్యయని తెలియుచున్నది. అవి అసత్యములు.

# ౨. తదభావాధికరణము

(7–8 సూత్రములు)

## 3-2-7 తదభావో నాడీషు తచ్ఛ్రుతేరాత్మనిచ

నాడులయందును, ఆత్మయందును, సుషుప్తి సంభవించునని శ్రుతిచే తెలియఁబడుచున్నది.

తదభావః = స్వప్నములేని సుషుప్తి, నాడీషు = నాడులలో, తచ్ఛ్రుతేః = అది శ్రుతిచే తెలియఁబడుటచే, ఆత్మని = ఆత్మయందు, చ = మఱియు.

స్వప్నములేని సుషుప్త్యవస్థ ఇప్పుడు చర్చింపఁబడుచున్నది.

ఇంతవరకు స్వప్నావస్థ విచారింపఁబడినది. ఇప్పుడు సుషుప్త్యవస్థ విచారింపఁబడుచున్నది.,

సుషుప్తియందాత్మ నాడులతోను, ప్రాణమునందును, హృదయము నందును, స్వయముగా తనయందును, బ్రహ్మమునందును విశ్రమించునని శ్రుతులు నానావిధములుగా వర్ణించుచున్నవి.

నానావిధ పరిస్థితులలో సుషుప్తి సంభవించునని నానావిధములగు శ్రుతి వాక్యములు పలుకుచున్నవి.

"తద్యత్రై తత్సుప్తః సమస్తః సంప్రసన్నః స్వప్నం న విజానాత్యా సుతదానాడీషు సుప్తోభవతి" (ఛాం. ఉ. 8-6-3). మరియొక స్థలములో నాడుల కన్వయముగా ఇట్లు చెప్పఁబడినది. "తాభిః ప్రత్యవసృప్య పురీతతిశేతే" (బృ. ఉ. 2-1-19). ఇంకొక స్థలములో ఇట్లు చెప్పఁబడినది. "తాసుతదా భవతి యదాసుప్తః స్వప్నం న కంచన పశ్యత్యథాస్మిన్ ప్రాణ ఏవైకథా భవతి" (కౌ.ఉ. 4-19) వేఱొక స్థానమునందిట్లు చెప్పఁబడినది. "య ఏషోంతర్హృదయ ఆకాశ స్తస్మింఛేతే" (బృ. ఉ. 4-4-22). ఛాందోగ్యమునందిట్లు చెప్పఁబడినది. "సతా సోమ్యతదా సంపన్నో భవతి స్వమపీతో భవతి" (ఛాం.ఉ. 6-8-1), బృహ దారణ్యక మిట్లు నుడివినది. "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తోన బాహ్యం కించన వేదనాంతరమ్" (బృ.ఉ. 4-3-2-1). "యత్రైష ఏతత్సుప్తోఽభూద్య ఏష విజ్ఞానమయః పురుషస్తదేషాం

ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞానమాదాయ యఏషోఽ౦తదర్హృదయ ఆకాశస్తస్మింఛేతే” (బృ.ఉ. 2-1-17).

పై వాక్యములలో పేర్కొనఁబడిన నాడులు ఇత్యాదులు పరస్పరము విభిన్నములై సుషుప్తియందు జీవునికి నానావిధస్థానముల నేర్పఱచునా? లేక అవి యన్నియు పరస్పర సంబంధమును కలిగియుండి ఒకే స్థానమును సూచించునా? యను సంశయమిచ్చట ఏర్పడును.

నానావిధస్థానములు పేర్కొనబడుటచే ప్రాథమిక దృష్టికోణముల ననుసరించి ఒకేయొక ఉద్దేశ్యము సాధింపఁబడునని పూర్వపక్షి పలుకును. ఒకే ఉద్దేశ్యమును సాధించు వ్రీహియవాదులు ఒకదానినొకటి ఆశ్రయించి యుండవు. స్థానములను సూచించు శబ్దములన్నియును సప్తమీ విభక్తి యుందుండుటచే, అవి తుల్యములు మఱియు వికల్పములైయున్నవి. ఒకవేళ అవి పరస్పర సంబంధమును కలిగి యున్నచో, శ్రుతి వాటికి నానావిధ విభక్తులను ప్రయోగించి యుండెడిది. కావున సుషుప్తియందు జీవుడు తన ఇచ్ఛానుసారముగా ఆకాశము, నాడులు, ప్రాణములు, హృదయాది స్థలములలో ఏదో యొకదాని నాశ్రయించునని మేము నిశ్చయించి చెప్పుదుము.

ఈ సూత్రము పూర్వపక్షి యొక్క దృష్టి కోణమును ఖండించి, అవి పరస్పర సంబంధమును కలిగి యుండుటచే ఒకే స్థానమును సూచించునని పలుకును. జీవుడు వీటియందేదో యొక స్థానమును చేఱునని భావించుట పొరపాటు. సత్యమైన విషయమేమనగా జీవుడు నరములద్వారా హృదయస్థానమును చేరి అచ్చట బ్రహ్మమునందు విశ్రమించును.

ఇచ్చట మరియొక మార్గములేదు. నాడ్యాదులు ఒకే లక్ష్యమును కలిగియుండునను విషయము నిరాధారమగుటచే, మన ఇచ్ఛ బలాత్కారముగా చొప్పింపఁబడినదని పైన నిశ్చయించి చెప్పఁబడినది. శ్రుతి యొక్క రెండు వాక్యములలో మన ఇచ్ఛను చేర్చినచో, శ్రుతి ప్రామాణ్యము నిర్వీర్యమగును. ఒక శ్రుతి వాక్యమును నీవంగీకరించినచో, రెండవవాక్య ప్రామాణ్యము నిషేధింపఁబడును.

ఇంతే కాకుండా నానావిధములగు ఉద్దేశ్యములను కలిగి ఏకత్రితమొనర్పఁ దగిన పదార్థములన్నింటికి ఒకే విభక్తి ప్రత్యయము ప్రయోగింపఁబడినది. "అతడు భవనమునందు పరుండును. అతడు మంచముపై పరుండున"ని మనము పలుకుదుము. మనమీ రెండు సప్తమీ విభక్తులను కలిపి "అతడు భవనములోని మంచముపై పరుండున"ని పలుకుదుము. అదేవిధముగా విభిన్నమైన వాక్యములు ఏకత్రిత మొనర్పఁబడవలయును. "జీవుడు నాడుల ద్వారా హృదయస్థానముచేరి, బ్రహ్మమునందు, విశ్రమించున"ని నుడువవలయును. గంగానదిని అనుసరించిన మానవుడు సముద్రమును చేరుకొనునట్లు, జీవుడు నాడుల ద్వారా బ్రహ్మమును చేరుకొనును. ఇట్లాతడు స్వస్వరూపమునందు నిలువగలుగును.

నాడులు, హృదయకోశము, బ్రహ్మమనెడి మూడు స్థానములను మాత్రము సుషుప్తి కలిగియున్నదని శ్రుతులు సూచించును. ఈ మూడింటియందు మరల బ్రహ్మము మాత్రమే సుషుప్తికి చివరి స్థానమైయున్నది. నాడులు మఱియు హృత్కోశము దానిని చేరుటకు కేవలము మార్గములైయున్నవి. హృదయ పద్మమును అవరించియుండునది "పురీతత్" అని చెప్పఁబడును.

సుషుప్తియందు జీవుడు బ్రహ్మమునందు విశ్రమించును. కాని అతనికి మఱియు పరమాత్మకు మధ్య ఒక సన్నని అజ్ఞానావరణయుండును. కావున నిర్వికల్పనసమాధికి వలె అతనికి పరమాత్మ తాదాత్మ్యజ్ఞానములేదు. శ్రుతి ఇట్లు నుడివినది. "సతాసోమ్య తదా సంపన్నోభవతి స్వమపీతో భవతి" (ఛాం. ఉ. 6-8-1).

కౌషీతక్యుపనిషత్తు (4-20) నందు మూడు స్థానములు ఒకేచోట సూచింపఁబడినవి. "వీటి యందు పురుషుడు నిద్రించునప్పుడు స్వప్నములనుఁ గాంచడు. అప్పుడాతడు కేవలము ప్రాణము (బ్రహ్మము)తో ఐక్యమగును."

కావున సుషుప్తియందు జీవుడు బ్రహ్మమునందే విశ్రమించును.

## 3-2-8 అతః ప్రబోధోఽస్మాత్

కావున దానిఁ (బ్రహ్మము) నుండియే మేల్కొనుచున్నాము.

అతః = కావున, ప్రబోధః = మేల్కొనుట, అస్మాత్ = ఈ బ్రహ్మమునుండి.

సుషుప్తినుండి మేల్కొను విధానమిప్పుడు వర్ణింపఁబడుచున్నది.

కావున మేల్కొనుటయనగా బ్రహ్మైక్యావస్థనుండి తిరిగి వచ్చుటయని భావము, బ్రహ్మము సుషుప్తికి శయనస్థానము. ఈ కారణముచేతనే బ్రహ్మమునుండియే జీవుడు జాగ్రదవస్థకు తిరిగి వచ్చునని సుషుప్తినిఁగూర్చి వర్ణించు శ్రుతి వాక్యములు ఏకరీతిగా ప్రబోధించుచున్నవి. శ్రుతి ఇట్లనును. "సత ఆగమ్యన విదుః సత ఆగచ్ఛమాహ" (ఛాం. ఉ. 6-10-2). జీవుడు సత్యము, లేక బ్రహ్మమునుండి మేల్కాంచుననియు మఱియు అతడు సుషుప్తియందు బ్రహ్మమునందే విశ్రమించును. కాని హితానామాదినాడులలో విశ్రమింపఁబడనియు ఈ శ్రుతి వాక్యము స్పష్టముగా సూచించుచున్నది. కాని అతడు అజ్ఞానావరణను కలిగియున్నందుచే, సుషుప్తియందు బ్రహ్మముతో తనకుఁగల తాదాత్మ్యతను గుర్తెఱుంగఁజాలడు.

"కుత ఏతదాగాత్" (బృ.ఉ. 2-1-16) అను ప్రశ్నకు సమాధానముగా బృహదారణ్యకము కూడా ఇట్లు నుడువును "యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగా వ్యుచ్చరంత్యేవమేవాస్మాదాత్మనః సర్వేప్రాణాః (బృ.ఉ. 2-1-20).

ఒక వేళ సుషుప్తియందు జీవుడు విశ్రమించు స్థలములు వేర్వేఱైయున్నచో కొన్నివేళలలో అతడు నాడులనుండియు, మరికొన్ని వేళలలో పురీతత్‌నుండియు, మరికొన్ని సమయములలో బ్రహ్మమునుండియు మేల్కాంచుననియు శ్రుతి ప్రబోధించి యుండెడిది.

ఈ కారణముచేత కూడా సుషుప్తికి బ్రహ్మమే స్థానమైయున్నది. నాడులు కేవలము బ్రహ్మమునకు ద్వారమువంటివి.

# 3. కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము

## 3-2-9 స ఏవతు కర్మానుస్మృతి శబ్ద విధిభ్యః

కాని సుషుప్త్యనంతరము బ్రహ్మమునుండి అదే జీవుడు తిరిగి వచ్చునని కర్మ, స్మరణము, శ్రుతి మఱియు విధులనుఁబట్టి తెలియుచున్నది.

స ఏవ=నిద్రించుటకు వెళ్ళిన జీవుడే, తు = కాని, కర్మానుస్మృతి శబ్ద విధిభ్యః = కర్మ, జ్ఞాపకశక్తి, శ్రుతి ప్రమాణము మఱియు విధులచే.

సుషుప్తినుండి మేల్కాంచిన జీవుడు బ్రహ్మమునందు విశ్రమించిన జీవునికి భిన్నుడా? లేక అభిన్నుడా? అను విషయమును మనమిప్పుడు విచారింపఁ వలసియున్నది.

"తు" యను శబ్దముచే సంశయము నివారింపఁబడును.

ఒకవేళ నిద్రనుండి మరియొక జీవి మేల్కాంచినచో "ఇదివరకుండిన వ్యక్తినే నేను" అనెడి ఆత్మానుస్మరణమునకు అవకాశముండెడిది కాదు.

ఈ విషయమునందొక నిశ్చితమైన నియమము లేదని పూర్వపక్షి పలుకును. బ్రహ్మము నుండి అదే జీవుడు మేల్కాంచునను నియమములేదు. ఒక పెద్ద పళ్ళెరములోని నీటియందొక నీటి చుక్కను వేసినచో అది దానియందైక్యమగును. మనము దాని నుండి మరల ఒక నీటి చుక్కను తీసుకున్నప్పుడది అదే నీటి చుక్కయని చెప్పుట కష్టము. దానిని తిరిగి పొందుట  కష్టము. అదే విధముగా సుషుప్తియందు జీవుడు బ్రహ్మమునందు లయించిన అనంతరము, అదే జీవుడు బ్రహ్మమునుండి మేల్కాంచునని చెప్పుట కష్టము. కావున సూషుప్త్యనంతరము బ్రహ్మమునండి మరియొక జీవుడు మేల్కాంచును.

ఈ సూత్రము దీనిని ఖండించి, ఈ క్రింది కారణములచే సుషుప్తియందు బ్రహ్మమునందు ప్రవేశించిన జీవుడే, తిరిగి సుషుప్త్యనంతరము బ్రహ్మమునుండి మేల్కాంచును. కాని మరియొకడు మేల్కాంచడని పలుకును.

నిద్రించుటకు పూర్వమొనర్పఁబడిన కొంత పని, అతడు మేల్కాంచిన అనంతరము పూర్తిచేయఁబడుచుండుటచే నిద్రనుండి మేల్కొన్న వ్యక్తి అతడేయై యుండును. మొదటిరోజు చేయగా మిగిలిన కార్యమును రెండవరోడు మనుజుడు పూర్తిచేయును. ఒక మనుజునిచే చేయఁబడిన సగము కార్యము, రెండవ మనుజునిచే పూర్తి చేయఁబడుట సాధ్యము కాదు. ఒకవేళ అతడదే వ్యక్తి కాకున్నచో, ఒక మనుజునిచే విడిచిపెట్టబడిన కార్యమును రెండవ మనుజుడు పూర్తి చేయుట కభిరుచిని కలిగియుండడు. అనేక దినములు చేయఁబడు యజ్ఞములు వివిధములై యుండును. కావున వైదిక ప్రామాణ్యము ననుసరించి యజ్ఞఫల మెవ్వరికి లభించునను విషయమునందు సంశయమేర్పడును. దీనిచే పవిత్రమైన గ్రంథము యొక్క బుద్ధిహీనత నిరూపణ యగును. కావున మొదటిరోజు ప్రారంభింపఁబడిన పనిని రెండవరోజు పూర్తిచేయువాడు అదే వ్యక్తియను విషయము సుస్పష్టమగుచున్నది.

అతడు ఆత్మాను స్మృతిని కూడా కలిగియున్నాడు, నిద్రకు ముందు, నిద్రకు తర్వాత కూడా అతడు తన వ్యక్తిత్వమును గుర్తుపట్టును. ఏలననగా ఒకవేళ బ్రహ్మైక్యము ద్వారా నిద్ర మోక్షము నొసంగినచో, నిద్రయే మోక్షమునకు సాధనమగును. అట్టియెడల మోక్షము నొందుటకై ఒసంగఁబడిన శాస్త్రవిధులు నిష్ప్రయోజనములగును. నిద్రించుటకు పూర్వమున్న వ్యక్తి నిద్రించిన తర్వాత మేల్కొను వ్యక్తికి భిన్నుడగునేని, కర్మజ్ఞానములనుఁ గూర్చి శాస్త్రమాదేశించినట్టి విధులు నిరుపయోగములగును.

నిద్రించుటకు పూర్వమున్న వ్యక్తి మఱియు నిద్రనుండి మేల్కొన్న వ్యక్తి ఒకడే. అట్లుకాదేని ఒక వ్యక్తి నిద్రించుటకు పూర్వము చూచిన విషయములను నిద్రనుండి మేల్కొన్న వ్యక్తి జ్ఞప్తియందుంచుకొనజాలడు. ఏలననగా ఒక వ్యక్తి చూచిన దానిని రెండవవ్యక్తి జ్ఞప్తియందుంచుకొనఁజాలడు. నిద్ర నుండి మేల్కొన్న వ్యక్తికి పూర్వ సంఘటనలు జ్ఞప్తియుందుండవు. "నిద్రించినవాడను మఱియు నిద్రనుండి మేల్కొన్న వాడను నేనే" యను విషయమాతనికి జ్ఞప్తియందుండును.

అదే వ్యక్తి తిరిగి మేల్కాంచునని శ్రుతి వాక్యములు నుడువును. "పునః ప్రతి న్యాయం ప్రతియోన్యాద్రవతి బుద్ధాం తాయైవ" (బృ.ఉ. 4-3-16). "సర్వాః ప్రజా అహరహర్గచ్ఛంత్య ఏతం బ్రహ్మ లోకం న విందంతి" (ఛాం.ఉ. 8-3-2) "త ఇహవ్యాఘ్రోవా సింహోవా వృకోవా వరాహోవా కీటోవా పతంగోవా దంశోవా మశకోవా యద్యద్భవంతి తదాభవంతి" (ఛాం.ఉ. 6-9-3). శ్రుతి ఖండములలో కానఁబడు ఇట్టి అనేక వాక్యములు జాగ్రత్సుషుప్త్యవస్థలను ఁగూర్చి వర్ణించినప్పుడు అదే వ్యక్తి మేల్కాంచునని పలికినవి.

ఇంతేగాకుండా అతడదే వ్యక్తి కాకున్నచో, కర్మ మఱియు అవిద్యలు నిరర్థకములగును.

కావున ఈ కారణములన్నింటిచే నిద్రించుటకు పూర్వమున్న వ్యక్తియే తిరిగి నిద్రనుండి మేల్కొనునని తెలియుచున్నది.

నీటి బిందువు ఒక పళ్ళెరములోని నీటి యందు ఉపాధిరహితముగా కలియుటచే, ఇచ్చుట నీటిబిందువుయొక్క దృష్టాంతము అసంగతమై యున్నది. అందుచేతనే నీటి బిందువు పూర్తిగా అదృశ్యమగును. కాని జీవుడు బ్రహ్మమునందు శరీరము, మనస్సు, బుద్ధి, ప్రాణము, ఇంద్రియములనెడి ఉపాధులతో

లయమునొందును. కావున కర్మ మఱియు కామనాబలముచే బ్రహ్మము నుండి అదే జీవుడు మేల్కాంచును.

సుషుప్తిలో బహ్మమునందు జీవుడొక ఉప్పునీటితో నిండి మూతవేయఁబడిన కుండ గంగానదిలో మునకవేసినట్లు ప్రవేశించును. అతడు సుషుప్తి నుండి మేల్కొన్నప్పుడు, గంగానది నుండి బయటికి తీయఁబడిన అదే కుండ అదే నీటిని కలిగియున్నట్లుండును. అదే విధముగా కోరికలను కలిగియున్న జీవుడు నిద్రించినప్పుడు తాత్కాలికముగా కర్మేంద్రియముల నంతర్ముఖమొనర్చి, విశ్రామస్థానమైన పరబ్రహ్మమునందు ప్రవేశించును. తదనంతరము మరికొన్ని అనుభవములను గడించుటకై అతడు తిరిగి వచ్చును. మోక్షమునుఁబడసిన పురుషునివలె అతడు బ్రహ్మముతో తాదాత్మ్యమునొందడు. ఈ విధముగా నిద్రించుటకు పూర్వమున్న జీవుడే అదే శరీరము నందు తిరిగి మేల్కాంచునని మనకు తెలియుచున్నది.

కావున సుషుప్తినుండి అదే పురుషుడు మేల్కాంచుననెడి సత్యము రూఢి యగుచున్నది.

# 4. ముగ్ధేర్ధసంపత్త్యధికరణము

## 3-2-10 ముగ్ధేర్ధ సంపత్తిః పరిశేషాత్

మూర్ఛయందు ఒకే అవకాశము, ఒకే ప్రమేయము మిగిలియుండుటచే అర్ధ కలయిక ఉండునని చెప్పవచ్చును.

ముగ్ధే = మూర్ఛయందు, అర్ధ సంపత్తిః= సుషుప్తి, లేక మృత్యువుయొక్క అర్ధావస్థ, పరిశేషాత్ = ఇతర అవస్థలకు భిన్నమైన అవస్థయగుటచే.

ఇప్పుడు మూర్ఛావస్థ చర్చింపఁబడుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును :- "జీవుడు శరీరము నందునప్పుడు జాగ్రత్స్వప్న సుషుప్తులనెడి మూడవస్థలను మాత్రము కలిగియుండును. జీవుడు శరీరమునుండి నిర్గమించుట నాల్గవ అవస్థ, లేక మృత్యువని చెప్పఁబడును. మూర్ఛావస్థ ఐదవ అవస్థగా అంగీకరింపఁబడదు. ఐదవ అవస్థనుఁగూర్చి శ్రుతిఁగాని, స్మృతిగాని పేర్కొనియుండలేదు.

ఐతే మూర్ఛయనగానేమి? ఇది జీవునికి భిన్నమైన అవస్థయా? లేక ఈ యవస్థల యందొకటిగా ఇది చేర్చఁబడునా?

ఇంద్రియములచే అతడు భౌతిక పదార్థములనుఁ గాంచఁజాలకుండుటచే, అది జాగ్రదవస్థయని చెప్పఁబడఁజాలదు.

ఇది బాణములను తయారుచేయువాని విషయము వంటిదై యుండునా? బాణములను తయారు చేయునట్టి వ్యక్తి జాగ్రదవస్థయందున్నను, అతడు మరియొక దానినిఁగాంచఁజాలని కార్యనిమగ్నతను కలిగి యుండునట్లు: ఒకానొక ఘాతముచే స్మృతి తప్పిన మనుజుడు మేల్కొనియున్నను కఱ్ఱతో మోదిన దెబ్బచే కలిగిన బాధయందు మనస్సును కేంద్రీకరించుటచే అతడేలాటి పదార్థమును చూడజాలకుండును.

అట్లుకాదని మేము సమాధానమొనంగుదుము. చైతన్యరహితస్థితి కారణముచే ఈ విషయము భిన్నమైయున్నది. బాణములను తయారుచేయు వాడిట్లనును. “ఇంత కాలము వరకు బాణము విషయము తప్ప నాకు మరియొక ప్రజ్ఞ లేకుండెను.” మూర్ఛనుండి లేచిన వ్యక్తి ఇట్లు పలుకును. “నా కేలాటి ప్రజ్ఞ లేకుండెను. ఇంతకాలము వరకు నేను కటిక చీకటి యందు మూయఁబడి యుంటిని.” మెలకువతోనున్న మనుజుడు తన శరీరమును నిలువుగా నుంచును. కాని మూర్ఛను పొందిన వ్యక్తి భూమిపై సాగిలపడియుండును. కావున మూర్ఛయందన్న మనుజుడు మెలకువను కలిగియుండడు.

అతడు పూర్తిగా ప్రజ్ఞారహితుడై యుండుటచే, స్వప్నముల నాతడుఁగాంచడు.

అది సుషుప్తియున్నూ కాదు. ఏలననగా సుషుప్తియందు ఆనందముండును. ఇఁక మూర్ఛయందానందముండదు.

అతడు శ్వాసించుట చేతను మఱియు శరీరమునందుష్ణోగ్రత యుండుట చేతను, అతడు మరణించినాడనియు చెప్పజాలము. మనుజుడు ప్రజ్ఞారహితుడైనప్పుడు మఱియు బ్రతికియున్నాడా? లేక మరణించినాడా? యను సంశయము ప్రజలకు కలిగినప్పుడు వారాతని హృదయస్థానమును తడిమి, అతని శరీరమునందు వేడియున్నదా? లేదా యని తెలిసికొందురు. వారు తమ హస్తములను అతని నాసికా పుటములయందుంచి శ్వాస ఉన్నదా? లేదా? యని తెలిసికొందురు. ఒకవేళ వారు వేడినిఁగాని, శ్వాసనుఁగాని కాంచజాలనిచో, అతడు మరణించినట్లు

నిశ్చయించుకొని, కాల్చుటకై అతని శరీరమును శ్మశానమునకుఁ గొంపోవుదురు. ఒకవేళ వేడి మఱియు శ్వాసయున్నచో అతడు చావలేదని నిశ్చయించుకొందురు. అతడు ప్రజ్ఞకు వచ్చునను తలంపుతో వారతని ముఖముపై చల్లని నీటిని చల్లుదురు.

కొంతకాలమున కాతడు తిరిగి ప్రజ్ఞకు వచ్చుటచే, మూర్ఛిల్లిన వ్యక్తి మరణించినాడనుకొనరాదు.

కావున మూర్ఛల్లిన వ్యక్తి ప్రజ్ఞారహితుడగుటచేతను మఱియు మరణింప కుండుటచేతను అతడు సుషుప్తియందున్నాడని పలుకుదుముఁగాక! అట్లుకాదని మేము బదులు పలుకుదుము. రెండవస్థల యొక్క విభిన్న లక్షణములున్న కారణముచే ఇదియున్నూ సాధ్యముకాదు.

మూర్ఛిల్లిన వ్యక్తి కొన్ని వేళలలో చాలకాలము వరకు శ్వాసింపడు. అతని శరీరము వణుకుచుండును. అతని ముఖము భయంకరమై యుండును. అతని కండ్లు పైకి తెఱచుకొని యుండును. కాని నిద్రించుచున్న మానవుడు ప్రశాంతముగను, ప్రసన్నముగను. నెమ్మదిగను ఉన్నట్లు కానఁబడును.

అతడు క్రమము తప్పక సమకాలికముగ, శ్వాసించును. అతని నేత్రములు మూయఁబడియుండును. అతని శరీరము వణకదు. మెల్లగా చేతితోకొట్టి ఒక నిద్రించుచున్న మనుజుని మేల్కొలుపవచ్చును కాని మూర్ఛిల్లిన మానవుని కఱ్ఱతో మోదినను అతడు మేల్కొనడు. అలసిపోయిన కారణముచే నిద్రవచ్చును. కాని కఱ్ఱతో తలపై మోదుట ఇత్యాది భౌతిక కారణములచే మూర్ఛకలుగును.

అర్ధలయమే మూర్ఛ యనఁబడును. మూర్ఛిల్లిన మానవుడు సగభాగము నిద్రావస్థయందును, శేషించిన అర్ధభాగము మరణావస్థయందును ఉండును. అది కేవలము అర్ధ సుషుప్తి, దీనిచే అతడు సగము బ్రహ్మానందమును పొందునని అర్థముకాదు. అనగా అది పాక్షికముగా నిద్రను పోలియుండునని భావము. అది మృత్యువు యొక్క పొలిమేరయందుండుటచే, దానిని అర్ధ మరణావస్థయని చెప్పవచ్చును. నిజమునకది మృత్యువునకు ద్వారము వంటిది. ఒకవేళ కర్మశేషమున్నచో అతడు ప్రజ్ఞఁగలవాడగును. లేనియెడల అతడు మరణించును.

మూర్ఛిల్లిన మానవుడు అర్ధభాగము సుషుప్త్యవస్థయందును, మిగిలిన భాగము మరణావస్థయందును ఉండును.

బ్రహ్మవిదులు మూర్ఛను అర్ధలయమని పలుకుదురు. మూర్ఛావస్థయందు మానవునికి ప్రజ్ఞలేకున్నను, అతడు తిరిగి ప్రజ్ఞఁగలవాడగుటచే అది పాక్షికముగా సుషుప్త్యవస్థయని చెప్పఁబడును. మఱియు ముఖవికారము, అవయవ వికృతి కారణములచే అతడు దుఃఖము మఱియు బాధననుభవించుటచే పాక్షికముగా అది మరణావస్థయనియు చెప్పఁబడును.

ఐదవ అవస్థకు ప్రమాణములేదని పలుకు వాక్యమును మనము గణింప నవసరములేదు. ఏలననగా అట్టి అవస్థ అప్పుడప్పుడే కలుగును. కాని తఱచుగా సంభవింపదు. ఇది సామాన్యానుభవముచేతను మఱియు ఆయుర్వేద విజ్ఞానము చేతను తెలియఁబడును. ఇది అప్పుడప్పుడు సంభవించును. ఇది ప్రత్యేకమైన అవస్థగా పరిగణింపఁబడును. ఇది సుషుప్తి మఱియు మరణావస్థల యొక్క సమ్మిశ్రణమగుటచే, ఇది ఐదవ అవస్థగా తలంపఁబడదు.

# 5. ఉభయ లింగాధికరణము

## (11-21 సూత్రములు)

## 3-2-11 న స్థానతోఽపి పరస్యోభయలింగం సర్వత్రహి

స్థానభేదమునుఁబట్టి పరబ్రహ్మమునకు రెండువిధములగు లక్షణము లుండుట పొసగదు. ఏలననగా అది భేదరహితమని శ్రుతి సర్వత్ర వచించి యున్నది.

న = కాదు, స్థానతః = స్థానభేదమునుఁబట్టి, అపి = కూడా, పరస్య= బ్రహ్మముయొక్క, ఉభయలింగం = ద్వివిధలక్షణములుఁగలది, సర్వత్ర = ప్రతిచోట, హి = ఏలననగా.

ఇప్పుడు సూత్రకారుడు బ్రహ్మముయొక్క స్వరూపమునుఁగూర్చి వివరించుచున్నాడు.

బ్రహ్మమునుఁగూర్చి ద్వివిధములగు వర్ణనలను శ్రుతులలో మనముఁ గాంచుచున్నాము. కొన్ని శ్రుతివాక్యములు బ్రహ్మము సవిశేషమనియు, మరికొన్ని శ్రుతి వాక్యములు బ్రహ్మము నిర్విశేషమనియు వర్ణించును. “సర్వకామః సర్వగంధః సర్వ రసః” (ఛాం.ఉ. 3-14-2). ఈ వాక్యము సవిశేషలింగములను సూచించును.

ఇఁక "అస్థూల మనణ్వహ్రస్వమదీర్ఘమ్" (బృ.ఉ. 3-8-8) ఈ వాక్యము బ్రహ్మముయొక్క నిర్విశేషలింగములను సూచించును.

ఉపాధులను కలిగియుండుట, కలిగి లేకుండుట ఈ రెండున్నూ బ్రహ్మమునకు నిజస్వరూపములా? లేక వీటి యందొకటి సత్యము మరియొకటి అసత్యమా? ఐతే ఏది సత్యము? అది సత్యమని చెప్పుటలోఁగల కారణమేమి?

పరబ్రహ్మము స్వయముగా ద్వివిధములగు లక్షణములను కలిగియుండదని ఈ సూత్రము నుడువును. బ్రహ్మము సవిశేషము - నిర్విశేషము మఱియు సోపాధికము - నిరుపాధికము రెండున్నూ ఐయున్నదని నీవు చెప్పజాలవు. ఏలననగా అది నిర్గుణమని సర్వత్ర వర్ణింపఁబడియున్నది.

ఒకే బ్రహ్మమునకు రెండింటిని ఆరోపించుట తగదు. ఏలననగా ఇది అనుభవమునకు విరుద్ధమైయున్నది. ఒకే పదార్థము, ఒకే సమయమునందు పరస్పర విరుద్ధములగు లక్షణములను కలిగియుండదు. ఒకే సమయమునందు బ్రహ్మము సగుణముగను, నిర్గుణముగను ఉండదు.

ఒక పుష్పము యొక్క ఎఱ్ఱఁదనము ఒక స్ఫటికమునందు ప్రతిబింబించిన మాత్రముచే స్ఫటికము యొక్క, స్వచ్ఛతకు భంగము కలుగదు. అదే విధముగా ఒక వస్తువు మరియొక వస్తువుతో సంబంధమును కలిగియున్నంత మాత్రముచే దాని స్వభావమునకు మార్పురాదు. స్ఫటికమునందు ఎఱుపుఁదనము నారోపించుట కేవలము అవివేకమే యగును. స్ఫటికము యొక్క ఎఱుపుఁదనము అసత్యమైయున్నది. ఒక పదార్థము తన నైజస్వరూపమును మార్చుకొనఁజాలదు. నైజస్వరూపము మారుటయనగా అది నశించుటయని అర్థము. అట్లే బ్రహ్మము యొక్క విషయమునందును పృథ్వ్యాద్యదులతో దానికిఁగల సంబంధము అజ్ఞానముచే ఏర్పడును. ఉపాధి కేవలము అజ్ఞాన స్వరూపమై యుండుటచే, ఉపాధిచే బ్రహ్మము యొక్క స్వరూపమునందు మార్పురాదు. ఒక పదార్థముపై ఎన్ని పరిస్థితులారోపింపఁ బడినను, ఆ పదార్థము యొక్క నైజస్వభావమెల్లప్పుడు శేషించియే యుండును. ఒకవేళ దానియందేదైన వికారమేర్పడినచో, దానికి కారణము నిశ్చయముగా అజ్ఞానమే యగును.

కావున బ్రహ్మము నిర్విశేషమని మనమంగీకరింపవలసి యుండును. ఏలననగా, "అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్" (కఠ. ఉ. 1-3-15) వంటి

బ్రహ్మమును నిరూపించు శ్రుతి వాక్యములన్నియును బ్రహ్మము నిర్విశేషమని ప్రబోధించుచున్నవి.

సవిశేష బ్రహ్మము కేవలము ఉపాసన నిమిత్తమై చెప్పబఁడినదే కాని, అది దాని నైజస్వరూపము కాదు.

## 3-2-12 న భేదా దితిచేన్న ప్రత్యేక మత ద్వచనాత్

శ్రుతియందు భేదము చెప్పబడుటచే అట్లుకాదని పలికినచో, అది సరికాదని మేము బదులు పలుకుదుము. ఏలననగా ప్రతిరూపమునకున్నూ శ్రుతి తద్భిన్నముగా నుడివియున్నది.

న = అట్లుకాదు, భేదాత్ = శాస్త్రములలో భేదము చెప్పఁబడుటచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = అట్లుకాదు, ప్రత్యేకమ్ = ప్రతియొక్క దానికి, అతద్వచనాత్ = తద్భిన్నముగా చెప్పబడుటచే.

పూర్వసూత్రమునకు ఒక ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపబడినది.

ఈ సూత్రమునందు శంకా సమాధానములు రెండున్నూ కలవు. "భేదాదితిచేత్" అనునది ఆక్షేపణ విభాగము. మఱియు "న ప్రత్యేక మతద్వచనాత్" అనునది సమాధాన విభాగము.

**పూర్వపక్షి ఇట్లనును :-** నానావిద్యలు బ్రహ్మముయొక్క వివిధ రూపములను సూచించును. బ్రహ్మము చతుష్పాదములను కలిగియున్నదనియు (ఛాం. ఉ. 3-18-1), షోడశకళలను కలిగియున్నదనియు (ప్ర. ఉ. 6-1), వామనుడనియు (కఠ, ఉ. 5-3), లోకత్రయ శరీరము గలఁవాడనియు (బృ. ఉ. 1-3-22) వైశ్వానరుడనియు (ఛాం. ఉ. 5-11-2) ను చెప్పబడినది. కావున బ్రహ్మము సవిశేషమై యున్నదని కూడా మనము అంగీకరింపవలసియుండును.

ఈ సూత్రము దీనిని ఖండించి "యశ్చాయమస్యాం పృథివ్యాం తేజోమయోఽమృతమయః పురుషోయశ్చాయ మధ్యాత్మం శారీరస్తే జోమయోఽమృతమయః పురుషోయమేవ సయోఽయమాత్మా" (బృ. ఉ. 2-5-1) వంటి వాక్యములలో బ్రహ్మముయొక్క ఉపాధికి సంబంధించిన ప్రతి యొక్క రూపము నిషేధింపబడినదని పలుకును. పృథివ్యాది సమస్త ఉపాధులలో ఒకే ఆత్మ ఉనికిని కలిగియున్నదని అట్టి వాక్యములు స్పష్టపఱచును. కావున కేవలము ఏకత్వమే కలదు. ఈ కారణముచే

బ్రహ్మము వేర్వేఱు రూపములను కలిగియుండుటను వేదములు ప్రబోధించుటలేదని తెలియనగును.

ప్రతివాక్యమునందు తాదాత్మ్యత కూడా రూఢి పఱుపఁబడినది. ఏకత్వమే పరమ సత్యమై యున్నది. ఉపాసనకై విభేదము చెప్పఁబడినది. రూపము సత్యము కాదనియు, నిజమునకు కేవలము ఒకేయొక రూపరహితమగు సారతత్త్వమున్న దనియును శ్రుతి నుడువుచున్నది.

## 3-2-13 అపి చైవ మేకే

ఇంతేకాకుండా మరికొందఱిట్లు ప్రబోధింతురు.

అపి = కూడా, చ = ఇంతేకాకుండా, ఏవం = ఇట్లు, ఏకే = కొందఱు.

11వ సూత్రమును బలపఱచుటకై మరియొక వాదమొసంగబడినది.

నానాత్వము సత్యముకాదని మరికొన్ని వైదిక శాఖలు స్పష్టముగా ప్రబోధించును. భేదమును దర్శించువారిని అవి కచ్చితముగా ఖండించును. "మనసై వేదమాప్తవ్యం నేహనా నాస్తి కించన, మృత్యోః సమృత్యుంగచ్ఛతి య ఇహనానేవ పశ్యతి" (కఠ.ఉ. 2-1-11). మనసైవాను ద్రష్టవ్యం నేహనాస్తి కించన, మృత్యోస్సమృత్యుమాప్నోతి య ఇహనానేవ పశ్యతి" (బృ.ఉ.4-4-19).

ఇతర శాఖలు కూడా "భోక్తాభోగ్యం ప్రేరితారంచ మత్వా సర్వం ప్రోక్తం త్రివిధం బ్రహ్మమేతత్" (శ్వే.ఉ. 1-2) భోక్త, భోజ్యము మఱియు ప్రేరకుడు సమస్తము బ్రహ్మముయొక్క త్రివిధ రూపములని నుడువుచున్నవి.

## 3-2-14 అరూపవ దేవహి తత్ప్రధానత్వాత్

నిశ్చయముగా బ్రహ్మము రూపరహితమనియే బ్రహ్మమునుఁగూర్చి ప్రబోధించు శ్రుతివాక్యములన్నింటికి ముఖ్యతాత్పర్యమై యున్నది.

అరూపవత్ = రూపరహితము, ఏవ = నిశ్చయముగా, హి = ఏలననగా, తత్ప్రధానత్వాత్ = అదియే ముఖ్యతాత్పర్యమగుటచే.

11వ సూత్రమును బలపఱచుటకై మరియొక వాదమొసంగఁబడినది.

బ్రహ్మము రూపరహితమని మనము నిశ్చయముగా అంగీకరింపవలసి యున్నది. ఏల? శ్రుతులయొక్క ముఖ్యతాత్పర్యమిదియే యగుటచే శ్రుతు లిట్లు

నుడువుచున్నవి. "అస్థూలమనణ్వ హ్రస్వమదీర్ఘమ్" (బృ.ఉ. 3-8-8) "అశబ్దమ స్పర్శమ రూపమవ్యయమ్" (కఠ.ఉ. 1-3-15) "ఆకాశోవై నామ నామ రూప యోర్నిర్వహితాతే యదంతరా తద్బ్రహ్మ" (ఛాం. ఉ. 8-14-1) దివ్యోహ్యామూర్తః పురుషః సబాహ్యాభ్యంతరోహ్యజః" (ముం. ఉ. 2-1-2). "తదేతద్బ్రహ్మ పూర్వమన పరమనంతరమ బాహ్యామయమాత్మా బ్రహ్మ సర్వానుభూః" (బృ.ఉ. 2-5-19).

ఈ శ్రుతి వాక్యములు బ్రహ్మమును రూపరహితముగా వర్ణించియున్నవి. ఒక వేళ బ్రహ్మము రూపసహితమని అర్థమొనర్చుకొనవలసియున్నచో, అది రూపరహితమని వర్ణించు శ్రుతివాక్యములు అర్థరహితములగును. శ్రుతులన్నింటికి ముఖ్య తాత్పర్యమొకటి కలదు. ఇంతే కాకుండా సవిశేష బ్రహ్మమునుఁగూర్చి వర్ణించినట్టి ఇతర వాక్యములు బ్రహ్మముయొక్క స్వరూపమును సూచింపవు. కాని బ్రహ్మము యొక్క ఉపాసనా విధానముఁగూర్చి వర్ణించును.

కావున బ్రహ్మము రూపరహితమైయున్నది. ఉత్తర శ్రుతివాక్యములు పూర్వశ్రుతి వాక్యములను ఖండింపనంతవరకు వాటిని మన మంగీకరింపవలసి యుండును. బ్రహ్మమే ప్రధానమైయున్న శ్రుతివాక్యములు ఇతర వాక్యములకంటె మిక్కిలి శక్తివంతములై యుండును. ఈ కారణముచేతనే బ్రహ్మము రూపరహితమని ముఖ్యమైన శ్రుతివాక్యములు నుడువుచున్నవి.

రూపవర్ణములు భూతములచే ఉత్పన్నములగును. బ్రహ్మము వీటన్నింటికి అతీతమైయున్నది. మఱియు భూతములకు భిన్నమైయున్నది. కావున అతడు "అరూపమవర్ణమ్" అని చెప్పఁబడును. అతడు సూక్ష్మోపాదాన కారణము మఱియు అధిష్ఠానదేవత కతీతుడగుటచే అతనియందు మూర్తిమంతములగు రూపవర్ణము లుండవు.

## 3-2-15 ప్రకాశవ చ్చావైయర్థ్యాత్

మఱియు రూపముఁగల పదార్థముల సంబంధముచే ప్రకాశము రూపసహితముగా కానఁబడునట్లు బ్రహ్మముకూడా ఉపాధిసంబంధముచే రూపమును ధరించునట్లు కానఁబడును. ఏలననగా బ్రహ్మమునకు రూపము నారోపించు శ్రుతులు అర్థ రహితములు కావు.

ప్రకాశవత్ = ప్రకాశమువలె, చ = మఱియు, అవైయర్థ్యాత్ = అర్థ రహితములు కాకుండుటచే.

11వ సూత్రమును బలపఱచునట్టి మరియొక వాదమొసంగబడినది.

"చ" యను శబ్దముచే పైన పేర్కొఁనబడిన సంశయము నివారింపఁబడును.

ఒకవేళ బ్రహ్మము నిరాకారమైయున్నచో, బ్రహ్మముయొక్క రూపమును వర్ణించునట్టి శ్రుతి వాక్యములన్నియును అర్థరహితములు మఱియు అనావశ్యకములగును. అప్పుడు సవిశేష బ్రహ్మమునుఁగూర్చి నుడివినట్టి ఉపనిషత్తులన్నియు నిష్ప్రయోజనములగును. ఇట్టి బూటకమైన బ్రహ్మోపాసనచే బ్రహ్మలోకము ఎట్లు ప్రాప్తించును?

వాటికి కూడా ఒక ప్రయోజనమున్నదని ఈ సూత్రము వివరించును. సూర్యకాంతికి రూపములేదు. కాని అది ఒక గదిలోనికి ప్రవేశించు రంధ్రమునుఁ బట్టి పెద్దగను, చిన్నగను కానఁబడును. ఐనను అది ఆ గదిలోని అంధకారమును తొలగించుటకు శక్తివంతమై యుండును. అదేవిధముగా నిరాకారమైయున్న బ్రహ్మము పృథ్వి, శరీరము ఇత్యాది ఉపాధుల కారణముచే రూపమును కలిగియున్నట్లు కానఁబడును. సూర్యకాంతి ఒక వ్రేలు, లేక మరియొక ఉపాధితో సంబంధమును కలిగి యున్నప్పుడు తదనుసారముగా నిలువుగనో, వంకరగనో కానబడునట్లు; బ్రహ్మమున్నూ పృథివ్యాది ఉపాధిసంబంధముచే ఆయా రూపములను ధరించునట్లుగా కానఁబడును. ఇట్టి మిథ్యాబ్రహ్మముయొక్క ఉపాసనచే సంపూర్ణ దృష్టికోణము ననుసరించి మిథ్యయైనట్టి బ్రహ్మలోకము పొందఁబడును.

కావున ఈ శ్రుతివాక్యములు అర్థరహితములు కావు. వాటికి నిశ్చయముగా ఒక ప్రయోజనమున్నది. వేద విభాగములన్నియును సమానముగా సప్రమాణములై యున్నవి. కావున వాటన్నింటికొక ఉద్దేశ్యము, లేక తాత్పర్యము కలదు.

ఏది ఎట్లయినను దీనిచే బ్రహ్మము ఉపాధిసహితమైయున్నను, అది ద్వివిధలక్షణములను కలిగియుండదను సిద్ధాంతమునకు విరోధములేదు. ఏలననగా కేవలము ఉపాధికారణముచే తత్త్వసారలక్షణమునకు విలక్షణము సంభవింపదు, ఇంతేకాకుండా ఉపాధులన్నియు అజ్ఞానజనితములైయున్నవి.

## 3-2-16 ఆహచ తన్మాత్రమ్

మఱియు బ్రహ్మము కేవలము ప్రజ్ఞాన ఘనమని శ్రుతి నుడువుచున్నది.

ఆహ = శ్రుతి నుడువుచున్నది, చ = మఱియు, తన్మాత్రమ్ = ప్రజ్ఞాన ఘనమాత్రము.

తన్మాత్రలోని "మాత్ర" యనుశబ్దము కేవలత్వమును సూచించును.

బ్రహ్మము విజ్ఞానఘనమని శాస్త్రము వచించుచున్నది. "స యథా సైంధవఘనో నంతరో బాహ్యః కృత్స్నోరసఘన ఏవైవం వా అరేయ మాత్మా నంతరో బాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ (బృ. ఉ. 4-5-13). పరిశుద్ధమైన జ్ఞానమే దానికి స్వభావమైయున్నది. ఒక ఉప్పుగడ్డకు అంతర్బాహ్యములు లేక ఒకే యొక ఉప్పందనమును ఎట్లు కలిగియుండునో, అట్లే బ్రహ్మమునందును అంతర్బాహ్యములు లేక అది విజ్ఞాన ఘనస్వరూపమై యుండును.

## 3-2-17 దర్శయతి చాథో అపిస్మర్యతే

శ్రుతియందును, స్మృతియందును ఇట్లు చెప్పఁబడినది.

దర్శయతి = శ్రుతి చెప్పును, చ = మఱియు, అథో = ఈ విధముగా, అపి = కూడా, స్మర్యతే = స్మృతియు నుడువును.

11వ సూత్రమును బలపఱచు వాదమింకను కొనసాగుచున్నది.

బ్రహ్మము నిర్గుణమనియు, దానికేలాటి ఇతర లక్షణములు లేవనియు శ్రు తి వాక్యములు నిరంతరము నిరూపించుచున్నవి. "అథాత ఆదేశోనే తినేతి" (బృ. ఉ. 2-3-6). ఈ "నేతినేతి"కి మించిన మరియొక వర్ణన సముచితము కాదు.

కేనోపనిషత్తిట్లు నుడువును. "అన్యదేవత ద్విదితాదథో అవిదితాదధి" (1-3) తైత్తిరీయమిట్లు పలుకును. "యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (2-4-1).

బాష్కలుడు మఱియు బాధ్వుని మధ్య జరిగిన సంభాషణను ప్రబోధించు శ్రుతివాక్యము కూడా ఇట్టి తాత్పర్యమునే కలిగియున్నది. బాష్కలుడు బాధ్వుని బ్రహ్మము యొక్క స్వరూపమునుఁగూర్చి తెలుపుమని అడిగెను. బాధ్వుడు బాష్కలునికి దానినిఁగూర్చి మౌనము ద్వారా బోధించెను. బాధ్వుడు బాష్కలునితో "ఓ మిత్రుడా!

బ్రహ్మమునుఁగూర్చి నేర్చుకొనుము” అని పలికి మౌనముద్రను వహించెను. అప్పుడాతడు రెండవమాఱు, మూడవమాఱు అడుగగా బాధ్వుడిట్లు పలికెను. “నేను నీకు నిశ్చయముగా ప్రబోధించుచున్నాను. కాని నీవు అర్థమొనర్చు కొనుటలేదు. మౌనమే బ్రహ్మము.”

ఒకవేళ బ్రహ్మమునకు రూపమున్నచో “నేతినేతి” వాక్యముద్వారా సమస్తమును నిషేధించు ఆవశ్యకత యుండదు.

బ్రహ్మముయొక్క సమస్త ఇతర లక్షణములను నిషేధించునట్టి స్మృతి వాక్యములు కూడా దీనినిఁ గూర్చియే ప్రబోధించుచున్నవి. “జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యజ్జ్ఞాత్వామృత మశ్నుతే, అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే” (గీత. 13-12) “అవ్యక్తోఽయమ చింత్యోఽయమ వికార్యోఽయముచ్యతే” (గీత. 2-25)

మరియొక స్మృతివాక్యము కూడా ఇట్లే నుడువుచున్నది. శ్రీహరి నారదునితో ఇట్లు పలికెను. “మయాహ్యేషామయా సృష్టాయన్మాం పశ్యసి నారద, సర్వభూత గుణైర్యుక్తం నైవమాం జ్ఞాతుమర్హసి”

## 3-2-18 అతఏవ చోపమా సూర్యకాదివత్

ఈ కారణము చేతనే బ్రహ్మము సూర్యుని ప్రతిబింబము ఇత్యాదులతో పోల్చఁబడినది.

అత ఏవ = ఈ కారణముచేతనే, చ = మఱియు, ఉపమా = దృష్టాంతము, సూర్యకాదివత్ = సూర్యుని ప్రతిబింబాదుల వలె.

11వ సూత్రమును బలపఱచు వాదమింకను కొనసాగుచున్నది.

బ్రహ్మముతో పోల్చఁబడిన దృష్టాంతములచేత కూడా బ్రహ్మము నిరాకారమని రూఢియగుచున్నది. బ్రహ్మము ప్రజ్ఞానఘనము, భేద వివర్జితము, మనోవాగతీతము, నిరాకారము, అఖండము మఱియు సర్వలక్షణ విలక్షితమగుట చే శ్రుతి అతని రూపములను నీటియందు ప్రతిబింబింపఁబడిన ప్రతిబింబాదులతో పోల్చినది. అనగా ఈ రూపములు ఉపాధుల కారణముచే ఏర్పడుటచే ఇవి అసత్యములని చెప్పఁబడినది. “ఏక ఏవహి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః, ఏకధా బహుధాచైవ దృశ్యతే జల చంద్రవత్”

## 3-2-19 అంబువ దగ్రహణాత్తున తథాత్వమ్

కాని బ్రహ్మమునందు నీటివలె రెండవ పదార్థము లేకుండుటచే ఈ దృష్టాంతము సరికాదు.

అంబువత్ = నీటివలె, అగ్రహణాత్ = ఇది అంగీకరింపc బడకుండుటచే, తు = కాని, న = కాదు, తథాత్వమ్ = అట్టి దృష్టాంతము.

పూర్వసూత్రమునకు పూర్వపక్షి ఒక ఆక్షేపణను పలుకుచున్నాడు.

పూర్వసూత్రములోని దృష్టాంతము సరికాదని పూర్వపక్షి ఒక ఆక్షేపణ చెప్పుచున్నాడు. పై దృష్టాంతమునందు సూర్యుడు జలమునకు భిన్నుడై యున్నాడు. సూర్యునికొక రూపమున్నది. అదియొక భౌతికపదార్థము. నీరు సూర్యునికి భిన్నమైయున్నది. మఱియు సూర్యునికి దూరమునందున్నది కావున సూర్యుడు నీటి యందు ప్రతిబింబించుటకు అవకాశమున్నది. కాని బ్రహ్మము నిరాకారము మఱియు సర్వ వ్యాపకమై యున్నది.

అదియొక భౌతిక పదార్థముకాదు. సమస్తము దానితో తాదాత్మ్యము నొంది యున్నది. దానియొక్క ప్రతిబింబమును ఆకళించుకొనుటకై దానికి భిన్నముగా మరియొక స్థానమునందు ఏలాటి ఉపాధియున్నా లేదు. ఉపాధులకు భిన్నముగా దానికి ఉనికి యున్నట్లు కానcబడదు.

బ్రహ్మము సర్వవ్యాపకము. కావున ఏ పదార్థము కూడా దానికి దూరము నందుండదు. సూర్యుడు నీటికి దూరమునందుండుటచే, అతడు దానియందు ప్రతిబింబించును. కాని బ్రహ్మమునకు మఱియు ఇతర పదార్థమునకు మధ్య దూరముండcజాలదు. కావున ఈ సందర్భమునందు ప్రతిబింబము అర్థరహితమగు విషయమగును.

కావున దృష్టాంతములు సమాంతరములై లేవు. పోలికయందు దోషమున్నది.

తదనంతర సూత్రము ఇట్టి ఆక్షేపణను తొలగించును.

## 3-2-20 వృద్ధిహ్రాస భాక్త్వమంతర్భావా దుభయసామంజస్యాదేవమ్

పరబ్రహ్మము ఉపాధుల అంతర్భాగము నందుండుటచే, అది వాటి వృద్ధి క్షయములయందు పాల్గొనును. కావున ఈ రెండు విషయములు పోల్చుటకు యోగ్యములై యుండుటచే, ఈ పోలిక సమంజసమే యగును.

వృద్ధిహ్రాసభాక్త్వమ్ = వృద్ధిక్షయములలో పాల్గొనుట, అంతర్భావాత్ = అంతర్భాగమునందుండుటచే, ఉభయ సామంజస్యాత్ = రెండు విషయములు యోగ్యములై యుండుటచే, ఏవం = ఈ విధముగా.

పూర్వసూత్రములోని ఆక్షేపణ ఖండింపఁబడినది.

సూర్యప్రతిబింబ దృష్టాంతమును దోగాడునట్లు తీసుకొనరాదు. రెండు పదార్థములు పోల్చఁబడినప్పుడు వాటియందు సర్వసామాన్యమైయున్న ప్రత్యేక విషయము దృష్టియందుంచుకొనఁబడును. కాని రెండింటికి సంపూర్ణమగు సమానత్వము చెప్పఁబడదు. ఒకవేళ అట్లు చెప్పఁబడునేని, పోలికకు కారణమైన ప్రత్యేక సంబంధము సమాప్తమగును. అన్ని విషయములలో సంపూర్ణమగు పోలిక యుండునేని, అది ఏకత్వమునే సూచించుననుట నిశ్చయము.

ప్రతిబింబమును వృద్ధిక్షయములనొనర్చి వక్రింపఁజేయు విషయమునందే ఈ పోలిక చెప్పఁబడినది. నీటి వైశాల్యము పెంపొందినప్పుడు సూర్యుని ప్రతిబింబము విస్తరించును. నీరు తగ్గిపోయినప్పుడా ప్రతిబింబము ముడుచుకొని పోవును. నీరు చలించినప్పుడా ప్రతిబింబము వణుకుచుండును. నీరు విభజింపఁబడినప్పుడు ప్రతిబింబము కూడా విభజింపఁబడును. ఈ విధముగా అది నీటి యొక్క సమస్త లక్షణములయందు మఱియు పరిస్థితులయందు పాల్గొనును. కాని నిజమైన సూర్యుడెల్లప్పుడు ఒకే విధముగా నుండును.

అదేవిధముగా నిజమునకు బ్రహ్మము నిర్వికారమైయున్నను, తాను వసించియున్నట్టి శరీరాది ఉపాధులయొక్క లక్షణములను, దశలను కలిగియున్నట్లు తోచును. అది వాటితోపాటు వృద్ధినొందుచున్నట్లు మఱియు క్షీణించుచున్నట్లు కానఁబడును. సర్వసామాన్యమగు ప్రత్యేక లక్షణములు మాత్రము రెండు పదార్థములయందు పోల్చఁబడుటచే ఈ పోలికయందు ఆక్షేపణకు తావులేదు.

పై దృష్టాంతములోని రెండు విషయములకువలె ఈ పోలికయు నిశ్చయముగా నిర్దోషమైయున్నది.

## 3-2-21 దర్శనాచ్చ

మఱియు శ్రుతి ప్రమాణముచేత కూడా

దర్శనాత్ = శ్రుతి ప్రమాణముచే, చ = కూడా

19వ సూత్రములోని ఆక్షేపణను ఖండించుటకై మరియొక కారణము చెప్పఁబడుచున్నది.

ఇంతేకాకుండా పరబ్రహ్మము శరీరాది ఉపాధులలో ప్రవేశించునని శ్రుతి నుడువుచున్నది. "పురశ్చక్రే ద్విపదః పురశ్చక్రే చతుష్పదః పురః సపక్షీ భూత్వాపురః పురుష ఆవిశత్" (బృ.ఉ. 2-5-18)" అనేన జీవేనాత్మనానుప్రవిశ్య" (ఛాం. ఉ . 6-3-2) ఈ కారణములన్నింటిచే 18వ సూత్రములోని దృష్టాంతము దోషయుక్తముకాదు.

కావున బ్రహ్మము నిరాకారమనియు, అఖండమనియు, ప్రజ్ఞానఘనమనియు మఱియు భేదవివర్జితమనియును రూఢియగుచున్నది. శ్రద్ధా భక్తులతో సగుణ బ్రహ్మమునుపాసించువారికి క్లేశ శమనమో, శక్తి సంచయమో, లేక క్రమ ముక్తియో కలుగునని శ్రుతినుడువుచున్నది.

# 6. ప్రకృతైతావత్త్వాధికరణము

## (22-30 సూత్రములు)

## 3-2-22 ప్రకృతైతావత్త్వం హిప్రతిషేధతితతో బ్రవీతిచభూయః

"నేతినేతి"యను శబ్దముచే ఇంతవరకు చెప్పఁబడినదంతయు నిషేధింపఁబడినది. తదనంతరము శ్రుతి దీనికి మించిన దానినిఁ గూర్చి నుడువును.

ప్రకృతైతావత్త్వం = ఇంతవరకు సూచింపఁబడినది. హి = ఏలననగా, ప్రతిషేధతి = నిషేధించును, తతః = దీనికిమించి, బ్రవీతి = పలుకును, చ = మఱియు, భూయః = ఇంకను ఎక్కువగా.

ఈ సూత్ర సమూహమునందు కూడా సూత్రకారుడు నిర్విశేషబ్రహ్మమునుఁ గూర్చి అభివర్ణించుచున్నాడు.

శ్రుతి ఇట్లు నుడువును "ద్వేవావ బ్రహ్మణోరూపే మూర్తం చైవామూర్తం చ" (బృ.ఉ. 2-3-1).

బ్రహ్మము యొక్క పృథ్వీ జలాగ్ని సమన్వితమగు స్థూలరూపమును మఱియు వాయువు, ఆకాశ సమన్వితమగు సూక్ష్మరూపమును వర్ణించిన అనంతరము శ్రుతి తుట్టతుదకిట్లు వచించును. "అథాత ఆదేశో నేతినేతి నహ్యేతస్మాదితి నేత్యన్యత్పరమస్తి" (బృ.ఉ. 2-3-6).

ఇచ్చట "నేతినేతి" యను శబ్దద్వయముచే ప్రపంచము, బ్రహ్మము రెండున్నూ నిషేధింపఁబడునా? లేక, కేవల మీ రెండింటియందొకటి మాత్రము నిషేధింపఁబడునా? యనెడి సంశయమేర్పడును.

ఈ రెండున్నూ నిషేధింపఁబడుటచే అసత్యమైయున్న బ్రహ్మము, మిథ్యయైన విశ్వమున కాధారము కాఁజాలదని పూర్వపక్షి పలుకును. ఇది మనలను శూన్యవాదమువైపు గొంపోవును. ఒకవేళ ఒకటి మాత్రము నిషేధింపఁబడినచో, బ్రహ్మమే నిషేధింపఁబడినదని పలుకుట ఉచితమగును. ఏలననగా అది చూడఁబడఁజాలకుండుటచే, దాని అస్తిత్వము సంశయాస్పదమై యున్నది. కాని అనుభవసిద్ధమై యుండుటచే ఈ విశ్వముయొక్క ఉనికియందు సందేహము లేదు.

ఈ సూత్రము పూర్వపక్షి యొక్క ఈ దృష్టికోణమును ఖండించును. "నేతినేతి" యనెడి వాక్యాంశముచే రెండున్నూ నిషేధింపఁబడుట అసంభవము. ఏలననగా దీనిచే శూన్యవాదమునకు ఆస్కారమేర్పడును. "నేతి నేతి" యను శబ్దములు సవిశేష మఱియు నిర్విశేష బ్రహ్మమును నిషేధించునని చెప్పఁజాలము. ఏలననగా దీనిచే శూన్యవాదము సూచింపఁబడును.

శ్రుతి బ్రహ్మమును నిరూపించును. ఒకవైపు బ్రహ్మమునుఁగూర్చి ప్రబోధించుచు, మరియొక్కవైపు దానిని నిషేధించుటచే కలుగు ప్రయోజనమేమి? అడుసు ద్రొక్కనేల? కాలు కడుగనేల? కావున బ్రహ్మము మనోవాగతీతము. శాశ్వతము శుద్ధము మఱియు స్వతంత్రమై యున్నది. అది ప్రజ్ఞానఘనమై యున్నది. కావున శ్రుతి సవిశేష బ్రహ్మమును మాత్రము నిషేదించును. కాని స్వయముగా బ్రహ్మమును కాదు.

"నేతి నేతి" యను శబ్దముచే ఇంతవరకు వర్ణింపఁబడినట్టి బ్రహ్మము యొక్క స్థూలసూక్ష్మ రూపములు మాత్రము నిషేధింపఁబడును.

బ్రహ్మము నిషేధింపఁబడఁజాలదు. ఏలననగా దీనిచే "బ్రహ్మతే బ్రవాణి" (బృ.ఉ. 2-1-1) యనెడి ఉపక్రమమునకు విరోధమేర్పడును., "అసన్నేవ స భవతి, అసద్బ్రహ్మేతి వేదచేత్" (తై. ఉ. 2-6-1) అనెడి భయమును నిరాదరణ మొనర్చినట్లగును. "అస్తీత్యేవోప లబ్ధవ్యః" (కఠ. ఉ. 2-6-13) అనెడి నిశ్చయ మును భంగపఱచినట్లగును. మఱియు నిశ్చయముగా వేదాంత సర్వస్వమును కించపఱచినట్లగును.

బ్రహ్మము మనోవాగతీతమని చెప్పఁబడినప్పుడు, బ్రహ్మమునకు ఉనికిలేదని నిశ్చయింపరాదు. ఏలననగా "బ్రహ్మవిదాప్నోతి పరమ్" "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" (తై.ఉ. 2-1-1) అని శ్రుతి బ్రహ్మముయొక్క ఉనికిని నిరూపించి యున్నది. ఆకస్మికముగా అది అభావమునుఁగూర్చి ప్రబోధించినదనుట అసమంజసము. ఏలననగా "ప్రక్షాళనాద్ధిపంకస్య దూరాదస్పర్శనం వరమ్" అనెడి లోకోక్తి కలదు. కావున "యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ" (తై.ఉ. 2-4-1) అనెడి శ్రుతి వాక్యముచే బ్రహ్మము ప్రతిపాదింపఁబడును.

బ్రహ్మముపై ఆరోపింపఁబడిన సమస్త రూప ప్రపంచమును "నేతినేతి" యను శబ్దములు నిషేధించును. కాని సమస్త మిథ్యా ప్రపంచమున కాధారమైయున్న బ్రహ్మమును నిషేధింపవు. అది బ్రహ్మముయొక్క మూర్తామూర్తస్వరూపమును నిషేధించును. ఇది అధ్యాయారంభమునందు దేవతలు మఱియు శరీరమునుఁగూర్చి వర్ణింపఁబడినప్పుడు సూచింపఁబడినది. మొదటి రూపముచే సృష్టింపఁబడిన రెండవ రూపము మానసికవృత్తి రూపమునందుండును. అమూర్త స్వరూపముయొక్క సారమే పురుషశబ్దముచే సూచింపఁబడినది.

నిషేధద్వయము బ్రహ్మము యొక్క మూర్తామూర్త స్వరూప ద్వయమును నిషేధింపవచ్చును. లేక మొదటి "నేతి" చే భౌతిక పదార్థ సంఘాతము మఱియు రెండవ "నేతి"చే మానసిక వాసనాసంఘాతము నిషేధింపఁబడవచ్చును. లేని యెడల సంకల్పింపఁబడిన దేదియును బ్రహ్మముకాదను విషయమును బలపఱచుటకు పునరుక్తి చెప్పఁబడియుండవచ్చును.

శ్రుతి బ్రహ్మముయొక్క రూపమును నిషేధించును. కాని స్వయముగా బ్రహ్మమును నిషేధింపదు. అది నేతిద్వయముచే స్థూల సూక్ష్మ శరీరములను నిషేధించును. లేక అది భూతములను మఱియు వాసనలను నిషేధించును. లేదా పునరుక్తిచే ఇట్టి సమస్త ఆరోపణల యొక్క నిషేధము సూచింపఁబడును. కావున శ్రుతి బ్రహ్మముపై ఆరోపింపఁబడిన ప్రపంచమును నిషేధించునేఁగాని, స్వయముగా బ్రహ్మమును నిషేధింపదు.

నేతినేతి యను నిషేధానంతరము శ్రుతి "సత్యస్యసత్యమ్" అనెడి నామధేయముల ద్వారా బ్రహ్మముయొక్క వాస్తవమైన లక్షణములనుఁగూర్చి వర్ణించును. ఇంతేకాకుండా ఈ నిషేధానంతరము అది "అన్యత్పరమస్తి" - "సత్యస్యసత్యమ్" అనెడి వాక్యాంశముల ద్వారా బ్రహ్మము మాత్రమే నిజమైన ఉనికిని కలిగియున్నదనియు, అది ఈ మిథ్యాప్రపంచమున కాధారమైయున్న దనియును సూచింపఁబడును.

పూర్వసూత్రములలో వర్ణింపఁబడినట్టి బ్రహ్మముయొక్క పరిచ్ఛిన్నతను "నేతినేతి" శబ్దములు నిషేధించును. కేవలము మూర్తామూర్త ప్రపంచము బ్రహ్మము కాదని అది నుడువును. అది దానిని అతిశయించి యున్నది. "ఇతి" యను శబ్దము ఇప్పుడిప్పుడే పేర్కొనఁబడినట్టి బ్రహ్మము యొక్క రూపద్వయమును సూచించును. ఇదియే ప్రస్తుత చర్చనీయాంశమై యున్నది. కావున పూర్వవాక్యములలో ముఖ్యమైన అంశము కానట్టి బ్రహ్మమునుఁగూర్చి ఇది సూచింపదు.

బ్రహ్మము అనుభవింపబడకుండుటచే బ్రహ్మమే నిషేధింపఁబడినదను ఆక్షేపణ నిస్సారమైయున్నది. ఇది అసమంజసము. ఏలననగా మనచేత సర్వసామాన్యముగా అనుభవింపఁబడని దానినిఁగూర్చి ప్రబోధించుటయే

శ్రుతి యొక్క లక్ష్యమైయున్నది. లేనిచో దాని ప్రబోధము అనావశ్యకమగును.

కావున "నేతినేతి" యను వాక్యాంశము బ్రహ్మము తప్ప శేషించిన సమస్త పదార్థములను నిషేధించునని మనము నిశ్చయింపవచ్చును.

## 3-2-23 తదవ్యక్త మాహహి

ఆ బ్రహ్మము అవ్యక్తమని శ్రుతి నుడువుచున్నది.

తత్ = ఆ బ్రహ్మము, అవ్యక్తమ్ = వ్యక్తముకానిది, ఆహ = శ్రుతి నుడువును,

హి = ఏలననగా

బ్రహ్మముయొక్క లక్షణము చర్చింపఁబడినది.

ఇది పూర్వపక్షి సూత్రము.

బ్రహ్మము ఇంద్రియాతీతమని శ్రుతి నుడువుచున్నది. ఒకవేళ బ్రహ్మమునకు ఉనికియున్నచో అది ఇంద్రియములకు, లేక మనస్సుకు ఏల గోచరింపదు? ఏలననగా అది సూక్ష్మాతి సూక్ష్మమై యున్నది. మఱియు గ్రాహ్యపదార్థములన్నింటికి సాక్షియై యున్నది. జీవులు అజ్ఞానముచే ఆవరింపఁబడియున్నారు. కావున వారు బ్రహ్మమును చూడఁజాలకున్నారు. శ్రుతి ఇట్లనును. "న చక్షుషా గృహ్యతే నాపివాచా నాన్యైర్దేవై స్తపసా కర్మణావా" (ముం. ఉ. 3-1-8). "స ఏష నేతినేత్యాత్మాஉ గృహ్యోనహిగృహ్యతే" (బృ. ఉ. 3-9-26). "యత్తదద్రేశ్యమగ్రాహ్యమ్" (ముం. ఉ. 1-1-6).

"యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేஉ నాత్మ్యేஉ నిరుక్తే నిలయనే" (తై. ఉ. 2-7-1). "అవ్యక్తో உ యమచింత్యోஉ యమవికార్యోஉ యముచ్యతే" (భ. గీ. 2-25) అనెడి స్మృతి వాక్యములు కూడా ఇట్లే నుడువుచున్నవి.

## 3-2-24 అపి చ సంరాధనే ప్రత్యక్ష్యాను మానాభ్యామ్

ఇంతేకాకుండా బ్రహ్మము ధ్యాననిష్ఠచే పొందఁబడునని శ్రుతి స్మృతులు వాకొనుచున్నవి.

అపి చ = ఇంతేకాకుండా, సంరాధనే = ధ్యాననిష్ఠయందు, ప్రత్యాక్షానుమానాభ్యామ్ = శ్రుతి స్మృతులచే.

బ్రహ్మముయొక్క లక్షణముఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

"అపి" యను శబ్దముచే పూర్వపక్షము తొలగింపఁబడును. ఇది నివారణార్థమునందు ప్రయోగింపఁబడినది. పై పూర్వపక్షము గణింపఁ దగినదికాదు.

బ్రహ్మము మిక్కిలి సూక్ష్మమైయున్నది. కావున అది భౌతికచక్షువులతో చూడఁబడదు. అది ఇంద్రియాతీతము. కాని యోగులు తమ శుద్ధమైన అంతఃకరణమునందు దానిని దర్శింతురు. ఒకవేళ బ్రహ్మము వ్యక్తము కాకున్నచో, దానిని మనము తెలిసికొనఁజాలము. అందువలన మనము మోక్షమునుఁ బడయఁజాలము.

అంతఃకరణశుద్ధి లేనివారికి మాత్రము బ్రహ్మము తెలియఁబడదు. కాని హృదయ పారిశుద్ధ్యమునుఁ బడసినవారి సమాధిస్థితియందు వారి అజ్ఞానము నిర్మూలింపబడుటచే వారు బ్రహ్మసాక్షాత్కారమునుఁ బడయుదురని ఈ సూత్రము మనకు తెలుపును.

దీనిని శ్రుతి స్మృతులిట్లు నిరూపించును. "పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూస్తస్మాత్పరాఙ్ పశ్యతినాంతరాత్మన్, కశ్చిద్ధీరః ప్రత్యగాత్మా నమైక్షదావృత్త చక్షురమృతత్వమిచ్ఛన్" (కఠ. ఉ. 4-1). "జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వస్తతస్తుతం పశ్యతే నిష్కళంధ్యాయమానః" (ముం. ఉ. 3-1-8).

స్మృతియున్నూ ఇదే విషయము నుడువుచున్నది. "యం వినిద్రా జితశ్వాసాః సంతుష్టాః సంయతేంద్రియాః జ్యోతిః పశ్యంతి యుంజానాస్తస్మై యోగాత్మనే నమః యోగినస్తం ప్రపశ్యంతి భగవంతం సనాతనమ్"

## 3-2-25 ప్రకాశాదివచ్చా వైశేష్యం ప్రకాశశ్చ కర్మణ్యభ్యాసాత్

మఱియు భౌతిక ప్రకాశాదులయందు భేదములేనట్లే, బ్రహ్మము మఱియు కార్యబ్రహ్మమునందు భేదములేదని శ్రుతి పునఃపునః పలుకుచుండుటచే.

ప్రకాశాదివత్ = ప్రకాశాదులవలె, చ = మఱియు, అవైశేష్యమ్ = అభేదము, ప్రకాశః = బ్రహ్మము, చ = మఱియు, కర్మణి = కర్మయందు, అభ్యాసాత్ = శ్రుతి పునఃపునః పలుకుచుండుటచే.

బ్రహ్మము యొక్క లక్షణములనుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

జీవబ్రహ్మైక్యము వివరింపఁబడినది. ప్రకాశము, ఆకాశము, సూర్యుడు నిజమునకు తమ స్వాభావికమగు అభేదమును పోషించుకొన్నను వ్రేళ్ళు, పాత్రలు, జలములనెడి ఉపాధులకారణముచే అవి భిన్నముగా కానఁబడునట్లు, సమస్త ఆత్మసమైక్యత స్వాభావికము మఱియు మూలభూతమైయున్నను, ఉపాధుల కారణముచే ఆత్మయందు భిన్నత్వము గోచరించును. జీవాత్మ నిజమునకు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందియున్నను, అజ్ఞాన కారణముచే అతడు బ్రహ్మమునకు భిన్నునిగా తలంచును.

ప్రకాశాదులవలె స్వయం ప్రకాశమగు బ్రహ్మము ఉపాసనాదులయందు

విభిన్నముగా కానఁబడును. “తత్త్వమసి” మహావాక్యమును శ్రుతి తొమ్మిదిసార్లు ఉచ్చరించుటచే ఈ విషయము స్పష్టమగుచున్నది.

జీవబ్రహ్మైక్య సిద్ధాంతమునుఁగూర్చి వేదాంత గ్రంథములు పునః పునః ప్రతిపాదించును. “తత్త్వమసి” “అహం బ్రహ్మాస్మి” యనెడి భేదమును రహితమొనర్చు వాక్యములచే శ్రుతి మాటిమాటికి జీవబ్రహ్మైక్యమునుఁగూర్చి నిరూపించును.

## 3-2-26 అతోఽనంతేన తథాహి లింగమ్

కావున జీవాత్మ అనంతముతో తాదాత్మ్యము నొందునని శ్రుతి సూచించుచున్నది.

అతః = కావున, అనంతేన = అనంతముతో, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, లింగమ్ = శ్రుతి సూచించినది.

బ్రహ్మసాక్షాత్కారముచే ఉపాసకుడు అనంతముతో తాదాత్మ్యము నొందును. బ్రహ్మజ్ఞానము నొందినప్పుడు ఉపాధులతో సహా అజ్ఞానమంతయు నశించును. ఈ విషయమై శ్రుతి ఇట్లు సూచించును. “సయోహవై తత్పరమం బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి” (ముం. ఉ. 3-2-9). “బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి” (బృ.ఉ. 4-4-6). ఒకవేళ భేదము వాస్తవమగునేని, మానవుడు బ్రహ్మైక్యము నొందఁజాలడు. భేదము కేవలము మిథ్య లేక అసత్యము. జీవుడు కేవలము ఒక నీడ, లేక ప్రతిబింబమువంటివాడు. అతడు కేవలము దృగ్గోచరుడు. నీరు ఎండిపోయినప్పుడు నీటిలోని సూర్యబింబము తిరిగి సూర్యునియందే ఎట్లు లయించునో, అదే విధముగా బ్రహ్మజ్ఞానము కలిగినప్పుడు అజ్ఞానము నశించుటచే ప్రతిబింబ సదృశుడగు జీవుడు తిరిగి బ్రహ్మమునందు లయించును.

## 3-2-27 ఉభయవ్యపదేశాత్త్వహి కుండలవత్

కాని పాము మఱియు పాము చుట్టకువలె పరబ్రహ్మమునకు మఱియు జీవునికిఁగల సంబంధము శ్రుతియందు భేదాభేదముగ బోధింపఁబడినది.

ఉభయవ్యపదేశాత్ = రెండున్నూ బోధింపఁబడుటచే, తు=కాని, అహికుండలవత్ = పాము మఱియు పాము చుట్టుకువలె.

బ్రహ్మముయొక్క లక్షణమునుఁగూర్చిన చర్చ మరల ఆరంభింపఁబడినది.

27 మఱియు 28 సూత్రములు భేదాభేదవాదుల యొక్క దృష్టికోణము ను వ్యక్తపఱచును. 29 సూత్రము వాస్తవమైన విషయమునొసంగును. జీవ బ్రహ్మైక్యతను ప్రతిపాదించిన అనంతరము సూత్రకారుడు అదే విషయము యొక్క మరియొక దృష్టి కోణమును సూచించుచున్నాడు. ఇప్పుడాతడు భేదాభేద వాదమును గూర్చి విచారించుటకు ముందంజవేయుచున్నాడు.

జీవాత్మ పరమాత్మలు విభిన్నములని కొన్ని శ్రుతివాక్యములు నుడువుచున్నవి. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా, సమానం వృక్షం పరిషస్వజాతే" (ముం. ఉ. 3-1-1) ఈ వాక్యము జీవ బ్రహ్మవిభేదమును తెలియఁజేయును.

మరికొన్ని వాక్యములలో పరమాత్మ పొందబడదగినదనియు మఱియు అతడు జీవాత్మకు పరిపాలకుడనియును చెప్పఁబడినది. " తతస్తుతం పశ్యతే నిష్కళం ధ్యాయమానః" (ముం. ఉ. 3-1-8). "పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్" (ముం. ఉ. 3-2-8). "యః సర్వాణి భూతాన్యంతరోయమయతి"

మరికొన్ని వాక్యములలో ఈ రెండున్నూ అభిన్నముగా చెప్పఁబడినవి. "తత్త్వమసి" (ఛాం. ఉ. 6-8-7), "అహం బ్రహ్మాస్మి" (బృ.ఉ. 1-4-10). "ఏషత ఆత్మా సర్మాంతరః" (బృ.ఉ. 3-4-1). "ఏషత ఆత్మాంతర్యామ్యమృతః" (బృ.ఉ. 3-7-3).

ఈ విధముగా శ్రుతివాక్యములచే భేదాభేదములు సమానముగా ప్రతిపాదింపఁబడుటచే, అభేదము సంగీకరించినచో భేదమును రూఢిపఱచిన శ్రుతివాక్యములన్నియును వ్యర్థములగును. కావున ఒక పాము మఱియు పాము చుట్టవలె వాటి సంబంధము భేదముగను, అభేదముగను ఉండునని చెప్పవలసియుండును. ఒక పాము అభిన్నముగ కన్పట్టినను, మనము దాని ముడుపులను పరీక్షించినచో దాని పడగ, తోక ఇత్యాదిభేదములు మనకు కానఁబడును.

అదేవిధముగా జీవుడు మఱియు బ్రహ్మమునకు మధ్య భేదము మఱియు అభేదమున్నది. మోక్షమునకు పూర్వము వాటియందుఁగల భేదము వాస్తవమై యుండును. బ్రహ్మజ్ఞానముచే అజ్ఞానము నశించినప్పుడు మాత్రమే జీవుడు బ్రహ్మముతో తాదాత్మ్యము నొందును.

వాటి భేదాభేదములు సర్పము యొక్క నిశ్చలత మఱియు చలనము వలె యుండును.

## 3-2-28 ప్రకాశాశ్రయవద్వా తేజస్త్వాత్

లేక, ప్రకాశము మఱియు దాని ఆధారమువంటి సంబంధమును కలిగియుండును. ఏలననగా ఈ రెండున్నూ ప్రకాశవంతములై యున్నవి.

ప్రకాశాశ్రయవత్ = ప్రకాశము మఱియు దాని ఆధారమువలె, వా = లేక, తేజస్త్వాత్ = ఈ రెండున్నూ తేజోవంతములై యుండుటచే.

బ్రహ్మము మఱియు జీవునికి మధ్యగల సంబంధముకూడా చర్చింపబడుచున్నది.

లేనియెడల ఈ రెండింటియొక్క సంబంధము ఈ క్రింది విధముగా ఉండి యుండవచ్చును. భేదాభేదవాదమును స్థిరపఱచుటకై మరియొక దృష్టాంతమొసంగఁబడినది. సూర్యుడు మఱియు సూర్యప్రకాశము రెండున్నూ అగ్ని సంబంధములగుటచే అవి పూర్తిగా భిన్నములు కాకున్నను, వాటియందు భేదమెట్లు చెప్పబడుచున్నదో, అట్లే జీవాత్మ పరమాత్మలు కూడాను.

సూర్యుడు మఱియు సూర్యప్రకాశము రెండున్నూ తోజోవంతములై యున్నవి. కావున అవి అభిన్నములై యున్నవి. వాటియొక్క విస్తారత ననుసరించి అవి విభిన్నములై యున్నవి. అదేవిధముగా జీవాత్మ పరమాత్మలకు భేదాభేద సంబంధము కలదు. మొదటిది పరిచ్ఛిన్నము, రెండవది సర్వవ్యాపకమునై యున్నది.

## 3-2-29 పూర్వవద్వా

లేక, జీవబ్రహ్మలకు మధ్యఁగల సంబంధము పూర్వము నుడివిన దాని ననుసరించియుండును.

పూర్వవత్ = పూర్వమువలె, వా = లేక.

లేక, 25వ సూత్రమునందు నుడివినదానివంటిదై యుండవచ్చును. ఈ చివరిది నిజమైన దృష్టికోణమైయున్నది. ఏలననగా ఒకవేళ జీవుడు బ్రహ్మమునకు విభిన్నుడై యున్నచో, లేక బ్రహ్మముయొక్క కిరణమైయున్నచో, ఇట్టి స్వాభావికమగు పరిచ్ఛిన్నత నశింపఁజాలకుండును. శ్రుతి తాదాత్మ్యతను నిరూపించును. మఱియు

నానాత్వమునకు కారణము అవిద్యయని నుడువును.

పూర్వసూత్రములు రెండున్నూ భేదాభేద సిద్ధాంతమును నిరూపించునట్టి భేదాభేదవాదుల దృష్టికోణమును వ్యక్తపఱచును.

ఈ సూత్రము భేదాభేదవాదుల దృష్టికోణమును ఖండించి, 25వ సూత్రమునందు చెప్పఁబడినట్టి నానాత్వము మిథ్యయనియు, ఏకత్వమే సత్యమనియు నిరూపించు పరమ సత్యమును స్థిరపఱచును.

ఒకవేళ జీవుడు బంధింపఁబడుటకుఁగల కారణము కేవలము అజ్ఞానమై యున్నచో, మోక్షము సంభవించును. కాని ఒకవేళ జీవుడు నిజముగానే బంధింపఁబడియున్నచో 27వ సూత్రమునందువలె జీవుడు బ్రహ్మము యొక్క ఒక అవస్థగా తలంపఁబడినను, లేక, 28వ సూత్రమునందువలె పరమాత్మయొక్క ఒక అంశముగా తలంపఁబడినను, అతని నిజమైన బంధనము తొలగింపఁబడదు. ఈ విధముగా శాస్త్రమునందు నుడువఁబడిన మోక్ష సిద్ధాంతము నిష్ప్రయోజనము మఱియు అసంగతమగును.

ఒకవేళ భేదము సత్యమేయైనచో దానికి అంతము లేకుండును. అప్పుడు మోక్షమునుఁగూర్చి ప్రబోధించు సమస్త శ్రుతివాక్యములన్నియును నిరర్థకములగును. బంధనము కేవలము విభిన్నతను సూచించును. ఒకవేళ భిన్నత నిజమగునేని, మోక్షమెంతమాత్రమున్నూ కలుగఁజాలదు. కాని ఒక వేళ అజ్ఞాన కారణముచే భిన్నత్వ మేర్పడినచో, బ్రహ్మజ్ఞానముచే అది తొలగింపఁ బడును. అప్పుడు పరమసత్యమైన మఱియు అభిన్నమైన బ్రహ్మము సాక్షాత్కరింపఁబడును.

శ్రుతి భేదాభేదములను రెండింటిని సమానముగా ప్రబోధించుచున్నదని నుడువఁజాలము. శ్రుతియొక్క లక్ష్యము కేవలము అభిన్నత యగుటచే, అది దానిని మాత్రమే నిరూపించును. దృశ్యజ్ఞానాదులచే తెలియఁబడు విభిన్నతను మాత్రము అది సూచించును.

కావున 27 మఱియు 28 సూత్రములలో తెలుపఁబడిన దృష్టికోణములు నిశ్చయముగా అసత్యములు. 25వ సూత్రములోని దృష్టికోణము మాత్రము సత్యమై యున్నది. జీవాత్మ పరమాత్మకు అభిన్నుడై యున్నాడని 25వ సూత్రము మనకు విశదీకరించి చెప్పుచున్నది.

## 3-2-30 ప్రతిషేధాచ్చ

మఱియు నిషేధింపఁబడిన కారణముచే.

ప్రతిషేధాత్ = నిషేధకారణముచే, చ = మఱియు

29వ సూత్రము బలపఱచఁబడినది.

నిజమునకు శ్రుతి విభిన్నతను స్పష్టముగా నిషేధించును.

బ్రహ్మము, లేక పరమాత్మకు భిన్నముగా మరియొక చైతన్యవంతుడగు పురుషుడు లేడని శ్రుతి నొక్కి చెప్పుచుండుటచే పై విషయము బలపఱచబడినది. "నాన్యోఽతోఽస్తిద్రష్టా" (బృ.ఉ. 3-7-23).

బ్రహ్మము వినా ప్రపంచమునకు ఉనికిలేదనియు, కేవలము బ్రహ్మము మాత్రమే శేషించియున్నదనియు నుడువు వాక్యములచేత కూడా పై విషయము నిశ్చయింపఁబడుచున్నది. "అథాత ఆదేశో నేతినేతి" (బృ. ఉ. 2-3-6) "తదేతద్బ్రహ్మ పూర్వమన పరమనంతర మబాహ్యమ్" (బృ. ఉ. 2-5-19).

కావున బ్రహ్మముతప్ప మరియొక పదార్థములేదను విషయమిప్పుడు నిరూపింపఁబడినది. కావున కేవలము అభిన్నమగు ఏకైక బ్రహ్మము మాత్రమే శేషించి యున్నది.

# 7. పరాధికరణము

# (31-37 సూత్రములు)

## 3-2-31 పర మతః సేతూన్మాన సంబంధభేదవ్యపదేశేభ్యః

బ్రహ్మమును సూచించుటకై వంతెన, కొలత, సంబంధము మఱియు భేదము చెప్పఁబడుటచే బ్రహ్మమున కతీతమైనది మరియొకటి యున్నదని తెలియచున్నది.

పరమ్ = గొప్పది, అతః = ఈ బ్రహ్మముకంటె, సేతూన్మాన సంబంధభేదవ్య పదేశేభ్యః = వంతెన, కొలత, సంబంధము మఱియు భేదములనెడి పదములచే సూచింపఁబడుటచే.

బ్రహ్మము ఒక వంతెనగను, పరిచ్ఛిన్నముగను, మానవునిచే పొందఁబడున

దిగను మఱియు మానవునికి విభిన్నమైయున్నదిగను వర్ణింపఁబడుటచే బ్రహ్మమునకు మించినది మరియొకటి యున్నదని చెప్పవచ్చును.

నానావిధములగు శ్రుతి వాక్యములయొక్క పరస్పర విరోధముచే, బ్రహ్మమున కతీతమైనది మరియొకటి కలదా? లేదా? యను సంశయమిచ్చట ఏర్పడును.

బ్రహ్మమునకు భిన్నముగా మరియొక పదార్థమున్నదని అంగీకరింప వలయునని పూర్వపక్షి పలుకును. ఏలననగా బ్రహ్మము ఒక తీరముగను, పరిమాణముఁగలదిగను, సంబంధముఁగలదిగను, విభిన్నమైయున్నదిఁగను చెప్పఁబడినది. "అథయ ఆత్మాససే తుర్విధృతిః" (ఛాం.ఉ. 8-4-1) అను వాక్యమునందది ఒక వంతెనగ చెప్పఁబడినది. ఇచ్చట సామాన్యవంతెనకంటె భిన్నమైనది మరియొకటి యున్నదని తోచునట్లే, సేతువను శబ్దముచే బ్రహ్మమునకు భిన్నమైనది మరియొకటి యున్నదని తెలియుచున్నది. "సేతుంతీర్త్వా" (ఛాం. ఉ. 8-4-2) అను శబ్దములచే పై విషయము దృఢపఱుచబడినది. మానవుడు తన సామాన్య జీవితమునందు ఒక సేతువును దాటిన తర్వాత, అరణ్యమువంటి ఒకానొక ప్రదేశమును చేరును. కావున మానవుడు బ్రహ్మమును దాటిన తరువాత, బ్రహ్మము కానట్టి మరియొక పదార్థమును చేరునని అర్థమొనర్చుకొనవలసి యుండును.

ఈక్రింది వాక్యమునందు బ్రహ్మమునకు పరిమాణమున్నట్లుగా చెప్పఁబడినది. "తదేతద్బ్రహ్మ చతుష్పాదష్టాశఫం షోడశకళమ్" పరిమాణము గల పదార్థమునకు భిన్నముగా మరియొక పదార్థముండునను విషయము సర్వజన విదితమేకదా! కావున అచ్చటకూడా బ్రహ్మమునకు భిన్నముగా మరియొక పదార్థమున్నదని మన మూహింపవలసియున్నది.

"సతాసోమ్య తదా సంపన్నోభవతి" (ఛాం.ఉ. 6-8-1). "ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తః" (బృ.ఉ. 4-3-21). అను వాక్యములచే బ్రహ్మము సంబంధమును కలిగియున్నట్లు తెలియుచున్నది. మనుజులు పట్టణముతో సంబంధమును కలిగియుండునట్లు, పరిమాణములేని పదార్థములు పరిమాణముఁగల పదార్థములతో సంబంధము కలిగియుండుటను మనముఁగాంచుచున్నాము. జీవులు సుషుప్తి యందు బ్రహ్మముతో సంబంధమును కలిగియుండునని శ్రుతులు వాకొనుచున్నవి. కావున బ్రహ్మమున కతీతముగా పరిమాణములేని ఏదో యొక పదార్థమున్నదని మేము నిశ్చయింతుము.

భేదమును తెలుపు వాక్యములచే ఇదే విషయము నిశ్చయింపఁ బడుచున్నది. “అథయ ఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే” (ఛాం. ఉ. 1-6-6) అను వాక్యమునందు సూర్యునిలోని పురుషుడు సూచింపఁబడుచున్నాడు. తదనంతరము “అథమ ఏషోంతరక్షిణి పురుషోదృశ్యతే” (ఛాం. ఉ. 1-7-5) అను వాక్యమునందు మొదటి పురుషునికి భిన్నమైన నేత్రములోని పురుషుడు సూచింపఁబడెను.

“ఆత్మ చూడఁబడును” ఇత్యాది వాక్యములను శ్రుతి నుడువును. ఇచ్చట ద్రష్ట మఱియు దృశ్యపదార్థమున్నది. కావున వీటియందు భేదమున్నది.

వీటన్నింటిచే బ్రహ్మము అద్వితీయముకాదనియు, బ్రహ్మమునకు భిన్నముగా మరియొకటి కలదనియు తెలియచున్నది.

## 3-2-32 సామాన్యాత్తు

కాని పోలిక కారణముచే బ్రహ్మము వంతెన ఇత్యాదులుగా చెప్పఁబడినది. సామాన్యాత్ = పోలిక కారణముచే, తు = కాని.

పూర్వసూత్రమునందు చెప్పఁబడిన ఆక్షేపణ ఇచ్చట ఖండింపఁబడినది.

“తు” యను శబ్దము సంశయమును నివారించును. పూర్వనిర్ణయమును అది త్రోసిపుచ్చును.

బ్రహ్మమునకు భిన్నముగా దేనికిన్నీ ఉనికిలేదు. ఒక ప్రత్యేక విషయము నందు బ్రహ్మము వంతెనను పోలియుండుటచే, అది వంతెన ఇత్యాదులుగా చెప్పఁబడినది. ఒక కాలువను దాటుటకు వంతెన ఎట్లు సహకరించునో, అట్లే సంసార సాగరమును దాటువారందఱికి బ్రహ్మము ఆధారమైయున్నది.

బ్రహ్మమునకు భిన్నమైన పదార్థమున్నట్లు ఏలాటి ప్రమాణము లేకుండుటచే, దానికి ఉనికి లేదని చెప్పవచ్చును. పదార్థములన్నియును బ్రహ్మము నుండియే ఉత్పన్నమగును. బ్రహ్మము తెలియఁబడుటచే సమస్తము తెలియఁబడునని శ్రుతి పలుకుచున్నది. అప్పుడు మరియొక పదార్థమెట్లుండును? వంతెన, లేక ఆనకట్ట యనగా వంతెన, లేక ఆనకట్టవంటిదని భావము.

పోలిక కారణముచే బ్రహ్మము వంతెనయని చెప్పఁబడినదేకాని, బ్రహ్మమున

కతీతముగా మరియొకటి ఉన్నదని అర్థము కాదు. బ్రహ్మమును ఒక వంతెనతో పోల్చినంత మాత్రముచే ఒక వేళ బ్రహ్మమున కతీతముగా మరియొక పదార్థమున్నదని నిర్ణయింతుమేని, బ్రహ్మముకూడా వంతెనవలె మృత్తిక మఱియు రాళ్ళచే నిర్మింపఁబడినని చెప్పవలసియుండును. దీనిచే బ్రహ్మమునకు ఉత్పత్తి లేదనెడి శ్రుతి సిద్ధాంతమునకు వైరుధ్యమేర్పడును.

కొన్ని విషయములలో బ్రహ్మము ఆనకట్టను పోలియుండుటచే, అది ఆనకట్టయని చెప్పఁబడినది. ఒక ఆనకట్ట నీటి పారుదలను నిలిపి, ప్రక్కనున్న పొలములకు ఎట్లు సరిహద్దు నేర్పఱచునో; అట్లే బ్రహ్మముకూడా ప్రపంచమున కాధారముగా నుండి, దానికి సరిహద్దుల నేర్పఱచును.

పైన నుడువఁబడిన "సేతుంతీర్త్వా" యను పదసమూహములోని "తీర్త్వా" యను క్రియచే "దాటివెళ్లుట" యనెడి భావమును స్వీకరింపఁరాదు. కాని "గమ్యస్థానమును చేఱుట" యను అర్థమును స్వీకరింపవలయును. "సేతుంతీర్త్వా" అనగా "బ్రహ్మమును పూర్ణముగా పొంది" యని భావము. కాని "దానిని దాటి" యని అర్థముకాదు. ఒక విద్యార్థి వ్యాకరణమునం దుత్తీర్ణుడైనాడ" ని చెప్పినప్పుడు అతడు దానిని పూర్తిగా అర్థమొనర్చుకొన్నాడని భావము.

## 3-2-33 బుద్ధ్యర్థః పాదవత్

బ్రహ్మమునకు చతుష్పాత్‌వంటి పరిమాణమును తెలుపుట ఉపాసనా నిమిత్తమైయున్నది.

బుద్ధ్యర్థః = సులభగ్రాహ్యత కొఱకై, పాదవత్ = చతుష్పాత్‌వలె.

అనంతము, సూక్ష్మాతిసూక్ష్మము, సర్వవ్యాపకమగు బ్రహ్మమును అర్థమొనర్చుకొనుట కష్టసాధ్యమగుటచే ఉపాసనానిమిత్తమై బ్రహ్మము "చతుష్పాత్" "షోడశకళమ్" ఇత్యాది పరిమాణముఁగలదిగా చెప్పఁబడినది. బుద్ధిమాంద్యముఁ గలవారి ఉపాసనను సులభసాధ్యమొనర్చుటకై బ్రహ్మమునకు "చతుష్పాత్" ఇత్యాది రూపము లారోపింపఁబడినవి.

వాగాది పాదములు మనస్సంబంధములుగా వర్ణింపఁబడినట్లు, బ్రహ్మము షోడశకళాత్మరూపముగా వర్ణింపఁబడుట ఉపాసనానిమిత్తమై యున్నది.

బ్రహ్మము వ్యష్టిగా వ్యక్తమైనప్పుడు మనస్సు వాగింద్రియము, నాసిక, నేత్రములు మఱియు శ్రోత్రములనెడి చతుష్పాదములను కలిగియున్నట్లూహింపఁ బడినట్లు బ్రహ్మముకూడా ఉపాసనానిమిత్తమై పరిమాణము కలిగియున్నట్లూ హింపఁ బడినదే కాని, నిజముగాకాదు.

“మనో బ్రహ్మేత్యుపాసీత” (ఛాం. ఉ. 3-18-1) ఇది జీవునియందున్న పరికరములను సహాయముగాఁగొని ఉపాసించువిధానవ్మైయున్నది. “తదేతచ్చతుష్పాద్బ్రహ్మ వాక్పాదః ప్రాణః పాదశ్చక్షుః పాదశ్శ్రోత్రం పాదః” (ఛాం. ఉ. 3-18-2).

## 3-2-34 స్థాన విశేషాత్ ప్రకాశాదివత్

ప్రకాశాదులవలె ప్రత్యేక స్థలములలో బ్రహ్మమునకు సంబంధము మఱియు భేదము చెప్పఁబడినది.

స్థానవిశేషాత్ = ప్రత్యేక స్థలముల కారణముచే, ప్రకాశాదివత్ = ప్రకాశాదులవలె.

33వ సూత్రము తిరిగి రూఢిపఱచఁబడినది.

భిన్నమైన స్థానమునుఁబట్టి సంబంధము మఱియు భేదము చెప్పఁబడినది. కేవలము బుద్ధ్యాది ఉపాధుల ననుసరించియే భేదము చెప్పఁబడినది. కాని బ్రహ్మము యొక్క స్వరూపమునందు భేదము చెప్పఁబడలేదు.

బ్రహ్మము బుద్ధ్యాది ఉపాధులతో సంబంధము కలిగియున్నప్పుడు చూడఁబడిన భేదము, స్వయముగా ఉపాధులు నశించినప్పుడు నశించును. పరమాత్మతో వాటికిఁగల సంబంధము ఉపమానాత్మకముగా చెప్పఁబడినది. అది కేవలము ఉపాధులను దృష్టియందుంచుకొనియే చెప్పఁబడినది. కాని బ్రహ్మము నందుఁగల పరిచ్ఛిన్నతనుఁబట్టి చెప్పఁబడలేదు.

ఇది ప్రకాశమువంటి విషయములను పోలియున్నది. ఉపాధులతోఁగల సంబంధముచే సూర్యప్రకాశముకూడా విభేదించును. ఈ యుపాధుల కారణముచే ప్రకాశము విభజింపఁబడినట్లుగా చెప్పఁబడును. ఉపాధులు తొలగింపఁ బడినప్పుడు అది ఐక్యమైనదనియు, ప్రవేశించినదనియును చెప్పఁబడును.

నేత్రవ్యాధికారణముచే మనము రెండు చంద్రులనుఁ గాంతుము. ఆ వ్యాధి తొలగినప్పుడు మనకు ఒకే చంద్రుడు కానఁబడును.

నిజమునకు ప్రకాశము ఏకమేనైయున్నను గదిలోని ప్రకాశము, గదికి వెలుపలనున్న ప్రకాశమని మనము చెప్పుదుము. భేదము కేవలము ఉపాధుల ననుసరించి యుండును. గది నశింపఁజేయఁబడినప్పుడు, గదిలోని ప్రకాశము బాహ్యప్రకాశమునందైక్యమైనదని మనము పలుకుదుము.

అకాశము సూదిరంధ్రములలో ప్రవేశించుట ఇత్యాది ఉపమానముల ద్వారా ఉపాధులొనర్చు ఇతర కార్యములు ఉదహరింపఁబడినవి.

## 3-2-35 ఉపపత్తేశ్చ

మఱియు ఇది సమంజసమైయున్నది.

ఉపపత్తేః = సమంజసమైయుండుటచే, చ = మఱియు.

ఇంతేకాకుండా పైన తెలుపఁబడిన సంబంధము మాత్రమే సాధ్యమగును. ఏలననగా "స్వమపీతో భవతి" (ఛాం. ఉ. 6-8-1) యనెడి శ్రుతివాక్యములచే జీవ బ్రహ్మైక్యము స్వాభావికమని తెలియుచున్నది. ఒక పదార్థము యొక్క సహజలక్షణము అవినాశమైయుండును. కావున ఈ సంబంధము ఒక పట్టణములోని ప్రజల వంటిది కాదు.

జీవునికి అజ్ఞానముతోఁగల సంబంధమే, ఆత్మయొక్క నిజమైన స్వరూపమును గుర్తెఱుంగకుండుటకు కారణమైయున్నది.

అదే విధముగా శ్రుతి యందు చెప్పఁబడిన భేదము నిజము కాదు. అది అజ్ఞాన జనితము. ఏలననగా ఏకైక బ్రహ్మమే ఉనికిని కలిగి యున్నదని వివిధ శ్రుతులు వాకొనుచున్నవి.

అనేక స్థలములలోఁగల సంబంధముచే ఆకాశము వివిధముగా గోచరించునని శ్రుతి ప్రబోధించుచున్నది. "యోయం బహిర్ధా పురుషాదాకాశః (ఛాం.ఉ. 3-12-7) "యోయమంతః పురుష ఆకాశః (ఛాం. ఉ. 3-12-8) "యోయమంతర్హృ దయ ఆకాశః (ఛాం. ఉ. 3-12-9).

కావున సంబంధము మఱియు భేదమును వాస్తముగా స్వీకరింపరాదు. కాని గౌణార్థమునందు స్వీకరింపవచ్చును.

## 3-2-36 తథాన్యప్రతిషేధాత్

అదేవిధముగా ఇతర పదార్థములన్నియును నిషేధింపఁబడుటచే, బ్రహ్మము తప్ప మరియొకటి లేదు.

తథా = అదే విధముగా, అన్యప్రతిషేధాత్ = ఇతర పదార్థము లన్నియును నిషేధింపఁబడుటచే.

ఇంతే గాకుండా బ్రహ్మముతోపాటు మరియొక పదార్థము యొక్క అస్తిత్వమును శ్రుతి మాటిమాటికి నిషేధించుచున్నది (బ్రహ్మైవేదం సర్వమ్ – ఆత్మైవేదం సర్వమ్). బ్రహ్మము సకల జీవుల అంతఃకరణమునందున్నదని వర్ణింపఁబడినది.

ఇట్లు పూర్వపక్షి యొక్క వాదమును ఖండించిన అనంతరము సూత్రకారుడు మరికొన్ని కారణములచే తన మతమును బలపఱచుచున్నాడు.

బ్రహ్మముతో పాటు మరియొక పదార్థముండుటనుఁగూర్చి అసంఖ్యాక ములగు వైదిక వాక్యములు వేఱ్వేరుగా నిషేధించుచున్నవి. "స ఏవాధస్తాత్" "అహమేవాధస్తాత్" (ఛాం. ఉ. 7-25-1). "ఆత్మైవాధస్తాత్" (ఛాం. ఉ. 7-25-2) "సర్వంతం పరాదాద్యోఽ న్యత్రాత్మనః సర్వంవేద" (బృ. ఉ. 2-4-6) "బ్రహ్మైవేదం సర్వమ్" (ముం. ఉ. 2-2-11) "ఆత్మై వేదం సర్వమ్" (ఛాం. ఉ. 7-25-2) "నేహనా నాస్తి కించన" (బృ. ఉ. 4-4-19). " యస్మాత్పరం నా పరమస్తి కించిత్" (శ్వే. ఉ. 3-9). "తదేత ద్బ్రహ్మ పూర్వమన పరమనంతరమ బాహ్యమ్" (బృ. ఉ. 2-5-19). పై వాక్యములు బ్రహ్మము సర్వత్ర వ్యాపించియున్నదని ప్రబోధించుచుండుటచే, పరమాత్మ యందు మరియొక ఆత్మలేదని రూఢియగుచున్నది.

కావున బ్రహ్మము అద్వితీయమైయున్నదను విషయము నిశ్చయింపఁ బడుచున్నది.

## 3-2-37 అనేన సర్వగతత్వ మాయామ శబ్దాదిభ్యః

బ్రహ్మముయొక్క విస్తీర్ణతనుఁగూర్చిన శ్రుతి వాక్యములచే బ్రహ్మము సర్వ వ్యాపకమని రూఢియగును.

అనేన = దీనిచే, సర్వగతత్వం = సర్వవ్యాపకత, ఆయామ = శ్రుతి యందు బ్రహ్మము యొక్క విస్తీర్ణతనుఁగూర్చిన, శబ్దాదిభ్యః = శబ్దాదులచే.

బ్రహ్మము నిజముగా వంతెన ఇత్యాదులవంటిది కాదని నిశ్చయింపఁ బడుటచే, అది సర్వవ్యాపకమని స్పష్టమగుచున్నది. ఆయామాది శబ్దములచేత కూడా ఇట్టి సర్వాంతర్యామిత్వము స్పష్టమగుచున్నది. ఒకవేళ బ్రహ్మము వంతెన ఇత్యాదులుగా వర్ణింపఁబడుటను గౌణార్థమునందుఁగాక ముఖ్యార్థమునందు స్వీకరింతుమేని, బ్రహ్మము పరిచ్ఛిన్నముగను, సర్వవ్యాపకముగను వర్ణించుచున్నవి. ఆయామయను శబ్దమునకు సర్వవ్యాపకమని అర్థము. బ్రహ్మము అద్వితీయమగుటచే అది సర్వవ్యాపకమని రూఢి యగుచున్నది.

విస్తీర్ణతను తెలియఁజేయు వాక్యములచే బ్రహ్మము యొక్క సర్వాంతర్యామిత్వము నిరూపింపఁబడుచున్నది. "యావాన్వా అయమాకాశస్తావానేషోంతర్హృదయ ఆకాశః" (ఛాం. ఉ. 8-1-3) "ఆకాశమువలె అతడు సర్వవ్యాపకుడు మఱియు శాశ్వతుడై యున్నాడు." "అతడాకాశముకంటెను, అంతరిక్షముకంటెను గొప్పవాడైయున్నాడు" (శత. బ్రా. 10-6-3-2) నిత్యః సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః (భ. గీ. 2-24).

# 8. ఫలాధికరణము

# (38-41 సూత్రములు)

## 3-2-38 ఫలమత ఉపపత్తేః

కర్మ ఫలములు పరమేశ్వరుని నుండియే కలుగుచున్నవి. ఏలననగా ఇదియే సమంజసమమై యున్నది.

ఫలమ్ = ఫలము, అతః = అతని నుండియే, ఉపపత్తేః = సమంజసమగుటచే

బ్రహ్మముయొక్క మరియొక లక్షణము నిరూపింపఁబడుచున్నది.

మానవుడొనర్చిన కర్మఫలములను కర్మయే ఒసంగును. కాని పరమేశ్వరు డొసంగడని మీమాంసకులు పలుకుదురు.

ఈ సూత్రము దీనిని ఖండించి మానవుని సుఖదుఃఖ మిశ్రఫలములను పరమేశ్వరుడే ఒసంగునని ప్రతిపాదించును.

సమస్త దేశకాల భేదములను గుర్తెఱుంగునట్టి పరమేశ్వరుడే ఆయా కర్తల యొక్క యోగ్యత ననుసరించి ఫలముల నొసంగుటకు సమర్థుడై యున్నాడు. కర్మ జడము మఱియు తాత్కాలికమైయున్నది. దాని కార్యము పూర్తియైన వెంటనే అది ఉనికి లేనిదగును. కావున అది మానవుని యోగ్యత ననుసరించి భవిష్యత్తు నందు కర్మఫలముల నొసంగఁజాలదు.

ఇట్టి అసత్పదార్థము నుండి వాస్తవమైన ఫలము ఎట్లు ఉత్పన్నమగును?

భవిష్యత్తునందు కర్త నంటుకొని యుండు ఫలమును ఉత్పన్నమొనర్చిన అనంతరము కర్మ నశించినదని నీవు చెప్పఁజాలవు. ఏలననగా అనుభవింపఁ బడినప్పుడు మాత్రమే అది ఫలమని చెప్పఁబడును.

ఫలము నొసంగునట్టి అపూర్వమును కర్మ ఉత్పన్నమొనర్చునని కూడా నీవు చెప్పఁజాలవు. అపూర్వము అచేతనమైయున్నది. ఒకానొక చైతన్య పదార్థముచే

చలింపజేయఁబడనంతవరకు అది పనిచేయదు. కావున అది పుణ్య పాప ఫలముల నొసంగఁజాలదు. ఇంతేకాకుండా ఇట్టి అపూర్వమునకు ఉనికి యున్నట్లు ఏలాటి ప్రమాణమున్నూ లేదు.

కావున మానవునికి కర్మఫలముల నొసంగువాడు శాశ్వతుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు మఱియు కరుణా సముద్రుడగు ఆ సర్వేశ్వరుడేనై యున్నాడు.

## 3-2-39 శ్రుతత్వాచ్చ

మఱియు శ్రుతి ఇట్లు ప్రబోధించుటచే.

శ్రుతత్వాత్ = ఇట్లు శ్రుతి ప్రబోధించుటచే, చ = మఱియు

శ్రుతియొక్క ఆధారముచే పూర్వసూత్రము బలపఱచఁబడినది.

కర్మఫలములు పరమేశ్వరుని నుండి కలుగునని శ్రుతికూడా పలుకుచున్నది. "సవాఏష మహానజ ఆత్మాన్నాదో వసుదానః" (బృ. ఉ. 4-4-24)

## 3-2-40 ధర్మం జైమిని రత ఏవ

38, 39 సూత్రములలో చెప్పఁబడినట్లుగా ధార్మిక కర్మఫలము శ్రుతి ప్రామాణ్యము మఱియు సామంజస్యములపై ఆధారపడియుండునని జైమిని తలంచును.

ధర్మం = ధార్మికఫలము, జైమినిః = జైమిని ముని, అత ఏవ = ఈ కారణముల చేతనే.

38 మఱియు 39 సూత్రములలోని ఆక్షేపణ ఖండింపఁబడుచున్నది.

శ్రుతి మఱియు తర్కము ఈ దృష్టికోణమున కాధారమై యుండుటచే ధర్మము కర్మఫలముల నొసంగునని జైమిని నుడువుచున్నాడు.

"స్వర్గకామోయజేత" యని శ్రుతి ప్రబోధించుచున్నదని జైమిని వాదించును. ప్రతి శ్రుతి వాక్యమునకు ఒక లక్ష్యముండునను విషయమును మన మంగీకరింపవలసియున్నది. కావున శ్రుతి స్వయముగా స్వర్గలోకప్రాప్తి నొసంగునని

పలుకుట సమంజనసమైయున్నది. అట్లుకాదేని, ఎవడున్నూ యజ్ఞయాగాదుల నొనర్పకుండుటతో శ్రుతి వాక్యములు నిష్ప్రయోజనములగును.

కాని కర్మ నశించుటతో భవిష్యత్తునందది ఫలము నొసంగఁజాలదని ఆక్షేపింపఁబడవచ్చును.

జైమిని ఇట్లనును:- ఒక కార్యము నశించుటకు పూర్వము అది అదృశ్యమగు ఫలము నొసంగకుండా భవిష్యత్తునందు ఫలమును ఉత్పన్న మొనర్పఁజాలదు. కావున కర్మ నశించుటకు పూర్వము ఉత్పన్నమైనట్టి ఒక అపూర్వమనెడి తత్త్వమున్నదని మేము పలుకుదుము. ఈ యపూర్వకారణముచే భవిష్యత్తునందు ఫల ముత్పన్నమగును.

ఈ యూహచే సమస్త సమస్యలు నివారింపఁబడును. కాని దీనికి విరుద్ధముగా పరమేశ్వరుడు కర్మ ఫలముల నొసంగుననుట అసంభవము. ఏలననగా ఏకరూపుడగు ఈశ్వరుడు నానావిధములగు ఫలముల నొసంగఁజాలడు. అతడు క్రూరత్వమును మఱియు పాక్షికతను కలిగి యుండుటచే, కర్మ నిష్ప్రయోజనమగును. కర్మ స్వయముగా ఫలము నొసంగఁ జాలకున్నచో ఆ కర్మ నొనర్చుట నిరుపయోగమగును.

ఈ కారణములన్నింటిచే పుణ్య పాప ఫలములు కర్మ నుండియే ఉత్పన్నమగునని తెలియుచున్నది. (ఇది జైమిని యొక్క దృష్టి కోణమై యున్నది.)

## 3-2-41 పూర్వంతు బాదరాయణో హేతు వ్యవదేశాత్

కాని పరమేశ్వరుడు కర్మలకు స్వయముగా కారణమైయుండుటచే, అతడే కర్మఫలముల నొసంగునని బాదరాయణుని అభిమతమైయున్నది.

పూర్వం = మొదటిది, (ఈశ్వరుడే కర్మఫలముల నొసంగుననుమాట), తు = కాని, బాదరాయణః = వ్యాసుడు, హేతువ్యపదేశాత్ = స్వయముగా కర్మలకు కారణమని చెప్పఁబడుటచే.

తద్విరుద్ధమగు సిద్ధాంతముచే 40వ సూత్రములోని జైమిని యొక్క మతము

"తు" యను శబ్దముచే ఖండింపఁబడినది. కేవలము కర్మచేతను లేక కేవలము అపూర్వము చేతను ఫలముత్పన్నమగునను దృష్టికోణమును అది నివారించును.

కర్మ ఫలముల నొసంగువాడు ఈశ్వరుడే యనునది బాదరాయణుని మతము. స్వర్గలోకప్రాప్తిఁగాని, బ్రహ్మైక్యముఁగాని సమస్త ఫలములు అతనివల్లనే సంభవించునని శ్రుతి స్పష్టముగా తెలుపుచున్నది. "పుణ్యేన పుణ్యం లోకం నయతి" మఱియు "యమేవైష వృణుతే తేనలభ్యః" (కఠ. ఉ. 1-2-23).

ఈశ్వరుడు కర్మల నొనర్చుటకు ప్రేరేపించి కర్మఫలముల నొసంగునని శ్రుతినుడువుటచే, కర్మఫలముల నొసంగువాడు ఈశ్వరుడేయని బాదరాయణుడు పలుకుచున్నాడు. ఈశ్వరుడు నానావిధకర్మల ననుసరించి ప్రవర్తించుటచే, అతడు నానావిధ ఫలములను కల్పించి మన కొసంగును. అతనియందు పాక్షికతఁగాని, క్రూరత్వముఁగాని లేదు. కర్మ నిష్ప్రయోజనము కాజాలదు.

పుణ్య పాప కర్మలన్నింటికి ఈశ్వరుడు కారణకర్తయై యున్నాడు. "ఏషహ్యేవ సాధుకర్మ కారయతి తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే, ఏష ఉ ఏవాసాధుకర్మ కారయతి తం యమధోనినీషతే" (కౌ. ఉ. 3-9).

భగవద్గీత (7-21,22) యందు కూడా ఇదే విషయము చెప్పఁబడినది. "యోయోయాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి, తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్" "సతయాశ్రద్ధయాయుక్తస్తస్యారాధన మీహతే లభతే చతతః కామాన్మయైవ విహితాన్హితాన్"

ఇంతే కాకుండా సృష్టులన్నింటికి ఈశ్వరుడే కారణమైయున్నాడని వైదిక గ్రంథములన్నియు నుడువుచున్నవి. పూర్వ కర్మల కనుగుణముగాను, ప్రతి ఫలము గాను ఈశ్వరుడు సమస్త ప్రాణులను సృష్టింపఁజేయును. కావున ఈశ్వరుడు సమస్త కర్మ ఫలములకు కారణమైయున్నాడు. ఈశ్వరుడు జీవులయొక్క పుణ్య పాపములను దృష్టియందుంచుకొనుటచే, ఏకైక కారణము నానావిధ ఫలముల నొసంగఁజాలదని పైన చెప్పఁబడిన ఆక్షేపణ నిరాధారమై యున్నది.

సారాంశమేమనగా ఈ పాదమునందు పరబ్రహ్మము యొక్క స్వరూపము వర్ణింపబడినది. బ్రహ్మము నిరాకారమనియు, స్వయం ప్రకాశకమనియు మఱియు భేద వివర్జితమనియును చెప్పఁబడినది. "నేతినేతి" సిద్ధాంతము ద్వారా బ్రహ్మము అద్వితీయమని నిరూపింపఁబడినది. తుట్టతుదకు ఈశ్వరుదు ప్రజలకు కర్మ ఫలముల నొసంగునను విషయము ప్రతిపాదింపఁబడినది.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర తృతీయాధ్యాయ**

**ద్వితీయ పాదము**

**సమాప్తము**

# బ్రహ్మసూత్రములు

## 3వ అధ్యాయము

## 3వ పాదము

## పీఠిక

రెండవ పాదమునందు జీవుడు (తత్త్వమసి మహా వాక్యములోని త్వం పదము) బ్రహ్మము (తత్త్వమసి మహా వాక్యములోని తత్పదము) తో తాదాత్మ్యమునొందుట చెప్పఁబడినది. బ్రహ్మము అఖండైకరసముగా చెప్పఁబడినది. ఇంతవరకు మేము బ్రహ్మము యొక్క స్వరూపమునుఁగూర్చి వర్ణించియున్నాము.

ఇప్పుడు బ్రహ్మసూత్రకారుడు శ్రుతులలో సూచింపఁబడిన విద్యలయొక్క లక్ష్యమును మఱియు ఫలమును గూర్చి ప్రబోధించుటకు సమకట్టుచున్నాడు.

ముముక్షువు తాదాత్మ్యజ్ఞానమునుఁబడయుటకై శ్రుతులు నానారకములగు విద్యలను లేక ఉపాసనలను పేర్కొనినవి. భావాతీతము, సూక్ష్మాతి సూక్ష్మము, మనస్సు–బుద్ధి–ఇంద్రియముల కతీతమైయున్న అనంతత్వమునుఁగూర్చి సామాన్య మానవుడర్థమొనర్చుకొనుట మిక్కిలి కష్టసాధ్యము లేక ఆసాధ్యమనియు చెప్పవచ్చును. కావున ఈ యనంతత్వమును లేక పూర్ణత్వమును చేఱుటకై శ్రుతులు సగుణోపాసనయనెడి సులభమైన పద్ధతులను సూచించినవి. ప్రారంభసాధకుడు తన మనస్సును కేంద్రీకరించుటకై శ్రుతులు బ్రహ్మము యొక్క నానావిధ ప్రతీకములగు వైశ్వానరుడు(విరాట్టు), సూర్యుడు, ఆకాశము, ఆహారము, ప్రాణము

మఱియు మనస్సులను సూచించినవి. ప్రారంభమునందు మనస్సు లగ్నమగుటకై ఈ ప్రతీకములు ఊతగానుండును. ఇట్టి సగుణ రూపోపాసనచే స్థూలమైయున్న మనస్సు సూక్ష్మముగను, వాడిగను మఱియు ఏకాగ్రముగను మాఱును.

పరబ్రహ్మమును చేరుటకు ఉపయుక్తములగు ఈ నానావిధములగు పద్ధతులు, విద్యలు, లేక ఉపాసనలని చెప్పఁబడును.

జీవుడు పరబ్రహ్మానుభూతినిఁబడయుటకు సాధనములగు ఈ నానా విధములగు విద్యలనుఁగూర్చి ఈ పాదము చర్చించును. ఇట్టి విద్యలు వివిధములగు వేద విభాగములలో వేర్వేఱుగా వర్ణింపఁబడినవి. ఇప్పుడీ వివిధములగు విద్యలు భిన్నములా? లేక అభిన్నములా? యను ప్రశ్న ఉదయించును. ఈ వివిధములగు విద్యలు ఒకే ఉపాసనగా భావింపఁబడవలయునా? లేక వేర్వేఱుగా తలంపఁ బడవలయునా? ఏ యే విద్యలు అభిన్నములుగా మేళవింపఁబడవలయునో మఱియు అనేక అంశములలో సామ్యతను కలిగియున్నను ఏయే విద్యలు భిన్నములుగా భావింపఁబడవలయునో ఈ పాదమునందు నిశ్చయించి చెప్పఁబడినది.

అవినాశమగు బ్రహ్మమును ప్రాప్తించుటయే విద్యలన్నింటికి లక్ష్యమైయున్నది. కేవలము బ్రహ్మము మాత్రమే వాస్తవమైన అస్తిత్వమును కలిగి యున్నది. బ్రహ్మము మాత్రమే సత్యమైయున్నది. బ్రహ్మము సత్తామాత్రమైయున్నది. కావున వివిధములగు శాఖలయందున్న ఒకే విద్య యొక్క అంశములను ఏకత్రిత మొనర్చినచో, ఆయా శాఖల ననుసరించు వారికి మిక్కిలి సహాయకారిగా నుండును.

తైత్తిరీయములోని భృగువల్లియందు ప్రబోధింపఁబడిన మనస్సును బ్రహ్మముగా ఉపాసించు విధానములోని మానసిక లక్షణములన్నియు, తన ప్రత్యేక వైదిక శాఖకు వలెనే ఇతర శాఖలలో మనస్సు బ్రహ్మముగా ప్రబోధింపఁబడిన అంశములతో సరితూగవలసియుండును. బ్రహ్మమును మనస్సుగా ఉపాసించు నప్పుడు మనస్సుతో సంబంధములేని బ్రహ్మమును ఆహారముగా ఉపాసించు అంశములను చేర్చుకొనరాదు. నిజమునకు ఒకే ఉపాసనకు సంబంధించిన ఇతర

శాఖలలోని అంశములన్నింటిని ఏకత్రిత మొనర్పవలయునేఁగాని, నానావిధోపాస కులకు సంబంధించిన అంశములను కాదు.

శ్రుతులయందు పేర్కొనబఁడిన అనేక విద్యలు బ్రహ్మజ్ఞానమునే లక్ష్యముగా కలిగియున్నవని బ్రహ్మసూత్రకర్త వ్యాసుడీ పాదమునందు నుడివియున్నాడు. అవి రూపమునందు విభేదించియున్నను. సారతత్త్వమునందు భేదమును కలిగిలేవు. శాశ్వత శాంతి, పరమానందము మఱియు అమృతత్వమును ప్రాప్తింపఁజేయుటయే వాటికి పరమ లక్ష్యమైయున్నది. ఒక విద్య లేక ఉపాసన మోక్షమునకు కారణమైనట్లే, ఇతర ఉపాసనలన్నింటిచేతను మనము ముక్తినిఁబడయవచ్చును.

బ్రహ్మమును ప్రత్యక్షముగాను లేక సూర్యుడు, ఆకాశము, ఆహారము, మనస్సు, ప్రాణము, అక్షి పురుషుడు, దహరాకాశము లేక ప్రణవము వంటి ప్రతీకముల మూలముగను ఉపాసింపవచ్చునని శ్రుతి మనకు ప్రబోధించుచున్నది.

ఈ ప్రతీకముల మూలమున నీవు బ్రహ్మమును అన్వేషించి, అతనిని స్తుతింపవచ్చును. కాని ఇవి అతని స్థానమును ఆక్రమింపరాదు. నీవీ ప్రతీకములపై ధారణ యొనర్చి మనస్సును లగ్నమొనర్పవలయును. మఱియు అతని సచ్చిదానంద రూపమగు సర్వవ్యాపకత, సర్వజ్ఞత, సర్వశక్తిమత్త్వము, పరిశుద్ధత, పరిపూర్ణత. స్వాతంత్ర్యత ఇత్యాది లక్షణములనుఁగూర్చి చింతింప వలసియుండును.

ప్రతీకభేదము ననుసరించి విద్యలలో భేదమున్నట్లు గోచరించును. కాని అన్నింటి లక్ష్యము ఏకమేనై యున్నది. ఈ విషయమును ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచు కొనుము. దీనిని నిరంతరము మనస్సునందుంచుకొనుము.

కొన్ని విద్యలలో బ్రహ్మముయొక్క కొన్ని లక్షణములు ఏకరీతిగ చెప్పఁబడినవి. నిన్ను నీవు బ్రహ్మమునకు భిన్నముగా తలంపరాదు. ఇది ముఖ్యాతిముఖ్యమైన అంశమైయున్నది.

విద్యలన్నింటియందు మూడు విషయములు సర్వసామాన్యములై యున్నవి. ప్రతీకముల సహాయమున్నను, లేకున్నను బ్రహ్మసాక్షాత్కారము ద్వారా శాశ్వతానందము మఱియు అమృతత్వమునుఁబడయుటయే జీవితమునకు

పరమలక్ష్యమైయున్నది. విద్యలన్నింటియందు సర్వసామాన్యముగా కానఁబడునట్టి ఆనందము, పవిత్రత, పూర్ణత్వము, జ్ఞానము, అమృతత్వము, కైవల్యము, స్వాతంత్ర్యము, శాశ్వత సంతృప్తి వంటి లక్షణములు బ్రహ్మమున కభిన్నములుగా తలంపఁబడవలయును. ఉపాసకుడు బ్రహ్మమును తనకు అభిన్నముగా భావించి, అమరమైన ఆత్మరూప బ్రహ్మమును ఉపాసింపవలయును.

# సార సంగ్రహము

## 1,2 అధికరణములు

## (1-4-5 సూత్రములు)

నానావిధ శ్రుతులయందున్న ఒకే రకమగు విద్యలు అనేక విద్యలుగా పరిగణింపఁబడవలయునా? లేక ఒకే విద్యగా పరిగణింపఁబడవలయునా? యను ప్రశ్నకు సంబంధించియున్నవి. నానావిధ శ్రుతులయందున్న ఒకే రకమునకు సంబంధించిన విద్యలన్నియును ఒకే విద్యగా పరిగణింపఁబడవలయును. భిన్న భిన్న శాఖలలో పేర్కొనఁబడిన విద్యలన్నింటిని ఒకే ఉపాసనగా జోడింపవలయును.

**3వ అధికరణము (6-8 సూత్రములు) :** విద్యలు కొన్ని విషయములలో పోలికను కలిగియున్నను, సందర్భవిషయము వేఱైయుండుటచే అవి వేర్వేఱు విద్యలుగా తలంపఁబడవలయునను విషయమునుఁగూర్చి చర్చించును. ఛాందోగ్యము (1-1-3) మఱియు బృహదారణ్యకము (1-3-1) లోని ఉద్గీథ విద్యలు ఉపమానములుగా స్వీకరింపఁబడినవి. ఒకే పేరును కలిగియుండుట మఱియు ఉద్గీథము రెండింటి యందు ప్రాణముతో తాదాత్మ్యము నొందుటవంటి పోలికలున్నను, అవి అభిన్నములుగా భావింపఁబడవలయును. ఏలననగా ఛాందోగ్య విద్యలోని విషయము పూర్ణమైన ఉద్గీథము కాదు. అది కేవలము పవిత్రమైన ఓంకారము. ఇఁక బృహదారణ్యకములోని ఉపాసనా విషయము పూర్ణముగా ఉద్గీథమైయున్నది.

**4వ అధికరణము (9వ సూత్రము):-** "ఓమిత్యే తదక్షర ముద్గీథ ముపాసీత" (ఛాం. ఉ. 1-1-1) అను వాక్యములోని ఓంకారము మఱియు ఉద్గీథము ఒక

దానికొకటి వివరించు సంబంధమును కలిగియున్నవి. అనగా "ఉద్గీథమని చెప్పఁబడు ఓంకారము ను మానవుడు ఉపాసించునుఁగాక" యని భావము.

**5వ అధికరణము (10వ సూత్రము):–** ఛాందోగ్యము, బృహదారణ్యకము మఱియు కౌషీతకిలోని ప్రాణవిద్య ఏకమేయని నుడువుటలో దోషములేదని సూచించును. అది ప్రాణవిద్యలయొక్క ఐక్యతను మఱియు ఒకే ఉపాసనగా నానావిధ శ్రుతులలో చెప్పఁబడిన ప్రాణము యొక్క వివిధ లక్షణములనుఁగూర్చి వివరించి చెప్పును.

**6వ అధికరణము (11–13 సూత్రములు):–** బ్రహ్మముయొక్క ప్రధానమైన మఱియు స్థిరమైన లక్షణములగు జ్ఞానానందములను సర్వత్ర గణింపవలయుననియు, తైత్తిరీయములోని ప్రత్యేక ఉపాసనకు సంబంధించిన వృద్ధిక్షయములతో కూడినట్టి అనందమే తలగా చెప్పఁబడిన వాటిని సర్వత్ర గణింపరాదనియును సూచించును.

**7వ అధికరణము (14–15 సూత్రములు):–** పరమాత్మయే ఉన్నతోన్నతమై యున్నదని నుడువునట్టి కఠోపనిషత్తు (3–10–11) లోని విషయము ఒకే విద్యను సూచించునని ప్రబోధించును.

**8వ అధికరణము (16–17 సూత్రములు):–** ఐతరేయారణ్యకము (2–4–1) లో సూచింపఁబడిన ఆత్మ సూత్రాత్మ లేక హిరణ్యగర్భుడు కాదనియు, అది పరమాత్మ యనియును ప్రబోధించును.

**9వ అధికరణము (18 వ సూత్రము):–** ప్రాణసంవాదమునకు సంబంధించిన ఒక చిన్న విషయమునుఁగూర్చి చర్చించును. ప్రాణ విద్యయం దాచమనము చెప్పఁబడలేదు. కాని జలము ప్రాణములకు వస్త్రముగా తలంపఁబడవలయునని నిర్దేశింపఁబడినది.

**10వ అధికరణము (19 వ సూత్రములు):–** పోలికను కలిగియున్న ఒకే శాఖలోని విద్యలన్నియును ఏకమే యగుటచే ఏకత్రిత మొనర్పఁబడవలయునని నుడువును.

**11వ అధికరణము (20–22 సూత్రములు):–** బృహదారణ్యకము (5–5)నందు బ్రహ్మము మొదట సూర్యమండలమునందున్నదనియు, తదనంతరము కుడికన్నునందున్నదనియు చెప్పఁబడినది. సూర్యుడు మఱియు కుడికంటియందున్న "అహర్" మఱియు "అహమ్" అని చెప్పఁబడు పరబ్రహ్మము యొక్క నామములను ఏకత్రిత మొనర్పరాదు. ఏలననగా ఈ రెండున్నూ విభిన్నమైన విద్యలైయున్నవి.

**12వ అధికరణము (23 వ సూత్రము):–** రాణాయనీయఖిలలో సూచింపఁబడిన బ్రహ్మముయొక్క లక్షణములను శాండిల్యవిద్యాది ఇతర బ్రహ్మ విద్యలకు సంబంధించినవిగా తలంపరాదని తెలుపును. ఏలననగా బ్రహ్మస్థాన విభేదమును కలిగి యుండుటచే మొదటిది స్వతంత్రమైన విద్యయైయున్నది.

**13వ అధికరణము (24 వ సూత్రము):–** ఒకే నామము కలిగియున్నను ఛాందోగ్యములోని పురుషవిద్య, తైత్తిరీయములోని పురుషవిద్య కేలాటి సంబంధము లేదని సూచించును.

**14వ అధికరణము (25 వ సూత్రము):–** "సర్వం ప్రవిధ్య" ఇత్యాది విడి మంత్రములు మఱియు ఐతరేయారణ్యకములోని మహా వ్రతోత్సవము నందలి బ్రాహ్మణుని వలె కొన్ని ఉపనిషత్తుల ఆరంభమునందు పేర్కొనఁబడిన యజ్ఞములు బ్రహ్మవిద్యకు సంబంధించిన వాటివలె కన్పట్టును. కాని అవి బ్రహ్మవిద్యకు సంబంధించినవి కావు. ఏలననగా అవి క్రతువులకు సంబంధించిన స్పష్టమైన చిహ్నములను కలిగి యున్నవి.

**15వ అధికరణము (26 వ సూత్రము):–** సత్యజ్ఞాన సమన్వితుడగు మనుజుడు మరణించునప్పుడు తన సమస్త సుకృత దుష్కృత కర్మలను విదలించుకొనునను వాక్యములోని భావమును, ఇతర వాక్యములలో చెప్పఁబడినట్లు సుకృత కర్మలను తన స్నేహితుల కొసంగుననియు, దుష్కృత కర్మలను తన శత్రువుల కొసంగుననియు అర్థమొనర్చు కొనవలయుననియు చెప్పును.

**16వ అధికరణము (27–28 సూత్రములు):–** కౌషీతక్యుపనిషత్తు నుడివినట్లు మానవుడు సుకృతదుష్కృత కర్మలను విదలించుకొనుట బ్రహ్మలోక మార్గమునందు

సంభవింపదనియు, అతడు శరీరమునుండి నిర్గమించు క్షణము నందు సంభవించుననియు నిశ్చయించి చెప్పును.

**17వ అధికరణము (29-30 సూత్రములు):-** సగుణ బ్రహ్మజ్ఞాని మాత్రమే మరణానంతరము దేవయానము గుండా వెళ్ళును. కాని నిర్గుణ బ్రహ్మజ్ఞాని కాదని సూచించును. నిర్గుణ బ్రహ్మజ్ఞాని యొక్క ఆత్మ, మరియొక స్థానమునకేగకుండా బ్రహ్మము నందైక్యమగును.

**18వ అధికరణము (31 వ సూత్రము):-** దేవయానమునకు వెళ్ళు విద్యలు తెలిసిన వారు మాత్రమే కాకుండా, సగుణబ్రహ్మ విద్యో పాసకులందఱున్నూ దేవయానము ననుసరింతురని నిర్ణయించును.

**19వ అధికరణము (32 వ సూత్రము):-** సత్యజ్ఞాన సాక్షాత్కారముచే జనన మరణములనుండి విముక్తి కలిగినను, ముక్త పురుషులు కూడా ఒకానొక దివ్యకార్య నిర్వహణకై మరల జన్మింతురను విషయమును నిశ్చయించును.

**20వ అధికరణము (33 వ సూత్రము):-** కొన్ని విద్యలలో పేర్కొనఁబడిన "అస్థూలమనణు" వంటి బ్రహ్మముయొక్క పరోక్షలక్షణములు బ్రహ్మోపాసన లన్నింటియందును వర్తించునని ప్రబోధించును.

**21వ అధికరణము (34 వ సూత్రము):-** రెండు వాక్యములున్నూ పర బ్రహ్మమును సూచించుటచే కఠోపనిషత్తు (3-1) మఱియు ముండకోపనిషత్తు (3-1) ఒకే విద్యకు సంబంధించినవని నిశ్చయించును.

**22వ అధికరణము (35-36 సూత్రములు):-** బృ.ఉ. 3-4,5 వాక్యములలో సర్వులయందున్న అంతరాత్మయే బ్రహ్మమని చెప్పఁబడుటచే, ఈ రెండు వాక్యములున్నూ ఒకే విద్యకు సంబంధించియున్నవను విషయమును సూచించును.

**23వ అధికరణము (37 వ సూత్రము):-** ఐతరేయారణ్యకము (2-2-4-6) లోని వాక్యమునందు రెండు ఉపాసనలున్నవని నిర్ణయించును. శ్రుతి అన్యోన్యాశ్రయమైన ఉపాసనను విధించినది. కాని ఒకే ఉపాసనను గూర్చి చెప్పలేదు.

**24వ అధికరణము (38 వ సూత్రము):-** బృ. ఉ. 5-4-1 మఱియు 5-5-2 నందు చెప్పఁబడిన సత్యబ్రహ్మమునుఁగూర్చిన విద్యలు ఏకమేయని నిశ్చయించును.

**25వ అధికరణము (39 వ సూత్రము):-** రెండు వాక్యములలోని అధికాంశములు పోలియుండుటచే (ఛాం.ఉ. 8-1-1) మఱియు (బృ.ఉ. 4-4-32)లో పేర్కొనఁబడిన లక్షణములు జోడింపఁబడవలయునని నిర్ణయించును.

**26వ అధికరణము (40, 41 సూత్రములు):-** ఉపవాస దినములలో ప్రాణాగ్నిహోత్రము పాటింపఁబడవలసిన పనిలేదని సూచించును.

**27వ అధికరణము (42 వ సూత్రము):-** కొన్ని ప్రత్యేక క్రతువులకు సంబంధించిన ఉపాసనలు వాటియొక్క అంశములు కావు. కావున అవి వాటితో అవిభాజ్యమైన సంబంధమును కలిగిలేవని నిశ్చయించును.

**28వ అధికరణము (43 వ సూత్రము):-** బృహదారణ్యకములోని వాయువు యొక్క ఉపాసనా సంబంధమగు వాక్యము మఱియు ఛాందోగ్యములోని ప్రాణోపాసనా వాక్యముయొక్క ముఖ్యాంశము ఒకే విధముగా నున్నను. ఈ రెండింటిని వేర్వేఱుగా తలంపఁవలయునని ప్రబోధించును.

**29వ అధికరణము (45-52 సూత్రములు):-** బృహదారణ్యకములోని అగ్ని రహస్యమునందు పేర్కొనఁబడిన మనః కల్పితములగు అగ్ని దేవతా పీఠములు క్రతుసంబంధములు కావనియు, అవి ఒక ప్రత్యేక విద్యకు సంబంధించినవనియును నిశ్చయించును.

**30వ అధికరణము (53-54 సూత్రములు):-** ఆత్మ శరీరమునకు భిన్నమైన పదార్థమైయున్నదని నిర్ణయించును.

**31వ అధికరణము (55-56 సూత్రములు):-** క్రతు సంబంధములగు ఉద్గీథోపాసనలు సమస్త శాఖలకు ప్రామాణికములై యున్నవని నిశ్చయించును.

**32వ అధికరణము (57 వ సూత్రము):-** ఛాందోగ్యము (15-11) లోని వైశ్వానరోపాసన ఒక ప్రత్యేక ఉపాసనయని నిర్ణయించును. వైశ్వానరాగ్ని పూర్తిగా ఉపాసింపఁబడవలయునేఁగాని, ఆతని ప్రత్యేక అంగములయందు కాదు.

**33 వ అధికరణము (58 వ సూత్రము):-** శాండిల్యవిద్య, దహర విద్య ఇత్యాది వివిధములగు విద్యలు వేర్వేఱుగా గణింపఁబడవలయునేఁగాని, ఒకే విద్యగా ఏకత్రిత మొనర్పరాదని నిర్ణయించును.

**34 వ అధికరణము (59 వ సూత్రము):-** ఒకే ఫలమును సూచించు బ్రహ్మోపాసనలు ఐచ్ఛికములగుటచే, వాటిని ఒకటిగా చేర్చరాదని ప్రబోధించును. తమ తమ ఇచ్ఛాను సారముగా ఉపాసనకై ఏదో యొక విద్యను ఎన్నుకొనవలసి యుండును.

**35 వ అధికరణము (60 వ సూత్రము):-** ప్రత్యేక వాంఛలను సూచించుఉ పాసనలను తమ తమ ఇచ్ఛానుసారముగా ఏకత్రిత మొనర్పఁబడవచ్చును, లేక ఒనర్పఁబడకుండవచ్చునని నిశ్చయించును.

**36 వ అధికరణము (61-66 సూత్రములు):-** ఉద్గీథాది క్రతువిభాగములకు సంబంధించిన ఉపాసనలు తమ తమ ఇచ్ఛానుసారముగా ఏకత్రిత మొనర్పఁ బడవచ్చును, లేక ఒనర్పఁబడకుండవచ్చునను విషయమును నిర్ణయించును.

# 1. సర్వవేదాంత ప్రత్యయాధికరణము

## (1 నుండి 4 సూత్రములు)

### 3-3-1 సర్వ వేదాంత ప్రత్యయం చోదనాద్యవిశేషాత్

నామరూప సంబంధాది భేద రాహిత్య కారణముచే వివిధములగు వేదాంత వాక్యములలో వర్ణింపఁబడిన ఉపాసనలన్నియును అభిన్నములై యున్నవి.

సర్వవేదాంత ప్రత్యయమ్ = వేదాంత వాక్యము లన్నింటియందుఁగల బ్రహ్మమునుఁగూర్చిన వర్ణన, చోదనాద్యవిశేషాత్ = నామరూప సంబంధాదులలో భేదము లేకుండుటచే.

ఒకే విషయమునుఁగూర్చి శ్రుతులు నానావిధోపాసనలను నిర్దేశించునా? ఒకవేళ ఒక శ్రుతి సత్యమైనది, ఇతర శ్రుతులు అసత్యములని పలికినచో, శ్రుతులన్నింటి యందు అవిశ్వాస మేర్పడును. బ్రహ్మముయొక్క స్వరూపమునుఁగూర్చి నుడువు శ్రుతులు శాసనములు కావు. అవి కేవలము సహజమగు సత్యమునుఁగూర్చి వర్ణించును.

సూత్రకారుడిప్పుడు ఉపాసనకు సంబంధించిన శ్రుతులు వ్యాపకములు మఱియు విభిన్నములా? కావా? యను విషయమునుఁగూర్చి చర్చించుచున్నాడు. కర్మలకువలె ఉపాసకులకు కూడా వివిధములగు ఫలితములన్నవని శ్రుతులు ప్రబోధించును. వాటిలో కొన్ని దృష్టఫలితములను, మరికొన్ని అదృష్ట ఫలితముల నొసంగును. కొన్ని ఉపాసనలు సత్యజ్ఞానమును ఉత్పన్నమొనర్చి, క్రమముక్తికి దారి తీయును. కావున ఆ యుపాసనలను దృష్టియందుంచుకొని, ప్రత్యేక వేదాంత వాక్యములు విభిన్నములైన బ్రహ్మోపాసనలనుఁగూర్చి ప్రబోధించునా? లేదా? యను ప్రశ్నను మనము రేకెత్తింపవచ్చును.

శ్రుతియందు బ్రహ్మమునుఁగూర్చిన అనేక వర్ణనలున్నవి. ఒకానొక శ్రుతి యందు వైశ్వానరుడుగను, మరియొక శ్రుతియందు ప్రాణము ఇత్యాదులుగను అతడు వర్ణింపఁబడియున్నాడు. ఐతే వర్ణనలు విభిన్నములా? లేక, అవి యన్నియు ఒకే లక్ష్యమును కలిగియున్నవా? యనెడి సంశయమిచ్చట కలుగవచ్చును.

ఈ సూత్ర మీ సంశయమును తొలగించును. శ్రుతులన్నింటి యందుఁ గల వర్ణనలు ఏకమేనైయున్నవి. ఉపాసకుని సామర్థ్యము ననుసరించి విభిన్న రూపమునందున్నను, బ్రహ్మోపాసనయే ఉపాసనలన్నింటికి లక్ష్యమైయున్నది. ఏలననగా ధ్యానవిధులలో భేదమేమియును లేదు. బ్రహ్మమే ఉపాసింపదగినదని విధులన్నియును సూచించుచున్నవి. కావున వర్ణనలు మఱియు ఉపాసనలన్నింటికి లక్ష్యము ఏకమేనైయున్నది.

ప్రాణోపాసన బృహదారణ్యకోపనిషత్తునందొక విధముగాను, ఛాందోగ్యము నందు మరియొక విధముగాను వర్ణింపఁబడినది. ఈ విధముగా విభిన్నమైన వైదిక శాఖలతో విభిన్నముగా వర్ణింపఁబడిన ఉపాసనలు విభిన్నములా? లేక ఏకమా? యనెడి సంశయమిచ్చట కలుగును.

రూపమునందు భేదముండుటచే అవి విభిన్నములై యున్నవని పూర్వపక్షి పలుకును. ఈ సూత్రము దీనిని ఖండించి, నానావిధ శాఖలలోని నామరూప సంబంధవిధులయందు భేదము లేకుండుటచే ఈ యుపాసన లన్నియు ఏకమేనై యున్నవని నుడువును.

ఈ విధముగా ఏకైకాగ్నిహోత్రమునకు శాఖాభేదమున్నను, అన్నింటియందుఁ గల శబ్దసాధనముచే, "జుహుయాత్" అనెడి పురుషప్రయత్నము ఏకమేనైయున్నది. కావున "బృహదారణ్యకము" (6-1-1) లోని "యోహవై జ్యేష్ఠంచ శ్రేష్ఠంచ వేద" మరియు ఛాందోగ్యము (5-1-1)లోని "యోహవై జ్యేష్ఠంచ శ్రేష్ఠంతవేద"యను వాక్యములు ఏకరీతిగానున్నవి. ప్రాణవిద్య శాఖలన్నింటి యందు ఏకమేనైయున్నది. రెండు వాక్యముల యందును ఉపాసనా ఫలమునందు భేదము లేదు. "జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ స్వానాం భవతి" (బృ.ఉ. 6-1-1) రెండు వాక్యముల యందును ప్రాణమే ఉపాసనకు విషయమై యున్నది. ఈ రెండు వాక్యములలోని ఉపాసనలు ప్రాణవిద్యయని చెప్పఁబడును. రెండు వాక్యముల యందును ప్రాణము

జ్యేష్ఠముగాను, శ్రేష్ఠముగాను చెప్పఁబడినది కావున అన్ని విషయములయందును భేదము లేకుండుటచే ఈ రెండు విద్యలు అభిన్నములై యున్నవి. ఈ రెండు విద్యలు ఏకమేనైయున్నవి. అదే విధముగా వివిధ శాఖలయందు వర్ణింపఁబడినట్టి దహరవిద్య, పంచాగ్ని విద్య, వైశ్వానరవిద్య, శాండిల్యవిద్య వీటన్నింటియందుఁ గల సత్య స్వరూపము ఏకమేనైయున్నది.

## 3-3-2 భేదా న్నేతిచే న్నైకస్యామపి

కొన్ని చిన్న విషయములలో భేదముండుటచే విద్యలు భిన్నములై యున్నవని పలికినచో, మేము దీనిని నిషేధింతుము. ఏలననగా ఒకే విద్యయందిట్టి స్వల్పభేదములుండవచ్చును.

భేదాత్ = భేదముచే, న = కాదు, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = కాదు, ఏకస్యామ్ = ఒకే విద్యయందు, అపి = కూడా,

పూర్వసూత్రమునకు ఒక ఆక్షేపణ చెప్పబడి ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకాసమాధానములనెడి రెండు విభాగములున్నవి. "భేదాన్నేతిచేత్" అనునది శంక, "నైకస్యామపి" అనునది సమాధానము.

భేదమున్నదని నీవు పలికినచో, అట్లు కాదని మేము చెప్పుదుము. ఏలననగా ఇట్టి భేదములు ఒకే ఉపాసనయందు కూడా ఉనికిని కలిగియుండును.

"తస్యాగ్ని రేవాగ్నిర్భవతి" (బృ.ఉ. 6-2-14) యను వాక్యమునందు పంచాగ్నివిద్యను సూచించునప్పుడు నిశ్చయముగా వాజసనేయులు షష్ఠాగ్నిని సూచింతురు. కాని ఛందోగులు సూచింపరు. "అథహయ ఏతానేవం పంచాగ్నీన్వేద" (ఛాం.ఉ. 5-10-10). కాని ఇంత మాత్రముచే అవి విభిన్నములు కానేరవు. ఇష్టమున్నచో ఛందోగులు కూడా దానిని కలుపవచ్చును. ఈ విధముగా బృహదారణ్యము మఱియు ఛాందోగ్యమునందు తెలుపఁబడిన విద్యలు రెండున్నూ అభిన్నములై యున్నవి.

షష్ఠాగ్ని ఉన్నను, లేకున్నను రూపమునందు భేదమేర్పడదు. ఏలననగా అతిరాత్ర క్రతువునందు షోడశిపాత్రను గ్రహింపవచ్చును. లేక గ్రహింపలేక పోవచ్చును. సంఖ్య అధికమైనను "పంచాగ్ని" నామమునకు నిషేధముండదు.

ఏలననగా ఐదవ సంఖ్య విధియందు ప్రాధాన్యమును వహించదు. ఒకే శాఖయందు మఱియు ఒకే విద్య యందు వేర్వేఱు అధ్యాయములలో ఇట్టి భేదములు కానఁబడును. ఐనను వేర్వేఱు అధ్యాయములలో వర్ణింపఁబడిన విద్య, అందరిచేతను ఏకముగానే అంగీకరింపఁబడినది.

"తం ప్రేతం దిష్టమితోఽ గ్నయ ఏవ హరంతి" (ఛాం.ఉ.5-9-2) అను వాక్యము నందు ఛాందోగ్యోపనిషత్తుకూడా నిజమునకు ఆరవ అగ్నిని సూచించును.

కావున వివిధములగు శాఖలలో వివిధములగు భేదములున్నను, ఒకే వర్గమునకు సంబంధించిన విద్యలు అభిన్నములను విషయము సుస్పష్టమగుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును:- ఇఁక ప్రాణముల మధ్య సంభాషణ జరిగినపుడు ముఖ్యమైన ప్రాణమున కతిరిక్తముగా వాక్కు, నేత్రము, శ్రోత్రము, మనస్సనెడి నాలుగు ఇతర ప్రాణములను కూడా ఛందోగులు పేర్కొందురు. మఱియు వాజసనేయులు ఐదవ దానిని కూడా పేర్కొందురు. "యోహవై ప్రజాతిం వేద ప్రజాపతేహప్రజయా పశుభీరేతోవై ప్రజాతిః ప్రజాయతేహ ప్రజయా పశుభిర్య ఏవం వేద" (బృ.ఉ.6-1-6).

మేమిట్లు సమాధాన మొసంగుదుము. ప్రాణముల యొక్క సంభాషణల యొక్క సంభాషణరూపము నందున్న విద్యయందు కొంత అధికముగా చేర్చఁబడినను దోషములేదు. ఒక ప్రత్యేక గుణమును తగ్గించుటచేతను, హెచ్చించుట చేతను, విషయజ్ఞానమునందుగాని, జ్ఞానమునందుఁగాని భేదమేర్పడదు. ఏలయనగా విషయజ్ఞానమునందు కొంత భేదమున్నను, దాని అధికాంశమునందు మఱియు దానిని గుర్తెఱుంగునట్టి వ్యక్తియందు మార్పుండదు.

కావున విద్య కూడా ఏకముగానే తలంపఁబడును.

## 3-3-3 స్వాధ్యాయస్య తథాత్వేన హి సమాచారేఽ ధికారాచ్చ సవవచ్చతన్నియమః

సమాచారమునందు సూచింపఁబడినట్లుగా తలపై అగ్నిని మోసికొనివెళ్ళు ఆచార కర్మ, ఆధర్వణికులకు వేదాధ్యయనముతో సంబంధమును కలిగి యున్నది.

సౌర్యాది సప్త ఆహుతుల విషయమునందిది అథర్వ వేదాధ్యయనము నొనర్చువారికి యోగ్యతగ కూడా పరిణింపఁబడును.

స్వాధ్యాయస్య = వేదాధ్యయనముయొక్క, తథాత్వేన = ఇట్లుండుటచే, హి = ఏలననగా, సమాచారే = వైదిక కర్మకాండనుఁగూర్చి ప్రబోధించు సమాచారమనెడి గ్రంథమునందు, అధికారాత్ = యోగ్యత కారణముచే, చ = మఱియు, సవవత్ = సౌర్యాది సప్తఆహుతుల విషయమునందు వలె, చ = మఱియు, తన్నియమః = ఆ నియమము.

ముండకోపనిషద్వాక్యము నాధారముగాఁగొని ఒక అక్షేపణ చెప్పఁబడి, ఖండింపబడినది.

మరియొక ఆక్షేపణ రేకెత్తింపఁబడినది. బ్రహ్మజ్ఞానమునుఁగూర్చి ప్రబోధించు ముండకోపనిషత్తునందు శిష్యుడు తలపై అగ్నిని మోయు శిరోవ్రతము పేర్కొనఁబడినది. అథర్వణ వేదానుయాయులచే అనుసరింపఁబడు ఈ ప్రత్యేక కార్యముచే ఆథర్వణికుల విద్యలు, ఇతర విద్యలన్నింటికి భిన్నములై యున్నవని పూర్వపక్షి పలుకును.

ఈ సూత్రము దీనిని ఖండించి తలపై అగ్నిని మోయు కార్యము విద్య యొక్క అంగము కాదనియు, కేవలము ఆథర్వణికుల వేదాధ్యయనమునకు సంబంధించినదనియు పలుకును. కావున వైదిక కర్మకాండను తెలుపునట్టి సమాచారమనెడి గ్రంథమునందిది వర్ణింపఁబడియున్నది.

ఇంతేకాకుండా ఉపనిషదంతమునందీ క్రింది వాక్యము కలదు. "నైతదచీర్ణవ్రతోఽధీతే" (ముం.ఉ. 3-2-11) దీనిచే ఇది ఉపనిషదధ్యయనమునకు సంబంధించినదనియు, విద్యకు సంబంధించినది కాదనియు స్పష్టమగుచున్నది.

"ఆహుతుల విషయమునందువలె దానికిన్నీ పరిచ్ఛిన్నత కలదు." అను మాటలలో ఈ సూత్రము మరియొక దృష్టాంతము నొసంగును. అగ్నిని మోయు ఆచారము ఒక ప్రత్యేక వేదాధ్యయనమునకే సంబంధించియున్నది. కాని ఇతర వేదములకు సంబంధించిలేదు. అగ్నితో సంబంధములేని సౌర్యాది శతౌదన పర్యంతముఁగల సప్త విధాహుతులు ఇతర వేదములలో ప్రబోధింపఁబడినవి.

కాని అధర్వణ వేదమునందు ప్రబోధింపఁబడలేదు. సప్తసవనముల నొనర్చు వారికి ఆజ్ఞ ఒసంగబడునట్లు ముండకోపనిషత్తును అధ్యయనమొనర్చువారికి ఆజ్ఞ ఒసంగఁబడును. తమ తలలపై అగ్ని కుండను మోయుటచే విద్యయందేలాటి భేదమేర్పడదు.

కావున అన్ని విషయములయందును విద్యయందేకత్వము కలదు. ఈ విధముగా విద్యల యొక్క సమైక్యతా సిద్ధాంతము స్థిరముగా నిలచియుండును.

## 3-3-4 దర్శయతి చ

ఇట్లు శ్రుతి కూడా ప్రబోధించుచున్నది.

దర్శయతి = శ్రుతి ప్రబోధించుచున్నది. చ = కూడా.

1 వ సూత్రమును బలపఱచు వాదమొసంగఁబడినది.

వేదముకూడా విద్యలయొక్క అభిన్నతనుఁగూర్చి పలుకును. ఏలననగా వేదాంతవాక్యములన్నియును ఏకైక జ్ఞానమునే లక్ష్యముగా కలిగియున్నవి. "సర్వే వేదా యత్పదమామనంతి" (కఠ.ఉ. 2-15)" ఏతంహ్యేవ బహ్వృచా మహత్యుక్థే మీమాంసంత ఏతమగ్నావధ్వర్యవ ఏతం మహావ్రతే ఛందోగాః" (ఐత. ఆర. 3-2-3-12).

విద్యలయొక్క అభిన్నతను నిరూపించుటకై మరికొన్ని దృష్టాంతములను కూడా పేర్కొనవచ్చును. "మహద్భయం వజ్ర ముద్యతమ్" (కఠ. ఉ. 3-2) ఇదే లక్షణము (తై.ఉ. 2-7-2) నందిట్లు చూపఁబడినది. "యదాహ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే, అథతస్యభయం భవతి, తత్త్వేవభయం విదుషోఽ మన్వానస్య"

పూర్ణ బ్రహ్మప్రాప్తియే వేదాంత వాక్యము లన్నింటికి లక్ష్యమైయున్నది. కావున దానికి సంబంధించిన విద్యలన్నియును అభిన్నములై యుండవలయును. బృహదారణ్యకములోని స్వర్గలోకమునుండి భూలోకమువరకు వ్యాపించియున్న సగుణ బ్రహ్మమగు వైశ్వా నరోపాసన చాందోగ్యములోని "యస్త్వేతమేవం ప్రాదేశ మాత్ర మభివిమాన మాత్మానం వైశ్వానరముపాస్తే" (ఛాం.ఉ. 5-18-1) అను వాక్యము నందు సూచింపఁబడినది. దీనిచే వైశ్వానర విద్యలన్నియును ఏకమేయను

విషయము స్పష్టమగుచున్నది.

నిర్గుణబ్రహ్మము ఏకమే కాని అనేకము కాదు. కావున సగుణబ్రహ్మము, లేక నిర్గుణ బ్రహ్మమునకు సంబంధించిన ప్రత్యేక విద్యలు కూడా ఏకమే కాని అనేకములు కావు. భక్తి పూరితమగు ఉపాసనానిమిత్తమై ఒకచోట చెప్పఁబడిన వాక్యము మరియొక చోట చెప్పఁబడుటచేత కూడా ఈ విషయము నిరూపింపఁబడుచున్నది.

వైశ్వానర విద్యయేఁగాక, ఇతర విద్యల యందు కూడా ఇదే విషయము వర్తించును. కావున వివిధ శాఖలలో విభిన్నములుగా వర్ణింపఁబడినను, విద్యలు అనేకములు కావు. వేదాంత వాక్యము లన్నియును అభిన్నములగు భక్తి పూర్వకములగు ఉపాసనలను సూచించును. ఈ విధముగా విద్యల యొక్క ఏకత్వము నిరూపింపఁబడుచున్నది.

# ౨. ఉపసంహారాధికరణము

## 3-3-5 ఉపసంహారోఽర్థాభేదా ద్విధిశేషవ త్సమానేచ

మఱియు ఒక ముఖ్య క్రతువును నెరవేర్చుటకై విభిన్నశాఖలలోని కర్మకాండలను సంయోగపఱచునట్లు, ధ్యేయవిషయమునందు భేదము లేకుండు టచే, వివిధ శాఖలలోని ఒకే వర్గమునకు చెందిన ఉపాసనలన్నింటిని ఏకత్రిత మొనర్చవచ్చును.

ఉపసంహారః = సంయోజనము, అర్థాభేదాత్ = ధ్యేయవిషయము నందు భేదము లేకుండుటచే, విధిశేషవత్ = ముఖ్యక్రతువునకు సంబంధించిన కర్మకాండవలె, సమానే = ఒక విధమైన విద్యయందు, చ= మఱియు.

పూర్వము చెప్పఁబడిన నాలుగు సూత్రముల నుండి ఒక పరామర్శము చేయఁబడినది. అనుష్ఠాన యోగ్యమగు మొదటి నాలుగు సూత్రములలోని తర్కఫలము ఈ సూత్రమునందొసంగఁబడినది.

వివిధ శాఖలలో వర్ణింపఁబడినట్టి విద్యలన్నియును ఉపాసనయందు ఏకత్రిత మొనర్పఁబడవలయును. ఏలననగా విధిశేషములవలె వాటి లక్ష్యము మఱియు ఫలముకూడా ఏకమేనైయున్నది.

స్వశాఖకంటె ఇతర శాఖలలో పేర్కొనఁబడినట్టి ప్రత్యేక విషయములు కూడా అమోఘములై యున్నవి. కావున వివిధ శాఖలలో పేర్కొనఁబడినట్టి ముఖ్యక్రతువునకు సంబంధించిన అగ్నిహోత్రాది కర్మకాండకువలె వీటినన్నింటిని సంయోగపఱచ వలసియుండును.

# 3. అన్యథాత్వాధికరణము

## (6 నుండి 8 సూత్రములు)

### 3-3-6 అన్యథాత్వం శబ్దాదితిచేన్నా విశేషాత్

ఒకవేళ గ్రంథ భేద కారణముచే బృహదారణ్యకము మఱియు ఛాందోగ్యములోని ఉద్గీథవిద్యలు వేర్వేరైయున్నవని పలికినచో, వాటి సారతత్త్వమునం దభిన్నత యుండుటచే అట్లుకాదని మేము దీనిని నిషేధింతుము.

అన్యథాత్వం = భేదభావము, శబ్దాత్ = గ్రంథభేద కారణముచే, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, న = కాదు.

వాటి సారతత్త్వమునం దభిన్నత యుండుటచే అట్లుకాదని మేము దీనిని నిషేధింతుము.

ఈ సూత్రము పూర్వపక్షి యొక్క దృష్టికోణమును వెలిబుచ్చును. రెండు విద్యలున్నూ ఏకమేయని నిరూపించుటకు పూర్వపక్షి ప్రయత్నించును.

ఈ సూత్రము ఆక్షేపకుని దృష్టికోణము ననుసరించిన ఆక్షేపణ మఱియు తన ఆక్షేపణను బలపఱచుటకై అతడొనర్చు ఖండనయనెడి రెండు విభాగములను కలిగి యున్నది. "అన్యథాత్వం శబ్దాదితిచేత్" అనునది ఊహింపఁబడిన ఆక్షేపణ మఱియు "నావిశేషాత్" అనునది దానికి సమాధానమైయున్నది.

వాజసనేయకమునందీ క్రింది వాక్యములు కలవు. "తేహదేవా ఊచుర్హంతానురాన్యజ్ఞ ఉద్గీథేనాత్యయామేతి" (బృ.ఉ. 1-3-1) "తేహవాచ మూచుస్త్వం న ఉద్గాయేతి తథేతి తేభ్యోవాగుదగాయత్" (బృ.ఉ. 1-3-2).

వాక్కు మఱియు ఇతర ప్రాణములు అసురులయొక్క దౌర్జన్యముచే తుత్తునియలు చేయఁబడెను. అవి తమ కర్తవ్యములను నెరవేర్పఁజాలకుండెను.

అప్పుడు దేవతలు ముఖ్యప్రాణమును పంపి "త్వం న ఉద్గాయ" అని వాక్కును జడిపించిరి. వాక్కు "సరి" యని పలికి పాడ నారంభించెను.

దేవతలు ఉద్గీథమును గ్రహించిన ఇటువంటి కథయే ఛాందోగ్యము (1-2-1) నందున్నూ కలదు. దానిచే తాము అసురులను జయింపవచ్చునని వారు భావించిరి. ఇతర ప్రాణములు దౌర్జన్యముచే తుత్తునియులు చేయఁబడి. అసురులచే జయింపఁబడెను. అప్పుడు దేవతలు ముఖ్యప్రాణమును సమీపించిరి. మఱియు ఉద్గీథరూపము నందున్న ముఖ్యప్రాణమును వారు ఉపాసించిరి.

ఈ రెండు వాక్యములున్నూ ముఖ్యప్రాణమును స్తుతించును. కావున ఈ రెండున్నూ ప్రాణోపాసనకు సంబంధించినవని తెలియుచున్నది. ఇప్పుడీ రెండు విద్యలు భిన్నములా? లేక ఏకమా? యనెడి సంశయమేర్పడును.

ఈ రెండు విద్యలు ఏకమే యని పూర్వపక్షి పలుకును. గ్రంథ విభేద కారణముచే అవి ఏకము కావని ఆక్షేపించబడఁవచ్చును. వాజసనేయులు "త్వంన ఉద్గాయ" అను వాక్యముచే ప్రాణము ఉద్గీథమును సృష్టించునని పలుకుదురు. ఇఁక ఛందోగులు అదియే స్వయముగా ఉద్గీథమైయున్నదని పలుకుదురు. "అథహాయ ఏవాయం ముఖ్యః ప్రాణస్తముద్గీథ ముపాసాంచక్రిరే" (ఛాం.ఉ. 1-2-7) ఈ విభిన్నత్వమునకు మఱియు విద్యలయొక్క ఏకత్వమునకు సమన్వయ మెట్లేర్పడును?

కాని దీనిని అంగీకరింపరాదు. ఏలననగా అనేకాంశములయందు వీటియందేకత్వమున్నది. ఈ రెండు వాక్యములలోను దేవతలు, అసురులు యుద్ధమొనర్చుట మఱియు వారుభయులున్నూ మొదటవాక్కును, ఇతర ప్రాణములను, ఉద్గీథమును స్తుతించినను లాభము లేకుండుటచే ముఖ్యప్రాణమును సమీపించుట మరియు ముఖ్య ప్రాణముయొక్క బలముచే అసురులు ఓడింపఁబడుట యనెడి విషయములున్నవి.

వీటియందు కొంత భేదమున్నను, అది ఈ రెండు విద్యలను విభిన్న మొనర్చునంతటి శక్తిమంతమైనది కాదు.

"ఏష ఉవా ఉద్గీథః" (బృ.ఉ. 1-3-23) అను వాక్యాంశముతో వాజసనేయ వాక్యములోని ముఖ్యప్రాణము మఱియు ఉద్గీథము సమన్వయింపఁబడును. కావున ఛాందోగ్యములోని ముఖ్యప్రాణము కూడా గౌణముగా ఉద్గీథమును సృష్టించునని మన మూహింపవలసియున్నది.

ఈ విధముగా ఈ రెండు వాక్యములు ఒకే విద్యను సూచించును. (3-3-1) వ సూత్రమునుఁబట్టి ఈ విద్యలయందేకత్వమున్నది.

## 3-3-7 నవా ప్రకరణభేదా త్పరోవరీయస్త్వాదివత్

లేక, 'జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ' యనెడి బ్రహ్మము రూపమునందున్న ఉద్గీథోపాసన మఱియు నేత్రాదులయందున్న ఉద్గీథోపాసనకు భేదములుండుటచే ఈ విద్యలయందున్నూ ఏకత్వములేదు.

న = కాదు, వా = నిశ్చయముగా, ప్రకరణభేదాత్ = ప్రకరణము నందుఁగల భేదముచే, పరోవరీయస్త్వాదివత్ = జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చయనెడి బ్రహ్మము మరియు ఉద్గీథోపాసనయందు భేదముండుటచే.

పూర్వసూత్రములోని ఆక్షేపణ ఖండింపఁబడినది.

ఈ సూత్రము పూర్వదృక్పథమును ఖండించి, అనేక విషయములలో పోలిక యున్నను ప్రకరణ భేదమున్న కారణముచే ఈ విద్యలు విభిన్నములై యున్నవని నిరూపించును.

ఛాందోగ్యమునందు ఓంకారమునకు ఉద్గీథమనెడి పరిచ్ఛిన్నత యున్నట్లు చెప్పఁబడినది. కావున ఇట్టి ఓంకారము ప్రాణముగా తలంపఁ బడవలయును. రెండవ దానియందు ఉద్గాతయే ప్రాణముగా చెప్పఁబడినది. ఉద్గీథోపాసన పరోవరీయమగుటచే, ఈ రెండు విద్యలును విభిన్నములై యున్నవి. "స ఏష పరోవరీయా నుద్గీథః స ఏషో నంతః" (ఛాం. ఉ. 1-9-2) అను ఉపాసన "అక్ష్యాదిత్యాదిగత హిరణ్యశ్మశ్రుత్వాదిగుణ విశిష్టోద్గీథోపాసన"కు భిన్నమైయున్నది.

ఛాందోగ్యమునందు మాత్రమే ఉద్గీథముయొక్క అంశమైన ఓంకారాక్షరము ప్రాణరూపమునందు ఉపాసింపఁబడినది. "ఓమిత్యేతదక్షర ముద్గీథ ముపాసీత" (ఛాం. ఉ. 1-1-1) కాని బృహదారణ్యకమునందు ఉద్గీథమంతయు ప్రాణ రూపముగా ఉపాసింపఁబడినది. (1-3-2). కావున ఉపాస్య విషయమునందు భేదముండుటచే ఈ రెండు విద్యలు ఏకముకావని తెలియుచున్నది.

ఒకే శాఖ యందున్నను విభిన్నమైన విద్యలయొక్క ప్రత్యేకాంశములను ఐక్యమొనర్పరాదనగా, ఇఁక విభిన్నమైన శాఖలయందున్న విభిన్నమైన విద్యలను ఐక్యమొనర్పరాదని వేఱుగా చెప్పవలయునా?

## 3-3-8 సంజ్ఞాతశ్చేత్తదుక్తమస్తితు తదపి

ఒకపేరు ఉన్న కారణముచే ఈ విద్యలు ఏకమేయని పలికినచో, అది ఇతః పూర్వమే వివరింపఁబడినదని మేము సమాధాన మొసంగుదుము. కావున ఒకే పేరును కలిగియున్నను, అవి భిన్నమైన విద్యలని మనము అంగీకరింప వలసియున్నది.

# 4. వ్యాప్త్యధికరణము

## 3-3-9 వ్యాప్తేశ్చసమంజసమ్

మఱియు ఓంకారము సమస్త వేదములయందు వ్యాపించియుండుటచే దానికి "ఉద్గీథమ"నెడి ప్రత్యేకనామము నొసంగుట సమంజసమైయున్నది.

వ్యాప్తేః = ఓంకారము సమస్త వేదములయందు వ్యాపించియుండుటచే, చ = మఱియు, సమంజసమ్ = యుక్తమైయున్నది.

7వ సూత్రమిచ్చట విస్తరించి చెప్పఁబడినది.

"ఓమిత్యేత దక్షరముద్గీథ ముపాసీత" అను శ్రుతియందు ఓంకారమునకు విశేషణముగా ఉద్గీథము ప్రయోగింపఁబడుట సమంజసమైయున్నది. ఏలననగా ఓంకారము స్వయముగా శ్రుతులన్నింటి యందు వ్యాపించియున్నది. కావున దీనిని సామాన్యార్థమునందు స్వీకరింపరాదు.

"ఓమిత్యేత దక్షరముద్గీథ ముపాసీత" యను వాక్యమునందుగల ఓంకారము మఱియు ఉద్గీథమనెడి శబ్దములు తుల్యార్థమునందు ప్రయోగింపఁబడినవి. ఇప్పుడీ రెండు శబ్దముల సంబంధమునందుఁగల భావము అధ్యాసమా? అపవాదమా? ఏకత్వమా? లేక, విశేషణమా? యను ప్రశ్న ఇచ్చట ఉదయించును.

"చ" యను శబ్దమిచ్చట "కాని" యను అర్థమునందు ప్రయోగింపఁబడినది. ఇది మొదటి మూడింటిని నిరాకరించి, నాల్గవదానిని అనుసరించును. నీలోత్పల శబ్దమువలె ఒకటి రెండవదానికి విశేషణమైయున్నది ఈ వాక్యమునందు ఉద్గీథము ఓంకారమునకు విశేషణమైయున్నది. ఛాందోగ్యములోని ఈ వాక్యము నందలి ఉద్గీథము ఓంకారముఁగూర్చి విశేషించి చెప్పుటకై ప్రయోగింపఁ బడినది.

# 5. సర్వాభేదాధికరణము

## 3-3-10 సర్వాభేదా దన్యత్రేమే

ప్రాణవిద్యనుꠓగూర్చి చెప్పꠓబడిన వివిధశాఖ లన్నింటియందుꠓగల విద్యయం దభేద ముండుటచే, ఈ రెండు లక్షణములను కౌషీతక్యుపనిషత్తు నందు చేర్చవలసియుండును.

సర్వాభేదాత్ = సర్వత్ర అభేదముండుటచే, అన్యత్ర = ఇతర స్థలములలో, ఇమే = ఈ గుణములు చేర్చꠓబడవలయును.

5వ ముఖ్య సూత్రముꠓగూర్చి ఒక దృఢమైన దృష్టాంతము చూపꠓబడినది.

వాజసనేయులు మఱియు ఛందోగులచే జ్యేష్ఠము మఱియు శ్రేష్ఠముగా పేర్కొనꠓబడిన ప్రాణమే ఉపాస్యవస్తువని ప్రాణముల సంభాషణయందు నిర్ణయింపꠓబడినది. వాగాది ఇతర ఇంద్రియములకు ఐశ్వర్యము ఇత్యాది వివిధ గుణములు ఆరోపింపబడినవి. తుట్టతుదకు ఈ తర్వాతి గుణములు ప్రాణమునకు కూడా ఆరోపింపꠓబడినవి. "యద్వాఅహం వసిస్ఠాఽస్మిత్వం తద్వసిష్ఠోఽసి (బృ.ఉ. 6-1-14).

"అన్యత్ర భూతాచ్చభవ్యాచ్చయత్తత్పశ్యతి తద్వద" (కఠ.ఉ. 2-14) వంటి ఇతర శాఖలలోకూడా కౌషీతకులు నుడువునట్టి జ్యేష్ఠ శ్రేష్ఠాది గుణములు ప్రాణమున కారోపింపꠓబడినవి. కాని ఐశ్వర్యాది గుణములు ఇచ్చట పేర్కొనꠓ బడలేదు.

అట్లు పేర్కొనꠓబడనప్పుడు కౌషీతకియందుకూడా వీటిని చేర్చుకొన వలయునా? లేదా? యను ప్రశ్న ఇచ్చట ఉదయించును.

ఉపనిషత్త్రయములోని విద్య ఏకమేనై యుండుటచే, వీటిని చేర్చుకొనవల యునని ఈ సూత్రము తెలుపును. ఒక విద్యకు సంబంధించిన గుణములను, ఆ విద్య ఎచ్చటెచ్చట పేర్కొనꠓబడునో అచ్చటచ్చట దాని కారోపింపవలసి యుండును.

# 6. ఆనందాద్యధికరణము
# (11 నుండి 13 సూత్రములు

## 3-3-11 ఆనందాదయః ప్రధానస్య

బ్రహ్మోపాసనయందు బ్రహ్మముయొక్క నిజస్వరూపమును సూచించు ఆనందాది గుణములను అన్ని స్థలముల నుండి చేర్చుకొనవలసియుండును.

ఆనందాదయః = ఆనందాదిగుణములు, ప్రధానస్య = బ్రహ్మము యొక్క.

నానావిధ శాఖలలోని వివిధములగు వాక్యములలో బ్రహ్మము ఆనంద స్వరూపము, జ్ఞానస్వరూపము, సర్వవ్యాపకము, సర్మాత్మ, సత్యస్వరూపము ఇత్యాదులుగా వర్ణింపఁబడినది. కాని అన్ని స్థలములలో అన్ని గుణములు పేర్కొనఁబడలేదు.

ఐతే బ్రహ్మోపాసనయందు అవి ఏకత్రిత మొనర్పఁబడవలయునా? లేదా? యను ప్రశ్న ఇచ్చట ఉదయించును. అన్ని శాఖలలోని ఉపాస్యవస్తువగు బ్రహ్మము ఏకమే యగుటచేతను మరియు అది ఒకే విద్యయగుటచేతను అవి యన్నియు ఏకత్రిత మొనర్పఁబడవలయునని ఈ సూత్రము నుడువును. 10వ సూత్రములోని విషయమే ఈ నిర్ణయమునకు కారణమైయున్నది.

ఒకచోట బ్రహ్మమునుఁగూర్చి చెప్పఁబడిన గుణములను బ్రహ్మమును గూర్చి పేర్కొనఁబడిన స్థలములన్నింటియందును చేర్చుకొనవలసియుండును.

## 3-3-12 ప్రియశిరస్త్వా ద్యప్రాప్తి రుపచయా పచయౌ హి భేదే

ఆనందమే తలగా కలిగియున్న గుణములు అన్ని స్థలములలో స్వీకరింపరాదు. ఏలననగా అది వృద్ధిక్షయములను కలిగియున్నది. మఱియు వృద్ధిక్షయములు భేదమున్నప్పుడే సంభవించును; కాని అభిన్నమైయున్న బ్రహ్మమునందవి సంభవింపవు.

ప్రియశిరస్త్వాది = ఆనందమే తలగా కలిగియున్న గుణములు, అప్రాప్తిః = అన్ని చోట్ల స్వీకరింపరాదు. ఉపచయాపచయౌ = వృద్ధిక్షయములు, హి = ఏలననగా, భేదే = భేదమున్నప్పుడు సాధ్యమగును.

ప్రతి ఉపాసనయందేయే గుణములను ఏకత్రిత మొనర్పరాదో సూచించుచు, ఇచ్చట 11వ సూత్రములోని చర్చ ప్రారంభింపఁబడినది.

భేదభావమున్నప్పుడే ఎక్కువ తక్కువలుండును. కావున "ప్రియశిరస్" ఇత్యాది వర్ణనలు బ్రహ్మమునకు వర్తించవు. తైత్తిరీయోపనిషత్తులోని ప్రియశిరస్ ఇత్యాది వర్ణనలు బ్రహ్మమునకు సంబంధించిన ధర్మములు కావు. అవి ఆనందమయ కోశమునకు సంబంధించియున్నవి. మనస్సును బ్రహ్మమువైపు త్రిప్పుటకై ఇట్టి వర్ణన లొసంగఁబడినవి. సగుణ బ్రహ్మోపాసనయందు గుణములలో హెచ్చు తగ్గులుండవచ్చును. కాని నిర్గుణబ్రహ్మమునకవి వర్తించవు.

బ్రహ్మముయొక్క ప్రతి ఉపాసనయందు ఆనందమే శిరస్సుగా కలిగియుండుట వంటి గుణములు అంగీకరింపఁబడవు. ఏలననగా బ్రహ్మమున కంగముల నారోపింతుమేని, అది వృద్ధిక్షయములకు గుఱి కావలసివచ్చును.

బ్రహ్మోపాసననుఁగూర్చి చెప్పఁబడిన ఇతర స్థలములలో తైత్తిరీయోపనిషత్తు నందు చెప్పఁబడిన ఆనందమే శిరస్సువంటి గుణములను చేర్చుకొనరాదు. ఏలననగా "తస్య ప్రియమేవ శిరః" మోదోదక్షిణః పక్షః" "ప్రమోద ఉత్తరః పక్షః" "ఆనంద ఆత్మా" "బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా" (2-5-2) అను గుణములు జీవులయొక్క వృద్ధి క్షయములను సూచించును. కావున భేదమున్నచోటనే వీటికి స్థానమున్నదని తెలియుచున్నది.

భేదము లేక నానాత్వమున్నచోటనే ఉచ్చనీచములుండును. కాని బ్రహ్మము నానాత్వము లేక భేదరహితమైయున్నదని అనేక శ్రుతి వాక్యములచే మనకు తెలియుచున్నది. (ఏకమేవా ద్వితీయమ్) కావున ఈ గుణములచే బ్రహ్మముయొక్క స్వరూపము గోచరముకాదు. ఆయా శ్రుతులకే వాటిని నిర్బంధింపవలయును. కాని వాటిని ఇతర స్థలములకు తీసుకొని వెళ్ళరాదు.

ఇంతేకాకుండా కేవలము మనస్సును కేంద్రీకరించుటకే ఈ గుణములు పరబ్రహ్మమున కారోపింపఁబడినవి. కాని అవి స్వయముగా ఉపాస్యములు కావు. దీనిచే అవి సర్వత్ర ప్రామాణికములుకావని తెలియుచున్నది. ఒక దానినిఁగూర్చి పేర్కొనఁబడిన గుణములు మిగిలిన వాటికి ప్రామాణికములు కాఁజాలవు.

ఈ విషయము ఒక రాజుకు ఒక భార్య విసనకర్రతోను, రెండవభార్య

గొడుగుతోను పరిచర్యచేయు ఇద్దఱు భార్యల దృష్టాంతమును పోలియున్నది. ఇచ్చట కూడా ఉపాస్యము ఏకమేనై యున్నను, ఉపచార కర్మలు విభిన్నములై యున్నవి. అవి తమ స్వంత ప్రత్యేక గుణములను కలిగియున్నవి. ప్రస్తుత చర్చనీయాంశము కూడా ఇట్టిదేనై యున్నది.

ఉచ్చనీచ భేదములుఁగల గుణములు కేవలము నానాత్వసహితమగు సగుణ బ్రహ్మమునకు మాత్రమే సంబంధించియున్నవి. కాని అవి గుణాతీతమగు నిర్గుణ పరబ్రహ్మమునకు సంబంధింపవు. కొన్ని ప్రత్యేక స్థలములలో పేర్కొనఁబడినట్టి సత్కామము వంటి గుణములు ఇతరములగు బ్రహ్మోపాసనలకు ప్రామాణికములు కావు.

## 3-3-13 ఇతరే త్వర్థసామాన్యాత్

కాని భావమునందు అభేదముండుటచే, ఆనందాది ఇతర గుణములు ఏకత్రిత మొనర్పఁబడవలయును.

ఇతరే = ఇతర గుణములు, తు = కాని, అర్థసామాన్యాత్ = ఏకైకభావ కారణముచే.

పూర్వపు చర్చ కొనసాగుచున్నది.

కాని వర్ణనలయొక్క ఉద్దేశ్యము ఏకమై యుండుటచేతను, ప్రత్యక్షముగా బ్రహ్మమునకు సంబంధించియుండుటచేతను, అవి బ్రహ్మమునందం తర్నిహితములైన గుణములగుటచేతను, వాటి లక్ష్యము అఖండైకాపరిమితమగు బ్రహ్మమే యగుటచేతను ఆనందము, జ్ఞానము, సర్వవ్యాపకత ఇత్యాది బ్రహ్మము యొక్క స్వరూపమును వర్ణించు గుణములను ఏకత్రిత మొనర్పవలసియుండును.

బ్రహ్మము యొక్క నిజమైన స్వరూపమునుఁగూర్చి ప్రబోధించు శ్రుతులలోని ఈ గుణములు బ్రహ్మమునుఁగూర్చి పేర్కొను వాక్యములన్నింటికి ప్రామాణికములై యున్నవి. ఏలననగా బ్రహ్మముయొక్క స్వరూపమునుఁగూర్చి ప్రబోధించు వాటి లక్ష్యము ఏకైకమైయున్నది. ఈ గుణములు కేవలము బ్రహ్మజ్ఞానము నిమిత్తమై సూచింపబడినవే కాని ఉపాసన నిమిత్తమైకాదు.

# 7. ఆధ్యానాధికరణము

## (14–15 సూత్రములు)

### 3–3–14 ఆధ్యానాయ ప్రయోజనాభావాత్

ఉపాసనానిమిత్తమై కఠోపనిషద్వాక్యము (1–3–10) ఆత్మయే ఉత్పన్నమైనదిగా నుడువుచున్నది. ఏలననగా ఇంద్రియాదులకంటె ఉన్నతమైన విషయ జ్ఞానముచే ప్రయోజనము లేదు.

ఆధ్యానాయ = ఉపాసనానిమిత్తమై, ప్రయోజనాభావాత్ = ప్రయోజనము లేకుండుటచే.

పూర్వపుచర్చ కొనసాగుచున్నది.

కాఠకమునందిట్లు కలదు. "ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః మనసస్తు పరాబుద్ధిః" (కఠ. ఉ. 1–3–10). "పురుషాన్నపరం కించిత్సా కాష్ఠాసాపరాగతిః" (కఠ ఉ. 1–3–11).

ఈ వాక్యము పూర్వపు పదార్థముకంటె ముందున్న పదార్థము క్రమముగా ఉన్నతమైనదని సూచించునా? లేక కేవలము వీటన్నింటికంటె ఆత్మయే ఉన్నతమైనదని సూచించునా? యని ఇచ్చట సందేహమేర్పడును.

పూర్వపక్షి మొదటి విషయము సంగీకరించును. ఏలననగా ఈ వాక్యము నందు ఇంద్రియముల కంటె విషయములు ఉన్నతములనియు, మనసు విషయములకంటె ఉన్నతమనియు క్రమముగా నొక్కి చెప్పఁబడినది. ఈ వాక్యములు వేఱువేఱనియు, అది కేవలము ఆత్మను సూచించునట్టి ఒకే వాక్యము కాదనియు అతడు పలుకును. కావున ఈ వాక్యము యొక్క ఉద్దేశ్యము ఇంద్రియముల కంటె విషయములు ఉన్నతములు ఇత్యాది విషయములనుఁగూర్చి ప్రబోధించుటయై యున్నది.

ఈ సూత్రము దీనిని ఖండించి ఇది ఒకే వాక్యమనియు, అన్నింటి కంటె ఆత్మయే శ్రేష్ఠమైయున్నదని ఇది సూచించుననియును నుడువును.

మొదటిదానికంటె రెండవది ఉన్నతమని చెప్పుట శ్రుతి యొక్క లక్ష్యము కాదు. ఏలననగా ఇట్టి వివరణచే ఏలాంటి ప్రయోజనముఁగాని, ఆధ్యాత్మిక లాభముగాని, ఉండదు. అన్నింటికంటె బ్రహ్మమే శ్రేష్ఠమని చెప్పుటయే దీనికి లక్ష్యమై యున్నది. ఏలననగా ఇట్టి జ్ఞానము మోక్షదాయకమైయున్నది.

ఆత్మమాత్రమే తెలియబడవలయును. ఏలననగా జ్ఞానము స్వాతంత్ర్యమును లేక మోక్షము నొసంగును. శ్రుతికూడా ఇట్లు నుడువుచున్నది. "నిచాయ్యతన్ మృత్యుముఖాత్ప్రముచ్యతే" (కఠ. ఉ. 1-3-15).

ఇంతేకాకుండా ఆత్మకంటె ఉన్నతమైనది మరియొకటిలేదని తెలుపుట ద్వారా శ్రుతి ఆత్మకు మహాగౌరవము నొసంగుచున్నది. మఱియు అది పరమలక్ష్యమని నుడువుట ద్వారా ఆత్మను సూచించునిమిత్తమే వరుసగా పదార్థములు గణింపఁ బడినవని తెలియుచున్నది. ఆత్మనుఁగూర్చి ధ్యానించి ఆత్మజ్ఞానమునుఁ బడయుటకై ఈ వివరమొసంగఁబడినది.

## 3-3-15 ఆత్మ శబ్దాచ్చ

మఱియు ఆత్మ శబ్దమువలన.

ఆత్మశబ్దాత్ = ఆత్మశబ్దమువలన, చ = మఱియు.

14వ సూత్రమును బలపరచు వాదమొసంగఁబడినది.

చర్చనీయాంశము ఆత్మ యగుటచే పై నిర్ణయము సునిశ్చిత మగుచున్నది. "ఏష సర్వేషు భూతేషు గూఢోఽ త్మాన ప్రకాశతే, దృశ్యతేత్వ గ్ర్యయాబుద్ధ్యాసూక్ష్మయా సూక్ష్మదర్శిభిః" (కఠ. ఉ. 1-3-12). దీనిచే శ్రుతి ఇతర పదార్థములను అనాత్మగా నుడువుచున్నదని మనము నిర్ణయింపవచ్చును.

"యచ్ఛేద్వాఙ్మనసీప్రాజ్ఞః" (కఠ. ఉ. 1-3-13) ఈ వాక్యము మనము పరమాత్మజ్ఞానము నొందుటకై ఉపాసనను విధించుచున్నది. కావున ఆత్మనుఁగూర్చియే శ్రుతి నానావిధములగు శ్రేష్ఠతలను సూచించుచున్నది. కాని ఇతర పదార్థములనుఁగూర్చి కాదని తెలియుచున్నది.

"సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్" (కఠ.ఉ. 1-3-9) అను వాక్యముచే పరమ లక్ష్యము తెలియఁబడుచున్నది. కావున ఇంద్రియములు

, విషయములు మున్నగునవి కేవలము ఉన్నతోన్నతమగు విష్ణుపదమును చేరుటకే చెప్పఁబడినది. కాని ఇంద్రియములు, విషయములు ఇత్యాదులయందుఁగల సంబంధమును తెలుపుటకు కాదని మేము నిర్ణయింతుము.

ఐతే ఇంద్రియాదుల గణన పూర్తిగా నిష్ప్రయోజనము కాదు. అది బహిర్ముఖమైయున్న సాధకుని మనస్సును ఆత్మవైపు అంతర్ముఖ మొనర్చును. ఈ సూక్ష్మమైన ఆత్మ ఏకాగ్రత, అంతర్ముఖత్వము మఱియు నైష్ఠికధ్యానము వినా పొందఁబడదు.

# 8. ఆత్మగృహీత్యధికరణము

## (16-17 సూత్రములు)

### 3-3-16 ఆత్మగృహీతి రితరవ దుత్తరాత్

సృష్టికి సంబంధించిన ఇతర శ్రుతులలో నుడువఁబడిన విషయమునుఁ బట్టి ఐతరేయోపనిషత్తు (1-1) నందు పరమాత్మ సూచింపఁబడినదని తెలియుచున్నది.

ఆత్మగృహీతిః = పరమాత్మ సూచింపఁబడుట, ఇతరవత్ = సృష్టికి సంబంధించిన ఇతర శ్రుతులవలె, ఉత్తరాత్ = తదనంతర విషయమునుఁబట్టి.

ఐతరేయోపనిషత్తిట్లు నుడువుచున్నది. "ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీన్నా న్యత్కించ న మిషత్స ఈక్షతలోకాన్ను సృజా ఇతి" (1-1). నేను లోకములను సృష్టింతునుఁగాక! యని అతడు సంకల్పించెను. అతడీ లోకములను సృష్టించెను. ఇచ్చట ఆత్మశబ్దము పరమాత్మను సూచించునా? లేక, హిరణ్యగర్భునివంటి మరియొక దానిని సూచించునా? యనెడి సంశయ మేర్పడును.

సృష్టికి సంబంధించిన ఇతర శ్రుతులవలెనే ఆత్మశబ్దము పరమాత్మను సూచించునేఁగాని, హిరణ్యగర్భుని సూచింపదు. "ఆత్మన ఆకాశస్సంభూతః" (తై. ఉ. 2-1-1). ఏలననగా వెనుకటి ఐతరేయ వాక్యమునందిట్లు కలదు. "సఈక్షత లోకాన్నుసృజా ఇతి" (ఐ. ఉ. 1-1-1). "సఇమాగ్ంలోకాన సృజత" (ఐ.ఉ. 1-1-2) సృష్టికి పూర్వము "స ఈక్షత" యనెడి లక్షణము ఇతర శ్రుతివాక్యములలో

బ్రహ్మమునకు ముఖ్యార్థమునం దారోపింపఁబడినది. కావున ఆత్మ పరమాత్మను లేక పరబ్రహ్మమును సూచించునే కాని హిరణ్యగర్భునిఁగాని, మరి ఏలాటి ఇతర ప్రాణినిఁగాని సూచింపదని మేము నిర్ణయింతుము.

**3-3-17 అన్వయా దితిచే త్స్యాదవధారణాత్**

ఒకవేళ పూర్వోత్తర సందర్భము ననుసరించి పరమాత్మ సూచింపఁబడలేదని పలికినచో, అట్లుకాదు పరమాత్మయే సూచింపఁబడినదని మేము సమాధాన మొసంగుదుము. ఏలననగా "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" అను వాక్యము ఛాందోగ్యము (6-2-1) నందు కలదు.

అన్వయాత్ = పూర్వోత్తర సందర్భము ననుసరించి, ఇతి = ఈ విధముగా, చేత్ = ఒకవేళ, స్యాత్ = అది అట్లు కావచ్చును. అవధారణాత్ = నిశ్చితమైన వాక్యముచే.

16వ సూత్రమునకొక ఆక్షేపణ చెప్పఁబడి, ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకా సమాధానములనెడి రెండు విభాగములున్నవి. "అన్వయాదితిచేత్" అనునది ఆక్షేపణ. "స్యాదవధారణాత్" అనునది సమాధానము.

ఇచ్చట పరబ్రహ్మము, లేక పరమాత్మ సూచింపఁబడినది. "ఆసీత్" అను శబ్దము కేవలము పరబ్రహ్మమునే సూచించును. ఏలననగా సమస్త సృష్టికి పూర్వము అతడే ఉనికిని కలిగియుండెను. మహాభూతసృష్టికి అనంతరమే లోకసృష్టి ఏర్పడినది.

పూర్వపక్షి ఇట్లనును:- "బ్రహ్మము చతుర్విధలోకములను సృష్టించెన"ని ఐతరేయోపనిషత్తు (1-10) నందు కలదు. కాని తైత్తిరీయాది ఇతర శ్రుతులలో బ్రహ్మము ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వియనెడి పంచభూతములను సృష్టించెనని చెప్పఁబడినది. పరమాత్మచే సృష్టింపఁబడిన పంచభూతముల సహాయముచే హిరణ్యగర్భుడు మాత్రమే ప్రపంచమును సృష్టించును. కావున ఐతరేయోపనిషత్తులోని ఆత్మ, పరమాత్మ కానేరదు, కాని కేవలము హిరణ్యగర్భుడు, లేక కార్యబ్రహ్మమైయున్నది.

ఈ సూత్రము దీనిని ఖండించి ఇట్లు పలుకును. అద్వితీయుడగు ఏకైక పదార్థమును సూచించునట్టి "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" (ఛాం. ఉ. 6-2-1)

అను వాక్యము కేవలము పరమాత్మ లేక పరబ్రహ్మమును మాత్రము సూచించును. కాని హిరణ్యగర్భునిఁగాని కార్యబ్రహ్మమునుఁగాని సూచింపదు. ఇతర శాఖలలో వర్ణింపఁబడినట్లు పరమాత్మ భూతసృష్టికి అనంతరము చతుర్విధ లోకములను సృష్టించెను. ఇతర స్థలములలో పేర్కొనఁబడినట్టి పరమాత్మకు సంబంధించిన గుణములను ఐతరేయకోపాసనయందు చేర్చుకొనవలయును.

# 9. కార్యాఖ్యానాధికరణము

## 3-3-18 కార్యాఖ్యానాద పూర్వమ్

స్మ ృతియందితః పూర్వమే విధింపఁబడినట్టి కార్యము ప్రాణవిద్యయం దాచమన రూపమునందు ద్విరుక్త మొనర్పఁబడుటచే, ఇతరచోట్ల అట్లు విధింపఁబడనిదేదో అది శ్రుతియందు విధింపఁబడినది.

కార్యాఖ్యానాత్ = స్మృతియందితః పూర్వమే విధింపఁబడిన కార్యముయొక్క వచనానుసారముగా, అపూర్వమ్ = మరియొకచోట అట్లు విధింపఁబడనట్టిది.

ప్రాణోపాసన విషయమునందు మరియొకచోట పేర్కొనఁబడినట్టిదే ఆచమన రూపమునందు ద్విరుక్త మొనర్చఁబడినది. ఆహారమును కప్పునట్టి నీటినిఁగూర్చి మాత్రము ఉపాసించుట విధింపఁబడినది. ఛాందోగ్యోపాసనయగు ప్రాణవిద్యయం దిట్టి ఆచమనము విధింపఁబడలేదు. ఆచమనము స్మ ృతుల యందు విధింపఁబడుటచే, ఇది సర్వజన సామాన్యమైయున్నది. అనగ్నతచ్చింతనము అనగా ఆహారము జలముచే కప్పఁబడుట యనెడి ఉపాసన విధింపఁబడినది.

"తస్మాద్వా ఏతదశిష్యంతః పురస్తాచ్చో పరిష్టాచ్చాద్భిః పరిదధతి" (ఛాం. ఉ . 5-22) మఱియు "తద్విద్వాంసః శ్రోత్రియా ఆశిష్యంత ఆచామంత్య శిత్వాచామం త్యేతమేవ తదనమనగ్నం కుర్వంతో మన్యంతే" (బృ.ఉ.6-1-14) యను వాక్యమునందును భుజంచుటకు పూర్వము మఱియు భోజనానంతరము ఆచమించుట ద్వారా ప్రాణమునకు వస్త్రాచ్ఛాదన మొనర్పఁబడినట్లు భావించుట విధింపఁబడినది.

ఈ వాక్యములు ఆచమనము మఱియు ప్రాణమునకు వస్త్రాచ్ఛాదన మొనర్చు ఉపాసనయనెడి రెండు విషయములను సూచించును. ఈ వాక్యములీ రెండు

విషయములను సూచించునా? లేక, ఆచమనముంగూర్చి మార్చుడమే చెప్పునా? లేక, కేవలము ప్రాణము వస్త్రముచే ఆచ్ఛాదింపబడు ఉపాసనను గూర్చి నుడువునా? యనెడి సంశయమిచ్చట ఏర్పడును.

ఈ సూత్రము చెప్పునదేమనగా ఆచమనమునుంగూర్చి స్మృతి ఇతఃపూర్వమే ప్రతియొక్కరికి విధించియున్నది. కావున శ్రుతి కేవలము జలమును ప్రాణమునకు వస్త్రముగా చింతించుటనుంగూర్చియే విధించియున్నది. ఆచమనక్రియ నూతనము కాదు. కావున దానికి వైదికశాసనము అనావశ్యకము.

# 10. సమానాధికరణము

## 3-3-19 సమాన ఏవం చాభేదాత్

ఉపాస్య విషయము అభేదమైయుండుటచే, ఒకే శాఖయందు కూడా విద్యయొక్క ఐక్యతయుండును.

సమానే = ఒకేశాఖయందు, ఏవం = ఇట్లు, చ = మఱియు, అభేదాత్ = అభేద కారణముచే.

5వ సూత్రములోని భావమిచ్చట నిరూపింపంబడినది.

వాజసనేయి శాఖలోని అగ్ని రహస్యమునందు శాండిల్యవిద్యయనెడి ఒక విద్య కలదు. దానియందీ క్రింది వాక్యము కలదు. "సఆత్మాన ముసాసీత మనోమయం ప్రాణ శరీరం భారూపమ్" (శత. బ్రా. మాద్య. 10-6-3,2). అదే శాఖకు చెందిన బృహదారణ్యకమునందు కూడా "మనోమయోఽ యం పురుషోభాః సత్యస్తస్మిన్నంతర్హృదయే యథా వ్రీహిర్వాయవోవా స ఏష సర్వస్యేశానః సర్వస్యాధిపతిః సర్వమిదం ప్రశాస్తి యదిదం కించ" (బృ.ఉ. 5-6-1) అను వాక్యము కలదు.

ఈ రెండు వాక్యములలో పేర్కొనంబడిన విషయములను ఏకత్రిత మొనర్చవలయునా? లేదా? యనియు, ఇవి ఒకే విద్యకు సంబంధించి యున్నవా? లేక, విభిన్నములగు విద్యలకు సంబంధించియున్నవా? యనియును ఇచ్చట సందేహము కలుగును.

ఈ రెండింటియందును ఉపాస్యము ఏకమేయగుటచే, ఇవి ఒకే విద్యకు సంబంధించియున్నవని ఈ సూత్రము మనకు తెలుపును. మనోమయమైన ఆత్మయే ఈ రెండింటికి ఉపాస్యవస్తువైయున్నది. ఒకే శాఖయందున్న ఒకే విద్యయొక్క అంశములను ఏకత్రిత మొనర్చుట, వివిధ శాఖలలోని ఒకే విద్యయొక్క అంశములను ఏకత్రిత మొనర్చుటవంటిది. ఈ రెండు వాక్యములు ఒకే శాఖకు సంబంధించినవై యున్నను. అవి ఒకే విద్యకు సంబంధించినవగుటచే వాటి అంశములన్నింటిని ఏకత్రిత మొనర్పవలసి యున్నది. ఇట్టి విద్యయొక్క మొదటి వాక్యము ఉపాసనను సూచించును. రెండవ వాక్యము దాని గుణములనుఁగూర్చి తెలియఁజేయును.

శ్రుతిద్వయమునందుగల శాండిల్యవిద్యయొక్క వర్ణనలో కొంచెము భేదమున్నను, నిజమునకీ రెండున్నూ ఏకమేనైయున్నవి. కావున శాండిల్య విద్యనుఁగూర్చి ఒక శ్రుతియందు చెప్పఁబడినట్టి ప్రత్యేక అంశము రెండవదానియందు లేనప్పుడు, దానిని రెండవదానితో ఏకత్రిత మొనర్పవలయును.

కావున శాండిల్యవిద్య ఏకమేనై యున్నది.

# 11. సంబంధాధికరణము

## (20 నుండి 22 సూత్రములు)

### 3-3-20 సంబంధా దేవ మన్యత్రాపి

ఇట్లే ఇతర విషయములలోకూడా ఒకేవిద్యలోని అంశములను ఏకత్రిత మొనర్పవలసియుండును.

సంబంధాత్ = సంబంధకారణముచే, ఏవం = ఇట్లు, అన్యత్ర = ఇతర విషయములలో, అపి = కూడా.

పూర్వసూత్రములోని దృష్టాంతముపై ఒక ఆక్షేపణ చెప్పఁబడినది.

ఈ సూత్రము పూర్వపక్ష సూత్రము. ఇది ఆక్షేపకుని దృష్టికోణమును ప్రస్ఫుటమొనర్చును.

"సత్యం బ్రహ్మ"యని బృహదారణ్యకము (5-5-1) నందు ప్రారంభింపబడి "తద్యత్తత్సత్యమసౌ స ఆదిత్యో య ఏష ఏతస్మిన్మండలే పురుషోయశ్చాయం

దక్షిణేక్షన్పురుషః (బృ. ఉ. 5-5-2) నందు చెప్పఁబడినది. దీనిచే దేవతలయందు మఱియు శరీరమునందుగల సత్యబ్రహ్మము యొక్క స్థానము మనకు తెలియుచున్నది. ఈ స్థానములయొక్క సంబంధముచే శ్రుతి మనకు సత్యబ్రహ్మము యొక్క రెండు రహస్యమైన నామములను ప్రబోధించుచున్నది. దేవతలు సూచింపఁబడినప్పుడు దీని రహస్యనామము “అహర్”; శరీరము సూచింపఁబడినప్పుడు దీని రహస్యనామము “అహమ్”.

బ్రహ్మముయొక్క దేవస్థానము మఱియు శరీరస్థానము రెండింటికి ఈ రహస్యనామములు రెండున్నూ వర్తించునా? లేక ఒక్కొక్కదానికి ఒక్కొక్క నామము వర్తించునా? యనెడి సంశయమిచ్చట కలుగును.

సత్యబ్రహ్మమనెడి ఉపాస్యవస్తువు ఏకమే యగుటచే, శాండిల్యవిద్యలోని దృష్టాంతమునందుగల అంశములను ఏకత్రిత మొనర్పవలసియుండును. కావున సత్యబ్రహ్మమునకుగల “అహర్” మఱియు “అహమ్” అను నామములను ఏకత్రిత మొనర్పవలసియుండును.

ఈ రెండు రహస్యనామములు క్రమముగా ఆదిత్యునికి మఱియు అక్షిపురుషునికి సంబంధించియున్నవి.

## 3-3-21 నవా విశేషాత్

కాని స్థలభేద కారణముచే ఇట్లు కాదు.

న = కాదు, వా = కాని, విశేషాత్ = భేద కారణముచే, (నవా = ఇట్లు కాదు).

పూర్వసూత్రములోని నిర్ణయము త్రోసివేయఁబడినది.

ఇది సిద్ధాంత సూత్రము.

ఈ సూత్రము పూర్వసూత్రముయొక్క దృష్టి కోణమును ఖండించును. సూర్యమండలము మరియు నేత్రగోళము విభిన్నములై యుండుటచే, బ్రహ్మోపాసనకు స్థానభేదమును కలిగియున్నవి. కావున పూర్వసూత్రమునందు సూచింపఁబడినట్టి “అహర్” మఱియు “అహమ్” అనెడి రహస్యనామములు ఒకే ఉపాసనకు సంబంధింపవు. ఒక్కొక్కనామము ఒక్కొక్క ఉపాసనకు సంబంధించి యున్నది.

విద్య ఏకమేయైనను, స్థానభేదకారణముచే ఉపాస్యమునందు భేదమేర్పడును. ఈ కారణముచేతనే వేఱు, వేఱు నామములు చెప్పఁబడినవి. కావున వీటిని ఏకత్రిత మొనర్పరాదు.

పూర్వపక్షి ఒక ఆక్షేపణను రేకెత్తించును. అతడిట్లనును:– సూర్య మండలము నందుఁగల పురుషుడు మఱియు నేత్రమందున్న పురుషుడు ఏకమే! ఏలననగా ఈ రెండున్నూ సత్యబ్రహ్మముయొక్క స్థానములని శ్రుతి ప్రబోధించుచున్నది.

అది నిజమే, కాని మేమిట్లు సమాధానమొసంగుదుము. ఒక ప్రత్యేక భూమిక యందున్న బ్రహ్మమునుఁగూర్చి మాత్రమే ఒక్కొక్క రహస్యనామము పేర్కొనఁబడినది. బ్రహ్మము ఆ భూమికయందున్నప్పుడు మాత్రమే ఆ నామము దానికి వర్తించును. దానికొక దృష్టాంతము చెప్పఁబడుచున్నది. గురువెల్లప్పుడు గురువుగానే శేషించి యున్నను, శిష్యుడు గురువుకై ఒనర్చు సేవ అతడు కూర్చున్నప్పటికంటె, నిలఁబడి యున్నప్పుడు విభిన్నమైయుండును.

ఆక్షేపకుని ఉపమానము సవ్యముగా లేదు. గురువునుఁగూర్చి శిష్యునికిఁగల కర్తవ్యము అతని స్వభావముపై ఆధారపడియుండును. కాని అతడు గ్రామమునందున్నను, లేక ఆరణ్యమునందున్నను అతని గురుత్వమునందు భేదమేర్పడదు.

కావున "అహర్" మఱియు "అహమ్" అనెడి రహస్య నామములు విభిన్నములై యున్నవి. అందువలన వాటిని ఏకత్రిత మొనర్పరాదు.

## 3-3-22 దర్శయతి చ

శ్రుతికూడా ఇట్లే నుడువుచున్నది.

దర్శయతి = శ్రుతి సూచించుచున్నది. చ = కూడా.

20వ సూత్రమును ఖండించుటకు మరియొక వాదమొసంగఁబడినది.

గుణములను ఏకత్రిత మొనర్పరాదనియు, వాటిని వేరుగా నుంచవలయు ననియు శ్రుతి ప్రత్యేకముగా నుడువుచున్నది. ఏలననగా అది ఆదిత్యపురుషుడు మఱియు అక్షిపురుషుడనెడి ఇద్దఱు పురుషులను పోల్చిచెప్పుచున్నది. ఒకవేళ అది ప్రత్యేకతలను ఏకత్రిత మొనర్పఁదలంచునేని, అది ఇట్లు పోల్చియుండెడిది కాదు.

కావున ఈ రెండు రహస్య నామములను విభిన్నముగా ఉంచవలయునని నిర్ణయింపఁబడినది.

# 12. సంభృత్యధికరణము

## 3-3-23 సంభృతి ద్యువ్యాప్త్యపి చాతః

పూర్వసూత్రములోని కారణముచే ప్రపంచమును ధరించుట మఱియు ఆకాశమును వ్యాపించుట యనెడి రాణాయనీయఖిలలోని బ్రహ్మముయొక్క గుణములను కూడా ఇతర బ్రహ్మోపాసనలయందు చేర్చరాదు.

సంభృతి = ప్రపంచమును ధరించుట, ద్యువ్యాప్తి = ఆకాశమును వ్యాపించుట, అపి = కూడా, చ = మఱియు అతః = పూర్వసూత్రములోని కారణముచే.

5వ సూత్రమునకొక ప్రతిరోధము చెప్పఁబడినది.

రాణాయనీయఖిల యనెడి అనుబంధమునందీ క్రింది వాక్యము కలదు. "బ్రహ్మ జ్యేష్ఠా వీర్యా సంభృతాని బ్రహ్మాగ్రేజ్యేష్ఠం దివమాతతాన"

పూర్వసూత్రమందు నుడువఁబడిన స్థానభేద కారణముచే "సంభృతి" మఱియు "ద్యువ్యాప్తి" యనెడి ఈ రెండు గుణములను శాండిల్య విద్యయందుఁగాని, ఇతర విద్యలయందుఁగాని చేర్చరాదు. శాండిల్యవిద్యయందు హృదయమే బ్రహ్మమునకు స్థానముగా చెప్పఁబడినది. "ఏషమ ఆత్మాంతర్హృదయే" (ఛాం.ఉ. 3-14-3) దహరవిద్యయందు కూడా ఇదే విషయము చెప్పఁబడినది. "దహరం పుండరీకం వేశ్మదహరోఽ స్మిన్నంతరాకాశః" (ఛాం.ఉ. 8-1-1). ఇఁక ఉపకోస విద్యయందు బ్రహ్మము నేత్రమునందు వసించునని చెప్పఁబడినది. "య ఏషోఽ క్షిణి పురుషోదృశ్యతే" (ఛాం.ఉ. 4-15-1).

ఇంతేకాకుండా ఈ గుణములు మఱియు శాండిల్యాది ఇతర విద్యలలో పేర్కొనఁబడిన గుణములు ఒకదాని కొకటి విభిన్నములు మఱియు స్వతంత్రములై యున్నవి. ఈ విద్యలు కేవలము బ్రహ్మముతో సంబంధించి యున్నంత మాత్రముచే అవి ఏకమే యని చెప్పుటకు వీలులేదు. బ్రహ్మము ఏకమేనైయున్నను, అతని శక్తులు 7వ సూత్రము ననుసరించి అనేక విధములుగా ఉపాసింపఁబడుచున్న వనుట తథ్యము.

కావున సంభృతి మఱియు ద్యువ్యాప్తి యనెడి గుణములను శాండిల్యాది ఇతర విద్యలయందు చేర్చరాదు. మఱియు ఈ సూత్రమునందు సూచింపఁబడిన ఉపాసన ఒక స్వతంత్రమైన విద్యయై యున్నది. శాండిల్య విద్య హృదయములోని ఆత్మనుఁగూర్చిన ఉపాసనను సూచించును. ఇఁక ఉపకోసల విద్య నేత్రములోని ఆత్మయొక్క ఉపాసనను సూచించును. ఐనను పై గుణములు బ్రహ్మాండమునకు సంబంధించియున్నవి.

# 13. పురుష విద్యాధికరణము

## 3-3-24 పురుష విద్యాయా మివచేత రేషా మనామ్నానాత్

మఱియు ఛాందోగ్యమునందు పేర్కొఁనబడిన పురుషవిద్యలోని గుణములు తైత్తిరీయాదులలో పేర్కొనఁబడకుండుటచే, ఈ రెండు పురుష విద్యలు ఏకము కావు. కావున వీటిని ఏకత్రిత మొనర్పరాదు.

పురుష విద్యాయామివ = ఛాందోగ్యములోని పురుష విద్యయందు వలె, చ = మఱియు, ఇతరేషామ్ = ఇతరుల యొక్క, అనామ్నానాత్ = తైత్తిరీయమునందు పేర్కొనఁబడకుండుటచే.

ఇప్పుడు ఛాందోగ్యములోని పురుషవిద్య మఱియు తైత్తిరీయములోని పురుషవిద్య పరీక్షింపఁబడుచున్నవి.

రహస్య బ్రాహ్మణమునందు తాండులు మరియు పైంగుల (ఛాందోగ్యము) యొక్క విద్య యొకటి కలదు. దీనియందు పురుషుడే యజ్ఞమని చెప్పఁబడినది. పురుషుని ఆయుష్యమును త్రివిధములుగా విభజించి, సవనత్రయము కల్పింపఁబడినది.

తైత్తిరీరయారణ్యకము (10-64) నందు కూడా ఇట్టి విద్యయే కలదు. "తస్యైవం విదుషోయజ్ఞస్యాత్మా యజమానః శ్రద్ధాపత్నీ" ఇత్యాదులు.

ఈ రెండు విద్యలు ఏకమేనా? మఱియు ఛాందోగ్యమునందలి పురుష యజ్ఞము యొక్క అంశములను తైత్తిరీయమునందు చేర్చవలయునా? లేదా? యనెడి సంశయమిచ్చుట కలుగును.

పురుషుడు యజ్ఞముతో తాదాత్మ్యము నొందు ప్రధానమైన గుణము ఈ రెండింటియందును సూచింపఁబడినది. ఐనను ఈ విద్యలలోని వర్ణన విభిన్నమై యుండుటచే, ఈ రెండు విద్యలు ఏకము కావని ఈ సూత్రము నుడువుచున్నది. ఛాందోగ్యుల యొక్క పురుష యజ్ఞ లక్షణములను తైత్తిరీయ శ్రుతి సమ్మతింపదు. పత్నీ యజమాన వేదవేది బర్హిర్యూపాజ్యపశ్వ ృత్విగాద్యనుక్రమణముఁగల యజ్ఞముతో పురుషుడు తాదాత్మ్యము నొందుటను తైత్తిరీయము సూచించును. ఈ యంశములు ఛాందోగ్యమునందు సూచింపఁబడలేదు.

మరణావభృథమును ఈ రెండు శ్రుతులున్నూ సమ్మతించును. కాని అసమానతలు అనేకములున్నవి. ఛాందోగ్యమువలె తైత్తిరీయము పురుషుని యజ్ఞముగా అంగీకరింపదు.

ఇంతేకాకుండా బ్రహ్మము యొక్క మహత్వమునుఁబడయుటయే తైత్తిరీయములోని విద్యకు ఫలమైయున్నది. "బ్రహ్మణోమహిమాన మాప్నోతి" (నారా. 80) ఇఁక దీర్ఘాయుష్యమే ఛాందోగ్యములోని విద్యకు ఫలమైయున్నది. "ప్రహషోడశం వర్షశతం జీవతియ ఏవం వేద". (ఛాం.ఉ. 3-16-7).

కావున ఈ రెండు విద్యలు విభిన్నములైయున్నవి. రెండు స్థలములలోని అంశములను ఏకత్రిత మొనర్పరాదు. ఛాందోగ్య పురుషవిద్యయందు పేర్కొనఁబడిన ఆశీర్మంత్రాది అంశములను తైత్తిరీయ శ్రుతిలోని విద్యతో సంయోగమొనర్పరాదు.

# 14. వేధాద్యధికరణము

## 3-3-25 వేధాద్యర్థ భేదాత్

కొన్ని ప్రత్యేక మంత్రములయందున్న వేధాది విషయములు సమీపము నందున్న విద్యలలోని విషయమునకు విభిన్నమైయుండుటచే, మొదటి అంశములను రెండవ అంశములతో చేర్చరాదు.

వేధాది = పొడుచుట ఇత్యాదులు, అర్థభేదాత్ = భిన్నమైన అర్థమును కలిగి యుండుటచే.

అథర్వవేదోపనిషదారంభమునందున్న కొన్ని వాక్యములిచ్చట విమర్శింపఁ బడుచున్నవి.

ఆథర్వణికుల ఉపనిషదారంభమునందీ క్రింది వాక్యము కలదు. "సర్వం ప్రవిధ్యహృదయం ప్రవిధ్యధమనీః ప్రవృజ్యశిరోభి ప్రవృజ్యత్రిధావిపృక్తః" ఇత్యాదులు, తాండుల ఉపనిషదారంభమునందీ క్రింది మంత్రము కలదు. "దేవసవితః ప్రసువ యజ్ఞమ్" కఠులు మఱియు తైత్తిరీయకులు ఆరంభమునందిట్లు పలుకుదురు. "శంనోమిత్రః శం వరుణః" కౌషీతకులు ఆరంభమునందిట్లు నుడువుదురు. "బ్రహ్మావా అగ్నిష్టోమో బ్రహ్మైవ తదహర్బ్రహ్మణైవతే బ్రహ్మోపయంతితే మృతత్వమాప్నువంతి య ఏతదహరుపయంతి".

వాటిని ఏకత్రిత మొనర్చవలయునని పూర్వపక్షి పలుకును. ఏలననగా శ్రు తి బ్రాహ్మణముల యొక్క ఉపనిషద్విభాగములలోని ముఖ్యాంశములను విద్యల రూపమునందు ప్రదర్శించును. మంత్రముల విషయమునందు విద్యలతో సంబంధమును కలిగియున్న అర్థమును మన మెల్లప్పుడును ఊహింపవచ్చును. మొదటి మంత్రము హృదయమునుఁగూర్చి స్తుతించును. ఏలననగా విద్యలలో సామాన్యముగా హృదయమే ఉపాసనకు స్థానముగా చెప్పబడును. కావున హృదయమునుఁగూర్చి స్తుతించు మంత్రములను ఆ విద్యలకు సహాయకములని చెప్పవచ్చును.

వాటిని ఏకత్రిత మొనర్పరాదని ఈ సూత్రము నుడువును. ఏలననగా అవి యజ్ఞకార్యములను సూచించుట చేతను, వాటి అర్థము విభిన్నమై యుండుటచేతను అవి విద్యలతో సంబంధమును కలిగిలేవు.

మంత్రములు పూర్తిగా హృదయమును స్తుతించియుండినచో, అవి ఉపయుక్తములై యుండెడివని భావించుట తగదు. మొదట పేర్కొనఁబడిన మంత్రము స్పష్టముగా ఒకానొకనిపైఁగల శత్రుత్వమును సూచించును. కావున ఇది ఉపనిషత్తులలోని విద్యలతో సంబంధమును కలిగిలేదు. కాని ఒకానొకని శత్రువును నశింపఁజేయుటకై ఒనర్చు కార్యమునకు సంబంధించి యున్నది.

ఇతర మంత్రములు కొన్ని ప్రత్యేక యజ్ఞకార్యములకు సహాయకములై యున్నవి. కేవలము ఉపనిషత్తుల యందుండుటచేతను, సామీప్య కారణముచేతను అవి విద్యలకు సంబంధించి యున్నవని నుడువుటకు వీలులేదు.

ఈ కారణముచే పైన పేర్కొనఁబడినట్టి మంత్రములు మఱియు కార్యములు కేవలము శ్రుతియందున్నంత మాత్రముచే ఉపనిషత్తులలోని విద్యలకు అనుబంధములుగా తలంపరాదు.

# 15. హాన్యధికరణము

## 3-3-26 హానౌ తూపాయన శబ్ద శేషత్వా త్కుశాచ్ఛందస్తుత్యుపగానవత్త దుక్తమ్

కాని ఎచ్చట పుణ్య పాపములనుండి విముక్తి నొందుట మాత్రము పేర్కొనఁబడినదో, అచ్చట ఇతరులనుండి పుణ్యపాపముల నొందుట కూడా చేర్చఁబడవలయును. ఏలననగా కుశాచ్ఛందస్తుత్యుపగానములవలె పరిగ్రహ విముక్తులు అనుబంధము వంటివై యున్నవి. దీనికి కారణము పూర్వ మీమాంసయందు జైమినిచే చెప్పఁబడినది.

హానౌ = ఎచ్చట పుణ్యపాప విముక్తి చెప్పఁబడినదో, తు = కాని, ఉపాయన శబ్ద శేషత్వాత్ = విముక్తి శబ్దమునకు పరిగ్రహము అనుబంధమై యుండుటచే, కుశాచ్ఛందస్తుత్యుపగానవత్ = కుశగ్రాసము, ఛందస్సు, స్తుతి, ఉపగానములవలె, తత్ = అది, ఉక్తమ్ = జైమినిచే చెప్పఁబడినది.

ఆత్మసాక్షాత్కారము నొందినవాడు మృత్యుసమయమునందు తన పుణ్య పాపములను తన మిత్రులు మరియు శత్రువులు పరిగ్రహించుట ద్వారా అతడు పుణ్య పాపములనుండి విముక్తుడగు విషయమిచ్చట చర్చింపఁబడుచున్నది.

కుశ, ఛందస్సు, స్తుతి మఱియు ఉపగానమునుఁగూర్చిన వాక్యములను ఇతర శ్రుతులనుండి పరిగ్రహింపవలయునని జైమిని పలికెను. కౌషీతకీ శ్రుతియందు ఏ వృక్షమునుండియైనను కుశయనెడి కఱ్ఱలను సేకరింపవచ్చునని చెప్పఁబడినది. కాని శాట్యాయనశాఖయందు ఉదుంబర వృక్షమునకు సంబంధించిన కుశలు మాత్రము చెప్పఁబడినవి. కావున తర్వాతి వాక్యమును కౌషీతకి శ్రుతికి పూరకముగా పరిగ్రహింపవలయును. మొదటి శ్రుతి రెండవదాని ననుసరించి పూరింపఁబడవలయును.

ఒకానొక శ్రుతియందు ఛందోబద్ధముకాని ప్రార్థన నుడువఁబడినది. కాని మరియొక స్థలమునందిది దేవఛందస్సనఁబడునని చెప్పఁబడినది. కావున ఛందోబద్ధము కాని ప్రార్థన దేవఛందస్సునందున్నదని మనము అర్థమొనర్చుకొన వలయును.

"షోడశి" యనెడి యజ్ఞపాత్రను ఎప్పుడు స్తుతింపవలయునో ఒకానొక శ్రుతి యందు చెప్పఁబడలేదు. కాని మరియొక శ్రుతి యందు సూర్యోదయ సమయము నందది స్తుతింపఁబడవలయునని చెప్పఁబడినది. ఇచ్చట ఉత్తర వాక్యమును పూర్వ వాక్యమున కనుబంధముగా తలంపవలయును.

యజ్ఞములోని ఉపగానమునందు ఏ నలుగురు ఋత్విక్కులు కూడవలయునో నిశ్చయముగా చెప్పఁబడలేదు. కాని ఒక ప్రత్యేక శ్రుతియందు అధ్వర్యువు గానము నందు చేరకూడదని స్పష్టముగా చెప్పఁబడినది. ఈ రెండు వాక్యములను సమైక్యమొనర్చినప్పుడు అధ్వర్యువుతప్ప ఋత్విక్కులందఱును చేరవచ్చునని మనము నిశ్చయింపవచ్చును.

ఉపనిషత్తులలో పేర్కొనఁబడిన విద్యలకు సంబంధించిన జీవన్ముక్తుని కార్యఫలములకీ సిద్ధాంతము వర్తించును. తాండుల శ్రుతియందిట్లు కలదు. "అశ్వఇవరోమాణి విధూయ పాపం చంద్ర ఇవరాహోర్ముఖాత్ప్రముచ్య ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోక మభిసంభవామి" (ఛాం.ఉ. 8-13-1). ఇఁక ముండకము (3-1-3) నందీ క్రింది వాక్యము కలదు. "తదా విద్వాన్ పుణ్య పాపే విధూయ, నిరంజనః పరమం సామ్య ముపైతి" అతని పుణ్యపాప కార్యములను ఎవ్వడంగీకరించునను విషయమునందీ శ్రుతులు మౌనమును వహించినవి.

శ్రుతియొక్క శాట్యాయనశాఖయందిట్లు చెప్పఁబడినది. "తస్యపుత్రాదాయ ముపయంతి సుహృదః సాధుకృత్యాం ద్విషంతః పాపకృత్యామ్" కౌషీతకి (1-4) యందిట్లు కలదు. "తత్సుకృత దుష్కృతే విధూనుతే తస్యప్రియాజ్ఞాతయః సుకృత ముపయంత్యప్రియా దుష్కృతమ్".

పైన వివరింపఁబడిన జైమిని సిద్ధాంతము ననుసరించి పాపపుణ్యము లను శత్రుమిత్రులు పంచుకొందురనెడి విషయమును అవశ్యకముగా ఛాందోగ్య శ్రుతి మఱియు ముండక శ్రుతియందు చేర్చఁబడవలయునని ఈ సూత్రము నుడువును.

పూర్వపక్షి మరియొక ఆక్షేపణను లేవదీయును. ఛాందోగ్యము మఱియు కౌషీతకిశ్రుతిలోని "దూఞ్" అనెడి క్రియకు అర్థము కంపనమగునే కాని, విమోచనము కాదని అతడు వాదించును. కావున జ్ఞానమునుఁబడసిన తర్వాత కూడా అతనికి

పుణ్య పాపములంటుకొనియుండును. కాని జ్ఞాన కారణముచే వాటి వేగము తగ్గునని భావము.

ఇట్టి భావము దోషపూరితమని ఈ సూత్రము తెలుపును. ఏలననగా పుణ్యపాపములను ఇతరులు పొందుదురని తదనంతర శ్రుతి సూచించును. జ్ఞానము నొందిన వ్యక్తి వాటిని త్యజించుటచే తప్ప, ఇది నిశ్చయముగా అసాధ్యమైన విషయము.

పుణ్యపాపములు సారవంతమైన పదార్థములు కాకుండుటచే అవి గాలిలోని పతాకములవలె కంపించునని చెప్పుటకు వీలులేదు. "విధూయ" లోని "ధూఞ్" అనెడి ధాతువునకు కంపనమనెడి అర్థమున్నను, ఇతర శ్రుతి విభాగములలో జీవన్ముక్తుని పుణ్యపాపములను ఇతరులు స్వీకరింతురని చెప్పఁబడుటచే ఇచ్చట "విమోచనమ"నెడి అర్థమును అంగీకరింపవలసియుండును.

# 16. సాంపరాయాధికరణము

## 3-3-27 సాంపరాయే తర్తవ్యాభావా త్తథాహ్యన్యే

జ్ఞాని మృత్యుసమయమునందు తన పుణ్యపాప కర్మలనుండి విముక్తుడగును. ఏలననగా ఆ కర్మలచే బ్రహ్మలోకమునకు వెళ్ళు మార్గమునందాతడు పొందవలసిన దేమియు లేదు. ఈ ప్రకారముగా ఇతరులు తమ పవిత్ర గ్రంథములయందుల్లేఖించి యున్నారు.

సాంపరాయే = మృత్యుసమయమునందు. తర్తవ్యాభావాత్ = పొందవలసిన దేమియు లేకుండుటచే, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, అన్యే = ఇతరులు.

జీవుడు తన పుణ్యపాప కర్మలనుండి ఎప్పుడు విముక్తుడగునను విషయమునుఁగూర్చి ఈ సూత్రము నిశ్చయించి చెప్పును.

జీవుడు తన పుణ్యపాప కర్మలనుండి ఎప్పుడు విముక్తుడగునను ప్రశ్న ఇప్పుడుదయించును. కౌషీతకి (1-4) యందీ క్రింది వాక్యము కలదు. "సఆగచ్ఛతి విరజాం నదీంతాం మనసై వాత్యేతి తత్సుకృత దుష్కృతే విధూనుతే" పూర్వపక్షి ఈ వాక్యము నాధారముగాఁగొని జీవుడు బ్రహ్మలోకమునకు వెళ్ళు మార్గమునందే

తన పుణ్యపాప కర్మలనుండి విడివడును. కాని శరీరమును త్యజించునప్పుడు కాదని నుడువును.

ఈ సూత్రము దీనిని ఖండించి ముక్తపురుషుడు తన జ్ఞానబలముద్వారా మృత్యుసమయమునందే పుణ్యపాప కర్మఫలమునుండి విడివడునని నిశ్చయించి చెప్పును.

దేవయానము లేక బ్రహ్మలోకమార్గమునందు విరజానదిని దాటిన తర్వాత సుకృత దుష్కృత కర్మలనుండి విముక్తి కలుగునని కౌషీతకి శ్రుతి నుడివినను, మృత్యువనంతరము వాటిద్వారా పొందవలసినదేమియు లేకుండుటచే సుకృత దుష్కృత కర్మలు మృత్యుసమయమునందే విడివడునని చెప్పవచ్చును. తన పుణ్యపాప కర్మలచే అనుభవింపఁబడవలసిన దేదియును అతనికి శేషించి యుండదు. పుణ్య పాపకర్మలచే అతనికేలాటి ప్రయోజన ముండదు. మఱియు ముక్తినిఁబడసిన తర్వాత వాటిని భరించు ఆవశ్యకత కూడా అతనికుండదు.

బ్రహ్మజ్ఞానము బడసినఁవానికి వెంటనే తన సంచిత కర్మ భస్మీభూతమగును. ప్రారబ్ధము మృత్యుసమయమునందు నశించును. కావున మరణ సమయము నందాతడు తన సమస్త పుణ్యపాప కర్మలనుండి విముక్తుడగును.

పుణ్య పాపకర్మఫలములు జ్ఞానఫలమునకు విరుద్ధమై యుండుటచే, అవి జ్ఞానశక్తిచే నశింపఁజేయఁబడును. అవి నశించిన తత్క్షణమే అతడు బ్రహ్మలోకము లేక జ్ఞానఫలమువైపు పయనించుట కారంభించును.

ఇంతేకాకుండా బ్రహ్మలోకమార్గమునందు తన పుణ్య పాపకర్మలనుండి విడివడుట సాధ్యముకాదు. ఏలననగా ఆత్మకు స్థూల శరీరము లేకుండుటచే వాటిని నశింపఁజేయుట కేలాటి సామర్థ్యము దానికుండదు. మఱియు జీవుడు సమస్త పుణ్యపాపములనుండి విడివడకుండా విరజానదిని దాటజాలడు.

“అశ్వ ఇవరోమాణి విధూయపాపమ్” (ఛాం. ఉ. 8-13-1) అని శ్రుతి నుడువుచున్నది. కావున మృత్యుసమయమునందే సమస్త పుణ్యపాపకర్మలు విడివడునని దృఢీభూతమగుచున్నది.

## 3-3-28 ఛందత ఉభయథావిరోధాత్

జీవుడు యమనియమముల నభ్యసించుచు తన ఇచ్ఛానుసారముగా జీవించి యున్నప్పుడే సుకృత దుష్కృత కర్మలనుండి విడివడుననుట యుక్తమగును. ఏలననగా దానిచే కార్యకారణమునందును, ఛాందోగ్యము, మరియొక శ్రుతి యందును విరోధ మేర్పడదు.

ఛందతః = తన ఇచ్ఛానుసారముగా, ఉభయథావిరోధాత్ = రెండింటి యందు విరోధము లేకుండుటచే.

ఈ దృష్టికోణము సరియైనది. ఏలననగా ఐచ్ఛిక యమనియమా ద్యనుష్ఠానముచే శ్రుతులన్నింటికి విరుద్ధమైయున్న కర్మ మరణమునకు పూర్వమే నశించుట సాధ్యమగును. పై దృష్టికోణము శ్రుతులన్నింటిచే అంగీకరింపఁబడినది.

ఒకవేళ శరీర త్యాగానంతరము దేవయానమార్గమునందు ప్రవేశించిన తర్వాత జీవుడు దారిలో పుణ్యపాప కర్మల నుండి విడివడునేని, మనకు సమస్తము అసాధ్యములే యగును. ఏలననగా శరీరమును పరిత్యజించిన తర్వాత అతడు తన ఇచ్ఛానుసారముగా తన పుణ్యపాపకర్మలను నశింపఁజేయునట్టి ఆత్మ నియంత్రణము మఱియు జ్ఞానార్జనాదులను అభ్యసింపఁజాలడు. కావున తన సుకృత దుష్కృత కర్మలను అతడు నివారించుకొనఁజాలడు.

మృత్యువనంతరము కారణముండగనే కొంతకాలమునకు కార్యము ఆలసించుననుట అయుక్తమగును. శరీరమున్నప్పుడు బ్రహ్మలోకమునుఁ బడయుట అసాధ్యమగును. కావున సుకృత దుష్కృత కర్మలను పరిత్యజించుటలో కష్టమేమియును లేదు.

# 17. గతేరర్థవత్త్వాధికరణము

## (29 నుండి 30 సూత్రములు)

### 3-3-29 గతే రర్థవత్త్వ ముభయథాన్యథాహి విరోధః

జీవుడు దేవయానముగుండా పయనించు మార్గము ద్వివిధముగా నుండును. లేకున్నచో శ్రుతికి విరోధ మేర్పడును.

గతేః = మృత్యువనంతరము జీవుడు దేవయానముగుండా పయనించు మార్గముయొక్క, అర్థవత్త్వమ్ = ఉపయోగము, ఉభయథా = రెండు విధములుగా, అన్యథా = లేకున్నచో, హి = నిశ్చయముగా, విరోధః = విరోధము.

ఇచ్చట నుండి 27వ సూత్రాంశము చర్చింపఁబడినది.

కొన్ని శ్రుతివాక్యములలో జీవుడు సుకృత దుష్కృతములనుండి విడివడుటకై మృత్యువనంతరము దేవయాన మార్గముగుండా వెళ్ళునని సూచింపఁబడినది. మరికొన్ని వాక్యములలో ఇట్లు సూచింపఁబడలేదు. ఇప్పుడు ఈ రెండున్నూ అన్ని విషయములయందు వర్తించునూ? లేక కొన్ని ప్రత్యేక విషయములయందు మాత్రమే వర్తించునా? యను సంశయమేర్పడును.

ఈ రెండున్నూ అన్ని విషయములయందు వర్తించునని పూర్వపక్షి పలుకును. ఏలననగా మానవుడు తన సుకృత దుష్కృత కర్మలను తన స్నేహితులకు మఱియు శత్రువుల కొసంగుట ద్వారా అతడెల్లప్పుడు వాటి నుండి విముక్తుడగును.

సగుణ బ్రహ్మోపాసకుడు మాత్రమే మృత్యువనంతరము దేవయానముగుండా వెళ్ళునని ఈ సూత్రము నుడువును. సగుణోపాసనయందు మాత్రమే ఆ మార్గము గుండా వెళ్ళుటలో ప్రయోజనమున్నది. కాని నిర్గుణ బ్రహ్మోపాసకునికి కాదు. బ్రహ్మలోకము ఒకానొక స్థలమునందు ఉనికిని కలిగియున్నది. సగుణోపాసకుడు చలించి ఆ స్థానమును చేరవలసియున్నది. మనము నిజముగా చలించినప్పుడు మాత్రమే మరియొక స్థలమును చేరఁగలుగుదుము. కావున అతని విషయమునందు మాత్రమే ప్రయాణమున కర్థమున్నది. నిర్గుణోపాసకుని ప్రాణము బ్రహ్మమునందు లయించును. అతడు అనంతత్వము లేక పరిపూర్ణ పరబ్రహ్మముతో తాదాత్మ్యము

నొందును. అతడెచ్చటికి చలించును? సమస్త కామనారహితుడు మఱియు నిరహంకారుడగు ముక్తపురుషుడు మరియొక స్థలమునకు వెళ్ళడు. అతడు చలింపఁజాలడు. ముక్త పురుషునికి పరబ్రహ్మమును చేరవలసిన పనిలేదు. అతడు మరియొక స్థలమునకు మారవలసిన పనిలేదు. నిర్గుణ బ్రహ్మమునందు లయించినట్టి ఈ ముక్త పురుషుడు పయనించుటలో అర్థములేదు. బ్రహ్మజ్ఞానముచే అజ్ఞానమంతయు నశించును. అతడు పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందును. ఒకవేళ అతనికి కూడా ప్రయాణముండియున్నచో "పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి" (ముం.ఉ. 3-1-3) ఇత్యాది శ్రుతివాక్యములకు విరోధమేర్పడును.

అద్వితీయము, సర్వవ్యాపకము, అనంతము, అచలమునై యున్న పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందినట్టి ముక్తపురుషుడు దేవయానముద్వారా మరియొక స్థలమున కెట్లు వెళ్ళును? అతడితఃపూర్వమే తన లక్ష్యము లేక బ్రహ్మమునందైక్యత నొందియున్నాడు. అతనికి దేవయాన ప్రయాణము నిరర్థకమైయొప్పును.

కావున సగుణ బ్రహ్మోపాసన నొనర్చి, సగుణ బ్రహ్మమును సాక్షాత్కరించుకొన్నవాడు మాత్రమే దేవయానము గుండా వెళ్ళునని తెలియుచున్నది.

## 3-3-30 ఉపపన్న స్తల్లక్షణార్థోపలబ్ధేర్లోకవత్

పైన పేర్కొనఁబడిన ద్వివిధ దృష్టికోణము యోగ్యమై యున్నది. ఏలననగా సామాన్యజీవితమునందు ప్రయాణముయొక్క ప్రయోజనమును మనముఁ గాంచుచుందుము.

ఉపపన్నః = యోగ్యమైనది, తల్లక్షణార్థోపలబ్ధేః = ఇట్టి ప్రయాణము యొక్క లక్షణములు చూడఁబడుటచే, లోకవత్ = ప్రపంచమునందిట్టి సామాన్యానుభవముఁ గాంచఁబడుటచే.

పూర్వపు చర్చ కొనసాగుచున్నది.

కౌషీతక్యుపనిషత్తులోని పర్యంక విద్యాదులలోఁగల సగుణ బ్రహ్మోపాసనలలో జీవుడు దేవయానముగుండా వెళ్ళుటలోఁగల ప్రయోజనము చెప్పఁబడినది. ఏలననగా మానవుడు వివిధ స్థలములకు వెళ్ళినప్పుడు మాత్రమే శయ్యపై పరుండుట, శయ్యపైనున్న బ్రహ్మముతో సంభాషించుట మఱియు అనేక రకములగు

సుగంధ ద్రవ్యముల నాఘ్రాణించుట ఇత్యాది ఫలములు పొందఁబడునని శ్రుతి వచించుచున్నది.

ఇంతేకాకుండా దేవయానమార్గముగుండా వెళ్ళుటకు మఱియు పూర్ణ జ్ఞానమునుఁబడయుటకునుఁగల సంబంధ మేమియును లేదు. బ్రహ్మజ్ఞానముచే అజ్ఞానము నశింపఁజేయఁబడినట్టి నిర్గుణోపాసకుడు లేక ముక్త పురుషునికి ఇట్టి ప్రయాణముతో ప్రయోజనములేదు. అతడు పరమాత్మతో ఏకత్వమును లేక తాదాత్మ్యము నొందియున్నాడు. అతని కోరికలన్నియును తీర్పఁబడినవి. అతని కర్మలన్నియును నశింపఁజేయఁబడినవి. అతడు కేవలము తన శరీర లయమునకై వేచియున్నాడు.

నాశము సామాన్యజీవితమునందు చూడఁబడు నాశమును పోలియుండును. మనమొక గ్రామమును చేరఁదలచినప్పుడు ఆ గ్రామమునకు వెళ్ళుదారిని అనుసరించవలసియుండును. కాని మనమొక వ్యాధినుండి విముక్తి నొందఁ దలంచినప్పుడు ఇట్టి మార్గమును అనుసరింపవలసిన పనిలేదు.

# 18. అనియమాధికరణము

## 3-3-31 అనియమః సర్వేషా మవిరోధః శబ్దానుమానాభ్యామ్

దేవయానమార్గమునందు వెళ్ళుటలో ఏ విద్యకున్నూ నిర్బంధములేదు. శ్రుతి స్మృతులలో దీనికి విరోధము కానబఁడదు.

అనియమః = నిర్బంధములేదు, సర్వేషామ్ = అన్నింటికి, అవిరోధః = విరోధములేదు, శబ్దానుమానాభ్యామ్ = శ్రుతి స్మృతులలో చూడఁబడుటచే.

బ్రహ్మజ్ఞుడైన జీవుని ప్రయాణము కొనసాగుచున్నది.

దేవయానముగుండా వెళ్ళుట కేవలము సగుణ బ్రహ్మమునకు సంబంధించిన విద్యలకు మాత్రమే వర్తించును. కాని సమస్తగుణ వివర్జితమైయున్న నిర్గుణ బ్రహ్మజ్ఞానమునకు వర్తించదని మనము తెలిసికొనియున్నాము.

ఇఁక బ్రహ్మలోకమునకు వెళ్ళు దేవయానము పర్యంక విద్య, పంచాగ్నివిద్య, ఉపకోసల విద్య, దహరవిద్యవంటి, విశేషవిద్యలయందే సూచింపఁబడినది. కాని

మధువిద్య, శాండిల్యవిద్య, షోడశకళ విద్య, వైశ్వానరవిద్యలవంటి ఇతర విద్యలలో పేర్కొనఁబడకుండుటను మనము గమనింపవలసియున్నది.

దేవయానముగుండా వెళ్ళుట అట్లు పేర్కొనఁబడిన విద్యలకు మాత్రమే అనువర్తించునా? లేక తాదృశ విద్యలన్నింటికి వర్తించునా? యనెడి సంశయ మిచ్చట కలుగును.

ఏ విద్యలకు సంబంధించినవారైనను, సగుణ బ్రహ్మోపాసకులందఱు మృత్యు వనంతరము దేవయానముగుండా వెళ్ళుదురని ఈ సూత్రము విశదపఱచును. ఈ విషయము శ్రుతియందును, స్మృతియందును మనకు కానఁబడును. "తద్య ఇత్థం విదుః" (ఛాం.ఉ. 5-10-1) "య ఏవమే తద్విదుర్యేచామీ ఆరణ్యేశ్రద్ధాం సత్యముపాసతే" (బృ.ఉ. 6-2-15).

భగవద్గీత కూడా ఇట్లు వచించినది. "శుక్ల కృష్ణేగతీహ్యేతే జగతః శాశ్వతేమతే, ఏకయా యాత్యనావృత్తి మన్యయావర్తతే పునః (భ.గీ. 8-26).

"య ఏవమే తద్విదుర్యేచామీ అరణ్యే శ్రద్ధాం సత్య ముపాసతే" అను వాక్యములోని "సత్యమ"ను శబ్దము బ్రహ్మమును సూచించును.

ఈ విధముగా దేవయానమార్గము సూచింపఁబడిన విద్యలకు మాత్రమే దేవయానము నిర్ణీతమై లేదను విషయము స్పష్టీకరింపఁబడినది.

# 19. యావదధికారాధికరణము

## 3-3-32 యావదధికార మవస్థితి రాధికారికాణామ్

ఒక కార్యము నొనర్పఁదలంచువారు. ఆ కార్యము పూర్తియగునంతవరకు సశరీరులైయుందురు.

యావదధికారమ్ = కార్యము పూర్తికానంతవరకు, అవస్థితిః = శరీర ముందును, అధికారికాణామ్ = జీవితమునందొక కార్యమును సాధింపఁదలంచు వారికి.

31వ సూత్రమునకు యుక్తమైన నిషేధము ఖండింపఁబడినది.

అపాంతరతముడనెడి వేదాచార్యుడు విష్ణువుయొక్క ఆజ్ఞచే ఈ పృథ్వియందు వ్యాసుడు లేక కృష్ణద్వైపాయనుడుగా అవతరించెనని పూర్వపక్షి పలుకును. అదే విధముగా బ్రహ్మ మానసపుత్రుడైన వసిష్ఠుడు నిమియొక్క శాపముచే తన పూర్వ దేహమును పరిత్యజించి, బ్రహ్మయొక్క ఆజ్ఞచే మిత్రావరుణులచే పునరుత్పన్న మొనర్పఁబడెను. బ్రహ్మమానస పుత్రులగు భృగ్వాదులు వారుణ యజ్ఞమునందు పునరుత్పన్న మొనర్పఁబడిరి. బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుడుకూడా రుద్రునియొక్క వరముచే తిరిగి స్కందునిగా అవతరించెను. దక్షుడు, నారదుడు, ఇతర ఋషులుకూడా మరల జన్మించిరి. పూర్వదేహము నశించిన తర్వాత కొందఱు నూతన శరీరమును ధరించిరనియు, మరి కొందఱు పూర్వదేహము యథాతథముగా నున్నను తమ అమానుషశక్తులచే నానావిధములగు నూతన శరీరములను ధరించిరనియును చెప్పఁబడినది.

ఐతే ఈ ఋషులకు బ్రహ్మజ్ఞానమున్నను, వారు తిరిగి జన్మింపవలసి వచ్చినది. అట్టి ఎడల ఈ బ్రహ్మజ్ఞానముచే కలుగు ప్రయోజనమేమి? బ్రహ్మజ్ఞానము సర్వతంత్ర స్వతంత్రమైన మోక్షము నొసంగునదై యుండవలయును. లేదా ఒసంగనిదై యుండవలయును.

ఈ సూత్రము దీనిని ఖండించి, సర్వసామాన్యముగా మానవుడు బ్రహ్మ జ్ఞానము నొందిన తర్వాత తిరిగి జన్మింపడని పలుకును. కాని దివ్యమైన కార్యము నొనర్పఁదలంచువారి విషయము దీనికి భిన్నమైయుండును. తమ కార్యము సాధింపబడునంతవరకు వారు ఒకటిఁగాని, అనేక జన్మలనుఁగాని ఎత్తవలసి వచ్చును. కాని తదనంతరము వారికి పునర్జన్మ యుండదు. వారు లోకస్థితిహేత్వా ద్యధికారములలో వేదప్రవర్తనాదులకై వినియోగపడుదురు. వారు కర్మఫలాను సారముగా కాక, తమ ఇచ్ఛానుసారముగా నూతన శరీరములను ధరింతురు. కార్యాలయములలోని కర్తవ్యములను నెఱవేర్చుటకై ఒక గృహమునుండి మరియొక గృహమున కేగునట్లు వారు ఒక శరీరమునుండి మరియొక శరీరమునకేగుచుందురు. వారు ధరించిన శరీరములన్నియు వారికి జ్ఞాపకముండును. పంచ భూతాత్మకములగు శరీరేంద్రియాదులకు భిన్నముగా వారు తమ శక్తిసామర్థ్యములచే నూతన శరీరములను సృష్టించి, వాటిని ఏకకాలమునందుఁగాని ఒకదాని తర్వాత మరియొకదానినిఁగాని ఆక్రమించుకొనఁగలుగుదురు.

బ్రహ్మజ్ఞాన సంపన్నయగు సులభ జనకునితో వాద మొనర్చుటకు వాంఛించి నట్లు స్మృతి మనకు తెలుపుచున్నది. ఆమె తన స్వశరీరమును త్యజించి, జనకుని శరీరమునందు ప్రవేశించి, అతనితో వాదమొనర్చి, అనంతరము తన స్వశరీరమునకు తిరిగివచ్చెను.

"తత్త్వమసి" యను వాక్యమునకు "తత్త్వంమృతో భవిష్యసి" యను అర్థమును స్వీకరించరాదు. అనగా నీవు మరణించిన తర్వాత తత్స్వరూపుడవగుదువని వ్యాఖ్యా నింపరాదు. పూర్ణ బ్రహ్మజ్ఞానమునుఁ బడసిన తత్క్షణమే బ్రహ్మైక్యము సిద్ధించునని మరియొక శ్రుతి పలుకుచున్నది. వామదేవ ఋషి దీనిని అనుభవ మొనర్చుకొని "అహం మనురభవం సూర్యశ్చ" అని పాడెను.

కాని వారు జన్మించినప్పటికిన్నీ అవిద్యకు వారు అధీనులు కాకుండిరి. ఇది ముక్తపురుషుని విషయమును పోలియున్నది. జీవన్ముక్తుడు బ్రహ్మజ్ఞానము నొంది నను, ప్రారబ్ధ కర్మక్షయమగునంతవరకు తన భౌతిక దేహమునందే యుండును. వ్యాసుడు, వసిష్ఠుడు, అపాంతరతముడు ఇత్యాదుల యొక్క దివ్య కార్యములను కూడా జీవన్ముక్తుల ప్రారబ్ధ కర్మతో పోల్చవచ్చును.

ఈ కారణము లన్నింటిచే సత్యమైన పూర్ణజ్ఞానము కలిగిన వారందఱు ఏ విధముగా నైనను పరమపదమును పొందుదురనుట సునిశ్చితమై యున్నది.

# ౨౦. అక్షరధ్యధికరణము

## 3-3-33 అక్షరధియాం త్వవరోధః

## సామాన్య తద్భావాభ్యా మౌపసద వత్తదుక్తమ్

కాని ఒకే విద్యను సూచించుటచే అవినాశియగు బ్రహ్మముయొక్క నిషేధాత్మక గుణములను వేర్వేఱు శ్రుతులనుండి సంగ్రహింపవలసియుండును. ఏలననగా నేతి నేతి వాక్యములచే చెప్పఁబడు అవినాశబ్రహ్మముయొక్క నిర్వచనము మఱియు అవినాశ బ్రహ్మము ఉపసదమువలె తాదృశమై యుండును. ఇది జైమినిచే పూర్వమీమాంసయందు వర్ణింపఁబడినది.

అక్షరధియాం = అవినాశమునకు సంబంధించిన నిర్గుణ నిరాకార పదములనుఁగూర్చి ధ్యానించువారి యొక్క, తు = కాని, అవరోధః = చేర్చుట,

సామాన్య తద్భావాభ్యామ్ = నిషేధాత్మక పదములు మఱియు అవినాశ బ్రహ్మము నందు పోలిక యుండుటచే, ఔపసదవత్ = ఉపసదమంత్రమువలె, తత్ = అది, ఉక్తమ్ = పూర్వమీమాంసలో జైమినిచే వివరింపఁబడినది.

ఈ పాదములోని 11వ సూత్రమునందు భావార్థక గుణములు వివరింపఁబడుటచే, ఇప్పుడు అవినాశబ్రహ్మముయొక్క నిషేధాత్మక గుణములు వివరింపఁబడుచున్నవి.

బృహదారణ్యకమునందీ క్రింది వాక్యము కలదు. "ఏతద్వైతదక్షరంగార్గి బ్రాహ్మణా అభివదంత్య స్థూలమనణ్వహ్రస్వమదీర్ఘ మలోహితమస్నేహమ్" (బృ. ఉ. 3-8-8) ఇఁక ముండకోపనిషత్తిట్లు నుడువును. "అథపరాయయాతదక్షర మధి గమ్యతే యత్తదద్రేశ్యమగ్రాహ్యమగోత్రమ వర్ణమ్" (ముం. ఉ. 1-1-5) ఇతర స్థలములలో కూడా అక్షరమని చెప్పఁబడు పరబ్రహ్మము నిషేధాత్మక గుణములతో వర్ణింపఁబడినది.

పై రెండు శ్రుతులలోని నిషేధాత్మక గుణములు ఒకే విద్యగా సంయోగ మొనర్పఁబడవలయునా? లేక రెండు వేర్వేరు విద్యలుగా గణింపఁబడవలయునా? యను సంశయ మిచ్చట కలుగును.

ఏయే శ్రుతివాక్యమునందు చెప్పఁబడిన నిషేధము ఆయా శ్రుతివాక్యమునందే వర్తించును. కాని ఇతర స్థలములలో వర్తించదని పూర్వపక్షి పలుకును. ఈ నిషేధాత్మకగుణములు ఆనందము, శాంతి, జ్ఞానము, సత్యత, పవిత్రత, పూర్ణత్వము శాశ్వతత్వము ఇత్యాదులవలె బ్రహ్మముయొక్క స్వరూపమును ప్రత్యక్షముగా సూచింపవు. కావున 3-3-11వ సూత్రములోని సిద్ధాంత మిచ్చట వర్తించదు. ఏలననగా ఇట్టి సంయోగముచే ఏలాటి ప్రయోజనము సిద్ధింపదు.

ఈ సూత్రము దీనిని ఖండించి, ఇట్టి నిషేధములు సంయోగ మొనర్పఁ బడవలయునని తెలుపును. ఏలననగా నిషేధాత్మకముద్వారా బ్రహ్మముయొక్క ప్రబోధ విధానము మఱియు ప్రబోధక విషయమగు అక్షర పరబ్రహ్మముకూడా ఏకమేనై యున్నది. ఈ పాదములో 11వ సూత్రమునందు చర్చింపఁబడిన బ్రహ్మము యొక్క విధిరూప విశేషణములు ఇచ్చటకూడా వర్తించును. ఇచ్చట బ్రహ్మమునుఁ గూర్చి పరోక్షముగా ప్రబోధించునట్టి నిషేధాత్మక గుణములతో మనకు నిమిత్తము

కలదు. ఇది ఉపసదర్పణమువంటిదై యున్నది. అర్పణ మొసంగు ఈ మంత్రములు కేవలము సామవేదమునందే కానcబడును. కాని యజుర్వేద యాజకులు మరియొక వేదములోని ఈ మంత్రమును ప్రయోగింతురు. యజుర్వేద పఠన సమయమునం దధ్వర్యుడు సామవేద మంత్రముల నుచ్చరించును. ఈ సిద్ధాంతము జైమినిచే పూర్వమీమాంస (3–3–9) యందు స్థాపింపcబడినది.

ఇదేవిధముగా అక్షర పరబ్రహ్మోపాసనయందు ఇచ్చుటి నిషేధాత్మక గుణము లను సంయోగ మొనర్పవలయును.

బృహదారణ్యకములో పేర్కొనcబడిన అక్షర బ్రహ్మముయొక్క నిషేధాత్మక లక్షణములను ప్రతి అక్షర విద్యలోని ఉపాసనలయందు చేర్చcబడవలయును. ఏలననగా ప్రతి అక్షరవిద్యయందును ఒకే అక్షర బ్రహ్మమును గుర్తెఱుంగవలసి యున్నది. మఱియు ఈ నిషేధాత్మక లక్షణములను పరబ్రహ్మముయొక్క ముఖ్య లక్షణములతో చేర్చcబడవలసియున్నది.

# 21. ఇయదధికరణము

## 3–3–34 ఇయదా మననాత్

ఏలననగా ఒకే విషయము మరల మరల వర్ణింపబడినది.

ఇయత్ = ఇంత మాత్రమే, ఆమననాత్ = శ్రుతియందు పేర్కొనబడుటచే.

ముండకమునందీ క్రింది వాక్యము కలదు. "ద్వాసుపర్ణాసయుజా సఖాయా సమానంవృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలంస్వాద్వత్త్య నశ్నన్నన్యో అభిచాకశీతి" (ముం. ఉ. 3–1–1). ఇదే మంత్రము శ్వేతాశ్వతరము (4–6) నందున్నూ కలదు.

ఇcక "ఋతం పిబంతౌ సుకృతస్యలోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే ఛాయాతపౌ బ్రహ్మ విదోవదంతి పంచాగ్నయోయేచ త్రిణాచికేతాః" అను వాక్యము కఠోపనిషత్తు (1–3–1) నందున్నూ కలదు.

ఈ రెండు శ్రుతులలో రెండు విభిన్నమైన విద్యలు కలవా? లేక ఒకే విద్య యున్నదా? యను సంశయమిచ్చుట కలుగును.

ఉపాసనా విషయములు విభిన్నములై యుండుటచే ఇవి రెండు విద్యలను సూచించునని పూర్వపక్షి పలుకును. ఒకే పక్షి ఫలమును భక్షించుననియు, మరియొక పక్షి భక్షింపదనియును ముండకోపనిషత్తు పలుకును. రెండున్నూ తమ సుకృత కర్మఫలముల ననుభవించునని కఠోపనిషత్తు నుడువును. కావున ఉపాస్యవిషయ మిచ్చట ఏకముకాదు. జ్ఞేయపదార్థములు విభిన్న లక్షణములను కలిగియుండుటచే, విద్యలు స్వయముగా విభిన్నములని చెప్పవలసియుండును.

ఈ సూత్రము దీనిని ఖండించి, ఇవి ఒకే విద్యను సూచించునని నిశ్చయించును. ఏలననగా ఆయా విధముగా జీవుని రూపమునందు ఒకే పరమాత్ముడు వర్ణింపఁబడియున్నాడు. పరబ్రహ్మమునుఁగూర్చి ప్రబోధించి జీవబ్రహ్మైక్యమును గుర్తెఱుంగఁజేయుటయే ఈ రెండు శ్రుతివాక్యములకు లక్ష్యమై యున్నది.

"ద్వా" అను శబ్దము రెండు శ్రుతులలోను ప్రయోగింపఁబడుటచే, అవి ఒకే విద్యను సూచించుచున్నవని మనము తెలిసికొనవలసియున్నది. జీవుడనెడి పక్షి కర్మఫలములను భక్షించుననియు, రెండవపక్షి భక్షింపక చూచుచుండునని ముండకోపనిషత్తు చెప్పినను మఱియు మరియొక వాక్యమునందు రెండున్నూ ఫలములను భక్షించునని చెప్పఁబడినను అవి ఒకే పదార్థమును సూచించుచుండుటచే, ఈ రెండు విద్యలు ఏకమేనై యున్నవి. ఒక సమూహము నందొకానొకడు మాత్రము గొడుగును ధరించినను, మనము గొడుగును ధరించినవారు వెళ్ళుచున్నారని చెప్పినట్లు పరబ్రహ్మముకూడా ఫలములను భక్షించుచున్నట్లు చెప్పఁబడినది. 1-2-11 నందు ఇవన్నియును విస్తారముగా వర్ణింపఁబడినవి.

కావున ఉపాస్యవస్తువు ఏకమైయుండుటచే, విద్యలుకూడా ఏకమేనై యున్నవని నిర్ణయింపఁబడుచున్నది.

# 22. అంతరత్వాధికరణము

## (35-36 సూత్రములు)

### 3-3-35 అంతరాభూతగ్రామవత్స్వాత్మనః

భూత సంఘాతమునందువలె అందఱియందున్న ఆత్మ ఏకమే యగుటచే, విద్యయందేకత్వమున్నది.

అంతరా = అందఱియొక్క అంతఃకరణమునందుండుటచే, భూతగ్రామవత్ = భూతసంఘాతమువలె, స్వాత్మనః = తన స్వాత్మయొక్క,

ఒకే విద్యకు సంబంధించినవని తెలుపుటకు బృహదారణ్యకములోని రెండు వాక్యములు చర్చింపఁబడుచున్నవి.

బృహదారణ్యకమునందు ఉషస్తుడు యాజ్ఞవల్క్యుని "యత్సాక్షాద పరోక్షాద్బ్రహ్మయ ఆత్మాసర్వాంతరః" (బృ.ఉ. 3-4-1) అని ప్రశ్నించెను. "ప్రాణము ద్వారా శ్వాసించునదేదో, అందఱి అంతఃకరణము నందున్నదేదో, అదియే ఆత్మ," యని యాజ్ఞవల్క్యుడు సమాధానమొసంగును.

అదే ఉపనిషత్తునందు కహోలునిచే అదే ప్రశ్న వేయఁబడినప్పుడు యాజ్ఞ వల్క్యుడీ క్రింది సమాధానము నొసంగును. "క్షుత్పిపాసలను, శోక మోహములను, జరా మృత్యువుల నధిగమించునదేదో అదియే ఆత్మ." (బృ.ఉ. 3-5-1).

ఈ రెండున్నూ విభిన్నమైన విద్యలని పూర్వపక్షి పలుకును. ఏలననగా సమాధానము వేర్వేఱుగా నుండుటచే, విషయములున్నూ వేర్వేఱై యుండవలసి యుండును.

ఈ సూత్రము దీనిని ఖండించి, ఏకైక పరబ్రహ్మమే ఈ రెండింటికి విషయమై యున్నదని పలుకును. ఏలననగా ఒకే దేహముయొక్క అంతర్భాగము నందు ఒకే కాలములో రెండు ఆత్మలుండుట అసాధ్యమైన విషయమైయున్నది.

ఆత్మ సర్వభూతములలో పరివ్యాప్తమై యుండునట్లు, ఆత్మ సర్వాంతర్యామియై యున్నదని రెండు వాక్యములయందు ప్రబోధింపఁబడినది. ఈ రెండు వాక్యములు ఒకే విద్యనుఁగూర్చి సూచించును. ఏలననగా సర్వాంతరమైన ఆత్మ ఏకైకమై యుండును. భూతములలో పృథ్వియందు నీరు, నీటి యందగ్నియు వ్యాపించియున్నది. కాని వీటియం దేదియున్నూ సర్వాంతరత్వమును కలిగిలేదు. కావున సర్వాంతరత్వమును కలిగియున్న పదార్థమేకైకమై యున్నది.

సాపేక్షముగా ఒక భూతము మరియొక భూతమునం దుండవచ్చును. కాని ఈ భౌతిక శరీరమునకు కారణమైయున్న పంచభూతములయందే యొక్కటియు నిజముగా అన్నింటికి సర్వాంతరమైనదికాదు. అదే విధముగా ఒకే శరీరమునందు,

ఒకే కాలమునందు రెండు ఆత్మలు అన్నింటికంటె సర్వాంతరము కాఁజాలవు. కావున కేవలము ఒకే ఆత్మ అన్నింటికి సర్వాంతరమై యొప్పును.

కాఁబట్టి యాజ్ఞవల్క్యుని రెండు సమాధానములయందును ఒకే ఆత్మ ప్రబోధింపఁబడినది.

రెండు విషయములలోను ప్రశ్నోత్తరములకు విషయము బ్రహ్మమేనై యున్నది. యాజ్ఞవల్క్యుని ఈ క్రింది వాక్యముచే ఈ విషయము ప్రతిపాదింపఁ బడినది. "నీ యాత్మయే సర్వజీవులకు అంతరాత్మయై యున్నది." యాజ్ఞవల్క్యుని నానావిధ వర్ణనలు బ్రహ్మమనెడి ఒకే విషయమునకు సంబంధించియున్నవి.

ఈ రెండు వాక్యములున్నూ సర్వాంతరమగు ఆత్మనుఁగూర్చి తెలుపుటచే, అవి ఒకే విద్యకు సంబంధించినవని తెలియుచున్నది. రెండు వాక్యములలోను శంకా సమాధానములలో సర్వాంతరమగు ఆత్మ సూచింపఁబడినది. ఏలననగా ఒకే శరీరమునందు సర్వాంతరములగు రెండు ఆత్మలుండఁజాలవు. ఒకే యాత్మ మాత్రమే సర్వాంతరమై యుండవచ్చును. శ్వేతాశ్వతరమునందీ క్రింది వాక్యము కలదు. "ఏకో దేవః సర్వభూతేషుగూఢః సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా" (శ్వే. ఉ. 6-11) భూత సంఘాతమునందొకే ఆత్మ నివసించునని ఈ మంత్రము నుడివినట్లే, బృహదారణ్యకములోని రెండు వాక్యములున్నూ ప్రబోధించుచున్నవి.

ఉపాస్యము లేక జ్ఞేయపదార్థము ఏకమై యుండుటచే, విద్యకూడా ఏకమేనై యున్నది.

## 3-3-36 అన్యథా భేదానుపపత్తిరితిచే న్నోపదేశాంతరవత్

మరల మరల చెప్పఁబడుటచే ఈ రెండు విద్యలు విభిన్నములని పలికినచో అట్లు కాదని మేము సమాధాన మొసంగుదుము. ఇది ఛాందోగ్యములోని మరియొక ఉపదేశము తిరిగి చెప్పుట వంటిది.

అన్యథా = లేకున్నచో, భేదానుపపత్తిః = రెండు సమాధానములలో భేదమును పాటింపకుండుట, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = కాదు, ఉపదేశాంతరవత్ = ఛాందోగ్యములోని సత్యవిద్యవలె.

రెండు విద్యలయొక్క భేదము నంగీకరింపకున్నచో, రెండు వాక్యముల యొక్క భేదము పాటింపఁబడకుండునని పూర్వపక్షి పలుకును. రెండు వాక్యములు రెండు

ఆత్మలను సూచింపకున్నచో, ఒకే విషయము మరల చెప్పఁబడుట నిష్ప్రయోజన మగునని అతడు పలుకును.

అట్లుకాదని ఈ సూత్రము నిర్ధరించును. పునరుక్తికి ఒక నిశ్చయమైన కారణమున్నది. సాధకుడు నానావిధ దృష్టికోణముల ననుసరించి విషయమును స్పష్టముగను, గంభీరముగను, అర్థ మొనర్చుకొనుట కది సహకరించును. పునరుక్తిచే రెండు భిన్నమైన ఆత్మలు ప్రబోధింపఁబడినవనుట యుక్తముకాదు. ఛాందోగ్యము నందు "స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో" (ఛాం.ఉ.6-8-7) అను వాక్యము తొమ్మిది పర్యాయములు చెప్పఁబడినది. ఐనను ఒక విద్య అనేక విద్యలుగా విభజింపఁ బడలేదు. ఈ విషయము కూడా ఇట్టిదే నైయున్నది.

వాక్యములన్నియును ఒకే అర్థమును కలిగియున్నవని ఆద్యంత వాక్యాంశములు సూచించును. ఉపక్రమోప సంహారములు ఒకే విధముగా నున్నవి. "ప్రతి యొక్కటి నాశవంతము, ప్రతి యొక్కటి హానికరమైనద"ని అది పలుకును.

శరీరేంద్రియములకు ఆత్మభిన్నమైయున్నదని మొదటి బ్రాహ్మణమునందు చెప్పఁబడినది. రెండవ బ్రాహ్మణమునందు ఆత్మకు క్షుత్పిపాసాదులు లేవని చెప్పబడినది; కాని విద్య ఏకమేనై యున్నది.

పరమాత్మ కార్యముఁగాని, కారణముగాని కాదని మొదటి విభాగము తెలుపుచున్నది. ఇఁక క్షుత్పిపాసాదులతో కూడిన సంసార సంబంధమున కది అతీతమై యున్నదని రెండవ విభాగమునందు తెలుపఁబడినది. రెండవ సమాధానమునందు ఆత్మయొక్క ప్రత్యేక లక్షణము తెలుపఁబడినది.

కావున ఈ రెండు విభాగములున్నూ ఒకే విద్యకు సంబంధించియున్నవి.

# 23. వ్యతిహారాధికరణము

## 3-3-37 వ్యతిహారో విశింషంతి హీతరవత్

ఇతర విషయములకువలె శ్రుతులీ రెండు ఉపాసనలను ప్రత్యేకించి చెప్పుటచే, ఇచ్చట పారస్పరికోపాసనను మనము అంగీకరింపవలసియుండును.

వ్యతిహారః = పారస్పరికోపాసన, విశింషంతి = శ్రుతులు స్పష్టముగా చెప్పుచున్నవి, హి = ఏలననగా, ఇతరవత్ = ఇతర విషయములకువలె.

అదిత్యపురుషుని సూచించుచు ఐతరేయారణ్యకమిట్లు పలికినది. "తద్యోఽ హంసోఽ సౌయోఽ సౌసోఽ హమ్" (ఐ.ఆ. 2-2-4-6)

ఉపాసన పారస్పరికమైనదా? అనగా ఉపాసకుడు ఆదిత్య పురుషునితోను, ఆదిత్యపురుషుడు ఉపాసకునితోను తాదాత్మ్యము నొందవలెనా? లేక, మొదటి విధానమే అనుసరణీయమా? అను సంశయమిచ్చట కలుగును.

మొదటి విధానమునే ఉపాసనయం దనుసరింపవలయును, కాని రెండవ విధానము అనుసరణీయము కాదని పూర్వపక్షి పలుకును. ప్రథమోపాసనచే జీవుడు పవిత్రడగుననియు, ద్వితీయోపాసనచే దేవునికి కించిత్త్వము కలుగుననియును అతడు వాదించును. ప్రాథమికోపాసన అర్థవంతమైనదనియు, ద్వితీయోపాసన అర్థరహితమైనదనియును అతడు పలుకును.

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి, ఉపాసన రెండు విధములుగా అభ్యసింపఁబడవలయునని పలుకును; ఏలననగా ఇట్టి సిద్ధాంతము నిరర్థకమై యున్నది. పారస్పరికోపాసనను శ్రుతి నొక్కి వక్కాణించుచున్నది. ఈ కారణము చేతనే సర్వాంతరత్వము, సత్యసంకల్పత్వాదులు ఆత్మకు సంబంధించినవిగా చెప్పఁబడినవి. ఏలననగా శ్రుతిద్వయము రెండు విధములుగా ప్రతిపాదించి యున్నది. "అహమేవత్వం, త్వమేవాఽ హమ్" కావున ద్వివిధోపాసనలపై ఆధారపడి యున్నప్పుడే ప్రతిపాదన ద్వయము అర్థవంతమగును. లేకున్నచో అది అర్థరహిత మగును. ఏలననగా ఒకే యొక సిద్ధాంతము మన కావశ్యకమైయున్నది.

దీనిచే బ్రహ్మమునకేలాటి లోటు కలుగదు. ఇంతేకాకుండా ఇట్టి మార్గము ననుసరించినప్పుడు మాత్రమే ఆత్మైక్యత ఉపాసింపఁబడును. అశరీరియగు బ్రహ్మము శరీరమున్నట్లుగనే ఉపాసింపఁబడును, లేక, స్తుతింపఁబడును. ఆత్మైక్యతను స్థిరపఱచు నిమిత్తమే ప్రతిపాదనద్వయము చెప్పఁబడినది. ఇది సమైక్యతను బలపఱచును.

కావున ద్వివిధోపాసనయే అంగీకరింపఁబడును. కాని ఒకే విధమగు ఉపాసన కాదు. దీనిచే ఆత్మైక్యత స్థిరపడును. శ్రుతి ప్రతిపాదితమగు ద్వివిధోపాసనను అవలంబింపవలసియుండును. మఱియు ఇదే విషయమును ప్రతిపాదించిన ఇతర విద్యల యందు కూడా దీనిని వినియోగింపవలసియుండును.

# 24. సత్యాద్యధికరణము

## 3-3-38 సైవ హి సత్యాదయః

సత్యాదిగుణములు రెండు స్థలములలోను చూడఁబడుటచే, రెండు స్థలముల యందును ఒకే సత్యవిద్య ప్రబోధింపఁబడినది.

సా ఏవ = ఒకే సత్యవిద్య, హి = ఏలననగా, సత్యాదయః = సత్యాది గుణములు.

బృహదారణ్యకమునందు "సయోహైతం మహద్యక్షం ప్రథమజం వేద సత్యం బ్రహ్మ" (బృ.ఉ. 5-4-1) మఱియు "తద్యత్తత్సత్యమసౌస ఆదిత్యోయ ఏష ఏతస్మిన్మండలే పురుషో యశ్చాయం దక్షిణే క్షన్పురుషః" (బృ.ఉ. 5-5-2) అను వాక్యములు కలవు.

ఐతే ఈ రెండు సత్యవిద్యలు ఏకమా? లేక విభిన్నములా?యనెడి సంశయమిచ్చట కలుగును.

విద్యలు రెండని పూర్వపక్షి పలుకును. ఏలననగా పై శ్రుతి యందు "జయతీమాన్ లోకాన్" (5-4-1) అనియు "హంతి పాప్మానం జహాతిచ" (5-5-3) అనియు రెండు విధములగు ఫలములు చెప్పబడినవి. అవి ఏకమేయని ఈ సూత్రము స్పష్టపరచును. ఏలననగా రెండవ వాక్యములోని "యోஉయం" అను పదముచే మొదటి వాక్యములోని సత్యబ్రహ్మము సూచింపఁబడుచున్నది.

నిజమునకీ రెండింటియందును ఒకే ఫలము చెప్పఁబడినది. సత్యమునుఁ గూర్చిన నూతనమగు ఉపదేశమును స్తుతించుటకై రెండవ ఫలము చెప్పఁబడినది. "అహర్" మరియు "అహమ్" అనునవి సత్యమునకు రహస్య నామములు.

కావున శ్రుతి సత్యవాక్యమనెడి ఒకే విద్యనుఁగూర్చి నుడువుచున్నదని నిర్ణయింపఁబడినది. ఇది నిషేధాత్మక గుణములకు భిన్నమైనదిగను, సత్యాది సద్గుణ సమన్వితమైనదిగను ఉపాసింపఁబడవలయును.

పై సూత్రము బృ.ఉ. 5-4 మఱియు 5-5 నందున్న విద్య ఒకే విద్యయా? కాదా? యనెడి ప్రశ్నకు సంబంధించినది కాదనియు, బృహదారణ్యకములోని ఆదిత్య పురుషుడు, అక్షిపురుషుడు మఱియు "అథయ ఏషోంతరాదిత్యే హిరణ్మయః

పురుషో దృశ్యతే" (ఛాం.ఉ. 1–6–6) అనునవి ఒకే విద్యను సూచించునా? లేదా? యను ప్రశ్నకు సంబంధించినదనియును కొందఱు వ్యాఖ్యాతలు తలంతురు.

బృహదారణ్యకములో పేర్కొనఁబడిన సత్యాదిగుణములు ఛాందోగ్య శ్రుతి యందు కూడా చేర్చఁబడవలసియుండుటచే, అవి ఒకే విద్యను సూచించునని వారు నిశ్చయించి చెప్పుదురు.

కాని సూత్రముయొక్క ఈ వ్యాఖ్యానము అసమంజసమైయున్నది. ఏలననగా ఛాందోగ్యవిద్య ఉద్గీథమును సూచించుటచే, అది జ్యోతిష్టోమాది కర్మలకు సంబంధించి యున్నది. ఏతచ్చిహ్నములను ఈ విద్యయొక్క ఆది మధ్యాంతముల యందు మనముఁ గాంచవచ్చును. ఆదియందు "ఇయమేవర్గగ్నిః సామ" (ఛాం. ఉ. 1–6–1) యనియు, మధ్యమునందు "తస్యర్క్సామచ గేష్ణౌ తస్మాదుద్గీథః" (1–6–8) యనియు, అంతమునందు "య ఏవం విద్వాన్సామగాయతి" (1–7–9) యనియును చెప్పఁబడినది.

ఇఁక బృహదారణ్యకములోని విద్య ఏతద్విరుద్ధమగుటచే ఏలాటి కర్మ సంబంధమగు చిహ్నమును కలిగిలేదు. విషయము విభిన్నమైయుండుటచే, విద్యలుకూడా విభిన్నములై యున్నవి. కావున ఈ రెండు విద్యలయొక్క వివరములను వేర్వేఱుగా పేర్కొనవలసియున్నది.

# 25. కామాద్యధికరణము

## 3–3–39 కామా దీతరత్ర తత్ర చాయతనాదిభ్యః

రెండింటియందును ఆయతనము ఏకమైయుండుటచేతనే ఛాందోగ్యము నందు పేర్కొఁనబడిన సత్యకామాదులు బృహదారణ్యకమునందు చేర్చఁబడవల యును. మఱియు బృహదారణ్యకములో పేర్కొనఁబడిన వాటిని ఛాందోగ్యము నందు చేర్చవలయును.

కామాది = సత్య సంకల్పాదులు, ఇతరత్ర = బృహదారణ్యకమునందు, తత్ర = ఛాందోగ్యమునందు, చ = కూడా, ఆయతనాదిభ్యః = స్థానాదులచే.

ఛాందోగ్యము మఱియు బృహదారణ్యకోపనిషత్తులలోని "దహరవిద్య" ఇప్పుడు చర్చింపబడుచున్నది.

ఛాందోగ్యమునందు "అథయదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మదహరోఽస్మిన్నంత రాకాశః" (ఛాం.ఉ. 8-1-1) అను వాక్యము కలదు. బృహదారణ్యకమునందు "సవాఏష మహానజ ఆత్మాయోఽయం విజ్ఞానమయః ప్రాణేషు య ఏషోంతర్హృదయ ఆకాశస్తస్మిఞ్ఛేతే సర్వస్యవశీ" (బృ.ఉ.4-4-22) అను వాక్యము కలదు.

ఇచ్చట ఈ రెండున్నూ ఒకే విద్యను సూచించునా? లేదా? యనియు మఱియు వీటిలోని అంశములను సంయోగమొనర్పవలయునా? లేదా? యనియును సంశయమేర్పడును.

ఈ రెండింటియందును సామాన్యములగు అంశములుండుటచే ఈ రెండింటి యందు పేర్కొఁనబడిన గుణములు పరస్పరము సంయోగమొనర్పఁబడవలయు ననియు, ఈ రెండున్నూ ఒకే విద్యను సూచించుననియు ఈ సూత్రము మనకు తెలియఁజేయును.

కామాదులు "సత్యకామాదులు"గా పరిగణింపఁబడవలయును. ప్రజలు సామాన్యముగా దేవదత్తుని దత్తనియు, సత్యభామను భామయనియును పలుకునట్లు "కామ" శబ్దము "సత్యకామము"ను సూచించును. ఛాందోగ్యము నందు హృదయాకాశమున కారోపింపఁబడిన ఈ గుణములన్నింటిని బృహదారణ్యక వాక్యముతో సంయోగమొనర్పవలయును. మఱియు బృహదారణ్యకములోని "సర్వస్యవశీ" ఇత్యాదిగుణములను ఛాందోగ్యమునందు వర్ణింపఁబడినట్టి "ఏష ఆత్మాపహతపాప్మా"యను దానితో సంయోగ మొనర్పవలెను.

ఈ వాక్యద్వయమునందు సర్వసామాన్యములగు అంశములుండుటయే దీనికి కారణమైయున్నది. ఈ రెండింటికి హృదయమే స్థానమైయున్నది. ఇఁక జ్ఞేయమగు పరమాత్మకూడా ఈ రెండింటియందు సామాన్యమైయున్నది. మఱియు లోకములు పడిపోకుండా పరమేశ్వరుడు సేతువుగానుండి రక్షించుటకూడా ఈ రెండింటి యందు సామాన్యమైయున్నది. ఇదే విధముగా అనేకములగు ఇతరాంశములున్నవి.

కాని ఇచ్చట ఒక ఆక్షేపణ చెప్పఁబడినది. వీటియందు కొన్ని భేదములు కూడా ఉన్నవి. ఛాందోగ్యమునందీ లక్షణములు హృదయాకాశమున కారోపింపఁ బడినవి. ఇఁక బృహదారణ్యకమునందవి ఆకాశములోని బ్రహ్మమున కారోపింపఁ

బడినవి. ఈ యాక్షేపణ నిర్బలమైనది. ఇది నిశ్చయముగా నిలువనేరదు. ఛాందోగ్యములోని ఆకాశ శబ్దము బ్రహ్మమును సూచించునను విషయమును మేము (1–3–14)వ సూత్రమునందు నుడివియున్నాము.

ఏది ఎట్లయినను ఈ రెండు వాక్యములయందొక భేదమున్నది. ఛాందోగ్యము సగుణ బ్రహ్మమును మఱియు బృహదారణ్యకము నిర్గుణ బ్రహ్మమునుఁగూర్చి ప్రతిపాదించును. యాజ్ఞవల్క్యుడు జనకునితో ఇట్లనును. "అసంగోహ్యాయం పురుషః" (బృ. ఉ. 4–3–15).

కాని సగుణ బ్రహ్మము నిర్గుణ బ్రహ్మమునకు మూలాధారమై యుండుటచే ఈ సూత్రము బ్రహ్మమును స్తుతించుటకు మాత్రము గుణసంయోగమును ప్రబోధించినదే కాని,ఉపాసన నిమిత్తముకాదని మనము నిర్ణయింపవలసి యున్నది.

# 26. ఆదరాధికరణము

## (40–41 సూత్రములు)

### 3–3–40 ఆదరా దలోపః

శ్రుతియందు ప్రాణాగ్ని హోత్రమునకు గౌరవమొసంగఁబడుటచే, ఆహారము స్వీకరింపఁబడకున్నను ఈ కార్యమునకు లోపముండరాదు.

ఆదరాత్ = గౌరవము చూపఁబడుటచే, అలోపః = లోపముండరాదు.

ఈ సూత్రమునందు పూర్వపక్షియొక్క దృష్టికోణ మొసంగఁబడినది.

జాబాల శ్రుతియందు ప్రాణాగ్నిహోత్రము బలపఱచఁబడుటచే, ఇట్టి ప్రాణగ్నిహోత్రమునకు లోపముండరాదు.

ఉపాసకుడు ఆహారమును స్వీకరించుటకు పూర్వము "ప్రాణాయస్వాహా" ఇత్యాది మంత్రములచే ప్రాణపంచకమునకు ఆహుతి నొసంగవలయునని ఛాందోగ్యములోని వైశ్వానరవిద్యయందు తెలుపఁబడినది. ఈ ప్రాణాగ్ని హోత్రమునకు శ్రుతి మిక్కిలి ప్రాధాన్యము నొసంగినది. అతిథులను సైతము తృప్తిపఱచక పూర్వమే ప్రాణములకాహారము సమర్పింపఁబడవలయునని శ్రుతి విధించుచున్నది.

ఇంక ఉపవాస దినములలో కూడా ప్రాణాగ్ని హోత్రము పాటింపఁబడవల యునా? లేదా? యను సంశయమిచ్చట కలుగును.

శ్రుతి దీనికి మిక్కిలి ప్రాధాన్యము నొసంగుటచే, ఉపవాస దినములలోకూడా దీనిని పాటింపక తప్పదని ఈ సూత్రము వివరించును. ఉపవాస దినములలో కూడా కనీసము కొన్ని నీటిబిందువులను పీల్చుట ద్వారా ఇది పాటింపఁ బడవలయునని జాబాల శ్రుతి పలుకుచున్నది.

ఈ పూర్వపక్షికి తదనంతర సూత్రము సమాధానమొసంగును.

## 3-3-41 ఉపస్థితేఽ తస్తద్వచనాత్

భోజనమొనర్చునప్పుడు మొదట భుజించు ఆహారమునుండి ప్రాణాగ్నిహోత్ర మొనర్పఁబడవలయునని శ్రుతి వచించుచున్నది.

ఉపస్థితే = ఆహారము వడ్డింపఁబడినప్పుడు, అతః = దానినుండి, తద్వచనాత్ = శ్రుతి ఇట్లు నిర్దేశించుటచే.

చివరి సూత్రములోని దృష్టికోణమును ఈ సూత్రము ఖండించి, ఉపవాస దినములలో ప్రాణాగ్నిహోత్రమును పాటింపనవసరములేదని పలుకును. ఏలననగా శ్రుతి స్పష్టముగా ఇట్లు నుడువుచున్నది. "తద్యద్భక్తం ప్రథమమాగచ్ఛేత్తద్ధోమీయమ్" (ఛాం.ఉ. 5-19-1).

ఆహారము స్వీకరింపఁబడినప్పుడు మాత్రము మొదటిభాగమును ప్రాణముల కర్పింపవలయును. శ్రుతి దీనికి మాత్రమే ప్రాధాన్య మొసంగుచున్నది. కాని ఉపవాస దినములలో కూడా ఇది పాటింపఁబడవలయునని పలుకుటలేదు.

# 27. తన్నిర్ధారణాధికరణము

## 3-3-42 తన్నిర్ధారణానియమస్తద్దృష్టేః పృథగ్ఘ్యప్రతిబంధః ఫలమ్

క్రతు సంబంధములగు ఉపాసనలలో అతిక్రమింపరాని నియమములేదని శ్రుతి స్వయముగా తెలుపుచున్నది. ఏలననగా అప్రతిబంధ మనెడి క్రతుఫలము ఉపాసనలకు సంబంధించియున్నది.

తన్నిర్ధారణానియమః = అతిక్రమింపరాని నియమము లేదు, తదృష్టేః = అది శ్రుతియందు చూడఁబడుటచే, పృథక్ = ప్రత్యేకమైన, హి = ఏలననగా, అప్రతిబంధః = నిరాటంకము, ఫలమ్ = ఫలితము.

క్రతుసంబంధమగు ఉపాసన అనివార్యముకాదని ఈ సూత్రము నుడువుచున్నది.

“కర్మాంగావబద్ధోపాస్తి” ఉపాసనకర్మయొక్క అంగముగా ఒనర్పబడవలయు నని చెప్పఁబడినది. ఇది అత్యంతావశ్యకమా? కాదు. ఒకవేళ అది ఆచరింపఁ బడినచో గొప్ప ఫలము కలుగును. అది ఒనర్పఁబడకున్నను కర్మ పూర్ణమనియే చెప్పఁబడును. ఇది ఛాందోగ్యోపనిషత్తుద్వారా స్పష్టమగుచున్నది.

క్రతువులతో పాటు పేర్కొనఁబడిన కొన్ని ఉపాసనలు క్రతు సంబంధము లగుటచే, అవి వాటితో శాశ్వతముగానుండి అవిభాజ్యములై యున్నవా? లేదా? యను విషయమును మనమిప్పుడు చర్చింతము.

ఉపాసనలు క్రతువున కంగములు కాకుండుటచే అవి అవిభాజ్యములని తలంపరాదని ఈ సూత్రము తెలుపుచున్నది. క్రతువు ఉపాసనయుక్తముగను లేక ఉపాసనరహితముగను ఒనర్పఁబడవచ్చునని శ్రుతి నొక్కి చెప్పుచున్నది. “తేనోభౌకురుతో యశ్చైతదేవం వేదయశ్చనవేద” (ఛాం.ఉ. 1-1-10), దీనిచే ఉపాసనారహితముగా ఉద్గీథపూజ ఒనర్చఁబడవచ్చునని తెలియుచున్నది. కాని శ్రద్ధ మఱియు జ్ఞానముచే ఒనర్పఁబడు ఉపాసన మిక్కిలి శక్తిమంతమై యుండును.

క్రతువులలో ఉద్గీథోపాసనాదుల నొనర్చుట అనివార్యమను నియమము లేదు.

ఏలననగా యజ్ఞకర్తకు ఓంకారోపాసన ఐచ్ఛికమైయున్నది. మఱియు యజ్ఞము నిరాటంకముగా జరిగినచో ఆ యజ్ఞమునకు ఫలము విభిన్నమై యుండును. ఏలననగా క్రతువుతో నిమిత్తము లేకుండా నిశ్చయముగా

ఉపాసనకు ఫలముండుననుట సుస్పష్టము. కాని క్రతువునకు విఘ్నములు మరియు ఆటంకములు సంభావ్యములై యున్నవి. ఒకవేళ ఉపాసన మరియు క్రతువు మిళిత మొనర్పఁబడునేని, ఫలము ద్విగుణీకృతమగును.

క్రతువు ఉపాసనరహితముగా కూడా ఒనర్పఁబడవచ్చుననియు, ఉపాసన సహితమైన క్రతువు మిక్కిలి ఫలవంతమనియు ఛాందోగ్య శ్రుతి (1-1-10) నుడువుచున్నది. కావున యజ్ఞయాగాదులతో పాటు ఒనర్పఁబడు ఉద్గీథాది కర్మాంగోపాసనలు అనివార్యములు కావు. ఐనను మిక్కిలి ఫలము నాశించువారు మాత్రము వాటి నొనర్పవచ్చును.

మూలమైన యజ్ఞనిర్వహణకు తగిన ఫలము చేకూరును. కాని ఉపాసనచే తత్ఫలము ఇనుమడించును. కావున ఉపాసన యజ్ఞమునకు అంగము కాజాలదు. కాఁబట్టి యజమానియొక్క ఇచ్ఛానుసారముగా ఉపాసన ఒనర్పఁబడవచ్చును లేక ఒనర్పఁబడకపోవచ్చును.

ఉపాసన యజ్ఞఫలమునకు కలుగు ఆటంకమును నివారించును. దీనిచే అది క్రతువునకు అంగముగా భావింపఁబడదు. యజమానియొక్క దుష్కర్మ అడ్డువచ్చుటచే యజ్ఞఫలము ఆలస్యముగా పొందఁబడవచ్చును. ఉపాసన ఈ దుష్కర్మ ప్రభావమును తొలగించి, యజ్ఞఫలమును శీఘ్రముగా లభింపఁజేయును. అంతేయేకాని యజ్ఞము తన ఫలము నిమిత్తమై ఉపాసనపై ఆధారపడియుండదు.

కావున ఉపాసన యజ్ఞమున కంగము కాకుండుటచే, అది ఐచ్ఛికమైయున్నది.

# 28. ప్రదానాధికరణము

## 3-3-43 ప్రదానవదేవ తదుక్తమ్

ప్రదాన విషయమునకువలె వాయువు మఱియు ప్రాణములను ప్రత్యేకముగా నుంచవలయును. ఈ విషయము పూర్వమీమాంసాసూత్రమునందు వర్ణింపఁ బడినది.

ప్రదానవత్ = ప్రదానాహుతి విషయమునకువలె, ఏవ=నిశ్చయముగా, తత్ = అది, ఉక్తమ్ = చెప్పఁబడినది.

"జ్వలిష్యా మ్యేవాహమి త్యగ్నిర్దధ్రే" (బృ.ఉ. 1-5-22) అని ప్రారంభించు బృహదారణ్యకోపనిషద్విభాగము శరీరాంగములలో ప్రాణము శ్రేష్ఠమనియు, దేవతలలో వాయువు శ్రేష్ఠమనియును నిశ్చయించును.

ఛాందోగ్యమునందు దేవతలలో వాయువే సంవర్గమని చెప్పఁబడినది. "వాయుర్వావ సంవర్గః" (ఛాం.ఉ.4-3-1).

ఇక శరీరాంగములలో ప్రాణమే సంవర్గమని చెప్పబడినది. "ప్రాణోవావ సంవర్గః (ఛాం.ఉ. 4-3-3)

ఛాందోగ్యములోని సంవర్గవిద్యయందు శరీరపరముగా ప్రాణోపాసన మఱియు దేవతాపరముగా వాయువుయొక్క ఉపాసన చెప్పఁబడినది.

ప్రాణము మఱియు వాయువు తాత్త్వికముగా ఏకమేయని అనేక శ్రుతి వాక్యములు నుడువుచున్నవి. కావున తాత్త్వికముగా వాటియందు భేదము లేకుండుటచే, వాయువు మఱియు ప్రాణోపాసనలను సంయోగ మొనర్పవలయునని పూర్వపక్షి పలుకును. మఱియు అవి స్వాభావికముగా అభిన్నములై యుండుటచే, అవి వేర్వేఱుగా ఉపాసింపఁబడరాదు. కొన్ని స్థలములలో ఈ రెండింటియొక్క తాదాత్మ్యత ఇట్లు చెప్పఁబడినది. "యఃప్రాణః సవాయుః"

ప్రస్తుత సూత్రముపై దృష్టికోణమును ఖండించి, ప్రాణవాయువులు స్వాభావికముగా అభిన్నములై యున్నను, అవి విభిన్నస్థానములను కలిగి యుండుట చేతను, వాటి వృత్తులు వేర్వేఱై యుండుటచేతను అవి ప్రత్యేకింపఁ బడవలయునని పలుకును. తాత్త్వికముగా అవి అభిన్నములై యున్నను, ప్రబోధము నందును మఱియు ఉపాసన యందును అవి విభిన్నతను కలిగియుండుట కవకాశమున్నది.

"ప్రదానవత్" అను వాక్యాంశము ద్వారా ఈ సూత్రమీ విషయమును కర్మకాండకు సమాంతరముగా పోల్చి చెప్పినది.

ఉపమానముగా చెప్పవలయునేని తాత్త్వికముగా ఇంద్రుడొకడేయైనను, అతడొకే దేవుడైనను యజమానియొక్క శక్తి సామర్థ్యముల ననుసరించి రాజేంద్రునకు, అధిరాజేంద్రునకు లేక స్వరాజేంద్రునకు ప్రత్యేకముగా ప్రదానము నందు పురోడాశ మొసంగఁబడుచున్నది.

కావున ఆధ్యాత్మిక దృష్టికోణము ననుసరించి విద్య ఏకమైయున్నను, అధిదైవ దృష్టికోణము ననుసరించి దానియందు విభేదమున్నది. కావున ప్రాణము మఱియు వాయువుయొక్క ఉపాసనలయందు విభిన్నత యున్నది. ఈ సిద్ధాంతము పూర్వమీమాంస (సంకర్ష లేక దేవతాకాండ) యందు జైమినిచే స్థాపింపఁబడినది.

# 29. లింగభూయస్త్వాధికరణము

## (44 నుండి 52 సూత్రములు)

## 3-3-44 లింగభూయస్త్వాత్తద్ధి బలీయస్తదపి

అనేక చిహ్నములున్నకారణముచే వాజసనేయులయొక్క అగ్ని రహస్యము నందలి మనస్సు, వాక్కు ఇత్యాది అగ్నులు క్రతువున కంగములు కాజాలవు. ఏలననగా ముఖ్య విషయముకంటె లింగము బలవత్తరమైయున్నది. ఇది కూడా జైమినిచే పూర్వమీమాంసా సూత్రములలో వర్ణింపఁబడియున్నది.

లింగభూయస్త్వాత్ = వేఱు చిహ్నములు అనేకములుగా ఉన్న కారణముచే, తత్ = ఆ ప్రత్యేక చిహ్నము, హి = ఏలననగా, బలీయః = బలవత్తరమై యున్నది. తత్ = అది, అపి = కూడా.

వాజసనేయుల అగ్ని రహస్యము (శతపథ బ్రాహ్మణము) నందు మనస్సు, వాక్కు నేత్రములు ఇత్యాది పేర్లతో కొన్ని అగ్నులు పేర్కొనఁబడినవి.

ఇట్లు పేర్కొనఁబడిన అగ్నులు క్రతువుయొక్క అంగములా? లేక, ఇవి ప్రత్యేక విద్యకు సంబంధించినవా? యను సంశయమిచ్చట ఏర్పడును.

బాహ్యదృష్టికి మరియొక విధముగా తోచినను, ఇవి ప్రత్యేకవిద్యకు సంబంధించినవని ప్రస్తుత సూత్రము తెలుపుచున్నది. ఏలననగా ఈ యగ్నులు ప్రత్యేక విద్యకు సంబంధించినవని తెలుపుటకు అనేక చిహ్నములున్నవి.

ప్రకరణముకంటె లింగము బలవత్తరమైయున్నది. ఈ విషయము పూర్వ మీమాంస (3-3-14) యందు వర్ణింపఁబడియున్నది.

బృహదారణ్యకమునందు మానవుని వయస్సు 100 సంవత్సరములు అనగా 36,000 దినములని చెప్పఁబడినది. మఱియు ప్రతిదినముయొక్క మానసిక తత్త్వము ఒక అగ్నిచయనముగా చెప్పఁబడినది. కర్మకాండ విభాగమునందీ వాక్యము తటస్థించును. కర్మసంబంధమగు విభాగమునందిది తటస్థించుటచే ఇట్టి ఉపాసనను క్రతువుయొక్క అంగముగా నీవు తలంతువేని, ఇట్టి చయనము నిద్రయందుకూడా సంభవించునని శ్రుతి పలుకుటచే లింగాధిక్యత మరొకవిధముగా నున్నదని మేము నుడువుదుము. ప్రకరణముకంటె శ్రుతివాక్యమునం దొసంగఁబడిన ప్రత్యేక కారణము బలవత్తరమై యున్నది.

## 3-3-45 పూర్వవికల్పః ప్రకరణాత్స్యాత్ క్రియా మానసవత్

పూర్వసూత్రమునందు చెప్పఁబడిన అగ్నులు నిజమైన యజ్ఞాగ్నికి వికల్ప రూపములై యున్నవి. ప్రకరణమునుఁబట్టి అవి మానసికపానీయమువలె క్రతువు యొక్క విభాగములై యుండును.

పూర్వ వికల్పః = మొదట పేర్కొనఁబడిన దానికి వికల్పరూపము, ప్రకరణాత్ = ప్రకరణములోని విషయము ననుసరించి, స్యాత్ = ఉండవచ్చును. క్రియామానసవత్ = సోమక్రతువులోని మానసికపానీయమువలె.

పూర్వసూత్రమునకొక ఆక్షేపణ చెప్పఁబడుచున్నది.

పూర్వపక్షి ఒక నూతనమైన ఆక్షేపణను చెప్పుచున్నాడు. సోమక్రతువునకు 10వ రోజు ప్రజాపతికి ఒక సోమపానీయము అర్పింపఁబడును. దానియందు పృథ్వియే పాత్రగను, సముద్రమే సోమముగాను తలంపఁబడును. ఇది కేవలము మానసిక క్రియమాత్రమే. ఐనను ఇది క్రతువునకొక అంగమైయున్నది.

మనస్సు ఇత్యాదులచే కల్పితములగు కృతకాగ్నులకు కూడా ఇదే విషయము వర్తించును. ఇవి మానసికాగ్నులైనను ప్రకరణమునుఁబట్టి ఇవి క్రతువున కంగములుగా పాటింపఁబడునేకాని, స్వతంత్రమైన విద్యగా తలంపఁబడవు. మొదట పేర్కొనఁబడిన నిజమైన అగ్నికి ఇవి వికల్పములై యున్నవి.

ఇది కేవలము అర్థవాదమనియు, కేవలము అర్థవాదముచే ప్రకరణము అతిక్రమింపఁబడజాలదనియు, దశరాత్రకర్మవలె ఇట్టి ఉపాసనకర్మయొక్క అంగ మనియును నీవు నుడువవచ్చును.

## 3-3-46 అతిదేశాచ్చ

మఱియు ఈ మానసికాగ్నులకు నిజమైన అగ్నియొక్క లక్షణములారోపింపఁ బడుటచే.

అతిదేశాత్ = ఈ యగ్నులకు మొదటి అగ్ని యొక్క లక్షణము లారోపింపఁ బడుటచే, చ = మఱియు.

45వ సూత్రమును బలపఱచునట్టి 44వ సూత్రమునకు వ్యతిరిక్తమైన వాదము కొనసాగుచున్నది.

తన దృష్టికోణమున కాధారముగా పూర్వపక్షి మరియొక కారణము నొసంగుచున్నాడు. ఈ మానసికాగ్నులకు నిజమైన అగ్నియొక్క లక్షణములన్నియు శ్రుతి వాక్యమునందారోపింపఁబడినవి. కావున అవి క్రతువున కంగములై యున్నవి.

## 3-3-47 విద్యైవతు నిర్ధారణాత్

కాని శ్రుతియొక్క నిర్ధారణము ననుసరించి అగ్నులు విద్యకు మాత్రము సంబంధించి యున్నవి.

విద్యా = విద్య, ఏవ = మాత్రము, తు = నిశ్చయముగా, నిర్ధారణాత్ = శ్రుతి నిర్ణయించుటచే.

45 మఱియు 46 సూత్రములలోని ఆక్షేపణలిప్పుడు ఖండింపఁబడుచున్నవి.

"తు" యనెడి శబ్దము పూర్వపక్షమును త్రోసిపుచ్చు చున్నది. ఇది పూర్వపక్షిని ఖండించుచున్నది.

అగ్నులొక స్వతంత్రమైన విద్యకు సంబంధించినవని ప్రస్తుత సూత్రము నుడువుచున్నది. ఏలననగా "తేహైతే విద్యాచితఏవ" మఱియు "విద్యయా హైవైత ఏవం విదశ్చితాభవంతి" యనియును శ్రుతి నిర్ధరించినది.

## 3-3-48 దర్శనాచ్చ

మఱియు శ్రుతియందు దానికి సంబంధించిన చిహ్నములు చూడఁబడుటచే

దర్శనాత్ = శ్రుతియందు స్పష్టమైన చిహ్నములు చూడఁబడుటచే, చ = మఱియు.

44 వ సూత్రమునందు సూచింపఁబడినవి చిహ్నములని చెప్పఁబడును. అంతరంగిక చిహ్నములు నిజమునకది ఒక విద్యయని నిరూపించునే కాని, కర్మాంగమని కాదు.

## 3-3-49 శ్రుత్యాది బలీయస్త్వాచ్చ నబాధః

శ్రుత్యాదులు బలీయములై యుండుటచే, అగ్నులొక స్వతంత్రమైన విద్యకు సంబంధించునను దృష్టికోణము ఖండింపఁబడఁజాలదు.

శ్రుత్యాది బలీయస్త్వాత్ = శ్రుత్యాదులు బలవత్తరములై యుండుటచే, చ = మఱియు, న = కాదు, బాధః = ఖండనము.

45 మఱియు 46 సూత్రములలోని ఆక్షేపణలింకను ఖండిపఁబడుచున్నవి.

శ్రుత్యాదులు బలీయములై యుండుటచే ప్రకరణమునుఁబట్టి ఈ దృష్టికోణమునకు నిషేధము లేదు.

మన దృష్టికోణముననుసరించి స్వతంత్రములైయున్న అగ్నులు, ప్రకరణము నాధారముగాఁగొని, క్రతులకంగములుగా నిశ్చయించుటకు పూర్వపక్షికి ఆధారము లేదు. ఏలననగా పూర్వమీమాంస ననుసరించి, ప్రకరణముకంటే, శ్రుతి, లింగవాక్యములు మిక్కిలి బలవత్తరములైయున్నవి. మఱియు పై మూడు ప్రమాణములు అగ్నులు స్వతంత్రములనియే నిరూపించుచున్నవి.

కేవలము ప్రకరణము శ్రుతిలింగాదులకంటే మిక్కిలి బలవత్తరమైనది కాదు. విధ్యర్థకమునందే శ్రుతి "ఏవ"యను శబ్దమును ప్రయోగించినది. స్పష్టమైన ఆజ్ఞకూడా ఉండుటచే కేవలోపదేశము స్తుత్యర్థమని చెప్పవచ్చును. ఇట్టి సూచన లేనప్పుడు ఉ పదేశమునే విధిగా అంగీకరింపవలసియుండును. కావున ఇచ్చట స్వతంత్రమైన విద్యయే కలదు, కాని కర్మాంగము కాదు.

శ్రుతి "తేహైతే విద్య చిత ఏవ" అని పలికినది. లింగమిట్లు నుడువును. "సర్వదా సర్వాణి భూతాని చిన్వంత్యపి స్వపతే". ఈ యగ్ని అఖండమై యుండుటచే అవి మానసికములని తెలియుచున్నది. నిజమైన క్రతువు నిద్రించునప్పుదు జరుగదు.

వాక్యమిట్లు పలుకును. "విద్యయాహైవైత ఏవం విదశ్చితాభవంతి". ప్రకరణముకంటె ఈ మూడున్నూ మిక్కిలి బలవత్తరములైయున్నవి.

## 3-3-50 అనుబంధాదిభ్యః ప్రజ్ఞాంతర పృథక్త్వవద్ దృష్టశ్చ తదుక్తమ్

సంబంధాదులచే మానసికాగ్నులు స్వతంత్ర్యమైన విద్యగా రూపొందును. అదే విధముగా శాండిల్యాది ఇతర విద్యలు కూడా విభిన్నములై యున్నవి. మఱియు, ప్రకరణ ప్రమాణమున్నను క్రతువు స్వతంత్రమైనదిగా చెప్పఁబడుచున్నది. ఇది జైమినిచే పూర్వమీమాంస సూత్రములలో వివరింపఁబడి యున్నది.

అనుబంధాదిభ్యః = సంబంధాదులచే, ప్రజ్ఞాంతర పృథక్త్వవత్ = ఇతర విద్యలు విభిన్నములైయున్నట్లు, దృష్టః = చూడఁబడినది, చ = మఱియు, తత్ = అది, ఉక్తమ్ = జైమినిచే పూర్వమీమాంసయందు చెప్పఁబడినది.

45 మఱియు 46 సూత్రముల ఖండనకు సంబంధించిన వాదము కొనసాగుచున్నది.

47వ సూత్రములోని దృష్టికోణమును బలపఱచుటకై ఈ సూత్రము మరికొన్ని కారణముల నొసంగుచున్నది.

ప్రకరణమునుఁబట్టి మనశ్చిదాదులకు స్వాతంత్ర్యము చెప్పఁబడినది. ఏల ననగా క్రియావయవములను మనస్సు ఇత్యాది వ్యాపారములయందు బంధించును. సంపదుపాసన నిమిత్తమై శ్రుతి క్రతువిభాగములను మానసిక క్రియలతో సంబంధపఱచును. "తేమనసైవాధీయంత మనసాచీయంత మనసైవగ్రహా అగృహ్యంత మనసాఽ స్తువన్మనసాఽ శంసన్యత్కించ యజ్ఞేకర్మ క్రియతే యత్కించ యజ్ఞియం కర్మ మనసైవతేషు తన్మనో మయేషు మనశ్చిత్సు మనోమయమేవ క్రియతే" ఒక దానికొకటి పోలియున్నను స్వల్పభేదమున్నప్పుడే ఇది సాధ్యమగును.

ఇట్టి మానసికోపాసనయందు కర్మాంగమునకుఁగల ప్రాముఖ్యతనుఁగూర్చి శ్రుతి సూచించును. కావున కర్మాంగమునకు విభిన్నమైన స్వతంత్రమైన విద్యను సూచించునట్టి ప్రకరణ ప్రమాణమునకు సైతము అతిదేశము వర్తించును.

క్రతుక్రియలతో పాటు సూచింపఁబడినను శాండిల్యవిద్య, దహరవిద్యలకు వలెనే అగ్నులున్నూ స్వతంత్రమైన విద్యగా పరిగణింపఁబడును.

రాజసూయ యజ్ఞమునందొక స్వతంత్ర కార్యమైన అవేష్టి ఒనర్పఁబడుట చూడఁబడుచున్నది. రాజసూయయజ్ఞముతో పాటు అవేష్టి యజ్ఞము పేర్కొనఁ బడినను, పూర్వమీమాంసయందు జైమినిచే ఇది స్వతంత్రమైన యజ్ఞముగా తలంపఁబడినట్లు వైదికయజ్ఞ విభాగమునందు కానఁబడుచున్నది.

## 3-3-51 న సామాన్యా దప్యుపలబ్ధేర్మృత్యువ న్నహిలోకాపత్తిః

అగ్నులు మానసిక పానీయమువలె తోచినను, అవి క్రతుకార్యములకు అంగములు కాఁజాలవు. ఏలననగా మృత్యువు వలె శ్రుత్యాది కారణములనుఁ

బట్టి అది స్వతంత్రమైన విద్యగా చూడఁబడుచున్నది. కారణమేమనగా కొన్ని అంశములలో అగ్నిని పోలియున్నను ప్రపంచము అగ్ని కాఁజాలదు.

న = కాదు, సామాన్యాదపి = క్రతువుయొక్క అగ్నిని పోలియున్నను, ఉపలబ్ధేః = చూడఁబడుటచే, మృత్యువత్ = మృత్యువు వలె, నహిలోకాపత్తిః = కొన్ని అంశములలో పోలియున్నను ప్రపంచము అగ్నికాకుండుటచే.

45 మఱియు 46 సూత్రములయొక్క ఖండనకు సంబంధించిన వాదము కొనసాగుచున్నది.

మానసిక క్రియయగుటచే తాదాత్మ్యత యొక్క అంశమున్నను, అది కర్మాంగము కాదు. ఏలయనగా దానికి ప్రత్యేక ఫలమున్నదని చెప్పఁబడినది. మృత్యువు మఱియు లోకమును అగ్నిగా వర్ణించుటవంటి ఉపమానములచే ఇది స్పష్టమగుచున్నది.

పూర్వపక్షి పేర్కొనినట్టి పోలిక నిర్బలమైయున్నది. శ్రుతి, లింగాదులయం దొసంగఁబడిన కారణములచే ఇది నిశ్చయముగా నిలువనేరదు. అగ్నులు కేవలము మానవుని కుపయుక్తమగునే కాని, క్రతు క్రియానిమిత్తమై ఉపకరింపవు.

కేవలము పోలికయున్నంతమాత్రముచే భిన్నమైన దృష్టికోణమునకు తావులేదు. ఏదోయొక అంశమునందొక పదార్థము మరియొక పదార్థమును పోలియుండ వచ్చును. ఐనను ఇతర పదార్థమునుండి వేఱుచేయు ప్రత్యేకత ప్రతిపదార్థము నందుండును.

ఈ విషయము మృత్యువునకు సాదృశ్యతను కలిగియున్నది. ఈ పోలిక సామాన్యమైన మృత్యువిశేషణమును అగ్ని మఱియు ఆదిత్య పురుషుని కారోపించినట్లున్నది. "సవాఏష ఏవ మృత్యుర్య ఏష ఏతస్మిన్మండలే పురుషః" మఱియు "అగ్నిర్వైమృత్యుః" (బృ.ఉ. 3-2-10). ఈ పోలికచే అగ్ని మఱియు ఆదిత్య పురుషుడు ఏకము కాజాలవు.

"అసావావలోకో గౌతమాగ్ని స్తస్యాదిత్య ఏవసమిత్" (ఛాం.ఉ. 5-4-1) అను మరియొక వాక్యము కలదు. ఇచ్చట ఆదిత్యుడు నిజముగా ఇంధనము కాఁజాలడు. మఱియు లోకము నిజముగా అగ్నిఁజాలదు.

మన విషయముకూడా ఇట్టిదేనై యున్నది. కర్మాంగమైన మానసిక గ్రహము వలె మనశ్చితాగ్నియు మానసిక క్రియయైయున్నను, కేవలము పోలిక నాధారముగాఁ గొని ఇదికూడా కర్మాంగమని నీవు నుడువుటకు వీలులేదు.

## 3-3-52 పరేణచ శబ్దస్య తాద్విధ్యం భూయస్త్వా త్త్వనుబంధః

మఱియు అనంతర బ్రాహ్మణముచే స్వతంత్రమైన విద్యయే విధింపఁ బడినట్లు తెలియుచున్నది. కాని నిజమైన అగ్నితో చిత్రవిచిత్రములైన మానసికాగ్నుల సంబంధము, అగ్నియొక్క అనేక లక్షణములనుఁబట్టి ఈ యగ్నులలో ఆరోపింపఁబడినది.

పరేణ = అనంతర బ్రాహ్మణముచే, చ = మరియు, శబ్దస్య = శ్రుతి యొక్క , తాద్విధ్యమ్ = ఇట్టి విషయము, భూయస్త్వాత్ = అనేకములై యుండుటచే, తు = కాని, అనుబంధః = సంబంధము.

అనంతర బ్రాహ్మణమునందిట్లు కలదు. "విద్యయాతదారోహంతి యత్ర కామాః పరాగతాః న తత్ర దక్షిణాయంతినా విద్వాంసస్తపస్వినః" ఈ శ్లోకమునందు కర్మ నిందింపబడి, విద్య లేక జ్ఞానము స్తుతింపబడినది. పూర్వ బ్రాహ్మణము నందుకూడా "యదే తన్మండలం తపతి" యని ప్రారంభింపబడి "సోమృతో భవతి మృత్యుర్హ్యస్యాత్మాభవతి" యని విద్యాఫలముతో అంతమొందింపబడినది. దీనిచే కర్మ ప్రధానముకాదని నిరూపింపఁబడినది. కావున అగ్నులు స్వతంత్రమైన విద్యకు సంబంధించినవనుటయే శ్రుతి సిద్ధాంతమై యున్నదని మా నిశ్చయము.

అగ్నులు క్రతువున కంగములగుటచే నిజమైన అగ్నితో వాటి సంబంధము ఏర్పడలేదు. కాని నిజమైన అగ్నియొక్క అనేక లక్షణములు విద్యయొక్క అగ్నులలో, మానసికాగ్నులలో ఊహింపబడుచున్నవి. మానసికాగ్నులు సామాన్యమైన క్రతువు యొక్క అగ్నితో మేళవింపబడుటకు కారణము, రెండవదానియందు సామాన్యమగు అనేకాంశములుండుటయేనై యున్నది.

వీటన్నింటిచే మనశ్చిదాదులు స్వతంత్రమైన విద్యను రూపొందించునని మనము నిర్ణయింపవచ్చును.

# ౩౦. ఐకాత్మ్యాధికరణము

## (53-54 సూత్రములు)

### 3-3-53 ఏక ఆత్మనః శరీరే భావాత్

కేవలము శరీరము నందు తప్ప మరియొక ఆత్మ వేఱుగా లేదని కొందరు తలంతురు.

ఏకే = కొందఱు, ఆత్మనః = మరియొక ఆత్మ, శరీరే = శరీరమునందు భావాత్ = ఉనికిని కలిగియుండుటచే.

ఈ యధికరణమునందు శరీరముకంటె భిన్నమైన ఆత్మయొక్క ఉనికినిఁ గూర్చి చర్చింపఁబడుచున్నది. శరీరమునకు భిన్నముగా ఆత్మ లేకున్నచో శాస్త్రము మోక్షమునుఁగూర్చి ప్రబోధించుట నిష్ప్రయోజనము; లేక జీవబ్రహ్మైక్య ప్రబోధమునకుఁగాని, స్వర్గప్రాప్తికిఁగాని నైతిక శిక్షణ ఒసంగుటయు నిష్ప్రయోజనమగును.

ఉపాసనాఫలముల ననుభవించుటకై శరీరమునకు భిన్నమైన ఆత్మ ఉండి యుండవలయును. లేనిచో ఉపాసనవలన కలుగు ప్రయోజనమేమి? ఆత్మ లేకున్నచో ఉపాసనలన్నియు నిష్ప్రయోజనమగును.

ఆత్మయొక్క బంధమోక్షములను నిరూపించుటకై ప్రస్తుతము శరీరమునకు భిన్నమైన ఆత్మయొక్క ఉనికినిఁగూర్చి మేము ఋజువొనర్తుము. ఒకవేళ శరీరమునకు భిన్నమైన ఆత్మలేకున్నచో, ఇతర లోకములలో కర్మఫలముల ననుభవించుట కవకాశము లేకుండెడిది. లేక ఆత్మయే బ్రహ్మమనెడి ఉపదేశమునకు తావు లేకుండెడిది.

శరీరమునకు భిన్నమైన ఆత్మయొక్క ఉనికిని నిషేధించునట్టి చార్వాకులు లేక లోకాయతికుల దృష్టికోణమును ఈ సూత్రము కలిగియున్నది. చైతన్యము కేవలము భౌతికమైనదియు, శరీరమే ఆత్మయనియును వారు పలుకుదురు. శరీరమున్నప్పుడే చైతన్యమున్నట్లు తోచుననియు మఱియు శరీరము వినా అది అనుభవ గోచరము కాదనియు వారు స్పష్టీకరింతురు. కావున చైతన్యము కేవలము శరీరము కొౕక లక్షణమై యున్నది. ఈ శరీరమునకు భిన్నమైన ఆత్మలేదు.

మానవుడు కేవలము శరీరమాత్రుడని వారు పలుకుదురు. చైతన్యము శరీమునకు లక్షణమ్మైయున్నది. చైతన్యము కొన్ని పదార్థములను కొన్ని పరిమాణములలో కలిపినప్పుడు ఏర్పడు ఒక మాదకద్రవ్యము వంటిది. ఒకే పదార్థమునందు మాదక వికారముండదు.

పృథ్వ్యాది భూతములు ఏకముగానున్నను మిశ్రమముగానున్నను వాటి యందు చైతన్యము గోచరింపదు. కాని అవి శరీరముగా రూపొందినప్పుడు అది గోచరించును. చైతన్యము వాటినుండి ఉప్పతిల్లును. శరీర మరణానంతరము ఆత్మకానఁబడదు. మఱియు ఈ రెండున్నూ ఏకముఖముగా ఉనికి లేములను కలిగియుండుటచే, అగ్నికి వెలుతురు మఱియు వేడివలె చైతన్యము శరీరమునకు లక్షణమై యున్నది.

జీవితము, చలనము, చైతన్యము, జ్ఞాపకశక్తి ఇత్యాదులు శరీరమునకు భిన్నముగా ఆత్మ యున్నదని తలంచువారు ఆత్మకు లక్షణములుగా శరీరమునందేఁ గాంతురు. కాని శరీరమునకు బాహ్యమునందు కాదు. మఱియు ఈ లక్షణములకు స్థానము శరీరమునకు బాహ్యమునందున్నదనుట నిరూపింపఁ బడదు. కావున అవి కేవలము శరీరమునకు లక్షణములని తెలియుచున్నది. ఈ కారణముచే ఆత్మ శరీరమునకు భిన్నమైలేదు.

చార్వాకులు లేక లోకాయతికుల ఈ నిర్ణయమునకు తర్వాతి సూత్రము సమాధానము నొసంగును.

## 3-3-54 వ్యతిరేకస్తద్భావాభావిత్వాన్న తూపలబ్ధివత్

కాని అట్లుకాదు. శరీరమునకు భిన్నమైన ఆత్మకు ఉనికి యున్నది. ఏలననగా మరణానంతరము శరీరమునకునికి యున్నను, ప్రత్యక్ష దర్శనమువలె దానికి చైతన్యముండదు.

వ్యతిరేకః = భిన్నము, తాద్భావాభావిత్వాత్ = శరీరమున్నను చైతన్యమున కునికి లేకుండుటచే, న = అట్లుకాదు, తు = కాని, ఉపలబ్ధివత్ = జ్ఞానమునకువలె.

పూర్వసూత్రములోని వివరణము ఖండింపఁబడుచున్నది.

శరీరమున కునికియున్నను, ఆత్మ వెళ్ళిపోవుటచే ఆత్మ విభిన్నమై ఉన్నది. కర్త మఱియు కర్మలవలె అవి విభిన్నములై యున్నవి.

పూర్వసూత్రములోని పూర్వపక్షియొక్క దృష్టికోణము నిశ్చయముగా దోష పూరితమైయున్నది. ఏలననగా శరీరమున కునికియున్నను, మృత్యువనంతరము చైతన్యాదులు కానఁబడుటలేదు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత అతని శరీరమునందు చైతన్యము కానరాకుండుటచే, చైతన్యము శరీరమునకు లక్షణము కాఁజాలదు.

ఈ చైతన్యము శరీరమునందుండి, శరీరమునకు భిన్నమైయున్న ఒకానొక పదార్థమునకు విశేషణమైయున్నది.

కర్త మఱియు కర్మ తాదాత్మ్యము నొందుట అసాధ్యము. అగ్ని తన్ను తాను కాల్చుకొనజాలదు. దొమ్మరవాడు తన భుజములపై తాను నిలబడఁజాలడు. ఒక విగ్రహము మరియొక విగ్రహమును చూడఁగలుగునా? ఒక శబ్దము మరియొక శబ్దమును వినఁగలుగునా? లేదు. చైతన్యమెల్లప్పుడును శాశ్వతమైన గుణమును కలిగియున్నది. రూపములనుఁ గాంచుటకు వెలుతురు ఆవశ్యకమై యుండుటచే, చైతన్యము వెలుతురు యొక్క విశేషణమని నీవు చెప్పఁగలవా? అదే విధముగా చైతన్యము శరీరమునకు విశేషణము కాదు. ఇంతేకాకుండా శరీర సహాయము లేకుండానే చైతన్యము స్వప్నములో పనిచేయుచుండును.

ద్రష్టదృశ్యమునకు వేఱైయున్నదను విషయమును చార్వాకు లంగీకరింతురు. కావున ఈ శరీరమునుఁగాంచుచు, ఈ శరీరము ననుభవించువాడు శరీరమునకు భిన్నుడై యుండవలసియుండును. ఈ శరీరమునుఁ గాంచునట్టివాడే ఆత్మ.

కావున చైతన్యము ఆత్మయొక్క విశేషణమై యున్నది. కాదు, కాదు. ఆత్మ యొక్క సారస్వరూపమైయున్నది.

చైతన్యము ఆత్మయొక్క లక్షణమైయుండుటచే, ఆత్మ శరీరమునకు భిన్నమై యుండును. చైతన్యము శాశ్వతమైనదని దాని నైజస్వభావముచే మనకు తెలియు చున్నది. కావున చైతన్యాత్మ కూడా శాశ్వతమై యున్నదని మనము నిర్ణయింప వచ్చును. ఆత్మ విభిన్నమైన అవస్థలయందున్నను "నేను దీనిని చూచితి న" ని జ్ఞప్తియందుంచుకొనుటచే, ఆత్మస్వరూపమగు చైతన్యము శాశ్వతమైయున్నదని రూఢియగుచున్నది.

కావున ఆత్మ శరీరమునకు భిన్నమైయున్నదనెడి దృష్టికోణమునకేలాటి ఆక్షేపణయు లేదు.

# 31. అంగావబద్ధాధికరణము

## (55-56 సూత్రములు)

### 3-3-55 అంగావబద్ధాస్తు న శాఖాసు హి ప్రతివేదమ్

కాని క్రతువిభాగములకు సంబంధించిన ఉపాసనలు ప్రత్యేక వైదికశాఖలకు మాత్రము స్థగితమొనర్పఁబడలేదు. అవి అన్ని శాఖలకు సంబంధించియున్నవి. ఏలననగా ఒకే ఉపాసన అన్నింటి యందు వర్ణింపబడియున్నది.

అంగావబద్ధాః = క్రతువిభాగములకు సంబంధించిన ఉపాసనలు, తు = కాని, న = కాదు, శాఖాను = ప్రత్యేక శాఖలలో, హి = ఏలననగా, ప్రతివేదమ్ = వేదము ననుసరించి.

అంగావబద్ధోపాసన (కర్మాంగోపాసన) ప్రతి శ్రుతిశాఖకు విభిన్నమై యుండ వలయుననియు మఱియు దానికే స్థగితమై యుండవలయుననియు నియమము లేదు.

పైన పేర్కొనఁబడిన తాత్కాలికచర్చ పూర్తియైనది. ఇప్పుడు ప్రధానమైన విషయము ననుకరింతము. ఉద్గీథాదులలో నానావిధములగు కర్మాంగోపాసనలు ప్రబోధింపఁబడినవి. ప్రకరణ సాన్నిధ్యముచేతను మఱియు స్వరభేదమునుఁబట్టియు ప్రతి ఉపాసన ప్రతి శ్రుతిశాఖలో విభిన్నమైయున్నదని నీవు చెప్పఁజాలవు. ఇట్టి ఉపాసనల నన్నింటిని ఏకీకృతమొనర్పవచ్చును. ఏలననగా ప్రకరణ సన్నిహితత్వము లేక స్వరభేదముకంటె ఉద్గీథశ్రుతి మిక్కిలి శక్తివంతమైయున్నది.

క్రతుసంబంధములగు కొన్ని ఉపాసనలు సూచింపఁబడినవి. ఉదాహర ణార్థము ప్రాణమే ఉద్గీథముగాఁగల ఓంకారోపాసన మఱియు పృథ్వియే ఉద్గీథముగా భావించు ఉపాసన ఇత్యాదులను పేర్కొనవచ్చును. “ఓమిత్యేతదక్షర ముద్గీథ ముపాసీత” (ఛాం.ఉ. 1-1-1).

“లోకేషు పంచవిధం సామోపాసీత” (ఛాం.ఉ. 2-2-1).

ఉద్గీథాదులకు సంబంధించిన ఉపాసనలు ఒక ప్రత్యేకశాఖకు సంబంధించి నవా? లేక సమస్త శాఖలకు సంబంధించినవా? యను సంశయమిచ్చట కలుగును.

ఉద్గీథాదులు వివిధ శాఖలలో వివిధములుగా ఉచ్చరింపఁబడుటచేతను మఱియు స్వరభేదముండుటచేతను ఈ సంశయ మేర్పడును. కావున అవి విభిన్నములుగా తలంపఁబడవలయును.

ఉపాసనకు సంబంధించిన ప్రత్యేక శాఖనుఁబట్టి నిర్ణయింపఁబడిన ఉద్గీథాదుల ననుసరించి ఉపాసనలు విధించబడినవని పూర్వపక్షి నుడువును. ఏల? సన్నిహితత్వమునుఁబట్టి.

ప్రస్తుత సూత్రమీ దృష్టి కోణమును ఖండించి, అవి స్థగిత మొనర్పఁబడలేదని పలుకును. ఏలననగా శ్రుతి ఈ యుపాసనలనుఁగూర్చి సర్వసామాన్యముగా పలుకుటచే, అవి సమస్త శాఖలలో ఏకమేనై యున్నవి.

"తు" యను శబ్దము పూర్వపక్షియొక్క బాహ్యదృష్టిని ఖండించును. ఉపాసనలు వేదములకు సంబంధించిన తమ శాఖలకు మాత్రము స్థగిత మొనర్పఁబడలేదు. కాని అవి అన్ని శాఖలకు సంబంధించును. ఏలననగా

ఉద్గీథమునకు సంబంధించిన ప్రకరణమునందు ప్రత్యేకత తెలుపఁబడలేదు. సన్నిధానము కంటె శ్రుతియే బలవత్తరమై యున్నది.

ఉపాసన సర్వసామాన్యమైయుండకుండుట కేమియు కారణములేదు. కావున శాఖలు స్వరభేదమునుఁబట్టి విభిన్నములై యున్నను, ఉపాసనలు సమస్త శాఖలకు సంబంధించినట్టి ఉద్గీథాదులను సూచించునని మేము నిర్ణయింతుము. ఏలననగా శ్రుతులు సామాన్యముగా కేవలము ఉద్గీథాదులనుఁగూర్చి ప్రబోధించును.

## 3-3-56 మంత్రాదివద్వా విరోధః

లేనియెడల మంత్రాదులవలె ఇచ్చట విరోధములేదు.

మంత్రాదివత్ = మంత్రాదులవలె, వా = లేనియెడల, అవిరోధః = విరోధములేదు.

33వ సూత్రమునం దారంభింపఁబడిన చర్చ కొనసాగుచున్నది.

ఒకేశాఖయందు పేర్కొనఁబడినట్టి మంత్రాదులు ఇతర శాఖయందున్నూ ప్రత్యేక కార్యమునందెట్లు ప్రయోగింపఁబడునో, అట్లే ఒక వైదికశాఖలో ప్రత్యేక క్రియలకు సంబంధించిన ఉపాసనలున్నూ ఇతర శాఖలకు వర్తించును.

ఉదాహరణముగా “కుటరురసి” (నీవు విసుర్రాయివి) అను పిండి విసరుటకు ప్రయోగింపఁబడు ఒక వైదిక శాఖలోని మంత్రము ఆ కార్యమునందు ప్రతి స్థలమునందెట్లు ప్రయోగింపఁబడునో, అట్లే ఒక వైదికశాఖయందు పేర్కొఁనబడిన ఉపాసన ఇతర శాఖలలో ప్రయోగింపఁబడుట అక్రమముగా తలంపరాదు.

ప్రత్యేక ఉపాసనల కాశ్రయమైయున్న క్రతుకార్యములలోని సభ్యులు ప్రతిచోట ఉపయుక్తములగునట్లు ఒక శాఖలోని మంత్ర, గుణ, కర్మలు మరియొక శాఖలోనికి స్వీకరింపఁబడుటచే సభ్యుల నాశ్రయించియున్న ఉపాసనలు కూడా స్వయముగా సమస్త శాఖలకు మఱియు సమస్త వేదములకు వర్తించును.

# 32. భూమజ్జ్యాయస్త్వాధికరణము

## 3-3-57 భూమ్నః క్రతువజ్జ్యాయస్త్వం తథాహి దర్శయతి

యజ్ఞమునందువలె ఉపాసనయందు వైశ్వానరుని పూర్ణరూపమునకు ప్రాముఖ్యత ఒసంగఁబడినది. ఏలననగా శ్రుతి ఇట్లు నుడువుచున్నది.

భూమ్నః = పూర్ణ రూపమునకు, క్రతువత్ = యజ్ఞమునందువలె, జ్యాయస్త్వమ్ = ప్రాముఖ్యత, తథా = అట్లు, హి = ఏలననగా, దర్శయతి = శ్రుతి నుడువుచున్నది.

ఇచ్చట వైశ్వానరవిద్య చర్చింపఁబడుచున్నది.

ఛాందోగ్యము (5-2-8) నందు పరమాత్ముని విశ్వరూపోపాసనయగు వైశ్వానర విద్యనుఁగూర్చి చెప్పఁబడినది. ఉపాసకుడు స్వర్గమును తన తలగాను, సూర్యుని తన నేత్రముగాను ఇట్లే నానావిధములుగా తలంపవలసియుండును. ఉపాసనయొక్క ప్రతి విభాగమునకు వివిధములుగా ఫలములు సూచింపఁబడినవి. ఉదాహరణకు స్వర్గమునకు తన తలగా భావించి చేసిన ఉపాసనా ఫలమిట్లు చెప్పఁబడినది. “అత్స్యన్నం పశ్యసి ప్రియమత్త్యన్నం పశ్యతి ప్రియంభవత్యస్య బ్రహ్మవర్చసంకులే” (ఛాం.ఉ. 5-12-2).

ఇచ్చట శ్రుతి వైశ్వానర విద్యయంతటిని ఏకముఖముగా చెప్పినదా? లేక వైశ్వానరుని ఒక్కొక్క విభాగమునుఁగూర్చిన ఉపాసననుఁగూర్చి చెప్పినదా? యనెడి సంశయము కలుగును.

వైశ్వానరుని పూర్ణ రూపమునుఁగూర్చిన ఒకే ఉపాసన శ్రుతియందు చెప్పఁబడినదని ప్రస్తుత సూత్రము నుడువును.

క్రతువునందువలె పూర్తి వైశ్వానరోపాసనకు శ్రుతి ప్రాధాన్యము నొసంగును. దర్శపూర్ణమాస క్రతువులలో సమస్తాంగములు ఏకత్రిత మొనర్పఁబడినట్లు, వైశ్వానర విభాగోపాసనకు ఫలము శ్రుతియందు చెప్పఁబడినది. విశ్వమే తన శరీరముగాఁగల పూర్తి వైశ్వానరోపాసనను శ్రుతి బలపఱచుచున్నది.

వైశ్వానర విభాగోపాసనకు ప్రత్యేక ఫలములు చెప్పఁబడినను, ఉపాసన యందు వాటన్నింటిని ఏకత్రిత మొనర్పవలసియుండును.

ప్రాచీనశాలోద్దాలకాదిషడ్రుషులు వైశ్వానర విద్యయొక్క తత్త్వమును తెలియఁజాలక అశ్వపతి కైకయ రాజును దరిఁజేరినట్లు శ్రుతి మనకు తెలుపుచున్నది. ప్రతి ఋషియు తన ఉపాస్యము ఆకాశము ఇత్యాదులని తెలుపగా, అది కేవలము వైశ్వానరుని తలయని అశ్వపతిరాజు సమాధాన మొసంగెను. “మూర్ధాత్వేష ఆత్మనః” (ఛాం.ఉ. 5-12-2) అని పలికి వైశ్వానర విభాగోపాసనను ఖండించుచు అశ్వపతి ఇట్లనెను. “మూర్ధాతేవ్యపతిష్యద్యన్మాంనాగమిష్యః” (ఛాం.ఉ.5-12-2). ఈ శ్రు తి వైశ్వానర విభాగోపాసనను నిరాకరించుటచే, ఇది పూర్తి వైశ్వానరోపాసనను బలపఱచుచున్నదనుట సుస్పష్టము.

ఇంతేకాక ఈ విభాగమెట్లు ప్రారంభింపఁబడినది. “కోను ఆత్మాకిం బ్రహ్మేతి” (ఛాం.ఉ.5-11-1). దీనిచే పూర్ణ బ్రహ్మమే ఉపాస్యమని సూచింపఁబడుచున్నది. మఱియు అది “వైశ్వానరస్య మూర్ద్ధె వసుతేజాః” (ఛాం.ఉ. 5-18-2) అను వాక్యముతో అంతమగును. దీనిచే కేవలము పూర్ణోపాసనయే అనుకరణీయమని సూచింపఁబడుచున్నది.

ఈ కారణములన్నింటిచే పూర్ణవైశ్వానరోపాసనను విధించునట్టి శ్రుతియొక్క దృష్టికోణమే నిర్దోషమై యున్నదను విషయము నిర్ధారితమగుచున్నది.

# 33. శబ్దాది భేదాధికరణము

## 3-3-58 నానా శబ్దాది భేదాత్

శబ్దాది భేదకారణముచే విద్యలు విభిన్నములై యున్నవి.

నానా = వివిధములు, శబ్దాదిభేదాత్ = శబ్దాది నామ విభేదమునుబట్టి.

ఉపాసనా విభాగములకు సుతేజసాది ప్రత్యేక ఫలము లొసంగcబడినను, పూర్ణవైశ్వానరోపాసనకు శ్రుతి ప్రాధాన్యము నొసంగినదని పూర్వసూత్రమునందు నిశ్చయింపcబడినది.

పూర్వపక్షి పై విషయము నాధారముగాcగొని శాండిల్యవిద్య, దహరవిద్య, సత్యవిద్య మున్నగు వివిధోపాసనల నన్నింటిని సర్వసామాన్యమైన ఒకే ఉపాసనగా ఏకత్రిత మొనర్పవలయునని పలుకును. ఏలననగా ఉపాస్యము ఒకే పరమాత్మయై యున్నాడు.

ఉపాస్యము ఒకే దేవుడై యున్నను. శబ్దాది భేదమునుcబట్టి విద్యలు వేర్వేఱై యున్నవని ప్రస్తుత సూత్రము పై విషయమును ఖండించి నుడువుచున్నది. ఏలననగా శ్రుతియందు. "వేద", "ఉపాసీత", "సక్రతుం కుర్వీత" (ఛాం.ఉ.3-14-1) అనెడి శబ్ద విభేదములున్నవి. పూర్వమీమాంసా సూత్రములు (2-2-1) ననుసరించి ఈ శబ్ద విభేదముచే క్రియావిభేదము సూచితమగుచున్నది.

"ఆది" యను శబ్దముచే గుణ విభేదాది ఇతర కారణములు సూచింప బడుచున్నవి.

పరమాత్ముడే కేవలోపాస్య పదార్థమైయున్నను, తన్ముఖ్యార్థము ననుసరించి ఒక్కొక్క పరిచ్ఛేదము దేవుని ఒక్కొక్క గుణమునుcగూర్చి ప్రబోధించును. ఇతర పరిచ్ఛేదములలో ఉపాస్యవస్తువు ఒకేయొక ప్రాణమైయున్నను. ఒకచోట ఒక గుణమును, మరియొకచోట మరియొక గుణమునుc గూర్చి ఉపాసింపవలయునని చెప్పcబడినది. సంబంధ విభేదమునుcబట్టి విధి విభేదము కూడా ఏర్పడును. మఱియు ఈ విధి విభేదమునుc బట్టి విద్యా విభేదమును మనము ఊహింప వలసియుండును.

ఉపాస్యవస్తువు ఒకే దేవుడై యున్నను, నానా విధోపనిషత్తులలో ఊహింపఁబడిన అతని గుణ విభేదమునుఁబట్టి అతడు విభిన్నుడుగా తలంపఁబడును. ఇంతే కాకుండా నానావిధ విద్యలన్నింటిని ఒకే విద్యగా ఏకత్రిత మొనర్చుటకు సాధ్యము కాదు.

కావున వివిధ విద్యలను వేర్వేఱుగా నుంచవలయును. మఱియు ఒకే సర్వసామాన్యమగు ఉపాసనగా ఏకత్రిత మొనర్పరాదు.

విద్య యనునది ఏకమేయైనను, ఉపాసీత మున్నగు శబ్దములచే వర్ణింపఁబడిన ఉపాసనలు విభిన్నములై యున్నవి. ప్రతి ఉపాసనయందు దేవుని ప్రత్యేక గుణములు, ప్రత్యేక ఫలితములు పేర్కొనబడినవి.

శాండిల్యవిద్య, సత్యవిద్య, దహరవిద్య, వైశ్వానరవిద్య వంటి ఉపాసనా రూపములు వాటి నామములు, విధానములు, సూచికా శబ్దములు, గుణములనుఁబట్టి వేర్వేఱుగా నుండును. ఐనను ప్రతియొక్కటియు ఒకే దేవుని యొక్క ఉపాసననుఁగూర్చి ప్రబోధించును. కాని ఒక ప్రత్యేకాంశమునందు నానా విధములగు ఉపాసకుల అభిరుచి ననుసరించి వాటికి నానావిధములగు నామ రూపములు విధింపఁబడినది.

కావున ఈ సూత్రము విద్యలయొక్క విభిన్నతనుఁగూర్చి స్పష్టముగా నొక్కి చెప్పుచున్నది.

# 34. వికల్పాధికరణము

## 3-3-59 వికల్పోఽ విశిష్ట ఫలత్వాత్

విద్యలన్నింటికి ఫలము ఏకమేయగుటచే, వివిధములగు విద్యలకు వికల్ప మున్నది.

వికల్పః = ఇచ్ఛ, అవిశిష్టఫలత్వాత్ = విద్యలన్నియు ఒకే ఫలమును కలిగియుండుటచే.

శాండిల్య విద్య, భూమ విద్య, సద్విద్య, దహరవిద్య, ఉపకోసల విద్య, వైశ్వానరవిద్య, ఉద్గీథవిద్య, ఆనందమయవిద్య, మఱియు అక్షరవిద్యలనునవి మిక్కిలి ముఖ్యమైన విద్యలు.

మానవుడు తన ఇచ్ఛానుసారముగా ఏదోయొక విద్య ననుష్ఠించి, తన జీవితలక్ష్యము నొందవచ్చును. ఏలననగా ఈ విద్యలన్నియును ఆత్మసాక్షాత్కారము లేక బ్రహ్మసాక్షాత్కారమనెడి ఏకైక లక్ష్యమును కలిగియున్నవి. ఒకవేళ మనము అనేక విద్యల ననుష్ఠించినచో, మనస్సు వ్యాకులమగును. మఱియు ఆధ్యాత్మిక పురోభివృద్ధి క్షీణించును. ఒకే ఉపాసననచే బ్రహ్మసాక్షాత్కారము నొందఁగలిగి నప్పుడు. రెండవ ఉపాసన అర్థరహితమగును.

కావున మానవుడు ఒక ప్రత్యేక విద్యను ఎన్నుకొని, ఉపాస్యవస్తువుయొక్క అంతర్జ్ఞానము ద్వారా విద్యాఫలమునుఁ బడయువరకు దాని ననుష్ఠించు చుండవలయును.

# 35. కామ్యాధికరణము

## 3-3-60 కామ్యాస్తు యథాకామం సముచ్చీయేరన్నవాపూర్వహేత్వభావాత్

కాని పూర్వసూత్రమునందు సూచింపఁబడిన కారణము లేనప్పుడు, తన ఇచ్ఛానుసారముగా ప్రత్యేక కోరికలకు సంబంధించిన విద్యలను ఏకత్రిత మొనర్పవచ్చును లేక ఒనర్పకుండవచ్చును.

కామ్యాః = విషయవాంఛలను తీర్చుకొను ఉపాసనలు, తు = కాని, యథా కామమ్ = తన ఇచ్ఛానుసారముగా, సముచ్చీయేరన్ = ఏకత్రిత మొనర్పవచ్చును, న = కాదు, వా = లేక, పూర్వ = మొదటి, హేతు = కారణము, అభావాత్ = లేకుండుటచే.

ఒకవేళ మానవునికి బ్రహ్మసాక్షాత్కారముకాక మరియొక లక్ష్యముండునేని, అనేక విద్యలను ఏకత్రిత మొనర్పవచ్చునని ఈ సూత్రమునందు పూర్వసూత్రమునకు వినాయింపు చెప్పఁబడినది.

పూర్వ సూత్రమునందు మానవుడు బ్రహ్మవిద్యలలో ఏదోయొక విద్యను చేపట్టవలయుననియు, ఒక కాలమునందు ఒకేవిద్యకంటె ఎక్కువ విద్యల ననుష్ఠింపరాదనియు, ఏలననగా ఆత్మసాక్షాత్కారమునకు ఒకేవిద్య సర్వసమర్థమై

యున్నదనియు మఱియు అనేక విద్యలచే మనస్సునందు కలవర మేర్పడుననియును సూచింపఁబడినది.

ఇకఁ దీనికి విరుద్ధముగా ప్రత్యేక వాంఛలతో కూడిన విద్యలు "సయఏతమేవం వాయుం దిశాం వత్సం వేదన పుత్రరోదం రోదితి" (ఛాం. ఉ. 3-15-2). "సయోనామ బ్రహ్మేత్యుపాస్తే యావన్నామ్నోగతం తత్రాస్యయథాకామచారోభవతి" (ఛాం. ఉ. 7-1-5) అనునవి కలవు.

మానవుడీ విద్యలయం దొకేదానిని అంటిపట్టుకొని యుండవలయునా? లేక ఒక సమయమునం దనేక విద్యల ననుష్ఠింపవచ్చునా? యనెడి ప్రశ్న ఇచ్చట ఉదయించును.

మనుజుడు తన ఇచ్ఛానుసారముగా అనేక విద్యలనుఁగాని, ఒకే విద్యనుఁ గాని అనుష్ఠింపవచ్చునని ప్రస్తుత సూత్రము నుడువును, ఏలననగా బ్రహ్మవిద్యలను విడిచి, ఇతర విద్యలకు ఫలములు విభిన్నములై యుండును. మొదటి కారణము లేకున్నచో అతడు ఒకే విద్యనుఁగాని, అనేక విద్యలనుఁగాని అనుష్ఠింపవచ్చును. ఏలననగా పూర్వసూత్రమునందు నుడువఁబడిన వికల్పమున కిచ్చట తావులేదు.

# 36. యథాశ్రయభావాధికరణము

## (61-66 సూత్రములు)

### 3-3-61 అంగేషు యథాశ్రయభావః

క్రతు కర్మాంగములయం దొనర్పఁబడు ఉపాసనలకు యథాశ్రయ భావ ముండును.

అంగేషు = క్రతు కర్మాంగములయం దొనర్పఁబడు ఉపాసనలకు, యథాశ్రయభావః = ఆయా అంగములకు సంబంధించినవిగా ఉండును.

ఈ యధికరణమునందున్న ఆరు సూత్రములలో మొదటి నాలుగు సూత్రములు పూర్వపక్షమునకు సంబంధించియున్నవి. చివరి రెండు సూత్రములు సిద్ధాంత సూత్రములై యున్నవి.

వివిధములగు వేదములలో యజ్ఞమునకు సంబంధించిన నానావిధ

సిద్ధాంతము లొసంగఁబడినవి. ముఖ్యమైన యజ్ఞనిర్వహణకై వివిధ వేదములలోని అంగములను ఏకత్రిత మొనర్పవలయునని శ్రుతులు నుడువుచున్నవి.

ఈ యంగములకు సంబంధించిన ఉపాసనా విషయమునం దే నియమము ననుసరింపవలయునని ప్రస్తుతము ప్రశ్నింపఁబడుచున్నది.

అంగములకు వర్తించు నియమమే వాటికి సంబంధించిన ఉపాసనలకున్నూ వర్తించునని ప్రస్తుత సూత్రము వచించుచున్నది. ఇది స్థానముల ననుసరించి యుండును. యజ్ఞ నిర్వహణకై ఉపాసనాస్థానములగు స్తోత్రాదులు సంయోగ మొనర్పఁబడునట్లు, ఉపాసనలు కూడా సంయోగ మొనర్పవలసియుండును. ఏలననగా ఉపాసన అది ఆశ్రయించిన దానికి గుఱియగును. ఈ యుపాసన లన్నియును ఏకత్రిత మొనర్పఁబడవలయును.

కర్మల నాచరించునప్పుడు స్తోత్రాదులనెట్లు ఏకత్రిత మొనర్తుమో, అట్లే కర్మాంగములను (అంగావబద్ధోపాసన) ఉపాసనలుకూడా ఏకత్రిత మొనర్పఁబడ వలయును.

## 3-3-62 శిష్టేశ్చ

శ్రుతి సిద్ధాంతమువలన కూడా.

శిష్టేః = శ్రుతి సిద్ధాంతము వలన, చ = కూడా.

61వ సూత్రములోని ఆక్షేపణ కాధారముగా ఒక తర్కము ఉదాహరింపఁ బడినది. ఉపనిషత్తులు, స్తోత్రములపై ఆధారపడియుండుటయే దానికి కారణమై యున్నది.

యజ్ఞముయొక్క స్తోత్రాద్యంగములు ఉపాసనలపై ఆధారపడియుండుట వేద త్రయమునందు ప్రబోధింపఁబడినట్లే, ఉపాసనలు కూడా వాటిపై ఆధారపడి యుండును. వివిధములగు వేదములలో అంగములు ఛిన్నాభిన్నములై యున్నట్లే, ఉపాసనలు కూడా వాటితో సంబంధమును కలిగియున్నవి. ఈ యుపాసనలలోఁ గల శ్రుతి సిద్ధాంతమునం దేలాటి భేదము లేదు.

కావున క్రతు కార్యాంగములయందును మఱియు వాటి నన్వయించియున్న ఉపాసనల యందున్నూ భేదమేమియును లేదు.

## 3-3-63 సమాహారాత్

పరిశోధన కారణముచే.

సమాహారాత్ = పరిశోధన కారణముచే.

ప్రతిపక్షిచే మరియొక కారణ మొసంగఁబడినది. 61వ సూత్రమును బలపఱచునట్టి మరియొకవాదము ఉదాహరింపఁబడినది.

ఇట్టి సంయోగము కూడా శ్రుతియందు సూచింపఁబడినది. కర్మదోష నివారణకై ఉద్గాత మరియొక వేదమునందు వర్ణింపఁబడినట్టి హోత్ర కర్మ నొనర్చునప్పుడు కూడా ఇట్టి సంయోగము కాననగును.

ఛాందోగ్యమిట్లు నుడివినది :- "అథఖులుయ ఉద్గీథస్సప్రణవోయః ప్రణవస్స ఉద్గీథ ఇతిహోతృషదనాద్ధైవాపి దురుద్గీతమను సమాహరతి" (ఛాం. ఉ. 1-5-5)

సామవేదమును పఠించు ఉద్గాతృదోషములు హోతయొక్క ఋగ్వేదోచ్చారణచే శుద్ధమొనర్పఁబడునని ఇచ్చట చెప్పఁబడినది. దీనిచే వివిధ వేదములలో ఉపాసనములున్నను, అవి పరస్పరము సంబంధమును కలిగియున్నవని సూచిత మగుచున్నది. కావున వాటినన్నింటికి ఆచరింపవలసియుండును.

"హోతృషదనా ద్ధైవాపిదురు ద్గీతమను సమాహరతి" (ఛాం.ఉ. 1-5-5) అను వాక్యము ప్రణవము మఱియు ఉద్గీథముయొక్క సంయోగోపాసనయందలి దోషములు హోతృకార్యముచే తొలగింపఁబడునని సూచించుచున్నది.

ఒక వేదములోని ఉపాసన మరియొక వేదములోని ఉపాసనతో సంబంధమును కలిగియున్నట్లు మఱియు ఒక వేదములోని వస్తువు మఱియొక వేదములోని వస్తువుతో సంబంధమును కలిగియుండునట్లు క్రతుకర్మాంగములకు సంబంధించిన ఉపాసనలు ఏ వేదమునందున్నను అవి ఏకత్రిత మొనర్పఁబడవలయునని పై వాక్యము సూచించుచున్నది.

ఋగ్వేదమునకు సంబంధించిన ఛాందోగ్యములోని ప్రణవము, సామవేదోపాసనయగు ఉద్గీథముతో సంబంధమును కలిగియున్నది. కావున వివిధ వేదములకు సంబంధించిన ఉపాసనలు ఏకత్రిత మొనర్పఁబడవలయును. ఏలననగా సంబంధము ననుసరించి వాటియందును. పదార్థములయందును భేదమేమియును లేదు.

## 3-3-64 గుణసాధారణ్య శ్రుతేశ్చ

మఱియు ఉద్గీథవిద్యకు ఓంకారము ఒక సామాన్యలక్షణమని శ్రుతి నుడువుటచే అది వేదములన్నింటికి సామాన్యమైయున్నది.

గుణసాధారణ్యశ్రుతేః = ఓంకారము వేదములన్నింటికి సామాన్య లక్షణమై యున్నదని శ్రుతి పలుకుటచే, చ = మఱియు.

61వ సూత్రమును బలపఱచునట్టి మరియొక వాదము చెప్పఁబడినది.

ఇంతేకాకుండా ప్రణవము ఉపాసనలన్నింటికి సామాన్యమైయుండుటయేఁ గాక, అది వాటిని సంయోగపఱచును.

ఓంకారము వేదములన్నింటికి సామాన్య సంపత్తియని శ్రుతి నుడువుచున్నది. కావున వేదములలో సూచింపఁబడిన కర్మకాండతో అది విడదీయరాని సంబంధమును కలిగియున్నది. ఇఁక విద్యలు కూడా ఓంకారముపై ఆధారపడి యుండుటచే అవి కర్మకాండ ననుసరించునవై యున్నవి. ఛాందోగ్యమిట్లు నుడువును: "తేనేయంత్రయీవిద్యావర్తతే ఓమిత్యాశ్రావ యత్యోమితిశం సత్యోమిత్యుద్గాయతి" (ఛాం.ఉ. 1-1-9), ఇది వేదములకు మఱియు వాటియందున్న ఉపాసనలకు సామాన్యమైయున్న ఓంకారముఁగూర్చి చెప్పఁబడినది. దీనిచే విద్యలన్నింటికి స్థానమైయున్న ఓంకారము సర్వసామాన్యమగుటచే, దానియందు విశ్రమించు విద్యలు కూడా సర్వసామాన్యములని సూచింపఁబడుచున్నది. కావున ఇవన్నియును పాటింపఁబడవలయును.

## 3-3-65 నవా తత్సహభావాశ్రుతేః

కర్మాంగములకు సంబంధించిన ఉపాసనలను ఏకత్రిత మొనర్పరాదు. ఏలననగా అవి సమానములని శ్రుతి సూచించుట లేదు.

న = కాదు, వా = లేక, తత్సహభావాశ్రుతేః = వాటి సమానత్వమును శ్రుతి సూచంపకుండుటచే.

"సవా" యను శబ్దములు పూర్వపక్షమును నిరాకరించుచున్నవి. ఈ సూత్రము 61 నుండి 64 వరకుఁగల సూత్రములలోని విషయమును ఖండించుచున్నది.

ఈ సూత్రము మఱియు తదనంతర సూత్రము తుది నిర్ణయము నొసంగును.

కర్మాంగోపాసనలను సంయోగపఱచుమని ఆదేశించు ఏలాటి శ్రుతియున్నూ లేదు. ఉపాసనలయొక్క సంయోగము అనివార్యమని ఎట్టి శ్రుతియున్నూ సూచించుట లేదు. కావున అవి విడివిడిగను, లేక ఏకత్రితముగను మన ఇష్టాను సారముగా ఆచరింపఁబడవచ్చును.

ప్రణవముపై లేక ఎట్టి కర్మాంగముపైనను ఆధారపడియుండు విద్యలు క్రతువు ననుసరించి యుండవలయునను నియమము లేదు. అది కర్త యొక్క ఇచ్ఛనను సరించి స్వీకరింపఁబడవచ్చును. లేక త్యజింపఁబడవచ్చును. కాని ఈ భేదము మాత్రముండును. ఒకవేళ విద్యలు క్రతువులతో సంయోగ మొనర్పఁబడినచో, గొప్ప ఫలము చేకూరును.

యజ్ఞ నిర్వహణకై ప్రణవము లేక ఉద్గీథోచ్చారణ ఆవశ్యకమైయున్నదని శ్రుతి సూచించినను, క్రతువుయొక్క విద్యావిభాగము మనస్సున కావశ్యకమైన ఉపాధిగా చెప్పియుండలేదు. భౌతికయజ్ఞ నిర్వహణకై అది అత్యంతావశ్యకము కాదు. ఉపాసనారహితముగా కూడా కేవలము మంత్రోచ్చారణచేతను, ఉద్గీథమును పాడుట చేతను, ఆజ్యాదులను పవిత్రమైన అగ్నియందాహుతి యొనర్చుట చేతను ప్రత్యేక వాంఛలను తీర్చుకొను నిమిత్తమై యజ్ఞము నిర్వహింపఁబడవచ్చును. కాని బ్రహ్మోపాసన కేవలము బ్రహ్మసాక్షాత్కారమునుఁ బడయఁజేయును.

వేదములలో విచ్ఛిన్నములై యున్న క్రతువులను సంయోగపఱచు నియమము, వాటికి సంబంధించియున్న ఉపాసనలకు వర్తించదు. ఒకవేళ క్రతువులకు సంబంధించిన నియమములను సంయోగపఱచకున్నచో, క్రతువు స్వయముగా విఫలమగును. కాని ఉపాసనలు ఆచరింపఁబడకున్నను అట్లు జరుగదు. ఏలననగా ఉపాసనలు కేవలము యజ్ఞఫలమును ఇనుమడింపఁజేయును. (బ్ర. సూ. 3-3-42) ఉపాసనలు యజ్ఞము నుండి విడఁదీయఁబడరానివి కావు.

కావున ఉపాసనలు ఆచరింపఁబడవచ్చును. లేక ఆచరింపఁబడకుండ వచ్చును.

## 3-3-66 దర్శనాచ్చ

మఱియు శ్రుతి ఇట్లు నుడువుటచే.

దర్శనాత్ = శ్రుతి ఇట్లు చెప్పుటచే, చ = మఱియు

65వ సూత్రమున కాధారముగా ఈ సూత్రము చేర్చఁబడినది.

ఇది శ్రుతిచేతకూడా ఊహింపఁబడుచున్నది. ఛాందోగ్యమిట్లు నుడువును. "ఏవం విద్ధవై బ్రహ్మాయజ్ఞం యజమానం సర్వాంశ్చర్త్విజో భిరక్షతి" (ఛాం.ఉ. 4-17-10).

దీనిచే ఉపాసనలన్నియు ఏకత్రిత మొనర్పఁబడుట శ్రుతి సమ్మతము కాదని తెలియుచున్నది. ఏలననగా ఉపాసనల నన్నింటిని ఏకత్రిత మొనర్చినచో, వాటన్నింటిని ఋత్త్విజులందఱు తెలుసుకొనియుందురు. మఱియు ప్రత్యేక జ్ఞానమును కలిగియున్న ఋత్త్విజుడు అందఱిని సంరక్షించునని శ్రుతి ప్రత్యేకముగా తెలిపియుండెడికాదు.

కావున ఉపాసనలు తన ఇచ్ఛానుసారముగా సంయోగ మొనర్పఁబడవచ్చును. లేక ఒనర్పఁబడకుండవచ్చును.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర తృతీయాధ్యాయ**

**తృతీయపాదము**

**సమాప్తము**

# బ్రహ్మసూత్రములు

## 3వ  అధ్యాయము

## 4వ  పాదము

# పీఠిక

పూర్వపాదమునందు బ్రహ్మజ్ఞానమునకు మూలములైన ఉపాసనలు చర్చింపఁబడినవి.

ఈ పాదమునందు సూత్రకారుడు బ్రహ్మజ్ఞానము కర్మకాండకు సంబంధించి నదా? లేక మానవుని లక్ష్యమును సిద్ధింపఁజేయుటకది ఒక స్వతంత్రమైన సాధనమా? యను విషయమును చర్చించును.

సూత్రకారుడైన బాదరాయణుడు ప్రథమ సూత్రమునందు "అథ" ఇత్యాదులను ప్రయోగించుటతో వేదాంత శ్రుతులలో విధింపఁబడునట్టి స్వతంత్రమైన బ్రహ్మ జ్ఞానముచే మానవుడు తన జీవిత లక్ష్యమునొందునని సూచించెను.

మోక్షమునొందుటయే బ్రహ్మజ్ఞానమునకు ఫలమనియు, కర్మకాండ కేవలము చిత్తశుద్ధికి సహాయకమనియు, కర్మచే ప్రత్యక్షమోక్షమునుఁబడయలేమనియు, బ్రహ్మప్రాప్తినిఁ బడయఁగోరువాడు కర్మను త్యజించి కేవల బ్రహ్మోపాసన నొనర్ప వలయుననియు, కాని అట్టి సమయమునందున్నూ శాస్త్రవిహిత ధర్మకార్యముల నాచరింపవలయుననియును బాదరాయణుడు సిద్ధాంతీకరించెను.

# సారసంగ్రహము

**1వ అధికరణము (1-17 సూత్రములు) :-** బ్రహ్మజ్ఞానము క్రత్వర్థము కాదనియు, అది స్వతంత్రమైనదనియును నిరూపించును.

**2వ అధికరణము (18-20 సూత్రములు) :-** సన్న్యాసము శ్రుతి సమ్మతమనియు, పరివ్రాజకస్థితి ధార్మికమనియు, అట్టివారికి కేవలము బ్రహ్మవిద్యయే విధింపఁబడినది. కాని కర్మకాండ కాదని నిశ్చయించును.

**3వ అధికరణము (21-22 సూత్రములు) :-** విద్యా విభాగములై యున్న కొన్ని వాక్యములు కేవలము అర్థవాదములే కాకుండా, అవి స్వయముగా ఉపాసనలై యున్నవను విషయమును నిశ్చయించును.

**4వ అధికరణము (23-24 సూత్రములు) :-** ఉపనిషత్తులలోని కథలు కర్మకాండకు అంగములుగా ఉపయోగింపఁబడరాదు. అవి పారిప్లవములుగా పనికిరావు. మఱియు కర్మకాండకు విభిన్నములున్నూ కావు. వాటియందు ప్రబోధింపఁబడిన విద్య శ్లాఘింపఁబడుటయే వాటికి లక్ష్యమై యున్నది. వాటికి సంబంధించిన ప్రబోధమును అర్థవాదములవలె అవి స్తుతించును.

**5వ అధికరణము (25వ సూత్రము) :-** ఈ కారణములన్నింటిచే సన్న్యాసికి కర్మకాండతో అవసరములేదు. ఏలననగా జ్ఞానముచే ఇది సిద్ధించును. అతనికి కేవలము జ్ఞానము తప్ప కర్మలు అనావశ్యకములు.

**6వ అధికరణము (26-27 సూత్రములు) :-** ఐనప్పటికిని పరోక్ష జ్ఞాన సాధనములగుటచే యజ్ఞములు, ధర్మాచరణము మున్నగు శ్రుతి సమ్మతములగు క్రియల నాచరింపవలసియుండును.

**7వ అధికరణము (28-31 సూత్రములు) :-** ఆహార విషయములోని కొన్ని నియమములు అత్యంతావశ్యక సమయమునందు శ్రుతిచే పరివర్తన మొనర్పఁ

బడినవి. ప్రాణాపాయ సమయమునందు మాత్రమే ఆహారనియమము ఉల్లంఘింపఁబడవచ్చును.

**8వ అధికరణము (32-35 సూత్రములు) :-** మోక్ష ప్రయత్నము నొనర్చని వాడు లేక జ్ఞానవాంఛ లేనివాడు ఆశ్రమధర్మములను నిర్వర్తింపవలసియుండును.

**9వ అధికరణము (36-39 సూత్రములు) :-** రెండు ఆశ్రమములకు మధ్యనుండువారు కూడా జ్ఞానము నార్జించుటకు యోగ్యులే యగుదురు.

**10వ అధికరణము (40 వ సూత్రము) :-** ఆజన్మ బ్రహ్మచర్యము నవలంబింపఁదలంచు సన్న్యాసి తన ప్రతిజ్ఞనుండి వెనుఁదిరుగరాదు. అతడు మరల ఇతరాశ్రమములలో ప్రవేశింపరాదు.

**11వ అధికరణము (41-42 సూత్రములు) :-** ఊర్ధ్వరేతస్కుడు పతనమైనచో ప్రాయశ్చిత్తము నొనర్చుకొనవలయును.

**12వ అధికరణము (43 వ సూత్రము) :-** పతితుడైన ఊర్ధ్వరేతస్కుడు సంఘము నుండి బహిష్కరింపఁబడవలయును.

**13వ అధికరణము (44-46 సూత్రములు) :-** కర్మాంగములకు సంబంధించిన ఉపాసనలు ఋత్విజునికి సంబంధించును. కాని యజమానికి కాదు.

**14వ అధికరణము (47-49 సూత్రములు) :-** (బృ.ఉ. 3-5-1) బాల్యము మఱియు పాండిత్యముతో పాటు మౌనమనెడి మూడవ భూమికను కూడా సూచించును.

**15వ అధికరణము (50 వ సూత్రము) :-** బాల్యదశ అనగా బాలునివలె కామక్రోధాదులు లేని మనస్సుయొక్క అమాయకస్థితి యని గుర్తెఱుంగవలయును.

**16వ అధికరణము (51 వ సూత్రము) :-** ఒకవేళ ఏలాటి ఆటంకము లేకున్నచో, జ్ఞానఫలము ఈ జన్మయందుకూడా పొందఁబడునని సూచించును.

**17వ అధికరణము (52 వ సూత్రము) :-** బ్రహ్మసాక్షాత్కారము లేక మోక్షమునందేలాటి భేదము లేదని నుడువును. అన్ని అంశములయందిది ఏకరీతిగా నుండును.

# 1. పురుషార్థాధికరణము

## (1-17 సూత్రములు)

### 3-4-1 పురుషార్థోఽ తశ్శబ్దాదితి బాదరాయణః

బ్రహ్మవిద్యలేక బ్రహ్మజ్ఞానము ద్వారా మానవుడు పురుషార్థమునుఁ బడయునని శ్రుతులు నుడువుచున్నవి. ఇది బాదరాయణముని యొక్క మతమైయున్నది.

పురుషార్థః = మానవుని జీవితలక్ష్యమైయున్న మోక్షము, అతః = బ్రహ్మవిద్య ద్వారా శబ్దాత్ = శ్రుతులు నుడువుటచే, ఇతి = ఇట్లు, బాదరాయణః = బాద రాయణమునియొక్క మతమైయున్నది.

బ్రహ్మవిద్యాఫలమిచ్చుట నిరూపింపఁబడినది. బ్రహ్మజ్ఞానముచే కర్మ ప్రాప్తించదు. కాని పరమ పురుషార్థమైన మోక్షము ప్రాప్తించునని సూత్రకారుడగు వ్యాసుడిప్పుడు నిరూపించుచున్నాడు. ఇది బాదరాయణుని ప్రబోధము.

పురుషార్థములు నాలుగు: (1) ధర్మము (కర్తవ్యపాలనము). (2) అర్థము (ఐశ్వర్య ప్రాప్తి) (3) కామము (సుఖోపభోగము) 4. మోక్షము (ముక్తి). బ్రహ్మజ్ఞానము కేవలము కర్మకాండకు సంబంధించినదికాదు. అది నిశ్చయముగా జనన మరణముల నుండి విముక్తి నొందుటకు దోహదమొసంగును.

ఇది దేనివలన తెలియఁబడును? శ్రుతివలన.

బాదరాయణుడీ క్రింది శ్రుతివాక్యముల వలన తన తర్కమును కొనసాగించును. "తరతిశోకమాత్మవిత్" (ఛాం.ఉ. 3-4-1). "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ముం. ఉ. 3-2-9). "బ్రహ్మవిదాప్నోతి పరమ్" (తై.ఉ. 2-1).

"ఆచార్య వాన్పురుషో వేదతస్యతావ దేవచిరం యావన్నవిమోక్ష్యేఽ థసం పత్స్యే" (ఛాం.ఉ. 6-14-2) "య ఆత్మా పహతపాప్మా" (ఛాం.ఉ. 8-7-1) మొదలుకొని "సర్వాంశ్చలోకానాప్నోతి సర్వాంశ్చ కామాన్యస్తమాత్మాన మనువిద్య విజానాతి" (ఛాం.ఉ. 8-7-1). "ఆత్మావా అరేద్రష్టవ్యః" (బృ.ఉ. 4-5-6) మొదలుకొని "ఏతావదరే ఖల్వమృతత్వమ్" (బృ.ఉ. 4-5-15).

బ్రహ్మజ్ఞానము పరమపురుషార్థమునుఁ బడయఁజేయునని పై వాక్యములు దృఢపఱచుచున్నవి.

పూర్వపక్షి దీనికి విరుద్ధమైన వాదమును రేకెత్తించుచున్నాడు. ఇచ్చట జైమిని ఈ క్రిందివిధముగా ముందడుగు వేయును.

## 3-4-2 శేషత్వాత్పురుషార్థవాదో యథాన్యేష్వితి జైమినిః

క్రతు కార్యములకు ఆత్మశేషత్వమగుటచే, ఇతర విషయములవలె ఆత్మజ్ఞాన ఫలములు కేవలము యజమాని యొక్క స్తుతియే యగును. ఇది జైమిని యొక్క మతమైయున్నది. శేషత్వాత్ = క్రతుకార్యములకు అనుబంధమగుటచే, పురుషార్థ వాదః = కేవలము యజమాని యొక్క స్తుతి, యథా = ఎట్లు, అన్యేషు = ఇతర విషయములలో, ఇతి = ఇట్లు, జైమిని = జైమినిమతము.

2 నుండి 7 వరకు పూర్వపక్షసూత్రములు మరియు 8 నుండి 17 వరకు సిద్ధాంత సూత్రములై యున్నవి.

శ్రుతులు యజమానిని కేవలము స్తుతించినవనియు, బ్రహ్మజ్ఞానము కర్మాంగము మాత్రమనియును జైమిని తలంచును.

మోక్షముతో సహా కొన్ని విషయములను సాధించుటకై వేదములు కర్మలను సూచించినవని అతని అభిమతమై యున్నది. క్రతుకార్యమునకు అనుబంధమై యుండుటచే బ్రహ్మజ్ఞానమునకు స్వతంత్రమైన ఫలములేదని అతడు తలంచును. జ్ఞానమునకు విషయమైన ఈ సంబంధము ఆత్మచే ఉపాసింపఁబడును. ఇది కార్యములన్నింటికి యజమానియగుటచే, కర్మకు సహకారియై యున్నది. యజమాని కర్మనొనర్చుటకు యోగ్యుడగును. ఆత్మశరీరమును సంరక్షించునని తెలిసికొన్నప్పుడు మృత్యువనంతరము తత్ఫలము గోచరించును.

మానవుడు తన శరీరమునకు విభిన్నుడనియు, మృత్యువనంతరము తాను స్వర్గమునకేగి యజ్ఞఫలముల నుపభోగించు ననియును గుర్తెఱింగినప్పుడే అతడు యజ్ఞము నొనర్చుట కుద్యుక్తుడగును.

ధాన్యపు గింజలపై నీరు చల్లఁబడినట్లు ఆత్మకు యోగ్యత కలుగును. ఏల ననగా అవి యజ్ఞమునందుపయోగించుటకు యోగ్యములగును. ఇది ప్రోక్షణచేత మాత్రమే సాధ్యమగును.

ఆత్మజ్ఞానమునకు స్వతంత్రమైన స్థాయి లేకుండుటచే, దానికి స్వతంత్రమైన ఫలముండదు. కావున ఇట్టి ఫలములను పేర్కొను వాక్యములను ఫలదాయకము లుగా స్వీకరింపరాదు. కాని కేవలము అర్థవాదములుగా స్వీకరింపవలయును. ఇవి ద్రవ్యము, సంస్కారము, కర్మలకు సంబంధించిన అర్థవాదములవంటివి. ఇవి క్రతుకర్మల ఫలములకు అనుబంధమువంటివి. ఆత్మజ్ఞానము దీనికి సహాయ కము మాత్రమే యగును.

బ్రహ్మజ్ఞానముచే పరమపురుషార్థము పొందఁబడుననుటచే బ్రహ్మజ్ఞానము స్వయముగా ఫలము నొసంగునని భావము కాదనియు, అది కేవలము యజ్ఞా చరణకు స్తుతివంటిదనియు జైమిని తలంచును. యజ్ఞఫలములను పరలోకములలో అనుభవించు విశ్వాసమును యజమానియందు కలుగఁజేయుటకు మాత్రము ఆత్మజ్ఞానము ఉపకరించునని అతడనును. అది స్వయముగా ఫలము నొసంగునను వాక్యము కేవలము యజమానియొక్క శుద్ధిని ఉద్ధృత మొనర్చును. యజ్ఞమునకు ఇతర భౌతికాంగములవలె పారిశుద్ధ్యముకూడా యజమానికి ఆవశ్యకమై యున్నది. ఏలననగా ఇట్టి పారిశుద్ధ్యము వినా శరీరముయొక్క ఉనికి అనిశ్చితమగును. మఱియు మరణానంతరము ఊర్ధ్వలోకములలో యజ్ఞఫలము ననుభవించుటయు అనిశ్చితమే యగును.

## 3-4-3 ఆచార దర్శనాత్

ఏలననగా ఆత్మసాక్షాత్కారము నొందినవారి ఇట్టి ప్రవర్తన శ్రుతులనుఁ బట్టి తెలియుచున్నది.

ఆచార దర్శనాత్ = ఏలననగా శ్రుతులచే ప్రవర్తన తెలియఁబడుచున్నది.

2వ సూత్రమునందు చెప్పఁబడిన ఆక్షేపణ బలపఱచఁబడుచున్నది.

విదేహరాజైన జనకుడు దానధర్మముల నొనర్చు యజ్ఞము నాచరించెను. "జనకోహ వైదేహో బహుదక్షిణేన యజ్ఞేనేజే" (బృ.ఉ. 3-1-1)" యక్ష్యమాణోవై భగవంతోఽ హమస్మి" (ఛాం. ఉ. 5-11-5). ఇట్టి వాక్యములచే బ్రహ్మజ్ఞాని కర్మ సంబంధమును కలిగియుండునని తెలియుచున్నది.

జనకుడు మఱియు అశ్వపతి బ్రహ్మజ్ఞానులై యుండిరి. ఒకవేళ బ్రహ్మ జ్ఞానముచే వారు పరమలక్ష్యమును పొందియుండినచో, వారికి యజ్ఞములనొనర్చు అవశ్యకత లేకుండెడిది. ఒకవేళ కేవల జ్ఞానముచే మానవుని లక్ష్యము సిద్ధించినచో,

అన్ని విధములుగా కష్టప్రదములగు యజ్ఞములను వారు ఒనర్పనేల? ఒకవేళ మానవునికి అర్కవృక్షమునందు మధువు లభించినచో, అతడరణ్యమునకు వెళ్ళనేల? కాని ఈ రెండు శ్రుతులచే వారు యజ్ఞముల నాచరించినట్లు తెలియుచున్నది.

దీనిచే మానవుడు యజ్ఞయాగాది కర్మలచేతనే పరమలక్ష్యమునొందును, కాని వేదాంతులు నుడువునట్లు బ్రహ్మజ్ఞానముచే అది లభ్యముకాదని నిరూపింపఁ బడుచున్నది.

## 3-4-4 తచ్ఛ్రుతేః

ఏలననగా బ్రహ్మజ్ఞానము క్రతుకర్మలకు లోకువైయున్నదని శ్రుతి ప్రత్యక్షముగా నుడువుచున్నది.

తత్ = ఆ జ్ఞానము యజ్ఞమున కనుబంధమని, శ్రుతేః = శ్రుతులు ప్రత్యక్షముగా తెలుపుటవలన.

విద్య ఒక కర్మాంగమని శ్రుతి కూడా తెలుపుచున్నది.

ఒకవేళ ఎవడైనను జ్ఞానసహితముగా కర్మ నొనర్చినచో, అతనికి గొప్ప ఫలితము చేకూరును. "యదేవ విద్యయాకరోతి శ్రద్ధయోపనిషదాతదేవ వీర్యవత్తరం భవతి" (ఛాం.ఉ. 1-1-10). జ్ఞానమొక కర్మాంగమని ఈ శ్రుతివాక్యముచే స్పష్టమగుచున్నది. కర్మకు జ్ఞానము లోకువయని ఈ వాక్యము స్పష్టముగా తెలియఁజేయుచున్నది. దీనిచే కేవల జ్ఞానముచే మానవుడు తన జీవిత లక్ష్యము నొందఁజాలడని తెలియుచున్నది.

## 3-4-5 సమన్వారంభణాత్

ఏలననగా కర్మఫలముల నొసంగుటకై శరీరచ్యుతినొందిన ఆత్మతోపాటు కర్మజ్ఞానములు రెండున్నూ కలసి వెళ్ళును.

సమన్వారంభణాత్ = ఈ రెండున్నూ యజ్ఞఫలముల నొసంగుటకై యజమాని ననుసరించుటచే.

2వ సూత్రమునందారంభింపఁబడిన ఆక్షేపణ ఇంకను కొనసాగుచున్నది.

బృహదారణ్యకమిట్లు పలుకును: "తం విద్యా కర్మణీ సమన్వారభేతే" (బృ. ఉ. 4-4-2). కర్మజ్ఞానములు రెండున్నూ ఆత్మతో కలసి వెళ్లుననియు మఱియు

కలిసి కర్మఫలముల నొసంగుననియును ఈ వాక్యము సూచించుచున్నది. కావున జ్ఞానము స్వతంత్రమైనదికాదని తెలియుచున్నది. అది స్వతంత్రముగా ఏలాటి ఫలము నొసంగఁజాలదు. కర్మలను విడిచి జ్ఞానమునకు స్వతంత్రమైన ఉనికిలేదని ఇట్లు నిశ్చితమగుచున్నది.

## 3-4-6 తద్వతో విధానాత్

ఏలననగా వేదములయొక్క ముఖ్యార్థమును తెలిసికొన్నవారికే శ్రుతులు కర్మలను విధించినవి.

తద్వతః = వేదములయొక్క ముఖ్యార్థమును తెలిసికొన్నవానికి, విధానాత్ = శ్రుతులు కర్మలను విధించుటచే.

2వ సూత్రమునందారంభింపఁబడిన ఆక్షేపణ ఇంకను కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా వేదాధ్యయనమొనర్చి దానిని పారాయణ మొనర్చువారికి మాత్రమే కర్మ విధింపఁబడినది. "ఆచార్య కులాద్వేదమధీత్యయథా విధానం గురోః కర్మాతి శేషేణాభి సమావృత్య కుటుంబే శుచౌదేశే స్వాధ్యాయ మధీయానః" (ఛాం. ఉ. 8-15-1). ఇట్టి వాక్యములు కూడా వేదముయొక్క ముఖ్యార్థము తెలిసినవారు మాత్రమే కర్మనొనర్చుట కర్హులనియు, కేవల జ్ఞానము స్వతంత్రముగా ఫలము నొసంగఁజాలదనియును సూచించుచున్నవి.

## 3-4-7 నియమాచ్చ

మఱియు నియమముల కారణముచే.

నియమాత్ = నియమముల కారణముచే, చ = మఱియు

2వ సూత్రమునందారంభింపఁబడిన చర్చ దీనితో సమాప్తమైనది.

జీవితమంతయు నియమమును పరిపాలించుటయే కర్మయనఁబడును. "కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః, ఏవం త్వయి నాన్యథేతోస్తిన కర్మలిప్యతే నరే" (ఈశా. ఉ. 2) "ఏతద్వైజరామర్యం సత్రం యదగ్నిహోత్రం జరయావా హ్యేవాస్మాన్ముచ్యతే మృత్యునావా" (శత. బ్రా. 12-4-1-1). ఇట్టి నియమములననుసరించి కూడా జ్ఞానము కేవలము కర్మాంగమని తెలియుచున్నది.

ఈ యాక్షేపణ లన్నింటికి సమాధానముగా సూత్రకారుడగు వ్యాసుడీ క్రింది సూత్రమునందు సమాధానము నొసంగుచున్నాడు.

## 3-4-8 అధికోపదేశాత్తు బాదరాయణ స్యైవం తద్దర్శనాత్

కాని పరమాత్మ యజమానికి భిన్నుడని శ్రుతులు పలుకుచుండుటచే, బాదరాయణుని దృష్టికోణము సరియైయున్నది.

అధికోపదేశాత్ = పరమాత్మ అధికమై యున్నదని శ్రుతులు ఉపదేశించుటచే, తు = కాని, బాదరాయణస్య = బాదరాయణుని యొక్క, ఏవం = ఇట్లు తద్దర్శనాత్ = శ్రుతులలో ఈ దృష్టి కోణము చూడఁబడుటచే.

2 నుండి 7వరకుఁగల సూత్రములలోని ఆక్షేపణలిప్పుడు వరుసగా ఖండింపఁబడుచున్నవి. ఈ సూత్రము 2వ సూత్రమును ఖండించును.

2 నుండి 7వరకుఁగల సూత్రములలోని మీమాంసకుల దృష్టికోణము 8 నుండి 17 వరకుఁగల సూత్రములచే ఖండింపఁబడుచున్నది.

ఈశ్వరుడు జీవునికంటె గొప్పవాడని శ్రుతి స్పష్టీకరించుచున్నది. కావున 1వ సూత్రములోని బాదరాయణ సిద్ధాంతము సరియైయున్నది. శ్రుతి దీనిని నిరూపించుచున్నది. దివ్యత్వమే జీవుని సత్స్వరూపమై యున్నది.

"తు" యను శబ్దము పూర్వపక్షమును నిరాకరించును. యజమానియైయున్న జీవునిఁగూర్చి వేదాంతగ్రంథములు ప్రబోధించవు. వేదాంత గ్రంథములు నిజమునకు జీవునికి భిన్నమైయున్న జ్ఞేయపదార్థమునుఁగూర్చి ప్రబోధించుచున్నవి. జననమరణ రహితము మఱియు పాపవిముక్తమునగు పరమాత్మనుఁగూర్చి అవి ప్రబోధించుచున్నవి.

ఇట్టి ఆత్మజ్ఞానము కర్మలకు దోహద మొసంగకుండుటయేఁగాక, సమస్త కర్మలను నశింపఁజేయును. కావున 1వ సూత్రమునందు సూచింపఁబడిన పూజనీయులగు బాదరాయణుని దృష్టికోణము అమూల్యమైయున్నది. మఱియు జ్ఞానము కర్మకు లోకువయనెడి కుతర్కముచే చలింపఁజేయఁబడనిదై యున్నది.

శ్రుతులు పరమాత్మునిఁగూర్చి ప్రబోధించుచున్నవనెడి విషయము ఈ క్రింది వాక్యములచే స్పష్టమగుచున్నది. "యః సర్వజ్ఞః సర్వవిత్" (ముం.ఉ.1-1-9). "భీషాఽస్మాద్వాతః పవతే, భీషోదేతి సూర్యః" (తై.ఉ. 2-8-1). "మహద్భయం

వజ్రముద్యతమ్" (కఠ.ఉ. 6-2). "ఏతస్యవా అక్షరస్య ప్రశాసనేగార్గి" (బృ.ఉ. 3-8-9) "తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తేజోఽసృజత" (ఛాం.ఉ. 6-2-3).

## 3-4-9 తుల్యం తు దర్శనమ్

కాని శ్రుతి ప్రబోధము రెండు దృష్టి కోణములకు ఆధారమైయున్నది.

తుల్యం = సమానము, తు = కాని, దర్శనమ్ = శ్రుతి ప్రబోధము.

ఈ సూత్రము 3వ సూత్రములోని దృష్టికోణమును ఖండించును. ఇది 3వ సూత్రమునకు సమాధానము.

విద్య కర్మాంగము కాదని తెలుపుటకు సమానమైన శ్రుతులున్నవి. విద్య కర్మాంగము కాదని శ్రుతి నిశ్చయముగా తెలుపును.

విద్య కర్మాంగమనెడి భావమును తుడిచివేయుటకు "తు" యనెడి శబ్దము ప్రయోగింపఁబడినది. విద్య కర్మాంగము కాదనియు, జ్ఞానప్రాప్తినిఁబడసిన వారికి కర్మ అనావశ్యకమనియును శ్రుతులలో సమానమైన ప్రమాణము కలదు. ఇట్టి శ్రుతి వాక్యములు కొన్ని కలవు. "ఏతద్ధస్మవై తద్విద్వాంస ఆహుర్ఋషయః కావషేయాః కిమర్థావయమధ్యే, ష్యామహేకిమర్థావయం యక్ష్యామహే। ఏతద్ధస్మవైతత్పూర్వే విద్వాంసోఽగ్నిహోత్రం న జుహువాంచక్రిరే", "ఏతం వై తమాత్మానం విదిత్వా బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చవ్యుత్థాయాథ భిక్షాచర్యం చరంతి" (బృ. ఉ. 3-5-1)

ఈ విధముగా కావషేయులనెడి ఋషులు కర్మనొనర్పలేదు. మఱియు సమస్త కర్మలను త్యజించినవాడై యాజ్ఞవల్క్యుడు అరణ్యమున కేగెను. "ఏతావదరే ఖల్వమృతత్వమితి హోక్త్వాయాజ్ఞవల్క్యో విజహార" (బృ. ఉ. 4-5-15). ఇట్లు సమస్త కర్మలను త్యజించినవారై విద్యానురక్తులైన మహాపురుషుల నెందరినో ఉదహరింపవచ్చును. కావున కొన్ని శ్రుతి వాక్యములు కేవలము కర్మలను బలపఱచినను, మరికొన్ని వాక్యములు తద్విరుద్ధములై యున్నవి. జనకునివంటి రాజర్షులు కర్మనవలంబించుట, కేవలము సాంఘిక భవనము పతనము కాకుండుటకేనై యున్నది. వారు అసంగశస్త్రమును చేఁబూని కార్యము నొనర్చుటచే, అది కార్యమని చెప్పుటకే వలనుపడదు. కావున మీమాంసకుల వాదము

బలహీనమైయున్నది. జనకుని వంటి జీవన్ముక్త పురుషులు యజ్ఞయాగాది కర్మలనొనర్చినట్లు నిశ్చయముగా శ్రుతులు పేర్కొనియున్నవి. కాని బ్రహ్మజ్ఞానులకు యజ్ఞాచరణము నిష్ప్రయోజనమనియు, అనావశ్యకమనియు తెలుపు వాక్యములు కూడా శ్రుతులయందున్నవి.

కావున జనకునివంటి దృష్టాంతములచే కర్మకంటె జ్ఞానము లోకువయని నిశ్చయింపరాదు.

"యక్ష్యమాణోవై భగవంతోఽహమస్మి" (ఛాం.ఉ. 5-11-5) అను వాక్యముచే జ్ఞానము కర్మపై ఆధారపడియుండునని పలికినచో, అది వైశ్వానరునిఁ గూర్చి ప్రబోధించు విభాగమునకు చెందినదని మేము నుడువుదుము.

బ్రహ్మవిద్య కర్మసమన్వితమై యుండుటచే ఉపాధులచే పరిచ్ఛిన్నమై యున్నదని శ్రుతులు వచించినను, విద్య కర్మకు లోకువకానేరదు, ఏలననగా ఇచ్చట ముఖ్యవిషయము మఱియు ప్రకరణాదులు అభావమైయున్నవి.

తదనంతరము సూత్రకారుడగు బాదరాయణుడు 4వ సూత్రములోని ఆక్షేపణకు సమాధానము నొసంగుచున్నాడు.

## 3-4-10 అసార్వత్రికీ

1వ సూత్రములోని శ్రుతివాక్యము సర్వత్ర వర్తించదు.

అసార్వత్రికీ = సర్వత్ర వర్తింపదు.

ఆక్షేపణలను ఖండించుట కొనసాగుచున్నది. ఈ సూత్రము ప్రత్యేకముగా 4వ సూత్రమును ఖండించును.

4వ సూత్రమునందు పేర్కొనఁబడినట్టి కర్మోపాసనల సంయోగముచే కర్మబలవత్తరమగుననెడి శ్రుతివాక్యము సర్వత్ర వర్తించదు. పైన పేర్కొనఁబడిన శ్రుతివాక్యము ఉపాసనలన్నింటికి పనికిరాదు. కాని ప్రకరణ విషయమగు ఉద్గీథ విద్యకు మాత్రము సంబంధించి యున్నది.

జ్ఞానముచే కర్మఫలము వృద్ధినొందుననెడి శ్రుతివాక్యము సమస్తవిద్యలకు వర్తించదు. ఏలననగా ఇది కేవలము "ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత" (ఛాం. ఉ. 1-1-1) యనెడి ఉద్గీథ విద్యకు మాత్రము సంబంధించియున్నది.

జ్ఞానముఁగల పురుషునిచే ఒకవేళ ఉద్గీథవిద్య ఉచ్చరింపఁబడినచో అది మిక్కిలి ఫలవంతమగుననియు, విద్య లేకుండా ఉచ్చరింపఁబడినచో అట్లు ఫలవంతము కాదనియును శ్రుతి పలుకును.

కావున ప్రతి సందర్భమునందు విద్య కర్మాంగము కానేరదు.

సూత్రకారుడు తదనంతరము 5వ సూత్రములోని ఆక్షేపణకు సమాధానము నొసంగుచున్నాడు.

## 3-4-11 విభాగః శతవత్

నూటిని ఇద్దఱు వ్యక్తులలో విభాగ మొనర్చినట్లు జ్ఞానకర్మలయందు భేదము కలదు.

విభాగః = జ్ఞాన కర్మవిభాగము, శతవత్ = నూటిని ఇద్దఱు వ్యక్తులలో విభజించినట్లు.

ఈ సూత్రము ప్రత్యేకముగా 5వ సూత్రమును ఖండించును.

బృహదారణ్యక మిట్లు నుడువును. "తం విద్యాకర్మణీ సమాన్వారభేతే" (బృ. ఉ. 4-4-2) ఇచ్చట కర్మజ్ఞానములను విభాగములుగా అర్థమొనర్చుకొన వలయును. అనగా జ్ఞానము ఒకదానిని, కర్మ మరియొక దానిని అనుసరించునని భావము. "100 రూప్యములను రామకృష్ణులకు ఇవ్వుమని పలికినప్పుడు, రామునికి 50 రూకలు మఱియు కృష్ణునికి 50 రూకలను ఇవ్వుమ"నెడి భావమును స్వీకరించునట్లు విద్య మోక్షము నాకాంక్షించు వారికి మఱియు కర్మ ఇతరులకున్నూ సంబంధించినదని పై వాక్యమున కర్థమగును. కాని ఈ రెండింటికి సంయోగము లేదు.

శ్రుతియందు కర్మజ్ఞానములు జననమరణముల నొందు జీవునికే సూచింపఁ బడినవి. కాని మోక్షము నొందనున్న జీవునికి కాదు. ఏలననగా "ఇతి తుకామయమానః" (బృ. ఉ. 4-4-6) అను వాక్యముచే పూర్వశ్రుతి జనన మరణముల నొందు జీవుని పేర్కొన్నట్లు సూచింపఁబడుచున్నది. శ్రుతి మోక్షము నొందనున్న జీవునిఁగూర్చి ఇట్లు నుడివినది. "అథాకామయమానః" (బృ. ఉ. 4-4-6).

తర్వాతి సూత్రము 6వ సూత్రమును ఖండించును.

## 3-4-12 అధ్యయన మాత్రవతః

కేవలము వేదాధ్యయన మొనర్చినవారికి శ్రుతులు కర్మలను విధించినవి.

అధ్యయనమాత్రవతః = కేవలము వేదాధ్యయన మొనర్చినవారికి.

ఈ సూత్రము ప్రత్యేకముగా 6వ సూత్రమును ఖండించును.

వేదాధ్యయన మొనర్చి యజ్ఞయాగాదులనుఁగూర్చి తెలిసికొన్నవాడు యజ్ఞము నొనర్చుటకు అర్హుడు. కాని బ్రహ్మజ్ఞానికి ఏ కార్యమున్నూ విధింపఁబడలేదు.

## 3-4-13 నావిశేషాత్

జ్ఞానికి ప్రత్యేకమైన నియమము వర్తించదు.

న = నియమము వర్తించదు, అవిశేషాత్ = ఏలాటి ప్రత్యేకత లేకుండుటచే.

ఈ సూత్రము ప్రత్యేకముగా 7వ సూత్రమును ఖండించును.

"కుర్వన్నే వేహకర్మాణి జిజీవిషేత్" అనెడి ఈశావాస్యోపనిషద్వాక్యము ప్రత్యేకముగా బ్రహ్మజ్ఞానికి వర్తించదు. అది సర్వసామాన్యమైన వాక్యము. జ్ఞానికి కూడా అది వర్తించునని దానియందు ప్రత్యేకముగా చెప్పఁబడలేదు. ప్రత్యేకత లేనప్పుడు అది జ్ఞానిని బంధించదు.

ముక్తపురుషుడు కూడా తన జీవితాంతమువరకు కర్మ నాచరింపవలయునను నియమమును ఈశావాస్య శ్రుతి పేర్కొనలేదు. ఏల? అవిశేషాత్, ప్రత్యేకత లేకుండుటచే. "కుర్వన్నే వేహకర్మాణి జిజీవిషేత్" అని మాత్రము అది పలికినది. ఆ ప్రత్యేక నియమము ఏ వర్గము వారికి వర్తించునో, ఆ విషయము చెప్పఁబడలేదు. ఇంతేకాకుండా అమృతత్వము కేవల జ్ఞానముచే తప్ప, కర్మలచే పొందఁబడదని శ్రుతులు స్పష్టీకరించుచున్నవి.

మహానారాయణోపనిషత్తిట్లు నుడువుచున్నది. "న కర్మణాన ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః"

ఈ రెండు శ్రుతులలోని స్పష్టమైన భేదాభిప్రాయములను ఇప్పుడు సమన్వయ మొనర్పవలసియున్నది. ఇందులో ఒకటి కర్మనిష్ఠాపరులకు చెప్పఁబడినది. మరియొకటి జ్ఞాననిష్ఠాపరులకు చెప్పఁబడినది.

## 3-4-14 స్తుతయేఽనుమతిర్వా

లేక జ్ఞానముయొక్క స్తుతి నిమిత్తమై కర్మానుష్ఠానము చెప్పఁబడినది.

స్తుతయే = జ్ఞానముయొక్క స్తుతి నిమిత్తమై, అనుమతిః = అనుజ్ఞ, వా = లేక.

ఈ సూత్రముకూడా 7వ సూత్రమును ఖండించును.

"కుర్వన్నే వేహకర్మాణి" అను వాక్యము మరియొక విధముగ కూడా పరి గ్రహింపఁబడవచ్చును. బ్రహ్మజ్ఞానుల నిమిత్తమై కర్మచేయు నియమము ఈ జ్ఞానమును స్తుతించుటకై ఏర్పడినది. బ్రహ్మజ్ఞాని తన జీవితాంతము వరకు కర్మల నొనర్చినను, తన జ్ఞానబలముయొక్క కారణముచే అతడా ఫలములచే అంటుఁబడడు. జ్ఞానము కర్మఫలమును రద్దుచేయును. "న కర్మలిప్యతే నరే" అను వాక్యముచే జ్ఞానము నిస్సందేహముగా స్తుతింపబడినది.

## 3-4-15 కామకారేణచైకే

మఱియు కొందఱు తమ ఇచ్ఛానుసారముగా సమస్త కర్మలను త్యజించిరి.

కామకారేణ = తమ ఇచ్ఛానుసారముగా, చ = మఱియు, ఏకే = కొందఱు.

జైమిని దృష్టికోణములను ఖండించు వాదము కొనసాగుచున్నది.

బ్రహ్మజ్ఞానమునుఁ బడసిన తర్వాత కూడా జనకాదులు యజ్ఞయాగాదుల నొనర్చినట్లు 3వ సూత్రమునందు చెప్పఁబడినది. కొందఱు తమ ఇచ్ఛాను సారముగా సమస్త కర్మలను త్యజించినట్లు ఈ సూత్రము నుడువుచున్నది. ఇతరులకు ఆదర్శవంతులుగా నుండుటకై కొందఱు బ్రహ్మజ్ఞానమునుఁ బడసిన తర్వాత కూడా కర్మచేయుట కిచ్ఛగింపవచ్చును. మరికొందఱు సమస్త కర్మలను త్యజింపవచ్చును. కావున కర్మనుఁగూర్చి బ్రహ్మజ్ఞానుల విషయములో నిర్బంధములేదు.

వాజసనేయినుల శ్రుతివాక్యమొకటి కలదు. "ఏతద్ధస్మవై తత్పూర్వే విద్వాంసః ప్రజాం న కామయంతే కిం ప్రజయా కరిష్యామః ఏషాం నోయమాత్మాయం లోక ఇతి" (బృ.ఉ. 4-4-22). దీనిచే జ్ఞానము కర్మకు లోకువ కాదనియు మఱియు శ్రుతి వాక్యములలోని జ్ఞానఫలము నిజమైన అర్థమునందే స్వీకరింపఁబడవల యుననియును తెలియుచున్నది.

## 3-4-16 ఉపమర్దంచ

మఱియు జ్ఞానమువలన సమస్త కర్మలు నశించునని శ్రుతి ప్రబోధించుచున్నది.

ఉపమర్దం = సమస్త కర్మనాశము, చ = మఱియు.

పూర్వవాదము కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా ఇట్టి జ్ఞానముచే సమస్తము ఆత్మలేక బ్రహ్మమనెడి అనుభవము కలుగును. ఐతే జ్ఞాత ఎట్లు వర్తించును?

జ్ఞానము కర్మాంగము కాదు. కాని సమస్త కర్మలను మఱియు సమస్త విధ్యుక్త కర్తవ్యములను నశింపఁజేయును. ముండకోపనిషత్తిట్లు నుడువును. "భిద్యతే హృదయ గ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః, క్షీయంతే చాస్యకర్మాణితస్మిన్ దృష్టే పరావరే" (ముం.ఉ. 2-2-9).

బ్రహ్మజ్ఞానముచే సమస్త అజ్ఞానము మఱియు తత్కార్యములైన కర్త, కర్మ, ఫలములు నశించును. "యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కంపశ్యేత్తత్కేన కంజిఘ్రేత్" (బృ.ఉ. 4-5-15). బ్రహ్మజ్ఞానము సమస్త కర్మలకు వైరము వంటిది. కావున అది కర్మకు లోకువ కానేరదు. అది స్వతంత్రమై యున్నది.

## 3-4-17 ఊర్ధ్వరేతస్సు చ శబ్దేహి

మఱియు నైష్ఠిక బ్రహ్మచర్యము నాచరించువారికి జ్ఞానము సంబంధించి యున్నది. ఏలననగా శ్రుతియందు ఆ జీవితస్థాయి పేర్కొనఁబడినది.

ఊర్ధ్వరేతస్సు = ఊర్ధ్వరేతస్కులైనవారియందు, చ = మఱియు, శబ్దే = శ్రుతి యందు, హి = ఏలననగా.

పూర్వవాదము కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా జ్ఞానము సన్న్యాసులకు సంబంధించినదని శ్రుతి పలుకుచున్నది. జ్ఞానము సన్న్యాసులయందుండునని చెప్పఁబడినది. వారు ఏలాటి కర్మలను చేయవలసియుండదు. గృహస్థాశ్రమము నవలంబింపకున్నను ఇట్టి సన్న్యాసమును స్వీకరింపవచ్చును.

జీవితములోని భూమికలలో కూడా జ్ఞానమావశ్యకమై యుండుటచే నైష్ఠిక బ్రహ్మచర్యము శ్రుతియందు విధింపఁబడినది. వాటి విషయములో జ్ఞానము కర్మకు లోకువకాదు. ఏలననగా కర్మకు ఉనికిలేదు. దీనికి కారణమేమనగా ఆ భూమికలను చేరిన మనుజులచే వేదవిహితములుగా అగ్నిహోత్రాదికర్మలు ఆచరింపఁబడవు. బ్రహ్మవిచారణ మఱియు పరమాత్మ ధ్యానముతప్ప సన్న్యాసికి మరియొక కార్యము విధింపఁబడలేదు. కావున జ్ఞానము కర్మకు లోకువ ఎట్లగును?

శ్రుతి వాక్యముల ద్వారా సన్న్యాసమనెడి జీవితభూమిక యొకటి కలదని మనకు తెలియుచున్నది. "త్రయోధర్మస్కంధాః" (ఛాం.ఉ. 2-23-1). "యేచే మేరణ్యే శ్రద్ధాతప ఇత్యుపాసతే" (ఛాం. ఉ. 5-10-1). "తపః శ్రద్ధేయేహ్యుప వసంత్యరణ్యే" (ముం. ఉ. 1-2-11). "ఏతమేవ ప్రవ్రాజినో లోకమిచ్ఛంతః ప్రవ్రజంతి" (బృ. ఉ. 4-4-22). "బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్" (జా.ఉ.4) "సర్వఏతే పుణ్యలోకా భవంతి బ్రహ్మసంస్థోఽ మృతత్వమేతి" (ఛాం.ఉ. 2-23-1).

గృహస్థాశ్రమాదుల నవలంబింపకయే ఎవరైనను ఈ జీవితము ననుష్ఠింప వచ్చును. దీనిచే జ్ఞానముయొక్క స్వతంత్రత సూచింపఁబడుచున్నది.

ఇట్లు కర్మకంటె జ్ఞానము లోకువయనెడి జైమిని యొక్క సిద్ధాంతము నిలుచుటకు కాళ్ళు లేనిదగుటచే అది ఖండింపఁబడినది.

# 2. పరామర్శాధికరణము

## (18-20 సూత్రములు)

### 3-4-18 పరామర్శం జైమిని రచోదనా చాపవదతి హి

ఇతర శ్రుతివాక్యములు వాటిని ఖండించుటచే బ్రహ్మచర్యము విధిగా చెప్పఁ బడిన జీవిత భూమికలను సూచనగ మాత్రమే శ్రుతి పేర్కొనినదని జైమిని తలంచును.

పరామర్శం = సూచనగ మాత్రమే, జైమినిః = జైమిని, అచోదనా = స్పష్టమైన సిద్ధాంతముకాదు, చ = మఱియు, అపవదతి = ఖండించును, హి = నిశ్చయముగ.

17వ సూత్రమునకొక ఆక్షేపణ చెప్పబడినది.

పూర్వసూత్రమునందు పేర్కొంనబడిన శ్రుతివాక్యము (ఛాం.ఉ. 2-23-1) నందు సన్న్యాసము మానవునికి విధిగా సూచించు శబ్దములేదని జైమిని పలుకును. అది కేవలము సూచన మాత్రమే కాని సిద్ధాంతము కాదు.

కొందఱు వ్యక్తులు సన్న్యాసమును ఇచ్ఛగింతురని పూర్వసూత్రములోని బృహదారణ్యకవాక్యము నుడువుచున్నది. ఇచ్చట శ్రుతి నిజమైన విషయమును వ్యక్త మొనర్చినది. అది సన్న్యాసమును విధింపదు.

కావున స్మృతులు మరియు ఆచారములున్నను, సన్న్యాసమునుఁగూర్చి శ్రుతి ప్రత్యక్షముగా చెప్పుటలేదు. కాని గృహస్థాశ్రమమునకున్నూ ఏలాటి శ్రుతి లేదని మనము పలికినచో అగ్నిహోత్రాదికర్మలు శ్రుతిచే విధింపబడినవని జైమిని సమాధానమొసంగును. ఇంతేకాకుండా ఇచ్చట శ్రుతి బ్రహ్మముపై నిశ్చలత్వమును గూర్చి స్తుతించును. "బ్రహ్మసంస్థోఽమృతత్వమేతి" (ఛాం. ఉ. 2-23-1). యజ్ఞము, స్వాధ్యాయము, దానము, తపస్సు, గురుకులవాసము మఱియు నైష్ఠిక బ్రహ్మచర్యములచే స్వర్గఫలము ప్రాప్తించును. కాని అమృతత్వము కేవలము బ్రహ్మనిష్ఠుని చేత మాత్రమే పొందఁబడును.

ఇఁక సన్న్యాసమును ఖండించునట్టి ఇతర శ్రుతి వాక్యములు కూడా కలవు. "ఆచార్యాయప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః" (తై.ఉ. 1-11-1) "నా పుత్రస్యలోకోఽస్తీతి తత్సర్వే పశవోవిదుః" (తై.బ్రా. 7-13-12).

## 3-4-19 అనుష్ఠేయం బాదరాయణః సామ్యశ్రుతేః

సన్న్యాసమునుకూడా అనుష్ఠింపఁవలయునని బాదరాయణుడు పలుకును ఏలననగా శ్రుతి చతుర్విధాశ్రమములనుఁగూర్చి సమానముగా సూచించును.

అనుష్ఠేయం = అనుష్ఠింపవలయును, బాదరాయణః = సూత్రకారుడగు వ్యాసుడు, సామ్యశ్రుతేః = శ్రుతి చతుర్విధాశ్రమములను గూర్చి సమానముగా సూచించుటచే.

18వ సూత్రములోని ఆక్షేపణ ఇచ్చట ఖండింపఁబడినది. శ్రుతిలోని యజ్ఞ యాగాదులు గృహస్థులకు, తపస్సు వానప్రస్థులకు, గురుకుల వాసము బ్రహ్మచారులకు మరియు బ్రహ్మనిష్ఠ సన్న్యాసులకున్నూ విధింపబడినది. కావున శ్రుతి చతుర్విధాశ్రమములన్నింటిని సమానముగా సూచించుచున్నది. మొదటి మూడు ఆశ్రమములకు సంబంధించి శ్రుతి మరియొకచోట విధింపఁబడినదానిని

సూచించుచున్నది. సన్న్యాసమునకు సంబంధించిన శ్రుతి కూడా అట్టిదేనైయున్నది. కావున సన్న్యాసము కూడా విధింపఁబడియుండుటచే అది అందరిచే ఆచరింపఁ బడవలయును. రెండున్నూ శ్రుతియందు సూచింపఁబడుటచే, సన్న్యాసము కూడా గృహస్థాశ్రమమువలె సరియైన ఆశ్రమమైయున్నదని బాదరాయణుడు పలుకును. తపస్సనెడి శబ్దము విభిన్నమైన ఆశ్రమమును సూచించును. దీనియందు తపస్సు అధికాంశమునందుండును.

## 3-4-20 విధిర్వాధారణవత్

లేక, సమిత్తులను ధరించుటవలె ఈ శ్రుతియందొక నియమము కలదు. విధిః = నియమము, వా = లేక, ధారణవత్ = సమిత్తులను ధరించుటవలె, 18వ సూత్రములోని ఆక్షేపణ యొక్క ఖండన కొనసాగుచున్నది.

ఛాందోగ్య శ్రుతియందు సన్న్యాసమునుఁ గూర్చిన నియమమున్నట్లు ఈ సూత్రము నిరూపించుటకు ప్రయత్నించును. ఈ వాక్యమునందొక నియమ మున్నది. కాని కేవలము సూచన కాదని గుర్తెఱుంగవలయును.

ఈ విషయము సమిత్తులను ధరించుటను పోలియున్నది. పితృదేవతలకై ఒనర్పఁబడు మహాపితృయజ్ఞమునందొక భాగమగు అగ్నిహోత్రమునకు సంబంధించిన శ్రుతి వాక్యమొకటి కలదు. "అధస్తాత్సమిధందారయన్న నుద్రవేదు పరిహిదేవేభ్యో ధారయతి" నియమమునకు సంబంధించిన ఏలాటి శబ్దము లేకున్నను, చివరి వాక్యాంశమును జైమిని ఒక నియమముగా తలపోయును. ఏలననగా ఇట్టి నియమము శ్రుతులయం దెచ్చటను కానరాదు. ఈ వాదము ననుసరించి ఈ సూత్రము సన్న్యాసమునుఁగూర్చిన విధి యున్నదనియు, (ఛాం. ఉ. 2-23-1) వ వాక్యము కేవలము సూచన కాదనియును తెలుపుచున్నది. ఏలననగా ఇది మరియొకచోట చెప్పఁబడలేదు.

శ్రుతియందు కేవలము ఇతర ఆశ్రమములయొక్క అనువాదమున్నను "బ్రహ్మ సంస్థోమృతత్వమేతి" యను వాక్యమునుండి సన్న్యాసము యొక్క విధిని ఊహింప వలయునని పూర్వమీమాంసా సూత్రములు తెలుపుచున్నవి. సమిత్తు స్రుక్కు యొక్క పై భాగమునందుంచవలయునను నియమము లేకున్నను, ఇట్టి నియమమును ఊహింపవలయునని పూర్వమీమాంసకులు నుడువునట్లు మరియొక నియమము లేకుండుటచే సన్న్యాస విధిని ఊహింపవలయును.

ప్రస్తుత విషయమునందుకూడా ఇట్టి నిర్మాణాత్మకమగు నియమమే వర్తించును. ఇంతేకాకుండా ఇతరాశ్రమములవలె నియమములేకుండా కేవలము సూచింపఁబడినను, సన్న్యాసము ప్రత్యేకముగా స్తుతింపఁబడుటచే దానికి నియమమును మనము ఊహింపవలసియుండును.

మఱియు సన్న్యాసమును ప్రత్యక్షముగా విధించు శ్రుతివాక్యములున్నూ కలవు. “బ్రహ్మచర్యం పరిసమాప్య గృహీభవేద్గృహీ భూత్వావనీ భవేద్వనీ భూత్వాప్రవ్రజేత్, యదివేతరథా బ్రహ్మచర్యాదేవప్రవ్రజేద్గృహాద్వావనాద్వా” (జా. ఉ.4). కావున సన్న్యాసాశ్రమముయొక్క ఉనికిని నిషేధింపఁజాలము.

శ్రుతిలోని తపశ్శబ్దము వానప్రస్థమును సూచించును. మఱియు సన్న్యాసమునకు ఇంద్రియ సంయమమే ప్రధానమైయున్నది. ఇతరాశ్రమములకు సంబంధించిన వారు పుణ్యలోకముల కేగుదురనియు, సన్న్యాసులు అమృతత్వము నొందుదురనియును శ్రుతి ప్రత్యేకించి నుడువుచున్నది.

స్తుతి కూడా విధికి పూరకమై యుండవచ్చునని జైమిని స్వయముగా పలుకును. శ్రుతియందు బ్రహ్మనిష్ఠ విధింపఁబడినది. కావున దానికి విధివంటి విలువ కలదు. “బ్రహ్మసంస్థద” నగా ఎల్లప్పుడు బ్రహ్మమునుఁగూర్చి ధ్యానించువాడని అర్థము. అది ఇతర కార్యములన్నింటిని విడిచి బ్రహ్మమునందు స్థిరచిత్తుడై యుండుదశ. ఇతర ఆశ్రమములలో ఆయాకార్యములుండుటచే ఇది సాధ్యముకాదు. కాని సన్న్యాసులు కర్మలను త్యజించుటచే ఇది వారికి సాధ్యమగును. వారి శమదమములు దానికి సహకరించునేకాని, ఆటంకములు కాజాలవు.

కర్మకాండను ఆచరింపలేని కుంటి, గ్రుడ్డివారికి మాత్రము సన్న్యాసము విధింపఁబడలేదు. బ్రహ్మసాక్షాత్కారమునకు సన్న్యాసము సాధనమువంటిది. అది సక్రమ విధానము ననుసరించి స్వీకరింపఁబడవలయును. శ్రుతి ఇట్లు నుడువును. “అథ పరివ్రాడ్వివర్ణ వాసాముండోఽ పరిగ్రహః శుచిర ద్రోహీ భైక్షాణో బ్రహ్మ భూయాయ భవతి” (జాబాల శ్రుతి 5)

కావున శ్రుతులచే సన్న్యాసము విధింపఁబడినది. సన్న్యాసులకు జ్ఞానము విధింపఁబడుటచే, అది కర్మకు భిన్నమైయున్నది.

# 3. స్తుతిమాత్రాధికరణము

## (21-22 సూత్రములు)

## 3-4-21 స్తుతిమాత్రము పాదానాదితిచేన్నా పూర్వత్వాత్

క్రతు కర్మాంగములచే ఉద్గీథాదులు కేవలము స్తుతిమాత్రములని పలికినచో, వాటి ప్రబోధములోని నవీనత్వముచే అవి విధులేయని మేము నుడువుడుము.

స్తుతి మాత్రమ్ = కేవలము స్తుతి, ఉపాదానాత్ = క్రతుకర్మాంగము లగుటచే, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = అట్లుకాదు. అపూర్వత్వాత్ = నవీనత్వముచే.

ఈ సూత్రము శంకా సమాధానములనెడి రెండు విభాగములను కలిగియున్నది. "స్తుతి మాత్రము పాదానాదితిచేత్" అనునది శంక, "న అపూర్వత్వాత్" అనునది సమాధానము.

"స ఏషరసానాం రసతమః పరమః పరార్థ్యోఽ ష్టమోయదుద్గీథః" (ఛాం. 1-1-3). "ఇయమేవర్గగ్నిః సామ" (ఛాం. ఉ. 1-6-1). "అయంవావలోక ఏషో ఽ గ్నిశ్చితః" (శ. బ్రా. 10-1-2-2). "తదిదమేవోక్థమియ మేవ పృథివీ" (ఐ. ఆ. 2-1-2-1).

ఈ వాక్యములు ఉపాసనా నిమిత్తమై చెప్పఁబడినవా? లేక ఉద్గీథమును స్తుతించుటకై చెప్పఁబడినవా? యనెడి సంశయము కలుగును.

ఇది కేవలము స్తుతి యగునే కాని, ఓంకారము నుపాసించు విధికాదని పూర్వపక్షి పలుకును. ఈ వాక్యములు "ఇయమేవ జుహూరాదిత్యః కూర్మః స్వర్గోలోక ఆహవనీయః" అనెడి జుహ్వాదులను స్తుతించు వాక్యములను పోలియున్నవి.

ప్రస్తుత సూత్రములోని ఉత్తరభాగము పూర్వపక్షి యొక్క దృష్టికోణమును ఖండించును.

"స ఏషరసానాం రసతమః పరమః పరార్థ్యోఽ ష్టమోయదుద్గీథః" అనెడి శ్రు తి వాక్యములోని వర్ణన కేవలము స్తుతి కాదు. కాని అది ఒక విధి. అది ఒకానొక నూతన విషయమునుఁగూర్చి మనకు తెలుపును.

దృష్టాంతము సరియైనదికాదు. స్తుతివాక్యములు విధివాక్యములకు పూరకములుగా ఉపయోగపడును. కాని ప్రస్తుతము చర్చింపఁబడుచున్న వాక్యములు ఉద్గీథమునకు సంబంధించినవికావు. అవి వేదములయొక్క విభిన్న స్థలములయందున్నవి. కావున స్తుతిపాత్రములు కాజాలవు. 'ఇయమేవజుహూః" వంటి వాక్యములు ఉపమానములు కావు. ఏలననగా అవి విధి వాక్యములకు సమీపమునందుండుటచే వాటిని స్తుతిగా పరిగ్రహింపవచ్చును.

కావున ప్రస్తుతము చర్చింపఁబడుచున్న శ్రుతులకు విధియే ప్రాధాన్యమై యున్నది. నూతనత్వ కారణముచే అవి కేవలము స్తుతులు కావు. కాని విధులై యున్నవి.

## 3-4-22 భావ శబ్దాచ్చ

మఱియు విధులను సూచించునట్టి శబ్దములుండుటచే.

భావ శబ్దాత్ = శ్రుతిలోని విధులను సూచించు శబ్దములచే, చ = మఱియు.

21వ సూత్రమునందారంభింపఁబడిన చర్చ దీనితో సమాప్తమగును.

"ఉద్గీథముపాసీత" (ఛాం. ఉ. 1-1-1). ఈ వాక్యమునందు ఓంకారమును ఉపాసించు విధానము స్పష్టపఱచఁబడినది. ఈ కారణముచే చివరి సూత్రములోని శ్రుతివాక్యమును కేవలము ఓంకారముయొక్క స్తుతిగా నుడువుటకు వీలు లేదు. పూర్వ సూత్రములోని "స ఏష రసానాంరసతమః పరమః" అను వాక్యము కేవలము స్తుతికాదు. కాని అది ఉద్గీథోపాసనకు విధియైయున్నది.

# 4. పారిప్లవాధికరణము

## (23-24 సూత్రములు)

### 3-4-23 పారిప్లవార్థా ఇతిచేన్న విశేషితత్వాత్

ఉపనిషత్తులలోని కథలు కేవలము పారిప్లవముకొరకేయని పలికినచో, అట్లు కాదని మేము నుడువుదుము. ఏలననగా ఇందునిమిత్తమై కొన్ని కథలు శ్రుతియందు ప్రత్యేకించి చెప్పఁబడినవి.

పారిప్లవార్థాః = పారిప్లవ నిమిత్తమై, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ, న = అట్లుకాదు, విశేషితత్వాత్ = కొన్ని కథలు మాత్రమే ప్రత్యేకింపబడుటచే.

ఈ సూత్రము శంకాసమాధానములనెడి రెండు విభాగములను కలిగి యున్నది. "పారిప్ల వార్థా ఇతిచేత్" అనునది. శంక, "న విశేషితత్వాత్" అనునది సమాధానము.

అశ్వమేధ యజ్ఞమునందు యాజకుడు ఆ యజ్ఞమునొనర్చు రాజు మఱియు తత్సంబంధీకులకు యజ్ఞ విరామకాలమునందు కొన్ని కథలను నుడువును. ఇవి పారిప్లవములనఁబడును. మఱియు అవి యజ్ఞమునకంగములుగా పరిగణింపఁ బడును.

"అథహ యాజ్ఞవల్క్యస్యద్వేభార్యే బభూవతుర్మైత్రేయీచ కాత్యాయనీచ" (బృ. ఉ. 4-5-1) "ప్రతర్దనోహవైదేవో దాసిరింద్రస్యప్రియం ధామోపజగామ" (కౌ. ఉ. 3-1). "జానశ్రుతిర్హపౌత్రాయణః శ్రద్ధాదేయో బహుదాయీ బహుపాక్య ఆస" (ఛాం.ఉ. 4-1-1). ఇత్యాది ఔపనిషత్కథలు కూడా కర్మాంగములా? యనెడి సంశయమిచ్చట కలుగును. అట్లయినచో జ్ఞానకాండయంతయు కర్మకాండకు లోకువ యగును.

ఈ యౌపనిషత్కథలు పారిప్లవమునకై చెప్పఁబడినవని పూర్వపక్షి పలుకును. ఏలననగా అవి ఇతరములగు కథలను పోలియుండును. మఱియు పారిప్లవమునకు కథలు చెప్పుట విధింపఁబడినది. దీనిచే ఔపనిషత్కథలు మఱియు వేదాంత గ్రంథములయొక్క ముఖ్య లక్ష్యము జ్ఞానముకాదని తెలియచున్నది. ఏలననగా అవి మంత్రములవలె క్రతుకార్యములకు పూరకములైయున్నవి.

## 3-4-24 తథాచైక వాక్య తోపబంధాత్

మఱియు అవి సమస్తమునకు సంబంధించిన దగ్గరి విద్యలకు దృష్టాంతము లుగా నున్నవి.

తథా = ఆ విధముగా, చ = మరియు, ఏకవాక్యతోపబంధాత్ = సిద్ధాంత సమన్వయమునకు సంబంధించుటచే.

23వ సూత్రమునందారంభింపఁబడిన చర్చ ఇంతటితో పూర్తియైనది.

కావున ఇది ఉపాసనను స్తుతించుటకై చెప్పఁబడినది. ఏలననగా అప్పుడు మాత్రమే ప్రకరణభావమునందు సమన్వయ మేర్పడును. ఇట్టి దృష్టికోణము మాత్రమే సందర్భ సముచితత్వమునకు దారితీయును.

ఔపనిషత్కథలు బ్రహ్మవిద్యకు ముఖ్యాంగములుగా తలంపఁబడును. జ్ఞానకాండను సులభసాధ్య మొనర్చుటకై అవి చెప్పఁబడినవి. ఉపాసనలను పరిచయ మొనర్చుటకై ఆఖ్యానములు ప్రవేశపెట్టఁబడినవి. కథానిక రూపము నందున్న విషయము ముముక్షువునకు మిక్కిలి శ్రద్ధను మఱియు ఆసక్తిని కలిగించును. ఉపనిషత్తులలోని ఇతర విభాగములలో సూక్ష్మరూపమునందున్న ఉపాసనలను విస్తరించి చెప్పుటయే వాటియొక్క ఉద్దేశ్యమైయున్నది.

అట్లు మనమేల చెప్పుదుము? 'ఏకవాక్యతోపబంధాత్', తర్వాతి వాక్యములు ఉపాసనలతో వాక్యప్రక్రియానుసార సంబంధమును కలిగియుండుటచే.

ఈ విధముగా "అథహ యాజ్ఞవల్క్య స్యద్వేభార్యే బభూవతుః" అను వాక్యముతో ప్రారంభింపబడిన కథానికయందు వెంటనే "ఆత్మావా అరేద్రష్టవ్యః" (బృ.ఉ. 4-5-6) అను శబ్దములద్వారా ఆత్మనుఁగూర్చిన ఉపాసన ప్రబోధింపఁ బడినది. బ్రహ్మమునుఁగూర్చిన ప్రబోధమునకు ముందుఁగాని, తదనంతరముఁ గాని ఈ కథలు చెప్పఁబడుటచే అవి పారిప్లవములు కావనియు, విద్యలను స్తుతించుటకే అవి చెప్పఁబడినవనియును మన మూహింపవచ్చును. కఠినమైన విషయమును సులభసాధ్యమొనర్చుటకై ఈ కథలు చెప్పఁబడినవి. మఱియు ఇందునిమిత్తమై అవి మిక్కిలిగా ఉపయుక్తములైయున్నవి.

# 5. అగ్నీంధనాద్యధికరణము

## 3-4-25 అత ఏవచాగ్నీంధనాద్య నపేక్షా

మఱియు ఈ కారణముచే అగ్నిని రగుల్కొల్పుట ఇత్యాది ఆవశ్యకతలేదు.

అత ఏవ = ఈ కారణముచేతనే, చ = మఱియు, అగ్ని = అగ్ని, ఇంధనాది = ఇంధనాదులయొక్క, అనపేక్షా = ఆవశ్యకతలేదు.

బ్రహ్మోపాసకుడు యజ్ఞయాగాదులను త్యజింపవలయునని ఈ సూత్రము నుడువుచున్నది.

బ్రహ్మవిద్యకు అగ్ని, ఇంధనములు ఇత్యాదులతో పనిలేదు. అది స్వయముగా ముక్తికి కారణమై యున్నది.

పరమపురుషార్థమునుఁబడయుటయే బ్రహ్మజ్ఞానమునకు లక్ష్యమైయున్నదని 3-4-1వ సూత్రమునందు తెలుపఁబడినది. “అత ఏవ” యనెడి శబ్ద సముచ్చయ ముచే 3-4-1వ సూత్రములోని విషయము సూచింపఁబడినది. ఏలననగా దీనిచే సంతృప్తికరమైన విషయము ద్యోతకమగుచున్నది. సన్న్యాసుల జ్ఞానముచే గృహస్థులకు విధింపఁబడినట్టి యజ్ఞయాగాదికర్మలు సాధింపఁబడు కారణముచే, వాటిని సన్న్యాసులు ఆచరింపవలసిన పనిలేదు.

మరికొన్ని వివరములను తెలుపుటకై సూత్రకారుడిచ్చట ప్రథమాధికరణము యొక్క సారమును వ్యక్తమొనర్చెను.

బ్రహ్మోపాసన నొనర్చు సన్న్యాసి అమృతత్వము నాకాంక్షింపవలయునేకాని, క్రతు కర్మఫలముల నాశింపరాదని శ్రుతి పలుకుటచే అతడు అగ్నీంధనాది కర్మల నాచరింప నవసరములేదు. “బ్రహ్మసంస్థోఽ మృతత్వమేతి” యని ఛాందోగ్యము (2-23-1) నందు కలదు.

ముక్తి నొందుటకై జ్ఞానకర్మలు సంయోగమొనర్పఁబడవలయునను సిద్ధాంత మిచ్చట తృణీకరింపఁబడినది. అందునిమిత్తమై బ్రహ్మజ్ఞానము చాలును.

# 6. సర్వాపేక్షాధికరణము

## (26-27 సూత్రములు)

## 3-4-26 సర్వాపేక్షా చ యజ్ఞాది శ్రుతేరశ్వవత్

గుఱ్ఱము రథమును లాగుట కుపకరించును, కాని పొలము దున్నుట కుపకరింపనట్లు జ్ఞానార్జనకై యజ్ఞయాగాదులను శ్రుతులు విధించుటచే సమస్త కర్మలు ఆవశ్యకములై యున్నవి.

సర్వాపేక్షా = సమస్తకర్మలు ఆవశ్యకములై యున్నవి, చ = మఱియు, యజ్ఞాది శ్రుతేః = యజ్ఞాదులను జ్ఞానసాధనములుగా శ్రుతి విధించుటచే, అశ్వమువలె.

బ్రహ్మజ్ఞానోత్పత్తికై క్రతుకర్మాదులు ఆవశ్యకములని ఈ సూత్రము నుడువుచున్నది.

కర్మలు పూర్తిగా నిష్ప్రయోజనములని పూర్వసూత్రముచే మనము నిశ్చయించుట కవకాశమున్నది.

జ్ఞానార్జనకై ఈ కర్మలన్నియును ప్రయోజనకరములని ఈ సూత్రము నుడువుచున్నది. జ్ఞానప్రాప్తికై పరోక్షసాధనములగుటచే శ్రుతులు కూడా కర్మలను విధించుచున్నవి. బృహదారణ్యకమిట్లు నుడువును. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసాஉనాశకేన" (బృ. ఉ. 4-4-22). అదే విధముగా "అథయద్యజ్ఞ ఇత్యాచక్షతే బ్రహ్మచర్య మేవతత్" (ఛాం. ఉ. 8-5-1) అను వాక్యములచే జ్ఞానసాధనమైయున్న బ్రహ్మచర్యముతో యజ్ఞాదులను సంయోగపఱచుచు, యజ్ఞాదులుకూడా జ్ఞానసాధనములని సూచించును. ఇంతేకాకుండా "సర్వేవేదాయత్పదమామనంతి తపాంసి సర్వాణిచ యద్వదంతి, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తేపదం సంగ్రహేణ బ్రవీమి" (కఠ. ఉ. 1-2-15) ఇత్యాది వాక్యములు కూడా ఆశ్రమధర్మములను జ్ఞానసాధనములుగా సూచించుచున్నవి.

ఒకప్పుడు జ్ఞానము పొందబడిన తర్వాత మోక్షఫలమునుఁ బడయుటకై భౌతిక కర్మలయొక్క సహాయము ఆవశ్యకమై యుండదు. దీనికి దృష్టాంతమేమనగా గమ్యస్థానము చేరునంతవరకు ఒక గుఱ్ఱము ఆవశ్యకమై యుండును. కాని ప్రయాణము పూర్తియైన తర్వాత ఆ గుఱ్ఱమును వదలివేయవచ్చును.

ఆత్మజ్ఞానము నొందిన తర్వాత ముక్తినిఁబడయుటకై ఏలాటి ఉపకరణముతో పనిలేదు. కాని ఆత్మజ్ఞానమునకై కర్మ ఆవశ్యకమై యుండును. ఒక గుఱ్ఱము ఒక రథమును తోలుటకు పనికివచ్చును. కాని పొలమును దున్నుటకెట్లు పనికిరాదో, అట్లే ఆశ్రమ కర్మలు జ్ఞాన ఫలమునకై ఆవశ్యకములు కావు. కాని జ్ఞానప్రాప్తికై ఆవశ్యకములగును.

బ్రహ్మజ్ఞానము చేతనే మోక్షఫలము పొందఁబడును, కాని కర్మచేతకాదు. కర్మచే మనస్సు పవిత్రమగును. మఱియు పవిత్రమైన మనస్సునందు జ్ఞానోదయమగును.

కావున కర్మలు జ్ఞానమునకు పరోక్షసాధనములగుటచే అవి ఉపయుక్తములై యున్నవి.

ఒకవేళ జ్ఞానము – యజ్ఞము, దానము, తపస్సు మఱియు ఉపవాసముచే ఉత్పన్నమగునేని, శమదమాదులచే ప్రయోజనమేమి? దీనికి సూత్రకారుడు తర్వాతి సూత్రమునందు సమాధానము నొసంగును.

## 3-4-27 శమదమాద్యుపేతః స్యాత్తథాపితు తద్విధేస్తదం గతయా తేషా మవశ్యానుష్ఠేయత్వాత్

కాని జ్ఞానము నొందుటకు కర్మలావశ్యకము లేదను సిద్ధాంతము బృహదారణ్య కమునందున్నను, జ్ఞానమునకు సహకారములగుటచే శమదమాదులు అత్యావశ్యకముగా ఆచరింపఁబడవలయును.

శమదమాద్యుపేతఃస్యాత్ = శమదమాదులను సాధకులు కలిగి యుండ వలయును, తథాపి = ఐనను, తు = నిశ్చయముగా, తద్విధేః = అవి విధింపఁ బడుటచే, తదంగతయా = జ్ఞానమునకు సహకారములగుటచే, తేషామ్ = వాటి యొక్క అవశ్యానుష్ఠేయత్వాత్ = అవశ్యముగా ఆచరింపఁబడవలసి యుండుటచే.

బృహదారణ్యకమిట్లు నుడువును. “తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసాఽ నాశకేన” (బృ.ఉ. 4-4-22). బ్రహ్మజిజ్ఞాసువుకు యజ్ఞము విధింపఁబడినట్లీ వాక్యమునందేలాటి శబ్దములేదు.

కావున జ్ఞానము నాకాంక్షించు వానికి కర్మతో ఏలాటి పనిలేదని పూర్వపక్షి పలుకును.

ఇదికూడా ఇట్లుండవలయునని ప్రస్తుత సూత్రము నుడువును. జ్ఞానపిపాసువు శమదమాదులను కలిగియుండవలయును. ఏలననగా ఇదియంతయు జ్ఞానసాధనముగా ఈ క్రింది శ్రుతివాక్యమునందు విధింపఁబడినది. "తస్మాదేవం విచ్ఛాంతోదాంత ఉపరతస్తితిక్షుః సమాహితో భూత్వాత్మన్యేవాత్మానం పశ్యతి" (బృ.ఉ. 4-4-23).

శాసింపఁబడిన విషయమును నిశ్చయముగా ఆచరింపవలసియుండును. "తస్మాత్" అను శబ్దప్రయోగముచే ఈ వాక్యము విధిపూర్వకమైయున్నదని తెలియుచున్నది. ఏలననగా ఒకవేళ విధిలేకున్నచో స్తుతి అర్థరహితమగును.

ఇఁక మాధ్యందిన శ్రుతి "పశ్యతి"కి బదులుగా "పశ్యేత్" అను శబ్దమును ప్రయోగించును. కావున యజ్ఞయాగాదులు ఆవశ్యకములు కాకున్నను, శమదమాదులు ఆవశ్యకములై యున్నవి.

ఈ గుణములు విధింపఁబడుటచే అవి ఆవశ్యకముగా ఆచరింపఁబడవలయును. శమదమాదులు జ్ఞానమునకు అంతరంగ సాధనములై యున్నవి. ఇఁక యజ్ఞయాగాదులు జ్ఞానమునకు బహిరంగసాధనములైయున్నవి.

సూత్రమునందు పేర్కొనఁబడిన "ఆది" యను శబ్దముచే బ్రహ్మజిజ్ఞాసువు సత్యసంధత, దయ, తపస్సు, బ్రహ్మచర్యము, ప్రాపంచిక విషయ వైముఖ్యము, ఓర్పు, క్షమ, శ్రద్ధ, సమత్వము, కారుణ్యము ఇత్యాది సమస్త సద్గుణములను కలిగియుండవలయునని సూచింపఁబడినది.

# 7. సర్వాన్నానుమత్యధికరణము

## (28-31 సూత్రములు)

### 3-4-28 సర్వాన్నానుమతిశ్చ ప్రాణాత్యయే తద్దర్శనాత్

ప్రాణాపాయ సమయమునందు మాత్రమే అన్నిరకములగు ఆహారములను భుజింపవచ్చునని శ్రుతి నుడువుచున్నది.

సర్వాన్నానుమతిః = అన్నిరకములగు ఆహారములను భుజించుటకు అనుమతి, చ = కేవలము, ప్రాణాత్యయే = ప్రాణాపాయ సమయమునందు. తద్దర్శనాత్ = శ్రుతి ఇట్లు నుడువుచుండుటచే.

ఈ సూత్రము మఱియు తర్వాతి మూడు సూత్రములు ఏ రకమగు ఆహారమును స్వీకరింపవలయునో, అట్టి విషయమును సూచించుచున్నవి.

ఛాందోగ్యమిట్లు నుడువును. "నహవా ఏవం విది కించనానన్నం భవతి" (ఛాం. ఉ. 5-2-1). ఈ సర్వాన్నానుమతి ఒక విధియా? లేక విధ్యంగమా? లేక స్తుతియా? యని ఇచ్చట సంశయ మేర్పడుచున్నది.

ఈ వాక్యములోని క్రొత్తఁదన కారణముచే ప్రాణోపాసకునికై ఇది విధింపఁబడినదని పూర్వపక్షి పలుకును. ఇట్టి వాక్యము మరియొకచోట కానఁబడకుండుటచే, ఇది విధివంటి సత్తాను కలిగియున్నది.

ఈ సూత్రము దీనిని ఖండించి ఇది ఒక విధికాదు, కాని కేవలము సత్యమైన విషయమని వివరించును. విధియనెడి భావమే స్ఫురింపనప్పుడు విధియని పలుకుట యుక్తముకాదు. ఆజ్ఞార్థకమైన శబ్దములు కానఁబడకుండుటచే ఇది విధికాజాలదు. మానవుడు సమస్త పదార్థములను భుజించి జీర్ణించుకొనఁ గలుగునా? అట్లుకాదు. ప్రాణాపాయస్థితియందు మాత్రము నిషేధింపఁబడిన పదార్థమును భుజింపవచ్చును. ఆహారములేక మరణింపనున్నప్పుడు చాక్రాయణ (ఉషస్తి) ఋషి అట్లే యొనర్చెను. ఈ విషయమును శ్రుతి ఉల్లేఖించుచున్నది.

కాటక కారణముచే ఆకలిఁగొనియున్న ఉషస్తి ఋషి మరణింపనుండెను. అతడు మావటి వానివద్ద ఉచ్ఛిష్టములగు చిక్కుడు గింజలను భుజించెను. కాని అతనిచే సమర్పింపఁబడిన ఉచ్ఛిష్టమగు పానీయమును స్వీకరించుటకు నిరాకరించెను. ఆ ఋషి ఇట్లు పలికి తన ప్రవర్తనలోని నిర్దుష్టతను సమర్థించుకొనెను. "నవా అజీవిష్యమి మానఖాదన్", కామోమ ఉదపానమ్" (ఛాం.ఉ. 1-10-4).

దీనిచే "నహవా ఏవంవిది" (ఛాం. ఉ. 5-2-1) అను వాక్యము అర్థవాదమని తెలియుచున్నది.

## 3-4-29 అబాధాచ్చ

ఏలననగా ఆహారము పూజనీయమని పలుకు శ్రుతివాక్యములలో వైరుధ్యము లేదు.

అబాధాత్ = శ్రుతియందేలాటి వైరుధ్యము లేకుండుటచే, చ = మఱియు.

28 సూత్రమునందారంభింపఁబడిన విషయము కొనసాగుచున్నది.

ఇట్లు "ఆహార శుద్ధౌసత్త్వశుద్ధిస్సత్త్వశుద్ధౌధ్రువాస్మృతిః" (ఛాం. ఉ. 7-26-2) అనెడి శ్రుతివాక్యములకు తిరుగులేదు. పై వివరమును స్వీకరించినప్పుడు మాత్రమే ఛాందోగ్యోపనిషద్వాక్యమునకు వైరుధ్ధ్యముండదు. లేకున్నచో వైరుధ్ధ్యమేర్పడును.

అప్పుడు మాత్రమే ఇతర శ్రుతులకు నిరాటంక మేర్పడును. ఈ దృష్టి కోణముచేత మాత్రమే "ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః" అను శ్రుతివాక్యము అర్థవంతమగును.

శుద్ధమైన ఆహారమునకు విరుద్ధముగా శ్రుతియందేలాటి వాక్యము లేకుండుటచే సామాన్యముగా పరిశుద్ధమైన ఆహారమునే స్వీకరింపవలయును. "ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః" అను ఛాందోగ్యశ్రుతికి విరుద్ధమైన వాక్యము మరెచ్చటను లేదు.

అపవిత్రమైన ఆహారముచే బుద్ధి క్షీణించును. మఱియు సత్కార్యములకు ఆటంకమేర్పడును. కాని హృదయ పారిశుద్ధ్యమును మఱియు శుద్ధమైన బుద్ధిని కలిగియున్న ఋషి ఇట్టి ఆహారమును స్వీకరించును. అతని బుద్ధిబలము క్షీణింపక, అతడు పరిశుద్ధమైన జ్ఞానసమన్వితుడై యుండును.

## 3-4-30 అపి చ స్మర్యతే

ఇంతేకాకుండా స్మృతులు కూడా ఇట్లు నుడువుచున్నవి.

అపి = కూడా, చ = ఇంతేకాకుండా, స్మర్యతే = స్మృతి ఇట్లు నుడువుచున్నది.

పూర్వవిషయము కొనసాగుచున్నది. ప్రాణాపాయ సమయమునందు జ్ఞానియైనను, అజ్ఞానియైనను ఏలాటి ఆహారమునైనను స్వీకరింపవచ్చునని

స్మృతికూడా నుడువుచున్నది. "జీవితాత్యయమాపన్నోయోఽ న్నమత్తియత స్తతః లిప్యతే న సపాపేన పద్మపత్రమివాంభసా".

ఏకద్విరుద్ధముగా అపవిత్రమైన ఆహారము త్యజింపఁబడవలయునని అనేక వాక్యములు ప్రబోధించుచున్నవి. "మద్యం నిత్యం బ్రాహ్మణః త్యజేత్", "సురాపస్య బ్రాహ్మణస్యోష్ణామాసించేయుః", "సురాపాః కృమయో భవంత్యభక్ష్యభక్షణాత్".

దీనిచే మనకు తెలియఁబడు విషయమేమనగా మిక్కిలి కష్టదశయందు తప్ప మరియెుకప్పుడు సామాన్యముగా పరిశుద్ధమైన ఆహారమునే స్వీకరింపవలయును.

ఋషి ఏలాటి పదార్థమునైనను భుజింపవచ్చునని ఉపనిషత్తు పలికినప్పుడు కష్టదశయందు మాత్రమే అతడట్లు చేయవచ్చునను అర్థమును గైకొనవలయును. అపవిత్రమైన ఆహారమును భుజించుట కాదేశించినట్లు ఉపనిషద్వాక్యమును అన్వయ మొనర్చుకొనరాదు.

## 3-4-31 శబ్దశ్చాతోఽ కామకారే

కావున శ్రుతి అవినీతిని నిషేధించుచున్నది.

శబ్దః = శ్రుతివాక్యము, చ = మఱియు, అతః = కావున, అకామకారే = అవినీతిని నిషేధించుట యందు.

పూర్వవిషయము చర్చింపఁబడి, ఇచ్చుట పరిసమాప్త మొనర్పఁబడినది.

మానవుడు తన ఇచ్ఛానుసారముగా ఆహార పానీయములను స్వేచ్ఛగా సేవించుటను నిషేధించు శ్రుతివాక్యములున్నవి. "తస్మాద్బ్రాహ్మణః సురాం న పిబేత్" (కారక సంహిత) మనస్సును, ఇంద్రియముల నరికట్టి ఆత్మసాక్షాత్కారము నొందుటకై పరిపూర్ణమైన ఆధ్యాత్మిక శిక్షణ అత్యవసరమైయున్నది. ఈ విధమగు క్రమశిక్షణకై ఇట్టి శ్రుతివాక్యములు సాధనములై యున్నవి.

కావున ప్రాణోపాసకుడు విచక్షణరహితముగా అన్ని రకములగు ఆహారము లను స్వీకరించుటకై శ్రుతి ఆదేశించుటలేదను విషయము నిర్ధరింపఁబడినది. ఆహారపానీయములలో శ్రుతి స్వేచ్ఛను నిషేధించుటచే, 28వ సూత్రములోని శ్రుతివాక్యము కేవలము అర్థవాదమైయున్నదని తెలియుచున్నది.

ప్రాణాపాయమైన కష్టదశయందు మాత్రమే అన్నిరకములగు ఆహారములను సేవించు అనుమతి పరిమితమైయున్నది. సామాన్యవేళలలో మానవుడు శ్రుతి విధులను కచ్చితముగా ఆచరించవలసియుండును.

# 8. ఆశ్రమకర్మాధికరణము

## (32-35 సూత్రములు)

## 3-4-32 విహితత్వాచ్చా శ్రమ కర్మాపి

మోక్షకామి కానివాడు ఆశ్రమ ధర్మముల నాచరింపవలయును. ఏలననగా శ్రుతులచే అవి విధింపఁబడినవి.

విహితత్వాత్ = అవి విధింపఁబడుటచే, చ = మఱియు, ఆశ్రమకర్మ = ఆశ్రమ కర్తవ్యము, అపి = కూడా.

యజ్ఞయాగాది ధర్మకార్యములను ఎట్టివారు ఆచరింపవలయునో ఈ సూత్రము మఱియు తర్వాతి మూడు సూత్రములు మనకు తెలుపుచున్నవి.

ఆశ్రమ విధులు జ్ఞానసాధనములని 26వ సూత్రమునందు నిరూపింపఁబడినది. ఐతే మోక్షకాంక్ష లేనివారు కూడా ఈ విధులనేల ఆచరింపవలయును? అను ప్రశ్న ఇచ్చట ఉదయించును.

బ్రహచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమము లన్నింటికై ఈ విధులాదేశింపఁబడుటచే వీటిని ఆచరింపవలయునని ప్రస్తుత సూత్రము నుడువుచున్నది.

ఏదో ఒక ఆశ్రమమునందుండి మోక్షము నపేక్షింపని మానవుడు కూడా నిత్య కర్మలను అవశ్యకముగా ఆచరింపవలయును. "యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి" అనగా జీవించి యున్నంతకాలము మానవుడు అగ్నిహోత్రమును ఆహుతి యొనర్పవలయునని శ్రుతి నుడువుచున్నది.

## 3-4-33 సహకారిత్వేనచ

మఱియు జ్ఞానము నొందుటకు సాధనమగుటచేత కూడా ధర్మము నాచరింపవలయును.

సహకారిత్వేన = జ్ఞానసాధనమగుటచే, చ = మఱియు.

32వ సూత్రమునందారంభింపఁబడిన విషయము కొనసాగుచున్నది.

జ్ఞానము నుత్పన్న మొనర్చుటకు కర్మలు సహకరించునేగాని, తత్ఫలమగు మోక్షమునుఁబడయుటకు కాదు. మొదటి విషయమునందు కర్మ మఱియు ఫలములు నిత్య సంయోగ సంబంధమును కలిగియున్నవి. ఇఁక రెండవ విషయమునందవి అనిత్యసంయోగ సంబంధమును కలిగియున్నవి. బ్రహ్మజ్ఞానముచేత మాత్రమే మోక్షము పొందఁబడును.

ఆత్మజ్ఞానమునకు కర్మలు సహకరించును. ఆత్మ ప్రకాశమునకు సహకరించుటచే మోక్షము నాకాంక్షించువారు కూడా ధార్మిక కార్యముల నాచరింపవలసి యుండును. ఫలముల నుత్పన్నమొనర్చుటలో బ్రహ్మవిద్య స్వతంత్రమైయున్నది. కర్మ ఉపాసనకు కీలుబొమ్మ, లేక సహాయకము మాత్రమేనై యున్నది. కర్మలు జ్ఞానోత్పత్తికి సాధనములై యున్నవి.

## 3-4-34 సర్వథాపి త ఏవోభయ లింగాత్

రెండు విధములగు లింగములుండుటచే అన్ని విషయములలో ఒకే రకమగు కర్మల నాచరింపవలసియుండును.

సర్వథా = అన్ని విషయములలో, అపి = కూడా, త ఏవ = అవే కర్మల నాచరింపవలసియుండును, ఉభయలింగాత్ = రెండు విధములగు అనుమానాత్మక చిహ్నములుండుటచే.

పూర్వ విషయము కొనసాగుచున్నది. సూత్రములోని "అపి" శబ్దము "నిశ్చయము" మఱియు "కూడా" అను అర్థము నొసంగును. "సర్వథా, అపి" అను శబ్దములు "సర్వథా, ఏవ" అను శబ్దములకు సమానములై యున్నవి.

ఆశ్రమ విధుల ననుసరించి ఒనర్పఁబడు కర్మలు మఱియు జ్ఞానమునకు సహాయకములుగా ఒనర్పఁబడు కర్మలు రెండున్నూ విభిన్నములా? యనెడి ప్రశ్న ఉదయించును.

ఆశ్రమ విధుల ననుసరించిన కర్మలు లేక జ్ఞాన సహాయకములగు కర్మలతో ఒకేరకమగు అగ్నిహోత్రము మఱియు ఇతర కర్తవ్యములుండునని శ్రుతి స్మృతులు వక్కాణించుచున్నవని ప్రస్తుత సూత్రము నుడువుచున్నది.

బృహదారణ్యకమిట్లు నుడువును. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి" (బృ. ఉ. 4-4-22). వివిధ విషయములనుఁగూర్చి కర్మకాండ యందు విధింపఁబడిన యజ్ఞయాగాదులు జ్ఞానార్జన కొరకు కూడా ఆచరింపఁబడునని ఈ వాక్యము సూచించుచున్నది.

స్మృతికూడా ఇదే విషయము నుడువుచున్నది. "అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మకరోతియః (భ.గీ. 6-1). అట్టి విధ్యుక్త కర్తవ్యములే జ్ఞానోత్పత్తికి కారకము లగును.

ఇంతేకాకుండా "యస్యైతేష్టా చత్వారింశత్సంస్కారాః" అను స్మృతి వాక్యము వైదిక కర్మకు కావలసిన సంస్కారములను సూచించును. ఇట్లు సంస్కరింపఁ బడిన వానియందు జ్ఞానము ఉత్పన్నమగును.

గృహస్థాశ్రమమునకు సంబంధించిన కర్మలైనను లేక జ్ఞానప్రాప్తికై విధింపఁ బడిన కర్మలైనను ఏకమేనై యుండును. కాని వివిధములై యుండవు. ఏలననగా అవి గృహస్థులకు నిత్య కర్తవ్యముగను, సన్న్యాసికి తన ఉపాసనకు సహాయక కర్మగను అవశ్యాచరణీయములై యున్నవి.

కావున సూత్రకారుడు కర్మాభేదమునుఁగూర్చి న్యాయపూర్వకముగా బల పఱచుచున్నాడు.

## 3-4-35 అనభి భవంచ దర్శయతి

మఱియు బ్రహ్మచర్యానుస్ఠానపరుడు కామ క్రోధాదులకు వశుడుకాడని శ్రుతి నుడువుచున్నది.

అనభిభవం = వశుడు కాడు, చ = మఱియు, దర్శయతి = శ్రుతులు నుడువుచున్నవి.

ఇచ్చట పూర్వ ప్రసంగము పరిసమాప్తమైనది.

కర్మలు జ్ఞానమునకు సహకరించునను నిర్ణయమును బలపఱచుటకు మరియొక చిహ్నమును ఈ సూత్రము సూచించుచున్నది. బ్రహ్మచర్యాది సాధన సంపత్తిని కలిగియున్నవాడు కామ క్రోధాది వ్యవనములకు వశుడుకాడని శ్రుతి కూడా నుడువుచున్నది. "ఏషహ్యాత్మాన నశ్యతి యం బ్రహ్మచర్యేణాను విందతే"

(ఛాం.ఉ. 8-5-3). బ్రహ్మచర్యాది కర్మలు కూడా జ్ఞానసాధనములని ఈ వాక్యము సూచించుచున్నది. బ్రహ్మచర్యానుష్ఠానపరుడు కామము, క్రోధము, ఈర్ష్య, అసూయలకు గుఱికాఁజాలడు. అతని మనస్సు ఉద్రిక్తము కాకుండుటచే, అతడు జ్ఞాన ప్రాప్తినిఁ బడయఁజేయునట్టి నిరంతర ధ్యాననిష్ఠ యందుండఁ గలుగును.

ఇట్లు ఆశ్రమ నిర్వహణకు మఱియు జ్ఞానప్రాప్తికి కూడా కర్మలు ఆవశ్యకము లను విషయము నిర్ణయింపఁబడినది.

# 9. విధురాధికరణము

## (36-39 సూత్రములు)

### 3-4-36 అంతరాచాపితు తద్ దృష్టేః

మఱియు రెండు ఆశ్రమములకు మధ్యనున్న వ్యక్తులు కూడా జ్ఞానమున కర్హులే. ఏలననగా శ్రుతి ఇట్లు వచించుచున్నది.

అంతరా = ఆశ్రమ ధర్మములు లేనప్పుడు, చ = మఱియు, అపితు = కూడా, తద్ దృష్టేః = ఇట్టి విషయము శ్రుతియందు చూడఁబడుటచే.

మరల వివాహ మొనర్చుకొనని భార్యావిహీనులు, వివాహమొనర్చుకొనుటకు శక్తిలేని వ్యక్తులు, కొన్ని పరిస్థితులచే ప్రేమబంధమునందు ప్రవేశింపనివారు మఱియు ప్రపంచమును పరిత్యజింపనివారు 36 నుండి 39 సూత్రములలో చర్చింపఁబడుచున్నారు.

"తు" యను శబ్దము బ్రహ్మజ్ఞానోత్పత్తికి కర్మ ఆవశ్యకమని పలుకు పూర్వపక్షియొక్క మతమును ఖండించును. "చ" యను శబ్దము నిశ్చయత్వమును సూచించును.

ధనాభావ కారణముచే ఏదో యొక ఆశ్రమమునందు ప్రవేశింపఁ జాలనివారు, లేక భార్య చనిపోయినవారు జ్ఞానమునకర్హులా? కారా? యనెడి సంశయమిచ్చట కలుగును.

ఇట్టి విషయములు శ్రుతులయందు చూడఁబడుటచే వారు జ్ఞానమున కర్హులని

ప్రస్తుత సూత్రము నుడువుచున్నది. రైక్వుడు మఱియు వాచక్నుని పుత్రిక యైన గార్గివంటివారు బ్రహ్మజ్ఞానమునుఁ బడసినట్లు శ్రుతి వాక్యములు నుడువు చున్నవి. (ఛాం. ఉ. 4-1 మఱియు బృ.ఉ. 3-6-8).

భార్యారహితుడైన విదురుడు వానప్రస్థాశ్రమమును స్వీకరింపలేదు. ఆశ్రమ రహితుడైనను అతడు బ్రహ్మవిద్యయందు నిపుణుడై యుండెను. అతడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడై యుండెను.

"అంతరా" అనగా ఏలాటి ఆశ్రమమునకు సంబంధింపనివారగుటచే, వారు ఏలాటి ఆశ్రమ ధర్మములను నిర్వర్తింపకుందురు. అట్టివారు పూర్వజన్మయందిట్టి ధర్మములను నిర్వర్తించియుండుటచే ఈ జన్మయందు వివేక, వైరాగ్య సమన్వితులై యుందురు. వారు తమ పూర్వజన్మలయం దనుష్ఠించినట్టి సత్యము, తపస్సు, ప్రార్థన ఇత్యాదులచే మనశ్శుద్ధిని కలిగినవారై యుందురు. ఒకవేళ మానవుడు తన పూర్వజన్మలో ఆశ్రమధర్మములను నిర్వర్తించియున్నను అతనికా జన్మయందేదో యొక ప్రతిబంధ కారణముచే బ్రహ్మజ్ఞానము జనింపకపూర్వమే మరణించినచో, ఈ జన్మయందాతడు జ్ఞానఫలమునుఁబడయుటకై జన్మించును. ఒకానొక సాధువుయొక్క సాంగత్యమాత్రముచే అతనియందు బ్రహ్మజ్ఞానము సర్వతోముఖముగ వ్యక్తమగును. కావున ఇట్టి మానవుడు ఏలాటి కర్మల నొనర్పడు. సరికదా, ఏలాటి ఆశ్రమ ధర్మములను నిర్వర్తించు ఆవశ్యకత అతనికి లేకుండును.

## 3-4-37 అపిచ స్మర్యతే

ఈ విషయము స్మృతియందున్నూ చెప్పఁబడినది.

అపి = కూడా, చ = మఱియు, స్మర్యతే = స్మృతియందు చెప్పఁబడినది.

పూర్వప్రసంగము కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా చతుర్విధాశ్రమములకు సంబంధింపని వ్యక్తులుకూడా బ్రహ్మజ్ఞానము నొందవచ్చునని స్మృతులుకూడా పలుకుచున్నవి.

సంవర్తాదులు ఆశ్రమ ధర్మమును నిర్వర్తింపకుండా దిగంబరులై వెళ్ళి యోగులుగా మారిన విషయము మహాభారతాది ఇతిహాసములలో పేర్కొనఁ బడినది. భీష్మాచార్యులను కూడా ఇందులకు దృష్టాంతముగా చెప్పవచ్చును.

మను సంహిత ఇట్లు నుడువును: "అఖండ జపానుష్ఠానమాత్రముచే బ్రాహ్మణుడు విజయము నొందుననుట నిస్సంశయము. ఇతర విధ్యుక్త కర్తవ్యములను అతడాచరించినను, ఆచరింపకున్నను అది గణనీయము కాదు. అందఱితో స్నేహభావమును కలిగియున్నవాడే నిజమైన బ్రాహ్మణుడనఁబడును." (2-87).

కాని శ్రుతి స్మృతులలో పేర్కొనఁబడిన దృష్టాంతములు కేవలము లింగములు మాత్రమే. ఐతే తుది నిర్ణయమేమి? అట్టి నిర్ణయము తర్వాతి సూత్రమునందు నుడుపఁబడినది.

## 3-4-38 విశేషానుగ్రహశ్చ

మఱియు ప్రత్యేక క్రియలచే వారియందు జ్ఞానాభివృద్ధి కలుగును.

విశేష = ప్రత్యేకమైన, అనుగ్రహః = అనురాగము, చ = మఱియు.

(విశేషానుగ్రహః = పూర్వజన్మయందొనర్పఁబడిన ప్రత్యేక శుభకర్మానుగ్రహము).

పూర్వప్రసంగము కొనసాగుచున్నది.

ఇంతేకాకుండా జపము, ఉపవాసము మఱియు దైవపూజ ఇత్యాది కర్మలచే కలుగు ప్రత్యేక దైవానుగ్రహముచే బ్రహ్మజ్ఞానము పొందఁబడవచ్చును. లేక పూర్వజన్మలలో అతనిచే ఆశ్రమకర్మలు నెఱవేర్పఁబడి యుండవచ్చును.

నిజమునకు గృహస్థుడు కాని పత్నీరహితుడు జపము, ఉపవాసము, ప్రార్థన వంటి ప్రత్యేక కర్మలచే బ్రహ్మజ్ఞానమునుఁ బడయవచ్చును. ఇవి ఏలాటి ఆశ్రమమునకు సంబంధింపని వానికి విరుద్ధ ధర్మములు కావు.

స్మృతి ఇట్లనును. "జప్యేనైవతు సంసిద్ధ్యేద్బ్రాహ్మణోనాత్ర సంశయః కుర్యాదన్యన్న వాకుర్యాన్మంత్రో బ్రాహ్మణ ఉచ్యతే" (మనుసంహిత 2-87)

ఆశ్రమ ధర్మములు నిర్వర్తింపఁబడుటకు సాధ్యముకానిచో, ప్రార్థనచే జ్ఞానమునుఁ బడయవచ్చునని ఈ వాక్యము సూచించును.

స్మృతి కూడా ఇట్లు నుడువును. "అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాంగతిమ్" (భ.గీ. 6-45). పూర్వజన్మలయం దొనర్పఁబడిన అనేక పుణ్య కర్మ సముచ్చయముచే మానవుడు జ్ఞానోన్నతినిఁబడయునని ఈ వాక్యము సూచించుచున్నది.

కావున భార్యారహితులు మున్నగువారు జ్ఞానార్జన కర్హులే యను విషయము నందేలాటి వైరుధ్యము లేదు.

## 3-4-39 అతస్త్వి తరజ్యాయో లింగాచ్చ

శ్రుతి స్మృతులలోని లింగకారణముచే దీనికంటె ఒక ఆశ్రమమునకు చెంది యుండుట శ్రేష్ఠము.

అతః = పైన తెలుపఁబడిన మధ్యవర్తిత్వస్థితికంటె, తు = కాని, ఇతరత్ = ఒక ఆశ్రమమునకు చెందియుండుట, జ్యాయః = శ్రేష్ఠము, లింగాత్ = లింగ కారణముచే, చ = మఱియు.

పూర్వప్రసంగమిచ్చుట పరిసమాప్తమైనది.

"తు" యను శబ్ద ప్రయోగముచే సంశయము నివారింపఁబడినది. "చ" యను శబ్దము వినాయింపు అనెడి అర్థమునందు వాడఁబడినది.

రెండు ఆశ్రమములకు మధ్యనున్న వానికి జ్ఞానార్జన సాధ్యమైయున్నను, ఏదోయొక ఆశ్రమమునకు చెందియుండుట శ్రేష్ఠమైన సాధనమై యున్నది. అనుకూలములు ఎక్కువగా నుండుటచే ఏదోయొక ఆశ్రమమునందుండి ఆత్మజ్ఞానమును సాధించుటయే శ్రేష్ఠము.

ఈ విషయము శ్రుతిస్మృతులచేత కూడా అంగీకరింపఁబడినది. "బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన" (బృ.ఉ. 4-4-22). తేనైతి బ్రహ్మవిత్పుణ్య కృత్తైజసశ్చ" (బృ.ఉ. 4-4-9). ఇఁక స్మృతి ఇట్లనును: "అనాశ్రమీ నతిష్ఠేత దినమేకమపి ద్విజః, సంవత్సర మనాశ్రమీ స్థిత్వాకృచ్ఛ్రమేకం చరేత్"

# 10. తద్భూతాధికరణము

## 3-4-40 తద్భూతస్య నాతద్భావో జైమినేరపి నియమా తద్రూపా భావేభ్యః

కాని సన్న్యాసాశ్రమమును స్వీకరించినవాడు పూర్వాశ్రమములోనికి తిరిగి ప్రవేశింపకూడదు. ఇట్లు నిమ్నమైన ఆశ్రమమునందు ప్రవేశించుట నిషిద్ధమై యున్నది. ఈ విషయమును జైమినికూడా అంగీకరించును.

తద్భూతస్య = ఉన్నతమైన ఆశ్రమమును పొందినవానికి, తు = కాని, న = కాదు. అతద్భావః = ఆ స్థితినుండి పతనమగుట, జైమినేః = జైమినియొక్క మతము, అపి = కూడా, నియమాతద్రూపాభావేభ్యః = నియమము, అతద్రూపము, అభావముల వలన.

సన్న్యాసము స్వీకరించిన అనంతరము ఎవరైనను పూర్వాశ్రమమునకు తిరిగి వెళ్ళవచ్చునా? అను ప్రశ్నకిప్పుడు సమాధాన మొసంగఁబడుచున్నది.

అతడు తిరిగి పూర్వాశ్రమమునకు వెళ్ళరాదని ప్రస్తుత సూత్రము నుడువుచున్నది. జైమినికూడా ఈ విషయము నంగీకరించును.

ఇట్టి అవరోహణమును అంగీకరించునట్టి శ్రుతివాక్య మెచ్చటను లేదు. శ్రుతి స్పష్టముగా దీనిని నిషేధించుచున్నది. "అరణ్య మిదియాదితి పదం తతో న పునరేయాదిత్యుపనిషత్"

ఇది సామాన్య ధర్మమునకు విరుద్ధముకూడా నై యున్నది.

ఉపనిషత్తిట్లునుడువును. "అత్యంతమాత్మాన మాచార్యకులేఽ వసాదయన్" (ఛాం.ఉ. 2-23-1). "ఆచార్యేణాభ్య నుజ్ఞాతశ్చతుర్ణామేక మాశ్రమమ్, ఆ విమోక్షాచ్ఛరీరస్య సోఽ నువిష్ఠే ద్యథావిధి" ఉన్నతమైన ఆశ్రమ స్వీకరణనుఁగూర్చి ప్రబోధించు శ్రుతులు కలవు. "బ్రహ్మచర్యం సమాప్య గృహీభవేత్, బ్రహ్మచర్యా దేవప్రవ్రజేత్" (జా. ఉ. 4) కాని నిమ్నమైన ఆశ్రమములలోనికి అవరోహించు శ్రుతి వాక్యములు లేవు.

ప్రతి యొక్కరికై శాసింపఁబడినదేదో, అదియే ధర్మమనఁబడును. కాని ప్రతి యొక్కరికి శక్యమగుదానినిఁగూర్చి చెప్పునది ధర్మమనఁబడదు.

శ్రుతి ఇట్లు నుడువును. "అరణ్యమునకు వెళ్ళిన తర్వాత తిరిగి గృహస్థాశ్రమమునందు ప్రవేశింపరాదు. క్రతువును త్యజించిన సన్న్యాసి తిరిగి యజ్ఞాగ్నిని రగుల్కొలుపరాదు".

కావున సన్న్యాసాశ్రమమునుండి వెనుఁదిరిగి నిమ్నమైన ఆశ్రమములోనికి ప్రవేశింపరాదు.

# 11. అధికారాధికరణము

## (41-42 సూత్రములు)

## 3-4-41 నచాధికారికమపి పతనానుమానాత్తదయోగాత్

నైష్ఠిక బ్రహ్మచారి పతనమైనప్పుడు అతనికి ప్రాయశ్చిత్తము లేదు. ఏలననగా ప్రాయశ్చిత్తము నొనర్చుకొనుట కాతడు అసమర్థుడని స్మృతి సూచించుచున్నది.

న = కాదు, చ = మఱియు, అధికారమ్ = అధ్యాయమునందు పేర్కొనఁబడిన ప్రాయశ్చిత్తము, అపి = కూడా, పతనానుమానాత్ = స్మృతియందాతని పతనము పేర్కొనఁబడుటచే, తదయోగాత్ = ప్రాయశ్చిత్తము నొనర్చుకొనుటకు అతడసమర్థుడగుటచే.

పూర్వపు చర్చ కొనసాగుచున్నది ప్రస్తుత సూత్రము పూర్వపక్షియొక్క దృష్టి కోణమును వ్యక్త మొనర్చుచున్నది.

ఆజన్మ బ్రహ్మచర్యదీక్ష నవలంబించినట్టి నైష్ఠిక బ్రహ్మచారి పతనమైనచో, దానికి ప్రాయశ్చిత్తములేదని పూర్వపక్షి పలుకును. ఏలననగా అట్టివాని విషయమై ప్రాయశ్చిత్తకర్మ చెప్పఁబడలేదు. పూర్వమీమాంస 6-8-22 సూత్రమునందు చెప్పఁబడిన ప్రాయశ్చిత్తకర్మ శక్తిమంతమైనదికాదు. ఏలననగా అతడు యజ్ఞాగ్నిని రగుల్కొలుపవలసియుండుటచే, అతడు వివాహ మొనర్చుకొనవలసియుండును. అట్టి ఎడల అతడు నైష్ఠిక బ్రహ్మచర్యమునుండి పతనము కావలసివచ్చును.

కాని జీవితాంతమువరకు కాక, వివాహకాలమువరకు మాత్రము బ్రహ్మచర్యము నవలంబించునట్టి ఉపకుర్వాణ బ్రహ్మచారి మాత్రము ప్రాయశ్చిత్త కర్మచే పవిత్రుడు కాఁగలుగును. అతడధర్మకార్యము నొనర్చినచో, దానికి ప్రాయశ్చిత్తము కలదు.

## 3-4-42 ఉపపూర్వ మపిత్వే కే భావ మశన వత్తదుక్తమ్

కాని కొందఱు పాపమును అల్పముగా భావింతురు. కావున నైష్ఠిక బ్రహ్మచారికి కూడా ప్రాయశ్చిత్తము కలదని పలుకుదురు. ఇది నిషిద్ధమైన ఆహారమును భూజించుటవంటిది. ఈ విషయము పూర్వమీమాంసయందు వర్ణింపబడినది.

ఉపపూర్వమ్ = ఉపపాతకము, అపితు = కాని, ఏకే = కొందఱు పలుకుదురు. భావమ్ = ప్రాయశ్చిత్తముయొక్క ఉనికి, అశనవత్ = నిషేదింపఁబడిన ఆహారమును భుజించుటవలె, తత్ = ఇది, ఉక్తమ్ = పూర్వమీమాంసలో వర్ణింపఁబడినది.

పూర్వపు చర్చ కొనసాగుచున్నది.

నైష్ఠిక బ్రహ్మచారియైనను గురుపత్నీ గమనము తప్ప ఇతర విషయములలో పతనమైనప్పుడు అది ఉపపాతకమే యగుటచే సామాన్య బ్రహ్మచారులు తేనె, మాదకద్రవ్యము, మాంసము ఇత్యాది నిషేధాత్మక పదార్థములను సేవించినప్పుడు ప్రాయశ్చిత్తకర్మలచే పవిత్రులగునట్లు, వారి విషయమునందున్నూ ప్రాయశ్చిత్త కర్మలకు అవకాశమున్నదని కొందఱు ఆచార్యులు తలంతురు. ఆ పాపము ఆచార్యుని పడకగదిని భ్రష్టమొనర్చుటవంటి మహాపాతకములయం దొకటిగా పరిగణింపఁ బడదని వారు వాదింతురు. ప్రాయశ్చిత్తకర్మ నైష్ఠిక బ్రహ్మచారి మఱియు ఉపకుర్వాణ బ్రహ్మచారికిన్నీ వర్తించునని వారు వాదింతురు. ఉభయులున్నూ బ్రహ్మచారులగుటచే ఒకేరకమగు దోషము నొనర్తురని వారు పలుకుదురు.

గూరుపత్నీ గమన మొనర్చినప్పుడు మాత్రమే అది మహాపాతక మనఁబడును. ప్రాయశ్చిత్తమునకు యోగ్యమైన ఉపపాతకము పూర్వమీమాంసలోని జైమిని సూత్రము (1–3–8) నందు వివరింపఁబడినది.

నైష్ఠిక బ్రహ్మచర్యమునకు ప్రాయశ్చిత్తము లేదని చెప్పు స్మృతివాక్యము నైష్ఠిక బ్రహ్మచారులను హెచ్చరించుటకై చెప్పఁబడినది. అతడు జాగరూకుడై తన ధర్మమును నెఱవేర్చును. అఖండ బ్రహ్మచర్యము ద్వారా ఆత్మసాక్షాత్కారము నొందునట్లది అతనిని పురికొల్పును.

తపస్వి మఱియు సన్న్యాసి యొక్క విషయముకూడా ఇట్టిదేనై యున్నది. వానప్రస్థుడు మఱియు సన్న్యాసి ఉభయులకున్నూ స్మృతి ప్రాయశ్చిత్తమును విధించును. వానప్రస్థుడు వ్రత భంగ మొనర్చునేని అతడు పండ్రెండు రాత్రులు కృచ్ఛ్ర తపస్సునాచరించి, గడ్డి మఱియు వృక్షములతో కూడిన స్థలమును సారవంత మొనర్పవలసియుండును. సన్న్యాసికూడా సోమలతను సారవంత మొనర్చుట తప్ప, తన ఆశ్రమమున కనుకూలమగు ప్రాయశ్చిత్తము నొనర్చుకొనవలసియుండును.

# 12. బహిరధికరణము

## 3-4-43 బహిస్తూభయథాపి స్మృతే రాచారాచ్చ

కాని స్మృతి మఱియు ఆచారము ననుసరించి ఉభయ విధములుగా వారు సంఘమునుండి బహిష్కరింపబడవలయును.

బహిః = బయటకు, తు = కాని, ఉభయథా = మహాపాతకమైనను, ఉపపాతకమైనను, అపి = కూడా, స్మృతేః = స్మృతివాక్య కారణముచే, ఆచారాత్ = ఆచారము వలన, చ = మఱియు.

పూర్వ చర్చ ఇచ్చట పరిసమాప్తమైనది.

మహా పాతకము నొనర్చినవారైనను, ఉపపాతక మొనర్చినవారైనను ఇట్టి పాపులు శ్రేష్ఠులచే బహిష్కరింపఁబడవలయును. ఏలననగా శ్రుతి మఱియు ఆచారము రెండున్నూ వీరిని ఖండించును.

స్మృతి ఇట్లనును "అరూఢపతితం విప్రం మండలాచ్చ వినిః సృతమ్, ఉద్బుద్ధంకృమిదష్టంచ స్పృష్ట్వాచాంద్రాయణం చరేత్" శిష్టాచారముకూడా ఇట్టి వారిని ఖండించును. ఏలననగా శ్రేష్ఠులు ఇట్టి వారితో కలిసి యజ్ఞమొనర్పరు, అధ్యయన మొనర్పరు, వివాహములలో పాల్గొనరు.

# 13. స్వామ్యధికరణము

(44-46 సూత్రములు)

## 3-4-44 స్వామినః ఫలశ్రుతే రిత్యాత్రేయః

ఉపాసనా కర్తృత్వము యజ్ఞకర్తకు చెందును. ఏలననగా తత్ఫలమునుఁ గూర్చి శ్రుతి పేర్కొనినది. ఇది ఆత్రేయుని మతమై యున్నది.

స్వామినః = స్వామియొక్క, ఫలశ్రుతేః = ఫలమునుఁగూర్చి శ్రుతి వచించుటచే, ఇతి = ఇట్లు, ఆత్రేయ ఋషి పలుకును.

ఇది పూర్వపక్షియొక్క దృష్టి కోణమై యున్నది.

క్రతుకర్మల యొక్క యజ్ఞాంగములకు సంబంధించిన ఉపాసనల నాచరించు వాడు యజమానియా? లేక ఋత్విక్కా? యనెడి సంశయమిచ్చట కలుగును.

ఈ యుపాసనలకు ప్రత్యేక ఫలమును శ్రుతి విధించుటచే అవి యజమానిచేత అనుష్ఠింపఁబడవలయునని పూర్వపక్షియొక్క ప్రతినిధియగు ఆత్రేయ ఋషి నుడువును.

“వర్షతిహాస్మై వర్షయతి హయ ఏతదేవం విద్వాన్ వృష్టౌపంచవిధం సామో పాస్తే” (ఛాం. ఉ. 2-3-2)

కావున ఫలమును కలిగియున్నట్టి యజమాని మాత్రమే ఆ యుపాసనలకు కర్తయగును. ఇది ఆత్రేయ ఋషియొక్క అభిప్రాయమైయున్నది.

## 3-4-45 ఆర్త్విజ్య మిత్యౌడులోమి స్తస్మైహి పరిక్రీయతే

అవి ఋత్విక్కుయొక్క కర్తవ్యములని ఔడులోమియొక్క అభిమతమై యున్నది. ఏలననగా అతడు సమస్త యజ్ఞమునకు వేతన మొసంగఁబడును.

ఆర్త్విజ్యమ్ = ఋత్విక్కు యొక్క కర్తవ్యము, ఇతి = ఇట్లు, ఔడులోమిః = ఔడులోమి ముని తలంచును. తస్మై = దాని కొఱకు, హి = ఏలననగా, పరిక్రీయతే = అతనికి వేతన మొసంగఁబడును.

పూర్వప్రసంగము కొనసాగుచున్నది.

యజ్ఞాంగములనుఁగూర్చిన ఉపాసనలను యజమానుని యొక్క కార్యమని చెప్పు నిర్ణయము నిరాధారమైయున్నది.

కాని అవి ఋత్విక్కుచే ఒనర్పఁబడవలయునని ఔడులోమి పలుకును. ఏలననగా అతడు కర్మనిమిత్తమై నియోజింపఁబడును. ఋత్విక్కు తన కర్మల న్నింటికై వేతన మొసంగఁబడుటచే, అతని కర్మఫలము యజమానిచే క్రయ మొనర్పఁబడును. కావున ఉపాసనలు కూడా కర్మాచరణగనే గణింపఁబడును. ఏలననగా అవి యజమానికి అర్పమైన మండలమునకు చెందియున్నవి. అవి ఋత్విక్కుచే ఆచరింపఁబడవలయునేకాని, యజమానిచే కాదు.

ఇది ఔడులోమి ముని యొక్క దృష్టికోణమైయున్నది.

## 3-4-46 శ్రుతేశ్చ

మఱియు శ్రుతికూడా ఇట్లు పలుకుటచే.

శ్రుతేః = శ్రుతి నుండి, చ = మఱియు.

పూర్వప్రసంగమిచ్చట పరిసమాప్తమైనది. ఋత్విక్కు అంగోపాసన నొనర్పవలయును. కాని ఫలము యజమానికి చెందును.

"యాం వై కాంచనయజ్ఞ ఋత్విజ ఆశిషమాశాసత ఇతి యజమానాయైవతా మాశాసత ఇతి హోవాచ" (శత. బ్రా. 1-3-1-26). " తస్మాదుహైవం విదుద్గాతా బ్రూయాత్కంతే కామమాగాయాని" (ఛాం. ఉ. 1-7-8). ఋత్విక్కు కర్తగానున్న ఉపాసనలయొక్క ఫలము యజమానికి చెందునని శ్రుతివాక్యములు కూడా వెల్లడించుచున్నవి.

వీటన్నింటిచే యజ్ఞాంగములనుఁగూర్చిన ఉపాసనలు ఋత్విక్కుయొక్క కార్యమని రూఢియగుచున్నది.

కావున శ్రుతి వాక్యముల నాధారముగాఁ గొనియున్న ఔడులోమియొక్క దృష్టి కోణము సరియైయున్నది.

# 14. సహకార్యంతర విధ్యధికరణము

## (47-49 సూత్రములు)

## 3-4-47 సహకార్యంతరవిధిః పక్షేణ తృతీయం తద్వతో విధ్యాదివత్

జ్ఞానమునకు సహకరించు ఉపాసన యనెడి మరియొక విధి కూడా కలదు. ఇది పూర్ణజ్ఞానోత్పత్తికి పూర్వావస్థలగు బాల్యము మఱియు పాండిత్యము నతిక్రమించిన మూడవ పదార్థమై యున్నది. విధ్యాదులవలె ఇట్టి సన్యాసి జ్ఞానియని చెప్పఁబడును.

సహకార్యంతరవిధిః = ప్రత్యేకముగా సహకరించు ఒక విధి, పక్షేణ = పాక్షికముగా, తృతీయం = మూడవది, తద్వతః = జ్ఞానము కలిగియున్నవానికి విధ్యాదిపత్ = విధ్యాదులవలె.

ఈ సూత్రము బృహదారణ్యకోపనిషద్వాక్యమును పరీక్షించి, బ్రహ్మ సాక్షాత్కారమునకై ఆఖండ ధ్యానమును కూడా శ్రుతి విధించినట్లు నిశ్చయించును. శ్రుతి చతుర్విధాశ్రమములను విధించినట్లు ఈ సూత్రము మఱియు తర్వాతి రెండు సూత్రములు నిరూపించును.

మౌనము లేక నిదిధ్యాసనము సహకారముగా విధింపఁబడినది. స్వర్గకామి యగువానికి యజ్ఞములు విధింపఁబడినట్లు విశ్వవైచిత్ర్యమునకై పట్టు విడువని సన్న్యాసికి తృతీయమగు మౌనము విధింపఁబడినది.

"తస్మాద్ బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠా సేద్బాల్యంచ పాండిత్యం చ నిర్విద్యాథమునిరమౌనంచ మౌనంచ నిర్విద్యాథ బ్రాహ్మణః" (బృ. ఉ. 3-5-1).

ఇచ్చుట నిదిధ్యాసనము విధింపబడినదా? లేదా? యనెడి సంశయము కలుగును.

విధిని సూచించు శబ్దము లేకుండుటచే నిదిధ్యాసనము విధింపఁబడలేదని పూర్వపక్షి పలుకును. బాల్యావస్థ విషయమునందు విధ్యర్థకము ప్రయోగింప బడినను, ముని విషయమునం దిట్టి సూచన లేదు. శ్రుతి కేవలము అతడు ముని యగునని పలుకును. కాని బాల్యావస్థ మఱియు పాండిత్యము విషయము నందు "తిష్ఠాసేత్" అని ప్రయోగించును.

ఇంతేకాకుండా పాండిత్యము జ్ఞానమును సూచించును. కావున తిరిగి జ్ఞానమునే సూచించునట్టి మునిత్వమును అది చేర్చుకొనును. శ్రుతిలోని మునిత్వమునకు నూతనత్వము లేకుండుటచే దానికి విధ్యర్థక ప్రయోగము లేదు.

ఈ సూత్ర మీ దృష్టికోణమును ఖండించి, శ్రుతియందు మునిత్వము, బాల్యత్వము మరియు పాండిత్యమునకు భిన్నమైన మూడవ అంశముగా విధింపఁ బడినదని స్పష్టీకరించెను.

నిరంతరము బ్రహ్మోపాసన నొనర్చువాడు "ముని" యని చెప్పఁబడును. కావున బాల్యత్వము మఱియు పాండిత్యము ఇతఃపూర్వమే కలిగియున్న వానికి నిరంతర బ్రహ్మోపాసన తృతీయ సహాయక క్రియయైయున్నది; మఱియు ఇట్టి నిరంతర బ్రహ్మోపాసన, యజ్ఞము మఱియు ఇంద్రియ నిగ్రహాదులవలె ఆచరింపఁ బడవలయునని విధింపఁబడినది.

ఈ సూత్రము బృహదారణ్యకములోని ఒక వాక్యమును సూచించును. కహోలుని ప్రశ్నకు యాజ్ఞవల్క్యముని సమాధాన మొసంగునప్పుడు మొదట పాండిత్యము, బాలునివంటి సరళ స్వభావమును పేర్కొనిన అనంతరము బ్రహ్మ సాక్షాత్కారమునకై మూడవదగు నిరంతర బ్రహ్మోపాసనను కూడా విధించెను. ఈ మూడవ అంశమునందు ఆజ్ఞార్థకము విధింపఁబడకున్నను, ఇతరాంశములలోని విధులవలె దీనికి కూడా విధిని ఊహింపవలసియుండును.

నిరంతర బ్రహ్మోపాసనయే మునిత్వ మనఁబడును. కావున అది పాండిత్యము నకు భిన్నమైయున్నది. ఇది అపూర్వమైయున్నది. ఇది ఇతఃపూర్వము సూచింపఁ బడలేదు. కావున ఈ వాక్యమునకు ఆజ్ఞార్థక విలువ యున్నది. ఆత్మైకత్వమును సాధింపని కారణముచే నానాత్వమును సందర్శించునట్టి సన్న్యాసికి నిరంతర బ్రహ్మోపాసన మిక్కిలి లాభకారియై యున్నది.

జ్ఞానమునకు సహాయకారిగా మునిత్వము విధింపఁబడినది.

## 3-4-48 కృత్స్నభావాత్తు గృహిణోప సంహారః

అతనియందన్నియు ఉండుటచే గృహస్థునితో ప్రకరణము ఉపసంహరింపఁ బడినది.

కృత్స్నభావాత్ = గృహస్థజీవనమునం దన్నియును అంతర్భూతమై యుండు టచే, తు = నిశ్చయముగా, గృహిణా = గృహస్థునిచే, ఉపసంహారః = ప్రకరణోప సంహారము.

సమస్త ధర్మసమన్వితుడగుటచే గృహస్థునితో శ్రుతి ఆమోదింపఁబడినది. అతడు కష్టతరములగు యజ్ఞముల నాచరింప వలసియుండును. మఱియు అహింస, ఆత్మ నియంత్రణాదుల ననుష్ఠించవలసియుండును. గృహస్థాశ్రమ జీవనమునందు ఇతరాశ్రమ ధర్మములన్నియును ఇమిడియుండుటచే, గృషస్థాశ్రమ ధర్మవివరముతో ఈ ప్రకరణము అంతమొదింపఁబడినది.

ఛాందోగ్యోపనిషత్తు గృహస్థాశ్రమముతో అంతమొందింపఁబడును. ఏల ననగా ఈ యాశ్రమమునందు ఇతరాశ్రమములన్నియును ఇమిడియున్నవి. "ఆచార్య కులాద్వేద మధీత్య యథావిధానం గురోః కర్మాతి శేషేణాభి సమావృత్య కుటుంబే శుచౌదేశే స్వాధ్యాయ మధీయానో ధార్మికాన్విద ధదాత్మని సర్వేంద్రియాణి

సంప్రతిష్ఠాప్యాహిం సంత్సర్వభూతాన్యన్యత్ర తీర్థేభ్యస్స ఖల్వేవం వర్తయన్యావ దాయుషం బ్రహ్మలోక మభిసంపద్యతేన చ పునరావర్తతేన చ పునరావర్తతే" (ఛాం. ఉ. 8-15-1).

"తు" యను శబ్దము గృహస్థాశ్రమమే సమస్తమను విషయమును బలపరచుటకు ప్రయోగింపఁబడినది. కష్టపరంపరలతో కూడిన తన స్వంత ఆశ్రమమునకు సంబంధించిన కర్తవ్యముల నెన్నింటినో అతడు నెఱవేర్చును. దీనితో పాటు ఇతరాశ్రమ కర్తవ్యములగు భూతదయ, ఇంద్రియ నిగ్రహము, స్వాధ్యాయము మున్నగు వాటిని అతడనుష్ఠింపవలసియుండును. కావున గృహస్థాశ్రమముతో ఛాందోగ్యము సమాప్తమగుటలో విరోధములేదు.

గృహస్థాశ్రమ జీవితము మిక్కిలి ప్రధానమైనది. గృహస్థాశ్రమమునందు దాదాపు సమస్తాశ్రమములయొక్క కర్తవ్యములుండును. బ్రహ్మచర్యాశ్రమ ధర్మములను వివరించిన అనంతరము శ్రుతి గృహస్థాశ్రమ ధర్మములను వివరించి సన్న్యాసాశ్రమ ధర్మములను వివరించుటకు పూర్వమే అది అంతమగును. ఇది గృహస్థాశ్రమ ప్రాధాన్యతను సూచించుటకే కాని, సన్న్యాసాశ్రమము చతుర్విధాశ్రమములలో ఒకటి కాదని నిరూపించుటకు కాదు.

## 3-4-49 మౌనవదిత రేషా మప్యుపదేశాత్

ఏలననగా ముని లేక సన్న్యాసాశ్రమమునకు వలెనే శ్రుతి ఇతరములగు బ్రహ్మచర్యము మఱియు వానప్రస్థములను కూడా పేర్కొనినది.

మౌనవత్ = సన్న్యాసాశ్రమమునకు వలె, ఇతరేషామ్ = ఇతరాశ్రమములకు, అపి = కూడా, ఉపదేశాత్ = శ్రుతి విధించుటచే.

సమస్తాశ్రమ ధర్మములను పాలించుటకై శ్రుతి నుడువుచున్నదని ఈ సూత్రము సూచించుచున్నది.

సన్న్యాసము మఱియు గృహస్థాశ్రమములను శ్రుతి విధించినట్లే, అది వానప్రస్థము మఱియు బ్రహ్మచర్యాశ్రమములను కూడా విధించును. ఏలననగా మేము ఇతఃపూర్వమే "తప ఏవద్వితీయో బ్రహ్మ చార్యాచార్య కులవాసీ తృతీయః" (ఛాం. ఉ. 2-23-1) వంటి వాక్యములను పేర్కొనియున్నాము. శ్రుతియందు చతుర్విధాశ్రమములు సమానముగా ప్రబోధింపఁబడుటచే, అవి వరుసగా ఆచరింపఁబడవలయును.

కేవలము రెండాశ్రమములనుఁగూర్చి పలుకునప్పుడు సూత్రము "ఇతరముల" నెడి బహువచనమును ప్రయోగించుటచే, ఆ రెండింటి యొక్క ఉపవర్గములుఁగాని, లేక వాటి కష్టప్రదమైన కర్తవ్యములుఁగాని సూచింపఁ బడుచున్నవి.

# 15. అనావిష్కారాధికరణము

## 3-4-50 అనావిష్కుర్వన్న న్వయాత్

అన్వయానుసారముగా తనకు తాను వ్యక్తము కాకుండుటయే బాల్యత్వమనఁ బడును.

అనావిష్కుర్వన్ = తనకు తాను వ్యక్తము కాకుండా, అన్వయాత్ = అన్వయానుసారముగా.

47వ సూత్రములో పేర్కొనఁబడిన బృహదారణ్యక వాక్యములోని "బాల్యేన" అను పదమున కర్థము బాలుని వంటి పట్టు విడువనితనము కాదని ఈ సూత్రము నుడువుచున్నది.

47వ సూత్రములోని బృహదారణ్యక వాక్యమునందు జ్ఞానము నాకాంక్షించు ముముక్షువు కొఱకు బాల్యత్వము విధింపఁబడినది. "తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్" (బృ. ఉ. 3-5-1) ఈ వాక్యమునకు నిజమైన అర్థమేమి?

ఇచ్చట బాల్యత్వమనగా పవిత్రత - అపవిత్రత తెలియకుండుట, ఏదోయొక స్థలమునందు మలమూత్రములను విసర్జించుట, తన ఇష్టానుసారముగా భుజించుట, ప్రవర్తించుట, మాట్లాడుట ఇత్యాది కార్యముల నొనర్చుటయా? లేక అంతఃకరణ శుద్ధిని కలిగియుండుట అనగా:- మోసము, దుర్మదము, అహంకారము, కామవాసన ఇత్యాదులు లేకుండుటయా? యనెడి సంశయము కలుగును.

మొదటిది జ్ఞానమునకు హానికరమైనదగుటచే, రెండవ దానినే స్వీకరింప వలయునని ప్రస్తుత సూత్రము నుడువును. అనగా సాధకుడు మోసము, గర్వము, అహంకారము ఇత్యాదులనుండి విముక్తుడై యుండవలయును. అతడు అవాంఛనీయములగు దుర్గుణములను వ్యక్త మొనర్పరాదు. ఆడంబరముకొరకై అతడు జ్ఞానము, పాండిత్యము మఱియు ధార్మికతను ప్రదర్శింపరాదు. ఇంద్రియశక్తులు బలపడని

బాలుడెట్లు ఇతరుల ఎదుట తన గొప్పఁదనమును ప్రదర్శింపడో, అట్లే ముముక్షు వున్నూ తన పాండిత్యము, విజ్ఞానము మఱియు మంచితనమును ప్రచురించి, ప్రకటించుకొనరాదు. పవిత్రత మఱియు అమాయకత్వము జ్ఞానమునకు సహకరించుటచే, ఈ సందర్భమునందు ఈ యర్థము మాత్రమే అన్వయించును.

అప్పుడు మాత్రమే బ్రహ్మసాక్షాత్కారమే ముఖ్యాంశముగాఁగల సమస్తమైన అధ్యాయముతో ఈ వాక్యమునకు సంబంధమేర్పడును. నిరాడంబరముగా నుండుట అత్యావశ్యకమై యున్నది. ఏలననగా అప్పుడు మాత్రమే సిద్ధాంతముతో అన్వయ మేర్పడును.

స్మృతి కర్తలు ఇట్లు నుడివిరి. “యం న సంతం న చాసంతం నా శ్రుతం న బహుశ్రుతమ్ । న సువృత్తం దుర్వృత్తం వేదకశ్చిత్స బ్రాహ్మణః ॥ గూఢధర్మాశ్రితో విద్వానజ్ఞాత చరితం చరేత్ । అంధవజ్జడవచ్చాపి మూకవచ్చ మహీంచరేత్” మఱియు “అవ్యక్తలింగోఽ వ్యక్తాచారః” ఇత్యాది స్మృతి వాక్యములున్నూ కలవు.

# 16. ఐహికాధికరణము

## 3-4-51 ఐహికమప్య ప్రస్తుత ప్రతిబంధే తద్దర్శనాత్

ఒకవేళ సాధన పథమునం దాటంకము లేకున్నచో ఈ జీవితమునందే జ్ఞానోదయము కలుగును. ఏలననగా ఇట్లు శ్రుతులు నుడువుచున్నవి.

ఐహికమ్ = ఈ జీవితమునందు, అపి = కూడా, అప్రస్తుత ప్రతిబంధే = సాధన పథమునం దాటంకము లేకున్నచో, తద్దర్శనాత్ = శ్రుతి ఇట్లు నుడువుటచే.

బ్రహ్మవిద్యకు ఫలమగు బ్రహ్మసాక్షాత్కారము నొందుట ఈ జీవితముండగనే సాధ్యమగునా? లేక, మరణపర్యంతము వేచియుండవలయునా? యను విషయమును ఈ సూత్రము సూచించుచున్నది.

ప్రస్తుత పాదములో 26వ సూత్రమునుండి నానావిధములగు జ్ఞానసాధన ములు చర్చింపఁబడినవి.

ఈ సాధనాఫలమగు జ్ఞానము ఈ జీవితమునందే లభ్యమగునా? లేక, మరియొక జన్మయందు లభించునా? యని ఇప్పుడు ప్రశ్నింపఁబడుచున్నది.

ఒకవేళ బాహ్యకారణములచే ఏలాటి ఆటంకమేర్పడకున్నచో, ఈ జన్మయందే జ్ఞానోదయమగునని ఈ సూత్రము నుడువుచున్నది. జ్ఞానఫలము ఉత్పన్నమగు సందర్భమునందది, మరియొక శక్తిమంతమగు కర్మఫలముచే అడ్డగింపఁబడును. ఇట్టి ఆటంకమేర్పడినప్పుడు జ్ఞానము మరియొక జన్మయందు ఉత్పన్నమగును.

ఈ కారణముచేతనే ఆత్మను గుర్తెఱుంగుట కష్టప్రదమని శ్రుతి కూడా నుడువుచున్నది. "శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యః శృణ్వంతోఽపి బహవోయం న విద్యుః, ఆశ్చర్యోవక్తా కుశలోఽస్యలబ్ధాశ్చర్యోజ్ఞాతా కుశలాను శిష్టః" (కఠ.ఉ. 1-2-7).

గీత కూడా ఇట్లు నుడువును: "తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహికమ్, యతతేచ తతో భూయ స్సంసిద్ధౌ కురునందన" (భ.గీ. 6-43). "ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః. అనేక జన్మ సంసిద్ధ స్తతోయాతి పరాం గతిమ్" (భ.గీ. 6-45)

ఇంతేకాకుండు వామదేవుడు తన మాతృగర్భమునందే బ్రహ్మముతో తాదాత్మ్యము నొందెనని శ్రుతి పలుకును. దీనిచే మొదటి జన్మలోని సాధనాఫలమగు జ్ఞానము రెండవ జన్మయందు పొందఁబడునని తెలియుచున్నది. ఏలననగా గర్భములోని బాలుడు ఆ దశయందు సాధన నొనర్పఁజాలడు.

కావున ఆటంకములు అంతర్ధానమగునప్పుడు ఈ జన్మలోఁగాని, మరు జన్మలోఁగాని జ్ఞానోదయమగునని నిశ్చయింపఁబడినది.

# 17. ముక్తిఫలాధికరణము

## 3-4-52 ఏవం ముక్తి ఫలానియమస్త దవస్థావధృతే స్తదవ స్థావధృతేః

ఆ స్థితి నిర్వికారమైనదని శ్రుతి నిశ్చయించుటచే, జ్ఞానఫలమగు ముక్తి విషయమునందు ఒక నిశ్చితమైన నియమము లేదు.

ఏవం = ఇట్లు, ముక్తి ఫలానియమః = జ్ఞానఫలమగు ముక్తి విషయము నందొక నియమములేదు, తదవస్థావధృతేః = ఆ స్థితినిఁ గూర్చి శ్రుతి నిశ్చయిం చుటచే.

ఆటంకముల యొక్క ఉనికి లేములనుఁ బట్టియు మఱియు సాధన సంపత్తి యొక్క తీవ్రతనుఁ బట్టియు జ్ఞానము ఈ జన్మయందుఁ గాని లేక మరొక జన్మ యందుఁ గాని ఫలవంతమగునని పూర్వసూత్రమునందు చెప్పఁబడినది.

అదేవిధముగా జ్ఞానఫలమగు మోక్షము నొందుటకు కూడా ఏదోయొక నియమముండవచ్చుననెడి సంశయమిచ్చట కలుగును. జ్ఞానోదయానంతరము మోక్షము నొందుటకు ఆలస్యమగునా? సాధకుని యోగ్యతలనుఁ బట్టి జ్ఞానమునందు తరతమ భేదములుండునా? జ్ఞానుల అర్హతలనుఁ బట్టి మోక్షఫలమునందు కూడా ఇట్టి భేదమునకు అవకాశముకలదా? యనెడి సంశయము కలుగవచ్చును.

మోక్షవిషయమునందిట్టి నియమములేదని ఈ సూత్రము నుడువును. ఏలననగా వేదాంత గ్రంథములన్నియును మోక్షావస్థను ఏకరీతిగా నిరూపించినవి. కేవల బ్రహ్మమే మోక్షావస్థ యనఁబడును. మఱియు బ్రహ్మము నానావిధ రూపము లతో సంబంధమును కలిగియుండును. ఏలననగా అనేక శ్రుతివాక్యములు దానిని ఏకరీతిగా నిరూపించియున్నవి.

"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" బ్రహ్మము నిష్కళమై యుండుటచే, దానియందు నానాత్వము లేదు.

ఏకైక స్వరూపము నిశ్చయింపఁబడుటచే, మోక్షఫలమునందు నానాత్వము లేదు. జ్ఞానము, లేక బ్రహ్మవిద్యనుఁ బడయఁజేయునట్టి సాధనశక్తి యందు భేదముండవచ్చును. సాధనశక్తి ననుసరించి త్వరగా లభించినను, లేక ఆలస్యముగా పొందఁబడినను బ్రహ్మవిద్య స్వయముగా ఏకరీతిగా నుండును. బ్రహ్మవిద్యచే పొందఁబడు మోక్షస్వరూపమునం దేలాటి భేదముండదు. కర్మోపాసనాఫలము (సగుణ విద్య)లలో భేదముండవచ్చును. కాని నిర్గుణవిద్య ఏకైకమై యున్నది. మఱియు దాని ఫలమగు మోక్షము అన్ని విషయములలో ఏకరీతిగా నుండును.

సగుణ బ్రహ్మమునందువలె గుణములున్నప్పుడే భేదభావ మేర్పడును. విద్యా విభేదమునుఁబట్టి అనుభవములలో విభేదములుండవచ్చును. కాని నిర్గుణ బ్రహ్మము మాత్రము ఏకైకమైయుండునేఁగాని, అనేకత్వమును కలిగియుండదు.

జ్ఞానమును సాధించు వ్యక్తియొక్క శక్తి ననుసరించి జ్ఞానము హెచ్చు తగ్గులుగా

సాధింపఁబడవచ్చును. కాని జ్ఞాన ఫలమగు మోక్షమునందు హెచ్చు తగ్గులుండవు. ఏలననగా మోక్షము సాధింపబడునదికాదు. కాని జ్ఞానముద్వారా శాశ్వతత్వము నందు సుస్థిరుడగుటయే! మోక్షమనఁబడును.

జ్ఞానమునందు హెచ్చు తగ్గులుండవు. ఏలననగా అది స్వాభావికముగా కేవలము ఉన్నతోన్నతమైయున్నది. ఒక వేళ అది నిమ్నమై యుండునేని, అది జ్ఞానమనఁబడజాలదు. స్వల్పకాలమునందును, దీర్ఘకాలమునందును వ్యక్త మగుటనుఁబట్టి జ్ఞానమునందు విభేదముండవచ్చును; కాని మోక్షమునందు హెచ్చుతగ్గులుండుట అసాధ్యము. జ్ఞానమునందు విభేదములేని కారణముచేత కూడా జ్ఞాన ఫలమగు మోక్షమునందున్నూ భేదములేదని తెలియుచున్నది.

జ్ఞాన ప్రకాశము కలిగిన అనంతరము మోక్షప్రాప్తియందేలాటి ఆలస్య ముండదు. ఏలననగా బ్రహ్మజ్ఞానమే మోక్షమని చెప్పఁబడును.

"తదవస్థావధృతేః" యను వాక్యాంశము రెండుమార్లు ఉచ్చరింపబడుట, అధ్యాయము అంతమగుటను సూచించును.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**తృతీయాధ్యాయ చతుర్థపాదము**

**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## 4వ అధ్యాయము

## 1వ పాదము

## ఫలాధ్యాయము

# పీఠిక

తృతీయాధ్యాయమునందు పరాపరవిద్యలకు సంబంధించిన సాధనలు చర్చింపఁబడినవి. చతుర్ధాధ్యాయమునందు బ్రహ్మప్రాప్తిచే కలుగు పరమానంద ఫలమునుఁగూర్చి చర్చింపబడును. దానితోపాటు ఇతర విషయములు కూడా చర్చింపఁబడును. ప్రారంభమునందుకొన్ని అధికరణములలో మాత్రము విభిన్నమైన జ్ఞాన సాధనములు చర్చింపఁబడినది. పూర్వము చర్చింపగా మిగిలిన సాధన మాత్రము ఆదియందు నుడువఁబడినది. ఈ యధ్యాయము యొక్క ముఖ్యాంశము బ్రహ్మవిద్యాఫలమగుటచే ఇది “ఫలాధ్యాయమ” ని చెప్పఁబడినది.

# సార సంగ్రహము

**1వ అధికరణము (1–2 సూత్రములు) :–** శ్రుతియందు విధింపఁబడిన ఆత్మోపాసన కేవలము ఒకే పర్యాయము ఆచరింపఁబడు క్రియ కాదు. కాని జ్ఞానప్రాప్తి పర్యంతము మరల మరల ఆచరింపఁబడవలయును.

**2వ అధికరణము (3వ సూత్రము) :–** బ్రహ్మోపాసనయందు నిమగ్నుడై యున్న ఉపాసకుడు దానిని తనకు అభిన్నముగా తలంపవలసియుండును.

**3వ అధికరణము (4వ సూత్రము) :–** "మనోబ్రహ్మేత్యుపాసీత" వంటి ప్రతీకోపాసనలలోని చిహ్నములను ఉపాసకుడు తనకు అభిన్నములుగా తలంపఁ రాదు.

**4వ అధికరణము (5వ సూత్రము) :–** ప్రతీకోపాసనలలో ప్రతీకములను సాక్షాత్ బ్రహ్మముగా తలంపవలయును. కాని తద్భిన్నముగా తలంపరాదు.

**5వ అధికరణము (6వ సూత్రము) :–** కర్మాంగోపాసనములలో దివ్యత్వము ఆరోపింపఁబడుట, లేక ఆరోపింపఁబడకపోవుటను సూచించును. దృష్టాంతముగా ఉద్గీథమును ఆదిత్యునిగా తలంపఁవలయునేఁగాని, ఆదిత్యుని ఉద్గీథముగా తలంపరాదు.

**6వ అధికరణము (7–10 సూత్రములు) :–** కూర్చుండియే ధ్యానసాధనల నొనర్చవలయును. సమ్యగ్దర్శనము నొందదలంచు ఉపాసకులకు ఈ నియమము వర్తించదని శ్రీ శంకరుల అభిమతము. కాని ఈ సూత్రమునందా విషయము సూచింపఁబడలేదు.

**7వ అధికరణము (11వ సూత్రము) :–** మానసికధారణకు అనుకూలములై యున్నచో ఏ స్థలమునందైనను ఏ సమయమునందైనను ఉపాసనలను అనుష్ఠింప వచ్చును.

**8వ అధికరణము (12వ సూత్రము) :–** మరణ పర్యంతము ఉపాసనలను కొనసాగింపవలయును. కాని సమ్యగ్దర్శనము నొందించు ఉపాసనలకు వినా యింపు కలదని శ్రీ శంకరుల అభిమతమై యున్నది.

**9వ అధికరణము (13వ సూత్రము) :–** బ్రహ్మజ్ఞానముచే భూతభవిష్యత్తుల లోని సమస్త పాపకర్మలు నశించును.

**10వ అధికరణము (14వ సూత్రము) :–** అదేవిధముగా బ్రహ్మజ్ఞాని పుణ్యకర్మలచేత కూడా ప్రభావితుడు కాడు.

**11వ అధికరణము (15వ సూత్రము) :–** అనారబ్ధకార్యములు మాత్రమే జ్ఞానముచే నశింపఁజేయఁబడును. కాని ఆరబ్ధకార్యములు నశింపఁజేయబడవు.

**12వ అధికరణము (16, 17 సూత్రములు) :–** 10వ అధికరణమునందు నుడువఁబడిన నియమము అగ్నిహోత్రాది నిత్యకర్మలకు వర్తించదు. ఏలననగా అవి జ్ఞానోదయమునకు దోహదములైయున్నవి.

**13వ అధికరణము (18వ సూత్రము) :–** ఉపాసనారహితములగు క్రతు కర్మలు కూడా జ్ఞానోత్పత్తికి సహకరించును.

**14వ అధికరణము (19వ సూత్రము) :–** ప్రారబ్ధక్షయానంతరము బ్రహ్మజ్ఞాని బ్రహ్మముతో ఏకత్వము నొందును. శంకర మతానుసారముగా సూత్రములోని భోగము ప్రస్తుత సాధకునికి వర్తించును. ఏలననగా అతనిచే పొందఁబడిన పూర్ణ జ్ఞానముచే అజ్ఞానము నశించును. లేనిచో అది భవిష్యజ్జన్మలకు కారణమగును.

# 1. ఆవృత్త్యధికరణము

## (1-2 సూత్రములు)

### 4-1-1 ఆవృత్తి రసకృదుపదేశాత్

శ్రుతులు మరల మరల నుడువుటచే బ్రహ్మమునుఁగూర్చి శ్రవణమనన నిదిధ్యాసనల నొనర్చుట అత్యావశ్యకమై యున్నది.

ఆవృత్తిః = మరల మరల బ్రహ్మోపాసన నొనర్చుట ఆవశ్యకమైయున్నది. అసకృత్ = అనేకమార్లు, ఉపదేశాత్ = శ్రుతులు ఉపదేశించుటచే.

నిరంతరము ధ్యానము సభ్యసించుట ఆవశ్యకమైయున్నదని ఈ సూత్రము సూచించుచున్నది. శ్రుతియందు ప్రబోధింపబడుటచే తఱచుగా బ్రహ్మోపాసన నొనర్చుట ఆవశ్యకమైయున్నది.

"ఆత్మావా ఆరేద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" (బృ.ఉ. 2-4-5) "తమేవ ధీరోవిజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత" (బృ.ఉ. 4-4-21) "సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసి తవ్యః" (ఛాం.ఉ. 8-7-1).

వీటియందు సూచింపఁబడిన మనన నిదిధ్యాసనలను ఒకే పర్యాయ మొనర్ప వలయునా? లేక మాటిమాటికి ఒనర్పవలయునా? యను సంశయమిచ్చట కలుగును.

ప్రయాజాద్యాహుతులవలె అది ఒకే పర్యాయము ఆచరింపఁబడవలయునని పూర్వపక్షి పలుకును.

శ్రుతి పలికిన దానినే మనమిచ్చట ఉదహరింతుముఁగాక! "సకృచ్ఛ్రవణం సకృన్మననం సకృన్నిదిధ్యాసనం చేతినాతిరిక్తమ్".

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి బియ్యమగునంతవరకు వడ్లు దంపఁబడునట్లు, బ్రహ్మజ్ఞానము కలుగునంతవరకు శ్రవణాదులను మాటిమాటికి

ఒనర్పవలయునని పలుకును. బ్రహ్మజ్ఞానోదయమగునంతవరకు వాటిని పునః పునః ఆచరించుట ఆవశ్యకమై యున్నది. మానసికవృత్తులగు మనన నిదిధ్యాసనము లను మాటి మాటికొనర్చుటచే అది ప్రత్యక్ష ఆత్మ సాక్షాత్కారము నొందింపఁజేయును. ఈ విషయమై శ్రుతి మరల మరల ప్రబోధించుటచే వీటిని పునఃపునః ఆచరింప వలసియుండును.

ఇట్లు ఛాందోగ్యోపనిషత్తునందాచార్యుడు తొమ్మిదిమారులు "తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో" (ఛాం.ఉ. 6-8-7) అని ఉచ్చరించెను. ఇచ్చట బ్రహ్మమునుఁగూర్చి శ్వేతకేతువు తొమ్మిదిమార్లు ప్రబోధింపబడెను.

ప్రయాజ దృష్టాంతము దోషపూరితమైయున్నది. ఇది ఏ మాత్రము సమయోచితమై లేదు. ఏలననగా అదృష్టమనెడి ఫలితము భవిష్యత్కాలములో పరలోకము నందు ఫలము నొసంగును. కాని ఇచ్చట ఫలితము ప్రత్యక్షముగా చూడఁబడును. ప్రత్యక్ష ఆత్మజ్ఞానము ఈ జీవితమునందే పొందఁబడును. కావున ఫలితము లభింపకున్నచో, అది లభించునంతవఱకు మరల మరల ఆచరింపఁ బడవలయును. ప్రత్యక్షఫలము నొందింపఁజేయుటచే ఇట్టి క్రియలు మాటిమాటికి అనుష్ఠింపఁబడవలయును.

ఒక గురువు లేక రాజును ఉపాసించుట, లేక, ఇంటిలో లేని భర్తనుఁ గూర్చి భార్య చింతించుట ఒకేయొక చింతనగా తలంపఁబడదు. కాని ఇది అఖండమైన క్రియలు మరియు ఆలోచనల యొక్క పరంపరయై యున్నది. ఎవడైనను ఒక గురువునుఁగాని, రాజునుఁగాని మానసిక నిష్ఠఁ గలవాడై ఉపాసించునేని అతడు గొప్ప భక్తుడనియు మఱియు విదేశమున కేగిన భర్తనుఁగూర్చి భార్య తదేక ధ్యానముతో చింతించుచుండునేని, ఆమె పతివ్రతయనియును మనము సామాన్యముగా పలుకుచుందుము.

వేదాంతమునందు "విద్" మఱియు "ఉపాస్తి" శబ్దములు ఏకార్థమునందు ప్రయోగింపబడినవి. వేదాంత గ్రంథములలో ఈ శబ్దములు ఒకదానికి బదులుగా మరియొకటి వాడఁబడినవి. కొన్ని వాక్యములలో "విద్" శబ్దము ఆదియందును "ఉపాస్తి" శబ్దము అంతమునందును ప్రయోగింపఁబడినవి. "యస్తద్వేద యత్సవేద సమయైతదుక్తః (ఛాం.ఉ. 4-1-4). "అను మ ఏతాం భగవో దేవతాం శాధియాం

దేవతాముపాస్స॰" (ఛాం.ఉ. 4-2-2). ఇఁక ఇతర స్థలములలో "ఉపాస్తి" ఆది యందును, "విద్" అనంతరమున్నూ ప్రయోగింపఁబడినది. "మనోబ్రహ్మేత్యుపాసీత" (ఛాం. ఉ. 3-18-1). "భాతి చ తపతి చ కీర్త్యాయశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద" (ఛాం.ఉ. 3-18-3).

మననోపాసనలు మానసిక క్రియ యొక్క పునరుక్తిని సూచించును. "అతడు దానిని ఉపాసించుచున్నాడ"ని మనము పలికినప్పుడు ఆ పదార్థమును అఖండముగా జ్ఞప్తియందుంచుకొను క్రియ సూచింపఁబడును. మననము యొక్క విషయము కూడా ఇట్టిదేనై యున్నది.

ఒకే పర్యాయము శ్రుతి ప్రబోధించినను, అది మరల మరల మనన మొనర్పఁ బడవలయునని దీనినిఁబట్టి మనకు తెలియుచున్నది. శ్రుతి మరల మరల ప్రబోధించినప్పుడు, మానసిక క్రియలు మరల మరల ఒనర్పఁబడవలయుననుట సువిదితము.

"వడ్లు దంపఁబడవలయున"ని శ్రుతి పలికినప్పుడు యజమాని "పొట్టుపోవు నంత వరకు వడ్లు మరల మరల దంపఁబడవలయున"ని అర్థమొనర్చుకొనును. ఏలననగా వడ్లతో ఏలాటి యజ్ఞము నిర్వర్తింపఁబడదు. కావున "ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అని శ్రుతి పలికినప్పుడు ఆత్మ సాక్షాత్కార పర్యంతము ఇది ఆచరింపఁబడవలయునని మనము అర్థమొనర్చు కొనవలయును.

## 4-1-2 లింగాచ్చ

లింగము వలన కూడా.

లింగాత్ = లింగమువలన, చ = మఱియు

అదే ప్రసంగము కొనసాగుచున్నది.

ఆవృత్తి అవశ్యకమని లింగము కూడా సూచించుచున్నది. శ్రుతియందు ఉపాసన మరల మరల ఒనర్పఁబడవలయునను ప్రబోధము కలదు. ఒక ఉపాసన నొనర్చినప్పుడు ఒకే కుమారుడు జన్మించుననియు, అనేక ఉపాసనల నొనర్చినప్పుడు అనేక కుమారులు జన్మింతురనియును అది నుడువును. "రశ్మీం స్త్వం పర్యావర్తయాత్" (ఛాం.ఉ. 1-5-2) ఉద్గీథోపాసనను సూచించు

విభాగమునందు శ్రుతి సూర్యుని దృష్టియందుంచుకొని ఉద్గీథోపాసనను ప్రబోధించును. ఏలననగా తత్ఫలితము ఏకైక పుత్రుడు మాత్రమే! ఇఁక, రశ్మీంస్త్వం పర్యావర్తయాత్" అను వ్యాఖ్యోపాసనచే అనేక పుత్రులు కలుగుదురు. దీనిచే ఉపాసన యొక్క ఆవృత్తి సుప్రసిద్ధమై యున్నదని తెలియుచున్నది. ఈ విషయములోని నియమము ఇతర ఉపాసనలకున్నూ వర్తించును.

పవిత్రత, వివేక వైరాగ్యములు మఱియు తీక్ష్ణమైన సూక్ష్మమైన బుద్ధికుశలతను కలిగియుండి ప్రథమ శ్రేణికి చెందిన ముముక్షువునకు "తత్త్వమసి" మహావాక్యమును ఒకే పర్యాయము శ్రవణము చేసినచో చాలును. "తత్త్వమసి" మహావాక్యమును కేవలము ఒకే పర్యాయము ఉచ్చరించినను బ్రహ్మము యొక్క నిజస్వరూపమును సాక్షాత్కరించుకొనఁగలుగువానికి ఆవృత్తి నిశ్చయముగా నిష్ప్రయోజనమే యగును. కాని ఇట్టి మహాత్ములు అరుదుగా నుందురు. శరీరాది వస్తుసముదాయము నందు అనురాగమును కలిగియున్న సామాన్య ప్రజలు మహావాక్యమును ఒకే పర్యాయము ఉచ్చరించినచో సాక్షాత్కరించుకొనఁగలుగు వానికి ఆవృత్తి నిశ్చయముగా నిష్ప్రయోజనమే యగును. కాని ఇట్టి మహాత్ములు అరుదుగా నుందురు. శరీరాది వస్తుసముదాయము నందు అనురాగమును కలిగియున్న సామాన్యప్రజలు మహావాక్యమును ఒకే పర్యాయము ఉచ్చరించినచో ఆత్మసాక్షాత్కారము నొందజాలరు. ఇట్టివారికి ఆవృత్తి ప్రయోజనకారియగును. నిరంతరోపాసనచేతనే "దేహోహం" భావన నశించును. ఎడతెగని నిరంతర ధ్యానము చేతనే జ్ఞానోదయమగును.

ఆవృత్తిచే "దేహోహ"మనెడి దుర్భావన క్రమముగా నశించును. దేహోహం భావన మూలమట్టమగునంతవరకు ఉపాసనను కొనసాగింపవలసియుండును. దేహభావన నిశ్శేషముగా తొలగింపఁబడినప్పుడు బ్రహ్మము తన పూర్వప్రతిభతో ప్రకాశించును. ధ్యాత మఱియు ధ్యేయము ఏకమగును. వ్యక్తిత్వము నిశ్శేషముగా నశించును.

ఒకవేళ ఆవృత్తి అవసరములేకున్నచో ఛాందోగ్యమునందు బ్రహ్మమునుఁ గూర్చి తెలుపు "తత్త్వమసి' మహావాక్యము మాటిమాటికి చెప్పఁబడి యుండెడిది కాదు.

"పునరేవ వరుణం పితరముపససార అధీహి భగవో బ్రహ్మేతి" (త్రై.ఉ. 3-2). అను వాక్యముచే భృగువు బ్రహ్మస్వరూపము నెఱుంగుటకై తన తండ్రి యగు వరుణుని అనేకసార్లు సమీపించి, మరల మరల ప్రార్థించినట్లు తెలియు చున్నది.

భృగువగు వారుణి తన తండ్రియగు వరుణుని సమీపించి ఇట్లనెను. "అధీహి భగవో బ్రహ్మేతి" ఆతడాతనికి ఆహారము, శ్వాస, నేత్రము, శ్రోత్రము, మనస్సు మఱియు వాక్కునుఁగూర్చి నుడివెను. తిరిగి అతడిట్లు పలికెను. "ఈ ప్రాణులన్నియు దేనినుండి ఉత్పన్నమైనవో, దేనిచే సంరక్షింపఁబడుచున్నవో, దేనియందవి మృత్యు సమయమునందు లయించునో, అదియే బ్రహ్మమని గుర్తెఱుంగుటకు యత్నించుము".

ఈ యావృత్తి సిద్ధాంతము పవిత్రత, సూక్ష్మబుద్ధి లేనివారికి వర్తించును. అట్టి వారికి బ్రహ్మజ్ఞానోపదేశము నొనర్చుటకు ఒకే పర్యాయము ఉచ్చరించుట చాలదు.

శరీరాదులకంటె సూక్ష్మస్థితినొందుచు, శుద్ధచైతన్యమును సాక్షాత్కరించు కొనువరకు జీవుడు క్రమక్రమముగా ప్రబోధింపఁబడును. మనమొక పదార్థము యొక్క జ్ఞానము మాత్రము కలిగియున్నప్పుడు, దాని ఉనికినిఁగూర్చిన స్థిరమైన పూర్వజ్ఞానమును కలిగియుందుము. అజ్ఞానము, సంశయము, లేక, పరోక్షజ్ఞానము కలిగియున్న వారికి "తత్త్వమసి" వాక్యసారమగు ఆత్మసాక్షాత్కారము కలుగఁ జాలదు. కాని ఇట్టి ఆటంకములు లేనివారికి ఆత్మసాక్షాత్కారము కరతలామలకమగును. కావున పూర్ణమగు వాచ్యార్థ జ్ఞానమునుఁబడయుటకై వివేక విచారములతో కూడిన ఆవృత్తి అత్యావశ్యకమగును.

సామాన్యముగా ఒక వాక్యమునుఁగూర్చి ప్రప్రథమముగా శ్రవణ మొనర్చిన మనుజులు దానిని పూర్ణముగా అర్థమొనర్చుకొనజాలరు. అప్పుడా వాక్యమును మరల మరల ఉచ్చరించినచో అపార్థములు తొలగింపఁబడుటతో నిజమైన భావార్థము వ్యక్తమగుటను మనముఁగాంచుచుందుము.

ఈ కారణములన్నింటిచే పరబ్రహ్మ సాక్షాత్కారము నొందుటకు ఆత్మ సాక్షాత్కారమునకై ప్రబోధింపబడిన వాక్యము మరలమరల ఉచ్చరింపఁబడ వలయునని నిర్ణయింపఁబడుచున్నది.

# ౨. ఆత్మత్వోపాసనాధికరణము

## 4-1-3 ఆత్మేతి తూపగచ్ఛంతిగ్రాహయంతిచ

కాని శ్రుతి వాక్యములు బ్రహ్మమును ధ్యాతయొక్క ఆత్మగా సెలవొసంగును. మఱియు ఇట్లు సాక్షాత్కారము నొందునట్లు ఇతరులకు కూడా ప్రబోధించును.

ఆత్మేతి = ఆత్మగా, తు = కాని, ఉపగచ్ఛంతి = సాక్షాత్కరించుకొందురు, గ్రాహయంతి = ప్రబోధింతురు, చ = కూడా.

ఈ సూత్రము ఉపాసనా విధానమును సూచించును.

బ్రహ్మము జీవునికి భిన్నమైయున్నదా? లేక, అభిన్నమైయున్నదా? యను సంశయ మిచ్చట కలుగును.

ప్రధానమైన భేదమున్న కారణముచే బ్రహ్మము జీవునికి భిన్నమైయున్నదని పూర్వపక్షి పలుకును. ఏలననగా జీవుడు చింత, దుఃఖము మఱియు బాధలకు గుఱియగును. కాని బ్రహ్మము వీటినుండి విముక్తమైయున్నది.

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి బ్రహ్మము ఆత్మతో తాదాత్మ్యము నొందియున్నదని పలుకును. జీవుడు తాత్త్వికముగా బ్రహ్మమేనై యున్నాడు. అంతఃకరణమనెడి ఉపాధిచే జీవత్వమేర్పడినది. జీవత్వము మిథ్యయైయున్నది. జీవుడు నిజమునకు ఆనందస్వరూపుడు. అతడు అంతఃకరణమనెడి ఉపాధిచే దుఃఖము మఱియు బాధననుభవించును.

జాబాలురు ఇట్లు నుడువుదురు "త్వం వా అహమస్మి భగవో దేవతే హం వైత్వమసి భగవో దేవతే" ఇతర శ్రుతివాక్యములు కూడా ఇట్లే నుడువును. "అహం బ్రహ్మాస్మి" (బృ.ఉ. 1-4-10). "ఏష త ఆత్మా సర్వాంతరః" (బృ.ఉ. 3-4-1). "ఏష త ఆత్మాంతర్యామ్యమృతః" (బృ.ఉ. 3-7-3), "తత్సత్యం స ఆత్మా "తత్త్వమసి" (ఛాం. ఉ. 6-8-7). "మనో బ్రహ్మ" (ఛాం.ఉ. 3-18-1) వలె ఈ వాక్యములయొక్క ముఖ్యార్థమునే స్వీకరింపవలయును, కాని గౌణార్థమును కాదు. "మనోబ్రహ్మ" యను వాక్యమునందు ఉపాసనకు ప్రతీకముగా మనస్సు స్వీకరింపఁబడినది.

కావున బ్రహ్మమును ఆత్మభావముతో ధ్యానింపవలసియుండును.

ఒక విగ్రహమును విష్ణువుగా తలంచినట్లు ఇది కేవలము ఒక ఉద్రేకమని నీవు నుడువుటకు వీలులేదు.

తర్వాతి ప్రసంగమునందు ఒకేయొక ప్రబోధము కలదు. కాని జాబాల శ్రుతి యందు ప్రబోధద్వయము కలదు. అది బ్రహ్మము జీవునికి, జీవుడు బ్రహ్మమున కభిన్నుడై యున్నాడని పలుకును. జీవుడు మఱియు బ్రహ్మమునకు మధ్య కానఁబడు భేదము అసత్యము. ఆత్మసాక్షాత్కారము నొందువరకు జీవునికి జీవత్వము, లేక, సంసారిత్వముండును.

కావున ఆత్మరూపమునందున్న బ్రహ్మముపై మన మనస్సును కేంద్రీకరింప వలసియుండును.

# 3. ప్రతీకాధికరణము

## 4-1-4 న ప్రతీకేనహిసః

అది తాను కాకుండుటచే, ధ్యాత ప్రతీకమునందు తన్నుఁగాంచరాదు.

న = కాదు, ప్రతీకే = ఆకాశము, సూర్యుడు, మనస్సు ఇత్యాది ప్రతీకములలో, న = కాదు, హి = ఏలననగా, సః = అతడు.

ఈ సూత్రము మఱియు తర్వాతి రెండు సూత్రములు ప్రతీకముయొక్క విలువను పరీక్షించును.

ప్రతీకములను మన కభిన్నములుగా తలంపరాదు. ధ్యాత వాటిని తన కభిన్నముగా తలంపరాదు. ఏలననగా అవి అతనికి విభిన్నములై యున్నవి.

"మనో బ్రహ్మేత్యుపాసీతేత్యధ్యాత్మమథాధి దైవత మాకాశో బ్రహ్మేతి" (ఛాం. ఉ. 3-18-1) అని ఛాందోగ్యము నుడువుచున్నది.

"అహం బ్రహ్మాస్మి" వాక్యోపాసనకువలె బ్రహ్మమునకు ప్రతీకముగా స్వీకరింపఁబడిన మనస్సుతో ఉపాసకుడు తాదాత్మ్యము నొందవలయునా? లేదా? యను సంశయమిచ్చట కలుగును.

మనస్సు బ్రహ్మము నుండి ఉత్పన్నమగుటచేతను, అది దాని కభిన్నమై యుండుటచేతను ఉపాసకుడు దానితో తాదాత్మ్యము నొందవలయునని పూర్వపక్షి పలుకును. కావున ఉపాసకుడగు జీవుడు బ్రహ్మమున కభిన్నుడై యున్నాడు. కాఁబట్టి ఉపాసకుడు కూడా మనస్సుతో ఏకీభవించునని తెలియుచున్నది. ఈ కారణముచే ఈ యుపాసనయందుకూడా అతడు మనస్సునందు తన ఆత్మనుఁ గాంచవలసియుండును.

ప్రస్తుత సూత్రము దీనిని ఖండించును. ప్రతీకములయందు బ్రహ్మభావనను చేర్చరాదు. ఏలననగా ధ్యాత వైజాత్యమైన ప్రతీకములను తన ఆత్మస్వరూపముగా భావింపఁజాలడు.

ప్రతీకములను మన స్వరూపములుగా తలంపరాదు. అవి మనకు భిన్నములై యుండుటచే వాటిని మనతో తాదాత్మ్యము నొందింపరాదు. లేక, అవి బ్రహ్మము నుండి ఉత్పన్నమగుటచేతను మఱియు బ్రహ్మము ఆత్మకు అభిన్నమైయుండుట చేతను అవి కూడా ఆత్మకు అభిన్నములై యున్నవని నుడువుటకున్నూ వీలులేదు. నామరూప వివర్జితములైనప్పుడే అవి బ్రహ్మముతో అభిన్నత్వము నొందును. ఇఁక అవి నామరూపముల కతీతమైనప్పుడు, అవి ప్రతీకములని చెప్పఁబడజాలవు.

కర్తృత్వము నుండి విముక్తమైనప్పుడు మాత్రమే ఆత్మ బ్రహ్మమని చెప్పబడును. రెండు బంగారు ఆభరణములకు అభిన్నత్వము లేదు. కాని రెండింటిలోని బంగారమునకు అభిన్నత్వము కలదు.

ఒక ఆభరణమును బంగారముగా గుర్తెఱింగినప్పుడు అది ఆభరణముగా శేషించి యుండదు. అట్లే మనఃప్రతీకము బ్రహ్మముతో తాదాత్మ్యము నొందినప్పుడు అది ప్రతీకముగా శేషించియుండదు. ధ్యాత ఆత్మతో తాదాత్మ్యము నొందినప్పుడు అతడు ధ్యాతగా, జీవుడుగా, లేక, ఒకవ్యక్తిగా శేషించియుండడు. ఏకత్వానుభూతి నొందనంతవరకు మాత్రమే ప్రారంభమునందు ధ్యాత, ధ్యేయము మఱియు ధ్యాన మనెడి విభేదముండును. ధ్యాత–ధ్యేయములమధ్య విభేదమున్నంత వరకు ధ్యానము కొనసాగుచుండవలయును. భేదము, లేక, నానాత్వ మున్నంతవరకు ధ్యాత ప్రతీకమునకు పూర్తిగా విభిన్నుడై యుండును.

ఈ కారణములచే ప్రతీకములయందు ఆత్మ ఉపాసింపఁబడదు. ధ్యాత తన ఆత్మను ప్రతీకమునందు చూడఁజాలడు.

# 4. బ్రహ్మదృష్ట్యధికరణము

## 4-1-5 బ్రహ్మదృష్టి రుత్కర్షాత్

ప్రతీకమును స్తుతించు నిమిత్తమై ప్రతీకమును బ్రహ్మముగా తలంప వలయును. కాని బ్రహ్మమును ప్రతీకముగా తలంపరాదు.

బ్రహ్మదృష్టిః = బ్రహ్మ ప్రకాశదృష్టి, ఉత్కర్షాత్ = గొప్పఁదనము యొక్క కారణముచే.

అదే చర్చ కొనసాగుచున్నది.

“మనోబ్రహ్మ” “ఆదిత్యో బ్రహ్మ” యనెడి ప్రతీకోపాసనలలో ప్రతీకమును బ్రహ్మముగా తలంపవలయునా? లేక, బ్రహ్మమునే ప్రతీకముగా తలంపవలయునా? యనెడి ప్రశ్న ఉదయించును.

మనస్సు, సూర్యుడు ఇత్యాది ప్రతీకములనే బ్రహ్మముగా తలంపవలయును. కాని విపరీతముగా తలంపరాదని ఈ సూత్రము నుడువును. ఏలననగా నీవు ఒక క్షుద్రమైన పదార్థమును ఉన్నతమైన దానిగాఁ గాంచినప్పుడు నీయందు వికాసము కలుగును; కాని తద్విపరీతముగా తలంచినప్పుడు వికాసము కలుగదు. నీవు బ్రహ్మమును సమస్త పదార్థములయందుఁగాంచి భిన్నత్వము, లేక, భేదభావమునుండి విముక్తుడవు కావలసియుండుటచే, ఈ ప్రతీకములనే నీవు బ్రహ్మముగా ఉపాసింపవలసియుండును.

బ్రహ్మము ప్రతీకమును మించి సర్వశ్రేష్ఠమై యుండుటచే ప్రతీకమును బ్రహ్మముగా తలంచుట శ్రేష్ఠము. కాని బ్రహ్మమునే ప్రతీకముగా తలంచుట అసంగతమగును.

బ్రహ్మమును ఒక పరిచ్ఛిన్న పదార్థముగా పరిగణించుటలో ప్రయోజనము లేదు. ఏలననగా దీనిచే అనంత బ్రహ్మమును అంతవంతమైన స్థాయికి కొనివచ్చినట్లగును. ప్రతీకమును బ్రహ్మముయొక్క ఔన్నత్యము నొందింపవచ్చును. కాని బ్రహ్మమును ప్రతీకముయొక్క స్థాయియందు పడవేయరాదు.

# 5. ఆదిత్యాదిమత్యధికరణము

## 4-1-6 ఆదిత్యాది మతయశ్చాంగ ఉపపత్తేః

మఱియు, కర్మాంగములయందు ఆదిత్యాది భావములను ఆరోపింపవల యును ఏలననగా అప్పుడు మాత్రమే శ్రుతి సిద్ధాంతము సంగతమగును.

ఆదిత్యాదిమతయః = సూర్యుడు ఇత్యాది భావములు, చ = మఱియు, అంగే = కర్మాంగమునందు, ఉపపత్తేః = సంగతమగుటచే.

పూర్వసూత్రమును దృఢపఱచుటకై ఒక ప్రత్యేక దృష్టాంతము చెప్పఁబడు చున్నది.

"య ఏవాసౌతపతి తముద్గీథ ముపాసీత" (ఛాం.ఉ. 1-3-1). "లోకేషు పంచవిధం సామోపాసీత" (ఛాం. ఉ. 2-2-1). "వాచి సప్తవిధం సామోపాసీత" (ఛాం.ఉ. 2-8-1). "ఇయమేవర్గగ్నిః సామ" (ఛాం.ఉ. 1-6-1).

పై వాక్యములలోని కర్మాంగములకు సంబంధించిన ఉపాసనలను ఎట్లొనర్ప వలయును? సూర్యుని ఉద్గీథముగా తలంపవలయునా? లేక, ఉద్గీథమునే సూర్యునిగా తలంపవలయునా? బ్రహ్మము సర్వవ్యాపకమగుటచే పూర్వసూత్రము నందు ప్రతీకమే బ్రహ్మముగా తలంపఁబడెను. కాని ఇచ్చట సూర్యుడు మఱియు ఉద్గీథములలో శ్రేష్ఠమైనదేదియో తెలుపున దేదియును లేదు.

ఉద్గీథమువంటి కర్మాంగములను సూర్యుడు ఇత్యాదులుగా తలంపవలయు నని ప్రస్తుత సూత్రము నుడువును. ఏలననగా ఇట్లొనర్చుటచే క్రతు క్రియాఫలము వృద్ధినొందును క్రతుకర్మ విజయవంతమగును. "యదేవ విద్యయా కరోతి శ్రద్దయోప నిషదా తదేవ వీర్యవత్తరం భవతి" (ఛాం. ఉ. 1-1-10) అను

శ్రుతివాక్యము క్రతుకర్మ విజయవంతమగుటకు జ్ఞానమే కారణమని నొక్కి చెప్పుచున్నది.

ఉద్గీథమును మనము సూర్యునిగా భావింతుమేని అది ప్రత్యేక సంస్కార శు ద్ధి నొంది, సమస్త యజ్ఞమునకు అదృశ్యఫలమగు అదృష్టము, లేక, అపూర్వము ద్వారా కర్మ సమృద్ధిని కలుగఁజేయును. ఒకవేళ సూర్యునే ఉద్గీథముగా భావింతుమేని,

సూర్యుడు కర్మాంగము కాకుండుటచే ఈ యుపాసన ద్వారా సూర్యుడు అపూర్వమును సంస్కరింపఁజాలడు.

ఉపాసనలచే కర్మఫలము వృద్ధినొందుననెడి శ్రుతివాక్యము సత్యమగుటకై క్రతుకర్మాంగములను ఆదిత్యుడు ఇత్యాదులుగా తలంపవలసియుండును.

ఆదిత్యాదులు కర్మఫలములగుటచే అవి ఉద్గీథము కంటె ఉన్నతములై యున్నవి కావున.

పై నుడుపఁబడిన ఉత్కర్షబుద్ధి నియమమునుఁబట్టి ఉద్గీథాదులను ఆదిత్యాదులుగా భావించి పూజింపవలసియుండును.

ఒకవేళ ఆదిత్యాదులను ఉద్గీథముగా భావించినచో ఆదిత్యుడు కర్మ స్వరూపుడగుటచే ఫలము నొసంగునని నీవు పలుకుదువేని, అది దోషయుక్త మగును. ఏలననగా ఉపాసన స్వయముగా కర్మయగుటచే అది ఫలము నొసంగును.

ఉద్గీథమును ఆదిత్యునివంటి ఉన్నతస్థాయికిఁగొంపోవలయును; కాని ఆదిత్యుని ఉద్గీథస్థాయియందు పడవేయరాదు.

ఈ విధముగా ఉపాసకుడు తనను బ్రహ్మముగా భావించుట ద్వారా బ్రహ్మము యొక్క స్థాయికి వెళ్ళవలయును. కాని బ్రహ్మమును వ్యక్తిగతస్థాయికి తీసుకొని రాకూడదు.

# 6. ఆసీనాధికరణము
# (7-10 సూత్రములు)

## 4-1-7 ఆసీనః సంభవాత్

సాధ్యమైన కారణముచే కూర్చుండి ధ్యాన మొనర్పవలయును.

ఆసీనః = కూర్చుండి, సంభవాత్ = సాధ్యమైన కారణముచే.

ఉపాసకుడు ధ్యానమునందు కూర్చుండు విధానమిప్పుడు చర్చింపఁబడుచున్నది. కర్మాంగోపాసనలు ప్రత్యేక కర్మపై ఆధారపడియుండుటచే వాటిని కూర్చుండి ఆచరింపవలయునా? లేక, నిలబడి ఆచరింపవలయునా? యను ప్రశ్నకు తావులేదు. పూర్ణ సాక్షాత్కారమునందున్నూ ఇట్టి ప్రశ్న ఉదయింపదు. ఏలననగా,

అది ఇట్టి సాక్షాత్కార విషయముపై ఆధారపడియుండును. ఇతర ఉపాసనలలో ధ్యానమునకై కూర్చుండుట ఆవశ్యకమైయున్నది.

ధ్యానము మానసికమగుటచే శరీర వైఖరియందు నియమము అనావశ్యకమని పూర్వపక్షి పలుకును.

నిలబడినప్పుడు, లేక, పరుండియున్నప్పుడు ధ్యానము అసాధ్యమగుటచే కూర్చుండియే ధ్యాన మొనర్పవలయునని ఈ సూత్రము నుడువును. ధ్యానమునకై కూర్చుండుట ఆవశ్యకమైయున్నది. ఏలననగా మానసికస్థాయిని అఖండముగా నుంచుటయే ఉపాసన యొక్క ఉద్దేశ్యమగుటచే నడుచునప్పుడుఁగాని, పరుగెత్తునప్పుడుఁగాని ఇట్టి అఖండతకు భంగమేర్పడును. ఏలననగా అప్పుడు మనస్సు శరీరమునందు లగ్నమైయుండుటచే, ఆది ధారణ నొనర్పఁజాలదు. ఇఁక పరుండియున్నప్పుడు కూడా ధారణ అసాధ్యమగును. ఏలననగా ఆ సమయము నందు నిద్ర అతనిని ఆవరించును.

ఉపాసనయందు మనస్సును ఒకే పదార్థముపై కేంద్రీకరింపవలసి యుండును. నిలఁబడినప్పుడుఁగాని, పరుండియున్నప్పుడుగాని ఇది సాధ్యము కాదు. నిలఁబడియున్న మానవుని మనస్సు తన శరీరమును నిలువుగా ఉంచుట యందు కేంద్రీకరింపఁబడియుండుటచే, ఏదేని సూక్ష్మవిషయముపై మనస్సును కేంద్రీకరించుట అసంభవమగును.

కూర్చున్న వ్యక్తి ఇట్టి నానావిధములగు విషమ పరిస్థితులను సులభముగా ఎదుర్కొనఁగలుగుటచే తన ధ్యానమును కొనసాగింపఁగలుగును. కూర్చుండు విధానముచే ధ్యానమున కత్యావశ్యకమగు మానసిక స్థిరత చేకూరును. ధ్యానమును ఆసీనుడై అభ్యసింపవలయును. ఏలననగా అట్టిఎడల మాత్రమే ధ్యానము అనుష్ఠింపఁబడును.

## 4-1-8 ధ్యానాచ్చ

మఱియు ధ్యానకారణముచే.

ధ్యానాత్ = ధ్యానకారణముచే, చ = మఱియు.

7వ సూత్రమును బలపఱచువాదము ఉదాహరింపఁబడినది.

ఇంతేకాకుండా అవిచ్ఛిన్నమగు భావమే ధ్యానమని చెప్పఁబడును. అంగములు క్రియాశీలములు కానప్పుడు మఱియు మనస్సు ప్రశాంతముగా నున్నప్పుడు మాత్రమే ధ్యానము సాధ్యమగును.

ఉపాసన ముఖ్యముగా ధారణస్వభావమును కలిగియుండుటచే, కూర్చుండి దానిని అభ్యసింపవలసియుండును. దీనిచే ధారణకు అనుకూలత ఏర్పడును. ఒక ప్రత్యేక పదార్థమునుఁ గూర్చి నిరాటంకముగా మఱియు నిర్విరామముగా భావనను ప్రవహింపఁజేయుటయే ధారణయని చెప్పఁబడును. దీనికి ఆసనముపై కూర్చొనియుండుట ఆవశ్యకమగును.

"ఉపాసన"యనెడి శబ్దమునకు ధ్యానమని కూడా అర్థము. అనగా ఏకైక పదార్థముపై దృష్టిని నిగుడ్చుట మఱియు అవయవములను ఏమాత్రము చలింపఁజేయకుండుటయని అర్థము. ఇది కేవలము ఆసీనస్థితియందే సాధ్యమగును.

ఒకేరకమగు సజాతీయ భావములను కొనసాగించుచుండుట ధ్యానమని చెప్పఁబడును. ఒకే పదార్థముపై ఎవరి మనస్సు కేంద్రీకరింపఁబడునో మఱియు ఎవరి అవయవములు చలింపకుండాయుండునో, అతడు ఆలోచనాగ్రస్తుడని మనము ఆరోపించుచుందుము. శ్రీరామకృష్ణుడు ఆలోచనాగ్రస్తుడైయున్నాడని మనము చెప్పుచుందుము. ఇట్టి ఆలోచనాగ్రస్తత కూర్చున్నవారికి సులభసాధ్యమగును. భార్య ఇంటియందు కూర్చొని దూరదేశమునకేగినట్టి తన భర్తనుఁ గూర్చి గాఢముగా చింతించుచుండును.

ధ్యేయపదార్థమున కన్యమగు భావములు రానీయకుండా నిరంతరము ఒకే పదార్థమునుఁ గూర్చి చింతించుచుండుటయే ధ్యానమనఁబడును. ఇట్టి ధ్యానము కేవలము ఆసీనస్థితియందే సాధ్యమగును. కాని పరుండియున్నప్పుడు గాని, నిలబడియున్నప్పుడుగాని సాధ్యము కాదు. కావున ప్రార్థనలకు మఱియు ధ్యానమునకు అసీనస్థితిని అనుసరింపవలసియుండును.

కూర్చుండి ధ్యానమొనర్చినప్పుడు మానసిక కలత తగ్గిపోవును. కావున ధ్యానించుటయే కూర్చున్న వ్యక్తికి కర్తవ్యమైయున్నదని మేము నిశ్చయింతుము.

## 4-1-9 అచలత్వం చాపేక్ష్య

మఱియు చలింపని కారణముచే శ్రుతులు భూదేవికి ఉపాసనత్వము నారోపించినవి.

అచలత్వం = స్థిరత్వము, చ = మఱియు, అపేక్ష్య = సూచించి.

7వ సూత్రమును బలపఱచు చర్చ కొనసాగుచున్నది.

"చ" యను శబ్దముచే నిశ్చయత్వము సూచింపఁబడును. "ధ్యై" అనెడి ధాతువున కర్థము నిశ్చలత్వమని ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పఁబడినది.

సామాన్య దృష్టియందు భూమికి చలనము లేకుండుటచే, అది ఆకాశము నందు స్థిరముగానుండి ధ్యానధారణల నొనర్చుచున్నదని శ్రుతి భావించును. ఇట్టి మానసిక స్థిరత్వము కేవలము ఆసీనస్థితియందు మాత్రమే పొందఁబడునని అది సూచించును.

శరీరమునకు విశ్రాంతి యున్నప్పుడు మనస్సుకు కూడా విశ్రాంతి యుండును. ఒకవేళ శరీరము చలించుచున్నచో మనస్సు కూడా చలించుచుండును. "ధ్యాయతీవ వృథివీ" (ఛాం. ఉ. 7-6-1) అను వాక్యమునందు పృథ్వి స్థిరముగానున్న కారణముచే దానికి ఉపాసనత్వము ఆరోపింపఁబడినది. దీనినిబట్టి ధ్యానము కూర్చున్న స్థితియందే సాధ్యమగును. కాని నిలబడినప్పుడుఁ గాని, నడుచునప్పుడుఁ గాని సాధ్యము కాదని మనమూహింపవచ్చును.

స్థిరత్వము ధ్యానమునకు దారితీయును. శరీరము మఱియు మనస్సు యొక్క స్థిరత్వము కేవలము కూర్చున్నప్పుడే పొందఁబడును. కాని నిలఁబడినప్పుడు, లేక నడచుచున్నప్పుడు పొందఁబడదు.

## 4-1-10 స్మరంతి చ

స్మృతి వాక్యములు కూడా ఇట్లే చెప్పుచున్నవి.

స్మరంతి = స్మృతి వాక్యములు చెప్పుచున్నవి, చ = కూడా.

7వ సూత్రమును బలపఱచు చర్చ ఇంతటితో సమాప్తమైనది.

శిష్యులు కూడా తమ స్మృతులలో ధ్యానము నిమిత్తమై ఆసనమును పేర్కొనియున్నారు. "శుచౌదేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః" (భ.గీ. 6-11)

ఈ కారణముచేతనే యోగశాస్త్రమునందు పద్మాసనము, సిద్ధాసనము మున్నగు ఆసనములు పేర్కొనఁబడినవి.

# 7. ఏకాగ్రతాధికరణము

## 4-1-11 యత్రైకాగ్రతా తత్రా విశేషాత్

ఎచ్చట మనస్సున కేకాగ్రత కుదురునో, అచ్చట దాని నభ్యసింపవలయును. దానికై ప్రత్యేకస్థలము చెప్పబడలేదు.

యత్ర = ఎచ్చట, ఏకాగ్రతా = మానసికధారణ, తత్ర = అచ్చట, అవి శేషాత్ = శ్రుతియందు ప్రత్యేకత చెప్పఁబడకుండుటచే.

ధ్యానమునుఁగూర్చి ప్రత్యేక కాలనియమముఁగాని, స్థల నియమముఁగాని లేదు. ఎప్పుడు ఎచ్చట మనస్సుకు ఏకాగ్రత కుదురునో అప్పుడచ్చట ధ్యానింప వలయును. "మనోనుకూలే" మనస్సుకు ఎచ్చట అనుకూలమో అచ్చట" యని శ్రుతి నుడువుచున్నది.

ఏకాగ్రత ఎచ్చట కుదురునో ఆ స్థలమే శ్రేష్ఠమని చెప్పబడినది. "సమేశుచౌ శర్కరావహ్నివాలుకా వివర్జితే శబ్దజలాశ్రయాదిభిః, మనోనుకూలే న తు చక్షుపీడనే గుహాని వాతాశ్రయణే ప్రయోజయేత్" అని శ్రుతులు నుడువుచున్నవి.

కాని రాళ్ళు, అగ్ని, ధూళి,శబ్దము, నిలిచియున్న నీరులేని శుభ్రమైన స్థలములను ఎన్నుకొనవలయును, ఏలననగా ఇట్టి స్థలములు ధ్యానమునకు అనుకూలములు.

ఐనను స్థలము, సమయము మఱియు దిశకు ప్రత్యేక నియమములు లేవు.

# 8. ఆప్రాయణాధికరణము

## 4-1-12 ఆప్రాయణా త్తత్రాపి హి దృష్టమ్

మృత్యుపర్యంతము (మోక్షము నొందువరకు) ఉపాసన నొనర్పవలయును. ఏలననగా ఇది కూడా శ్రుతియందు పేర్కొనఁబడినది.

ఆప్రాయణాత్ = మరణపర్యంతము, తత్ర= అచ్చట, అపి = కూడా, హి = ఏలననగా, దృష్టమ్ = శ్రుతియందు చెప్పఁబడినది.

మరణపర్యంతము, ముక్తినొందునంతవరకు ఉపాసన నొనర్చుచుండ వలయును. ఏలననగా మరణపర్యంతము ఉపాసన నొనర్చువ్యక్తి మరణా నంతరము బ్రహ్మలోకము నొందునని శ్రుతి నుడువుచున్నది.

శ్రుతియందు విధింపఁబడిన బ్రహ్మోపాసనను జ్ఞానప్రకాశమగునంత వరకు కొనసాగింపవలయునని ఈ యధ్యాయము యొక్క ప్రథమాధికరణమునందు చెప్పఁబడినది.

ప్రత్యేక ఫలముల నాశించి ఒనర్పఁబడు ఇతర ఉపాసనల విషయ మిప్పుడు చర్చింపఁబడుచున్నది. కొంతకాలము తర్వాత ఇట్టి ఉపాసనలను నిలిపివేయ వచ్చునని పూర్వపక్షి పలుకును. ఒకే పర్యాయ మొనర్పబడిన యజ్ఞములవలె అవి ఫలదాయకములగును.

అవి మరణపర్యంతము ఆచరింపఁబడవలయునవి ప్రస్తుత సూత్రము నుడువును. ఏలననగా శ్రుతి స్మృతులలో అట్లు చెప్పఁబడినది. "యచ్చిత్తస్తేనై షప్రాణ మాయాతి, ప్రాణ స్తేజసాయుక్తః సహాత్మనా యథా సంకల్పితం లోకం నయతి" (శత. బ్రా. 10-6-3-1). "యం యం వా పి" (భ.గీ. 8-6). "ప్రయాణకాలే మనసా చలేన" (భ.గీ. 8-10). "సో ంత వేళాయా మేత త్త్రయం ప్రతిపద్యేత" (ఛాం.ఉ. 3-17-6).

"మృత్యు సమయమునందే భావము కలదో, ఆ భావముతో అతడు ప్రాణములోనికేగును. ప్రాణము తేజస్సు మఱియు జీవునితో కూడుకొని మరణసమయమునందెట్లు భావించునో, అట్టి లోకమునకేగును." (ప్ర.ఉ. 4-2-10) "తృణజలాయుకము" (బృ.ఉ. 4-4-3) యొక్క దృష్టాంతమునుఁబట్టి కూడా పై విషయము నిరూపించబడుచున్నది. తృణజలాయుకము ఒక పదార్థమును త్యజించుటకు ముందుగా మరియొక పదార్థమును ఆధారముగా అంటిపట్టు కొనును.

ఎవడైనను జీవితాంతమువరకు అభ్యాసమొనర్చకుండా, ఈ శరీరమునుండి ప్రాణము నిర్గమించు సమయమునందు ఇట్టి భావనను కలిగియుండఁజాలడు.

కావున మరణపర్యంతము ఉపాసనలు అనుష్ఠింపఁబడవలయును.

# 9. తదధిగమాధికరణము

## 4-1-13 తదధిగమే ఉత్తర పూర్వాఘయో రశ్లేష వినాశౌ తద్వ్యపదేశాత్

బ్రహ్మము పొందఁబడినప్పుడు భూతభవిష్యత్పాపములచే అంటుపడకుండుటచే అవి నిశ్శేషముగా నశించును, ఏలననగా ఇట్లు శ్రుతులు వాకొనుచున్నవి.

తదధిగమే = అది సాక్షాత్కరింపఁబడినప్పుడు, ఉత్తర పూర్వాఘయోః= పూర్వాపర పాపములు, అశ్లేషవినాశౌ = అసంగము మఱియు వినాశము, తద్వ్యపదేశాత్ = శ్రుతి ఇట్లు నుడువుటచే.

బ్రహ్మజ్ఞానము, లేక జీవన్ముక్తావస్థ యొక్క ఫలమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

తృతీయాధ్యాయము యొక్క అనుబంధము ఇంతటితో ముగిసినది. గడచిన అధికరణముతో మూడవ అధ్యాయమునకు సంబంధించిన విషయములు సమాప్తమైనవి. ఈ యధికరణముతో అసలైన నాలుగవ అధ్యాయము ప్రారంభమగును. నాల్గవ అధ్యాయము బ్రహ్మవిద్యాఫలమును గూర్చి తెలుపుటచే, ఫలాధ్యాయమనబడును.

జ్ఞానము పొందఁబడినను జీవుడొనర్చిన పాపకర్మఫలముల ననుభవింపకుండా అతనికి ముక్తిలేదని పూర్వపక్షి పలుకును. ఏలననగా "న హి కర్మక్షీయతే" యని స్మృతులు వాకొనుచున్నవి. కర్మ నిర్దయమైనది.

జ్ఞానము పొందఁబడినప్పుడా వ్యక్తి యొక్క సమస్త పురాకృత పాపములు నశించును, మఱియు భవిష్యత్పాపములచే అతడు అంటువడడని ఈ సూత్రము నుడువుచున్నది.

కర్మ నిస్సంశయముగా ఫలముల ననుభవింపఁజేయు శక్తిని కలిగియున్నది. కాని ఆ శక్తి బ్రహ్మజ్ఞానముచే శూన్య మొనర్పబడును. మఱియు జయింపఁబడును. ప్రాయశ్చిత్తముచే పాపము క్షాళన మొనర్పఁబడును. సగుణ బ్రహ్మవిద్యచే సమస్త పాపములు రహితములగును. కావున జ్ఞానప్రకాశము కలిగినప్పుడు అతనికి

భవిష్యత్కర్తృత్వము సంభవింపదు. మఱియు సమస్త పురాకృత కర్మఫలములు నశించును. అట్లు కానిచో కర్మఫలములవలె మోక్షము లభించునని చెప్పినచో, అది మార్పునొందునది మఱియు అశాశ్వతమైనదగును.

ఇంతేకాకుండా జ్ఞానఫలము ప్రత్యక్షము మఱియు సద్యోజాతమైయున్నది. కావున బ్రహ్మజ్ఞానము, లేక ఆత్మజ్ఞానము పొందఁబడినప్పుడు అతని సమస్త పాపములు నశించును.

బ్రహ్మజ్ఞాని భవిష్యత్పాపములచే అంటువడడని శ్రుతులు నుడువుచున్నవి. "యథా పుష్కర పలాశ ఆపో నశ్లిష్యంత ఏవమేవం విది పాపంకర్మ నశ్లిష్యతః" (ఛాం. ఉ. 4-14-3). అదే విధముగా పురాకృత ప్రారబ్ధకర్మ నశించుననియు శ్రుతి నుడువుచున్నది. "తద్యథేషికా తూలమగ్నౌ ప్రోతం ప్రదూయేతైవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే" (ఛాం. ఉ. 5-24-3). ఈ క్రింది వాక్యముచేత కర్మ క్షయము సూచింపబడుచున్నది. "భిద్యతే హృదయ గ్రంథిశ్ఛిద్యంతే సర్వ సంశయాః క్షీయంతేచాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" (ము. ఉ. 2-2-9).

కర్మకు నాశము లేదనియు అది ఫలముల నుత్పన్న మొనర్చుచుండు ననియును పలుకువారు అజ్ఞానులు మఱియు బ్రహ్మజ్ఞానవిరహితులని చెప్పఁబడుదురు. బ్రహ్మ జ్ఞానమునొందిన ముక్త పురుషులకు పై నుడువఁబడిన విషయము వర్తించదు.

బ్రహ్మజ్ఞాని ఇట్లు భావించి తదనుసారముగా అనుభవించును. "నిత్యస్వరూప మై యున్న ఆ బ్రహ్మము కర్తయు, భోక్తయుకాదు. కర్తృత్వ భోక్తృత్వ రహితమై యున్న ఆ బ్రహ్మమే నేనైయున్నాను".

ఈ విధానముచేత మాత్రమే మోక్షము సాధ్యమగును. లేకున్నచో అనాదిగా ఏతెంచుచున్న కర్మ పరంపర ఖండింపఁబడ జాలకుండుటచే మోక్షము సంభవింప కుండెడిది. కర్మఫలమువలె మోక్షము స్థలము, సమయము మఱియు ప్రత్యేక కారణములపై ఆధారపడియుండదు. ఏలననగా దానిచే జ్ఞానఫలము అశాశ్వత ముగా పరిణమించును.

కావున బ్రహ్మజ్ఞానముచే సమస్తపాపములు క్షయమగునని నిర్ణయింపఁ బడుచున్నది.

# 10. ఇతరా సంశ్లేషాధికరణము

## 4-1-14 ఇతరస్యా ప్యేవ మసంశ్లేషః పాతేతు

ఇదే విధముగా పుణ్యకర్మలచేత కూడా అతడు అంటుబడడు. కాని మరణా నంతరము విదేహముక్తి నిశ్చయముగా లభించును.

ఇతరస్య = రెండవదానియొక్క, అపి = కూడా, ఏవమ్ = ఇట్లు, అసంశ్లేషః = అంటుబడకుండుట, పాతే = మరణ సమయమునందు, తు = నిశ్చయముగా,

బ్రహ్మజ్ఞానఫలమును గూర్చిన చర్చ కొనసాగుచున్నది.

పాపములవలెనే పుణ్యముచేతకూడా బ్రహ్మజ్ఞాని అంటువడకుండును. లేని ఎడల ఇట్టి పుణ్యము మోక్షమున కాటంకమును కలిగించును. కర్తృత్వము నశించిప్పుడు పాపమువలె పుణ్యము కూడా నశింపవలసియుండును. పుణ్య ఫలము జ్ఞానముకంటె క్షుద్రమైయున్నది. పుణ్య పాపములను త్యజింపవలసి యుండును. ఈ రెండున్నూ అతిక్రమింపబడినప్పుడు మరణ సమయమునందు నిశ్చయముగా మోక్షము లభించును. బ్రహ్మ జ్ఞానికి కర్తృత్వభావముండదు. అతడు సత్కారములచేత కూడా అంటువడడు. అతడు పుణ్యపాపముల నతిక్రమించును. "ఉభే ఉహై వైష ఏతే తరతి" (బృ.ఉ. 4-4-22)

కేవలము పాపకర్మలనుఁగూర్చి శ్రుతి సూచించినప్పుడే, దానియందు పుణ్య కర్మలు కూడా అంతర్నిహితములై యున్నవని మనము తలంపవలసి యుండును. ఏలననగా జ్ఞానఫలముకంటె పుణ్యకర్మఫలము కూడా నికృష్టమైయున్నది.

పుణ్యము కూడా బంధకారణమై యుండుటచే అది మోక్షమార్గమున కడ్డు నిలచును. బ్రహ్మజ్ఞానికి తన సమస్త పూర్వార్జిత పుణ్యపాపకర్మములు నశించును. ఈ విధముగా అతని పుణ్యపాపములు పూర్తిగా నిష్ఫలమగుటచే, మృత్యుసమయము నందాతనికి అవశ్యముగా మోక్షము లభించును.

# 11. అనారబ్ధాధికరణము

## 4-1-15 అనారబ్ధ కార్యే ఏవతు పూర్వే తదవధేః

కాని ఫలారంభము కాని కర్మలు మాత్రమే జ్ఞానముచే నశించును. ఏలననగా శరీరపాతము అవధిగా నున్నదని శ్రుతి నుడువుచున్నది.

అనారబ్ధకార్యే = ఫలారంభముకాని కర్మలో, ఏవ = మాత్రము, తు = కాని, పూర్వే = పూర్వకర్మలు, తదవధేః = మరణము అవధిగా నుండుటచే,

బ్రహ్మజ్ఞాన ఫలమునుఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

బ్రహ్మజ్ఞానికి పూర్వకర్మలన్నియు నశించునని గడచిన రెండధికరణములలో సూచింపబడినది. పూర్వకర్మలు ద్వివిధములు, ఫలారంభముకాని కర్మలు సంచిత మని చెప్పబడును. ఫలారంభమునొందిన కర్మలు ప్రారబ్ధమని చెప్పఁబడును. ఈ కారణముచేతనే బ్రహ్మజ్ఞానమునకు కారణమైన శరీరము సృష్టింపబడినది.

ఈ రెండు కర్మలున్నూ నశించునని పూర్వపక్షి పలుకును. ఏలననగా అతని సమస్తకర్మలు నశించునని ముండకోపనిషత్తు నుడువుచున్నది. "క్షీయంతే చాస్య కర్మాణి" (ముం.ఉ. 2-2-9). దీనిచే ఇది, అది యనక సమస్తకర్మలని మనము గ్రహించవలయును.

ఇంతేకాకుండా ఆత్మసాక్షాత్కారము నొందిన ముని అకర్తయై యున్నాడు. అతనికి కర్త ృత్వభావము లేదు. అతని అకర్త ృత్వభావము సంచితము, లేక ప్రారబ్ధమునకు సంబంధించియున్నది. కావున బ్రహ్మజ్ఞానము నొందినప్పుడు ఈ రెండు కర్మలున్నూ నశించును.

ఈ సూత్రము దీనిని ఖండించి, జ్ఞానముచే ఫలారంభముకాని సంచిత కర్మలు మాత్రము నశించును. కాని ప్రారబ్ధకర్మ నశింపదని నుడువును. ప్రారబ్ధ కర్మలు అనుభవింపఁబడినప్పుడు మాత్రమే నశించును. ఫలారంభమైన కర్మలు మఱియు సగము ఫలము అనుభవింపఁబడిన కర్మలచేతనే ప్రస్తుతము బ్రహ్మ జ్ఞానోదయమైన శరీరము జనించుటచే జ్ఞానముచే అవి నశింపఁజేయబడవు. ఈ దృష్టికోణమునకు ఈ క్రింది శ్రుతివాక్యము ఆధారముగా నున్నది. "తస్యతావ దేవచిరం యావన్న విమోఽక్షేథ సంపత్స్యే" (ఛాం. ఉ. 6-11-2) దీనిచే మోక్షముఁబడయునప్పుడు శరీరపాతము నిర్ణయింపఁబడును.

అట్లుకాదేని, జ్ఞానమునుఁగూర్చి ప్రబోధించు ఆచార్యులకు ఉనికి ఉండ కుండెడిది. కావున ప్రారబ్ధకర్మలు జ్ఞానముచే నశింపఁజేయఁబడవు.

అగ్ని సమస్త బీజములను నశింపఁజేయునని ఒకవేళ పలికినచో, కుమ్మరివాని చక్రమువలె ఆరంభింపఁబడినది జరిగి తీరునని మేము సమాధాన మెసంగుదుము.

సమ్యక్ జ్ఞానముచే మిథ్యాజ్ఞానము తొలగింపఁబడినను, బాధితానువృత్తిచే అది కొంతవరకు శేషించియుండును.

ప్రతి మానవుని ఆంతరికతత్త్వము మరియొకనిచే నిషేధింపఁబడజాలదు లేక, సందేహింపఁబడజాలదు. భగవద్గీతలోని స్థితప్రజ్ఞ వర్ణనయందీ సత్యము వెల్లడింపఁబడినది.

విడువఁబడిన బాణమును ఒక విలుకాడు ఎట్లు నియమింపఁజాలడో, అది తన చలన శక్తిని కోల్పోయినప్పుడు మాత్రమే ఎట్లు భూమిపైపడునో, అట్లే బ్రహ్మజ్ఞానియు ప్రారబ్ధకర్మను నియమింపఁజాలడు. ప్రారబ్ధకర్మక్షయ మగునంత వరకు జీవన్ముక్తుడు తన శరీరమును ధరింపవలసియుండును. ప్రారబ్ధకర్మ అనుభవింపఁబడిన తర్వాత శరీరము పతనమగును. మఱియు అతడు విదేహ ముక్తి నొందును.

కావున జ్ఞానముచే ఫలారంభముకాని సుకృత దుష్కృత కర్మలు మాత్రమే నశించునని నిర్ణయింపఁబడినది.

# 12. అగ్నిహోత్రాద్యధికరణము

## (16–17 సూత్రములు)

### 4–1–16 అగ్నిహోత్రాది తు తత్కార్యాయైవ తద్దర్శనాత్

కాని శ్రుతి వచనానుసారముగా అగ్నిహోత్రాదులు జ్ఞానము, లేక మోక్షమునుఁ బడయఁజేయును.

అగ్నిహోత్రాది = నిత్యాగ్నిహోత్రాదులు, తు = కాని, తత్కార్యాయ = జ్ఞాన ఫలము నిమిత్తమై, ఏవ = మాత్రమే, తద్దర్శనాత్ = శ్రుతులలో చూడఁబడుఁటచే.

వేదవిహితములగు అగ్నిహోత్రాది నిత్యకర్మలు జ్ఞానమువంటి ఫలమును కలుగఁజేయును. ఏలననగా ఈ విషయము ఈ క్రింది శ్రుతివాక్యమునందు పేర్కొనఁబడినది. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన" (బృ.ఉ. 4–4–22).

కాని జ్ఞానకర్మలు భిన్నమైన ఫలములను కలిగియుండుటచే, అవి రెండున్నూ ఒకే ఫలము నొసంగఁజాలవనెడి ఆక్షేపణ చెప్పఁబడినది.

దీనికి మా సమాధాన మేమనగా పెరుగు మఱియు విషములు జ్వరము మఱియు మృత్యువులను సామాన్యఫలములుగా కలిగియున్నను, పెరుగునందు చక్కెర చేర్చినచో తృప్తి, మఱియు మంత్రోచ్చారణతో విషమును సేవించినచో శారీరక వికాసము కలుగుటను మనముఁగాంచుచున్నాము. అదే విధముగా కర్మలు జ్ఞానముతో మేళవింపఁబడినప్పుడు అవి ముక్తికి దారితీయుననుట నిశ్చయము.

ఏలాటి ఫలము నొసంగకున్నను, ఒక విధమగు శిక్షణగా శ్రుతులలో విధింపఁబడినట్టి అగ్నిహోత్రాది నిత్యకర్మలు కూడా జ్ఞాన ప్రకాశముచే నశింపఁజేయఁబడునని పూర్వపక్షి పలుకును. కోరికలతో ఒనర్పఁబడు ఇతర కర్మలవలె ఇవికూడా నశించును. ఏలననగా బ్రహ్మజ్ఞానికి అకర్తృత్వభావన రెండింటియందును సమానముగానే యుండును.

ఈ సూత్రము ఈ దృష్టికోణమును ఖండించి, నిత్యకర్మలు నశింపఁజేయ బడవని పలుకును.

నిత్యకర్మలు హృదయశుద్ధిని కలిగించి, జ్ఞానోదయమునకు సహకరించును. అవి పరోక్షముగా మోక్షమునకు కారణమగును. అవి శీఘ్రముగా పరమపదము నొందించుటకు ఉపయుక్తమగును. కావున మృత్యువు వరకు అవి ఫలముల నొసంగును.

## 4-1-17 అతోఽన్యాపి హ్యే కేషా ముభయోః

ఏలననగా కొందఱి మతము ననుసరించి దీనికి భిన్నమైన సత్కర్మ సమూహము కూడా కలదు. ఆ కర్మల గతి ననుసరించి జైమిని మఱియు బాదరాయణులకు ఒడంబడిక ఏర్పడును.

అతః = దీనికంటె, అన్యా = భిన్నమైన, అపి = కూడా, హి = ఏలననగా, ఏకేషామ్ = కొన్ని శాఖలయొక్క, ఉభయోః = ఉభయుల యొక్క.

అగ్నిహోత్రాది నిత్య కర్మలకు భిన్నమైన సత్కర్మ సమూహము కూడా కలదు.

అవి ఫలము నాశించి ఒనర్పఁబడును. దీనిని నిరూపించుటకై కొన్ని శాఖలచే ఈ క్రింది వాక్యము చెప్పఁబడినది. “సుహృదః సాధుకృత్యా ముపయంతి”.

కొన్ని ప్రత్యేక ఫలముల నాశించి ఒనర్పఁబడు కర్మలు నిజమైన జ్ఞానమును ఉత్పన్న మొనర్పఁజాలవని జైమిని మఱియు బాదరాయణుడు ఉభయులున్నూ, అభిప్రాయపడుచున్నారు.

# 13. విద్యాజ్ఞాన సాధనాధికరణము

## 4-1-18 యదేవ విద్యయేతి హి

ఏలననగా “యదేవ విద్యయాకరోతి” యను శ్రుతి వాక్యము దీనినిఁగూర్చి సూచించుచున్నది.

యదేవ = ఏదైతే , విద్యయా = జ్ఞానముతో, ఇతి = ఇట్లు, హి = ఏలననగా.

జ్ఞానోత్పత్తికి సహకరించు నిత్యకర్మలు రెండు విధములు: (1) ఉపాసనా సహితములు (2) ఉపాసనారహితములు.

ఉపాసనారహితములగు కర్మలకంటె ఉపాసనాసహితములగు కర్మలు శ్రేష్ఠములగుటచే అవి జ్ఞానోత్పత్తికి సహకరించునని పూర్వపక్షి పలుకును.

ప్రసుత్త సూత్రము దీనిని ఖండించి ఇట్లు నుడువును. “యేదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి” (ఛాం.ఉ. 1-1-10)అను వాక్యములో ని తర ప్రత్యయముచే ఉపాసనా సహితములగు కర్మలు వీర్యవత్తరములై యున్నను, ఉపాసనారహితములగు కర్మలు పూర్తిగా నిష్ప్రయోజనములు కావని సూచింపఁబడుచున్నది.

సామాన్యమైన అగ్నిహోత్రమైనను శక్తిమంతమై యుండును. కాని జ్ఞానసహితమగు అగ్నిహోత్రము వీర్యవత్తరమై యుండును. ఉపాసనా సహితమగు అగ్నిహోత్రము జ్ఞానోత్పత్తికి దోహద మొసంగుటచే ఆత్మసాక్షాత్కారమునకు శ్రేష్ఠతరమైనది; కాని జ్ఞానరహితములగు కర్మలకిట్టి శ్రేష్ఠత్వము లేదు.

# 14. ఇతరక్షపణాధికరణము

## 4-1-19 భోగేన త్వితర ే క్షపయిత్వా సంపద్యతే

కాని ఫలారంభమునొందిన సుకృత దుష్కృత కర్మలు రెండున్నూ అనుభవింపఁబడి క్షీణించినప్పుడాతడు బ్రహ్మమునందైక్యము నొందును.

భోగేన = భోగించుటతో, తు = కాని, ఇతరే = పుణ్యపాపకర్మద్వయము, క్షపయిత్వా = క్షీణించిన తర్వాత, సంపద్యతే = బ్రహ్మమునందైక్యమగును.

ఈ సూత్రమునందు "జీవన్ముక్తునికి ఈ శరీరమును ధరించుటకు కారణమైన ప్రారబ్ధకర్మ ఏమగును?" అను ప్రశ్నకు సమాధాన మొసంగఁబడినది.

ఫలారంభము నొందని సుకృత దుష్కృత కర్మలన్నియును బ్రహ్మజ్ఞానశక్తిచే నశింపజేయఁబడునని ఇతఃపూర్వము చెప్పఁబడినది. ఇఁక ఫలారంభమునొందిన సుకృత దుష్కృత కర్మలు రెండున్నూ అనుభవింపఁబడిన తర్వాత అతడు బ్రహ్మమునందైక్యమగును. ఈ విషయము ఈ క్రింది శ్రుతివాక్యములలో కానఁబడును. "తస్యతావదేవచిరం యావన్న విమోక్ష్యేఽథసంపత్స్యః" (ఛాం.ఉ. 6-14-2). "బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి" (బృ.ఉ. 4-4-6).

చంద్రద్వయము లేదని తెలిసిన తర్వాత కూడా మానవుడు చంద్రద్వయమునుఁ గాంచునట్లు, మరణానంతరము కూడా బ్రహ్మజ్ఞాని నానాత్వమునుఁ గాంచుననియు, మరణానంతరము కూడా అతడు బ్రహ్మమునందైక్యము నొందడనియు పూర్వపక్షి వాదించును.

ఈ సూత్రము దీనిని ఖండించి ప్రారబ్ధకర్మలు అనుభవము ద్వారా నశింపఁజేయఁబడునని పలుకును. బ్రహ్మజ్ఞాని ఈ ప్రపంచమునందు జీవన్ముక్తుడుగా శేషించి యున్నను, మరణానంతర మాతడు బ్రహ్మమునందైక్యమగును.

అనుభవము ద్వారా ప్రారబ్ధకర్మలు నశింపఁజేయఁబడినప్పుడు ప్రారబ్ధము వంటి కారణమేమియు లేకుండుటచే, అతడు నానాత్వమునుఁ గాంచఁజాలడు. మరణ సమయమునందు ప్రారబ్ధముతో సహా సమస్త కర్మలు నశింప జేయఁబడుటచే అతడు నిశ్చయముగా బ్రహ్మమునందైక్యమగును.

ఈ విధముగా బ్రహ్మజ్ఞానముచే ఫలారంభముకాని సంచితకర్మలు నశించును. ఇcక ఫలారంభమునొందిన ప్రారబ్ధకర్మలు భోగించుటతో నశించును. జీవన్ముక్త పురుషునికైనను ప్రారబ్ధకర్మల ననుభవింపక తప్పదు.

నూతన కర్మసమూహము నూతన ఫలమును ఉత్పన్న మొనర్చునని పూర్వపక్షి మరల వాదించును. అట్లుకాదని మేము సమాధానమొసంగుదుము. ఇట్టి సమస్త ఫలబీజము నశింపcజేయcబడును. శరీర మరణ సమయమునందు ఉత్పన్నమగు నూతన ఫలసమయము కేవలము నూతన కర్మ సమూహమై యున్నది. ఇcక కర్మలు మిథ్యా జ్ఞానముపై ఆధారపడియుండును. కాని ఇట్టి మిథ్యాజ్ఞానము పూర్ణ బ్రహ్మజ్ఞానముచే పూర్తిగా నశింపcజేయcబడును.

కావున ఫలారంభమునొంది కర్మలు నశింపcజేయcబడినప్పుడు, బ్రహ్మజ్ఞాని యగు జీవన్ముక్త పురుషుడు అవశ్యకముగా పూర్ణ కైవల్యస్థితినిcబడయును.

## ఇట్లు
## బ్రహ్మసూత్ర చతుర్థాధ్యాయ
## ప్రథమపాదము
## సమాప్తము

# బ్రహ్మ సూత్రములు

## 4వ అధ్యాయము

## 2వ పాదము

## పీఠిక

ఫలారంభముకాని సంచిత కర్మలు నశించినప్పుడు జీవన్ముక్తి పొందఁబడుననియు మఱియు మృత్యుసమయమునందు ప్రారబ్ధకర్మ నశించినప్పుడు విదేహముక్తి పొందబడుననియును పూర్వపాదమునందు చెప్పఁబడినది.

ముక్త పురుషులు మఱియు అముక్త పురుషులు శరీరమును త్యజించు విధానము ఈ పాదమునందు చెప్పఁబడినది. సగుణ బ్రహ్మజ్ఞాని మరణానంతరము దేవయానముగుండా పయనించు విధానము వర్ణింపఁబడినది. మృత్యుసమయము నందు శరీరమునుండి జీవుడు నిర్గమించు సోపానక్రమమును సూత్రకారుడు శ్రుతివాక్యముల నాధారముగాఁగొని వర్ణించెను. క్షుద్రజ్ఞాని మఱియు సమస్త జ్ఞానరహితుని నిర్గమనము సమానముగా నుండును.

# సార సంగ్రహము

**1వ అధికరణము (1-2 సూత్రములు) :** మరణ సమయమునందు సగుణ బ్రహ్మజ్ఞానికి ఇంద్రియక్రియలు మనస్సు నందు లయించును.

**2వ అధికరణము (3వ సూత్రము) :** మృత్యుసమయమునందు సగుణ బ్రహ్మజ్ఞానికి మానసిక క్రియ ప్రాణమునందు లయించును.

**3వ అధికరణము (4-6 సూత్రములు) :** మరణ సమయమునందు సగుణ బ్రహ్మజ్ఞానియొక్క ప్రాణక్రియ జీవునియందు లయించును.

**4వ అధికరణము (7వ సూత్రము) :** శరీరమునుండి మార్గము వరకు నిర్గమించు విధానము సగుణ బ్రహ్మజ్ఞానికి మఱియు సామాన్య మానవునికి ఏకమేనై యుండును. తన్మాత్రాదులతో కలిసి నాడులలోనికి జీవుడు ప్రవేశించు భూమికలు ఉభయులకున్నూ సమానమైయుండును.

**5వ అధికరణము (8-11 సూత్రములు) :** మృత్యుసమయమునందు అగ్న్యాదులు పరదేవతయందు లయించుట పూర్ణలయమనఁబడదు. మోక్షము పొందఁబడినప్పుడు మాత్రమే భూతములన్నియును పూర్ణముగా లయించును.

**6వ అధికరణము (12-14 సూత్రములు) :** మరణకాలమునందు నిర్గుణ బ్రహ్మజ్ఞానియొక్క ప్రాణములు శరీరమునుండి నిర్గమించవు.

**7వ అధికరణము (15వ సూత్రము) :** మృత్యుసమయమునందు నిర్గుణ బ్రహ్మజ్ఞానియొక్క ఇంద్రియములు దానియందే లయించును.

**8వ అధికరణము (16వ సూత్రము) :** మరణకాలమునందు నిర్గుణబ్రహ్మ జ్ఞానియొక్క కళలు బ్రహ్మముతో తాదాత్మ్యమునొందును.

**9వ అధికరణము (17వ సూత్రము) :** మృత్యుసమయమునందు సగుణ బ్రహ్మజ్ఞానియొక్క ఆత్మ హృదయమువరకు వచ్చి, తర్వాత సుషుమ్న ద్వారా బయటి కేగును. అజ్ఞానియగు మానవుని అత్మ మరియొక నాడి ద్వారా బయటికి వెళ్ళును.

**10వ అధికరణము (18–19 సూత్రములు) :** మరణానంతరము సగుణ బ్రహ్మజ్ఞానియొక్క ఆత్మ, రాత్రింబగళ్ళ ఉనికిని కలిగియున్న సూర్యకిరణముల ననుసరించును; మఱియు బ్రహ్మలోకమున కేగును.

**11వ అధికరణము (20–21 సూత్రములు) :** సగుణ బ్రహ్మజ్ఞాని దక్షిణా యనమునందు మరణించినను, అతని ఆత్మ బ్రహ్మలోకమున కేగును.

# 1. వాగధికరణము

## (1–2 సూత్రములు)

## 4–2–1 వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ

శ్రుతి ప్రమాణముచేతను మఱియు చూడఁబడుట చేతను వాక్కు మనస్సునందు లయించును.

వాక్ = వాక్కు, మనసి = మనస్సునందు, దర్శనాత్ = శ్రుతి ప్రమాణముచే, శబ్దాత్ = స్మృతి ప్రమాణముచే, చ = కూడా.

మృత్యుసమయమునందు వాక్కు మనస్సునందు లయించునని ఈ సూత్రము నుడువుచున్నది.

ఇంతవరకు జీవన్ముక్తునిఁగూర్చి వర్ణింపఁబడినది. ఇప్పుడు మరణానంతరము దేవయానముద్వారా బ్రహ్మలోకమును చేఱుట వర్ణింపఁబడుచున్నది.

మరణ విధానమునుఁగూర్చి ఈ క్రింది వాక్యము తెలియఁజేయుచున్నది. "అస్య సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే మనః ప్రాణే ప్రాణ స్తేజసి తేజః పరస్యాం దేవతాయామ్" (ఛాం.ఉ. 6–8–6)

ఇచ్చట మనస్సునందు వాగింద్రియము లయించునా? లేక, కేవలము దాని క్రియ మాత్రము లయించునా? యనెడి సంశయ మేర్పడును.

శ్రుతియందు వాక్కుయొక్క క్రియ సూచింపఁబడకుండుటచే వాగింద్రియము స్వయముగా మనస్సునందు లయించునని పూర్వపక్షి పలుకును.

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి, వాగింద్రియము యొక్క క్రియ మాత్రము మనస్సునందు లయించునను విషయమును నిశ్చయించి చెప్పును.

కారణము నందు కార్యము ఎల్లప్పుడు లయించును. వాక్కు మనస్సుయొక్క కార్యముకాదు. కావున వాగింద్రియము మనస్సునందు లయింపఁజాలదు. కాని కారణముకాని ఒకానొక పదార్థమునందు వృత్తులు లయింపఁగలుగును. దృష్టాంతమునకు అగ్నియొక్క కార్యమగు వేడి ఇంధనమునుండి ఉత్పన్నమై నీటిచే ఆర్పివేయఁబడును.

చావనున్న మనుష్యుని మనస్సు పనిచేయుచున్నను, అతని వాక్కు నిలచి పోవుటను మనముఁగాంచుచున్నాము. మనస్సునందు వాగింద్రియము లయించు టను ఎవ్వడైనను కాంచఁజాలడు.

కావున అనుభవమునుఁబట్టి కూడా మనస్సునందు వాక్కుయొక్క క్రియ మాత్రము లయించును. కాని వాగింద్రియము లయింపదని తెలియుచున్నది.

## 4-2-2 అతఏవ చ సర్వాణ్యను

మఱియు ఈ కారణముచే సమస్తేంద్రియవృత్తులు మనస్సునందు లయించును.

అత ఏవ = ఈ కారణముచే, చ = మరియు, సర్వాణి = సమస్తేంద్రియ ములు, అను (గచ్ఛంతి) = అనుసరించును.

మరణ కాలమునందు సమస్తేంద్రియ వృత్తులు మనస్సునందు లయించునని ఈ సూత్రము సూచించును.

1వ సూత్రమునందు సూచింపఁబడిన కారణములనుఁబట్టి సమస్తేంద్రియ వృత్తులు మనస్సునందు లయించును. "తస్మాదుపశాంత తేజాః, పునర్భవమింద్రియై ర్మనసి సంపద్యమానైః (ప్ర.ఉ. 3-9)

వాక్కువలె నేత్రాది ఇతరేంద్రియములు వృత్తి రహితములై మనస్సు పని చేయుటను మనము గమనింతుము. ఏలననగా స్వయముగా ఇంద్రియములు లయింపఁబడవు. మఱియు నానావిధేంద్రియవృత్తులు మనస్సునందు లయింపఁ బడుటను మాత్రము శ్రుతి అంగీకరించుచున్నది.

# ౨. మనోధికరణము

## 4-2-3 తన్మనః ప్రాణ ఉత్తరాత్

ఉత్తర శ్రుతి ననుసరించి ఆ మనస్సు ప్రాణమునందు లయించును.

తత్ = అది, మనః = మనస్సు, ప్రాణే = ప్రాణమునందు, ఉత్తరాత్ = ఉత్తరశ్రుతి ననుసరించి.

"వాఙ్మనసి సంపద్యతే" (ఛాం.ఉ. 6-8-6) అను వాక్యమునందు వాక్కు యొక్క వృత్తి మాత్రమే లయించునని చెప్పఁబడినది. ఇఁక "మనఃప్రాణే"యను ఉత్తరవాక్యములోని మనస్సు ప్రాణమునందు లయించునా? లేక, మానసిక వృత్తి మాత్రము లయించునా? యనెడి సంశయమిచ్చట కలుగును.

ఇచ్చట ప్రాణమునందు మనస్సు స్వయముగా లయించును. కాని మానసిక వృత్తి కాదని పూర్వపక్షి పలుకును. ఏలననగా ప్రాణము మనస్సు యొక్క ఉపాదాన కారణమైయున్నది. దీనికి ఆధారముగా ఈ క్రింది శ్రుతివాక్యములను అతడు ఉదహరించును. "అన్నమయం హి సోమ్య మన ఆపోమయః ప్రాణః" (ఛాం.ఉ. 6-6-5) "ఆపశ్చాన్నమసృజంత" (ఛాం.ఉ. 6-2-4). కావున మనస్సు ప్రాణమునందు లయించినప్పుడు, పృథ్వి జలమునందు లయించినట్లగును. ఏలననగా మనస్సు అన్నము, లేక పృథ్వి మఱియు ప్రాణము జలమై యుండుటచే కార్యకారణములయందు విభేదముండదు. కావున మనస్సు స్వయముగా ప్రాణమునందు లయించునని శ్రుతి చెప్పుచున్నదే కాని, మానసిక క్రియనుఁ గూర్చి పలుకుట లేదు.

ఈ సూత్రమీ దృష్టికోణమును ఖండించును. ఈ కారణముచేతనే మానసిక వృత్తులు ప్రాణమునందు లయించును. ఏలననగా గాఢనిద్రయందు మఱియు మరణాసన్న సమయమునందు శ్వాస ఆడుచున్నను, మానసికవృత్తులు ఆగిపోవుటను మనముఁగాంచుచున్నాము. మనస్సు ప్రాణమునుండి ఉత్పన్నము కాకుండుటచే, అది దానియందు లయింపఁజాలదు. ప్రాణము మనస్సునకు కారణపదార్థము కాదు. పరోక్షవిధానము ద్వారా మనస్సు నిజముగా ప్రాణము నందు లయించినదను విషయమును కారణ సంబంధము నిరూపింపఁ జాలదు. అట్లయినచో మనస్సు

కూడా పృథ్వియందు, పృథ్వి జలమునందు, శ్వాస జలమునందు లయించి యుండెడిది. లేక, శ్వాసలోనికి ప్రవేశించినట్టి నీటినుండి మనస్సు ఉత్పన్నమైన దనుటకేలాటి ప్రమాణమున్నూ లేదు.

కావున మనస్సు స్వయముగా ప్రాణమునందు లయింపఁజాలదు. మానసిక క్రియ మాత్రమే ప్రాణము నందు లయించును.

# 3. అధ్యక్షాధికరణము

## (4-6 సూత్రములు)

## 4-2-4 సోఽ ధ్యక్షే తదుపగమాదిభ్యః

ఆ ప్రాణము పరిపాలగుడగు జీవునియందు లయించును. ఏలననగా ప్రాణములు జీవుని సమీపించుట ఇత్యాది శ్రుతి ప్రమాణములు కలవు.

సః = అది (ప్రాణము), అధ్యక్షే = పరిపాలకుడగు జీవునియందు, తదుపగమాదిభ్యః = ప్రాణములు జీవుని సమీపించుట ఇత్యాది ప్రమాణములచే.

"ప్రాణస్తేజసి" (ఛాం. ఉ. 6-8-6) శ్రుతివచనము ననుసరించి ప్రాణక్రియ అగ్నియందు లయించునా? లేక, శరీరేంద్రియములకు పరిపాలకుడైన జీవునియందు లయించునా? యనెడి సంశయమిచ్చట కలుగును.

ప్రాణము అగ్నియందు మాత్రమే లయించునని పూర్వపక్షి నిశ్చయించును.

ప్రస్తుత సూత్రము పై దృష్టికోణమునకు సమాధానము నొసంగును. ఏలననగా శ్రుతివాక్యములలో ప్రాణములు జీవుని సమీపించుట ఇత్యాది ప్రమాణములు కలవు.

"ఏవమే వేమమాత్మానమంతకాలే సర్వే ప్రాణా అభిసమాయంతి యత్రై తదూర్ధ్వోచ్ఛ్వాసీ భవతి" (బృ. ఉ. 4-3-88) ప్రాణము తన పంచవిధ వృత్తులతో కలిసి జీవుని అనుసరించునని మరియొక వాక్యమునందు ప్రత్యేకముగా చెప్పఁబడినది. అతడు నిర్గమించునప్పుడు ప్రాణమున్నూ నిర్గమించును. మఱియు ఇతర ప్రాణములు ఆ ప్రాణము ననుసరించును. "ప్రాణమనూత్క్రామంతం సర్వే ప్రాణా అనూత్క్రామంతి" (బృ.ఉ. 4-4-2).

ఏది ఎట్లయినను 1వ సూత్రమునందు పేర్కొనఁబడినట్టి " అస్యసోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే మనః ప్రాణే ప్రాణస్తేజసితేజః పరస్యాం దేవతాయామ్". (ఛాం.ఉ. 6-8-6). అను వాక్యము ఈ దృష్టి కోణమును ఖండింపదు. ఈ విషయము ఈ క్రింది సూత్రమునందు సూచింపఁబడినది.

## 4-2-5 భూతేషు తచ్ఛ్రుతేః

ప్రాణసహితముగా జీవుడు సూక్ష్మభూతములలో లయించునని శ్రుతియందు చెప్పఁబడినది.

భూతేషు = భూతములలో, తచ్ఛ్రుతేః = దానిగురించి వైదిక ప్రమాణ ముండుటచే.

ఈ సూత్రమునందు పూర్వసూత్రము విస్తరించి చెప్పఁబడినది.

ప్రాణసహితముగా జీవుడు భూత సూక్ష్మమునందు విశ్రమించును. ఇది "ప్రాణస్తేజసి" యనెడి శ్రుతివాక్యముచే స్పష్టమగుచున్నది.

జీవుడు ప్రాణసహితుడై అగ్నితో కూడిన భూతసూక్ష్మము నాధారముగాఁ గొని భవిష్యత్ స్థూలశరీరమునకు బీజముగా మారును. "ప్రాణస్తేజసి" అను వాక్యముచే ఈ విషయము మనకు తేటతెల్ల మగుచున్నది. కాని ఈ వాక్యము ప్రాణము తన స్థానమును ధరించునని సూచించుచున్నదే కాని ప్రాణముతో కూడిన జీవుడు తన స్థానమును ధరించునని సూచించుట లేదు.

దీనిలో దోషములేదని మేము పలుకుదుము. పూర్వసూత్రము ప్రాణము మఱియు అగ్నికి మధ్య జీవుని చేర్చును. హరిద్వార్ నుండి అయోధ్యకు, తర్వాత అయోధ్యనుండి వారణాసికి వెళ్ళుచున్నాడని చెప్పుదుము. కావున ప్రస్తుతము చర్చింపఁబడుచున్న వాక్యమున కర్థమేమనగా:- ప్రాణసహితుడగు జీవుడు అగ్నిసహితములగు భూతములయందు వసించును. ప్రాణము ప్రప్రథమముగా జీవునియందు లయించును. తర్వాత ప్రాణసహితుడగు జీవుడు సూక్ష్మభూతములగు అగ్న్యాదుల నాధారముగాఁగొని, భవిష్యచ్ఛరీరమునకు బీజరూపమును ధరించును.,

కాని శ్రుతి కేవలము ఒకే దానినిఁగూర్చి చెప్పుచుండగా, దానిని ఇతర భూతములకు కూడా వర్తింపఁజేయుట నీకు ఉచితమగునా? ఈ ప్రశ్నకు తర్వాతి సూత్రము సమాధానము నొసంగును.

ప్రాణము జీవునితో కలిసి తేజస్సునందే కాకుండా ఇతర భూతములలో కూడా లయించును. ఈ విషయము శ్రుతిచే తెలియఁబడుచున్నది. తేజస్సే అచ్చట అధికాంశమునందుండుటచే, అది తేజస్సునందు మాత్రము లయించునని చెప్పఁబడినది. "పృథివీమయ ఆపోమయో వాయుమయ ఆకాశమయస్తేజో మయః" (బృ.ఉ. 4-4-5).

## 4-2-6 నైకస్మిన్ దర్శయతో హి

ప్రాణసహితుడగు జీవుడు కేవలము ఒకే భూతమునందు లయింపఁబడునని శ్రుతి స్మృతులు రెండున్నూ నుడువుచున్నవి.

న = కాదు, ఏకస్మిన్ = ఒకదానియందు, దర్శయతః = శ్రుతి స్మృతులు రెండున్నూ నుడువుచున్నవి, హి = ఏలననగా,

మరణకాలమునందు జీవుడు ఒక శరీరమును వదలి మరియొక దానియందు ప్రవేశించినప్పుడు సూక్ష్మదేహసహితుడై సమస్తభూత సూక్ష్మమునందు వసించునే కాని, కేవలము అగ్నియందు మాత్రము వసింపడు. ఏలననగా భవిష్యచ్ఛరీరమునకై సమస్తభూతములు ఆవశ్యకములై యుండును. నూతన శరీరము నానావిధ భూతములతో నిర్మాణమగును. ఈ విషయము "ఆపః పురుషవచసః" (ఛాం.ఉ. 5-3-3) అను ప్రశ్నోత్తర పరిచ్ఛేదము ద్వారా "త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాత్" (బ్ర.సూ. 3-1-2) నందు వ్యాఖ్యానింపఁబడినది.

జీవుడు మరియొక శరీరమును ధరించినప్పుడు అతడు కేవలము ప్రాణము నందే విశ్రమింపడు. కాని సమస్త భూతసూక్ష్మము నందు ప్రవేశించును. ఈ విషయము ప్రశ్నోత్తరరూపమునందున్న శ్రుతియందు పేర్కొనఁబడినది.

కర్మానుసారముగా జీవుడు శరీరమును ధరించునని బృహదారణ్యకవాక్యము నుడువుచున్నది. ఏలననగా; గ్రహములు మఱియు అతి గ్రహముల స్థానము కర్మఫలములచే ఏర్పడును. ఇచ్చట సూక్ష్మభూతములే స్థానముగా చెప్పఁబడును. ఏలననగా వీటి నాధారముగాఁగొని నూతన శరీరము నిర్మాణమగును. ఈ రెండు వాక్యములలోని దృష్టికోణములు పరస్పరము ఖండింపఁబడవు.

# 4. ఆసృత్యుపక్రమాధికరణము

## 4-2-7 సమానా చాసృత్యుపక్రమా దమృతత్వం చానుపోష్య

మఱియు మరణకాలమునందు సగుణ బ్రహ్మజ్ఞానికి మఱియు అజ్ఞానికి నిర్గమన విధానము ఆది యందు సామాన్యమై యున్నది. మఱియు అజ్ఞానము భస్మీకృతము కాకుండుటచే సగుణ బ్రహ్మజ్ఞానికి అమృతత్వము సాపేక్షికమై యున్నది.

సమానా = సామాన్యము, చ = మఱియ, ఆసృత్యుపక్రమాత్ = మార్గా రంభము వరకు, అమృతత్వం = అమరత్వము, చ = మఱియు, అనుపోష్య = భస్మముకాకుండా.

నిర్గుణ బ్రహ్మజ్ఞానికి నిర్గమనము లేదు. అతని ప్రాణములు బ్రహ్మమునందు లయించును.

మరణానంతరము భిన్నమైన స్థానములను చేఱుటచే సగుణ బ్రహ్మజ్ఞాని మఱియు సామాన్యమానవుని శరీర నిర్గమన విధానము వేర్వేఱై యుండవలసి యుండెడిదని పూర్వపక్షి పలుకును. సగుణ బ్రహ్మజ్ఞాని బ్రహ్మలోకమున కేగును. ఇఁక సామాన్య మానవుడు ఈ ప్రపంచమునందు తిరిగి జన్మించును.

సగుణ బ్రహ్మజ్ఞాని మరణాకాలమునందు సుషుమ్నానాడి యందు ప్రవేశించి తర్వాత శరీరము నతిక్రమించి దేవయానమార్గమునందడుగిడును. ఇఁక సామాన్యుడగు అజ్ఞాని మరియొక నాడియందు ప్రవేశించి మరియొక మార్గముగుండా వెళ్ళి తిరిగి జన్మించునని ప్రస్తుత సూత్రము నుడువును.

కాని తమ తమ మార్గములలో ప్రవేశించునంతవరకు మరణకాలమునందు ఉభయులకున్నూ నిర్గమన విధానము సమానమై యుండును.

"శతంచైకాచ హృదయస్యనాడ్యస్తాసాం మూర్ధాన మభినిస్సృతైకా, తయోర్ధ్వ మాయన్న మృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి" అని ఛాందోగ్యము 8-6-6 మఱియు కఠోపనిషత్తు 2-3-16 నందు పేర్కొనఁబడినది.

# 5. సంసారవ్యపదేశాధికరణము

## (8-11 సూత్రములు)

## 4-2-8 తదాపీతేః సంసారవ్యపదేశాత్

జ్ఞానము ద్వారా బ్రహ్మమునుఁ బడయు వరకు ఆ సూక్ష్మ శరీరము శేషించి యుండును. ఏలననగా అంతవరకది సాపేక్షికమైన ఉనికిని కలిగియుండునని శ్రుతులు వచించుచున్నవి.

తత్ = సూక్ష్మభూత సంఘాతము, ఆపీతేః = జ్ఞానము ద్వారా బ్రహ్మమును బడయువరకు, సంసారవ్యపదేశాత్ = సాపేక్షికమైన ఉనికినిఁగూర్చి శ్రుతులు వచించుచుండుటచే.

1వ సూత్ర వివరణమునందు "తేజః పరస్యాం దేవతాయామ్" (ఛాం. ఉ. 6-8-6) అను వాక్యము కలదు. అనగా మరణించు మనుజునియొక్క అగ్ని జీవుడు, ప్రాణము మఱియు భూతేంద్రియ సమూహముతో కలిసి బ్రహ్మము నందు లయించునని అర్థము.

అది ఏరకమైన లయమో మనమిప్పుడు విచారింపవలసియున్నది.

ఆ పదార్థములకు పరదేవతయే కారణమై యుండుటచే, అవి నిశ్శేషముగా లయించునని పూర్వపక్షి పలుకును. ఏలననగా సృష్టింపఁబడిన పదార్థములన్నింటికి పరదేవతయే మూలమైయున్నదని నిరూపింపఁబడినది. కావున అవి నిశ్శేషముగా లయించునని చెప్పవలసియుండును. ఇది అంతిమ లయఁమనబడును. మరణానంతరము ప్రతి యొక్కరు అంతిమ బంధనము నుండి విడుదల యగుదురు.

ఇది అంతిమ లయముకాదని ఈ సూత్రము నుడువును. ఆ భూతములకు బ్రహ్మము కారణ పదార్థమైయున్నను, అవి మృత్యుసమయమునందు ప్రళయము మఱియు సుషుప్తికి వలె కేవలము బీజరూపమునందు లయించియుండును. ఈ భూతముల యొక్క క్రియలు మాత్రమే లయించును. కాని స్వయముగా భూతములు లయింపవు.

సంసారమునుండి పూర్తిగా విడుదల నొందువరకు శ్రవణేంద్రియాదులకు స్థానమైయున్న సూక్ష్మభూతములగు అగ్న్యాదులు మనల నావరించియుండును. దీనిచే మనకు పూర్ణజ్ఞానము కలుగును. ఏలననగా అంతవరకు జీవుడు సాపేక్షిక సత్తాకు గుఱి యగునని శ్రుతులు వచించుచున్నవి. "యోనిమన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః స్థాణుమన్యేను సంయంతి యథాకర్మ యథాశ్రుతమ్" (క. ఉ. 2-5-7).

అట్లుకానిచో మరణ కాలమునందు ప్రతి జీవియొక్క ఉపాధులు లయించి, జీవుడు పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందియుండెడివాడు. మరణించిన ప్రతి మానవుడు బ్రహ్మమును చేరియుండెడివాడు. దీనిచే సమస్త శ్రుతి శాసనములు మఱియు సిద్ధాంతములు నిష్ప్రయోజనములై యుండెడివి.

బంధనము సమ్యగ్జ్ఞానము చేతనే నివర్తించఁబడును. కాని మిథ్యాజ్ఞానముచే కాదు. ఒకవేళ మరణకాలమునందు జీవుడు పూర్తిగా లయము నొందునేని, అతనికి పునర్జన్మ ఉండఁజాలదు.

## 4-2-9 సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః

ఈ సూక్ష్మశరీరము స్వాభావికముగా స్వల్పపరిమాణమును కలిగియుండుట చూడఁబడుచున్నది.

సూక్ష్మం = సూక్ష్మము, ప్రమాణతః = పరిమాణమును బట్టి, చ = మఱియు, తథా = ఆ విధముగా, ఉపలబ్ధేః = ఇది అనుభవజన్యమగుటచే.

ఈ శరీరము నుండి నిర్గమించునట్టి జీవునికాధారముగా నున్న అగ్న్యాదిభూత సమూహము స్వాభావికముగా సూక్ష్మము మఱియు స్వల్పపరిమాణమును కలిగియుండవలయును. అది నాడ్యాదులద్వారా నిర్గమించునని నుడువునట్టి శ్రుతివాక్యములచే ఈ విషయము స్పష్టమగుచున్నది.

అది సూక్ష్మమైయుండుటచే పలుచనైన మఱియు సూక్ష్మమైన నాడిద్వారా అది నిర్గమింపఁగలుగును. మఱియు దానికిగల పారదర్శకత్వముచే, అది ఏలాటి స్థూలపదార్థముచే నిరోధింపఁబడ జాలకుండును. మఱియు మరణ కాలమునందది నిర్గమించునప్పుడు ప్రక్కనున్న వారెవ్వరును దానిని గమనింపఁజాలకుందురు.

## 4-2-10 నోపమర్దేనాతః

కావున స్థూలశరీరనాశముచే ఈ సూక్ష్మశరీరమునకు నాశము లేదు.

న = కాదు, ఉపమర్దేన = నాశముచే, అతః = ఈ కారణముచే.

ఇది మిక్కిలి సూక్ష్మమై యుండుటచే స్థూల శరీరము కాల్చఁబడుట, పూడ్చఁ బడుట ఇత్యాదులకు గుఱియైనను సూక్ష్మశరీరము నశింపకుండును.

## 4-2-11 అస్యైవచోపపత్తే రేష ఊష్మా

మఱియు ఈ శరీరమునందున్న ఉష్ణము కేవలము ఈ సూక్ష్మ శరీరమునకే సంబంధించియున్నది. ఏలననగా ఇది సాధ్యమైన విషయమే.

అస్య = సూక్ష్మశరీరముయొక్క, ఏవ = నిశ్చయముగా, చ = మఱియు, ఉపపత్తేః = సాధ్యమగుటచే, ఏష = ఇది, ఊష్మా = శరీరములోని ఉష్ణము.

ప్రాణముఁగల శరీరమును స్పర్శించినప్పుడు అనుభవగోచరమగు ఉష్ణము సూక్ష్మశరీరమునకు చెందియున్నది. మరణానంతరము ఇట్టి ఉష్ణము గోచరము కాదు. కాని రూపము, వర్ణము ఇత్యాదులు చూడఁబడును. జీవితమున్నంతవరకు శరీరములోని ఉష్ణము అనుభవగోచరమగును. దీనిచే శరీరమునకు భిన్నమైన దానియందు ఉష్ణము ఉండునని తెలియుచున్నది. సూక్ష్మశరీరము తన ఉష్ణమును స్థూల శరీరమున కొసంగి, అది జీవించి యున్నంతకాలము దానికి వేడినొసంగును. శ్రుతియున్నూ ఇట్లు నుడువుచున్నది. "ఉష్ణఏవ జీవిష్యన్ శీతోమరిష్యన్."

# 6. ప్రతిషేధాధికరణము

## (12-14 సూత్రములు)

## 4-2-12 ప్రతిషేధాదితిచేన్న శారీరాత్

శ్రుతి నిషేధించుటచే బ్రహ్మజ్ఞానికి ప్రాణములు నిర్గమింపవని పలికినచో, అట్లుకాదని మేము చెప్పుదుము. ఏలననగా శ్రుతి జీవునినుండి ప్రాణ నిర్గమన మును నిషేధించుచున్నదే కాని శరీరమునుండి కాదు.

ప్రతిషేధాత్ = నిషేధకారణముచే, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ వాదించినచో, న = అట్లుకాదు, శారీరాత్ = జీవుని నుండి.

ఈ సూత్రమునందు శంకా సమాధానములనెడి రెండు విభాగములున్నవి. "ప్రతిషేధా దితిచేత్" అనునది శంక. "న శారీరాత్" అనునది సమాధానము.

ఈ సూత్రము పూర్వపక్షి యొక్క దృష్టికోణము నొసంగును. ఇఁక 13 మఱియు 14 సూత్రములు సిద్ధాంత సూత్రములై యున్నవి.

బృహదారణ్యకమిట్లు నుడువును:- "అథాకామయమానోయోఽ కామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామో భవతి నతస్యప్రాణా ఉత్క్రామంతి బ్రహ్మైవసన్ బ్రహ్మేప్యేతి" (బృ.ఉ. 4-4-6). పరమజ్ఞాన సంబంధమైన ఈ నిషేధముచే, బ్రహ్మజ్ఞానియొక్క శరీరమునుండి ప్రాణములు నిర్గమింపవని తెలియుచున్నది. ఈ శ్రుతివాక్యము నిర్గుణ బ్రహ్మజ్ఞానిని సూచించును. మృత్యుకాలమునం దాతని ప్రాణములు నిర్గమింపవని అది నుడువుచున్నది.

పై శ్రుతి వాక్యము ప్రాణములు శరీరమునుండి నిర్గమించుటను నిషేధింపదు, కాని జీవునినుండి నిర్గమించుటను నిషేధించునని పూర్వపక్షి పలుకును. ఒకవేళ ప్రాణములు శరీరమునుండి నిర్గమింపకున్నచో మృత్యువనునదే సంభవింపదు. "నతస్మాత్ప్రాణా ఉత్క్రామంతి" యనెడి మాధ్యందిన సంశోధన వాక్యముచే ఈ విషయము స్పష్టమగుచున్నది.

కావున బ్రహ్మజ్ఞానికి ఆత్మ, ప్రాణ సహితముగా శరీరమునుండి నిర్గమించును. ఈ దృష్టికోణమును తదనంతర సూత్రము ఖండించును.

## 4-2-13 స్పష్టోహ్యేకేషామ్

ఏలననగా కొన్ని మత గ్రంథములలో ఆత్మయొక్క నిర్గమనము స్పష్టముగా నిషేధింపఁబడినది.

స్పష్టః = స్పష్టము, హి = ఏలననగా, ఏకేషామ్ = ఒకశాఖవారియొక్క.

ముక్తపురుషుని విషయమునందు శరీరమునుండి ప్రాణములు నిర్గమింపవు. ఈ విషయమును ఈ క్రింది శ్రుతివాక్యములు స్పష్టీకరించుచున్నవి. "యత్రాయం పురుషోమ్రియత ఉదస్మాత్ప్రాణాః క్రామంత్యాహోనేతి" అనెడి ఆర్తభాగుని ప్రశ్నకు

“నేతి హోవాచ యాజ్ఞవల్క్యః అత్రైవ సమవనీయంతే” యని (బృ.ఉ. 3-2-11) వాక్యము సమాధానమొసంగినది.

ఒకవేళ శరీరమునుండి ఆత్మతో కలిసి ప్రాణములు నిర్గమించినచో, అప్పుడు నిశ్చయముగా ఆత్మకు పునర్జన్మ యుండును. కావున మోక్షమునకు తావు లేకుండును.

కావున బ్రహ్మజ్ఞాని విషయమునందు ప్రాణములు శరీరము నుండి నిర్గమింపవు.

## 4-2-14 స్మర్యతే చ

మరియు స్మృతి కూడా ఇట్లే చెప్పుచున్నది.

స్మర్యతే = స్మృతి చెప్పుచున్నది. చ = మఱియు

బ్రహ్మజ్ఞానులకు నిర్గమనము లేదని మహాభారతమునందుకూడా చెప్పఁబడినది. “మహాభూతాత్మ భూతస్య సమ్యగ్భూతా నిపశ్యతః, దేవా అపి మార్గే ముహ్యంత్యపదస్యపదైషిణః” (మహాభారతము 12-270-22).

# 7. వాగాది లయాధికరణము

## 4-2-15 తాని పరే తథాహ్యాహ

ఆ ప్రాణములు, భూతములు పరబ్రహ్మమునందు లయించునని శ్రుతి నుడువుచున్నది.

తాని = అవి, పరే = పరబ్రహ్మము నందు, తథా = ఈ విధముగా, హి = ఏలననగా, ఆహ = శ్రుతి నుడువుచున్నది.

బ్రహ్మజ్ఞాని యొక్క “ప్రాణముల”ని చెప్పఁబడు ఇంద్రియములు మఱియు భూతములు అతని మరణకాలమునందు అదే పరబ్రహ్మమునందు లయించును. ఏలననగా ఆ విషయమునుఁ గూర్చి శ్రుతి ఇట్లు నుడువుచున్నది. “ఏవమేవాస్య పరిద్రష్టురిమాః షోడశకళాః పురుషాయణాః పురుషం ప్రాప్యాస్తం గచ్ఛంతి” (ప్ర.ఉ. 6-5).

కాని మరియొక శ్రుతియందు బ్రహ్మజ్ఞానిని సూచించుచు కళలుకూడా పరమాత్మకు భిన్నమైనదానియందు లయించునని చెప్పఁబడినది. “గతాః కళాః

పంచదశ ప్రతిష్ఠాః” (ముం. ఉ. 3-2-7). అట్లు కాదని మేము సమాధాన మొసంగుదుము. ఈ తదనంతర వాక్యము సామాన్యదృష్టి కోణము ననుసరించి చెప్పఁబడినది. ఇది సాపేక్షిక దృష్టికోణము అంతమగుటను సూచించును. దానినిఁ బట్టి శరీరము శిథిలమై తనకు కారణమైన భూతములను చేరును. ప్రథమ శ్రుతి భావాతీత దృష్టికోణము ననుసరించి నుడువును. దానినిఁబట్టి బ్రహ్మజ్ఞాని యొక్క విభాగములన్నియును మిథ్యయైన సర్పము రజ్జువునందు లయించునట్లు, బ్రహ్మము నందు మాత్రమే లయించును. ఈ విధముగా దీనియందు భేదభావము లేదు.

సర్వసామాన్యముగా భూతేంద్రియములు తమ కారణపదార్థములయందు లయించినను, బ్రహ్మజ్ఞాని విషయమునందవి బ్రహ్మమునందు లయించును.

# 8. అవిభాగాధికరణము

## 4-2-16 అవి భాగోవచనాత్

శ్రుతి వచనాను సారముగా బ్రహ్మమునందు కళలు అభిన్నముగా లయించును.

అవిభాగః = అభిన్నత్వము, వచనాత్ = శ్రుతివచనానుసారముగా.

“భిద్యేతే చాసాం నామరూపే పురుష ఇత్యేవం ప్రోచ్యతే స ఏషోఽ కలోమృతో భవతి” (ప్ర.ఉ. 6-5).

బ్రహ్మజ్ఞానియొక్క కళలు పూర్తిగా పరబ్రహ్మమునందు లయించును. సామాన్య మానవుని విషయమునందిట్లు సంభవింపదు. అవి భవిష్యజ్జన్మకు కారణమై యుండుటచే, సూక్ష్మరూపమునందు ఉనికిని కలిగియుండును.

జ్ఞానముద్వారా అజ్ఞాన కార్యములైన కళలు నశింపఁజేయఁబడినప్పుడు, అవి శేషించి యుండుట అసంభవము. కావున కళలు పూర్తిగా బ్రహ్మము నందు లయించును. అవి తిరిగి ఉత్పన్నమగుటకు అవకాశములేదు.

# 9. తదోకో౽ ధికరణము

## 4-2-17 తదోకో౽గ్రజ్వలనం తత్ప్రకాశిత ద్వారో విద్యాసామ ర్థ్యాత్తచ్ఛేష గత్యను స్మృతియోగాచ్చహార్దానుగృహీతః శతాధికయా

సగుణ బ్రహ్మజ్ఞానియొక్క ఆత్మ శరీరమునుండి నిర్గమించు వేళయందు, తన నిర్గమన ద్వారమగు హృదయస్థానము ప్రకాశమానమగును. ధ్యాననిష్ఠచేతను మఱియు జ్ఞానశక్తిచేతను నూటిని అతిక్రమించునట్టి సుషుమ్ననాడి ద్వారా తన హృదయమునందున్న ఆత్మ ఊర్ధ్వముఖముగా నిర్గమించును.

తదోకో౽గ్రజ్వలనం = హృదయాగ్రస్థానము ప్రకాశమానమగుట, తత్ప్రకాశితద్వారః = ఈ వెలుగుచే ప్రకాశింపఁబడిన ద్వారము కలవాడు, విద్యా సామర్థ్యాత్ = తన జ్ఞానశక్తిచే, తచ్ఛేషగత్యను స్మృతియోగాత్ = జ్ఞాన విభాగమైన ధ్యాన నిష్ఠచే, చ = మరియు, హార్దానుగృహీతః = హృదయనివాసిచే అనుగ్రహింపఁబడి, శతాధికయా = నూటిని అతిక్రమించిన దానిచే.

పరావిద్యనుఁగూర్చిన చర్చ పూర్తియైనది. ఇప్పుడు సూత్రకారుడు అపరావిద్యయగు ఉపాసననుఁగూర్చి చర్చించుచున్నాడు.

మార్గారంభము వరకు సగుణ బ్రహ్మోపాసకుడు మఱియు అజ్ఞానియగు మానవుని నిర్గమనము ఒకే విధముగా నుండునని 7వ సూత్రమునందు ఇతః పూర్వమే నుడువబడినది. ప్రస్తుత సూత్రమునందు జీవుడు మార్గమునందు ప్రవేశించు విధానము వర్ణింపఁబడినది. బృహదారణ్యక శ్రుతి మానవుని మృత్యువునుఁ గూర్చి ఇట్లు వర్ణించినది. "స ఏతా స్తేజోమాత్రాః సమభ్యాదదానో హృదయమేవా న్వవక్రామతి" (బృ.ఉ. 4-4-1) మరల ఇట్లు వచించును. "తస్యహైతస్య హృదయస్యాగ్రం ప్రద్యోతతే తేనప్రద్యోతే నైష ఆత్మా నిష్క్రామతి చక్షుష్టోవా మూర్ధ్నోవాన్యేభ్యోవా శరీరదేశేభ్యః" (బృ.ఉ. 4-4-2). మరణకాలము నందు ఇంద్రియ సహితమగు ఆత్మ హృదయమును దరిఁజేఱును.

సగుణ బ్రహ్మజ్ఞానికి మఱియు సామాన్య మానవునికి నిర్గమనము సమానమై యుండునా? యనెడి ప్రశ్న ఇచ్చట ఉదయించును.

సామాన్య మానవుని ద్వారము సగుణ బ్రహ్మజ్ఞానియొక్క ద్వారమునకు భిన్నమైయుండును. సామాన్య మానవుడు మృత్యువేళలో నేత్రము, శ్రోత్రము, నాసిక, గుదస్థానము వంటి శరీరములోని ఏదో ఒక భాగమునుండి నిర్గమించును. కాని సగుణ బ్రహ్మజ్ఞాని కేవలము సుషుమ్నానాడి మరియు శిరస్సులోని బ్రహ్మ రంధ్రముద్వారా నిర్గమించును. ఒకవేళ అతడు మరియొక మార్గముగుండా నిర్గమించినచో, అతడు పరమధామమును చేరఁజాలడు.

జ్ఞానశక్తిచేతను మఱియు నిరంతర బ్రహ్మనిష్ఠచేతను మృత్యుగ్రస్తుడైయున్న జీవునికి స్థానమైయున్న హృదయాగ్రము ప్రకాశింపఁజేయఁబడును. మఱియు దానియందు స్థితుడైయున్న పరమాత్ముని అనుగ్రహముచే 7వ సూత్రమునందు సూచింపఁబడిన హృదయమునుండి శిరస్సునకేగు నాడీముఖమనెడి నిర్గమన ద్వారము తెఱువఁబడును. జీవుడు నూట ఒకటవ నాడిలోనికి ప్రవేశించును. ఈ నాడి మోక్షద్వారమని చెప్పఁబడును. ఇతరములగు నూరు నాడులు బంధమునకు కారణమగును.

హృదయస్థితుడైయున్న బ్రహ్మజ్ఞానినిఁగూర్చి శ్రుతి ఇట్లు నుడువును. "శతంచైకా చ హృదయస్యనాడ్యస్తాసాం మూర్ధానమభినిః సృతైకా, తయోర్ధ్వ మాయన్నమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి" (ఛాం. ఉ. 8-6-6).

జ్ఞానికి మఱియు అజ్ఞానికి హృదయాగ్రము సమానముగా ప్రకాశించినను, దానిచే నిర్గమన ద్వారము వెలిగింపఁబడినను, జ్ఞాని బ్రహ్మరంధ్రము ద్వారా నిర్గమించును. ఇతరులు ఇతరస్థలములనుండి నిర్గమింతురు. ఏల? జ్ఞానశక్తిచే, ఒకవేళ జ్ఞానికూడా ఇతరులవలె నిర్గమించునేని, అతడు ఊర్ధ్వలోకమును చేరఁ జాలడు. మఱియు అతని సమస్త జ్ఞానము నిరర్థకమగును.

"విద్యాసామర్థ్యాత్తచ్ఛేషగత్యను స్మృతియోగాచ్చ" నానావిధ విద్యలలో జీవుడు సుషుమ్నానాడిద్వారా ప్రయాణమొనర్చు ఉపాసన విధానము తెలుపఁబడినది. ఆ మార్గము ననుసరించి ఉపాసన నొనర్చువారు మరణానంతరము కూడా ఆ యుపాసనను కొనసాగించవలయునను విషయము ఇప్పుడు నిశ్చయింపఁబడినది.

కావున హృదయవాసియగు బ్రహ్మముచే అనుగ్రహింపబడిన జ్ఞాని బ్రహ్మ రంధ్రమువరకేగు నూట ఒకటవ నాడియగు సుషుమ్నానాడి ద్వారా నిర్గమించును. ఇతర మనుజుల ఆత్మలు ఇతర నాడుల ద్వారా నిర్గమించును.

# 10. రశ్మ్యధికరణము

(18-19 సూత్రములు)

## 4-2-18 రశ్మ్యను సారీ

సగుణ బ్రహ్మజ్ఞాని మరణించినప్పుడు అతని ఆత్మ సూర్యకిరణముల నను సరించును.

రశ్మి = కిరణములు, అనుసారీ = అనుసరించును.

ముక్తపురుషుని నిర్గమనముయొక్క వర్ణన కొనసాగుచున్నది.

ఛాందోగ్యోపనిషత్తు ఇట్లు నుడువును. "అథయత్రైత దస్మాచ్ఛరీరా దుత్క్రామత్యథైతైరేవ రశ్మిభిరూర్ధ్వమాక్రమతే" (ఛాం.ఉ. 8-6-5) మఱియు "తయోర్ధ్వమాయన్న మృతత్వమేతి" (ఛాం.ఉ. 8-6-6).

దీనిచే సుషుమ్న నాడి ద్వారా నిర్గమించు ఆత్మ సూర్యకిరణముల నను సరించునని రూఢియగుచున్నది. రాత్రియందైనను, పగటి యందైనను మరణించు వాని ఆత్మ సూర్యకిరణములననుసరించునా? లేక, పగటి యందు మాత్రమే మరణించువాని ఆత్మ సూర్యకిరణములననుసరించునా? యనెడి సంశయమిచ్చట కలుగును. రాత్రింబగళ్ళలో ఎప్పుడు మరణించినను, జీవులు సూర్యకిరణముల ననుసరింతురని సూచించుచున్నట్లు ఈ సూత్రము మనకు ప్రబోధించును.

## 4-2-19 నిశినేతిచేన్న సంబంధస్య యావద్దేహభావిత్వా ద్దర్శయతి చ

ఒకవేళ జీవుడు రాత్రియందు సూర్యకిరణముల ననుసరింపడని పలికినచో, శరీర మున్నంతవరకు నాడులు మఱియు కిరణములకు సంబంధముండుట చేతను, శ్రుతులు కూడా ఈ విషయమును పేర్కొనుటచేతను అట్లుకాదని మేము నుడువుదుము.

నిశి = రాత్రియందు, న = కాదు, ఇతి = ఇట్లు, చేత్ = ఒకవేళ పలికినచో, న = కాదు, సంబంధస్య = సంబంధముయొక్క, యావద్దేహభావిత్వాత్ = శరీర మున్నంతవరకు, దర్శయతి = శ్రుతి నుడువును. చ = మఱియు

17వ సూత్రమునకు ఒక ఆక్షేపణ చెప్పఁబడి ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకా సమాధానములనెడి రెండు విభాగములున్నవి. "నిశినేతిచేత్" అనునది శంకా విభాగము, మఱియు "న సంబంధస్య యావద్దేహ భావిత్వాద్దర్శయతిచ" అనునది సమాధాన విభాగము.

పగటియందు నాడులకు మఱియు కిరణములకు సంబంధముండుటచే పగటి యందు మరణించిన వ్యక్తియొక్క ఆత్మ కిరణముల ననుసరింపవచ్చును. కాని రాత్రియందు నాడులకు మఱియు కిరణములకు మధ్యఁగల సంబంధము విచ్ఛిన్నమగుటచే జీవుడు కిరణముల ననుసరింపఁజాలడని పలుకవచ్చును.

కాని ఇది యొక దురూహ. ఏలననగా కిరణములు మఱియు నాడులయొక్క సంబంధము శరీరమున్నంతవరకు ఉండును. కావున జీవుడు పగటియందు మరణించినను, రాత్రియందు మరణించినను వ్యత్యాసములేదు.

ఇంతేకాకుండా గ్రీష్మకాలములో రాత్రియందు కూడా సూర్యకిరణములు ఉనికిని కలిగియుండుటను మనము గమనింతుము. ఏలయనగా అప్పుడు మనము వేడి ఇత్యాదుల ననుభవింతుము. ఇతర ఋతువులలో రాత్రులయందవి కొన్ని మాత్రము ఉనికిని కలిగియుండుటచే వాటినిఁ గాంచుట కష్టము. ఇది చలి కాలములో మేఘావృతమైన పగటి వలె నుండును. శ్రుతి కూడా ఇట్లు నుడువును. "అహరేవైతద్రాత్రౌ దధాతి."

మృత్యుచాలనమును ముందే మనము నిశ్చయింపఁజాలము. ఒకవేళ రాత్రి యందు మరణించు మానవునికి పరమధామమును చేర్చునట్టి ఇట్టి నిర్గమనము నిషేధింపఁబడినచో, ఎవడున్నూ ఉపాసన నొనర్పకుండును. జ్ఞానఫలము పగటి మరణము, లేక రాత్రి మరణముపై ఆధారపడియుండదు.

ఒకవేళ రాత్రియందు మరణించిన మానవుడు ఊర్ధ్వగాముడగుటకై వేకువ యగువరకు వేచియుండవలసివచ్చినచో, దహనాదిక్రియల కారణముచే ఉషః కాలమునందాతని శరీరము సూర్యకిరణములలో ప్రవేశింపఁజాలదు. ఇంతే కాకుండా అతడు వేచి యుండఁజాలడని శ్రుతి నొక్కిచెప్పుచున్నది. "స యావత్ క్షిప్యేన్మనస్తావదాదిత్యం గచ్ఛతి" (ఛాం. ఉ. 8-6-5).

ఈ కారణములన్నింటిచే జీవుడు రాత్రింబగళ్ళు సూర్యకిరణముల నను సరించునని తెలియుచున్నది.

# 11. దక్షిణాయనాధికరణము

(20-21 సూత్రములు)

## 4-2-20 అతశ్చాయనేఽ పి దక్షిణే

మఱియు ఈ కారణముచేతనే దక్షిణాయమునందు కూడా మరణించిన జీవుడు సూర్యకిరణముల ననుసరించును.

అతః = ఈ కారణముచేతనే, చ = మఱియు, అయనే = అయనము నందు, అపి = కూడా, హి = నిశ్చయముగా, దక్షిణే = దక్షిణమునందు.

పూర్వసూత్రమునకు ఈ సూత్రము ఉపసిద్ధాంతమై యున్నది.

బ్రహ్మజ్ఞాని దక్షిణాయనమునందు మరణించినచో బ్రహ్మలోకమునకుఁ గొంపోవు కిరణముల ననుసరింపడని పూర్వపక్షి పలుకును. ఉత్తరాయణకాలము నందు మరణించువాడు మాత్రమే బ్రహ్మలోకమును చేరునని శ్రుతి స్మృతులు వాకొనుచున్నవి.

ఇంతేకాకుండా భీష్ముడు శరీరము త్యజించుటకై ఉత్తరాయణమువరకు వేచియున్నట్లు గ్రంథములలో లిఖింపఁబడియున్నది.

పూర్వసూత్రమునందు పేర్కొనబడిన కారణమునుఁబట్టి అనగా :- ప్రత్యేక సమయమునందు మరణించినప్పుడే జ్ఞానఫలము లభించుననుట అనుచిత మగుటచే, సగుణ బ్రహ్మజ్ఞాని దక్షిణాయనమునందు మరణించినను బ్రహ్మ లోకమును చేరునని ఈ సూత్రము నుడువుచున్నది.

ఈ కారణముచేతనే అనగా :- వేచియుండుట అసాధ్యమగుటచేతను, జ్ఞానఫలము కేవలము ఆనుషంగికము కాకుండుటచేతను మఱియు మరణకాలము నిశ్చయింపఁబడకుండుట చేతను సత్యజ్ఞానము కలిగియున్నవాడు దక్షిణాయనము నందు మరణించినను జ్ఞానఫలము నొందును.

"తేఽ ర్చిషమభిసంభవంత్యర్చిషోఽ హరహ్న ఆపూర్యమాణ పక్షమాపూర్య మాణ పక్షాద్యాన్ షడు దఙ్ఙేతి మాసాంస్తాన్" (ఛాం.ఉ. 5-10-1). అను వాక్యము లోని దక్షిణాయనమునకు సంబంధించిన అంశములు ఒక కాలవిభాగమును

సూచింపవు. కాని 4-3-4వ సూత్రమునందు పేర్కొనఁబడిన దేవతలను సూచిం చును.

దక్షిణాయమునందు మరణించువారు కూడా దేవయానము నందడుగిడ వచ్చును.

ఆచారపరాయణుడగుట చేతను మఱియు తన తండ్రియొక్క వరము నను సరించి తన స్వేచ్ఛామరణమును ప్రదర్శింపఁదలంచుటచేతను భీష్ముడు ఉత్తరాయ ణము వరకు వేచియుండెను.

## 4-2-21 యోగినః ప్రతిచస్మర్యతే స్మార్తేచైతే

మఱియు యోగుల నిమిత్తమై ఈ సమయములు స్మృతులలో పేర్కొనఁ బడినవి; మఱియు యోగము, సాంఖ్యము మాత్రము స్మృతులుగా వర్గీకరింపఁ బడినవి.

యోగినః ప్రతి = యోగి నిమిత్తమై, చ = మరియు, స్మర్యతే = స్మృతి వచించును. స్మార్తే = స్మృతివర్గమునకు సంబంధించినవి, చ = మఱియు, ఏతే = ఈ రెండు.

మరికొంత వివరణద్వారా పూర్వసూత్ర ద్వయములోని వాదము ఇచ్చట బలపఱచబడినది.

పూర్వపక్షి ఇట్లనును. మాకు ఈ క్రింది స్మృతివాక్యము కలదు. "ప్రయాతాయాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ, తత్రప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః" (భ.గీ. 8-23, 24) దీనికి ప్రత్యేకముగా పగటి మరణము ఇత్యాదులచే జీవుడు తిరిగి జన్మింపడని నిశ్చయింపఁబడుచున్నది. ఐతే దక్షిణాయనము, లేక రాత్రియందు మరణించువాడు తిరిగి జన్మింపడని నుడువుట ఎట్లు పొసగును? కావున పూర్వసూత్ర నిర్ణయము సరికాఁజాలదు.

ఈ సూత్రమీ విషయమును ఖండించి ఇట్లనును:- గీతలో పేర్కొనఁబడిన కాలమానాది వివరములు కేవలము యోగము మఱియు సాంఖ్యపద్ధతుల నవలంబించుచు సాధనయొనర్చు యోగులకు మాత్రమే వర్తించును. ఈ రెండున్నూ స్మృతులే కాని, శ్రుతులుకావు. కావున వాటియందు పేర్కొనఁబడిన కాలమానాదులు శ్రుతి వాక్యానుసారముగా సగుణ బ్రహ్మోపాసన నొనర్చువారికి వర్తించవు.

యోగము మఱియు సాంఖ్యము కేవలము స్మృతులు. అవి ఆధ్యాత్మిక సంబంధమైనవి కావు. అది మరియొక మండలాంతర్గతమగుట చేతను మఱియు ప్రత్యేక ప్రమాణముపై ఆధారపడియుండుట చేతను మరణకాలమనెడి స్మృతి నియమము, శ్రుతిపై ఆధారపడియున్న జ్ఞానమునకు వర్తించదు.

కాని ఒక ఆక్షేపణ చెప్పఁబడినది. "అగ్నిర్జ్యోతి రహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్, ధూమోరాత్రిస్తథాకృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్'' (భ.గీ 8-24, 25) అను వాక్యములు స్మృతికి సంబంధించినవైనను, శ్రుతి నిశ్చయము ననుసరించి మనము పితృయానమును గుర్తింపఁగలుగుదుము.

దీనిని ఖండించుచు మేమిట్లు పలుకుదుము. "నేను నీకు మృత్యు సమయమును చెప్పఁగలన"ని నుడుపఁబడినప్పుడు స్మృతి ప్రబోధమునకు వైరుధ్య మేర్పడును. మరణించిన జీవుడు అగ్న్యాది దేవతలను చేరుననెడి స్మృతి ప్రబోధము నందేలాటి వైరుధ్యములేదు.

మనకు కాలముగా గోచరించుచున్నట్టి దినము, శుక్లపక్షము, ఉత్తరాయణము మఱియు రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనములు కేవలము వాటి అధిష్ఠానదేవతలను సూచించును.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర**

**చతుర్థాధ్యాయ ద్వితీయపాదము**

**సమాప్తము**

# బ్రహ్మసూత్రములు

## 4వ అధ్యాయము

## 3వ పాదము

## పీఠిక

పూర్వపాదమునందు సగుణ బ్రహ్మజ్ఞాని దేవయానముగుండా నిర్గమించు విధానము వర్ణింపబడినది. ప్రస్తుత పాదము స్వయముగా ఆ మార్గముఁగూర్చి వివరించును. పూర్వపాదమునందు విడువఁబడిన అంశముతో ఆరంభించి, ఈ పాదము ముక్తపురుషుడు బ్రహ్మలోకమునకు వెళ్ళు మార్గముఁగూర్చి వర్ణించును.

# సారసంగ్రహము

**1వ అధికరణము (1వ సూత్రము) :–** జ్యోతితో ఆరంభింపఁబడి అధిష్ఠాన దేవతలకు సంబంధించిన మార్గము మాత్రమే బ్రహ్మలోకమునకుఁగొంపోవును.

**2వ అధికరణము (2వ సూత్రము) :–** మరణించిన జీవుడు సంవత్సరాధిష్ఠాన దేవతను చేరి, అటుపిమ్మట వాయ్వధిష్ఠాన దేవతను సమీపించును.

**3వ అధికరణము (3వ సూత్రము) :–** మెరుముతో తాదాత్మ్యము నొందిన అధిష్ఠానదేవతను చేరిన తర్వాత జీవుడు వరుణ లోకమును చేఱును.

**1,2,3 అధికరణములు (1–3 సూత్రములు) :–** ఉపాసకుడు సగుణ బ్రహ్మము నొందు మార్గమునందు ఉపనిషత్తులు వివిధముగా పేర్కొనిన భూమిక లను పొందు పఱచును.

**4వ అధికరణము (4–6 సూత్రములు) :–** శ్రుతియందలి దేవయానమార్గము నందు సూచింపఁబడిన జ్యోతి ఇత్యాదులు జ్యోత్యాదులతో తాదాత్మ్యము నొందిన అధిష్ఠానదేవతలను సూచించును. అవి భూమికాక్రమము ననుసరించి జీవుని బ్రహ్మలోకమువరకుఁగొంపోవును.

**5వ అధికరణము (7–14 సూత్రములు) :–** మరణించిన జీవులు దేవయానము గుండా సగుణబ్రహ్మమును చేరుదురు. ఇది 7 నుండి 11వరకుఁ గల సూత్రములలో వివరింపఁబడిన బాదరాయణుని మతము. 12 నుండి 14

సూత్రములలో ఉపాసకుని ఆత్మ సగుణ బ్రహ్మమునుఁ గాక ఉన్నతోన్నతమైన నిర్గుణ బ్రహ్మమును చేరునని జైమిని తద్విరుద్ధముగా వాదించును. జైమినియొక్క దృష్టి కోణము కేవలము పూర్వపక్షమునకు సంబంధించియున్నది. బాదరాయణుని మతము సిద్ధాంతపక్షమునకు సంబంధించియున్నది.

**6వ అధికరణము (15-16 సూత్రములు) :-** సంకేతము లేకుండా సగుణ బ్రహ్మమును ఉపాసించువారు మాత్రమే బ్రహ్మలోకమున కేగుదురు.

# 1. అర్చిరాద్యధికరణము

## 4-3-1 అర్చిరాదినా తత్ప్రథితేః

మరణానంతరము సగుణ బ్రహ్మజ్ఞాని యొక్క ఆత్మ అర్చిరాది మార్గమునందు పయనించు విషయము శ్రుతియందు సుప్రసిద్ధమై యున్నది.

అర్చిరాదినా = అధిష్ఠాన దేవతలకు సంబంధించిన మార్గమునందు, తత్ప్రథితేః = శ్రుతియందది ప్రసిద్ధమై యుండుటచే.

మరణానంతరము సగుణ బ్రహ్మజ్ఞాని అర్చిరాది మార్గముగుండా పయనించు నని ఈ సూత్రము నుడువును.

మార్గారంభము వరకు నిర్గమనము ఒకేవిధముగా నుండునని ఇతఃపూర్వము వివరింపబడినది. సగుణ బ్రహ్మజ్ఞాని దేవయానము గుండా బ్రహ్మలోకమును చేఱునని గడచిన పాదమునందు చెప్పఁబడినది. కాని ఈ మార్గముఁ గూర్చి నానావిధ శ్రుతులు నానావిధములుగా పేర్కొనినవి.

ఆది నాడులు మఱియు కిరణముల కూడలియని ఒక వాక్యమునందు వర్ణింపఁబడినది. "అథైతైరేవ రశ్మిభి రూర్ధ్వ మాక్రమతే" (ఛాం. ఉ. 8-6-5). అది జ్యోతితో ఆరంభింపఁబడునని మరియొక వాక్యము వర్ణించును. "తే ర్చిషమమభి సంభవంత్యర్చిషో హః" (ఛాం.ఉ. 5-10-1). కౌషీతకి (1-3) యందు మరియొక మార్గము వర్ణింపబడినది. "స ఏతం దేవయానం పంథానమాసాద్యాగ్నిలోక మాగచ్ఛతి" బృ.ఉ. 5-10-1లో ఇంకొక మార్గము వర్ణింపబడినది. "యదావై పురుషోఽ స్మాల్లోకా త్ప్రైతి సవాయుమాగచ్ఛతి" ముండకము 1-2-11 నందు వేఱొక మార్గము వర్ణింపబడినది. "సూర్యద్వారేణతే విరజాః ప్రయాంతి".

వేర్వేఱు శ్రుతులలో వేర్వేఱుగా వర్ణింపఁబడినట్టి ఈ దేవయానమార్గము ఏకైకమా? లేక, ఇవి పరస్పరము భిన్నమైన మార్గములా? యనెడి సంశయ మిచ్చట  కలుగును.

ఈ శ్రుతులు బ్రహ్మలోకమునకు వివిధ మార్గములను సూచించునని పూర్వపక్షి పలుకును.

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి, ఈ శ్రుతులన్నియును ఒకే మార్గమును సూచించునని పలుకును. మఱియు అర్చిరాది అధిష్ఠాన దేవతలకు సంబంధించిన మార్గములోని వివిధ భూమికలనుఁ గూర్చి వర్ణించునని నుడువును. ఏల? బ్రహ్మజ్ఞానులందఱికి ఇది ఏకైకమార్గమై యున్నదని శ్రుతుల యందు సుప్రసిద్ధమై యుండుటచే.

"తద్య ఇత్థం విదుః యేచేమేరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే తేర్చిషమభి సంభవంతి" (ఛాం. ఉ. 5–10–1) అను వాక్యముచే ఏ విద్య ద్వారా జ్ఞానమునుఁ బడసినను బ్రహ్మజ్ఞానులందఱును అర్చిరాద్యధిష్ఠాన దేవతలకు సంబంధించిన మార్గము ననుసరింతురని స్పష్టమగుచున్నది.

అన్ని విషయములయందును గమ్యస్థానమగు బ్రహ్మలోకము ఏకమేనై యున్నది. అన్ని వాక్యములలోను మార్గములోని కొంతభాగము మాత్రము వర్ణింపఁబడినది. ఈ క్రింది వాక్యములన్నియును బ్రహ్మలోక ప్రాప్తియనెడి ఒకే ఫలమునుఁ గూర్చి ప్రతిపాదించును. "తేతేషు బ్రహ్మలోకేషు పరాః పరావతో వసంతి" (బృ. ఉ. 6–2–15). "తస్మిన్వసతి శాశ్వతీః సమాః" (బృ.ఉ. 5–10–1). "సాయా బ్రహ్మణోజితిర్యా వ్యుష్టిస్తాంజితిం జయతితాం వ్యుష్టిం వ్యశ్నుతే" (కౌ.ఉ . 1–4). వివిధ అధ్యాయములలో వర్ణింపఁబడి యుండుటచే ఈ మార్గము విభిన్నమైనదిగా తలంచుట అనుచితమగును.

కావున శ్రుతివాక్యములన్నియును ఒకే మార్గమును సూచించును. కాని ఈ మార్గముయొక్క సంపూర్ణ వర్ణనకై వివిధ భూమికల నన్నింటిని ఏకత్రిత మొనర్చ వలయునని మనము నిశ్చయింపవలసియున్నది.

నానావిధ శ్రుతులు అర్చిస్సు, ఆదిత్యుడు, వాయువు ఇత్యాది శబ్దములచే మార్గమును సూచించినను, అవి అన్నియును ఒకేయొక మార్గమగు

బ్రహ్మలోకమునకుఁగొంపోవునట్టి దేవయానము, లేక అర్చిరాది మార్గముయొక్క వివిధ భాగములను సూచించును. ప్రతి శ్రుతియు మార్గములోని ఒకానొక విభాగమును సూచించును. ఇట్టి విభిన్న భూమికలను మనము ఏకత్రిత మొనర్పవలసియున్నది.

# 2. వాయ్వధికరణము

## 4-3-2 వాయు మబ్దా దవిశేష విశేషాభ్యామ్

అవిశేష విశేషములచే సగుణ బ్రహ్మజ్ఞాని మరణించినప్పుడు ఆతని ఆత్మ సంవత్సరాధిష్ఠానదేవత నుండి వాయ్వధిష్ఠాన దేవతవరకేగును.

వాయుమ్ = వాయువుయొక్క అధిష్ఠానదేవతను, అబ్దాత్ = సంవత్సరాధిష్ఠాన దేవత నుండి, అవిశేష విశేషాభ్యామ్ = సామాన్యముగా ఒక శ్రుతి యందును, విశేషముగా మరియొక శ్రుతియందును చెప్పఁబడుటచే.

దేవయాన మార్గ వర్ణన కొనసాగుచున్నది.

ఈ సూత్రము భూమికలయొక్క క్రమమును నిర్ణయించును. కౌషీతక్యుపనిషత్తు మార్గమును ఈ క్రింది విధముగా వర్ణించును. "స ఏతం దేవయానం పంథాన మాపద్యాగ్నిలోక మాగచ్ఛతి సవాయులోకం సవరుణలోకం స ఇంద్రలోకం స ప్రజాపతిలోకం స బ్రహ్మలోకమ్" (కౌ. ఉ. 1-3).

ఇచ్చట అగ్నిలోకము జ్యోతిర్లోకమును సూచించును. ఏలననగా ఈ రెండూన్నూ ప్రకాశమును వ్యక్తపఱచును. కావున అవి వేటియందు సంయోగ మొనర్పఁబడవలయునని విచారింప నవసరములేదు.

ఇఁక ఛాందోగ్యము ఈ మార్గమును ఈ క్రింది విధముగా వర్ణించును. "తేఽ ర్చిషమభి సంభవంత్యర్చిషోఽ హరహ్న ఆపూర్యమాణపక్ష మాపూర్యమాణ పక్షాద్యాన్ షడుదఙ్ఞేతి మాసాంస్తాన్ మాసేభ్యః సంవత్సరం సంవత్సరాదిత్య మాదిత్యా చ్చంద్రమసం చంద్రమసోవిద్యుతమ్" (ఛాం. ఉ. 5-10-1). ఇచ్చట అర్చిస్సు నుండి ఆరంభింపఁబడి మార్గమునందు వాయువు పేర్కొనఁబడలేదు. ఇచ్చట అవిశేషత్వమున్నది.

బృహదారణ్యకమునందు ఆదిత్యునికి పూర్వము వాయువు సూచింపఁబడినది. “యాదావై పురుషోఽ స్మాల్లోకా త్ప్రైతిసవాయు మాగచ్ఛతి తస్మై సతత్ర విజహీతే యథారథచక్రస్య ఖంతేన స ఊర్ధ్వమాక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి” (బృ. ఉ. 5-10-1) ఆదిత్యునికి పూర్వము వాయువుయొక్క విశేషోపదేశ కారణముచే, సంవత్సరము మఱియు ఆదిత్యునికి మధ్య వాయువును చేర్చవలసియుండును. ఆదిత్యలోకమునకు పూర్వము జీవుడు వాయులోకమును చేరునని మనము నిశ్చయింపవలసియున్నది.

ప్రయాణమునందొక క్రమబద్ధత ఉండుటచే సూర్యునికి పూర్వము వాయువు వచ్చునని బృహదారణ్యక శ్రుతి (5-10-1) నుడువుచున్నది. కాని అగ్ని లోకానంతరము వాయువు వచ్చుటలో విశేషోపదేశము లేకుండుటచే ఈ క్రింది సామాన్య వాక్యము చెప్పఁబడినది. “స ఏతం దేవయానం పంథా నమాసా ద్యాగ్నిలోక మాగచ్ఛతి సవాయులోకం స వరుణలోకమ్” (కౌ. ఉ. 1-3).

వాజసనేయుల శ్రుతియందిట్లు కలదు. “మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యమ్” (బృ. ఉ. 6-2-15). ఇచ్చట వాయ్వధిష్ఠానదేవత మఱియు ఆదిత్యాధిష్ఠాన దేవతలను క్రమబద్ధమొనర్చుటకై జీవుడు దేవలోకాధిష్ఠాన దేవతనుండి వాయ్వధిష్ఠాన దేవతవరకేగునని మనము అర్థమొనర్చు కొనవలయును.

ఇఁక ఛాందోగ్య శ్రుతియందు దేవలోకాధిష్ఠానదేవత సూచింపఁబడలేదు. మఱియు బృహదారణ్యక శ్రుతియందు సంవత్సరాధిష్ఠానదేవత పేర్కొనఁబడలేదు. ఈ రెండు శ్రుతులున్నూ ప్రామాణికములై యున్నవి. మార్గము యొక్క సంపూర్ణవర్ణనయందు ఈ రెండున్నూ చేర్చబడవలసియున్నవి. సంవత్సరము మాసములకు సంబంధించినదగుటచే, దేవలోకాధిష్ఠానదేవతకు పూర్వము సంవత్సరాధిష్ఠానదేవతను చేర్చవలసియున్నది.

కావున అర్చిస్సు, అహస్సు, శుక్ల పక్షము, షణ్మాసములు, సంవత్సరము, దేవలోకము, వాయులోకము, ఆదిత్యుడు, చంద్రుడు, మెఱుము, వరుణలోకము, ఇంద్రలోకము, ప్రజాపతిలోకము మఱియు బ్రహ్మలోకము ఇవి అనుక్రమములై యున్నవి.

# 3. తడిదధికరణము

## 4-3-3 తడితోఽధి వరుణః సంబంధాత్

రెండింటియందును సంబంధముండుటచే జీవుడు మెఱుముయొక్క అధిష్ఠాన దేవతను చేరిన తర్వాత వరుణుని చేరును.

తడితః అధి = మెఱుము యొక్క అధిష్ఠానదేవత తర్వాత, వరుణః = వరుణ దేవుడేతెంచును, సంబంధాత్ = సంబంధముండుటచే.

ప్రయాణములోని భూమికల గణన కొనసాగుచున్నది.

ఛాందోగ్యశ్రుతి ఇట్లు నుడువును. “ఆదిత్యాచ్చంద్రమసం చంద్రమసో విద్యుతమ్” (ఛాం.ఉ. 4-15-5) కౌషీతకి ఇట్లు నుడువును. “ స వాయులోకం స వరుణలోకమ్” (కౌ.ఉ. 1-3) విద్యుత్తు మఱియు వరుణునియందు సంబంధముండుటచే ఈ రెండు శ్రుతులను ఏకత్రితమొనర్చి, మెఱుము తర్వాత వరుణుని చేర్చవలసియుండును. మేఘములనుండి ఘనమైన విద్యుత్తు గొప్ప ఉఱుముతో బయల్వెడలి ఆ తర్వాత వర్షించును. “విద్యోతతే స్తనయతి వర్షిష్యతివా” (ఛాం.ఉ. 7-11-1). వానదేవుడే వరుణుడు. విద్యుత్తు వర్షమునకు ముందు వచ్చును. కావున విద్యుత్తు తర్వాత వరుణుడేతెంచును.

ఇతర స్థలము లేకుండుటచే వరుణుని తర్వాత ఇంద్రుడు మఱియు ప్రజాపతి ఏతెంతురు. కౌషీతక్యుపనిషత్తు కూడా ఈ క్రమమునే సూచించును.

దేవయానమార్గములోని భూమికల యొక్క పూర్ణగణన ఈ క్రింది విధముగా నుండును. అగ్న్యధిష్ఠానదేవత, అహర్దేవత, శుక్లపక్షదేవత, ఉత్తరాయణదేవతలు, సంవత్సరదేవత, దేవలోకాధిష్ఠానదేవత, వాయుదేవత, ఆదిత్యుడు, చంద్రుడు, విద్యుద్దేవత, వరుణలోకము, ఇంద్రలోకము, ప్రజాపతిలోకము తుట్టతుదకు బ్రహ్మలోకము.

# 4. ఆతివాహికాధికరణము

## (4-6 సూత్రములు)

## 4-3-4 ఆతి వాహికాస్తల్లింగాత్

ఆ చిహ్నముల ననుసరించి దేవయాన మార్గమునందీ దేవతలు జీవుని ప్రవర్తింపఁజేయుదురు.

ఆతివాహికాః = మరణానంతరము జీవుని ప్రవర్తింపఁజేయువారు, తల్లింగాత్ = అట్టి చిహ్నముల కారణముచే.

దేవయానముయొక్క వర్ణన కొనసాగుచున్నది.

అర్చిస్సును ఆదిగా కలిగియున్నవాటినిఁబట్టి అవి మార్గమునకు చిహ్నములా? లేక, భోగభూములా? లేక, జీవులను ప్రవర్తింపఁజేయునవా? అనెడి సంశయమేర్పడును.

ప్రబోధమునందట్టి విశేషణముండుటచే అర్చిస్సు ఇత్యాదులు మార్గచిహ్నము లని పూర్వపక్షి పలుకును. సామాన్యముగా ఒక గ్రామము, లేక పట్టణము చేరదలంచు వ్యక్తితో ఒకానొకడు ఇట్లు చెప్పును. "ఇచ్చటనుండి కొండవరకేగుము. అచ్చటినుండి వటవృక్షమువరకు వెళ్ళుము. ఆ చెట్టునుండి నదివరకు పొమ్ము. అచ్చటి నుండి గ్రామమునకు వెళ్ళుము. తదనంతరము నీవు పట్టణమును చేఱుదువు". అదే విధముగా ఇచ్చట కూడా శ్రుతి ఇట్లు పలుకును. "అర్చిషో ఉ హరహ్న ఆపూర్వమాణపక్షమ్" ఇత్యాదులు.

అట్లుకాదేని అర్చిరాదులు భోగభూములుగా తలంపఁబడవచ్చును. ఏలననగా శ్రుతియందు అగ్న్యాదులతోపాటు "లోకమ" ను పదము చేర్చఁబడినది. "అగ్నిలోక మాగచ్ఛతి" (కౌ.ఉ. 1-3). ఇచ్చట లోకమను శబ్దము "మనుష్యలోకము, పితృలోకము, దేవలోకము" ల వలె జీవులుండెడి భోగభూమిని సూచించును.

కావున అర్చిరాదులు ఆతివాహికములు కావు. ఇంతేకాకుండా అవి ప్రజ్ఞా రహితములై యుండుటచే అవి ఆతివాహికములు కాఁజాలవు. సామాన్యముగా కష్టమైన దారులలో పయనించుటకై రాజు ప్రజ్ఞగల వారినే సేనానాయకులుగా నియమించును.

ప్రస్తుత సూత్రము దీనిని ఖండించును. అవి ఆతివాహికములై యుండ వలయును. అవి మరణించిన జీవులను ఆదరించి, వారిని బ్రహ్మలోకమునకుఁ గొంపోవును. "చంద్రమసో విద్యుతం తత్పురుషోఽ మానవః స ఏతాన్ బ్రహ్మగమ యతి" (ఛాం.ఉ. 4-15-5) అను శ్రుతి వాక్యమునందు చిహ్నములుఁగాని భోగభూములుఁగాని సూచింపఁబడలేదు. కావున వాటిని ఆతివాహికములుగా మనము అర్థమొనర్చుకొనవలయును. పూర్వము సూచింపఁబడిన మానవ సదృశు లుగా కాక, ఇచ్చట "అమానవుడు" ఆతివాహకుడని ఈ శ్రుతి నుడువుచున్నది.

## 4-3-5 ఉభయ వ్యామోహాత్తత్సిద్ధేః

దేవతలు, లేక, దివ్యమార్గదర్శులు ఈ శ్రుతియందు వ్యక్తిగతమగు ఆతివాహకులుగా తలంపఁబడుదురు. ఏలననగా పథము మఱియు పథికుడు రెండున్నూ ప్రజ్ఞారహితములై యుండును.

ఉభయ = పథము మఱియు పథికుడు, వ్యామోహాత్ = ప్రజ్ఞారహితమై యుండుటచే, తత్సిద్ధేః = అది నిర్ణయింపఁబడుటవలన.

ఈ సూత్రము 4 వ సూత్రమును బలపఱచుచు వాదించును.

అవయవములు మనస్సులోనికి నివర్తింపఁబడియుండుటచే మరణించిన జీవులు తమకు తాము మార్గదర్శులు కాఁజాలరు. అర్చిరాదులు ప్రజ్ఞారహితములై యున్నవి. కావున అవి కూడా జీవులకు మార్గదర్శకములు కాఁజాలవు. ఈ కారణముచే అర్చిరాదులతో తాదాత్మ్యము నొందియున్న ప్రజ్ఞాసమన్వితులగు దేవతలు జీవులను బ్రహ్మలోకము వరకుఁ గొంపోవుదురని తెలియుచున్నది. సామాన్యముగా త్రాగుఁబోతులు, లేక, ప్రజ్ఞ తప్పినవారు కూడా ఇతరుల సహాయముతో దారిపై నడువఁగలుగుదురు.

అర్చిరాదులు ఎల్లప్పుడు ఉనికిని కలిగి లేకుండుటచే, అవి దారికి చిహ్నము లుగా అంగీకరింపఁబడవు.

అవయవములు మనస్సులోనికి నివర్తింపఁబడుటచే మరణించిన జీవులు భోగముల ననుభవింపఁజాలరు. కావున అర్చిరాదులు వారికి భోగభూములు కాఁజాలవు.

మరణించిన జీవులు ఏయొక్క దానినైనను అనుభవింపఁజాలకున్నను, అవి అచ్చట నివసించుచున్న ప్రాణులకు భోగభూములగుటచే “లోకము” అను శబ్దము వాటి కొసంగఁబడినది.

కావున జీవుడు అగ్నిదేవునిచే అగ్నిలోకమునకు మఱియు వాయుదేవునిచే వాయులోకమునకుఁ గొంపోఁబడుచున్నాడని నిర్ణయింపఁబడుచున్నది.

## 4-3-6 వైద్యుతేనైవ తతస్తచ్ఛ్రుతేః

అచ్చట నుండి జీవులు విద్యుత్తు వరకే తెంచినట్టి అదే అమానవ పురుషునిచే మార్గదర్శిత్వము నొందుదురని శ్రుతి నుడువుచున్నది.

వైద్యుతేన = విద్యుత్తుకు సంబంధించిన అమానవ పురుషునిచే, ఏవ = నిశ్చయముగా, తతః = అచ్చటి నుండి, తచ్ఛ్రుతేః = శ్రుతి ఇట్లు నుడువుటచే.

ప్రయాణముఁగూర్చిన చర్చ కొనసాగుచున్నది.

విద్యుత్తు నుండి వారు బ్రహ్మలోకమున కేగుదురు. బ్రహ్మలోకమునకు అమానవ పురుషుడుఁ గొంపోవును. వారు వరుణాదిలోకములకు అదే అమానవ పురుషునిచే తీసుకొని రాఁబడుదురు. “తాన్వైద్యుతాన్ పురుషో మానస ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి” (బృ. ఉ. 6-2-15).

వరుణాదులు కేవలము జీవులకు ఆటంకము లేకుండా ఏదోయొక రూపము నందు సహకరించుచుందురు.

కావున అర్చిరాదులు ప్రవర్తకులగు దేవతలేయను విషయము నిశ్చయింప బడినది.

# 5. కార్యాధికరణము

## (7-14 సూత్రములు)

## 4-3-7 కార్యం బాదరి రస్య గత్యుపపత్తేః

విగతజీవులు కార్యబ్రహ్మము లేక హిరణ్యగర్భుడు లేక సగుణబ్రహ్మమును చేఱుదురని బాదరిముని అభిప్రాయపడును. ఇదియే వారి ప్రయాణమునకు గమ్యస్థానమని వారి మతము.

కార్యం = హిరణ్యగర్భుని, బాదరిః = బాదరిముని మతము, అస్య = అతని యొక్క, గత్యుపపత్తేః = గమ్యస్థానము సాధ్యమగుటవలన.

జీవుడు నిర్గుణ బ్రహ్మమును చేఱునా? లేక సగుణ బ్రహ్మమును చేఱునా? యనెడి విషయమిప్పుడు చర్చింపఁబడుచున్నది.

పూర్వసూత్రమునందు మార్గమునుఁ గూర్చి వివేచింపఁబడినది. ఈ సూత్రము నుండి జీవుడు పొందు గమ్యస్థానమునుఁగూర్చి చర్చింపఁబడును.

ఛాందోగ్యశ్రుతి ఇట్లు వచించును. "తత్పురుషోఽ మానవస్స ఏనాన్ బ్రహ్మ గమయతి" (ఛాం. ఉ. 5-10-2).

ఆ బ్రహ్మము సగుణ బ్రహ్మమా? లేక, నిర్గుణ పరబ్రహ్మమా? యనెడి సంశయ మిచ్చట కలుగును. అచ్చటికి వెళ్ళుట సాధ్యమైన విషయమగుటచే జీవుడు సగుణ, లేక కార్యబ్రహ్మమును చేఱునని బాదరిముని అభిప్రాయపడును. ఏలననగా ఒక నిశ్చిత స్థలమును ఆక్రమించునట్టి, ఒక ప్రత్యేక స్థానమును కలిగియున్నట్టి మఱియు పరిమితమైయున్నట్టి సగుణ బ్రహ్మము ప్రయాణమునకు గమ్యస్థానమై యుండును. కాని అనంతము మఱియు సర్వవ్యాపకమైయున్న నిర్గుణ బ్రహ్మమును చేరుట సాధ్యముకాదు. ఇంతేకాకుండా నిర్గుణ పరబ్రహ్మము సర్వత్ర వ్యాపించి యుండుట చేతను మఱియు సర్వులకు అంతరాత్మయై యుండుటచేతను దానిని చేరుటయను భావమున కవకాశములేదు.

## 4-3-8 విశేషితత్వాచ్చ

మఱియు మరియొక శ్రుతియందీ బ్రహ్మమునుఁగూర్చి విశేషముగా చెప్పఁబడి యుండుటచే.

విశేషితత్వాత్ = శ్రుతియందు విశేషముగా చెప్పఁబడియుండుటచే, చ = మఱియు.

7వ సూత్రమును బలపఱచు వాదము నుడువఁబడుచున్నది.

ఏలననగా బ్రహ్మమను శబ్దమునకు "లోకాన్" అను శబ్దము విశేషణముగా నున్నది.

"బ్రహ్మలోకాన్గమయతి తే తేషు బ్రహ్మలోకేషు పరాః పరావతో వసంతి" (బృ. ఉ. 6-2-15). అనంతమైయున్న పరబ్రహ్మమునకు బహువచన ప్రయోగము సాధ్యము కాదు. కాని నానావిధావస్థలయందుండు సగుణ బ్రహ్మమునకు బహువచన ప్రయోగము వర్తించును.

## 4-3-9 సామీప్యాత్తు తద్వ్యపదేశః

కాని సగుణబ్రహ్మము నిర్గుణబ్రహ్మమునకు సామీప్యమునందుండుటచే అది పరబ్రహ్మముగా చెప్పఁబడును.

సామీప్యాత్ = సమీపత్వకారణముచే, తు = కాని, తద్వ్యపదేశః = ఆ సంజ్ఞ.

7వ సూత్రమును బలపఱచు వాదము కొనసాగుచున్నది.

ఛాందోగ్య శ్రుతియందు సగుణ బ్రహ్మమునకై ప్రయోగింపఁబడిన "బ్రహ్మమ" ను శబ్దముపైఁగల సందేహమును "తు" శబ్దము తొలగించును.

సగుణ బ్రహ్మము పరబ్రహ్మమునకు సమీపమునందుండుటచే ఈ సంజ్ఞ చెప్పఁబడినదని ఈ సూత్రము నుడువును.

సగుణ బ్రహ్మము కూడా బ్రహ్మమని చెప్పఁబడును. ఏలననగా ఇది అవ్యక్తమైన పరబ్రహ్మమునకు సమీపమునందున్నది. భక్తి మఱియు ఉపాసనలకు యోగ్యమగునట్లుగా పరబ్రహ్మము పరిశుద్ధమైన మనస్సు ఇత్యాది ఉపాధుల ద్వారా ఉపాసింపఁబడు కార్యబ్రహ్మము, లేక సగుణ బ్రహ్మము యొక్క రూపమును ధరించును.

## 4-3-10 కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్

బ్రహ్మలోకము లయించినప్పుడు శ్రుతి వచనానుసారముగా ఆ లోకాధ్యక్షునితో సహా జీవులందఱును పరబ్రహ్మము నొందుదురు.

కార్యాత్యయే = బ్రహ్మలోక ప్రళయమునందు, (కార్య = సగుణబ్రహ్మమనఁబడు విశ్వము) తత్ = దానియొక్క, అధ్యక్షేణ సహ = అధ్యక్షునితో సహ (చతుర్ముఖ బ్రహ్మ, లేక హిరణ్యగర్భుడు). అతఃపరమ్ = దానికంటె మిన్నయగు పరబ్రహ్మము, అభిధానాత్ = శ్రుతి వచనానుసారముగా.

పరబ్రహ్మమునందు జీవుని అత్యంతలయము ఇప్పుడు పేర్కొనఁబడుచున్నది.

పూర్వపక్షి ఇట్లనును:- ఒకవేళ దేవయానమార్గమునందు వెళ్ళు జీవులు సగుణ బ్రహ్మమును చేరినచో "స ఏనాన్ బ్రహ్మ గమయత్యేష దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే" (ఛాం. ఉ. 4-15-5). "తేషాం న పునరావృత్తిః" (బృ. ఉ. 6-2-15) "తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి" (ఛాం.ఉ. 8-6-6) వంటి వాక్యములకు విలువ లేకుండును. ఏలయనగా పరబ్రహ్మము తప్ప మరియొకదానికి ఎచ్చటను శాశ్వతత్వము లేదు. బ్రహ్మ లోకములయించునప్పుడు జీవులు జ్ఞానమును బడసినవారై సగుణ బ్రహ్మముతో పాటు దాని కంటెను ఉన్నతమైనట్టి పరబ్రహ్మము, లేక విష్ణువు యొక్క పరమ పదమును పొందుదురని ఈ సూత్రము వచించుచున్నది. ఇది క్రమముక్తి యని చెప్పబడును. ఇట్లు శ్రుతి వాక్యములు నుడువుచున్నవి.

## 4-3-11 స్మృతేశ్చ

ఈ దృష్టికోణమును స్మృతి వాక్యములు బలపఱచుచున్నవి.

స్మృతేః = స్మృతి వాక్యానుసారముగా, చ = మఱియు.

10వ సూత్రమును బలపరచువాదము పొందుపఱచఁబడినది.

పూర్వసూత్రములోని దృష్టికోణమును స్మృతికూడా బలపఱచుచున్నది. "బ్రహ్మణా సహతే సర్వే సంప్రాప్తే ప్రతి సంచరే, పరస్యాంతే కృతాత్మానః ప్రవిశంతి పరం పదమ్" (కూ. పు. పూ. ఖం. 12-269).

పై నుడువఁబడిన 7-11 సూత్రములు సిద్ధాంత సూత్రములు. కావున స్మృతి వాక్యానుసారముగా జీవులు తమ లక్ష్యమగు కార్యబ్రహ్మము, లేక సగుణ బ్రహ్మమును చేరునని నిర్ణయింపఁబడుచున్నది.

## 4-3-12 పరం జైమినిర్ముఖ్యత్వాత్

"బ్రహ్మమ"ను శబ్దము యొక్క ముఖ్యార్థమునుఁబట్టి జీవులు పరబ్రహ్మమును చేరుదురని జైమిని అభిప్రాయపడుచున్నాడు.

పరం = పరబ్రహ్మము, జైమినిః = జైమినిమునియొక్క మతము, ముఖ్యత్వాత్ = "బ్రహ్మమ"ను శబ్దముయొక్క ముఖ్యార్థమునుఁబట్టి.

12-14 సూత్రములలో బాహ్యదృష్టికోణ మొసంగఁబడినది. 7వ

సూత్రమును నిషేధించుటకై ఒక వ్యతిరిక్తమైన దృష్టికోణమొసంగఁబడినది.

"స ఏనాన్ బ్రహ్మగమయతి" (ఛాం. ఉ. 4-15-5) అను ఛాందోగ్య వాక్యములోని బ్రహ్మశబ్దము యొక్క ముఖ్యార్థము పరబ్రహ్మమగుటచే అది పరబ్రహ్మమును సూచించునని జైమిని అభిప్రాయపడుచున్నాడు.

## 4-3-13 దర్శనాచ్చ

మఱియు ఆ విషయమును శ్రుతి వచించుటచే.

దర్శనాత్ = శ్రుతివాక్యముల ననుసరించి, చ = మఱియు

జైమినిని బలపఱచునట్టి వాదమొసంఁగబడినది.

"తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి" (ఛాం. ఉ. 8-6-6) (కఠ.ఉ. 6-16) అను వాక్యముచే వెళ్ళుట ద్వారా అమృతత్వము పొందఁబడునని తెలియుచున్నది. కాని అమృతత్వము పరబ్రహ్మమునందే సాధ్యమగును. కాని అశాశ్వతమైన సగుణ బ్రహ్మమునందు సాధ్యముకాదు. కావున శ్రుతి ఇట్లు నుడువును. "అథయత్రా న్యత్పశ్యతి యదల్పం తన్మర్త్యమ్" (ఛాం. ఉ. 7-24-1).

కఠోపనిషద్వాక్యము ననుసరించి కూడా ఆత్మ పరబ్రహ్మమువైపు వెళ్ళునని తెలియుచున్నది. సుషుమ్నానాడి ద్వారా శరీరమునుండి బయటికివెళ్ళు జీవుడు అమృతత్వము నొందును. ఇది కేవలము పరబ్రహ్మమునందు మాత్రమే పొందఁ బడును.

## 4-3-14 న చ కార్యే ప్రతిపత్త్యభిసంధిః

మఱియు బ్రహ్మమును పొందు కోరిక సగుణ బ్రహ్మమునందుండదు.

న = కాదు, చ = మఱియు, కార్యే = సగుణ బ్రహ్మమునందు, ప్రతి పత్త్యభిసంధిః = బ్రహ్మసాక్షాత్కారము నొందు కోరిక.

12వ సూత్రమును బలపఱచువాదము కొనసాగుచున్నది.

"ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే" (ఛాం. ఉ. 8-14-1) అను వాక్యమునకు విషయము సగుణబ్రహ్మము కాఁజాలదు. ఈ గృహము, లేక ప్రాంగణములోనికి ప్రవేశించు కోరిక సగుణబ్రహ్మమునకు సంబంధించినది కాదు. ఇది పరబ్రహ్మము

నకు సంబంధించినదనుట యుక్తమగును. ఏలననగా దానికి పూర్వమునందీ దిగువ వాక్యము కలదు. "నామరూప యోర్నిర్వహితా తే యదంతరా తద్బ్రహ్మ" (ఛాం.ఉ. 8-14-1). "యశోహం భవామి బ్రాహ్మణానామ్" అను వాక్యముచే ఆత్మ సర్వాంతరమని తెలియుచున్నది. "యశస్సు" పరబ్రహ్మమునకు పేరు. "న తస్య ప్రతిమా అస్తి, యస్యనామ మహద్యశః" (శ్వే. ఉ. 4-19) అను వాక్యమునందు పరబ్రహ్మము సూచింపఁబడినది.

7-11 సూత్రములకు విరుద్ధముగా పూర్వపక్షి 12-14 సూత్రములలో నుడివి యున్నాడు. 12-14 సూత్రములలోని వాదము ఈ క్రిందివిధముగా ఖండింపఁబడుచున్నది.

దేవయాన మార్గముగుండా వెళ్ళువారు చేఱునది నిర్గుణబ్రహ్మము కాఁజాలదు. వారు కేవలము సగుణబ్రహ్మమును చేరుదురు. పరబ్రహ్మము సర్వ వ్యాపకము. అది సర్వులకు అంతరాత్మ. అది ప్రతియొక్కరికి అంతరాత్మయై యుండుటచే వారు దానిని పొందఁజాలరు.

ఇదివరకే పొందఁబడిన దానివైపు మనము వెళ్ళము. ఒకవ్యక్తి తనకు భిన్నమైయున్న దానివైపు వెళ్ళుట మనకు సామాన్యముగా అనుభవసిద్ధమైయున్నది. పొందువాడు పొందఁబడు దానికి భిన్నుడై యున్నప్పుడు మాత్రమే పయనించుట, లేక పొందఁబడుట సాధ్యమగును.

పరబ్రహ్మమునందు దేశాకాలాది భేదములుండవు. కావున అది గమనము నకు విషయము కాఁజాలదు.

పరబ్రహ్మ సాక్షాత్కారమునందు అజ్ఞానావరణ తొలగింపఁబడుటచే సాధకుడు తన దివ్యమైన నైజస్వరూపమును గుర్తెఱుంగఁగలుగును. అతడు పరబ్రహ్మముతో తనకుఁగల అభిన్నతను తెలిసికొనును. అజ్ఞానము నిర్మూలింపఁబడినప్పుడు బ్రహ్మము స్వయముగా వ్యక్తమగును. అంతే, ఏతత్సాక్షాత్కారమునందు వెళ్ళు టఁగాని, పొందుబడుటఁగాని యుండదు.

కాని దేవయానమునకు సంబంధించిన శ్రుతి ప్రోక్తమగు బ్రహ్మసాక్షాత్కారము కేవలము అజ్ఞానము తొలగింపఁబడుట కాదు, కాని నిజమైనది.

"ప్రజాపతేః సభాంవేశ్మ ప్రపద్యే" అను వాక్యమును పూర్వవాక్యముతో విడఁదీసి, సగుణబ్రహ్మముతో జోడింపవచ్చును.

"యశోహంభవామి బ్రాహ్మణానామ్" (ఛాం. ఉ. 8-14-1) అను వాక్యము నిర్గుణ బ్రహ్మమును సూచింపదు. ఏలననగా "సర్వకర్మా సర్వకామః" (ఛాం. ఉ. 3-14-2) అను వాక్యమునుఁబట్టి సగుణబ్రహ్మము కూడా సర్వాత్మయని చెప్పఁబడును.

నిర్గుణ పరబ్రహ్మోపాసననుఁ గూర్చిన ప్రకరణమునందు సగుణ బ్రహ్మోపాసనకు సంబంధించిన బ్రహ్మమునుఁగూర్చిన ప్రయాణము నిర్గుణబ్రహ్మమును స్తుతించు నిమిత్తమై పేర్కొనఁబడినది.

ఈ కారణములన్నింటినిఁబట్టి 7-11 సూత్రములలోని బాదరియొక్క దృష్టి కోణము సవ్యమైయున్నదని తెలియుచున్నది.

# 6. అప్రతీకాలంబనాధికరణము

## (15-16 సూత్రములు)

### 4-3-15 అప్రతీకాలంబనా న్నయతీతి బాదరాయణ ఉభయథాదోషాత్త త్క్రతుశ్చ

తమ ఉపాసనయందు బ్రహ్మమునకు ప్రతీకమును ఎవరు ఆలంబనముగాఁగైకొనరో, అట్టి వారిని మాత్రము అమానవపురుషుడు బ్రహ్మలోకమునకుఁ గొంపోవునని బాదరాయణుడు అభిప్రాయపడును. దీనిచే రెండు విధములగు సంబంధమునందు దోషముండదు. మఱియు ఉపాసన ననుసరించి సాధకుడు తద్విధముగా రూపొందునని సిద్ధాంతీకరింపఁబడినది.

అప్రతీకాలంబనాన్ = బ్రహ్మోపాసనయందు ప్రతీకము ఆలంబనముగా లేని వారిని, న యతి = అమానవపురుషుడు తీకుకొని వెళ్ళును, ఇతి బాదరాయణః = అని బాదరాయణుడు పలుకును, ఉభయథా = రెండువిధములుగా, అదోషాత్ = దోషము లేకుండుటచే, తత్క్రతుః= ఉపాసన ననుసరించి అతడు రూపొందును. చ = మఱియు.

6వ సూత్రమునందు ప్రారంభింపఁబడినట్టి జీవుడు పరబ్రహ్మమునకు తీసుకొని వెళ్ళఁబడునా? లేక, సగుణ బ్రహ్మమునకు తీసుకొని వెళ్ళబడునా? యనెడి చర్చ దీనియందును, తర్వాతి సూత్రమునందును పరిసమాప్తమగును.

"స ఏనాన్ బ్రహ్మగమయతి" (ఛాం. ఉ. 4-15-5) అను వాక్యానుసారముగా సగుణ బ్రహ్మోపాసకులందఱు అమానవపురుషునిచే బ్రహ్మలోకమునకు తీసుకొని పోఁబడుదురా? లేక, వారిలో కొందఱుమాత్రమే తీసుకొని పోఁబడుదురా? యనెడి సంశయ మిచ్చట కలుగును.

వారి ఉపాసన ఎట్టిదైనను అందఱును బ్రహ్మలోకమునకు వెళ్ళుదురని పూర్వపక్షి పలుకును.

బ్రహ్మమునకు ప్రతీకమును అవలంబింపని సగుణ బ్రహోపాసకులు మాత్రమే అచ్చటికి వెళ్ళుదురని ఈ సూత్రము నుడువును. ఇది ఆచార్యుడగు బాదరాయణుని మతము. ఏది ఎట్లయినను "అనిమయః సర్వాసామ్" (బ్ర. సూ. 3-3-31) అను సూత్రమునకు విరోధములేదు. ఏలననగా "సర్వాసామ్" అను పదముచే బ్రహ్మోపాసనయందు ప్రతీకమును ఆశ్రయించని ఉపాసకులందఱని మనము గ్రహింపవలసియుండును.

బ్రహ్మోపాసకులు మాత్రమే అమానవపురుషునిచే బ్రహ్మలోకమునకుఁ గొంపోఁబడుదురు. ఉపాసనా విధమునుఁబట్టి ఫలమేర్పడును. సాలగ్రామ శిలాది ప్రతీకములలో ఇదియే బ్రహ్మమనెడి భావమేర్పడదు. పంచాగ్ని విద్యోపాసకుడు నిస్సంశయముగా బ్రహ్మలోకమునకుఁ గొంపోఁబడునని శ్రుతి నుడువును. కాని శ్రుతి ప్రామాణ్యములు కాని భౌతిక ప్రతీకోపాసకులకు ఇట్టి ఫలము లభింపదు. బ్రహ్మమును ఉపాసించువారు మాత్రమే బ్రహ్మలోకమునకు వెళ్ళుదురు. కాని ఇతరులు కాదని మనము అర్థమొనర్చుకొనవలసియుండును.

బ్రహ్మనిష్ఠుడు మాత్రము బ్రహ్మలోకమునకు చేరఁగలుగును. ఈ విషయమును శ్రుతి స్మృతులు వాకొనుచున్నవి. "యం యథోపాసతే తదేవ భవతి". ఇఁక ప్రతీకోపాసయందు ప్రతీకమే ముఖ్యాంశమై యుండుటచే బ్రహ్మనిష్ఠ సంభవింపదు. కావున ఉపాసకుడు బ్రహ్మలోకమునుఁ బడయఁజాలడు.

## 4-3-16 విశేషం చ దర్శయతి

మఱియు ప్రతీకోపాసన విషయమునందు శ్రుతిభేదమును నుడువుచున్నది.

విశేషం = భేదమును, చ = మఱియు, దర్శయతి = శ్రుతి నుడువుచున్నది.

బాదరాయణుని నిర్ణయమును బలపఱచునట్టి వాదమిచ్చుట చేర్చఁబడినది.

ఛాందోగ్యమునందు పేర్కొనఁబడిన నామము ఇత్యాది ప్రతీకోపాసనలలో ప్రతీక భేదము ననుసరించి, తత్ఫలము కూడా విభేదించునని శ్రుతి నుడువు చున్నది. "యావన్నామ్నోగతం తత్రాస్య యథా కామచారోభవతి" (ఛాం. ఉ. 7-1-5) "యావద్వాచో గతం తత్రాస్య యథా కామ చారోభవతి" (ఛాం. ఉ. 7-2-2).

ఇఁక ఉపాసనలు ప్రతీకములపై ఆధారపడియుండుటచే ఫలభేదమునకు అవకాశము కలదు. కాని వారు ఏకైకాద్వితీయ బ్రహ్మముపై ఆధారపడియున్నచో ఫలమునందు భేదముండదు.

కావున ఉపాసనలకై ప్రతీకములను వినియోగించుకొనువారు ఇతరులవలె ఒకే ఫలమును పొందఁజాలరను విషయము సుస్పష్టమగుచున్నది. సగుణ బ్రహ్మోపాసకులవలె వారు బ్రహ్మలోకమునకు వెళ్ళఁజాలరు.

**ఇట్లు**

**బ్రహ్మసూత్ర చతుర్థాధ్యాయ**

**తృతీయ పాదము**

**సమాప్తము.**

# బ్రహ్మసూత్రములు

## 4వ అధ్యాయము

## 4వ పాదము

## పీఠిక

పూర్వపాదమునందు సగుణబ్రహ్మోపాసకులు బ్రహ్మలోకమును చేఱు విషయము ప్రస్తావింపఁబడినది. ఇఁక, నిర్గుణ బ్రహ్మోపాసకులు పొందునట్టి పరబ్రహ్మ సాక్షాత్కారమునుఁ గూర్చి ఈ పాదము చర్చించును.

# సార సంగ్రహము

**1వ అధికరణము (1–3 సూత్రములు) :** సాక్షాత్కారము నొందిన జీవునికి ఏదైన క్రొత్త విషయము లభ్యముకాదు. కాని కేవలము అతనికి తన సత్స్వరూపము వ్యక్తమగును.

**2వ అధికరణము (4వ సూత్రము) :** ముక్త పురుషుడు బ్రహ్మమునందు అవిభాగస్థితి యందుండునని నిశ్చయించును.

**3వ అధికరణము (5–7 సూత్రములు) :** నిర్గుణ బ్రహ్మము నొందిన జీవుని లక్షణములనుఁగూర్చి చర్చించును. జైమిని మతము ననుసరించి ముక్తపురుషుడు సత్స్వరూపములో వ్యక్తమైనప్పుడు ఛాం. ఉ. 8–7–1 మఱియు ఇతర స్థలములలో బ్రహ్మమున కారోపింపఁబడినట్టి అపహత పాప్మత్వము, సత్యసంకల్పత్వము మఱియు ఐశ్వర్యము ఇత్యాది లక్షణములను కలిగియుండును.

ఔడులోమి మతము ననుసరించి కేవల చైతన్యత్వమే ముక్తపురుషునికి లక్షణమైయున్నది.

బాదరాయణుని మతము ననుసరించి రెండు దృష్టికోణములు ఏకత్రిత మొనర్పబడును. రెండు భిన్నమైన దృష్టికోణములనుఁబట్టి ముక్తపురుషుడు ద్వివిధములుగా వర్ణింపఁబడును. కావున సాపేక్షికము మఱియు భావాతీతమనెడి రెండింటియందు వైరుధ్యముండఁజాలదు.

**4వ అధికరణము (8–9 సూత్రములు) :** సగుణ బ్రహ్మము నొందిన జీవుడు తన కోరికలను కేవలము సంకల్పమాత్రముచే సిద్ధింపఁజేసికొనును.

**5వ అధికరణము (10–14 సూత్రములు) :** బ్రహ్మలోకము నొందిన ముక్త పురుషుడు తన ఇచ్ఛానుసారముగా సశరీరుడై, లేక అశరీరుడై ఉండవచ్చును.

**6వ అధికరణము (15–16 సూత్రములు) :** సగుణ బ్రహ్మము నొందిన ముక్తపురుషుడు ఒకే సమయమునందు అనేక శరీరములను చలింపఁజేయఁ గలుగును.

**7వ అధికరణము (17–22 సూత్రములు) :** బ్రహ్మలోకము నొందిన ముక్తపురుషుడు సృష్ట్యాదులను విడిచి, సమస్తైశ్వర్యశక్తులను కలిగియుండును. ఈ ముక్తపురుషులు ఈ లోకమునకు తిరిగిరారు.

# 1. సంపద్యావిర్భావాధికరణము

## (1-3 సూత్రములు)

### 4-4-1 సంపద్యావిర్భావః స్వేనశబ్దాత్

జీవుడు ఉన్నతోన్నతమైన ప్రకాశము నొందినప్పుడు "స్వ" యను శబ్దము చేతన సత్స్వరూపమును ప్రకటించుకొనునని తెలియుచున్నది.

సంపద్య= పొంది, ఆవిర్భావః = వ్యక్తమగుట, స్వేన = స్వస్వరూపముచే, శబ్దాత్ = శ్రుతి వలన.

ఛాందోగ్యశ్రుతి ఇట్లు నుడువును. "సంప్రసాదోస్మాచ్ఛరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్యస్వేనరూపేణాభినిష్పద్యతే" (ఛాం.ఉ. 8-12-3).

జీవుడు శరీరత్రయము నుండి విడివడినవాడై బ్రహ్మసాక్షాత్కారానంతరము మోక్షమునుఁ బడయునని పూర్వపక్షి పలుకును. స్వర్గాది ఇతర ఫలములవలె మోక్షము కూడా ఒక ఫలమే. నైజత్వము ప్రకటింపబడుటయే ఆవిర్భావమున కర్థము. మోక్షము పూర్వమున్న పదార్థముకాదు. శ్రుతియందుఁగల "గమయతి" యను శబ్దముచే అది స్వర్గాదులవలె నూతనముగా పొందఁబడిన పదార్థమని స్పష్టమగుచున్నది. కావున మోక్షము జీవునిచే పొందఁబడిన నూతన పదార్థమని తెలియుచున్నది. ఒకవేళ ఆవిర్భావము జీవునికి స్వాభావికముగా సంభవించునేని, అది జీవుని ప్రారంభ భూమి కలయందున్నూ కానఁబడియుండెడిది. ఏలననగా ఒక పదార్థము యొక్క స్వభావము దానిని విడిచియుండదు.

ప్రస్తుత సూత్రమీ దృష్టికోణమును ఖండించి, "స్వ" యనెడి శబ్దముచే మోక్షము పూర్వముండియున్నట్లు సూచింపఁబడుచున్నదని పలుకును. దీర్ఘకాలము వరకు

అవిద్యచే కప్పఁబడియున్న తన దివ్యమైన సత్స్వరూపమును జీవుడు వ్యక్తమొనర్చు కొనును. ఇదియే మోక్షావస్థయని చెప్పఁబడును. అది నిశ్చయముగా నూతనముగా పొందఁబడినది కాదు.

## 4-4-2 ముక్తః ప్రతిజ్ఞానాత్

శ్రుతి ప్రామాణ్యము ననుసరించి నైజస్వరూపమును వ్యక్తమొనర్చుకొన్న జీవుడే ముక్తిని బడయును.

ముక్తః = మోక్షమునుఁబడసినవాడు, ప్రతిజ్ఞానాత్ = ప్రతిజ్ఞ ననుసరించి.

పూర్వసూత్రము ఇంకను విశదీకరింపఁబడినది.

సర్వబంధ నివృత్తియే మోక్షమనఁబడును, కాని ఏదోయొక నూతన పదార్థమును ఆర్జించుటకాదు. వ్యాధిని నిర్మూలింపఁజేయుటయే ఆరోగ్యమనఁ బడును, కాని ఒక క్రొత్తపదార్థమును పొందుటకాదు.

ఒకవేళ మోక్షము జీవునిచే పొందఁబడు క్రొత్తపదార్థము కానిచో, దానికి మఱియు బంధనమునకుఁగల భేదమేమి? బద్ధావస్థయందు జీవుడు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలచే కళంకిత మొనర్పఁబడెను. ఈ విషయము ఛాందోగ్యమునందిట్లు చెప్పఁబడినది. “అంధేఽ౽ంధో భవతి స్రామే స్రామః పరివృక్ణే పరివృక్ణోస్యైవ శరీరస్య నాశమన్వేష నశ్యతి” (ఛాం. ఉ. 8-9-1). అది తనకు తాను అంత వంతమైనదిగా తలంచును. అది స్వయముగా మిథ్యయైన ఉపాధులతో తాదాత్మ్యము నొంది సుఖదుఃఖములను మఱియు సంతుష్టి, అసంతుష్టుల ననుభవించును. ఆత్మ సాక్షాత్కారానంతరము అది పరమానందప్రదమగు తన నైజస్వరూపమునుఁ బడయును. అది సమస్త దురూహలు మరియు దుర్భావనల నుండి విముక్తమగును. అది అవిద్య మఱియు తత్కార్యములనుండి విడివడును. అది పూర్ణము, స్వతంత్రము మఱియు విముక్తమైయున్నది. ఇదియే భేదము.

అజ్ఞానము తొలగింపఁబడుటయే మోక్షము సమస్త దురూహలు, లేక దుర్భావనలు నిర్మూలింపఁబడుటయే ముక్తి. జీవాత్మను పరమాత్మనుండి విడఁ దీయునట్టి అజ్ఞానావరణ నశించుటయే మోక్షము, లేక ముక్తి యనఁబడును.

కాని ప్రస్తుతావస్థయందు జీవుడు విముక్తినిఁబడసినట్లు తెలిసికొనుటెట్లు? శ్రుతి ప్రామాణ్యము ననుసరించి దానిని గుర్తింపవచ్చునని ఈ సూత్రము నుడువును.

ఛాందోగ్యోపనిషత్తు ఇట్లు పలుకును :- "ఏతంత్వే వతేభూయోను వ్యాఖ్యా స్వామి". (ఛాం.ఉ. 8-9-3, 8-10-4, 8-11-3), ఇచ్చట శ్రుతి సమస్త అపరిపూర్ణతలనుండి విముక్తమైయున్న ఆత్మనుఁ గూర్చి వ్యాఖ్యానించును. అది ఇట్లు ఆరంభించును. "య ఆత్మాపహతపాప్మా" (ఛాం.ఉ. 8-7-1). "అ శరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః" (ఛాం.ఉ. 8-12-1) మఱియు ఈ క్రింది వాక్యముతో అంతమగును. "స్వేన రూపేణాభి నిష్పద్యతే స ఉత్తమః పురుషః" (ఛాం.ఉ. 8-12-3).

## 4-4-3 ఆత్మా ప్రకరణాత్

ఈ ప్రకరణమునకు విషయము పరమాత్మ యగుటచే జీవుడు పరమాత్మ ప్రకాశము నందు ప్రవేశించునని తెలియుచున్నది.

ఆత్మా = పరమాత్మ, ప్రకరణాత్ = ప్రకరణ విషయమునుఁబట్టి.

1వ సూత్రమునందు నుడువఁబడినట్లు జీవుడు పరమాత్మ స్వరూపము నొందునని ఈ సూత్రము తెలుపును.

పూర్వపక్షి ఇట్లనును. "పరంజ్యోతి రుప సంపద్య" (ఛాం.ఉ. 8-12-3) యను వాక్యమునుఁబట్టి కేవలము కార్య గోచరత్వము సూచింపఁబడుటచే జీవుడు "ముక్తపురుషుడ"ని ఎట్లు చెప్పఁబడును? ఏలననగా సామాన్యముగా "జ్యోతి" యను శబ్దము భౌతిక జ్యోతిని సూచించును. కార్యరంగము నతిక్రమింపని వాడెవ్వడున్నూ ముక్తుడు కాఁజాలడు. ఏలననగా సమస్త కర్మలున్నూ దోష భూయిష్ఠములై యున్నవి. దానికి మేమిట్లు సమాధానమొసంగుదుము. ఈ యాక్షేపణ బలహీనమైనది. అది నిలువనేరదు. ఏలననగా :(ఛాం. ఉ. 8-3-4) వాక్యమునందు పేర్కొనబడిన 'జ్యోతి' శబ్దము ప్రకరణ విషయమును బట్టి పరమాత్మను సూచించునే కాని, భౌతిక ప్రకాశమును సూచింపదు.

"య ఆత్మా పహత పాప్మావిజరో విమృత్యుః।" (ఛాం. ఉ. 8-7-1) అను విషయమును పై వాక్యములోని "జ్యోతి" శబ్దము సూచించును.

కావున ప్రస్తుత విషయమును పరిత్యజించి నూతన విషయమును పరిగ్రహించు దోషము సంభవించుటచే, మేము దానిని భౌతిక జ్యోతిగా స్వీకరింపము.

"తద్దేవా జ్యోతిషాం జ్యోతిః" (బృ.ఉ. 4-4-16) వంటి వాక్యములలో "జ్యోతి" శబ్దము ఆత్మను కూడా సూచించును. ఈ విషయము మేము "జ్యోతిర్దర్శనాత్" (బ్ర. సూ. 1-3-40) నందు చర్చించియున్నాము.

# 2. అవిభాగేన దృష్టత్వాధికరణము

## 4-4-4 అవిభాగేన దృష్టత్వాత్

ముక్తావస్థ నొందిన జీవుడు బ్రహ్మమునకభిన్నుడై యుండును. ఏలననగా శ్రుతులిట్లునుడువుచున్నవి.

అవిభాగేన = అభిన్నముగా, దృష్టత్వాత్ = శ్రుతులలో చూడఁబడుటచే.

ముక్తావస్థ నొందిన జీవుడు బ్రహ్మమునకు భిన్నుడై యుండునా? లేక, అభిన్నుడై యుండునా? యనెడి సంశయమిచ్చట కలుగును.

అతడు బ్రహ్మమున కభిన్నుడై యుండునని ప్రస్తుత సూత్రము వచించును. ఏలననగా శ్రుతివాక్యములట్లు నుడువుచున్నవి. "తత్త్వమసి" (ఛాం. ఉ. 6-8-7) "అహం బ్రహ్మాస్మి" (బృ. ఉ. 1-4-10). "యత్రనాన్యత్పశ్యతి" (ఛాం.ఉ. 7-24-1) "బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి" (బృ.ఉ. 4-4-6). ఈ శ్రుతివాక్యము లన్నింటిచే ముక్తపురుషుడు బ్రహ్మమున కభిన్నుడై యుండునని తెలియుచున్నది.

"యథోదకం శుద్ధేశుద్ధమాసిక్తం తాదృగేవ భవతి, ఏవం మునేర్విజానత ఆత్మాభవతి గౌతమ" (కఠ. ఉ. 4-15) వంటి వాక్యములు ముక్తపురుషుని స్వరూపమును వర్ణించుటయే విషయముగా కలిగియుండుటచే, అవి అభిన్నత్వమునే సూచించుచున్నవి. జీవుడు బ్రహ్మమునందు ప్రవేశించు విషయమును నదులు సముద్రమునందు కలియుటతో పోల్చవచ్చును.

భిన్నత్వమునుఁగూర్చి పలుకు వాక్యములను గౌణముగా తలంపవలయును. మఱియు అభిన్నత్వమును, లేక ఏకత్వమును నిశ్చయింపవలయును.

# 3. బ్రాహ్మాధికరణము

## (5-7 సూత్రములు)

## 4-4-5 బ్రాహ్మేణ జైమిని రుపన్యాసాదిభ్యః

ముక్తపురుషుడు బ్రహ్మముయొక్క లక్షణములను కలిగియుండునని జైమిని అన్వయాదులచే పలుకును.

బ్రాహ్మేణ = బ్రహ్మము యొక్క లక్షణములను కలిగియున్నట్లు, జైమినిః = జైమిని అభిప్రాయపడును. ఉపన్యాసాదిభ్యః = అన్వయాదులచే.

ఈ సందర్భమునందు జైమినిముని యొక్క దృష్టికోణ మొసంగఁబడినది.

ముక్తపురుషుడు బ్రహ్మమును పొందునని చెప్పఁబడినది. బ్రహ్మము రెండంశములను కలిగియున్నది. మొదటిది శుద్ధచైతన్యస్వరూపము. రెండవది ఛాందో గ్యము (8-7-1) నందు వివరింపఁబడినది. "య ఆత్మాఽ ప హత పాప్మావిజరో విమృత్యుర్విశోకో విజఘత్సోఽ పిపాసస్సత్యకామస్సత్యసంకల్పః"

ఈ రెండింటియందు ముక్తపురుషుడు దేనిని పొందుననెడి సంశయమిచ్చట కలుగును. ముక్తపురుషుడు బ్రహ్మముయొక్క సవిశేషమగు అంశమును పొందునని జైమిని పలుకును. ఏలననగా ఆత్మయొక్క ఇట్టి స్వరూపము శ్రుతియందు నిర్దేశింపఁబడియున్నది. సర్వజ్ఞత్వము మఱియు సర్వశక్తిత్వ లక్షణములు పేర్కొనఁబడినవి. కావున ముక్తపురుషుడు బ్రహ్మముయొక్క సవిశేషమగు అంశమును పొందునని జైమిని అభిప్రాయపడును.

## 4-4-6 చితి తన్మాత్రేణ తదాత్మకత్వాది త్యౌడులోమిః

దాని సత్యస్వరూపము శుద్ధచైతన్యమగుటచే, ముక్తపురుషుడు కేవలము శుద్ధ చైతన్యస్థితియందుండునని ఔడులోమి తలంచును.

చితితన్మాత్రేణ = కేవలము శుద్ధచైతన్యస్థితి, తదాత్మకత్వాత్ = అది దాని సత్స్వరూపమగుటచే, ఇతి = ఇట్లు, ఔడులోమిః = ఔడులోమి తలంచును.

ఈ సందర్భమునందు ఔడులోమి ఋషియొక్క దృష్టికోణము చెప్పఁబడుచున్నది.

ఈ సూత్రము ముక్తావస్థయొక్క మరియొక దృష్టికోణము నొసంగును. ఇది ఔడులోమి మునియొక్క దృష్టికోణము. ఆత్మయొక్క సారస్వరూపమైన శుద్ధచైతన్యమును సాక్షాత్కరించుకొనుటయే ముక్తావస్థయని ఔడులోమి నుడువును. ఆత్మ కేవలము శుద్ధచైతన్యస్వరూపమై యున్నది. అది ముక్తావస్థయందు ఇట్టి స్థితి యందుండును.

ఈ నిర్ణయము "ఏవం వా అరేఽయమాత్మానంతరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞా నఘన ఏవ" (బృ.ఉ. 4-5-13) వంటి ఇతర శ్రుతివాక్యములతో కూడా అన్వయించును.

"అపహత పాప్మా" వంటి వివిధ లక్షణములను శ్రుతి పేర్కొన్నను, ఈ లక్షణములు శబ్దవిభేదముచే కేవలము చిత్రవిచిత్రపు టూహలకు తావొసంగును. ఏలననగా శ్రుతి కేవలము పాపము ఇత్యాది సమస్త లక్షణములను రహితమొనర్చుటయే లక్ష్యముగా కలిగియున్నది.

## 4-4-7 ఏవ మప్యుపన్యాసాత్ పూర్వభావా దవిరోధం బాదరాయణః

ఇట్లే అన్వయాదుల ననుసరించి పూర్వపు లక్షణముల ఉనికి అంగీకరింపఁబడుటచే, ఈ రెండింటియందు వైరుధ్యము లేదని బాదరాయణుడు తలంచును.

ఏవం = ఇట్లు, అపి = కూడా, ఉపన్యాసాత్ = అన్వయము ననుసరించి, పూర్వభావాత్ = ఇతఃపూర్వము పేర్కొనఁబడిన ధర్మములు ఆరోపింపఁబడుటచే, అవిరోధం = వైరుధ్యము లేదు. బాదరాయణః = బాదరాయణుడు తలంచును.

ఇప్పుడు సూత్రకారుని స్వయం దృష్టికోణము చెప్పఁబడినది.

బాదరాయణుడీ రెండింటిని సమన్వయపఱచి ఇట్లు పలుకును:- జీవుడు బంధింపఁబడియున్నప్పుడు సర్వజ్ఞత్వము మఱియు సర్వశక్తిత్వమువంటి దివ్య లక్షణములతో కూడిన పరమాత్మ స్వరూపము నిశ్చయించి చెప్పఁబడును. ఇఁక జీవుడు బంధవిముక్తుడైనప్పుడు ఆత్మస్వరూపము శుద్ధచైతన్యముగా నిశ్చయించి చెప్పఁబడును.

ఆత్మయొక్క సత్యస్వరూపము కేవలము శుద్ధచైతన్యముగా అంగీకరింపఁబడినను, అన్వయాదులచే సూచింపఁబడిన బ్రహ్మముయొక్క పరమైశ్వర్యశక్తి

ప్రాపంచిక దృష్టికోణము ననుసరించి కానఁబడుటచే, అది నిరసింపఁబడలేదు. కావున ఇచ్చట వైరుద్ధ్యము లేదు. ఇది ఆచార్యుడగు బాదరాయణుని అభిప్రాయము.

# 4. సంకల్పాధికరణము

## (8-9 సూత్రములు)

### 4-4-8 సంకల్పాదేవ తు తచ్ఛ్రుతే ః

కాని సంకల్పమాత్రముచే ముక్త పురుషులు తమ కోరికలను నెఱవేర్చు కొందురు, ఏలననగా శ్రుతులు ఇట్లు పలుకుచున్నవి.

సంకల్పాత్ = సంకల్పశక్తిచే, ఏవ = మాత్రము, తు = కాని, తచ్ఛ్రుతేః = శ్రుతి ఇట్లు పలుకుటచే.

ముక్తపురుషుడు పొందునట్టి శక్తులు మఱియు స్వాధికారములిచ్చట పేర్కొన బడినవి.

హృదయములోని బ్రహ్మమును ఉపాసించునప్పుడు మనమిట్లు పఠింతుము, "స యది పితృలోకకామోభవతి సంకల్పాదేవాస్యపితరః సముత్తిష్ఠంతి" (ఛాం. ఉ . 8-2-1).

ఇచ్చట ఫలము నొందుటకు సంకల్పము మాత్రమే కారణమా? లేక, మరి యొక ఉపకరణముతో కూడియున్న సంకల్పము కారణమా? యనెడి సంశయ మేర్పడును.

"సంకల్పాదేవ" యని శ్రుతి పలికినను, లోక సామాన్యమువలె మరియొక కారణము సహకరించునని పూర్వపక్షి పలుకును. ఏలననగా తన సంకల్పాను సారముగా తన తండ్రితో కలియుట లోకసిద్ధమై యున్నను, దానియందు

వెళ్ళుట వంటి ఇతర కార్యములిమిడియున్నవి. కావున ముక్తపురుషుని విషయము కూడా ఇట్టిదేనై యున్నది.

కేవల సంకల్ప మాత్రముచే ఫలితము సిద్ధించునని ఈ సూత్రము పలుకును. ఏలననగా శ్రుతి ఇట్లు నుడువుచున్నది. ఒక వేళ మరియొక కారణమావశ్యకమై

యున్నచో "సంకల్పాదేవ" వంటి ప్రత్యక్ష శ్రుతి వాక్యములు ఖండింపఁబడి యుండెడివి.

ముక్తపురుషుని సంకల్పము సామాన్యమానవుని సంకల్పమునకు భిన్నమై యున్నది. మరియొక కారణముయొక్క సహాయము లేకున్నను, అది ఫలము నొసంగు శక్తిని కలిగియున్నది.

## 4-4-9 అత ఏవ చానన్యాధిపతిః

మఱియు ఈ కారణము చేతనే ముక్తపురుషునికి మరియొక అధిపతి లేదు.

అత ఏవ = ఈ కారణము చేతనే, చ = మఱియు, అనన్యాధిపతిః = మరియొక అధిపతిలేదు.

పూర్వ విషయము కొనసాగుచున్నది.

ఈ కారణముచేతనే అనగా :- ముక్తపురుషుని సంకల్పము సర్వశక్తివంతమై యుండుటచే, సర్వజ్ఞుడగు అతనికి మరియొక అధిపతి లేదని తెలియుచున్నది. ఏలననగా సామాన్య మానవుడైనను సహాయమొనర్చుటకు సంకల్పించునప్పుడు, తనకు తాను మరియొక అధిపతికి ఆధీనుడై యుండుటకు అంగీకరింపడు. ఈ ప్రపంచము నందున్నూ ఎవడైనను తనపై అధికారమును చూపునట్టి అధిపతిని కలిగియుండుట కిచ్ఛగింపడు. ముక్తపురుషుడు తనకు తానే అధిపతియని శ్రుతియున్నూ నుడువుచున్నది. "తేషాం సర్వేషు లోకేషు కామచారోభవతి" (ఛాం. ఉ. 8-1-6).

# 5. అభావాధికరణము

## (10-14 సూత్రములు)

## 4-4-10 అభావం బాదరి రాహహ్యేవమ్

ముక్తపురుషులు శరీరేంద్రియ రహితులై యుందురని బాదరి నిశ్చయించును, ఏలననగా శ్రుతి ఇట్లు నుడువుచున్నది.

అభావం = శరీరేంద్రియరాహిత్యము, బాదరిః = బాదరిముని నిశ్చయించును. ఆహ = శ్రుతి నుడువును, హి = ఏలననగా, ఏవమ్ = ఇట్లు.

ముక్తపురుషునికి శరీరధారణ ఉండునా? లేదా? యనెడి విషయము చర్చింపఁబడుచున్నది.

"సంకల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠంతి" అను వాక్యమునుఁబట్టి ముక్త పురుషుడు సంకల్పించుటచే అతనికి మనస్సున్నదని తెలియుచున్నది. అతనికి శరీరేంద్రియములున్నవా? లేదా? యనెడి సంశయమిచ్చట కలుగును.

అతనికి శరీరేంద్రియము లుండవని బాదరిముని పలుకును. ఏలననగా శ్రుతి ఇట్లు నుడువుచున్నది. "మనసైతాన్కామాన్పశ్యన్ రమతే" (ఛాం.ఉ. 8-12-5). దీనిచే అతనికి మనస్సు మాత్రముండుననియు, ఇంద్రియాదులుండవనియును స్పష్టమగుచున్నది. ముక్తావస్థయందు శరీరముఁగాని, ఇంద్రియములుఁగాని ఉండఁజాలవు.

## 4-4-11 భావం జైమినిర్వికల్పామననాత్

ముక్త పురుషునికి శరీరేంద్రియము లుండునని జైమిని నిశ్చయించును. ఏలననగా ఇట్టి పురుషుడు నానావిధ రూపములను ధరించు సామర్థ్యమును కలిగియుండునని శ్రుతులు నుడువుచున్నవి.

భావం = ఉనికిని, జైమినిః = జైమిని తలంచును, వికల్పామననాత్ = ఏలననగా దివ్యరూపములను ధరించు సామర్థ్యమును కలిగియుండునని శ్రుతులు నుడువుచున్నవి.

10వ సూత్రమునకు విరుద్ధమైన దృష్టకోణ మొసంగఁబడినది.

ముక్తపురుషునికి శరీరేంద్రియములు మఱియు మనస్సు కూడా ఉండునని జైమిని ముని తలంచును. ఛాందోగ్యము ఇట్లు వచించును. "స ఏకధాభవతి త్రిధాభవతి పంచధా సప్తధా నవధాచైవ" (ఛాం. ఉ. 7-26-2) ముక్తపురుషుడు అనేకరూపములను ధరించునని ఈ వాక్యముచే మనకు తెలియుచున్నది. దీనిచే ముక్త పురుషునికి మనస్సుతోపాటు శరీరేంద్రియములున్నూ ఉండునని ఊహింపఁ బడుచున్నది.

## 4-4-12 ద్వాదశాహవ దుభయవిధం బాదరాయణోఽతః

ఈ కారణముచే ముక్త పురుషుడు ద్వాదశాహయాగమువలె ఉభయవిధములుగా ఉండునని బాదరాయణుడు అభిప్రాయపడును.

ద్వాదశాహవత్ = ద్వాదశాహయాగమువలె, ఉభయవిధం = రెండు విధములుగా ఉండును, బాదరాయణః = బాదరాయణుడు తలంచును, అతః = ఈ కారణముచే.

పైన పేర్కొనఁబడినట్టి పరస్పర వైరుధ్యముఁగల దృష్టికోణములకు ఒక నిర్ణయ మొసంగఁబడినది.

బ్రహ్మలోకము నొందిన ముక్తపురుషుడు రెండు శ్రుతులలోని రెండు వాక్యములనుఁబట్టి తన ఇష్టానుసారముగా శరీర రహితముగాను, శరీర సహితముగను ఉండవచ్చునని బాదరాయణుడు నిశ్చయించును. ఇది ద్వాదశాహ యాగము సత్రము మఱియు అహీనమని చెప్పఁబడుటవంటిది.

## 4-4-13 తన్వభావే సంధ్యవదుపపత్తేః

శరీరము లేనప్పుడు స్వప్నములకు వలె వాంఛలు నెఱవేరుట సాధ్యమగును. ఏలననగా ఇది యుక్తమై యున్నది.

తన్వభావే = శరీరము లేనప్పుడు, సంధ్యవత్ = స్వప్నములకు వలె, ఉపపత్తేః = యుక్తమై యుండుటచే.

12వ సూత్రములోని నిర్ణయమునకు ఒక ఉపమానము చెప్పఁబడినది.

శరీరేంద్రియములు లేనప్పుడు స్వప్నములోని శరీరధారులు ఆనందము ననుభవించునట్లు, ముక్తపురుషులున్నూ కోరిన పదార్థముల నుపభోగింతురు.

## 4-4-14 భావే జాగ్రద్వత్

శరీరమున్నప్పుడు జాగ్రదవస్థయందు వలె కోరికలు నెఱవేర్పఁబడును.

భావే = శరీరమున్నప్పుడు, జాగ్రద్వత్ = జాగ్రదవస్థకు వలె.

శరీరేంద్రియములున్నప్పుడు ముక్త పురుషులు సశరీరులు జాగ్రదవస్థ యందు ఆనందము ననుభవించునట్లు, తాము కోరిన పదార్థములను ఉపభోగింతురు.

# 6. ప్రదీపాధికరణము

## (15-16 సూత్రములు)

## 4-4-15 ప్రదీప వదావేశస్తథా హి దర్శయతి

ఒక దీపజ్వాల నానావిధరూపములను ధరించునట్లు ముక్తపురుషుడు నానావిధ శరీరములను ధరించునని శ్రుతి నుడువుచున్నది.

ప్రదీపవత్ = ఒక దీపజ్వాలవలె, ఆవేశః = ప్రవేశము, తథా = ఇట్లు, హి = ఏలననగా, దర్శయతి = శ్రుతి నుడువుచున్నది.

ముక్తపురుషుడు ఏకకాలమునందు తన శరీరమునకు భిన్నమైన నానావిధ శరీరములను ధరించు సామర్థ్యమును కలిగియుండునని ఈ సూత్రము నుడువును.

ముక్తపురుషుడు ఉపభోగించుటకై ఒకే కాలమునందు అనేక శరీరములను ధరింపఁగలుగునని 11వ సూత్రమునందు చెప్పఁబడినది.

ముక్తపురుషులు సృష్టించు త్రివిధ శరీరములు దారుయంత్రములవలె నిరాత్మకములా? లేక, మానవశరీరముల వలె సాత్మకములా? యనెడి సంశయ మిచ్చట కలుగును.

ఆత్మఁగాని, మనస్సుగాని అవిభాజ్యములగుటచేతను అవి కేవలము ఒకే శరీరమున కంటుఁబడియుండుటచేతను ఇతర శరీరములు నిరాత్మకములని పూర్వపక్షి పలుకును. ఇతర శరీరములు నిర్జీవములగు కీలుబొమ్మలు. ఆత్మ మఱియు మనస్సుతో కూడిన శరీరము మాత్రమే ఉపభోగించుటకు శక్తిమంతమై యుండును.

ఈ సూత్రమీ దృష్టికోణమును ఖండించి ఇట్లు పలుకును :– "ప్రదీప వదావేశః" ఒకే దీపజ్వాలనుండి నానావిధములగు వత్తులు వెలిగింపఁబడునట్లు. ముక్తపురుషడొకడే యైనను తన ఐశ్వర్యశక్తిచే వివిధములుగా రూపొంది, ఈ శరీరములన్నింటిలో ప్రవేశించును. అది మూలమైన అంతరంగికావయములను పోలిన అంతరంగికావయవములతో తనువులను సృష్టించును. మఱియు వీటిచే సంకుచిత మొనర్పఁబడి స్వయముగా అనేకములుగా విభజింపఁబడును. కావున సృష్టింపఁబడిన శరీరములన్నింటికి ఆత్మయుండును. దీనిచే ఈ శరీరములన్నియు

ఉపభోగించుటకు సమర్థములగును. ఇట్లు ఏకము అనేకమగునని శ్రుతి వచించును. "స ఏకధా భవతి త్రిధా భవతి పంచధా సప్తధా నవధా" (ఛాం.ఉ. 7-26-2).

యోగశాస్త్రము కూడా ఇట్టి నిర్ణయమునే ఒసంగును.

## 4-4-16 స్వాప్యయసంపత్త్యో రన్యతరాపేక్షమావిష్కృతం హి

సుషుప్తి మరియు బ్రాహ్మీస్థితియనెడి రెండింటిలో ఒకదానిని దృష్టి యందుంచుకొని సమస్త దృశ్యజ్ఞాన రాహిత్యము సిద్ధాంతీకరింపఁబడినది. ఏలననగా ఈ విషయము శ్రుతులచే స్పష్టీకరింపఁబడినది.

స్వాప్యయ సంపత్త్యోః = సుషుప్తి మఱియు బ్రాహ్మీస్థితి యొక్క, అన్యతరాపేక్షమ్ = ఈ రెండింటిలో ఒక దానిని దృష్టియందుంచుకొని,

ఆవిష్కృతం = శ్రుతిచే స్పష్టీకరింపఁబడినది, హి = ఏలననగా.

ముక్తపురుషుల యొక్క జ్ఞానపరంపర ఇప్పుడు చర్చింపఁబడుచున్నది.

పూర్వపక్షి ఇట్లు నుడువును :- ఆ స్థితియందున్న జీవునికి ఏలాటి ప్రత్యేక దృశ్యజాలము కానఁబడదని నుడువునట్టి నానావిధములగు శ్రుతివాక్యముల ననుసరించి ముక్తపురుషుడు తన ఐశ్వర్యశక్తిచే నానావిధ శరీరములలో ప్రవేశించి, ఉపభోగించునని ఎట్లు చెప్పనగును? ''తత్కేన కం విజానీయాత్'' (బృ.ఉ. 2-4-14). "న తు తద్ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యద్విజానీయాత్" (బృ.ఉ. 4-3-30). "సలిల ఏకోద్రష్టాద్వైతో భవతి" (బృ.ఉ. 4-3-32).

ఈ వాక్యములు సుషుప్త్యవస్థనుఁగాని లేక జీవుడు నిర్గుణ బ్రహ్మము నొందునట్టి పరమోన్నతమగు స్థితినిఁగాని సూచించునని ఈ సూత్రము నుడువును.

ఇఁక ఐశ్వర్యశక్తినిఁగూర్చి వర్ణించు వాక్యములు సగుణ బ్రహ్మజ్ఞాన ఫలములగు స్వర్గలోకాది భిన్నమైన స్థితిని సూచించును.

పూర్వ సూత్రములలో మనము నిర్గుణబ్రహ్మముతో ఐక్యము నొందని కేవలము బ్రహ్మలోకము నొందిన జీవునిఁగూర్చి చర్చించియున్నాము. బ్రహ్మ లోకమునందు దృశ్యజాలముండును. స్వర్గమునందు వలె భోగపదార్థములు కూడా ఉండును. స్వర్గలోకము మఱియు బ్రహ్మలోకమునందుఁగల భేదమేమనగా:- బ్రహ్మలోకము నుండి జీవుడు తిరిగి ఈ ప్రపంచమునకు రాడు. కాని నానా విధములగు

కర్మలఫలములను ఉపభోగించిన అనంతరము జీవుడు స్వర్గలోకము నుండి తిరిగి ఈ భూలోకమున కేతెంచును.

# 7. జగద్వ్యాపారాధికరణము

## (17-22 సూత్రములు)

### 4-4-17 జగద్వ్యాపారవర్జం ప్రకరణాద సన్నిహితత్వాచ్చ

ముక్తపురుషుడు సృష్ట్యాది శక్తులు తప్ప సమస్తైశ్వర్య శక్తులను పొందును. ఏలననగా సృష్ట్యాదులు సూచింపఁబడినప్పుడు సమస్త శ్రుతివాక్యములకు విషయము పరమాత్మయేనై యున్నది. మఱియు అట్టి సందర్భమునందు ముక్తపురుషులు పేర్కొనఁబడలేదు.

జగద్వ్యాపారవర్జం = సృష్ట్యాదిశక్తులు తప్ప, ప్రకరణాత్ = పరమాత్మయే ప్రకరణమునకు ముఖ్యవిషయమై యుండుటచే, అసన్నిహితత్వాత్ = అసన్నిహితులగు ముక్తపురుషులు పేర్కొనఁబడకుండుటచే, చ = మఱియు.

ముక్త పురుషుల శక్తుల యొక్క సరిహద్దు ఇచ్చట పేర్కొనఁబడినది.

సగుణ బ్రహ్మోపాసన ద్వారా బ్రహ్మలోకమునందు ప్రవేశించువారు అపరిమితమగు ఐశ్వర్యశక్తిని కలిగియుందురా? లేక, కొంతవరకు పరిమితిఁగల ఐశ్వర్యశక్తిని కలిగియుందురా? యనెడి సంశయమిచ్చట కలుగును.

వారి శక్తులు అపరిమితములై యుండవలయునని పూర్వపక్షి పలుకును. ఏలననగా ఈ విషయమును నిరూపించు శ్రుతి వాక్యములు కొన్ని కలవు. "తేషాం సర్వేషు లోకేషు కామచారో భవతి". (ఛాం.ఉ. 7-25-2, 8-1-6) "ఆప్నోతి స్వారాజ్యమ్" (తై.ఉ. 1-6-2). "సర్వేఽ స్మైదేవా బలిమావహంతి" (తై.ఉ. 1-5-3).

ముక్తపురుషులు సృష్ట్యాది శక్తులు తప్ప, ఇతరములగు అణిమాది సమస్తైశ్వర్య శక్తులను పొందుదురని ఈ సూత్రము నుడువుచున్నది. సృష్టిస్థితి ప్రళయములు పరిపూర్ణ పరబ్రహ్మముచేత మాత్రము నిర్వహింపఁబడును. ఏలననగా సృష్ట్యా

దులనుఁగూర్చి చెప్పఁబడిన శ్రుతులకు పరబ్రహ్మము విషయమై యున్నది. కాని ఈ సందర్భమునందు ముక్తపురుషులనుఁగూర్చి అవి ఏ మాత్రము పేర్కొనలేదు.

ఇంతేకాకుండా దీనిచే అనేక ఈశ్వరులకు తావుండును. ఒకవేళ వారు విశ్వరచనాశక్తిని కలిగియున్నను, వారు ఒకే మనస్సును కలిగియుండరు. సృష్ట్యాదుల విషయములో వారికి అభిప్రాయభేద మేర్పడవచ్చును. ఒకడు సృష్టించు కోరికను కలిగియుండవచ్చును. మరియొకడు నశింపఁజేయు కోరికను కలిగి యుండవచ్చును. ఒకని కోరిక మరియొకని కోరిక ననుసరించియున్నప్పుడు మాత్రమే ఇట్టి వైరుధ్యము తొలగింపఁబడును. దీనిచే ఇతర జీవులన్నియును పరబ్రహ్మముపై ఆధారపడి యుండునని తెలియుచున్నది.

కావున ముక్తపురుషుల యొక్క శక్తులు పరిచ్ఛిన్నములై యున్నవి. కాని అపరిచ్ఛిన్నములు కావు. మఱియు వారి శక్తులు దేవుని సంకల్పముపై ఆధారపడి యుండును.

## 4-4-18 ప్రత్యక్షోపదేశా దితిచేన్నాధికారిక మండలస్థోక్తేః

శ్రుతియొక్క ప్రత్యక్ష ప్రబోధము ననుసరించి ముక్తపురుషులు అపరిచ్ఛిన్న శక్తులను కలిగియుందురని పలికినచో, అట్లుకాదని మేము నుడుపుదుము. ఏలననగా సూర్యుడు ఇత్యాదులను నియోగించి, వాటి మండలముల యందంతర్నిహితుడైయున్న వానిని ముక్తపురుషులు పొందుదురని శ్రుతులు నుడుపుచున్నవి.

ప్రత్యక్షోపదేశాత్ = ప్రత్యక్ష ప్రబోధముచే, ఇతిచేత్ = ఒకవేళ చెప్పఁబడినచో, న = కాదు, ఆధికారిక మండలస్థోక్తేః = సూర్యుడు ఇత్యాదులను నియోగించి, వాటి మండలముల యందంతర్నిహితుడైయున్న వానిని జీవులు పొందుదురని శ్రుతి నుడువుటచే.

17వ సూత్రమునకు ఒక ఆక్షేపణ చెప్పఁబడి. ఖండింపఁబడినది.

ఈ సూత్రమునందు శంకా సమాధానములనెడి రెండు విభాగములున్నవి. "ప్రత్యక్షోపదేశాత్" అనునది ఆక్షేపణ, "నాధికారిక మండలస్థోక్తేః" అనునది సమాధానము.

“అప్నోతి స్వారాజ్యమ్” (తై.ఉ. 1-6-2) అనెడి ప్రత్యక్ష శ్రుతి ప్రబోధము ననుసరించి జీవుడు పూర్ణశక్తులను బడయునని పూర్వపక్షి పలుకును. ఈ సూత్రము దీనిని ఖండించి అతని శక్తులు పరమాత్మునిపై ఆధారపడియుండునని పలుకును. ఏలననగా తదనంతర శ్రుతి వాక్యము ఇట్లునుడువును. ‘ఆప్నోతి మనసస్పతిమ్’ (తై.ఉ. 1-6-2). ఈ ప్రభువు సూర్యమండలాదులలో వసించి సూర్యుడు ఇత్యాదులను నియమించును.

కావున రెండవ శ్రుతివాక్యము ననుసరించి ముక్తపురుషుడు పరమాత్మునిపై ఆధారపడియుండి, అతనినుండి శక్తులను పొందునని, స్పష్టముగా తెలియుచున్నది. కావున అతని శక్తులు అపరిచ్ఛిన్నములుకావు. అతడు సూర్యుడు ఇత్యాదుల యందున్న పరమాత్ముని నుండి శక్తులను వరముగా పొందును. ఆ పరమాత్మ సూర్యమండలము నందుండి, సూర్యదేవుని ప్రవర్తింపఁజేయును.

## 4-4-19 వికారవర్తి చ తథా హి స్థితి మాహ

మఱియు సృష్టింపఁబడిన పదార్థములన్నింటికి అతీతమైయున్న పరమాత్ముని రూపమొకటి కలదని శ్రుతి వచించును, అతని అస్తిత్వము వ్యక్తము మఱియు అవ్యక్తమను పేర్లతో ద్వివిధములుగా నున్నది.

వికారావర్తి = సృష్టింపఁబడిన పదార్థములన్నింటికి అతీతమైనది, చ = మఱియు, తథా = అట్లు, హి = ఏలననగా, స్థితిమ్ = ఉనికిని, ఆహ = శ్రుతి చెప్పుచున్నది.

ముక్తపురుషుని అస్తిత్వవర్ణన ఇంకను కొనసాగుచున్నది.

శ్రుతివచనానుసారముగా ప్రత్యక్షగోచరముకాని పరమాత్ముని ఆంతరంగిక రూపముకూడా ఒకటి కలదు. ప్రత్యక్ష గోచరమైయున్న సూర్యమండలాదులకు అతడు కేవలము పరిపాలకుడు మాత్రము కాదు.

శ్రుతి ఈ క్రింది విధముగా అతని ద్వివిధరూపములనుఁగూర్చి వర్ణించును. “తావానస్యమహిమా, తతోజ్యాయాంశ్చ పూరుషః పాదోఽస్య సర్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి” (ఛాం.ఉ. 3-12-6)

పరమాత్మ వ్యక్తావ్యక్తములనెడి రెండు రూపములయందుండునని ఈ వాక్యము సూచించుచున్నది.

పరమాత్ముని సగుణరూపమును ఉపాసించువాడు అతని నిర్గుణ రూపమును పొందలేడు. రూపముఁగల దేవుని పూజించువాడు రూపములేని బ్రహ్మమును పొందఁజాలడు. ఏలననగా కోరిక ననుసరించిన ఫలము లభించుట న్యాయసమ్మత మగును. శ్రుతి ఇట్లనును. "యద్భావం తద్భవతి".

పరమేశ్వరుని సగుణరూపము నారాధించువాడు అతనిని పూర్ణముగా తెలియఁజాలకుండుటచే, అతడు కేవలము పరిచ్ఛిన్న శక్తులను మాత్రమే పొందఁ గలుగును. కాని పరమేశ్వరునివంటి అపరిచ్ఛిన్న శక్తులను పొందఁజాలడు.

## 4-4-20 దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే

మఱియు ఈ విధముగా ఈ రెండున్నూ ప్రత్యక్షానుమానములను దర్శింపఁజేయును.

దర్శయతః = ఈ రెండున్నూ దర్శింపఁజేయును. చ = మఱియు, ఏవం = ఇట్లు, ప్రత్యక్షానుమానే = ప్రత్యక్షానుమానములను.

శ్రుతిస్మృతులు రెండింటిచే పరమేశ్వరుని నిర్గుణరూపము నిరూపింపఁ బడుచున్నదని ఈ సూత్రము నుడువును. పరమోన్నతమైన ప్రకాశము నగుణ పదార్థమునందుండదని శ్రుతి స్మృతులు రెండున్నూ వచించుచున్నవి. "న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం నేమావిద్యుతోభాంతి కుతోయమగ్నిః" (ముం. ఉ. 2-2-11, కఠ, ఉ. 2-15, శ్వే. ఉ. 6-14) "న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః" (భ. గీ. 15-6).

## 4-4-21 భోగమాత్ర సామ్యలింగాచ్చ

శ్రుతులలో చెప్పఁబడిన ముక్తపురుషుడు మఱియు పరమేశ్వరుని సమానత్వము కేవలము భోగవిషయమునందేనని తెలియనగును.

భోగమాత్ర = భోగమునందు మాత్రము, సామ్య = సమత్వము, లింగాత్ = శ్రుతి సూచనానుసారముగా, చ = మఱియు.

ముక్తపురుషుని శక్తులు అపరిచ్ఛిన్నములు కావని శ్రుతి వచనానుసారముగా కూడా తెలియుచున్నది. పరమేశ్వరునితో ఆ ముక్తపురుషుల సమత్వము కేవలము భోగవిషయమునందే కలదు. కాని సృష్ట్యాది విషయమునందు కాదు.

"స యథైతాం దేవతాం సర్వాణి భూతాన్యవంత్యేవం హైవం విదం సర్వాణి భూతాన్యవంతి" (బృ.ఉ. 1–5–20). "తేనో ఏతస్యైదేవతాయై సాయుజ్యం సలోకతాం జయతి" (బృ.ఉ. 1–5–23).

ఈ శ్రుతి వాక్యములన్నియును భోగ విషయమునందు మాత్రము సమానత్వ మున్నట్లు వర్ణించును. సృష్ట్యాది విషయములలో సమానత్వమున్నట్లు అవి ఏ మాత్రము పేర్కొనలేదు.

## 4–4–22 అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్

శ్రుతి వచనానుసారముగా ఈ ముక్తపురుషులకు పునరాగమనముండదు.

అనావృత్తిః = పునరాగమనము లేదు, శబ్దాత్ = శ్రుతివచనానుసారముగా, అనావృత్తిః = పునరాగమనము లేదు, శబ్దాత్ = శ్రుతివచనానుసారముగా.

ముక్తపురుషుని ప్రత్యేకాధికారములనుఁ గూర్చిన చర్చ ఇంతటితో పూర్తియైనది.

పూర్వపక్షి ఇట్లనును:– ఒకవేళ ముక్తపురుషుల యొక్క శక్తులు పరిచ్ఛిన్నములై యున్నచో, వారు కూడా మరణశీలురగు సమస్తజీవులవలె క్షీణింపక తప్పదు. కావున ముక్తపురుషులు బ్రహ్మలోకమునుండి ఈ ప్రపంచమునకు తిరిగి రావలసి యుండును.

ఈ సూత్ర మీ విషయమును ఖండించి, దేవయానము గుండా బ్రహ్మలోకము నకు వెళ్ళువారు అచ్చటినుండి తిరిగిరారని పలుకును. ఏలననగా అట్టివారు తిరిగిరారని శ్రుతివాక్యములు ప్రబోధించుచున్నవి. "తయోర్ధ్వమాయన్నమృతత్వ మేతి" (ఛాం. ఉ. 8–6–6). "ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే" (ఛాం. ఉ. 8–15–1)., "తేషాం న పునరావృత్తిః" (బృ.ఉ. 6–2–15).

"అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్" అనెడి పునరుక్తి గ్రంథ పరిసమాప్తిని సూచించును.

ఇట్లు శ్రీహరి యొక్క అవతారమైన శ్రీ వేదవ్యాస విరచితమగు బ్రహ్మ సూత్రములలోని చతుర్థాధ్యాయమందలి చతుర్థపాదము ముగిసినది. అతని ఆశీర్వాదములు మీ అందఱియందు ఉండునుఁగాక!

**హరిః ఓం తత్సత్**

**శ్రీ సద్గురు పరమాత్మనే నమ:**

**ఓం శ్రీ వేదవ్యాసాయ నమ:**

**ఓం పూర్ణ మదః పూర్ణమిదం**

**పూర్ణాత్పూర్ణ ముదచ్యతే, పూర్ణస్య**

**పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే,**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# శ్రీశ్రీశ్రీ శివానంద స్వాములవారి సంక్షిప్త జీవితము

శ్రీ సద్గురు శివానందస్వాములవారు అప్పయ్యదీక్షితార్ మఱియు ఇతర మహాపురుషులు జన్మించిన సుప్రసిద్ధవంశమునందు 1887 సెప్టెంబరు 8వ తేదీన జన్మించిరి. శ్రీవారు ఆధ్యాత్మిక గ్రంథాధ్యయనమునందును, వేదాంత జీవితానుష్ఠానమునందును స్వాభావికమైన మోజును కలిగియుండిరి. దీనితో పాటు సమస్త జనులను సేవించుభావము మఱియు సర్వమానవ సౌభ్రాతృత్వము వారికి జన్మసిద్ధమై యుండెను. శ్రీవారు ఆచార పరాయణ కుటుంబమునందు జన్మించినను; విశాల హృదయము, సరళత్వము, పవిత్రము మఱియు భక్తిపరాయణ జీవనులై యుండిరి.

సేవాభావవాంఛ వారిని వైద్యవృత్తి నవలంబింపజేసి, సేవ ఆవశ్యకమై యున్న స్థలమునకు శ్రీవారు ఆకర్షింపబడిరి; మలయాదేశము శ్రీవారి సేవాభాగ్యమును బడసెను. దీనికి పూర్వము శ్రీవారు ఒక ఆరోగ్య సంబంధముగు మాసపత్రికను నడుపుచు, వ్యాధులను నిర్మూలించుట కనువగు అనేక వ్యాసములను వ్రాసిరి. ప్రజలకు జ్ఞానముయొక్క ఆవశ్యకతను గుర్తెఱింగినవారై శ్రీవారు జ్ఞానదానమే తమకు ముఖ్యకర్తవ్యముగా భావించిరి.

విధివశముచేతను, మానవజాతిపై గల దైవానుగ్రహముచేతను దేహ – మనస్సులకు డాక్టరైయున్న శ్రీవారు తమ వైద్యవృత్తికి స్వస్తిచెప్పి, మానవుని ఆత్మకు ఉపచారము చేయు నిమిత్తమై తమను అర్హునిగా చేసికొనదలంచిరి. శ్రీవారు 1924లో ఋషీకేశ్‌నందు స్థిరనివాస మేర్పఱచుకొని గొప్పయోగిగను, మహాత్ముడుగను, ఋషిగను మఱియు జీవన్ముక్తునిగను ప్రకాశించిరి.

1932లో శ్రీవారు శివానందాశ్రమమును ప్రారంభించిరి. 1936లో దివ్య జీవనసంఘమును స్థాపించిరి. 1948లో యోగవేదాంత అరణ్యక పరిషత్తును నెలకొల్పిరి. ఆధ్యాత్మిక జ్ఞాన ప్రచారము మఱియు యోగ-వేదాంతములలో ప్రజలకు శిక్షణ యొసంగుటయే వాటికి లక్ష్యములై యున్నవి. 1950లో శ్రీవారు భారతదేశమును మఱియు సింహళమును పర్యటించిరి. 1953లో వారు విశ్వమత సమ్మేళనమును నిర్వహించిరి. శ్రీవారు 300లకు పైగా గ్రంథములను రచించిరి. శ్రీవారికి సమస్త తెగలకు, జాతులకు, మతములకు సంబంధించిన శిష్యులు ప్రపంచమంతటను వ్యాపించియున్నారు. శ్రీవారి రచనలను పఠించుట జ్ఞానామృతమును పానమొనర్చుటవంటిది. దానిచే చదువరులకు నిశ్చయముగా ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలుగును. శ్రీవారు 14వ జూలై 1963 లో మహాసమాధి నొందిరి.

# మహామృత్యుంజయ మంత్రము

**ఓం త్ర్యంబకం యజామహే**
**సుగంధిం పుష్టి వర్ధనమ్ ।**
**ఉర్వారుక మివ బంధనాత్**
**మృత్యోర్ముక్షీయ మాఽమృతాత్ ॥**

తా॥ దోసకాయను తొడిమనుండి సులువుగా త్రుంచివేసి నటుల, మృత్యు బంధము నుండి మమ్ముద్ధరించి అమరత్వ మొసంగుటకు సర్వజీవులకు పోషణ కర్తయు, దివ్యపరిమళముగల దేహము గలవాడును అగు ముక్కంటిని ఆరాధించెదము.

(ఈ మృత్యుంజయ మంత్రము ప్రాణముల నివ్వ సమర్ధమైనది. రోగములను నివారించుటలో, ప్రమాదములను తొలగించుటలో దీనికి పెట్టినది పేరు. ఇది రోగములన్నింటికి వజ్రాయుధము వంటిది. ఇది మృత్యువును జయించు మంత్రము.

ప్రతిదినము భక్తిశ్రద్ధలతో ఈ మంత్రమును కనీసము 108 సార్లు జపించినచో, ఏ విధమైన ప్రమాదమువలన, అపమృతుయ భయము లేకుండ కాపాడుటయే గాక, దీర్ఘాయువును, శాంతి సౌఖ్యములను ప్రసాదించును.

ఇంతేకాక ఇది మోక్షప్రదమగు మంత్రముకూడా! ఇది పరమశివుని మంత్రము, నిరంతరము జపించువారికి అమరత్వమును గూడ ప్రసాదించును.)